



కవులు

రచనలు,జీవిత చరిత్ర

వీరేశలింగ గ్రంథావళి









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

జన్మాంతరము.

ప్రియమిత్రులారా!

కడచిన శనివారమునాఁటి రాత్రి నేనిక్కడ జేసిన యుపన్యాసమునందు జీవునకుఁ బునర్జన్మ ముండునా యుండదా యను విషయమునుగూర్చి మఱియొకసారి ప్రసంగించెద నని సూచించి యుంటినిగదా? ఈవిషయమయి వివిధమతములు వివిధముగా బోధించుచుండుటయు స్వవాదోపబలార్థముగా నాయామతములవారు విశేషప్రయాసపడి తమబుద్ధి నంత[illegible]గించి బహుహేతువులను గల్పించి స్వసిద్ధాంతస్థాపనము చేయఁ గడఁగియుండుటయు, అందఱు నెఱిఁగియున్నయంశమే కాని యెఱుఁగనిసంగతి కాదు. అట్లు దీర్ఘపరిశ్రమము చేసి పుస్తకములను వ్రాసియున్న బుద్ధిమంతులలో నొక్కరితోనైనను నే నేవిషయమునను సమానుఁడను గాకపోవుటయు వివర్ణనీయమయిన యీ మహావిషయమునందు నిర్దోష మయినసిద్ధాంతమును దేల్చుట పండితులకుసహితము సులభసాధ్యము కాకపోవుటయు నెఱిఁగినవాఁడ నయ్యును, పండితునిబుద్ధికిసహితము గోచరముఁగానియంశ మొకానొకప్పుడు చదు వెఱుఁగని బాలునిమనస్సునకు స్ఫురించుట కలదుగనుకను నావాక్యము లొకవేళ సహేతుకములుగాఁ గనఁబడి మహాజనులను రంజింపఁ గలుగునేమో యనుభ్రాంతి నాహృదయమును బాధించుచున్నందునను సంకోచము మాని యీవిషయమున నాకుఁ గలయభిప్రాయమును నేఁడు మీకడఁ దెలుప సాహసించుచున్నాఁడను! నాప్రసంగము నంతను మీరు సావధానముగా విని యొకటివాదముమీఁద నేను జేయు పూర్వపక్షములను నాసిద్ధాంత

మును సాంతముగాఁ బరిశీలించి నావాదము మీహృదయములకు సారవంతముగాఁ గనఁబడినపక్షమున నంగీకరించి యాదరింతురుగాక! ఈవిషయమున నన్యదేశీయులమతము లెల్లను భిన్నాభిప్రాయములు కలవిగా నున్నను, మనదేశమునం దున్నమతము లన్నియు నైకకంఠ్యముగా జీవాత్మకు జన్మపరంపర కలదని ఘోషించుచున్నవి. పునర్జన్మ మెప్పుడును ప్రత్యక్షమగునది గాదుగనుకను కనఁబడనివి లేవనియే యెప్పుడును ననుమేయము గనుకను, ఎవ్వరు పునర్జన్మ మున్నదని వాదింతురో వారిమీఁదనే తమ పక్షమును స్థాపించుకోవలసిన భార మంతయు నాఁగి యుండును. కాఁబట్టి యిప్పుడు ఋజువుచేయ వలసినబాధ్యత పునర్జన్మము కలదనువారిదిగాను, వారియుక్తులపై ప్రతియుక్తులు చెప్పి వారివాదమును ఖండించి తమవాదమును సహేతుకముగా స్థిరపఱచుకోవలసినబాధ్యత పునర్జన్మము లేదనువారిదిగాను నేర్పడును. మనమిప్పు డుభయపక్షములవారికిని గల యాక్షేప సమాధానములను నిష్పాక్షికబుద్ధితో విమర్శించి గుణ బాహుళ్యమును సయుక్తికము నని తేలిన సత్పక్షమును జేకొందము.

సత్యమును గనుఁగొనవలె నన్నచో, భగవంతునిస్వభావమును బట్టి చూడఁగా, నతఁడు జన్మపరంపరలను జీవులకుఁ గలిగించు నని నమ్మఁదగియున్నదా, పూర్వోత్తరజన్మములు జీవులకుఁ గలవని స్థిరపఱచుటకుఁ జాలినంత బలమయినహేతువు లేమియున్నవి, పూర్వోత్తరజన్మములున్నవని నమ్మటవలన లోకమునకు లాభముకలుగునా నష్టముకలుగునా, లేవనిచెప్పుటకు గల ప్రబలహేతువు లేవి, జన్మాంతరములు లేవనుకొనుటవలనఁ బ్రజలయోగక్షేమాభివృద్ధికి హాని సంభవించునా పుష్టి కలుగునా, యను నంశములను మొదట విచారింపవలయును.

౧. ఈశ్వరునికరుణాభరిత్వమును బట్టి చూచినను, అపరిమిత బుద్ధిసంపదనుబట్టి విచారించినను, న్యాయైకశీలతనుబట్టి విమర్శించి నను జీవాత్మల కతఁడు జన్మపరంపరలను గలిగించునని యూహించు టకు లేశ మయినను నవకాశము గనఁబడదు. జీవుఁడు పూర్వజన్మఁ మునందుఁ జేసినకర్మలకయి యాతనిని శిక్షించుటకొఱకే కదా యీశ్వ రుఁడు జన్మపరంపరలను గలిగించినాఁ డని మనవారందఱును జెప్పు దురు. భగవంతుని నీతిస్వభావమునుబట్టి విమర్శింపఁగా నతఁ డట్టి శిక్షను విధించు నని మందబుద్ధికైనను తోఁచదు. దండార్హుని కుత్తముఁ డయినప్రభువు చేయుశిక్ష యెప్పుడును దోషి తా నీ నేరమును జేయుఁ బట్టి తనకీశిక్ష కలుగుచున్నదని తెలిసికొని ముం దట్టియపరాధమును జేయుటకు వెఱచి బుద్ధి తెచ్చుకొని పాటుపడుటకును, అట్టి దుర్మార్గు లకుఁ గలుగుచున్న దండనమును జూచి యితరులు తా మెన్నఁడు నట్టి యకార్యకరణమునకు సాహసింపక పాపభీతులై యుండుటకును, అను కూలమైనదిగా నుండును. అట్లుగాక శిక్ష పగదీర్చుకొనునుద్దేశము తోనే చేయఁబడుచున్నట్లు కనఁబడినను, ఏ నేరముకొఱకు శిక్ష విధింపఁ బడినదో తెలుపఁబడక పోయినను, ఎల్లవారలహృదయములకు శిక్షను విధించుప్రభువు దయాశూన్యుఁడు గాను కార్పణ్యస్వభావుఁడుగాను పొడకట్టును. ఈజన్మమునందుఁ బొందెడియాపదలను వ్యాధిబాధలును పురాకృత కర్మఫలములే యందురేని, పూర్వజన్మమునం దేదోష మును జేయఁబట్టి తనకవి సంప్రాప్తమయినవో యెఱుఁగుట కెవ్వనికిని సాధ్యముకాదు. కాఁబట్టి యట్టి శిక్షవలన నేమియుఁ బ్రయోజనము కలుగకపోవుటయేకాక మీఁదుమిక్కిలి జను లట్టిశిక్ష విధించినయీశ్వ రుఁడు క్రూరస్వభావుఁ డని భ్రమించుటకును గారణ మగుచున్నది; అట్టి శిక్షవలన దోషియైన బుద్ధి తెచ్చుకొని పశ్చాత్తాపపడి తనప్రవ

ర్తనమును గ్రమపఱచుకొనుటకును వీలు కలుగదు; ఇతరులు సాధువర్తనము కలిగి మెలఁగుటకును ప్రోత్సాహము కలుగదు. ఈలోకమునందు సహితము మనలో నెవ్వరినో యొకరిని రాజభటులు పట్టుకొనిపోయి మనమీనేరమును జేసితి మని దానిస్వభావమును దెలుపకయు నితరులు తెలిసికొనుట కవకాశము కలిగింపకయు మనలను గొన్ని మాసములు కారాగృహమున నుంచి నిర్బంధించి విడిచిపెట్టినచో మన మట్టి ప్రభుత్వమువారిని క్రూరులని భావింతుమే కాని వెనుక మన మెప్పుడో యేదో నేరము చేసినందునకయి శిక్షించియుందురని యెంతమాత్రము దలఁపము; ప్రజలును వారిని దుర్మార్గులనియే యెంతురు ఇదియిట్లుండఁగా భగవంతుఁడే నిజముగా పురాకృతదుష్కర్మమునకు శిక్షగా జన్మము కలుగఁజేసి యంధత్వము మొదలయిన యంగహీనతలవలనను దీర్ఘరోగములు మొదలయినకష్టములవలనను శిక్షించు ననెడు పక్షమున, శిక్షను బొందువారికి నేరముయొక్క స్వభావమును దెలుపకుండ శిక్షించు చున్నందున క్రూరుఁ డనియు, స్వల్పదోషములకయి కాళ్లు చేతులు మొదలయినవి నఱికించి మనుష్యులను నిరుపయోగులను గాఁజేయు క్రూరదండనలను విధించుదుష్టరాజులవలెనే కన్ను కాలు మొదలయిన యవయవములకు భంగము కలిగించుచున్నందున ద్వేషైకప్రధానుఁడనియు, దోషనివారణమునకయి యుపచరింపనిశిక్షను విధించుచున్నందున దూరాలోచనయు బుద్ధిసంపదయు లేనివాఁడనియు ఎందునకుశిక్షించుచున్నాఁడో యితరులకుఁ దెలియకుండ మఱుఁగుపఱుచుచున్నందున న్యాయబుద్ధిగలవాఁడు కాఁడనియు, భగవంతునిం జెప్పవలసి వచ్చును. అయినను లోకములోని యాస్తికమతములవారందఱు పరమేశ్వరుఁడు సర్వకారుణ్యుఁడనియు రాగద్వేషరహితుఁడనియు సర్వజ్ఞుఁడనియు నపరిమిత బుద్ధిమంతుఁ డనియు ధర్మస్వరూపుఁ

డనియు నైరంతర్యముగా నొప్పుకొనుచున్నారు. కాఁబట్టి జీవాత్మలకు జన్మపరంపరను గలిగించు ననుట యీశ్వరుని స్వభావమున కెంతమాత్రమును బొనఁగి యుండదు.

౨. ఇఁక జీవాత్మలకు బహుజన్మములు కలవని సాధించుట కయి చూపెడు హేతువుల బలాబలములనుగూర్చి కొంత విచారింతము. పూర్వజన్మకర్మము నంగీకరింపని పక్షమున లోకమునందలి జనులలోఁ గల స్థితిభేదములకును, కొందఱు బీదాంద్రులుగాను కొందఱు ధనికులుగాను, కొందఱు రాజులుగాను, కొందఱు సేవకులుగాను, కొందఱు తెలివిగలవారుగాను, కొందఱు తెలివితక్కువవారుగాను, ఉన్నందునకును నేమిగతి కల్పింతురని యడుగుదురు. జీవదయాపరుఁడయిన పరమేశ్వరుఁడు మనక్షేమముకొఱకును అభివృద్ధికొఱకునే ప్రపంచములో స్థితిభేదములను గలిగించి యున్నాఁడు. అట్టి స్థితిభేదములు లేకపోవునేని లోకములో నెవ్వరికిని సుఖసంతోషములు కలుగవు. ఈ లోకమున వేఱువేఱు స్థితులవలననే మనకు భగవంతుని యవచనీయబుద్ధియు దయాళుత్వమును మఱింత వెల్లడి యగుచున్నవి. స్థితిభేదములు లేక యందఱు నొకరీతివృత్తి గలవారును, ఒకరీతిబుద్ధి కలవారుగాను నుందు రేని యందఱును నసౌఖ్యమున పొందవలసి యుండుటచేత లోకవృత్తమే నడవక పోవలసివచ్చును. ఎట్లనఁగా నందఱును మహారాజులుగానే యుందు రనుకొందము; అందఱును సింహాసనములమీఁదనే కూరుచుండి మహారాజభోగము ననుభవించువారే యవుదు రేని, వ్యవసాయముచేసి ధాన్యాదులను పండించువారు లేక యందఱును నచిరకాలములోనే పస్తుపడి చావవలసి వచ్చును; అందఱును కృషిచేసి ధాన్యాదులను పండించువారే యౌదు రేని, ఇతరవృత్తులు చేయువారు లేమింజేసి మంచిబట్టలు, లేక చలిచేతను

ఎండచేతను బాధపడవలసినవారును, గృహములు కట్టువారు లేక బయల నివసించి పెక్కుకష్టములకు లోనుగావలసినవారును నగుదురు. ఈప్రకారముగానే జను లందఱు నేదైన నొకవృత్తినే ప్రత్యేకముగా నవలంబించువా రగుదు రేని యొక్కరును సుఖపడరు; స్థితిభేదము లుండి యందఱు నన్నివ్యాపారములయందును బ్రవర్తించుచుఁ బరస్పర సహాయులగుచుండుటం బట్టియే యందఱును సుఖించు చున్నారు. కాఁబట్టియే ప్రపంచముయొక్క క్షేమముకొఱకుఁ గొందఱు సేద్యము చేయువారుగాను కొందఱు బట్టలు నేయువారుగాను, కొందఱు పని ముట్లు చేయువారుగాను, కొందఱు కూలిపని చేయువారుగాను, కొందఱు జనుల కన్యాయము సంభవింపకుండఁ గాపాడువారుగాను, ఈవిధముగానే మఱియు బహువిధ వ్యాపారములు గలవారుగాను, ఉండక తప్పదు. ఇందుచేతనే భూమిమీఁదఁ గొందఱు రాజులుగాను, కొందఱు కాపులుగాను కొందఱు యజమానులుగాను, కొందఱు సేవకులుగాను, నానావిధ తారతమ్యములు గలవారుగా నుండుట యావశ్యక మయినది. అట్లుండుటవలననే యిరుదెఱఁగులవారికిని గూడ సౌఖ్యమును సంతోషమును గలుగుచున్నవి.—ఎట్లనఁగా నడవవలసిన ప్రయాస మక్కఱలేకుండఁ బల్లకిలో నెక్కి గ్రామాంతరము పోఁగలిగినందుకు ధనికునకును తిండికి శ్రమపడ నక్కఱలే కుండఁ గూలి దొరికినందుకై పల్లకిని మోచిన బీదవాండ్రకును గూడ సుఖమును సంతోషమును గలుగుచున్నవి. కాఁబట్టి యీస్థితి భేదములనుబట్టి దేవుఁడు పక్షపాతియని గాని పూర్వజన్మ మున్నదని కాని యూహించుటకు మాఱుగా, మన క్షేమలాభములకొఱకే వానిని గల్పించెఁగదా యని యానందమునుబొందుచుఁ గృతజ్ఞతతో జీవదయాపరుఁ డయిన యీశ్వరుని స్తుతింపవలసియున్నది. మఱియుఁ గొందఱు

ధనికులుగాను కొందఱు దరిద్రులుగాను ఉండుటనుగూర్చి యించుక విచారింతము. అందఱు నేకస్థితియందే యుండుట నష్టకరమని యీవఱకే చెప్పియున్నాను గనుక, కొందఱు ధనవంతులుగాను కొందఱు ధనహీనులుగాను నుండవలసి యుండుటయే యావశ్యకము. అయినను ధనమువలనఁగాని యీలోకమునందలి యేయితరపదార్థసంచయము వలనఁగాని మనకు కలుగవలసిన ప్రయోజన మంతయు సౌఖ్యమేకాని యంతకంటె నధిక మేమియు లేదు. కాఁబట్టి యేమనుష్యునకుఁగాని తన సౌఖ్యమునకుఁ గావలసినదానికంటె నధికముగా ధనాదులు కలుగుటవలన లేనివారికి సాహాయ్యము చేయుటచే, గలిగెడు సంతోషము తప్ప వేఱుప్రయోజన మేదియు లేదు. సర్వసముఁడయిన భగవంతుఁడు పాటు పడుటకుఁ దగినయవయవముల నందఱికిని సమానముగా ననుగ్రహించి యున్నందున, ఎల్లవారును వాని నుపయోగించుకొని పాటుపడవలయు ననుటయే భగవదుద్దేశ మయినట్లు కరతలామలకముగాఁ గనఁబడుచున్నది. అట్లు దేహము వంచి పాటుపడినచోఁ దనసౌఖ్యముకొఱకును భార్యాపుత్త్రాదుల సౌఖ్యముకొఱకును గావలసినంత ధనమును సంపాదించుకోలేనివాఁ డెవ్వఁడును నుండఁడు. మనదేశములో నొకఁడు పాటుపడి సంపాదించుచున్నచో వానిని నాశ్రయించుకొని సోమరు లగుబంధువులు పలువురు జీవించుచుండుటవలనను, పాటుపడుట తమగొప్పతనమునకుఁ దగినపని గాదనియు నుద్యోగములు చేయువారు తామిబ్బంది పడియైనను ధనాదిదానములు చేసి గౌరవపఱిచి తమకు సుఖజీవనము గలుగఁజేయుట కయి బద్ధులయి యున్నా రనియు నమ్మెడి యొకతెగవారు యాచ్ఞావృత్తిచే నితరులమూలముననే జీవనము చేయుచుండుటవలనను, ఈదేశమున బీదలసంఖ్య యంతకంత కధిక మగుచున్నది. దేహదార్ఢ్యము కలవా

రయ్యును పాటుపడకయు జూదము మొదలయిన దుర్వృత్తులయందుఁ బ్రవేశించి ధనమును పాడుచేసికొనియు బీదలయి యన్నవస్త్రాదులకు లేక కష్టపడువారు భగవదాజ్ఞ నుల్లంఘించి కష్టములను స్వయంకృతాపరాధమువలననే తెచ్చిపెట్టుకొన్నవా రగుదురుగనుక వారిస్థితిని జూచి మన మంతగాఁ బరితపింపవలసిన పని లేదు; అట్లు చేయుటలో భగవంతునిదోషమును లేదు. పాటుపడువారు నిజదారసుతోదరపోషణమునకును సౌఖ్యముకును వలయునంత ధనమును సంపాదించుకోఁగలవారే యగుదురుగనుక వారు విశేషవిత్తవంతులు కాకపోయితిమి గదాయని విచారింపవలసిన పని లేదు. భాగ్యవంతులకు బీదలకంటెఁ గొన్నివిషయములలో నధికసుఖ మున్నను వారికిఁ గలబాధ్యతలును కష్టములును గూడ బీదలకంటె నధికముగానే యుండును. కాఁబట్టి మొత్తముమీఁద ధనికులకును దరిద్రులకును సుఖదుఃఖములు సమానముగానే యుండును. ధనవంతులు కష్టపడకయే సుఖజీవనము చేయవచ్చును. బీదలు కష్టపడినఁగాని సుఖజీవనము చేయఁజాలరనికొంద ఱన వచ్చును. కానిసర్వసముఁ డయినపరమాత్ముఁ డెల్లవారును పాటుపడిననే సుఖమనుభవింపవలసినవారయినట్టు నిర్ణయము చేయుచున్నాఁడు. దేహపరిశ్రమ లేక యింటఁ గాలు కదలుపక కూరుచుండి స్థూలకాయు లయియుండుధనవంతులే పాటుపడెడుబీదలకంటె నధికసుఖపడుచున్నా రని యనుకొనుచుండుట వట్టిభ్రమయే కాని వేఱు కాదు. ధనవంతులకు భక్షించుటకు పంచభక్ష్యపరమాన్నములును గలిగియు దేహకష్టము లేకపోవుటచేత నేది భుజించినను జీర్ణముకాక వారు బలహీను లయి బాధపడు చుందురు; ఎంతబలమయినయాహారపదార్థములను దిన్నను దానిసారమును గ్రహింపఁజాలక యనారోగ్యదారు లగుదురు; నాలుగడుగులు నడచిన నాయాసపడుదురు; తఱుచుగా

సంతానహీనులును నల్పాయుష్కులును నగుదురు. బీదవాండ్రు భక్షించుటకు మంచిపదార్థములు లేకపోయినను పాటుపడుటచే జిన్నగా రక్తప్రసారణము గలిగి దృఢకాయులయి యుందురు; గంజి త్రాగినను దానిసారమును గ్రహించి పూర్ణారోగ్యదశను గాంచి యుందురు; దినమునకు నాలుగామడ లైనను దిట్టముగా నడవఁగలిగి యుందురు; సాధారణముగా సంతానవంతులును దీర్ఘాయుష్మంతులును నగుదురు. కాఁబట్టి నిజమయినసౌఖ్య మంతయు దేహపరిశ్రమమును బట్టియే యుండును. ధనరక్షణాదికార్యములయందును గౌరవవాంఛాదుల యందును ధనికులకే బీదల కెప్పుడును నుండనివిశేషకష్టము లుండును. బీదవాని కెవ్వరైన నాలుగుడబ్బు లిచ్చిన వాఁడు పరమానందభరితుఁ డగును; ఆనాలుగుడబ్బులనే భాగ్యవంతునిచేతిలోఁ బెట్టినఁ దన్నవ మానపఱిచినట్టు భావించి దుఃఖించును. పలువిషయములలో సాధా రణులకు స్వల్పలాభమువలననే సంతోషము కలుగును; గొప్పవారికి విశేషలాభము సంభవించినంగాని కలుగదు. కాఁబట్టి మొట్టుమీఁద నిరువురకు సుఖసంతోషాదులు సమానముగానే యుండును. వివేకము లేనియెడలఁ దమకు సుఖించుటకుఁ జాలినంతధన మున్నను మఱింత లేకపోయె నని ఖేదము నొందెడి యొకానొక సామాన్యమానవుని వలెనే, యొకానొక ధనాఢ్యుఁడును కావలసినంత ధనముండియు నతి ధనాశచేత దాని ననుభవింప మనసు పుట్టక తిన్నగా తిండి యైనను దినక దరిద్రునికంటెను నధికముగా బాధ పడును. నిజముగా విత్త వంతుల కుండెడుకష్టము లన్నియుఁ దెలిసినయెడల వారిస్థితితోడ బీద వాండ్రు తమస్థితిని మార్చుకొనుటకైన నొప్పుకోక పోవచ్చును. పూర్వము సర్వాధికారముగల రాజులుసహితము కొందఱు కష్ట సమయములయందును కార్యభారమున మునిఁగియున్నప్పుడును తమ

స్థితిని దలఁచుకొని సామాన్యస్థితియందుఁ బుట్టకపోతిమిగదా యని సాధారణజనులస్థితి కాశపడినట్లు కొన్నిచరిత్రములు సాక్ష్య మిచ్చు చున్నవి. ఈపయిని జెప్పినదానినిబట్టి చూడఁగా నెల్లవారును నధి కారము, రాజ్యము మొదలయినవానివలన సౌఖ్యమే కలుగునని యెదురు చూచినను, ఎల్లప్పుడును వానివలన సౌఖ్యమే కలుగక కొన్ని సమయములయందు దుఃఖముకూడఁ గలుగుననియు, బీదతనము సేవక వృత్తి మొదలగువానివలన దుఃఖమే కలుగునని పరీక్షించినను వాని వలననే సౌఖ్యముకూడ గలుగు ననియు అందుచేత రాజైనను కా పైనను మొత్తముమీఁద తుల్యసుఖము నేయనుభవించుచుండు ననియు తేటపడుచున్నది గనుక, కొందఱిని రాజులనుగాను తక్కినవారిని కాపులనుగాను జేయుటచేత భగవంతునియెడల పాక్షికత్వ మున్న దని యూహించుట కవకాశము లేదని వేఱుగ వివరింపవలసిన యక్కఱయే లేదు. కాఁబట్టి యీయంశమును విడిచిపెట్టి కొందఱు తెలివిగలవారుగాను కొందఱు తెలివితక్కువవారుగాను నుందు రన్న విషయమునుగూర్చి కొంత చర్చింతము. పూర్వోక్తములైన స్థితి భేదములు లోకముయొక్క క్షేమాభివృద్ధికయి యెట్లవశ్యముగా నుండ వలసియున్నవో యట్లే తెలివియందును తారతమ్యము లవశ్యముగా నుండవలసియే యున్నవి. అట్లుగాక యందఱును విశేషబుద్ధిశాలు లయి కవిత్వము చెప్పువారే యైనను, గణితశాస్త్రప్రవీణులయి యసాధ్యములయిన లెక్కల నాలోచించి చేయుచుండువారే యైనను, మఱి యేయితరవిషయములలోనైన నొకదానిలోనే పూర్ణముగా వ్యాపించుబుద్ధి గలవారయినను తక్కినవిషయము లన్నియు పాడుపడి యెవ్వరికిని సుఖము కలుగక పోవచ్చును. కాఁబట్టి లోకహితార్థమే పరమేశ్వరుఁడు కొందఱిని గణితాదిశాస్త్రములయందు వ్యాపించుబుద్ధి

గలవారినిగాను, కొందఱిని ప్రకృతిశాస్త్రములయందుఁ బ్రకాశించు బుద్ధి గలవారినిగాను, కొందఱిని జనులవేడుకకొఱ కుపయోగించు కవిత్వాదులనురచింప శక్తులనుగాను, కొందఱిని మతబోధ చేయుటకు సమర్థులనుగాను, కొందఱిని చమత్కారముగా మాటాడఁగలుగు వారినిగాను, నానావిధముల నానావిషయములయందు బుద్ధి వ్యాపించు వారిని సృజియించి యున్నాఁడు. కొంద ఱెంతకాలము చదువుకొన్నను తిన్నగా చదువు రాకపోవుటయు కొందఱు శీఘ్రకాలములోనే పండితు లగుటయు సంభవించుచున్నదే దాని కేమి చెప్పగల రని మన వారు శంక చేయవచ్చును. మనకు ముఖ్యముగాఁ గావలసినవి యుక్తా యుక్తములను దెలిసికోఁదగినజ్ఞానమును లోకకార్యములను జక్కఁగా నడుపుటకై కావలసినవ్రాఁతయు లెక్కలును నేర్చుకోఁగలుగుటయు; కష్టపడిచదువుకొన్న పక్షమున నంతవఱకు రానివాఁ డెవ్వఁడునుండఁడు; ఇహపరలోకసుఖముల కయి యంతవఱకే చాలియుండును. భగవంతుఁ డందఱును విద్యాజీవనమే చేయవలయునని యుద్దేశించలేదు గనుకను, అందఱును విద్యాజీవనమునకే వొచ్చినచో నెవ్వరికిని సుఖము కలుగ నేరదు గనుకను, విద్య చురుకుగా రానివారిబుద్ధిని సంగీతమునందుఁ గాని శిల్పములయందుఁగాని, కృషివాణిజ్యాదులయందుఁగాని, జనోప యుక్త మయినమఱియొక వ్యాపారమునందుఁగాని వ్యాపించునట్లుగా నీశ్వరుఁడు కటాక్షించి యున్నాఁడు. గొప్పబరువు మోయువాఁడు కవిత్వము చెప్పుట కెట్లు పనికిరాఁడో యట్లే గొప్పకవీశ్వరుఁడును శరీరదార్ఢ్యమును మోటుతనమును గావలసినపనులకు పనికిరాకుండును. అయినను లోకమునకు కవీశ్వరుఁ డెంతయావశ్యకమో భారవాహియు నంతే యావశ్యకము. కాఁబట్టి బుద్ధిసంపదయందుఁగూడ తారతమ్యము తప్పక యుండవలెను. మనదేశములోమాత్ర మెవనిబుద్ధి యే

విషయమునఁ బ్రవర్తించునో వాఁడావృత్తియందుఁ బ్రవేశింపక, కొన్నివర్ణ ములవారు తమకు రాజకీయోద్యోగములే కావలయుననియు శరీర ప్రయాసమును గోరు కర్మలను చేయఁగూడ దనియు పట్టుపట్టి కూరు చుండుటవలనఁ గొంద ఱెంతునకుం బనికిరానివా రగుచున్నారు. అది స్వయంకృతాపరాధమే యగుటవలన, మనుష్యులలోఁ గల బుద్ధితార తమ్యమునుబట్టి యీశ్వరునియందు వైషమ్య మారోపింపవలసి వచ్చు నని చెప్పుటకుఁగాని లేనియెడలఁ బూర్వజన్మ మొప్పుకోవలసివచ్చు నని చెప్పుటకుఁగాని యణుమాత్ర మయినను అవకాశము లేదు. లోకములో కొందఱు పుట్టుకతోనే గ్రుడ్డివారుగాను, చెవిటివారు గాను, మఱి యితరావయవములు లేనివారుగాను, అయి యుండఁగా మనము చూచు చున్నామే పూర్వజన్మకర్మము నంగీకరింపనిపక్షమున వారిస్థితి కేమి సమాధానము చెప్పఁగల రని మనవారు ప్రశ్న వేయ వచ్చును. ఈయంగహీనతలు వారికి స్వదోషమువలన వచ్చినవి కాక పోయినను, సంబంధదోషమునుబట్టి వచ్చినవిగాఁ గనఁబడుచున్నవి. ఈలోకములోఁ గొందఱికిఁ గొన్నియాపదలు పరస్పరసంబంధము వలననే సంభవించు చున్నవి. ఈశ్వరశాసన మొక్కని విషయ మయి యెప్పుడును మాఱ్పు చెందునదికాదు గనుకను, మన సుఖాభివృద్ధి కయి యన్యోన్యసంబంధ మవశ్యముగాఁ గావలసి యుండును గనుకను, అట్టియవస్థ లప్పుడప్పుడు సంభవింపక తీరదు. ఎట్లనఁగా పాషాణము పొరపాటున నైనను గొంతుకలో పడినపక్షమున దోషిని నిర్దోషిని నేకరీతిగానే మరణము నొందించును. నిప్పంటించిన మంచియోగ్యుని యిల్లును దుర్మార్గునియిల్లును నేకరీతిగానే కాలును. ఆప్రకారముగానే జననీజనకుల కుండుజబ్బుచేతనో, పిండోత్పత్తిసమయమునందు సంభ వించెడి యే యితరదోషమువలననో కొందఱి కంగలోపములు కలుగు

చున్నవి. వ్యాధులవిషయమయినకూడ మనవా రిటువంటిప్రశ్నమునే చేయవచ్చును. సాధారణముగా రోగములు మన శరీరారోగ్యవిషయమయినవిధులను మీాఱి నడుచుటవలననే సంభవించుచున్నను, తల్లిదండ్రులు సుఖవ్యాధులు కుష్ఠరోగములు మొదలయినవి కలవారై రేని వారిసంతతివారి కటువంటిరోగములు వంశపరంపరగా వచ్చుచుండుటయుఁ గలదు. ఈరెండువిషయములునుగూడ పూర్వజన్మమున్న దని సాధించుట కెంతమాత్రమును సమర్థములు కావు. అయినను గుడ్డితనము మొదలయిన వెక్కడనో యరుదుగా వేయిమందిలో నొక్కనికి వచ్చునవియేకాని బాహుళ్యముగా వచ్చునవి కావు. అప్పుడుసహిత మటువంటి యంగవైకల్యమువలన సుఖాభావము కలుగ కుండుటకయి దయాస్వరూపుఁడయిన యీాశ్వరుఁడు సాధనములను ప్రసాదించియే యున్నాఁడు. ఈయొక్క యంగవైకల్యముల విషయముననేకాక తక్కిన యన్ని యాపదలలోను దుఃఖశాంతి శీఘ్రముగా కలుగుటకయి భగవంతుఁడు తగిన యేర్పాటులను జేసియున్నాఁడు. ఆపద వచ్చినదినమునకంటె మఱునాఁడు కొంత తగ్గిపోవును; ఈప్రకారముగా దినదిన క్రమమున కష్టముయొక్క క్రౌర్యము తగ్గుచువచ్చి యనుభవించువారికి సాధారణముగా జను లనుకొనువానిలో షోడశాంశమయినను బాధయుండదు; మిత్రసందర్శనాదులవలన సగమాపద తగ్గిపోవును; తనకంటెను హీనస్థితియందుండు వారితోఁ దన్ను పోల్చుకొనుటచేతను ధైర్యముచేతను పోవచ్చునన్న యాశచేతను బాధలో విశేషభాగము తోఁచకపోవును. ఇంతేకాక లోకములో సుఖదుఃఖములు మనుష్యులస్వభావము ననుసరించియుండుటనేకాని జనులనుకొనురీతిగా నుండవు. కొందఱు మనుష్యులు ధనాదులలేమివలననే మనస్సులకు స్థిరత్వమును తృప్తి

యును గలిగి సుఖించుచు తమకు ధనికులస్థితి నెప్పుడును గలుగఁ జేయ కుండుటకై యీశ్వరుని బ్రార్థించుచు నెమ్మదితో నుందురు; కొందఱు తమకధికారాదులు పట్టకపోవుటయే మేలని యెంచుకొనుచు రాజకీయోద్యోగములన్న నేవగించుచు, అట్టివి తమకు తటస్థించినను నిరాకరించి స్వేచ్ఛగానుండి సుఖింతురు; కొంద అంధత్వాదులు కలిగి నను, అట్టివి కలుగుటకూడ తమకు క్షేమకరమేయని భావించుకొని తమకాలమును లోకోపకార కార్యములయందు వినియోగించుచు సుఖపడుదురు; కొందఱు సత్ప్రవర్తనము గలిగి లోకములో నెన్ని యాపదలువచ్చినను నెందఱెన్నివిధముల బాధపెట్టినను లక్ష్యము చేయక సత్కార్యాచరణముచేతనే సుఖింతురు. మఱియు తమకున్న యధికారమును, ధనమును, ఇతరసంపదలను భార్యాదిభోగములను బుద్ధిపూర్వకముగా వదలివేసి సన్యాసు లయ్యును విరాగు లయ్యును భగవంతుని నారాధించుచు స్థిరమయిన యానంద మనుభవించు వారిని మన మెందఱిని జూచుచున్నాముకాము? కాఁబట్టి సుఖదుఃఖములు వారివారి మనోరీతి ననుసరించి యుండును. ఇందుమీఁద భగవంతుఁడు సర్వసముఁడుగదా పూర్వజన్మమే లేనియెడల నీలోకములో పాపమును, మనుష్యాదులయందు లోపములను బాధలను నెందుకుఁ జేసెనని యాక్షేపణము చేయవచ్చును. పాపమనెడిది యొకటి ప్రత్యేకముగా లేదు. వెలుతురుయొక్క యభావ మేప్రకారముగా చీఁకటి యనఁబడునో యదేప్రకారముగా పుణ్యముయొక్క యభావమే పాపమగును. మనము సృష్టింపఁబడినవార మగుటచేతను, మన మీశ్వరులము కానేరము గనుకను జ్ఞానాదులయందంతకంతకు వృద్ధి నొందు వారమే యయినను మనము పరిపూర్ణుల మగుటమాత్ర మెన్నటికిని సంభవించదు; కాఁబట్టి మన కెప్పుడును కొన్నిలోపము లుండక

తప్పదు. మనకు లోపము లుండుట యనివార్యమే గనుకను, మన కీశ్వరుఁడు స్వాతంత్ర్యమును దయచేసి యున్నాఁడు గనుకను మనమే భగవదాజ్ఞనుమీఱి పాపులమయి కొన్ని బాధలకు లోనగుచుందుము. మనక్షేమాభివృద్ధికై యప్పుడప్పు డాపదలుకూడ నుండుట యావశ్య కమని దూరాలోచన గలబుద్ధిశాలు లనేకులు చెప్పుచున్నారు. మన కప్పుడప్పుడు వ్యాధులు లేకపోవునేని, ఆరోగ్యమువలని సుఖమును విలువను గ్రహింపలేనివార మగుదుము. బొత్తిగాదుఃఖము లేకుండు నేని, సుఖము వలన నానందమే కలుగదు; భగవంతుని మఱచిపోవు టయు దుర్మార్గమునకు వెలువకపోవుటయు సంభవింపవచ్చును. ఎప్పుడు జ్ఞప్తికి రాకపోయినను కష్టదశయందు భగవంతుఁడు తప్పక జ్ఞప్తికి వచ్చి యాతనిస్మరణమును సన్మార్గాసక్తియుఁగలిగి బాగుపడిన వా రనేకులు గలరు. భగవంతుఁడు మనలను లోకమునఁ బరిశోధన కయి పుట్టించినాఁడనువారిమతమున, మనస్వభావమును బరిశోధిం చుటకయి యాపత్సమయమే యనుకూల మయినదిగా నుండును. ఒకడు ధైర్యశాలి యగునోకాఁడో పరిశీలింపవలెనన్నచోఁ గష్టసమ యమునఁగాని మఱియొకప్పుడు శక్యముకాదు. ఒకఁడు సత్యము పలు కునోలేదో పరీక్షింపవలె ననుపక్షమున వాని కబద్ధమాడవలసినంత కష్టము వచ్చినప్పుడె కనుఁగొనవలెను. అవసరము రానంతవఱకు నందఱును మంచివారుగానే కనఁబడుదురు. ఇతరులకు వచ్చినయాప దలే మనకు భయమునుగలిగించి సన్మార్గమునకు దింపుటకును, వారి యెడ కనికరమును గలిగించి పరోపకారాదులకు బ్రేరేపించుటకును సాధనము లగును. మనము పూర్వజన్మకర్మమునే యిప్పు డనుభ వించు చుంటిమనిపక్షమున దుర్మార్గులకు శిక్షయును సన్మార్గులకు బహు మానమును ఈలోకములో కలుగకపోవుటకును, కొందఱుదుర్మార్గు

లీలోకములో సుఖమునే యనుభవించుచుండగా కొందఱు సన్మార్గులు కష్టమును పొందు చుండుటకును కారణము నేమని యూహింపగలఁ మని పూర్వజన్మవాదు లడుగుదురు. నిప్పంటినచో దేహముఁ కెట్లో యట్లే పాప మంటిన నెప్పుడో యొకప్పు డాత్మకును తాపము కలుగక తప్పదు. ఈజన్మము పరిశోధనముకొరకో మనయభివృద్ధికొఱకో యేర్పఱుపఁబడినదే కాఁబట్టి యన్ని నేరములకును శిక్ష యిక్కడనే కలుగదని యీవఱకే చెప్పియున్నాను. ఇక్కడ మంచివారికి బహుమానమును చెడ్డవారికి శిక్షయును సదా కలుగక పోవుటయే మనము చేసిన కార్యములకయి మనకు సుఖదుఃఖముల నిచ్చెడిపరలోక మొక్కటి యున్నదని స్పష్టమగుచున్నది. మనలను భగవంతుఁడు కార్యము చేసినవెంటనే శిక్షించుచు వచ్చినట్లయిన మనకిచ్చినస్వాతంత్ర్యము వలని ప్రయోజనము కలుగక, మన మేపని చేయఁబోయినను కత్తియెత్తి యొకడు కొట్టుటకు సిద్ధముగా దగ్గరనిలుచున్నట్టుండి మనకు భయమెక్కువయి సౌఖ్యమన్న మాటయే లేకపోవలసివచ్చును. వెంటనే శిక్షించకపోయినను మనమెప్పుడును సన్మార్గముననే నడచుచుండునట్లు చేయరాదా యనెడుపక్షమున, అప్పుడు మన విభాగజ్ఞానమును స్వాతంత్ర్యమును వ్యర్థములయి సుఖవంతోపాదులు లేక మనము యంత్రములవంటివార మగుదుము. కాఁబట్టి యీప్రశ్నకు మనలను భగవంతుఁడు పశుపక్ష్యాది తిర్యగ్జంతువులఁగాఁగాఁబి శిలాపర్వతాదిజడపదార్థములఁగాగాని యేల చేయరాదని యర్థ మేర్పడును. భగవంతుఁడు మనకంటె నెన్నోమడుఁగులు బుద్ధిమంతుఁడయి యట్లుచేయక పోఁబట్టియే మన మిప్పుడు సృష్టిలోని సమస్త పదార్థములకంటెను నుత్తమజన్మము గలవారమని సంతోషింపఁ గలుగుచున్నాము. ఈ లోకములోఁ గొందఱు మంచివారు కష్టములపాలగుచుండుటయు కొందఱు

దుష్టులే సుఖ మనుభవించుచుండుటయుఁ తటస్థించుచున్నదే దాని కేమికారణమని సందేహము కలుగవచ్చును. జనుల కెల్లను సమానముగానే స్వాతంత్ర్యము కలిగియుండుటయు జనులలోఁ బరస్పర సంబంధము గలిగియుండుటయు నే పయియాక్షేపమునకు సమాధానముగా నుండును. మనకు స్వాతంత్ర్యము లేకపోయిన, సౌఖ్య ముండదనియు మనముప్పుడు మృగాదులకంటె నధికులము కానేర మనియు వెనుకనే చెప్పియున్నాను. జనకులు బిడ్డలు, రాజులు రాష్ట్రములు భర్తలు భార్యలు, గురువులు శిష్యులు, అధికారులు ప్రజలు, మొదలయిన సంబంధములవలన నీతిమంతు లయినచో సమస్తసుఖములును గలుగునట్లే యందులో నెవ్వరయిన నీతిమాలినవా రగుదురేని సంబంధదోషమువలన రెండవవారికి యోగ్యులకునయితము కష్టములు సంభవించును. తల్లిదండ్రులు కోపిష్ఠు లగుదురేని నిష్కారణముగా నిరపరాధులయిన బిడ్డలను కొట్టి హింసపెట్టుదురు. బిడ్డలు దుర్మార్గులగుదురేని జననీజనకులకు మనస్తాపము కలిగింతురు. రాజులు దుష్టాత్ము లయిరేని దేశజనులను బాధింతురు; జనులు స్వామిద్రోహులయి తిరుగఁబడువా రగుదురేని రాజులకు మనోవ్యథ కలుగును. భర్తలు సురాపానాదిదుర్వృత్తుల మరిగినవారైరేని భార్యలు దుఃఖభాజనలగుదురు భార్యలుజారిణులగుదురేని భర్తలుసుఖదూరులగుదురు; గురువులుమోసగాండ్రగుదురేని శిష్యులుభ్రష్టులగుదురు; న్యాయాధికారులులంచములు గైకొనువా రగుదురేని ప్రజలు క్షోభపడుదురు. పాపభీతివలన నందఱును నీతిమంతులైనచో నిటువంటి బాధ లించుమించుగా నివారణమగును. జగత్తునఁ గొందఱు చిన్నప్పటినుండియు దుష్టస్వభావము కలవారుగాను కొందఱు సత్స్వభావము గలవారుగాను నుండుటకు స్వాతంత్ర్యమే కారణ మగును. ఇట్లు రెండువిధ

ములుగాను బ్రవర్తించుటకు శక్తి గలుగకపోవునేని, మనకుస్వేచ్ఛయే లేకపోవలసి వచ్చును; స్వేచ్ఛ లేకపోయిన మనము పశుపక్ష్యాదుల కన్న నధికులము కానేరము; స్వేచ్ఛయున్నఁ గొందఱు యోగ్యులుగాను కొంద ఱయోగ్యులుగాను నుండక తప్పదు. కాఁబట్టి యీభేదమునకుఁ బూర్వజన్మమును హేతువునుగాఁ జెప్పుట కావశ్యకంజంతయు నవకాశము లేదు. పునర్జన్మమే లేదనెడునెడల నీశ్వరుఁడు నవాజీవాత్మలనుసృజించుచుసృష్టికార్యమునందుఁదగిలియున్నాఁడని చెప్పవలసివచ్చునని మన వారికడపటి యాక్షేపముం జేయవచ్చును. ఈప్రశ్నకు సమాధానము చెప్పుటయు నంతదుష్కరముకాదు. ఇప్పుడు సృష్టియొక్క క్రమమును విచారించి చూడఁగా బ్రతివస్తువు నెప్పటికప్పుడే పుట్టుచున్నది. ఎట్లనఁగా నొక మఱ్ఱిగింజవలన పెద్దవృక్షము జనించి, కాలక్రమమున కోట్లకొలఁది ఫలములుగలిగి, యాఫలములలోని ప్రతిబీజమువలనను వృక్షములును ప్రతివృక్షమువలనను ఫలములును నంతములేకుండ పొడముచున్నవి. అట్లయ్యును పరమేశ్వరుఁ డవి యాప్రకారమగుటకు మొదటనే సంకల్పించెనందుముగాని ప్రతిపర్యాయమును పని కట్టుకొని చేయుచున్నాఁడని మన మనఁజాలముకదా? ఆప్రకారము గానే యాదియందుఁ జేసినభగవత్సంకల్పముచేతనే యాత్మలును కలుగుచున్నవని చెప్పుట యుక్తియుక్తమయి యున్నది.

3. తరువాత పూర్వజన్మమున్నదని నమ్ముటవలన లోకము నకు లాభము కలుగునా నష్టముగలుగునా యన్న మూడవయంశ మును గొంత విచారింతము. పూర్వజన్మసిద్ధాంతమువలన లాభము లేవియు లేవని యీవఱకుఁ జెప్పినదానివలననేస్పష్టమగుచున్నది. బీద తనము మొదలగునవి పూర్వజన్మకృతపాపమునకు శిక్ష యనువాద మునుబట్టి, సాధారణముగా లోకములో తిండికిలేనివారే దొంగత

సము మొదలయినవి చేయుటకు లోనగుదురు గనుక భగవంతుఁడు చేయుశిక్ష దుర్మార్గనివారణమున కనుకూలపడుటకుమాఱుగా దుష్కర్మాభివృద్ధికే తోడుపడుచున్నదని చెప్పవలసివచ్చును. తా నే నేరమునుజేయఁబట్టి శిక్ష వచ్చినదో తెలిసికొనుట కనుభవించువారికిగాని వాఁడేనేరమును జేయఁబట్టి యీశిక్షను బొందుచున్నాఁడని యెఱుఁగుట కితరులకుఁగాని యవకాశము లేదు గనుక, ఎవ్వఁడునుదుష్కృత్యములకు వెనుకతీయఁడు; వ్యాధి మొదలగునవి పూర్వజన్మ పాపరూపములని నమ్మకము కలిగియుండుటవలన, అంగహీనులు వ్యాధిబాధితులు మొదలయినదయనీయులస్థితిని జూచి జాలిపడి వారికి సాహాయ్యము చేయక పూర్వజన్మమునందుఁ జేసికొన్న పాపముచేత వారి కాగతి సంభవించినదని పుర్భ్రిమగొని కఠినహృదయులమును దుర్మార్గులము నగుదుము; పుణ్యాత్ములుదృఢకాయులుగా నుందురనియునట్టివారికి దానధర్మములు చేసినచే పరలోకసుఖము సంభవించుననియునమ్మి దిట్టముగా పాటుపడి నలుగురిని బోషింప శక్తిగలదృఢశరీరులకే దానములు చేసి సమస్త దోషములకును కుదురయినసోమరితనమునువృద్ధిచేసినవార మగుదుము. ఈసిద్ధాంతమును నమ్మినవారు పూర్వజన్మప్రారబ్ధ మెట్లున్న నట్లగునని కొందఱు వ్యాధులకు యుక్తసమయములో దగినచికిత్సలుచేయించకయు, మంచి కార్యములకయి ప్రయత్నలు చేసి పాటుపడకయు చెడిపోవుచున్నారు; ముందు లెక్కలేని పశుపక్ష్యాదిజన్మములు వచ్చునని లేనిపోనిభయమును పెట్టుకొని నిరుత్సాహులయి సుఖమునకు దూరులగుచున్నారు.

ర. ఇఁకఁ బూర్వోత్తరజన్మము లుండవనుటకుం గలహేతువులను గుఱించి యించుక చర్చింతము. గ్రాహ్యాశక్తి, జ్ఞప్తి, ఇచ్ఛ మొదలగునవి శరీరముయొక్క యేయవయవములనుగాని రక్తమాం

సాస్థి నాడీసముదాయములలో వేనినిగాని యంటినవి కాకపోవుటయు, అవి ప్రత్యేకముగా జీవగుణములే యగుటయుఁ దలపోసి చూడఁగా శరీరనాశమువలన వానికి భంగము కలుగుటకు హేతు వేదియుఁ గనఁబడదు. కాఁబట్టి జీవులకు బహుజన్మములే యుండి యిప్పుడు మనదేహములో నున్నజీవాత్మ వెనుక నొకజన్మ మెత్తినదే యయిన పక్షమున వెనుకటి జన్మములో జీవునకుఁ గలిగినజ్ఞానమును, నేర్చుకొన్న విద్యలును చేసినకార్యములును గొంతవఱకైన నీజన్మమునఁ గలిగి యుండవలెను. అట్లు లేక జన్మ మెత్తిన ప్రతిజీవుఁడు ప్రతివిషయమును క్రొత్తగా నేర్చుకోవలసి యుండుటయు, ప్రతిభాషయు నూతనముగా నభ్యసింపవలసి యుండుటయు, పూర్వజన్మములోని దొక్కసంగతియైన స్మరణము లేకపోవుటయు, పూర్వజన్మము లేదనుటకుఁ జాలినంత నిదర్శనములుగా నున్నవి. జ్ఞానము లేకపోవుటకును భాష రాకపోవుటకును గారణము పూర్వజన్మమున నీయాత్మ శిలావృక్షాది జడజన్మమును గాని మహిషవాయసాది తిర్యగ్జన్మమును గాని పొంది యుండుట యయి యుండవచ్చునని చెప్పవత్తురు. శిలాపర్వతాది జడపదార్థములయం దాత్మ యుండునని చెప్పెడు మనవారి సిద్ధాంతము నకన్న పరిహాసాస్పదమైన విషయము మఱియొకటి యుండునని నే నూహింపఁ జాలను. ఆత్మస్వభావలక్షణములను నెఱిఁగినబాలుఁ డయినను జడపదార్థములయం దాత్మయుండదని సులభముగాఁ జెప్పఁగలుగునపుడు విశేషజ్ఞులయిన మీకడ నేనావిషయమునఁ బెంచి చెప్పవలసినయావశ్యక ముండదు. అందుచేత మనుష్యాత్మలు జడములగుననుట యున్మత్త వాక్యమునకంటె నెక్కువ గౌరవనీయ మయినదిగాఁ గనుపట్టదు. పశు పక్ష్యాదులు మనుష్యు లగుదురని చెప్పుటయు నించుమించుగా నంత విశ్వసనీయ మయినవాక్యమునుగానే

గ్రహింపఁ దగియుండును. ప్రపంచమునందలి యన్నిమతములవారును నైకకంఠ్యముగా సృష్ట్యాదియం దాదిమదంపతు లల్పసంఖ్య కలవారుగానే సృజియింపఁ బడిరని చెప్పుచున్నారు; ఇప్పు డంత కంతకు జనసంఖ్య ప్రపంచములో నెక్కువగుచున్నట్టు మనమందఱము నెఱుఁగుదుము. జనసంఖ్య వృద్ధియగుట యనఁగా నాత్మలసంఖ్య వృద్ధియగుచున్న దనుటయే గనుక, ఈప్రత్యక్ష నిదర్శనమే మొదట నున్నయాత్మలే కర్మబంధవశమున మరలమరల జన్మము లెత్తుచున్న వన్న వాదమును ఖండించి పూర్వోత్తరజన్మము లుండవను సిద్ధాంతమును స్థాపించు చున్నది. ఇంతయేకాక యొకవేళ వాదమునిమిత్తము పశుపక్ష్యాదులు మనుష్యజన్మము లెత్తుచున్నవని యొప్పుకొందమన్నను ఒక యావునుగాని యొక మేఁకనుగాని కొన్నవారికి కొంత కాలములోనే వానిసంఖ్య యెంత వృద్ధియగునో మన మందఱము నెఱిఁగియున్నాము గనుక, ఆపక్షమునను మరల మరల దొల్లింటి యాత్మలే జన్మించుచుండుట కవకాశము కనఁబడక క్రొత్తయాత్మలే పుట్టుచున్నట్టు స్థిరపడుచున్నది. జన్మాంతరము నొప్పుకొను మనవారయినను లోకములో నందఱును జన్మములనే యెత్తుచుండవలయునని చెప్పఁజాలరు, పుణ్యాత్ములు కొంద ఱయినను క్రమక్రమముగాఁ బునరావృత్తిరహితశాశ్వత పుణ్యలోకముల నొందుదు రని యొప్పుకొందురు గనుక, ఆసిద్ధాంతప్రకారమును జన్మము లెత్తవలసిన జీవులసంఖ్య యంతకంతకు తక్కువయై కొంతకాలములో జనులసంఖ్య క్షీణదశ నొందవలెను. అట్లుగాక జనసంఖ్య నానాటికి వృద్ధియే యగుచున్నది గనుక, జన్మపరంపర లేదని సులభముగా నూహింపఁదగియున్నది. కర్మానుబంధమే జన్మమునకుఁ గారణ మని మనవారు చెప్పెడి సిద్ధాంతప్రకారముగా, మొట్టమొదటి జన్మమునందుఁ గర్మ

యొక్కడినుండి వచ్చినదని ప్రశ్న రాఁగా తగిన సమాధానము కుదురక యీశ్వరునితో పాటుగా కర్మయు ననాదియని యుక్తిరహితముగా మనవారు తమసిద్ధాంతమును సమర్థింపఁ జూతురు. కర్మ యనాది యైనచో జన్మలు ననాదియే కావలసివచ్చును. అప్పుడు మనల నీశ్వరుఁడు సృజించనేలేదని సిద్ధాంతము తేలును. అందునకును వెనుక తీయక మనవా రాప్రకారముగానే జీవు లనాదు లని చెప్పి జీవుల నీశ్వరుఁడు సృజింపలేదనియు, జీవాత్మలు సృజింపఁబడినవే యయినపక్షమున నాశనముకూడఁ బొందవలసి యుండు ననియు, కాఁబట్టి భగవంతుఁడు మనలను సృజించినాఁ డనుట కర్థము కరణకళేబరములతో గూర్చినాఁ డనుట యనియుఁ జెప్పుదురు. మొట్టమొదటకరణ కళేబరాదులయినను గలిగించినవాఁ డీశ్వరుఁడే యుండురుగనుక తప్పక యెప్పుడో జీవుల కీశ్వరుఁడు జన్మమును కలిగించినకాల మొకటి యున్నదని యొప్పుకొని తీరవలెను. అందుచేత జీవులజన్మముల కాది యుండక తప్పదు. జీవులకు జన్మము లేనప్పుడు కర్మయుండుట యసందర్భముగనుకజన్మతోనే కర్మకును నాదియున్నదనియంగీకరింపకుండనయితీరాదు. అందుచేతఁ గర్మ యనాదియను సిద్ధాంతము పడిపోయినది భగవంతునకు వైషమ్యాదులు లేవనియే వారిసిద్ధాంతముగనుక, మొదటిజన్మముననందఱును సుకృతాత్ములయియేయుండిరనవలెను. ఆజన్మముననందఱును యోగ్యులెయయిపుణ్యకర్మలు చేసినవారుగానేయుందురుగనుక, దాని మఱుచటిజన్మమునందుఁగాని మఱియేజన్మమునందుఁగాని కొందఱు పాపాత్ములగుటకును వారికి జన్మపరంపర వచ్చుటకును గారణముకనఁబడదు. కాఁబట్టి వారి జన్మపరంపరాసిద్ధాంత మయినను లోకములోని పుణ్యపాపములకును స్థితిభేదములకును గతిని కల్పింపఁ జాలదు. పూర్వజన్మమే యున్నపక్షమున మన కాజన్మములోని

సంగతు లేవియు నెందుకు స్మరణకు రాకపోవునని చేసినయాక్షేపణ మున కుత్తరముగా, నమ మీజన్మములోఁ జేసినపనులే కొన్ని మఱచిపోవుచుండగా నెంతోకాలముక్రిందట జరిగిన వెనుకటిజన్మము లోనిసంగతులు మన కెట్లు జ్ఞప్తి యుండఁగలవని చెప్పుదురు. ఈ జన్మమునందలి యనావశ్యకము లైనసంగతులను మనము మఱచి పోయినను ముఖ్యము లయినసంగతులను మనము జ్ఞప్తి యుంచుకొనే యుంచుకొందుము. సర్వకారుణ్యుఁ డయినయీశ్వరుఁడు మనమేలు కొఱకే కొన్నిసంగతులను మనకు జ్ఞప్తికి రాకుండులాగునఁ జేసి యున్నాఁడు. మనము ప్రతిదినమును నేమేమి పదార్థములను భుజించి తిమో యేమేమి మాటలాడితిమో యెక్కడెక్కడఁ దిరిగితిమో మొదలైనప్రతిస్వల్పవిషయమును స్మృతికి వచ్చుచుండుటవలనఁ బ్రయోజనము లేదు; మీఁదిమిక్కిలి నష్టమును గలుగును. మన మేదియైన నొక మహావిషయము నాలోచింపఁగడఁగినపుడు మనము చిన్నప్పటి నుండియు బ్రతిదినమును తినుచువచ్చిన కూరగాయలు మొదలయినవియు నేలమీఁద బ్రాకుట తప్పటడుగు లిడుట లోనుగాఁగల వ్యాపారములును నొక్కసారిగా మనోవీధిని బ్రవేశించి స్మరణకు వచ్చినచో స్థిరచిత్తత కలుగక కార్యాలోచనము చెడిపోవును; వెనుక సంభవించినయాపద లన్నియుఁ దఱచుగా జ్ఞప్తికి వచ్చుచున్నచో సుఖాభావము కలుగును. కాఁబట్టియే యీశ్వరుఁ డివి యన్నియు మఱచునట్లు చేసి ప్రధానాంశములనుమాత్రమే జ్ఞప్తికి వచ్చుచుండునట్లు చేసి యున్నాఁడు. వెనుక మన మేదియయిన నొక ఘోరపాతకమును జేసి యుండి దానికి శిక్ష కాకపోయినయెడల మనకు తీరికగలిగి యాలోచింప నవకాశము కలిగినప్పుడెల్ల ముందుగా నదే స్మరణకువచ్చి మన మనస్సునకు నొప్పి కలిగించి మనవర్తనమును క్రమపఱుచును. ఒక్క.

లోకోపకారక మయినఘనకార్యమును జేసియుండినపక్షమున దాని వలనఁ గలిగినకీర్తియును మనస్సంతోషమును జ్ఞప్తికివచ్చి సత్కార్యాచరణమునకు మనలను బ్రోత్సాహపఱుచును. ఈప్రకారముగా నిష్ప్రయోజనము లైనవిషయముల నెన్నటిని మఱచినను, బాల్యావస్థయందుఁగాని యౌవనదశయందుఁగాని పూర్వము మన మొక స్థితియం దుంటిమన్న ముఖ్యాంశమునుమాత్రము మన మెన్నటికిని మఱచిపోము. శిక్షను బొందుచున్న కాలములోఁ దా నేనేరమున కయి శిక్ష ననుభవించుచున్నాఁడో యెవ్వఁడును మఱచిపోఁడు; అట్లు మఱచిపోయెడుపక్షమున శిక్షవలన ఫలము కలుగక యొకఁడు తన నడతను దిద్దుకొనుట కవకాశము లేనివాఁడగును. ఈలాగు ననే దేనిని మనము జ్ఞప్తియం దుంచుకొనుటవలన ముందు మనకుఁ బ్రయోజన ముండునో యటువంటి యేవిషయమును భగవంతుఁడు బొత్తిగా మఱచునట్లు చేయఁడు. మనవారు చెప్పెడు ప్రకారముగాఁ బూర్వజన్మమే యొకటి యుండి యీజన్మము వెనుకటిజన్మమునఁ జేసినకర్మలకు శిక్షయే యగునేని, ఏజన్మమునఁ జేసినయపరాధముల కయి మనము శిక్ష ననుభవించు చున్నామో యాజన్మమున్న సంగతినే బొత్తిగా మఱచిపోవుచున్నామనుటకన్న వింత మఱియొకటియుండదు. అయినను పూర్వజన్మములోని సంగతు లన్నియు స్మరణకు రాక పోయినను దానిలో జరిగినప్రధానసంగతులుగాని యధమపక్షముజన్మమె త్తినసంగతిగాని యేలస్మరణమునకు రాకపోవునని చేసినయాక్షేపణ కుత్తరముగా మనపండితులు మరణానంతరము మనోబుద్ధిచిత్తాహంకారము లాత్మను విడుచునని చెప్పుదురుగాని యీనాలిగింటిని విడిచి యాత్మయుండునని చెప్పుట జ్ఞానకర్మేంద్రియాదు లగునవయవముల నెల్లను విడిచి శరీర ముండునన్నట్లుగా నర్థము లేనిమాటగా నుండును.

కాఁబట్టి పునర్జన్మము లేదనుసిద్ధాంత మీ చెప్పినదానివలననే సిద్ధాంతము కావచ్చును.

౫. ఇపుడు పునర్జన్మము లేదనుకొనుటవలనఁ బ్రజల క్షేమాభివృద్ధికి నష్టము సంభవించునా పుష్టికలుగునా యన్నకడపటియంశమును గూర్చి కొంచెము ముచ్చటించి యీవిషయము ముగించెదను. నాబుద్ధి ప్రచారమునకు గోచర మగునంతవఱకుఁ బూర్వోత్తరజన్మములు లేవనుకొనుటవలనఁ గలిగెడునష్ట మొక్కటియుఁ గానరాకున్నది. పూర్వజన్మకర్మలను నమ్మకపోవుటవలనఁ బ్రతిమనుష్యుఁడును తాను జేసెడు పనులకుఁ దానే యుత్తరవాది నని తెలిసికొని మంచిపనులను చేయఁ బ్రయత్నించును; దైవపరుఁడు కానందున యుక్తమయినపని చేయుటకే యీశ్వరుఁడు తనకు దృఢమయిన యవయవములను దయ చేసి యున్నాఁడని సోమరితనము విడిచి తనజీవనమున కయి పాటు పడును; ఇతరులకు సంభవించెడి యాపదలను జూచినప్పుడు కనికరము కలిగి యంగహీనులు మొదలయినదానయోగ్యులకే సహాయము చేయుచు నపాత్రదానమును బొత్తిగా కట్టిపెట్టును; సర్వకార్య సిద్ధులును తనప్రయత్నములోనే యుండునని నమ్మి యేకార్యము నకును నదృష్టమును నమ్ముకొని యుండక సర్వకాయకష్ట పడునుగనుక సర్వశుభములును కలుగును; వ్యాధులు మొదలయినవి వచ్చునపుడు ప్రారబ్ధమును నమ్మి యుపేక్షాపరుఁడు గాక యుక్తసమయముననే తగినచికిత్సలు చేయించుచు మనుష్యప్రయత్నముగో లోప మేమియు లేకుండఁ జేసి మేలు పొందును. పునర్జన్మము లేదనుకొనుటవలననే సత్కర్మలు చేయుటకుఁ బ్రోత్సాహమును దుష్కర్మలు చేయుటకు నిరుత్సాహమును గలుగును.

ఈవఱకుని జర్చించిన యైదంశములవలనగనప్పా పునర్జన్మము లేక

పోవుటయే పరమార్థమని మీకుఁ దేటపడి యుండవచ్చును. ఈ ప్రపంచములోఁ బాపముకూడ నుండుటకుఁ గారణము మనకు మనసు వచ్చినట్లు పనిచేయుటకయి స్వాతంత్ర్య ముండుట తప్ప వేఱొక టేదియు లేదు. మన పాపకార్యములకు జన్మాంతరములను గలిగింపకయే యీశ్వరుఁడు పరలోకమున నర్హదండనము విధించును. మనకు విభాగజ్ఞానమును స్వాతంత్ర్యమును బ్రసాదించియుండుటవలన మనము చేయునెల్ల కార్యములకు మన మీశ్వరున కుత్తరవాదులముగా నుందుము. ప్రపంచములో నదృష్ట మనిగాని ప్రారబ్ధ మనిగాని యేదియు లేదు. పాపభీతి కలుగఁజేసి మనలను సన్మార్గమునకుఁ ద్రిప్పెడి యద్భుతశక్తిగలదివ్యౌషధము భగవదారాధన మొక్కటియే గనుక, మన మీశ్వరు నెన్నఁడును మఱచిపోక యాసర్వకారుణ్యుని సదా స్మరించుచు నాతని గుణానుభవము గలిగి యాయనయాజ్ఞలను జెల్లించుచు నానంద మనుభవింప నెల్లవారును బ్రయత్నింపవలయును.

అతిబాల్యవివాహము

ఇది

చెన్నపురి రాజధానీ శాస్త్రపాఠశాలయందు

తెలుఁగుపండితులుగానుండిన

కందుకూరి వీరేశలింగముచేత

రచియింపఁబడినది.

మూడవకూర్పు.

రాజమండ్రి:

మోహన్ ప్రెస్సందు ముద్రింపఁబడినది.

1949

ప్రతివెల 4 అణాలు.

అతిబాల్యవివాహము

ఓవిద్వన్మహాజనులారా!

ఈసమాజముయొక్క అగ్రాసనాధిపతిగారు కొన్నిదినముల క్రిందట నన్నొక యుపన్యాసము చదువుమని యడిగినప్పుడు నాశక్తిని వక్తవ్యాంశముయొక్క గౌరవమును లేశమాత్రమును విచారింపక సాహసముచేసి బాల్యవివాహమునుగూర్చి యుపన్యసించుట కొప్పు కొన్నాఁడను. కాని యీదినమున నేను కలము చేతఁబట్టుకొని వ్రాయ నారంభింపఁగానే నాకంటె సమర్థతరులకు విడిచిపెట్టవలసిన కార్య భారమును నేను పైని వేసికొన్న హేతువుచేత కాఁబోలును కలము సాగక నాచేయి వడఁక మొదలుపెట్టెను. నాకంటె విద్యయందును బుద్ధియందును అధికులయిన యీసామాజికులలో మఱియెవ్వరయిన సమర్థు లీబాల్యవివాహమునుగూర్చి వ్రాసినచో మిక్కిలి రసవంతము గాను జనరంజకముగాను ఉండునని నేనెఱిఁగినవాఁడ నయ్యును, రోటిలో తల దూర్చినతరువాత రోకటిపోటునకు వెఱవఁదగదన్న సామెతను స్మరించుకొని నాకు తోఁచినది వ్రాయ తెగించుచున్నాను. కాఁబట్టి నే నిప్పుడు చెప్పఁబోవుదానిలో నూతనములుగని క్రొత్తసంగతులుగాని క్రొత్తయుక్తులుగాని యుండునని యెవ్వరు నాశపెట్టుకొనఁ బోకుఁడు. లోక ములో ననుభవింపఁదగిన సమస్తసుఖములలోను వివాహబంధమువలన కలిగెడిసౌఖ్య మత్యధికమయినదనియు, ఈ వివాహబంధము వలననే భార్య, భర్త, తల్లి, తండ్రి, బిడ్డ, అక్క, చెల్లెలు, అన్న, తమ్ముఁడు, మొదలయిన సమస్తబంధుత్వములును కలుగుననియు, ఈవివాహ బంధమువలననే బిడ్డలు మృగప్రాయులుగాక తగిన సంరక్షణమును విద్యాబుద్ధులనుపొంది వెలయుదురనియు, ఈవివాహబంధమువలననే

స్త్రీపురుషులు యావజ్జీవమును స్నేహపాశబద్ధులయియుండి యిరువురు నొక్క దేహముగా పరిగణింపఁ బడుచుందురనియు, ఈవివాహబంధము వలననే పురుషుల యావశ్యకములను స్త్రీలును స్త్రీలయావశ్యకములను పురుషులును తీర్చి పరస్పరసుఖాభివృద్ధి పొందుదురనియు, మీరందఱు నెఱిఁగియున్న విషయమే గనుక వివాహముయొక్క ప్రాశస్త్యమును గుఱించియు ప్రయోజనములనుగుఱించియు నే నిక్కడ చెప్పవలసిన యావశ్యకములేదు. అనురాగమును వధూవరులకుఁ గలుగవలసిన సుఖమునకుఁగాని దుఃఖమునకుఁగాని వధూవరులయోగ్యతలే ప్రధానములైనవనియు, సంసారసుఖము దంపతులయొక్క పరస్పరానురాగము ననుసరించియే యుండుననియు, మీకు విశదపడినయంశమే గనుక వివాహకాలమునకుముందే వధూవరులు వివాహబంధమువలనఁ దమకు ముందు కలుగఁబోవు సంసారభారముయొక్క గౌరవమును తాము ముందెల్ల కాలమును కలసిమెలసి యుండవలసినవారి గుణాగుణములను తెలిసికోఁదగినంత ప్రాజ్ఞతగలవారుగా నుండవలసిన దన్నయంశమును సహితము నేను వివరింపవలసిన యావశ్యకములేదు. అయినను వివాహము లెవ్వరిసుఖసంతోషముల నిమిత్తముద్దేశింపఁబడినవో, వానియందలి లోపమువలన నెవ్వరు కలకాలమును దుఃఖమనుభవింపవలసినవారగుదురో, తమ చిరకాలసుఖజీవనమున కనుకూలప్రతికూలములుగా నుండు సాధకబాధకముల నాలోచించుకొనుట కెవ్వరర్హులో, వార యంగీకారమును పరస్పరేచ్ఛను లేశమాత్రమును గణింపక మనదేశమునందు కొన్నివర్ణములవారు వివాహములయం దాస్వాతంత్ర్యము నంతను తామే యక్రమముగా వహించి యాచారబలముచేతను మఱికొన్ని కారణములచేతను యుక్తాయుక్తవిచారమును జేయఁజాలక నిర్దోషులయిన బిడ్డలకు మితిమీఱిన కష్టములను దెచ్చిపెట్టుచుండుట చూడ నెంతయు శోచనీయముగానున్నది. సంసారసుఖకల్పవృక్షమును

మూలచ్ఛేదము చేయుటకై వేరుపురుగువలెనున్న యీబాల్యవివాహ
మును రూపుమాపినంగాని మనదేశమునందలి కుటుంబములలో వివా
హమువలని సంపూర్ణఫల మెన్నటికిని కలుగనేరదు. ఈబాల్యవివా
హము మనదేశమునం దంతకంతకు ప్రబలుచుండుట కనేకకారణము
లగుపడుచున్నవి. కొందఱు తాము బ్రతికియుండఁగానే తమబిడ్డలకు
వివాహముచేసి ముద్దులను ముచ్చటలను వేడుకలను చూడవలెనను
నుద్దేశముతో పసిబిడ్డలకు వివాహములు చేయుదురు; మఱికొందఱు
బిడ్డలయొక్క పెండ్లిండ్లను తామెప్పుడు చూతుమా యని తొందర
పడుచుండెడు వృద్ధులయిన జనకులయొక్కయు బంధువులయొక్కయు
నిర్బంధముచేత చేయుదురు; కొందఱుగవుతగవుల నిమిత్తమును కట్న
ములు కానుకలు మొదలైనవాని నిమిత్తమును పోరుపెట్టెడు మూర్ఖు
రాండ్రయిన భార్యలయొక్క ప్రోత్సాహముచేత చేయుదురు;
కొందఱు డంభమునకయి యతివ్యయముచేసి దక్షిణలచేతను బ్రాహ్మణ
సంతర్పణములచేతను ప్రతిష్ఠపొందవలెనన్న కోరికతో చేయుదురు;
కొందఱు వివాహములో వివాహముచేసిన సొమ్ము కలిసివచ్చునని
చేయుదురు; మఱికొందఱుశిష్టాచారమునుబట్టి తమబిడ్డల కెంత
శీఘ్రముగా వివాహముచేసిన లోకులు తమ్మంతమంచివారను కొందురని
పేరున కాశపడి చేయుదురు; కొందఱు కోడండ్రమీఁద నధికారము
చేయవచ్చునన్న యభిలాషతో నుండెడియిల్లాండ్రయొక్క యభిమత
మును తీర్చుటకయి చేయుదురు; కొందఱు మంచిసంబంధముల కాస
పడి చేయుదురు; కొందఱు వేగిరము వివాహములు కాకపోయిన
పక్షమున తమబిడ్డలు చెడిపోదురను సచ్చింతతోనే చేయుదురు; ఇంకను
కొందఱు బాల్యవివాహములు చేయకుండుట శాస్త్రవిరుద్ధమన్న భ్రమ
చేత చేయుదురు.

ఈ తెగలవారుగాక స్వప్రయోజనపరులై మానుషధర్మమును విడిచి దయాశూన్యులై రొక్కమును పుచ్చుకొనియో, అల్లుఁడు చచ్చినచో వానిసొత్తంతయు తమకే వచ్చుననియో, అల్లునియింటఁ జేరి తామందఱును సుఖజీవనము చేయువచ్చుననియో, తాముకన్న నోరెఱుఁగనిశిశువులను అప్రయోజకులకును వికలాంగులకును వృద్ధులకును వివాహవ్యాజమున బలి యిత్తురు. ఏకారణములచేత జరిగెడు బాల్యవివాహములకైనను పురోహితులును యాజకులును తోడుపడి సర్వవిధముల బాల్యవివాహములను ప్రోత్సాహపఱుతురు. ఇటువంటి కార్యములచేతనే ధనము సంపాదించి పొట్ట పోసికోవలసిన ప్రయోజనపరులు ప్రోత్సాహము చేయక మఱియేమి చేయుదురు? ఎవరిప్రోత్సాహముచేత చేసినను, ఏయుద్దేశముతో చేసినను, ఏకారణముచేతఁ జేసినను, స్వభావవిరుద్ధ మనఁజను బాల్యవివాహమువలనఁ గలిగెడి దుర్వారము లైనదుష్ఫలములు కలుగక మానవు. అతిబాల్యవివాహమువలన సంభవించుచున్న యనర్థములలోఁ గొన్నిటినిమాత్రము నిందు వివరించెదను. బాలారిష్టములును స్ఫోటకము మొదలగు సాంక్రామిక రోగములును వానివలన కలిగెడు మరణములును బాల్యదశయందే విస్తారముగానుండు నన్న సంగతి యెల్లవారికిని తెలిసినదే. అందుచేత ౧౮౮౧ వ సంవత్సరాంతమునందు మనదేశమునందు చేసినజనపరిగణనమునుబట్టి చూడఁగా తొమ్మిది సంవత్సరములకు లోపలివయస్సుగలిగి వివాహమన్న నేమో యెఱుఁగనిదశలో నున్నబాలురలో భార్యలను పోఁగొట్టుకొన్నవారు లెక్క తెలిసినంతవఱకు ౨౮౭౨౩ గురు కనఁబడుచున్నారు. వీరి వివాహసమయములయందు వ్యయపఱిచినధనమంతయు వ్యర్థ మగుటతప్ప, ఈ బాలురుగాని వారి బంధువులుగాని యేమిలాభము ననుభవించినవా రయినారు? బాలికలగతి బాలురదానికంటెను సహస్రగుణములు దుఃఖబహుళ మయినదిగా నున్నది. పురు

షులు మరల వివాహము చేసికొననైన నర్హులుగా నుందురుగాని నిరప రాధినులయిన పసిబాలికల కామాత్రపు పుణ్యమయినను లేక క్రూర మయి చిరకాలాగతమయిన యొకదురాచార ప్రాబల్యముచేత నో రెఱుఁగనిదశలో తల్లిదండ్రులు తమవేడుకకొఱకు వివాహ మని పేరు పెట్టి యొకతంతు నడపినదోషమునుబట్టి యావజ్జీవమును ప్రపంచసుఖ ములకు దూరురాండ్రయి మరణముకంటెను తీవ్రవేదనాకరమయిన దుస్సహవైధవ్యబాధ ననుభవింప నిర్బంధింపఁబడు చున్నారు. అప్పటి జనపరిగణనమునుబట్టి యిట్టి దుస్థితిపాలయి యున్న పసిబాలికలు మన దేశమునం దెందఱున్నారో యాలోచింపుఁడు. ఆ సంవత్సరమున తొమ్మిదియేండ్లకు లోఁబడినవయస్సు గలవారయి భర్తలని చెప్పఁ బడిన పురుషులను పోఁగొట్టుకొన్న దురదృష్టతను వహించిన దయ నీయ లయినబాలికలు [illegible] గు రుండిరి. ధనము న్యాయము చేసి యీపసిబాలికలకు వృథాగా తెఱుఁగనిదుఃఖమును గొని తెచ్చి పెట్టుకొనుటకుఁ గాక, వీరివివాహమువలన నెవరి కేవిధ మయినలాభము కలిగినది? ఈచెప్పినవారుగాక యాసంవత్సరమున పదునాలుగు సంవత్స రముల ప్రాయమునకు లోపుగా నున్న [illegible] గురు బాలికలు కూడ విధవలయి యుండిరి. ఈ[illegible] బాలికలను తలిదండ్రుల చేతను సంరక్షకులచేతను బాల్యవివాహ మను పెనుభూతమునకు నిష్కా- రణముగా బలి పెట్టఁబడి కలకాలమును దుఃఖపరంపరపాలు చేయఁ బడినవారే కదా? మనదేశమునందలి వైధవ్యదుఃఖమున కంతకును బాల్యవివాహమే ప్రధానకారణము కాకపోయినను, ఇన్నిలక్షల బాలి కలవైధవ్యమున కయినను కారణ మయినందుకు లేశమాత్రమును సందేహములేదు. ఇఁక వైధవ్యమును పొందక తిన్నగానున్న వారిగతి విచారింపుఁడు. వివాహమునాటికి చక్కఁగా నున్న పురుషులుగాని స్త్రీలు గాని పలువురు స్ఫోటకము మొదలయిన వ్యాధులచేత కన్నులుకాలును

చెడియు, వికలాంగు లయియు, దుర్బలశరీరు లయియు, సంసారసుఖము నకు పనికిరాక యొండొరులకు దుఃఖహేతువు లగుచున్నారు. కొన్ని సమయములయందు యోగ్యు లయినపురుషుల కయోగ్యురాండ్రు భార్యలగుట లభించియు, గుణవంతురాండ్రయిన స్త్రీలకు గుణహీనులు భర్తలగుట లభించియు, పరస్పరాంగీకారము లేక పోవుటచేత మనసు కలియకయు, భర్తకంటె ముందుగా భార్య యెదిగి కాపురమునకు వచ్చియు, దంపతులలో నొకరు విద్యావంతు లయిన నొకరు మూర్ఖశిరోమణులుగా నుండ సంభవించియు, బహుదంపతు లేకగృహమున వసించుచుండియు సుఖ మున్నమాట యెఱుఁగనివారగుచున్నారు. పెద్ద పెరిగిన తరువాతఁగాని సుగుణములో దుర్గుణములో తిన్నగా స్థిరపడవు గనుక చిన్నతనములో వివాహమునాఁటికి మంచివా రనుకొన్నవారే కొందఱు తరువాత చెడ్డవారయి మఱికొన్ని దాంపత్యములు దుఃఖదాయకము లగుచున్నవి. బాల్యవివాహప్రభావముచేత జనకులన్న పేరు చెఱుప నవతరించిన మనుష్యరూపమున నున్న ఘోరరాక్షసులు ధనాశాపాశబద్ధులై తమముద్దుబాలికలను వృద్ధవిగ్రహములకును వారికంటెను అధము లయిన రోగిష్ఠులు మొదలయినవారికిని విక్రయించుచుండుటవలన ఆముద్దరాండ్రు కాపురమునకు వచ్చునప్పటికిపతులు స్వర్గయాత్ర కున్ముఖులై యుండియు జీవచ్ఛవములవలె నుండియు యువతులు పలువురు దుఃఖములపాలు కావలసినవారగుచున్నారు. ఇంతేకాక మన దేశములో నున్న యనేకవర్ణభేదములచేతను వానిలోని మితిమీఱిన శాఖోపశాఖలచేతను తల్లిదండ్రులు వేఱుగతి లేక రంభవంటికొమార్తెనైనను కొన్నిసమయములయందు వికలాంగున కయినను దరిద్రునకయినను ఇచ్చి వివాహము చేయవలసినవారగుటచేత కొందఱుకన్నియలు సుఖమెఱుఁగనివా రగుచున్నారు.

ఇట్టి వేమియులేక సుఖ మనుభవింపుచున్నా రనుకొనుచున్న బహుదంపతుల యవస్థను చూతము. ఒక్క మన దేశమునందుతప్ప సమస్త దేశములయందును పురుషులు తాము స్వతంత్రముగా భార్యాపుత్రులను పోషింప శక్తివచ్చిన తరువాతనే వివాహము చేసికొందురు. మన దేశమునం దట్లు గాక తల్లిదండ్రులు పసిబిడ్డలకే వారియనుమతి విచారింపక భార్యల నంటకట్టుటచేత మన బాలురు కౌమారదశయందలి స్వాతంత్ర్య వర్తనమును సంతోషమును చవి చూడనివారయి సదా నిరుత్సాహు లగుచున్నారు. కాబట్టియే మోక్షమూలరుపండితు డొకపాఠశాలయం దుపన్యసించుచు అన్ని దేశముల వారికిని కౌమారదశ యుండగా మన పెద్దలు మన బాలుర కాదశ నపహరించి జనసామాన్యమునకు భగవంతు డనుగ్రహించియున్న యత్యంతప్రయోజనకర మయిన కౌమారదశానిక్షేపము తస్కరణ చేసి యున్నారని వచించియున్నాడు. అందుకు సందేహములేదు. ఈకౌమారదశయందే పురుషులు తమ ప్రవర్తనమును స్థిరపఱచుకొని, సుగుణసంపదను గడించి, విద్యాబుద్ధులయందు ప్రబలి, ధైర్యసాహసాదులను నేర్చుకొని, స్వాతంత్ర్యవృత్తి నలవఱచుకొని, తరువాతి లౌకికయాత్ర కనుకూలమయిన సాధనసామగ్రి నెల్లనుసంపాదించుకొనవలసినది. దుఃఖముల నెఱుగక నిర్విచారముగా నుండవలసిన యటువంటి సుఖకాలములోనే యాంబోతునకు గుదెకఱ్ఱ కట్టినట్టు మనవారు బాలురకు సంసారము నంటకట్టి తల యెత్తుకొనకుండ జేయుటవలన మనవా రుత్సాహమును ధైర్యసాహసాదులును లేనివారయి పూనికతో స్వతంత్రించి యేసత్కార్యమును జేయుటకును పనికిమాలినవా రగుచున్నారు. అందుచేతనే మన బాలురు సాధారణముగా వివాహములేక పాఠశాలలో చదువుకొన్నంత వఱకును దేశోపకారము నిమిత్తము పాటుపడవలెననియు, సంఘదురాచారములను మాన్పవలె ననియు, స్త్రీలయొక్కయు నీచకులములవారి

యొక్కయు స్థితిని బాగుచేయవలెననియు. తలంచి మిక్కిలి యుత్సాహముతో సమాజము లేర్పఱిచి ప్రసంగములు చేసి ధైర్యముతో దురాచారములను దూషింపఁ గలిగియు, వివాహమై భార్య కాపురమునకు వచ్చిన రెండుమూడు సంవత్సరముల లోపలనే తమపూర్వావస్థ నంతను మఱచిపోయి, తొంటియుత్సాహము చెడి దీనముఖములు గలవారయి, దేశాభిమాన మన్నమాటను స్మరణకు తెచ్చుకొనక, తొంటి ప్రసంగములను సమాజములను విడిచిపెట్టి, ధైర్యసాహసములను స్వాతంత్ర్యమును గోలుపోయి, ఎవ్వరియొద్దనుగులకు నుడుగులొ త్రియైనను నెలకు పదియేను రూపాయలపని సంపాదించి లంచములు పుచ్చుకొనియో కల్లలాడియో తమ భార్యాపుత్రులను పోషించుటయే పరమార్థమని సిద్ధాంతము నేర్పఱచుకొని, లోకమునిమిత్తమయి పాటుపడఁదలఁచినవారిని జూచి పరిహాసించుచు వారిని నిరుత్సాహపఱచి, తాము లోకమునకు నిష్ప్రయోజకు లగుచున్నారు. పురుషులగతి యిట్లుండఁగా వారిభార్యల కింకొకదురవస్థ కూడ ప్రాప్తించుచున్నది. ఆ చిన్నది మగని కొలువుమాత్రమే కాక అత్తగారి కొలువుకూడ చేయవలసి యుండును. సాధారణముగా మగఁడింటఁ గూరుచుండి సుఖభోజనము చేయుచుండు పరాధీనుఁడుగా నుండుటచేతను, తన్ను మాత్రమే కాక తనభర్తనుకూడ పోషింపవలసినవారు తల్లిదండ్రులే యగుటచేతను అత్తమామలకుఁ బూర్ణముగా కోపము వచ్చినపక్షమున ఇంట నిలుచుటయే పొసఁగ నేరదుగనుకను, బాలభార్య మగనికంటె అత్తమామలకే యెక్కువలోఁబడి వారికే యాజ్ఞానువర్తినిగా నుండవలసిన దగుచున్నది. ఈ హేతువునుబట్టి బాలభార్యలు పలువురు మగల మనసుల కెడమై యావజ్జీవమును సుఖ మెఱుఁగనివారగుచున్నారు. అదిగాక అత్తలకు కొందఱకు కారణమున్నను లేకపోయిననుకూడ కోడండ్రను బాధించునప్పటికంటె నధికసంతోషము మఱియెప్పుడును కలుగదు.

అత్తగా రెంతమూర్ఖురా లయిన, ఈబాధ యంతయధికముగా నుం డును. కొడుకేమైననుసరే కోడలిత్రాడు కోటిపల్లె రేవున త్రెంచినఁ జాలు నని సంతోషించు అత్తలును మన దేశములో పలువు రున్నారు. ఈబాధలనుబట్టియే అత్తపోఁగొట్టిన దడుగోటికుండ కోడలుపోఁగొట్టి నది. కొత్తకుండ యను సామెతయు, ఇటువంటివే మఱికొన్ని సామె తలును వెలసియున్నవి.

ఈసుఖమంతయు నిట్లుండఁగా నీబాలదంపతులకు లభించెడి యితరావస్థలను చిత్తగింపుఁడు. కాలము రాకమునుపే గర్భాధాన మగుటచే కలిగిన సంతానము సాధారణముగా దుర్బలమయి పురిటిలో పోవువారును తరువాత కొంతకాల మాదంపతులకును బంధువులకును శ్రమయిచ్చి పోవువారును అయియుందురు; అంతటిభాగ్యమును వహిం పక చిరకాలము కష్టముల ననుభవించుచు బ్రతుక నోచుకొన్నబిడ్డలు చిడుము మొదలయిన వ్యాధులచేత చిక్కి దుర్బలమయిన శుష్క దేహములు గలవారయి పెద్దవారయినప్పుడు సహితము నాబిడ్డలకు పుట్టినబిడ్డలు తాము తమకాలములో పురాణములయందు వర్ణింపఁ బడిన యంగుష్ఠమాత్రశరీరులను పుట్టింపఁ బ్రయత్నించుచున్నవారి వలె నుందురు. ఆడుకోవలసినయవస్థలోనే బాలికలకు బిడ్డలు పుట్టుటచేత కూడ తల్లులు తిన్నగా పిల్లలను పెంచుటకు చేతఁగాక వారిని పాడు చేయుచున్నారు. బిడ్డలమాట యటుండఁగా బిడ్డలను గన్నతల్లులు తం డ్రులు సహితము కొంతకాలములోనే శరీరపటుత్వము చెడి పడుచు తనములోనే ముసలివా రయి యల్పాయుష్కు లగుచుందురు. రజస్వల యయినంతమాత్రముచేత కన్య సంభోగార్హురాలు గాదనియు, సమస్తా వయవపరిపూర్తి యగుటకు మఱికొన్ని సంవత్సరములు జరగవలె ననియు, ఈలోపల వధూవరులను కలిపినయెడల వారిదేహములు చెడి

రోగాశ్రియము లగుటయేకాక వారికి పుట్టినబిడ్డలును చెడుదు రనియు వైద్యశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

ఈవిధముగా బాల్యవివాహమువలన సుఖము కలుగకపోవుటయే కాక వివాహము లేనియెడల దృఢకాయులయి చిరకాలము జీవింపఁదగిన దంపతులయాయువుకూడ సన్నమగుచున్నది. మఱియు బాల్యవివాహమువలన బాలికయొక్క చదువుమాత్రమేకాక బాలభర్తయొక్క చదువుకూడ చెడిపోవుచున్నది. సంసారదుఃఖములు లేక స్వేచ్ఛగా బ్రతుకవలసిన బాల్యదశలోనే సంసారమునచ్చి మీఁదపడుట చేత చదువు సాగక, ఇంటనొకమూల తల్లిదండ్రులును, మఱియొకమూల నాలుబిడ్డలును ద్రవ్యార్జనము కుటుంబభరణము చేయుమని నిత్యమును పోరుచుండఁగా నుద్యోగము నిమిత్తమయి యీబాలుఁడు కృషిచేయవలసినవాఁడుకాక యేటుండఁ గలఁడు? మన మెఱిఁగినవారిలోనే యెందఱుబాలురు మిక్కిలి తెలివిగలవారయ్యును గొప్ప పరీక్షలం గృతార్థులయి యున్నతస్థితికి రాఁదగినబుద్ధిసంపద గలవారయ్యును సంసారభారము మీఁదపడుటచేత నడుమ చదువువిడిచిపెట్టి భావిమహాఫలములను చెడఁగొట్టుకోవలసిన వారగుచున్నారు కారు? ఎందఱు బాలురు తమ చిన్నభార్యల నింట నొంటిగా విడిచిరా వలనుపడక యత్యల్పదూరములోనున్న శాస్త్రపాఠశాలలకు సహితము పోయి చదువుకోలేక చదువుసందెంతయూసక్తిగలవారైనను కార్యములేక చిన్నపనులతోనే తృప్తి పొందవలసినవారగుచున్నారుకారు? ఒక్క విద్యాభివృద్ధిమాత్రమే కాక సమస్తాభివృద్ధులకును బాల్యవివాహము ప్రతిబంధకముగా నున్నది. వివాహమైనతోడనే తఱుచుగా బాలికలను పాఠశాలలనుండి మాన్పించుచున్నారు. ఇదిగాక, యీబాల్యవివాహమువలన చిన్నతనములోనే సంతానముకలిగి వారు పోషింపలేని యవస్థ

లోనే కుటుంబములు పెరుగుచుండుటచేతను వారివివాహముల నిమిత్తమయి కులాచారానుసారముగా విశేషవిత్తమును వ్యయముచేయవలసివచ్చుటచేతను మన దేశములో బహుకుటుంబములు పేదఱికముపాలయి పిమ్మట ఋణములపాలయి చిరకష్టములపాలు కావలసిన వగుచున్నవి. కొన్నిచోట్ల వివాహములనిమిత్తము చేసినయప్పులచేత పురుషులు తమ కంతకు మునుపు జీవనాధారములుగానున్న మాన్యములను పోఁగొట్టుకొన్నవారయి భార్యలింటికి కాపురమునకు వచ్చునప్పటికి తిండికిలేక తిరిపె మెత్తుకోవలసినస్థితిని పొందుచున్నారు. మఱికొన్నిచోట్ల వారి వివాహములనిమిత్తమయి చేసినఋణములను వారి ముమ్మనుమలును వారిసంతతివారునుకూడ తీర్చుకోవలసినవారగుచున్నారు. పనికిమాలిన బాల్యవివాహములకయి దుర్వ్యయము చేయుటకంటె, ఆధనములో కొంతభాగమువెట్టి బాలురకు విద్యచెప్పించినపక్షమున వారెంతసుఖపడుదురు? మనవారు బహ్వనర్థములకు మూలమయిన యీబాల్యవివాహమును మాన్పించి యేల తమబిడ్డల సుఖాభివృద్ధిచేయఁ బ్రయత్నింపరారు? ముసలివాండ్రు వేడుకకొఱకు కడుపున పుట్టినబిడ్డలను పాడుచేయుట మానుషధర్మముగునా? తము కంతవేడుక చూడవలెనన్న మనసున్నపక్షమున బొమ్మలపెండ్లిండ్లుచేయించి సుఖమనుభవింపరాదా? అంతటితో తృప్తికలుగకపోయినయెడల నిజముగా బిడ్డలనే పల్లకులలో పెట్టి యూరేగించి సంతోషమనుభవింపరాదా? ఎలుకకు ప్రాణసంకటము పిల్లికి చెలగాటము నన్నట్లు ముసలివాండ్రయొక్కయు మూర్ఖులయొక్కయు వినోదముకొఱకు పసిబాలికలయొక్కయు బాలురయొక్కయు సుఖము చెడఁగొట్టుట క్రూరకృత్యముకాదా? తల్లియొక్కయుగవుతగవుల నిమిత్తమును వేడుకలనిమిత్తమును బిడ్డలకు వివాహము చేయుటయు, దానివలన కలిగెడుకీడుల నాబిడ్డ లనుభవింపవలె ననుటయు నెంతకానిపని?

ఈ బాల్యవివాహములు మనదేశములో చిరకాలమునుండి యున్నను, ఇప్పుడంతకంతకు ప్రబలమగుచున్నవి. నాచిన్నతనములో ఏడెనిమిది సంవత్సరములకు లోపు వయస్సుగల బాలికలకు వివాహము చేయుట ఎక్కడనో యరుదుగానుండుచు వచ్చెను. ఇప్పుడు పాలు విడువని పసిబాలికలకుసహితము వివాహములు చేయుట సర్వసామాన్యమగుచున్నది. ఈదురాచార మొక్కపామరులలో మాత్రమేకాక చదువుకొన్నవారిలోకూడ వ్యాపించుచున్నది. ఇక్కడి విద్యాశాలయందు సర్వకలాశాలాపరీక్షకు చదువుకొనుచు బహుధైర్యముతో బాల్యవివాహము లనర్థదాయకములని వాదించుచువచ్చిన నామిత్రుఁడే యొకఁడు తనవంతు వచ్చినప్పుడు కొమార్తెకు నాలుగుసంవత్సరముల యీడు వచ్చులోపలనే వివాహముచేయఁగా చూచియున్నాను. చదువుకొన్నవారికిని చదువుకొననివారికిని మాటలయందుతప్ప కార్యములయం దంతగా భేదమగపడుచుండలేదు. ఈనడుమను చెన్నపురమునందు జరగినమహాసభలో సర్వకలాశాలాపరీక్షలందేటి పట్టపరీక్షనిచ్చి మెప్పించినంత మహావిద్యావంతులుకూడ తమ కొమార్తెలకు పది సంవత్సరములకులోపల వివాహము చేయకుండుటకు బద్ధులమయ్యెదమని వాగ్దానము చేయలేకపోయిరి. వారందుకు కనఁబఱిచిన హేతుబలమును కొంచెము చిత్తగింపుఁడు. ఈకొమార్తెలను గన్నతండ్రులు తామే తల్లిదండ్రులచాటు బిడ్డలఁట! స్వాతంత్ర్యము లేనివారఁట! ఉన్నను తల్లిదండ్రుల మనస్సులను నొప్పింప నిష్టములేనివారఁట! ఆహా! లోకములో నింతకంటె బానిసత్వ మేమున్నది? వివాహవిషయమయిన సాధకబాధకముల నాలోచించుకొను స్వాతంత్ర్యము వివాహబంధము వలని సుఖదుఃఖములను యావజ్జీవమును అనుభవింపవలసిన వధూవరులకును లేక, వారితల్లిదండ్రులకును లేక, అంతల పొంతలవారికాయుండవలసినది! పట్టపరీక్షకృతార్థులైనవారు తాముస్వతంత్రముగా పొట్టపోసి

కోలే మనుభయముచేతనా తాముయుక్తమని యెఱిఁగినదియు, తాము ప్రేమించెడివారికి నష్టకరమయినదియునైన యకార్యమును చేయ వలసినది.

తమకడుపున పుట్టినవారి సౌఖ్యాభివృద్ధితో చేరిన యీవిషయ మునందే స్వాతంత్ర్యము లేకపోయినయెడల మఱియేవిషయమునందుఁ గలుగును? కారణము లేనివిషయములలో న్యాయము కానిపట్టుపట్టి కాటికి కాళ్లుచాచుకొనియున్న వృద్ధు లయిన జననీజనకుల మనస్సును నొప్పింప లేనంతదయార్ద్ర హృదయము గలవారు, కలకాలము సుఖముగా బ్రతుకవలెనని కొండంతయాశ పెట్టుకొని దయనీయులయి తమ కడుపునపుట్టిన ముక్కుపచ్చలారనిముగ్ధకూఁతులను వేగిరపడి స్వయంకృతాపరాధమువలన యావజ్జీవమును దుఃఖములపాలు చేయఁగలరా? ఈరీతి సాకులను విడిచిపెట్టి మనలోని చదువుకొన్నవారు తాము మంచి కార్య మని దృఢముగా నమ్మిన దానిని పామరులకు భయపడక నిశ్శంకముగా నెప్పుడుచేయ నారంభింతురో, అప్పుడే మనదేశము బాగుపడ నారంభించునుగాని క్రియలేనిశూన్యవచనములచేత నెప్పుడును బాగు పడదు. చదువవేసిన నున్నమతియు చెడిన దన్నట్లు మనదేశమున చదువు హెచ్చినకొలఁదినే బాల్యవివాహములును హెచ్చుచున్నవి. పూర్వకాలమునందు బ్రాహ్మణులు కానివారు కన్నులు తెఱవని పసికూనలకు వివాహము చేయుచుండుట సాధారణముగా లేదు. ఈకాలమున మూడేండ్లకు ముండమోసిన బాలికలుగూడ శూద్రులలో కనఁబడుచున్నారు. ఇప్పుడు నష్టకరములని యెంచి బ్రాహ్మణులు తమ యాచారములను కొన్నిటిని మానుకొని పరిత్యజించుచుండగా లాభనష్టములను కొంచెమయినను విచారింపక శూద్రులు మొదలయిన వారు కొందఱు బ్రాహ్మణు లాచరించినట్టు తా మాచరించినచో

తమకు గౌరవము వచ్చునని యెంచుకొని యనాలోచితముగా బ్రాహ్మ
ణుల దురాచారములను కొన్నిటి నవలంబించుచున్నారు. అందుచేత
పూర్వకాలమునందు బ్రాహ్మణ వైశ్యజాతులలో మాత్రమే యున్న
బాల్యవివాహము లిప్పుడు సర్వవర్ణసామాన్యములయి శూద్రులలో
కూడ వెలయుచున్నవి. శూద్రులు చేయనారంభించిన పనినే తాము
చేయుచున్నచో తమకు గౌరవాధిక్యము లేదనుకొని యాలోచనలేని
బ్రాహ్మణోత్తములు తా మేలాగున నయినను వారిని మించవలెనని
యొకరు ప్రయత్నించుచుండుట చేత కడపట నందఱును చెడుచు
న్నారు. అందుచేత నీవివాహములు క్రమక్రమముగా వివేకులకుఁ బరి
హాసపాత్రము లయి, పెండ్లిపీటమీఁద పెండ్లికొడుకు తల్లిని గానక
యేడుచుటయు, పెండ్లికూఁతురు పాలకై యేడుచుటయు, వారి యేడు
పుడుపుటకయి కొన్ని సమయములయందు బెత్తము చేతఁబట్టుకొని
యయ్యవారును మఱికొన్ని సమయములయందు పప్పు బెల్లములను
కావలసివచ్చుటయు, భార్య యెవ్వరో తెలియక పిల్లనోడిలోఁ బెట్టు
కొని చన్నుగుడుపు చున్నతల్లి మెడకే పెండ్లికొడుకు మంగళసూత్ర
ధారణముచేయుటయు, పోరుపెట్టిన పెండ్లికొడుకుచేత పుస్తెకట్టించుటకు
చేతఁగాక పురోహితుఁడే పెండ్లికొమార్తెకు తాళిబొట్టుకట్టి వివాహ
తంత్రము నడుపుటయు, తటస్థించు చున్నది. మూఢము లనియు,
శూన్యమాసము లనియు, పయిసంవత్సరము లగ్నములు లే వనియు,
చెప్పి యనుగ్రహించెడి జ్యోతిష్కులముహూర్తములు కూడ బాల్య
వివాహములను త్వర పెట్టుచున్నవి. ఈజ్యోతిషముచేత జనులు మోహా
పడి జాతకపత్రిక బాగుండలే దను హేతువుచేత కులములో దొరక
తగినవారిలో కూడ మంచి మంచి వరులను నిరాకరించి యధములను
స్వీకరించుచున్నారు. ఇందుచేతకూడ బహుదాంపత్యములు సుఖదాయ

కములు కాకున్నవి. ఈముహూర్తములవలన జ్యోతిషమునే వృత్తిగా నేర్పఱచుకొన్న వారికుటుంబపోషణము జరగుచుండుట తప్ప నాకు వేఱుప్రయోజన మగుపడుచుండలేదు. తక్కిన యేశుభకార్యముల కెట్లు చేసినను వివాహకార్యమునందు మాత్రము వరుని జాతకపత్రమును పరి శీలింపించి కొననివారును మంచిముహూర్తమును పెట్టించుకొననివారును సాధారణముగా నుండరు. అట్లయినను ముహూర్తములు పెట్టించు కొననిహూణులు మొదలయినవారిలో కన్న సుముహూర్తముల కయి కాలమును ధనమును వెచ్చపెట్టెడుహిందువులలోనె విధవ లధికముగా నున్నారు. జ్యోతిషమువలన ప్రయోజనలేశమయినను కలిగినయెడల, శుభలగ్నములయందు వివాహిత లయినవారిలోనిన్ని లక్షలనుంది బాలవిధవ లెందుచేత కావలయునాయని నాకు సందేహాము కలుగు చున్నది. ఇట్టిసందేహా మే మనవారి కండజీకిని కలిగెడుపక్షమున, ముహూర్తమృత్యుదేవతనోటినుండి విధవలు కాకుండ ప్రతిసంవత్సర మును లక్షలకొలఁది పసిబాలికలను కాపాడవచ్చు నని నాకు తోఁచు చున్నది. అదియట్లుండ నిండు.

మనవా రిప్పుడు సామాన్యముగా బ్రాహ్మణవర్ణమునకు హిం దూశాస్త్రములు బాల్యవివాహమును విధించుచున్నవనియు, శాస్త్ర విధానము దుర్లంఘ్యమనియు భావించుచున్నారు. అట్టివారికి సంశయ నివారణము కలుగుటకయి నాకుఁ దెలిసినంతవఱకు వివాహవిషయ మునఁ గల శాస్త్రమునుకూడ సంగ్రహముగా వివరించుచున్నాను. వేద మంత్రములును మంత్రవినియోజకవాక్యము లయినకల్పసూత్రములును సంబంధించి యున్నంతవఱకును బాల్యవివాహముల కనుజ్ఞ యెక్కడను లేదు సరిగదా, వ్యక్తురాలయినకన్యకే వివాహము చేయవలసినట్టు కూడ కనఁబడుచున్నది.

వివాహమంత్రములలోని "సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః తృతీయో అగ్నిష్టేపతి స్తురీయస్తే మనుష్యజాః॥ సోమో దదద్గంధర్వాయ గంధర్వోదద దగ్నయే। రయించ పుత్రాంశ్చాదాదగ్ని ర్మహ్యామథో ఇమాం॥" అను ఋగ్వేదవచనమునుబట్టి కన్నియను మొదట సోముఁడు వరించుననియు, తరువాత గంధర్వుఁడు వరించుననియు, అటుపిమ్మట నగ్ని వరించుననియు, ఆపయిని మనుష్యుఁడు వరించుననియు, కన్నియను సోమాదు లొకరితరువాత నొకరి కియ్యఁగా కడపట మనుష్యునకు వచ్చుననియు, శాస్త్రమర్యాద యున్నది. కన్నియను పురుషుఁడు వివాహమాడుటకుముందు సోమాది దేవతలు వరించవలసిన పక్షమున, ఆసోమాదులు వరించెడి కాలమేది, అటుతరువాత మనుష్యుఁడు పొందవలసిన కాలమేది, అని తెలిసికో వలసి యుండును. దీని కాధారముగా సంవర్తస్మృతియందు "శ్లో॥ రోమ దర్శన సంప్రాప్తే సోమోభుఙ్క్తేథకన్యకాం। రజోదృష్ట్వాతుగంధర్వః కుచౌదృష్ట్వాతు పావకః॥" అని యున్నో రోమదర్శనకాలమందు సోముఁడును రజోదర్శనకాలమునందు గంధర్వుఁడును కుచదర్శనకాలమునందు పావకుఁడును వరింతురనియు, అటుపిమ్మట ననఁగా కన్నియ యుక్త వయస్సు వచ్చి రజస్వలయయి కుచపరిపూర్తియయిన పిమ్మటనే పురుషుఁడు వివాహమాడవలయుననియు, ప్రమాణవచనము కనఁబడుచున్నది. దీనినిబట్టి చూడఁగా [illegible]వారిని వివాహమాడకూడదనియేకదా స్పష్టమగుచున్నది. రోమదర్శనాది కాలములయందు సోమాదులు వరింతురనఁగా నాయాకాలములయందు వరుసగా శరీర శుచిత్వమును, వాక్చాతుర్యమును, పరిశుద్ధతను కలుగఁజేయుదురని తాత్పర్యమేకాని వారు నిజముగా వరింతురనియే యర్థముకాదు. అందుచేతనే యాజ్ఞవల్క్యస్మృతియందు "శ్లో॥ సోమశ్శౌచందదాత్స్త్రీణాం గంధర్వశ్శుభాంగిరం। పావకస్సర్వమేధ్యత్వం మేధ్యావై యోషితో

హ్యాతః" అని స్త్రీలకు సోముడు శౌచము నిచ్చుననియు, గంధర్వుఁడు మంచిపలుకులనిచ్చుననియు, పావకుఁడు సర్వపరిశుద్ధతలనిచ్చుననియు, కంఠోక్తిగాఁ జెప్పఁబడియున్నది.

ఈ శ్లోకములోని కడపటిచరణమునకు వ్యాఖ్యానము చేయుచు విజ్ఞానేశ్వరయోగి "స్త్రీయస్సర్వత్ర స్పర్శనాలింగనాదిషు శుద్ధాః" అని వ్రాసియున్నాఁడు. కాఁబట్టి స్త్రీలు వివాహకాలమునకు సంపూర్ణావయవములు కలవారయి యీడేఱి వ్యాక్రొవశీమ కలవారయి యుండవలెనని యేర్పడుచున్నది. శ్రుతిస్మృతుల యందీప్రకార ముగా నుండఁగా బాల్యవివాహములను వ్యాపింపఁజేసినవారు జ్యోతిర్నిబంధ మనుగ్రంథములోని దని "శ్లో॥ షడ్వర్షమధ్యేనోద్వాహ్యా కన్యా వర్షద్వయంయతః సోమోభుఙ్క్తేతత స్తద్వ ద్గంధర్వశ్చ తథానలః॥" అని స్త్రీ కాఱేండ్లలోపల వివాహము చేయఁగూడ దనియు, సోమగంధర్వ పావకులు రెండేసిసంవత్సరము లనుభవింతురనియు, వ్రాసి సోమాదు లనుభవించుకాల మాఱేండ్లలోనే పోవుననియు నేడవయేఁడు మొదలు కొనియే కన్నియ వివాహయోగ్యురా లనియు బోధపడునట్లు చేసి యున్నారు. కాని సోమాదులు కన్నియను పసితనములోనే వరించి శౌచాదుల నిత్తురనుట యుక్తికిని శాస్త్రమునకునుకూడ విరుద్ధము. గంధర్వుని నుద్వాసము చేయునప్పుడు వివాహములో పఠించెడు ఋగ్వేదమంత్రములోనే 'ఉదీర్ష్వాతో విశ్వావసోనమసేడామహేత్వా। అన్యామిచ్ఛప్రఫర్వ్యగ్ం సంజాయాంపత్యాసృజ । ఉదీర్ష్వాతః పతివతీ హ్యేషావిశ్వావసుంనమసాగీర్భిరీట్టే । అన్యామిచ్ఛపితృషదం వ్యక్తాగ్ం సతే భాగోజనుషాతస్యవిద్ధి' అని గంధర్వుఁ డగుసవిశ్వావసుఁడు వివాహితమైనయాస్త్రీని విడిచిపెట్టి వ్యక్తురాలు కాని పితృగృహమున నున్న యవివాహితకన్యయొద్దకు పోవ ప్రార్థింపఁబడుచున్నాఁడు. ఇట్టి బలవత్తర మయినశ్రుతి ప్రయాణ ముండఁగా నిర్ణయసింధువుసం దుదా

హరింపఁబడిన పయివచనమునుబట్టి కన్నియకు నాలవయేటనే స్తనోద్గమము కలుగుననికాని, ఏడవయేటనే వివాహము చేయవలెననికాని, వివేక లెవ్వరయిన చెప్ప సాహసింపఁ గలరా?

అంతేకాక వివాహములో నాలవదినమున వధూవరులకు జరిగెడి సంభాషణములో "అపశ్యం త్వా మనసా చేకితానం తపసో జాతం తపసో విభూతం। ఇహప్రజా మిహరయిగ్ంశరాణః ప్రజయా స్వపత్రిజయాపుత్రకామ" అని వరునిగూర్చి వధువు 'నీవు యోగ్యుఁడవనియు తపస్సు చేతపుట్టి తపస్సుచేత వర్ధిల్లితి వనియు నేను మనస్సు చేత తెలిసికొంటిని గనుక, నాయందు పుత్రకాముఁడ వయియున్న నీ విఁక సంతోష పూర్వకముగా సంతానము పొందుమనియు, 'అపశ్యం త్వా మనసాదీధ్యానాగ్ం స్వాయాంతనూగ్ం ఋత్వియేనాధమానాం। ఉపమాముచ్చా యువతిర్బభూయాః పత్రిజయాత్వ పత్రిజయాపుత్రకామే' అని వధువునుగూర్చి వరుఁడు 'నీవీసమయమునందు నాథునితో కూడవలె నని యపేక్షించుచున్నట్లు నామనస్సుచేత కనిపెట్టితిని గనుక, యువతివయి పుత్రకామురాలవయి యున్ననీవు నన్ను పొంది సంతానము కనుము' అనియు, మంత్రములచేత చెప్పుదురు. ఇటువంటి సంభాషణము సంభోగముమాట యటుండఁగా వివాహ మనఁగా నేమో యెఱుఁగనిబాలునకును బాలికకును జరిగెడిదని మతిమంతుఁ డెవ్వఁడయిన చెప్పఁగలుగునా? వివాహదినములలోనే వరుఁడు వధువును గూర్చి 'గృహాం గచ్ఛ గృహపత్నీ యథాసోవశినీ త్వం విదథమావదాసి' అను ఋగ్వేదమంత్రముచేత 'నీవు గృహమునకు వచ్చి గృహయజమానురాలవయి యింటికి వచ్చినవారి నాదరించి గృహకృత్యములను నిర్వహింపుమని పలుకుటయు, వధువునుగూర్చి బ్రాహ్మణులు 'ఇహప్రియం ప్రజయా తే సమృధ్యతాస్మిన్ గృహేగార్హ పత్యాయజా

గృహి । ఏనాపత్యాతన్వగ్ంసంసృజస్వాథాజి వ్రివిదథమావదాథః' అను ఋగ్వేదవచనముచేత 'ఇప్పుడు ప్రియపడి నీ వీగృహామునందు సంతానమును పొంది గృహాయజమానత్వమునందు జాగరూకురాలవయి నీశరీరమును నీపతి శరీరముతోఁ చేర్చి మీరు ముసలివా రగువఱకును గృహామును పరామర్శింపుము అని పలుకుటయు, బాల్యవివాహామున కిసుమంతయయినను పొసఁగియుండునా? ఆపస్తంబ, ఆశ్వలాయనాది సూత్రములన్నియు వధూవరులు మూఁడుదినము లధశ్శయ్యనుండి బ్రహ్మచర్యము చేయవలెననియు నాలవదినమురాత్రి గర్భాధానము జరగవలె ననియు విధించుచున్నటును, గర్భాధానముతోఁ గాని వివాహాపూర్తి కానట్టును శాస్త్రజ్ఞానము కలవారి కందఱికిని తెలియునుగదా? ఇప్పుడు జరుగుచున్న శాస్త్రవిరుద్ధమయిన బాల్యవివాహాములలో వివాహాముననావశ్యకమయిన గర్భాధానమును జరపకపోయినను మనపురోహితులు నాలవనాటిరాత్రి గర్భాధానమంత్రికుల నేకరువు పెట్టుచుండుట నందఱు నెఱుఁగుదురుగదా? ప్రాచీనము లయిన మనధర్మశాస్త్రములన్నియు యుక్తవయస్సు వచ్చినస్త్రీలకే వివాహామును విధించుచున్నవి.

అందుచేతనే మనధర్మశాస్త్రకర్తలు వివాహాయోగ్యకన్యాపాత్రశస్త్యమును చెప్పునప్పుడు "శ్లో॥ కన్యాక్షతయోనిః స్యాత్కులీనా పితృమాతృతః।బ్రహ్మాదిషువివాహేషుపరిణీతాయథావిధిఃసాప్రశస్తావరారోహా శుద్ధయోనిః ప్రశస్యతే" అని బ్రాహ్మాది వివాహాములయందు కులీనురాలును పురుషసంభోగ మెఱుఁగునిదియు ప్రశస్తురాలని వృద్ధగౌతముఁడును, "గృహస్థో వినీతక్రోధహర్షో గురుణానుజ్ఞాతః స్నాత్వా అసమానార్షామస్పృష్టమైథునాం యవీయసీం సదృశీం భార్యాం విందేత" అని వరుఁడు గురువునాజ్ఞ పొంది పురుషసంసర్గ మెఱుఁగని

తనకంటె చిన్నదానిని వివాహ మాడవలయునని వసిష్ఠుఁడును, "శ్లో॥ అపపిండాచ యామాతు రసగోత్రాచ యాపితుః । సాద్విజానాం ప్రశస్తాస్త్రీ దారకర్మణ్యామైథునీ" ద్విజాతులలో మైథున మెఱుఁగని స్త్రీ భార్యగా స్వీకరించుటకు ప్రశస్తురాలని మనువును, బ్రాహ్మాదివివాహ ములయందు పురుషసంభోగములేని కన్నియలనే ప్రశస్తురాండ్రనుగాఁ జెప్పియున్నారు. రజస్వలలు కానివారికే ద్విజాతులలో వివాహములు జరగవలెనని యీఋుష్యాదు లుద్దేశించియుండినయెడల, వారుపయోగిం చిన 'అక్షతయోని' 'శుద్ధయోని' అస్పృష్టమైథునా' 'అమైథునీ' అను పదములన్నియు వ్యర్థములగునుగదా? ఇది యిటుండఁగా మనువు మొదలగువారు వ్యక్తురాండ్రైన స్త్రీలకు వివాహములు విధించి యున్నారు. "శ్లో॥ త్రీణివర్షాణ్యుపేక్షేత కుమార్యృతుమతీసతీ । ఊర్ధ్వంతుకాలా దేతస్మాద్విందేత సదృశంపతిం॥ అదీయమాన భర్తారమధిగచ్ఛేద్యది స్వయమ్ । నైనఃకించిదవాప్నోతి నచయం సాధిగచ్ఛతి॥" అని కుమారి ఋుతుమతి యైనతరువాత మూడుసంవత్సరములు వేచియుండి, తండ్రివివాహము చేయనియెడల స్వయముగానే వరుని కోరుకోవచ్చుననియు, ఆప్రకారముగా వరించిన స్త్రీగాని దానిభర్తగాని యేవిధమయిన పాపమును పొందరనియు, మనువు స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు. "త్రీణివర్షాణ్యృతుమతీ కాంక్షేత పితృశాసనమ్ । తతశ్చతుర్థే వర్షేతు విందేత సదృశంపతిమ్॥" ఋుతుమతియైన స్త్రీ మూడు సంవత్సరములు తండ్రియాజ్ఞకయి వేచియుండి నాల్గవసంవత్సరమున తగినభర్తను కోరుకోవలసినదని బోధాయనులు చెప్పియున్నాఁడు. "ఋుతుత్రయ ముపాస్యైవ కన్యాకుర్యాత్స్వయంవరమ్" అని మూడు ఋుతువులైనతరువాత్త కన్య స్వయముగానే వరింపవచ్చునని విష్ణుస్మృతి యందును జెప్పఁడియున్నది. ఇట్లు వీరందఱును ఋుతుమతి యైన తరువాత వివాహము నంగీకరించుటయేకాక, మంచివరుఁడు దొరకని

పక్షమున నెంతకాలమయినను కన్యను వివాహములేకయే యుంచవచ్చు నని కూడ మన్వాదులు విధించియున్నారు. "శ్లో॥ కా[illegible]త్తిష్ఠే ద్గృహేకన్యర్తుమత్యపి । న చైవైనాం ప్రయచ్ఛేత్తు గుణహీ[illegible] కర్హిచి॥త్" అని కన్య ఋతుమతియైనను మరణపర్యంతము[illegible]ము ననే యుంచవలసినదికాని గుణహీనున కెన్నఁడును నియ్యఁగూడదని మనువును, "దద్యాద్గుణవతీకన్యాం నగ్నికాం బ్రహ్మచారిణే । అపివా గుణహీనాయ నోపరుంధ్యా ద్రజస్వలామ్॥" అని కన్యను గుణవంతుఁడయిన బ్రహ్మచారి కియ్యవలసినదేకాని రజస్వలయైనను గుణహీనుని కియ్యఁగూడదని బోధాయనులును, మఱికొందఱు ఋషులును చెప్పి యున్నారు. ఇట్లు చెప్పినను రజస్వలయైన కన్యను వివాహములేక చిరకాలమింటనుంచినపక్షమున చోరరతియు దానిఫలములైన భ్రూణహత్యాదులును సంభవింపవచ్చునని యెంచి కొందఱు ఋషులు రజస్వలయైనదానిని శీఘ్రముగా వివాహము చెయ్యనిపక్షమున పాపము వచ్చునని చెప్పియున్నారు. "శ్లో॥ ప్రాప్తే ద్వాదశేవర్షేయః కన్యాం నప్రయచ్ఛతి । మాసిమాసి రజస్తస్యాః పితా పిబతి శోణితమ్॥" పండ్రెండవ సంవత్సరము వచ్చినతరువాత తండ్రి కన్యకకు వివాహము చేయనిపక్షమున, ప్రతిమాసమునందు నాచిన్నదాని ఋతురక్తమును పానముచేసినట్టని యమస్మృతియందును, ఇత్యాదివచనములు కొన్ని మఱికొన్ని చిల్లరస్మృతులయందును గానఁబడుచున్నవి. మన్వాదులు ధర్మకార్యము నిమిత్తమయి కొన్ని సమయములయందు మాత్రము కొంచెము బాల్యవివాహముల కనుజ్ఞ యిచ్చియున్నారు. "శ్లో॥ త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ । త్ర్యష్టవర్షోష్టవర్షాంవా ధర్మే సీదతి సత్వరః॥" ధర్మమునకుఁ గావలసినప్పుడు ముప్పది సంవత్సరములవాఁడు పండ్రెండేండ్ల చిన్నదానిని పదునాఱు సంవత్సరములవాఁడు ఎనిమిదేండ్లదానిని వివాహమాడవచ్చునని మనువు వ్రాసి

యున్నాఁడు. ఇట్టి స్థలములలోతప్ప సాధారణముగా బాల్యవివాహ ములు చేయకూడదు. బాల్యవివాహములు పూర్వకాలమునందు లేవు గనుకనే యత్రిస్మృతియందు "శ్లో॥ వివాహే వితతే యజ్ఞే హోమకాల ఉపస్థితే । కన్యాం ఋతుమతీం దృష్ట్వా కథం కుర్వంతి యాజ్ఞికాః స్నాపయిత్వాతుతాంకన్యా మర్చయిత్వాయథావిధి । యుంజాన హోమంకుర్వీత తతఃకర్మ ప్రయోజయేత్ ॥" అని కన్య వివాహమధ్య మున ఋతుమతి యైనపక్షమున స్నానములు మొదలయినవి చేయించి కర్మ జరపవలసినదని చెప్పఁబడియున్నది. మనపురాణములయందు సహితము పూర్వకాలమునందు బాల్యవివాహములు జరిగిన ట్టెక్కడను వినియుండలేదు. "శ్లో॥ పితాదృష్ట్వా సుమంతోపి స్త్రీచిహ్నం యౌవనే స్థితాం । కస్మై దేయా కన్యే త్యచింతయదతీవసః॥ మునిఃకౌండిన్యనా మాస్మై వివాహేచ్ఛురభాగతః । తస్మై ప్రదేయా కన్యేతి సుమంతే నాపినిశ్చితమ్ ॥" అని సుమంతుఁడను బ్రాహ్మణుఁడు స్త్రీచిహ్నములు ధరించి యౌవనవతియైయున్న తన కొమార్తెను కౌండిన్యున కిచ్చి నట్టును, ఇట్టి వివాహము లనేకములు జరుగుచుండినట్టును పురాణముల యందు పెక్కుచోట్ల కానఁబడుచున్నది.

ఇదిగాక మనపూర్వులు పురుషులలో బాల్యవివాహముల కవ కాశములేకుండ నే కట్టుదిట్టము లేర్పఱచియున్నారు. 'శ్లో॥ గర్భాష్ట మేబ్దేకుర్వీత బ్రాహ్మణస్యోపనాయనమ్ । గర్భాదేకాదశే రాజ్ఞో గర్భా త్తుద్వాదశే విశః॥ అషోడశాద్బ్రాహ్మణస్యసావిత్రీ నాతివర్తతే । ఆద్వా వింశాత్క్షత్రబంధో రాచతుర్వింశతే ర్విశః॥' అను వచనములను బట్టి బ్రాహ్మణుల కేడవసంవత్సరము మొదలుకొని పదియాఱవ సంవత్స రములోపలను, క్షత్రియులకు పదవసంవత్సరము మొదలుకొని యిరు వది రెండవసంవత్సరము లోపలను, వైశ్యులకు పదునొకండవ యేఁడు

మొదలుకొని యిరువదినాలవ సంవత్సరములోపలను ఉపనయనము జరుగ వలసియున్నది. 'శ్లో॥ షట్త్రింశదాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్ తదర్ధికం వా పాదం వా గ్రహణాంతికమేవ వా॥' అను మనువచనమునుబట్టి బ్రహ్మచర్యము చేయవలసినకాల మెప్పటను తొమ్మిదిసంవత్సరములకు తక్కువ యుండదుగనుక, ఎవ్వరికిని పదియారుసంవత్సరములలోపల వివాహమాడుటకే వీలులేదు. ఇది యిట్లుండఁగా బాల్యవివాహమున కాధారముగా నేమిప్రమాణము లున్నవాయని యాలోచింపఁగా, 'శ్లో॥ అష్టవర్షా భవేద్గౌరీ నవవర్షాతు రోహిణీ । దశవర్షా భవేత్కన్యా అతఊర్ధ్వం రజస్వలా॥' అన్న వచనముతప్ప మఱియేదియు కనఁబడదు. వివాహమంత్రములయందు కన్యాశబ్దము వాడఁబడుచుండుట చేతను, స్మృతులయందుకూడ కన్యాశబ్దమే తఱుచుగా కనఁబడుచుండుట చేతను, బాల్యవివాహమును నెలకొల్పనెంచినవా రెవరో యీశ్లోకమును కల్పించి, కన్యాశబ్దమునకు విపరీతార్థ మిచ్చి స్వాభిమతము నెఱవేఱునట్లుగా నొకస్మృతియందు కలుపఁగా తక్కినవారును దానిని స్వీకరించి యుందురు. అట్లు కానియెడల నీసంకేతనామముల కేమిప్రయోజనము కలదు? వానికి కొంచెము ప్రయోజన మగుపడునట్లుగా, 'శ్లో॥ గౌరీందదన్నాకపృష్ఠం వైకుంఠం రోహిణీందదత్ । కన్యాందద ద్బ్రహ్మలోకం రౌరవంతు రజస్వలామ్॥' అని మఱియొకశ్లోకము కల్పింపఁబడినది. ఈకడపటి శ్లోకమే లేకపోయినయెడల గౌరీ, రోహిణీ శబ్దములతోడ ప్రయోజనమే యుండదు. కొన్ని స్మృతులయందు నగ్నికాశబ్దము కనఁబడుచున్నందున దానినికూడ బాలికాపరముగా పర్యవసితము చేయుటకయి 'శ్లో॥ అష్టమేతుభవేద్గౌరీ నవమే నగ్నికా భవేత్ । దశమే కన్యకా ప్రోక్తా ద్వాదశే వృషలీ తథా॥' అని పయిదానికి విరుద్ధముగా మఱియొక శ్లోకము కల్పింపఁబడినది. వివాహానుక్రమణికయందు 'శ్లో॥ కన్యాం కనకసంపన్నాం కనకాభరణై ర్యుతాం । దాస్యా

మివిష్ణవే తుభ్యం బ్రహ్మలోకజిగీషయా॥' అని కన్యాదాన మొక్కటియే చెప్పఁబడియున్నది. కాని రోహిణీగౌరీదానము లెక్కడను జెప్పఁబడి యుండలేదు. కన్యాశబ్దమునకు సాధారణముగా వివాహముకానిపడుచే యర్థ మయినను కొన్నిస్మృతులయందు 'ఋతుస్నాతాతుశుద్ధాయాసా కన్యేత్యభిధీయతే' అని ఋతుస్నాతయేకన్యయనియు, అట్టి కన్యవివాహమే ముఖ్యమయిన దనియు, చెప్పఁబడి యున్నది. బ్రాహ్మణకన్యల కెనిమిదవయేట వివాహము చేయ వలెనని యొకానొక చిల్లరస్మృతి యందు ప్రక్షిప్తవచన మొకటి కానఁబడుచున్నది.

పైనిచెప్పిన శ్లోకములు ప్రక్షిప్తములు కాకపోయినను, వాని యందు సహితము పదిసంవత్సరములదే కన్యయని చెప్పఁబడియున్నది గనుక, నేను పైనిచూపిన బాధకములను చక్కగా విచారించి పది సంవత్సరములకు లోపలనైనను బాలికలకు వివాహముచేయక మన వారు జాగరూకులయి యుందురని నమ్ముచున్నాను. ఇందులో ముఖ్యముగా చదువుకొన్నవారు తమచేత నయినంతప్రయత్నముచేసి తమ యింట నతిబాల్యవివాహములు చేయకయు, తమపలుకుబడి యున్నంతవఱకు చేయనీయక వారించియు, తెలియనివారికి బాల్యవివాహము వలని నష్టములను చెప్పియు నుపన్యసించియు ప్రకటించియు, పాటుపడుదురని నమ్ముచున్నాను. మనలోని విద్యాధికుల కిటువంటి సద్బుద్ధి నుదయింపఁజేసి, శీఘ్రకాలములోనే యతిబాల్యవివాహములు మన దేశములో నామమాత్రావశేషములగునట్లు ప్రసాదించి, ఈ భరత ఖండమునకు పూర్వపు మంచిదశను మరల కలిగింప జగదీశ్వరుని ప్రార్థించుచున్నాను.

మోడరన్ ముద్రాక్షరశాల, రాజమంద్రి.

విగ్రహారాధనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

అరవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీసమాజము,

రాజమహేంద్రవరము

1950

[వెల [illegible]

విగ్రహారాధనము

ఓ ప్రియసహోదరులారా!

మనుష్యుఁడనుభవింపఁ దగిన సమస్తానందములలోను, పొందఁదగిన సమస్తాభివృద్ధులలోను, ఆత్మానందాభివృద్ధులు మహోత్కృష్టములయినవని వివేకులకందఱికిని తెలిసిన విషయమేకదా! ఈ యానందాభివృద్ధులు సత్యమైన యీశ్వరారాధనమువలనను, సత్యమైన జ్ఞానమువలనను కలుగుననియు కొంచెమాలోచించి చూచు వారికెల్లను ఇంచుమించుగా తెలిసెడివిషయమే. సత్యమైన జ్ఞానమును వ్యాపింపఁజేసి పరిశుద్ధమయిన యీశ్వరారాధనము వర్ధిల్లఁ జేయవలెనన్న పక్షమున మనుష్యబుద్ధికల్పితములయి మతమునం దనావశ్యకముగా ప్రవేశించి చిరకాలమునుండి యీశ్వరైకార్హమయిన పూజ నక్రమముగా ననుభవించుచున్న యసత్యదేవతలయొక్కయు, కల్పితప్రతిమలయొక్కయు ఆరాధనమును మూలముట్టుగ తొలఁగించుటకయి ప్రబలప్రయత్నము చేయవలయును. ఇట్టి ప్రయత్నమువలనఁ గొందఱికి చిత్తశాంతిపోయి మనస్తాపము కలుగుట యనివార్యమే యైనను, ఒరుల మనస్సునకు నొప్పి కలుగఁజేయుట నాకెంతయిష్టము లేకపోయినను మానవకోటియొక్క నిత్యానందమునకు భంగము కలుగుచున్నప్పుడును సర్వకారుణ్యుఁడయిన పరమేశ్వరునికి చెందవలసిన భక్తికైంకర్యాదులు తుచ్ఛములయిన విగ్రహములపాలయి పరాధ్యముచేత నీశ్వరమహిమ మఱుఁగుపఱుపఁబడుచున్నప్పుడును మాత్రము నాశక్తియుక్తుల నెల్లను వినియోగపఱిచి, ఆనందసస్యము పెరుఁగక బీడుపడియున్న యస్మద్దేశీయుల హృదయక్షేత్రముల యందీశ్వరరాజ్యబీజమును స్థాపించుటకయి పాటుపడక, జడములయిన ప్రతిమలయందును ప్రతిమలను [illegible]

కొలుచు వారి యందును దాక్షిణ్యమువహించి నే నూరకుండఁ జాలను. ప్రతిమార్చనము తగదన్న దోషమునకయి మూఢులును జనులను మూఢ్యమునందుంచి వారి మౌఢ్యమువలననే కుటుంబభరణముచేసి కొని లాభముపొంద నలవాటుపడిన స్వప్రయోజనధురంధరులును నన్ను నిష్కారణముగా నాస్తికుఁడనియు బౌద్ధుఁడనియు నిందించినను నిందింప నిండు. పామరులయొక్కయు స్వార్థపరులయొక్కయు దూషణలను ప్రతిబంధములను పాటిగాఁబట్టక సత్యమునే యవలంభించెడు బుద్ధిని, వేయివిఘ్నములు వచ్చినను వెనుకతీయక నిశ్శంకముగా సత్యమును లోకోపకారార్థమయి బోధించునట్టి ధైర్యస్థయిర్యాదులను, పరమ కృపాళుఁడయిన యీశ్వరుఁడు నాకు ప్రసాదించునుగాక!

సకలజగత్కర్తయైన యీశ్వరుఁ డొక్కఁడనియు, అతఁడు నిరాకారుఁడగుటచేత బాహ్యేంద్రియములకు గోచరించువాఁడు కాఁడనియు, కేవలమానసైకవేద్యుఁడనియు, సర్వమతములవారును నైకకంఠ్యముతో నంగీకరించిన రాద్ధాంతాంశమే గనుక దాని స్థాపించుటకయి నేనిక్కడ యుక్తులు చెప్పి గ్రంథబాహుళ్యము చేయవలసిన పనిలేదు. ముండకోపనిషత్తునందు "నచక్షుషాగృహ్యతేనాపివాచా నాన్యైర్దేవైస్తపసాకర్మణా వాజ్ఞానప్రసాదేనవిశుద్ధసత్త్వః తతస్తుతంపశ్యతే నిష్కలం ధ్యాయమానః" అని యీశ్వరుఁడు నేత్రముచేతఁగాని, వాక్కుచేతఁగాని ఇతరేంద్రియములచేతఁగాని తపస్సుచేతగాని కర్మచేతగాని గ్రహింపఁబడఁడనియు, మనశ్శుద్ధికలవాఁడు ధ్యానముచేసి యీశ్వరుఁడు ప్రసాదించిన జ్ఞానముచేతనే యాతనిని తెలిసికొను ననియు, చెప్పఁబడియున్నది. ఈశ్వరునిధ్యానమార్గముననే జ్ఞాననేత్రముచేతఁ జూడవలెనని యుపదేశించుటయే కాక వేదము బహుస్థలములయందు దేవుని నిరాకారుఁడని తెలిసికొని యారాధించువారికే కాని నిజమయిన యానందము లేదనియు ఘోషమిడుచున్నది. శ్వేతాశ్వతరోపనిషత్తు

నందు "తతోయదుత్తరతరం తదరూపమనామయమయం, యఏత ద్విదురమృతాస్తే భవన్త్యథేతరే దుఃఖమేవాపి యాన్తి" అని యీశ్వరుఁడుత్కృష్టపదార్థములలో నెల్ల నుత్కృష్టుఁడనియు నిరాకారుఁడనియు నిరామయుఁడనియు నెవ్వరెఱుఁగుదురో వారు నిత్య సుఖత్వమును పొందుదురు. తదితరులు దుఃఖమునే పొందుదురనియు, వివరింపఁబడియున్నది. అంతేకాక యీశ్వరు ననేకముగాఁ జూచు వారు మోక్షపదవినందక చెడుదురనియు ప్రకృతినిగాని సృష్టిపదార్థమునుగాని యుపాసించు వారంధకారమునఁ బడుదురనియు, కూడ వేదమే మొఱయిడుచున్నది. కఠోపనిత్తునందు "మనసైవేదమాప్తవ్యం నేహనానాస్తికించన మృత్యోస్సమృత్యుంగచ్ఛతియ ఇహనానేవ పశ్యతి" యని మనస్సుచేమాత్రము బ్రహ్మము నందఁదగుననియు, అక్కడ ననేకముమనుసదిలేదు కాఁబట్టి యిక్కడననేకమును గాఁజూచు వాఁడు మృత్యువునుండి మృత్యువునకుఁ బోవుననియు, మఱియు వాజస నేయోపనిషత్తునందు "అన్ధన్తమం ప్రవిశంతి యేసంభూతి ముపాసతే, తతోభూయ ఇవ తే తమోయేసంభూత్యాగ్ంరతాః" అని ప్రకృతి నుపాసించువా రంధకారమునఁ బ్రవేశింతురనియు, సృష్టిపదార్థముల నుపాసించువారంతకంటెను హీనమయిన యంధకారమునఁ బడుదు రనియు, స్పష్టపఱుపఁబడియున్నది. ఈశ్వరుఁడు మానసైకవేద్యుఁ డనియు, ప్రకృతినిగాని విగ్రహములనుగాని యుపాసించుట దూష్య మనియు, చూపుటకయి వేదమునుండి యిటువంటి ప్రమాణశతముల నుదాహరింప వచ్చునుగాని గ్రంథవిస్తారమువలన నధికప్రయోజనము లేదు. కాఁబట్టి యింతటితో విరమించెదను. హిందువు లందఱిచేతను సర్వోత్కృష్ట ప్రమాణముగా నంగీకరింపఁబడుచున్న వేదమే యీ ప్రకారముగా ప్రతిమార్చనమువలదని బహుముఖముల ఘోషమిడు చుండఁగా దానిని విశ్వసింపక, నిన్న మొన్న పుట్టిన పురాణముల

యందు విగ్రహారాధన విషయమయి" వేదవిరుద్ధముగాఁ జొప్పింపఁ బడిన వాక్యములను మన వారెట్లు పరమప్రమాణముగా స్వీకరింపఁ గలుగుచున్నారో నేనూహింపఁజాలకున్నాను.

శబ్దప్రమాణములలో నెల్ల నధమములయిన యీ పురాణములు సహితమజ్ఞుల విషయమున విగ్రహారాధనమును శ్లాఘించుచు వచ్చినను ప్రాజ్ఞులవిషయమై పలుకవలసి వచ్చినపుడు విగ్రహారాధనము నింద్య మని బొత్తిగా చూపకున్నవికావు. అయినను మన దేశము చేసికొన్న పాపమేమో కాని చిరకాలమునుండి మనవారికి పురాణముల యందలి యధర్మములవలె నందలి సద్ధర్మము లంతగా రుచింపకున్నవి. పురాణ ములయందు విగ్రహారాధనము నిరసింపఁబడలేదని నమ్మియుండెడి విజ్ఞుల యుపయోగార్థము నకుసగా శైవవైష్ణవ పురాణములనుండి రెండుమూడు వచనములనుమాత్ర మెత్తి చూపుచున్నాను. స్కాంద పురాణమునందు "శ్లో॥ ఆత్మసంస్థంశివంత్యక్త్వా బహిస్థంయుజతేశివం। హస్తస్థంపిండముత్సృజ్యలిహేత్కూర్పరమాత్మనః॥ శివమాత్మని పశ్య న్తిప్రతిమాసునయోగినః॥ అజ్ఞానాంభావనార్థాయ ప్రతిమాః పరి కల్పితాః॥" అని తనలోనుండు నీశ్వరుని విడిచిపెట్టి బయిటనుండు శివుని పూజించుట యరచేతిలోని యన్నమును పాఱవైచి మోచేతిని నాకుటయేయనియు, యోగులీశ్వరుని తనలోఁ జూతురుగాని ప్రతి మలయందుఁ గాదనియు, తెలివితక్కువ వారి భావననిమిత్తమై ప్రతి మలు కల్పింపఁ బడినవనియు, చెప్పఁబడి యున్నది. ఈలాగుననే శ్రీమద్భాగవత తృతీయ స్కంధమునందును "శ్లో॥ అహంసర్వేషు భూతేషు భూతాత్మా వస్థితస్సదా। తమవజ్ఞాయ మాంమర్త్యః కురు తేర్చా విడంబనమ్॥ యోమాం సర్వేషుభూతేషు సంత మాత్మాన మీశ్వరమ్। హిత్వార్చాంభజతే మౌఢ్యా ద్భస్మన్యేవజుహోతిసః॥" అని నేను (ఈశ్వరుఁడు) సదా సకల భూతములయందును ఆత్మస్వరూ

వుఁడ నయి యుండఁగా అటువంటినన్ను వమానపఱుచుటకయి మనుష్యుఁ డర్చ యనుపరిహాసమును జేయుచున్నాఁడనియు సర్వభూతముల యందును ఆత్మస్వరూపుఁడునుగా నున్న యీశ్వరుని నన్ను విడిచి మూఢత్వముచేత నెవ్వఁడర్చను చేయుచున్నాఁడో వాఁడు బూడిదలో హోమముచేయువాఁడే యనియు, ప్రతిపాదింపఁబడి యున్నది. ఈ పురాణములనుబట్టి విచారించినను విగ్రహముల నుపాసించువారు బుద్ధిహీనులనియు, బుద్ధిహీనుల నిమిత్తమే ప్రతిమలు కల్పింపఁబడిన వనియు నేకదా తేటపడుచున్నది? "ప్రతిమాస్వల్పబుద్ధీనాం। సర్వత్రవిదితాత్మనాం" అని దేవుఁడు బుద్ధిహీనులకు ప్రతిమల యందును తెలిసినవారికి సర్వత్రనుండునన్న యుత్తరగీతావచనమువలనను "కాష్ఠలోష్టేషుమూఢానాం యుక్తస్యాత్మనిదేవతా" యని దేవుఁడు మూఢులకు కాష్ఠలోష్టములయందును వివేకులకు మనస్సునందును నుండునన్న ప్రమాణాంతరమువలనను, కేవల మూఢులకే కాని జ్ఞానలేశముకలవారికి బింబోపాసనము తగదని కరతలామలక మగుచున్నది. చెప్పినను మూఢులు గ్రహింపలేరని భ్రమించి వారీశ్వర జ్ఞానములేక కేవల నాస్తికులయి చెడిపోవుటకంటె ప్రతిమలను పూజించుటవలన నయినను వారి కొకప్పుడు కాకపోయిన నొకప్పుడయిన సర్వమును సృజించి పాలించెడు ప్రభువొకఁడున్నాఁడన్న జ్ఞానము కొంచెము పుట్టవచ్చునని యెంచి మనపూర్వులు దీర్ఘాలోచన లేక మూఢులనిమిత్తమయి ప్రతిమలను కొంతకాలము క్రిందట సచ్చింతతోనే కల్పించి యుందురు.

ఈ ప్రతిమ లందుచేత మొట్టమొదట మూఢశిరోమణుల నిమిత్తమే యుద్దేశింపఁబడినను, ఏమికాలకర్మదోషముననో కాని మన దేశమునం దిప్పుడు విగ్రహములు పామరుల గుడిసెలయందుమాత్రమే కాక పండితులనఁబడెడువారి పవిత్రగృహములయందుకూడ నిరాతంక

ముగాఁ బ్రవేశించి, ఈశ్వరుని సర్వాధికారమును తామే వహించి సర్వత్ర పూజనొందుచు, జనులను విగ్రహారాధనమే సర్వోత్కృష్టమని భావించి వాదించునంతటి దుస్థితికిఁ దెచ్చినవి. ఓహో! స్వప్రయోజనపరులై విగ్రహారాధనమే సర్వార్థదాయకమని బోధించెడి పండితవేషధారుల యనుగ్రహమువలన, పూర్వకాలమునందు పరమేశ్వరుని యేకదివ్యాలయముగానుండి పరిశుద్ధేశ్వరోపాసనముచేత సుప్రసిద్ధమయి యుండిన యీ భరతఖండమున కిప్పు డెంత దుర్గతిపట్టినది! జ్ఞానానంద సంధాయకుఁ డయిన యేకేశ్వరుని యుత్తమారాధనను విడిచిపెట్టి జడములయిన లెక్కలేని శిలాలోహ విగ్రహముల కాళ్ళకు మ్రొక్కవలసిన మన దేశపుప్రస్తుత దుర్దశను తలఁచుకొనఁగా నాదేహ మిప్పుడు కంపమెత్తుచున్నది. గౌరవస్థానములయిన పీఠములమీఁద నెక్క, ఈశ్వరునికిని మనుష్యులకును మధ్యనిలిచి యీశ్వరైకార్హమయిన పూజాసత్కారమును తామయోగ్యముగా పొందుచున్న యీ విగ్రహములు మరల తమ కుచితమయిన స్థితిని బొంది బొమ్మరిండ్లలో బిడ్డల వినోదమునకే యుపయోగపడుచుండఁగా చూచి సంతోషించెడిభాగ్యము భగవత్కటాక్షమువలన మన దేశమున కత్యంత శీఘ్రకాలములోనే కలుగునుగాక!

మన మిఁక మూఁధుల కయినను విగ్రహారాధనమువలన ప్రయోజనలేశము కలుగునాయన్న యంశమును, విగ్రహారాధనము వలనఁ గలుగుచున్న యనర్థములను, ప్రతిమార్చనము మానుటవలన సంభవించెడి లాభములను, కొంచెము విమర్శింతము. ప్రపంచములోని సమస్తదేశములలోను సమస్తమతములలోను ఒక్క హిందూమతము నందుమాత్రము విగ్రహారాధనము కొంతకాలమునుండి పారంపర్యముగా వచ్చుచున్నది. మనవారు గ్రంథములయందుఁ జెప్పినట్లొక్క పామరులేకాక పండితులు సహితము మన దేశములో నప్పుడు సర్వ

సాధారణముగా ప్రతిమలను సేవించుచున్నారు. అన్యదేశముల యందున్న పామరులకు సహితము మానసికారాధనము పనికివచ్చి వారికి దానివలన నాత్మశాంతి మొదలయిన సమస్తప్రయోజనములును గలిగి వారు తరించుచుండఁగా, ఒక్క మనదేశమునందుమాత్రము పండిత పామర సామాన్యముగా నెల్లవారికిని మానసికారాధన మేల పనికిరాదో, విగ్రహార్చనమే యేలకావలెనో నాకూహింప శక్యము కాకున్నది. ఇతరదేశములలోని పామరులకన్నను మనదేశములోని పండితులు గ్రహణాదిశక్తులయందు తక్కువవారనియు, అందుచేత నాధ్యాత్మికారాధనమున కనర్హులనియు, విశ్వసించుటకును నామన స్సొప్పకున్నది. ఇతరవిషయములయందును మనలోని పామరులు కొందఱు విగ్రహారాధనలేని జాతులవారిలోని పామరులకంటె జ్ఞానాధికులైయుండుటయు, మఱికొందరు వారికంటె జ్ఞానహీనులుగా నుండ కుండుటయు, మనము స్వానుభవమువలన నెఱిఁగియున్నాము.

కాఁబట్టి దీని కంతకును కొంతకాలమునుండి మనదేశములో నంధపరంపరగా వచ్చుచున్న దురాచారముతప్ప వేఱుకారణమునాకగ పడదు. చక్కగా బోధచేయు గురువులున్న పక్షమున నిరాకార నిర్వి కారుఁడైన యీశ్వరుని కళ్యాణగుణములను తెలిసికొని మనస్సులో నా మహామహుని ధ్యానింపలేనంత మూఢుఁడే దేశమునందును ఏ జాతి యందును కేవల: చిత్తోన్మాదముగలవాఁడుతప్ప మరియొకఁ డుండఁ డని నా నిశ్చితాభిప్రాయము. లోకానుభవమును నాయభిప్రాయమును సిద్ధాంతీకరించుచున్నది. అదిగాక మూఢులకు సహితము విగ్రహముల మూలమున నీశ్వరవిషయక జ్ఞానమును కలిగింపఁబూనుటకంటె సృష్టి కార్యములనుబట్టి యీశ్వరస్వభావాదులను తెలుపుటయే సహస్ర గుణముల సులభమని నా మనస్సునకు తోచుచున్నది. పగలును, రాత్రియు, భూమిమీఁదను, ఆకాశముమీఁదను సమస్తప్రదేశముల

యందును, విరామములేక సృష్టికర్తయొక్క దివ్యమహిమలను చాటుచుండు దేదీప్యమానములయిన సూర్యుని, చంద్రుని, వివిధసుందర రూపములుగల వృక్షలతాదులను, విచిత్రవర్ణములుగల పాదరసపుబుడ్ల వలె వ్రేలుచు నేత్రోత్సవముచేయు నక్షత్రములనుజూపి, వానినిసృజించి నడిపించుచున్న సర్వశక్తిగల పరమేశ్వరుని దివ్యలక్షణములను మనసునఁ బట్టించుటే సులభమో కదలమెదలనేరని నిర్జీవములయిన రాతి ప్రతిమలనుజూపి యీశ్వరగుణాదులను బోధించుట సులభమో, ఊహించుకొనుట కిచ్చటి బుద్ధిమంతులకే విడిచిపెట్టెదను.

సర్వశక్తిసంపన్నమయి జ్ఞానస్వరూపమయిన యగోచరపదార్థమును బోధించుటకయి, ప్రత్యక్షముగా కనఁబడుచుండు జడమయి మొద్దులాగుననుండు దారుమయవిగ్రహము నొకదానినిజూపి యది దీనివలె నుండునని చెప్పి యెంతబుద్ధిహీనునినైనను నమ్మించుట సాధ్యమగునా? సర్వవ్యాపియయి సర్వజ్ఞుఁడయి యింద్రియాగోచరుఁడయిన యీశ్వరుఁడు మన ప్రార్థనలాలించి మన యభీప్సితములనిచ్చునని విశ్వసించుటకంటె కొండలనుండి తెచ్చి కాలుచేతులు చెక్కి గుడులలో పెట్టిన రాతివిగ్రహములు మనప్రార్థనలువిని మన వాంఛితముల నిచ్చునని విశ్వసించుట సులభమా? మన కగుపడకున్న యీశ్వరుఁడు సర్వజ్ఞుఁడనుకొనుటకన్న రాతిప్రతిమ సర్వజ్ఞుఁడనుకొనుట కష్టతరముకాదా? ఈసంగతి యటుండనిండు.

విగ్రహారాధనము స్థాపించిన మనవారుసహితము ప్రతిమారాధనము మహాత్మ్యబోధక మనియు మానసికారాధనము జ్ఞానబోధకమని యనేకదా చెప్పుచున్నారు. లోకములో మహాత్మ్యప్రధానమయిన దెప్పుడును అసత్యముగాను, జ్ఞానప్రధానమయిన దెప్పుడును సత్యముగాను ఉండును. లోకములో నొక యక్రమము మనుష్యుని మఱియొక యక్రమమున కీడ్చునుగాని యెప్పుడును క్రమమార్గమునకు దారి

చూపదు. అసత్యమువలన నెప్పుడును సత్యము కలుగనేరదు. కాబట్టి యజ్ఞానజనకమయిన విగ్రహారాధనమువలన క్రమక్రమముగా జ్ఞానోదయముకలిగి కాలాంతరమున మానసికారాధనమునకు మార్గమేర్పడు నని యెవ్వరెంతచెప్పినను, అట్టిస్థితి యెప్పుడును పొసఁగనేరదనియు మనము లోకానుభవము వలనను వస్తుతత్త్వమువలనను స్పష్టముగా నెఱుఁగుదుము. మహాధ్యజన్యమయిన ప్రతిమార్చనము మఱింత మహాధ్యమునే వృద్ధిపొందించి జనుల నంతకంతకు పరమేశ్వరునినుండి మఱింత దూరముగానే తొలగించుచుండును. మనదేశమందించుమించుగా రెండు వేల సంవత్సరములనుండి విగ్రహారాధనమున్నను జనులంతకంతకు భగవన్మహిమలను దెలిసి జ్ఞానాధికులుకాక యంతకంతకు భగవంతుని మఱచి జ్ఞానహీనులయి చెడుచుండుట ప్రత్యక్షదృష్టము. పూర్వ మొక్క మూఢులనిమిత్తమే ప్రతిమార్చనము కల్పింపఁబడినను, రాఁగారాఁగా నించుమించుగా నిప్పుడు హిందువులందఱును విగ్రహారాధకులే యయిపోయినారుగదా! ఒకయక్రమము మఱియొక యక్రమమునకు దింపకమానదు. సూర్యాగ్ని సముద్రాది మహోత్కృష్ట పదార్థముల మూలమున భగవన్మహిమలను దెలిసికొని యారాధించిన మనవారు కొంతకాలమున కీశ్వరు నెట్లో మఱచి సూర్యాదుల కొలుచువారయినారు. ఏకేశ్వరుని విడిచినతోడనే బహుదైవతములను గొలువనారంభించి, మనవారంతకంత కాదేవతలసంఖ్య నధికపఱుచుచు వచ్చి ముప్పదిమూడుకోట్ల దేవతలను కల్పించి, తుదకు గొలచెడు జనులసంఖ్యకంటె గొలువఁబడెడు దేవతలసంఖ్యనే యెక్కువచేసినారు.

మనవా రంతటితోను తృప్తినొందక గృహదేవతలతోను కుల దేవతలతోను స్థలదేవతలతోను గ్రామదేవతలతోనుగూడ మనదేశము నంతను నింపివేసినారు. ఈశ్వరుని మొదట మనుష్యరూపమునకు దింపిన మనవారు, కాలక్రమమున దేవుని మృగరూపమునను పక్షిరూప

మునను క్రిమికీటకరూపమునను కడపట జడరూపమునను కూడఁ గల్పించి కొలువ సాలుపడినారు. ఇంతకు వచ్చినవా రెంతకురారు? అటుతరువాత ప్రత్యక్షపశ్వాదులనే కొలువసాగినారు. మనదేశములో వృషభములను గొలుచువా రెందఱున్నారుకారు! గరుడాదిపక్షులను సేవించువా రెందఱున్నారుకారు? పాములను పూజించువా రెందఱున్నారుకారు? జెట్టులకు మ్రొక్కువా రెందఱున్నారుకారు? అశ్వత్థాది వృక్షములకు ప్రదక్షిణనమస్కారములు చేయువా రెందఱున్నారు కారు? తుదకు సన్నికండ్లకును గోడలకును బొట్టుపెట్టి పూజచేయువా రెందఱున్నారు కారు? జనులింతకన్నను మూఢులగుట యెన్నఁడైన సాధ్యమగునా? మనదేశమున కింతకన్నను దుస్థితి మఱియేమిపట్టును? సర్వోత్కృష్టుఁడయిన భగవంతుని నిర్మలమయిన మానసికారాధనమును విడిచి తప్పుత్రోవతొక్క మొదలుపెట్టినతరువాత మనకంటెను పరమనికృష్టములయిన పశుపక్ష్యాదులకును జడపదార్థములకును దాసులముగాక మన ముత్కృష్టదశ నెట్లుపొందుదుము? దేవుని నీప్రకారముగా పశుపక్ష్యాదిరూపములకుఁ దీసికొని వచ్చుటచేత మన బుద్ధిలోపమే వెల్లడియై మనమే చెడుపోదుముగాని పరిశుద్ధుఁడయిన యీ పరమేశ్వరునికి గోరంతయు కొరంత రాఁబోదు.

మానసికారాధనమును విడుచుటవలనఁ గలిగిన చెడుగు లింతేకావు మనము జ్ఞానానందమయుఁడయిన యీశ్వరుని మాని జడపదార్థములను కొలుచునంతటి బుద్ధిమంతుల మయిన తరువాత మన యీరాధన క్రమమును మన బుద్ధికి తగినట్టే యుండును. ఈశ్వరుని హృదయపూర్వకముగా ప్రేమించుటకును త్రికరణశుద్ధియైన భగవదాజ్ఞానుసరణమునకు మాఱుగా, మనభక్తియంతయు విగ్రహములకు స్నానములు చేయించుటతోను బట్టలుకట్టుటతోను నగలలంకరించుటతోను ధూపదీపనైవేద్యములర్పించుటతోను భోగములు చేయించుట

తోను ప్రతిసంవత్సరమును వివాహములు చేయుటతోను రథోత్సవములతోను సమాప్తినొందినది. అంతటితో సరిపోయినను కొంత మేలుగానే యుండును. కొందఱు విగ్రహముల ప్రీతికయి భుజములను కాల్చుకొనుచున్నారు. కొందఱు భుజములయందును నాలుకయందును శూలములు గ్రుచ్చుకొనుచున్నారు; కొందఱు వీపులకు గాలములు గ్రుచ్చుకొని సిడులాడ లోనగుచున్నారు; కొంద ఱుపవాసములుచేసి శరీరములు శోషిల్లఁజేయుచున్నారు; కొందరు కోడిపిట్టలను మేకపోతులను తుదకు దున్నపోతులనుకూడ రాతిదేవతలకు బలియిచ్చి జీవహింసచేయుచున్నారు.

దౌరతనమువారు మాన్పఁబట్టికాని లేకపోయినయెడల తమతోడి మానవులను తమకడుపునఁబుట్టిన బిడ్డలనుకూడ కొందఱు తాము కొలుచు విగ్రహములవలెనే తామును రాతిగుండెనే కలవారయి ప్రతిమలకు బలియియ్య వెనుకతీయకపోవుటయేకాక మొండిచేతుల జగన్నాథస్వామివారి రథచక్రములక్రిందపడి యాత్మహత్యలు చేసికొనుటకును తెగించుచున్నారు. మనుష్యుఁడింతకంటెను క్రూరకృత్యములు మఱియేమిచేయఁ గలుగును. ఈప్రకారముగా జనులు మానుష స్వభావమును మఱచి ప్రత్యక్షరాక్షసులు కాఁగలుగుట విగ్రహారాధన ప్రభావముచేత నేకదా? ప్రతిమార్చనమువలన నిట్లు మానుషస్వభావమే చెడినప్పుడు, నీతి చెడుట యొకవింతకాదు. "యథా దేవ స్తథా భక్తాః" అను న్యాయము మనవా రెఱుఁగనిది కాదు. మనము కొలుచు దేవతల నీతియెట్లుండునో, మననీతియు నట్లే యుండును. అందుకు నిదర్శనము చూడుఁడు. శ్రీకృష్ణవిగ్రహమును గొలుచువారు కృష్ణలీల లనిపాడెడు పాటలు విన్నపక్షమున వివేకులు సిగ్గుచేత తలలు వంచుకొనవలసి యుండును; వైష్ణవులలో నాచరింపఁబడు కంచుకోత్సవము, రాసక్రీడ

వల్లభ మతసంప్రదాయము తలచుకొన్నంతమాత్రముచేత మానవజాతి
యింత నీతిమాలినదగునా యని శరీరముపు లకించుచున్నది.

మగవాండ్ర రవికలనెల్లను చీఁకటిగదిలోవేసి యేపురుషున
కేవ తెరవికదొరకునో వాఁడు దానితో వావివరుసలులేక పరకాంత
యనక సంభోగించుట పశుకృత్యముకాక మఱియేమగును? ఇదేనా
రాధామాధవమతము? ఇదేనా కంచుకోత్సవము? ఓమతమా! నీపేరున
కింతయవమానము వచ్చినది! ఇట్టిది మతమని చెప్పుకొనుట సిగ్గుల
చేటుకాదా? పశ్చిమహిందూస్థానమున వల్లభమతాచార్యుని శ్రీకృష్ణ
మూర్తినిగా భావించి మానాభిమానములు విడిచి తల్లులు తమ కూతు
లను, అన్నలు చెల్లెండ్రను, అత్తలు కోడండ్రను, భర్తలు భార్యలను
వెంటఁబెట్టుకొనిపోయి వట్టపగలు పలువురు చూచుచుండఁగా దక్షిణ
లిచ్చి సంభోగార్థమర్పించి, పుణ్యముపేరుచెప్పి వారిని నీతికిని పాతి
వ్రత్యమునకును మృత్యుదేవతయైన యాగురువు శయనగృహమునకుఁ
బంపుట మతమగునా? పశుకృత్యమగునా? మతముపేరుచెప్పి చైతన్య
శిష్యులగు వైష్ణవులు కొందఱు తప్పత్రాగి సిగ్గులులేక గుంపులు
కూడి వీథులలో వికారముగా వడఁకురోగము వచ్చినవారివలె తల
లెగరవైచుచు గంతులువైచునప్పుడు చూచువారికి మానవజాతి
యింత మృగప్రాయమగునాయని యాశ్చర్యము కలుగకపోదు. విగ్రహా
రాధనము మనుష్యులనీతిని చెఱిచిన దన్నందు కీరెండుమూఁడు నిదర్శ
నములుచాలును. దివ్యస్థలములను తఱుచుగా సేవించినవారు కొన్ని
దివ్యక్షేత్రము లెట్లు వ్యభిచారమునకును త్రాగుఁబోతుతనమునకు
జన్మాలయములయి యున్నవో యెఱిఁగియుండవచ్చును. కాఁబట్టి
యిక్కడ నింతకంటె నధికముగాఁ జెప్పుట యనావశ్యకము.

ఈశ్వరుఁడు రూపములేనివాఁడుగనుక, ఆతని ప్రతిరూపముండు
టయే సంభవింపదు. కాఁబట్టి విగ్రహము లెప్పుడును తా మీశ్వర

రూపసాదృశ్యమును పొందఁజాలవు. ఒకవేళ నీశ్వరునకు రూపమున్న దనియు విగ్రహము లారూపమును తెలుపుననియు వాదసౌకర్యార్థముగా క్షణకాల మంగీకరించినను మనకాతనిరూపముతో లేశమయినను ప్రయోజనములేదు. దేవుఁడు నల్లనివాఁడయినను, తెల్లనివాఁడయినను, పర్వతమంతవాఁడయినను, పరమాణు వంతవాఁడయినను, మన కందువలన వచ్చెడిలాభ మేదియులేదు. నిష్కళంకములయిన యాతని దివ్యగుణముల కద్భుతామోదముల నొంది, సాధ్యమయినంతవఱ కాగుణముల నవలంబించి, ఆయన యాజ్ఞానుసారముగా ప్రవర్తింపఁ గలుగుటకయి భగవంతుని కల్యాణగుణస్వభావములనే మనము తెలిసికొనవలసి యుండును. మనము విగ్రహమువంక వేయిసంవత్సరములు రెప్పవాల్చకచూచినను భగవంతునియొక్క బుద్ధిగాని, సామర్థ్యముగాని, జ్ఞానముఁగాని, కరుణాళుత్వముగాని, పరిశుద్ధతగాని మఱి యే కల్యాణగుణముగాని, యించుకైన బోధపడునా?

మన మొకమనుష్యుని ప్రతిమను చూచినంత మాత్రముచేత అతఁ డెంతటి శక్తియుక్తుఁడో, అతనియందు సుగుణసంపద యున్నదో లేదో, కొంచెమయినను గ్రహింపఁ గలుగుదుమా? సాకారమయిన జడపదార్థదర్శనమువలన నిరాకారమయి విరుద్ధధర్మములుగల జ్ఞానవస్తువివేక మెన్నటికిని కలుగనేరదు. జడాత్మకములయిన విగ్రహసాహాయ్యమున నేత్రేంద్రియముచేత మానసైక వేద్యమయిన పరమాత్మనే తెలిసికొనుట సాధ్యమయ్యెనేని, అప్పుడు చీకటినిచూచుటచేత వెలుతు రిట్టిదనియు విషమును చవిచూచుటచేత చక్కెరయొక్క మాధుర్య మిట్టిదనియు తెలిసికొనుట సాధ్యమగును. కాఁబట్టి సత్యజ్ఞానానందస్వరూపుఁడయిన యీశ్వరుని ఒక్కమనస్సుచేతఁగాని మఱి యేయింద్రియముచేతను గ్రహించి యారాధించుటకు శక్యముకాదు. దేవుని మనము కన్నులతోఁ జూచి చేతులతో పూజింపఁదలంచుకొన్న

పక్షమున మనలను జేసిన దేవుని విడిచి మనముచేసిన జడము లయిన విగ్రహముల నర్చింపవలసినివారమయి యాప్రతిమలకంటెను, జడుల మగుదుము. అప్పుడు మూఢభక్తి ముదిరి వివేకముచెడి, దురభిమానము హెచ్చి, బహుదైవతము లేర్పడి, మతద్వేషముపుట్టి, రాగద్వేషాదులు ప్రబలి, మానవధర్మములయిన దయాసత్యశౌచాదుల యందు విపరీతజ్ఞానము కలిగి, మనము సర్వవిధముల చెడిపోదుము.

విగ్రహారాధనమువలనఁ గలిగిన విపరీతజ్ఞానమాహాత్మ్యమువలననే కదా వైష్ణవులు శైవుని మొగముచూచిన పాపమువచ్చి తమ్ము చుట్టుకొనుననియు శైవులు వైష్ణవునిముఖదర్శన మాత్రముననే ఘోరపాతకము సంభవించుననియు పరస్పరము దూషించుచు ద్వేషించుచు మానుషస్వభావమునుమఱచి ముక్తికి తులసి పూసల తావళములును దుష్టునామములును మాత్రమే సాధనములని యొకరును రుద్రాక్షమాలలును విభూతిపెండెకట్టును మాత్రమే సాధనములని మఱియొకరును పోరాడుచున్నారు. ఈవిగ్రహములభాగ్యమువలననేకదా తమకుపని చేయు బ్రతికియున్న యెద్దులకు తిన్నగా మేఁతపెట్టకయు త్రాగనీరుపోయకయు తోఁకలు మెలివెట్టియు ములుకోలకఱ్ఱలతో పొడిచి తుంట్లుపుండుచేసియు మోయరాని బరువులు మోపి చావమోదియు బాధించు భక్తాగ్రేసరులు రాతితోఁచేసిన వృషభము కంటఁబడగానే కాలిజోడు వదలి చేతులు జోడించుకొని మ్రొక్కి ఫలములు సమర్పించి పూజించుచున్నారు!

ఈ విగ్రహసంపదచేతనేకదా తమతోడి పేదమానవులు నిలువనీడలేక నిరతంతరకష్టములపాలయి భార్యాపుత్రాదులతోడఁ గూడ బాధపడుచుండఁగాఁజూచి వారికొక్క చిన్నకుటీరము నయినను కట్టించియిచ్చునంతటి కనికరముపుట్టని భూతదయాళువు తాము కట్టించియిచ్చినంగాని యీశ్వరునకేమో నిలువ నీడలేకపోవునన్నట్టుగా వేల

కొలఁది రూప్యములు వెచ్చించి క్రొత్తగా మలిపించిన రాతిదేవతలు కాపురముండుటకయి గుడులను గోపురములను కట్టించుచున్నారు! ఈ పశుపక్ష్యాదిరూపములనున్న విగ్రహముల నారాధించు పెన్నిధాన మబ్బుటచేత నేగదా భగవత్కుటుంబమయిన యీలోకములో తమకు సోదరులుగా జనించి మందభాగ్యులయియున్న తోడిమానవు లంగవైకల్యాదులచేతను దీర్ఘవ్యాధులచేతను దిక్కుమాలి బాధపడుచుండఁగా చూచి యొక్కపూట యింతగంజి పోయులేని ధర్మస్వరూపులైన పుణ్యాత్ములు బియ్య మొడికట్టుకొని వెదుకుకొనుచుఁబోయి చీమలపుట్టలకడ పోయుచు, చేపలను మాంసమునుకొని చెట్లవెంబడిని గుట్టలవెంబడిని పరుగులెత్తి తలలు పైకెత్తి గరుడపక్షులను పిలిచి మాంసాదుల నెగరవేయుచు, సార్థకదానములను చేయుచున్నారు! విగ్రహారాధనమువలనఁ గలుగుచున్న విషతుల్యములయిన దుష్ఫలము లింతకంటెను మఱియేమి కావలెను!

మనవారు జడములయిన విగ్రహముల నారాధించుచుండలేద నియు, గుఱికుదిరి మనస్సుచలింపక యొకదానిమీద నిలుచుటనిమిత్తమయి విగ్రహముల నెదురనుంచుకొని యీశ్వరునే యారాధించుచున్నారనియు, విగ్రహార్చనము భగవదారాధనమునకు సహాయపడి క్రమక్రమముగా మానసికారాధనమును పురికొల్పుననియు చెప్పుదురు. మన మనస్సెప్పుడును స్వభావముచేత నొక్కవస్తువుమీదనే కాని యేక కాలమునందు విరుద్ధగుణములుగల యనేకవస్తువులయందు నిలువదు. ఈశ్వరునకును మనకును మధ్య మఱియొకవస్తువుండిన పక్షమున, మన ధ్యానము భగవంతునుండి తొలఁగి బహుశరముగా నడుమనున్న ప్రతిమలమీదనే మనలక్ష్యము నిలుచును. కావలసిన యీశ్వరుని యందు నిలువక విగ్రహములయందు గురికుదురుటవలన నేమిప్రయోజనము కలుగును? ఆరంభదశయందెట్లున్నను క్రమక్రమముగా విగ్రహ

ములే పూజకు విషయములు కాకమానవు. అటుపిమ్మట విగ్రహాను గ్రహ సామర్థ్యాదులును పరమాద్భుత మహిమలునుకూడ విగ్రహములకే యారోపింపఁబడి, జను లవియే యాపదలను తొలగించుననియు కోరికల నిచ్చుననియు నమ్ముచుందురు.

అందుచేతనే సామాన్యముగా జనులు కొన్ని విగ్రహముల కెక్కువ మహాత్త్వ మున్నదని భ్రమించి తమ యూరనున్న విగ్రహములను విడనాడి దేవతాసందర్శనము నిమిత్తమయి సకలశ్రమలనుపడి దూరదేశయాత్రలు చేయుచుందురు. అదిగాక యొక్క దేవత నారాధించువారే మాయూరి దేవతే యెక్కువని మా వీధి దేవతయెక్కువని దురాగ్రహముతో పోరాడి వ్యర్థవైరములను పరస్పర ద్వేషమును పూనియైకమత్యమును చెడఁగొట్టుకొందురు. ఒకవేళ కొందఱి దృష్టియందీశ్వరుఁడు బొత్తిగా పోవక కొంతవఱకున్నను అతఁడు స్వాభావిక స్వచ్ఛగుణములతో మాత్రము కనఁబడఁడు. మనము చూడఁదలచుకొన్న వస్తువునకును కంటికిని నడుమ దేనినైనను పెట్టుకొని చూచిన పక్షమున, చూడఁదలఁచిన వస్తువు కనఁబడినను వికారరూపముతో కనఁబడును. గాని స్వచ్ఛముగా కనఁబడదనుట యెల్లవారికి ననుభవసిద్ధమే. అదే ప్రకారముగా మన మారాధింపవలసిన యీశ్వరునికిని మనకును మధ్యవిగ్రహము లడ్డముండెనేని భగవద్గుణాదులు మనకు విపరీతరూపముతో పొడకట్టును. అందుచేతనే విగ్రహారాధకులు తమ దేవునియందు జారత్వచోరత్వాదులు సహితమారోపించి, తమగీతములయం దట్టి యపవిత్రవిషయములను కళ్యాణగుణములని చెప్పించి భక్తిపరవశులయి పాడుచు ఆహేయగుణములు తమ మనస్సుల కసహ్యములు కాకపోవుటవలన తాము వానిని సులభముగా పొంది కలలోనైనను పాపవిచారములేక యుందురు. మనుష్య నిర్మితములయిన విగ్రహములనేనమ్మి కొలుచువారికి వానిని చూచుటవలనను, ధ్యానించుట వల

నను, పూజించుటవలనను భగవద్గుణాను భవముగాని సత్యమయిన జ్ఞానముకాని నిజమయిన ప్రేమకాని కలుగనేరదని యీవరకే చూపి యున్నాను. అదిగాక యింద్రియ గోచరములగు పదార్థములను గొలుచుట యింద్రియ సుఖములకే యాశపడునట్లుచేసి, ఆధ్యాత్మికసుఖములను మఱపించి నీతిని మన్నింపకుండునట్లును జేయును. కాఁబట్టి విగ్రహారాధకులకుఁ గలిగెడు సుఖమంతయు విగ్రహముల నలంకరించుటవలనను, వానికిధూపదీపనైవేద్యాదులు సమర్పించుట వలనను, ప్రసాదము భుజించుటవలనను. పాటలు వినుటవలనను, ఇంద్రియములద్వారమున వచ్చినదేకాని మానసికారాధకులకు కలిగెడి మహత్తరమయిన యాత్మానందము వారికిలేదు. బొమ్మలకు సొమ్ములుపెట్టి, బట్టలుకట్టి, గుజ్జెనగూళ్లువండి, బొమ్మల పెండ్లిండ్లుచేసి, బొమ్మలతో నాడుకొను జ్ఞానములేని పసిబిడ్డలకు కలుగు సంతోషమువంటిదే బాలప్రాయులయిన యీవిగ్రహారాధకులకును తమ విగ్రహముల నలంకరించుటయందును, ఉత్సవములు జాతరలు చేయుట యందును, ప్రసాదము లారగించుటయందును, పాటలు పాడుటయందును ఒక విధమయిన యింద్రియసుఖము కలుగునే కాని, పరిశుద్ధభక్తితో మానసికముగా నీశ్వరధ్యానము చేసెడి వారి కెల్లయెడలను వ్యక్తమయ్యెడ యీశ్వరుని సర్వశక్తిత్వము వలనను, అపరిమితబుద్ధి సంపదవలనను, అపార కరుణాళుత్వము వలనను, హృదయములయందు పొంగిపొరలెడి యీశ్వర విషయకమయిన యమృతప్రేమయు, నిరుపమాన కృతజ్ఞతయు, నిశ్చలభక్తియు, అసాధారణగౌరవమును, పరమవిధేయతయు, దృఢ విశ్వాసమును, ఉత్తమచిత్తైకాగ్ర్యమును, అనుపమానమానసికానందమును వారికెట్లు కలుగనేర్చును? ఆధ్యాత్మికారాధనము లేనివారికి మనోజయ మెట్లుకలుగును? బాహ్యపూజవలన నింద్రియములకు తృప్తి కలుగవచ్చునుకాని యాత్మశాంతి యెట్లు కలుగును.

భగవదారాధనమువలనఁ గలుగవలసిన ఫలమంతేయుఁ బరమేశ్వరుని సంపూర్ణ గుణానుభవముపొంది, ఈశ్వరసాన్నిధ్యముచేత బాహ్యప్రపంచమును మఱచి, ఆపరిశుద్ధుని కళ్యాణగుణముల కానందపరవశత్వమునొంది, ఆ పరమదయాళుని నిశ్చలభక్తిపూర్వకముగాఁ బ్రేమించిఁ సర్వవిషయములయందును మనోవాక్కాయకర్మలచే నా పరమపితకు ప్రీతికరముగా నడుచుచు స్వప్రయోజనపరత్వమును రూపుమాపి, పరోపకారపరాయణత వహించి, ప్రాణములను శరీరములను భగవదాజ్ఞాకైంకర్యాదుల కర్పించుటయయి యుండఁగా, ఈబ్రహ్మానందము వేయియేండ్లు తలక్రిందైనను విగ్రహారాధకుల కెట్లులభింపనేర్చును? ఈశ్వరుఁడు మనలను సృజించి పెంచి కాపాడుచున్నందునను, దేహము మొదలుకొని సమస్తము మనకాయన యిచ్చినదేయైనందునను, సమస్తసుఖములను సుఖసాధనములను కల్పించినవాఁడతఁడేయైనందునను, మనమీశ్వరవిషయమున చెల్లింపవలసిన భక్తికైంకర్యాదులను చెల్లింపక యాగౌరవమున కనర్హములయిన యన్యపదార్థముల నాతనిస్థానమున కల్పించుకొని సేవించుటయేకదా విగ్రహారాధనము? అట్టి తప్పుదారివలన నిశ్చలానంద మెన్నటికిని కలుగనేరదనుట నిశ్చయము. విగ్రహారాధనములేని కాలములో విద్యచేతను నాగరికతచేతను సర్వజనసమాన్యమై మహోన్నతదశయందుండిన మనదేశము విగ్రహారాధనము వెలసినతరువాతనే యైకమత్యాభావమునుపొంది నానాటికి క్షీణించి యన్యాక్రాంతమయి తుదకిప్పటికి హీనదశకు వచ్చుటయు పశ్చిమఖండవాసులు విగ్రహారాధనమును త్యజించి మానసికారాధనము నవలంబించిన తరువాతనే తమహీనస్థితిని పోఁగొట్టుకొని దినదినక్రమమున నభివృద్ధిపొంది నాగరికాగ్రగణ్యులయి యిప్పటి మహోన్నతదశకు వచ్చుటయు, చరిత్రములయం దించుక జ్ఞానముకలవారి కందఱికిని కన్నులకు కట్టినట్లుండకపోదు. ఇట్టిసర్వానర్థదాయకమయిన యీ

విగ్రహారాధనము వలన నొక్కమతాచార్యులకుఁ దప్ప మఱియెవ్వరికి నేవిధమయిన లాభమునులేదు. వారికిది జీవనాధారముగా నుండుటచేత మతగురువు లెప్పుడును జనులను మూఢులనుగా నేయుంచి వారిని వంచించి విత్త మపహరించి కుటుంబపోషణముచేసి కొనుటకయి తమచేత నయినన్ని తంత్రములుపన్ని విగ్రహారాధనమును నిలువఁబెట్టుటకే ప్రయత్నింతురుగాని వారు స్వప్నావస్థయందును స్వలాభకరమైన దీనిని పరిశింపఁజేయుట కాలోచింపరు. ఈమతాచార్యులలో విద్యామహిమచేత నిది యయుక్తమని తెలిసియు ధనాశచేత బుద్ధిపూర్వకము గానే పామరులను మోసపుచ్చువారు కొందఱును, చిరకాలాభ్యాసము చేత నిదియుక్తమేయనుకొని నిష్కపటముగానే ప్రోత్సాహపఱుచు వారు కొందఱును ఉందురు.

ఈ యిరుతెగలవారును ప్రతిమార్చనమును నిరుత్సాహపఱుపరు. కాఁబట్టి జనక్షేమమును కోరుజనులు వారి దుర్బలహేతువులను ఖండించి వారియుక్తులకుఁదగిన సమాధానములుచెప్పి దేశమునందు మానసికారాధన మెల్లయెడలను మేలుకొనునట్లుచేసి పవిత్రమయిన యీశ్వరరాజ్య మెల్లవారల హృదయములయందును కుటుంబముల యందును స్థిరపఱుపఁ బ్రయత్నింప వలయును.

విగ్రహారాధనమును ప్రోత్సాహపఱిచెడి మహానుభావులు భక్తి ప్రధానమనియు, దేనినినమ్మి కొలిచిన నదేదైవమనియు, విగ్రహములను గొలుచుటవలన బాధకరములేదనియు చెప్పుదురుకాని వారివాక్యములు యుక్తియుక్తము లయినవికావు. కేవలభావనవలనను, నమ్మకమువలనను ప్రయోజనమేమియునుండదు.

ఒకఁడు తానురాజునని నమ్మినంతమాత్రముచేత తాను రాజగునా? దొంగను మంచివాఁడని భావించిన, వాఁడు పరిశుద్ధుఁడగునా?

అమృతమనినమ్మి విషము త్రాగినయెడల నాలుక యీడ్చుకొని పోవునట్లుచేసి ప్రాణోపద్రవము కలుగఁజేయక మన కావిషము దేహపుష్టిని కలుగఁజేసి యమృతత్వమునిచ్చునా? రజ్జువును సర్పమనుకొన్నచో దానికి ప్రాణమువచ్చి లేచి తిరుగునా? రాతిని తెప్పయని పట్టుకొన్నయెడల అది నదిని దాటింపఁగలుగునా? ఈప్రకారముగా నట్టి విశ్వాసము లౌకికకార్యములయందే పనిచేయదని స్పష్టముగా నెఱిఁగియున్నప్పుడు పారమార్థికవిషయములలోఁ గార్యకారియగునని నమ్ముటకన్న మూఢత మఱియేదియులేదు. మేలుకలుగుటకయి యెప్పుడును సత్యమయిన వస్తువులయందే యర్థవిశ్వాసముండవలెను. అట్లుగాక భ్రమచేతఁగాని యజ్ఞానముచేతఁగాని యనుచితవస్తువులయందు విశ్వాసము పుట్టినయెడల, దానివలన కీడేకలుగునుగాని మేలెన్నటికిని గలుగదు.

ఈశ్వరుఁ డన్నిటియందు నుండునుగాన దేనిని కొలిచినను దోషములేదని మఱియొక హేతువు చెప్పుదురు. దేవుడంతటను నిండియుండుట సత్యమేయయినను, సృష్టపదార్థములుమాత్ర మెప్పుడు నీశ్వరస్వరూపములుకావు. అవి యెప్పుడును ఈశ్వరునికంటె భిన్నములయియే యుండును. వెలుతురిగదిలో నంతటను నిండియున్నంతమాత్రముచేత గదిలోని బల్లలు మొదలయినవన్నియు వెలుతురే యని మతిమంతు డెవ్వఁడయిన చెప్పసాహసించునా?

ఇందలి యేబల్లనైనను చీకటిలోనికిఁ గొనిపోయిన వెలుతురు కలుగునా? ఉష్ణత మన దేహమునం దంతటను వ్యాపించియున్నను, ఉష్ణము దేహముకంటె భిన్నమయినదే యందురుగాని యెంత మందబుద్ధులయినను దేహమంతయుగాని దానిలోని యేయవయవమయినను గాని యుష్ణమని చెప్పఁగలుగుదురా? ఆలాగుననే దేవుఁడు సర్వవ్యాపియైనను, సృష్టపదార్థము లన్నియు దేవునికంటె భిన్నములని స్థూల

బుద్ధిసహితము సులభముగా గ్రహింపవచ్చును. కాఁబట్టి యీశ్వరునికి మాఱుగా దేని నారాధించినను ఆరాధింపవచ్చుననుట వెఱ్ఱిమాట. సర్వాంతర్యామియైన యాపరమాత్మనొక్కనినే మానసికముగా నారాధింపవలయును.

సర్వమును బ్రహ్మమయముగాన దేనినైనను సేవింప వచ్చునని మఱియొక కారణాభావమును చెప్పుదురు. సర్వమును బ్రహ్మమయిన పక్షమున దేనిని గొలువవలసిన యక్కఱయు లేదు. అప్పుడు కొలుచువాఁడెవ్వఁడు? కొలువఁబడు వాఁడెవ్వఁడు? ఒక్కదానిని కొలువవలెనన్నతోడనే కొలిచెడివాఁడొకఁడును కొలువఁబడు నొక్కటియు వేఱుగనుండి తీరవలెను. అప్పుడన్నియు బ్రహ్మమునకంటె భిన్నములయి యుండవలెను. అందుచేత సర్వమును బ్రహ్మమనుట సరిపడదు. ఈశ్వరోపాసకులు సర్వమును బ్రహ్మమే యనుట స్వోక్తివ్యాఘాతము. కాబట్టి దేనినైనను కొలువవచ్చునను వారి యుక్తిని తలపెట్టఁగూడదు. అద్వైతసిద్ధియయి యీశ్వరునిలో నైక్యము నొందినవా రున్నయెడల వారు తప్ప, ఆస్తికులందఱును జగత్కర్తను మానసికముగానే ధ్యానించి యానంద మనుభవింపవలెను.

ఈశ్వరజ్ఞానమును కలిగించుటకయి విగ్రహము లక్షరతుల్యములనియు, ధ్వనులను నేర్పుటకయి వర్ణములు గుఱుతులుగా నేర్పఱుపఁబడినట్లే యివియు నేర్పఱుపఁబడినవనియు, ఇంకొకయుక్తిని చెప్పుచున్నారు. అక్షరాభ్యాసమువలన లోకములో నెల్లవారును విద్యనేర్చి జ్ఞానాధికులగుచుండఁగా మనము ప్రత్యక్షముగా చూచుచున్నాము. ఆ ప్రకారముగా విగ్రహారాధనమువలన జనులు శుద్ధమయిన యీశ్వరజ్ఞానమును పొందుచుండఁగా మన మెక్కడనైనఁ జూచుచున్నామా? మన దేశములో బహుశతసంవత్సరములనుండి లెక్కలేనిజనులు యావజ్జీవమును విగ్రహారాధనము చేయుచున్నను దేవునివిషయమయి వారికెక్కువ తెలివి

కలుగుచుండఁగా మనమొకప్పుడును చూచుచుండలేదు. గనుక ముం దట్టిజ్ఞానము కలుగుననుటకును మనకాధారలేశము కనబడదు. అందుకు విరోధముగా నెల్లదేశములయందును విగ్రహారాధనము చేయువా రెప్పు డును మూఢభక్తులే యయి, కాలక్రమమున మానసికారాధముననే మూలపట్టించి సర్వజనులను విగ్రహారాధకులనుగానే చేయుచుండుట వలన, విగ్రహారాధనము భగవద్విషయక జ్ఞానమునకు సాధకము కాక పోవుటయేకాక బాధకముకూడనని స్పష్టమగుచున్నది. కాఁబట్టి విగ్ర హములచే నీశ్వరజ్ఞానాభివృద్ధిని కలుగఁజేయుదుమనుట, నిప్పుచే శైత్యము నభివృద్ధి చేయుదుమనుటయే. కాఁబట్టి యీశ్వర జ్ఞానాభివృద్ధికయి సర్వవిధములఁ ప్రతిమలను దృష్టిపథమునకు దూరము చేయవలెను.

విగ్రహములే లేకపోయినయెడల విద్యావిహీనులగు మూఢు లలో నీశ్వరజ్ఞానమే నశించుననియు, అప్పుడు వారికి పాపభయములేక పోవుననియు, అందుచేత మూఢులనిమిత్తమయి విగ్రహారాధనముండ వలెననియు, కడపటియుక్తి నింకొకదానిని చెప్పుదురు. విగ్రహములు రూపములేని యీశ్వరుని ప్రతిరూపములగుటయే సాధ్యమయినయెడల నవి యాతని రూపమునే తెలుపునుగాని గుణములను తెలుపవనియు, ఈశ్వరారాధనమున కాయన దివ్యగుణములు కావలెను. గాని రూప ముతోఁ బ్రయోజనములేదనియు, నేను ముందే చెప్పియున్నాను.

కాఁబట్టి విగ్రహములు నిరాకారుఁడయిన యీశ్వరుని రూప మును దెలుపుటకు నహితము పనికిరావు గనుక సర్వవిధములచే ప్రతి మలు కేవల నిష్ప్రయోజనములు. ఒకఁడుచేసిన విచిత్రవస్తువులను చూచుటవలన కర్తలను చూడకపోయినను కర్తయొక్క బుద్ధికుశలతను, సామర్థ్యమును, మంచితనమును, కొంతవఱకు కనిపెట్టి సంతోషింప వచ్చును. ఆలాగుననే యీశ్వరుని గుణసామర్థ్యాదులను దెలిసికొని యానందించుటకు మనకు మార్గప్రదర్శకములయిన భగవన్నిర్మిత

పదార్థములు సర్వత్ర లెక్కకు మిక్కిలిగా నిండియుండి యాయన దివ్య గుణములను. దివ్యశక్తులను సహస్రముఖముల ఘోషించుచున్నవి. ఇట్లుండఁగా నెంతటిమూఢునకును భగవంతుని తెలిసికొనుటకై మూగ విగ్రహము లావశ్యకములగునా? ప్రతిమ లక్కఱలేక యే మనము చూడని మనుష్యులయొక్క చరిత్రములను చదివియు వినియు వారి గుణస్వభావములను తెలిసికొనుచుండలేదా? హరిశ్చంద్రుని యొక్క గాని ధర్మరాజుయొక్కగాని పటముల నెప్పుడును చూడకపోయినను వారి సత్యధర్మప్రవర్తనములు వినిగాని చదివిగాని విద్యావిహీనులు సహితము వారిని ప్రేమించి, వారికాపద వచ్చిన దన్నప్పు డాయాపద తమకే వచ్చినట్టు కన్నులనీరు పెట్టుకొని పరితపించుచు, వారికి శుభము కలిగినదన్నప్పుడు తమకు మేలు కలిగినట్టు సంతోషించుచు నుండ లేదా? ఒకరిని ప్రేమించి గౌరవించుటకయి వారి సుగుణ సుచరితలు కావలెనుగాని రూప మక్కఱలేదుగదా? ఆప్రకారముగానే భగవంతుని దివ్యలక్షణాదులను వివరించెడి గ్రంథములను చదివిగాని సద్గురుముఖ మున వినిగాని యీశ్వరుని తెలిసికొని యానందింపలేనంతటి మూఢుఁ డెవఁడుండును మనకేయుపకారమును చేయక యెప్పుడో లోకాంతర గతులయిన గుణసంపన్నుల చరిత్రములను విన్నంతమాత్రముననే మనకు మనస్సులో వారియందాదరమును ప్రేమయు కలుగుచుండగా, నిత్యమును భగవంతుఁడు దయచేసిన మితిమీఱిన పదార్థములననుభ వించి సుఖించుచున్న మన మాయన సృష్టిని విమర్శించుటవలనను దివ్య గుణములను వినుటవలనను మన కాపరమాత్మునియందు భక్తియు ప్రేమయు కలుగకపోవునా?

గంభీరమయి యనంతములయిన జంతుజాలములకు నివాసమయిన మహాసముద్రమును, మనభూమికంటెను సహస్రగుణములు పెద్దవియు చిన్నవియు నయిన సూర్యచంద్ర నక్షత్రాది గోళకోటులను బంతుల

వలె ధరించిన యాకాశమును, వివిధములైన పల్లవములు పత్రములు పుష్పములు ఫలములు మొదలయినవానితో నిండియున్న వృక్షలతాగుల్మాదులచే నావరింపఁబడియున్న భూమియు, మహావృక్షములను వ్రేళ్ళతో పెల్లగింపఁగలిగిన బలముండియు మెల్లగా సోఁకి దేహముల చెమటలార్చి జీతములేని పరిచారికునివలె సేవించుచుండు వాయువును, లోకముల నన్నిటి నొక్కసారిగా దహింపఁగల శక్తియుండియు నెల్ల వస్తువులలో నడఁగియుండి చలిపాపి పచనాదికార్యములకు తోడుపడుచుండు నగ్నియు, మనకు భగవన్మహిమలను తెలుపక యీశ్వరజ్ఞానమును పోఁగొట్టి బుద్ధిమాలిన్యముకలుగఁజేయు ప్రతిమలా మన కీశ్వరసద్భావమును మహిమలను భక్తిమార్గమును ఉపదేశించునవి? విరామములేక యీశ్వర మహిమలను ఘోషించు బాహ్యవస్తువులమాటయటుండఁగా మనప్రయత్నముక్కఱలేకయే మనము నిద్రించుచున్నప్పుడును మేలుకొనియున్నప్పుడును నిరంతరమును మనసుఖాభివృద్ధికయి పనిచేయుచున్న మనదేహయంత్రమొక్కటియే మనల నీశ్వరునిచెంక కాకర్షింపుచుండలేదా? మనకద్భుతములయిన జ్ఞానేంద్రియములను దయచేసి బాహ్యప్రపంచములో మనకన్నులను తృప్తిపఱచుటకయి వివిధసుందరరూపములను, కర్ణములను తృప్తిపఱచుటకయి బహువిధ శ్రావ్యనాదములను, జిహ్వను తృప్తిపఱచుటకయి నానావిధరుచ్యపదార్థములను, ఘ్రాణమును తృప్తిపఱచుటకయి బహువిధసువాసలను, స్పర్శేంద్రియమును తృప్తిపఱచుటకయి వివిధమృదుశీతపదార్థములను, కటాక్షించిన దయాకరుఁడైన యాపరమపితయందు మనమెంత ప్రేమయు విధేయతయు కృతజ్ఞతయు కలవార మయి యుండవలెను? వానచినుకులయినను లెక్కపెట్టవచ్చునుగాని మనకీశ్వరుఁడు ప్రసాదించిన సుఖసాధనముల నెన్నికయి డశక్యమగునా? ఎంతటిమూఢులయినను తమకు మేలు చేసినవారియెడ కృతజ్ఞతను ప్రేమనుపొందుటకును,

పలినవారియెడ ప్రభుభక్తిని చూపుటకును దూరముగా నున్నను తమ జనకులకును మఱవకుండుటకును, ఎఱిఁగియుండగా వారు లోకములందు తామనుదినమును చూపుచుండెడి కృతజ్ఞతను ప్రేమను భక్తిని పర మోపకర్తయు పరమేశ్వరుఁడును పరమపితయు నయినదేవునియందు కనఁబఱచుటకు బోధించినను తామెఱుఁగకుందురా? ఎఱుఁగకుండరు. కాఁబట్టి తెలిసిన వారు సృష్టికర్తయొక్క మహిమలను మూఢుల కుప దేశించి వారిని మానసికారాధనమునకు పురికొల్పుచుండవలయును.

ఇఁక మనమందఱమును ప్రయత్నముచేసి చిరకాలమునుండి మనదేశమునకు మితిమీఱిన హాని నాపాదించుచు మూఢులతోఁగూడ పాటుగా పండితులను సహితము భగవంతుని నుండి మరలించి తమ దూ రాధనమునకు దింపి మూఢతుల్యులనుగాఁ జేసిన విగ్రహములను దూర ముగా విడిచి పరమేశ్వరుని దివ్యగుణాదులను తెలిసికొని నిజమయిన శ్రద్ధాభక్తులతో నాకరుణాళునే సేవింతముగాక! ఓకరుణాకరా! ఓదీన శరణ్యా! నాహృదయమెప్పుడును నీసేవనుండియు నీయాజ్ఞలనుండియు కొంచెమయినను తొలఁగకుండునట్లు చేసి లోకుల దాక్షిణ్యము నిమిత్త మును లోకులవలని భీతిచేతను నేనెప్పుడును ధర్మమార్గమును తొలఁగి చరింపక యెల్లపనులను నీకు ప్రీతికరముగానే చేయుచుండినట్లు నాకు బుద్ధిని ధైర్యమును ప్రసాదింపుము. స్వార్థపర్వతమును నామనస్సునందు చొరనీయక పరోపకారబుద్ధిని నిలుపుము. నిన్ను సదా తండ్రినిగాను, నీకుటుంబమయిన మానవకోటిని సోదరతుల్యముగాను భావించి ప్రేమించునట్లు కృపచేయుము.

హెండరసన్ ప్రెస్, కలర్ ప్రింటర్స్, అండ్ బాక్సు మేకర్సు రాజమండ్రి.

ఈశ్వరదత్తపుస్తకములు

By

K. VEERESALINGAM

ఈశ్వరదత్తపుస్తకములు.

ఓ మిత్రులారా!

ఐహికాముష్మికవిషయములయం దమోఘప్రమాణ మయి యీశ్వరదత్త మయిన గ్రంథ మేదియైనఁ గలదా, ఈశ్వరస్వభావమునుబట్టి యట్టిగ్రంథ ముండుట సాధ్యమా, అన్నయంశ మనేకస్థలములయందు పలుమాఱు చర్చింపఁబడుచుండఁగా వినుచున్నాము. ఈశ్వరసద్భావమునే యొప్పుకొనని నాస్తికులతో నిది యీశ్వరదత్త మయినగ్రంథ మని వాదించుట కేవలోన్మాదమే యగునుగాన, ఈ విషయ మయి యీశ్వరసద్భావము నంగీకరించెడి యాస్తికులలో మాత్రమే వాదప్రతివాదములు జరుగుట కవకాశ మున్నది. ఈశ్వరదత్తమయినగ్రంథ మున్నదనెడివారు మనుష్యబుద్ధి భ్రమప్రమాదాదులతోఁ గూడిన దనియు, మోక్షసాధనములను పూర్ణముగా తెలిసికొనుటకు తన సహజజ్ఞానము చాల దనియు నందుచేత నీశ్వరోపదిష్ట మయినగ్రంథముండుట యత్యంతావశ్యకమనియు, అమోఘప్రమాణ మయినయట్టి యలౌకికగ్రంథమే యుండనిపక్షమున జనులు తమచిత్తమువచ్చినట్లు నానావిధముల ప్రవర్తించుచు స్వేచ్ఛావిహారులయి పాడగుదురనియు, కాఁబట్టి యీశ్వరునియొక్క పరమదయాళుత్వమునుబట్టి విచారింపఁగా నీశ్వరోపదిష్ట మయినవేద ముండుట పరమసాధ్య మనియు, అందుచేతనే యట్టి పరమప్రమాణ మయినవేదము గలదనియు, చెప్పుచున్నారు. ఈశ్వరదత్త మయిన గ్రంథ ముండ దనెడువారు యుక్తాయుక్తవివేకమును బొందుటకయి యిదిమంచి యిదిచెడ్డ యని తెలిసికొనుటకుఁ దగినబుద్ధినితప్ప వేఱు సాధనములను మనుష్యుల కీశ్వరుఁడు ప్రసాదించి యుండలే దనియు,

ఏవిషయమునను సత్యజ్ఞానమును సంపాదించుటకయి లోకానుభవముతోఁగూడిన బుద్ధిమాత్రమే పరమసాధనముగా గానఁబడుచున్నదనియు, సర్వవిషయములయందును జ్ఞానాభివృద్ధి లోకములో బుద్ధియు లోకానుభవము మొదలైన వానివలననే కలుగునట్లేర్పఱిచి యీశ్వరుఁడు తా నేవిషయమునందును ప్రత్యక్షసంబంధమును కలిగించుకొనకుండుటచే నెప్పుడో యొకప్పుడుమాత్ర మట్టి సంబంధమును కలిగించుకొని యెవ్వరికో వేదము ననుగ్రహించినాఁ డని చెప్పుట యుక్తియుక్తముగా నుండ లేదనియు, తమతమ బుద్ధ్యనుసారముగాఁ బ్రవర్తింపక యేకరీతిగాఁ బ్రవర్తించుట పరమప్రమాణ మని చెప్పెడు వేదము వలనను గలుగుచుండ లేదనియు, వేదప్రమాణము నంగీకరించినవారు సహితము సత్యాసత్యనిర్ణయమునకు బుద్ధి యొక్కటియే, యుత్కృష్ట సాధన మని యొప్పుకోవలసి వచ్చుననియు వాదించుచున్నారు. అప్పుడీయుభయవాదములయందును గల సారాసారములను విమర్శింపవలసి యున్నది. బహుమతములవారు భగవద్దత్తమయిన వేదము గలదని చెప్పుటయేకాని సర్వోత్కృష్ట ప్రమాణ మయిన యాదివ్యగ్రంథ మేది యని ప్రశ్న వేసినప్పుడు మాత్రము తమలో నైకమత్యము లేక యొకరు చెప్పినవిధమున నొకరు చెప్పక హిందువులు వేద మనియు క్రైస్తవులు బైబిలనియు, మహమ్మదీయులు ఖొరా ననియు, పలువురు పలువిధములుగాఁ జెప్పుచున్నారు. ఆవఱకే వేదమును దానెఱుగక సత్యప్రియుఁడైనవాఁ డొకఁడు వచ్చి నిజమేదో దానిని గ్రహింపవలె నని త్యాసక్తుఁ డయి యడిగినప్పు డిందఱిన్నివిధములుగా జెప్పిరేని, అతఁ డెవ్వరిమాట నమ్మవచ్చును? దేవుఁ డిచ్చిన సత్యవేద మేదియైన నొక్కటియే యుండవలెనుగాని యిన్ని యుండవు గదా? వీనిలో దేనిని నమ్మవలె నని యాతఁ డడిగినప్పుడు, ప్రతిమతస్థుఁడును తనదే సత్యవేద మని సంశయింపక దృఢముగాఁ జెప్పును.

ఇందఱును తమ దొక్కటియే సత్యవేద మనియు తక్కిన వన్నియు మనుష్యకల్పితము లైన యసత్యవేదము లనియుఁ జెప్పుచున్నారే మీదొక్కటియే సత్యవేదమని నమ్మి తక్కినవాని నన్నిటిని నిరాకరించుట కేప్రబలహేతువు కలదని మరల నడిగినచో, తమపూర్వులు తమ దొక్కటియే యీశ్వరకృత మనియు సత్యవేద మనియుఁ, జెప్పియున్నారు గనుక తమ దొక్కటిదే విశ్వసింపవలసినదని యేకసమాధానమునే కదా యెల్లవారును ప్రత్యేకప్రత్యేకముగాఁ జెప్పవత్తురు. అప్పు డాతటస్థుఁడు వారి యుత్తరములతో తృప్తిపొందక యెల్లవారును తమ పూర్వులమాటనే విశ్వసింపవలయునని చెప్పుచున్నారే యిందొకరి పూర్వుల మాటను నిరాకరించి మఱియొకరి పూర్వుల మాట నంగీకరించుటకు బలవత్తర మయిన హేతు వేది గలదని యింకొక ప్రశ్న మడిగిన పక్షమున, తాను వారిసంతతివాఁ డయిన యాధిక్యమునుబట్టి తన పూర్వులమాటను మాత్రమే నమ్మవలయుననియో తన వేదమునందు విశేష ముండుటచేత పరీక్షించి చూచి విమర్శ మీఁద తనది సర్వోత్తమ మయినదని తేలును గనుక దానిని నమ్మవలయుననియో యుత్తరము చెప్పవలసి వచ్చును. విమర్శించి చూచి సత్య మయినదని సిద్ధాంతపడిన దానినే నమ్మవలసిన దని యెప్పుడు చెప్పుదురో యప్పుడు వేదముయొక్క సత్యమును నిర్ధారణము చేయుటకు సహితము బుద్ధియే యుత్కృష్ట ప్రమాణమని సిద్ధాంత మగుచున్నది. కాఁబట్టి వేదప్రమాణవాదులు సహితము సత్యాసత్యనిర్ణయమునకు బుద్ధి పరమప్రమాణమని యొప్పుకొనక తప్పదు. ఈశ్వరుఁ డెప్పు డెవ్వరికి తనయాజ్ఞల నుపదేశించినను గ్రహించువారి మనస్సుల కవిబోధపడునట్లు కదా చేయవలెను. అట్లుచేసినచో నాకాలమునందు వానిని ప్రత్యక్షముగా గ్రహించువారికిమాత్రమే యవి యీశ్వరాజ్ఞారూపమయిన ప్రత్యక్షవేదప్రమాణము లగునుగాని తక్కినవారి కవి

కేవల శబ్దప్రమాణమునకంటె నధికమయినవి కానేరవు. కాఁబట్టి సర్వశక్తుఁ డయినయీశ్వరుఁడే యెల్లవారల హృదయములకును తన యాజ్ఞలను బోధపఱుపఁ దలఁచుకొన్నపక్షమున, ఆయాజ్ఞల నెల్లవారల హృదయఫలకములయందును స్థిరముగా నుండునట్లు లిఖించును గాని యేకకాలమునందే యొక కొందఱికిమాత్రము ప్రత్యక్షముగాను గణనాతీతమయిన తక్కిన జనబాహుళ్యమున కంతకును చెప్పుడు మాటలుగాను నుండునట్లు చేయఁడు. కాఁబట్టి యీశ్వరుఁడే మానవకోటికి జ్ఞానోపదేశమును జేసెడుపక్షమున తనయుపదేశము నంతను వారి హృదయఫలకములయం దెన్నఁడును జెడని దివ్యాక్షరములతోనే కాని వేఱువిధముగా వ్రాసి యుండఁడనుట నిస్సందేహము. నే నిప్పుడు బుద్ధి యని చెప్పిన మనోగత మయిన సహజబోధ మొక్కటియే యట్టిదిగా నున్నది. సత్యాసత్యనిర్ణయసమర్థ మయి వలసినప్పు డెల్ల నెల్లవారికిని స్ఫురించుచుండెడిహృదయగత మయిన యీ దివ్యలిఖిత మొక్కటియే యీశ్వరదత్త మయినసత్యవేద మగునుగాని తదితరములు కానేరవు. ఇది సత్యవేద మగునా కాదా యని నిర్ణయము చేయుటకు సహితము మనబుద్ధి యెప్పుడు ప్రమాణ మగుచున్నదో యప్పుడే మనోగతమయిన యీ యాత్మవేదమే లిఖితవేదము లన్నిటికంటెను శ్రేష్ఠమయిన దనియు, దానిబోధకు వ్యతిరిక్తముగాఁ జెప్పెడు వేద మేదియు గ్రాహ్యము కానేర దనియు, విస్పష్ట మగుచున్నది. ఇప్పు డిందువలనఁ దేలిన పరమరహస్యము దేవుని స్వహస్తలిఖిత మని చెప్పఁదగిన యీ హృదయవేద మొక్కటియే యమోఘప్రమాణ మనియు, దీనిబోధన కనుకూలముగా నుండని బాహ్యవేదము లన్నియు నిరాకరింపఁబడవలసినవే యనియు అయి యున్నది. ఎట్లనఁగా పూర్వ మెప్పటిమాటయో విడిచిపెట్టి యిప్పుడే ప్రత్యక్షముగా నవతార రూపమునఁ గానఁబడి మహిమలను జూపుచుఁ దానే దేవుఁడ నని

తెలుపుచుండుగాని నేత్రగోచరుఁడుకాక యంతర్హితుఁడయి యుండి యశరీరవాక్కుతో మాటాడుచుండుగాని, మనలో నొక్కరియెదుట నైనను పలువురయెదుటనైనను "ఓ జనులారా! మీరు నిత్యమును దొంగతనము చేయుచుండుఁడు; అసత్యములు పలుకుచుండుఁడు; పరపీడనము చేయుచుండుఁడు; జారత్వము చేయుచుండుఁడు; భార్యలను పోషింపకుఁడు; జననీజనకులను గౌరవింపకుఁడు; దయాదాక్షిణ్యముల నవలంబింపకుఁడు; క్రూరత్వమును మానకుఁడు; ఇవియే వేదవాక్యములు; ఇవియే యీశ్వరుఁడ నయిన నా యాజ్ఞలు; ఇవియే మోక్షసాధనములు; ఇవియే యలంఘ్యధర్మములు" అని యెవ్వరైనఁ జెప్పినచో నవి యీశ్వరాజ్ఞారూపము లయిన వేదవాక్యములని మీలో మతిగలవా రెవరైన నమ్ముదురా? నిశ్చయముగా నమ్మరు. ఈశ్వరుఁడు తనమహిమలను జూపుచుఁ బ్రత్యక్షముగాఁ జెప్పుచున్నప్పుడేల నమ్మరు? అవి మన హృదయములయందు స్వాభావికముగా ముద్రింపఁబడియున్న సత్యములకు విరుద్ధముగా నున్నవనియే కదా నమ్మరు. ఆ చెప్పినమాటలను నమ్మకపోవుటయేకాక వానిని చెప్పిన వానివిషయమునఁకూడ మన మెట్టియభిప్రాయమును గలవార మగుదుము? వాఁ డెవ్వఁడో తా నీశ్వరుఁడ ననువేషము వేసికొని మనలను మోసముచేయ వచ్చినరాక్షసుఁడో పిశాచమో యయి యుండునుగాని యీశ్వరుఁ డయి యుండఁ డని మనము నిశ్చయముగా దలఁతుము, కాఁబట్టి యిందువలన నెన్నఁడో యెవ్వరికో దేవుఁడు చెప్పినాఁ డన్న వాక్యములను మాత్రమేకాక యిప్పుడు ప్రత్యక్షముగా మనకన్నుల యెదురఁ జెప్పిన వాక్యములనుసహితము మన మనస్సులయందు భగవంతునిచే విచిత్రముగా చిత్రింపఁబడి యున్న స్వభావసిద్ధము లయిన మూలసత్యములకు వ్యతిరిక్తముగా నున్నంతవఱకు విశ్వసింపరా దని నిశ్చితాభిప్రాయ మేర్పడుచున్నది. ఈరీతిగా మనబుద్ధియే సర్వమున

కను ప్రధాన మని యేర్పడుచున్నప్పుడు, ఆలోచనమీఁద మనయంత రాత్మ బోధించెడు సత్యములు మాత్రమే యీశ్వరకృతవేద మనియు, బాహ్యవేదము లనియు, సమర్థులగు మనుష్యులచే నాయాకాలాను గుణముగా రచియింపఁబడిన వనియు సిద్ధాంతము చేసికొనుట కేమి యాక్షేపణ గలదు ?

ఒక్కబుద్ధినే నమ్ముకొన్న పక్షమున బుద్ధ్యనుసారముగా నానా జనుల భిన్నాభిప్రాయములనుబట్టి భిన్నమతము లేర్పడు ననియు నమోఘప్రమాణమయిన వేద మొక్కటి యున్నపక్షమున సర్వత్ర యేకమతము వ్యాపించు ననియుఁ జెప్పనగురుగదా ? అట్టిలాభ మీ లిఖితవేదమువలనఁ గలుగుచున్నదా యన్నయంశమును గొంత విచా రింతము. ఎల్లవారును భిన్నమతావలంబకు లయి భిన్నవేదముల ననుస రించుచు, తమ దొక్కటియే సత్యవేదమని తగవులాడుచున్నారుగాని మొట్టమొదట నిదే సత్యవేదమన్న యంశములోనే యైకమత్యము కుదిరినవారుగా నుండలేదు. ఈభిన్నవేదములసంగతిని విడిచిపెట్టి యొక్కవేదమును నమ్మినవారిలోనయిన భిన్నాభిప్రాయములు లేక మతవిషయములం దైకమత్య మున్నదా యని విచారింప, అదియుఁ గానరాదు. ఒక్క క్రైస్తవమతమును బుచ్చుకొని పరీక్షించినచో తన్మతావలంబు లందఱును బైబిలునే పరమప్రమాణ మయినసత్య వేద మని యంగీకరించువారైనను వారిలోఁ బరస్పరవిరుద్ధములయిన సిద్ధాంతములును, మతశాఖలును నెన్ని యేర్పడి యున్నవో యెల్ల రును సులభముగాఁ దెలిసికోవచ్చును. ఈకాలమునందు విద్యాధిక్యము వలన నంతఃకలహము లంతగా లేకపోయినను, పూర్వకాలమునందు మతాంతరులయిన మహమ్మదీయులతోఁ బోరాడి క్రైస్తవు లెదుటి వారియొక్కయుఁ దమవారియొక్కయు వేలకొలఁది ప్రాణములకు నష్ట మెట్లు కలిగించిరో యట్లే స్వమతములోని భిన్నశాఖలవారుసహితము

స్వల్పాంశములను గూర్చి తమలోఁ దమరు పరస్పరవివాదములు పెట్టుకొని ఘోరయుద్ధములు చేసి యెంతప్రజానాశనము కలిగించుకొన్నడియు చరిత్రములు ఘోషించుచున్నవి. కత్యావేశముచేతను మతద్వేషముచేతను పరస్పరసోదరభావమును వహింపవలసిన యేకమతావలంబకు లయిన వీ రొండొరులవిషయమున జరిగించిన క్రూరకృత్యములను దలఁచుకొన్న దేహ మిప్పుడును కంప మెత్తక మానదు. అమోఘప్రమాణ మయినయొక్క వేదగ్రంథ మున్నను వీరిలో వీరి కది యైకమత్యము గలిగింపఁ గలిగినదా? అన్యోన్యవిరుద్ధము లయిన భిన్న సిద్ధాంతములను భిన్నశాఖలను పుట్టకుండ వారింపఁగలిగినదా? లేదని దృఢముగాఁ జెప్పవచ్చును. ఇందువలన లిఖితవేదమువలనఁ గలుగు నన్న యైకమత్యము దానివలనఁ గలుగుచుండ లేదని యే గదా వేదవాదులుసహిత మొప్పుకోవలసి వచ్చును. ఇతరమతములను దూరముగా నుంచి కొంతసేపు మనమతమును గూర్చియు మనవేదమును గూర్చియు విచారింతము. భరతఖండమునం దంతటను బూర్వకాలము నుండియు నొక్క వేదమునే నమ్ముచు వచ్చినవారయ్యును వారిలో నొక్కమత మొకట గాణాపత్యాది మతములు మితిమీఱి యున్నట్టును తత్తన్మతావలంబకులు పరస్పరద్వేషముతో నొండొరులతో గలహించుచుండినట్టును శంకరవిజయాదు లగుగ్రంథము లనేకములు సహస్రముఖముల ఘోషించుచున్నవి. దీనిసబట్టి చూడఁగా బూర్వకాలమునందు సహితము మనవేదము తన్ను నమ్మినవారిలో నెల్ల నేక మతమును పరస్పరభ్రాతృభావమును స్థాపింప లేకపోయిన దనుట స్పష్టమే కదా? మతమునుపేరు చెప్పి యాకాలమునందు రాజులసాహాయ్యమున జరపించిన క్రూరకృత్యములను దలఁచుకొనఁగా దేహ మిప్పుడును జలదరించుచున్నది. నిర్దోషు లయి స్వమతాభిమానసీయు లయి యుండినబౌద్ధులు మొదలగు మతాంతరులను శంకరాచార్యాదు

లగు మనపూర్వులు మానుషస్వభావమును విడిచి రాత్రిగానుగలలోఁ బెట్టి యాడించిన దారుణరాక్షసకృత్యములను విన్నమాత్రముచేత దయాలేశము కలవారి శరీరము లిప్పుడును పులకరింపకుండునా? కడచినదానిని బోనిచ్చి మన దేశముయొక్క ప్రస్తుతస్థితిని విచారింతము. మనమందఱమును నొక్కవేదమునే నమ్మినవార మయినను మనలో నైకమత్యము లేక యద్వైతము, విశిష్టాద్వైతము, ద్వైతము, అను మూఁడు ప్రధానమతములు వ్యాపించియున్నవి. అంతటితో నిలువక వీనిలో నొక్కొక్కమతమునం దనేకములైన శాఖోపశాఖ లేర్పడి యైకమత్యాభావమునకును పరస్పరద్వేషమునకును గారణము లయి యున్నవి. ఒక్క విశిష్టాద్వైతులలో రామానుజమతస్థు లనియు, రామానందులనియు, చైతన్యు లనియు, వాల్లభు లనియు, ఎన్నెన్నో శాఖలవా రున్నారు. మరల రామానుజులలో వడగళు లనియు తెంగళు లనియు ననేకోపశాఖలుగా భాగింపఁబడి యన్యోన్యకలహములతోను వివాదములతోను దూషణములతోను కాలముగడపుచున్నారు. వీరిలో వీరు మతద్వేషముచేత తగవులాడి ధర్మస్థాపనముల కెక్కినవ్యవహారములు లెక్కకు మిక్కిలిగా నున్నవి. ఈపయినిజెప్పిన మతములలోఁ జేరి నబ్రాహ్మణులలో సహిత మన్యోన్యమైత్రిమాట యటుండఁగా సంబంధబాంధవ్యములను తుదకు పంక్తిభోజనములను సహితము మానుకొని యాయా మతములవా రితరమతముల వారి ముఖావలోకనమువలననే పాపము వచ్చుననియు వారి హస్తాద్దర్శనము సంభవించినను సచేలస్నానములను భూప్రదక్షిణములను జేయవలయుననియు మతగ్రంథములలో వ్రాసియున్నారు. అనంతములుగా నున్న యిట్టి నిదర్శనములనుబట్టి చూడఁగా వేద మొక్కటినే నమ్మిన వారిలో గూడ లిఖితవేదమువలనఁ గలుగు నన్న ప్రయోజనములు కలుగుచున్నవా? ఒక్క వేదవాక్యమునకే మతాచా

ర్థ్యులు, పరస్పరవిరుద్ధములయిన విపరీతార్థములను జేసి వివాదపడుచుండఁగా, సత్యమయినవేదార్థ మిదియని సిద్ధాంతము చేయుట యెట్లు సాధ్యమగును? ఒక్క వేదమునే ప్రమాణముగాఁగొని యద్వైతులు జీవేశ్వరులకు భేదము లేదనియు, విశిష్టాద్వైతులు జీవుఁ డీశ్వరునకు లోఁబడినవాఁడై యీశ్వరానుగ్రహమువలన ముక్తి నొందుననియు, ద్వైతులు దుష్కృతజీవులకు ముక్తియే లేదనియు, సిద్ధాంతములు చేయుచుండఁగా సత్యకాములయిన వారేసిద్ధాంతమును విశ్వసింపవలసియుండును? ప్రతిమతమువారును తమసిద్ధాంతమునకు వేదప్రమాణమునే యుదాహరింతురు; వేదార్థనిర్ణయమునకు ప్రామాణికములయిన నిఘంటువులను వ్యాకరణములనే యుదాహరింతురు. ఇట్టి సందిగ్ధసమయములయందు సత్యనిశ్చయము చేయుట కిం దేయర్థము యుక్తియుక్తముగా నున్నది, యేది గుణబాహుళ్యము కలదిగా నున్నది, యేది యెంతవఱకు గ్రాహ్యముగానున్నది, అనెడు బుద్ధివిచారము తప్ప వేఱుసాధనము కానరాదు. అమోఘప్రమాణమను కొనెడి వేదమునందుఁ బరమవిశ్వాస ముంచినవారికి సహితమర్థసందేహమును, అభిప్రాయభేదమును, గలిగినప్పుడు సిద్ధాంతనిర్ణయమునకు బుద్ధి యొకటియే గతియైన ట్లింకావలనఁ బరమార్థ మేర్పడుచున్నది. ఈశ్వరోపదేశము లనుకొనెడి యమోఘప్రమాణముల నంధప్రాయముగా విశ్వసించునప్పుడును సంశయార్థములయందు సిద్ధాంతము నేర్పఱుచుకొనుటకు బుద్ధియొక్కటియే యనివార్యముగాఁ గావలసియుండఁగా, సమస్తవిషయములయందును సత్యగ్రహణమునకు బుద్ధినొక్కదానినే పరమప్రమాణమునుగాఁ జేసికొని దాని సాహాయ్యమునకయి మాత్రము పుస్తకముల నేల గ్రహించుచుండరాదు? విరుద్ధార్థములను జేయుట కవకాశము కలవియు, సందేహాస్పదములును, అయిన పుస్తకములనే పరమప్రమాణములనుగా గ్రహించి, సత్యా

సత్యనిర్ణయ సమర్థమయి యెల్లవారికిని భగవంతునిచేఁ బ్రసాదింపఁ బడిన యుత్కృష్టసాధనమయియున్న బుద్ధి నా పుస్తకముల నర్థము చేయుటకు సహాయపడుటకు మాత్రమే యేల యంగీకరింప వలెను ? ఇట్లడిగినచో మనుష్యబుద్ధి ప్రమాద సహితమయిన దనియు, భగవద్దత్తమయిన వేద మొక్కటి మాత్రమే ప్రమాద రహితముగా నుండు ననియు, కాఁబట్టి మనబుద్ధికి విపరీతములుగాఁ దోఁచిన వానిని కూడ వేదవిహితములయిన వానిని భగవంతుని బుద్ధియొక్క యమోఘత్వమును నమ్మి యపరిహార్యములుగా నంగీకరింపవలయు ననియు, ఉత్తరక చెప్పుదురు గాని యాగ్రంథము లీశ్వరదత్తములయిన వనుటకును విశ్వాసార్హములయిన నిదర్శనము లేవియుఁ జూపఁజాలరు. వారు చెప్పెడు నిదర్శనము లన్నియు రెండు విధములుగా నుండును. అందొకతరగతివి భగవదావేశముగలవారును భగవదంశసంభూతులును జూపి రన్న మహిమలుగా నున్నవి; రెండవ తరగతివి పూర్వము భగవదనుగ్రహమును బొందినవారు దీర్ఘదర్శు లయి చెప్పిన యాగామిసంగతు లన్నియు సత్యము లగుచున్న వన్న యద్భుతచర్యలుగా నున్నవి. మన మొకదానియొక్క వాస్తవము నెఱుఁగుట దాని తత్త్వవిమర్శనము వలనగాని దానిని జెప్పినవారు చూపిన యింద్రజాలమహేంద్రజాలములవలనఁ గాదు. కొలిమిలో కరఁగుచున్నసీసము మంచినీళ్ళవలె త్రాగిన మహానుభావుఁడు చెప్పె నన్నహేతువుచేత కాకులన్నియు తెల్లనివియు కొంగలన్నియు నల్లని వియు కానేర్చునా? అట్టిమహిమలను నమ్మెద మన్నను, మనవా రట్టిమహిమలను దుష్టులకును శిష్టులకునుగూడఁ గలవని చెప్పి యున్నారు. శ్రీమహావిష్ణువుయొక్క యవతారపురుషుఁడయిన శ్రీకృష్ణుల వారు గోవర్ధనగిరిని చిటికెనవ్రేలిమీఁద నిలుపుటయే గొప్పమహిమ యని మన మద్భుతపడుచుండఁగా, ఇటువంటిపర్వతసహస్రములను

వహించిన భూమండలము నంతను చాపచుట్టవలె చుట్టి మోసిన ఘోర రాక్షసుఁ డయిన హిరణ్యాక్షుని మహిమ యా దేవమహిమను సిగ్గు పఱుచుచున్నది. పుస్తకములయందు వర్ణింపఁబడిన యీమహిమ లన్నియు నేకాలమునం దయిన నిజముగా జరిగి యుండునా యన్న యంశమునుగూడ మన మిప్పుడు సందేహింపవలసి యున్నది. ఈ గ్రంథములు పుట్టినట్టియు మహిమలు చూపఁబడె నన్నట్టియు కాలము, చెప్పినదానినెల్లను విమర్శలేక నమ్మెడి సత్యకాలము. ఆకాలమునందలి యమాయకు లయినజనులు మూఢభక్తిని బట్టియు ప్రకృతిస్వభావ మును ధర్మములను చక్కఁగా నెఱుఁగ కుండుటనుబట్టియు కొంచెము చదువుకొన్న వారేది చెప్పిన దానినెల్ల సత్యమని విశ్వసించుచుండెడి వారు. అందులో మతవిషయములో మతాచార్యులు చెప్పిన దెల్ల వేదతుల్యమే యనియు గురువులను దేవసములనుగాఁ జూడవలయు ననియు వారు చెప్పినదానియం దవిశ్వాస ముంచుట యపచారమనియు బాల్యమునుండియు బోధతగిలియుండుటచేత పూర్వకాలపువారు మాత్రమే కాక విద్యాధికులయిన ఇప్పటికాలపువారు సహితము తక్కిన విషయములయం దెట్లున్నను మతవిషయములయందు ప్రత్యక్షవిరుద్ధములయిన సంగతులను సహితము మాఱుమాటాడక నమ్ముచుండుటను మనము ప్రత్యక్షముగాఁ జూచుచున్నాము. అంతేకాక యీ కాలమునందు సహిత మెక్కడనో జరిగిన యొకయల్పసంగతి కర్ణపరంపరనుండి రాఁగారాఁగా మాఱుచు వచ్చి క్రమక్రమముగా శాఖలతోను నుపశాఖలతోను పెఱిగి తుదకు క్రొత్తదగుచు వచ్చుటయు, తరువాత, వారు చూచి రనియు, వీరుచూచిరనియు నేమియు నెఱుఁగని గొప్పవార నేకులు ప్రత్యక్షసాక్షులుగాఁ గల్పింపఁబడు చుండుటయు, సామాన్యజను లా యద్భుతకల్పనలను సందేహపడక సత్యములుగా నమ్ముచుండుటయు, విమర్శకు లెవ్వరయిన శ్రమపడి శోధిం

పఁబూనినచో నాకాశమునంటిన వార్తామహావృక్షమంతయు కడపట మూఢతాకల్పితములయిన తన శాఖోపశాఖలను మహాద్భుతవృద్ధిని పొందుట్టుకొని సామాన్యమయిన చిన్న మొక్క యగుచుండుటయు మన మనేక విషయములలోఁ గనిపెట్టుచున్నాము. ఆవిరియంత్రములుగాని మంచిమార్గములుగాని తంత్రీవార్తలుగాని వృత్తాంతపత్రికలు గాని లేని యీకాలములో నాటవికుఁడొకఁడు కోఁతియొకటి పెద్దరాతి నెత్తి విసరివేయఁగాఁ జూచి కొంత పెంచి యాకథను తన మిత్రున కద్భుతకరముగాఁ జెప్పవచ్చును. ఆ మిత్రుఁ డింకొకనితోఁ జెప్పునప్పుడా తాటికాయయంత రాయియు గుమ్మడికాయయంత కావచ్చును. ఈకథ యింకొకనివద్దకుఁ బోవునప్పటి కాగుమ్మడికాయయంతరాయియు చిన్నపర్వతమంత కావచ్చును. ఈరీతిగా మఱికొందఱిచెవులు చేరునప్పటి కది నిజమయిన పర్వతమే కావచ్చును. రాయి పర్వతమంత యయినప్పుడు రాతితోఁగూడ కోఁతియు పెరుగక మానదు. ఈరీతిగా కోఁతియు రాయియు జనులనోళ్ళలో పడి పెరుగుచు రాఁగా, కట్టకడపట నా మర్కటము వెంట్రుకకు కోటికొండలను కట్టుకొని యెగురఁగల మహామహిమగలదయి దానిచరిత్రము సత్యమయిన మహాపురాణమే కావచ్చును. అప్పుడనేకులు కల్పితపురుషులును సత్యముగా నున్నవారును గూడ నా దివ్యమర్కటముయొక్క యమానుషచర్యలను జూచిన మహానుభావులయిన సాక్షులుగా మహాకవులచేఁ జేయబడుదు రనుటకు సందేహ ముండదు. తరువాతికాలపువారి కాకథ విశ్వాసార్హమయిన పురాణమగుటకును సంశయ ముండదు. ఈకాలమందు మహిమలుగా పరిగణింపఁబడెడు కథలనేకము లీప్రకారముగా బయలుదేరినవని యే నాయభిప్రాయము. ఇప్పటికాలపువారికిట్టి కథలయందలి నమ్మక మిప్పుడిప్పుడు క్రమముగాతగ్గుచున్నది.

కాఁబట్టి యీ కాలమునందే యీ మహిమలు జరుగుచున్నట్టు చెప్పఁబడిన పక్షమున, ఇప్పటివారు విన్నంతమాత్రముననే వానిని నమ్మక స్థలమునుగూర్చియు కాలమును గూర్చియు మహాత్మునితో సంబంధించిన యనేకవిషయములను గూర్చియు నెన్నెన్నో ప్రశ్నలు వేసి చెప్పినవానిని నిరుత్తరుని జేయుటయేకాక సత్యమును శోధించి కల్పించిన కథలయందలి యసందర్భములను లోకమునకు వెల్లడించి సత్యము బయలు పడునట్లు చేయక మానరు. హిరణ్యాక్షుఁడు భూమిని చాపఁగాఁ జుట్టిన కథనే యిప్పటి విద్యార్థులకడ మనము చెప్పెదుపక్షమున, భూమిని చాపవలె చుట్టుట సాధ్య మగునా యనియు, భూమిని చంకక్రింద నిముడ్చుకోఁ గలిగినవాఁ డెంతపొడు గయినవాఁడుగా నుండవలెననియు, భూమికంటె నెన్నోమడుఁగులు పొడుగయినవాఁడు భూమిమీఁద నున్న యొకపట్టణములోని యొక యింట నెట్లిమిడె ననియు, ఎక్కడ నిలుచుండి భూమిని దేనిమీఁద పెట్టి చుట్టఁగలిగె ననియు, వేయిప్రశ్నలు వేసి వారు మనకథయొక్క యసందర్భమును అవిశ్వాసనీయతను ప్రకటనచేసి మనలను పిచ్చివారిని జేసి పంపక మానరు. క్రైస్తవవేదమునందుఁ జెప్పినట్లుగా నొక మహా పురుషుని భూమధ్యసముద్రములో తిమింగిల మొకటి మ్రింగివేసి, అతనిని తనగర్భకుహరములో మూఁడుదినము లుంచుకొని, తరువాత నాతనిని సముద్రతీరమునందు ప్రాణములతో విడిచినదని చెప్పెడు పక్షమున, ఇప్పటివారు ప్రకృతిశాస్త్రజ్ఞులను రప్పించి భూమధ్యసముద్రమునందు తిమింగిలము లెప్పుడు నుండలేదనియు ఆసముద్రము యొక్క యుష్ణస్వభావమునుబట్టి శీతలప్రదేశములయం దుండఁదగిన తిమింగిలములందు వసించుట సాధ్యము కాదనియు, తిమింగిలము యొక్క కంఠద్వారము చిఱుచేపలుమాత్రము పట్టఁదగిన చిన్నరంధ్ర

మగుటచే మనుష్యుఁడు దాని కంఠములోనుండి కడుపులోనికి పోవుట యసాధ్యమనియు, చూపి యీసంగతి యసత్యమని స్థాపింపకుందురా ?

ఈశ్వరావేశముగల పూర్వకాలపు మహానుభావులు సూచించి రన్న భావికాలజ్ఞతయుఁ విమర్శించి చూచినచో నీప్రకారముగానే యుండును. పూర్వకాలపు దీర్ఘదర్శులు సూచించినవియుఁ జెప్పినట్లుగా కాలాంతరమున జరిగినవియు నయిన యద్భుతకార్యము లేవియుఁ గాన రావు. అందులోఁ గొన్ని నిజముగా జరిగిన తరువాతనే వెనుకటివారు చెప్పినట్లు పౌరాణికులు వ్రాసినవియు నయి యుండవచ్చును. మఱి కొన్ని వెనుకటివారు వ్రాసిన వాక్యముల కనేకార్థములు తీయుట కవ కాశము కలుగఁగా, నేదో యొక యర్థమును ప్రస్తుతకాలమునందు జరిగిన యొక వృత్తాంతముతో సరిపెట్టి మనపూర్వుల త్రికాలజ్ఞతను స్థాపించిన రీతివియు నయి యుండవచ్చును. సర్వజ్ఞులయిన మనపూర్వులు కలియుగమున నయిదువేలసంవత్సరములు వచ్చునప్పటికి వర్ణసాంక ర్యము కలుగుననియు ధర్మము చెడుననియు వ్రాసియుండిరనియు, వారివాక్యము లిప్పుడు సత్యము లగుచున్నవనియు, మనవారనేకులు తొంటివారి దీర్ఘదర్శిత్వమునకు దృష్టాంతముగా నుదాహరించు చుండఁగా మనము పలుమాఱు వినుచున్నాము. "గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్" అన్నయార్యోక్తినిబట్టి యీవని తలయూఁచిన నేమోకాని, సత్యమునుబట్టి విచారింపఁగా పూర్వకాలమునందే ధర్మ దేవత నాలుగుపాదములతో నడుచుచు వచ్చినందుకును, ఇప్పుడు కుంటుపడిపోయి యొంటికాలితోనే నడుచుచున్నందుకును, నాకు ప్రబల నిదర్శనము లేవియుఁ గానరావు. పురాణములనుబట్టి కృతయుగవర్తన మును విచారింపఁ బూనినపక్షమున, మనుష్యులమాట యటుండఁగా దేవతలలోనే వ్యభిచారదోషము లేనివారు కానరాకున్నారు. పూర్వము చంద్రుఁడు దేవగురుని విషయమునఁ బ్రవర్తించినట్లుగా గురుభార్యను

లేవఁదీసి యింట నుంచుకొని మగఁడు వచ్చి యడిగినప్పుడును విడువక తగవులాడువారును, పరులు ప్రార్థించి భార్యను మగని కిప్పించినమీఁదట పుట్టిన పుత్రునకయి పోరాడువారును, తగవులు తీర్చువారును, మనకాలమునందు బహిరంగముగాఁ గానరారు. ఎక్కడనైనఁ గొందఱున్నను వారిని రాజులు దోషులనుగా నెంచి శిక్షించుచున్నారు. ఇటువంటివి చెప్పఁబూనినచో నెన్నియైన నున్నవి గాని గ్రంథబాహుళ్యభయముచేత నీవిషయమును విరమించెదను.

మనపూర్వులు చూపిరన్న మహిమలును దీర్ఘదర్శిత్వమును పరీక్షకు నిలుచునవి కావనియు విమర్శచేయక విశ్వసించిన వారికి మాత్రమే విశ్వాసార్హములుగా నుండుననియుఁ జూపియున్నాను. అయినను మహిమలు మొదలయినవానినిగూర్చి గ్రంథములు వ్రాసిన పూర్వు లందఱును వంచకులనియు నసత్యవాదు లనియు నేను జెప్పను. ఆకాలస్వభావమునుబట్టి వా రసత్యములను సహితము సత్యము లనియే నమ్మియుండవచ్చును. ఆకాలపువారు సాధారణముగా నప్రత్యక్షమయిన సంగతులలో నసాధ్యచర్యలు చెప్పినను శంకింపక విశ్వసించుస్వభావము గలవారు; కాఁబట్టి గొప్పవా రుపదేశించెడు సద్ధర్మములనుబట్టి వారియెడలఁ గలిగిన గౌరవమువలన వారివిషయమయి మూర్ఖు లేమహిమలను జెప్పుచు వచ్చినను నమ్ముచుండెడివారు. కథలను నమ్ముచు వానియం దాదరాతిశయము కలిగియుండెడి ప్రపంచముయొక్క యాబాల్యదశలో జనులు సత్యములకును కల్పనలకును, ప్రత్యక్షములకును భ్రమలకును, స్వభావసిద్ధములకును స్వభావవిరుద్ధములకును భేదము నంతగాఁ గనిపెట్టఁదగిన స్థితిలో నుండువారు కారు. కాఁబట్టి మన మిప్పుడువారిని మోసగాండ్రని దూషింపక వారు చెప్పినమహిమలను విశ్వసించు విషయములో మాత్ర మత్యంత జాగరూకుల మయి యుండవలెను.

మనము ప్రత్యక్షముగా దెలిసికోఁదగియున్నంతవఱకు భగవంతుఁ డొక్కఁడను జ్ఞానమును మనుష్యులకు వారి బుద్ధిమూలమునను సృష్టిమూలమునను లోకానుభవమూలమునను దప్పఁ దాను ప్రత్యక్షమయి యుపదేశించుచున్నట్టు కానఁబడదు. ఒక్కసారి యీశ్వరుఁడు ప్రత్యక్షముగానే జనులకు జ్ఞానోపదేశమును జేయుట తటస్థించిన పక్షమున, ఆయనయొక్క పరమదయాళుత్వమునుబట్టి విచారింపఁగా నతఁడెల్లప్పుడును జనులకేల ధర్మోపదేశమును చేయుచుండరాదో చెప్పుటకు హేతువేదియుఁ గానరాదు. అతఁడు కొన్ని వేల సంవత్సరముల క్రిందట హిందూవేదమును పందొమ్మిదివందల సంవత్సరములక్రిందట క్రైస్తవవేదమును పదుమూఁడువందల సంవత్సరములక్రిందట మహామ్మదీయవేదమును వారివారి మతానుసారముగా ననుగ్రహించి యుండిన పక్షమున, మధ్యమధ్యనంతంతకాల మొకచోటనుండునట్లుగా నొక్కొక్కరికి మాత్రమే తనయుపదేశములాభమును గలుగఁజేసి తక్కినవారి కట్టిలాభమును గలుగఁజేయక వారిని సంశయాబ్ధిలో ముంచివేసి యితరులు చెప్పినమాటలనే నమ్మకొని ప్రవర్తింప వలసినవారినిగా విడిచిపెట్టునా ? సర్వజ్ఞుఁ డయిన యీశ్వరుఁడు లోకజాలముయొక్క పరిపాలనము నిమిత్తము తా నేర్పఱుచుకొన్న క్రమమును రెండుమూఁడుసారులుమాత్ర మతిక్రమించుచున్న నమ్మఁదగియుండునా ? ఏదో యొక్కగ్రంథమునే జను లందఱును విశ్వసించి దాని ప్రకారముగానే యెల్లవారును నడువవలె ననియే భగవదుద్దేశ మయిన యెడల, ఆత్మవేదమును సృష్టివేదమునుగూడ దాని కనుకూలముగా నుండి క్రమక్రమాభివృద్ధులవలన జనులందఱు వారియొక్కమార్గముననే యనుసరించువారు కారా ? అప్పు డిన్నిమతభేదము లుండుట కవకాశము గలుగునా ? మనయొక్కయు సృష్టియొక్కయు తత్త్వమును బరిశీలించి చూడఁగా మనుష్యుఁడు తన యాలోచనచేతను లోకానుభవము

చేతను వస్తుతత్త్వవిచారముచేతను మాత్రమే యెల్ల విషయములందు మనము వృద్ధి పొందవలెనని భగవదిచ్ఛ యెసట్లు కనబడుచుండ లేదా? క్షణకాలము వాదము నిమిత్త మీశ్వరుడు లిఖితవేదము నిచ్చెననియే యొప్పుకొన్నను దానిని వ్యాపింపజేయుటకయి యీశ్వరుం డేర్పఱిచినమార్గ మప్రతిహత మయినదిగా నుండదా? సర్వశక్తుం డయిన భగవంతుడు తన యిచ్ఛను లోకమున కంతకును దెలుపం దలంచుకొన్నపక్షమున, భూమండలములోని యెక్కడనో యొకమూల నొకచోట నుండెడి యొక్క మనుష్యునకుం గాని పలువురు మనుష్యు లకుం గాని తెలిపి వారిమూలమునన్నా వ్యాపింపం జేయవలెను? అనంత మయినకాలమునం దెల్లను స్థిరముగా బహులక్షయోజన విస్తీర్ణ మైన జగత్తునం దంతటను స్థాపింపవలసిన ధర్మములను ఒక్కమూల నత్యల్ప కాలము జీవించెడు కొందఱు మనుష్యుల కొక్కభాషలోం జెప్పి నానావిధభాషల వారికిని నానాదేశముల వారికిని నానాకాలముల వారి కిని బోధించు నసాధ్యపుపనిని వారికి నియమించునా? మనుష్య మాత్రులయిన రాజులుసహితము తమ శాసనములను తమ రాజ్య ములో వ్యాపింపంజేయుట కయి రాజకీయవ్యవహారపత్రికలయందు ప్రకటించియు నానాభాషలయందు భాషాంతరీకరించియు పూర్ణ ముగా లబ్ధమనోరథులు కాకుండఁగా సర్వజ్ఞుఁడును, సర్వశక్తుఁడు నయిన పరమేశ్వరుడు తనశాసనముల నెవ్వరికిని దెలియకుండ నొక్క మూలనున్న యొక్క మనుష్యున కొక్కభాషలోం జెప్పి యంతటితో తృప్తిపొందియుండు ననుటకంటె విరుద్ధము మఱియొకటి యుండునా?

ఈ విషయమయి నేనింత నొక్కి చెప్పుటచేత మనుష్యుని యభివృద్ధికి పుస్తక సాహాయ్య మక్కఱ లేనట్లు నాయభిప్రాయమని మీ రెంతమాత్రమును భ్రమింపఁగూడదు. మన యభివృద్ధికి పుస్త కము లవశ్యముగా నుండవలసిన వనియే నాయభిప్రాయము. పుస్త

కములమూలముననే కదా మనపూర్వులు తాము కష్టపడి లోకాను భవముచేత సంవత్సరములకొలఁది కృషిచేసి కూర్చిన జ్ఞానధనమంతయు మన కశ్రమలభ్యమగునట్లుగా క్షణకాలములో మనకు కొల్లబెట్టఁ గలుగుచున్నారు? స్వర్ణరజతాదిరూపముల నున్న ధనముకంటె సహస్రగుణము లధికమూల్యమయిన జ్ఞానధనమును మతిమంతుఁ డెవ్వఁడైన నిరాకరింపఁ జూచునా? జ్ఞానధన మెందున్నను మన మవశ్యముగా గ్రహింపవలసినదే. వేదమునం దున్నను, వేమనశత కమునం దున్నను, స్మృతియం దున్నను, సుమతీ శతకమునం దున్నను, బైబిలునం దున్నను, ఖొరాను నం దున్నను, మఱియెందున్నను సత్యము మన కవశ్యాదరణీయముగా నుండవలెను. మన కెంతబుద్ధియున్నను లోకానుభవమును, పుస్తకసాహాయ్యమును లేక మన మభివృద్ధిపొంద నేరము. అయినను నేను జెప్పిన దంతయు భ్రమప్రమాదాదులతోఁ గూడిన మనుష్యులచేతఁ జేయఁబడిన పుస్తకము లమోఘప్రమాణ ములుగా నుండనేరవు. కనుక వానియం దున్న సత్యములనెల్ల గ్రహిం చుచు బుద్ధ్యనుభవాదులచేత నసత్యములని తేలినవానిని నిరాకరింప వలయునని మాత్రమే. సత్యనిర్ణయముకొఱకు మనబుద్ధి నుపయోగిం పక యొకపుస్తకము నమోఘప్రమాణముగా స్వీకరింతుమేని, మన మప్పుడాలోచనను పోఁగొట్టుకొని మూఢభక్తిని మూఢవిశ్వాసము లను మూఢాచారములను బొందవలసినవార మగుదుము. కేవల పుస్తకప్రమాణము నవలంబింపక సత్యాసత్యవిచారమునందు మన యాలోచననుగూడ నుపయోగించుకొందుమేని, అప్పు డసత్యముల నెం దున్నను విడుచుచు సత్య మెం దున్నను గ్రహించుచు కేవల సత్యప్రియుల మయి జ్ఞానాభివృద్ధి బొందుచుందుము. కాఁబట్టి నీతిని గలిగించునట్టియు సత్యములను వెల్లడించునట్టియు నిజమయిన భక్తి

విశ్వాసములను వృద్ధిపఱుచునట్టియు సంగతు లెందున్నను మహాదర ముతో గ్రహించుట కయి మన మభ్యాసము చేసికోవలెను.

ఈలోకములో భగవంతుఁడు మన ప్రవర్తనమునుగూర్చి యేమియు మనకు ధర్మోపదేశమును జేయుఁడా? ఏమియుఁ దెలియకుండ మనల నెల్లకాలము నంధకారములోనే యుంచునా? యని యెవ్వరయిన నడుగవచ్చును. మీప్రశ్నల కుత్తరముగా గ్రహింపఁ దలఁపుగొన్నవారి కెల్ల భగవంతుఁ డెప్పుడును విరామము లేకుండ నుపదేశించుచున్నాఁ డనియే నేను దృఢముగాఁ జెప్పగలను. ఈశ్వరుఁడు మన కనుగ్రహించినవేదములు రెండున్నవని చెప్పవచ్చును. అవి సమస్తకాలముల యందును సమస్తప్రదేశముల యందును నవిచ్ఛిన్నములుగా నుండును. అందొకటి ప్రపంచవేదము. ఈసృష్టివేదమే పుస్తకములన్నియుఁగలిసి చెప్పఁదగినదానికంటె శతగుణములధికముగా భగవంతుని మహిమలను శక్తులను మంచితనమును దెలిసికొనఁగోరు వారి కందఱికిని మాటలు లేకయేయుందఱికిని దెలిసెడిభాషతో సదా ఘోషించుచుండును. బ్రహ్మాండము మొదలుకొని యణువు వఱకునుగల సృష్టిజాల మంతయు మీకు దేవుని మహాత్వమును దయాళుత్వమును వెల్లడించుచుండలేదా ? ఏవస్తువునుజూచిన, అది యీశ్వరుని మహత్త్వమును శక్తిని కరుణాళుత్వమును న్యాయమును బుద్ధిని ప్రేమను సహస్రముఖముల ఘోషింపకుండును ? సృష్టివర్గములోని యేపదార్థమును విమర్శించినను, అది యొక యుద్గ్రంథమై పరిశీలించిన కొలఁదిని విశేషార్థమును బోధించుచుండును. అది బోధించెడి భాష యెల్లదేశములవారికిని సమస్తకాలములవారికిని పండితపామరసామాన్యముగా బోధపడెడు విచిత్రభాషయయియున్నది. సర్వసత్యములును సర్వమతసారములును పరీక్షించిచూచువారికి సృష్టివేదము నందే యిమిడియున్నది. ఈశ్వరుఁడుమనకు ప్రసాదించిన రెండవవేదము

మాంసమయములయిన మన హృదయఫలకములయందే యీ బాలవృద్ధముగా నందఱికిని విదితమగునట్లు దివ్యాక్షరములతో లిఖింపఁబడియున్నది. దానియం దిమిడియున్న సమస్త ధర్మములును మనమేకార్యమును జేయఁ బూనినప్పుడును మన ప్రయత్న మక్కఱలేకయే కన్నులఁ గట్టినట్లుండి హితోపదేశము చేయుచుండును. ఈశ్వరదత్తములయిన యీ రెండువేదములే సమస్తసత్యములకును సమస్త ధర్మములకును సమస్త సుఖములకును మూలాధారములు. కాఁబట్టి మనమెల్ల విషయములయందును నివి యుపదేశించు సత్యములను నిరాకరింపక యాదరించుచు నిరంతరాభివృద్ధిని పొందుచుందుముగాక!

లిఖితవేదమువలన నైకమత్యము కలుగక మతభేదములును మతద్వేషములును సంభవించునని యాక్షేపించుచున్నారుగదా, వీరు చెప్పెడి హృదయస్థమయిన "యాత్మవేదమును" నమ్మి ప్రవర్తించునప్పుడు మాత్రము మనుష్యుల బుద్ధ్యనుసారముగా మఱిన్ని మతభేదము లేర్పడి మఱింత యైకమత్యముచెడి సర్వజనవిశ్వాసపాత్రములయిన కట్టుబాట్లులేక లోకము మఱింత చెడిపోదా యని వీరడుగవచ్చును. హృదయగతమైన యీ సత్యవేదము ననుసరించునప్పుడట్టి వైషమ్యములు కలుగుట కెంతమాత్రమును నవకాశముండదు. అప్పుడైకమత్యము చెడుటకు మాఱుగా బలపడి లోకము బాగుపడును. మన మనస్సులయందు రెండువిధములయిన జ్ఞానములున్నవి. అందొకవిధమైనవి యెప్పుడును మార్పును జెందక సదా యేకరీతిగా నుండునవి; రెండవవిధమైనవి కాలానుసారముగా యుక్తమయిన మార్పులను జెందుచు నభివృద్ధి కవకాశము కలిగించునవి. ఆలోచనవలనను విమర్శవలనను గలిగెడి యీ రెండవవిధమయిన జ్ఞానవిషయమున నభిప్రాయభేదము లుండవచ్చునుగాని, మనుష్యసామాన్యముయొక్క హృదయములయందెల్లను దేవుని దివ్యలిఖితములయియున్న మొదటి

విధమయిన "సత్యము పలుకవలెను. అసత్యము పలుకఁగూడదు; శమ దమ దయాదులను పూనవలెను; జారత్వచోరత్వ మాత్సర్యాదులను మానవలెను." అను నివి యాదిగాఁగల మూలతత్త్వములు మాత్ర మెప్పుడును మాఱవు. మానవహృదయములనంటి సర్వకాల సర్వావస్థలయందును మాఱక యేకరీతిగా నుండెడి యీ ప్రాథమిక సత్యములనే శాస్త్రవేత్తలు సామాన్యజ్ఞాన మనియు సహజబోధ మనియు స్వాభావికతత్త్వ మనియు వివిధ నామములతో వ్యవహరించుచున్నారు. దేవుఁడు కలఁడనియు, ఆత్మ దేహనాశము వలన నశింపదనియు, మరణానంతరము పుణ్యపాపఫలముల ననుభవించెడు పరలోకము గలదనియు, మనకుఁ గలిగెడు జ్ఞానము స్వభావసిద్ధమయిన సహజబోధమే కాని యాలోచనచేతను విమర్శచేతను లోకానుభవము చేతను గలిగినదికాదు. ఈ సహజబోధమునకు వ్యతిరిక్తముగా దేవుఁడు లేఁడనియు, ఆత్మలేదనియు, పుణ్యపాపములు లేవనియు, కొందఱు మాటలతోఁ జెప్పవచ్చునుగాని మనస్సుమాత్రము వారిమాటలతో నేకీభవింపక యెప్పుడును పయి సత్యములను స్థాపించుటకయి లోపలపోరాడుచునే యుండును. అందుచేతనే కొందఱు మరణానంతరమున పుణ్యపాపఫలానుభవము లేదని పయికిఁ జెప్పుచునేయున్నను, అట్టివారు సహితము హృదయగత మయిన సహజబోధమును తుడిచివేయలేక దానికి లోఁబడి కొన్నిపనులు చేయవచ్చుననియు కొన్నిపనులు చేయఁగూడదనియు నమ్మి యా ప్రకారమాచరించుచునే యుందురు. ఈ ప్రాథమికసత్యములు వారివారి యిచ్ఛాధీనములయి నానావిధములుగా నుండక సర్వజన సామాన్యములయి యేకవిధమయినవిగా నుండును. కాఁబట్టి యవి పండితులకును పామరులకును బాలురకును వృద్ధులకును వనవాసులకును గృహవాసులకును సర్వ మానవులకును సామాన్యధనమని చెప్పవచ్చును.

ఆత్మ నిత్యమనియు, పుణ్యపాపఫలముల నిచ్చెడు పరమేశ్వరుఁడు గలఁడనియు, మన కిప్పుడు కలిగియున్న సహజజ్ఞానము మనకు వేదమూలముననే కలిగినదనియు, వేదమే లేకపోయినయెడల మన మాముష్మికవిషయములయందు మూఢుల మయి యుందు మనియు, కొందఱు సాధింపఁజూతురుకాని యీవేదవాదులవాదము సయుక్తికమయినది కాదు. చక్కఁగా నాలోచించి చూచినపక్షమున, వేదోత్పత్తికి పూర్వమునందే యీశ్వరసద్భావాదులయందు జనులకు నమ్మకముండనియెడల వేదము లీశ్వరాజ్ఞారూపములని విశ్వసించుటయే యసాధ్యమని స్పష్టపడక మానదు. ఎట్లన- దేవుఁడున్న సంగతియే యావఱకు నిశ్చయముగా నమ్మనిపక్షమున, అవి దేవుఁ డిచ్చిన పుస్తకము లని నమ్ముట యెట్లు సాధ్య మగును? దేవుఁడు పరమకారుణికుఁ డనియు పరిశుద్ధుఁడనియు కళ్యాణగుణపరిపూర్ణుఁ డనియు నావఱకు నమ్మి యుండనియెడల, అతఁడు తనవేదమునందుఁ జెప్పిన దానినెల్లఁ జెల్లించుననియు తదుక్తఫలములను గలుగఁజేయుననియు నమ్ముట యెట్లు సాధ్య మగును? అణుమాత్రమును సాధ్యము కాదు. కాఁబట్టి వేదోత్పత్తికిఁ బూర్వమునందును మనుష్యునకు భగవద్విషయకజ్ఞానము సహజముగా నున్నదని యొప్పుకోవలసి వచ్చును. ఈసహజజ్ఞానమే మతమునకు సుస్థిరమయినపునాదిగానుండును; విమర్శ మొదలయినవానివలనఁ గలిగెడు జ్ఞానములు వృద్ధియోగ్యమయిన మతసౌధమునకు విచిత్రము లయిన యుపరిభవనములుగా నేర్పడుచుండును. అందుచేత మనము బుద్ధిని ప్రసరింపఁజేసి పరిశోధన చేసిన కొలఁదిని క్రమక్రమాభివృద్ధిని జెందును. మతము పరిశుద్ధ మయి మహోన్నత మగుచు వచ్చును. విమర్శ యెప్పుడును సహజజ్ఞానము ననుసరించియే యుండునుగాన, విమర్శించి చేసినపని స్వాభావిక మతమునకు మెఱుఁగు దెచ్చుచుండును. కాని దాని కెప్పుడును విరుద్ధ మయినదిగా నుండదు.

సహజబోధము నాధారపఱుచుకొని సత్యాసత్యవిచారము చేయుచు విమర్శించుచు వచ్చిన యెడల, మతము కాలానుగుణముగా నభివృద్ధి నొందుచుఁ బ్రకృతిశాస్త్రముల కెన్నఁడును బ్రతికూలముగా నుండకుండును. దానిని విడిచి వేదప్రమాణమునే నమ్ముకొని యుండెడి పక్షమున, మతమునకును కాలానుగుణముగాఁ బెంపు చెందుచుండు ప్రకృతిశాస్త్రములకును విరోధమును కలహమును గలిగి శాస్త్రజ్ఞుల కెల్ల మతమునం దవిశ్వాసమును నగౌరవమును గలుగుటకుఁ గారణమగును. మతమును బుద్ధికిని యుక్తికిని బాహ్యము కాకుండ నుంచుచు వచ్చెడుపక్షమున, ప్రకృతిశాస్త్రమునం దొక్కొక్క మూలతత్త్వమును కనుఁగొన్నకొలఁది మతమునం దీశ్వరునిమహిమ నొక్కొక్కదానిని కనుఁగొన్నట్లయి మతము పెంపు చెందుచుండును. దేవుని స్వహస్తలిఖితము లయిన ప్రకృతిశాస్త్రతత్త్వములకు మతసిద్ధాంతము లెప్పుడు వ్యతిరిక్తములుగా నుండునో యప్పుడు మత మడుగంటి క్రమక్రమముగా క్షీణింపక తప్పదు. కాఁబట్టి మన మంధప్రాయముగా మన పూర్వులు వేదవాక్యము లని చెప్పినవానినెల్ల నమ్మక సందేహము కలిగినప్పుడు విమర్శ చేయుచువత్తుమేని, మూఢాచారములను మూఢవిశ్వాసములను విడిచి సత్యమునుమాత్రమే గ్రహించుచుందుము. పుస్తకములకంటె మనకు సత్యమే యమూల్య మయినది. కాఁబట్టి సత్య మేపుస్తకమునందున్నను మనము దానిని గ్రహించుచుండవలెను; సత్య మేపుస్తకమునందు లేకున్నను మనము దానిని పరిత్యజించుచుండవలెను. ఇదియే మన పురోభివృద్ధికి సాధన మయినపరమార్గము.

వృద్ధికి హేతువయిన విమర్శనజ్ఞానమునం దభిప్రాయభేదములున్నను స్వాభావికమతసిద్ధాంతములయం దభిప్రాయభేద ముండదని యీవఱకే నొక్కి చెప్పి యున్నాను. కొందఱుజనులుగాని కొన్ని

జాతులవారు గాని కొన్ని దేశములవారు గాని యల్పకాల మయినను చిరకాల మయినను దురాచారదుర్మతములకు లోఁబడి యస్వాభావిక సిద్ధాంతముల నవలంబింపవచ్చును గాని యట్టి యసత్యము లెంతకాలము ప్రబలములుగానున్నను నైసర్గికసత్యములు మాత్రము మానవహృదయ ములం దెన్నఁడును మొదలంట నశింప నేరవు. మనము బుద్ధిని విమర్శజ్ఞానమును ననుసరించి ప్రవర్తించుటవలన పుస్తకములయొక్క గాని గురువులయొక్కగాని మధ్యవర్తిత్వ మక్కఱలేక మన మీశ్వ రాజ్ఞలను ప్రత్యక్షముగా గ్రహించుచు, దేవాలయములయందును దూర దేశతీర్థములయందును గాక దేవునిని మన హృదయాంతరము నందే చూచుచుందుము. ఈ సత్యములను మనము నమ్మికొని ప్రవర్తిం చెదు పక్షమున, ప్రాపంచికగురువులు మనల నొకవేళ విడనాడినను లోకగురుఁ డయిన పరమేశ్వరుఁడుమాత్రము మనలను విడిచిపెట్టక యనిర్వచనీయ మయిన యాత్మానందము నిచ్చుచుండును. కాఁబట్టి మన హృదయగత మయిన సహజబోధమునందును ప్రకృతితత్త్వముల యందును మనకుఁ బరమవిశ్వాసము కలుగునట్లును సత్య మొందున్నను గ్రహించుచు నీశ్వరాజ్ఞానుసారముగా సన్మార్గమునఁ బ్రవర్తించు నట్లును సర్వకారుణ్యుఁడైన సర్వేశ్వరుఁడు మనకు దృఢచిత్తమును ప్రసాదించునుగాక !

ఈశ్వరోపాసనము

By
K. VEERESALINGAM

ఈశ్వరోపాసనము

మనకు ప్రభువయి సృష్టికర్తయైన యీశ్వరుఁడున్నాఁడన్న నమ్మిక యెక్కడ నుండునో యక్కడనెల్ల నీశ్వరోపాసన ముండక తప్పదు. ఈప్రపంచమునందు మనుష్యులు సృజింపఁబడినది మొదలుకొని ప్రతిదేశమునందును ప్రతిజాతివారిలోను ఏదో యొకవిధమయిన యారాధన ముండుచు వచ్చినట్టు చరిత్రములు ఘోషించుచున్నవి. దీనినిబట్టి చూడఁగా తనకు ప్రభువయి తన్ను శాసించువాఁడొకఁడు పయి నున్నాఁ డనుజ్ఞానము మనుష్యున కాదికాలమునుండియు స్వాభావికముగా నున్నట్టు కానఁబడుచున్నది. స్వభావమును మార్చుట యెప్పటికిని శక్యము కాదు. అందుచేతనే యడవులలో వసించెడు జ్ఞానశూన్యులయిన యనాగరికులు మొదలుకొని పురములలో వాసముచేసెడు జ్ఞానాధికులయిన నాగరికులవఱకును సమస్తజనులును తమతమ జ్ఞానతారతమ్యములనుబట్టి దేవుని తమకు సర్వోత్కృష్ట మని తోఁచినరీతిగా భావించి తదనుగుణములయిన గుణాదుల నాతని కారోపించి ఘనతపఱిచి పూజించి, గౌరవించి యాదినుండియు తమ తెలివికి తగినట్లుగా నారాధించుచున్నారు. గృహాదులను నిర్మింప నెఱుఁగని మోటుకాలములో మనుష్యుఁడు దేవుని నరణ్యమధ్యముననో పర్వతాగ్రమునందో యారాధించుచు వచ్చెను. గృహనిర్మాణాదులను నేర్చిన పిమ్మట మనుష్యుఁడు దేవాలయములను కట్టి యందు దేవుని నారాధింప మొదలుపెట్టెను. ఈశ్వరారాధన మెప్పుడారంభ మయినదో యెవ్వరును జెప్పలేరు గాని యది మనుష్యసృష్టితోనే యారంభమయి యనాదిగా నుండియున్నదని నిర్వివాదముగా

సాధింపవచ్చును. రాజుల ప్రభుత్వము లేర్పడి వారిని కొలువనారంభించుటకు ముందుసహితము మనుష్యులలో దేవతలను పూజించుట యున్నందున కనేకనిదర్శనములు కానఁబడుచున్నవి. కొంచెము నాగరికత గలిగి తరువాత నేర్పడని కాలములో దేవతాస్తుతులు పద్యరూపముగా రచింపఁబడి పాడఁబడుచుండెను. మనలోని ఋగ్వేదములోని ఋక్కు లన్నియు నీప్రకారముగా నేర్పడినవే. ఇట్టి ఋక్కులు మొదలయినసూక్తములను పాడ నారంభించుటచేతనే సంగీత మారంభమయ్యెనని బుద్ధిమంతు లూహించుచున్నారు. సంతోషజనకమయిన యీసంగీతమునకు మాత్రమే కాక యాదికాలమునందు దేశాభివృద్ధికర మయిన నాగరికత కంతకునుగూడ మతమే కారణ మయినట్లు తెలియవచ్చుచున్నది. పూర్వకాలమునం దారంభదశలో నేదేది మహిమకలదిగా కానఁబడుచుండెనో యదియెల్ల నీశ్వరస్వరూపముగా భావింపఁబడుచుండెను. అందుచేతనే మనపూర్వ ఋషులు సూర్యుఁడు, చంద్రుఁడు, అగ్ని, వాయువు మొదలయినవానిని దేవతలనుగా భావించి వానినెల్లను ఋక్కులలో స్తుతించుచు వచ్చిరి. అటుతరువాత మఱికొంత జ్ఞానాధిక్యము కలిగినపిమ్మట నీశ్వరునకు సూర్యచంద్రులు నేత్రములుగాను, వాయువు లూర్పులుగాను, మహత్తరము లయిన యనేకపదార్థము లితరావయవములుగాను వర్ణించుచు వచ్చిరి. జ్ఞానాభివృద్ధి యయినకొలఁదిని జనులలో నీప్రకారముగా నీశ్వరవిషయకము లయిన పూర్వాభిప్రాయములు మాఱిపోయి నూతనాభిప్రాయము లేర్పడఁ జొచ్చినవి. నాగరికతయొక్కయు విద్యయొక్కయు నభివృద్ధితోఁ గూడ జనులలో నీశ్వరమహిమలును వర్ధిల్లసాగినవి. మొట్టమొదట దేవతలుగానో దేవుని యవయవములుగానో యుండిన సూర్యాగ్నిచంద్రాదు లన్నియు విద్యాభివృద్ధియయిన యీ కాలములో

తమ దేవత్వమును పోఁగొట్టుకొని దేవుని మహిమలను వెల్ల డించెడు సృష్టిపదార్థము లయిపోయినవి. మూఢదశలో జనులను తమ్మును తమ గ్రామమును మాత్రము పాలించెడు గృహదేవతగానో గ్రామదేవతగానో తోఁచెడి యీశ్వరుఁడు జ్ఞానదశలో నిప్పుడు సమస్తలోకములను పాలించెడు సర్వేశ్వరుఁడయి యున్నాఁడు. సూర్యచంద్రాదులు తాము దేవతలుగా భావింపఁబడిన కాలమునకంటెను ప్రకృతిశాస్త్రజ్ఞాన మధిక మయిన యీకాలమునం దధికమహత్త్వముకలవిగా తెలియఁబడి దేవత్వ మక్కఱలేకయే యీ సూర్యుఁడును, చంద్రుఁడును, భూమియు, ఆకాశమును, అగ్నియు, వాయువును, జలమును, వృక్షములును సమస్తపదార్థములును దేవదూతలవలె దేవునిమహిమలను వాక్కులేకయే జనులహృదముల కెక్కునట్లు మఱింతవిశేషముగా బోధించుచున్నవి. ఒక్కసూర్యచంద్రాదులయందు మాత్రమేకాక ప్రకృతిశాస్త్రజ్ఞానమువలన మన మిప్పుడు స్థూలములును సూక్ష్మములు నైన సమస్త పదార్థముల యందును మనపూర్వు లెప్పుడును చూడని మహిమలను కనిపెట్టి యీశ్వరశక్తి కద్భుతపడి యానందింపఁగలుగుచున్నాము. మునుపు వట్టిగాలిగాను, నీరుగాను, ఉండెడుపదార్థము లిప్పుడు తమలో నీశ్వరుఁ డమర్చియుంచిన క్రొత్తక్రొత్త యుపయోగములను క్రమముగా నొక్కొక్కటినే బయలఁబెట్టుచు యంత్రాదులను నడుపుచు మనసుఖ సంతోషాదులను వృద్ధిపఱచుటకును శ్రమలను తగ్గించుటకును సాధనము లయి యీశ్వరుని యద్భుతమహిమను శక్తిని బుద్ధిని కరుణాళుత్వమును సదుద్దేశమును సహస్రముఖముల ఘోషించుచున్నవి. ఈప్రకారముగా భగవంతుని తెలిసికొనుటకు సాధనము లంతకంత

దిని జను లెక్కువగా బ్రహ్మానందము ననుభవింపఁ గలుగుచున్నారు. తత్త్వవిచారము చేసినకొలఁదిని సర్వాంతర్యామి యైన యీతని మహిమ దరిలేని సాగరమువలె పెరుగుచున్నది. ఇట్లున్నను తెలివి యెక్కువయిన యీకాలములో కొంద ఱీశ్వరుని దూషింపను వచ్చును; కొంద ఱీశ్వరసద్భావమునే శంకించి హేతుకల్పనము చేయను వచ్చును; కొందఱు నాస్తికులు కాను వచ్చును; కాని జనసామాన్యము యొక్క హృదయక్షేత్రములనుండి స్వభావసిద్ధ మయిన యీశ్వర విశ్వాసబీజమును పెల్లగించివేయుటమాత్ర మెన్నటికిని సాధ్యముకాదు.

పూర్వకాలమునం దిప్పటికంటె జనులలో మూఢవిశ్వాసమును మూఢభక్తియు నెక్కువగా నున్నను, అది స్వప్రయోజనపరత్వముచే వచ్చిన దగుటచేత వారిభక్తి శ్రేష్ఠ మయినదని నేను చెప్పఁజాలను. అజ్ఞాన మెక్కువగానున్న కాలములో స్వప్రయోజనపరత్వమును భీతియు హెచ్చుగా నుండకతప్పవు. అజ్ఞానికిని జ్ఞానికిని గలభేదమంతయు 'స్వార్థపరత్వము' 'పరార్థపరత్వము' అను రెండుపదములలో నేవిస్తారము గానున్నదని చెప్పవచ్చును. జనుఁడెంత స్వప్రయోజనపరుఁడుగానుండునో యంత యజ్ఞానియు, ఎంత పరార్థపరుఁడుగా నుండునో యంత జ్ఞానియు అగుచున్నాఁడు, కాఁబట్టి భయముచేతను స్వప్రయోజనపరత్వముచేతను గలిగిన యీ కాలపు దేవతారాధన మంతగా పరిశుద్ధ మయినదిగా నుండనేరదు. ఆకాలమునందు మనుష్యున కెక్కడఁ జూచినను కష్టము లధికము కాఁగా, పాపములు మనస్సును బాధింపఁగా, శత్రువులు మాత్రమే కాక జలాగ్నిమారుతాద్యద్భుతపదార్థములుకూడ నష్టముల నాపాదించి మనస్సులకు వెఱగు కొల్పి భయపెట్టఁగా, భయముకలిగి యపాయమును తప్పించుకొనుటకు సాధనాంతరము లేక దేవుని కోపమును శాంతపఱచి యనుగ్రహమును సంపాదించుట కయి యీశ్వరా

రాధన మారంభ మయినది. ఆదికాలమునం దీశ్వరప్రార్థనముయొక్క యుద్దేశ మింతే. అందుచేత నప్పటి యారాధన మాడంబరము లయిన పూజలతోను, హోమములతోను, కానుకలతోను, బలులతోను, ఉత్సవములతోను, స్తోత్రపాఠములతోను మాత్రము నిండి యుండెను. ఈ హేతువుచేతనే యప్పటి ప్రార్థనలన్నియు తమ్మును తమవారిని దీర్ఘాయుష్మంతులనుగాను సుఖులనుగాను జేసి కాపాడుటకొఱకును, సంపదల నిచ్చుటకొఱకును, సంతానము నిచ్చుటకొఱకును, శత్రువులను నాశనము చేయుటకొఱకును, ఉద్దేశించి చేయఁబడినవిగా నుండినవే కాని మనశ్శుద్ధినిమిత్తమును, సత్ప్రవర్తనమునిమిత్తమును, పరోపకారమునిమిత్తమును అంతగా నుద్దేశింపఁబడియుండలేదు. మనయుధర్వణవేదమునందు శత్రుసంహారాదుల నిమిత్తమయి యుద్దేశింపఁబడిన మంత్రము లనేకము లుండుటయే యిందుకు దృష్టాంతముగాఁ జెప్పవచ్చును.

ఇఁకను పూర్వకాలచరిత్రమును కట్టిపెట్టి మానవయోగ్యమయిన యీశ్వరోపాసనమును గూర్చి కొంత యోచింతము. ఈశ్వరోపాసనము స్తోత్రము, వందనము, ధ్యానము, అనుతాపము, ప్రార్థన మొదలయిన యనేకాంగములను కలదిగా నుండును. ఈశ్వరునియొక్క కళ్యాణగుణాదులను తలఁచుకొని మన భక్తిశ్రద్ధలను తెలుపుట స్తోత్రము. మనలను మనకుఁ గావలసిన సమస్తపదార్థములను సృజియించి మనకు నిత్యమును సమస్తసౌఖ్యములను గలుగఁ జేయుచున్న యీశ్వరుని యపారకరుణను మనస్సునందు నిలిపి మనకృతజ్ఞతను దెలుపుట వందనము. ఈశ్వరునియొక్క యనంతకళ్యాణగుణములను చింతించి, అతని సాన్నిధ్యమును జ్ఞాననేత్రముచే దర్శింప యత్నించుట ధ్యానము. ఈశ్వరవిషయముననను, ఈశ్వర కుటుంబమైన జనుల విష

యమునను, మనము చేసిన యపచారములను అపరాధములను తలఁచు
కొని మనసునొవ్వ పరితాపపడుట అనుతాపము. మనలను పాపకార్య
ములనుండి తొలఁగించుటకును, సత్కార్యములను జేయుటకయి
ధైర్యము నిచ్చుటకును, ఆత్మశాంతిని పారిశుద్ధ్యమును ప్రసాదించు
టకును, వినయపూర్వకముగా నీశ్వరుని వేఁడుట ప్రార్థన. ఈశ్వరో
పాసనమునం దీయంగములన్నియు కాలానుగుణ్యముగాను రసోచితము
గాను కొంచెముగానో, గొప్పగానో చేరియుండవలెను. ఇట్టియుపాస
నముయొక్క ఫలము మన కీశ్వరునియందు నిశ్చలమైనభక్తి కుదిరి,
ఈశ్వరుఁడుచేసిన మేలునకయి నిష్కపటమయిన కృతజ్ఞత దృఢపడి,
ధ్యానముచే పరమేశ్వరసాన్నిధ్యానుభవము కలిగి, మనస్సులు పాప
బంధములనుండి విడివడి పరిశుద్ధములయి నిత్యానందము నొందుట.
ఇట్టిఫల మొక్కమానసికారాధనమువలననేకాని విగ్రహారాధనాదుల
వలనఁ గలుగనేరదు. ప్రాణములేని దారుశిలామయవిగ్రహాదులను
పూజించుచుండుటవలన బాలురకు బొమ్మలాటయందువలె నజ్ఞాను
లయిన ముదిబాలుర కొకవిధముగా కాలక్షేప మయినను, సర్వేశ్వరుని
మానసికముగా నారాధించువారికివలె దానివలన నవ్యాజప్రేమయు,
నిజమయిన భక్తివిధేయతలును, నిర్మలానందమును కలుగవు. అంతే
కాక ప్రతిమార్చనము దేవునియనంతమహిమ నంతను పోఁగొట్టి
యాతనిని సామాన్యమనుష్యునిస్థితికిఁ దెచ్చి జగదీశ్వరునకు బట్టలు
లేవని వస్త్రములు సమర్పించునట్లును, తిండి లేదని ప్రసాదనివేదనము
చేయునట్లును, భార్య కావలసిన ట్లేటేట కళ్యాణోత్సవము చేయున
ట్లును, భూతహింస కోరునట్లు జంతుబలు లిచ్చునట్లును చేయును.
చేసినపాపములకయి పరితాపపడి దుఃఖించునప్పుడు కలిగెడు కన్నీటి
ధారలే జలాభిషేకములును, అపరిశుద్ధలయిన కోరికలను విడు

చుటయే బలులును, సత్ప్రవర్తనము కలిగి యీశ్వరాజ్ఞాబద్ధుఁడయి యుండుటయే యుపహారసమర్పణమును, వినయముతోను ప్రేమతోను కృతజ్ఞతతోను పూర్ణభక్తిశ్రద్ధలను తెలుపుటయే పూజయును, ఆత్మల నీశ్వరార్పణముచేసి మనుష్యులను సోదరభావముతోఁ జూచుచు పరోపకారమునందు సుఖించుటయే యారాధనమును, అగునుగాని యితరవిధములయిన యర్చన లేవియు భగవత్ప్రీతికరము లయినవి కావు. కాఁబట్టి బుద్ధిమంతు లయినవారందఱును ప్రతిమార్చనమును ముందుగా మాని యీశ్వరమహిమలను విగ్రహములయందుఁ గాక సృష్టియందుఁ జూడ యత్నింపవలెను. భగవన్మహిమలు సృష్టికర్త చేసిన సూర్యచంద్రాదిదివ్యపదార్థములవలనఁగాక మనుష్యుఁడు చేసిన విగ్రహాదులవలన వెల్లడి యగునా? పరమాత్ముఁడు స్వయముగాఁ జేసిన విచిత్రములయిన సూర్యచంద్రాదిగోళములయందును, అపార సాగరములోను, విశాలభూమండలముమీఁదను గల చేతనాచేతనము లయిన సమస్తవస్తుజాలమునందును, పరిశీలించినకొలఁదిని దేవుని మహిమ లనంతములై కానఁబడు చుండలేదా!

మన మీశ్వరుని యెడల నడుచుకోవలసిన ధర్మములను తెలుపునది మత మనఁబడును. లవణము లేనిదే యేవస్తువులకును రుచి యెట్లు రాదో యట్లే యుపాసన లేనిదే యేమతమునకును శోభ రాదు. ఉపాసనయే మతమున కెల్లను ప్రాణము; ఉపాసన లేనిమతము ప్రాణములేని బొందివంటిది. అట్లగుటవలన లోకములో నీశ్వరోపాసనము లేని మత ముండదు. ఉపాసనాపాశమే మనల నీశ్వరునితో బంధించునది; అట్టియుపాసనలేనిగృహము శూన్యగృహము; ఈశ్వరుని స్మరింపని హృదయము శూన్యహృదయము; ఈశ్వరోపాసనము చేయనియెడల మనజన్మము నిరర్థకము. ధర్మైకనిధియైన

యీశ్వరుని విడిచి మన మెట్లు ధార్మికుల మగుదుము? కళ్యాణగుణా కరుడయిన యీశ్వరుని విడిచి మన మెట్లు సాధువులము కాఁగ లము? నేటినుండి యైనను నిత్యమును మన మాతని నారాధించుచు భగవద్గుణానుభవము వలన నానందపారవశ్యము నొందుచు పవిత్ర మయిన నూతనజీవమును బొందఁ బ్రయత్నింతముగాక!

మనము దుర్బలుల మనియు పరతంత్రుల మనియు కార్యసా ధనమునకు మన శక్తి యొక్కటియు చాల దనియే మన కనుభవ మగుటచేతనే, సమస్తవస్తుప్రలును, సర్వజంతువులును, సర్వశక్తుఁడును, సర్వరక్షకుఁడును, సర్వకారుణ్యుఁడును, సర్వజ్ఞుఁడు నయిన యీశ్వరుని పాల నమునకు లోఁబడి యున్నవని మనము విశ్వసించుటచేతను, ప్రార్థన యావశ్యక మయినది. అందుచేతనే యెల్లవారును తాము కోరినకోరి కల నన్నిఁటిని పరమేశ్వరుఁడు ప్రసాదించునా యన్న విచారము లేక స్వభావముచేతనే యీశ్వరప్రార్థనను చేయుచున్నారు. మన జన్మ మునకును, స్థితికిని, సుఖమునకును, సంతోషమునకును, సమస్తమునకును, ఆధారుఁడయియున్నవానిని దినమున కొకసారియైనను తలఁచు కొనకుండుటకంటెను, కృతజ్ఞతను గౌరవయును తెలుపకుండుటకంటెను కృతఘ్నత మఱి యేముండును? ఎవ్వని యనుగ్రహము లేక మనము క్షణకాల మయినను సుఖించుటకు శక్తులము కాకుందుమో, ఎవ్వఁడు మనకు పుత్రవాత్సల్యముతో సుఖసంతోషములను కలుగఁ జేయుచున్నాఁడో, ఎవ్వఁడు మన ప్రాణమిత్రులకంటెను పరమ మిత్రుఁడయి మన యాప్తబంధువుల కంటెను పరమబంధువయి న్యాయప్రభులకంటెను నుత్తమప్రభువయి నిరంతరమును రక్షించుచు న్నాఁడో, అటువంటి తండ్రుల కెల్లను తండ్రియు ప్రభువుల కెల్లను ప్రభువును న్యాయదాతల కెల్లను న్యాయప్రదాతయు రక్షకుల కెల్లను

రక్షకుఁడును నయిన యీశ్వరునితో నుపాసనమూలమున దినమున కొక్క నిమిషమయినను సంబంధమును కలిగించుకొనకుండుటకంటె బుద్ధిహీనతయు దుర్మార్గమును మఱియేమి యుండును ? ఏమియు నుండదు. ఈశ్వరుఁ డున్నాఁడని మన మెప్పుడు నమ్మి మనకతఁడు ప్రభువని యెప్పుడు తలఁప నారంభింతుమో యప్పుడే యుపాసన యారంభ మగును. మనకు ప్రభువయి మనలను శాసించుటకును పాలించు టకును సుఖులనుగాఁ జేయుటకును సమర్థుఁడయిన వానియెడల మనము భక్తి నెట్లు కనఁబఱుపకుండఁగలము ? ఈశ్వరుని నమ్మిన తరు వాత భక్తితో నారాధింపకుండుట మానుషస్వభావమే కాదు. ఈశ్వరుని మహిమలను మన మెంత యెక్కువగా తెలిసికొందుమో యీశ్వరునియందు మన కంతభక్తి హెచ్చును. ఆయన సర్వశక్తుఁ డని తెలిసినతరువాత గౌరవము కలుగక మానదు. పరిశుద్ధుఁడని తెలి సిన తరువాత ప్రేమ కలుగకమానదు ; సర్వకారుణ్యుఁ డని తెలి సిన తరువాత కృతజ్ఞత కలుగక మానదు; సర్వరక్షకుఁడని తెలిసిన తరువాత విధేయత కలుగక మానదు. ఇవి యన్నియు మనకు సహజ ధర్మములు కాఁబట్టి యీశ్వరోపాసనము మనకు సహజకృత్యమే కాని యందు విరుద్ధమయినదేదియు లేదు. మితజ్ఞుఁడు సర్వజ్ఞుని భక్తిపూర్వకముగా వేఁడుకొనుటకంటెను, అల్పశక్తుఁడు సర్వశక్తుని సవినయముగా శరణొందుట కంటెను, యుక్తమయినపని మఱియేమి యుండును ? మనల సృజించినవాఁడే మనలను బ్రతికించువాఁడును పాలించువాఁడునునయి యున్నప్పుడు మనలను పుట్టించినవానియెడల ప్రేమను మనలను రక్షించువానియెడల కృతజ్ఞతను మనలను పాలించు వానియెడల భక్తిని కనఁబఱిచి స్తుతించుటకంటెను న్యాయమయిన పని మఱియేముండును ? మేలుచేసినవారియెడల కృతజ్ఞతను ప్రేమను

గలవారమగునట్లుగా మనము సృజింపఁబడి యున్నందున, కృతజ్ఞతతో ప్రార్థించుట మనకు సహజగుణమయి యున్నది. ఈగుణమును మనము మనుష్యులమయి యున్నంతకాల మెట్లుమఱల్చుకొఁగలము? ఈశ్వరుఁడు ప్రసాదించిన మితిమీఱిన సౌఖ్యముల ననుభవించుచునే యతనిని మఱచుటను, మనకుపకారియైన వారియెడల కృతజ్ఞతను భక్తిని విశ్వాసమును విడుచుటకును, మనము మనుష్యస్వభావమును త్యజించి మృగస్వభావమును భజించి పశుప్రాయులముగా మాఱవలెను. అట్టి యస్వాభావికధర్మము నవలంబించుటవలన మన మనస్సులకు నిరుత్సాహమును వ్యసనమును పరితాపమును దక్క మఱియేమి కలుగును? కాఁబట్టి మనకాయన చేసిన యనంతములైన మేళ్ళనిమిత్తమయి కృతజ్ఞత నెట్లు తెలుపకుండఁ యుండగలుగుదుము? అజ్ఞానులమై తనయాజ్ఞలను మనము నిత్యమును మీఱి పాపులమగుచున్నను మనలను విడువక పతితపావనుఁడైన యాకరుణానిధి మనకు సుఖసాధనములను పుత్రవాత్సల్యముతో ప్రసాదించుచునే యున్నాఁడు గదా! ఆయన యనుగ్రహము వలననే మనముధరించిన యీదేహములను, తినెడి యాహారమును, త్రాగెడినీరును, శ్వాసించెడు వాయువును, ఉత్సాహము కలిగించెడు తేజస్సును, సుఖదాయకములయిన సమస్తపదార్థములును కలిగినవి. ఎవ్వని కరుణ లేక మన యాత్మలును దేహములును క్షణకాలమయినను సుఖముగా నుండనేరవో యటువంటి దీనవత్సలుని దినమున కొకసారి యైనను కృతజ్ఞతతో తలచుకొనక మనమెట్లు సుఖపడఁగలము? సంసారయాత్రలో ప్రతిదినమును మనలనుజేరి బాధించెడు కష్టములను దుఃఖములను ధ్యానమూలమున మన మా ప్రణతార్తిహారుని చెంతఁజేరి యాతనిప్రాపు చెందక యెట్లు నిర్జింపఁ గలుగుదుము? కాఁబట్టి ప్రార్థ

నకు ముందు పరిశుద్ధచింత గలవారమయి ధ్యానముచే మన యీశ్వరుని మనహృదయపీఠమునం దధిష్ఠింపఁ జేసి యాతని సాన్నిధ్యమును దప్ప మన మన్యమును మఱచి మనతలఁపు లన్నియు నీశ్వరునియందే నిలుచునట్లు చేయవలెను.

అట్టిసమయమునం దాయన కళ్యాణగుణముల నన్నిఁటిని మన మనస్సులో నిలుపుకొని యాతనికిని మనకునుగల సంబంధమును దలంచుకొని మన మనస్సుల నాతనియందు లయింపఁజేసి యానందింపవలెను. ఇట్టి దొకఁటియే నిజమయినధ్యానము. పరిశుద్ధత, కరుణాభుత్వము మొదలయిన యీశ్వరగుణములను స్మరించుటచేత కొంతవఱకు మనకట్టి గుణములు పట్టువడి మనము పరిశుద్ధులమును దయగలవారమును అగుదుము. మనము తెలిసికొఁగలిగినంతవఱ కాయన కళ్యాణగుణముల నన్నింటిని మనస్సుచేతఁ జూచుచు ధ్యానించుటచేత మన కాతనియం దద్భుతప్రేమయు భక్తియు విశ్వాసమును కృతజ్ఞతయు విధేయతయుఁ గలుగును. ఆయనయొక్క సత్యాదులయిన గుణములను వేఱువేఱుగా స్మరించుట మన కాతనితోడి నూతన బంధుత్వమును కల్పించి నూతనప్రేమను పుట్టించి నూతనానందమును గలిగించి, మనకు పరిశుద్ధమయిన నూతనజీవనమును ప్రసాదించును. అందువలన మనకు మనశ్శాంతియు నపారానందమును గలుగును. కాఁబట్టి యీశ్వరునియొక్క సమస్తకళ్యాణగుణములను స్మరించుచుండుట కర్తవ్యము. అట్లు చేయక యాయనకారుణ్యమును ప్రసన్నతను మాత్రమే మనము తలఁచుచుందుమేని సద్వర్తన మక్కఱలేక యొక్కభక్తి వలననే పాపపరిహారమునుపొంది ముక్తులమగుదుమని భావించి చెడుదుము; ఆయన పరిశుద్ధతను న్యాయమును మాత్రమే తలంచుచుందుమేని ఈశ్వరుని ప్రేమతో సమీపించుటకు భయపడుచు

నాతనిని క్రూరముగా శిక్షించు దయాదాక్షిణ్యములులేని కఠినచిత్తునిగా భావించి భయభ్రాంతుల మగుదుము; ఆయనసర్వజ్ఞతను సర్వశక్త్యాదులను తలపకుందుమేని, ఆయన మహిమను పూర్ణముగా తెలిసికోలేక యీశ్వరుని నించుమించుగా మనతో సమానునిగా భావించి మూఢుల మగుదుము. కాఁబట్టి యిట్టి చెడుగులేవియు కలుగకుండుటకై యీశ్వరుని కళ్యాణగుణానుభవమును మనము సాధ్యమయినంత పూర్ణముగా పొందుటకయి ప్రయత్నింపవలెను; అట్లు చేయనిచో మనము భగవన్మహిమను చక్కఁగా తెలిసికొని నిజమయిన లాభమును పొందుటకు శక్తులముగాక మూఢభక్తి కలవారమయి చెడిపోదుము. ఈశ్వరగుణములను స్మరించునప్పుడు మనఃపూర్తిగా తద్గుణానుభవమును పొందవలెనుగాని యది లేని వట్టిమాటలతో ప్రయోజనము లేదు. ఈశ్వరగుణానుభవము లేని కర్మలును, తంత్రములును, పూజలును, ఉత్సవములును, పరిహాసపాత్రములయి మూఢతాజనకము లగును. మూఢభక్తివలన సుగుణము లన్నియు హృదయకుహరము నుండి క్రమక్రమముగా తొలఁగి పోయి హృదయము నీతిశూన్యమగును. మనస్సీశ్వరునియందు లేక నోటితో భగవద్గుణాదులను స్మరించుట యర్థము తెలియనిమాటలను మంత్రములను పఠించుటవంటిదే కాని యంతకంటె ప్రయోజనకర మయినదికాదు. భగవంతుని సర్వశక్త్యాదులను దెలిసికొని యారాధించుట యాయనయెడల భయభక్తులకు పొందుటకుఁ గాని యూరక యద్భుతపడుట కొఱకుగాదు; ఆయనను సర్వకారుణ్యునిగా నారాధించుట మన మాయనయెడ కృతజ్ఞతను ప్రేమను పొందుటకుఁగాని యాయన ప్రేమానిధియనియు కరుణాళుఁ డనియు తెలిసికొని సంతోషపడుటకొఱకుఁ గాదు; ఆయనను పరిశుద్ధునిగా నారాధించుట ప్రవర్తనము చక్క

చేసికొని మనము పరిశుద్ధుల మగుటకుఁగాని యాయన పరిశుద్ధత కాశ్చర్యపడుటకొఱకుఁగాదు.

ఈశ్వరోపాసనమునుగూర్చి యింతవఱకును సామాన్యముగాఁ జెప్పియున్నాను. ఉపాసనలో ప్రధానాంగము ప్రార్థన. దానినిగూర్చి విశేషముగాఁ జెప్పవలసియున్నది; ప్రార్థన యనఁగా మన కున్నలోపములను తొలఁగించుటకుఁగాని కావలసిన వానిని ప్రసాదించుటకుఁగాని వేఁడుకొనుట. ఈ ప్రపంచములో మన కనేకలోపములుండును. అనేకదుఃఖములు వచ్చును; అనేకప్రతిబంధములు కలుగును. వాని నన్నిఁటిని మన కృషిచేత నివారించుకొనుటకు మనము శక్తులము గాము. అందుచేత మన మసహాయులమయి యున్నామనుట స్పష్టము. కాఁబట్టి యాత్మసంరక్షణార్థము మన మీశ్వరుని వేఁడుట యనివార్యమగుచున్నది. మంచికార్యములు చేయుటకు శక్తిని ధైర్యమును కలిగించు నిమిత్తము వేఁడుకొనవలయును; చెడుకార్యములమీఁది కిడ్చెడి యింద్రియములను నిగ్రహించుట కయి సామర్థ్యమును కలిగించు నిమిత్తము వేఁడుకొనవలయును; మనము చేసిన పాపములను క్షమించి సుఖము కలిగించు నిమిత్తమయి వేఁడుకొనవలయును. ఈశ్వరుఁడు సమస్తపదార్థములను సృజించి సమస్తమును కాపాడువాఁడయినందునను, ఈశ్వరాజ్ఞకు భిన్నముగా నేకార్యమును జరుగనేరనందునను, ఆయన రక్షణమును కోరుటయు, ఆపదలయం దాయనను శరణుచొచ్చుటయు, సత్కార్యనిర్వాహణము నం దాయన సాయమును వేఁడుటయు సుఖకాలమునం దాయనను కృతజ్ఞతతో స్మరించుటయు, మనకు ప్రియులుగా నుండువారిని కాపాడ ప్రార్థించుటయు, మనుష్యునకు సహజగుణమయి యున్నది. మన హృదయములనుండి స్వాభావికముగా బయలువెడలి వచ్చెడు యనివార్యమయిన యిచ్ఛను మర

లించుకోలేని వారమయి వినమ్రులమయి మన కోరికలను దెలిపి మన మీశ్వరుని భక్తితో ప్రార్థింతుము. ఈ స్వాభావికగుణము మనలో నున్నదని స్థాపించుటకు వితర్క మక్కఱలేదు. మన ప్రార్థనవలన భగవంతుఁ డెంతవఱకు మనకోరికల నీడేర్చును, మనస్థితి యేప్రకారముగా మాఱును, అన్నవిషయమును మాత్రము మనము కొంచె మాలోచింపవలయును. ప్రార్థన వ్యర్థము కాదని భక్తిపూర్వకముగా ప్రార్థించు వారి కందఱికిని అనుభవసిద్ధమే. పయినిజెప్పినరీతి ప్రార్థనవలననే మన మీశ్వరసాన్నిధ్యమును పొంది, ఆయన యనుగ్రహమువలన జ్ఞానమును, ఆనందమును, ధైర్యమును, బలమును పొందుదుము. ప్రార్థనవలననే యజ్ఞానాంధకారబంధుర మయి పాపభూయిష్ట మయిన యీ ప్రపంచగుహనుండి బయలువెడలి మన యాత్మ మహోన్నత మయిన యీశ్వరసామీప్యమునకు పరుగెత్తి యనిర్వాచ్యము లయిన జ్ఞానానందములను పొంది యీశ్వరానుగ్రహము వలనఁ దనమాలిన్యమును విడిచి పరిశుద్ధము కాఁగలుగును. ప్రార్థనచేత మన మీశ్వరసాన్నిధ్యమును పొందినకాలఁదిని మనహృదయముల యందు జ్ఞానజ్యోతి ప్రజ్వరిల్లి యధికముగా ప్రకాశించుచు మనకు ధర్మాచరణమునం దధికోత్సాహమును ధైర్యమును స్థైర్యమును కలిగించుచుండును; ధ్యానాభావముచేత మన మీశ్వరసన్నిధానమునకు దూరుల మయినకాలఁదిని మనయాత్మ యజ్ఞానాంధకారములో మునిఁగి స్వప్రయోజనపరత్వమును పొందుచు పాపకార్యములకు భయపడకుండును. ఈ గుణము మనయాత్మలకు నైసర్గికము. వెలుతురు చొరనిప్రదేశము నందున్న మొక్క తెల్లబారి బలహీనమయి యెదుగక యుండి వెలుతురులో పెట్టఁబడఁగానే పచ్చనయి కోమలత్వమును పొంది యెదిగి బలపడ నారంభించునట్లు, యీశ్వరచింత యను వెలుతురు లేక యింద్రియ

సుఖములను బంధములలో తగులుకొని యజ్ఞానాంధకారమునఁ బడి యభివృద్ధిని పొందక కృశించు చుండెడి మన యాత్మయు ఈశ్వరసాన్నిధ్య మను వెలుతురులో చేరఁగానే ప బంధములనుండి విముక్తినొంది బలపడి నిత్యానందమును పొందుట కర్హమయిన దగును. ప్రార్థన వలన మఱి యేలాభము లేకపోయినను మన కీయొక్క లాభము చాలదా? మన మనస్సులను సన్మార్గమునందు ప్రవర్తించునట్లు చేయు మని ప్రార్థించుటచేతనే మనము నీతిమంతులమును పుణ్యాత్ములమును అగుట సంభవించును. అగ్నిహోత్ర సమీపమునకు పోయినవారికి చలి దీఱుట యెట్లు సహజమో ప్రార్థనచేత నీశ్వరసాన్నిధ్యమును పొందువారికి పాపచింతనలు తొలఁగుట యట్లే సహజగుణము. ఎవ్వరు పాపపరిహారము కొఱకును నిత్యానందము కొఱకును ప్రార్థింతురో వారు సుగుణసంపదను ఆత్మానందమును పొందుదురు. కాఁబట్టి మనము పరిశుద్ధుల మగుటకును సుఖుల మగుటకును ప్రార్థన తప్ప వేఱుసాధ నము లేదు. హృదయపూర్వకముగాను, నిష్కపటముగాను భగవంతుని ప్రార్థించి చూచిన పక్షమున, ప్రార్థనచేసి లేవఁగానే తాను మునుపటి కంటె నెక్కువ పరిశుద్ధుఁడును, సంతోషము గలవాఁడును మనోబలము గలవాఁడును అయినట్లు ప్రతిమనుష్యుఁడును స్వానుభవముచేతనే కని పెట్టవచ్చును. ప్రార్థనవలనగలిగెడు హృదయానందము మొదలైనవి యనుభవైకవేద్యములే కాని యిట్టి వని చెప్ప నలవి యైనవికావు. ప్రార్థనయొక్క విచిత్రశక్తి నేమని చెప్పవచ్చును? అది బలహీనుని బలవంతుని గాను, భీరువును ధైర్యశాలినిగాను, నిరాశుని సాభిలాషుని గాను, దుర్మార్గుని సన్మార్గుని గాను, మూఢుని జ్ఞానిని గాను, మంత్రించినట్లు నిమిషములో మార్చివేయఁ గలుగును. ప్రార్థనవలన పరమేశ్వరునియొక్క పవిత్రసాన్నిధ్యము మనకు లభించిన పక్షమున

మన యాత్మ పారిశుద్ధ్యపారావారములో మునిఁగిపోయి తన స్వభావ దౌర్బల్యమును మాలిన్యమును విడిచి పరిశుద్ధమయి ప్రాపంచిక తుచ్ఛసుఖములను సరకుగొనక ధర్మాచరణమునం దసమానబలము కల దగును. మన మీశ్వరునియందు నిజమయిన స్వచ్ఛభక్తి కల వారమయి సర్వమునకు మన మాయన యనుగ్రహమునే నమ్ముకొని యాయన యాజ్ఞల నన్నిఁటిని చెల్లింపవలయునను దృఢనిశ్చయముతో మనఃపూర్తిగా ప్రార్థించిననేకాని, వేదుకకొఱకు స్తోత్రపాఠములను చదువుచు మనసులో లేని పయిమాటలతో కన్నులు మూసికొని చేతులు పయికెత్తిచేసెడు కపట ప్రార్థనలవలన లేశమును ప్రయోజనములేదు. మనఃపూర్తిగా చేయని ప్రార్థన ప్రార్థనయే కాదు. అది నిష్ఫలమయిన కంఠశోష. నోటితో నుచ్చరించెడు మాటలప్రకారముగా నాచరింపవలెనన్న మనోనిశ్చయము లేక చిత్తము నొక చోటను మాటల నొకచోటను బెట్టి చిలుకపలుకులవలె వల్లించెడు ప్రార్థనలన్నియు గాలికి పోయినవియే కాని యీశ్వరుని సమీపించునవి కానేరవు. అశ్రద్ధతో జామునేపు చేసెడి ప్రార్థనకంటె శ్రద్ధాభక్తులతో చేసెడు ప్రార్థన క్షణకాల మయినను శ్రేష్ఠతరమయినదిగా నుండును. ఆత్మకృషియు శ్రద్ధయు ప్రతివిషయములోను ప్రధానములు. కృషిలేక ఫలము లభింపదు. శక్తివంచనలేక కృషిచేయని వాని కీశ్వరుఁ డెప్పుడును ఫలము నియ్యఁడు. దేహపరిశ్రమమును జేయుచు సోమరితనమును పాఱఁదోలుట కయి పోరాడుటవలన శరీరమునకు బలమెట్లు హెచ్చునో, ఆ ప్రకారముగానే పాపమును పాఱఁదోలుట కయి శ్రమపడుచు పాపముతోఁ బోరాడుచు తోడ్పాటున కయి ప్రార్థించుటవలన ఆత్మకును బలము కలిగి భగవదనుగ్రహము వలన విజయమును సుఖమును పొందుటకు సమర్థమగును. మనయాత్మ

తన యావచ్ఛక్తిని పాటుపడి పాపభంజనమున కయి సంపూర్ణప్రయత్నము చేయువఱకును నిజమయిన ప్రార్థన యారంభము కాదు. మన చిత్తములను పాపచింతలనుండి మరలింపు మని మనము ప్రార్థించునప్పుడు మనము చేసినపాపకార్యముల నిమిత్తమయి నిజమయిన యనుతాపమును పొంది మనము ముందటిపాపముల నెన్నఁడును చేయకుండునట్లు దృఢనిశ్చయము చేసికోవలెను. అట్టినిశ్చయమును కృషియు లేనియెడల చేసినప్రార్థన లన్నియు నిష్ఫలములగును. మనదుర్బలచిత్తముతో మనము దురాశాదులను నివారింపలేకపోయినను వానిని పాఱఁదోలుట కయి దృఢమయిన ప్రయత్నము నయినను చేయుచుండవలెను. మనము ప్రార్థన కారంభించుటకు ముందు సర్వవ్యాపియును సర్వకారుణ్యుఁడును, సర్వశక్తుఁడును, పరిశుద్ధుఁడును, సుఖదాతయు, ధర్మస్వరూపుఁడును, ప్రేమనిధియు నయిన పరమేశ్వరుని నేరముచేసినవాఁడు న్యాయాధిపతిని చేరఁబోవునప్పటివలె భయభక్తులతోను వినమ్రతతోను గౌరవముతోను సమీపింపవలెను. సమీపించిన తరువాత కరుణానిధియు సుఖదాతయునైన తండ్రియొద్ద భయమునువిడిచి స్వేచ్ఛగా మన హృదయములో నున్న దంతయు దాఁచక తెలిపి క్షమింప వేఁడుకొనవలెను. మన హృదయమునందలి నిజ మయిన కోరికలను తప్పిదములను దుఃఖములను గౌరవమును ప్రేమను భక్తిని కృతజ్ఞతను మనసు విప్పి ధారాళముగా మన పరమపితతో చెప్పివేసినప్పుడే యది ఫలకారియైన యవ్యాజప్రార్థనయగును. మనుష్యులమయిన మనము గర్వమును దురభిమానమును గలవారమయి సర్వజ్ఞుఁడయిన భగవంతునిముందట మనపాపములను చెప్ప సాహసింపలేక ప్రార్థనచేయుచున్నట్లు నటించుచు కృత్రిమప్రార్థనలను మాత్రము చేయుచుండుటచేత, ఈశ్వరుఁడు మన సమీపములో నున్న

ప్పటికిని చూడలేక మనము దూరస్థులవలె నున్నాము. చిత్తశుద్ధిగల ప్రార్థనమూలమున నీశ్వరబల మాత్మకు గలుగని పక్షమున బహు విధములయిన పాపములు మొసళ్ళవలె వచ్చి దానిని మ్రింగివేయును; మన కీశ్వరుని ప్రాపు దొరకనియెడల నంతశ్శత్రువులు మనస్సును బంధించి దుర్బలము చేయును. కాఁబట్టి మనము నిజముగాఁ బాగు పడఁదలఁచుకొన్న పక్షమున మనప్రార్థన హృదయపూర్వకమయిన దిగా నుండవలె నని మీకు మఱిమఱి విన్నవించుచున్నాను. హృదయశుద్ధి లేని చేతులుజోడించుట ప్రార్థనకాదు; కన్నులు మూసి కొనుట ప్రార్థనకాదు; ఆకాశమువంక చూచుట ప్రార్థన కాదు; స్తుతి పాఠములు చేయుట ప్రార్థనకాదు. చిత్తము నీశ్వరార్పణము చేయుట యొక్కటియే ప్రార్థన యగును. అప్పుడు మాత్రమే మనము ప్రార్థన చేత నీశ్వరసాన్నిధ్యమును పొంది యానందింపఁగలుగుదుము; అప్పుడు మాత్రమే యీశ్వరసాన్నిధ్యమువలన మనకు బలోత్సాహములు గలిగి మనలను సదా సన్మార్గమునుండి తొలఁగింప పాటుపడుచుండు కామక్రోధాది శత్రువర్గమును మనము జయించి లోఁబఱుచుకొన శక్తుల మగుదుము. ప్రార్థనమూలమున మన మీశ్వరునియందుఁ జేరి నిలువఁగానే పుణ్యకార్యములయందు మనకు విఘ్నము లాపాదించుచు ప్రతిఘటించుచుండెడు క్రోధాదులు భయపడి తమంతనే మనలను విడిచి దూరముగా తొలఁగిపోవును. స్వాభిమానము విడిచి మనము నిర్భయముగా నీశ్వరుని జేర శంకించితిమా, పాపగ్రహములును కామాదిశత్రువర్గమును అసహాయులమయిన మనలను చుట్టుకొని మనయాత్మలను తప్పుదారుల కీడ్చుకొనిపోవును. హృదయవాసమునం దేమూల నైనను పాపశకలమునకు మనము కొంచెము చోటిచ్చితిమా, అది మన హృదయము నీశ్వరసామీప్యమునకు పోనీక యడ్డుపడి

బంధించి వేయును. పాప మయినను మనహృదయమును విడువవలెను; లేదా మన హృదయ మయినను దేవుని విడువవలెను. అంతేకాని పాపలేశము మన హృదయభాగము నంటియుండఁగా దానిని గెంటి వేయ నిజమయిన ప్రయత్నము లేక మనహృదయము సత్యమయిన ప్రార్థనను జేయుటకాని యీశ్వరుని సమీపించుటగాని సంభవింప నేరదు. కాఁబట్టి సోదరులారా! మనము నేటినుండి పాపలేశము నైనను పర్వతమువలె జూచి దానికి దూరముగా తొలఁగుచు నీశ్వ రాజ్ఞాకైంకర్యములను చెల్లింప త్రికరణశుద్ధిగా పాటు పడుదము. ప్రార్థనయొక్క యుద్దేశ మంతయు మన మీశ్వరునియందు సంపూర్ణ విశ్వాస ముంచి సర్వవిషయములయందును మన మాతని యాజ్ఞా బద్ధులమయి వానిని చెల్లించుచు తదిచ్ఛానుసారముగా ప్రవర్తింప బాటుపడుటయే. ప్రార్థనవలని సంపూర్ణఫలము మన మనుభవింప గోరిన పక్షమున, మనహృదయఫలకముల యందాయన లిఖించిన యీశ్వరశాసనములను మీఱక నడుచుకొనుచు మన యాత్మలను దేహములను ఈశ్వరార్పణము చేయవలెను. ఆయనయెడల మనము చూపఁదగిన భక్తి యంతయు మన మాయనకు లోఁబడి పరమ భృత్యుల మయి యాయనవలె నగుటకయి పాటుపడుటయే. ఈ పాటు వలన మన హృదయగృహమునందు సుజ్ఞానదీప మారక సర్వదా ప్రజ్వ రిల్లుచు దానిని విమలముగా జేయును.

ఇఁక ప్రార్థనలవిషయమయి మనవారు కొందఱు చేసెడి యాక్షే పణములను కొంచెము విచారింతము. "సర్వజ్ఞుఁ డగుటచేత మన మనోవృత్తులును, వాంఛలును, లోపములును సర్వమును పరమేశ్వరుఁ డెఱుఁగనివి లేకయుండఁగా మన మాతనికి తెలుపవలసిన యావశ్యకమే మున్నది? మనము ప్రార్థింపకుండ సర్వకారుణ్యుఁడయిన యాతఁడు

మనవాంఛలను తీర్పఁడా? ” అని కొందఱాక్షేపించుచున్నారు. ఈ యాక్షేపణము పయికి సయుక్తికముగానే కానఁబడును. మనచిత్తవృత్తులు మంచివయినప్పుడతఁ డామోదించు ననియు, మనవాంఛలు మంచివియు పరిశుద్ధము లయినవియునయిన పక్షమున ప్రార్థన యక్కఱలేకయే వాని నతఁడు ప్రసాదించు ననియు, మన హృదయములు పరిశుద్ధములుగా నుండక చేయు ప్రార్థనల నాతఁ డంగీకరించి ప్రసాదింపఁ డనియు వేఁడుకనిమిత్తము చేయు ప్రార్థనలవలన ప్రయోజన ముండ దనియు, వారు చెప్పెడుమాటలను మనముసహిత మంగీకరింపవచ్చును. ఈమాటలు సత్య మగుటకు సందేహము లేదు. హృదయములో భక్తిలేని యారాధన మీశ్వరవంచన మగునేకాని యుపాసనము కానేరదు. అయినను మనముమాత్రము మనకోరికలను మనస్సులో పెట్టుకొని యూరకుండక పయికిసహితము చెప్పవలెను. అట్లుచేయుటచేతనే మనకు మనశ్శాంతియు తృప్తియు సంతోషమును కలుగును. అది స్వభావధర్మము మనస్సులలోనున్న కష్టసుఖములను మనయాప్తులకు చెప్పివేయుట చేతనే దుఃఖశాంతియు సంతోషమును కలుగునట్లుగా దేవుఁ డేర్పఱచి యున్నాఁడు. అందుచేతనే మన కాప్తులై ప్రియులయి యున్నవారిలో నెల్లను ప్రియతముఁడైన యీశ్వరునకు మనలోపములను కోరికలను జెప్పి మనకృతజ్ఞతను దెలుపుట మనకు సహజగుణమై యున్నది. నిజమయిన భక్తిగలవాఁ డీశ్వరునకు తన వాంఛితములను దెలుపక యూరకుండనేరఁడు. అట్లు తెలుపుటవలననే మనస్సులో నీశ్వరభక్తి మరింత ప్రబలి యార్పరాని దవానలమువలె విశేషతేజస్సుతో ప్రజ్వరిల్లును. అందుచేత మనుష్యుఁడు నిశ్చలుఁడును పరిశుద్ధుఁడును అగును. ఈశ్వరభక్తివలన దయాసత్యాది కళ్యాణ గుణములు మనస్సులో దృఢముగా నాటుకొని దినదినక్రమమున పరి

శుద్ధుఁడు కా నారంభించును; సత్కార్యానురాగమును పరలోక చింతయు దృఢపడును; నిరంతర ప్రార్థనవలన మనము పాపములో సులభముగా పడక జాగరూకులమయి యుందుము. పాపమునుండి తొలఁగింపుమని చేయు ప్రార్థనయే మన మా పాపమునకు దూరముగా తొలఁగునట్లు చేయును. అంతేకాక సంతతసంస్మరణమువలన మన మీశ్వరసాన్నిధ్యమును పొంది పాపశిక్షకుఁడయిన యీశ్వరుఁడు జ్ఞాననేత్రమున కగపడుచుండఁగా నాతని యెదుట పాపమును జేయుటకు తప్పక భయపడుదుము. మన కోరికల నీశ్వరుఁడు మనము తెలుపకయే గ్రహింపఁ గలిగినను, ఈశ్వరునకును మనకును గల సంబంధమునుబట్టి మనము తెలుపవలసిన యావశ్యకము కలుగుచున్నది. అంతేకాక మనము నిత్యమును సర్వేశ్వరుని ప్రార్థించుచుండుటవలన మనము మఱింత జాగ్రత్త గలవారమయి పాపకార్యములనుండి తొలఁగుచు పుణ్యకార్యములయం దాదరమును ధైర్యోత్సాహములును గలవార మగుదుము. నిత్యప్రార్థనము చేయువాఁడు ప్రార్థనచేయనివానికంటె కామాదిశత్రువర్గముయొక్క వలలో చిక్కకుండ నెక్కువ మెలఁకువ గలవాఁడయి యుండును. మనము దేని విషయమున నైనను ప్రార్థించెదము పక్షమున దానిని తప్పించుకొనుటకుఁగాని పొందుటకుఁగాని బద్ధులమయి యుందుము. వెనుక చెప్పినట్లు మన మేపాపమునుండి యైనను కాపాడుమని ప్రార్థించుటయే మనల నా పాపమువంకఁబోకుండ నిలుపుటకు శక్తి కలదగును. కాఁబట్టి మనుష్యుఁడు ప్రార్థనవలన పాపకార్యములనుండి విడివడకపోయిన పక్షమున, పాపకార్యము లాతనిని ప్రార్థననుండి విడివడునట్లు చేయును. పాపములనుండి తొలఁగింపుమని హృదయపూర్వకముగా ప్రార్థించుచుండుటయు పాపకార్యములను జేయుచుండుటయు రెండును నేకకాలమునందు పొసఁగవు.

రెంటిలో నేదైననొకటి వినవలెను. పరిశుద్ధుఁడు కావలెనని ప్రార్థించుటచేత పరిశుద్ధుఁడయినను కావలెను, లేదా ప్రార్థన హృదయపూర్వకమయినది కానిపక్షమున పాపియైనను కావలెను. ప్రార్థన నిజమయినదియు నిష్కపటమయినదియు నయిన యెడల భక్తివిశ్వాసముల వలన తన మనోనిశ్చయము బలపడి మనుష్యుఁడు దానిని సాధించుటకు తప్పక సమర్థుఁ డగును.

ఈశ్వరుఁ డచంచలుఁడు గనుక మనుష్యుఁ డెంత భక్తిపూర్వకముగా ప్రార్థించినను వాని నిమిత్తమయి నడుమ తనయేర్పాటులను మార్చునా యని మఱియొక యాక్షేపణమును జేయుదురు. ఈశ్వరుఁడు నిశ్చలుఁడై నమాట నిశ్చయమే ; మనము ప్రార్థించితి మని తన స్థిరమయిన యేర్పాటుల నెప్పుడును మార్చువాఁడును కాఁడు. అయినను మనము హృదయపూర్వకముగాను నమ్రతతోను మనశ్శుద్ధితోను ప్రార్థించినపక్షమున, ఆత్మసుఖములు కలుగునట్లును మనోదుఃఖములు తొలఁగునట్లును చేయుటకూడ నాతని స్థిరమయినయేర్పాటులలో నొకటియైయున్నది. ప్రార్థనమూలమున మన కీశ్వరునితోడి సంబంధము కుదిరిన పక్షమున ఆ సంబంధముచేత నీశ్వరునిలోనుండి యాత్మికకళ్యాణ గుణామృత ప్రవాహము మెల్లమెల్లగా మనయాత్మలలో ప్రవేశించి వానిని శుద్ధపఱచి నిర్మలగుణములు గలవానినిగాఁ జేయును. భగవంతుఁ డేర్పచిన దివ్యమయిన యేర్పాటులనుబట్టి ఆధ్యాత్మిక సుఖాభివృద్ధుల నిమిత్తము ప్రార్థించుటయే పుణ్యకార్యములలో నీశ్వర సాహాయ్యమును సంపాదించుకొనుటకు నిజమయిన మార్గముగా నున్నది. ఇది సహజమయిన మార్గమేగాని దీనిలో వింతయైనది గాని యస్వాభావిక మయినదిగాని యేదియు లేదు. కడుపులోనుండి పుట్టి భూపతనము కాఁగానే శిశువునకు సంరక్షణసుఖములఁ గలిగించుదయా

నమ్ముదుము మన యాత్మలకు కలిగింపకుందునా ? అనుదినప్రార్థన వలన దైవసాన్నిధ్యమును పొంది యాత్మాభివృద్ధిని పొంద నలవాటు పడిన వాని కీశ్వరుఁడు మనప్రార్థనల నాలించి మన కోరికలను సఫలము చేయునని స్వానుభవముచేతనే తెలియును. మన మీశ్వరుని కోరునది యంతయు నాధ్యాత్మికలోపములను పోఁగొట్టుటకును, ఆధ్యాత్మికసుఖములను మనోబలమును కలిగించుటకును అయి యుండవలెను. అంతే కాని మన మైహికములయిన శరీరసుఖములనిమిత్తమును, ధనమునిమిత్తమును; కీర్తినిమిత్తమును, ఇతరము లయిన ప్రాపంచిక లాభములనిమిత్తమును, ప్రార్థించినపక్షమున మన మనోరథము లెప్పుడును సాఫల్యము నొందవు. మన ప్రార్థన లెప్పుడును పరమాత్ముఁ డేర్పఱిచిన స్థిరమైనవస్తుధర్మములను మార్పఁజాలవు. ఆరోగ్యధర్మముల ననుసరించుటవలననే కాని ప్రార్థనవలన దేహబలము రాదు; పాటుపడుటవలననేకాని ప్రార్థనవలన ధనము రాదు; సత్కార్యములను జేయుటవలననేకాని ప్రార్థనవలన కీర్తి రాదు; ఆయావనులను సాధించుట కర్హములయిన కృత్యములవలననే కాని శుష్కప్రార్థనలవలన నిహలోకసంబంధములయిన యే యితరలాభములును రావు. ఇది తెలిసికొని బుద్ధిమంతు లయిన వారు సఫలములు కానేరని యిట్టి యసాధ్యకార్యములనిమిత్తమై ప్రార్థింపక యాధ్యాత్మికజ్ఞానముకొఱకును, ఆధ్యాత్మికబలముకొఱకును, ఆధ్యాత్మికపారిశుద్ధ్యముకొఱకును; ఆధ్యాత్మిక సుఖములకొఱకును మాత్రమే పరబ్రహ్మమును ప్రార్థింపవలెను. అంతేకాక మనము ప్రార్థించునప్పుడు "ఓ యీశ్వరుఁడా ! నాయందు దయచూపుము; నన్ను రక్షింపుము; నాపాపములను క్షమింపుము" అని సామాన్యముగా నేవో యనిర్దిష్టములయిన కోరికలను కోరక, మన మేసత్కార్యఘటనమునం దశ

క్తుల మయి యాతని ప్రాపు నపేక్షింతుమో దానిని దయచేయు మనియు, మన కేలోప మున్నదని తెలిసికొని దానిని స్వశక్తిచేత వారింపలేమని నమ్ముదుమో దానినుండి రక్షింపు మనియు, మన మేపాపము చేసి పశ్చాత్తప్తులమయి తత్పరిహారమును గోరుదుమో దానిని పేర్కొని క్షమింపు మనియు, నిర్దేశించి ప్రార్థింపవలయును. లోకములో శిశు వాఁకలివేసినప్పుడు తల్లికడకేగి "అమ్మా! అన్నము పెట్టుము" అని యడుగునట్లును, రోగి వ్యాధిబాధితుఁడయి వైద్యుని యొద్దకుపోయి "అయ్యా! ఔషధ మిచ్చి తెవులు మాన్పుము" అని వేఁడునట్లును, దరిద్రుఁడు సంపన్నగృహస్థుని దాపు చేరి "మహా ప్రభూ! వస్త్రదానము చేయుము" అని ప్రార్థించునట్లును, ప్రతిమనుష్యుఁడును తనయాత్మ యాఁకలిగొని యున్నప్పుడును పాపరోగపీడితమయి యున్నప్పుడును గుణదరిద్రతను పొందియున్నప్పుడును జగద్రక్షకుఁడును భవరోగవైద్యుఁడును కళ్యాణగుణసంపన్నుఁడును నయిన పరమేశ్వరుని ఆధ్యాత్మికలోపములను తొలఁగింప వేఁడుకొనవలయును. ఈప్రకారముగానే పాపియైనవాఁడు తానుచేసిన పాపమును స్మరణకు తెచ్చుకొని పరితాపపడుచు నంతరాత్మచేయు మనోవ్యథ దుస్సహము కాఁగా భరింపలేక మనశ్శాంతి లేనప్పుడు మనశ్శాంతిని కలిగింపుమని వేఁడుకొనవలయును; లోకోపకారి యైనవాఁడు తా నొక సత్కార్యమును చేయ తలపెట్టి యున్నిప్రక్కలను కష్టములు వచ్చి చుట్టుకొనఁగా నిరుత్సాహుఁడయి స్వశక్తిచేత వానిని తొలఁగించుకొనుటకు శక్తుఁడు కానప్పుడు కష్టములు తన్ను సత్కార్యములనుండి తొలఁగింపకుండ జేయుమని ప్రార్థింపవలయును; సత్యకామి యైనవాఁడు కామాదు లయిన యరిషడ్వర్గముకాని యంతకంటెను క్రూరము లయిన లౌకికాధికారి పిశాచములుగాని తన్ను చుట్టుకొని తప్పుదారి

కీడ్చి తనచే నసత్యము బలికింప నుద్యమించినప్పుడు వానిని తప్పించుకో సమర్థుఁడు కాక సన్మార్గముననే నడువ తనకు బలధైర్యములను ప్రసాదింపు మనియు, ప్రాణములకంటెను సత్య మధికప్రియమయి నదిగాఁ జేయు మనియు వేఁడుకొన వలయును; ధార్మికుఁడయిన వాఁడు పాపమును నిగ్రహించుటకుఁగాని ధర్మము నవలంబించుటకుఁ గాని తనంతట సంపూర్ణ శక్తుఁడుగాక మనోబలోత్సాహముల ననుగ్రహింపు మని ప్రార్థింపవలయును. ఈవిధముగా ప్రార్థింప వలసిన విషయములు సమయోచితముగా ననేక విధములుగా నుండును.

"శాశ్వతానంద సౌఖ్యములకు మనుష్యుఁడు భూతదయయును నీతివర్తనమును గలవాఁడయి పరుల కుపకారము చేయుచు పాప కార్యములు చేయక పరిశుద్ధుఁ డయియున్న చాలదా? వేఱుగ ప్రార్థన యేలకావలయును? దేవుఁడు స్తోత్రప్రియుఁడా? తన్ను స్తోత్రము చేయు వారికే కాని మోక్షమియ్యఁడా?" అని కొంద ఱందురు. ఆనంద సౌఖ్యముల కొఱకు మనుష్యునకు సద్వర్తనాదులు చాలునుగాని యీశ్వరప్రార్థనలేక పరిశుద్ధుఁ డగుటకును సంపూర్ణ నీతిమంతుఁ డగుటకును పరోపకారపారీణుఁ డగుటకును మనుష్యున కెప్పుడును సాధ్యము కాదు. అంతేగాక ప్రార్థనము తన బాగుకొఱకే యుద్దేశింపఁ బడినదికాని యీశ్వరుని సంతోషపెట్టుటకొఱకు కాదుగనుక, ఈ యాక్షేపణ కిప్పు డింతకంటె నెక్కువ సమాధానము చెప్పవలసిన యావశ్యకత కానఁబడదు.

ఏకాంతప్రార్థన, కుటుంబప్రార్థన, సమాజప్రార్థన, అని ప్రార్థనలు మూఁడువిధములుగాఁ జెప్పవచ్చును. మనుష్యుఁడు తా నొంటరిగా నీశ్వరుని గూర్చి చేయు ప్రార్థన యేకాంతప్రార్థన. ఏకాంత

ప్రార్థనను ప్రతిమనుష్యుఁడును ప్రతిదినమును తప్పక యొక్కసారియైనను జేయవలెను. ప్రాతఃకాలమును సాయంకాలమును ప్రార్థనకు ముఖ్యమయిన కాలములు. కొందఱు బుద్ధిమంతులు తమకు ప్రార్థనచేయుటకు తీఱికయే లేదని ప్రతిష్ఠగా చెప్పుచున్నారు. అట్టివారికి దేవుఁడిచ్చిన మంచిపదార్థముల నన్నిటిని దినమునకు మూఁడేసిసారులు గంట గంటసేపు కూరుచుండి పొట్టనిండ భుజించుటకు కావలసినంత తీఱిక కలదు కాని వాని ననుగ్రహించిన యుపకర్తనొక్క నిముషకాలము స్మరించుటకు మాత్రము తీఱిక లేదఁట! ఇంతకంటె సిగ్గులచేటు వేఱు కలదా? కాఁబట్టి మీరందఱును యిట్టిసాకుల నెన్నఁడును చెప్పఁ బ్రయత్నింపక నిత్యమును తప్పక యీశ్వరప్రార్థనము చేయుచు మనుష్యనామమును ధరించుట కర్హులుగా నుండునట్లు ప్రవర్తింపుఁడు. ఈ యేకాంతప్రార్థనవలని లాభము లీవఱకే విస్తారముగా చెప్పఁబడినందున నిచ్చట మరలఁ జెప్పుట యనావశ్యకము.

రెండవది కుటుంబప్రార్థన. భార్యయు భర్తయు బిడ్డలును బంధువులును చేరి యింట చేయునదియే కుటుంబప్రార్థన. ఈప్రార్థనవలన కుటుంబములో పరిశుద్ధతయు, ఐకమత్యమును, నెమ్మదియు, సుఖమును కలుగును; బాలురకు భక్తియు ప్రేమయు సుగుణములును కలుగును; కుటుంబములోని బంధువుల కన్యోన్య ప్రేమానుబంధము దృఢపడును; కుటుంబములోని దుష్టులు శాంతులు, బుద్ధిహీనులు తెలివిగలవారును, అగుదురు. వేయేల? ఇట్టి ప్రార్థనలవలన కుటుంబములో సుఖసంతోషాదులు ప్రబలి గృహము భూలోకస్వర్గము వలె నగును. మనలో కుటుంబప్రార్థనలు లేకపోవుటచేతనే భర్తది పరిశుద్ధాస్తికమతముగాను, భార్యది విగ్రహారాధకమతముగాను, తల్లిదండ్రులది మూఢ వేదాంతముగాను ఉండి, తల కొకదారి యయి

యేకకుటుంబములో కలుగవలసినంత యైకమత్యమును, పరస్పరాను రాగమును, సౌఖ్యమును కలుగకున్నవి. కాఁబట్టి యీ యనర్థము తొలఁగునట్లుగా మీ రందఱును మీ మీ కుటుంబములలో కుటుంబ ప్రార్థనలు నెలకొల్పుట కయి ప్రయత్నింతు రని నమ్ముచున్నాను.

మూఁడవది మన మిప్పుడు చేసెడిరీతి సమాజ ప్రార్థనము. మనుష్యు లెప్పుడును పరస్పర సంబాధ సాహాయ్యముల వలననే సుఖపడ వలసిన వా రగుటచేత సంఘ ప్రార్థనయు నత్యంతావశ్యక మయినదే. అన్యోన్య సోదరభావమును, పరస్పరానురాగము మొద లయినవి జన సామాన్యములో వెలయుటకయి యప్పుడప్పు డంద ఱును సంక్షుభవించి సర్వపిత యైన యీశ్వరునికి తమ కృతజ్ఞతను భక్తిని విధేయతను తెలుపు చుండవలెను; జన సామాన్యము యొక్క క్షేమము నిమిత్తమును కష్టనివారణము నిమిత్తమును ప్రార్థించు చుండవలెను. ఇట్టి ప్రార్థనలు తఱుచుగా చేయుచుండుట వలన జనసంఘములో నన్యోన్యద్వేషము పోయి యైకమత్యము పుట్టి పరోపకార గుణమును నన్యోన్య సాహాయ్యకరణమును కలుగును; భక్తి హెచ్చును; సద్గుణములు పట్టుబడును. జంతుజాలములో మను ష్యుఁ డొక్కఁడు మాత్రమే యీశ్వర ప్రార్థనము చేయ నర్హుఁడయి నందున యెల్లవారును పరమేశ్వరారాధనము చేయుచు, మానుష స్వభావమును నిలుపుకొనఁ బ్రయత్నింతు రని నమ్ముచున్నాను. ప్రార్థన లేనిచో మనుష్యుఁడు మృగతుల్యుఁ డగు ననుటకు సందే హము లేదు కాఁబట్టి మిమ్మందఱను పయిని జెప్పిన మూఁడువిధము లయినప్రార్థనలను జేయు చుండుఁ డని వినయపూర్వకముగా వేఁడు చున్నాను. సర్వశుభంకరుఁడయిన యీశ్వరుఁడు మీకట్టి బుద్ధిని పుట్టించునుగాక!

ప్రార్థన.

By

K. VEERESA LINGAM

ప్రార్థన.

ఓ భ్రాతృవరులారా!

మా ప్రార్థనసమాజముయొక్క సాంవత్సరికోత్సవమును జూచుటకయి యీ సాయంకాలము మీరంద ఱిక్కడకు వచ్చియున్నారు. మా సమాజముయొక్క యుద్దేశమేమో దాని పేరునుబట్టియే మీరు గ్రహింపవచ్చును. కాఁబట్టి మా సమాజముయొక్క ముఖ్యోద్దేశమయిన ప్రార్థననుగురించి నేఁడు కొంచెము చెప్పవలసియున్నది. అవయవార్థమునుబట్టి చూడఁగా ప్రార్థన యనుటకు వేఁడుకొనుటయే యర్థమయినను, మీరిక్కడ ప్రార్థన యనఁగా పరమేశ్వరోపాసనమని గ్రహింపవలయును. ప్రపంచారంభము మొదలుకొని నేఁటివఱకును సమస్తదేశములలోను సమస్తజాతులవారిలోను తాము స్వతంత్రులము కామనియు పుణ్యపాపపరిశీలనముచేసి తమ్ము పాలించెడు ప్రభువొకఁడు పయినున్నాఁడనియు జ్ఞాన ముండి యుండుటచేత నేదో యొకవిధమయిన మతము తప్పక కలిగి యున్నది. ఈశ్వరారాధనములేని మత మెక్కడను లేదు గనుక, భగవత్ప్రార్థన సర్వమతములలోను సర్వజనసామాన్యమయి యున్నది. వీనినిబట్టి విచారింపఁగా మనుష్యకోటియొక్క సుఖసంతోషాదులకు ప్రార్థన యత్యంతావశ్యకమనియు ముఖ్యాధారమనియు స్పష్టమగుచున్నది.

ఈశ్వరోపాసనమునకు పూజ, కృతజ్ఞత, ప్రార్థన, ముఖ్యాంగములని చెప్పవచ్చును. నేనిక్కడ జెప్పెడు పూజ కేవల మానసికమేకాని పుష్పపత్రాదులతోఁ జేయు బాహ్యపూజ యెంతమాత్రమును గాదు. పూజ యనఁగా సర్వేశ్వరుని సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదుల కద్భుత

ప్రమోదములు పొందుచు, సర్వకారుణ్య పరిశుద్ధత్వాదు లయిన యనంతకళ్యాణగుణములను తలఁచి భక్తివిశ్వాసములతో స్తుతించి వందనములు చేయుట. కృతజ్ఞత యనఁగా సర్వదా మన సుఖసంతోషాదుల నిమిత్తముగ నీశ్వరుఁడు దయచేసియున్న లెక్కలేని సాధనములను దెలిసికొని యాతఁడు చేసిన మహోపకారమును మఱవక యాతనియం దత్యంతప్రేమను కనఁబఱుచుట. ప్రార్థన యనఁగా భగవదాజ్ఞను మీఱి మనము చేసిన యపచారములకయి మనస్తాపము నొంది వానిని క్షమించుటకును, ఆత్మోజ్జీవమునకయి కావలసిన శాంతిపారిశుద్ధ్యాదులను దయచేయుటకును, దుర్మార్గమున కాకర్షించు ప్రబలతరములయిన కామక్రోధాదులవాతఁ బడకుండ సన్మార్గమున సంచరించు శక్తి నిచ్చుటకును, పరమేశ్వరుని హృదయపూర్వకముగా వేఁడుకొనుట. భగవదారాధనమున కిప్పుడు చెప్పిన వన్నియు నావశ్యకములే యయినను సమయానుగుణముగా నొకప్పు డొకయంగము హెచ్చయి మఱియొకప్పుడు మఱియొక యంగము హెచ్చుకావచ్చును. మన కాకస్మికముగా గొప్పమేలు లభించినప్పుడు ప్రేమయు కృతజ్ఞతయు ప్రజ్వరిల్లి స్తోత్రవందనములు హెచ్చుకావచ్చును; మన మే దయిన సత్కార్యమున కుపక్రమించిన సమయములందు ఘోరకష్టము లన్నిప్రక్కలను వచ్చి చుట్టుకొని లోకులు మనల నాపద పెట్టఁగడఁగి నప్పుడు మనశక్తి చాలక యీశ్వరసాహాయ్యము నిమిత్తమయి ప్రార్థన హెచ్చుకావచ్చును. ఈశ్వరారాధనము పరులు చూచి మెచ్చుటకయి చేసెడు బాహ్యవేషధారణమును, తంత్రమును గాక, కాలస్థితిని బట్టి సమయోచితప్రయోజనసిద్ధి కయి హృదయపూర్వకముగాఁ జేసెడి యుపాసన గనుక, ఆ కాలమున కేది హెచ్చుగా నుండవలెనో తదనుగుణముగానే జరపవలెను. మన యిండ్లకడ ప్రతిదినమును

ప్రత్యేకముగాఁ జేసికొనెడు పరమేశ్వరారాధన మిప్పుడు చెప్పిన ప్రకారముగా నుండవలసినను, పలువురొక్కచోటఁ గూడి యీ ప్రకారముగా చేసెడు సమాజప్రార్థనమాత్రము సామాన్యముగా పయియంగములన్నిఁటితోడను నిండి యుండవలెను. ఇహపరలోకసుఖములకయి యీశ్వరప్రార్థన మత్యావశ్యక మని యించుమించుగా నెల్లవారు నొప్పుకొనుచున్నను, భగవత్ప్రార్థనవలనఁ బ్రయోజనము లేదని భావించువారుకూడ కొంద ఱీకాలమున నందందుఁ గానఁబడుచున్నారు. శరీరసుఖమునకయి కావలసిన యితరపదార్థములవలెనే యాత్మసుఖము నిమిత్తమయి ప్రార్థన యావశ్యక మని యెఱిఁగి యెల్లవారు నాచరించుచున్నప్పుడు, అట్టి సర్వజనానుభవసిద్ధమయిన సత్యమును స్థాపించుటకయి యుక్తులు చెప్పవలసినపనిలేదు. గాని యీ సంశయాళుర లాభము నిమిత్తమయి కొంచెము చెప్పవలసి యున్నది.

మనుష్యుఁడు తన సుఖమునకుఁ గావలసిన పదార్థముల నిమిత్తమయి పరాత్పరుని సాహాయ్య మపేక్షించువాఁడు గనుక ప్రార్థన యావశ్యక మయినది. కాఁబట్టి ప్రార్థన చేయుట మనుష్యకోటికి సహజగుణము. ఆఁకలి వేసినప్పుడు బిడ్డ పాలనిమిత్తమయి తల్లిని వేఁడుకొనును; అన్నాతురుఁడైన దరిద్రుఁడు తన కన్నము పెట్టగల ధనికుని గృహమునకుఁ బోయి వేఁడుకొనును; రోగార్తుఁడు వ్యాధిబాధ తొలఁగింపఁగల వైద్యుని యొద్దకుఁ బోయి వేఁడుకొనును. ఈ ప్రకారముగా బాలురు మొదలుకొని వృద్ధులవఱకును తమ పోషణము నిమిత్తమును సంరక్షణము నిమిత్తమును విపన్నివారణము నిమిత్తమును తత్తత్కార్యములను చేయఁగలవారిని చేరి ప్రార్థింతురు. పోషణరక్షణాదులు లేక శరీర మెట్లు సుఖస్థితియం దుండనేరదో యట్లే యాత్మయు పోషణరక్షణాదులు లేక సుఖస్థితియం దుండఁజాలదు. దేహ

సంబంధములయిన లోపములు తటస్థించి నప్పుడు తల్లోపములను వారింపఁ గలవారిని వెదకుచుఁ బోయి ప్రార్థించులాగుననే మనుష్యుఁ డాత్మసంబంధములయిన లోపములు సంభవించినప్పు డా లోపము లను దీర్చి సుఖము ప్రసాదింపఁ గలిగిన యీశ్వరుని నిజస్వభావము చేతనే ప్రార్థించును. జ్ఞానశరీరపోషణమున కావశ్యకములయిన సత్యశాంత్యాదులకు లోపము తటస్థించి నప్పుడు తత్సంపాదనమున కయి గుణసంపత్ప్రదాతయైన యీశ్వరునే వేఁడుకోవలెను; పాప రోగముల బాధచేత నాత్మరక్షణము కావలసి వచ్చినప్పుడు భవరోగ వైద్యుఁ డయిన యీశ్వరునే వేఁడుకొనవలెను; అనివార్యము లయిన యింద్రియముల యుద్రేకముచేత చిత్తదౌర్బల్యము కలిగి సుఖాభా వము సంప్రాప్తము కాఁబోవు నప్పుడు సుఖసంధాయకుఁ డయిన యీశ్వరునే వేఁడుకొనవలెను. ఈ చెప్పిన దృష్టాంతముల వలన భగ వత్ప్రార్థన యావశ్యక మనియు స్వాభావికమనియు నేర్పడుచున్నది. సమస్తమునకును మన కెవ్వఁ డాధారభూతుఁడుగ నున్నాఁడో, ఎవ్వని యనుగ్రహము లేక మన మొక్క నిముషమయిన సుఖపడుటకు శక్తులము కామో, ఎవ్వఁడు ప్రతిదినమును మన మనుభవించు నట్టియు మనకు ప్రియమయి నట్టియు మన మనుగడను సుఖవంత ముగాఁ జేయునట్టియు సమస్తపదార్థములను సాధనములను దయ చేసెనో, అట్టి పరమదయాళుఁడును పరిశుద్ధుఁడును ప్రేమైకనిధియు నైన యా యీశ్వరుని సంపూర్ణభక్తితోను కృతజ్ఞతతోను దినమున కొకసారి రెండు నిమిషము లయినను స్మరింపక, ప్రార్థింపక, తెలి సిన వాఁ డెవ్వఁ డూరకుండఁగలుగును?

అప్రయత్నముగా కాలోచితమైన ప్రార్థన స్వభావముచేతనే కలుగునని యేర్పడినను, అట్టి ప్రార్థనవలననే ఫలము గలుగదనియు,

అర్ధనిమీలిత నేత్రములతో నాకాశమువంకఁ జూచుచు చేతులు జోడించి ఈశ్వరనామము లోలోపల గొణిగినంతమాత్రముచేత నీశ్వరుఁడు ముక్తినియ్యఁడనియు, ఈ బాహ్యాచరణము లేమియు లేకపోయినను భూతదయ గలిగి కామక్రోధాదులకు లోఁబడక శాంతత వహించి బీదలను సాధులను గాపాడుచు నిత్యసత్యవ్రతమును బూని పరోపకారదీక్ష వహించి పాపముల పొంతఁ బోవక న్యాయముగా ప్రవర్తించు వారిని ధర్మస్వరూపుఁడయిన యీశ్వరుఁడు శాశ్వత సుఖమునుండి తొలగింపఁడనియు, ఈశ్వరాజ్ఞారూప మయిన సత్ప్రవర్తనము ముక్తికి సాధనము కాని యీశ్వరుని ముఖస్తుతులు చేయుట కాదనియు, కొందఱు బుద్ధిమంతులు చెప్పుదురు. యుక్త ప్రవర్తనము లేని భగవన్నామసంస్మరణము పుణ్యమునకు హేతువు కాకపోయినను, భగవద్భక్తిలేనిదే సంపూర్ణమయిన సన్మార్గవర్తన మెప్పటికిని లభింపనేరదు. నీతివర్తనమునందు భగవంతుని ప్రాపు నమ్ముకొనక స్వశక్తినే నమ్ముకొనువారికి నానాముఖముల కష్టము లును విఘ్నములును సంప్రాప్తములయి దుష్టుల వలనను పామరుల వలనను బాధలు సంభవించి రాజోపద్రవము కలిగినప్పుడు చలింపక నిలిచి ధర్మమార్గమును వదలకుండుటకు ధైర్య మెక్కడనుండి వచ్చును? ఒకవేళ లేని ధైర్యమును కొంతకాలము తెచ్చుకొన్నను మనస్సుఖ మును నుత్సాహము నెట్లు కలుగును? కాఁబట్టి సమస్తవిషయముల యందును భగవంతుని ప్రాపునే నమ్ముకొని భగవత్ప్రార్థనము చేయుచు సమస్తమును భగవత్ప్రీతి కొఱకే చేయనివాఁడు సదా సంపూర్ణనీతిమంతుఁ డయి యుండనేరఁడు. ఆపదలు రాకున్నంత వఱకు మాత్రము నీతిమార్గమున నడచిన నడువవచ్చును. ఇఁక సమ స్తమునకును భగవంతుని ప్రాపునే నమ్ముకొని యీశ్వరప్రార్థన

ముచే విడువకుండెడివాఁడో నిరంతర ధ్యానము వలన భగవత్సాన్నిధ్యమును పొంది యానందపరవశుఁడయి తన్నావఱి కాశ్రయించి యున్న దుఃఖములను, కష్టములను, దుశ్చింతలను మఱచి, ఆత్మపారిశుద్ధ్యమును పొంది, ఏ కార్యమునందును తన సహజ దౌర్బల్యమును గానక యెక్కుడలేని, యుత్సాహమును ధైర్యమును సాహసమును కనఁబఱచి, కష్టజాలములయందు సహిత మపరిమిత సుఖసంతోషములను పొందును. ప్రభువుల కెల్లను ప్రభువయిన యా సర్వశక్తుని యాశ్రయబలముచేత లోకములోని యే ప్రతిబంధకమును విఘ్నమును లక్ష్యపెట్టక సత్కార్యాచరణమునందు నిర్భయముగా ప్రవర్తించును. కాఁబట్టి యీశ్వరప్రార్థన వలననే సమస్తగుణములును కలుగును; ఈశ్వరప్రార్థన వలన దుర్బలులకు బలమువచ్చును; ఈశ్వరప్రార్థన వలన భీరులు ధీరులగుదురు; ఈశ్వరప్రార్థన వలన నిరాశులయిన వారికాశ గలుగును; ఈశ్వరప్రార్థన వలన మూఢులు వివేకు లగుదురు; ఈశ్వరప్రార్థన వలన దుష్టులు సద్వర్తను లగుదురు. అదిగాక దుర్భరములయిన కష్టములు వచ్చి బాధించు నప్పుడు వానిని తొలఁగించుకొనుటకును, ఇంద్రియము లుద్రేకించి హృదయమును బలవంతముగా పాపకార్యముల కీడ్చు నప్పుడు తప్పించుకొనుటకును, కేవల మనుష్యశక్తి చాలదు. ప్రార్థనమూలమున నమూల్యమయిన యీశ్వరసాహాయ్యము నావశ్యకముగా పొందవలెను. దైవసాహాయ్యమును పొందుటకు భక్తిపూర్వకమయిన ప్రార్థన తప్ప సాధనాంతరము లేదు. భగవత్సామీప్య సాన్నిధ్యములను గలిగించుకొని, మన కష్టసుఖములను విన్నవించుకొని అభయప్రదానమును బలమును పొంది, ఆత్మశాంతిని పొందుటకు ప్రార్థన యొక్కటియే యమోఘమార్గము. మనము చిత్తశుద్ధితో ప్రార్థించినయెడల, ప్రార్థనమండి

లేవఁగానే యాతోఁ నూజీవనముగలిగి మనకు క్రొత్తబలమును ధైర్యమును సంతోషమును పరిశుద్ధతయు కలుగును. మనుష్యుఁడీ లోకములో పొందఁదగిన యుత్కృష్టానందమంతయు మన కొక్క ప్రార్థనమూలము ననే లభించును. సత్ప్రవర్తనము లేనిపక్షమున కేవల బాహ్యమైన పరమేశ్వరప్రార్థనవలన ఫలమేమియు లేదని నాకును దృఢమైన నమ్మకమున్నది. నడత మంచిదికాక భగవంతుని గుఱించి యూరక నోటితో చెప్పుమాటలు గాలి కెగిరిపోవును. అట్టి ప్రార్థనలు కీచుపిట్టలును యంత్రములునుచేయు ధ్వనులకంటె నధికప్రయోజనకరము లయినవి కావు. హృదయపూర్వకముగాచేయని బాహ్యపూజలవలన వృథాయాసమేకాని ఫలలేశ మయినను కలుగదు. కాని మనఃపూర్తిగా చేయుప్రార్థనలుమాత్ర మెప్పుడును నిష్ఫలములు కానేరవు. భక్తిపూర్వకములయిన యట్టి ప్రార్థన లాలించి యీశ్వరుఁడు తగిన ఫలము నియ్యక మానఁడు. నిష్కపటమయిన ప్రార్థనయును దుష్టచింతయు నొక్కమనస్సులో చిరకాల మేకముగా నుండనేరవు. ఆ రెంటిలో నేదో యొక్కటిమాత్రమే మనస్సునందు కాపురము చేయును. చేసెడు ప్రార్థన హృదయపూర్వకమయినదే యయిన పక్షమున దుశ్చింత మనస్సులో నిలువలేక క్రమక్రమముగా క్షీణించి పాఱిపోవలెను. ప్రార్థన హృదయపూర్వక మయినది కానప్పుడుమాత్రమే దుష్టవర్తనము మనస్సును విడిచిపెట్టకుండును. కాఁబట్టి పైకి సభలలో ప్రార్థనలు చేయువాఁడెవ్వఁడయిన క్రమక్రమముగా తన చెడునడతను విడువకుండెడుపక్షమున, అట్టివాఁడు నిజమయిన భక్తుఁడు కాఁడనియు, వాని యారాధనము కపటనాటకమే కాని త్రికరణశుద్ధియయిన యుపాసనకాదనియు, వాఁడు పామరులను స్వార్థపరుఁడయి భ్రమింపఁజేయు పరమవంచకుఁడనియు మీరు సులభముగా తెలిసికోవచ్చును. మనము హృదయ

పూర్వకముగా జేసెడు ప్రార్థనలు మన మేపాపముచేత పీడింపఁబడు చుందుమో యా పాపనివారణార్థమును, మన మే ప్రయోజనమును గోరి యుందుమో దాని లాభమునిమిత్తమును అయియుండవలెను గాని సామాన్యముగా "మమ్ము పాపములనుండి విముక్తులను జేయుము" "మమ్మాపదలనుండి తొలఁగింపుము" "మాకు సద్గుణములను ప్రసాదింపుము" అని మాత్రము ప్రార్థించుటవలన నంతగా ప్రయోజన ముండదు. మన మసత్యము పలికిన యెడల నసత్యమునుండి కాపాడు మనియే వేడుకోవలెను; చౌర్యము చేసినయెడల ముందు చోరత్వము నందు బుద్ధి తగులకుండునట్లు చేయవలయు ననియే ప్రార్థింపవలెను. కామమును మరల్చుకోలేకపోయిన పక్షమున కామనివారణసామర్థ్య మును దయచేయవలయు ననియే ప్రార్థింపవలయును. అసత్య మాడుట చేత హృదయతాపము నొందుచు ముం దసత్యము జిహ్వాగ్రము నకు రాకుండఁ జేయవలయు నని హృదయపూర్వకముగా ప్రార్థించువాఁ డసత్యమునుండి మరలకుండునా? దొంగతనము చేయుటచేత మనో వేదన పొందుచు ముందు పరులసొత్తుమీఁదికి తన మనస్సును పోకుండఁ జేయవలెనని మనసార ప్రార్థించువాఁడు మరల దొంగతనము చేయు టకు చేయి చాపఁగలుగునా? వ్యభిచారదుఃఖముచేత మనస్తాపము నొందుచు తన మనస్సు పరాంగనలమీఁదికి పోకుండఁ జేయుమని నిష్కపటముగా ప్రార్థించువాఁడు మరల పరకాంత పొందాసింపఁ గలఁడా? కాఁబట్టి యెప్పుడును లేనిపోని కోరికలు కోరక మనయం దేలోపము కనఁబడునో దాని నిమిత్తమే వేడుకొనవలయును.

మనము కోరెడు కోరికలనెల్ల నిచ్చుటకు భగవంతుఁడు చంచ లుఁడు కాఁడనియు, తన శాసనములను మన ప్రార్థనలనుబట్టి నడుమ నడుమ మార్చుచుండునా యనియు, కొంద ఱాక్షేపింతురు. భగవంతుఁ

డెంతమాత్రమును చంచలుఁడు కాఁడు; ఒక్కరి నిమిత్తమయి తాను చేసిన శాసనములను మార్చువాఁడును, కాఁడు. మనము వేసవికాలములో వాన లిమ్మని ప్రార్థించినను శీతకాలములో వేఁడిమి నిమ్మని పార్థించినను ధనమునుగాని స్త్రీలనుగాని సంపదలనుగాని కీర్తినిగాని యితరభోగములనుగాని యిమ్మని ప్రార్థించినను, మనము కోరినందుచేత నిచ్చువాఁడు కాఁడు. అట్టివి వచ్చుటవలన మనకు సుఖమును కలుగక పోవచ్చును. అట్టి యిహలోకసంపదలు సంప్రాప్త మయినప్పుడు మనము సంపన్నాంధులమయి యీశ్వరుని మఱచి తుచ్ఛసుఖముల నిమిత్తమయి దుశ్చేష్టల మరగి కడపట పరలోకహానియుఁ దెచ్చుకోవచ్చును. కాఁబట్టి యట్టి నష్టకరములయిన కోరికల నతఁ డెప్పుడును ఫలింపఁజేయఁడు. మన మాతనిని కోరవలసిన కోరికలు మనస్సులను పాపకార్యములనుండి మరలింపవలసిన దనియు, సత్కార్యములయందాసక్తములయి యుండునట్లు చేయవలసిన దనియు, భగవదాజ్ఞలను చెల్లించుటకయి ధైర్యసాహసములను సుఖశాంత్యాదులను ననుగ్రహింపవలసిన దనియు, ఈ మొదలైన యాముష్మికసంబంధములైనవయి యుండవలెను. అప్పుడవి యీశ్వరుఁడు మనకు తప్పక ప్రసాదించును. అట్లు చేయుటవలన భగవచ్ఛాసనము మాఱవలసిన పని లేదు. అట్టి విషయములలో హృదయపూర్వకముగా తన్ను పార్థించువారి కవి లభించి యాత్మశాంతి, పారిశుద్ధ్యము మొదలయినవి కలుగవలె ననియే భగవంతుని శాసనము. ఒక్కజ్యోతినుండి మనము దూరముగా పోయినకొలఁదిని వెలుతు రంతకంతకు తగ్గుచు వచ్చి యాజ్యోతిని సమీపించుకొలఁదిని వెలుతురు హెచ్చుచు వచ్చులాగుననే జ్ఞానజ్యోతియైన యీశ్వరుని ప్రార్థనల మూలమున మనము సమీపించిన కొలఁదిని పాపాంధకారము దూరముగా తొలఁగుచుండునట్లును,

భక్తిహీనతమూలమున నీశ్వరునికి దూరముగా తొలఁగు కొలఁదిని పాపాంధకారము మనలు చుట్టుకొని కన్నుఁ గానకుండుట తటస్థించు నట్లును, ఈశ్వరుఁడు మొట్టమొదటనే శాసించి యున్నాఁడు.

మన కేమికావలయునో యీశ్వరునికి తెలియనే తెలియును గదా, మరల ప్రార్థింపవలసిన పని యేమున్న దని కొంద రాక్షేపణ చేయుదురు. భగవంతుఁడు మన కోరికలను ప్రసాదించుట పరిశుద్ధ చింతతో మన మడిగినందుకుఁ గాని మనకు లోపములున్నందు నిమిత్తమయికాదు. కపటము లేకుండ మన మనోగతములను తెలుపుట చేతకూడ దుఃఖశాంతియు సుఖాతిశయమును కలుగవలెనని కూడ భగవంతుని శాసనములలో నొకశాసనముగా నున్నది. అందుచేతనే మనకు దుఃఖము కలిగినప్పుడు ప్రేమాస్పదులయిన మిత్రులతోఁ జెప్పుటచేత సగము దుఃఖము తీఱును; మనకు శుభము కలిగినప్పుడు వారితోఁ జెప్పుటచేత మన సంతోషము ద్విగుణ మగును. కాఁబట్టి మనకుఁ గావలసినవాని నన్నిఁటిని భగవంతుఁడు తెలిసినవాఁడే యయినను మన దుఃఖశాంతినిమిత్తమును సంతోషాభివృద్ధి నిమిత్తమును మన ప్రార్థన లత్యావశ్యకములు. అదిగాక మన మొకవిషయమయి ప్రార్థించుచు సదా దానిని తలఁచుకొనుచుండెడి పక్షమున దాని విషయమై మనము మఱింత జాగరూకులమై యుందుము; కాఁబట్టి బొత్తిగా ప్రార్థనచేయని వానికంటె ప్రార్థనలు చేయు భక్తిహీనుఁడును కొంత యధికలాభము పొందును.

లోకములో భగవదారాధనము మూఁడువిధములుగా నుండును. అందొకటి యెవరి యింటివద్ద వారు రహస్యముగా చేయు ప్రత్యేకప్రార్థన. దాని విషయమయి ఇదవఱకు కొంత చెప్పియున్నాను. రెండవది భార్యలు పుత్రులు సోదరులు మొదలయిన వారందఱును

జేరి గృహమునఁ జేయు కుటుంబ ప్రార్థన. ఈ ప్రార్థనవలన కుటుంబములోని వారికెల్ల నైకమత్యమును నెమ్మదియు, బిడ్డలకు పెద్దలయందు భక్తియు, నమ్రతయు, పరోపకారచింతయు మొదలయిన బహుసుగుణములబ్బును. సంసారదుఃఖములు కానరాక సుఖముకలుగును. మూడవది యిటువంటి సమాజప్రార్థన మనుష్యుడు సమస్తవిషయములలోను పరస్పరసాహాయ్యమువలననే సుఖపడుననుట యెల్లవారు నెఱిగిన విషయమే. అలాగుననే యీశ్వరారాధన విషయమునఁ గూడ సంఘీభవించి చేసిన ప్రార్థనవలన సమస్తలాభములును కలుగును. ఐకమత్యముపుట్టును. ఈప్రకారముగా సమాజప్రార్థనలు లేని జాతులవారంతకంతకు మూఢులై క్రూరవర్తనులై నాగరికుల దూషణకు పాత్రులై నీతిమాలినవా రగుదురు.

ఈశ్వరారాధనమువలన పైని చెప్పినవిగాక ముఖ్యముగా కలిగెడు మఱియొక లాభము పరమేశ్వరుని తఱుచుగా స్మరించుచుండుట చేత నాతనియందును తద్గుణములయందును ప్రీతియును గౌరవమును కలిగి మన మాయన గుణముల నవలంబించుటకు ప్రయత్నించి బాగుపడుట. కాఁబట్టి యెల్లవారును నే నిప్పుడు చెప్పిన మూఁడువిధముల ప్రార్థనలును మన దేశమున వర్థిల్లునట్లు చేయుదురు గాక !

మానుషధర్మము.

By

K. VEERESA LINGAM

మానుషధర్మము.

భ్రాతృజనులారా!

ఈలోకములో నిప్పుడెంత జ్ఞానాభివృద్ధి యగుచున్నను, మనుష్యుఁడు బాహ్యప్రపంచమునుగూర్చి తెలిసికొన్నంత యాత్మవిషయమునుగూర్చి తెలిసికొని యుండలేఁడు. ఆత్మ యున్నదని తెలియనివాఁడు లోకములో నెవ్వఁడును లేఁడు గాని, ఆయాత్మయొక్క ధర్మములిట్టివని దృఢముగా నెఱిఁగినవారు మాత్రము మిక్కిలి తక్కువగా కానఁబడుచున్నారు. మానుషరూపమును ధరించినవానికెల్లను తన్నుగూర్చి తానెఱుఁగుట ప్రథమకర్తవ్యము. తానెట్టివాఁడో తాను తెలిసికోలేకపోయినప్పుడు బాహ్యపదార్థములను వేయింటిని గూర్చి తెలిసికొన్న ప్రయోజనమేమి? ఇట్లు చెప్పుటచేత పదార్థజ్ఞాన మనావశ్యకమని నాయభిప్రాయ మెంతమాత్రమును కాదు. అది కావలసినంత యుండవలసినదే కాని యాత్మజ్ఞానమును విడిచి యితరపదార్థతత్త్వమును మాత్ర మెఱుఁగఁగోరుట శ్లాఘ్యమయిన పని కానేరదు. మనుష్యులు జలధర్మమును దెలిసికొని, నీటియావిరివలన నోడలను బండ్లను వాయువేగమున నడుపుటయేకాక వస్త్రనిర్మాణాదుల నుపయోగించు వివిధయంత్రములచేఁ బనిచేయింప నేర్చుకొన్నారు; వాయుగుణమును దెలిసికొని, గాలిబలముచేత నీటిని క్రిందినుండి మీఁదికెక్కించుటయేకాక వాయుపథమున విమానములు నడుపుటకు నేర్చుకొన్నారు; తేజోమహిమను దెలిసికొని, చమురులేనిదీపములను వెలిఁగించుటయేకాక మనోవేగమున దూరవార్తలను బంపుటకు నేర్చుకొన్నారు; పృథివీతత్త్వమును దెలిసికొని, మృత్తుతో విచిత్రపాత్రా

ములు నిర్మించుటయే కాక భూమినుండి మనుష్యసుఖసాధనములయిన నానావిధసస్యఫలాదులను బొందనేర్చుకొన్నారు. ఈప్రకారముగా భూమిమీఁదనున్న వస్తుసముదాయమును గూర్చి మాత్రమే కాక యాకాశమున సంచారముచేయు గ్రహతారకాదుల గమనాదులను గూర్చి సహితము తెలిసికొని, దారిలేని మహాసముద్రమధ్యమున దారి తప్పకుండ నావలను నడప నేర్చుకొన్నారు. ఈరీతిగా బహువస్తు తత్త్వములను దెలిసికొని మనుష్యులు బహువిధలాభములను పొందు చున్నారు. కాఁబట్టి బాహ్యప్రపంచవిషయమున మనుష్యుఁడు సంపా దించిన జ్ఞాన మింతింతయని చెప్ప నలవికాదు. ఈవఱకు సంపాదించిన దానితో తృప్తినొందక యనేకులింకను బహువిషయములయందు జ్ఞానాభివృద్ధిని గూర్చుటకు నిరంతరకృషి చేయుచున్నారు. అయినను మనుష్యులలో ఆత్మవిషయమునకంటె నన్యవిషయములయందు కృషి విస్తారముగా పొడకట్టుచున్నది. వీనినన్నిటినిబట్టి విచారింపఁగా మను ష్యునకుఁ దెలిసినదానిలో నెల్లను దన్నుఁగూర్చి తెలిసికొన్నదే మిక్కిలి తక్కువగాఁ గానఁబడుచున్నది.

నీరు మెఱకనుండి పల్లమునకుఁ బాఱుచున్నది; అగ్నిజ్వాలలు పయికి లేచుచున్నవి; బీజమునుండి మొలకయెత్తి చెట్టు పెరిగి పూవు లనో ఫలములనో యిచ్చి నశించుచున్నది. సూర్యకిరణములు సముద్ర ములనుండి జలము నాకర్షించి వర్షరూపమున దానిని మరల భూమికిఁ బంపుచున్నవి; సూర్యచంద్రులు తమగతిచేత సంవత్సరములు, ఋతు వులు, మాసములు, దినములు మొదలయిన కాలభేదములను గలిగించు చున్నారు; గుఱ్ఱములు మహాజవసంపన్నములయి పరుగెత్తుచున్నవి; తాఁబేళ్ళు మందగమనముతో ప్రాఁకుచున్నవి; చేఁపలు నీటిలోమునిఁగి యాడులాడుచున్నవి; పక్షు లాకాశమున నెగురుచున్నవి. ఈవిధముగా

చరాచరములయిన సమస్తపదార్థములును తమకు నియతములయి యున్న ధర్మములను మీఱక చరించుచున్నవి. స్వభావముచే నీరు పల్లమునుండి మెఱక కెక్కదు; వెలగచెట్టున గుమ్మడికాయలు కాయవు; ఏనుఁగులు పిల్లిపిల్లలను బెట్టవు; పులుగులు గడ్డితినవు; గోవులు మాంసభక్షణము చేయవు; సూర్యుఁడు మూఁడుదినముల కొకసారి యస్తమింపఁడు; చంద్రుఁడు దినమునకు మూఁడుసారు లుదయింపఁడు. వస్తుధర్మములనుబట్టి పరీక్షించిచూడఁగా సృష్టిలో నణువు మొదలు కొని బ్రహ్మాండమువఱకునుగల ప్రతిపదార్థమును నేదోయొక ప్రయోజనముద్దేశించి తన కేర్పఱుపఁబడిన నియమమునకు లోఁబడి వర్తించునట్లు కానఁబడుచున్నది గాని యనిర్దిష్టముగా విచ్చలవిడిగా వర్తించుచున్నట్టు కానరాదు. ఇట్లు సృష్టిలోని సమస్తవస్తువులను, ప్రతిపదార్థములవలనను ఏదోయొక ప్రయోజనము నుద్దేశించి తదనుగుణముగా చేసిన పరమేశ్వరుఁ డొక్క మనుష్యునిమాత్రము నిర్దిష్టప్రయోజనము లేక పనికిమాలిన నిరర్థకజంతువునుగా సృజించియుండఁడు. కాఁబట్టి యిప్పుడు మనుష్యుఁ డేయుద్దేశముతో సృజింపఁబడినాఁడన్న యంశమును విచారింపవలెను. మనుష్యునకు పశుపక్ష్యాది జంతుసామాన్యమయిన స్థూలదేహ మొక్కటియు, ఆధ్యాత్మికమయిన జ్ఞానదేహ మొక్కటియు, రెండు కానఁబడుచున్నవి. స్థూలదేహము తక్కిన జంతువుల దేహములకంటె విశేష భిన్నమయినది కానందున, దేహధర్మములన్నియు మృగధర్మములుగానే యుండును. అందుచేత మనుష్యుఁ డింద్రియమూలమునఁ బొందఁగలుగు సౌఖ్యము లించుమించుగా మృగాదుల సౌఖ్యములతో సమానమయినవిగానే యుండును. అయినను మనుష్యునకున్న యాధిక్యమంతయు జ్ఞానదేహమయిన యాత్మను గలిగియుండుట. ఇఁక మనుష్యునకుఁగల యాత్మ

తత్త్వమెట్టిదో విచారింపవలెను. అది నిరవయవమయినదియు నిరాకారమయినదియుఁ గనుక నాశనరహితమయినది; అది స్వప్రకాశమయినది గనుక జ్ఞానాత్మకమయినది; కరుణాది గుణవిశిష్టమయినది గనుక కారుణ్యమయమునయినది. ఇట్టి గుణములుగల యాత్మ సృష్టిలోని మఱి యేపదార్థమునందును గానఁబడదు. ఈశ్వరుఁ డొకఁడు మాత్రమే యిట్లాత్మస్వరూపుఁడయి యున్నాఁడు. సృష్టిపదార్థములనుబట్టియు మన యాత్మతత్త్వమునుబట్టియు సృష్టికర్తయైన యీశ్వరుని గుణములను పరిశీలింపఁగా మనుష్యబుద్ధిచేతఁ దెలిసికోఁదగి యున్నంతవఱకు మనుష్యాత్మలయందుఁగల లక్షణములే యీశ్వరుని యందును గానవచ్చుచున్నవి. కాఁబట్టియే మనుష్యుఁడు స్థూలసూక్ష్మ శరీరధారణమునుబట్టి సగము మృగమనియు సగము దేవుఁడనియు చెప్పఁబడుచున్నాఁడు. మాంసశరీరముతో మృగత్వమును, జ్ఞానశరీరములో దేవత్వమును కలవనుటకు సందేహములేదు. మనయాత్మలు పరమాత్మునితో సమానమయిన గుణములు కలవేయయినను, జీవాత్మకును పరమాత్మకును విశేషతారతమ్యము గలదు. పరమాత్ముఁడు సర్వజ్ఞుఁడు; జీవాత్ముఁడు మితజ్ఞుఁడు; పరమాత్ముఁడు సర్వశక్తుఁడు; జీవాత్ముఁడు పరిమితశక్తుఁడు; పరమాత్ముఁడు సమస్తకళ్యాణగుణ పరిపూర్ణుఁడు; జీవాత్ముఁడు సమస్తసద్గుణాంకురవిశిష్టుఁడు. అగ్నిహోత్రమునకు తాపమును, పర్వతములకు కాఠిన్యమును ధర్మములయినట్లే మనయాత్మలకు జ్ఞానము నీతియును ధర్మములు. అగ్నిహోత్రము తాపమును విడుచుట యెట్లు అసహజగుణమో మనయాత్మలు నీతిని విడుచుటయు అట్లే యసహజగుణము. నీతిని గలిగియుండుట మానవాత్మకు స్వాభావికము; అదిలేకుండుట యస్వాభావికము. మామిడి పండునకు మధురరసాదులను గలిగి రమ్యముగానుండుట స్వాభావి

కము; పుష్పివట్టి చెడి వికారముగా నుండుట యస్వాభావికము; దేహమునకు బలారోగ్యములు కలిగియుండుట స్వాభావికము; రోగాదులచే దుర్బలమయి పాడగుట యస్వాభావికము. ఈప్రకారముగానే యాత్మకును నీతిజ్ఞానాదులచే నానందమనుభవించుట స్వాభావికము; పాపాజ్ఞానాదులచే సంతోషముచెడి బాధపడుట యస్వాభావికము. ప్రతిమనుష్యుఁడును మొట్టమొదట దేహమునకు రోగములు రాకుండ కాపాడుకొనవలసినట్లే యాత్మను పాపరోగములంటకుండునట్లు కాపాడుకొనుచు రావలెను; అటుతరువాత ప్రమాదాదికము వలన శరీరమును వ్యాధి యాశ్రయించినప్పుడు మందువేసి రోగమును మాన్పి యారోగ్యదశను బొందఁబ్రయత్నించుట యెట్లు ధర్మమో యట్లె యాత్మను పాపరోగమాశ్రయించి దుఃఖపెట్టుచున్నప్పు డనుతాపౌషధముచేత దానిని స్వస్థపఱిచి మరల సుఖస్థితికిఁ దెచ్చుటకయి ప్రయత్నించుటయుఁ బరమధర్మము. వేఁడిమిని విడిచిన బొగ్గెట్లగ్నిపాత్రమని పిలువఁబడఁదగదో యట్లే మనుష్యుఁడును నీతిని విడిచినతరువాత మనుష్యుఁడని పిలువఁబడఁ దగఁడు. నీతియే మనుష్యలక్షణము; నీతియే మనుష్యునకు పరమధర్మము; నీతిబంధమే మనుష్యుని కీశ్వరునితోడి పీడని చుట్టఱికమును గూర్చుచున్నది. నీతివర్తనముచేత నీశ్వరసామీప్యమును బొంది నిత్యానందమును బొందుటయే మనుష్యజీవనమువలని పరమప్రయోజనము. కాఁబట్టి ప్రతిమనుష్యుఁడును నీతిమార్గమునఁ బరమేశ్వరుని జేరి యానందింపఁ గలుగుటకయి సర్వవిధములఁ బ్రయత్నింపవలెను. ఒక్క యీ నీతిగుణమువలననే మనుష్యుఁడు పవిత్రుఁడయి యీశ్వరునికి పుత్రుఁడగుటయేకాక యీశ్వరకుటుంబమయిన సమస్త మానవకోటిని భ్రాతలనుగాఁ జేసికొనుచున్నాఁడు. నీతిమహిమను

బట్టియే మనుష్యపద మెంతో పవిత్రమయి గౌరవనీయమయిన దగుచున్నది.

పర్వతమునకు కాఠిన్య మెట్లు సహజగుణమో మనుష్యునకు నీతి యట్లే సహజగుణమయినను, ఈరెండు సహజధర్మములకును కొంత వ్యత్యాసమున్నది. మనుష్యుఁడు పర్వతమువలెఁగాక స్వతంత్రుఁడయి కొంతవఱకు స్వేచ్ఛగాఁ బ్రవర్తింపఁదగినవాఁడు. విషయ సుఖములు మనుష్యునకును మృగమునకును సామాన్యములనియు దేహసంబంధమువలన మనుష్యునిలో మృగధర్మముకూడఁ గొంత యున్నదనియు నీవఱకే చెప్పియున్నాను. మృగధర్మము మనుష్య ధర్మమునకంటె భిన్నమగుటచేత, అవి రెండును ఒకచోటఁ జేరి నప్పుడు పరస్పరవిరోధము సంభవింపక తప్పదు. అయినను మనుష్యుఁడు స్వేచ్ఛావివేకములనుబట్టి, మృగధర్మమునకును మనుష్య ధర్మమునకును విరోధము పొసఁగినప్పుడు మృగధర్మము నడఁచి లోఁబఱుచుకొని తన యిచ్ఛానుసారముగా మెలఁగునట్లుచేసి దానివలని లాభమును పొందుచుండవలెను. జీవాత్మకు జ్ఞానాంకురములును నీతి బీజములును గలవనియు వానిని వృద్ధిచేసికోవలయుననియుఁ గూడ నీవఱకే సూచించియున్నాను. జ్ఞానాదులు హీనదశలో నున్నప్పుడు పశుధర్మములని చెప్పఁబడిన మాంసగుణములు ప్రబలమయినవిగా నుండును. ఆకాలమునందు మనుష్యున కీశ్వరవిజ్ఞానమును తదను గుణమయినదిగానే యుండును. ప్రపంచముయొక్క యారంభ దశలో జ్ఞానాభివృద్ధి విశేషముగా కలుగనప్పుడు దేహబల మధిక ముగా నున్నవాఁడెవ్వఁడో వాఁడు గొప్పవాఁడుగాను నాయకుఁడు గాను అంగీకరింపఁబడి గౌరవింపఁబడుచు వచ్చెను. ఆకాలమునందు జనులు తాము భయపడి గౌరవించు నరుని గుణములనుబట్టి భగవం

తుని సర్వశక్తునిగాను, మేఘవాహనమెక్కి పిడుగులను బఱపి శత్రువులను నాశనము చేయువానినిగాను, భావించి భయముతో బలులు మొదలయినవానిని సమర్పించి యారాధించుచు వచ్చిరి. తరువాత జనులలో జ్ఞాన మభివృద్ధియైన కొలఁదిని దేహబలమునందు గౌరవము తగ్గి కాయబలముగలవానికంటె బుద్ధిబలముగలవాఁ డధికుఁడయ్యెను. దేహబలము గలవానిని బలహీనులయినను పదిమంది చేరి గెలువఁ గలుగుటయు, దేహబలము గలవారు వేయిమంది చేరియైనను జ్ఞానబలము గలవాని యుపాయములముందు నిలువలేకుండుటయు చూచి యద్భుతపడి, జనులు కేవల దేహబలము గలవానిని విడిచి వస్తుతత్త్వమును దెలిసి ఆలోచన గలిగి, ఉపాయశాలియైన బుద్ధిమంతునిఁ దమకు నాయకునిగాఁ జేసికొని గౌరవింపసాగిరి. లోకానుభవ మెక్కువయయి జ్ఞానాభివృద్ధి కలిగినకొలఁదిని జనులు సృష్టిలోని ప్రతివస్తువులోను దేవుని బుద్ధిబలము కనిపెట్టి దేవుని సర్వశక్తునిగా మాత్రమే కాక సర్వజ్ఞునిగాకూడ భావించి యద్భుతప్రమోదములతోను భయముతోను నర్చించుచుండిరి. జ్ఞానాభివృద్ధియధికమయి మనుష్యతత్త్వము చక్కఁగా తెలియ నారంభించిన తరువాత జనులు దేహబలము కలవానికంటెను జ్ఞానబలము కలవానికంటెను నీతిబలము గలవాని నెక్కువగా గౌరవించి, ఎవ్వఁడు సత్యము తప్పకుండునో యెవ్వఁడు ఋజుమార్గమున ప్రవర్తించునో యెవ్వఁడు పరోపకారపరాయణుఁడగునో యట్టివానిని ప్రేమించి దేవాంశకలవానినిగా భావింప మొదలుపెట్టిరి. అప్పుడు మనుష్యులీశ్వరవిషయమున గూడ నభిప్రాయములు మాఱినందున, దేవుని సర్వశక్తునిగాను సర్వజ్ఞునిగాను మాత్రమేకాక సత్యస్వరూపునిగాను సర్వకారుణ్యునిగాను గూడ భావించి ప్రేమించి, యద్భుతభయభక్తులతోఁ బూజింప నారం

భించిరి ఈప్రకారముగా మనుష్యుని యభిప్రాయములోను మతము లోను నభివృద్ధి కలుగుచున్నను, నీతివిషయమున నింకను దగినంత దృఢనిశ్చయము కలుగలేదు. కొందఱు మతవిషయమున మార్పులు కలుగుచుండరాదని వాదింప జూతురుగాని మనుష్యునితో సంబం ధించిన సమస్తవిషయములయందును నభివృద్ధి కలుగుచుండఁగా నాత్మోజ్జీవనమున కాధారమయిన మతవిషయమునందేల యభి వృద్ధి కలుగరాదందురో యూహించుటకు శక్యముకాకున్నది. ఆత్మ తత్త్వ మధికముగాఁ దెలిసిన తరువాత మునుపటివలె నీశ్వరుఁడు భయమునకు హేతువయినవాఁడుగాక ప్రేమాస్పదుఁడయి కారుణ్య గుణమునుబట్టి దరిఁజేరవలసిన తండ్రి యయినాఁడు. ఇంకను జ్ఞానాభి వృద్ధి యెనకాలఁదని దేవుని కళ్యాణగుణము లింకను క్రొత్తవి యేవి బయలఁబడునో యెవ్వరెఱుఁగుదురు ? అందువలన మనకెట్టి యధికా త్మానందము కలుగునో యెవ్వరూహింపగలరు ? ఏవిషయమునం దభివృద్ధికి భంగము కల్పించినను మనకనేకనష్టములు కలుగును. అందులో ముఖ్యముగా మతమను పేరుపెట్టి యాత్మాభివృద్ధికి భంగము కలిగించెదు పక్షమున, కలిగెడు యనర్థ మింతంత యని చెప్పనలవికాదు. ఒకవేళ మానుషధర్మమునకే భంగముకలుగ వచ్చును. కాఁబట్టి యెల్లవారును దా మాత్మాభివృద్ధికి విఘ్నము కలి గించుమార్గమును గొంచెమయినను తలపెట్టకుందురుగాక ! జ్ఞానము నందును నీతియందును వృద్ధిలేకపోవుటయే మానుషధర్మమునకు భంగము కలుగుట. ఆత్మ మార్పులేక యెల్లకాలము నేకరీతిగా నుండు స్వభావము కలదికాదు—జ్ఞానాధిక్యాదులచేత దేవత్వమునైనను సమీపించుచుండును; లేదా తదభావాదులవలన మృగత్వమునయి నను సమీపించుచుండును. కాబట్టి వివేకియైనవాఁ డప్రమత్తుఁ

డయి యాత్మను మృగత్వమును సమీపింపనియ్యక జ్ఞానాభివృద్ధిచే నీశ్వరుని సమీపింపఁ జేయుటకే సర్వదా పాటుపడుచుండవలెను. ఈశ్వరుని సమీపించుట కనుకూలమగునట్లుగా నిహలోకయాత్ర నడుపుచు నాతనిని పొందయత్నించుట మనుష్యునకు బరమార్థము. పాపవిమోచనమును బొంది సద్వర్తనముచే నీశ్వరునిబొంది యానందింపఁ గలుగుటయే ముక్తి—అనఁగా పాపమునుండియు మృగత్వమునుండియు విముక్తులమయి నిత్యానందమును బొందుటయే ముక్తి. ఆత్మగుణముల నన్నిఁటిని వృద్ధిచేసికొనుటయే ముక్తిమార్గము. అన్ని శక్తులను సమానముగా పెంపుచెందించుట వృద్ధి కాని యొకదానికి నష్టము కలుగునట్లుగా మఱియొకటి పెరుగుట వృద్ధి కాదు. శరీర విషయమయిన వృద్ధిని ముందుగా జూడుఁడు. దేహముయొక్క సమస్తావయవములును సమానముగాను బలప్రదముగాను పెరుగుట వృద్ధియగునుగాని యొక్క తలగాని పొట్టగాని కాలుగాని బలియుట వృద్ధికాదు; అట్లొక్క యవయవము మాత్రమే పెరిగినచో దయ్యపు తలయనియు, బానకడుపనియు, బోదకాలనియు పేరులుపెట్టి దానిని వ్యాధిమూలముగా నెంతురు; బలములేక యుబ్బురోగమునందువలె దేహమంతయు బలియుటయు వృద్ధి కానేరదు. కాఁబట్టి యీవిధముగానే యాత్మవిషయమున జ్ఞానమును, నీతియును, ప్రేమాదులును, ఈశ్వరభక్తియును, సమానముగా వృద్ధినొందవలెను. ఇట్టి యభివృద్ధిని, పాపపరిహారమును బొంది నిత్యానందమునకయి ప్రయత్నించుట యెల్లవారికిని సహజగుణము. జ్ఞానాభావాదులచేతను తత్త్వవిచారము లేకపోవుటచేతను మనుష్యులు తప్పుదారులు త్రొక్కుచున్నను, నిత్యానందపదవి నిమిత్తమయి కృషిచేయవలెనన్న యభిలాషమాత్ర మనివార్యమయి పామరుఁడు మొదలుకొని పండితుని

వస్తుకను గల ప్రతిమనుష్యుని హృదయము నందును దృఢముగా నాటు కొనియున్నది. ఈ నిత్యపదవి నిమిత్తమే మూఢులుపవాసములుచేసియు తీర్థసేవలుచేసియు, నిప్పులుత్రొక్కియు, శూలములు గ్రుచ్చుకొనియు బాధపడుచున్నారు; జ్ఞానుల మనుకొను సన్యాసులు ప్రేమాస్పదులయిన భార్యాపుత్రాదులను ధనవస్తువాహనములను తక్కిన సమస్తప్రాపం చికసుఖములను త్యజించుచున్నారు; యోగు లెండలలో మాడియు, పంచాగ్నిమధ్యమున వసించియు, కాళ్ళను చేతులును శుష్కింపఁ జేసియు, ఆకలములు తిని యేకాకులయి తిరిగియు, శ్రమపడు చున్నారు. మోక్షాపేక్ష యెల్లవారికిని దుర్వారముగానున్నను తత్త్వ విచారము చేయక యంధపరంపరగా వర్తించుచుండుటవలనఁ బలు వురు సత్యమైన మార్గమును దెలిసికోలేక భ్రమపడి తిరుగుచున్నారు. మనలను మోక్షమునకుఁ గొనిపోయెడు రాజమార్గము పయిన జెప్పిన రీతిగా జ్ఞానాదులను వృద్ధిపఱుచుకొని, యీశ్వరునియందు సంపూర్ణ విశ్వాసము గలవారమయి మనకీశ్వరుఁడు విధించి యున్న ప్రకార ముగా మనలోపల వెలుఁగు జ్ఞానజ్యోతి ననుసరించి మనయంతరాత్మ బోధించు నీతిమార్గమున వర్తించుట యొక్కటియే. కాఁబట్టి యెల్లప్పు డును నీతిమార్గముననే నడచుచుండుట మనకు విధి; ఎన్నికష్టముల కయిన సహించి నీతిమార్గానుసరణమనెడి యీశ్వరాజ్ఞను నిర్వహిం చుట కెల్లరమును బద్ధులమయి యున్నాము. ఆత్మాభివృద్ధినిబట్టి యీ కర్తవ్యతాబుద్ధి మనుష్యులలో బలపడును.

ఆత్మాభివృద్ధి యైనకొలఁదిని జీవుఁ డీశ్వరునితోడి బంధుత్వ మును దృఢపఱుచుకొని యాతని సామీప్యమును బొంది నిత్యసేవ వలన నీశ్వరసాంగత్యసుఖము ననుభవించుచుఁ బాపదూరుఁడయి నిత్యానందపదవి నొందఁగలుగును. ఈశ్వరుఁడు సకలకల్యాణగుణ

సాగరుఁడు; జీవాత్మలు నీతిరసప్రవాహములు. నదులు సముద్రమును జేరఁబోవునట్లుగానే మన యాత్మలును పరమేశ్వరుని జేర సంతత యాత్ర చేయుచుండవలెను. ఆత్మధర్మమయిన నీతియం దభివృద్ధిని బొంది పురోయాత్ర చేసినకొలఁదిని మనయాత్మ లీశ్వరుని సమీపించు చున్నవని చెప్పుదురు. నీతియం దభివృద్ధి నొందుటయే మనుష్యుని లోని దేవాంశమును వృద్ధినొందించుట. కాఁబట్టి మనుష్యనామమును ధరించినవాఁడెల్లను తా నొకదినమునకంటె నొకదినము మఱింత పరిశుద్ధుఁడగుచు తనయందలి దేవాంశమును వృద్ధినొందించుటకు పాటుపడుచుండవలెను. మనుష్యుఁడు తానేవృత్తి నవలంబించినను, ఏపనిచేయుచున్నను, నీతిమార్గమును విడువక పవిత్రమయిన మనుష్య నామమునకు తానర్హుఁడగునట్లుగా ప్రవర్తింపవలెను. మనుష్యుఁడను పేరులోనే యెంతగౌరవమున్నది! అది రాజనామముకన్నను, శాస్త్రి నామముకన్నను, గౌరవావహమయిన యే యితర నామముకన్నను, మిక్కిలి యుత్కృష్టమైనది. రాజ్యాధికారముచేత నొకఁడు రాజ య్యును నీతి లేకపోవుటచేత పశువు కావచ్చును; విద్యావైభవము చేత నొకఁడు శాస్త్రియయ్యును నీతిలేకపోవుటచేత మృగము కావచ్చును. ఇహలోకవైభవము లేవి లేకపోయినను మానుషధర్మ మును విడువక చరించినవాఁడొక్కఁడే యీశ్వరదృష్టికి గొప్పవాఁ డును, తదనుగ్రహపాత్రుఁడును అగును గాని మానుషధర్మమును మీఱుటచేత మనుష్యనామమున కపాత్రుఁడైన రాజును, శాస్త్రియు, గారు. నీతి మానుషలక్షణమనియు, నీతిలేమి పశులక్షణమనియు, దృఢముగా తెలిసికొని మన మెప్పుడును నీతిపాశమునకు బద్ధులమై ప్రవర్తింపవలెను; నీతిపాశమే యీలోకములో మనుష్యులను బరస్ప రమును గూర్చెడి యనుబంధము, ఈ యనుబంధమే మిక్కిలి పావన

మైనదియు, భూమిలోఁగల సమస్తగుణబంధములలోను స్థిరమయిన దియు అయియున్నది. నీతిపాశమునుబట్టియే జను లన్యోన్యభ్రాత లయి యేకమగుచున్నారు; ఈ బంధము విడిపోయెనా జనులైక మత్యములేక చెదరి పరస్పరశత్రు లగుచున్నారు. 'నీతి' యని నే నిక్కడ నొక్క చిన్నపదమును జెప్పుచున్నను దానిలో నెంతో యర్థ మిమిడియున్నది; ఆచిన్నపదములో సత్యము, కారుణ్యము, క్షమ, పరోపకారము, మొదలైన గుణములనేకములు చేరియున్నవి. వానిని వివరించుట కిప్పుడవకాశము లేదు. వానిలో నొక్కొక్కదానిని గూర్చి ప్రత్యేకముగా నెంతెంతో చెప్పవలసియున్నది. నీతిబలము ముందు ప్రపంచములోని యనావశ్యకములైన భేదములన్నియు గాలికి దూదిపింజె తెగిరిపోవునట్లు చెల్లాచెదరగును. నీతిమంతుఁ డెవఁడో వాఁడే సర్వోత్కృష్టుఁడగుటచేత, నీతిబలమునుబట్టి యధమ జాతివాఁడును పూజనీయుఁడగును. నీతిరతియొక్కటియే మనకీశ్వరుఁ డనుగ్రహించిన శ్రేయస్సులలోనెల్ల మహోన్నతమయినది. ధర్మ రతియు, యుక్తాయుక్తములను దెలిసికొని యుక్తము నాచరించు మతియు, భగవదాజ్ఞారూపమున హృదయములో నంతరాత్మ చేయు బోధమును, పుణ్యాచరణసామర్థ్యమును, — ఇవి మనుష్యునకుఁగల గుణరత్నములు. లోకములో వీనికన్న నున్నతగుణము లేవియు లేవు. దేవతలయందుసహిత మింతకంటె మహత్తరమయినది వేఱేదియు లేదు. ఈగుణములు పూర్ణముగా నున్నప్పుడు దేవతలకును మనుష్యు లకును భేదము లేకయేపోవును. అప్పుడు భూలోకమే స్వర్గలోక మగును; మనుష్యులే దేవతలగుదురు. ఈగుణములను వృద్ధిపొందించు కొనుకొలఁదిని మనుష్యుఁడు దేవత్వమును సమీపించుచుండును. నీతి మార్గము ననుసరించి ప్రవర్తించుపక్షమునఁ బ్రతిమానవుఁడును నిరం

తరాభివృద్ధియు నిరతిశయానందమును బొందఁగలుగును. నీతివర్తనము స్వర్గమార్గము; నీతిరాహిత్యము నరకమార్గము. ఎప్పుడు మనస్సులలో యుక్తాయుక్తజ్ఞాన ముద్భవిల్లి యుక్తమార్గమున నడువవలయుననియు, అయుక్తమార్గమున నడువఁగూడదనియు మనయంతరాత్మ బోధింప మొదలుపెట్టెనదో యప్పటినుండియు నీతిమార్గమును మీఱి చరింప కుండుటకు మన మీశ్వరునకు బద్ధులమై యున్నాము. మన మనస్సులలో నుదయించి భాసిల్లుచున్న యీ యుక్తాయుక్తవివేచకజ్ఞానమే యీశ్వరుఁడు మన కనుగ్రహించిన సత్యవేదము. తక్కినవేదము లన్నియు దీని ననుసరించి బుద్ధిమంతులచేఁ గాలానుగుణముగా వ్రాయఁబడినవే. హృదయఫలకమునం దీశ్వరలిఖితమైయున్న యీనీతిబోధమే మన కీశ్వరునితోడి చుట్టఱికమును నెఱపి మనల నాతని నిత్యానందసామ్రాజ్యమును చూఱగొనునట్లు చేయును. ఈ జ్ఞానోదయమే స్థిరముగా మనల నీశ్వరగుణబద్ధులను జేయును. ఈజ్ఞానప్రకాశముచేత ధర్మరతి యెవ్వని హృదయమునందు దృఢముగా నాటుకొనునో వాఁడా దినమునుండియు ప్రపంచమునందలి యెవ్వారిచేతను మరల్పరాని యొకపాశమునకు బద్ధుఁడయి, ఈశ్వరునితోడ విడిపోని నూతనబంధుత్వమును పొంది, తనహృదయములో దివ్యాక్షరములతో లిఖింపఁబడియున్న యీశ్వరాజ్ఞ కొక్కదాసికే లోఁబడి, అంతరాత్మ బోధించు శాసనముల ననుసరించుటయే శాశ్వతానందమునకు మూలమని నమ్మి, లోకములోని దేది యెట్లయినను సమస్తవిషయములయందును తనయంతరాత్మను తన్మూలమున పరమేశ్వరుని సంతోషపెట్టుటకే ప్రవర్తించుచుండును. ఈ యంతరాత్మ బోధించు బోధమే శాశ్వతానందమహావృక్షమునకు బీజము. ప్రతివిషయమునందును దానిని తప్పక యనుసరించుచు వచ్చిన పక్షమున,

మనము కృతార్థులమయి దినదినాభివృద్ధినొంది సత్యపదవి నొందుదుము; దానిఘోషమును పెడచెవిని బెట్టి తద్వాక్యముల ననాదరణము చేసినపక్షమున, మనము దుఃఖభాజనులమై యీశ్వరానుగ్రహమునకు దూరుల మగుదుము. ఆత్మావబోధమునుబట్టి యీశ్వరానుగ్రహమువలన న్యాయవర్తనము నెవ్వరు పొందఁ గలుగుదురో వారెల్ల ప్రేమానుబంధముచేత బద్ధులయి పరస్పర సోదరస్నేహము గలవారగుదురు. ఈసోదర వాత్సల్యమునకు నీతిరతి యొక్కటియే కారణముగాని లౌకికాధికారమును ధనసంపదయు సత్కులప్రసూనత్వమును గారణములు గావు. ఇహలోకసంపద లెల్లను గలిగియున్నను నీతిబాహ్యుఁ డగుటవలన మనుష్యుఁడు ధర్మదృష్టికి పశుప్రాయుఁడయి యీశ్వరసాంగత్యమున కనర్హుఁడు కావచ్చును. ఇహలోకసంపద లేవియు లేకపోయినను నీతిమంతుఁడగుటవలన మనుష్యుఁడు దేవతుల్యుఁడయి యీశ్వరసాంగత్యమున కర్హుఁడు కావచ్చును. కాఁబట్టి మోక్షానందపదవికిని ఐహికౌన్నత్యమునకును సంబంధమేదియు లేదు. మన మొకవేళ వారిపేరుల నయినను వినకపోయినను నిజమయిన నీతిమంతు లీలోకమునందు విస్తారముగా బీదవారిలోనే యుండవచ్చును. మిక్కిలి దుర్లంఘ్యములైన వ్యామోహములకు లోఁబడనివారును, దుస్సాధ్యములయిన ధర్మకార్యములను పూనికతో నిర్వహించినవారును, ఎటువంటి యాపదలు వచ్చినను వెనుకతీయక యొక్క యీశ్వరుని ప్రాపునే నమ్ముకొని తదాజ్ఞానుసరణమే నిత్యకృత్యముగా ప్రవర్తించినవారును, దుస్తరములైన పాపసముద్రముల నీఁది యతికష్టపడి దుష్టుల బాధలను సహించి పరిశుద్ధమయిన జీవయాత్రను చేసినవారును బీదవారిలోనే యుండవచ్చును. ఈశ్వరునిదృష్టియందిట్టివారు మాత్రమే నిజమైన గొప్పవారు. గొప్పతన మెప్పుడును నీతి

బలములోను, భగవదాజ్ఞానుసరణములోను, కష్టములను ధైర్య ముతో సహించుటలోను, ఇంద్రియనిగ్రహములోను, ఉండును గాని ధనికత్వ దరిద్రత్వములలో నుండదు. కండక్రొవ్వువలన నింద్రియము లుద్రేకించి దుర్మార్గమున కాకర్షించునప్పుడు వాని యుద్రేకమును ధర్మపాశములచే నడంచి పోరాడి వానిని యుక్తమార్గమునకుఁ ద్రిప్పి యాధ్యాత్మికబోధమువలన నింద్రియవర్గమును నిగ్రహించి తనయధీనములో నుంచుకొనుటకయి పాటుపడుట మనుష్యధర్మము. ఇంద్రియబద్ధుఁడయి యింద్రియసుఖములకు దాసుఁడుగాక యింద్రియ నిగ్రహము చేయఁగలిగిన పురుషుఁడే నిజమయిన పౌరుషము గల వాఁడు. ఇంద్రియనిగ్రహము చేసి మంచిమార్గముల నడువలేని పుణ్య భీరుఁడు మీసములు మొదలయిన సమస్తపురుష చిహ్నములను గలవాఁ డైనను పౌరుషహీనుఁడే. పాపముతోడి పోరాటమువలనను, కష్టము లకును బాధలకును చలింపక నీతిపథమున నిలుచుటవలనను మాత్రమే మనుష్యుఁ డధికుఁడగును. కష్టములును, నిర్బంధములును వచ్చినపుడు ధర్మమార్గమును తొలఁగనివాఁడొకఁడే మహానుభావుఁడు; అతఁ డొక్కఁడే మానుషధర్మముగలవాఁడు. పాతకభూతములతో పోరాడి గెలువఁ గలిగినప్పుడే యాత్మ కనిర్వాచ్యమైన, యనుభవైకవేద్య మయిన యానందము కలుగును. ఈశ్వర మహిమను భూమియందు భాసిల్లఁజేయుటకయి పాపపిశాచములతో వీరభటునివలె నిరంతర యుద్ధము చేయుచుండు వానికే యీశ్వరుఁ డెప్పుడును సహాయుఁ డయి జయమును గలిగించుచుండును. ధర్మ మెక్కడ నుండునో యీశ్వరుఁ డక్కడనుండును; ఈశ్వరుఁ డెక్కడనుండునో జయ మక్కడఁ గలుగును. కాఁబట్టి లోకములో ధర్మబలముతో సమాన మయిన బలము వేఱొకటిలేదు. ఈశ్వరుఁడు మంచికార్యముల కెప్పు

దును త్రోడుపడుచుండుట సత్యమే యయినను, అతని సాహాయ్యమును పొందుటకు మన మర్హులమని చూపుటకై పిఱికితండలేని వీరభటుల వలె నసహాయశూరులమయి నిలిచి మనము పాపము లను పెను భూతములపయి ధ్వజమెత్తి వానిని నిర్మూలనము చేయుటకయి యెల్లప్పుడును నడుముకట్టుకొని నిర్భయముగా ముందుకు నడుచు చుండవలెను; అప్పుడు పాపభూతావిష్టులయియున్న వారివలనను దీర్ఘకాల దురాచారపిశాచావేశపరవశులయియున్న వారివలనను, మూర్ఖతారాక్షసప్రేరితులయిన వారివలనను మన కనేక విధములయిన కష్టములు రావచ్చును. గాయములు లేని పోరాట మెక్కడను గలుగదు; గాయములకు వెనుకతీయడు వీరభటత్వమును గలుగదు. క్షణభంగురము లయిన యిహలోకసంపదల నిమిత్తము పోరాడునప్పుడే వీరుఁడైనవాఁడు శరీరమును విడువఁ దెగింపవలసియుండఁగా, పార లౌకిక శాశ్వతానందపదవికై పెనఁగులాడెడు సత్కార్యశూరుఁడు విడువ గూడని దీలోకములోని దేదియుండును? కష్టము లన్నిప్రక్కలను వచ్చి చుట్టుకొన్నప్పుడును, బంధుమిత్రాదులు సహితము ప్రతిపక్షు లయి ద్వేషించి మహాధైర్యశాలికి సహితము భయమును నిరాశయు కలుగునట్లుగా బాధించుచున్నప్పుడును, మన దుర్బలత్వమును దెలిసి కొని యీశ్వరసాహాయ్యమును వేఁడి తత్సాహాయ్యమువలన నూతన బలోత్సాహములను పొంది పాపబలనిర్మూలనమునకయి యమానుష ధైర్యమును జూపవలెను. అట్లు చేసినప్పుడే మనుష్యుని గొప్పతనము వెల్లడి యగును. ఘటనాఘటనసమర్థుఁడయిన యీశ్వరుని ప్రాపు వలన ధర్మశూరుల వజ్రహృదయములనుండి ప్రతిపక్షులు ప్రయోగించు వ్యాఘాతశిలల తాకుడువలన నార్పరాని యుత్సాహాగ్ని యుదయించి పురాణములయందు వర్ణింపబడిన బ్రహ్మాస్త్రమువలె నమోఘ వైరి

విజయకారణము కావచ్చును. ఇట్లుత్సాహవాక్యములు పలుకుసనప్పు డుపదేశమునం దిది యంతయు మనోహరముగా నేయున్నది గాని యను ష్ఠానసాధ్యమగునా ? యని కొందఱి హృదయములయందు సందేహము గలుగవచ్చును. అయినను నేనిప్పుడు చెప్పినదంతయు భగవచ్ఛక్తి యందు సంపూర్ణవిశ్వాసముగల ధర్మశూరులకుఁ బరమసాధ్యమే కాని యిందసాధ్యమేదియు లేదు. ఇట్టి సర్వజనశ్లాఘనీయమయిన పవిత్రచరిత్రముగల మహాత్ముల మహిమలను మనము పూర్వచరిత్ర ములయందుఁ జదివియున్నాము. సత్యము నిమిత్తమె సర్వకష్టముల కును లోనయి సమయము వచ్చినప్పుడు తమప్రాణములను సహితము తృణప్రాయముగా విడిచిన కీర్తికాయు లనేకులు చిరకాలము క్రిందటనే స్వర్గస్థులయ్యును నేఁటివఱకును మృతజీవులయి మన హృదయనివాస మును విడువక సమస్తసత్కార్యాచరణములందును మనకపరిమితో త్సాహసాహసములను కలిగించుచున్నారు. అట్టివారి చరిత్రములను పూర్ణముగా వివరింపవలసినదేకాని యట్టిపని కిది సమయముకాక పోవుటచేత దానినింకొకసారికి విడిచిపెట్టి యిప్పుడు సత్కార్యాచరణ మున కావశ్యకములయిన మనోధర్మములనుగూర్చి కొంచెము చెప్పెదను.

ఒక్క సత్కార్యమును పూని నిర్వహించుటకయి మనుష్యునకు మొట్టమొదట మనోనిశ్చయ మొక్కటి యుండవలెను. మనోనిశ్చ యము లేకపోయినపక్షమున, మనుష్యుఁ డెంతటి శక్తిసంపన్నుఁడయి నను దుర్బలుఁడయి యేకార్యమును పూనుటకును సమర్థుఁడుకాక పోవును. మనోనిశ్చయము కలుగుటకయి యాత్మగౌరవ మావశ్య కము. ఆత్మగౌరవమనఁగా తనశక్తియందు తనకు విశ్వాసముండుట. ప్రతిమనుష్యునకును తాను శక్తిమంతుఁడననియు బుద్ధిమంతుఁడననియు

కొంచెముగానో గొప్పగానో మనస్సులో గర్వముండవచ్చునుగాని తా నొకపని చేయవలసివచ్చినప్పుడు మాత్రము కష్టములు వచ్చునేని వాని కప్పుడా యహంకారము నిలువదు. ఇట్టి పనికిమాలిన యహంభావమాత్మ గౌరవము కాదు. తన సదభిప్రాయములతో నితరు లేకీభవింపనప్పు డును, తనపూనిక కితరులు విఘ్నము లాచరించుచున్నప్పుడును, తన కార్యమువలనఁ గష్టములు వచ్చునప్పుడును, నిరుత్సాహుఁడుగాక తనయాలోచనయందు విశ్వాసమును దనశక్తియందు గురుత్వమును గలిగియుండుట యాత్మగౌరవము. మనతో నేకీభవింపనంతమాత్ర ముచేత ననాదరముచేయక యితరుల యభిప్రాయములయం దుచిత గౌరవముంచుట మనకు ధర్మమే యయినను, మన యభిప్రాయములు సరియైనవని మనము దృఢముగా నమ్మియున్నప్పుడుమాత్ర మితరుల మాటల నాదరించి మనపూనికను విడువఁగూడదు. తనకొక దృఢనిశ్చ యములేక యితరుల యభిప్రాయములనే నమ్మియుండువాఁడు తా నేపనియందును స్వతంత్రుఁడుగాక మహావాయుపథమునఁబడిన కాకి యీకెవలె గాలి విసరిన దెసలకెల్లను దూలుచు స్వగౌరవమును లేనివాఁడగును. అట్టివాఁ డల్పకార్యమును సహితము స్వతంత్రముగా నిర్వహించుటకు శక్తుఁడుగాక వఱదకు గొట్టుకొని పోవుపుడకవలె నిటునటు నూగులాడుచు నొకతెన్నుఁ బోవక యాచారప్రవాహ మీడ్చినకెల్లను జనుచు వ్యర్థుఁడగును. కాఁబట్టి కార్యశూరునకు దృఢనిశ్చయ మావశ్యకము. గ్రహణశక్తియు సాధనసంపత్తియుఁ గావలసినంతయున్నను దృఢనిశ్చయము లేకపోవుటవలన ననేకుల యందు వాక్శూరతయేకాని కార్యశూరత కానరాకున్నది. కార్య భీరుత పురుషలక్షణము కాదు; కాఁబట్టి సత్కార్యాచరణపౌరుషము గలవాఁ డితరు లేమనుకొందురోయన్న సందేహమును విడిచి ధైర్య

సాహసములను బూని తాను దృఢముగా నమ్మినదాని ననుష్ఠించుటకు బద్ధకంకణుఁడు కావలెను. ఉపదేశమునకంటె ననుష్ఠాన మెంతో శ్రేష్ఠమయినది. మనదేశమునందు శుష్కోపదేష్టలు నక్షత్రము లంతమంది యున్నను, అనుష్ఠానసమయమునం దా నక్షత్రము లంత మందియు దివానక్షత్రములంతమంది యగుచున్నారు. మనదేశమునం దిప్పు డుపదేష్టలకంటె ముఖ్యముగా ననుష్ఠాతలు కావలసియున్నారు. వేయిమాటలు చెప్పుటకన్న నొక్కకార్యమునుజేసి చూపినయెడల జనులకు వారియందెంతో యధికగౌరవము కలుగును; క్రియావంతు లయినప్పుడు మాత్రమే జనులు వారి ననుసరింపఁజూతురు. పుస్తకములయందు మంచివారి చరిత్రములను జదివినప్పుడును, మంచియుపన్యాసములను విన్నప్పుడును, కొంతవఱకెల్లవారికిని సత్కార్యములు చేయవలెనన్న యభిలాష కలుగవచ్చును గాని యాయభిలాషము సత్ప్రవర్తనమును కన్నులార చూచినప్పుడున్నంత బలిష్ఠముగాను కార్యకరముగాను మఱియొకప్పుడుండదు. ఒకవేళ నితరులు తన్నను సరింపకపోయినను, తాను సత్యమని యెఱిఁగినదాని ననుష్ఠించుట మనుష్యునకు ధర్మము. తానాలోచించి శ్రమపడి కనుఁగొన్న సత్యమును దాననుష్ఠించి ఫలమును బొందకపోయినయెడల దానివలనఁ బ్రయోజనమేమి? తనసత్యము తనకే పనికిరానియెడల నితరులకేమి పనికివచ్చును? తనప్రవర్తనమును తాను సంస్కరించుకోలేనిపక్షమున లోకము నేమిసంస్కరింపఁ గలుగును? లోకమును సంస్కరింపఁబూనుటకు ముందుగా సంస్కారము తనతో నారంభము కావలెను. ఒక్కఁడు తనప్రవర్తనమును జక్కఁజేసికొన్నను లోకములోని దుష్ప్రవర్తనుల సంఖ్యలో నొక్కటి తక్కువగును. ఈప్రకారముగాఁ బ్రతిమనుష్యుఁడును తననడతను దిద్దుకొనుటకుఁ బ్రయత్నించినపక్ష

మున, కొంతకాలములోనే లోకమంతయు చక్కపడవచ్చును. అట్లు కష్టపడి తనవర్తనమును బాగుజేసికొనఁజూడక ప్రతిమనుష్యుఁడును దాను వయినుండి సులభముగా లోకమును సంస్కరింపవలెనని యాలోచించుచుండుటవలన మనదేశమునం దేవిషయమునను సంస్కారము సాగకున్నది. కష్టపడి పనిచేసినచో సంస్కారము జరుగునుగాని మంత్రములవలన జరగదు. అజ్ఞానాంధకారముచేత మార్గము దుర్గమమయియున్నప్పుడు ధర్మాచరణధైర్యము గలవా రెవ్వరయినను ముందుగావచ్చి కష్టపడి మార్గమును ఛేదించి దారిచూపి పని చేయవలెను. తెలియనివారికి తెలిసినవారు దారిచూపుట మానవ ధర్మము. తెలియనివారు చూపెడు తప్పుదారినే తెలిసినవారు పోవుట యధర్మము. కాఁబట్టి యజ్ఞానములోఁ బోరాడి మనము మూఢులకు త్రోవచూపి వారు మనత్రోవ ననుసరించునట్లు చేయవలెనుగాని మూఢులను సంతోషపెట్టుటకొఱకు మనమే వారిదారి ననుసరించుట నీతికాదు. మూఢులను కూడఁగట్టుకొని రావలెనని నీతిమాలి మూఢమార్గమునఁ దెలిసియు విపరీతముగాఁ బ్రవర్తించుచు వచ్చినపక్షమున, క్రమక్రమముగా మనము నిజముగానే మూఢులమయి యెన్నటికిని కడతేరనివార మగుదుము; సంస్కార మెన్నటికిని జరగదు. కాఁబట్టి యింకను కాలమురాలేదని యూరకుండక యెల్లవారును యథాశక్తిని లోకమునకు మేలుజేయుటయందుఁ బ్రవర్తింపవలెను. కాలమురాలేదనుట నీతిభీరులవచనముగాని కార్యశూరులనవలసిన మాటకాదు. విడువక కృషిచేయుచు వచ్చినచో కాలము తనంతనే వచ్చును. కృషిచేయక యెల్లవారును కాలముయొక్క రాకకే వేచియుండెడుపక్షమున కాలమెప్పటికిని రానేరదు. ఎంతోకాలముక్రిందటనే లోకాభివృద్ధి నిమిత్తమయి యెంతో కష్ట

పడి పరోపకారపరాయణులయిన మహానుభావు లనేకు లెన్నెన్నో ఘనకార్యములను నిర్వహించియున్నారు. ధర్మశూరులైన యామహాత్ములకు వెనుకనే కాలమువచ్చినను ధర్మభీరులయినవారి కింకను కాలమురాకున్నది. అట్టివారియొద్ద కెన్నటికినిరాదు. దృఢనిశ్చయమునకు కాలముసహిత మెప్పుడును లోఁబడియే యుండునుగాన దృఢనిశ్చయముగలవాఁ డెట్టికార్యమునైనను ఎప్పుడైనను సాధింపఁగలుగును. దృఢచిత్తునకు తన చింత పరిశుద్ధమయి యీశ్వరునకు ప్రీతికరమయినప్పు డితరుల యభిప్రాయముతోఁగాని మెప్పుతోఁగాని పని యుండదు. తనకు సత్కార్యాచరణమునందు దృఢచిత్తములేక యితరుల నాలోచన యడుగఁబోయినప్పు డనేకు లనేకవిధములుగాఁ జెప్పుదురు. వారిలోఁ గొందఱామోదింతురు; కొందఱు పరిహసింతురు; కొందఱు భూషింతురు; కొందఱు దూషింతురు. అట్టిసమయమునందట్టివానిచిత్తము స్థైర్యమును విడిచి గాలిలోనిదీపమువలె నల్లలనాడుచుఁ బనికిమాలినదగును. కాఁబట్టి బుద్ధిమంతుఁడైనవాఁడు ముందుగానే చక్కఁగా నాలోచించుకొని తాను తలపెట్టిన పనియొక్కయుద్దేశము మంచిదయినపక్షమున, నడుమ నెన్నికష్టములు వచ్చినను తాను పూనినపనిని విడువక కొనసాగించుటకు దృఢనిశ్చయము చేసికొనవలెను. అట్టిదృఢనిశ్చయమే కార్యసిద్ధికి మూలము; దృఢనిశ్చయముగలవాఁడు తనకు సాధనకలాపము లేకపోయినను, విఘ్నములు వచ్చినను, జడియక యెప్పుడును కార్యసాధనమునందే దృష్టి యుంచును. లోకములోఁ గొందఱు తమకు ధనమును, బలమును, బుద్ధియు, అధికారమును, పాండిత్యమును, ఉండియున్నయెడలఁ దామెంతో లోకోపకారమును చేయఁగలుగుదుమని చెప్పుదురు. ఇవి యన్నియు నున్నను మనోనిశ్చయము లేకపోవుటచేత నేమియుఁజేయని

వారిని, ఇంకేమియు లేకపోయినను మనోనిశ్చయ మొక్కటి యుండు టచేత ననేకసత్కార్యములను జేయఁగలిగినవారిని, మన మెందఱినో కనియు వినియు నున్నాము. కాఁబట్టి కార్యసాఫల్యమునకు మనోనిశ్చయము ప్రథమసాధనము.

ఎంతటి మనోనిశ్చయమున్నను లోకహితార్థముగా నూతన కార్యమును పూని ప్రొత్సాహింపను ద్రొక్కు వారికి కష్టములు రాక మానవు. అప్పుడు మనోనిశ్చయమునకు తోడు ధైర్యమును రెండవ సాధనముగా వహింపవలెను. ధైర్యముగలవాని కాకష్టములే కార్య నిర్వాహణమునకు ప్రోత్సాహకరములును విజయదాయకములును అగును. ఈశ్వరప్రీతికయి యొకసద్ధర్మమును ప్రతిష్ఠింపఁ బాటుపడు వారికి వచ్చెడుకష్టము లనేకములుగా నుండును. మన మెవ్వరిక్షేమము నిమిత్తమయి సత్కార్యదీక్షను వహింతుమో వారే మనకు ద్వేషు లయి కార్యవిఘాతమునకుఁ బ్రయత్నింతురు. లోకోపకార మొక్క టియే మన కర్తవ్యకృత్యము; లోకులు దానికర్హులయినను గాకపోయి నను, ప్రపంచము దానినంగీకరించినను అంగీకరింపకపోయినను కూడ లోకమునకు మేలు చేయఁగడఁగుట మానవరూపమును ధరించిన మన కుత్తమధర్మము. అట్టిపని భగవంతుని కెప్పుడును తృప్తికర ముగా నుండును; అందువలన మనయంతరాత్మయు సంతోషించును. ఆత్మానందమున కీశ్వరుని మెప్పు కావలసినదే కాని లోకముయొక్క యంగీకారముతోఁగాని మెప్పుతోఁగాని పనిలేదు. లోకమునకు మనము చేయఁబూనిన యుపకారమునకు మనము జనులవలన ప్రత్యు పకారమునుగాని కృతజ్ఞతనుగాని శ్లాఘనునుగాని యపేక్షింపక ఫలనిరపేక్షముగా పరమేశ్వరప్రీతికయి యది ధర్మమనుబుద్ధితో చేయవలెను. ఇతరుల యనుగ్రహమును మెప్పును సత్కార్యత్యాగము

నకు ప్రతిఫలములు కానేరవు. గనుక మనము వానిని సరకుగొనక కష్టములకు సహించి ధైర్యముతో నిలువవలయును. ఇటువంటి సమయములయందు మనకావఱకు తోడ్పాటుగానున్న మిత్రులు సహితము మనలను చేయివిడుతురు; బంధుజనులు పరిత్యజింతురు; సహాయులు దూరముగా తొలఁగుదురు. లోకమంతయు మనలను విడిచినను విడువనిండు. ఎవ్వరు మనలను విడిచినను మనము ధైర్యమును మాత్రము విడువక ధర్మబలమును నమ్ముకొని యసహాయశూరులమయి ప్రవర్తింపవలెను. ఇతరుల సాహాయ్యమును బొందకయే మనమొక ఘనకార్యమును నిర్వహించినయెడల మనకది మఱెంత ప్రతిష్ఠావహము. లోకమంతయు మనలను నిరోధించినను, లోకేశ్వరుఁడు మనకు ప్రాపైయుండఁగా మనము భయపడవలసినపని లేదు.

ఒకానొకప్పుడు బంధుజనులు మొదలయినవారు తీయని మాటలు చెప్పియు, బోధించియు, ప్రేమను నటించియు, కన్నీరు నించియు, ప్రార్థించియు మనలను సత్కార్యములనుండి మరలింపఁ జూతురు. మనయందును, సత్యమునందును, ధర్మమునందును గౌరవము లేనివారిపయిని మనమేల గౌరవముంచవలెను ? మన యంతరాత్మ సంతోషమును వారు చూడనప్పుడు వారి సంతోషమును మనమేల చూడవలెను ? మన యంతరాత్మయు భగవంతుఁడును మంచిపని యనిచెప్పి సంతోషించుచుండఁగా, ఈశ్వరునియందును మానవ ప్రకృతియందును గౌరవములేని స్వార్థపరులు సంతోషింపకపోయిన యెడల మనకేమిలోపము ? ధర్మాచరణవ్యవసాయమునందు కార్య సాఫల్యమైనప్పుడు కలుగుసంతోషముతో సమానమయిన సంతోషము లోకములో మఱియొకటి యుండునా ? మనకదియొక్కటి చాలదా ? కాఁబట్టి సత్కార్యములనుండి మనలను మరలించి యాత్మ

నందసుఖములకు భంగము కలిగింపఁ జూచువారి మంచిమాటలను చక్కెర మెత్తిన విషఘుటికలనుగా భావించి దూరముగా పరిహరింప వలయును.

మంచిమాటలు పనిచేయనప్పుడు వారు మనలను దూషించి బెదిరింప నారంభింతురు. అట్టి దూషణములకును మనము భయపడఁ గూడదు. వారు మనలను మాటలచేత తిరస్కరించుచున్నప్పుడు ప్రతిదూషణమునకు దిగక పూనిన యుద్యమమును విడువక మనము వారిని కార్యముచేత తిరస్కరింపవలెను. మనము కొంతకాలము వారిదూషణములకును వారు మనకుంచెడు పతిత, నాస్తికాది బిరుద నామములకును వారు చేసెడు పరిహాసములకును సహించి నిలిచి ధైర్యముతో పనిచేయుచు వచ్చినపక్షమున, కడపట వారే విసుగు చెంది తమ పరిహాసములు మనమీఁద వ్యర్థమయినవని సిగ్గుపడి యెగ తాళిచేయ మానుకొందురు. తమ పరిహాసములను లక్ష్యపెట్టక పోవుట వలన వారొకవేళ మనలను మొండివారని భావించినను భావింప నిండు. అందువలన మనము గర్వపడవలసినదేకాని యెంతమాత్ర మును సిగ్గుపడవలసిన పనిలేదు.

మన ప్రతిపక్షులు కొన్నిసమయములయందు దూషణముల తోను, పరిహాసములతోను, తిట్లతోను తృప్తినొందక దౌర్జన్యమును జూపి మనకనేకవిధములయిన బాధలను జేయుదురు. ఒకసత్కార్య మును సాధింపఁ దలంపుగొన్నవాఁడు దానివలన వచ్చెడు సత్ఫలము లకువలెనే దుష్ఫలములకును తలయొగ్గవలెను; ఎన్ని కష్టములు వచ్చి నను వెనుకంజవేయక ముందడుగిడుచుండవలెను. ఆపదలు వచ్చి నప్పుడు జడిసి పౌరుషము విడిచి లోఁబడుటకంటె నవమానకరము మఱియొకటిలేదు. సత్కార్యాచరణమునందే పౌరుషము లేకపోయి

నప్పుడేఁక మానవుని పౌరుషమేటికి ? కాల్పనా ? పురుషనామమును ధరించినవానికి ప్రతిపక్షు లెక్కువయయి కష్టము లాపాదించుచున్న ప్పుడే వారిని సాధింపవలెనన్న యావేశముచేతను రోషముచేతను సత్కార్యాచరణమునందు ధైర్య మెక్కువ కావలెను. ఝుంఝూ మారుతమునలన మిణుకు మిణుకు మను దీపము లాఱిపోయినను దావాగ్ని ప్రజ్వరిల్లునట్లుగా ప్రతిపక్షుల దౌష్ట్యమారుతములవలనను మహాత్ముల హృదయములయం దార్పరాని యుత్సాహదావాగ్ని ప్రజ్వరిల్లి దుస్సహమయి విఘ్నమృగములను భస్మముచేయును. తగినకష్టము లేక లోకములో నెంతటి చిన్నపనియు నెఱవేఱదు. ప్రతికార్యమును కష్టమువలననే సఫలముకావలెనని భగవదుద్దేశము. నడుచునప్పుడు పడు నని శిశువును తల్లి తొట్లలోనే బంధించి యుంచిన పక్షమున వాఁడెదిగి నప్పుడు నడువ నసమర్థుఁడగును. సానఁబెట్టిన మణివలెను, అఱుగఁ దీసిన గంధపుచెక్కవలెను, పురుషుఁడును కష్టములచేతను నలుగుడుల చేతను మాత్రమె వన్నెయు వాసియుఁ గాంచును. ఫలగౌరవమును బట్టి కష్టములు సహితము హెచ్చుగుచుండును. సత్కార్యములచేత లోకమున కనంతఫలములను కలుగఁజేయ యత్నించువాఁడు ప్రాణము విడువవలసినంత కష్టమువచ్చినను సంతోషముతో శిరసావహింప వలెను. ఎప్పుడయినను విడువవలసిన దేహమును హాయిగా లోకోప కారకార్యమునందు విడువక, సత్కార్యమును త్యజించి దీర్ఘవేదన ననుభవించుచు రోగములచే విడుచు నిమిత్త ముత్తమపురుషుఁడు దాచుకొనఁగోరునా ? కోరఁడు. దృఢచిత్తుని హృదయమెప్పుడును తాను పూనిన కార్యమునకు దుశ్ఛేద్యములయిన యినపగొలుసులతో బంధింపఁబడియుండును గాన మృత్యుదేవత యొక్కతె తప్ప నితరు లా బంధము నెవ్వరును విడఁగొట్టఁజాలరు.

కార్యసాఫల్యమునకు నిరంతరకృషి మఱియొక సాధనము. విడువక పట్టుదలతోఁ బనిచేయుచు వచ్చినపక్షమునఁ గాలక్రమమున నెటువంటి దుస్సాధ్యములును సుసాధ్యము లగును. నీరువంటి మృదు పదార్థము పడఁగా పడఁగా రాతివంటి కఠినపదార్థము సహితము కరుగు చుండఁగా నిరంతరకృషిచేత మనుష్యులు లోఁబడుట యేమి యాశ్చ ర్యము? మన మెంతకృషిచేసినను కొన్ని సమయములయందు కార్యము విఫలము కావచ్చును. అందుచేత నిరుత్సాహమును పొందక కార్య మొకసారి విఫలమయిన పక్షమున మరల సఫలమగువఱకును మఱింత పూనికతోఁ బనిచేయవలెను. కార్యసాఫల్యమయినను మనము గర్వపడి దానితో సంతుష్టిపొంది యూరకుండక దేహములో ప్రాణమున్నంతవఱకు నొకటితరువాత నొకటిగా సదా సత్కార్యా చరణమునకే పూనుచుండవలెను. సత్కార్యములకయి కృషిచేయుట మాత్రమే మనధర్మముకాని వాని సాఫల్యవైఫల్యములు మనచేతి లోనివికావు. కార్యసాఫల్యమయినను కాకపోయిననుగూడ విడువక యీశ్వరముఖమును జూచి మనశరీరప్రాణముల నీశ్వరార్పణముఁ జేసి మనకృషి మనము చేయుచుండవలెను. అప్పుడు మనుష్యులు మనలను దూరముచేసి విడిచినను, ఈశ్వరుఁడు దాపునకుఁజేర్చి కాపాడును.

మనకు సహాయసంపద లేదనియు నొంటిగాండ్ర మేమిచేయఁ గలమనియు నిరుత్సాహపడవలసినపనియు లేదు. ఈశ్వరుని ప్రాపున్నప్పు డితరుల తోడ్పాటు లేకున్న లోపమేమి? అంతేకాక లోకములో ప్రతిమహత్తరపదార్థమును మొట్టమొదట చిన్నవస్తువునుండియే యారంభమగుచున్నది. నూఱులకొలఁది జనులకు నీడనిచ్చి శ్రమముడఁచు గొప్పమఱ్ఱిచెట్టు నలకంతబీజమునుండియే బయలుదేఱును. ఎన్నో దేశ ములలోఁ బ్రవహించుచు లక్షలకొలఁది జనులకు స్నానపానములకు జల

మిచ్చి సస్యాదులను ఫలింపఁజేయు మన యీ గోదావరీనదియు మొట్ట మొదట నాసికాత్రయంబకముకడ నొకచిన్న యూటలోనుండి పుట్టినదే. కాఁబట్టి మన మల్పసంఖ్యగలవారమని ధైర్యమును విడువక యీశ్వర బలమును జూచుకొని సత్కార్యాచరణమునకు సాహసింపవలెను. సకల సత్కార్యములయందును మన కీశ్వరుఁడు తోడ్పడునుగాక !

విద్యాధికుల ధర్మములు.

★

By

K. VEERESA LINGAM

విద్యాధికుల ధర్మములు

సామాజికులారా! మిత్రులారా!

మూఁడు దినములనుండి మనమీ మందిరమునందు మన సమాజముయొక్క సంవత్సరోత్సవమును జరుపుచున్నాము. ఈ సంవత్సరముతో పదునేనేండ్లు గడపి షోడశవర్షప్రాయమునొంది మనసమాజమిప్పుడు తన యౌవనదశారంభమును సూచించుచున్నది. బాల్యదశ జాఱుటచేత మన సమాజమునకిఁక స్వకృత్యమును ధైర్యముతో నిర్వహింపవలసినకాలము వచ్చినదని నేను నమ్ముచున్నాను. నానమ్మకమును బలపఱిచెడు సూచనలును నామనస్సున కిప్పుడు కొన్ని పొడకట్టుచున్నవి. ఆరంభదశ మొదలుకొని మన సమాజము నిర్వహింపఁగలిగిన ఘనకార్య మిదియని నేను జెప్పలేకపోయినను జన్మదినము నుండియు సమాజముయొక్క యునికినే యుపేక్షచేసి యూరకుండిన మన పురజనులనేకు లిప్పుడు ముచికుందునివలె చిరకాలనిద్రనుండి యాకస్మికముగా లేచి మనమీఁద ధ్వజమెత్తి మన ప్రయత్నములకు విఘాతములు చేయ బాటుపడ నారంభించుట చూడఁగా మన సమాజ మితరు లుపేక్షచేసి యూరకుండవలసినంత దుర్బలమయినది కాదని పూర్వాచారపరాయణులయిన మన పురజనులకుఁ జూపి యొక ఘనకార్యమును జేయఁగలిగినదని భావించుచున్నాను. ఇప్పుడు యుద్ధ మారంభమయినందున భగవదాజ్ఞను శిరసావహించి మన సామాజికు లిఁక నెట్టి పౌరుషముతో దురాచారపిశాచములతోఁ బోరాడుదురో, యెంతవఱకు విజయమునొంది యీశ్వరమతమును దేశమునందు వ్యాపింపఁజేయుదురో చూడవలసి యున్నది. యుద్ధమే

యారంభముకానిపక్షమున భక్తివిశ్వాసములతో నీశ్వరసేవయందుఁ దమప్రాణముల నర్పించి పోరాడు వీరభటులెవ్వరో యీశ్వరద్రోహులయి పాఱిపోయి యసత్యపిశాచముల వాతఁబడు పిఱికిపంద లెవ్వరో తెలియరాదుగదా! ఇంతవఱకును మనమీఁదికి రాక యూరకున్న ప్రతిపక్షు లింతచొరవతో మనపయికి దండువెడలుటకు వారి కిప్పుడేమి బలము దొరకెనని కొందఱు సందేహపడవచ్చును. మునుపీవంకనుండువారు సహితము భయపడి తమ్మనుసరింపఁగా నధిక సంఖ్యతో మనమీఁద దాడివెడలుటకు మన ప్రతిపక్షుల కిప్పుడితర బలము లేకపోలేదు. వారికిప్పుడు మనుష్యబలము మాత్రమే కాక తమ్మిప్పు డాశ్రయించియున్న తమపాలిటి భాగ్యదేవతయొక్క బలము కూడ సమకూడినది. సృష్ట్యాదినుండియు ప్రపంచములోని వివిధజాతుల వారిచేతను గల్పింపఁబడిన సమస్తదేవతలకంటెను బలాధికురాలయి గణనాతీత జనపరంపరచే నారాధింపఁబడుచున్న మహాదేవత యొకటి వారికి ప్రాపయి నిలిచి సకలవిధముల తోడుపడుచున్నప్పుడు వారు మనమీఁద దండెత్త సాహసింపక యేల వెనుకతీయుదురు? వారి దేవతతో సమానమయిన చుఱుకుఁదనము గలది నా బుద్ధికి మఱియు గోచరముకాలేదు; దాని కెప్పుడును బడలికయే లేదు. అటువంటి విచిత్రశక్తిగల యపూర్వదేవత మనలను గెలుచుటకయి వారి కెన్నో విద్యల ననుగ్రహించి యున్నది; ఎన్నో యద్భుతసాధనములను బ్రసాదించియున్నది; ఎన్నో యపూర్వదర్శనములను తనంతనే కరుణించి యున్నది. తన శక్తిచేత దేవుని రాజ్యమునే యాక్రమించుకొనఁగలుగుదుమని గర్వించుచున్న యీ మహాదేవతయొక్క మహిమలను వేయినోళ్ళవాఁడును వర్ణింపఁజాలఁడు. ఆమె యేకకాలమునందే వివిధస్థలములయందున్న తనభక్తులకెల్లఁ బ్రత్యక్షమగును, యెల్లవారి

మనస్సులను పూని, ఎల్లవారికిని క్రొత్తక్రొత్తకోర్కులను సమయము నకుఁ దగిన ట్లపరిమితముగా ప్రసాదించుచున్నది. ఇంతటి భక్తసుల భురాలయిన సుప్రసిద్ధ దేవతయొక్క పేరేమో తెలిసికోవలెనని మీలోఁ గొందఱికి వేఁడుగకలుగవచ్చును. అందఱి నోళ్ళలో నుండెడి యీ పేరెల్లవారు నెఱిఁగియుండవలసినదే యయినను సమయమున కొకవేళ స్మరణకు రాకపోవచ్చునని నేనే చెప్పుచున్నాను. షడక్షరీ మహామంత్రమునువలె శ్రద్ధతో వినుఁడు. ఆ మహాదేవియొక్క దివ్య నామము "మూఢత్వదేవత." ఇఁక నాదేవత మనమీఁదఁ బ్రయో గించుటకయి తనభక్తుల కనుగ్రహించిన వరలాభములపేళ్ళు కొన్ని వినుఁడు. ఆమె వారికి నేర్పిన విద్యలు పరిహాసములు, దూషణములు; మిథ్యాదోషారోపణములు మొదలయినవి; వారి కనుగ్రహించిన విజయసాధనములు బెదరింపులు, బహిష్కారయత్నములు, దుర్బోధలు మొదలయినవి; వారికి ప్రసాదించిన యపూర్వదర్శనములు తెలుపు నలుపుగాను సత్య మసత్యముగాను పుణ్యము పాపముగాను దోఁచెడి విపరీతరూపములు మొదలయినవి ప్రతిపక్షులు మనమీఁదఁ బ్రయో గించెడు సాధనకలాపముయొక్క స్వభావమిప్పుడు కొంత తెలిసినది కదా? ఇఁక మనము సత్యకవచమును దొడిగికొని ధర్మఖడ్గమును చేతధరించి సత్కార్యాచరణశూరులమయి యీశ్వరపక్షమున నిలిచి యుద్ధమునకు సంసిద్ధులము కావలెను. సకలజన వశ్యతగల యీ మూ ఢత్వదేవతయొక్క చర్యల స్వభావమునుగూడ కొంచెము వినుఁడు. ఆ దేవతయొక్క పని యెప్పుడును సత్యమును, సర్వేశ్వరుని మూల పట్టించి యీ స్థానమున మూఢవిశ్వాసమును, ప్రతిమలను నెలకొల్పుట; మానసికధ్యానమును మాన్పి కావళములను త్రిప్పించుట; అను తాపమును రూపుమాపి పాపపరిహారార్థ మని బూడిదను

పూయించుట; జ్ఞానతేజస్సును బోఁద్రోలి పట్టపగలు దీపములు వెట్టించుట; భక్తియుక్తమయిన యీశ్వర సామీప్యానుభవము తొలగించి ధూపములను విగ్రహపూజలను శ్రీపాదతీర్థములను పుచ్చుకొల్పుట; వ్యాధిబాధితులకును వికలాంగులకును రక్షణశాలలను మాన్పించి మనుష్యనిర్మిత శిలాదారు దేవతలకు గృహములు కట్టించుట; తెలిసిన స్వభాషతో వేడ నియ్యక తెలియని భాషాపదములను నోట వల్లన వేయించుట లోనయినవి. ఆదేవతకు ప్రీతికరములయినపను లిటువంటి వనంతములుగా నున్నవి. అవియన్నియు నెవ్వరు వల్లింపఁగలరు? ఇటువంటి యమోఘసాధనసంపత్తియు విచిత్ర కృత్యములునుగల దేవతచే నడపఁబడు భక్తాగ్రేసరులు మనము హృదయపూర్వకముగా తెలిసిన తేటమాటలతో జేయు ప్రార్థనలను నిరర్థకములని దూషించి యర్థము తెలియని "పునంతు మాం బ్రాహ్మణ పాదపాంసవః" ఇత్యాది దేవభాషావాక్యపఠనమే సార్థకమని యెట్లు భాషింపకుండఁ గలుగుదురు? సచ్చిదానందస్వరూపుఁ డయిన పరమాత్మని ధ్యానింపవలయు నన్న యుపదేశము కానిమాట యని పరిహసించి మూఁడు పేటలు వేసిన త్రాటిని మెడలో వేసి "ఓం భూర్భువస్సువః" యనుటయే బ్రహ్మోపదేశమని యెట్లు సంతోషింపకుండఁ గలుగుదురు? మనలను భక్తిహీనులనియు నాస్తికులనియు దూషించుచు మనమీఁద దండయాత్ర వెడలెదు పరమభాగవతోత్తములలో నూట తొంబదితొమ్మిదిపాళ్ళట్టి మహానుభావులే. ఈ మహానుభావులే దేవతలమీఁదను భక్తిలేని యాస్తికశిఖామణు లయినను పామరులను వంచించుటకయి కుంకుమబొట్లను విభూతిపెండెకట్లను ముఖమున ధరించి శాక్తేయులవలె బొట్లుఁ విరియఁబోసికొని వీర శైవులవలె సివము లాడుచు, మూఢతా దేవియొక్క యగ్రసేనకు

నాయకు లయి ముందుగా మనమీఁద జైత్రయాత్ర వెడలుదురు. ఈ కపటనాటకు లుత్సవసమయములయందు తమ వాకిట మద్దెళ్ళతోను తాళములతోను మహాధ్వనితో భక్తులు దేవునిముందు హరి నామస్మరణ చేయుచున్నను పట్టపగ లావంక తొంగిచూడ నొల్లక భోగముదాని పాటగాని,'భోగము'దన్న మాటగాని చెవిని బడినతోడనే వీధులవెంట మేళములముం దూరేగుటకు మహాభక్తితో సర్వరాత్రములయందు సహితము బయలువెడలుదురు. ఇట్టివీరు హిందూమతోద్ధారకులయిన నాయకులఁట! వీరిమాటలు మహర్షి మతములఁట! ఓమహర్షిసత్తములారా? ప్రాజ్ఞశిఖామణు లయిన మీరిప్పు డుండిన యెడల మీమతము లివి కావనియు మానసికారాధనమే మీమత మనియు ఈవంచకులముందు సహస్రముఖముల ఘోషించి యుందురు గదా? ఓమహానుభావులారా! మరల సజీవులయి లేచి వచ్చి మను ష్యులతో మాటాడఁగల మహిమ మీయొద్దనున్న పక్షమున తత్క్షణమే విజయముచేసి మీరెప్పుడును తెలియనిభాషతో సేవా వల్లించి ప్రార్థన యనుకో లేదనియు, కాలానుగుణము లయిన మార్పులను జేసి కొని యభివృద్ధినొందుచు వచ్చితి మనియు వీరికి బోధింపరాదా? పాపమునకు పరితాపపడి హృదయపూర్వకముగా ప్రేమను గనఁబఱుచుటయే యారాధన కాని తెలియనిపదము లేవేవో పలికి గంటలు వాయించి ప్రసాదములు గైకొనుట యారాధన కాదని తెలియఁ జెప్పరాదా? సర్వవ్యాపియైన దేవుని విడిచి లోహవిగ్రహములను దర్శించుటకయి యూరూరఁ దిరుగుట మీమతము కాదని యుపదేశింపరాదా? మిమ్ము జేసిన దేవునిసేవ మాని మీరు చేసిన బొమ్మల కొలువు చేయుట మీయభిమతము కాదని బుద్ధి చెప్పరాదా? "మీ రేమిచేయవేఁడుచున్నారో మీరెఱుఁగరు; మీ రేమిపలుకుచున్నారో

మీరు గ్రహింపలేరు. ఇదా ప్రార్థన ?" అని పరిహసింపరాదా ?

ఇవియన్నియు లోకమును బాగుచేయవలెనన్న వెఱ్ఱియాశతో పలవరించుచున్న నా వ్యర్థము లయిన కోరికలు. మన మొఱ్ఱలాలించి పూర్వమహర్షు లొకవేళ శ్రమపడి లోకానుగ్రహార్థముగా నిక్కడకు విజయంచేసి పయినిజెప్పిన రీతిని దమ యథార్థమతసారమును మేఘగంభీర భాషణములతో ఘోషించినను, దురాచార పిశాచావేశులయి మూఢత్వదేవతకు ముఖ్యభక్తులయియున్న పండితమ్మన్యు లా సత్యములను చెవి యొగ్గి విననైనను విందురా ? వినరు. మున్నాటికిని వినరు. ఓ ఋషివర్యులారా ! మీరు శ్రమపడి వచ్చిన ప్రయోజనము లేదు. ఇక్కడ సత్యగ్రహణాదర మెవ్వరికిని లేదు. మీ కాలమునందు సత్యమన్న మధురవాక్కు మీచెవుల కెంత ప్రియతమముగా నుండునో యీ కాలమునందు మీ సంతతివారయిన యీ భరతఖండవాసులకు సత్యమన్న పేరంత వెగటుగానున్నది. ఈకాలములో సఖ్యమును సత్యాదరమును సరిపడవు. ఆరంభమయిన యుద్ధము జరిగి తీఱవలెను. ఇప్పుడు సత్యమున కసత్యముతోను, వివేకమున కవివేకముతోను, జ్ఞానజ్యోతి కజ్ఞానాంధకారముతోను పోరాటము పడినది. పశ్చిమఖండపండితులు మన దేశముమీఁద విడిచిన ప్రకృతిశాస్త్రకన్యలవలన కలిగిన క్రొత్తయూహ లభినవపటుత్వముతో నానాముఖముల వ్యాపించి ముదిసియున్న ప్రాఁతయూహలను పీఠములనుండి కదలింపఁ జూచుచున్నవి; నూతన సదాచారమహామంత్రములు పురాతన దురాచారభూతములను తఱిమివేయఁ జూచుచున్నవి; నవీనజ్ఞానసూర్యోదయము ప్రాచీన మూఢవిశ్వాస తమస్సులను పాఱద్రోలఁజూచుచున్నది. చిరకాలమునుండి మన హృదయములలో పాతుకొనియుండి మనమీఁద రాజ్యముచేయు మరఁగియున్న మూఢత్వదేవత

తన యధికారము విడువ నొల్లక తెంపరితనమున సుజ్ఞానభానునితో బోరాడఁదలఁచి తనభక్తులనందఱిని తోడుపడఁ బిలుచుచున్నది. చిర కాలస్నేహము వలనను మూఢత్వమునకు మూలబలమయిన దురాచారభూతములయొక్కయు దురభిమాన పిశాచముల యొక్కయు ప్రేరణమువలనను సుస్థిరప్రభు భక్తి గలవారై దురాలోచనలేని బహుసంఖ్యాకు లయిన జను లందఱును మూఢత్వదేవతయొక్క పక్ష మవలంబించి తత్సంరక్షణపరాయణులయి మూఁకగా ప్రతిఘటించి నిలిచియున్నారు. సత్యప్రియత్వమువలన దురభిమానమును విడిచి సదాచారగ్రహణదీక్షవహించిన కొందఱుమాత్ర మజ్ఞానాంధకార మును బాఱఁద్రోలవలయు నన్న యుత్సాహముతో విమర్శఖడ్గమును ధరించి వీరభటులవలె సుజ్ఞానభానునిపక్ష మవలంబించి పోరాడుటకు బయలువెడలుచున్నారు. ఇట్లవివేకమునకును సువివేకమునకును దుర్జ్ఞానమునకును సుజ్ఞానమునకును జరుగుచున్న యీ యుద్ధముచేత దేశమున కంతకును సంక్షోభము కలుగుచున్నప్పు డేదో యొకపక్ష మునఁ జేరక యూరకుండుట యెవ్వరికిని శక్యము కాదు. వివేకు లందఱును గ్రమక్రమముగా సత్యపక్షమునఁ జేరుదు రనుటకు సందే హము లేదు. యుద్ధముయొక్క పర్యవసాన మెట్లగునో యన్న సందేహ మంతకుముందే లేదు. కాలపరిమితి మాత్రము నిర్ణయించుట సాధ్య ము కాదు కాని తుద కజ్ఞాన మోటుపడి సుజ్ఞానమునకు విజయము కలుగుట నిశ్చయము. అజ్ఞానాంధకారము లోకముసం దంతట నెంత దట్టముగా వ్యాపించియున్నను సుజ్ఞానభానుఁడు బయలువెడలి తన తీక్ష్ణకిరణములను బఱపినప్పుడు క్రమక్రమముగా తొలఁగి మూలలను గుహాలలోను దాగి యడఁగుటకు సందేహ ముండదు. జ్ఞానపావకుని ప్రతాపముచేత మూఢత్వదేవత యమోఘసాధనములని సంతోషించు

చున్న కల్లలనెడు వేయంచుల యినుపకత్తులన్నియు నీరుగా కరఁగి పోవును; అవిమర్శలనెడు గడలన్నియు భస్మము లగును.

ఇంతవఱకును మన ప్రతిపక్షుల బలమును సాధనసామగ్రియు వారుచేసెడు యుద్ధక్రమమును వర్ణించితిగాని యిట్టి సమయమునందు మనమెట్లు ప్రవర్తింపవలయునో మన ధర్మములేవో వివరించి యుండలేదు. కాఁబట్టి యిప్పుడు సామాన్యముగా విద్యాధికు లందఱి కొఱకును ముఖ్యముగా మన సామాజికులకొఱకును ముఖ్యాచరణీయములయిన ధర్మములనుగూర్చి కొంచెము సంభాషించెదను. మన సామాజికులలోను మన యుపన్యాసములను ప్రసంగములను విను వారిలోను విశేషభాగము విద్యార్థులని మన ప్రతిపక్షు లొక యాక్షేపణను బలుకుచున్నారు. అదియొక గొప్ప యాక్షేపణముగా భావించు కొని మనపక్షము దుర్బలమయినదని వారు పొంగుచున్నను, విద్యార్థు లధికముగాఁ జేరుచుండుటవలననే మనపక్షము సబలమయి, భావి శుభసూచకముగా నున్నదని నేను సంతోషించుచున్నాను. మన దేశము తన భావిక్షేమాభివృద్ధుల నిమిత్తమయి యిప్పుడు పిన్నలుగా నుండి ముందు పెద్దలు కాఁబోవుచున్న విద్యార్థుల కొఱకే యెంతో యాశతో నెదురుచూచుచున్నది. ఈ ప్రపంచ నాటకమునం దిప్పటి పెద్దలు వినిపించుచున్న కథ యించుమించుగా ముగియవచ్చినది. వారీవఱ కందఱును వినిపించుచువచ్చిన పురాణకథా శేషమునే వృద్ధ వాక్యములతోఁ గొంతకాలము వినిపించి కథాశేషులయ్యెదరు. ఈప్రపంచ నాటకరంగమునందు మహాసామర్థ్యముతో క్రొత్తయాట లాడి హృదయరంజకముగా నూతనకథను వినిపించి సర్వజనులకు సంతోష మును గలిగింపవలసినవారు లేఁబ్రాయములో నున్న యిప్పటి విద్యార్థులే. వీరు తమకథను జక్కగా నేర్చుకొని సర్వజన హృదయాహ్లాద

కరముగాఁ బ్రయోగించిన పక్షమున రాఁబోవు విద్యార్థులును వీరి మార్గము నవలంబించి నీతి ప్రధానమయిన కథను మఱింత వృద్ధిపఱిచి దేశక్షేమలాభములకొఱకు ధైర్యోత్సాహసామర్థ్యములతో సర్వత్ర ప్రయోగించుచు వచ్చుటచేత మన దేశ మచిరకాలములోనే భూతల స్వర్గమయి సుఖసంతోషనిలయము కావచ్చును. మన దేశ మెప్పుడయి నను విద్యార్థుల మూలముననే వృద్ధికి రావలసియున్నది. అందుచేత మన దేశము స్వాభివృద్ధికయి విద్యార్థుల కృషినే నిరీక్షించుచున్నది. దురాచారదూషితములుకాని నిర్మల మనస్సులుగల విద్యార్థులు గాక, సంవత్సరశతములనుండి పరంపరగా వచ్చుచున్న దురాచారవాసనల చేత యుక్తాయుక్తవివేకచింతను విడనాడి, కఠినమనస్కులయియున్న మన తండ్రులును, తాతలును, ముత్తాతలును, ముత్తవలును తమ చిన్న నాటి యలవాటులను నుఱచి మన యూహలను బోధనలను క్రొత్తగా నిప్పుడు నేర్చుకొని, తమ ప్రాఁతయూహలను పూర్వాభిప్రాయములను మార్చుకొని దేశాభివృద్ధికయి పాటుపడుట సంభవించునా? వారు తా మభివృద్ధి పొందవలసినట్టియు నిప్పటి యూహలనుబట్టి యితరుల నభివృద్ధి చేయవలసినట్టియు కాలము దాటిపోయినది. వారిని నూతన మార్గములకు ద్రిప్పుటకయి మనము చేయు కృషి సహితము సఫలము కానేరదు. వారిని వారియూహలకును వారికర్మలకును వారివిశ్వాస ములకును వారిపూర్వాచారములకును విడిచిపెట్టి బాగుపడుటకుఁ గావలసినంత యాశయు నవకాశము నున్న చిన్నవారిని మంచిమార్గ మునకుఁ దెచ్చుటకయి మన శక్తియుక్తుల నుపయోగింపవలెను.

మనము జనసామాన్యమునకంటె విద్యార్థికుల మగుటచేత వారిస్థితిని బాగుపఱచుటకయి కృషిచేయవలసిన భార మొకటి మనమీఁద పడుచున్నది. విద్య యొక్కవయిన కొలఁదిని విద్యార్థిక్య

ముతో వచ్చు కార్యభారములను సహితము మనము వహించి నిర్వహిం చుచు రావలెను. మనము విద్యాలాభమును మాత్రము పొంది యందు వలన మనమీఁదబడిన భారమును భరింపనొల్లని పక్షమున ధర్మమును తప్పినవార మగుదుము. మృగమునకును మనుష్యునకునుగల భేదము స్వార్థపరత్వమును విడుచుటతో నారంభమగును. విద్యాగంధములేక కేవల స్వప్రయోజనపరుఁడుగా నుండువాఁడు మృగప్రాయుఁ డనఁ బడును. అట్టి మృగప్రాయుఁడయిన స్వకార్యధురంధరుఁడు జ్ఞాన సౌధముయొక్క యడుగుభాగముననైనను జేరలేక యంధకారబంధుర మయిన పాతాళగుహాయందున్నవాఁడగును. వెలుతురులేక చీఁక టిలో నున్నవానికి తన దేహమొక్కటి తక్క వేఱేదియు తోఁప కుండుట వింతకాదుగదా ? వాఁడు కొంచెము పయికివచ్చి జ్ఞాన సౌధముయొక్క యడుగుభాగమును జేరి వెలుతురులోఁ బ్రవేశింపఁ గానే వానికి గోడలనడుమనున్న భాగమును దానిలోనున్న వారును గానఁబడుదురు. ఈప్రకారముగా మృగప్రాయుఁడు గాఢాంధకారము నుండి వెలువడి తనమృగత్వమును గొంతవిడిచి కొంచెము మాన వత్వమును బొంది నాగరికుఁడయి జ్ఞానజ్యోతియొక్క తేజస్సును దర్శింప నారంభింపఁగానే స్వార్థపరత్వమును గొంచెము విడిచి తన యింటనుండు భార్యాపుత్రాదులను బంధువులను ప్రేమించి వారి క్షేమము నిమిత్తమయికూడ పాటుపడువాఁ డగును. అతఁడే యింకొక మెట్టెక్కి యాపయిని మఱియొక్క మెట్టెక్కి క్రమక్రమముగా జ్ఞానసౌధముయొక్క యుపరిభాగమునకుఁ బోయి నలుప్రక్కల దృష్టి వ్యాపింపఁ జేసినకాలఁదిని క్రిందనున్నప్పుడు నాలుగుగోడలమధ్య నున్నదితప్ప మఱియేదియుఁ జూడలేనివాఁ డంతకంతకు చుట్టుమ నున్నయిండ్లను గ్రామములను దేశములను వరుసగాఁ జూడ నారం

భించి స్వప్రయోజనపరత్వచింత యంతకంతకు తగ్గుచురాఁగా క్రమక్రమముగా తనవారి యిండ్లనియు తన యూరనియు తన దేశమనియు నభిమాన మేర్పఱుచుకొని తన ప్రేమను వానిమీఁదికి సహితము వ్యాపింపఁజేసి సమయము వచ్చినప్పుడు వానికిని తోడుపడుచువచ్చును. ఇట్లు దేశాభిమాన మెప్పు డేర్పడునో యప్పుడే దేశక్షేమము చేయవలెనన్న బుద్ధియు పుట్టి దినదినక్రమమున ప్రేమానుబంధము దృఢపడును. ఆ మనుష్యుఁడే జ్ఞానముయొక్క యున్నతపదవిని బొంది పిట్టవలె నుపరిభాగమున కెగసి పయినుండి క్రిందికి చూడఁగలిగిన పక్షమున, అప్పు డాతని దృష్టికి తనయూరును తనదేశమును మాత్రమేకాక చుట్టునుగల యితరదేశములును గోచరములగును. ఇట్లు పయి కెగసిన కొలదిని వస్తువులు కానఁబడెడు రీతిలోఁగూడ నొకవిశేషము కలదు. ఉపరిభాగమున కెగసిన కొలఁదిని తన యిల్లంతకంతకు చిన్నదగుచు వచ్చి మిక్కిలి పయికిఁబోయి లోకమునంతను జూచునప్పుడు తన యిల్లామధ్య నదృశ్యమగును. ఈప్రకారముగానే జ్ఞానముయొక్క మహోన్నతదశకు పొందిన వాని దృష్టిపథమునం దెప్పుడును లోకక్షేమమంతయు నుండును గాని తనవారియొక్క క్షేమముమాత్రము ప్రత్యేకముగా నుండదు. దీనినిబట్టి విచారింపఁగా జ్ఞానికి ముఖ్యలక్షణము స్వప్రయోజనపరత్వమును పూర్ణముగా విడిచిపెట్టి లోకప్రయోజనము నిమిత్తమయి చూచుచుండుట యని స్పష్టమగుచున్నది. జ్ఞానమే మనుష్యలక్షణ మగుటచే నిటువంటి లక్షణముగలవాఁడే నిజముగా మనుష్యుఁడని పిలువఁబడుట కర్హుఁడయినవాఁడు. కాఁబట్టి యెల్లవారును స్వప్రయోజనపరత్వమును విడిచి పరోపకారపరాయణులయి మనుష్యనామమునకు పూర్ణముగా నర్హులగునట్లు ప్రవర్తించుటయే పరమార్థముగా భావించుకొని తమకృషి యంతయు నందు నిమిత్తమే

యుపయోగింపవలెను. ఇట్టిస్థితిని బొంద ప్రయత్నించుట మనుష్యజన్మ మెత్తినవానికెల్లను పరమధర్మమే యయినను, అది యందఱికిని సాధ్యము కాకపోవచ్చును. ఎవ్వఁడును పూర్ణముగా నొకవేళ సాధింప లేకపోయినను పరోపకారము నిమిత్తమయి నిరంతరకృషిని జేయు చుండువాఁడు చాలవఱకు పొందవచ్చుననుట కావంతయు సందేహము లేదు.

ఇఁకను బరోపకార మనఁగా నెట్టిది, దానిని చేయు క్రమ మెట్టిది, దానికయి ప్రయత్నించుటలో మన మాచరింపవలసిన ధర్మము లేవి, అను నంశములను గొంచెము విచారింపవలెను. జనసామాన్య మునకు క్షేమాభివృద్ధులు కలిగించుటయే పరోపకార మగుటచేత దానినిగుఱించి చర్చింపవలసిన పనిలేదు. ఇఁకను దానిని చేయు మార్గ ములనుగూర్చి కొంచె మాలోచింపవలసియున్నది. ఈ మార్గములను ప్రతిమనుష్యుఁడును విద్యార్థిదశలో నున్నప్పటినుండియు నేర్చుకొని మొదటినుండియు తదనుష్ఠానమున కర్తృఁడగుటకు కృషిచేయుచుండ వలెను. కొంద ఱనుకొనునట్లు పాఠశాలలో పాఠములు వల్లించుట మాత్రమే విద్యార్థి ధర్మముకాదు. ముందు తన యిహలోకయాత్రకును సుఖమునకును దానిమూలమున దేశక్షేమాచరణమునకును తానర్హుఁ డగుటకు నేర్చుకొనుటయు విద్యార్థి ధర్మమే. ఈ యవస్థయే లోకము నకుఁ దాను ముందుపయుక్తుఁడగుటకు నేర్చుకోవలసిన యుక్తకాల మగుటచేత విద్యార్థి యిప్పుడే సద్వర్తనమును కార్యభారమునకుఁ దగిన నిజమయిన పౌరుషమునుగూడ నభ్యసింపవలెను. దేహబలము గలవారిమీఁద విద్యాబలము గలవారే లోకములో నధికారము చెల్లింపవలసినవారయి యుండుటచేత వారెప్పుడయినను మూఢ జనులకు నాయకులుగా నేర్పడి వారిని మంచిమార్గమున నడిపి దేశాభి

వృద్ధి చేయువలసినవారేకాని పామరుల మెప్పును స్తుతులను గోరి తమ విద్యకును బుద్ధికిని అవమానము కలుగునట్లుగా వారిచే నడుపఁబడ వలసినవారు కాఁగూడదు.

దేశాభివృద్ధికయి యాచరింపవలసిన ధర్మము లనేకవిధము లయి యున్నవి. ఈ దేశాభివృద్ధి మొట్టమొదట తనతో నారంభము కావలెను. అటుపిమ్మట తన కుటుంబమునకును తన గ్రామమునకును తన దేశమునకును క్రమముగా లోకమంతకును వ్యాపింపవలెను. మన యభివృద్ధికయి మొట్టమొదట నీశ్వరభక్తియు, సత్యానురక్తియు, ధర్మపరత్వమును, దుష్కర్మవిముఖత్వమును గలవారమయి మన యిహలోకయాత్రను పరిశుద్ధముగాను సుఖప్రదముగాను జేసికొని మనల నీశ్వరుఁ డీలోకమునుండి యే నిమిషమున తొలఁగింప నుద్దేశించినను శాశ్వతానందమును పొందుట కర్హులముగా నుండునట్లు సదా ప్రవర్తించుచుండవలయును. మనలను సన్మార్గము నుండి తొలఁగించుటకై యింద్రియసుఖవాంఛాదులను లుబ్ధులు సుఖాభాసబీజములను జవిచూపి వేఁటగాఁడు నూకలుచల్లి పిట్టల నాకర్షించునట్లుగా మన హృదయఖగముల నాకర్షించుచుండును. ఇట్లు విషయసుఖములు మనలను ధర్మపథమునుండి యాకర్షించినప్పుడు వలలోఁబడితిమేని పాపకిరాతబృందములు మనలను బట్టుకొని బాధించి సకలాకృత్యములకును లోఁబఱుచును. కాఁబట్టి మనజీవనమును పరిశుద్ధమయిన దానినిగాఁ గాపాడుకొనుటకయి మన మెల్లప్పుడును పాపములనెడు శత్రువులతోఁ బోరాడుచుండి వానిని మన హృదయదుర్గములను జేరనీయక తఱుముచుండవలయును. బాహ్యశత్రువులతోఁ బోరాడుటకంటె నంతశ్శత్రువులయిన పాపములతోఁ బోరాడి వానిని నిర్జింపఁగలుగుటయే మన కెక్కువ పౌరుషము. ఈ పాపశత్రువులను

పూర్ణముగా జయించి పాఱఁదోలఁగలుగుట యీశ్వర సాహాయ్యము లేక మన యల్పశక్తులకు సాధ్యము కాదు. ఈశ్వర సాహాయ్యమును బొందుటకై యీశ్వరారాధనము కావలెను. ఈశ్వరునియందు పూర్ణ మయిన ప్రేమను విశ్వాసమును ఉంచి పాపశత్రువులనుండి కాపాడి యాత్మసుఖము ననుగ్రహింప నీశ్వరుని హృదయపూర్వకముగా ప్రార్థించుచు, ఈశ్వరాజ్ఞలను మీఱినందునకై పశ్చాత్తాపపడుచు, సర్వ కార్యములయందును నాతని చిత్తవృత్తి ననుసరించి వర్తించుచుండు టయే యీశ్వరారాధనము. ఈ యీశ్వరారాధనమును మఱచి యాత్మశక్తిని నమ్ముకొని కొంచె మేమఱియుండిన పక్షమున, పాప పిశాచము దొంగవలె మన హృదయసదనమునందుఁ బ్రవేశించి యక్కడనుండి యీశ్వరభక్తిధనము నపహరించి మనలను దుఃఖ ములపాలు చేయును. కాఁబట్టి పాపతస్కరుఁడు మన మనోవీధియందుఁ బ్రవేశింపఁగానే తెలిసికొని పరితాపపడి యీశ్వరుని ప్రార్థించి పాప మును బాఱఁదోలుటకై పిలిచి సేవించిన పక్షమున మన మనస్సులు మరల నిర్మలము లగును. ఈశ్వరు నారాధింపవలసిన యీధర్మమే మతధర్మ మనఁబడును. ఇదియే ధర్మము లన్నిటిలోను బ్రధాన ధర్మము; సమస్తసుఖప్రదాయకము. పాప మే మూలనయిన హృద యములోఁ బ్రవేశించి దాగియున్నదేమో యని యాత్మశోధనము చేయుచు నిత్యము నీశ్వరారాధనముచేయుచు మన వర్తనమును పరి శుద్ధమయిన దానిసిగాఁ జేసికొనుచుండుటయేకాక మన బంధుమిత్రా దులనుగూడఁ బరిశుద్ధులనుగాను జ్ఞానులనుగాను సుఖపడువారినిగాను జేయుచుండుట మనకు రెండవ ధర్మము.

ఇట్లన్యోన్య సుఖము నిమిత్తమయి పరస్పరసాహాయ్యము చేసి కొను మనుష్యుల గుంపంతయుఁజేరి కుల మనఁబడును. కుల మను

శబ్దమునకు సమూహమని యర్థము. పరస్పర సుఖము నిమిత్తమయి జను లొండొరులతోఁ జేసికొనవలసిన ధర్మములు కులధర్మము లనఁ బడును. ఇతరులను సుఖులనుగాఁ జేయుటకుఁ దగిన బుద్ధియు శక్తియు మనలో నీశ్వరుఁ డిమిడ్చి యుండుటచేతనే మనుష్యుఁడు మృగాదుల కంటె నధికుఁ డగుచున్నాఁడు; ఈబుద్ధిని, శక్తిని, లోకముయొక్క క్షేమాభివృద్ధుల నిమిత్త మెంతయెక్కువగా నుపయోగించిన మనుష్యుని కంతయెక్కువ ఘనత వచ్చును. ఈలోకములో సమస్తసుఖములును సమస్తక్షేమములును మతముయొక్క పరిశుద్ధత ననుసరించియే యుండును గాన మనము జనసంఘముయొక్క క్షేమము నిమిత్తమయి చేయవలసిన మొదటి యుపకారము మతమును సాధ్యమయినంత పరిశుద్ధమయిన దానినిగా జేయఁ బ్రయత్నించుట. ఈ ప్రయత్నములో మూఢజనులవలన ననేక కష్టములు సంభవించును. లోకములో నేపనియు కష్టపడక నెఱవేఱదు గనుక, మనము కులాచారసంస్కరణమునందును కష్టములకు సహించి స్వప్రయోజనపర్వతమును త్యజించి యీశ్వరప్రీతికరముగా పనిచేయవలెను. దేశాభివృద్ధి యెప్పుడును తమక్షేమమున కంటె లోకక్షేమమే యెక్కువగా భావించి తమ ప్రాణములను శక్తులను సంపదలను దేశమునకు ధారపోసెడు పుణ్యపురుషులచేతనే యగుచు వచ్చినది గాని యేదేశమునందును స్వప్రయోజనపరులచేతను కుక్షింభరులచేతను స్వకుటుంబపోషణ ధనార్జనపరాయణతాధురంధరుల చేతను కాలేదు. కేవల కుక్షింభరుల మయినపక్షమున మనకు మృగాదులకంటె నాధిక్యమేదియు లేదు; మనకు ధనార్జనమే ముఖ్యకర్తవ్యము కాదు. మనము లోకములో నెంత ధనమార్జించినను, అల్పకాలోపయుక్తమయినదే కాని యది స్థిరమయినది కానేరదు. మనము కష్టపడి సంపాదించిన గృహములును, ధనమును మనతోరాక యెప్పటి

చోటనే యుండి కొన్ని సమయములయందు మన మరణానంతరమున బంధుపుత్రాదులకు కలహకారణములు సహితమగును. మనము న్యాయముగా నార్జించిన ధనమే మృత్యుదేవత మనకు ధనరక్షణభారమును తప్పించిన తరువాత మాంసముకొఱకు వేచియున్న గ్రద్దలవలె తాము కష్టపడి గడించుకొనక యితరు లార్జించిన దాని నపహరింప వేచియుండు బంధువులకు కలహకారణమును దుఃఖకారణము నగుచున్నప్పు డాధన మన్యాయార్జిత మగునేని చెప్పవలసిన పని యేమున్నది ? అప్పు డది దానిని పొందువారికే కాక గడించిన వానికిని దుఃఖహేతువగును. కాఁబట్టి మనల నెప్పుడో యొకప్పుడు విడిచి పోవునట్టియు దుఃఖకరమగునట్టియు ధనమును కావలసినదానికంటె నధికముగా సంపాదించి కూడఁబెట్టుటకు యత్నింపక మరణానంతరమున సహితము మనలను విడువక తోడుపడి సుఖమిచ్చెడు సత్యధర్మరూపమయిన సుస్థిరధనమును ఆర్జించుటకయి మనుష్యుఁ డధికకృషి చేయవలెను. ఇతరులకు మనము చేయవలసిన రెండవ యుపకారము దుర్నీతిదురాచారములను తొలఁగించి వారిని నీతిమంతులనుగాఁ జేయుట. సత్యవర్తనము గలిగి యితరులను వంచింపక పరస్త్రీ పరధనాదుల కాశపడక న్యాయమార్గమున సంచరించుట నీతి యనఁబడును. నీతిని విడిచిన మత ముండనేరదు గనుక, ఇదియు మతధర్మమే యయినను కాలమహిమచేత మనదేశమునం దిప్పుడు సద్వర్తనము లేని శ్రీచూర్ణరుద్రాక్షాది ధారణమే మతముగా మాఱినందున దీనిని మతమునకంటె వేఱుగాఁ జెప్పవలసివచ్చినది. జనసామాన్యముయొక్క క్షేమసంతోషములకు పరిశుద్ధమయిన యీశ్వరోపాసన యెట్లావశ్యకమో యట్లే నీతివర్తనము నావశ్యకమయిన దగుటచేత దానిని స్థాపించుటకుఁ గూడ మనము విశేషప్రయాసము పడవలసి యున్నది. కొందఱు మనదేశములో

మతము పేరు చెప్పియే నీతిబాహ్యములయిన దుష్కృత్యము లనేకములుచేసి చేయించి హృదయమునుండి దయాగుణమును తొలఁగించి కొంతవఱకు మనుష్యస్వభావమునే రూపుమాపుచున్నారు. దేవుఁడందఱియందును సమానదయ గలవాఁడయి మనకిచ్చిన మృదుహృదయములనే వారికిని ప్రసాదించినప్పుడు మతధర్మములలో నిట్టి వ్యత్యాస మేలకలుగవలెనని యాలోచింపఁగా, వారు దేవుఁ డనుగ్రహించిన స్వాభావిక మతమును విడిచి మనుష్యకల్పితము లయిన యస్వాభావికమతముల నవలంబించుటవలన నీయనర్థమంతయు పొసఁగినదని స్పష్టపడుచున్నది. మతముతో చేరియున్నను, చేరియుండక పోయినను సమస్తవిధములయిన దుర్నీతులను తొలఁగించుట దేశక్షేమమున కత్యావశ్యకము. కాఁబట్టి విద్యార్థులయిన వారందఱును నీతిమత విషయముల రెంటియందునుగల దోషముల నితరులకుఁ జూపి వానిని వారు దిద్దుకొనునట్లు చేయవలెను. జనులు తమ దోషములను దిద్దుకోలేకపోవుటకుఁ గల యొక గొప్పకారణము దురభిమానము. తానే గొప్పవాఁడననియు తనకు తెలియనిదేదియు లేదనియు జనుఁ డెప్పుడు దురభిమానమును పూననారంభించునో యప్పటినుండియు నతఁడు స్వలోపములను దిద్దుకొని యభివృద్ధిని పొందుట కవకాశము లేనివాఁడయి చెడుట కారంభించును. ఈ దురభిమానము జనులందఱిలోను వ్యాపించిన పక్షమున దేశముయొక్క దుర్గతి వేఱుగఁ జెప్పవలసినదే లేదు. సమస్తవిషయములయందును మనపూర్వులు సర్వజ్ఞులనియు వారికిఁ దెలియని దితరుల కేదియు తెలియదనియు మన మితరదేశస్థులవలన నేర్చుకొనవలసిన దేదియు లేదనియు మనవారిలో నొక దురభిమానము బలిసియున్నది. ఈ దురతిశయమే మనవారిని తమదోషములను విమర్శించి తెలిసికొననీయకయు నితరుల గుణాంశము

లను గ్రహింపనీయకయు దేశము నంతకంతకు చెఱుపుచున్నది. జను లకు నాయకులయి నడప నపేక్షగలవారు కొందఱు తమవారి తప్పు లను జూపి దిద్దింపఁజూడక తుచ్ఛమయిన జనుల మెప్పున కాశపడి సర్వవిషయములయందును మనపూర్వులు పరిపూర్ణులని బోధించి స్తుతించి జనులలో దురభిమానమును దురతిశయమును బలియునట్లు చేసి తామేమో దేశాభిమానులయినట్లు నటించుచున్నారు. దేశాభి మానమెప్పుడును జనుల లోపములను జూపి వానిని తొలఁగింపఁ బాటుపడుటలో నుండును గాని నీచమయిన పామరజనానురాగము నపేక్షించి వారిదోషములను గుణములని భూషించి దేశమభివృద్ధి పొందకుండ చెడఁగొట్టుటలో నుండదు. ఈ యపూర్వదేశాభిమానులు క్షణభంగురమయిన మూఢజనానురాగము నిమిత్తము వారి మూఢ విశ్వాసములను మూఢాచారములను భూషించుటయేకాక వారితోఁ గలిసి వానిని సంస్కరింపఁగోరువారినెల్ల బరిహాసించుటలో నఖండ పాండిత్యమును జూపుచున్నారు. ఇట్లుచేయుట దేశాభిమానలక్షణము కాదు. నిజమయిన దేశాభిమాని యెప్పుడును పరోపకారచింతయు ధర్మచింతయుఁ గలవాఁడయి తనవారి లోపములను పాపములను నిర్భయముగా విప్పి చూపును. ఇట్లు చూపుటవలన దురభిమానులు దూషించి ద్వేషించుటయు, కపటదేశాభిమానులు పరిహాసించుటయు సంభవించును. అయినను దేశాభిమానమాననీయుఁడు దేశక్షేమ మునే మనస్సునందుంచుకొని యట్టి దౌర్జన్యములకెల్ల తలయొగ్గి స్వకర్త వ్యమును ధైర్యముతో నిర్వహించుచు రావలెను. ఇట్లు చేయక విద్యార్థికులు తమ వివేకమును పాతిపెట్టి జనులకు నాయకులుకావలెనన్న దురాశచేత స్తోత్రప్రియులయి విద్యావిహీనుల మూఢవిశ్వాసములను శ్లాఘించుచు వారిచే మంచివారనిపించుకొనుటకయి వారివలె మాటా

డుచు వారివలె వర్తించెదు పక్షమున నచిరకాలములోనే తాము మూఢులయి మూఢులకు నాయకులగుటకు మాఱుగా మూఢులకు దాసులయి మూఢులను నడుపుచున్నామన్న భ్రమతో మూఢులచే నడపఁబడువారయి విద్యార్థికులన్న పేరున కపాత్రులగుదురు. ఇట్ల గుట యెంత సిగ్గులచేటు! విద్యార్థికులమాట యటుండఁగా స్వగౌరవమునందు దృష్టిగల విద్యార్థులు సహితము తామభ్యసించుచున్న విద్యకును బుద్ధికిని నపఖ్యాతి కలుగునట్లుగా నిటువంటి యపాత్రపుఁ బనికి లోఁబడఁ జూతురా? ధర్మశూరులయి తాము సత్యమని న్యాయమని నమ్మిన రీతిగాఁ బ్రవర్తించుచుఁ దాము నమ్మినట్లుగా నితరులకు నిశ్శంకముగా బోధింపక మూఢుల మెప్పునకయి మూఢవిశ్వాసములను దురాచారదోషములను శ్లాఘింపఁ జూతురా? పామరజనవిరోధమునకు భయపడి సత్కార్యపక్షమున నిలిచి సత్కార్యాచరణధైర్యము చూపలేని మగవారెన్నఁడయిన నాయకులగుదురా? జనద్వేషమునకును, పరిహాసములకును, బాధలకును వెనుకదీయక పామరులయొక్కయు, ధర్మభీరులయొక్కయు దురభిప్రాయమును గణనచేయక యితరుల తోడు లేకపోయినను భయపడక యసహాయశూరులయి యప్రియమయినను సత్యమార్గమును జూపు ధైర్యముగల పౌరుషభూషితులే కడపట నాయకులగుదురు. అట్టివారు మొదట కొంతకాలము దూషింపఁబడువారయినను తరువాత చిరకాలము భూషింపఁబడువారగుదురు. గుణాగుణగ్రహణము చాలని పామరుల మెప్పుతో మన కేమిప్రయోజనము? మన పనినిజూచి తెలిసినవారు మెచ్చుకొన్నప్పటివలె నవివేకులు మెచ్చుకొన్నప్పుడు సంతోషము కలుగునా? అనభిజ్ఞులు వేయిమంది మెచ్చుకొనుటకంటె నభిజ్ఞుడయినవా డొక్కఁడు మెచ్చుకొనుట శ్రేష్ఠతరము కాదా? కాఁబట్టి

మన కెప్పుడును బుద్ధిమంతులయొక్కయు మంచివారియొక్కయు మెప్పు మాత్రమే యపేక్షణీయము. జనులలో విశేషసంఖ్యాకు లెప్పుడును విమర్శలేని మూఢశిరోమణులుగా నుందురు గాన వారి మెప్పెప్పుడును గోరఁదగినదే కాదు. కాఁబట్టి మంచివారందఱికంటె నెక్కువ మంచి వాఁడును బుద్ధిమంతు లందఱికంటె నధిక బుద్ధిమంతుఁడును వివేకు లందఱికంటె ఘనవివేకియు నయిన యొక్క యీశ్వరుని మెప్పునకయి మాత్రమే మనము చూడవలెను. అతని మెప్పొక్కటియే శాశ్వత మైనది; తక్కిన మెప్పులన్నియు నెండమావులవంటివి. కాఁబట్టి యెవ్వ రేవిధమున దూషించినను పాటిగాఁ బట్టక మతవిషయము నందును కులాచార విషయములందును నీతి విషయములందును జనులమెప్పు గోరక యీశ్వరప్రీతిని మాత్రమే కోరి సర్వాపదలను నోర్చి దేశక్షేమమునకయి పాటుపడవలెను.

మనము జనులకుఁ జేయవలసిన యింకొక యుపకారము కుల స్త్రీలలోను సామాన్యజనులలోను విద్యాభివృద్ధి చేయుట. మనమెంత తెలివిగలవార మయినను మన భార్యలను మన పొరుఁగువారిని మనతో సమానముగా తెలివిగల వారినిగాఁ జేయక వారిని మూఢత్వములో నుంచిన పక్షమున మనము విద్యాలాభమువలన సంతోషమును పూర్ణ ముగా పొందలేకపోవుటయేకాక వారి మూఢత్వమునుబట్టి మన మనేక కష్టములు పడవలసినవార మగుదుము. జనులకును స్త్రీలకును సద్విద్య చెప్పించిన పక్షమున ననేక దురాచారములను వారే తొలగించుకొని దేశక్షేమమునకు తోడుపడుదురు. అనేక కష్టములను మఱపించి హృద యము నానందపరవశముగాఁ జేసి మన కాంతలను దేవతాకాంతలను గాను మనగృహములను భూలోకస్వర్గములనుగాను మార్చెడి యద్భుత శక్తిగల గానవిద్యను కులాంగనలకు నేర్పి కుటుంబములు సంతోష

స్థానము లగునట్లు చేయుటయే కాక, అమృతోపమానమయిన యీ సద్విద్యను పండువంటి సంసారములను పాడుచేయుటకు కంకణము కట్టుకొన్నట్టియు, పాతకములలో నెల్లను ఘోరపాతకమయిన జారత్వమును కులవిద్యనుగాఁ జేకొనుటచే మానవజాతికంతకును దీఱని యవమానము తెచ్చుచున్నట్టియు వేశ్యలను పేరుగల పెనుభూతముల చేతులలోనుండి విడిపించుటకయి ప్రయత్నించుట దేశాభిమానలేశము గలవారి కంద ఱికిని ముఖ్యకర్తవ్యము. స్త్రీలకు నీతి విద్య మొదలగునవి యావశ్యకము లని ప్రత్యేకముగాఁ జెప్పవలసిన పనిలేదు. తల్లియయి బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పవలసినదియు గృహమునకు రాణియై కుటుంబపరి పాలనము చేయవలసినదియు గృహపత్నియే యగుటచేతఁ దన సద్వర్త నమును జూచి బిడ్డలు సద్వర్తనము నేర్చుకొని వర్తించునట్లు చేయుట కును మూఢపూజలను విడిచి యీశ్వరారాధనము చేయుచు సమస్త సద్విషయములయందును విద్యాధికుఁడయిన భర్తతో నేకీభవించి లోకోపకార కార్యములయందెల్ల నాతనికి నిజమైన సహధర్మ చారిణిగా నుండునట్లు చేయుటకును గావలసినంత విద్యను సంసారమును సారమునుగాఁ జేసికొని సుఖింపఁగోరు ప్రతిపురుషుఁడును గృహిణికి తప్పక చెప్పింపవలెను. పురుషునకు భార్య యర్ధశరీరమగుట సర్వ జనాదరణీయమైన నిర్వివాదాంశ మగుటచేత భార్య విద్యాగంధము లేని మూఢురాలగునేని యా యర్ధశరీరము పక్షవాతపీడిత మయినట్లు కదలక మూఢత్వభారముచే సదా క్రిందికి దిగలాగుచుండుటనుబట్టి చదువుకొన్న భర్త సంసారసముద్రములో సుఖముగా తేలలేక యజ్ఞా నాంధకారములో విచారజలావర్తమునందుఁ బడి తల్లక్రిందుగా మునిఁగి పోవును; అట్లుగాక భార్య జ్ఞానవాసనగల విద్యావంతురాలగునేని యా యర్ధశరీర మారోగ్యతేజితమయినట్లు కరలాఘవము చూపి

వివేకప్లవముచే సదా పయికి తేల్చుచుండుటను బట్టి చదువుకొన్న భర్త సంసారసాగరములో సుఖముగా నీదుచు జ్ఞానతేజస్సులో నానంద ద్వీపమును జేరి తరించును. కాఁబట్టి విద్యాధికు లయినవారు తమ భార్యలకును తోడఁబుట్టినపడుచులకును కూఁతులకును సద్విద్యను జెప్పించి తమతో సమానవివేకము గలవారినిగాఁ జేయుటకయి సర్వ ప్రయత్నములను జేయవలెను. అజ్ఞానాంధకారమునఁ బడి జ్ఞానతేజో దర్శనము లేక పుట్టుగ్రుడ్లవలె నున్న మనదేశపు కులాంగనల కన్నులు తెఱపి విద్యాదీపముచేత వారికి పదార్థవిజ్ఞానము కలుగఁజేసి యనను భూతపూర్వమయిన నూతనసుఖమును లభింపఁజేయుటకయి కృషి చేయుట పురుషనామధారుని కెల్లను బరమధర్మము. ప్రతి విద్యాధికునికి స్త్రీవిద్యాభివృద్ధిని జేయుట యెంతధర్మమో జనసంఘమునకు విద్యాభి వృద్ధి చేయుటయు నంతధర్మమే. విశేషసంఖ్యాకు లెల్లయెడల నజ్ఞా నాంధకారములోఁ గన్నుగానక యంధులవలె తడవులాడుచు కష్ట పడుచుండఁగా వారిమధ్య నల్పసంఖ్యాకు లక్కడక్కడఁ గన్నుతెఱచి జ్ఞానదీపముచే వారిదురవస్థను జూడఁగలిగియు దయతో వారిగతి బాగుచేతఁ జూడక స్వసుఖమును జూచుకొనుచుండుట మానవధర్మ మగునా ? జనబాహుళ్యము జ్ఞానమునం దభివృద్ధిని బొందినగాని దేశ మభివృద్ధి పొందనేరదు. అందఱును మూఢులయి కొందఱు మాత్రము వివేకులగుటచేత మూఢజనపరివృతులయిన విద్యాధికుల కును సంసర్గదోషమువలన బహునష్టములు కలుగును. కాఁబట్టి విద్యా ధికులు తాముపొందిన విద్యాలాభమును జనసామాన్యమునకును గలి గించుటకయి శ్రమపడవలెను.

రాజ్యాంగవిషయములయిన స్వాతంత్ర్యములనుగూర్చి ప్రజ లకు తెలివిగలిగించుటయు జనులకొక యుపకారమే. పూర్వోక్తము

లయిన మత, నీతి, కుల, జ్ఞాన విషయములు నాలిగింటియందును పని చేయువా రిప్పు డంతగా మనదేశమునందుఁ గానఁబడక పోయినను రాజ్యాంగవిషయములయందు ప్రసంగించుటకుమాత్ర మనేకవక్తలు బయలు దేఱుచున్నారు. మతసంస్కారాదులలో బయలు దేఱక రాజ్యాంగ విషయములలోమాత్ర మింతమంది దేశాభిమానులు బయలు దేఱుటకు కారణమేమని కొందఱడుగవచ్చును. రాజ్యాంగవిషయ ములయందు శ్రమపడవలసిన యక్కఱ లేకయే సులభముగా ప్రసిద్ధి వచ్చుటయు, స్వప్రయోజనపరత్వమును, గొంతవఱకీ సాహసమునకుఁ గారణములని తోఁచుచున్నది. కొంచెము చదువుకొన్నవాఁడెల్లను తాను ప్రభువయి స్థానికప్రభుత్వము చేయుట కర్హుఁడ నయినా నను కొని తనకు జనపరిపాలకత్వము లభింపవచ్చునన్న యాశతో పని చేయుచుండవచ్చును. అయినను రాజ్యాంగవిషయములయందు సహి తము స్వప్రయోజనపరులు చేయు కృషివలన నిజమయిన స్వాతంత్ర్య ములును లాభములును కలుగనేరవు. మనము ముందుగా నీతియందు వృద్ధిపొందినంగాని రాజ్యాంగస్వాతంత్ర్యములను పొందుట కర్హులము కాఁజాలము. నీతివృద్ధికి మతాభివృద్ధి కావలెను. మన మతసత్యము లనేకములు దేశభాషలలో లేక జనసామాన్య దురవగాహమయిన సంస్కృతభాషలోనుండి జనసంఘమున కందని ప్రమానిపండ్లయి స్వార్థ పరులైన మతాచార్యుల పిడికిళ్ళలోనుండి విపరీత ప్రయోజనముకల వయి శిష్యహృత్తాపహారులుగాక విత్తాపహారులు మాత్రమయి యున్న గురువులకు జీవనాధారము లగుచున్నవి. రాజ్యాంగస్వాతం త్ర్యముల నిమిత్తమయి యత్నించుటకంటె ముందుగా మన కులాచా రాదులను సంస్కరించుకొని తత్స్వాతంత్ర్యములను పొందుటకయి కృషి చేయవలెను. ఇంటి గాఢాంధకారమును తొలఁగించుకొలేని

వాఁడు బయట వెలుతురు నెట్లు వ్యాపింపఁజేయగలుగును? మన భార్యలు విద్యాదీపములేక యవిద్యాంధకారములో మునిఁగియుండఁగాను, మన బాలురు మంచినీతియు మతమును లేక చెడుత్రోవలు త్రొక్కుచుండఁగాను మన వితంతుపుత్రికలు మన యనాదరముచేత ననాథలయి యావజ్జీవము సుఖహీనలయి బాధపడుచుండఁగాను స్వగృహమును బాగుచేసుకోలేని మనము దేశము నెట్లు బాగుచేయ గలుగుదుము? మన భార్యాపుత్రబంధువర్గమును ప్రేమించి మంచి స్థితికిఁ దీసికొనిరాలేని మనము లోకము నెట్లు మంచిదశకుఁ దీసికొని రానేర్తుము? మన మిప్పటి భార్యలతోఁగూడి బహిరంగముగా భోజనము చేయుటకు సాహసింపలేము; కుటుంబమునంతను ముందుంచుకొని కలిసి యేకేశ్వరుని ప్రార్థనచేయులేము; అతిబాల్యవివాహములను మానలేము; ఇతర దురాచారములను విడువలేము. ఇట్టి యల్పాంశములలో మనము బాగుపడి మనకుటుంబమును బాగుపఱుచుకోలేని మనము లోకము నేమి యుద్ధరింపఁ గలుగుదుము? బాహ్యరోగములచే దేహములు కృశించుచున్నప్పుడు ఖేదపడి మందులు వేయించుకొనుచున్నట్లే పాపరోగములచే మనయాత్మలు కృశించుచున్నప్పుడు దుఃఖపడి తన్నివారణార్థమయి యీశ్వరప్రేమామృతౌషధము నేల పానముచేయఁ బ్రయత్నింపరాదు? పొలములలో పయిరుపెట్టి తోఁటలువేసి ఫలానుభవము నపేక్షించునట్లు బీడుపడియున్న మన హృదయక్షేత్రములను బాగుచేసికొని భక్తిసస్యములను పుణ్యఫలవృక్షములను వృద్ధిపొందించి పాపకంటకములను పెల్లగించి యేల శాశ్వతములయిన సత్ఫలములను బొంది సుఖింపఁ బాటుపడరాదు? ఈపనులకన్నిటికిని బ్రతిబంధములు మనము సత్యములని ధర్మములని నమ్మిన వాని ననుష్ఠించుటకు ధైర్యము పూనలేకపోవుట మనము

పట్టి బోధనలు చేయుటకంటె బోధించిన ధర్మముల ననుష్ఠించి చూపుట మన కధికకర్తవ్యము. అనుష్ఠానము లేకపోయిన పక్షమున మన యుపదేశము లన్నియు నున్మత్తప్రలాపములవంటివయి నిష్ఫల మగును. స్వప్రయోజనపరత్వమువలనను, మాంద్యమువలనను, ఉపేక్షవలనను, భయమువలనను మనకు ధర్మమయిన పనిని చేయుటకు మనము వెనుక తీసిన పక్షమున మన యొక్కరమే చెడుటకాక కపటవర్తనులను జేసి మన సంతతివారికి సహితము చెఱుపు చేసినవార మగుదుము. మన మనోనిశ్చయప్రకారముగా నడుచుకొన్నయెడల మన కీలోకములో మూఢులవలనఁ గొన్నికష్టములు రావచ్చును. వచ్చిననేమి? రానిండు. మనకు దేశాభిమాన మున్నపక్షమునను, సత్యాదర మున్నపక్షమునను, ఈశ్వరభక్తి యున్నపక్షమునను, కష్టములకు వెఱచి మన మణుమాత్రమును సత్కార్యమునుండి మరల రాదు. కార్యసాఫల్యమునకయి మన మెప్పుడును కష్టములతో పెనఁగులాడుచునే యుండవలెను. అదియే దేవుని యేర్పాటు. ఆ కష్టములతోడి పోరాటమువలననే మనము మనోదార్ఢ్యమును బొంది కార్యదక్షుల మగుదుము. మన సత్కార్యాచరణమువలన మన కెక్కడ కష్టములే కలుగుచున్నను లోకమున కయినను మేలు కలుగక పోదు; మన సద్వర్తనమును జూచి యనేకులు మంచినడత నేర్చుకొని సుఖపడకపోరు. అందుచేత మనము మృతుల మయినను, మనకార్యముల మూలమున భూమిమీఁద నెప్పుడును జీవించి యున్నవారమే యగుదుము. కాఁబట్టి మిత్రులారా! మీ యుపేక్షను మాంద్యమును విడిచి యికనైన సత్కార్యములకు దీక్ష వహింపుఁడు; మాటలు చాలించి శీఘ్రముగా కార్యములకు పూనుఁడు. ధర్మచింతయు నీశ్వరభక్తియు లేకపోవుటచేత నాచరణములేక యుపన్యాసములును సభ

లును వ్యర్థములగుచున్నవి. కాంబట్టి ధర్మచింతను, ఈశ్వరభక్తిని గలవారమయి పరిశుద్ధజీవనములను బొంది మృగస్థితినుండి దేవస్థితికి లేవఁ బ్రయత్నింతము. మనకిట్టి పనులకు ధైర్యసాహసములను గలిగింప సర్వాభీష్టఫలప్రదాతయైన పరమేశ్వరుని త్రికరణశుద్ధిగా వేఁడుకొందము.

జీవితము యొక్క పరమార్థము
దానిని పొందు మార్గము

By

K. VEERESALINGAM

జీవితముయొక్క పరమార్థము
దానిని పొందు మార్గము

ఓ భ్రాతృబృందములారా!

మన సమాజముయొక్క యీ పదునాఱవ సంవత్సరోత్సవ సమయమున మనవారి కోరికప్రకారముగా మనుష్యజీవితమునకు పరమార్థమేదో దానిని పొందు మార్గ మెట్టిదో నా శక్తికొలఁదిని కొంత చెప్పఁబోవుచున్నాను. నేను చెప్పఁబోవు దానిని దత్తావధానులరయి యాలకించి యీ మహావిషయమునుగూర్చి మీ మనస్సులలోఁ గొంచె మాలోచింపుఁడు. ఏ వస్తు వే ప్రయోజనము నుద్దేశించి చేయఁబడినదో తెలిసికొనవలె నన్నపక్షమున, ముందుగా మన మా వస్తుతత్త్వమును విమర్శింపవలెను. ఆయా వస్తువుల యవయవనిర్మాణక్రమమును, వానికి గల శక్తులను, వాని గుణస్వభావమును మనము విమర్శించి తెలిసికొన్నప్పు డేయే వస్తు వేయే ప్రయోజనముల నుద్దేశించి చేయఁబడినదో గ్రహింపఁగలుగుదుము. ఈ ప్రకారముగానే మనుష్యుఁ డేయే ప్రయోజనముల నుద్దేశించి సృజింపఁబడెనో, అందు పరమార్థ మేదో, దానిని సాధించుసాధనము లేవో తెలిసికోఁ గోరిన యెడల మనము మనుష్యప్రకృతినిగూర్చి చక్కఁగా విచారింపవలెను. జడపదార్థములయొక్కయు మనుష్యేతరజంతువులయొక్కయు నిర్మాణము సుబోధముగాను, అవి యేకరీతి ప్రకృతిధర్మములకే యెప్పుడును తప్పక లోఁబడునవిగాను ఉన్నందున వానివలని ప్రయోజనములను నిర్ధారణముచేయుట మిగుల సుకరముగా నుండును. మనుష్యప్రకృతి యట్టి సుగమమయినది గాక మిక్కిలి దురవగాహమయినందున దాని పరమార్థమును నిర్ణయించుట యధిక ప్రయాసకరముగా నుండును.

నిపుణముగా పరిశీలించిచూడఁగా మనుష్యప్రకృతియందు భిన్న గుణములుగల రెండు ప్రత్యేకతత్త్వములు కానఁబడుచున్నవి. అం దొకటి సర్వజంతుసామాన్యమైన భౌతికతత్త్వము; రెండవది మను ష్యైకవిశేషమైన జ్ఞానతత్త్వము. ఈ రెంటిలో మొదటిదానిని శరీర మనియు, రెండవదానిని ఆత్మయనియు మనవారు చెప్పుదురు. సాకార మయిన యీ మొదటిదానిని స్థూలశరీరమనియు నిరాకారమైన ఈ రెండవదానిని సూక్ష్మశరీరమనియు వ్యవహరించుటకూడఁ గలదు. ఈ రెండుతత్త్వములును పయికిఁ జూచుటకు పరస్పరవిరుద్ధములయి నవిగా కనఁబడును. అంతేకాక మనుష్యుఁ డితరజంతువులవలె నియతములైన ధర్మములకు లోఁబడి యెప్పుడు నేకరీతిగా నడుచు వాఁడుగాక స్వేచ్ఛానుసారముగా సంచరించు స్వాతంత్ర్యముకలవా డుగా నున్నాఁడు. అతఁడు బాహ్యవస్తుప్రేరణముచేతనే నడపఁబడ వాఁడు గాక తద్వ్యతిరిక్తముగా తన మనస్సు వచ్చినట్లెల్లను నడువఁ గల వాఁ డగుటచేత, అతఁ డవలంబించు వ్యాపారములుసహిత మసం ఖ్యాకములుగా నుండును; అతఁడు పూనుకార్యము లెన్నివిధములనో యసంగతములుగాను చంచలములుగాను నుండును; అతఁడు కోరు కోరిక లనంతములుగాను, చేయుప్రయత్నము లపరిమితములుగాను నుండును. ఈ విషయములయందు మార్పులేక యెప్పుడు నేకరీతిగా వర్తించుచుండు మృగములకును సదా కాంక్షలతోను భయములతోను యోచనలతోను ప్రయత్నములతోను కొట్టుకొనుచుండు మనుష్యుల కును గలభేదమును విచారించినచో మహాస్తిమశకాంతరము కానఁ బడును.

ఇట్టి వివిధావస్థలు గల మనుష్యజీవితముయొక్క పరమార్థమును మన మిప్పుడు నిశ్చయింపవలసియున్నది. లోకములోని యేపదార్థము

యొక్క ప్రయోజనమును దెలిసికోవలెనన్నను దాని స్వభావమునుబట్టియే కాని వేఱుమార్గమునఁ గాదు. వివిధవస్తుధర్మములనుబట్టి రాళ్ళవలని ప్రయోజనము గృహనిర్మాణాదుల కుపయోగపడుట యనియు, లోహములవలని ప్రయోజనము పాత్రములు మొదలయినవానిని చేయుట కనుకూలపడుట యనియు, మల్లికాదిలతలవలని ప్రయోజనము పుష్పముల నిచ్చుట యనియు, పనసాదివృక్షములవలని ప్రయోజనము ఫలముల నొసఁగుట యనియు, వృషభాశ్వాదులవలని ప్రయోజనము భారమును వహించుట యనియు, మనము తెలిసికొనుచున్నాము. ఈ ప్రకారముగానే మనుష్యజీవితముయొక్క పరమార్థమును మనము మనుష్యస్వభావమునుబట్టియే నిర్ధారణచేయవలెను. ఇట్టి నిర్ణయమును జేయుటకు మన పట్టణములోని వారినిబట్టియే విమర్శింప నారంభింపవచ్చును. ఏ వీధిని జూచినను జనులు నానావిధవ్యాపారములయందు వర్తిల్లుచున్నారు. కొందఱితరస్థలములనుండి బండ్లమీఁదను పడవలమీఁదను వచ్చిన సరకుల నంగళ్ళకు మోయుచుందురు; కొంద ఱంగళ్ళనుండి యిక్కడిసరకుల నితరస్థలములకుఁ బంపుటకయి పడవలు మొదలయిన వానివద్దకుఁ గొనిపోవుచుందురు; కొంద ఱాహారవస్తువులను వస్త్రాదులను విక్రయించుచుందురు; కొందఱు కూరగాయలు మొదలయిన వానిని కొనుచుందురు; కొందఱు పెట్టెలు బల్లలు మొదలయినవి చేయుచుందురు; కొంద ఱక్కడక్కడ గృహములను కట్టుట, నూతులు త్రవ్వుట మొదలయినపనులు చేయుచుందురు; మఱికొంద ఱచ్చుటచ్చుట వస్త్రములు నేయుట కుండలు చేయుట లోహపాత్రములు నిర్మించుట మొదలయిన వివిధకర్మములు చేయుచుందురు. ఊరుదాఁటి కొంతదూరము పోయిన పక్షమున పలువురు పొలములు దున్ని పైరులు పెట్టుట, యిటికెలు మొదలయిన గృహోపకరణములు

చేయుట మొదలయిన పనులయందు కాలము పుచ్చుచుందురు. ఈ వ్యాపారము లన్నిటినిబట్టి చూడఁగా మొట్టమొదట మనుష్యుఁడు తన పొట్ట పోసికొనునిమిత్తమును చలి మొదలగువాని బాధనుండి తప్పించుకొని శరీరమును కాపాడుకొనునిమిత్తమును సృజింపఁబడినట్లు తోఁచవచ్చును. వీథుల కిరుప్రక్కలనుండెడి యిండ్లన్నియు చలిగాలి నుండియు నెండనుండియు వాననుండియు శరీరములను రక్షించుట కుపయోగపడును; ఆహారపదార్థములు క్షుద్బాధనుండి శరీరములను గాపాడుట కుపయోగపడును; వస్త్రాదులు శీతోష్ణములనుండి శరీరమును కాపాడుట కుపయోగపడును. ఈ ప్రకారముగా దేనిని జూచినను మనకది దేహసంరక్షణార్థమో దేహసౌఖ్యార్థమో దేహాలంకారార్థమో యుద్దేశింపఁబడినట్లు కానఁబడును. పృథివ్యాపస్తేజోవాయురూపమయిన బాహ్యప్రపంచముతోడి యనివార్యసంబంధమును గలదయి, మన్నువలనను నీటివలనను నిప్పువలనను గాలివలనను బాధ నొందఁదగిన శరీరము మనుష్యున కుండియుండుటచేత దానిని సంరక్షించుకొని సుఖపడుట మనుష్యధర్మమగుటకు సందేహములేదు. అయినను మనుష్యుఁడు దేహసంరక్షణము చేసికొనుచు నింద్రియసుఖముల ననుభవించు చున్నంత మాత్రముచేత చరితార్థుఁడగునా? యన్న యంశమును మన మాలోచింపవలెను. మనుష్యుఁడు శరీరసౌఖ్యము నిమిత్తము చేసికొనెడు సమస్తవ్యాపారములలోను మృగాదులయందుఁ గానఁబడని విశేష మొక్కటి కానఁబడుచున్నది. దేహము కాపాడుకొనుటకయి పాటుపడుట మృగమునకును మనుష్యునికిని సామాన్యధర్మము. పడెడుపాటులో నెల్ల నాలోచన యొక్కటి మనుష్యునకు విశేషము. ఈ యాలోచన యొక్కటి లేకపోయినపక్షమున దేహసంరక్షణవిషయమున మృగమునకంటె మనుష్యునియం దాధిక్య మేదియు

లేదు. ఒకవిధమునఁ జూడఁగా మనుష్యుఁడే మృగమునకంటె హీనుఁ
డని చెప్పవచ్చును. ఒక్కపూట భోజనమునకయి మనుష్యుఁ డెన్ని
విధములనో పాటుపడి చెమటయూడ్చి పనిచేసి పాకము చేసికోవలెను.
మృగమున కింత యాయాసములోఁ బనిలేదు. ఒకపశువు కొంచెము
దూరము నడువఁగానే భూమిమీఁద విస్తరివేసి వడ్డించి యాహార
మును సిద్ధపఱిచియుంచినట్టుగా పచ్చికబయిళ్లు కానఁబడును. ఈ విధము
గానే యింద్రియసౌఖ్యముతో సంబంధించినంతవఱకు ప్రతి విషయము
లోను మృగాదులకంటె మనుష్యుఁడే యెక్కువ కష్టపడవలసియుం
డును. ఇట్లున్నను మృగాదులకంటె మనుష్యున కాధిక్యము తెచ్చి
నది యాతనికున్న యాలోచన. ప్రతికార్యములోను మనుష్యుఁ
డాలోచనను బుద్ధిని జూపవలసి యున్నది. ఈ బుద్ధిబలముచేతనే మను
ష్యుఁడు తన దేహసౌఖ్యము నిమిత్తమయి వస్తుతత్త్వములను శోధించి
యంత్రములను కనిపెట్టి యినుమును నీటిమీఁద తేలించి యోడలతో
సముద్రములు దాఁటియు, నీళ్ళను నిప్పుచే కాఁగించి యావిరిచే
వాయువేగమున బండ్లులాగుట, వస్త్రాదికము నేయుట, మొదలయిన
పనులు చేయించియు, మెఱుపుల నాకాశమునుండి యాకర్షించి
యినుపతీగలలోఁ బెట్టి మనోవేగమున వానిచేత దూరదేశములకు
వార్తలను పంపియు, దుస్సాధ్యములయిన కార్యములను సాధించి తన
యసమానసామర్థ్యమును లోకమునకుఁ జూపుచున్నాఁడు. ఇట్టి బుద్ధి
సంపద మనుష్యుని కొకనికే దక్క మఱి యే యితరజంతువునకును
లేదు. మనుష్యేతరజంతువునకు దేనికిని లేని యీ బుద్ధివిశేషము సర్వ
జంతుసామాన్యమయిన దేహాభరణమున కుపయోగించు సాధనము
లను గనిపెట్టునిమిత్తమే మనుష్యున కియ్యఁబడినదా, లేక దానివలన
సాధింపఁదగిన యాధిక్యము మఱి యేదియైనను నున్నదా? యన్న

యంశమును మనము కొంచెము విచారింపవలసి యున్నది. నిత్యమయి నిరంతరాభివృద్ధిని బొందఁదగిన యాత్మ యనిత్యమయి క్షణభంగురమైన శరీరనిమిత్తమే చేయఁబడిన దనుట మందబుద్ధికి సహితము వింతగా తోఁచకమానదు. మన బుద్ధిని దేహసుఖమున కుపయోగించు పనులకొఱ కుపయోగించుచున్నను, ఆ పనులలోఁగూడ నొకవిశేషము పొడకట్టుచున్నది. శరీరసౌఖ్యమున కనుకూలించునన్న యుద్దేశముతో బుద్ధినుపయోగించి పనిచేసినప్పు డొకవేళ కార్యసాఫల్యము కాకపోయినను, ఆలోచనవలనను తన్మూలమున లభించెడు జ్ఞానమువలనను మనస్సున కానందము కలుగుచున్నది. కార్యసాఫల్యమువలనఁ గలిగెడి యల్పసంతోషమునకంటె జ్ఞానలాభమువలనఁ గలిగెడి యానందమత్యధికముగా నున్నది. దేహసౌఖ్యమునకువలయు పనులలో సులభమార్గములను కనిపెట్టుటనిమిత్తమే మొట్టమొదట మన మాలోచించినను, ఆ యాలోచనవలనను తదనుసారమైన శోధనవలనను ప్రారంభమున నుద్దేశింపఁబడిన పనితో బొత్తిగా సంబంధములేని క్రొత్తక్రొత్త సత్యములు బయలఁబడి తత్కర్తకు హృదయానందమును గలిగించుటయే కాక యాసత్యములే తరువాత శాస్త్రములయి లోకమునకు మహోపకారమును నంతతసంతోషమును గలిగించుచున్నవి. ఒక్కొక్కపని నిమిత్త మొక్కొక్కవస్తువును శోధించునప్పుడు దాని ధర్మములను కనుఁగొనుటయే కాక దాని కితరవస్తువులతోఁ గల సంబంధమును, ఒక్కొక్కజాతి వస్తుకోటికి సామాన్యమైన విశేషధర్మములను, సర్వవస్తుసామాన్యములైన ధర్మములను మనుష్యుఁడు కనిపెట్టుటకు సమర్థుఁడగును. ఆరంభదశలో పూనిన కార్యాంశమెట్లున్నను నడుమ కనిపెట్టఁబడిన యవాంతరవిషయములవలననే లోకమున కుపకారమును మనస్సున కాహ్లాదమును కలుగుచుండును.

అందుచేతనే బుద్ధిమంతు లగువా రనేకులు జనసౌఖ్యదాయకమైన వేఱుపనిని దేనిని నుద్దేశింపకయే వస్తుధర్మపరిశీలనమునే పనిగాఁ జేసికొని యా పని నిమిత్తమయి యెండకు వానకు నోర్చి యాఁకలియు దప్పియు సరకుగొనక శరీరకష్టమునకును, ధననష్టమునకును సహించి యపాయకరములైన యరణ్యములను సముద్రములను జొచ్చి యా పని నిమిత్తమే దేహసౌఖ్యములను దేహములను యౌవనమును ధారపోయుచున్నారు. ఒకఁడు జంతుస్వభావలక్షణములను గనిపెట్టవలెనని భార్యాపుత్రులను గృహములను విడిచి మనుష్యసంచారములేని మహారణ్యమును దూఱి క్రూరమృగమధ్యమున కష్టజీవనము చేయుచున్నాఁడు. ఒకఁడు ద్వీపాంతరములను కనిపెట్టవలెనని దారిలేని మహాసముద్రములమీఁదఁ బోయి ప్రచండవాయువులకును సంతతతీవ్రధారాపాతమునకును సంచలింపక గాలిలోని దీపమువలె నల్లలనాడుచుండెడి యోడలో మహాజలమధ్యమున ప్రాణముల కాశింపక యాత్ర చేయుచున్నాఁడు. ఒకఁడు తేజోవాయుశక్తులను పరీక్షింపవలెనని దుర్గమములైన పర్వతాగ్రములకెగఁబ్రాఁకి యందు చలువల్లుగ్రమ్మించి దేహములు కంపమొందించెడు మంచులో మహావాయుపథమున కాలము గడపుచున్నాఁడు. ఒకఁడు భూగర్భమును శోధింపవలెనని పాతాళలోకమంటునట్లుగా గోతులు త్రవ్వి భూమియొక్క పొరలను నడుమనడుమఁ గానఁబడెడు జంతుకంకాళములను నిరూపణచేయుచు నధోభాగమున నంధకారబంధురముగానుండి కొలుములవలె దుస్సహతాపమును గలిగించెడి యగాధబిలములలో ప్రొద్దుపుచ్చుచున్నాఁడు. ఒకఁడు నదుల జన్మస్థానములు మొదలయినవి కనుఁగొనవలెనని మరుభూములలోను వాలుకామయస్థలములలోను బడినడిచి బహుప్రయాసముతో

దేశసంచారము చేయుచున్నాఁడు. ఒకఁడు గ్రహనక్షత్రాదులగతులు నిరూపింపవలెనని రాత్రులు నిద్రమాని కొంత లెక్కలను దూరదేశముల కరిగియు నాకాశమండలి గోళకోటులను సంశోధించుచున్నాఁడు. ఈరీతిగా శరీరాయాసమునకును ప్రాణాపాయమునకును భయపడక పనిచేసిన బుద్ధిమంతుల బుద్ధిబలము వలననే మనకిప్పుడు జంతుశాస్త్రములు, జలశాస్త్రములు, తేజోవాయుశాస్త్రములు, పృథ్వీతత్త్వశాస్త్రములు, భూగోళశాస్త్రములు, ఖగోళశాస్త్రములు మొదలయిన నానావిధప్రకృతిశాస్త్రము లుద్భవిల్లి జనపరంపర కానందలాభములను గలుగఁజేయుచున్నవి. వీని నన్నిఁటినిబట్టి చూడఁగా శరీరసౌఖ్యమున కంటె మనస్సౌఖ్యమే యధికమైన దనియు, మనస్సౌఖ్యమునకు భంగము కలుగనున్నప్పుడు శరీరసౌఖ్యమును పాటింపకుండుట మానుషధర్మమనియు స్పష్టమగుచున్నది. పైని వివరించిన భౌతికపదార్థధర్మములను దెలిపెడు శాస్త్రములు గాక మనస్సున కానందమును వినోదమును గలిగించెడు కావ్యనాటకాదులును తర్కవ్యాకరణాది శాస్త్రములును మనోబలకల్పితములయి యున్నవి. ఒక్క రసికపురుషుఁడు యావజ్జీవమును పొందఁగలిగిన యింద్రియసుఖము నంతను కలిపినను మంచిబుద్ధిమంతునిచేఁ గల్పింపఁబడిన కావ్యము నొక్క దానిని వినుటవలన నొక్కదినమునఁ గలుగు సంతోషముతో సరి రాదు. అధికసుఖము నిమిత్తమయి యల్పసుఖమును విడుచుట బుద్ధిమంతుని లక్షణమగుట యెల్లవారును నెఱిఁగిన యంశమే యగుటచేత, దేహసుఖమునకంటె మానసికసుఖ ముత్కృష్టమయినదని నే నిక్కడ పెంచి చెప్పవలసిన యావశ్యకము లేదు. ఇంకొకసంగతి వినుఁడు. మనము పొలములనుండి మనపురవీధులకు మరలవచ్చి నడుచునప్పుడు మనుష్యబుద్ధివికాసమున కుత్తేజకములైన పాఠశాలలుకూడ మన

కక్కడక్కడ నేత్రగోచరము లగును. కొంచె మాలోచించి చూచిన పొలములలో దున్నుకొనువారును వీధులలో మూటలు మోయు వారును జనులచే గౌరవింపఁబడకుండుటయు పాఠశాలలలోఁ జదివి శాస్త్రపరీక్షలయందు మెప్పొందినవారు వారికంటె సహస్రగుణము లధికముగా గౌరవింపఁబడుచుండుటయు నెల్లవారికి స్ఫురింపకమా నదు. ఈ యొక్కయాంశమే దేహమునకంటె మనస్సు ప్రధానమ యినదనియు దేహసౌఖ్యమునకంటె మానసికసౌఖ్య మధికాదరణీయ మయినదనియు స్థాపించుటకుఁ జాలియున్నది.

క్షణభంగురమైన శరీరమునకంటె నిత్యమయిన మనస్సుత్కృష్ట మయినదని తెలిసికొన్నపిమ్మట, వివిధములయిన మానసికధర్మము లనుగూర్చి యించుక విచారింపవలసియున్నది. ఈమానసికధర్మము లనే యాధ్యాత్మికధర్మములని సామాన్యముగా వ్యవహరింతురు. ఈ పైని జెప్పఁబడినది యాధ్యాత్మిక ధర్మములలో నొక్కటియైన జ్ఞానము. ఇదియే సత్యము. సత్యమనగా వస్తుధర్మముల నున్నవి యున్నట్టుగా గ్రహించుట. ఈసత్యమును కనుఁగొను నిమిత్తమే ప్రకృతి శాస్త్రజ్ఞులు లోకములోని సమస్తసౌఖ్యములను విడిచి, నానాకష్ట ములకు లోనయి ప్రాణములకు సహిత మాశపడక తమ జీవిత ములను తత్త్వశోధనమున కర్పించియున్నారు. అట్టివారికి సత్యమే పరమదైవతము. వారు వస్తుశోధనము చేసినకొలఁదిని ప్రతివస్తు వునందును మొట్టమొదట ప్రాతఃకాల సూర్యకిరణములవలె వారి జ్ఞానదృష్టికి సత్య మణుమాత్రముగా కానఁబడి యంతకంత కధిక ముగా ప్రజ్వరిల్లి వారి కపరిమితానందమును గలిగింపఁ జొచ్చెను. సమస్త వస్తువులయందును సూర్యకిరణములవలెఁ దోఁచి శోభిల్లు చున్న నూతనసత్యములను జూడఁగా చూడఁగా సర్వత్ర వ్యాపించి

యున్న యీ సత్యకిరణ ప్రసారమునకు మూలకారణమై కోటిసూర్య ప్రభాభాసమానమైన పరమసత్యజ్యోతి కొందఱి దృష్టులను మిఱుమిట్లు గొలిపి ప్రపంచమును మఱచునట్లు చేసెను. ఇట్లు శోధన చేసిన వారిలో ననేకులు బాహ్యప్రపంచమునందు మాత్రమేకాక తమ మనస్సులయందును సత్యజ్యోతి దేదీప్యమానముగా వెలుఁగుచుండఁ జూచిరి. అందుచేతనే కొందఱు ప్రత్యేకముగా మనోధర్మములను పరిశీలించుటలోనే కాలమునంతను గడపి వివిధములైన యాధ్యాత్మికశాస్త్రములను జేసిరి. ఈపరిశీలనలోఁ గొందఱి మనోనేత్రములకు తమలోపలనున్న జ్ఞానతేజస్సుయొక్క మహిమచేత బాహ్యప్రపంచమే తోఁచకపోఁగా, అట్టివారు ప్రపంచము మిథ్యయనియు మనఃకల్పితమనియు మాయయనియు భ్రమయనియు నంతట నిండియున్న జ్ఞానరూపమయిన పదార్థమొక్కటియే సత్యమనియు సాధింపఁ జూచిరి. ఇట్టివారు కొందఱు సర్వత్ర వ్యాపించియున్న జ్ఞానశక్తిని తమలోపల నిమిడియుండి నిరంతరాభివృద్ధి నొందఁదగిన జ్ఞానశక్తినిజూచి భ్రమించి యీరెండుశక్తులు నొక్కటియే యనియు తామే బ్రహ్మలనియు భావింపఁజొచ్చిరి. తాము సర్వజ్ఞులు కాకపోయినను బాహ్యప్రపంచము మిథ్య కాకపోయినను, మానసికశక్తులముందఱ భౌతికశక్తులు పర్వతములో పరమాణువంత యయినను కావని స్పష్టపడుచున్నది. మనలోపలను వెలుపలను వ్యాపించియున్న సత్యమహిమలను నిపుణముగా పరిశీలించిన ధీమంతులు కొందఱీ రెండుశక్తులు నెంతయధికముగా నున్నను పరిమితములే యున్నసత్యమును కనుఁగొని యవి పరతంత్రస్వభావము కలవగుట భావించి పరిమితమునుండి యపరిమితము నూహచేసి దానికిఁగారణభూతమయిన పరిపూర్ణజ్ఞానస్వరూపమయిన పరబ్రహ్మమును వేరుగా

దెలిసికొని సేవించి ఆనందింపఁ జొచ్చిరి. మనకు లోఁబడి మనసౌఖ్యమున కనుకూలపడుచు మనకు సేవకప్రాయములుగానున్న పృథివ్యాపస్తేజోవాయువులు సహితము కొన్నిసమయములయందు మన కడఁగనివియు ప్రతికూలము లయినవియు నయి మీకును మాకును శాసకుఁడై సర్వాత్మకుఁ డయియున్న పరమాత్ముఁడొకఁడు పయినున్నాఁడని సహస్రముఖముల ఘోషించుచుండును. మన వంటయింటనుండి యాహారపదార్థములను పక్వము చేసెడి యగ్నిహోత్రమే యొకానొకప్పుడు తీవ్రజాలలతో లేచి యార్పశక్యముకాక మనగృహములను వస్త్రములను దేహములను గూడ భస్మము చేయుచున్నది. మనచెమ్మట లార్చెడు మలయమారుతమే యొకానొకప్పుడు తీవ్రప్రభంజనముగా మాఱి మనగృహములను సస్యములను క్షణకాలములో నేలమట్టము చేయుచున్నది. వానలను బంపి మనపైరులను పండించెడు మేఘమే యొకానొకప్పు డతివృష్టిని పిడుగులను బఱపి మన దేహములకును గేహములకును వినాశము కలిగించుచున్నది. అట్టిసమయములయందిట్టివి మనుష్యహృదయములలో భీతిని బుట్టించి యీశ్వరుని మహిమలను వెల్లడింపకుండునా? గాలివానలును తుపానులును మెఱుములును సుడిగాడ్పులును భూకంపములును వహ్నిపర్వతనిస్సరణములును మనస్సుల కాశ్చర్యమును భీతిని బురికొల్పి సృష్టికర్తయొక్క శక్తిమహిమలను వెల్లడింపనిపక్షమున లోకములోనివి మఱియేవి వెల్లడించును?

మానసికశక్తులలో నింకొకటి కారుణ్యము. దీనినే కొందఱనురాగ మనియు ప్రేమయనియు వివిధనామములతోఁ బిలుతురు. ఈ దయాగుణము మనుష్యున కలంకారభూతమైనది. మనము వీధులలో నడుచునప్పు డేయింటికిఁ బోయి చూచినను కారుణ్యము స్పష్టముగాఁ గానఁ

బడును. ఒక యింటనుండువారు పరస్పరానురాగముకలవారయి యొం డొరులకు మేలు చేసికొనుచుందురు. వృద్ధులయిన తల్లిదండ్రులను తన యులు స్వకష్టములకు సహించి భక్తితో పూజించి వారికి సమస్తోప చారములను జేయుచున్నారు. దృఢగాత్రులు నిద్రమాని శరీరాయాస పడి వ్యాధిగ్రస్తులకు మందుమాకులిచ్చి కరుణతో సంరక్షణచేయు చున్నారు. జననీజనకులు తాము సమస్తకష్టములను పడి తమకడు పైనఁ గట్టుకొని బిడ్డల కేలోపమును గలుగకుండ ప్రేమతో వారిని కాపాడుచున్నారు. ఇంటనున్నవారు దయచూపునది యొక్కకుటుం బములోనివారికి మాత్రమే కాదు. కొన్నిసమయములందు గృహస్థు లభ్యాగతులను బంధువులను బీదలను బిలిచి తమయింట భోజనములు పెట్టి యాదరించుచున్నారు. ఒక్క గృహస్థుల గృహములలో మాత్రమే కాక వీధులయందు నడుచునప్పుడు మన కీదయాగుణముయొక్క చిహ్నము లక్కడక్కడఁ గానవచ్చుచునేయుండును. సత్రములు చలిపందిరులు, వైద్యశాలలు మొదలయిన సర్వజనోపయుక్తధర్మనిల యములు మనుష్యునిలోఁగల యీదయాగుణమును చాటుచున్నవి. మన గృహములయందలి గోవులు మొదలయినవి తమదూడలను పాలిచ్చి ప్రేమతోఁ గాపాడుచుండుట చూడఁగా, దయాగుణము పశుపక్ష్యాదులలోను సర్వపదార్థములలోనుగూడఁ గానఁబడుచున్నది. సృష్టియందంతటను వ్యాపించియున్నది సత్యము మాత్రమేకాక కారు ణ్యముకూడ నని యెల్లవారు నెఱుఁగవచ్చును. ఈకారుణ్యము మన మనోగుణములలో నొకటియై యున్నది. మనుష్యులలోను పశుపక్ష్యా దులలోనుగల దయాగుణము పరిమిత మయినదిగాఁ గానఁబడుచున్నది. అందులో మనుష్యులకుఁగల దయాగుణ మంతకంత కధికము కాఁదగినది గా నున్నది. సృష్టిలోని యీ పరిమితదయాగుణమునుబట్టి మనుష్యుఁడు

సృష్టికర్తయొక్క యపరిమిత దయాగుణము నూహించి కనుఁగొను చున్నాఁడు. అపరిమిత సత్యతేజస్సునుబట్టి యీశ్వరుఁడు సత్యస్వరూపుఁ డనియు సర్వజ్ఞుఁడనియుఁ జెప్పఁబడునట్లే యీయపరిమిత దయాగుణ మునుబట్టి దయాస్వరూపుఁ డనియు సర్వకారుణ్యుఁడనియుఁ జెప్పఁబడు చున్నాఁడు.

మన మానసికగుణములలో మఱియొకటి న్యాయము. దీనినే నీతి యందురు. ఈగుణము మనుష్యునకుఁగల గుణములలోనెల్ల సర్వో త్కృష్టమయిన దగుటచేత దీనిని గుణరాజమని చెప్పవచ్చును. పర దారధనాదులను గోరక వంచనముమాని సమస్తవ్యవహారములలోను పరులయెడ ఋజువుగా ప్రవర్తించుటయే న్యాయగుణము; ఇదియే మనప్రవర్తనకు మార్గదర్శకము. దీనిని మీఱి నడుచుట పాపము; దీని ననుసరించుటయే పుణ్యము. న్యాయమైనమార్గమును మీఱి నడువఁబూనునప్పుడెల్ల మనయంతరాత్మ యది పాపమని బోధించు చుండును. ఇట్లు పుణ్యపాపములనుగూర్చి మనయంతరాత్మచేయు బోధనమే మనవృత్తమును నడిపెడి యీశ్వరశాసనము. హృదయ ఫలకమునందు లిఖింపఁబడియున్న యీశ్వరశాసనరూప మయిన యీ వాక్యముల నతిక్రమించువాఁడు పాపాత్ముఁడై యాత్మదుఃఖములపా లగును. మానసికధర్మములలో నిది యొక్కటియైనను మనుష్యుని పవిత్రమైన మనుష్యనామధారణమున కర్హునిగాఁజేయు ప్రధానధర్మ మయినందున ముఖ్యముగా నిదియే ధర్మమని చెప్పఁబడును. మను ష్యనామమునకు యోగ్యుఁడగువాని కెల్ల నీతి యవశ్యముగా నుండ వలెను. నీతిలేనివాఁడు మృగప్రాయుఁడు; మనుష్యనామధారణమున కనర్హుఁడు. ఇది చేయవలెను; ఇది చేయరాదు; అని బోధించెడు శాసనమొకటి మన హృదయములోనున్నందున, ఆశాసనమును మీఱి

నడుచువా రెల్ల శిక్షార్హులని యేర్పడుచున్నది. మనము చేయు కార్యములయందు మన మొక శాసనమునకు బద్ధులమయి, మనము చేసెడిపనులకు మన ముత్తరవాదుల మెప్పుడగుదుమో, అప్పుడు మనలను శిక్షించి యేలువాఁ డొకఁడుండక తీరదు. కాఁబట్టి మనలను నీతిమార్గమున నడువ నియమించిన యామహామహుఁడు ధర్మస్వరూపుఁడయిన పరమేశ్వరుఁడు. ఈనీతిగుణమును వహించినవారయి ప్రపంచసుఖములన్నియు పోయినను నీతిమార్గము నణుమాత్రమును తొలఁగక వర్తించువారినే జను లెల్లకాలమును ప్రేమచూపి గౌరవింతురు. సత్యము నిమిత్తమును ధర్మము నిమిత్తమును సకలకష్టములకు లోనయి శరీరమును సహితము విడువసాహసించిన మహాపురుషులనే మనము శ్లాఘింతుము గాని ధర్మము తప్పి శరీరమును పోషించుకొన్నవారిని మనము మెచ్చుకోము. ఎప్పుడో లోకాంతరగతులయిన హరిశ్చంద్రుఁడు మొదలయిన వారిమీఁద మన మిప్పటికిని ప్రేమ చూపుచు వారు పడిన కష్టములను విన్నప్పు డవి మనకు వచ్చినట్టుగా పరితపించుచుండుటకుఁ గల కారణము భగవంతుఁడు మానవహృదయములో స్థిరముగా స్థాపించిన ధర్మాభిరతిగాక మఱియేమగును? ఇట్టి స్వాభావికమయిన ప్రేమము మనకు నిజమైన పురుషులమీఁద నేకాక పురాణములలోను నాటకములలోను గల పుణ్యాత్ములయిన కల్పితపురుషుల మీఁదను గలుగును. ఈన్యాయగుణము మనుష్యకోటిలో నెల్లను గలదనుట కెంతటి మృగప్రాయుఁడయినను తనకు ప్రేమాస్పదుఁడయిన పుత్రుఁడు దొంగతనము చేసినప్పుడును వానిని శిక్షింపఁజూచుట నిదర్శనముగా నున్నది. మనము వెనుకఁజెప్పినరీతిని పట్టణములో నడుచునప్పుడును మనుష్యుని నీతిగుణమును సూచించుచిహ్నములు పెక్కులు కానఁబడును. మన కందందుఁ గానవచ్చెడు రక్షకభటులయొక్కయు

దండవిధాయకులయొక్కయు సభలును, న్యాయసభలును, చెఱసాలలు మొదలయినవియు ప్రజలను ధర్మమార్గమున నడిపించుటకొఱకును ధర్మము తప్పినప్పుడు శిక్షించుటకొఱకును నేర్పడినవేకదా ?

మనము పట్టణవీథులలో సంచరించునపుడు కంటికిఁ గానఁబడెడి వస్తువులనుండియే మనుష్యునికిఁగల మానసికగుణము నింకొక దానిని తెలిసికొనవచ్చును. పట్టణములోని కొన్నిప్రదేశములకు పోయిన పక్షమున మనకు నానామతస్థుల దేవాలయములు దృష్టిగోచరము లగును. ఈశ్వరారాధనము నిమిత్తమయి జను లాదేవాలయములకు భక్తితో గుంపులుగుంపులుగా పోవుచుండుటయు మనము చూడ వచ్చును. ప్రతి మనుష్యుని హృదయమునందును తాను పరతంత్రుఁడ ననియు, తానుజేయు కార్యములకు ఫలములనిచ్చు నిత్యపురుషుఁ డొకఁడు పైనిగలఁడనియు, తానాతని నారాధించిచే శాశ్వతసుఖ మును పొందవలెననియు, తానాతని ప్రీతినిమిత్తమే సమస్తకార్యము లను జేయవలయుననియు, దృఢవిశ్వాస మొకటి స్వాభావికముగా నున్నది. ఈవిశ్వాసములోనే తనయాత్మ దేహముతో నశించునది గాక శాశ్వతముగానుండి మరణానంతరమునను పుణ్యపాపఫలముల ననుభవించుచుండు నన్న సత్య మిమిడియున్నది. ఈశ్వరుని నారా ధింపవలయు నన్న యిచ్ఛ మనుష్యుని కనివార్యముగా నున్నది. దేవుని నారాధింపకపోయినపక్షమున మనుష్యునికి హృదయశాంతి గలుగదు. కాఁబట్టి యీశ్వరభక్తిపరాయణత్వము మనుష్యునికిఁగల మానసిక గుణములలో నాలవది. పూర్వోక్తములయిన మూడు గుణములను బట్టి గలిగిన దగుటచే దీనిని నాలవదానినిగాఁ జెప్పవలసివచ్చినను, అన్నిటి యొక్క సత్ఫలమగుటచేత నిదియే ప్రధానమైనదిగా పరిగణింపఁ బడవలసినది. తక్కినగుణములకు వన్నెతెచ్చి వానిని శోభిల్లఁజేసెడి యద్భుత సామర్థ్య మీ భక్తిరతిలో నున్నది. జీవాత్మకుగల యీ

నాలుగు గుణములను పరస్పరానుకూలముగా వృద్ధినొందించి యానందించుటయే మనుష్యజీవితముయొక్క పరమార్థము. ఈనాలుగుగుణములును సమానముగా వృద్ధినొందక యందుఁ గొన్నిమాత్రమే వృద్ధి పొందినయెడల నది నిజమయిన యభివృద్ధి కాదు. మన శరీరమునకు కరచరణాదు లెట్లంగములో మనయాత్మకు జ్ఞానాదులట్లే యంగములు. సర్వావయవములును యథాప్రమాణముగా పెరిగి యారోగ్యదశయందున్నప్పుడే దేహ మభివృద్ధి పొందినదని చెప్పవచ్చును; గాని యందుఁ గొన్ని యవయవములు మాత్రము పెరిగినప్పుడు వృద్ధి యని చెప్పఁదగదు. ఒక్కయవయవముమాత్రము పెరిగినప్పు డది రోగమని భావింపవలెను. ఒక్క కాలుగాని పొట్టగాని పెరిగినప్పుడు బోదకాలనియు మహోదరమనియు చికిత్సలు చేయించుచుండుట యెల్లవారు నెఱుఁగుదురుగదా? ఈయంగములలో నుత్తమమైన యంగము పెరిగినను, అదియు రోగసూచకమేకాని బలహేతువు గాదు. అంగములలోనెల్ల నుత్తమాంగమైన తల పెరిగినప్పుడును, సర్వేంద్రియములలోను ప్రధానమైన కన్ను పెరిగినప్పుడును, మఱింత శ్రద్ధతో చికిత్స చేయించుచుండుట యెల్లవారికి ననుభవగోచరమైన విషయమే. ఈప్రకారముగానే మానసికగుణములన్నియు పరస్పరానుగుణముగా పెరిగినప్పుడే యాత్మాభివృద్ధి యగును గాని యెంత యుత్తమమైనదైన నితరగుణములకు ప్రతికూలముగా నొక్కగుణము పెరుగుట యాత్మాభివృద్ధి కాదు. కొందఱు పూర్ణమయిన భక్త్యావేశము కలవారయ్యును తదితరగుణములను పాటింపకపోవుటచేత నీశ్వరుని పేరనే యనేక క్రూరకృత్యములను జేయుచు మనుష్యులని చెప్పఁబడుటకే యనర్హులగుచున్నారు. జ్ఞానమునందును కారుణ్యమునందును, నీతియందును, భక్తియందును సమానముగా వృద్ధినొందుటయే నిజమైన మానసికవృద్ధి. అట్టివృద్ధిని బొంది నిత్యానం

దమును బొందుటయే మనుష్యునికిఁ బరమార్థము. దీనిని బొందుట
కొఱకే మనుష్యరూపమును ధరించిన వారందఱును నిరంతరకృషి
చేయుచుండవలెను. మనుష్యుఁడు సమస్తవిషయములలోను మితజ్ఞుఁ
డగుటచేతను భ్రమప్రమాదాదులు మనుష్యునికి సహజగుణము లగుట
చేతను మనుష్యుఁ డెప్పుడును పరిపూర్ణుఁడు కానేరఁడు. కృషి చేసిన
కొలఁదిని వృద్ధిపొందుస్వభావము గలవాఁడగుటచేత సమస్తవిషయ
ములయందును వృద్ధికిఁ బ్రయత్నించుచు బాటుపడి సాధ్యమయినంత
యధికానందమును బొందుచుండుట మనుష్యునకుఁ బరమధర్మము.
ఇదియే మనుష్యునకుఁ బరమార్థము.

ఇప్పుడు మనుష్యజీవితమున కేదిపరమార్థమో కొంతవఱకుఁ
జెప్పితిని గాన నేనిఁక దానిని పొందు మార్గమునుగూర్చికూడ కొంత
చెప్పెదను. ఉత్తరోత్తరాభివృద్ధిని సదా కలిగించుచు మనుష్యుని పరి
పూర్ణస్థితికిఁ గొనిపోయి నిత్యానందమును గలిగించి పరమార్థమును
సమకూర్చునది పరిశుద్ధాస్తికమతము. అట్టి పరమార్థమును కలిగిం
పక యేవిషయమందైనను మానసికాభివృద్ధికి భంగము కలిగించెడు
పక్షమున, ఆమతము పరిశుద్ధమయినది కాదు. మతమనఁగా జీవా
త్మకు పరమాత్మతోడి సాంగత్యమును కలిగించి తన్మూలమున నిరంత
రాభివృద్ధిని నిత్యానందమును సమకూర్చునది. మనుష్యునికి స్వాభావి
కముగా జ్ఞానమును, కారుణ్యమును, నీతియు, భక్తియు, పరిమితము
లుగా నుండి సంతతాభివృద్ధిని పొందఁదగినవిగా నున్నవి. ఈగుణము
లీశ్వరునియందువలె పరిపూర్ణదశను పొందలేకపోయినను, వాని యభి
వృద్ధికి పరిమితిమాత్రము కానరాదు. ఈశ్వరుఁడు పరిపూర్ణజ్ఞానకారు
ణ్యధర్మస్వరూపుఁడు. పూర్ణజ్ఞానకారుణ్యధర్మము లీశ్వరగుణము లగు
టచే, ఈగుణములతో సంబంధించినంతవఱకు మనుష్యుఁడు దేవ
స్వభావము కలవాఁడుగా నున్నాఁడు. ఈగుణములలో నభివృద్ధిని

పొందిన కొలఁదిని మనుష్యుఁడు దేవత్వము సమీపించుచుండును. దీనినే వేదాంతులు సామీప్యముక్తియని చెప్పుదురు. ముక్తి యనఁగా జీవాత్మ పాపసంబంధమునుండి విముక్తమయి యీశ్వరసామీప్యముచే సుస్థిరానందము పొందుట. పుణ్యమార్గ మెప్పుడును జీవాత్మను భగవత్సాన్నిధ్యమునకుఁ గొనిపోవును; పాపమార్గ మెప్పుడును జీవాత్మను భగవత్సాన్నిధ్యమునుండి దూరముగా తొలఁగించును. జ్ఞానాదులు మనుష్యుని పుణ్యమార్గమున నడిపించి యానందమును గలిగించును; అజ్ఞానాదులు మనుష్యుని పాపమార్గమున కీడ్చి దుఃఖమును కలిగించును. జ్ఞానాదులు దేవునికిని మనకును సామాన్యగుణము లయినందున దేవధర్మములును, కరచరణాదులు మృగములకును మనకును సామాన్యము లయినందున మృగధర్మములును కూడ మనయందున్నవి. జ్ఞానాదు లయిన దేవగుణములను బట్టియే మనకు మనుష్యత్వము సిద్ధించినది. మృగము లెప్పుడును మనుష్యునికి లోఁబడి యతని సౌఖ్యమునిమిత్త మతఁడు నియమించినట్టు సేవ చేయవలసిన వగుటచేత, శరీరావయవము లయి మృగస్వభావము గల యింద్రియములను మనము లోఁబఱుచుకొని యాత్మాభివృద్ధి కుపయోగపడునట్లు చేయవలెను. అట్లు చేయుటయే యింద్రియనిగ్రహ మనఁబడును. ఆరంభదశలో నింద్రియములను యథేష్టముగా పోనీయక స్వాధీన పఱుచుకొన్నపక్షమున, తరువాత నవి యెప్పుడును తిరుగఁబడక మనకు విధేయములయి యాధ్యాత్మికసుఖమున కనుకూలముగా పనిచేయుచుండును. రౌతు కళ్ళెమును బిగించి గుఱ్ఱమును తనయిష్టప్రకారముగా నడిపింపక విచ్చలవిడిగా దాని యిచ్చవచ్చినట్లు నడవనిచ్చిన పక్షమున గమ్యస్థానమును చేరి సుఖింపక ముండ్లలోను బురదలోను పడి కష్టపడునట్లె మనుష్యుఁ డింద్రియవర్గమును తనబుద్ధిబలముచేత మరలింపక స్వతంత్రముగా నడవనిచ్చిన పక్షమున పాపపంకము

లోను విపత్కంటకములలోను తగులుకొని దుఃఖపడవలసినవాఁ డగును. ఇంద్రియము లుద్రేకించి లోఁబడక మనుష్యుని తప్పుదారి కీడ్వ గమకించుచున్నప్పుడు వానిని నిగ్రహింపఁగల సామర్థ్యమును పరిశుద్ధమత మెప్పుడును మనుష్యుని కనుగ్రహించుచుండును. ఇంద్రియములను చెడుదారులఁ బోనీయక మరలించి మంచిపనుల కుపయోగపడునట్లు చేయుటయే మతధర్మమును మానవధర్మమును నగును గాని యింద్రియవ్యాపారములను పూర్ణముగా వినాశము చేయఁజూచుట కాదు.

మనుష్యుని సుఖసంతోషములకు జ్ఞానమును నీతియు ముఖ్య సాధనము లయియున్నవి. జ్ఞానమును నీతియు నన్నపదములు చిన్నవిగా నున్నను వానిలోఁగల భేదములును ధర్మములును నపారముగా నున్నవి. ఆ భేదముల నెల్ల వివరింపఁబూనుట యిచ్చట నాపని కాదు. యుక్తాయుక్తములను స్వరూపస్వభావములను దెలిసికొనుట కుపయోగపడునది జ్ఞానము; తెలిసికొన్నప్రకారముగా నడిచి యనుభవించుట కుపయోగపడునది నీతి. జ్ఞానమహిమను జూచి భ్రమపడి కొందఱు జ్ఞానమే ముక్తిదాయకమని చెప్పుచున్నను, అనుష్ఠానము లేని కేవల జ్ఞానము ముక్తిప్రదము కానేరదు. బెల్లము తియ్యగా నుండునని తెలిసికొన్నంతమాత్రమున, బెల్లము తిన్న ఫలము కలుగ నేరదు. నామమాత్రస్మరణముచేత బెల్లము తిన్నవారికిఁ గల సంతోషము కలుగక బెల్లము తియ్యనిదని తెలిసికొన్నందువలననే యొకవిధమైన యల్పసంతోషము లభింపవచ్చు. నట్లే కేవలజ్ఞానమాత్రమునఁ గొంతసంతోషము కలుగవచ్చును గాని ప్రవర్తన కనుకూలపడని జ్ఞానము శ్లాఘనీయము కాదు. కొన్నిమతముల వారీశ్వరునియొక్క సత్యజ్ఞానస్వరూపములను మాత్రమే మనస్సునందుంచుకొని ధర్మ

స్వరూపమునందు లక్ష్య ముంచకపోవుటచేత బ్రహ్మానందమున
కీశ్వరగుణానుభవమును భగవన్నామ సంకీర్తనమును చాలుననుకొని
ప్రవర్తనమును ముఖ్యముగా విచారింపకున్నారు. అట్టివా రెన్నఁడును
మనుష్యునకు పరమార్థమయిన పూర్ణసుఖమును పొందఁజాలరు. జ్ఞాన
మెట్లో నీతియు నట్లే మనుష్యునకు స్వభావధర్మము; రెంటిలోను
జ్ఞానమునకంటె నీతి శ్రేష్ఠతరము. ఒక్క స్వవిషయమునందైనను
భావము నతిక్రమించువారు నిక్కమయిన సంతోషము ననుభవింప
నేరరు. మన సంతోషమంతయు స్వభావము ననుసరించి వర్తించుట
లోనే యున్నది. అందుచేతనే పూర్వోక్తమయిన సిద్ధాంతము ననుస
రించి వర్తిల్లువారు పైకి భక్తాగ్రేసరులవలె నటించుచున్నను నీతిమాలిన
వారయి భక్తి విరహితులయి సజ్జన గర్హితులయి యిహమునకును పర
మునకును దూరులగుచున్నారు. అట్టివారు మాటలనుబట్టి యాస్తికు
లయినను చేష్టలనుబట్టి నాస్తికులే. మన ప్రవర్తనమును బాగుచేయు
టకు సమర్థము కానట్టి మతము మతమే కాదు. అట్టిమతము
వలన లోకమునకు ప్రయోజన లేశమయినను లేదు. పయిని వివరించిన
రీతి భక్తులు భగవన్నామోచ్చారణము వలనను భగవన్నామసంకీర్త
నమువలనను తమపాపములు తొలగునని భ్రమపడి పాపకార్యము
లకు భయపడకపోయినను "రామరామ" యని "శివశివ" యని
సదా స్మరించుచు కీర్తనలు పాడుచు తాము చరితార్థుల మయితి
మనుకొందురు. అట్టివారి భ్రమ వట్టిదుర్భ్రమ. ధర్మస్వరూపుఁడయిన
యీశ్వరుఁ డెప్పుడును మన స్తోత్రపాఠములను పూజలను జూచి మన
కనుగ్రహమును జూపఁడు; మన వర్తనమును జూచి మన మెంత
చక్కఁగా నడుచుకొన్న నంత యధికసంతోషము నిచ్చును. పాపపరి
హారమునకు పశ్చాత్తాపమును మరల నట్టిపాపమునకుఁ జొరక పరిశుద్ధ

మార్గమున వర్తించుచుండుటయు సాధనములుగాని యవి లేని వట్టి పొడిమాటలు గావు. ఆచరణము లేని శుష్కక్రియములు వదురుట మతముయొక్క యుద్దేశము గాదు. మతముయొక్క యుద్దేశ మంతయు మనస్సు నున్నతస్థితికిఁ దెచ్చి పరిశుద్ధపఱిచి తన్మూలమున నానందాభివృద్ధి కలిగించుట. స్వభావగుణములయందు వృద్ధి పొందినప్పుడే మనస్సున్నతస్థితికి వచ్చును. నీతిమార్గమున నడుచుట మనుష్యస్వభావగుణము; నీతిమార్గాభిముఖుఁడయి పాపమును హృదయమునుండియు వర్తనమునుండియు పాఱఁదోలి పరిశుద్ధతతో ముందు కీశ్వరునివంక నడుచుచున్నప్పుడే మనుష్యుఁడు నిర్మలమైన యానందము పొందును. అప్పు డంతరాత్మ నూతనజీవము నొంది యీశ్వరునియం దానందించును. యీశ్వరునియందు భక్తి యున్నను లేకపోయినను స్వభావమగుటచేత లోపల నంతరాత్మ నీతిమార్గమును బోధించుచునే యుండును గాని యీశ్వరునితోడ్పాటు లేనప్పుడది యింద్రియోద్రేకము నడఁచి స్వతంత్రముగా మనుష్యుని నీతిమార్గమున నడిపింపఁగల శక్తి లేనిదయి మృతప్రాయముగా నుండును; సన్మతమూలమున దానికి కీశ్వరసాహాయ్యము కలుగఁగానే దుర్బలమయి యున్న యంతరాత్మ లేచి నూతనజీవమును బలోత్సాహములను పొంది పాపమును తృణప్రాయముగా హృదయాంతరాళము నుండి గెంటివేయుటకు సమర్థమగును. అంతరాత్మ తాను పాపమునకు సమీపమున నుండుటచే నీశ్వరునకు దూరమయి హంసతూలికాతల్పమునందు సుఖించుచున్నప్పటికంటెను పాపమునకు దూరమునం దుండుటచే నీశ్వరసాన్నిధ్యమునొంది యగ్నిహోత్ర మధ్యమునం దున్నప్పుడైన నధికసంతోషము పొందును. ఈశ్వరసాన్నిధ్యము లభింపనప్పు డింద్రియమృగములు సాహసముచేసి మీఁదఁబడి మెల్లమెల్లగా నంతరాత్మను మ్రింగివేయును. సన్మత మెప్పుడును సర్వశక్తి

సంపన్నుఁడయి సమస్తకళ్యాణగుణపరిపూర్ణుఁ డయిన యీశ్వరుఁడు సంపూర్ణతేజముతో సదా హృదయకుహరమునం దంతరాత్మసమీపమున ప్రకాశించుచుండునట్లు చేయును. ఆ స్వప్రకాశుని వెలుఁగుచేత నప్పు డంతరాత్మ సమస్తమును సత్యదృష్టితోఁ జూచుచు సర్వకార్యములయందును మంచిదారిని జూచి నడిచి యానందించుటకు శక్తమగును. అట్టివెలుఁగు చెంతనున్నప్పుడు దాని నుపయోగించుకొని లాభమును పొందక తిచ్చ్వవడి యావెలుఁగువంకనే యెప్పుడును జూచుచు నిలుచున్నపక్షమున దుస్సహమయిన యావెలుఁగుచేత కన్నులు మిఱుమిట్లుగొన మొదటనున్న యానందమును పోఁగొట్టుకొని యంతరాత్మ యేపనిని చేయుటకును శక్తిలేనిదయి ఫలమును పొందలేని దగును. కాఁబట్టి యెప్పుడును జ్ఞానదేత్రముచేత నీశ్వరుని వీక్షించుచుండుటయే మతముయొక్క ప్రయోజన మనుకొనుటయు భ్రాంతిమూలకమే. వెలుఁగుల కెల్లను వెలుఁగైన యీశ్వరుని సాక్షాత్కారముచేత సమస్తకార్యములను తత్ప్రీతికరముగాఁ జేయుచు సమస్తవిషయములలోను వృద్ధినొంది యానందించు మార్గమును జూపుటయే మతము చేసెడు మహోపకారము. మన యింద్రియవ్యాపారములను స్వభావగుణములను సర్వమును విడిచి యొక్కదానినే చింతించుచుండుటవలన మనుష్యునకు నిజమైన యానందము కలుగదు. భక్త్యావేశముచేతఁ గొంతకాల మనిర్వాచ్యమైన సంతోషము కలిగినను విరామము లేకపోయినపక్షమున క్రమక్రమముగా సంతోష మొండొకవిధముగా పరిణమించి మనుష్యస్వభావమును సహితము చెడఁగొట్టును. అతిభక్తిచేతఁ గొందఱు మతి చలించినవారయి జడులవలె నగుదురు. ఈ హేతువుచేతనే పూర్వులు వ్రాసిన గ్రంథములలోఁ గొన్నిచోట్ల జ్ఞాను లనఁగా నీశ్వరసాక్షాత్కారముగల యోగు లున్మత్తులవలె నుందురని చెప్పబడి యున్నది. నిత్యానందము నిమిత్తమయి నిసర్గసుఖములను

గుణములను విడువవలయునని సత్యమత మెప్పుడు నుపదేశింపదు. ఈ సత్య మెఱుఁగనివారు కొందఱు మతావేశముచేత దుర్భ్రమలఁ బడి భార్యాపుత్రాదిబంధువర్గములను విడిచి సన్యసించుచున్నారు; కొందఱు మనుష్యసాంగత్యమును విడనాడి మృగముల మైత్రి పొంది యరణ్యావాసము చేయుచున్నారు; కొందఱు బలప్రదమయిన యాహారమును వర్జించి శరీరములను శుష్కింపఁ జేయుచున్నారు; మఱియు నిట్టివే యనాలోచితకార్యముల ననేకు లనేకవిధములఁ జేయుచున్నారు. ఇట్టివారందఱును మానుషస్వభావమును భగవత్స్వభావమును గూడ గుర్తెఱుఁగనివారు. మతావేశముచేత మనుష్యులకు సహజమైన యాలోచనను విడుచుటవలన నిట్టి యనర్థములు పొసఁగుచున్నవి. జ్ఞానహీనులగుటచే ననేకులకు మానసికారాధన మేలేదు. అట్టివారిదొక మతమని చెప్పుటకే యవకాశము లేకపోయినను, వారికున్న మతమంతయు వ్యర్థములైన కర్మలు చేయుటయు నర్థములేని మాటలు నోట నుచ్చరించుటయు తమ సొత్తును మతాచార్యుల కర్పించుటయునై యున్నది. ఇట్టివారికి మతము వలన మనుష్యునకు స్వాభావికములైన యేవిషయములయందును వృద్ధి కలుగక గురువులకు మాత్రము జీవిక యేర్పడుచున్నది. జనుల మూఢవిశ్వాసమువలననే లాభము పొంది కుటుంబభరణము చేసికొన నెఱిఁగిన మహానుభావులు వారి యాత్మోజ్జీవనమునకయి లేశమయినను కృషి చేయక గురువులైన తమ్ము దైవములనుగా భావించి తాముపదేశించిన కర్మ లాచరించుటవలననే వారు ముక్తులగుదురని బోధింతురు.

ఇట్టివారు మాత్రమే కాక మఱికొందఱు బుద్ధిమంతులుకూడ తాము చిన్నప్పటినుండియు నమ్మిన మతబోధనలకు విరుద్ధముగానున్న సత్యములను ద్వేషించుచున్నారు. సత్యమును ద్వేషించుట సత్యస్వరూపుఁడైన యీశ్వరుని ద్వేషించుటయే. మతమునకు లౌకికసత్యముతో పనిలేదఁట! ఆహా! ఏమి యీబుద్ధివైపరీత్యము! సూర్యచంద్ర

గ్రహణములకు శాస్త్రప్రకారముగా చంద్రబింబ భూచ్ఛాయలు కారణములయి, మతప్రకారముగా రాహుకేతువులు కారణములగునా? సత్యము కానిది మత మగునా? సమస్త ప్రకృతిశాస్త్రములును భగవన్మహిమలను భగవత్సత్యములను ఘోషించుచున్నవి. ఈశ్వరుని యందు సంపూర్ణ భక్తిగల వారికందఱికిని నవి యత్యాదరణీయములు. మతవిషయమునఁ బూర్వులు చెప్పినవాని కట్టి సత్యములు విరుద్ధముగా నున్నపక్షమున, వానిని సంస్కరించుకొని మతమును బాగుపఱుచుకోవలెను. మనుష్యునితో సంబంధించిన ప్రతివిషయమునందు నభివృద్ధి సహజధర్మముగా నుండఁగా, మనుష్యుని నిత్యానందపదవికి మార్గము చూప దీక్షవహించిన మతమునం దభివృద్ధి కూడదనుట నయుక్తకముగా నుండునా? ఈశ్వరభక్తి లేశము గలవానికెల్లను సత్యగ్రహణము పరమవ్రతముగా నుండవలెను. సత్యమెక్కడనున్నను పరమాదరణీయమైనదే. కొన్నిసమయములయందు మతమును నిరాకరింపఁ జొచ్చినందున, సత్యప్రియులయిన వారనేకులు మతమునుండి విముఖు లగుచున్నారు. పరిశుద్ధమతాభినివేశము గల ప్రతిమనుష్యుఁడును తా నావఱకు సత్యమని నమ్మిన దసత్యమని తెలిసిన యెడల దానిని వెంటనే విడిచి దురభిమానముమాని నిష్పాక్షికబుద్ధితో సత్యము నంగీకరింపవలెను. ఇట్టి సత్యాదరము వహించి శోధించిన కొలఁదిని భగవన్నిర్మితములైన సమస్తవస్తువులును ప్రతిదినమును క్రొత్త క్రొత్తసత్యములను బయలఁ బెట్టుచు భగవంతునియొక్క క్రొత్తక్రొత్త మహిమలను ప్రకాశింపఁ జేయుచు మనయాత్మల నపారానందసాగరమునందు తేల్చుచుండును. ఈ సత్యాదర మొకటి లేకపోవుటవలన మహావిద్వాంసులును బుద్ధిసంపన్నులును తమసిద్ధాంతము స్థాపనము కావలెనన్న దురభిమానముచేత యుక్త్యాభాసములను కల్పించి సత్యము నడఁచి తమ కుత్సితసిద్ధాంతములను స్థాపించి లోకమును తప్పుదారిని పట్టించి మితిమీఱిన నష్టమును

గలిగించి యున్నారు. పరిశుద్ధమత మెప్పుడును సర్వవిషయములయం దును సత్యమును ప్రోత్సాహపఱిచి సర్వదా లోకము జ్ఞానాదులయందు వృద్ధిపొందుచుండునట్లు చేసి, జనులు తమస్వభావమునుబట్టి పొందఁదగి నంత సౌఖ్యమును సర్వవిషయములయందు బొందునట్లు చేయవలెను. అట్లు చేసెడి మతము ప్రతిమానవహృదయమునందును పరమేశ్వరుని సహజనిష్కళంకస్వరూపముతో నిలిపి, నిరంతరాభివృద్ధిని నిరంతరా నందమును గలిగించును. మనకంటె నధికుఁడైన మానవునితో సాంగ త్యము చేయుటవలనఁ గూడ మన మాతని సద్గుణముల నభ్యసించి మన ప్రవర్తనమును చక్కజేసికోఁ గలుగుదుము గదా ? అట్టిస్థితిలో మను ష్యునియందువలె కళంకలేశ మయినను లేని సత్యస్వరూపుని సాంగత్య మును మనయాత్మకుఁ గలిగించుకొన్నప్పుడు మనము సత్యాదరము గల వారమయి సత్యమునందెట్లు వృద్ధి పొందకుండఁ గలుగుదుము? దయా స్వరూపుని సాంగత్యమును మనయాత్మకుఁ గలిగించుకొన్నప్పుడు దయా రతి గలవారమయి దయయందెట్లు వృద్ధి పొందకుండఁ గలుగుదుము ? ధర్మస్వరూపుని సాంగత్యమును మనయాత్మకుఁ గలిగించుకొన్నప్పుడు ధర్మపరాయణులమయి ధర్మమునందెట్లు వృద్ధిపొందకుండఁ గలుగుదుము? సర్వజ్ఞుఁడును సర్వశక్తుఁడును దయాస్వరూపుఁడును సత్యస్వరూపుఁడును ధర్మస్వరూపుఁడును నయినపురుషుఁడేకదా యీశ్వరుఁడు ? ఈశ్వరుని సర్వశక్తిత్వమును సర్వజ్ఞత్వమును సర్వవ్యాపకత్వమును మనకు భయ ప్రమోదాద్భుతములను బుట్టింపఁగా సర్వకారుణ్యాదిగుణములు భక్తిని పురికొల్పఁగా, మన మీశ్వరునికిఁ బరమభక్తులమయి మనకుఁ గల సర్వగుణములయందును వృద్ధిపొంది నిత్యానందపదవిని గాంచ శక్తులము గాకుందుమా ? మనము సత్యము నెప్పుడు గౌరవముతో నుపాసింతుమో యప్పుడు సత్యము మన మనస్సులయందావేశించి ప్రజ్వరిల్లక మానదు. సత్యాదిసమస్తకళ్యాణగుణపరిపూర్ణుఁడయిన యీశ్వరుని మన

మెప్పుడు భక్తితో నుపాసింతుమో యప్పు డాపరమపురుషుని కళ్యాణ గుణములు మనమనస్సు నావేశించి యందలి సత్యప్రియత్వాదులకు నూతనజీవము కలిగించి ప్రజ్వరిల్లఁ జేయకుండునా ? అవి యన్నియు ప్రజ్వరిల్లి యున్నతస్థితినిపొంది సంపూర్ణానందదాయకము లగుటయే కదా మనజీవితమునకు పరమార్థము ? ఓసత్యస్వరూపుఁడవైన యీశ్వరుఁడా! చిరకాలాభ్యస్తము లయిన దురాచారములను విడిచి మాహృదయములు సత్యగ్రహణపరాయణము లగునట్లు చేయుము. ఓ భక్తవత్సలా! చంచలములయిన మాచిత్తము లింద్రియసుఖముల నాశించి తప్పుదారులు పట్టనియ్యక నీధ్యానము మరగి సదా సన్మార్గమున సంచరించునట్లు చేసి నీయందలి నిశ్చలభక్తిని విడువకుండునట్లు చేయుము. ఓ సర్వకారుణ్యా! దుర్బలములైన మా యుల్లములను స్వార్థపరత్వమునందు మునుఁగనీయక పరోపకారకార్యములయందు వర్తిల్లునట్లు చేయుము.

వైరాగ్యము.

By

K. VEERESALINGAM

వైరాగ్యము

భ్రాతృవరులారా! నేఁడు వైరాగ్యమునుగూర్చి మీ ముందఱఁ గొంచెము చెప్పఁబోవుచున్నాను. కొంచెముగానో గొప్పగానో వైరాగ్యమును బోధింపని మతము ప్రపంచములో నేదియు లేదు. ఇతరదేశములకంటె మన దేశములోను మన దేశములోఁగల ప్రతి మతమునందును వైరాగ్యబోధ మత్యధికముగాఁ జేయఁబడుచున్నది. మనుష్యుఁడైన వానికెల్లను వైరాగ్య మావశ్యక మనుటకు సందేహము లేదు. కొంచెమయినను వైరాగ్యము లేనివాఁడు పవిత్రమైన మనుష్యనామమును ధరించుటకే యర్హుఁడుకాఁడు. అయినను మన దేశమునం దిప్పుడు వైరాగ్యము విపరీతార్థమునం దుపయోగింపఁబడు చుండుటచేతను విపరీతముగా నాచరింపఁబడుచుండుటచేతను వైరాగ్య మనఁగా నేమో యది యెంతవఱకావశ్యకమో యిప్పుడు సయుక్తికముగాఁ గొంత విచారింపవలసి యున్నది. సయుక్తిక మన్నమాట చెవిని బడినతోడనే మనలోని ప్రమాణవాదు లనేకులు తోఁకత్రొక్కిన త్రాఁచులవలె లేచి మనకు శాస్త్రము ప్రమాణముకాని యుక్తి ప్రమాణము కాదనియు, మనుష్యబుద్ధి భ్రమప్రమాదసహిత మయినందున దానియందు విశ్వాస ముంచక శాస్త్రవిశ్వాసము కలవారము కావలయుననియు చెప్పవచ్చును. అట్టివారి మాటలు చెవుల కనేకులకు చక్కఁగానే వినఁబడవచ్చును. అయినను వారి నొక్కప్రశ్న మడుగవలసియున్నది. మనుష్యబుద్ధి భ్రమ ప్రమాద సహితమయిన దని మొట్టమొదట వారి కెట్లు తెలియవచ్చినది? స్వబుద్ధిచేతనే కదా? స్వబుద్ధిని కొంచెముసేపు దూరముగా నుండనిచ్చిన పక్షమున వారికి

భ్రమ యేదో ప్రమాద మేదో తెలియకపోయియే యుండునుగదా? బుద్ధి మనుష్యులను విడిచిపోయిన పక్షమున వారు మృగములకంటె నధికులు కాఁజాలరు. బుద్ధిని గలవారై యుండుటచేతను యుక్తాయుక్తనిర్ణయమునందు బుద్ధి నుపయోగించుకొనుచుండుటచేతను గాక మఱి దేనిచేత మనుష్యులకు మృగములకంటె నాధిక్యము వచ్చినది? లోకములోని జంతుజాతు లన్నిఁటికంటెను మనుష్యున కాధిక్యము గలిగించిన యీ బుద్ధిని దనయందున్న దోషములను సహితము తెలిసికొని సంస్కరించుకోఁదగిన సామర్థ్యము కలదన్న హేతువుచేత నిరాకరింపఁ దగునా? తగదు. బుద్ధి కొన్నిసమయములయందు భ్రమ పొందుచుండు ననుటకు సందేహములేదు. అయినను కలిగిన భ్రమను నివారణము చేసికొనుటకును పిమ్మట నా బుద్ధియే సాధన మగుచున్నది. అందుచేత యుక్తాయుక్తవిచారము చేసి సత్యమును దెలిసికొనుటకును మొదటఁ బడిన ప్రమాదమును దరువాతఁ గనిపెట్టి దిద్దుకొని కాలక్రమమున నభివృద్ధి పొందుచుండుటకును బుద్ధిని మించిన సాధనము వేఱొకటి లేనందున వివేకి కాఁగోరినవాఁ డెవ్వఁడును దాని నంగీకరింపక తప్పదు. ఇది యిట్లుండఁగా మనపెద్దలు పరమప్రమాణము లని చెప్పెడు శాస్త్రములయందు సహితము భ్రమప్రమాదాదులు లేవని యెవ్వరును జెప్పఁజాలరు. ఒక్కశాస్త్రమునందుఁ బ్రమాణబుద్ధి గలవారందఱును దాని కేకార్థము నంగీకరించుచుండ లేదు. ఒకవాక్యమున కొక రొకయర్థమును చెప్పఁగా మఱియొక రాయర్థమునకు విరుద్ధమయిన యర్థమును జెప్పుచున్నారు. పరస్పరవిరుద్ధము లయినయట్టి రెండర్థములలో నేదోయొకటి భ్రమైకమూల మయినదిగా నుండవలెను. ఇట్లు భ్రమాస్పదమయిన యర్థముల నిచ్చుచుండుటచేత వారి వాదరీతి ననుసరించి శాస్త్రముకూడ

ప్రమాణము కాదనియే సిద్ధాంతము చేయవలసివచ్చును. శాస్త్రార్థ నిర్ణయమునం దేకీభావము లేక యనేకవాక్యములకే కొందఱొక యర్థమును, మఱికొందఱు మఱియొక యర్థమును జేసి తమ యర్థమే సరియైనదని వివాదపడి కడపట సంబంధబాంధవ్యములను భోజన ప్రతిభోజనములను మాని వివిధమతములవారుగా విడివడి నేఁటివఱకును గలహములు మానకుండుట యీ దేశమునం దెల్లవారికి ననుభవ సిద్ధమైన విషయమే కదా? తమతమ మతానుసారముగా శ్రుత్యాది వాక్యముల కర్థభేదమును జెప్పి తగవులాడువారును తమ యర్థమును స్థాపించుటకు దేనిని ప్రమాణముగాఁ గైకొనుచున్నారో యించుక విచారింపుఁడు. తాము చేసిన యర్థమే న్యాయమైనదని చూపుటకును వారు యుక్తులనే కదా యాధారము చేసికొని వాదించుచున్నారు. సర్వోత్కృష్టములని యావారు విశ్వసించెడు శాస్త్రముల కర్థనిర్ణయము చేయవలసి వచ్చినప్పుడును మనుష్యబుద్ధియే కావలసియుండఁగా, మనుష్యబుద్ధి ప్రమాణము కాదని దానిని విడిచి సిద్ధాంతనిర్ణయము చేయఁబూనుట నేలవిడిచి సాము చేయఁబూనుటగాక మఱియే మగును? బుద్ధి నుపయోగించి సహేతుకముగా సత్యాసత్యవిచారము చేసి యుక్తమయిన దానిని గ్రహింపఁజూడక యెవ్వఁడేమి చెప్పినను చెప్పిన దానినెల్ల విశ్వసించి వర్తించుచువచ్చిన పక్షమున మనుష్యుఁడు బుద్ధిహీనుఁడు గాక మఱియెవ్వఁడగును? అజ్ఞానాంధకారావృతమైన మానవహృదయమునందు వస్తుతత్త్వమును గనుఁగొనుటకయి జ్ఞాన నేత్రమున కాధారముగా జ్ఞానసూర్యుఁడయిన యీశ్వరుఁడు మన కొక్క బుద్ధికిరణప్రసారమునే కదా యనుగ్రహించి యున్నాఁడు? ఈశ్వరుఁడు ప్రసాదించియున్న యీ దివ్యతేజోలేశమును మనము మన మనసునందుఁ జొరకుండఁ జేసినచో మన హృదయము తమోమయ

మయి పదార్థతత్త్వసంశోధనమునం దసమర్థమయి సదా చీఁకటిలోఁ దడవులాడుచుండదా? బుద్ధిని విడిచిన లోకవ్యవహార మొక్కనిమిషము నడుచునా?

ఇట్లున్నచో నెల్లవిషయములలోను బుద్ధి యప్రమాణమని యెవ్వరు ననఁజాలరనియు; లౌక్యవాక్యముల సత్యాసత్యనిర్ధారణము నిమిత్తమయి బుద్ధి నవశ్యప్రమాణమునుగా నంగీకరింపవలసినదే యయినను భగవంతుఁడు సర్వజ్ఞుఁ డగుటచేత నలౌకికమైన యట్టి యీశ్వరవాక్యమును ఖండించుటకు మాత్రము మన పరిమితబుద్ధి ప్రమాణము కాఁజాలదనియు, కొందఱు బుద్ధిమంతులందురు. ఈశ్వరుఁడు సర్వజ్ఞుఁ డగుటకును మనుష్యుఁడు మితజ్ఞుఁ డగుటకును సందేహము లేదు. అందుచేత నీశ్వరబుద్ధికిని మనుష్యబుద్ధికిని పర్వతమునకును బరమాణువునకును గలదానికంటెను నెక్కువ యంతరము కలదనుటకును సందేహము లేదు. ఎంత యల్పమయిన దయినను మనుష్యబుద్ధి సత్యదర్శనార్థమయి యీశ్వరునిచేఁ బ్రసాదింపఁబడిన వెలుతురే కదా? అట్లగుటచే నిజమయిన యీశ్వరవాక్యమునకును బుద్ధికిని విరోధ మెప్పుడును పొసఁగనేరదు. ఈశ్వరవాక్య మెప్పుడును చక్కఁగా నాలోచించినమీఁదట యుక్తియుక్తము కాకపోదు. ఎంత యాలోచించినను గూడ యుక్తియుక్తముగాఁ గనఁబడక యీశ్వరుఁడు ప్రసాదించియున్న బుద్ధిజన్యజ్ఞానమునకు సదా విరుద్ధముగానే తోఁచిన పక్షమున నట్టి వాక్య మీశ్వరకర్తృత్వము నారోపించి మనుష్యునిచేఁ గల్పింపఁబడినదయి యుండును గాని నిజమయిన యీశ్వరవాక్యము కానేరదు. ఈశ్వరహృదయమును దెలిసికొన నపేక్షించువారి కందఱికిని బరమేశ్వరుఁడు తనజ్ఞానమును సృష్టిమూలమున వెదచల్లుచున్నాఁడు. సృష్టి తెలిపెడు సత్యములను లిఖిం

చుచు వచ్చినచో నా పుస్తకములు పర్వతోపమానము లగును. ఇట్లు మహాసముద్రమువలె నీశ్వరుని జ్ఞానతేజస్సు సృష్టియం దంతటను నిండి యున్నను, మనుష్యులు తమతమ బుద్ధిపరిమాణమును బట్టి యందుఁ గొంతభాగమునే గ్రహింపఁగలుగుదురు. మనుష్యబుద్ధి స్వచ్ఛముగా నుండకపోయిన పక్షమున నట్లు గ్రహింపఁబడిన సత్యములయందు భ్రమప్రమాదజనితములయిన మాలిన్యములు చేరుచుండును. మనుష్యబుద్ధి నిర్మలమగుచు వచ్చినకొలఁది పూర్వము చేరిన కాలుష్యములు క్రమక్రమముగా నశించి నూతన సత్యములు చేరి జ్ఞాన మంతకంతకు స్వచ్ఛ మగుచుండును. సృష్టియందు నింపఁబడియున్న జ్ఞానసుధాసముద్రాంబుబిందుపానమును దనశక్తికొలఁదిని జేయుచున్నకొలఁదిని మనుష్యబుద్ధి జ్ఞానాహారముచే నభివృద్ధినొంది యీశ్వరసామీప్యము నొందుచుండును. సృష్టినుండి నిరంతరము ప్రవహించుచున్న జ్ఞానతేజస్స్వీకారమును జేయనొల్లక యీశ్వరుఁడు తనహృదయములో నుంచియున్న జ్ఞానతేజస్సు నుపయోగపఱుచుకోనిపక్షమున మనుష్యుఁ డజ్ఞానాంధుఁడయి తన సమీపమున నున్న యీశ్వరు నణుమాత్రమును జూడక సత్యమునకు దూరములయిన దుస్స్వప్నములలోను మిథ్యాభూతములలోను బడి కొట్టుకొనుచు బాధపడుచుండువాఁ డగును. కాఁబట్టి యీశ్వరజ్ఞానమును బొందుటకు బుద్ధియు సృష్టియు నీరెండు మాత్రమే మహాసాధనములు. ఈరెండుసాధనములను గొని సంశోధించినమీఁదటఁ బ్రత్యక్షవిరుద్ధముగాఁ గనఁబడిన పక్షమున, అలౌకికమనుపేర పరంపరగా వచ్చుచున్న యెట్టివాక్యమునైనను నిశ్చయముగా దేవుఁడు దయచేసి యున్న యీ తేజోద్వయమునకు నసంగతముగా నున్నంతవఱకు నిరాకరింపవలయును. అట్లు నిరాకరింపని యెడల నసత్యమునకును సత్యమునకును గల భేదభావమే హృదయము

నుండి తొలఁగిపోయి మనస్సు సమస్తాభాసములకును భ్రమలకును నివాసస్థాన మగును; అప్పుడు మంచిచెడ్డలను వేఱుపాటు చేయు విభాగ జ్ఞాన మడుగంటి హృదయమునందు జడత వ్యాపించి యొంతవిరుద్ధ మయినయసంగతియు వింతగా దోఁచకుండును. ఈశ్వరుఁ డనుగ్రహించిన బుద్ధిసంపద ననుభవింపనొల్లని ప్రబుద్ధున కింతకంటె మంచి ఫలమేమికలుగును? సత్యాసత్యనిర్ణయమునకు మనుష్యబుద్ధి ప్రమాణ మనిచూపుట కి ట్లింతదూరము చెప్పవలసివచ్చినది. ఇంతటితో నీ విషయమును విడిచి యింకఁ గార్యాంశమునకు వత్తము.

వైరాగ్యమను పదమున కనురాగము లేకుండుట యని యర్థము. దేనియం దనురాగము లేకుండుట? విషయసుఖములయందు. విషయ సుఖము లనఁగా మృగములకును మనకును సామాన్యము లైన యింద్రియసుఖములు. ఇంద్రియసుఖములలో మృగములకు లేనివియుఁ గొన్ని మనకుఁగలవు. ఇంద్రియసుఖ పరిత్యాగమే వైరాగ్య మనఁ బడును. ఈ యింద్రియములను మనవారు శత్రువులనుగా గణించు చుండుటచేత నింద్రియసుఖ త్యాగమునకు సాధారణముగా నింద్రియ నిగ్రహ మనియు నరిషడ్వర్గవిజయ మనియు వాడుచుందురు. ఇంద్రియ నిగ్రహమును జేసినవాఁడు జితేంద్రియుఁ డనఁబడును. ఇంద్రియనిగ్రహ మనఁగా నేమి, ఇంద్రియముల నెంతవఱకు నిగ్రహింపవలెను. అన్న యంశములకు వత్తము. ఇంద్రియనిగ్రహ మనఁగా నింద్రియములను లోఁబఱుచుకొని యవి మనయాజ్ఞ నుల్లంఘింపక వర్తించునట్లు చేయుట. ఐహికాముష్మికసుఖముల కింతవఱకుఁ గావలసియుండును. ఈ యింద్రియము లెప్పుడును మన నాత్మలను పాపమున కీడ్చుచుండు ననియు, అందుచేత నింద్రియసుఖములనన్నిఁటిని బూర్ణముగా త్యజించుటయే పరమార్థ మనియు, కొందఱు భావించుచున్నారు. ఈభావన

చేతనే యీ దేశమునందలి మతకర్తలనేకు లింద్రియనిగ్రహము చేయవలెనని చెప్పుచు, నింద్రియసుఖవాంఛ పుట్టకుండ వానిని హతము చేయవలెనని విధించియున్నారు. అట్టివారి మతమును బట్టి చూడఁగా మన కింద్రియములతోనే పనిలేదనియు, ఇంద్రియ సుఖము లెంతమాత్రము ననుభవింపఁదగినవి కావనియు, పర్యవసానము తేలుచున్నది. నిజము విచారింపఁగా మతమునకుఁగాని ధర్మమునకుఁగాని యింద్రియసుఖములను బూర్ణముగాఁ బరిత్యజింపవలసిన పనిలేదు. ఆత్మానందమునకును నీతికిని భంగముగా నుండనంత వఱకెల్లవారును విషయసుఖములను మితముగా ననుభవింపవచ్చును. అందువలన నిహలోకహానియుఁ బరలోకహానియుఁ గలుగవు. ఇంద్రియములే నిష్ప్రయోజనము లయిన పక్షమున మన కీశ్వరుఁడు వానిని బ్రసాదించక యేయుండి యుండును. ఈశ్వరుఁడు మన కింద్రియములను బ్రసాదించి యుండుటచేతనే వానివలనను బ్రయోజనము కలదనియు, వానివలనఁ గలుగవలసిన న్యాయమైన లాభమును మనమనుభవింపవలె ననుట యీశ్వరోద్దేశమనియు, విస్పష్టముగు చున్నది. మన శరీరమునం దేయవయవమును పనిలేక కృశించుటకయి చేయఁబడలేదు. సమస్తావయవములును బరస్పరానుకూలముగా నారోగ్యవంతముగ నుండి పని చేయుచున్నప్పుడే యవి యానందదాయకములును సుఖప్రదములును నగును. వానిలో నేయవయవ మారోగ్యము చెడి కృశించినను దానివలన సౌఖ్యము కలుగక పోవుటయే కాక తక్కిన వానివలన నితరావయవములకును నసౌఖ్యము కలుగును. ఈప్రకారముగానే యాత్మగుణములలో నేదియుఁగూడ నిష్ప్రయోజనముగా నశింపఁజేయుటకయి చేయఁబడి యుండలేదు. సమస్తగుణములవలనను బ్రయోజనము గలదు. పరమేశ్వరుఁడు మనకుఁ బ్రసాదించిన సమస్త సాధన

ములను సమస్తశక్తులను సాధ్యమయినంత మంచి యుపయోగమునకుఁ దెచ్చుకొనుట మనకుఁ బరమధర్మము. వానివలనఁ గలుగవలసిన ప్రయోజనములను బొందఁజూడక వాని నుపేక్షించుట యీశ్వరాజ్ఞాధిక్కారరూపమైన యపచారమని చెప్పవచ్చును. తగినయుపయోగమునకుఁ దెచ్చుకోక యింద్రియములను వానిగుణములను నిష్ఫలముచేయుట యస్వాభావికమును ననర్థదాయకము నగుటచేత మనలో నిప్పుడు యోగులును సన్న్యాసులును ధర్మములని యాచరించెడు పనులు పెక్కు లాచరణీయములు కావని వేఱుగఁ జెప్పవలసిన యావశ్యకము లేదు. యోగులు కొందఱు చేతులును వ్రేళ్ళును మీఁదుకట్టి నిరర్థకములయి బిఱ్ఱబిగియునట్లును గోళ్ళుపెరిగి యంగరములు తిరిగి చెడిపోవునట్లును జేయుదురు. ఇట్లుచేయుట సత్ప్రయోజనముకొఱకు హస్తములను వ్రేళ్ళను జేసిన యీశ్వరునకు సమ్మతముగా నుండునా? తాను జేసిన మహోపయుక్తమయిన సాధనము వ్యర్థమగుచుండఁగాఁ జూచుట కెవ్వరి కిష్టముండును? ఈయోగులు కొందఱు గృహములను వదలి యరణ్యములలో వాసము చేయుదురు. సన్న్యాసులును భార్యాపుత్రులను విడిచి యూరూరఁదిరిగి భిక్షాటనము చేయుదురు. ఈపనులు స్వభావవిరుద్ధములు. మనుష్యుఁడు సంఘములోనుండియే వృద్ధినొందఁదగినవాఁడు. సంఘమును విడిచెనా మనుష్యుఁడు శీఘ్రకాలములోనే మృగప్రాయుఁడగును. ఏకాకిగా నుండి వృద్ధినొందుట మనుష్యస్వభావము గాదు. మనుష్యున కాహారమును వాయువు నెంత యావశ్యకములో యితరజనసాంగత్య మంత యావశ్యకము. మనుష్యముఖమును జూడనీక యొకమనుష్యుని గొనిపోయి చిన్నప్పటినుండియు నరణ్యములో మృగములతోఁ బెరుగనిచ్చిన పక్షమున నట్టివాఁ డేవిషయమునందును బహుమృగములకంటె

నధికుఁడు కాఁజాలఁడు; కొన్ని విషయములయందుఁ బెక్కుమృగము
లతో సమానుఁడు కానేరఁడు. అభివృద్ధికి స్వయంకృషి యావశ్య
కమే యయినను, తనకంటె నధికులయిన వారితోడి సహవాస మా
స్వయంకృషికి తోడుపడినంగాని యభివృద్ధి కలుగదు. పదిమందిలో
మెలఁగువాఁడు సహితము తనకంటె నధికులైనవారితోడి సాంగత్యము
లేనివాఁడయినయెడల నాలోచనయు వృద్ధియు లేక యహంభావము
గలవాఁడయి చెడును. అదిగాక మనుష్యుని మనుష్యనామమున
కర్హునిగాఁ జేయు గుణముల కెల్లను బ్రేమానుబంధ మలంకార
మయినది. దైవగుణమని చెప్పఁదగిన యీప్రేమగుణము సంసార
ములోనుండి యుపయోగించుకొనుచున్నప్పుడుగాని వర్ధిల్లదు. భార్యను
భర్తను, తల్లిని బిడ్డను, అన్నను చెల్లెలిని, పొరుగువారిని మిత్రులను,
ఒక్కటిగాఁ జేర్చి యన్యోన్యసుఖదాయకులనుగాఁ జేయునది యీ
ప్రేమానుబంధమే. ఇది యొక్కటి లేకపోయెనేని, సంసారమును
భూతలస్వర్గముగాఁ జేసి యమృతతుల్యములయిన సౌహార్దఫలముల
ననుభవింపఁజేయు బంధము లేక లోకములో నాపన్నరక్షణము లేక
మనుష్యుఁడు నిర్దయుఁడయి ఘాతుకమృగతుల్యుఁ డగును. అరణ్యము
లకుఁ బోయి వసించినను మనుష్యున కేదో సాంగత్య ముండవలెను.
మనుష్యులను విడిచి యరణ్యములకుఁ బోయిన ఋషులనేకులు మృగ
ములను బెంచి తత్సంగమునఁ గాలక్షేపము చేయుచుండినట్లు పురాణ
ములు ఘోషించుచున్నవి. అట్టి మహానుభావులను మనుష్యసాంగత్యము
తొలఁగి మృగసాంగత్యభాగ్యము లభించుచున్నది. అరణ్యావాసము
చేసినంతమాత్రముచేత నింద్రియనిగ్రహము కలుగుననియుఁ జెప్ప
టకు వీలులేదు. స్త్రీ లొంటిగాఁ దారసించినప్పు డింద్రియనిగ్రహము
చేయలేకపోయినందుకు వ్యాస విశ్వామిత్ర పరాశరాదులగు మహాను

భావులను పెక్కండ్రను దృష్టాంతము చెప్పవచ్చును. ఇంద్రియములను జంపివేయవలెనని యెన్నిశాస్త్రములు బోధించినను, అది యస్వాభావిక మగుటచేత సకలజనవిశ్వాసపాత్రమయి సర్వత్ర వ్యాపింపనేరదు. ఈ సిద్ధాంతమే జనులలోనెల్ల నిజముగా వ్యాపించిన పక్షమున, ప్రపంచ మంతయుఁ జిరకాలము క్రిందటనే నశించి యుండును.

ఇంద్రియములను బూర్ణముగాఁ జంపివేయుట ధర్మము కాని పక్షమున, ఇంద్రియముల నేవిషయమున నెంతవఱకు జయింపవలెనని శంక కలుగును. మనుష్యునిలో మృగగుణములును దేవగుణములును రెండు చేరియున్నవని చెప్పుచున్నారు. మృగమునకును మనుష్యునకును సామాన్యములయిన కామాదులు, మృగగుణములు; మనుష్యునికిని దేవునికిని సామాన్యములయిన దయాదులు దేవగుణములు. ఈ రెంటిలో మొదటివి యధమగుణములు, రెండవవి యుత్తమగుణములు. ఈ రెంటిలో నధమగుణముల నుత్తమగుణములకు సదా లోఁబడుచుండునట్లు చేయవలెనుగాని యుత్తమగుణముల నధమగుణములకు లోఁబడునట్లెప్పుడును జేయఁగూడదు. అధమగుణముల నుత్తమగుణములకు లోఁబఱుచుచు వచ్చినపక్షమున మనుష్యుఁ డంతకంతకు దేవతుల్యుఁ డగుచుండును. అట్లుచేయక యధమగుణములకే యుత్తమగుణములను లోఁబఱుచుచు వచ్చినపక్షమున మనుష్యుఁ డంతకంతకు మృగతుల్యుఁ డగుచుండును.— ఉత్తమగుణముల కధమగుణములను లోఁబఱుచుటయే నిజమయిన యింద్రియనిగ్రహము. ఇంద్రియనిగ్రహము చేయుటచే నింద్రియములు బుద్ధికి లోనయి పనిచేయుచు మనుష్యుని దేవత్వమునకుఁ గొనిపోవుటకుఁ దోడుపడును. ఇంద్రియములను మనపూర్వులు గుఱ్ఱములతోఁ బోల్చి యాత్మను రౌతునుగాఁ

జెప్పియున్నారు. నేర్పరియయిన రౌతు గమ్యస్థానము చేరి సుఖపడఁ దలఁచినప్పుడు కళ్లెమును బిగించి గుఱ్ఱమును దాను బోఁదలఁచు కొన్న మార్గమున నడపవలెను. అట్లు చేయలేక దుర్బలుఁడైన పురుషుఁడు గుఱ్ఱమీడ్చిన తెరువున నెల్లఁ దాను బోవుచున్న పక్షమున వాసి నది ముండ్లలోనికిని డొంకలలోనికిని నీడ్చి గమ్యస్థానమును జేర్పక తప్పుదారిని బట్టించి కష్టములపాలు చేయును. ఈవిధముగానే వివేకి యగుపురుషుఁ డింద్రియములనెడు గుఱ్ఱములను బుద్ధియనెడు కళ్లెముచే బిగియఁబట్టి యీశ్వరాజ్ఞానుసారముగాఁ దాను బోవలసిన యుత్తమ స్థానమునకు వాని సాహాయ్యమునఁ బోయి కృతార్థుఁడు కావలెను. అట్లుచేయక యింద్రియము లీడ్చిన దారినెల్ల నడుచుచుఁ గేవల విషయ సుఖలోలుఁడయి ప్రమత్తుఁడయి యుండు పురుషుఁ డింద్రియములను జయించుటకు మాఱుగాఁ దానే యింద్రియములచేత జయింపఁబడి యింద్రియజితుఁ డనఁబడును. తన యసమర్థతచేత గుఱ్ఱములను తిన్నని దారిని నడపఁ జేఁతగాక మీఁదిమిక్కిలి గుఱ్ఱములు తన్నుఁ దప్పుత్రోవ కీడ్చుచున్న కోపముచేత గుఱ్ఱములను జంపిన రౌతువలెనే యింద్రియములు తన్నుఁ దప్పుదారిని బట్టించు నన్నభీతిచేత వానిని జంపఁ బూనుకొన్నవాఁడును నిష్ప్రయోజకుఁడును నీశ్వరాజ్ఞోల్లంఘియ నగును.

మనుష్యగుణములలో గొన్ని యధమము లయినవనియుఁ గొన్ని యుత్తమము లయిన వనియుఁ బయిని జెప్పియున్నాము. అట్లు చెప్పఁగానే మన కున్న వానిలో నేవి యధమగుణములు, ఏవి యుత్తమ గుణములు, వాని యుత్తమత్వాధమత్వము లెట్లు నిర్ణయింపవచ్చును, అన్న యాలోచన పుట్టక పోదు. కేవల స్వప్రయోజనమును గూర్చిన వన్నియు నధమగుణములు; పరప్రయోజనమును గూర్చినవి యుత్తమ

గుణములు. అధమగుణములలో నాహార సంభోగవాంఛా క్రోధాదులు మృగ మనుష్య సామాన్యములు; ధనతృష్ణ, అధికారవాంఛ మొదలయినవి కేవల మనుష్యసంబంధ మయినవి. సత్యము కారుణ్యము మొదలయినవి యుత్తమగుణములు. సత్యాద్యుత్తమగుణములకు భంగము రాకుండునట్లు మితముగా నాహారాద్యధమభోగముల నెల్ల ననుభవింపవచ్చును గాని వానిలో వేనిని పూర్ణముగా విడువనక్కఱ లేదు. న్యాయముగా ధన మార్జించి భోగములను మితముగా ననుభవింప వచ్చును; ఇతరులకు ద్రోహముచేయక ధర్మమార్గమున నధికారము సంపాదించి సుఖింపవచ్చును. అంతేకాని యసత్యములాడి ధనార్జనము చేయరాదు; స్వామిద్రోహముచేసి యధికారము సంపాదింపరాదు. ఈ ద్వివిధగుణములలో నధమములయిన కామక్రోధాదులు స్వపక్షపాతముతోఁ గూడినవయి ఫలసాపేక్షములయి సదా స్వలాభమును స్వకీర్తిని స్వసుఖమును గోరుచుండును; ఉత్తమములయిన సత్యకారుణ్యాదులు ఫలనిరపేక్షములయి సార్వత్రికములయి యితరుల స్వాతంత్ర్యములను సౌఖ్యములను మన్నించుచు స్వసుఖలాభములకు భంగకరములుగా నున్నప్పుడును ధర్మమనుసరింపవలెనని బోధించుచుండును. ఈ రెంటిలో నుత్తమగుణములకంటె నధమగుణములే బలవత్తరములయి మనుష్యులను దాసులనుగాఁ జేసికొని యెక్కువగా నడచుచుండ వచ్చును. అయినను వానియొప్పు లధికారహీనములయి, యాజ్ఞారూపమునఁ బలుకుచుండు నుత్తమగుణముల స్వరమునకంటె భిన్నమయినవిగా నుండును. మనుష్యులను బద్ధులనుగాఁ జేసెడు యధికారగౌరవ మింద్రియసుఖవాంఛలయందు లేదు. అవి తాము మనోరథసిద్ధిని బడసి విజయగర్వము నొందియున్నప్పుడును ధర్మస్వరూపమయిన యంతరాత్మచేఁ జీవాట్లు తినుచు

సిగ్గుచేఁ దలవంచుకొనవలసినవిగా నుండును. ఇట్టి యధికారతార తమ్యమును బట్టి విషయవాంఛ లధమగుణములుగాను, ధర్మాదు లుత్తమగుణములుగాను, బరిగణింపఁబడుచున్నవి. ఈ ద్వివిధగుణముల స్వభావమును దెలిసికొని వివేకియైనవాఁడు స్వప్రయోజనపరత్వము నడఁగఁద్రొక్కి ధర్మచింతను దన హృదయసింహాసనమునం దధిష్ఠింపఁ జేయుటకయి సదా ప్రయత్నించుచుండవలెను. అట్లుండుటయే యీశ్వర ప్రీతికరము. కాఁబట్టి నిశ్చలమయిన యీశ్వరభక్తి గల యుత్తమపురుషుఁడు ప్రాణమరణమునకైనను తల యొగ్గును గాని ధర్మమును విడువఁజాలఁడు. అట్టి భక్తుని ధర్మమార్గమునుండి తొలఁగించుటకుఁ బ్రపంచములోని యేవియు సమర్థములు గావు. ఇట్లు స్వార్థ పరిత్యాగము నంతటిఁ బరార్థపరత్వము నధికముగా నెంచి నడుచుచుండు నదే యింద్రియనిగ్రహము. ఇట్టి యింద్రియనిగ్రహమును గొందఱు మహానుభావులు సులభముగాఁ జేయఁగలిగినను, ఎంతో కష్టముమీఁద గాని పలువురు చేయఁజాలరు. అయినను బ్రతిపురుషుని హృదయము నందును గొంచెముగానో గొప్పగానో యింద్రియములకును ధర్మ మునకును పోరాటముమాత్రము జరుగకపోదు. ఇట్లు పరస్పరవిరుద్ధము లయిన రెండుగుణములకును బ్రతివాని మనస్సులోను పోరాటము జరుగు చుండుటనుబట్టి యింద్రియముల స్వభావమును గూర్చి వానిని జయించు మార్గమును గూర్చి కొంచెము ముచ్చటింపవలయును.

ఇంద్రియము లంధములయి ముందుచూపు లేనివిగా నున్నవి. తమకు విషయమైన పదార్థ మెదుటఁబడఁగానే యవి యుద్రేకించి దానివలన మేలుకలుగునా కీడుకలుగునా యనువిచారమును జేయక దాని ననుభవింపఁ జూచుచుండును. తినఁదగిన మంచిపదార్థ మెదుటఁ బొడకట్టినప్పుడు దానిని మ్రింగవలె నన్న యాశయే కాని యారోగ్య

ప్రదమైన వానిని మాత్రము తిని యనారోగ్యకరమైన వానిని విడువ వలె నన్న బుద్ధి పుట్టదు. ధనతృష్ణ కలిగినప్పు డేమార్గముననైన ధనార్జనముచేసి కూడఁబెట్టవలెనన్న చింతయేకాని న్యాయమార్గముననే సంపాదింపవలెననియు దానభోగములకు వలసినంతయే చేర్పవలె ననియు బుద్ధి పుట్టదు. చూచినవస్తువునెల్లఁ దెమ్మని బాధించు శిశువులవలెనే యింద్రియములును దమకు గోచరమగు వానినెల్ల ననుభవింపఁ జూచుచుండును గనుక బుద్ధిమంతుఁడగువాఁడు వానికోరికల నెల్లఁ దీర్పఁజూడక యందువలన లోకమునకును దనకును మేలు కలుగునో కీడుకలుగునో విచారించి లాభకర మయినప్పుడుమాత్రమే వానియభీష్టమును దీర్చుచు వానిని దమయాజ్ఞలో నుంచుకొనుచుండవలెను. ఇంద్రియములయం దింకొక్క స్వభావము గలదు. పురుషుఁ డింద్రియలోలుఁడయి వానికోరికను దీర్చినకొలఁదిని వానికి తృష్ణ యధిక మగుచుండును. వానికిఁ గొంతకాలము చనవిచ్చిన తరువాత మరల వానిని లోఁబఱుకొనుట కష్టము. మృగముల విషయవాంఛలకైనను మేరగలదుగాని మనుష్యులయాశకు మేర యుండదు. అందుచేత నమిత మయిన యింద్రియసుఖములలో మునిఁగినవారు మరలఁ బైకి తేలలేక మృగములకంటెను హీనమైన యవస్థనొంది యధోగతు లగుదురు. అట్టి దురవస్థ కలుగకుండుటకయి బుద్ధిమంతులగువారు మొదటినుండియు జాగరూకత గలవారయి యింద్రియములు పైకిలేచి జ్ఞానదేహము నడఁగఁద్రొక్కకుండ సదా నీతిదేవతను బైకి లేవనెత్తుచు నింద్రియమృగములను దలనెత్తనీక నిగ్రహించుచుండవలెను. యుక్తసమయములో బుద్ధిబలముచేత నిగ్రహింపక పోయిన పక్షమున దినదినక్రమమున బలపడి యింద్రియములు మనకు దుస్సాధ్యము లగును. ధనము కూడఁబెట్ట మరిగిన వానికి వార్ధక్యము వచ్చి

నప్పుడును ధనాశ తగ్గక స్వప్నావస్థయందును నదే పలవరింతగా నుండును. ముఖము ముడుతలువడియు, పండ్లు కదలఁబాఱియు, శరీరము శుష్కించి కంపమొందియు, కన్నులు మసకలు క్రమ్మియు, సమస్తావయవములకును ముసలితనము వచ్చుచున్నను ధనాశకు మాత్ర మంతకంతకు పడుచుతనము వచ్చుచున్నదని భర్తృహరి చెప్పిన వాక్యము కొంతవఱకు సత్యమేకాని కేవల వర్ణనాంశము కాదు. ఇట్టి ధనాశ లోనుగాఁగల యింద్రియవాంఛాప్రాబల్యము హెచ్చిన కొలఁదిని నొకటి తరువాత నొకటిగా నుత్తమగుణములన్నియు రూపు మాసి పోవును. హృదయమునందంతటను విషయసుఖవాంఛ లే క్రమ్ముకొన్నప్పుడు సత్యము ధర్మము దానము కారుణ్యము మొద లయినవాని కెక్కడ నవకాశ ముండును? కాఁబట్టి మనుష్యునకు దేవత్వమును దెచ్చెడి యుత్తమగుణములను బాడుచేయఁజాలిన యింద్రియముల నెల్లప్పుడును మన మార్గములో నుంచి నిగ్రహించుచుండ వలెను. ఇంద్రియముల కిట్టి యసివార్యశక్తి యున్నదన్నప్పుడు సత్యా దులను పాడుచేయఁజాలునంతటి బలమును వాని కీశ్వరుఁ డేల యియ్యవలె నని కొందఱడుగవచ్చును. ఇంద్రియవర్గమున కటువంటి శక్తిని కలి గించుట మనుష్యుని కీర్తిగౌరవములను పెంపొందించుటకే కాని మఱి యొకందునకుఁ గాదు. ఎంత బలవంతుఁడయిన శత్రువును జయింపఁ గలిగిన, మనుష్యున కంత కీర్తికరము. మనము లోకములో నెవ్వరిని గొప్పవారినిగా నెంచి గౌరవింతుము? అధికముగా తిన్నవానిని, అమిత స్త్రీలోలుఁడయిన వానిని, అత్యంత ధనార్జనాపరునిని కాదు. సత్యము నిమిత్తము సమస్తసుఖములను విడిచినవానిని, కష్టములకోర్చి లోకమున కుపకారము చేసినవానిని, ధర్మము నిమిత్తమయి తృణ ప్రాయముగా ప్రాణముల నిచ్చినవానిని, ఇంద్రియనిగ్రహము చేసిన

యిటువంటి మహాత్ములనే యెల్లవారును గీర్తించి గౌరవింతురు. ఎవ్వరిమాటయోకాక మనమాటయే మనము విచారించుకొందము. మనము మరణ మాసన్న మయినప్పు డింద్రియవిజితులమయి మన మతిభోగపరాయణుల మగుటను స్త్రీలోలుర మగుటను పరులను వంచించి ధన మార్జించుటను గొప్పవారి దయకయి కల్లలాడుటను దలంచుకొని సంతోషింతుమా? ఇంద్రియనిగ్రహమును జేసి శుద్ధచరిత్రుల మగుటను సత్యసంధుల మగుటను బరోపకారపారీణుల మగుటను ధర్మము నిమిత్తమై కష్టములను సహించుటను దలంచి సంతోషింతుమా? సత్యము నిమిత్తమును ధర్మము నిమిత్తమును లోకము నిమిత్తమును శరీరసంపదలను ధారపోసినవాం డెవ్వండును చరమావస్థయందుం దానే జేసిన యీసత్కృత్యములకయి వగచువాండుండునని నేననుకొనను.

ఇంద్రియనిగ్రహము చేయుట యనంగా నీశ్వరాజ్ఞారూపమయిన ధర్మము నిమిత్తము స్వప్రయోజనమును విడుచుటయేకదా? స్వప్రయోజనము విడుచుట యనంగా ధర్మము నిమిత్తమును సత్యము నిమిత్తమును లోకము నిమిత్తమును స్వసుఖమును విడిచి బాధలకోర్చుట. ఊరక బాధలకోర్చుట గొప్పతనము కానేరదు. దుష్టులు సహితము తమ దుష్కార్యములను జేయుటలో ననేకవిధముల బాధల నొందుదురు. ఈశ్వర ప్రీతికరముగా లోకముయొక్క మేలునిమిత్తమయి స్వప్రయోజనమును సుఖమును త్యజించి బాధలకు సహించుటలోనే గొప్పతన మంతయు నుండును. అట్లు చేయుటయే నిజమైన వైరాగ్యము; అదియే యింద్రియనిగ్రహము. మనస్సులో నీతిబలమును ధర్మబలమును గలిగి యుండినగాని యింద్రియనిగ్రహము చేయుట శక్యముకాదు. ఈశ్వరునియందు దృఢవిశ్వాసమును భక్తియు నుండినం గాని నీతిబలమును ధర్మబలమును గలుగవు. ఈ రెండుబలము

లును గలుగునేని దైవబలము వానితోడనే యుండును. దైవబలము కలిగినందునకు గుఱుతు ధర్మాదుల నిమిత్తమయి కష్టములకును బాధలకును నిందలకును సహించి యింద్రియములను గెలువఁగలుగుట. ఇంద్రియములను గెలుచుట యనఁగా నతిమానుషమయిన శక్తిని జూపుట యనియే యర్థము. మనకు ధర్మస్థాపనమునందు దోడుపడెడి యతిమానుషమయిన శక్తి లోపల యీశ్వరబలమే కాని వేఱుకాదు. భక్తిపరునకుఁ గాని నిర్మలమయిన యీశ్వరబలము కలుగదు. లోకము నిమిత్తమును సత్యము నిమిత్తమును ధర్మము నిమిత్తమును ప్రాణముల నైన నియ్యఁగలుగుటయే నిజమైన భక్తి. కార్యరూపమయిన యిటువంటి భక్తి లేక యానందబాష్పములతోను భగవన్నామస్మరణములతోను శీతలవాక్యములతోను మాత్రము తెలిపెడి నటనము భక్తి కాదు. కామము, క్రోధము, గర్వము, మొదలైన యింద్రియవ్యాపారముల నడఁచివేసి, శాంతి, వినయము, కారుణ్యము మొదలైన యుత్తమగుణములను ధరించి, యెన్నికష్టములు వచ్చినను లోకము నిమిత్తము సహించి ఫలాపేక్ష లేక యీశ్వరప్రీతికరముగాఁ బరోపకారమును జేయుచుండుటయే నిర్మలమయిన భక్తి. శాంతివినయాదు లుత్తమగుణములే యైనను శక్తి గలిగియుండియు ధర్మము నిమిత్తము వానిని బూనుట శ్లాఘాపాత్రమగును గాని యశక్తతచేత బూనుట శ్లాఘార్హము కాదు. కొందఱు శరీరదౌర్బల్యముచేతను భయముచేతను శాంతాత్ములు కావచ్చును. కొందఱు పరాధికారప్రాబల్యముచేతను ఫలాపేక్షచేతను వినయము చూపవచ్చును. అట్టివారు గౌరవార్హులు కారు. తన శత్రువున కపకారముచేయ శక్తుఁడయియుండియు కోపకారణము కలిగినప్పు డింద్రియోద్రేకము నడఁచి శాంతి చూపువాఁడు గౌరవార్హుఁడు; ధనబలాదులచేత దానధికుఁడనని యెఱిఁగియుండియు

గర్వము దొట్టినప్పుడు దానిని నిగ్రహించి యెదుటివాఁడు తన సోదర తుల్యుఁడని యెంచి వినయము చూపువాఁడు గౌరవార్హుఁడు. గౌరవార్హత యంతయు నింద్రియనిగ్రహములో నుండునుగాని మఱి దేనిలోను లేదు. అపకారము నొందియు ద్వేషమునడఁచి యుపకారము చేయువాఁడును, ఇతరుల యన్యాయమువలన బాధనొందియు ప్రతికారచింత నడఁగద్రొక్కి న్యాయముచూపువాఁడును, కోపకారణము కలిగియు నాగ్రహమును నిగ్రహించి శాంతత వహించువాఁడును, నీతినిమిత్తమయి సమస్తేంద్రియసుఖములను విడనాడువాఁడును, ఇంద్రియనిగ్రహము చేసినవారు. అంతేకాని మనుష్యైకయోగ్యము లయిన భార్యాపుత్రబంధుమిత్రాది సంగములను వదలివేసి, గుణాలంకారమయిన ప్రేమానుబంధము దెగఁగోసి, మృగనివహార్హము లయిన యాకలములు మేసి, యరణ్యవాసము చేయఁగడఁగుట మత్తోన్మాదముగాని యింద్రియనిగ్రహము కాదు. అట్టిది భగవత్ప్రీతికరమును గానేరదు. మనుష్యుల కీశ్వరుఁ డనుగ్రహించిన యే గుణములును బూర్ణముగాఁ బరిత్యాజ్యములు కావు. శరీరావయవము లన్నియు యథాయోగ్యస్థితియందుండి క్రమముగాఁ దమవ్యాపారములను నిర్వహించుచున్నంతవఱకే దేహమున కంతకు సౌందర్యమును బలమును గలిగించునట్లు మనోగుణములన్నియు యథాయోగ్యస్థితియందుండి క్రమముగాఁ దమకృత్యములను నిర్వహించుచున్నంతవఱకే యాత్మకు సౌందర్యమును బలమును గలిగించును. ఏ యవయవ మెంతమాత్రము చెడినను, శరీరసౌందర్యము మాత్రమే కాక యితరావయవముల బలము సహితము తగ్గుననుట యెల్లవారికి ననుభవవేద్యము. ఈప్రకారముగానే యే మనోగుణ మెంతమాత్రము చెడినను, అట్లు ఆత్మసౌందర్యము మాత్రమేకాక యితరగుణములబలము సహితము తగ్గిపోవును.

ఇట్లు చెడెడి యవయవముగాని గుణముగాని యుత్తమ మయినది గాక యధమ మయినదే యయిననుగూడ తక్కినవాని యోగ్యతను జెఱుపక పోదు. కన్ను మొదలయినవి చెడక పెదవి యింత మొట్టి పడినను మొగముయొక్క యందము పాడగునుగదా? దీనిబట్టి యింద్రియములను యుక్తస్థితియందుంచి వానిని యుక్తవ్యాపారముల యందు నడుపుటయే కర్తవ్యముగాని వానిలో దేని నెంతమాత్రము రూపు చెఱుచుటయుఁ గర్తవ్యము కాదని యెల్లవారును సులభముగాఁ దెలిసికొన వచ్చును. ఇంద్రియవర్గముయొక్క యుక్తవ్యాపారము ధర్మానుసారముగాఁ బనిచేయుట యని యీవఱకే చెప్పియున్నాను. తనయందును తనకుటుంబమునందును తన బంధుబృందమునందును తనమిత్రవర్గమునందును మాత్రమే చూపెడిది కాక భేదభావము లేక తనకుఁ సోదర తుల్యులయిన యెల్లమానవులయెడలను జూపెడి న్యాయము కారుణ్యము మొదలయిన యుదారగుణపుంజమే ధర్మమగును. కామ క్రోధాదులయిన యంతశ్శత్రువులను నిగ్రహింపక యిట్టి యుదార గుణము సాధ్యముకాదు. ఇంద్రియనిగ్రహముచే నిట్టి యుదారగుణము కలుగఁగానే ధర్మము వర్ధిల్లి యది లోకముయొక్క క్షేమాభివృద్ధులకు హేతువగును. ఇట్లుగాక భార్యలు బిడ్డలు బంధులు మిత్రులు నన్ను పక్షపాతమునఁ గొందఱియెడలను మాత్రమే కారుణ్యాదులను జూపి యితరులయెడ నుపేక్షను జూపినచో నప్పుడింద్రియనిగ్రహము లేక ధర్మమునకు భంగముకలిగి లోకక్షేమాభివృద్ధులకు నిరోధము సంభవించును. అప్పుడు మనము కొన్నిసమయములయందు మనకు ప్రేమాస్పదు లయినవారు తప్పుచేసినను శిక్షింపఁజాలము; నింద్యమైన పని చేసినను మెచ్చుకొందుము; స్వలాభమునకయి యితరులకు హానిచేసినను ఉపేక్ష చేయుదుము. కాఁబట్టి మనయపుత్రులయెడ జూపినను,

పరులయెడఁ జూపినను దయ మొదలగువాని నీశ్వర ప్రీతికరముగా ధర్మచింతతోను వైరాగ్యబుద్ధితోను జూపుచుండుటకయి యభ్యాసము చేయవలెను. అట్టి వైరాగ్యము కొంచెము శ్రమచేసినచో సర్వజనులకును సాధ్యమైనదే. ఇటువంటి వైరాగ్యము బొత్తిగాలేని మతము మతముగాదు; అది లేనిభక్తుఁడు భక్తుఁడును గాఁడు. తన ప్రవర్తనను బాగుపఱచుకొనుటకుఁ బనికిరాని పక్షమున నట్టి మతమువలనఁ బ్రయోజనము లేదు. దేవాలయమునను పురాణశ్రవణ సమయమునను కన్నులనుండి యానందబాష్పములు కార్చుచు స్వకృత్యములయం దింద్రియనిగ్రహము నించుకయుఁ జేయలేక లోకోపకారచింత నణుమాత్రమును బూనక భక్తిహీనునివలెనే ప్రవర్తించుచుండిన పక్షమున నట్టివాఁ డాత్మవంచకుఁడును దైవవంచకుఁడును పరవంచకుఁడును నగునుగాని భక్తనామమున కర్హుఁడు కాఁడు. అట్టివాఁడు బెల్లము యొక్క మాధుర్యమును వర్ణించినప్పుడెల్ల నోట నూటలు మ్రింగెడు వానివంటివాఁడగును గాని యనుభవించెడు వానివంటివాఁడు కాఁడు. సద్వర్తనము లేక యీశ్వరగుణకథన సమయమునందు మాత్ర మానందబాష్పములు విడుచు వేషధారిని భక్తుఁడనుట నిశ్చయముగా మతమున కగౌరవము తెచ్చుటయే. భక్తిలేశముగలవానికిఁ గొంచెమయిన వైరాగ్యమును సద్వర్తనమును గలుగక మానవు. నిజమైన వైరాగ్యము కలవాఁడు, ధర్మమార్గమునుండి తొలఁగించుట కయి యితరులు తన్నెంత బాధింతురో యెంత గర్హింతురో యంత యుత్సాహముతోను నంతపట్టుదలతోను ధర్మమార్గము నవలంబించియుండును; మనుష్యులు తనయెడలఁ గ్రూరులయినను కృతఘ్నులయినను గూడ లోకోపకారకార్యములను విడువకుండును. ఇట్టి వైరాగ్యమును భగవద్భక్తి కలవారయి కొంచెము శ్రమచేసినచో నెల్లవారు నాచ

రణమునఁ జూపవచ్చునని పయిని జెప్పియున్నాను. కాఁబట్టి ఓ మిత్రవరులారా! మనమందఱమును నిజమైన యీశ్వరభక్తి కలవారమయి వైరాగ్య మవలంబించి మన సహోదరప్రాయమైన జనసామాన్యము యొక్క క్షేమాభివృద్ధుల నిమిత్తమయి శక్తివంచన లేక పాటుపడఁ బ్రయత్నింతము. ఈ మహాకార్యనిర్వహణమునందు మనకు మనోబలమును ధైర్యమును దయచేసి యీశ్వరుఁడు నిత్యసహాయుఁ డగునుగాక!

విద్యాధురీణుల జీవిత చరిత్రములు

By

K. VEERESALINGAM

విద్యాధురీణుల యర్థకృత్యములు

లోకములోపి సమస్తపదార్థములకును వృద్ధి నైసర్గికమయి యున్నది. ప్రతివస్తువును చిన్నదిగా పుట్టి క్రమక్రమముగా పెద్దది యగుచున్నది. అయినను సాకారమయిన భౌతికవస్తువుయొక్క వృద్ధికిని, నిరాకారమయిన యాత్మయొక్క వృద్ధికిని భేదము కలదు. భౌతికపదార్థాభివృద్ధికి పరిమితి యున్నది; ఆత్మాభివృద్ధికి పరిమితి లేదు. అందుచేత శరీరమువలెఁగాక యాత్మ శాశ్వతముగా వృద్ధి నొందుచుండఁదగినది. మనుష్యుఁడు శరీరమును మాత్రమే కాక యాత్మనుగూడఁ గలవాఁడగుటచేత నతఁడు నిరంతరాభివృద్ధిని బొందుచుండఁ దగినవాఁడు. కాఁబట్టి మనుష్యుని కొకకాలమునందు వృద్ధి సంపూర్ణమయినదనియు, అటుపైని వృద్ధినొందవలసిన యావశ్యకము లేదనియు, చెప్పుట స్వభావవిరుద్ధము. అట్లయ్యును మనదేశములో రెండుతెగలవా రిప్పుడు మనపూర్వు లెంతో కాలముక్రిందటనే సర్వజ్ఞులయి పరిపూర్ణ దశను బొంది రనియు, ఆధ్యాత్మికవిషయమున నంతకంటె నధికజ్ఞానము కలుగఁజాలదనియు చెప్పుచున్నారు. అందొక తెగవారు సామాన్యముగా దివ్యజ్ఞానసామాజికులు; రెండవతెగవారు పూర్వాచారప్రియులు. ఈ యిరుదెఱఁగులవారి బోధనవలనను మనదేశమునకింక నభివృద్ధి యసాధ్యమన్న పర్యవసానము తేలుచున్నది. దేశాభివృద్ధికి భంగకరమయిన వీరి సిద్ధాంతమునుగూర్చి యించుక విమర్శ చేయవలసి యున్నది.

వృద్ధి యనఁగా నాయావస్తువుయొక్క యుపయోగమునకుఁ దగినట్టుగా సమస్తావయవములును బరస్పరానుకూలముగా పెరుగుట.

అట్లు సమానముగా పెరుగక యొకభాగము వర్ధిల్లుచు నొకభాగము శుష్కించుచు వచ్చినచో నది నిజమైనవృద్ధిగాక రోగ మగును. ఒక వృక్షముయొక్క యొకశాఖ ననలెత్తి పెరుగుచు నింకొకశాఖ యాకు లెండి వాఁబాఱినచో నది యావృక్షముయొక్క రోగసూచకమయిన యస్వాభావికస్థితిని దెలుపును. అటువలెనే మానవదేహముయొక్క సమస్తావయవములును పరస్పరానుకూలముగా నెదుగక యొకకాలు సన్నగిల్లి యొకకాలు లావయినను, మేను చిక్కి తల బలిసినను, అది సహజమైన వృద్ధిగాక రోగసూచక మగును. భౌతికవస్తువిషయమునం దెట్లో యట్లే యాధ్యాత్మికవిషయమునందును మనయాత్మ యన్యో న్యానుకూలముగా సమస్తగుణములలోను సమస్తశక్తులలోను పెం పొందుటయే వృద్ధియగునుగాని యొకదానికి భంగకరముగా నొకటి యతిశయించుట వృద్ధికాదు. మనయాత్మకుఁ గలజ్ఞానము, నీతి, కారుణ్యము మొదలైన గుణములలో నీతి తొలఁగి తెలివి వికసించినను కారుణ్య మతిశయించినను సత్యమైన వృద్ధి కాదు. ఈగుణము లన్నియు నొకదాని కొకటి సహకారులుగా వర్ధిల్లక యితరేతర విరుద్ధముగా నొకటి యెక్కువగాను వేఱొకటి తక్కువగాను వృద్ధిఁబొందినచో మనము శుభప్రదమయిన వృద్ధిని బొందినవారము కానేరము. వృక్షాదులగు భౌతికవస్తువుల యభివృద్ధికి వానివాని యుపయోగము లనుబట్టి పరిమితి యుండుటయేకాక యేకజాతిలోని యొక కాలపువాని కంటెఁ దరువాతి కాలపువానియం దాధిక్యమేమియు లేక యుండును. వెనుకటికాలపు వృక్షములిచ్చినరీతి పుష్పఫలాదులనే వాని సంతతి వృక్ష ములును తరములవరుస నిచ్చుచుండును; వెనుకటికాలపు పక్షులు కట్టిన గూళ్లవంటి గూళ్లనే వానిసంతతి పక్షులును తరములవరుసను గట్టుచుండును. అంతేగాని వానియందు క్రొత్తమార్పేదియు నుండదు.

మనుష్యాత్మ కృషిచేయుచు వచ్చినచో నిరంతరాభివృద్ధి నొందుచుండుటయేకాక యొకతరమువానికంటె నొకతరమువా రంతకంతకు క్రమక్రమముగా నభివృద్ధి నొందుచుందురు. ఆదికాలమునందు దిగంబరులై గుహాలలో వసించినవారి సంతతివారు కొంతకాలమునకు మృగాజినాదులు ధరించి తాము నిర్మించుకొన్న కుటీరములలో వసింతురు; వారిసంతతివారు కాలక్రమమున చీనిచీనాంబర ధారులయి దివ్యసౌధములలో వాసము చేయుదురు. ఇట్లు కాలక్రమమున వృద్ధి నొందుచుండుట మనుష్యజాతికి స్వాభావికము; వృద్ధి నొందకుండుట యస్వాభావికము. భూమిమీఁదఁ గల జంతుజాలములలో నెల్లను మనుష్యుఁడు శ్రేష్ఠుఁడు. ఆతని శ్రేష్ఠతకు ముఖ్యకారణము నిరంతరాభివృద్ధిని బొందుచుండు స్వభావము కలుగుటయే. ఈయభివృద్ధి యన్యోన్య సాహాయ్యముచేత గాని కలుగనేరదు. అన్యోన్య సాహాయ్యము నపేక్షింపక యేకాకియై యుండెడు పక్షమున మనుష్యుఁడు బహువిషయములలో మృగములకంటె నధికుఁడు కాఁజాలఁడు. కాఁబట్టి మనుష్యాభివృద్ధికిఁ బరార్థపరత్వ మత్యంతావశ్యకము. బొత్తిగా పరోపకారచింత లేని కేవల స్వార్థపరుఁడు మనుష్య నామమునకే యర్హుఁడు కాఁడు. మనుష్యునకును మృగాదులకును గల ముఖ్య భేదములలో నిది యొకటి. మృగాదులు తమ ప్రయోజనమును మాత్రమే చూచుకొనునవి; మనుష్యుఁడు స్వప్రయోజనమును మాత్రమే గాక పరుల బాగునుగూడఁ జూడవలసినవాఁడు. మనుష్యుఁడు స్వలాభమునకంటెఁ బరప్రయోజనమును నెంత యెక్కువగా జూచుకొనుచుండునో యంత యధికుఁ డగుచుండును; పరప్రయోజనమునకంటె స్వలాభము నెంత యెక్కువగాఁ జూచుకొనుచుండునో యంత యధముఁ డగుచుండును. ఈ పరార్థపరత్వమునే దేశోపకారము మొదలైన బహు

నామములతో వ్యవహరింతురు. ఈ పరోపకారశీలతయే మనుష్యున
కలంకారము. కాఁబట్టి మనుష్యనామమున కర్హులు కాఁగోరినవా
రందఱును లోకముయొక్క దుఃఖమును తమ దుఃఖమునుగాను లోకము
యొక్క సుఖమును తమ సుఖమునుగాను భావించుకొని సంఘముయొక్క
లోపములను తగ్గించుటకును క్షేమము వృద్ధిపొందించుటకును శక్తి
వంచన లేక పాటుపడుచుండవలెను. సంఘము వృద్ధిపొందినఁ దామును
వృద్ధి నొందుదురు; సంఘము క్షీణదశ నొందినఁ దామును క్షీణదశ
నొందుదురు. సకలావయవములును నారోగ్యదశయం దుండనప్పు
డేయవయవమునకును, నెంత మంచిదశలో నున్న దానికిని, సంపూర్ణ
సౌఖ్యము గలుగకుండునట్లే సంఘము మంచిస్థితిలో లేనప్పు డేమను
ష్యుఁడును దానెంత విద్యావిత్తసంపన్నుఁడయినను సంపూర్ణ
సౌఖ్యము ననుభవింపఁజాలఁడు. అందుచేత వివేకియగు ప్రతిపురుషున
కును సంఘాభివృద్ధికయి సర్వప్రయత్నములను చేయుచుండుట పరమ
కర్తవ్యము. సంఘవృద్ధికయి కష్టములకోర్చి పనిచేయనివాఁ డెంత
విద్యాబుద్ధులు గలవాఁడయినను సంఘముయొక్క దుస్స్థితిచేతఁ
దానును గొంత దుస్స్థితిని బొందకతీఱదు. సంఘమును దనస్థితికిఁ
దెచ్చుటకయి కృషిచేయుచు సంఘముతోడిపాటుగా నభివృద్ధినైనను
బొందవలెను; సంఘస్థితికిఁ దాను దిగుచు సంఘముతోడిపాటుగా క్షీణ
దశనైనను బొందవలెను; అంతేగాని సంఘములోనుండి సంఘాభి
వృద్ధికయి పనిచేయక తటస్థుఁడై యుండి సుఖస్థితి నొందుట
సాధ్యముకాదు. కాఁబట్టి వివేకి యగువాఁడు తోడివారికి లేక తనకు
సుఖాభివృద్ధులు కలుగవనియు, మానవుఁడయినందున భ్రాతృతుల్యు
లగు తోడివారి సుఖాభివృద్ధులకయి తాను జేయవలసిన కార్యములు
కలవనియు తెలిసికొని తనధర్మములను పారమార్థికబుద్ధితో నిర్వ

హించు చుండవలయును. లోకములో తృణము మొదలుకొని పర్వతము వఱకును, చీమ మొదలుకొని యేనుఁగు వఱకును, గల ప్రతివస్తువును నేదో యుపయోగము నిమిత్తము చేయఁబడినదే కాని నిష్ప్రయోజనమయిన దొక్కటియు లేదు. పనికిమాలిన గడ్డిపఱకలు సహితము లోకమున కుపయోగపడు చుండఁగా నుత్కృష్టజన్మముగల మనుష్యుఁడు నిరుపయుక్తుఁడుగా సృజింపఁబడఁ డనుట స్పష్టము. మనుష్యుఁడు లోకములో సృజింపఁబడుటయే యతఁడు లోకోపయోగము నిమిత్తము చేయఁబడె నన్న సత్యము సహస్రముఖముల ఘోషించు చున్నది. లోకములో వస్తు వెంత గుణాధిక్యము గలదైన నంత యుపయోగాధిక్యము కలదయి యుండును. మనుష్యుఁడు సమస్తజంతువులకంటె గుణాధికుఁడై నందున లోకమున కన్ని జంతులకంటె నెక్కువ ప్రయోజన పడవలెను. విద్యావిహీనునికంటె విద్యాలంకారభూషితుఁడు గుణాధికుఁడనుటకు సందేహము లేదు గదా. కాఁబట్టి విద్యాధిక్యముతోడనే కార్యభారాధిక్యమును మనుష్యునిమీఁదఁ బడును. విద్యాధికులవలననే మనదేశము వృద్ధికి రావలెను. తన యభివృద్ధికయి మనదేశము విద్యాధికుల కృపనే యత్యంతము ప్రతీక్షించు చున్నది. మాతృభూమి కాశాభంగము కలిగింపక విద్యాసంపన్నులు సార్థకజన్ము లగుదురు గాక !

దేశాభివృద్ధికై విద్యాధికు లాచరింపవలసిన ధర్మములను వివరించుటకుఁ బూర్వము ధర్మాచరణమునకు ప్రతిబంధకములుగా నిప్పటి విద్యావంతులలో వ్యాపించు చున్న ముఖ్యలోపములను గూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. మన దేశమునం దిప్పు డింగ్లీషు చదువుకొన్న వారిలో క్రియాశూన్యులైన శుష్కవేదాంతు లంతకంత కెక్కువగుచున్నారు. దేశాభివృద్ధి కావలె నన్న పక్షమున నిట్టివారి సంఖ్య

తక్కువయి క్రియావంతుల సంఖ్య యెక్కువగావలెను. ఈ శుష్క వేదాంతులు మాటలలోఁ దాము సర్వజ్ఞులగు నీశ్వరులు కాఁబోవుచున్నట్టు వచింతురు; చేష్టలలో జ్ఞానహీనులైన పామరులవలె చరింతురు. ఇట్టి బుద్ధిమంతు లవిద్యావరణము తొలఁగి తామీశ్వరుల మగుదుమన్న భ్రమను విడిచి, తాము మనుష్యమాత్రులే కాని యీశ్వరు లెన్నటికిని గారనియు, ఈశ్వరునికంటెఁ దామెల్లప్పుడును భిన్నులయి యుండెదరనియు, ఈశ్వరుఁడు సేవ్యుఁడును దాము సేవకులు ననియు, ప్రభువైన యీశ్వరునికి భృత్యులయిన మనుష్యులగుటచేఁ దామీశ్వరప్రీతికరముగా నిర్వర్తింపవలసిన ధర్మములు గలవనియు, దృఢ విశ్వాసమును బూనవలెను. అప్పుడుగాని పురుషుఁడు స్వకృత్యమును ధైర్యముతో నిర్వహింప శక్తుఁడుకాఁడు. మనదేశమునందు జీవేశ్వరాభేదవాదము వేలకొలఁదిసంవత్సరములనుండి నడుచుచున్నను పుస్తకములందే కాని లోకవృత్తమునం దొక్కనికిని నద్వైతసిద్ధి యయినట్టు మన మనుభవముచేత నెఱుఁగము; ఇఁకముం దగునన్న యాశయు లేదు. ఉపదేశములలోను ప్రసంగములలోను మాయ తొలఁగినచో మనము బ్రహ్మల మగుదుమని చెప్పుచుండవచ్చును; ఇంటఁ గూరుచుండి బ్రహ్మోహమని వేయిసారు లనుకొనుచుండవచ్చును; ఒకానొకప్పుడు మననసమయమున మనోరథకైవల్యము ననుభవింపనువచ్చును. అంతేకాని క్రియవచ్చినప్పు డద్వైతమును నమ్మువాఁ డొక్కఁడు నుండఁడు. ఇతరుఁడు తనయొప్పు తీర్పక యపహారించినప్పుడుగాని తన్ను ప్రహారించినప్పుడుగాని యెంతటి మహావేదాంతియు తన యద్వైతమును మఱచి ద్వైతము నవలంబించి న్యాయస్థానమునకో యారక్షకస్థానమునకో పరుగెత్తకమానఁడు. ఇతరుఁడు తనజోలికి రాక తనకుమారుని జంపినను శోకమునొంది

యీ హాంతనుబట్టి యధికారుల కప్పగింపఁ జూచును గాని యెంతటి పరమ వేదాంతవేత్తయు,

శ్లో॥ య ఏవం వేత్తి హంతారం య శ్చైనం మన్యతే హతమ్
ఉభౌ తౌ న విజానీతో నాఽయం హంతి నహన్యతే.

"దేహి చంపువాఁడనియు చంపఁబడువాఁడనియు తలఁచు వారుభయులును మూఢులు. దేహి యొకరిని చంపువాఁడును ఒకనిచేఁ జంపఁబడువాఁడును గాఁడు" అని శ్రీకృష్ణులవారు గీతలలో నానతిచ్చినారని చూపినను నమ్మి యూరకుండఁడు. వ్యవహారమునం దెవ్వరికిని సర్వమును బ్రహ్మ మన్న నమ్మకము కలుగకపోయినను, ఈసిద్ధాంత వ్యాపనమువలన లోకమునకు నష్టము కలుగకపోదు. నేనే దేవుఁడ ననుకొనువారు పాపమునకు భయపడవలసిన పని యుండదు; నేను జేసిన దానికెల్ల నేనీశ్వరుని కుత్తరవాది ననుకొనువారు మాత్రమే పాపమున కవశ్యముగా భయపడవలసి యుండును. వేదాంతముయొక్క బోధన మంతయు మనుష్యుఁ డహంభావము ననఁగా నేనను జ్ఞానమును నశింపచేసికొని యహంకర్తృత్వమును విడిచి పరమాత్మలోఁ గలిసిపోఁ బ్రయత్నింపవలెనని; మనుష్యుఁ డీశ్వరుని కంటె భిన్నుఁ డన్న సిద్ధాంతము చేయు బోధనము తనపనులకుఁ దాను కర్త ననియు నుత్తరవాది ననియు నమ్మి యహంకర్తృత్వమును విడువక నిరంతరాభివృద్ధి నొందుచు ఘనుఁడుకాఁ బ్రయత్నింపవలెనని; కాఁబట్టి వేదాంతసిద్ధాంతవిశ్వాసమువలన నీతిరతియు పరోపకారచింతయు నాత్మగౌరవమును దేశాభిమానమును దుర్బలము లగును; మనుష్యుఁడు తనపనులకుఁ దాను కర్తననియు నీశ్వరుని కుత్తరవాది ననియుఁ దెలుపు సిద్ధాంతవిశ్వాసమువలన నీతిరతియు పరోపకారచింతయు నాత్మగౌరవమును దేశాభిమానమును ప్రబలము లగును.

తన పనులకుఁ దాను కర్తను గానన్న నమ్మకము గలిగినచో నీతివర్తనమునకును పరోపకారమునకును ప్రోత్సాహ మెట్లు కలుగును? ఒండొరుల నేకముగా బంధించి, సౌభ్రాత్రమును పెంచి, సుఖసంతోషములను వృద్ధిపొందించి, భూమిని స్వర్గతుల్యముగా మార్చునవి నీతిపాశమును ప్రేమపాశమును గాక లోకములో మఱి యేవున్నవి? ఈరెండు పాశములును శిథిలములయిన యెడల నిజమయిన దేశాభిమాన మెక్కడనుండును? దేశాభివృద్ధి యెక్కడ నుండును? దేశాభివృద్ధి కలుగుటకయి యహంకర్తృత్వవిశ్వాస మావశ్యకము. అహంకర్తృత్వవిశ్వాస మెప్పుడుండునో యప్పు డాత్మాభివృద్ధిప్రయత్న ముండును; ఆత్మాభివృద్ధిప్రయత్న మున్నప్పు డాత్మగౌరవ ముండును; ఆత్మగౌరవ మున్నప్పుడు తనస్వాతంత్ర్యముల నెఱిఁగి పూనికతో వానిని గాపాడుకొనఁ బ్రయత్నించును; తన స్వాతంత్ర్యములను గౌరవించి కాపాడుకొన నేర్చినవాఁడు పరుల స్వాతంత్ర్యముల మన్నించ నేఱుఁగును. ఇట్లన్యుల స్వాతంత్ర్యములను మన్నించుటయే ధర్మము; అదియే నీతి; అదియే సోదరభావము. అన్యోన్యసోదరభావమే సంఘాభివృద్ధికి మూలము; అన్యోన్యసోదరభావము లేక ధర్మరతి యుండదు. ధర్మరతి కలుగుటను ఫలము పరులు దూషించినను భూషించినను లక్ష్యము చేయక తాను సత్యమనియు న్యాయమనియు నమ్మినదానిని స్థైర్యముతోఁ జేయుట. ఇట్టి ధర్మరతియు స్థిరచిత్తతయు మనలో చదువుకొన్నవారిలో నిప్పుడు కొఱవడియున్నవి. ఈ యుత్తమగుణములను మనవారు మనకు ప్రభువులుగానున్న యింగ్లీషువారిని జూచి నేర్చుకోవలసియున్నది. మన యిప్పటి చదువరులు మన పరిపాలకుల సుగుణములకంటె దుర్గుణముల నెక్కువగా నేర్చుకొనుచున్నారు. సత్కార్యాచరణమునందలి స్థిరచిత్తతను నేర్చుకొన్నవారికంటె మద్యపాన

మును నేర్చుకొన్న విద్యావంతు లధికముగాఁ గానవచ్చుచున్నారు; మూఢాచారములను విడువ నేర్చుకొన్న వారికంటె సీమపొగచుట్ట లను బహిరంగముగా కాల్ప నేర్చుకొన్న పండితు లెక్కువగుచున్నారు. ఇప్పటి చదువుకొన్నవారిలో వెంట్రుకలను కత్తిరించుకొనుట, కుళ్ళా యిలు ధరించుకొనుట లోనయిన బాహ్యవేషములయందు మార్పులు కావలసినన్ని కనఁబడుచున్నను, వానికిఁ దగినట్టు మనుష్యుల కలం కారములయిన సద్గుణ సద్వర్తనములయం దభివృద్ధి యెక్కడనో కాని కానరాకున్నది. మనదేశము వృద్ధికివచ్చుట పురుషభూషణము లయిన సత్కార్యశూరత్వాది గుణసంపదలవలనఁ గాని యవి లేని కేవల బాహ్యవేషధారణము వలనఁ గాదు.

మన చదువుకొన్నవారిలోఁ గనఁబడుచున్న యింకొక లోపము సత్యగ్రహణాదరము తగినంత లేకపోవుట. ఈ సత్యగ్రహణపరాయ ణత్వాభావమున కొక కారణము పూర్వాచార పూర్వవ్యవస్థలయం దతిగౌరవ ముంచుట. పూర్వపు సదాచారములను సద్వ్యవస్థలను గైకొనుట మనకు ధర్మమే యయినను యుక్తాయుక్తవిచారము లేక పూర్వపువానినెల్ల నవలంబింపవలయు ననుట చదువుకొన్న బుద్ధి మంతుల లక్షణముకాదు. ఆలోచనలేక పూర్వపుదానినెల్ల గ్రహిం చుచు వచ్చినచో మనకు సత్యగ్రహణాదరము తగ్గిపోవుటయే కాక యభివృద్ధికిని భంగము కలుగును. పూర్వకాలము మంచిదని భావించు చుండుట యాలోచలేని పామరులలో నేకాలమునందును నున్నదే యయినను, ఒకకాలమునకంటె నొకకాలమునందుఁ గ్రమక్రమముగా వృద్ధి కలుగుచుండుట స్వాభావికమని యెఱిఁగిన వివేకులలో నట్టి యభిప్రాయ ముండుట శ్లాఘ్యము కాదు. పూర్వపువారు కష్టపడి జ్ఞానధనము నార్జించిన బుద్ధిమంతులే యయినను వారెంతో శ్రమ

పడి కూర్చిన జ్ఞానధన మంతయు ననాయాసముగాఁ దరువాతి తరము వారి పాలగుచు వచ్చుటచేతను వారు వారు తమ యల్పబుద్ధులతోడనే తరముల వెంబడిని గొంతకొంత జ్ఞానధనము నప్పుడప్పుడు సమ కూర్చి పూర్వపుదానికిఁ జేర్చుచు వచ్చుటచేతను బూర్వపు వారికంటె తరువాతి వా రధిక లోకానుభవశాలులయి దీర్ఘకాయుల భుజముల మీఁద నెక్కిన వామనులును నెక్కువ పొడవైనట్లు జ్ఞానోన్నతులగుట నైసర్గికము. అట్లయ్యును జనులలో సర్వసాధారణముగా పూర్వ కాలము మంచిదని యభిప్రాయము కలుగుటకు భ్రాంతిగా కారణము లేక పోలేదు. దూరపుకొండలు నునుపన్న సామెత యందఱు నెఱిఁగి నదేకదా. దగ్గఱకుఁ బోయి చూచువఱకును లోపములు గానరాక దూర దేశములు స్వదేశమునకంటె నుత్కృష్టములై నవని తోఁచు చుండునట్లె యప్పటి లోపములు తెలియనిచే పామరులదృష్టి కెప్పు డును బూర్వకాలములు మంచివిగాఁ గనఁబడుచుండును. పూర్వ కాలమునందలి సామాన్యజనుల కష్టములను దెలిసికొనుట కిప్పు డాధా రము లంతగా లేకపోవుటచేతను, పుస్తకములలో గొప్పవారి గుణ మహిమలే సాధారణముగా వర్ణింపఁబడుటచేతను, పామరులు గత కాలమే మంచిదని భావించుట వింతగాదు. అయినను పూర్వపుగ్రంథ ములనుబట్టి విచారించినచో బహువిషయములు శ్లాఘ్యములైనవి కానవచ్చుచున్నప్పటికిని గొన్నివిషయములు మన మిప్పుడు చూచి గర్వపడవలసినవిగా లేవు. పూర్వకాలమునందందఱును విశుద్ధ చరిత్రు లుగానుండి రనుమాట కల్ల. దేవతలలో సహితము పేరుగలవారిలో వ్యభిచరింపనివారిని వ్రేలుమడచిచెప్పుట కష్టము. ఇంద్రియనిగ్రహము చేసినారన్న వనవాసులయిన మహర్షులలో సహితము స్త్రీ తారసించి నప్పుడు తన శుద్ధచరిత్రమును గాపాడుకొన్నవాఁ డెక్కడనో కాని

కానఁబడఁడు. దేవతలకు గురువయిన బృహస్పతి యంతటి బుద్ధిమంతుని యవస్థ చూడుఁడు. ఈ కాలమునందును తారలును చంద్రులును పలువురు గలరు. కాని కులకాంతను లేవఁదీసికొనివచ్చి బ్రహ్మ దిగి వచ్చి వేఁడినను విడువక తగవులాడువారును, దయదలచి విడిచిన తరువాత సంతానము కలిగినప్పుడు వచ్చి పుత్రుఁడు తనకు రావలెనని భర్తతో తగవుపెట్టెడు జారులును, భార్య నింటిమగనికిని, బిడ్డను ఱంకుమగనికిని యిప్పించి తగవుతీర్చెడు న్యాయకర్తలును, యీపాడు కలికాలమునందుఁ గానరారు. బృహస్పతి సహితము తన సహోదర భార్యను కామించిన బుద్ధిమంతుఁడే కాని సామాన్యుఁడు కాఁడు. పూర్వకాలమునందలి సంతానక్రమమును జూడుఁడు. అప్పటి ధర్మశాస్త్రములలో ద్వాదశ విధ పుత్రు లంగీకరింపఁబడి యున్నారు. అందొకఁడు మగని యనుమతిమీఁదనో మగఁడు గతించిన పిమ్మట బంధువుల యనుమతిమీఁదనో పరపురుషునివలనఁ బుట్టిన క్షేత్రజుఁడు; ఇంకొకఁడు కన్య పెండ్లియాడక ముందే స్వసామర్థ్యమువలనఁ గన్న కానీనుఁడు; మఱియొకఁడు పెండ్లినాటికే భార్య గర్భవతియై తరువాతఁ గన్న సహోఢజుఁడు; వేఱొకఁడు మగని యెఱుకలేకయే భార్య స్వశక్తిచేతఁ గన్న గూఢోత్పన్నుఁడు. ఇట్టి పుత్రులందఱును కలి ముదిరిన యీ కాలమునఁ బనికిరాకున్నారు. ఇప్పటివారి కన్యాయములని తోఁచెడి ధర్మముల ననేకములను మన ధర్మశాస్త్రములనుండి చూపవచ్చును. వాని నటుండనిండు. పూర్వకాలమునందు కల్లలు మొదలయిన సాహసకార్యములు తక్కువగా నుండెననుటలోఁ గొంతసత్యము లేకపోలేదు. ఇతరులను మోసపుచ్చి వారి ధనాదుల నపహరించుట కొఱకే కదా తఱచుగా కల్లలాడుదురు. ఎల్లవారును దిగంబరులో కౌపీనధారులో యయియుండి యాకలములు భక్షించువారయి

యుండినప్పుడు కల్లలాడి పొందు లాభ మేముండును? కాఁబట్టి స్వాతంత్ర్యముగా నున్న కాలమున కంటె దొంగతనములు బొంకులును తక్కువగానే యుండును. నాగరికత హెచ్చి సుఖసాధనము లెక్కువయినకొలఁది చౌర్యాదులును మాయోపాయములును మున్నులేనివి క్రొత్త వేర్పడుననుటకు సందేహము లేదు. వ్రాతయెఱుఁగని కాలములో నుండని తప్పుపత్రములు వ్రాఁత వచ్చిన తరువాత రావా? ఏవో కొన్ని కష్టములు రావచ్చునన్న హేతువుచేత బుద్ధిమంతు లగువా రెవ్వరైన సుఖసాధనములను బరిత్యజించి యనాగరికులు కాఁజూతురా? వచ్చెడి కష్టను లస్వాభావికములయి దుష్టులవలన మాత్రము కలిగెడివగుటచేతను, కలిగెడిలాభములు స్వాభావికములయి యందఱుచే ననుభవింపఁదగిన వగుటచేతను బుద్ధిమంతులగువార లెల్లప్పుడును సుఖసాధనములను హెచ్చించి దేశాభివృద్ధి జేయుచు వానివలని నష్టములను సాధ్యమైనంతవఱకు తగ్గించు సదుపాయముల నాలోచించుచుందురు. పూర్వకాలపువారి కాశలు తక్కువనియు నిప్పటి మనవారాస్థితిని బొందుట కర్తవ్యమనియు ఘోషించుచుఁ బూర్వకాలమహిమను సహస్రముఖముల భూషించెడి మన యిప్పటి చదువుకొన్నవా రెవ్వరు తమ సుఖస్థితిని విడిచి పూర్వస్థితిని బొందఁజూతురు? ఎవ్వరు దివ్యభవనములను దివ్యాంబరాభరణములను పంచభక్ష్యపరమాన్నములను వదలి, గుహలలోను పర్ణశాలలలోను వసించుచు, దిగంబరులును కౌపీనధారులునునయి, కందమూలపర్ణభక్షణము చేయుచు జోగులవలె వనవాసము చేయఁజూతురు? దివ్యజ్ఞానులు మొదలైనవారు హేతుకల్పనముచేసి తమ ప్రౌఢిమను జూపి యెంతశ్లాఘించినను పూర్వపుస్థితి మరల వచ్చుట యెప్పటికిని సాధ్యముకాదు. పూర్వమన నెప్పటికిఁ బూర్వమో యెప్పటి యాచా

రముల నవలంబింపవలెనో యెట్లు నిర్ణయింపవచ్చును? మనకంటెఁ బూర్వులు రామకృష్ణాది దేవతలను విగ్రహరూపమున మనవలెనే యర్చించుచుండిరి; వారికంటెఁ బూర్వులు యజ్ఞాదికర్మలలో మునిఁగి యుండిరి; వారికంటెఁ బూర్వులు రామకృష్ణాదిదేవతల నామములైన నెఱుఁగక యగ్ని వాయు సూర్యాది భూతముల నారాధించుచుండిరి. మనకంటెఁ బూర్వులు బాల్యవివాహముల నవలంబించి వితంతు వివాహములను లేకుండఁ జేసిరి. వారిపూర్వులు బాల్యవివాహములను నెల కొల్పి చచ్చిన భర్తలదేహములతో బ్రతికియున్న భార్యలను గాల్పఁ బూనిరి; వారిపూర్వులు బాల్యవివాహము లెట్టివో యెఱుఁగక వితంతు వివాహముల నంగీకరించుచుండిరి. ఇప్పటివా రాదియం దెట్టి యాచారముండెనో విచారింపక యిప్పు డేయాచారమున్నదో దానినే పూర్వాచారమని చెప్పి దేవతలనువలె సేవించుచున్నారు. ఈ యనర్థమంతయు నవిచారమూలమున సంభవించుచున్నది. ఏది మంచిదో యేది చెడ్డదో విచారించి మంచిదాని నవలంబించుచుండెడు పక్షమున దురాచారములు తొలఁగి సదాచారములు ప్రబలును; విచారణలేక యాచరించుచుండెడి పక్షమున సదాచారములు నశించి దురాచారములు ప్రబలి వృద్ధికి భంగము సంభవించును. ఏదేశమందును పామరులెప్పుడును విచారించి కార్యములను జేయువారు గాక పూర్వాచారమునుబట్టి పదిమంది పోయిన త్రోవను బోవువారుగా నుందురు. వారికిఁ బూర్వాచారము పరమదైవతము. —అనాగరికదశయందు తొల్లిటివా రవలంబించిన పనులన్నియు వారికి పూజనీయములును పవిత్రములు నగును. వస్త్రనిర్మాణము చేతకానప్పుడు ధరించిన దిగంబర వేషములును, క్షురకర్మ చేతకానప్పుడు పెంచిన గోళ్ళును వెండ్రుకలును, కీటకబాధను తప్పించుకొనుట కయి పూసికొనిన బూడిదయు, వారికి గౌరవపాత్రము లగును.

అందుచేత మూఢులలో నూటికి వేయిటికి నొక్కొక్కఁడు మత్తోన్మాదముచే నట్టివేషము వేయుచుండుటయు తక్కినవా రట్టి వారిని మహాత్ములని గౌరవించుచుండుటయు నిప్పటికిని దటస్థించు చున్నది; పామరులలో నిట్టి విశ్వాసముండుట వింతగాదు. చదువు కొన్నవారిలో నట్టి నమ్మక ముండుట మొదటివింత; విద్యాధికులు విభూతి ధారణాదులకు నూతన హేతుకల్పనము చేసి వాని మహిమలను స్థాపింపఁజూచుట వింతపై వింత. తామిప్పుడు చదువుకొన్న నూతన శాస్త్రముల సాహాయ్యమువలనను బుద్ధిబలమువలనను నూతన హేతువు లను కల్పించి పెనఁగులాడుచుండుటచేత దేశాభివృద్ధికి నిరోధము కలు గుటయే కాక విద్యాధికులకు సత్యగ్రహణాదరమును కుంటుపడును. కాఁబట్టి విద్యాధికులు సత్యగ్రహణపరాయణులయి సత్యమెందున్న నంగీకరించుటకును, అసత్య మెందున్న నిరాకరించుటకును, సత్యము కొనిపోయినదారినే నడుచుటకును దృఢనిశ్చయము చేసికొనవలెను. అట్టి దృఢనిశ్చయము దేశాభివృద్ధి కత్యావశ్యకము.

మన చదువుకొన్నవారిలోఁ గానఁబడుచున్న యింకొక లోపము నిజమైన దేశాభిమానము లేక పోవుట. నిజమైన దేశాభిమానికి లక్షణము దేశమునందలి సమస్తజనులమీఁదను ప్రేమాధిక్యము కలిగి సమస్తవిషయములలోను దేశము వృద్ధినొందుటకుఁ దగిన ప్రయత్నము చేయుట. దేశాభివృద్ధికి జనులలోఁ గల లోపములను సంస్కరించు టయు నితరులలోఁ గల గుణములను గ్రహించుటయు నావశ్యకములు. ఈ రెండుపనులును జరుగక దేశ మెప్పుడును వృద్ధినొందదు. చదువు కొన్నవారిలో ననేకు లిప్పుడు స్వపక్షముల దృష్టియందుంచక పూర్వా చారములను పొగడుటయే దేశాభిమానమని యెంచి మనవారిలోఁ

గల దురాచారములు సహితము సదాచారములని స్తోత్రపాఠములు చేసి జనులలో గర్వమును వృద్ధిపఱుచుచు, యితర దేశములవారి సదాచారములు సహితము దురాచారములని దోషారోపణము చేసి జనులలో ద్వేషమును బురికొల్పుచు, దేశాభివృద్ధికి ప్రతిబంధకు లగుచున్నారు. జనులవలన మెప్పొందుటకయి స్తుతిపాఠములు చేయువారు దేశమునకు శత్రువులును దురభిమానులును గాని నిజమైన యభిమానులును మిత్రులును గారు. తమపూర్వులును తామును లోకములో నెల్లవారికంటె నధికులమన్న గర్వము జనసంఘములో వ్యాపించి స్థిరపడిన పక్షమున దేశము బాగుపడదు. కాఁబట్టి దేశాభిమాన లేశముగల ప్రతిపురుషుఁడును సమస్తమును బట్టువలె పొగడెడు పాఠకవృత్తి నవలంబింపక యే యే విషయములందు లోపములు గలవో వానినెల్ల విప్పిచూపి, దేహారోగ్యవిషయమునందైనను, వాణిజ్య విషయమునందైనను, కృషివిషయమునందైనను, రాజ్యాంగ విషయములయందైనను, నీతివిషయమునందైనను, మతవిషయమునందైనను, కులాచారవిషయమునందైనను, మఱి యేవిషయమునందైనను వృద్ధినొందుటకుఁ దగిన మార్గములను జనులకు జంకులేక దెలిపి నిర్భయముగా పని చేయవలెను. అట్లు పనిచేయువారే జనులకు నిజమైన నాయకులయి కాలక్రమమున జనులను నడుపుటకును దేశాభివృద్ధి చేయుటకును శక్తు లగుదురు. ఇట్టి పరిశుద్ధచింతతోఁ బనిచేయక స్వప్రయోజనము నపేక్షించియు ప్రజానురంజనమును గోరియు మూఢజనుల యిష్టానుసారముగా వర్తించువారు కొంతకాలము పేరొందినను తామనుకొనునట్లు జనులను నడుపువారు గాక మూఢజనులచేతనే నడపఁబడువారయి వారి యజ్ఞానమునకు దాసులయి దేశాభివృద్ధికి విఘ్నము కలిగించు కుక్షింభరు లగుదురు. మూఢులను దన మార్గము

నకుఁ ద్రిప్ప సాహసింపఁజాలక తాను మూఢమార్గమునఁ దిరిగి మెప్పొందువాఁడు తాను నేర్చిన విద్యకును వివేకమునకును నవమానము దెచ్చినవాఁ డగును. కాఁబట్టి విద్యావివేకసహితుఁడైన ప్రతి పురుషుఁడును ప్రజలమెప్పుకొఱకు పూనెడు కపటదేశాభిమానమును మాని దేశముయొక్క యభివృద్ధికొఱకుఁ గావలసిన నిర్వ్యాజ దేశాభిమానమును పూనవలయును.

చదువుకొన్నవారిలోఁ దఱచుగాఁ గన్పఁబడుచున్న యింకొక లోపము క్రియావంతు లంతగా లేకపోవుట. విద్యాధురీణులలో వాక్శూరులు లెక్కకెక్కువగా నెల్లయెడలను గానఁబడుచున్నను కార్యశూరులెక్కడనో నూటికి కోటికి నొకఁడుగాని కానఁబడకున్నారు. అనేకస్థలములలో విద్యావంతులనేకులు వాక్శూరత చూపవలసి వచ్చినప్పుడు సభాభవనములలో మేఘగంభీరభాషణములతో నానావిషయములనుగూర్చి వ్యాఘ్రములవలె బొబ్బరించుచు వాగ్ధారాప్రవాహమును నిరర్గళముగాఁ బఱపినను, కార్యశూరత చూపవలసి వచ్చినప్పుడు నివాసభవనములలో ముసలమ్మముందఱ నోరు లేవక తాము ధర్మమని నమ్మినదాని ననుష్ఠింప వలసిన పురుషలక్షణమగు ధీరతను విడనాడి యాఁడువారిని శరణొందఁ దగిన పోటుబంట్లగుచున్నారు. ధర్మమార్గమున నడుచుటకుఁ జాలినంత పౌరుషములేని వాక్శూరులలోఁ గొందఱు తమ యశక్తతను గప్పిపుచ్చుటకో, తమ యన్యత యుక్తికల్పనాసామర్థ్యమును లోకమునకుఁ జూపి ప్రసిద్ధులగుటకో, మనలో పూర్వ మున్నవన్నియు మంచివే యనియు వానిలో వేనిని మార్పవలసిన యావశ్యకము లేదనియును వాదించుచు స్వవాదోపబలార్థముగా శాస్త్రములను శరణొందుచున్నారు. ఎన్నఁడో నూఱుల కొలఁది సంవత్సరముల క్రిందట నప్పటివారికి ననుకూలముగాఁ జేయఁ

బడిన విధులే యెల్లకాలమును స్థితిభేదములేక యెల్లవారికిని ననుష్ఠే యములని చదువుకొన్నవారు వాదించుట యత్యద్భుతముగా నున్నది. అద్భుతముల కెప్పుడును కొఱఁత యుండదు. ఈ యద్భుతమునకు గారణమైన రహస్యమొకటి యున్నదని కొందఱు భావించుచు న్నారు. ఆ రహస్యమేది యందురేమో? కష్టములకు భయపడుట కంటె వేఱేదియు లేదు. కష్టములు లేక యే సత్కార్యమును నెఱ వేఱదు. కష్టములు లేని దేశాభిమానమే యుండదు. గాయములకు వెఱచి మూలదాగి యుండు రణశూరుఁ డెందును నుండఁడు. ప్రజా క్షేమమును వృద్ధిని గోరెడు నిక్కమైన కార్యశూరుఁ డెట్టి ప్రయాసము నైనను గణింపక యోర్చి పాటుపడవలెను. శుద్ధహృదయముతో నిరం తరకృషి చేయు ధీరునకా కష్టములే యుత్సాహజనకములయి కార్య సాఫల్యమున కనుకూలసాధనము లగును. కార్యశూరత లేని యధీరుని మనస్సునకు లేనికష్టములును పెక్కులు పొడకట్టును. అతనికి దారి పొడుగునను వ్యాఘ్రములవలె కష్టము లడుగడుగునకును గనుపట్టు చుండును. అతఁడు శ్రమపడి తన బుద్ధిబలమును వినియోగించి యెన్ని కష్టములను గలిగింపఁగలిగినను, అవి దుర్లంఘ్యములని చూపుట కెన్ని యుపాయములు పన్నఁగలిగినను వానిలో నొక్కకష్టమునైనను నివారించుటకు శక్తుఁడుగాక తుద కేమియుఁ జేయలేనివాఁడగును. తానది యర్హ్యాకృత్యమని యెఱిఁగియు జను లేమనుకొందురో యని సంశయించు బుద్ధిమంతుఁ డెప్పుడు నేపనియుఁ జేయఁడు. అట్లు చేయక పోవుటకుఁ గారణము దృఢచిత్తము లేకపోవుటగాని కార్యగౌరవము తెలియకపోవుట కాదు. మొదటినుండియు దృఢచిత్తత నభ్యాసము చేయనివా రెంత తెలిసినవారును, ధీశాలులు నయినను లక్షయుపాయ ములను జెప్పఁగలుగుదురు గాని యొక్క కార్యమును పూని నిర్వహింపఁ

జాలరు. కొందఱికి సదుద్దేశములే యుండినను అభ్యాసము లేమిచే నవి కార్యకారులు కావు. సత్కార్యాచరణమునందలి యుత్సాహమును స్థైర్యమునుగూడ బాల్యమునందే యభ్యాసము చేయవలెను; అవి మొదట నుపేక్షింపఁబడినచో నాకాలము దాటిన తరువాత పట్టుపడవు. కాఁబట్టి దేశాభిమానులు విద్యార్థులుగా నున్న కాలము నుండియు స్వసుఖమును కుటుంబసుఖమును జూచుకొనుచుండునట్లే లోకసుఖమునుగూడ నొకకంటఁ జూచుకొనుచుండుట కభ్యాసము జేయవలెను. ఇట్టి యభ్యాసము చేయని విద్యావంతులలో నభివృద్ధికి విరోధులుగా నుండెడువారిని గొందఱిని విడిచినచో పలువురు తాము దుష్కార్యములలో ప్రవేశింపక పోయినను సత్కార్యములలో నడుగిడక, బుద్ధిపూర్వకముగా వెనుకకుఁగాని ముందుకుఁగాని సాగక, జనాభిప్రాయమను గాలి వీచువంక కెల్లను దిరుగుచు, సత్కార్యాదరముగాని కార్యోత్సాహముగాని లేనివారయి లోకమునకు నిష్ప్రయోజకులగుదురు; మఱికొందఱు అంతకంటె నధికబుద్ధిమంతులయి తా మేకార్యమును జేయకపోయినను, సంస్కారప్రియులైనట్లు నటించి చేయువారి నాక్షేపించుచు చేసిన పనులలో వంకలు పెట్టుచు తమమనస్సులకు తృప్తిగా పరిహాసించి సంతోషించుచుందురు. ఇట్టివారూరక కార్యనిరతుల నెగతాళి చేయుటకంటె వారు తప్పుదారిని బట్టినచోఁ దాము మంచిదారినిబట్టి చూపినను, చూపలేనిచో పరిహాసమును గట్టిపెట్టి మౌనమును వహించినను, యెంతో సముచితముగా నుండును. ఇతరవిషయములలో కార్యశూరులు విశేషముగా లేకపోయినను, రాజ్యాంగవిషయములలో ననేకులుండి పనిచేయుచున్నారే యని గొందఱనవచ్చును. కష్టములేని కార్యములలోఁ బనిచేయుట యంత గొప్పకాదు. రాజ్యాంగవిషయమునఁ జేయుపని కడ్డము

వచ్చువా రెవ్వరు నుండరు; అట్టి పనికిఁ బూనినవారి నందఱును శ్లాఘింతురు. ఇతరవిషయములలో కృషిచేయక యొక్క రాజ్యాంగవిషయమున మాత్రము కృషిచేయుట నిజమయిన దేశాభిమానమును గాదు. మూఢులుగా నున్న వారికి రాజ్యాంగస్వాతంత్ర్యముల నిచ్చుటవలనఁ బ్రయోజనము లేదు; ఇచ్చినను వారు వానివలని లాభములను బూర్ణముగా ననుభవింపఁజాలరు. జనులయొక్క తెలివిని నీతిని ననుసరించి ప్రభుత్వపద్ధతి భేదించి యుండవలెను. ప్రజలకు మంచిప్రభుత్వమును సంపూర్ణ స్వాతంత్ర్యములను గలిగింపవలె నన్నచో, చదువుకొన్న కొందఱి స్థితిని మాత్రముగాక జనసామాన్యముయొక్క స్థితిని జ్ఞానము నందును నీతియందును వృద్ధిపొందింపవలెను. అట్లు చేయుటయే దేశాభిమానము. ఇతరవిషయములలో ప్రజాభివృద్ధికయి ప్రయత్నింపక రాజ్యాంగ విషయములలో మాత్రము కృషి చేయుచుండుటచే స్వప్రయోజనపరత్వముచేతనే యట్లుచేయుచున్నారని యనేకులు మనలోని చదువుకొన్నవారిపై నింద మోపుచున్నారు. తమ కడుపునఁ బుట్టిన బిడ్డలకు యుక్తవయస్సు వచ్చిన తరువాత భర్తలను భార్యలను వరించుకొను స్వాతంత్ర్యము నియ్యక వారిపై నిరంకుశాధికారమును చెల్లింపఁజూచువారు, రాజ్యాంగవిషయమున మాకు సర్వ స్వాతంత్ర్యముల నిండని విదేశీయులైన ప్రభువుల నడిగిన నెవ్వరు మెత్తురు? తమకుటుంబములోని స్త్రీలకు వారి స్వాతంత్ర్యములను విద్యను నొసఁగ వెనుకదీయువారు, మాకు జనప్రతినిధిపాలనము పెట్టి మమ్ముఁ బ్రతినిధులనుగాఁ బెట్టుఁడన్న నెవ్వరు శ్లాఘింతురు? అన్యోన్యసోదరభావము లేక మానవకోటిలో కొందఱు కొందఱిని పశువులకంటె హీనముగాఁ జూచి యవమానించుచున్నప్పుడు పయి తరగతుల వారికి కొందఱికి కొన్ని స్వాతంత్ర్యములు వచ్చినంతమాత్రముచేత

జనసామాన్యమునకు క్షేమసౌఖ్యము లెట్లు కలుగును? బురదలో పొరలివచ్చిన కున్నపోతు రాచుకొనిపోయినను మైలపడితి మని భావించుకొని తోడిమానవుఁడైన మాలవాఁడు వీథిలో దూరముగాఁ బోయినను మైలపడితి మనుకొనువారును పుల్లెలు మేసివచ్చిన యావు విస్తరిలో మూతిపెట్టినను విడిచిపెట్టక శూద్రుఁడు కంటఁబడిన మాత్రమున నన్నమును విడిచి లేచిపోవువారును తాము స్వాతంత్ర్యములను పొందినప్పుడు హీనజాతులయెడ సౌభ్రాత్రము నెట్లు చూపఁగలుగుదురు! కాఁబట్టి స్వార్థపరులుగాక దేశక్షేమము నిమిత్తమే పాటుపడు విద్యాధౌరేయులు రాజ్యాంగవిషయములలోవలెనే తక్కిన సమస్తవిషయములలోను యథాశక్తిని ప్రజలయభివృద్ధికయి పనిచేయవలెను. ఇట్లు కార్యశూరు లగుటకయి దేశాభిమాన మాననీయులగు విద్యాధౌరేయులు తమ క్షేమమునకంటె దేశక్షేమము నెక్కువగాఁ జూచుకొనుచు కావలసి వచ్చిన యెడల దేశాభివృద్ధి నిమిత్తమయి తమ దేహములను శక్తులను సంపదలను ప్రాణములను ధారపోయవలెను. నిజమైన దేశాభివృద్ధి కలిగెడు పక్షమున నెప్పుడయిన స్వార్థపరులు గాని యిట్టి పుణ్యపురుషులవలననే కలుగును గాని స్వప్రయోజనపరులవలనను, ధనార్జనపరాయణులవలనను గలుగదు. కాఁబట్టి విద్యాధికులు కార్యశూరులు కారని తమపైని బడిన నిందను పరుషవాక్యములచేతఁగాక కార్యములచేత తొలఁగించుకొని దేశాభివృద్ధికరములైన కార్యములలో క్రియావంతు లగుదురుగాక!

మనలోని విద్యావంతులలోఁగల లోపములని నాకు తోఁచిన వానిని గొన్నిటిని జెప్పితిని. ఇఁక వారు చేయవలసిన యర్హాకృత్యములనుగూర్చి ముచ్చటింపవలసి యున్నది. దేశక్షేమమునకయి విద్యాధికులు చేయవలసిన కార్యములు మితిమీఱి యున్నందున వానినన్నిటిని

వివరించుట శక్యము కాదు. వానిలోఁ గొన్నిటిని మాత్ర మిందు పేర్కొని మిగిలినవానిని విడిచిపెట్టెదను.

౧. వ్యవసాయవిషయము — మనదేశములోని జనులలో విశేష భాగము వ్యవసాయమువలననే జీవనము చేయుచున్నారుగదా? అట్టివారు విద్యాగంధము లేనివారగుటచేత కృషిశాస్త్రజ్ఞానము లేనివారయి భూమివలన తగినంత ఫలమును బొందఁజాల కున్నారు. వ్యవసాయము చేయుట తమగౌరవమునకు లోపమన్న పిచ్చి యభిప్రాయమును విడిచి విద్యాధికులయినవారిలోఁ గొందఱు తాము కృషిశాస్త్రము నభ్యసించి స్వయముగా కృషిచేయుట కారంభించి తాము లాభమును బొంది తమనిదర్శనమువలన కాపులు లాభము నొందునట్లు చేయవలెను.

౨. శిల్పాదికర్మలు — కేవల వ్యవసాయములవలననే దేశమెన్నఁడును భాగ్యసంపన్నము కాఁజాలదు. దేశము భాగ్యసంపన్నము కావలెనన్నచో శిల్పాదికర్మలు వృద్ధిపొందవలెను. మూఢుల చేతులలో నున్న యేపనియు వృద్ధినొందనేరదు. శిల్పాదులవృద్ధికయి యాయా పనులలో విద్యాధికులు ప్రవేశింపవలెను. దేశమంతకంతకు దారిద్ర్యదశకు వచ్చుచున్నదని వృత్తాంతపత్రికలలో వ్రాయుటతోను, రాజకీయోద్యోగములలోఁ బ్రవేశించి పొట్ట పోసికొనుటతోను, తృప్తినొంది యూరకుండక విద్యాధికులలో తగినంతమంది యమెరికాఖండమునకును, యూరపుఖండమునకును బోయి యక్కడి కర్మశాలలలో యంత్రనిర్మాణాదులను నేర్చుకొనివచ్చి యంత్రములను స్థాపించి కాగితములు, పంచదార, లోహములు, అద్దములు, వస్త్రములు, బొచ్చుబట్టలు, సబ్బు, నిప్పుపుల్లలు, మొదలైనవి యీదేశమునందే చేయునట్లు చేసి దేశాభిమానమును జూపవలెను.

3. ఆరోగ్యధర్మములు— పల్లెలయందు మాత్రమే కాక పట్టణములయందును బహుజను లారోగ్యధర్మముల నెఱుఁగనివారలయి యనేకవ్యాధుల పాలగుచున్నా రనుట యెల్లరు నెఱిఁగినవిషయమే కదా? విద్యాధికులు కొందఱు దేశభాషలలో సులభశైలితో నారోగ్యధర్మములను బోధించు పుస్తకములను రచించియు, ఇరుగుపొరుగుల వారి కారోగ్యధర్మముల యావశ్యకమును దెలిపియు, తాము పోయిన స్థలములలో నెల్ల నావిషయమున నుపన్యాసములు చేసియు, లోకోపకారము చేయవచ్చును.

౪. నీతివృద్ధి— జను లెంత తెలివిగలవారయినను నీతిమంతులయినంగాని దేశము మంచిస్థితికి రాదు. మన దేశమునం దిప్పుడు నీతికంటె జాతికట్టుపాటు లెక్కువవిగా భావింపఁబడుచున్నవి. ఒక బ్రాహ్మణుఁడు నరహత్య చేసినను జాతిభ్రష్టుఁడుగాక, పరిశుద్ధుఁడయిన శూద్రునియింట భోజనము చేసిన మాత్రమున వర్ణబాహ్యుఁ డగుచున్నాఁడు. ఈ జాతికట్టుబాటు లైకమత్యాభావమునకును, నీతిరాహిత్యమునకును, కృషివాణిజ్యాదికర్మల హైన్యమునకును, కారణము లగుచున్నవి. బొంబాయిరాజధానిలోని యొక్క బ్రాహ్మణవర్ణములోనే ౧౮౮ శాఖాభేదము లున్నవఁట. నష్టకరమైనట్టియు ననావశ్యకము లయినట్టియు నిట్టిభేదములను రూపుమాపుటకై చదువుకొన్నవారు కృషిచేయవచ్చును; రాజకీయోద్యోగులలోఁ గల లంచములను తగ్గించుటకయి పనిచేయవచ్చును; మనలోఁగల మోటుహాస్యములను మాన్పుటకయి యత్నింపవచ్చును. మనలోని పట్టపరీక్షయందు కృతార్థులయినవారు సహితము కొందఱు మోటుహాస్యములను విరసములైన మాటలను బలుకుచుండుట చింతాకరముగా నున్నది. హేయాతిహేయమయిన వ్యభిచారమునే కుల

వృత్తిగాఁ జేకొన్న వేశ్యలను వివాహాది శుభకార్యములయందు రప్పించి వారిచేత బూతుపాటలను పాడించెడు దురాచారమును పోఁగొట్టుటకయి కృషిచేయవచ్చును. పట్టపరీక్షాసిద్ధులే కొన్నిచోట్ల భోగము మేళములను ప్రోత్సాహపఱుచుచుండుట శోచనీయముగా నున్నది. విద్యాధికులయిన కొందఱు మహానుభావులు స్త్రీలలో తప్పయిన వ్యభిచారము పురుషులలో తప్పు కానట్టు తామే కన్నెఱికములు చేసికొనియు, వేశ్యలనుంచుకొనియు, తమ విద్యకును వివేకమునకును నగుబాట్లు తెచ్చుచున్నారు. తోడివిద్యాధికు లట్టి సిగ్గుమాలిన వారిని గౌరవింపక తమ యనిష్టమును బహిరంగముగాఁ జూపవలెను.

౫. అతిబాల్యవివాహములు :—అతిబాల్య వివాహములవలన విద్యాభంగము కలుగుటయు దుర్బలులయి రోగిష్ఠులయిన బిడ్డలు పుట్టుటయు మొదలయిన యనేకానర్థములు కలుగుచున్నవనుట యెవ్వరు నెఱుఁగని విషయము కాదు! అనర్థదాయకమయిన యీ దురాచారమును మాన్పుటకొఱకేగాక వివాహమునందలి దుర్వ్యయములను మాన్పుటకొఱకును ప్రతివిద్యాధికుఁడును కృషిచేయవలెను.

౬. వితంతువివాహములు :—మనదేశములో వితంతువివాహములను మాన్పుటవలనఁ గలుగుచున్న గూఢవ్యభిచారము శిశుహత్యలు మొదలైన పాపములమాట యటుండనిచ్చి నోరెఱుఁగని పసితనములో నెవ్వనికో యిచ్చి పెండ్లిచేసి యా బాలభర్త యుక్తవయస్సు రాకమునుపే చచ్చినను నిర్దోషురాలయిన యీ బాలికను మరల వివాహము చేసికొనకుండ నిర్బంధించి యావజ్జీవమును బెట్టెడు కడగండ్లను దలఁచుకొన్న పగవాని మనస్సయినను కలుక్కు మనకమానదు. భరతఖండమున కంతకు నవమానమయిన యీ క్రూరదురాచారమును మాన్పుటకయి కరుణాలేశము గలవారికెల్లను కర్తవ్యము.

౭. అపాత్రదానము :—అంధు[illegible]ర వికలాంగులకును, దరిద్రులైన రోగపీడితులకును, దిక్కుమాలిన వృ[illegible]కును, దానము చేయుట యెల్లవారికిని కర్తవ్యము. కాయపుష్టిగలిగి పాటుపడశక్తి గల వారికి దానముచేసి సోమరితనమునకు ప్రోత్సాహము కలిగించుట పాప హేతువు. మన దేశములో సాధారణముగా దానము లిట్టి యపాత్రులకే చేయబడు చున్నవి. గత జనపరిగణనమునుబట్టి యొక్క మన చెన్నపురి రాజధానియందే భిక్షాటనముచే జీవనము చేయువారు రెండులక్షల మేబది వేలున్నారు. పాటుపడి కుటుంబములను పోషింపఁగల యవయవ పటుత్వము గల యింతమంది పాటుపడక సోమరిజీవనము చేయు చున్నప్పుడు దేశము బీదస్థితికి రాక యెట్లుండును ?

౮. స్త్రీవిద్యా స్వాతంత్ర్యములు :—కుటుంబ సౌఖ్యమునకును దేశాభివృద్ధికిని స్త్రీవిద్య యత్యంతావశ్యక మయినను, చదువుకొని స్త్రీ లుద్యోగములు చేసెదరా? యనియు చదువుకొన్న స్త్రీలు గృహ కృత్యముల ననాదరము చేయుదురనియు, పిటుల కుత్తరములు వాయుదురనియు వాదించు మహానుభావులింకను విద్యాధికులలోనే కొందఱున్నందున విద్యావంతు లట్టి దురభిప్రాయములను తొలగించి సర్వవిధముల స్త్రీవిద్య వర్ధిల్లునట్లు చేయవలెను. చదువుకొన్నవారు తమ భార్యలను బానిసలవలెఁ జూడక వారితోఁ గలసి మెలసి పగలు సంభాషించుచు నేకపంక్తిని భోజనము చేయుచు, వారిని గదులలో మూసియుంచక వారి స్వాతంత్ర్యముల నిచ్చి సహధర్మచారిణులఁగాఁ జూడవలెను. ఇట్లన్నచో స్త్రీలు తమకే స్వాతంత్ర్యములు కావలెనని మొట్టపెట్టుకొనుచున్నారా యని కొందఱడుగవచ్చును. స్త్రీలను తమ స్వాతంత్ర్యములను తెలిసికోలేనంత దుస్థితికిఁ దెచ్చినందునకయి మనము సిగ్గుపడవలెను. విల్లియమ్ విల్బర్ ఫోర్సు బానిసవ్యాపార

మును మాన్పుట[illegible]యత్నించినప్పుడు బానిసలు తమస్థితిని మాన్పుటకయి [illegible]వారితోనైనను మొఱపెట్టుకొన్నారా? లేదు. లేకపోయినను తమ స్వాతంత్ర్యముల నెఱుఁగక తమస్థితితో తృప్తినొందియున్న వారిజ్ఞానహీనతను పరితాపపడి యతఁ డాఫ్రికాఖండములోని బానిసలస్థితిని బాగుచేయుటకయి తన ధనమును శక్తిని ధారపోసినవాఁడు. పరోపకారు లన్యదేశములవారి హీనస్థితిని బాగుచేయుటకయి యంత శ్రమపడినప్పుడు మనకుటుంబములలోని స్త్రీలగతిని బాగుచేయుటకయి ప్రయత్నించుట విద్యార్థులకు ధర్మము కాదా?

ఇఁక మనపట్టణమునందలి విద్యార్థులకు రెండుమాటలు చెప్పి యీ విషయమును ముగించెదను. మనపట్టణ మితరపట్టణములకంటె నధికనాగరికత గలదనియు నిందుండు విద్యార్థులు దేశాభివృద్ధి నిమిత్తమయి పనిచేయువారనియు కొంత పేరు వచ్చినది. పూర్వ మొకప్పుడు సాంఘికదురాచార నివారణ నిమిత్తమయి పనిచేయుచుండినవారికి వారి యభిప్రాయములను వెల్లడించుటకే చోటు దొరకుటకు దుర్ఘటమయినందున, అట్టి కొఱఁతను నివారింపఁ బూని విద్యార్థులవలన దేశమునకు క్షేమము కలుగునన్న పూర్ణవిశ్వాసముతో నే నీమందిరమును గట్టించితిని గాని చదువుకొన్నవారి బంతులాటలు మొదలయిన వానికి తావులేదన్న తలఁపుతోఁ గాదు. దేహారోగ్యమున కత్యావశ్యకములయిన బంతులాటలు మొదలయిన వానినిక్కడ యథేచ్ఛముగా జరుపుచు విద్యార్థులు నెల కొక్కసారియైన దేశాభివృద్ధి కనుకూలములయిన యుపన్యాసములు జరిపి నాకానందము కలుగఁజేసి యీ పట్టణమున కీవఱకు వచ్చినపేరు నిలిపి దేశాభిమానులన్న కీర్తిని బొంద ప్రయత్నింతురని వేఁడుచున్నాను. కార్యభారమును సమర్థతరులయి విద్యా

ధికులయిన యౌవనపురుషుల కొప్పగించి నాపనినుండి విశ్రాంతి పొందఁ బోవుచున్న నా ప్రార్థనను ఇచ్చటి విద్యాధికులు మిత్రభావముతో మన్నింతురుగాక !

వర్ణము.

By

K. VEERESALINGAM

వర్ణము.

ఓ భ్రాతృవరులారా!

నేఁటి సాయంకాలమున వర్ణభేదమునుగూర్చి కొంత చెప్పఁబోవుచున్నాను. సావధానచిత్తులరయి వినుఁడు. ఈ వర్ణభేద మాదినుండియు నున్నదా, ఎప్పు డెట్లువచ్చి యే రీతిగానుండుచు వచ్చినది, దీనివలన దేశమునకు లాభము కలుగుచున్నదా నష్టము కలుగుచున్నదా, అన్న యంశములను మన మిప్పుడు విచారింపవలసి యున్నది. ఈ వర్ణభేదము నైసర్గికముగాక వ్యావహారిక మగుటచే నడుమ నెప్పుడో వచ్చియుండక తీఱదు. వేదములలో నెల్ల నాదిమ మగు ఋగ్వేదమును బట్టి చూడఁగా మనపూర్వులయిన యార్యులు మొట్టమొదట పంజాబు దేశమునందు ప్రవేశించినట్టును, వారిలో వర్ణభేదము లేనట్టును, కనఁబడుచున్నది. ఆకాలమునం దార్యులును, అనార్యులును, అన్న భేదము తప్ప వేఱొకభేద మున్నట్టు కానఁబడదు. క్రొత్తగా వచ్చి ఫలవంతములయిన సింధునదీ ప్రదేశముల నాక్రమించుకొన్న మన పూర్వు లార్యులు. ఆర్యులన్న శబ్దమునకు పూజ్యులని యర్థము. నూతనముగా వచ్చి దేశము నాక్రమించుకొన్న మనపూర్వు లధిక నాగరికత గలవారగుటచేతను, అనాగరికులయిన దేశవాసులను జయించి వారిచే సేవింపఁబడుచుండుటచేతను, మనపూర్వుల కార్యులన్న పేరు సార్థక మయినది. క్రొత్తగా వచ్చి యితరుల వశమున నున్న ప్రదేశమును బలవంతముగా నాక్రమించుకొనఁ జూచువారికిని పూర్వకాలమునుండియు తమయనుభవములో నున్నప్రదేశములను విడువవలసినవారికిని పోరాటము జరుగుట స్వభావమగుటచేత నాకాలమునందు బలాధికులయిన యార్యులకును దుర్బలులయిన యనార్యుల

కును తఱుచుగా యుద్ధములు జరుగుచువచ్చెను. ఆ యుద్ధములలో నధికనాగరికులును ప్రబలసాధనసంపన్నులు నయిన యార్యులు జయమునొంది యనార్యుల నరణ్యప్రదేశములకు పాఱఁదోలియు దాసులనుగాఁ జేసికొనియు క్రమక్రమముగా వారి సారవంతము లయిన భూములనెల్ల నాక్రమించుకొనిరి. అనార్యులు బహిరంగముగా యుద్ధముచేసి యార్యులను గెలువలేక పోయినను కొన్నిసమయముల యం దేమఱుపాటున వచ్చి పైఁబడియు కొన్ని సమయములందు రాత్రి వేళ దొంగతనముగా వచ్చి యెదిరించియు నార్యుల ధనప్రాణములకు హానిని గలిగించుచువచ్చిరి. ఆర్యు లనార్యులను సాధారణముగా దస్యులని పిలుచుచుండిరి. దస్యు లన్న పదమునకు శత్రువులనియు దొంగలనియు నర్థము. ఋగ్వేదమునందు మహర్షులు తమవిరోధు లయిన దస్యులను నశింపఁజేయవలసినదని తమ యిష్టదైవములయిన యింద్రాదులను ప్రార్థించిన ఋక్కు లనేకములు గలవు. ఈ దస్యులనే యార్యు లప్పుడప్పుడు పిశాచులనియు రాక్షసులనియు వ్యవహరించు చుండుట కలదు. ఆకాలమునం దుండిన వర్ణభేద మంతయు నింతే. వర్ణమన్నపదమునకు రంగని యర్థము. ఆర్యులు తెల్లనివర్ణము గల వారుగాను, అనార్యులు నల్లనివర్ణము గలవారుగాను, ఉండుటచేత రెండుతెగలవారికిని గలభేదమునకు వర్ణమని పేరువచ్చినది. ఇప్పుడు వర్ణ, జాతి, కులశబ్దము లించుమించుగా పర్యాయపదములుగా వ్యవ హరింపఁబడుచున్నను పూర్వకాలమునందు బ్రాహ్మణాదిభేదమును తెలుపుటకయి వర్ణశబ్ద మొక్కటిమాత్రమే వాడఁబడుచు వచ్చినది. జాతిశబ్దమునకు పుట్టుక యనియు, కులశబ్దమునకు సంఘమనియు, నర్థములు. బ్రాహ్మణాదివర్ణభేదము ఋగ్వేదములో నొక్కపురుష సూక్తమునందు మాత్రము పేర్కొనఁబడియున్నది. ఈ పురుషసూ

క్తము ఋగ్వేదముయొక్క పదవమండలములోని తొంబదవసూక్తము. ఇది శుక్లయజుర్వేద వాజసనేయసంహిత (౩౧-౧-౧౬) లోను, కృష్ణయజుర్వేదారణ్యకము (చిత్తి) లోను, అధర్వవేదము (౧-౯-౬) లోను కూడ కొంతమార్పుతోఁ గనఁబడుచున్నది. ఋగ్వేదములో నున్న ప్రకారముగా నీ పురుషసూక్తభాగము నిందుదాహరించుచున్నాను—

౧. సహస్రశీర్షా పురుషః । సహస్రాక్షః స్సహస్రపాత్
స భూమిం విశ్వతో వృత్వా । అత్యతిష్ఠ ద్దశాంగుళమ్.

* * * *

౬. యత్పురుషేణ హవిషా । దేవా యజ్ఞ మతన్వత ।
వసంతో అస్యాసీ దాజ్యం । గ్రీష్మ ఇధ్మ శ్శర ద్ధవిః॥

* * * *

౧౧. యత్పురుషం వ్యదధుః । కతిధా వ్యకల్పయన్ ।
ముఖం కిమస్య కౌ బాహూ । కా వూరూ పాదావుచ్యేతే॥

౧౨. బ్రాహ్మణోస్య ముఖమాసీత్ । బాహూ రాజన్యః కృతః ।
ఊరూ తదస్య యద్వైశ్యః । పద్భ్యాగ్ం శూద్రో అజాయత॥

* * * *

ఈ పురుషసూక్తమునే మనవారిప్పుడు బ్రహ్మమునకు రూప మున్నదని చెప్పి తన్మూలమున విగ్రహారాధనము కరణీయమని సాధించుటకును, బ్రహ్మముయొక్క ముఖాదికమునుండి బ్రాహ్మణాదులు పుట్టిరని చెప్పి వర్ణభేదము నైసర్గికమని సాధించుటకును ఆధారముగాఁ జేసికొనుచున్నారు. పయినిజెప్పిన విరాట్పురుషరూప మాలంకారికముగాని వాస్తవము కాదనియు, ఆ మానసికపురుషుని ముఖాదికముగా బ్రాహ్మణాదు లుత్ప్రేక్షింపఁబడిరనియు, కొంచె మాలోచించిన వారికి స్పష్టము కాకపోదు. ఇందలి మొదటి ఋక్కునందు,

"ఆ పురుషుఁడు వేయిశిరస్సులు గలవాఁడు; వేయి
కన్నులు గలవాఁడు; వేయిపాదములు గలవాఁడు;
భూమి నంతట నావరించి పదియంగుళములు మించి నిలుచును."

అని చెప్పఁబడి యున్నది. ఈ శ్రుత్యర్థ మీశ్వరునకు సరిగా వేయిశిరస్సులు మొదలయిన వున్నవని చెప్పుటకాదనియు, అతఁడు వేయి (అనంతములైన) శిరస్సు లున్నట్టు సమస్తమును జూచువాఁడనియు, వేయి (అనంతములైన) పాదము లున్నట్లంతటను మెలఁగువాఁడనియు, అతఁడు ప్రపంచమంతటను నిండియుండి దానిపయినిగూడ వ్యాపించి యుండువాఁడనియు తాత్పర్య మనియు, జ్ఞానలేశము గలవారు సహితము సులభముగా నూహించి తెలిసికోవచ్చును. అట్లుగాక విరాట్పురుషుఁడు నిజముగానే వేయితలలును వేయికన్నులును గలవాఁడని యే చెప్పెడుపక్షమున, వేయిశిరస్సు లున్నప్పుడు వేయి నేత్రము లుండుట యసంగతమనియు తలయొకటికి రెండేసికన్నుల చొప్పున రెండువేలకన్ను లుండవలయుననియు బాలురుసహిత మాక్షేపించుట కవకాశము కలుగునుగదా? కాఁబట్టి మన మీ శ్రుతికి లాక్షణికార్థమును గ్రహింపవలెను గాని యవయవార్థమును గ్రహింపఁగూడదు. మఱియు నిందుదాహరింపఁబడిన యీ యవఋుక్కునందు,—

"పురుషుఁ డను హవిస్సుతో దేవతను యజ్ఞముచేసి
నప్పుడు దానికి వసంతఋతువు నేయియు, గ్రీష్మఋతువు
సమిధయు, శరదృతువు హవిస్సును నయ్యెను."

అని చెప్పఁబడి యున్నది. ఈ ఋుక్కునుబట్టి కూడ నిందుఁ జెప్పఁబడిన యజ్ఞమును హోమద్రవ్యములును కేవలమానసికములని విస్పష్టమగుచున్నది. అట్లుగాక యిది నిజమయిన యజ్ఞమే యనెడు పక్షమున, కాలస్వరూపములయిన వసంతగ్రీష్మశరదృతువులు నేయియు చితుకులును మెతుకులు ననుట యున్మత్తప్రలాపములగును. కాఁబట్టి యీ

శ్రుతికి మనము వాచ్యార్థమును గ్రైకొనక లాక్షణికార్థమునే గ్రహింప వలయును. ఇఁక ప్రస్తుతవిచారణీయముతైన కడపటి ఋక్కులను వ్రత్తము. ఇందు పదునొకండవ ఋక్కునందు;

"(దేవతలు) పురుషుని కల్పించినప్పు డెన్నివిధములుగా కల్పించిరి? అతనికి ముఖ మేది? బాహువు లేవి? ఊరువు లేవి? పాదము లేవి? (అని) పలుకఁబడుచున్నవి."

అని చెప్పఁబడినది. ఈ ప్రశ్నల కుత్తరముగా పండ్రెండవ ఋక్కునందు,

"అతనికి బ్రాహ్మణుఁడు ముఖమయ్యెను; రాజన్యుఁడు భుజములుగాఁ జేయఁబడెను; వైశ్యుఁ డతని కూరువులయ్యెను; శూద్రుఁడు పాదములవలన కలిగెను."

అని చెప్పఁబడి యున్నది. ఇందలి భాషాభేదము మొదలయిన వానిని బట్టి వేదవేదార్థములను నిపుణముగా పరిశీలించినవా రీపురుషసూక్తము ఋగ్వేదములోని పురాతనసూక్తములకంటె చిరకాలమునకు తరువాత చేయఁబడినదని సహేతుకముగా నిర్ణయించియున్నారు. పురుషసూక్తము చేయఁబడిన కాలమునకు బ్రాహ్మణాదివర్ణభేద మేర్పడినది. జను లధికనాగరికులయిన కొలఁదిని వృత్తిభేదములును జ్ఞానభేదములును గలిగి తారతమ్యభావ మేర్పడుట నైసర్గికము. ఆ కాలమునందు విద్యాధికులయి బ్రహ్మవిచారము చేయుచు మతబోధచేయువారు బ్రాహ్మణు లనియు, యుద్ధములుచేసి ప్రజాసంరక్షణము చేయువారు రాజన్యులనియు; కృషివాణిజ్యాదికర్మలుచేయు సామాన్యజనులు వైశ్యులనియు, వీరివద్ద సేవకులుగా నుండువారు శూద్రులనియు, వ్యావహారికనామములను గలవారయి యుండిరి. అయినను బ్రాహ్మణ్యాది వ్యవహార మప్పు డిప్పటివలె పుట్టుకనుబట్టిగాక వృత్తిని

బట్టియు తెలివినిబట్టియు గుణములనుబట్టియుఁ గలుగుచుండెను. అందు చేతనే శూద్రుఁడు బ్రాహ్మణుఁ డగుటయు బ్రాహ్మణుఁడు శూద్రుఁ డగుటయు కూడ నప్పుడు సాధారణముగా కలుగుచుండెను. వీరిలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మాత్రమే యార్యులనియు, శూద్రులు జితులయి వారికి దాసులయిన యాదిమదేశనివాసులనియు కొందఱు చెప్పుచున్నారు. భిల్లులు నాగులు కోదులు మొదలయిన వారును నీచ జాతులవారయిన శూద్రులును మాత్రమే యాదిమనివాసులు గాని, కొందఱు శూద్రు లార్యులకంటె ముందుగా నీదేశమునకు వచ్చిన తజ్జాతిలోనివారే యనియు కొంద ఱభిప్రాయపడుచున్నారు. పూర్వోక్త మయిన పండ్రెండవఋుక్కు స్వాభావికములయిన యీ భేదములనే చెప్పుచున్నది. కాని కొంద ఱనుకొనునట్లు బ్రాహ్మణులు నిజముగా బ్రహ్మయొక్క ముఖమునుండియు రాజులు భుజములనుండియు వైశ్యులు తొడలనుండియు శూద్రులు పాదముల నుండియు పుట్టిరని ప్రతిపాదింపదు. పదునొకండవ ఋుక్కులోని ప్రశ్నలను విచారించి యీ ఋుక్కుయొక్క ప్రతిపదార్థమును విమర్శించిన పక్షమున మంద బుద్ధికి సహితమిందు తెలుపఁబడిన దాలంకారికమని తోఁచకపోదు.

ప్ర తి ప దా ర్థ ము.

అస్య=ఈ విరాట్పురుషునకు, బ్రాహ్మణః=బ్రాహ్మణుఁడు,
ముఖమ్=ముఖము, ఆసీత్=అయ్యెను; రాజన్యః=క్షత్రియుఁడు,
బాహూ=భుజములుగా, కృతః=చేయఁబడెను;
అస్య=ఈ విరాట్టునకు, ఊరూ=తొడలు, యత్=ఏదిదో,
తత్=అది, వైశ్యః=కోమటి; పద్భ్యాం=పాదములవలన,
శూద్రః=శూద్రుఁడు, అజాయత=పుట్టెను.”

పాదములవలన శూద్రుఁడు పుట్టెనన్న వాక్యమునుబట్టి పయివారంద ఱును తత్తదవయవములనుండి పుట్టిరని చెప్పి సాధింపఁజూతురు గాని

పయిప్రశ్నలకును వాని కుత్తరములయిన వాక్యములకును విరుద్ధముగా నుండుటనుబట్టియు, యిందు వర్ణింపఁబడిన పురుషయజ్ఞాదికమగు సర్వమును కేవల మానసికమగుటచేత నవయవకల్పనము చేయుట యసందర్భమగుటనుబట్టియు, ఈ యర్థ మెంతమాత్రమును పొసఁగనేరదు. ప్రపంచాత్మకుండయిన విరాట్పురుషునకు జ్ఞానాధికులయిన బ్రాహ్మణులు జ్ఞానప్రకటనమున కాధారమయిన నోరువంటివారనియు, భుజబలసంపన్నులయిన క్షత్రియులు శౌర్యసంపద కాధారమయిన బాహువులవంటివారనియు, తిరిగి కృషివాణిజ్యాదులు నిర్వహింపవలసిన వైశ్యులు పిక్కబలముచే తిరుగుట కాధారమయిన తొడలవంటివారనియు, సేవకులుగా నుండెడు శూద్రులు సకలాంగములలో నీచములుగా నెంచఁబడు పాదములవంటివారనియు చెప్పిన దృష్టాంత మెంతయు మనోహరమయి సయుక్తికమయినదిగా నున్నది. ఆ కాలమునం దీబ్రాహ్మణాదిపదము లిప్పుడు వ్రాయువానిని లేఖకుఁడన్నట్లును దండులోఁ గొలువున్నవానిని భటుఁడన్నట్లును వ్యావహారికనామములుగానే యుండినవనుటకు సందేహము లేదు. అయినను తరువాత స్మృతులను పురాణములను రచించినవారు బ్రాహ్మణాదులు బ్రహ్మయొక్క ముఖాదులనుండియే పుట్టిరని స్థాపించుటకు కొన్ని శ్లోకములను జెప్పిరి. కాని వారివాక్యము లన్యోన్యవిరుద్ధములుగా నున్నవి. మనుస్మృతి పుట్టిన కాలమునకే బ్రాహ్మణుల యాధిక్యము స్థిరపడి కొంతవఱకు జన్మమునుబట్టియే వర్ణభేదము కలుగుచువచ్చినది. మనువు తన స్మృతియందు వర్ణోత్పత్తిక్రమమును వివరించుచు ప్రథమాధ్యాయములో ముప్పదియొకటవశ్లోకమునందు మొదట,

శ్లో॥ లోకానాం తు వివృద్ధ్యర్థం ముఖబాహూరుపాదతః।
బ్రాహ్మణం క్షత్రియం వైశ్యం శూద్రం చ నిరవర్తయత్॥

లోకముల వృద్ధినిమిత్తము ముఖమునుండియు బాహువులనుండియు నూరువులనుండియు పాదములనుండియు బ్రాహ్మణుని క్షత్రియుని వైశ్యుని శూద్రుని సృజించెనని చెప్పి తరువాత ముప్పదినాల్గవ శ్లోకమునందు,-

శ్లో॥ అహం ప్రజా స్సిసృక్షు స్తు తప స్తప్త్వా సుదుశ్చరమ్ ।
పతీన్ ప్రజానా మసృజన్ మహర్షీ నాదితో దశ ॥

బ్రహ్మ తాను ప్రజలను సృజించుటకయి దుశ్చరమయిన తపస్సు చేసి మొదట ప్రజాపతులయిన పదుగురు మహర్షులను జేసినట్లు చెప్పి యున్నాఁడు. ఈ ప్రజాపతులు సర్వసృష్టిని జేసిరి. బ్రాహ్మణాదిప్రజలు మొదటఁ జెప్పినట్లు బ్రహ్మయొక్క ముఖాదికమునుండి పుట్టిరా? తరువాతఁ జెప్పినట్లు ప్రజాపతులవలనఁ బుట్టిరా? మనుజ మనుష్యాది శబ్దములు ప్రజలు వీరిరువురివలనను గాక మనువువలనఁ గలిగినట్టు సూచన చేయుచున్నవి. పురాణములలో మనుష్యులు మనువువలనఁ బుట్టిరనియు చెప్పఁబడియున్నది. వానికి విరోధముగా శ్రీమద్రామాయణమునం దీక్రిందిశ్లోకమున ,-

శ్లో॥ మను ర్మనుష్యాన్ జనయత్ కాశ్యపస్య మహాత్మనః ।
బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాన్ చ మనుజర్షభ ॥

కశ్యపుని భార్యయైన మనువను నామె బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులయిన సమస్తమనుష్యులను సృజించెనని చెప్పఁబడి యున్నది. పురుషసూక్తమునకు పూర్వోక్తమయిన లాక్షణికార్థమును జెప్పక పోయినపక్షమున పురాణవాక్యములన్నియు వ్యర్థములగును. వర్ణశబ్దార్థమునుబట్టి దేహచ్ఛాయలనుబట్టియే వర్ణభేదములు కలిగినవని కొన్నిపురాణములలోఁ జెప్పఁబడియున్నది. మహాభారతములోని శాంతి పర్వములో ,—

శ్లో॥ బ్రాహ్మణానాం సితో వర్ణః క్షత్రియాణాం చ లోహితః।
వైశ్యానాం పీతకో వర్ణః శూద్రాణాం అసిత స్తథా॥

అని బ్రాహ్మణులకు తెల్లవర్ణము, క్షత్రియుల కెఱ్ఱవర్ణము, వైశ్యులకు పచ్చవర్ణము, శూద్రులకు నల్లవర్ణము, అని చెప్పఁబడినది. ఈ వర్ణభేదములు కల్పితములుగాని సత్యములుగావు. బ్రాహ్మణులలో నల్లనివారుండుటయు, శూద్రాదులలో తెల్లనివారుండుటయు, మనము ప్రత్యక్షముగాఁ జూచుచున్నాము. ఈ యంశమునకు నేను త్తరము చెప్పఁబూనుటకంటె వజ్రసూచికోపనిషత్తులోని దానినిం దుదాహరించుటయు క్తమని యెంచి యట్లు చేయుచున్నాను.—

"బ్రాహ్మణో శ్వేతవర్ణః। క్షత్రియో రక్తవర్ణః। వైశ్యః పీతవర్ణః శూద్రః కృష్ణవర్ణః। ఇతి నియమాభావాత్ ... తస్మాన్న దేహో బ్రాహ్మణ ఇతి."

బ్రాహ్మణుఁడు తెల్లనివాఁడు, క్షత్రియుఁ డెఱ్ఱనివాఁడు, వైశ్యుఁడు పచ్చనివాఁడు, శూద్రుఁడు నల్లనివాఁడు, అను నియమము లేకపోవుటవలన దేహమునుబట్టి బ్రాహ్మణత్వము రాలేదని పై వాక్యమున కర్థము. ఈ యుపనిషత్తే బ్రాహ్మణత్వము పుట్టుకచేత సహితము రాలేదని యీ క్రిందివాక్యములతోఁ జెప్పుచున్నది :—

"తర్హి జాతి ర్బ్రాహ్మణ ఇతి చేత్తన్న, తత్ర జాత్యంతరే ష్వనేకజాతిసంభవాత్ మహర్షయో బహవ స్సంతి ... ... వ్యాసః కైవర్తకన్యాయాం ... వసిష్ఠ ఊర్వశ్యాం ... అగస్త్యః కలశే జాత ఇతి శ్రుతత్వాత్"

వ్యాసుఁడు బెస్తదానియందును వసిష్ఠుఁడు ఊర్వసియందును అగస్త్యుఁడు కుండయందును బుట్టినట్టు వినవచ్చుచుండుటవలన నొక్కజాతిలోనే యనేకజాతిసంభవులైన మహర్షు లనేకు లుండుటను బట్టి జాతి

వలననే బ్రాహ్మణత్వము కలుగదని దీని తాత్పర్యము. ఈ ప్రకారము గానే యనేకపురాణములలో వారువారు చేయు కర్మలవలననే కాని జాతిమాత్రముచేత బ్రాహ్మణత్వము రాదని చెప్పఁబడి యున్నది.

శ్లో॥ హరిణీగర్భసంభూతో ఋశ్యశృంగో మహామునిః।
శ్వపాకీగర్భసంభూతో పితా వ్యాసస్య సత్తమః॥
గణికాగర్భసంభూతో వసిష్ఠశ్చ మహామునిః।
తపసా బ్రాహ్మణో జాతః సంస్కార స్తత్ర కారణమ్॥

"మహామునియైన ఋశ్యశృంగుఁడు లేడికడుపునఁ బుట్టియు, వ్యాసుని తండ్రి మాలదానికిఁ బుట్టియు, వసిష్ఠమహాముని వేశ్యకుఁ బుట్టియు, తపస్సుచేత బ్రాహ్మణులైరనియు దీనికి కారణము సంస్కార" మనియు భవిష్యత్పురాణమును,

శ్లో॥ జాతో వ్యాసస్తు కైవర్త్యా శ్వపాక్యాస్తు పరాశరః।
బహవో౽న్యేపి విప్రత్వం ప్రాపయే పూర్వ మద్విజాః॥

"వ్యాసుఁడు పల్లెదానివలనను, పరాశరుఁడు మాలదానివలనను బుట్టిరి; పూర్వము ద్విజులు కానివారనేకులు బ్రాహ్మణత్వమును పొందిరి" అని భారతారణ్యపర్వమును జెప్పుచున్నవి.

ఈ వాక్యములనుబట్టి చూడఁగా పూర్వకాలమునందు కేవల జన్మముచేతఁ గాక బ్రాహ్మణేతరులును, గుణములచేతను పనులచేతను బ్రాహ్మణులగుచు వచ్చిరనుట కరతలామలక మగుచున్నది.

శ్లో॥ చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః॥

అని భగవద్గీతలయందు గుణకర్మవిభాగమువలననే కృష్ణుఁడు తాను చాతుర్వర్ణ్యమును సృజించినట్లు చెప్పఁబడియున్నది. బ్రాహ్మణుల కనుకూలముగాను, శూద్రులకు ప్రతికూలముగాను, ధర్మముల నేర్పఱిచిన మనువుకూడ తన స్మృతియందు,—

శ్లో॥ శూద్రో బ్రాహ్మణతా మేతి బ్రాహ్మణ శ్చైతి శూద్రతాం।
క్షత్రియా జ్జాత మేవం తు విద్యా ద్వైశ్యా త్తథైవ చ॥

శూద్రుఁడు బ్రాహ్మణత్వమును పొందును; బ్రాహ్మణుఁడు శూద్రత్వము పొందును; క్షత్రియస్త్రీవలనను వైశ్యస్త్రీవలనను పుట్టినవారు నట్లే యగుదు" రని శూద్రాదివర్ణములవారు బ్రాహ్మణులు కావచ్చునని యంగీకరించి యున్నాఁడు.

శ్లో॥ న విశేషోస్తి వర్ణానాం సర్వం బ్రాహ్మ మిదం జగత్।
బ్రహ్మణా పూర్వసృష్టం హి కర్మభి ర్వర్ణతాం గతమ్॥

అని శ్రీమహాభారత శాంతిపర్వమున ౧౮౮ అధ్యాయమునందు "వర్ణములలో విశేష మేదియు లేదు; ఈ జగత్తంతయు పూర్వకాలమునందు బ్రహ్మమయముగానే చేయఁబడి కర్మలచేత వర్ణత్వమును పొందినది." అని చెప్పబడియున్నది. ఈ ప్రకారముగానే వాయుపురాణముయొక్క యెనిమిదవ అధ్యాయమునందును కృతయుగములో వర్ణభేదము లేదని చెప్పఁబడినది. వర్ణభేదములను పాటించెడి యీ పురాణమువలనను పూర్వకాలమునందుత్తమవర్ణత సద్గుణములవలననే వచ్చుచుండినట్లును, మంచినడత లేనివాఁడు బ్రాహ్మణునికిఁ బుట్టినను శూద్రుఁ డగుచుండినట్లును, మంచినడత గలవాఁడు శూద్రునికిఁ బుట్టినను బ్రాహ్మణుఁ డగుచుండినట్లును స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈ యంశమున కుప బలముగా పురాణములనుండి కొన్నివాక్యము లిం దుదాహరించుచున్నాను :—

శ్లో॥ ఏభి స్తు కర్మభి ర్దేవి శుభై రాచరితై స్తథా।
శూద్రో బ్రాహ్మణతాం యాతి వైశ్యః క్షత్రియతాం వ్రజేత్॥

*　　*　　*　　*

న యోని ర్నాపి సంస్కారో న శ్రుతం న చ సంతతిః।
కారణాని ద్విజత్వస్య వృత్త మేవ తు కారణమ్॥

సర్వోయం బ్రాహ్మణో లోకే వృత్తేన చ విధీయతే ।
వృత్తే స్థితస్తు శూద్రోపి బ్రాహ్మణత్వం నియచ్ఛతి ॥

అని భారతానుశాసనికపర్వాంతర్గతమైన యుమామహేశ్వరసంవాదమునందు "ఇటువంటి మంచిపనులు చేయుటచేత శూద్రుఁడు బ్రాహ్మణత్వమును పొందును; వైశ్యుడు క్షత్రియత్వమును పొందును......పుట్టుక, సంస్కారము (ఉపనయనాదులు), వేదాధ్యయనము, సంతతి, ద్విజత్వమునకు కారణములు కావు; మంచినడత యొక్కటియే కారణము. లోకములో బ్రాహ్మణత్వమంతయు సద్వృత్తిచేతనే కలుగును: సద్వృత్తియందున్న శూద్రుఁడును బ్రాహ్మణత్వము పొందును." అని చెప్పఁబడియున్నది.

శ్లో॥ న కులేన న జాత్యా వా క్రియాభి ర్బ్రాహ్మణో భవేత్ ।
చండాలోపి హి వృత్తస్థో బ్రాహ్మణ స్స యుధిష్ఠిర ॥
ఏకవర్ణ మిదం పూర్ణం విశ్వ మాసీ ద్యుధిష్ఠిర ।
కర్మక్రియావిశేషేణ చాతుర్వర్ణ్యం ప్రతిష్ఠితమ్ ॥
సర్వే వై యోనిజా మర్త్యాః సర్వే మూత్రపురీషిణః ।
ఏకేంద్రియేంద్రియార్థశ్చ తస్మా చ్ఛీలగుణై ర్ద్విజః ॥
శూద్రోపి శీలసంపన్నో గుణవాన్ బ్రాహ్మణో భవేత్ ।
బ్రాహ్మణోపి క్రియాహీనః శూద్రా త్ప్రత్యవరో భవేత్॥

* * * *

న జాతి ర్దృశ్యతే రాజన్ గుణాః కళ్యాణకారకాః ।
జీవితం యస్య ధర్మార్థం పరార్థే యస్య జీవితమ్॥

అని శ్రీమహాభారతారణ్యపర్వములో నొకచోట యుధిష్ఠిరునిగూర్చి వైశంపాయనుఁడు "కులముచేతను పుట్టుకచేతను గాఁదు; కార్యముల చేతనే బ్రాహ్మణుఁ డగును. ఓ యుధిష్ఠిరా! మంచినడవడి గలవాఁడు

చండాలుఁడైనను వాఁడే బ్రాహ్మణుఁడు; ఓ యుధిష్ఠిరా! ఈ ప్రపంచ మేకవర్ణముతోనే నిండియుండెను. కర్మక్రియావిశేషముచేత చాతుర్వర్ణ్యము ప్రతిష్ఠింపఁబడినది. నరులందఱును యోనినుండి పుట్టినవారు; అందఱును మూత్రపురీషములు గలవారు; ఏకవిధమైన యింద్రియములును వానిప్రయోజనములును గలవారు; కాఁబట్టి సదాచార సద్గుణములచేత ద్విజుఁ డగును. శూద్రుఁడయినను సదాచారసంపన్నుఁడును గుణవంతుఁడు నగువాఁడు బ్రాహ్మణుఁడగును; బ్రాహ్మణుఁడైనను క్రియాహీనుఁడు శూద్రునికంటెను తక్కువవాఁడగును... ఓ రాజా! జాతియం దేమియు లేదు; గుణములే కళ్యాణదాయకములు. ఎవని జీవితము ధర్మార్థమును పరోపకారార్థము నగునో (వాఁడే బ్రాహ్మణుఁడు.)" అని చెప్పఁబడియున్నది. ఈ యారణ్యపర్వములోనే మఱియొకచోట నహుషప్రశ్నల కుత్తరముగా యుధిష్ఠిరుఁడు ,-

శ్లో॥ సత్యం దానం క్షమా శీల మానృశంస్యం తపో ఘృణా ।
దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥
శూద్రే తు యద్భవే ల్లక్ష్మ ద్విజే తచ్చ న విద్యతే ।
నవై శూద్రో భవే చ్ఛూద్రో బ్రాహణో న చ బ్రాహ్మణః ॥
యత్రైత ల్లక్ష్యతే సర్ప వృత్తం స బ్రాహ్మణః స్మృతః ।
యత్రైత న్న భవే త్సర్ప తం శూద్ర మితి నిర్దిశేత్ ॥

"ఓ నాగేంద్రా! సత్యము, దానము, క్షమ, శీలము, అహింస, తపస్సు, కరుణ, యెక్కడఁ గనఁబడునో వాఁడే బ్రాహ్మణుఁడుగా నెంచఁబడును. ఇవి శూద్రునియందుండి బ్రాహ్మణునియందు లేకపోయినపక్షమున ఆ శూద్రుఁడు శూద్రుఁడు కాఁడు; ఆ బ్రాహ్మణుఁడు బ్రాహ్మణుఁడును గాఁడు. ఈ గుణము లెవనియందుండునో వాఁడు బ్రాహ్మణుఁడుగా నెంచఁబడును; ఎవనియందు లేవో వాఁడు శూద్రుఁడని నిర్దేశింప

వలెను." అని చెప్పఁబడి యున్నది. ఆ పర్వమునందే వేఱొకచోట యక్షుఁడు ధర్మరాజును,—

శ్లో॥ రాజన్ కులేన వృత్తేన స్వాధ్యాయేన శ్రుతేన వా ।
బ్రాహ్మణ్యం కేన భవతి ప్రబ్రూ హ్యేత త్సునిశ్చితమ్॥

"ఓ రాజా! కులముచేతనా? వృత్తముచేతనా? స్వాధ్యాయము చేతనా? శ్రుతముచేతనా ? బ్రాహ్మణత్వము దేనిచేతఁ గలుగును ? ఇది సునిశ్చితముగాఁ జెప్పుము." అని యడుగఁగా, ధర్మరాజు—

శ్లో॥ శృణు యక్ష కులం తాత న స్వాధ్యాయో న చ శ్రుతమ్ ।
కారణం వా ద్విజత్వే చ వృత్తమేవ న సంశయః ॥

"ఓ యక్షా! వినుము. కులమును స్వాధ్యాయమును శ్రుతమును బ్రాహ్మణత్వమునకుఁ గారణముగాదు; నిస్సంశయముగా మంచినడత యొక్కటియే కారణము" అని యుత్తరము చెప్పి యున్నాఁడు. శ్రీమద్భాగవత సప్తమస్కంధమునందు,—

శ్లో॥ శమో దమ స్తప శ్శౌచం సంతోషః క్షాంతి రార్జవమ్ ।
జ్ఞానం దయా చ్యుతాత్మత్వం సత్యం చ బ్రహ్మలక్షణమ్॥
శౌర్యం వీర్యం ధృతి స్తేజ స్త్యాగ ఆత్మజయః క్షమా।
బ్రహ్మణ్యతా ప్రసాదశ్చ రక్షా చ క్షత్ర లక్షణమ్॥
దేవగుర్వచ్యుతే భక్తి స్త్రివర్గ పరిపోషణం ।
ఆస్తిక్య ముద్యమో నిత్యం నైపుణ్యం వైశ్యలక్షణమ్॥
శూద్రస్య సన్నతి శ్శౌచం సేవా స్వామి న్యమాయయా।
అమంత్రయజ్ఞో హ్యస్తేయం సత్యం గోవిప్రరక్షణమ్॥
యస్య యల్లక్షణం ప్రోక్తం పుంసో వర్ణాభివ్యంజకం।
యదన్యత్రాపి దృశ్యేత తత్తేనైవ వినిర్దిశేత్ ॥

"శమము, దమము, తపస్సు, శౌచము, సంతోషము, క్షాంతి, ఆర్జవము, జ్ఞానము, దయ, స్వార్థపరత్వము విడుచుట, సత్యము, బ్రాహ్మణ

లక్షణములు. శౌర్యము, వీరత్వము, ధృతి, ప్రతాపము, త్యాగము, ఆత్మజయము, క్షమ, బ్రహ్మణ్యత, ప్రసాదము, రక్షణము క్షత్రియ లక్షణములు. దేవ గురు విష్ణుభక్తి, త్రివర్గపోషణము, ఆస్తిక్యము, నిత్యోద్యమము, నైపుణ్యము వైశ్యలక్షణములు. వినయము, శౌచము, మాయలేక స్వామిని కొలుచుట, అమంత్రకముగా కర్మలు చేయుట, చౌర్య రాహిత్యము, సత్యము, గోవిప్రరక్షణము శూద్రలక్షణములు. ఎవని కేలక్షణము చెప్పబడినదో యదియే వర్ణాభివ్యంజకము; ఈ లక్షణము లితరుల యందుఁ గనఁబడిన పక్షమున వానిచేతనే (వర్ణ మును) నిర్దేశింపవలెను." అని చెప్పఁబడి యున్నది.

"అధర్మ చర్యయా పూర్వో వర్ణో జఘన్యజఘన్యవర్ణ
మాపద్యతే జాతిపరివృత్తౌ । ధర్మచర్యయా జఘన్యోవర్ణః
పూర్వపూర్వవర్ణ మాపద్యతే జాతిపరివృత్తౌ."

"అధర్మ చర్యచేత నగ్రవర్ణమువాఁడు జాతిపరివృత్తమందు తక్కువ తక్కువ వర్ణమును పొందును; ధర్మచర్యచేత హీనవర్ణమువాఁడు జాతి పరివృత్తమందు పూర్వ పూర్వ వర్ణమును పొందును." అని యాపస్తంబ ధర్మసూత్రముల యందును,

శ్లో॥ శూద్రయోనౌ హి జాతస్య సద్గుణా నుపతిష్ఠతః ।
వైశ్యత్వం లభతే బ్రహ్మన్ క్షత్రియత్వం తథైవచ ॥
ఆర్జవే వర్తమానస్య బ్రాహ్మణ్య మభిజాయతే ।

"శూద్రయోనియందుఁ బుట్టినవాఁడు సద్గుణములు పట్టుపడుటవలన వైశ్యత్వమును, అదే ప్రకారముగా క్షత్రియత్వమును పొందును; ఋజు మార్గమునఁ బ్రవర్తించువానికి బ్రాహ్మణత్వము సహితము కలుగును" అని భారతారణ్య పర్వమునందును, సద్గుణములు కలవాఁడయి ధర్మ మార్గమున నడుచు శూద్రునికిని బ్రాహ్మణత్వము వచ్చునని చెప్పఁబడి యున్నది. ఈ ప్రమాణవచనములనుబట్టి చూడఁగా బ్రాహ్మణత్వము

నను సద్గుణములు ప్రధానములనియు గుణవంతుఁడు శూద్రుఁడయినను బ్రాహ్మణుఁడు కావచ్చు ననియు స్పష్ట మగుచున్నది.

ఇఁక బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులగుచు వచ్చినందుకుఁ గూడ కొన్ని దృష్టాంతములను మన ప్రమాణ గ్రంథములనుండి చూపెదను. క్షత్రియావంశజాతుఁడయిన విశ్వామిత్రుఁడు బ్రాహ్మణుఁడయి యనేక బ్రాహ్మణగోత్రములకు మూలపురుషుఁడగుటయు, అతఁ డనేక వేద మంత్రములకు ఋషియయి బ్రాహ్మణులకు ప్రధానమంత్రమయిన గాయత్రికి కర్తయగుటయు, సుప్రసిద్ధమే కదా ?

శ్లో॥ తతో బ్రాహ్మణతాం జాతో విశ్వామిత్రో మహాతపః ।
క్షత్రియః సోప్యథ తథా బ్రహ్మవంశస్య కారకః॥

"మహాతపస్వియైన విశ్వామిత్రుఁడను క్షత్రియుఁ డప్పుడు బ్రాహ్మణత్వ మును పొందెను; అతఁడు తరువాత బ్రాహ్మణవంశమునకు కర్త యయ్యెను." అని భారతానుశాసనిక పర్వమునందుఁ జెప్పఁబడి యున్నది. దీనిని బట్టి క్షత్రియుఁడయిన విశ్వామిత్రుఁ డొక్కఁడు మాత్రమేకాక యాతని సంతతివారు సహితము బ్రాహ్మణులయినట్లు తేలుచున్నది.

శ్లో॥ యథాగతం మహారాజ ముక్త్వా విష మివోరగః ।
భృగో ర్వచనమాత్రేణ స చ బ్రహ్మర్షి తాం గతః ॥
వీతహవ్యో మహారాజ బ్రహ్మవాదిత్వ మేవ చ ।
తస్య గృత్సమదః పుత్రో రూపేణేంద్ర ఇవాపరః ॥
* * * *
యత్ర గృత్సమదో రాజన్ బ్రాహ్మణై స్స మహీయతే ।
స బ్రహ్మచారీ విప్రర్షిః శ్రీమాన్ గృత్సమదో భవత్ ॥

"పాము విషమును విడిచిపెట్టునట్లుగా భృగుని వచనమాత్రముచేత వీతహవ్యుఁడు బ్రహ్మర్షిత్వమును బ్రాహ్మవాదిత్వమును బొందెను. రూప

మున నింద్రుని వంటివాఁడయిన యతని పుత్రుఁడు గృత్సమదుఁడు బ్రాహ్మణులతోనుండి బ్రహ్మచారియు, బ్రహ్మర్షియు నయ్యెను" అని యను శాసనిక పర్వమునం దున్నది. దీనినిబట్టి భృగుమహర్షియొక్క వచన మాత్రమున వీతహవ్యుఁడను క్షత్రియుఁడు బ్రాహ్మణుఁడగుటయేకాక యాతని పుత్రుఁడగు గృత్సమదుఁడు కూడ బ్రాహ్మణుఁడయినట్లు స్పష్ట మగుచున్నది.

"ముద్గలా చ్చ మౌద్గల్యాః క్షత్త్రోపేతా ద్విజాతయో బభూవుః" ముద్గలుని వలన మౌద్గల్య గోత్రులయిన క్షత్రియవంశ బ్రాహ్మణులు కలిగిరని విష్ణుపురాణమునందుఁ జెప్పఁబడినది.

శ్లో॥ పుత్రః ప్రతిరథస్యాసీత్ కణ్వ స్సముభవ న్నృపః।
మేధాతిథి స్సుత స్తస్య యస్మాత్ కణ్వో భవే ద్ద్విజః॥

"ప్రతిరథుని కొడుకు కణ్వుఁడను రాజు; అతనికొడుకు మేధాతిథి; అతని వలన కణ్వుఁడను బ్రాహ్మణుఁడు పుట్టెను." అని హరివంశమునందు క్షత్రియునకు పుట్టినవాఁడు బ్రాహ్మణుఁ డయిన ట్లున్నది.

"గర్గా చ్ఛినిః తతో గార్గ్యాః శైన్యాః క్షత్త్రోపేతా ద్విజాతయో బభూవుః॥ మహావీర్యా దురుక్షయో నామ పుత్రోభూత్. తస్య త్రయ్యారుణపుష్కరిణౌ కపిలశ్చ పుత్రత్రయ మభూత్. తచ్చ త్రితయ మపి పశ్చా ద్విప్రతా ముపజగామ. బృహత్క్షత్రస్య సుహోత్రః సుహోత్రాత్ హస్తీ—య ఇదం హస్తినాపుర మారోపయా మాస—అజమీఢ ద్విమీఢ పురుమీఢా స్త్రయో హస్తిన స్తనయాః అజమీఢా త్కణ్వః కణ్వాత్ మేధాతిథిః తతః కాణ్వాయనా ద్విజాః"

గర్గుని వలన శిని, అతని వలన గార్గ్యులును శైన్యులును నను క్షత్రియ వంశ్యులయిన బ్రాహ్మణులును గలిగిరి. మహావీర్యునికొడుకు ఉరుక్ష యుఁడు; అతనికి త్రయ్యారుణుఁడు, పుష్కరిణుఁడు, కపిలుఁడు, అని

ముగ్గురు పుత్రులు; తరువాత వారు ముగ్గురును విప్రత్వమును పొందిరి. బృహత్క్షత్రుని పుత్రుఁడు సుహోత్రుఁడు; సుహోత్రుని పుత్రుఁడు హస్తి; ఇతఁడే హస్తినాపురమును కట్టించెను. అజమీఢుఁడు, ద్విమీఢుఁడు, పురుమీఢుఁడు, అని హస్తికి ముగ్గురుకొడుకులు; అజమీఢునివలన కణ్వుఁడును, కణ్వునివలన మేధాతిథియు, అతనివలన కాణ్వాయనులను బ్రాహ్మణులును గలిగిరి." అని విష్ణుపురాణమునందు శిని యను క్షత్రియుని సంతతివారును, ఉరుక్షయుఁడను క్షత్రియునియొక్క ముగ్గురు కొడుకులును, మేధాతిథి యను క్షత్రియునియొక్క కొడుకైన కణ్వుని వంశమువారును, బ్రాహ్మణులయినట్లు చెప్పఁబడియున్నది. ఇట్లు బ్రాహ్మణులయిన క్షత్రియుల నామములు పురాణములయం దపరిమితముగాఁ జెప్పఁబడియున్నవి. ఇట్లు బ్రాహ్మణులగుచు వచ్చిన దొక్క క్షత్రియులు మాత్రమే కాదు,—

శ్లో॥ నాభాగారిష్టపుత్రౌ ద్వౌ వైశ్యౌ బ్రాహ్మణతాం గతౌ॥

"నాభాగుఁడును, అరిష్టుఁడును, అను వైశ్యపుత్రు లిద్దఱును బ్రాహ్మణత్వమును పొందిరి." అని హరివంశమున నున్నది. ఇంతవఱకును జెప్పిన దానిని బట్టి బ్రాహ్మణేతరులయిన ద్విజులు బ్రాహ్మణులగుచు వచ్చినట్లు తెలిసికొనఁదగియున్నది. ఇఁక ద్విజేతరులు బ్రాహ్మణులయినందుకుఁ గొన్ని నిదర్శనములను జూపెదను.

శ్లో॥ అబ్రహ్మణ్యే తదా దేశే కైవర్తాన్ ప్రేక్ష్య భార్గవః ।
...............యజ్ఞసూత్ర మకల్పయత్॥
స్థాపయిత్వా స్వకీయే సక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్ ।
జామదగ్న్య స్తథోవాచ సుప్రీతే నాంతరాత్మనా॥

"అప్పుడు పరశురాముఁ డాదేశమందు బ్రాహ్మణులు లేకపోఁగా బెస్తలను జూచి వారికి యజ్ఞోపవీతము వేసెను. వారిని బ్రాహ్మణులను

జేసి తనదేశమునందు నిలిపి జామదగ్న్యుఁడు ప్రహృష్టాంతరంగుఁడయి పలికెను." అని స్కాందపురాణములోని సహ్యాద్రిఖండమునందు పరశురాముఁడు శూద్రులలో నీచులయిన బెస్తలకు జన్నిదములువేసి వారిని బ్రాహ్మణులను జేసినట్లు చెప్పఁబడియున్నది. ఇట్లు శూద్రాదులు బ్రాహ్మణులయినట్లు పురాణములయందు మాత్రమేకాక వేదములయందును జెప్పఁబడియున్నది. ఋగ్వేద సంహిత పుట్టిన కాలములో వర్ణవిభాగము లేకపోయినను బ్రాహ్మణములు పుట్టినకాలమునకు బ్రాహ్మణాదివర్ణభేద మేర్పడి కొంతవఱకు బలపడినది. పూర్వోక్తమయిన పురుషసూక్త మించుమించుగా బ్రాహ్మణములు పుట్టినకాలములోనే పుట్టినదని యనేకులు తలఁచుచున్నారు. ఋగ్వేదములోని యైతరేయ బ్రాహ్మణమునందు,—

ఋషయో వై సరస్వత్యాం సత్ర మాసత। తే కవష మైలూషం సోమా దనయన్। దాస్యాఃపుత్రఃకితవో౽బ్రాహ్మణఃకథంనోమధ్యే దీక్షిష్టేతి? తం వహిర్ధన్వోద్వహన్నత్త్రైనం పిపాసా హన్తు సరస్వత్యా। ఉదకంమాపాదితి। సవహిర్ధన్వోద్వూళ్హః పిపాసయావిత్త ఏతదపోనప్త్రీయ మపశ్యత్। ప్రదేవత్రా బ్రహ్మణే గాతురే త్వితి। తేనాపాం ప్రియం ధామోపాగచ్ఛ త్తమాపో౽నుదాం యం స్తం సరస్వతీసమన్తం పర్యధావ త్తస్మాద్ధాప్యే తర్హి పరిసార మిత్యాచక్షతే। య దేనం సరస్వతీ సమన్తం పరిససార తే వా ఋషయో౽బ్రువన్విదుర్వా ఇమం దేవా ఉపేమంహ్వయామహా ఇతి। తథేతితముపాహ్వయన్త। తనుపహూయైత దపోనప్త్రీయ మకుర్వత। ప్రదేవత్రా బ్రహ్మణేగాతురేత్వితి। తేనాపో ప్రియంధామ ముపాగచ్ఛన్నుపదేవాను పాపాం ప్రియంధామ గచ్ఛత్యుపదేవానాం జయతి పరమంలోకం యఏవం వేదయైనం విద్వానేతదపోనప్త్రీయం కురుతే॥

"సరస్వతీనది వద్ద ఋషులు సత్రయాగ మారంభించిరి, వారు ఐలూషుఁ డయిన కవషుని దాసీపుత్రుఁడును కితవుఁడును అబ్రాహ్మణుఁడు నయిన నీఁ డెట్లు మామధ్య దీక్షితుఁడగునని సోమమునఁ జేరనీయక వాఁడు నీరు త్రాగక పిపాసచేత చావవలెనని సరస్వతీనది పొంతనుండి వానిని తఱిమివేసిరి. వాఁడడవిలో పిపాసార్తుఁడయి యుండి ప్రదేవత్రా బ్రహ్మణేత్యాది జలమంత్రమునుకని, జలము గల ప్రియస్థానమునకు పోఁగా జలము వానిని సమీపించి సరస్వతి వానిచుట్టును ప్రవహింపఁగా ఋషులు దేవతలే యనుగ్రహించినందున మనము వానిని పిలుతమని వానిని పిలుచుకొనివచ్చి, తామును ప్రదేవేత్యాది జలమంత్రమును పఠించి, అందుచేత నుదకము యొక్క ప్రియధామమును పొందిరి. దీనిని తెలిసికొని జలస్తోత్రము చేయువాఁడు జలప్రియధామమును పొంది, జల దేవతల లోకమును జయించును." అని యైతరేయబ్రాహ్మణముయొక్క ద్వితీయపంచిక పందొమ్మిదవ ఖండమునందు ఋషులు దాసీపుత్రుఁ డయిన కవషునిఁ దమలోఁ జేర్చుకొని వానితో మంత్రపఠనము చేసి నట్లు చెప్పఁబడి యున్నది. ఈ ప్రకారముగానే ఛాందోగ్యోపనిషత్తు నందు తండ్రి యెవ్వరో తెలియని సంకరునిగూడ ఋషులు బ్రాహ్మణు నిగాఁ జేకొన్నట్టు చెప్పఁబడి యున్నది.

సత్యకామో హ జాబాలో జబాలాం మాతరమామంత్రయాం
చక్రే బ్రహ్మచర్యం భవతి వివత్స్యామి కిం గోత్రో న్వహమ స్మీతి ౧
సా హైన ముమాచ నాహ మేతద్వేద తాత యద్గోత్ర స్త్వమసి।
బహ్వాహం చర న్తీ పరిచారిణీ యౌవనే త్వా మలభే సా హా మే
తన్న వేద యద్గోత్రి స్త్వమసి। జబాలా తు నామాహామస్మి సత్య
కామో నామ త్వమసి ససత్యకామ ఏవ జాబాలో బ్రువీథా ఇతి. ౨
సః హారిద్రుమతం గౌతమ మేత్యోవాచ బ్రహ్మచర్యం భగవతి
వత్స్యా మ్యుపేయాం భగవ న్తమితి. 3

తంహోవాచ కింగోత్రో ను సౌమ్యాసీతి సహోవాచ నాహమేత
ద్వేద భో యద్గోత్రో హమస్మ్య పృచ్ఛం మాతరం సా మా ప్రత్య
బ్రవీద్బహ్వహం చరన్తీ పరిచారిణీ యౌవనే త్వామలభే సాహమేతన్న
వేద యద్గోత్రస్త్వమసి । జబాలా తు నామాహమస్మి సత్యకామో
నామ త్వమసీతి సో౽హం సత్యకామో జాబాలో౽స్మి భో ఇతి. ౪
తంహోవాచ నైతదబ్రాహ్మణో వివక్తుమర్హతి । సమిధం సౌమ్యా
హరోప త్వా నేష్యే న సత్యాదగా ఇతి తముపనీయ కృశానా మ
బలానాం చతుశ్శతా గా నిరాకృత్యోవాచేమాః సౌమ్యాను
సంవ్రజేతి । తా అభిప్రస్థాపయన్నువాచ నాసహస్రేణా
వర్తేయేతి సహ వర్షగణం ప్రోవాస తా యదా సహస్రం సంపేదుః॥

"జబాలకొడుకైన సత్యకాముఁడు తల్లియైన జబాలను బిలిచి నేను బ్రహ్మచర్యము చేయఁబోవుచున్నాను గనుక నాగోత్రమేదో చెప్పుమని యడిగెను :—'నాయనా! నీగోత్రమేమో నాకు తెలియదు. యౌవనమునందు పరిచారిణినయి పలువురతో తిరిగితిని. నీగోత్రమేదో నే నెఱుఁగను. నాపేరు జబాల, నీపేరు సత్యకాముఁడు; జబాల పుత్రుఁడనైన సత్యకాముఁడనని (ఆచార్యునితో) చెప్పు' అని తల్లి చెప్పెను. హారిద్రుమంతుని కొడుకైన గౌతముని యొద్దకుఁ బోయి దేవరవారికడ బ్రహ్మచర్యమును చేయఁగోరి వచ్చినాఁడనని యతఁడు చెప్పెను. నీగోత్రమేమని గౌతముఁడడిగెను. 'అయ్యా! నాగోత్రమేమో నాకు తెలియదు. నాతల్లి నడుగఁగా నామె యౌవనమునందు నేననేకులకు పరిచారిణినయి తిరిగి నిన్నుఁ గన్నదానను. నీగోత్రమేదో నాకును తెలియదు. నాపేరు జబాల; నీపేరు సత్యకాముఁడు' అని చెప్పెను. నేను జాబాలుఁడను; సత్యకాముఁడను—అని యతఁడు చెప్పెను. 'ఇది బ్రాహ్మణుఁడు కాని వాఁడు చెప్పఁజాలఁడు. సత్యము తప్పనివాఁడవు గనుక నీవు సమిధను

తీసికొని యిటు రమ్ము' అని (యాచార్యుఁడు) ఉపనయనముచేసి, చిక్కి బలహీనములయిన నన్నూరుగోవులనిచ్చి, 'ఓసౌమ్యా! వీనిని వెంటఁ గొనిపొమ్ము' అని చెప్పెను. అతఁడు బయలుదేఱుచు 'ఇవి వేయియగు వఱకును రాను' అని సహస్రసంఖ్య వృద్ధియగువఱకును బహుసంవత్సరములు ప్రవాసము చేసెను.' అని ఛాందోగ్యోపనిషత్తులోని చతుర్థ ప్రపాఠక చతుర్థఖండమునఁ జెప్పఁబడినది. దీనినిబట్టి చూడఁగా పూర్వకాలమున సత్యమునందత్యంతగౌరవ ముండినట్టును, సత్యము పలుకువాఁడు జాతిచేత నెట్టివాఁడయినను బ్రాహ్మణుఁడుగా నంగీకరింపఁబడుచుండినట్టును దృఢపడుచున్నది. ఇంతవఱకును జూపినదానివలన కొంతకాల మార్యులలో వర్ణవిభాగమే లేదనియు, వర్ణభేద మేర్పడిన తరువాత సహితము గుణసంపదనుబట్టియు జ్ఞానసంపదనుబట్టియు క్షత్రియ వైశ్య శూద్రులు మాత్రమేకాక జారజులు మొదలయిన వారుకూడ బ్రాహ్మణులుగా నంగీకరింపఁబడుచు వచ్చిరనియు, తెలియవచ్చుచున్నది గదా? బ్రాహ్మణు లన్యవర్ణములోని కన్యలను వివాహమాడుచు వచ్చినట్టును, అట్టివివాహములు విధివిహితములయినట్టును శ్రుతి స్మృతులు బహుముఖముల ఘోషించుచున్నవి. ఈవిషయమయి ప్రమాణవచనము లుదాహరించుట మానివేసి, శూద్రకన్యను బ్రాహ్మణుఁడు స్వీకరించి నట్టును శూద్రుఁడు వేదాధ్యయనము చేసినట్టును జూపెడి యొక్క శ్రుతివాక్యమునుమాత్రము చెప్పి తరువాత భోజన ప్రతిభోజనాదులను గూర్చిన ధర్మశాస్త్రవచనములను గొన్నిటి నుదాహరించెదను.

> తదుహజానశ్రుతిః పౌత్రాయణః షట్ఛతాని గవాం నిష్క మశ్వతరీరథం తదాదాయ ప్రతిచక్ర మేతం హాభ్యువాద. ౧
>
> రైక్వే మానిషట్ఛతాని గవామయం నిష్కోయ మశ్వతరీరథోనుమ ఏతాంభగవో దేవతాగ్ంశాధియాందేవతాముపాస్స ఇతి ౨

తముహపరః ప్రత్యువాచాహ హారేత్వా శూద్ర ...ముమును, చము
రస్త్వితి తదుహపునరేవ జానశ్రుతిః పౌత్రాయణ స... డు శూద్ర
గవాం నిష్క మశ్వతరీరథందుహితరం తదాదాయ ప్రతిచ... యమున
తగ్ హాభ్యువాద రైక్వేదగ్ సహస్రంగవామయంనిష్కోయమశ్వతరీ... టను
మియంజాయాయంగ్రామో యస్మిన్నాస్సే న్వేవ మా భగవశ్శా... ధి
తస్యాహ ముఖముపోద్గృహ్ణన్నువాచాజహారే మా శూద్రానేనైవ
ముఖే నాలాపయిష్యథా ఇతితేహైతే రైక్వపర్ణానామ మహావృ
షేషు యత్రాస్మా ఉవాస స తస్మైహోవాచ. ౫

"అప్పుడు పౌత్రాయణుఁడగు జానశ్రుతి యాఱు నూఱుగోవు
లను ధనమును రెండు కంచరగాడిదలను బండిని గొనిపోయి యతనిని
గూర్చి యిట్లనియెను. ౧

"ఓరైక్వా! ఈ యాఱునూఱు గోవులను, ఈ ధనమును,
కంచరగాడిదలను, రథమును గైకొని మీరుపాసించు దేవతను నాకుప
దేశింపుఁడు. ౨

'ఓశూద్రా! ఈహారమును గోవులను నీయొద్దనే యుంచుకొమ్ము'
అని యతఁడుత్తరము చెప్పెను. అప్పుడు పౌత్రాయణుఁడైన జానశ్రుతి
వేయిగోవులను ధనమును కంచరగాడిదలను రథమును తనపుత్రికను దీసి
కొని మరల నతనివద్దకు వచ్చెను. 3

(జానశ్రుతి) యిట్లనియెను—"ఓరైక్వా! ఈ సహస్రగోవులను
నిష్కములను కంచరగాడిదలను పూన్చినబండిని ఈభార్యను కాపుర
ముండు గ్రామమును గైకొని నాకుపదేశింపుము. ౪

ఆమెను కానుకగా నిచ్చిన కారణమును తెలిసికొని యతఁ
డిట్లనియెను—'ఓశూద్రా! ఈమె మూలమున నీవు విద్యోపదేశమున
కర్హుఁడ వయినావు—అని దేశములో రైక్వపర్ణ మనఁబడిన యాగ్రామ
మునందు వానికి జ్ఞానోపదేశము చేసెను.' ౫

తీసికొని యిటు ఛాందోగ్యోపనిషత్తు చతుర్థప్రపాఠకములోని ద్వితీయ బలహీనముఁకు జానశ్రుతి యను శూద్రుఁడు రైక్వుఁడను బ్రాహ్మణుని గొనిపోవ కాఱునూఱుగోవులు తీసికొనిపోయి తనకు విద్యోపదేశము వలయునని వేడఁగాఁ నతఁడు నిరాకరించినందున మరల వేయిగోవులను తనకొమార్తెను దీసికొనిపోయి సమర్పింపఁగా నాబ్రాహ్మణుఁ డాచిన్న దానిని భార్యనుగా స్వీకరించి వానికి బ్రహ్మవిద్యోపదేశము చేసినట్లు కంఠోక్తిగా చెప్పఁబడి యున్నది. హీనజాతులవా రగ్రజాతులవారు కావచ్చినందుకును బ్రాహ్మణులు హీనజాతిస్త్రీలను పరిణయముకావచ్చి నందుకును, కొన్నిదృష్టాంతములు చూపఁబడినందున నింక భోజనాది కమునుగూర్చి కూడ కొన్ని స్మృతివాక్యము లుదాహరింపఁబడవలసి యున్నవి.

"శ్లో॥ ధర్మేణాన్యోన్యభోజ్యాన్నా ద్విజాస్తు విదితాన్వయాః"

అని వ్యాససంహిత మూడవ యధ్యాయమం దొండొరుల వంశమును దెలిసిన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యు లొకరియన్నము నొకరు తినఁదగి నవారని చెప్పఁబడినది. ద్విజులలో నన్యోన్యభోజన మీ కలియుగమున నిషేధింపఁబడినదని యెవ్వరైనఁ జెప్పవత్తురేమో! కలియుగమునకు పరమప్రమాణమయిన పరాశరస్మృతి యీవిషయమున నేమి విధించు చున్నదో చూడుఁడు,—

శ్లో॥ క్షత్రియశ్చాపి వైశ్యశ్చ క్రియావంతౌ శుచివ్రతౌ ।
తద్గృహేషు ద్విజైర్భోజ్యం హవ్యకవ్యేషు నిత్యశః ॥ ౧౨
ఘృతం క్షీరం తథా తైలం భక్ష్యం స్నేహేన పాచితమ్ ।
గత్వా నదీతటే విప్రో భుంజీయా చ్ఛూద్రభోజనమ్ ॥ ౧౩

"క్షత్రియుఁడుగాని వైశ్యుడుగాని క్రియావంతులై శుచివ్రతులైన పక్షమున వారిగృహములయందు నిత్యమును హవ్యకవ్యములయందు

ద్విజులు భోజనము చేయవచ్చును. నేతిని, పాలను, తైలమును, చముదుతో వండిన భక్ష్యములను, నదియొడ్డునకుఁబోయి విప్రుఁడు శూద్ర భోజనమును చేయవచ్చును" అని పరాశరస్మృతి యేకాదశాధ్యాయమున బ్రాహ్మణుఁడు శుచిగానుండు క్షత్రియుని యింటను వైశ్యుని యింటను దేవకార్యములయందును పితృకార్యములయందును భోజనము చేయవచ్చునని చెప్పుటయేకాక ప్రయాణాదులలో నదీతీరమునందు శూద్ర భోజనము చేయవచ్చునని విధించుచున్నది. నదీతీరమునందు సమస్త శూద్రులభోజనమును స్వీకరింపవచ్చునని యిందుఁ జెప్పఁబడినను, ఇతరస్థలములయందు ద్విజులు కొందఱు శూద్రుల భోజనమునుమాత్రమే భుజింపవచ్చునని స్మృతులు చెప్పుచున్నవి.

శ్లో॥ మార్జాల నకులౌ హత్వా చాషం మండూక మేవచ।
శ్వగోధోలూక కాకాంచ శూద్రహత్యావ్రతం చరేత్॥

అని యేకాదశాధ్యాయమునందు శూద్రుని జంపినందునకయి పిల్లిని ముంగిని కప్పను బల్లిని జంపినందుకు విధించిన ప్రాయశ్చిత్తమునే విధించినట్టియు,—

శ్లో॥ సహాసన మభిప్రేప్సు రుత్కృష్టస్యాపకృష్టజః।
కట్యాం కృతాంకో నిర్వాస్యః స్ఫించం వా స్యావకర్తయేత్॥

అని యష్టమాధ్యాయమునందు బ్రాహ్మణునితో సహాసనమును గోరు శూద్రునికి తుంటిమీఁద వాతవేసికాని పిఱ్ఱలు కోసిగాని వెడలఁగొట్టుట శిక్షగా విధింప ననుగ్రహించినట్టియు మనువుకూడ భోజనవిషయమున,—

శ్లో॥ ఆర్ధికః కులమిత్రంచ గోపాలో దాసనాపితౌ।
ఏతే శూద్రేషు భోజ్యాన్నా యశ్చాత్మానం నివేదయేత్॥

అని చతుర్థాధ్యాయమునందు వ్యవసాయము చేయువారును, కులమిత్రులును, గొల్లలును, దాసులును, మంగలులును, (సేవకు)

తమ్మర్పించుకొనువారును అయిన శూద్రులలోపల బ్రాహ్మణుఁడు భోజనము చేయవచ్చునని చెప్పియున్నాఁడు. ఈప్రకారముగానే,—

శ్లో॥ నాపితాన్వయ మిత్రార్ధ సీరిణో దాసగోపకాః।
శూద్రాణా మప్యమీషాన్తు భుక్త్వాన్నం నైవదూష్యతి॥

శూద్రులయినను మంగలి, కులమిత్రుఁడు, కృషికుఁడు, దాసుఁడు, గొల్లవాఁడు, వీరియన్నము తినుట (బ్రాహ్మణునకు) దూష్యము కాదని వ్యాససంహితయందును,—

శ్లో॥ శూద్రేషు దాసగోపాల కులమిత్రార్ధ సీరిణో!
భోజ్యాన్నా నాపితశ్చైవ యశ్చాత్మానం నివేదయేత్॥

శూద్రులలో దాసుఁడు, గోపాలుఁడు, కులమిత్రుఁడు, కృషీవలుఁడు, మంగలి, ఆత్మార్పణము చేయువాఁడు, వీరిచేత భోజనము చేయవచ్చునని యాజ్ఞవల్క్యస్మృతియందును జెప్పఁబడి యున్నది. ఇవిమాత్రమే కాక కలియుగమునకయి యేర్పడిన పరాశరస్మృతియు నేకాదశాధ్యాయమునందు,

శ్లో॥ దాసనాపిత గోపాల కులమిత్రార్ధ సీరిణః।
ఏతే శూద్రేషు భోజ్యాన్నం యశ్చాత్మానం నివేదయేత్॥

దాసుఁడు, మంగలి, గొల్లవాఁడు, కులమిత్రుఁడు, కృషీవలుఁడు, తన్నర్పించుకొన్నవాఁడు, శూద్రులలో వీరియన్నమును బ్రాహ్మణుఁడు భుజింపఁదగునని విధించుచున్నది. కాఁబట్టి ధర్మశాస్త్రములు బ్రాహ్మణుఁడు సామాన్యముగా శూద్రునియింట భోజనము చేయుట కనుజ్ఞ యిచ్చుచున్నవి. అయినను మనపూర్వు లశుచిగా నుండువారితోను పాపాత్ములతోను గలిసి భోజనముచేయఁగూడదని కొన్ని నిషేధములను జెప్పియున్నారు.

శ్లో॥ మత్తక్రుద్ధాతురాణాంచ నభుంజీత కదాచన।
కేశకీటావపన్నం చ పదాస్పృష్టం చ కామతః॥

భ్రూణఘ్నా వేక్షితంచైవ సంస్పృష్టం చాప్యుదక్యయా ।
పతత్రిణావలీఢం చ శునా సంస్పృష్టమేవ చ॥ ౨౦౮
గవాచాన్న ముపఘ్రాతం ఘుష్టాన్నంచ విశేషతః ।
గణాన్నం గణికాన్నం చ విదుషాం చ జుగుప్సితమ్॥ ౨౦౯
అభిశ స్తస్య షండస్య పుంశ్చల్యా దాంభికస్యచ ।
శుక్తం పర్యుషితంచైవ శూద్రస్యోచ్ఛిష్ట మేవచ॥ ౨౧౧
పిశునా నృతినోశ్చాన్నం క్రతువిక్రయిణ స్తథా ।
శైలూషతున్న వాయాన్నం కృతఘ్నస్యాన్న మేవచ॥ ౨౧౪

"మత్తునియొక్కయు, క్రుద్ధునియొక్కయు, రోగియొక్కయు, వెంట్రుకలకు పేనుబట్టినవానియొక్కయు అన్నమును, కాలితో త్రొక్కిన యన్నమును, ఎప్పుడును తినఁగూడదు. భ్రూణహత్య చేసినవానిచేత చూడఁబడినదియు, ముట్టుదానిచే తాఁకబడినదియు, పక్షి వాలినదియు, కుక్క ముట్టుకొన్నదియు, అగు (అన్నము తినఁగూడదు.) గోవుమూర్కొని చూచినయన్నమును, అమ్మినయన్నమును, మూఁకయన్నమును, భోగముదానియన్నమును, తెలిసినవారిచే నేవగింపఁబడును. శిక్షితుని యొక్కయు, షండునియొక్కయు, జారిణియొక్కయు, దాంభికుని యొక్కయు, పాసినట్టియు, పులిసినట్టియు, (అన్నము తినఁగూడదు.) కొండెములు చెప్పువాఁడియొక్కయు, కల్లలాడువానియొక్కయు, క్రతువిక్రయము చేయువానియొక్కయు, నటునియొక్కయు, కుట్టుపనివాని యొక్కయు, కృతఘ్నునియొక్కయు, (అన్నము తినరాదు.) అని మనుస్మృతియొక్క చతుర్థాధ్యాయమునందు జెప్పఁబడినది. దీనినిబట్టి యాలోచింపఁగా మనపూర్వులు శుచిగా నుండనివారితోను గుణహీనులతోను గలిసి భుజింపరాదని నిషేధించినట్టు కనఁబడుచున్నది గాని జాతిమాత్రముచేత, శుచియైన గుణవంతుని యింట భోజనము చేయరాదని నిషేధించినట్టు కనఁబడదు. అంతేకాక కొన్ని స్మృతులలో,—

శ్లో॥ పరపాక నివృత్తస్య పరపాకరతస్య చ ।
అపచస్య చ భుక్త్వాన్నం ద్విజశ్చాంద్రాయణం చరేత్॥
అపచస్య చ యద్దానం దాతుశ్చాస్య కుతఃఫలమ్ ।
దాతా ప్రతిగ్రహీతా చ ద్వౌ తౌ నిరయగామినౌ॥

"పరుల కన్నము పెట్టనివానియొక్కయు, పరులయన్నమునే తినువాని యొక్కయు, ఇతరులకు దానముచేయక యనుభవించువాని యొక్కయు అన్నముతిన్న ద్విజుఁడు చాంద్రాయణము చరింపవలెను. అన్యులకు దానము చేయనివానికి దానము చేయుటవలన దాత కేమిఫల మున్నది? అట్టిదాతయు ప్రతిగ్రహీతయు నిరువురునుగూడ నరకము నకుఁ బోదురు." అని గుణహీనుఁడయిన బ్రాహ్మణునితోఁ గలిసి భుజించుటయు నిషేధింపఁబడినది. ధర్మశాస్త్ర మిట్లున్నను మనలో నున్న యాచారమిప్పుడు విపరీతముగా నున్నది.

ఇంతటితో శాస్త్రప్రమాణములను దూరముగానుంచి యిప్పు డున్నరీతిగా వర్ణభేదములవలనఁ గలుగు లాభనష్టములనుగూర్చి కొంత విచారింతము. వర్ణభేదమువలన ననేకలాభము లున్నవని మనవా రనేకులు చెప్పి సంతోషించుచున్నారు. ఆ లాభములనుగూర్చి ముం దుగాఁ గొంత విమర్శింతము.

ఈదేశమునం దొక్కొక్కవర్ణము వా రొక్కొక్కవృత్తి నవలం బింప వలయునని నియమ ముండుటవలన ప్రత్యేకముగా ప్రతివృత్తిని జేయువారు కొందఱు తప్పక యుందురనియు అందుచేత నేవృత్తికిని భంగముకలుగక యే పని చేయించుకోవలయునన్నను కావలసినంత మంది పనివాండ్రు దొరుకుదురనియు, కులవృత్తులు వంశక్రమా గతము లగుటచేత తండ్రి చేసినపనినే చిన్నప్పటినుండియు చూచుచు నభ్యసించుచుండు కుమారుఁ డాపనియందు నిపుణుఁడగుట సంభ వించు చున్నదనియు, తన్మూలమున శిల్పాదు లభివృద్ధి యగుటకు

కారణమగుననియు అనేకుల యభిప్రాయము. ఈ యభిప్రాయము
కొంతవఱకు సరియైనదనుటకు సందేహము లేదు. తండ్రి చేసినపనినే
కొడుకును జేయుచుండుటవలనఁ గొన్ని విషయములలో శిల్పాదులు
కొంతయభివృద్ధి చెందుచున్నను, ఆయాజాతులవా రాయా వృత్తులనే
యవలంబించి యుండవలెనన్న నిర్బంధముండుటచేత నాయాపనుల
యందు విశేషాభిరుచిగలవా రాయా పనులయందుఁ బ్రవేశింప వలను
పడక సామాన్యముగా శిల్పాదులవృద్ధికి భంగము కలుగుచు, అవి
యీదేశమునందు పొందవలసినంత యభివృద్ధిని పొందఁజాలకున్నవి.
ఎట్లనఁగా—చిత్రకారునికొడుకే చిత్తరువు వ్రాయవలె ననియు,
స్వర్ణకారునికొడుకే నగలు చేయవలె ననియు నియమ ముండుటను
బట్టి చిత్రకారునికుమారుఁడు బంగారపుపనియం దభిరుచిగలవాఁడయి
చిత్రములు వ్రాయుటయందు ప్రవీణత లేనివాఁడయినను, స్వర్ణకారుని
కుమారుఁడు చిత్తరువు వ్రాతయం దభిరుచి గలవాఁడయి యాభరణ
ములు చేయుటయందు నిపుణత లేనివాఁడయినను, వాఁడు తన
కేపనియం దభిరుచి గలదో యాపనియందుఁ బ్రవేశించి తనబుద్ధి
మహిమ నంతనుజూపి వన్నెకెక్కుట కవకాశము లేనివాఁడయి
యిష్టములేని కులవృత్తితోనే బాధపడవలసినవాఁ డగుచున్నాఁడు.
ఈ హేతువుచేతనే కొంతకాలముక్రిందట మన దేశమునందలి శిల్పములు
చుట్టుపట్టుల నున్న యితరదేశములకంటె నున్నతస్థితికి వచ్చినను క్రమ
క్రమముగా నంతకంత కభివృద్ధిగాంచక యా స్థితిలోనే నిలిచిపోయి
యిప్పుడు నాగరికాగ్రగణ్యులయిన దేశములవారి శిల్పములతో తుల
తూగఁజాలకున్నవి. మన దేశమునందు శిల్పాదులు సంపూర్ణ దశకు
రాలేకపోవుట కింకొక కారణముకూడ కనఁబడుచున్నది. ఏ వృత్తియం
దును విద్యాధికులు ప్రవేశించినంగాని యావృత్తి దినదినాభివృద్ధి
చెంది మహోన్నతదశకు రానేరదు. మన దేశమునందిప్పుడు శిల్పాది

వృత్తుల నవలంబించి యున్నవారు విద్యావిహీను లగుటచేత వారు తమ తండ్రితాతలు చేసినట్టుగా పనిచేయవలసినవారే కాని యిప్పటి ప్రకృతిశాస్త్రములయొక్క సాహాయ్యముచేతను యంత్రశక్తిచేతను బుద్ధిబలముచేతను నూతనమార్గములను కనిపెట్టి తమవృత్తుల నున్నత దశకు తేసమర్థులు కాకున్నారు. ఈయనర్థమునకును ముఖ్యకారణము వర్ణభేదముగానే తోఁచుచున్నది. మనదేశమునం దిప్పుడున్న వర్ణాచారములనుబట్టి కొన్నివర్ణములవారు తామే విద్యావంతను గుత్తగొనుటయు తక్కినవర్ణములవారు నిరక్షరకుక్షులగుటయు సముద్రముఁదాఁటి దేశాంతరములకుఁబోయి యేవర్ణమువారును పరదేశముల శిల్పాదులను నేర్చుకొని రాకుండుటయు తటస్థించుచున్నది. కాఁబట్టి యీహేతువులను బట్టి వర్ణభేదమువలననే పనివాండ్రు దొరకుట, శిల్పాదు లభివృద్ధి నొందుట మొదలయిన లాభములు కలుగుచున్నవని చెప్పరాదు. ఏపనినైనను చేయించుకొనువా రెక్కువగా నుండి యాపనిని నేర్చుకొన్న వారికి ప్రోత్సాహము కలుగునప్పుడు లాభకరమైన యాపనినే యనేకు లభ్యసించుట తటస్థించి కావలసినంతమంది పనివాండ్రు దొరకుచునే యుందురు. ఇప్పటివలె స్వర్ణకారులేకాని యితరులు బంగారుపని చేయఁగూడదన్న నియమము లేకపోవుట తటస్థించి దేశమునందు బహుసంఖ్యాకులు స్వర్ణాభరణములతో తమశరీరముల నలంకరించుకొనువా రయినపక్షమున, అనేకు లల్పలాభప్రదములయిన యితరవృత్తులను మాని యధికలాభకరమైన స్వర్ణకారవృత్తియందు ప్రవేశింతురనుటకు సందేహముండదు. ఇట్లు చేయుటవలన తక్కువలాభము వచ్చెడు పనులయందు తక్కువమంది ప్రవేశించుటచేత వారికి సుఖజీవనము జరగుటయు, యెక్కువ లాభము వచ్చెడుపనులయం దెక్కువమంది ప్రవేశించుటచేత తగినందఱు పనివాండ్రు దొరకుటయు కలుగుచున్నది. ఇట్లుగాక యీ వర్ణమువారే యీ పని చేయవలెనన్న నిర్బంధముండుటచేత

కొన్ని సమయములయందు కొన్ని పనులు చేయించుకొనువారి సంఖ్య కంటె చేసెడువారి సంఖ్య యెక్కువయయి యనేకులకు పనిదొరకక జీవనాధారము లేకపోవుటయు, కొన్ని సమయములయందు కొన్నిపనులు చేయించుకొనువారిసంఖ్యకంటె చేసెడువారిసంఖ్య తక్కువ యయి యనేకులకు పనివాండ్రుదొరకక యధికవ్యయము చేయవలసి వచ్చుటయు సంభవించుచున్నది.

వర్ణభేదమువలనఁ గలిగెడి యింకొకలాభము సంఖ్య తక్కువగుటచేత నొక్కొక్క వర్ణమువారిలో నధికైకమత్యమును, పరస్పరానురాగాతిశయమును, అన్యోన్యసాహాయ్య సంపదయు నుండుటయని చెప్పుచున్నారు. ఇవి యన్నియు నిజముగాఁ గలిగెడుపక్షమున వర్ణభేదమువలనఁ గొన్నిలాభములున్నవని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. అయినను లోకానుభవమునుబట్టి చూడఁగా వర్ణభేదమువలన మనదేశమునందు విపరీతగుణములు పొడకట్టుచున్నవి. వర్ణభేదమువలన ననేక వర్ణములవారిలోఁ గొన్నివిషయములయందుఁ గొంత యైకమత్యమున్నను ముఖ్యాంశములయందది యంతగాఁ గానరాదు. సుఖకాలములయందు పండుగులకును వివాహాది శుభకార్యములకును విందులారగించుటకయి కావలసినంతమంది బంధువులు చేరుదురు. కాని కష్టకాలములయందుమాత్రము తోడుపడుటకయి యీబంధువులలో నొక్కరును గానరారు. ఈ దురాచారము ముఖ్యముగా బ్రాహ్మణులలో నధికముగా నున్నది. ఈ దేశమునందలి స్మార్తబ్రాహ్మణులలో రోగాదికము వచ్చినప్పుడు చూడవచ్చి భోజనములు చేయుటకును ఉత్క్రమణగోదానాదులను చేయించుటకును చట్టములకు కొదవలేకపోయినను, ప్రాణములు పోయినతరువాత శవము నింటినుండి శ్మశానభూమికిఁ గొనిపోవలసిన పని వచ్చినప్పుడు మాత్ర మొక్కరును గానఁబడరు. భార్యాపుత్రాదులు దుఃఖసముద్రములో మునిఁగియుండి తోడుపడువారు లేక

కూలికి శవములను మోచు పుణ్యపురుషు లడిగినంత మొత్తమునిచ్చి మృతకళేబరమును ప్రేతభూమికి తరలించునప్పుడు కులమువారందఱును దూరదూరములఁ దొలఁగినను, దహనసంస్కారమయినపిమ్మట గోదానములను భూదానములను హిరణ్యదానములను సాలగ్రామదానములను గ్రహించుటకయి యెక్కడ లేనివారును గృహముచుట్టును గుంపులు గుంపులుగాఁ జేరుదురు. ఈమహానుభావులు కొన్నిసమయములయందు మగఁడు పోయి యేడ్చుచున్న యనాథయువతులను మఱింత యేడిపించి బహిష్కారములు చేసెదమని బెదరించి నగలు మొదలయినవాని నమ్మించియు ఋణములు చేయించియు వారిచేత సంతర్పణములు చేయించి తాము హాయిగా పిండివంటలతో విందారగించి, యాభాగ్యహీనురాండ్రను కూటికిపేదలను జేయుదురు. ఈవర్ణభేదమువలన నెవ్వరికో యొకానొకరికి కలిగెడు లాభములకన్న పలువురకు కలిగెడు నష్టములే యధికముగా నున్నవి.

వర్ణభేద ముండుటవలన కులమువారి భీతిచేత జనులు విచ్చలవిడిగా చెడుదారులఁబడి తిరుగక నీతిమార్గమున సంచరింతురని కొందఱందురు. అయినను లోకములో నిది మన యనుభవమునకు ప్రత్యక్షవిరుద్ధముగా నున్నది. వర్ణభేదమువలన నీతి వర్ధిల్లుటకు మాఱుగా గణనాతీతములయిన కులనిబంధనలు ప్రబలి నీతిని నామమాత్రావశిష్టము చేయుచున్నవి. ఈవిషయమయి ముందు కొంతవివరముగా వ్రాసెదను.

వర్ణభేదమువలన శుచిత్వమును పెద్దలయెడల వినయవిధేయతలును గలుగునని చెప్పుదురు. బ్రాహ్మణాదివర్ణములవారు తమ గేహములను దేహములను శుచిగా నుంచుకొనుట వాస్తవమే. కాని యీశుచిత్వమును పూర్ణముగా వర్ణభేదమున కారోపించుట మాత్రము న్యాయముకాదు. వర్ణాచారములవలనను మూఢవిశ్వాసములవలనను

యనేకవిషయములయందు శుచిత్వమునకు మారుగా నశుచిత్వమే వ్యాపించుచున్నది. స్నానముచేసి శరీరమును నిర్మలముగా నుంచుకొనుటయు శుభ్రవస్త్రములను ధరించుటయు దేహారోగ్యధర్మములలో ప్రధానములేయైనను బ్రాహ్మణులలోని పురుషులును ముఖ్యముగా స్త్రీలును నిర్మలజలమును విచారింపక యాచారప్రభావముచేత పుణ్యమనిచెప్పి బురదనీటిలో మునిగి తడిబట్టలు కట్టుకొనియు, మైలబట్టలని పిలువవలసినవానికి మడిబట్టలని పేరువెట్టి కల్మషజలములో ముంచి యారవేసినట్టి బట్టలనుగాని, వారమున కొక్కసారియైన నుతుకని దుర్గంధసహితములయిన పట్టుబట్టలనుగాని ధరించియు, శరీరారోగ్యమును చెడగొట్టుకొనుచున్నారు. ఈ ప్రకారముగానే స్త్రీలు పూర్వకాలమున మట్టికుండలను బేటికలు లేవకుండుటకయి పూయఁబడుచువచ్చిన గోమయమును పవిత్రమయిన దని శుద్ధినిమిత్తమయి యిప్పటి గచ్చునేలలకు సహితము పయోగించి గృహముల పారిశుద్ధ్యమునకు భంగము కలిగించుచున్నారు. పెద్దవారు చెప్పినవానినెల్ల వినయవిధేయతలతో గ్రహించి కులాచారములకు బద్ధులయి దాస్యము చేయుచుండుట మనలోనున్నది గాని స్వతంత్రముగా నాలోచించి కార్యనిశ్చయమును జేసికొనవలసిన పురుషధర్మమును జంపెడి యీవిధేయత యంతగా శ్లాఘ్యమైనదియు నపేక్షణీయమైనదియుఁ గాదు.

ఇప్పుడున్న ప్రకారముగా వర్ణభేదమువలనఁ గొన్నివర్ణములవారి కల్పలాభము కలుగుచున్నను, మొత్తముమీఁద దేశమునకు గణనాతీతములైన నష్టములు సంభవించుచున్నవి. ఈ నష్టములలో మొట్టమొదటిది జనులలోగల పరస్పరద్వేషము. ఈ దేశమునం దిప్పుడు బ్రాహ్మణాదులైన నాలుగువర్ణములు మాత్రమే కాక ప్రతివర్ణములోను లెక్కకెక్కుడైన యంతర్భాగము లున్నవి. ఈ దేశమునందలి వర్ణభేదములనుగూర్చి చేసిన పుస్తకములో నొకరించుమించుగా బ్రాహ్మణు

లలోఁగల తెగలపేరులు రెండువేలు తెలిపియున్నారు. ఈ తెగలవారు
తాము బ్రాహ్మణేతరులకంటె నెక్కువవారమని గర్వపడుచుండుటయే
కాక యెవరికివారు తమలోఁగూడ తామే యెక్కువవారమని తగవు
లాడుచు పరులను ద్వేషించుచు దూషించుచు సంబంధబాంధవ్యము
లను భోజనప్రతిభోజనములను మాని, జనులలో నైకమత్య మసాధ్య
మగునట్లు చేయుచున్నారు. ఈ తెగలవారిలో నొకని కధికారమబ్బి
నప్పుడు పరులలో సాధ్యమయినంతవఱకు తన తెగవారినే చేర్చుటకును
తక్కిన తెగలవారిని చేరనీయకుండుటకును సర్వవిధములచేతను బ్రయ
త్నము చేయుచుండును. వీరీద్వేషమును సమస్తవిషయములయందును
జూపించి కొన్నిసమయములయం దల్పాంశములనుబట్టి తగవులాడుచు
నొండొరులను గర్భశత్రువులనుగాఁ జూచుకొనుచుందురు. ఈ జాతిద్వేష
మగ్రవర్ణమువారయిన బ్రాహ్మణులు మొదలుకొని యధమవర్ణమువా
రయిన చండాలురవఱకును వ్యాపించి యున్నది. ఎంతటి నీచవర్ణమువాఁ
డయినను తన జాతివారిలోని తెగలలో తానధికుఁడననియు తన కధిక
స్వాతంత్ర్యములు కలవనియు శుష్కకలహములు పెట్టుకొని పనికి
మాలిన విషయములలో వివాదపడుచుండును. ఒకమండలమందు జరుగు
చుండిన జాతరలో నొకమాదిగవాఁడు సిగలో నెఱ్ఱపువ్వులు పెట్టుకొని
వచ్చినందున మాదిగలట్టిపువ్వులు ధరింపఁగూడదని తగవుపెట్టి మాలలు
దుడ్డుకఱ్ఱలుధరించి యుద్ధమునకు సంసిద్ధులుకాఁగా రాజభటులెంతో
కష్టముమీఁద తలలుబద్దలుకొట్టుకొని రక్తప్రవాహములను కట్టింపకుండ
వారిని వారించి సాగనంపిరి. అనంతములయిన యీ వర్ణభేదములు
చాలనట్టుగా మనవారు కుడిచేతి యెడమచేతి జాతిభేదము నొకదానిని
పెట్టుకొని తమలోతాము తగవులాడువారును కొన్నిసమయముల
యందు తమలోఁగల యన్యోన్యవైరమును మఱచి యొక్కతెగ

వారందఱు నొక్కటియయి రెండవతెగవారిని బాధించుటకయి యసూయాగ్రస్తులయి వీరావేశమును వహించి మితిమీఱిన చెఱుపును కలిగించుచున్నారు. ఎడమచేతివారి నవమానపఱుచుటకయి కుడిచేతివారందఱు నేకమయి తమ మానుషస్వభావమును మఱచి కాట్లకుక్కల వలె కయ్యమునకు కాలుద్రవ్వుచు చెప్పరాని క్రూరకృత్యముల కొడిగట్టుట యనేకులు చూచియుందురు. స్వర్ణకారులు తమ యింటిగోడలకు వెల్లవేసికొనిరనియు, పల్లెవాండ్రు వివాహాదిదినములలో పల్లకి యెక్కరనియు, కొంతకాలముక్రిందట బృందావనపురమునందును నీలపల్లెయందును కుడిచేతివా రెడమచేతివారిమీఁద ధ్వజమెత్తి నానావిధామాంగళ్యములను జేసియుండుట మీలో ననేకులు కనియువినియు నుందురుగదా? మనుష్యులకును మనుష్యులకును వేఱుపాటు కలుగఁజేసి యొకటివారు తమగోడకు వెల్లవేసికొన్నను చూచి సహింపలేనంత ఘోరరాక్షసత్వమును మనుష్యులకుఁ దెచ్చిపెట్టినది యీ వర్ణపిశాచమే కదా? ఈ పిశాచ మిట్లు పండితులు మొదలుకొని పామరులవఱకును గల సమస్తజనుల హృదయములలోను నెలవుకొని నిరంకుశాధికారమును చెల్లించుచుండఁగా మనదేశ మెట్లు పురోభివృద్ధికి రాఁగలదు? తమ యాచారములలో దేశక్షేమకరములయిన చిన్నమార్పులను సహితము చేసికొన సాహసింపలేని పరమభీరువులయి యున్న హిందూమహాజనులు క్రూరపరాచారపిశాచప్రేరణముచేత నకార్యకరణమునందెక్కడలేని ధైర్యమును వహించి ప్రాణములకు తెగించి పోరాడుట మహాద్భుతముగా నున్నది.

ఈ వర్ణభేదము మనదేశమునకు కలిగించిన గొప్పనష్టములలో నొకటి దయాదాక్షిణ్యములను, నీతిని హృదయములనుండి పాఱఁదోలి మనుష్యులను మృగములనుగాను క్రూరరాక్షసులనుగాను మార్చుట. మనదేశమునం దిప్పుడు నీతి యడుగంటి దానిస్థానమున జాతికట్టు

పాటులే పరమాదరణీయము లయినవి. ఒకఁ డగ్నిసాక్షికముగా వివాహమాడిన కులాంగనను విడిచి బహిరంగముగా వారాంగన నుంచుకొన్నను రహస్యముగా పరకులసంసారములు పాడుచేయుచున్నను, అట్టివాఁడు మొగమున విభూతిరేఖలు ధరించి బిళ్ళగోచి పెట్టి స్నానము చేసియో చేయకయో జుట్టుచివర ముడివైచుకొనువాఁడైన పక్షమున జాతిబాహ్యుఁడు గాక నిష్ఠాగరిష్ఠుఁడును సదాచారసంపన్నుఁడును నగుచున్నాఁడు. చౌర్యముచేసియో నరహత్యచేసియో చెఱసాలలోఁ బడి తప్పించుకొని వచ్చినవాఁడు కులమునకు వెలిగాక పంక్తిభోజనమున కనర్హుఁడుగాక, దాహశాంతియగుటచేత సచ్ఛూద్రునిచేతి మంచినీళ్ళు గిన్నెడు త్రాగినవాఁడు కులభ్రష్టుఁడును నపాంక్తేయుఁడు నగుచున్నాఁడు. ఓహో! ఈ వర్ణపిశాచముయొక్క ప్రభావము నేమన వచ్చును! గర్భపాతములను శిశుహత్యలను చేసిన క్రూరాత్ములు పతితులుగాక తన కడుపునఁబుట్టిన బాలవితంతువులకు విధ్యుక్తముగా వివాహము చేసిన కరుణార్ద్రహృదయులు పతితులగుచున్నారు! కల్లు త్రాగి లేదని కల్లలాడి యిల్లాలిని విడనాడి యిల్లు తనుల్లి పెంచిన మేనును గుల్లచేసికొని తొత్తులయిండ్లకు నిత్యయాత్రలు చేయుచు భక్తవేషము వేయు వంచకు లగ్రపంక్తి కర్హులయి విద్యాలాభము నిమిత్తమును స్వదేశక్షేమము నిమిత్తమును ద్వీపాంతరయాత్రలు చేయు ఋజుమార్గులు పంక్తిభోజనమున కనర్హులగుచున్నారు. ఏమి పాపము పండినదో కాని మనదేశమునం దిప్పుడు నీతిమార్గమును తొలఁగని సద్వర్తనము యోగ్యమయినదిగా పరిగణింపఁబడక నీతి మాలిన బాహ్యనటనము యోగ్యమయినదిగా భావింపఁబడు నంతటి వైపరీత్యము సంభవించినది. కల్లల గొడిగట్టి కూటసాక్ష్యములు పలికి దర్దానములు పట్టి పొట్టపోసికొను కుక్షింభరాధములు తమ దుశ్చరిత్ర

మునకు సిగ్గుపడుటకు మాఱుగా సత్యసంధులయి యణుమాత్రమును ధర్మమార్గము నతిక్రమింపక కష్టార్జితధనముతో జీవనముచేయు బ్రాహ్మణేతరులకంటెను జాతిమాత్రముచేతనే తా మధికుల మయితి మని గర్వపడుచు వారి గాలి సోఁకినను తాము మైలపడుదుమని భావించుచున్నారు. ఇట్టి దుర్గర్వముచేత మనుష్యలక్షణములైన దయాదాక్షిణ్యాదులును నీతియు మనవారి హృదయావాసములనుండి పాఱిపోఁగా వానిస్థానమున రాక్షసగుణములైన నిర్దయత్వాదులును దుర్నీతియు హృదయకుహరములయందు ప్రవేశించి యథేచ్ఛముగా రాజ్యము చేయుచున్నవి. అగ్రజాతివారమని గర్వపడు ఛాందసులు తమ కన్నులయెదుట చెట్టువిఱిగి శూద్రునిమీఁద పడినను పయికీఁదీయక దయాశూన్యులయి, తాఁకినచోఁ దమకు మైలసోఁకునని దూరముగా తొలఁగుచున్నారు. ప్రయాణమధ్యమున మండువేసవికాలములో దారిప్రక్కను తక్కువకులమువాఁడు వడగొట్టి పడి ప్రాణములు విడుచు చున్నను వానినంటినఁ దా నశుచి నగుదునని భయపడి యాదాఁరిని బోయెడు వేదజడుఁడగు బ్రాహ్మణోత్తముఁడు తనచెంబులోని నీటిబొట్టొక్కటియైనను వానినోటఁ బోయు పాపమునఁబోవఁడు. ఈ హేతువు చేతనే యాత్రలు సేవింపఁబోవు బీదలనేకులు, వ్యాధిగ్రస్తులయి పుణ్యక్షేత్రములకుఁ బోవు దారులలో వీధిప్రక్కలనుబడి చూచుదిక్కు లేక స్వదేశజనులనడుమనే కుక్కలవలెఁ జచ్చుచున్నారు. అట్టివా రొక్క వేదమునే నమ్మి యొక్క మతమునే యవలంబించి యొకదేవతనే యారాధించువారైనను వారేవర్ణమువారో తెలియని దోషముచేత వారికెవ్వరును తోడుపడరు. స్వదేశస్థులు మార్గమధ్యమున రోగ పీడితులయి దిక్కుమాలి చచ్చుచున్నప్పుడు తోడిమానవులు చూచి తోడుపడక యుపేక్షించుటకంటె నవమానకరమైన క్రూరకృత్యము మఱి యేముండును? వర్ణపిశాచముయొక్క ప్రేరణముచేతఁ గాక

పోయినయెడల మానవజన్మమెత్తిన వాఁడెవ్వఁడు నిసర్గదయాగుణమును విడిచి యిట్టి కటికిమనసు పూనఁగలఁడు? ఈ వర్ణపిశాచావేశముచేత మనుష్యులు తోడిమానవులను మృగములకంటెను నీచముగాఁ జూచుచు తామందువలన నధికుల మైతిమని విఱ్ఱవీఁగుచున్నారు. నిర్మలనీతిచేత పవిత్రములుగాని యీ మహానుభావుల హేయకాయములు తోడిమానవుల స్పర్శనమువలననేకాక దర్శనమువలనఁ గూడ నపవిత్రము లగునఁట! బురదలో పొరలివచ్చిన మహిషము కాయశుద్ధిచేసినను స్నానముచేయక భుజించు భూదేవోత్తముఁడు వైశ్యుని చేయి సోఁకినమాత్రమున తినుచున్న యన్నము విడిచి లేచిపోవుచున్నాఁడు. కుక్కగాని గాడిదగాని యెదుటనుండి చూచుచున్నను లేవక భక్షించెడు వైశ్వదేవపరుఁడు తోడిమానవుఁడైన శూద్రుఁడు దూరమున కంటఁబడినను ముందటివిస్తరి విడిచి శపించుచు లేచిపోవుచున్నాఁడు. మనదేశమునం దనేకు లిట్టి యకృత్యములచేతనే తాము భూదేవతలయి దేవతలకు దేవతల మైతి మని సంతోషించుచున్నారు. ఓ వర్ణభూతమా! నీ వెంత చక్కగా మావారిమతి చెఱిచితివి! నీ దెంత మొండిబలమో కాని సుజ్ఞానమంత్రాక్షరములును నిన్నొక పట్టున పాఱఁదోలఁ జాలకున్నవి. దయాగుణము దేవత్వసూచకము, నిర్దయత రాక్షసత్వసూచకము. నిజమైన దేవత్వము నపేక్షించు వారందఱును దయాగుణమును పూని తోడిమానవులను సోదరభావముతోఁ జూచుచు నితరులు సుఖించునప్పుడే తాము సుఖించునట్లు నేర్చుకొనవలెను. ఈ నిజమైనదేవత్వము నపేక్షించు వివేకము లేకపోవుటచేతనే వర్ణపిశాచావిష్టులు ప్రజాక్షేమకరములైన మంచిమార్పులను నిరోధించు రాక్షసత్వమును వహించుచున్నారు. వివేకియైన బ్రాహ్మణుఁ డొక్కఁడు తాను గన్న ప్రియపుత్రిక సుఖ మపేక్షించి భర్తతో కాపురము చేయఁదగిన యుక్తవయస్సు వచ్చిన పిమ్మటనే

వివాహము చేసెదనని సంకల్పింపఁగానే వర్ణపిశాచము నోరు తెఱచు కొని పరుగెత్తుకొనివచ్చి 'నీ పుత్రికకు ప్రాయమురాని పసితనములోనే పెండ్లి చేయనియెడల మ్రింగివేసెద' నని బెదరించుచున్నది. ఆ భూదేవుఁడు భయపడి పండ్లురాని పసికూనకే పెండ్లిచేసి విందులు పెట్టి వర్ణభూతమును సంతోషపెట్టి తన యల్లుని నా భూతము పొట్టఁబెట్టు కొన్న తరువాత మరల కొంతధైర్య మవలంబించి తన ముద్దులబిడ్డ యొక్క వైధవ్యదుఃఖమును మాన్పుటకుఁ గొంచెము ప్రయత్నము చేయఁగానే, మొదట వివాహము చేయించి భర్తను మ్రింగిన వర్ణ భూతమే మరల వచ్చి తొంటికంటెను వికృతముగా నోరు తెఱచి యఱచుచు 'నీ బిడ్డకు మరలఁ బెండ్లిచేసితివా నిన్ను బహిష్కారదంతము లతో కొఱికి తినెద' నని మరల వెఱపించు చున్నది. ఇట్టి ఘోరకృత్యములు చేసెడు పెనుభూతము మఱి యే యకృత్యము చేయ సంకోచించును ? నాథుని గోల్పోయి యేడ్చుచున్న యనాథకాంతను మగని శవముతో కట్టఁగట్టి కాల్చుమని బోధించెడు వర్ణభూతము వింతతువును నీ నగలమ్మి నాకు సంతర్పణము చేయుమని నిర్బంధింప కుండునా? జ్ఞానులయి యీశ్వరసేవ చేయఁగోరు పురుషులనే తనకు దక్షిణలిచ్చి, విగ్రహములను గొలుచుచు, జ్ఞానమును పడటఁ గలవని పక్షమున నిగ్రహించెదనని వ్యగ్రత చూపెడు వర్ణభూతము, విద్య నేర్వక యజ్ఞానాంధకారమున మునిఁగి యుండవలసినదని స్త్రీలను బాధించుటకు సందేహపడునా? ఈపాడుపిశాచము వయసువచ్చిన కన్నెలను వయసు వచ్చిన వరులకిత్తుమనువారిని మ్రింగఁ జూచుచున్నను, వయసురాని కన్నెలను వయసుజాఱిన ముదిపెండ్లికొడుకులకు వివాహమిషమున బలిపెట్టు పెద్దలను తన దీర్ఘబాహులతో నాలింగనము చేసికొని వారి వలన సంభావనల నొందుచున్నది. అనాథయైన పసిబాలికకు వివా

హోము చేయుదుమను వారిని విడుచుకొని తినఁజూచుచున్నను ఉన్న భార్యను దుఃఖపెట్టి పెక్కు భార్యలకు మంగళసూత్రములు కట్టి వెలయాంగ్రపాదములు పట్టు దిట్టలయెడ సౌభ్రాతము నెఱపి వారివలన సమ్మానము నొందుచున్నది. హెరిగినఁగాని విడుగుట తటస్థింపదు గాన నిజవినాశముకొఱకే యీ రాక్షసకృత్యము లిట్లు వర్ధిల్లుచుండి యుండవచ్చును.

ఈ వర్ణపిశాచ మీదౌర్జన్యములతో తృప్తినొంది యుండక చెలరేగి జనులయొక్క దేహబలాభివృద్ధిని జ్ఞానబలాభివృద్ధిని దేశముయొక్క ధనాభివృద్ధిని శిల్పాదినకలకలాభివృద్ధిని కూడ తనపొట్టను బెట్టుకొనుచున్నది. ఈ పిశాచముయొక్క యుపదేశమువలన నడుచుచున్న క్రూరకర్మలలో నొక్కటియైన శిశువివాహమునుగూర్చి యీవఱకే కొంచెము సూచన చేసి యున్నానుగదా! ఈ యపాత్రవివాహములవలన పిల్లలుగా నుండి యాడుకొనుచుండవలసిన కాలములోనే పిల్లలు తల్లులయి దుర్బలులగుట సంభవమగుచున్నది. పిల్లలు తల్లులయ్యెడు వింతదేశములో పిల్లవాండ్రు తండ్రులగుట యాశ్చర్యము కాదుగదా? ఇతరదేశములలో సంసారదుఃఖమెఱుఁగక హాయిగా చదువుకొనుచుండెడి యిరువదియేండ్ల బాలురు వర్ణభూతపరిపాలితమయియున్న యీ దేశములో ముగ్గురు బిడ్డలతండ్రులయి పుత్రశోకాది సంసారదుఃఖముల పాలయి చదువు మానవలసినవా రగుచున్నారు. బాలురకును బాలలకును పుట్టిన బిడ్డలు స్వభావముచేతనే దుర్బలులగుచుండఁగా, ఆ పయిని బాలమాతలాటలుమరిగి యుపేక్షచేయుటచేతను పెంచుటకు చేతఁగాక చెడఁగొట్టుటచేతను వారు మఱింత బలహీనులగుచున్నారు. భూదేవతలు ప్రధానదేవతనుగా బూజించెడి యీ వర్ణాపమృత్యుదేవతయొక్క సంపూర్ణకటాక్షము మన దేశముమీఁద చిరకాలము ప్రసరించిన పక్షమున

ముందు మన సంతతివారు పురాణములయం దభివర్ణింపఁబడిన యంగుష్ఠ మాత్రశరీరులయిన వాలఖిల్యులో, కలిప్రభావప్రస్తావనయందు వర్ణింపఁబడిన నేలములగచెట్లకు నిచ్చెనలువేయు మహోన్నతపురుషులో యయి యిప్పటివారు పురాణకర్తల కారోపించెడు సర్వజ్ఞత్వమును సత్యము చేయక మానరు. మనవారియొక్క దుర్బలస్థితి కీబాల్యవివాహపీడ యొక్కటి చాలనట్లుగా హేయకార్యములను కల్పించుటలో విసుగుచెందని వర్ణభూతము ప్రతివర్ణములోను గణనాతీతములైన యంతర్భాగములను సృష్టించి యిచ్చి పుచ్చుకొనఁదగు బంధుచక్రముయొక్క వృత్తమంతకంతకు చిన్నది యగునట్లు చేయుచున్నది. దగ్గఱబంధువులలోనే తఱచుగా వివాహకార్యములు చేయుచుండుటవలనఁ గలిగెడు శిశువులు బలహీనులగుటయేకాక యల్పాయుష్కులును రోగిష్ఠులు నగుదురని వైద్యశాస్త్రజ్ఞులు మొఱ్ఱపెట్టుచున్నారు. అయినను వర్ణభూతముయొక్క మహాఘోషముముందఱ వారి మొఱ్ఱ యెవ్వరికిని చెవి సోఁకకున్నది. కన్యావిక్రయము, వృద్ధవివాహము మొదలయిన యనర్థము లనేకము లీదురాచారవిషలతయొక్కయు, బాల్యవివాహకంటకవృక్షముయొక్కయు దుష్ఫలములే. ఇట్లు వర్ణభూతము జనులయొక్క దేహబలమును చెడఁగొట్టుటయేకాక జ్ఞానబలమునుకూడ చెడఁగొట్టుచున్నది. లోకములోనే దేశమునందు జూచినను జ్ఞానము మనుష్యలక్షణముగా పరిగణింపఁబడుచున్నది. ఇఁక మన దేశమునందో యీశ్వరుఁడు జ్ఞానాభివృద్ధిని బొందుఁడని బోధించుచుండఁగా, వర్ణభూతము జ్ఞానమును విడిచి మూఢులుకండని బోధించుచున్నది. వేదము శూద్రులును తిన్నభ్యసింపవచ్చునని చెప్పుచుండఁగా, వర్ణపిశాచము వేదాక్షరములు విన్న శూద్రునిచెవిలో సీసము కాచిపోయుమని చెప్పుచున్నది. ఏమి యీ సాహసము

ఎవ్వరో కొందఱే కాని దేవునిఁ దెలిసికొని యానందించుటకు దేవుని బిడ్డలందఱు నర్హులు కారఁట! స్వప్రయోజనపరులైన కొందఱు సర్వ జనులను మూఢత్వమున ముంచి, దేవతారాధనమును మాని తమ్మా రాధించుటయే పరమార్థమని బోధించుటచేత పరులను చెఱిచి తాము పాడగుచున్నారు. ఒరులను జెఱుపఁదలఁచుకొన్నవాఁ డెప్పుడును తాను బాగుపడఁడు. తమ పాదధూళి శిరమునఁ దాల్చు టయే పరమార్థమని యితరులకు సదా బోధించుచుంటచేత వారి కదియే విద్యయయి సత్యవిద్యలన్నియు మూలఁబడినవి. అందుచేత పర్వతములకును నదులకును బిడ్డలు పుట్టుట వారికి గొప్పసత్యము. కల్లుసముద్రములును నేతిసముద్రములును వారి భూగోళశాస్త్రము. సూర్యచంద్రులను పెద్దపాము మ్రింగుట వారి ఖగోళశాస్త్రము. స్వకాయకష్టము విడిచి యిట్టి సత్యములు బోధించి జీవించుట వారి కులవృత్తి. ఇట్టి జ్ఞానవంతులు తామే సర్వజ్ఞుల మనుకొని యున్న నాలుగుశాస్త్రములను తామే యభ్యసించి యితరులను చదువనీయక పూర్వోక్తసత్యములను ప్రవచించియే యాత్మభరణము చేసికొనుట చేత వారికి నిజమయిన జ్ఞానమును సంపాదించుటకుఁగాని వృద్ధిపొం దించుటకుఁగాని జనులలో వ్యాపింపఁజేయుటకుఁగాని యావశ్యకము లేకపోయినది. అందుచేత క్రొత్తవిద్యలు రాకపోఁగా క్రమక్రమముగా నున్నవిద్యలుసహితము నశించి, వారి కితరుల వంచించుటలే కులవిద్య లయినవి. ఈ కారణమునుబట్టి మన దేశమునందు భూజనులకు మాత్రమే కాక భూదేవతలకుఁగూడ జ్ఞానవృద్ధి లేక మూఢత్వము సంప్రాప్త మయినది. మన దేశముయొక్క బీదతనమునకుఁగూడ కొంతవఱ కీవర్ణభూతమే కారణము. ఈ భూతము చెమటయూడ్చి కష్టపడి స్వతంత్ర జీవనముచేయుట హేయమనియు, పాటుపడక మానము విడిచి పరు

లను యాచించి తేరతిండితిని బ్రతుకుట యుపాదేయమనియు, విప రీతోపదేశము చేసి మనవారిలో ననేకులను సోమరిరాజులను జేసి నది. అందుచేత కాయపుష్టి గలిగి పాటుపడి స్వతంత్రజీవనము చేయుచు గతిలేనివారిని పోషించుచు దేశమును భాగ్యసంపన్నముగాఁ జేయ శక్తిగల దృఢగాత్రులు సహితము శరీరకష్టపడుట యవమానకరముగాను తిరిపెమెత్తుట గౌరవావహముగాను భావించుచు, భక్తులమనియు బ్రాహ్మణులమనియు సన్యాసులమనియు తీర్థవాసులమనియు గుళ్ళు కట్టించెదమనియు చలిపందిళ్ళు పెట్టించెదమనియు పితృకా ర్యములనియు దైవకార్యములనియు నానావిధమాయవేషములు వేసి సర్వాసత్యములకు లోనయి సకలనైచ్యములకు తలయొగ్గి సోమరిరాములయి పరులను వంచించి కుటుంబభరణము చేసి కొనుచు దేశమును దరిద్రతావాసముచేయుచున్నారు. పాటుపడవల సినవారు పాటుపడక సాపాటురాములయి పరుల పెట్టుపోఁతల కాశించి పగటిదొంగలవలె పాటుపడువారి సొమ్ము సదా కొల్లగొనుచున్నప్పుడు దేశ మెట్లు దరిద్రదశకు రాకుండును? మనదేశముయొక్క బీదదశ కింకొకటికూడ ముఖ్యకారణముగానున్నది. అది తండ్రియవలంబించిన వృత్తియే కొడుకును పూనవలయుననియు, వాణిజ్యాదులకయి సము ద్రయానము చేసి యన్యదేశములకుఁ బోఁగూడదనియు జాతి భూతము నిర్బంధించి బాధించుటయే. తండ్రి పూనిన వృత్తినే కొడుకవలంబించుచుండుటచేత మనదేశమునందు శిల్పాదికళలు మొట్ట మొదట కొంతవఱ కభివృద్ధినొందినను, శిల్పులు మొదలగు వారు సాధారణముగా చదువెఱుఁగని మూఢులగుటచేత దినదినాభి వృద్ధినొందక యంతటితో నిలిచి యెదుగుబొదుగులు లేక తాతల కాలమునం దున్నట్లే యిప్పుడు నున్నవి. అందుచేత విద్యాధికులయి

యంత్రసాహాయ్యమునఁ బనిచేయు నన్యదేశస్థులతో సరితూఁగలేక మనశిల్పులు క్రమక్రమముగా కూటికిపేద లగుచున్నారు. ఎవ్వని కేవృత్తియం దభిరుచియున్నదో వాఁడావృత్తి నవలంబింపక రుచిలేని తనతండ్రి పనినే యాచరించుచుండుటవలన శిల్పాదికళల యభివృద్ధికి భంగముకలుగును. వాణిజ్యమునందు లక్ష్మి వాసముచేయునని మన పెద్దలే చెప్పియున్నారు. మనవా రితర దేశములకుఁ బోయి యచ్చటి వారితో వ్యాపారము చేయుటకు వలనుపడనందున వాణిజ్యాభావము చేత మనదేశము తాను లక్ష్మికి నివాసము కాఁజాలక యామె యక్కగారైన పెద్దమ్మవారికి నివాసమగుచున్నది. దేశక్షేమమో, మనవారిని మీరు సముద్రయానముచేసి కళలయందు వృద్ధినొంది యితర దేశములవారితో వాణిజ్యము విరివిగా సాగించి ధనమార్జింపుఁడనుచున్నది; వర్ణభూతమో మనవారిని మీరు సముద్రయానము మాని కూపకూర్మములవలె నిల్లుకదలక మ్లేచ్ఛసంబంధము నడఁచి కళలు విడిచి తన్నారాధించుచు ధనార్జనము వర్జింపుఁడనుచున్నది. ఇందేయుపదేశము భజింపఁదగినదో యే యుపదేశము త్యజింపఁదగినదో నిర్ణయించుటకు బుద్ధిమంతు లర్హులు. వర్ణభేదమువలన మన దేశమునకుఁ గలుగుచున్న యనర్థముల నన్నిటిని వివరించుట యీ చిన్న యుపన్యాసము పని కానందున, ఆ పనిని బుద్ధిమంతులకు విడిచి మఱికొన్ని వాక్యములతో నిప్పటి కీయుపన్యాసమును ముగించుచున్నాను.

ఎంతటి దురాచారమైనను లోకములో నొక్కసారిగా నశింపదు. దురాచారమని తెలిసినపిమ్మటకూడ జనులు వంశపరంపరగా వచ్చుచున్న యాచారము నొకపట్టున విడువఁజాలరు. కాఁబట్టి దేశక్షేమమును గోరువారందఱును వేగిరపడక యోర్పుతో పనిచేసి ప్రజల హృదయక్షేత్రములలో వేరూని దృఢముగా నాటుకొనియున్న

దురాచారవిషవృక్షములను మెల్లమెల్లగా పెల్లగించుటకు ప్రయత్నము
చేయవలెను. దురాచారవృక్ష మెంతబలముగా పెరిగినను వివేకపర
శువుయొక్క దెబ్బలచేత మొదలునఱికిన తరువువలె తుదకు కూలక
మానదు. వర్ణపిశాచ మిప్పుడు మనవారిని దృఢముష్టితోఁ బట్టుకొని
వివేకముచెఱిచి మంచిని చెడ్డగాను చెడ్డను మంచిగాను తోఁపించు
చున్నది. ఆ పిశాచావేశము వదల్చి మనవారికి సుజ్ఞానము కలిగించుట
కయి విద్యామంత్రబీజముల నెల్లయెడల వెదచల్లుచుండవలయును.
ఉపన్యాసముల నిచ్చియు పుస్తకములను ప్రకటించియు వర్ణభూతము
మనదేశమున కావహించుచున్న యనర్థములన్నియు జనులకు వెల్లడి
యగునట్లు చేయవలయును. విద్యాధికు లొక్కొక్క వర్ణములోఁ గల
యంతర్భాగముల నన్నిటి నేకముచేయుటకయి ప్రయత్నించుచు
భిన్నశాఖలవారితో సంబంధబాంధవ్యములను భోజనప్రతిభోజనము
లను జేయుచు నితరులకు దారిచూపుటకై సర్వవిధముల పాటుపడ
వలయును. విద్యాధికులైనవారు తాము శిల్పాదికళలను నేర్చుకొని
వాణిజ్యాకులయందుఁ బ్రవేశించి మూఢశిరోమణులకు భయపడక
దేశక్షేమము నిమిత్తమయి ద్వీపాంతరయాత్రలు చేయుచు మరలి
వచ్చిన తరువాత ప్రాయశ్చిత్తములకు తలయొగ్గక తమ ధైర్యమును
చూపుచుండవలెను. పూర్వాచారమునకు విరుద్ధమైన యే మంచిపనికి
పూనినను జనులును మతాచార్యులును ద్వేషించి బాధింపక మానరు.
ఈ బాధలకు సహించి సుఖింపఁగలుగుటకు మనోధైర్యమును భగవ
ద్భక్తియు నవశ్యముగా కావలెను. ఈశ్వరునియెడల దృఢభక్తి లేని
పక్షమున ధర్మమునే నమ్ముకొని జనవిరుద్ధముగా సత్కార్యాచరణ
మునకుఁ బూని నిర్వహించుట సాధ్యముకాదు. కాఁబట్టి సర్వధర్మము
లకును మూలమైన మతమును పరిశుద్ధపఱిచి తా నీశ్వరునియం దవ్యాజ

మైన విశ్వాసము కుదుర్చుకొనుటకై దేశాభిమానియైన ప్రతిపురుషుఁ
డును నిరంతరకృషి చేయవలెను. ఈశ్వరవిశ్వాసము లేనివాఁ డేసత్కా
ర్యమును చిరకాలము శ్రమలకోర్చి పూనికతో నిర్వహింపఁజాలఁడు.
కాఁబట్టి మనము సర్వసత్కార్యములు నీశ్వరాజ్ఞలని నమ్మి జనుల
నిగ్రహానుగ్రహములను పాటింపక యీశ్వరప్రీతికయి యాతని నమ్మిన
బంట్లమయి స్వకృత్యమును నిర్వహింపవలయును. మనకట్టి సంపూర్ణ
నిశ్చలభక్తియు సత్కార్యానురక్తియు ధర్మాచరణశక్తియు ప్రసాదించు
టకై ధర్మస్వరూపుఁడైన యీశ్వరుని మనఃపూర్తిగా ప్రార్థించు
చున్నాను.

హిందూమతములు.

By

K. VEERESALINGAM

హిందూమతములు.

వివేకమహితులగు విహితులారా !

మనము కన్నులార నొక యుత్తమాశ్వమును జూచుచున్నప్పుడది గాడిద యని గాని, కర్ణకఠోరమయిన శబ్దమును వినుచున్నప్పు డది శ్రావ్యనాదమని కాని, యీ రీతిగానే మన మేయింద్రియముచేత నయినను గ్రహించుదానికి విరుద్ధముగా నన్యులెవ్వరైనఁ జెప్పుదు రేని మనము వారి మాటల నెంతమాత్రమును విశ్వసింపఁజాలము; ఇట్లు మన కింద్రియముల ద్వారమున నవ్యవహితముగాఁ గలుగు జ్ఞానము ప్రత్యక్షమనఁబడును, కాఁబట్టి ప్రత్యక్షమునకు విరుద్ధముగా నుండుదానిని దేనినిగాని మనము నమ్మరాదు. లోకములో ప్రత్యక్ష జనిత జ్ఞానమే సర్వోత్తమమయిన దయినను, అన్ని విషయములలోను స్వానుభవముచేతనే నిజమును గనుఁగొనఁ బూనుట యొక్కమనుష్యున కసాధ్యము గనుకను కొన్ని విషయములలో సహేతుకములయిన యూహలచేతనే సత్యమును తెలిసికొనుట సాధ్యమగును గనుకను ప్రత్యక్షమునకు విరుద్ధముగా నుండనంతవఱ కనుమానప్రమాణమును గూడ నంగీకరింపవలసియున్నది. ఒకఁడు తన జీవితకాలమునంతను ధారపోసి విమర్శించినను స్వానుభవముచేతను యుక్తిచేతను సమస్త విషయములయందును యథార్థజ్ఞానమును సంపాదింపఁగలుగుట సంభవింపనేరదు గనుకను, వెనుకటివారు చర్చచేసి తెలిసికొన్నవిషయములనే మరల సాధించుటకయి ప్రయాసపడి కాలమును వ్యర్థముగాఁ బోఁగొట్టుచుండుటవలన నభివృద్ధి కవకాశము కలుగకపోవును గనుకను, ప్రత్యక్షాదులకు విపరీతముగా నుండనివఱకావిషయములలో విశేషశ్రమ చేసియున్నవారి నడిగి తెలిసికొనిగాని వారు వ్రాసి

యుంచిన పుస్తకములను జదివిగాని జ్ఞానసంపాదనముచేయుట యత్యం తావశ్యకముగా నున్నది. ఈ కడపటచెప్పినది శబ్దప్రమాణ మనఁ బడును. జ్ఞానాభివృద్ధి నపేక్షించినయెడల నితరవిషయములయం దేప్రకారముగా శబ్దప్రమాణ మావశ్యకమగునో యదే ప్రకారముగా మతవిషయమునందును జిరకాలము కృషిచేసి యనుభవశాలులయి ప్రసిద్ధిగన్న బుద్ధిమంతులు చేసియున్న పుస్తకసాహాయ్య మవశ్యముగాఁ గావలసియుండును. అయినను తక్కినవిషయములయందువలెనే యీ విషయమునందును మన యనుభవమునకుఁ గాని యుక్తికిఁ గాని పొసఁగి యున్నంతవఱకే శబ్దప్రమాణమును గ్రహింపవలసియుండును. ఏ విషయమునందును పలుపురుసమర్థులు వ్రాసిన పలుపుస్తకములను జదివి వారివారి యభిప్రాయములను చక్కఁగా శోధించినంగాని యెవ్వరిది యొక్క గ్రంథమును జదివినంతమాత్రమున యథార్థజ్ఞాన మలవడదు. గనుక మతవిషయమునందును యదార్థమును కనుఁగొనుటకయి యభిప్రాయభేదములుగల యాయా మతకర్తలు వ్రాసిన గ్రంథములను సావధానముగాఁ జదివి బరిశీలింపవలయును. ఇప్పుడున్న మతములలో హిందూక్రైస్తవ మహమ్మదీయమతములు ప్రధానములయినవిగా నున్నవి; ఇందులో ప్రతిమతము వారికిని వేఱువేఱుగ వేద మున్నది. ఇతరమతములనుగుఱించి తెలిసికొనుటకు ముందు హిందువుల మయిన మనము మన హిందూమతమునుగూర్చి కొంతవఱకయినను దెలిసికొనుట యావశ్యకము. మన మతగ్రంథములలో నెల్ల ముఖ్యమయినదియు హిందువు లందఱిచేఁ బరమప్రమాణమని చెప్పఁబడు నదియు వేదము; ఇది మిక్కిలి పురాతనము; దీనియందు ఋగ్యజుస్సామాథర్వణములని నాలుగుభాగములు గలవు. వానిలో పాద నియమము గలిగి ఛందోబద్ధములయి యుండు మంత్రములు ఋక్కులు;

కేవల వచనరూపముగా నుండునవి యజుస్సులు; గానయోగ్యము లగునవి సామములు. మంత్రార్థములను మంత్రములచేత సాధింపఁ దగిన కర్మలను గూర్చిన విధులను దెలుపు వేదభాగములు యథర్వణము లనఁబడును. ప్రతివిషయమునందును చర్చించినకొలఁదిని జ్ఞానాభివృద్ధి యగుచుండుట సహజము కావుననే యొకవిషయమునుగూర్చి మొదట వ్రాసిన గ్రంథములకంటెఁ బరిశీలనమీఁద తరువాత వ్రాసిన గ్రంథములు శ్రేష్ఠతరములుగా నుండును. మన దేశస్థు లారంభదశయందు వాయువు మొదలగు భూతములను, సూర్యబింబాది మహత్తరపదార్థములను నారాధించుకాలమునఁ బుట్టినవి గనుకనే మన వేదములయొక్క పూర్వభాగమునందు వాయ్వాది భూతస్తుతులును వానినధిష్ఠించియుండు ననుకొన్న దేవతల తృప్తికయి చేయవలసిన యాగకర్మలును మాత్రము ప్రతిపాదింపఁబడి యున్నవి; మనదేశమునందుఁ గ్రమక్రమముగా నాగరికత ప్రబలఁజొచ్చి తత్త్వవిచార మారంభమయిన తరువాత పుట్టిన వేదముయొక్క యుత్తరభాగములయందు విశేషముగాఁ బరబ్రహ్మను గూర్చియు జీవాత్మ పరమాత్మలకుఁ గల పరస్పరసంబంధమును గూర్చియు చర్చింపఁబడియున్నది. బ్రహ్మప్రతిపాదకములయిన యీ వేదాంతగ్రంథముల కుపనిషత్తులని పేరు. వీనిలోఁ గర్మవలనఁ ప్రయోజనము లేదనియు తత్త్వవిచారమే మోక్షసాధనమనియు స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. తరువాత మన శాస్త్రకర్తలందఱును కర్మప్రతిపాదకములయిన వేదభాగములను నిరాకరించి బ్రహ్మజ్ఞానబోధకములయిన యుపనిషద్భాగములనే యాధారపఱుచుకొని తమ శాస్త్రములను వ్రాయుటయే యాకాలములోనే కర్మకాండమంతగా నాదరింపఁబడక జ్ఞానకాండముమాత్రమే గౌరవింపఁబడుచు వచ్చె ననుటకుఁ జాలినంత ప్రబలనిదర్శనముగా నున్నది. ఉపనిషత్తుల

నాధారపఱుచుకొని కపిలుఁడు చేసిన సాంఖ్యశాస్త్రమును, కణాదుఁ డొనర్చిన వైశేషికశాస్త్రమును, గౌతముఁడు రచియించిన న్యాయ శాస్త్రమును, పతంజలికృతమయిన యోగశాస్త్రమును, జైమిని కృతమయిన మీమాంసా శాస్త్రమును, వ్యాసరచితమయిన వేదాంతశాస్త్రమును, షడ్దర్శనములని కాని షట్ఛాస్త్రములని కాని చెప్పఁబడును. ఈ శాస్త్రము లాఱును కొన్నివిషయములలో నేకీభావముకలవిగా నున్నను, ముఖ్యములయిన బహువిషయములలోఁ బరస్పరవిరోధము కలవిగానే యున్నవి. శాస్త్రములను గావించిన మన పూర్వపురుషులు భగవద్దత్తములయిన ప్రపంచవేదమును, ఆత్మ వేదమును బాత్తిగా పాటింపక, అనఁగా ప్రత్యక్షానుమానప్రమాణ ముల నొకమూలఁ బడవైచి, యథమప్రమాణమయిన శబ్దమునే పరమప్రమాణముగాఁ జేకొని, దానికిఁ దమ మనసు వచ్చినట్లెల్లను కుత్సితార్థములను గల్పించి తమ సిద్ధాంతమును స్థాపించుటకయి హేతు కల్పనముచేసి సత్యమునందు దృష్టిలేక తమ పక్షమునే సాధింపఁబూను కొనుటచే నొక్క వేదము నాధారము చేసికొని వ్రాసిన దానిలోనే యిట్లెన్ని భిన్నమతము లుత్పన్నము లగుటకుఁ గారణమయ్యెను. ఇందే దియో యొక్కటియే యుపనిషన్మతమయి యుండవచ్చును గాని యాఱును కానేరవు; ఈ యాఱునుగాక యుపనిషన్మతము మఱి యొకటియైనం గావచ్చును. ఈ యాఱుసిద్ధాంతములయందునుగూడఁ గొన్నిగుణములును గొన్నిదోషములును నుండియుండుటచేత నిందొ కటి యబద్ధమనికాని యొకటి నిబద్ధమనికాని నిర్ధారణము చేయు టకు వీలులేదు. ఈ చెప్పిన షణ్మతములవారునుగూడ ఆత్మనిత్య మనియు, ఇంద్రియగోచరములగు వస్తువులకు మూలాధారములయిన యణువులు నిత్యములనియు, ఆత్మకు దేహసంబంధ మున్నప్పుడు

మాత్రము జ్ఞానాదిశక్తు లుండుననియు, శరీరముతోఁ జేరుటవలన నాత్మకు బంధముకలిగి శుభాశుభకర్మలఫలము ననుభవింపవలసి వచ్చుననియు, పుణ్యపాపఫలానుభవము స్వర్గనరకములయందలి సుఖదుఃఖములతోఁ దీఱక నీళ్ళు పోయినతరువాత కుండనంటియుండు పాచివలె నిలిచియుండుననియుఁ దాని ననుభవించుటకై జీవుఁడు మరల మరల జన్మము లెత్తవలసి యుండుననియు, అన్నివిధములైన కర్మములును జీవునకు బంధహేతువులై జన్మపరంపరను గలిగించును గనుక మోక్షము నపేక్షించువాఁడు శుభాశుభకర్మములను గోసి కాంచనము నందును కాష్ఠమునందును, పుత్రునియందును శత్రునియందును సమబుద్ధి గలిగి దేని నంటించుకొనక మెలఁగవలయు ననియు, చెప్పుచున్నారు. మనలోని యన్నిమతములవారును పూర్వోత్తరజన్మముల నంగీకరించి యదృష్టమని యొకదానిని తెచ్చిపెట్టుటచే నెల్లవారును పూర్వజన్మకర్మవశమువలనఁ గావలసిన యోగమున్నఁ దనంతట నదియే యగునని ప్రతికార్యమునకు నదృష్టమునే నమ్ముకొని యే సత్కార్యనిర్వాహణము కొఱకును శ్రద్ధ పుచ్చుకొని పాటుపడక యుపేక్షాపరులయి కాలమును వ్యర్థముగాఁ బోఁగొట్టుచు నభివృద్ధి లేక సోమరులయి పాడగుచున్నారు. మనకుఁ బూర్వజన్మ మున్నయెడల వెనుకటి పుట్టువునందుఁ జేసిన సంగతులలో నొక్కటియైన నేల యీజన్మమున స్మరణమునకు రాకపోవునని యాలోచింపరు. అయిన నీవిషయమును గూర్చి యింకొకసారి ముచ్చటింపఁదలఁచి యుండుటచేతను, ప్రస్తుతము చెప్పఁదలఁచుకొన్నవిషయముతో నిది యంతగా సంబంధించినది కాకపోవుటచేతను, దీని నిప్పటికి విడిచిపెట్టుచున్నాను. ఈ యాఱు మతములలోను విస్తారముగా నిప్పుడు వ్యవహారములో నున్నది వ్యాసునిదైన వేదాంతమత మొక్కటియే. కాఁబట్టి తక్కినమతముల

స్వరూపకథనమును సంగ్రహముగాఁ జెప్పి పిదప దానిని కొంత వివరించెదను. పేరునకు భిన్నములుగాఁ గనఁబడినను సాంఖ్యయోగమతముల సిద్ధాంతము లించుమించుగా నొక్కటిగానే యుండును. ఈ యుభయమతములవారును ప్రకృతి స్వతంత్రమయిన దనియు, అదియే జగత్కారణమనియు, ఆత్మ వేఱైనను దానికి ప్రకృతితోడి యనాది బంధము కలిగియున్నదనియు, ప్రకృతిపరిణామమే బుద్ధియనియు దాని కర్తృత్వ మాత్మయం దారోపింపఁబడుననియు, బుద్ధి యింద్రియముల ద్వారమునఁ బరిణమించుటయే తెలివియనియు, పురుషునకును ప్రకృతికిని భేదమున్నను వివేకముకలుగుటవలన సంసారము నశించి మోక్షము వచ్చుననియుఁ జెప్పుదురు. వీరిలో సాంఖ్యమతము వారీశ్వరు డున్నట్టె యొప్పుకొనరు; యోగమతము వా రీశ్వరుని యునికి నొప్పుకొందురు గాని యాతని ప్రాముఖ్యము నొప్పుకొనరు. గనుక, అనుష్ఠానమునం దీ రెండుమతములకును భేదమంతగాఁ గనఁబడదు. ఇదిగాక యోగమతమునకు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులను అష్టాంగములు గలవు. ఇందులో ప్రాణాయామమువలనఁ జిరకాలజీవత్వమును నాంతరదృష్టిచేత బ్రహ్మైక్యమును కలుగునని భ్రమపడి యోగులు రేచక, పూరక, కుంభకములను మూడుప్రకారములచేతను నూపిరి బిగఁబట్టి వృథాయాసమును పడుచు కాలమును వ్యర్థపుచ్చుచున్నారు. ఇప్పుడు యోగమతము నవలంబించువారు యోగశాస్త్రమునఁ జెప్పఁబడని వివిధకష్టములకులోనై చేతులు మీఁదుకట్టి నిరుపయుక్తముగు నట్టుగా నెండఁగట్టుచు గోళ్ళను మిక్కిలి పెంచి వేళ్ళను వ్యర్థపఱుచుచు తాము మహానుభావులైనట్లు మూఢులకు భ్రమకలుగఁజేయుచున్నారు. ఇఁక న్యాయశాస్త్రమును, వైశేషికశాస్త్రమునుగూడ

నొకరీతిగానే యుండును. కాఁబట్టి వైశేషికశాస్త్రము న్యాయశాస్త్రముయొక్క భాగముగా జెప్పుటయే యుచితముగాఁ గనఁబడుచున్నది. న్యాయశాస్త్రమునందు విస్తారభాగము తర్కమును గూర్చినదయి యుండును గనుక మనపండితులు సాధారణముగా దాని నభ్యసింతురు; ఈ న్యాయవైశేషికశాస్త్రములు రెండును పదార్థములను గూర్చి, యుక్తివాదరీతులనుగూర్చియు ముచ్చటించును. గౌతమసూత్రములయం దొక చోట నీశ్వరనామ ముదాహరింపఁబడినను, ప్రపంచమీశ్వర నిర్మితమనిగాని చరాచరములయిన సమస్తపదార్థములను నడుపువాఁ డీశ్వరుఁడనిగాని యెచ్చటను జెప్పఁబడి యుండలేదు; వేదము సత్యమనిమాత్రము ప్రతిపాదింపఁబడి యున్నది. కాణాదసూత్రములయందెచ్చటను నీశ్వరనామమే యుచ్చరింపఁబడలేదు; వేదప్రమాణ మంగీకరింపఁబడినది. ఈ యుభయమతములయందును ప్రపంచ మణుసంయోగమువలనఁ గలిగినదనియు, ఆ యణువులు సృష్టింపఁబడనివయి నిత్యములయి యదృష్టవశమున సంయోగమును బొందినవనియు, జీవులుకూడ నపరిమితములును నిత్యములు ననియు, జీవుఁడు దేహమున కధిష్ఠాతయనియు, జీవుడు వేదోక్త కర్మములవలన నాత్యంతిక దుఃఖనివృత్తి చేసికొని పిమ్మట సుఖముగాని దుఃఖముగాని పొందకుండు స్థితియే ముక్తియనియుఁ జెప్పఁబడి యున్నది. ఈ ముక్తి రాళ్లు మొదలైన యచేతనపదార్థముల కిప్పుడున్నస్థితికంటె మేలయినదికాదు. కాఁబట్టి దీని నితరమతములవారు పాషాణముక్తి యని యాక్షేపింతురు. అయినను న్యాయశాస్త్రవ్యాఖ్యాతలును తరువాత న్యాయవైశేషికమతవిషయమున గ్రంథములు వ్రాసినవారును పరమేశ్వరునియునికి నొప్పుకొని జగత్తులకుఁ బరమాణువు లుపాదానకారణములనియు, నీశ్వరుఁడు నిమిత్తకారణ

మనియు, జగము సావయవముగాన నది యొకరిచే సృష్టింపఁబడవలయు ననియు, అట్లు సృజించినవాఁడు కర్మవశుఁడయి పరిమితజ్ఞానముగల జీవులకంటె విలక్షణుఁడయి సర్వశక్త్యాదులు గలవాఁడని యనుమానము చేతఁ దెలిసికోఁబడుచున్నాఁడనియు చెప్పుదురు. గాని ముక్తివిషయ మున మాత్రము గౌతమకణాదులతోడనే యేకీభవింతురు. జైమిని ప్రణీతమయిన మీమాంసాశాస్త్రము నొకమతమునుగాఁ జెప్పుటకే యవకాశము కనఁబడదు. వ్యాసవిరచితమయిన వేదాంతశాస్త్రమునకుఁ గూడ మీమాంసయను వ్యవహారము గలదు. గాన దీనిని పూర్వమీ మాంస యని కాని కర్మమీమాంస యనికాని చెప్పుదురు. దీనియందు తత్త్వవిచారమే లేదు; ఈశ్వరుఁ డున్నాఁడా లేఁడా యను సంశయ మందె క్కడను గానఁబడదు. అంతయు బ్రాహ్మణములచేతను మంత్రములచేతను జెప్పఁబడిన కర్మలనుగూర్చి విశేషముగా వ్రాయఁబడి వాని యర్థవివ రణము చేయఁబడియున్నది. ఈ మీమాంసాశాస్త్రము వేదవిహిత కర్మ చేయుటయే పరమార్థమనియు, శబ్దము నిత్యమనియు, దాని యందు మహత్త్వము గలదనియు బోధించుచున్నది. ఈ మతములోఁ జేరిన భాట్టులు వేదవిహితములయిన యజ్ఞాదికర్మలను ఫలాపేక్షలేక చేయుచో కర్మసంబంధనివృత్తిపూర్వకమోక్షము గలుగుననియు, వేదమంత్రమే దేవతగాని ఫలమునిచ్చు చేతనుఁడగు దేవుఁడు ప్రత్యే కముగా లేఁడనియుకూడఁ జెప్పుచున్నారు. ఇప్పు డాఱవదియైన వేదాంతశాస్త్రము సంగతి విచారింతము; ఇదియే యుత్తరమీమాంస యనియు బ్రహ్మసూత్రము లనియు వ్యవహరింపఁబడును. దీనికి శంక రుఁడును, రామానుజుఁడును, మధ్వుఁడును ప్రత్యేకప్రత్యేకముగా మూఁడుభాష్యములను జేసి వరుసగా నద్వైత విశిష్టాద్వైత ద్వైత మత ములను స్థాపించియున్నారు. ఇందేదియైన నొక్కటియే వ్యాసమత

మయి యుండవలయును గాని మూడును గానేరవని యెల్లవారును సులభముగా నూహించి తెలిసికోవచ్చును. అయిన నిందిదియే వ్యాస మతమని నిశ్చయింప వలనుపడదు. త్రిమతభాష్యకారులును వ్యాస సూత్రముల ననుసరించియే భాష్యములను వ్రాసియున్నారు. గాన ప్రతిమతమువారును గొంతవఱకు వ్యాసమతము నవలంబించువారు గాను గొంతవఱకు నిరాకరించువారుగాను కూడ నుండవచ్చును. అది యెట్టిదయినను త్రిమతములలోను నద్వైతము మిక్కిలి పురాతన మైన దగుటచేతను జనబాహుళ్యముచే ననుసరింపఁబడుచున్న దగుట చేతను, ముందుగా నద్వైతమతమునుగూర్చి కొంతముచ్చటించెదను.

సాంఖ్యయోగశాస్త్రములయందు ప్రపంచము ప్రకృతివలనఁ గలిగిన దనియు, న్యాయవైశేషికశాస్త్రములయందు జగత్తు కేవ లాణుసంయోగమువలననే కలిగినదనియు, వేదాంతశాస్త్రమునందు ప్రపంచ మసలే లేదనియుఁ జెప్పఁబడియున్నది. ఆదియందు వేదాంత శాస్త్రమున బ్రహ్మమొక్కటియే యున్నదనియు, అది సత్యమును, జ్ఞానానందాత్మకమును, నిర్వికారమును, నిరవయవమును, నిత్యమును, నిర్దోషమును, సర్వవ్యాపకము ననియు జగత్తు పారమార్థికముగా సత్యము కాకపోయినను వ్యావహారికముగా సత్యమే యనియుఁ జెప్పఁ బడియున్నది. ఆటుతరువాతివారు ప్రత్యక్షముగా కనఁబడుచున్న జగత్తు నసత్యమని చెప్పుటకుఁగాని యీ యపవిత్రమయిన జగత్తు పరిశుద్ధమయిన బ్రహ్మమునుండి పుట్టినదని చెప్పుటకుఁగాని తోఁచక మధ్య నవిద్య యను మాయ నొకదానిని సృష్టించి బ్రహ్మ మును దానికి లోఁబఱిచినారు; అట్టి యవిద్య మిథ్యాభూత మయిన దనియు, జడమును, సవికారమును, సావయవమును, సాంతము ననియు ననాదియనియు, దాని కాచ్ఛాదకశక్తియు, విక్షేపకశక్తియు,

నని రెండుశక్తులుగలవనియు, జీవులన్నియు బ్రహ్మమే యయినను అవిద్యయొక్క యాచ్ఛాదకశక్తిచే స్వస్వరూపమును మఱచి విక్షేపకశక్తిచేత రూపభేదమున్నట్టు భ్రాంతిపొందుననియు, తత్త్వమసీ త్యాది శ్రుతివాక్యజన్యజ్ఞానమువలన నవిద్య నివర్తించి స్వతస్సిద్ధజ్ఞానము మరల నుదయించుటయే మోక్షమనియు శంకరాచార్యులవారి మతము. అద్వైతులు పరబ్రహ్మము నొప్పుకొన్నవారయినను బ్రహ్మము తమకంటె వేఱయినది కాదందురు. గనుక భగవంతుని యాజ్ఞకు లోఁబడి యాతని నుపాసించుట పొసఁగనేరదు గనుక భగవంతుఁడు లేఁడను నాస్తికులకును వీరికిని నంతగా భేదము కనఁబడదనియు, వీరును ప్రచ్ఛన్నబౌద్ధులే యనియు నితరమతములవారు వీరిని పలువిధముల నాక్షేపించియున్నారు. ఈ యద్వైతులలో నింకొకపక్షమువారు సూర్యుఁడు ఘటతటాకాదులయందుఁ బ్రతిఫలించునట్లే పరబ్రహ్మమును దేహుల యంతఃకరణములయందుఁ బ్రతిఫలించుననియు, ఘటాదులయందు పెక్కు సూర్యబింబములవలె నగపడునట్టుగానే యంతఃకరణములయందు బ్రహ్మము పెక్కురూపములుగా తోఁచుననియు ఆకాశమునందలి సూర్యబింబమునకును ఘటాదులయందలి ప్రతిబింబములకును భేదము లేనట్లే బ్రహ్మమునకును దేహములయందలి జీవులకును నభేదమనియు చెప్పుచున్నారు. ఘటాదులయందు సూర్యబింబము ప్రతిఫలించునట్లే దేహములయందు బ్రహ్మము ప్రతిఫలించుననుపక్షమున, ఘటాదులయందు సూర్యబింబ మేప్రకారముగా లేదో యదే ప్రకారముగా దేహములయం దాత్మలు లేకపోవచ్చుననియు, అవి ఛాయవలె మిథ్యాభూతములగునేని వానికి జ్ఞానము కాని తత్త్వవిచారముగాని లోకవ్యాపారముగాని యెట్లు సంభవించుననియు పూర్వపక్షు లడుగుదురు. అద్వైతమతాంతర్గతములగు యాదవ

భాస్కరమతములయందు శంకరమతమునందు కంటె కొన్నివిషయములయందు భేదమున్నను మెట్టుమీద నన్నియు జీవేశ్వరులకు భేదము లేదనుటలో నేకీభవించుచునే యుండును. జీవేశ్వరులకు భేదము లేనిపక్షమున నేకకాలమునందే యొకఁడు సుఖమనుభవించుటయు నొకఁడు దుఃఖమనుభవించుటయు నెట్లు పొసఁగుననియు, అట్టి సుఖదుఃఖములు దేహసంబంధమువలనఁ గలుగు ననునెడల దేహమును విడిచినతరువాత నద్వైతసిద్ధాంతప్రకార మొక్కఁడు ముక్తుఁడగుటయు మఱియొక్కఁడు కాకపోవుటయు నెట్లు సంభవించుననియు యితరమతములవారు చేయు నాక్షేపణములన్నియు నన్నిశాఖలకును సమానముగానే పట్టును.

అద్వైతమతమునకు తరువాత మిక్కిలి వ్యాపకముగానున్నది విశిష్టాద్వైతమతము. ఈ మతాచార్యులగు రామానుజాచార్యులవారు వ్యాసుని వేదాంతశాస్త్రమునకు తాము తమ మతానుసారియయిన భాష్యమును వ్రాసి జీవునకును నీశ్వరునకుగల గుణములే యుండును గాని పరమాత్మకు లోఁబడియుండుననియు, ఆ యీశ్వరుఁడే విష్ణువనియు, అతనికి దివ్యమంగళవిగ్రహము కలదనియు, మోక్షస్థానము వైకుంఠమనియు స్థాపించియున్నారు. శైవ విశిష్టాద్వైతము నిదే ప్రకారముగా నుండును గాని యీ మతమువారు శివుఁడే పరతత్త్వమనియు మోక్షస్థానము కైలాసమనియు జెప్పుదురు. ఈ మతభాష్యకర్త నీలకంఠాచార్యుఁడు.

వేదాంతశాస్త్రమునకు మధ్వాచార్యులవారుకూడ నొకభాష్యమును జేసి ద్వైతమతమును స్థాపించియున్నారు. ఈ మతమువారును జీవేశ్వరులకు భేద మొప్పుకొని, ఈశ్వరుఁడు విష్ణువనియు, జీవులు పరస్పరవిలక్షణములయిన వనియు, ఈశ్వరునకు రూపముకలదనియు,

జీవులును పరలోకమునందుఁగూడ పూర్వరూపతుల్యమయిన రూపము తోనే పరమపదము పొందుదురనియు చెప్పుదురు. వ్యాసమతము ననుసరించి పుట్టిన యీ మూఁడుమతములును త్రిమతము లనఁబడును. అద్వైతమునందు జీవేశ్వరుల కభేదమని సాధించుట యెంతకష్టమో, విశిష్టాద్వైతమతమునం దీశ్వరునకు రూపమును, భార్య మొదలగు వారును గలరని సాధించుటయు, ద్వైతమతమునందు జీవులకుఁగూడ మరణానంతరమునఁ బూర్వదేహసదృశదేహములు గలవని సాధించు టయు నంత కష్టముగానే యుండును.

ప్రత్యక్షానుమానప్రమాణములను వదలివేసి యొక్క శబ్ద ప్రమాణముచేతనే దైవస్వరూపాదులను స్వేష్టానుసారముగా సాధింపఁ దలంపుకొన్నందుననే మతవిషయములయం దిటువంటి విపరీతాభి ప్రాయములు కలుగునని యీవఱకే చెప్పియున్నాను గదా? తక్కిన సమస్తవిషయములయందును స్వానుభవమును బుద్ధిని మన మెట్లుపయోగింతుమో మతవిషయములయందుఁగూడ నిజమును గనుఁగొనుటకయి మన యనుభవమును బుద్ధిని తప్పక యుపయో గింపవలెను. మిత్రులారా! మీరెప్పుడును బ్రహ్మల మగుదుమని కలలోను భ్రమింపఁబోకుఁడు. పరబ్రహ్మమునకును మనకును గల తారతమ్యము పర్వతమునకును పరమాణువునకును గల యంతరమున కన్నను కోటిరెట్లు హెచ్చయినదిగానుండును. అతఁడు సర్వజ్ఞుఁడు; మనము మన వెనుకనుండియే యొరులు వెక్కిరించుచున్నను తెలి సికోఁజాలనివారము. అతఁడు సర్వశక్తుఁడు; మనము మనకుఁ గావల సిన వస్తువులనే సంపాదించుకోలేని యశక్తులముగా నున్నాము. మనకు యథార్థమయిన జ్ఞానమును కరుణించి సత్ప్రవర్తనము గల వారినిగాఁ జేసి రక్షించుటకు భగవంతుని ప్రాఁపుదక్క మనకు

వేఱాధార మేదియు లేదు. అశక్తులమయిన మనకు వలెనే సర్వశక్తుఁడైన యీశ్వరునకును పనిచేయుటకై కరచరణాద్యవయవములు కావలయుననియు, మనవలెనే యాతఁడును భార్యాసంగమాది తుచ్ఛసుఖముల కాశపడుననియు భ్రమింపక, అతఁడు నిరాకారుఁడనియు నిర్వికారుఁడనియు నానందస్వరూపుఁడనియుఁ దెలిసికొని, నిశ్చలభక్తితో నిరంతరము నాకరుణాస్వరూపుని నుపాసింప యత్నింపుఁడీ. ఓ సర్వకారుణ్యా! ఓ భక్తవత్సలా! భక్తులమయిన మా ప్రార్థన లాలించి, మా హృదయము లెప్పుడును నీధ్యానమునందే తగిలియుండునట్లును సత్కార్యాచరణమునందే యాసక్తములయి యుండునట్లును జేయుము. ఓ దీనజనపోషకా! దీనులమయిన మమ్ము నీయండను జేర్చి పాపులమగుటచే నిన్నుఁ జేరుటకు భయపడుచున్న మా జడుపు దీర్చి యభయ మిచ్చి రక్షింపుము.

స్వయంకృషి

By

K. VEERESALINGAM

45

స్వయంకృషి

మనము లోకములో సస్యముల విషయమునఁగాని ఫలవృక్షముల విషయమునఁగాని కృషిచేయుటవలనఁ గలుగవలసిన ప్రయోజనమంతయు సస్యాదులు చక్కఁగా పెరిగి ఫలము నిచ్చుట యయియున్నది. ఆ ప్రకారముగానే మనము స్వవిషయమునఁ గృషి చేయవలెనన్నను, మన మభివృద్ధి చెంది లోకమున కుపయోగపడునట్లు చేయవలెననియే కాని వేఱుకాదు. మొట్టమొదట స్వతస్సిద్ధముగా పెరిగెడి స్వభావము దానియందున్న నే కాని, ఏ వస్తువునుగాని మనము పెంచుటకు శక్తులము కానేరము. మన మొక వృక్షమును దోహదము చేసి పెంచఁగలము గాని రొుక యెండుమోడు నెవ్వడును పెంచుటకు శక్తులముకాము. ఆ రీతినే మనము స్వయంకృషి చేయవలయు నన్నచో మన కీశ్వరుఁడు ప్రసాదించియున్న నానాంకురాదుల నభివృద్ధి పఱుచుకోవలయు ననుటయే కాని స్వభావముచేత మనకు లేనివానిని క్రొత్తగా తెచ్చిపెట్టుకోవలయుననుట కాదు. అయినను సస్యాదుల యభివృద్ధికిని మనయభివృద్ధికిని మిక్కిలి వ్యత్యాసమున్నది. వానికివలె మనకు పాంచభౌతికమైన శరీరమొక్కటియేకాక తద్విలక్షణమైన యాత్మకూడ నుండియున్నది. మనకుఁగల జ్ఞానాదిశక్తులు ప్రత్యేకముగా నాత్మతోడనే సంబంధించినవి. ఈ జ్ఞానాది శక్తులచేతనే మనము వృక్షాది జడపదార్థములనుండియేకాక పశుపక్ష్యాది సమస్తేతర జంతువులనుండియు భేదపడిమెదము. మనుష్యుఁడు సృష్టిలోని పదార్థములలో నెల్లను శ్రేష్ఠుఁడనుట నిర్వివాదాంశము; ఆశ్రేష్ఠత్వమునకుఁ గారణము జ్ఞానసంపద కలిమియేయనియు సర్వానుభవసిద్ధమయిన రాద్ధాంతాంశమే. పశుపక్షివృక్షాదులకును మనకును

సామాన్యమయిన భౌతికదేహ మాహారముచేతనే పెరుగఁదగినది; అట్టిదేహము నొక్కదానినే పెంచుకొనుటవలన వానికంటె మన కాధిక్య మెంతమాత్రమును గలుగఁబోదు. మనము జ్ఞానదేహము నెంతయభివృద్ధి పొందించుకొన్న మనకంత యాధిక్యము కలుగును. కాఁబట్టి యిప్పుడు నేను చెప్పఁబోయెడు స్వయంకృషియంతయు ముఖ్యముగా నాత్మాభివృద్ధితోడ సంబంధించినదిగానే యుండును. స్వయంకృషి చేసి యభివృద్ధి పొందుటవలనఁ గలుగవలసిన ఫలము సుఖానుభవము. మృగాదులు తాత్కాలికానుభవమునుమాత్రమే చూచుకొనును గాని ముందుసంగతి విచారించుకోవలయునను జ్ఞానము వానికెంతమాత్రమును లేదు. ఒక గోవునకు విస్తారముగా గడ్డి వేసితిమేని, అది తనకప్పుడు కావలసినంత తిని, తక్కిన దానిని త్రొక్కి పేడవేసి పాడుచేయునే కాని తినఁగా మిగిలిన దానిని మఱుసటి దినమునకు భద్రపఱుచుకొనుటకై లేశమును ప్రయత్నింపదు. మనుష్యుఁ డొక్కఁడే యిప్పటి సుఖమును మాత్రమే కాక భావికాలమునందలి సుఖమును గూడ దృష్టియం దుంచుకొని దానిని కాపాడుకొనుటకయి ముందుగానే తగిన సదుపాయములను విచారించువాఁడు. కాఁబట్టి లోకములో బుద్ధిమంతుఁడైన వాఁడెప్పుడును తాత్కాలికతుచ్ఛసుఖములయందే తగిలియుండక యిప్పటి యల్పసుఖములను గొన్నిటిని మానుకొనియైనను ముందు రాఁబోయెడు గొప్పసుఖమునకై పాటుపడుచుండును. ముందుసంగతిని బొత్తిగా విచారింపక యా కాలపు చిఱుసుఖములతోడనే తృప్తినొంది యుండువాఁడు మూఢుఁ డనఁబడును; అట్టివానికిని మృగాదులకును జ్ఞానసంపదయందు విశేషభేద ముండదు. అల్పసుఖములను పాటింపక యధికసుఖమునకై శ్రద్ధ వహించుట బుద్ధిమంతుల లక్షణమని సూచించి యున్నానుగదా? ఇప్పుడు లోకములోని వారందఱును ధనలాభ మపేక్షించియో, ఇంద్రియసుఖము

లను గోరియో, ప్రఖ్యాతి కాసించియో, ధర్మబుద్ధి గలిగి పరలోక మును కాంక్షించియో తమ కాలమును గడుపుచుందురు. ధన మెప్పుడును మన సుఖమున కనుకూలమయిన పదార్థములను సంపాదించుకొనుటయం దుపయోగపడునే కాని ప్రత్యేకముగా సుఖసాధనము కాదు. కాఁబట్టి మన సుఖభోగాదుల కక్కఱకు వచ్చునంతవఱకే ధనము ప్రయోజనకరమగును. ఈ సంగతిని విచారింపక కొందఱు మూఢాత్ములు ధనాశచేత నేలాగుననో దానిని సంపాదించి పెట్టెలలోనో మఱివేఱుచోటనో దానిని భద్రపఱచి, తా మనుభవింపకయు నితరులకు పెట్టకయు దరిద్రులతో సమానముగా కష్టజీవనమును చేయుచుందురు. అట్టివారిసంగతి నిక్కడ విడిచిపెట్టి భోగత్యాగముల నిమిత్తము ధనమును సంపాదింపఁ బ్రయత్నించువారిమాటే యిక్కడ విచారింతము. ధనార్జనముతప్ప వేఱుచింత లేసి వారెప్పుడును కొన్ని యక్రమములకు లోఁబడక విశేషవిత్తమును పోగుచేయఁజాలరు. అట్టివారి నొంటిగా నున్నప్పుడును పూర్వము చేసిన కార్యములు తలంపునఁ బొఱినప్పుడును అంతరాత్మ బాధించుచుండును గనుక వారు నిజమయిన సుఖము ననుభవింపఁజాలరు; ఒకానొకప్పుడు ధనాశచేత చెడుపనులకు లోనయినను ధనము లభింపక మనస్తాపము సంభవింప వచ్చును; ఫలకాలము వచ్చునప్పటికి సంపాదించిన ధనమునకు ఱెక్కలువచ్చి మనయొద్దనుండి యెగిరిపోయి దొంగలపాలో యితరుల పాలో కానైనను కావచ్చును; లేదా యనుభవించుకాలము వచ్చునప్పటికి మధ్య నాకస్మికముగా మృత్యుదేవత యడ్డమువచ్చి మన ధనమునకును మనకును నెడఁబాటు కలిగించి మనల నీ లోకము నుండి యెగయెత్తుకొని పోవచ్చును. కాఁబట్టి చక్కఁగా విమర్శించి చూడఁగా ధనమువలనఁ గలిగెడి సౌఖ్యము మిక్కిలి యస్థిరమయిన దనియు నల్పమయిన దనియుఁ దేటపడుచున్నది. అందుచేత

బుద్ధిమంతుఁడయినవాఁడు ధనార్జనమే పరమప్రయోజన మని నమ్మికొని యందునిమిత్తమే తన యమూల్యమైన జీవితకాలమును ధారపోయుట యుక్తమయిన పనికాదు. ఈ ప్రకారముగానే కేవలము నింద్రియసుఖములనిత్తమే కాలము పుచ్చుటయు నుచితకార్యముగా గనుపట్టదు. ఇంద్రియసుఖములు మృగాదులకును మనకును సామాన్యములే యనియు, మనుష్యుల మగుటచేత మన కావశ్యకములుగా నేర్పడిన ధర్మములను పాటింపక విషయసుఖములయందే యాసక్తుల మయి యున్నచో మృగాదులకన్న మన కెక్కువ మేలిమి రానేర దనియు ఈ వఱకే చెప్పియున్నాను. ఆ యల్పసుఖమయినను చిరకాల ముండునని నమ్ముటకయిన వీలులేదు. ప్రతిదినమును సూర్యుఁ డుదయించి యస్తమించులోపల లక్షలకొలఁది జనులు మృతినొందుచుందురు. ఎప్పుడో యే నిమిషముననో మనమును ప్రపంచములోని సర్వము విడిచిపెట్టి లోకాంతరగతులము కావలసినవారమే యగుదుము; మన శక్తియంతయు వినియోగపఱిచి యింద్రియసుఖసాధనములకయి పాటుపడి వానిని సంపాదించుకొనువఱకు వానికిని మనకును వినియోగము కలిగి సుఖమునకు మాఱుగా బహుతరముగా దుఃఖము సంభవించుచుండుటయు తటస్థించుచున్నది; ఒకవేళ నప్పటికి సుఖముగానే కనఁబడినను కొన్నివిషయములలో నా సుఖమంతయు కడపట దుఃఖముగానే పరిణమించుటయుఁ గలదు. ఇప్పు డీదేశములో నతిభోజనము, అతిపానము, అతిసంభోగము, ఇంద్రియసుఖములలోనెల్లను సర్వసాధారణములయి యున్నవి. ఈ యతిభోజనము యాచ్ఞావృత్తి వలననే జీవనముచేయు బ్రాహ్మణులలో నధికముగాఁ గనఁబడుచున్నది; వారు యాచ్ఞావృత్తి యెంతమాత్రమును హేయమయిన దని తలఁపకపోవుటయే కాక మీఁదుమిక్కిలి యా వృత్తియే మిక్కిలి గౌరవావహమయిన దని యెంచి సంతోషమును పొందుదురు; ఒక్క

పూట తిండికయి గ్రామము విడిచి పొరుగూళ్ళకు సహితము పోదురు; వారు కడుపే కైలాసమని యెంచుకొని లోకములో జన్మించుట యెల్లను తిండికొఱకే యని వేఱుచింత లేక యుందురు; సంతర్పణములును సమారాధనలును జరుగునప్పుడు మనము కొంచెము శ్రమ చేసి యా మార్గమున వెళ్ళుదుమేని, అతిభోజనము చేసి యాయాస పడుచు నడవలేక నడుచువారిని, నేయియు భక్ష్యములును నధికముగా భుజించి కడుపునొప్పిచేత వీధియరుగులమీఁద పడి పొరలు వారిని మన మనేకులను చూతుము. అప్పటి వారిస్థితిని జూచినప్పుడు మృగముల స్థితియైనను అంతకంటె కొంత మేలయినదే యని తోచవచ్చును. ఏ మృగముగాని మితము తప్పి తిని బాధపడుచుండఁగా మన మెప్పుడును జూచియుండలేదు. భోజన మొక్కటియే పరమార్థ మనుకొను వారికిఁ గల యితరకష్టములును మృగాదులకు లేవు. కష్టపడ నక్కఱ లేకయే విస్తళ్ళు వేసి వడ్డించి యుంచినట్టుగా భగవంతుఁడు మృగాదుల కాహారము నెల్లయెడల నమర్చియున్నాఁడు; ఒకయావు గడవ దాటి వెళ్ళినచో పాకము చేసికోవలసిన శ్రమతో పనిలేక మేయుటకుఁ గావలసినంత పచ్చిక సిద్ధముగా నుండును. బీదలగు బ్రాహ్మణుల స్థితి యిట్లుండఁగా ధనికులయిన నానాజాతులవారిలోను పలువిధములయిన రోగముల కాకరములయిన మధురాహారాదుల నతిమాత్రముగా భుజించి నిజమయిన సౌఖ్యమునకు దూరులయియుండుటయు ప్రబలియే యున్నది. అతిభోజనమునకంటెను సహస్రగుణముల నష్టము నాపాదించుచు నంతకంతకు సురాపానము మనదేశములో మిక్కిలి వ్యాపించుచున్నది. ఈ క్రైస్తవప్రభుత్వము మన దేశమునకు రానప్పుడీ విషయమున మనదేశము తక్కినదేశములకంటె మిక్కిలి మంచిదశయందే యుండియున్న దనుటకు సందేహములేదు. అప్పుడు మనపూర్వులు పల్లెలయందుసహిత మీ కాలమందు వినఁబడు ద్రాక్షాసవాదుల పేరున్నను

విని యుండరు; మనపెద్దలు సురాపానము మహాపాతకముగా నేర్పఱచి పానమూర్తులతో సహవాసము చేసినవారిని సహితము మహాపాతకుల లోనే గణించుచు వచ్చినందున త్రాగుఁబోతుతన మాకాలములో మిక్కిలి తక్కువగా నుండెను. ఈ హూణప్రభుత్వము మనదేశమున వ్యాపించిన తరువాత ఈ దేశపు సారాయములుమాత్రమే కాక యిచ్చటి వారల కడుపులను పవిత్రము చేయుటకయి వివిధనామములు ధరించిన యన్యదేశీయసారాయములు సహితము నెలకు నాలుగుసారులు ఓడల కొలఁది బుడ్లతో పంపఁబడుచున్నవి. ఏ దేశమునందుఁగాని సాధారణ ముగా జరుగు నేరములలో సగముపాలు త్రాగుఁబోతులవలనఁ జేయఁ బడినవిగానే యుండును. సమస్తదోషములకును కుదురయిన యీ వ్యా పారమును దొరతనమువారే ప్రోత్సాహపఱుచుచుండుట చూడ నెంతయు వింతగానున్నది. నేరములు జరిగిన తరువాత దోషులను పట్టి శిక్షించుటకంటె నేరముల యుత్పత్తికారణమును కనుఁగొని దానిని వారింపఁ బూనుకొనుట దొరతనమువారికి ముఖ్యకర్తవ్యము. తమకు విధియైన కృత్యమును చేయక యుపేక్షించుచున్నారు కనుక, మన దేశస్థు లందఱును జేరి యీ వ్యాపారము సమస్తజనులలోనుకూడ వ్యాపించి మిక్కిలి ముదురక మునుపే ప్రభుత్వమువారికి సంఘవిజ్ఞాప నలను బంపి త్రాగుఁబోతుతనమును నిర్మూలించుటకయి తగిన ప్రయ త్నము చేయవలయును. మఱియు మన ధర్మశాస్త్రములే పురుషుఁడు బహుభార్యలను జేసికొనుట కనుజ్ఞ నిచ్చుచున్నవి. అయినను, అందు వలనఁ గలిగెడి నష్టము సంస్థానాధిపతులలో కొందఱికేగాని జన సామాన్యమున కంతగాఁ గలుగుచుండ లేదు. ఏమి కాలధర్మదోష మునవో కాని చిరకాలమునుండి మనదేశములో వ్యభిచారమునకయి ప్రత్యేకముగా నేర్పడి భోగస్త్రీలను పేరుగల యొకజాతిస్త్రీలు పరంప రగా వచ్చుచున్నారు. అట్టివారికి నిరుత్సాహమును కలిగించుటకు

మూఱుగా కొంచెము ధనముగల మనవారు పలువురు వేశ్యల నుంచు కొనుటచేతనే ప్రతిష్ఠను వహించుచున్నారు. వేశ్యల నుంచుకొన్న వారికి పూర్వకాలములయందు రాజాస్థానములలో గౌరవము లేక పోవుటంజేసి యప్పుడెవ్వరో నీచులు తప్ప నలుగురిలోను తలయెత్తు కొని తిరుగఁదలఁచిన వారెవ్వరును వ్యభిచరించి తిరుగుటకు సాహ సింప కుండిరి. ఇప్పటి రాచటికమువా రాంతరంగకప్రవర్తనవిషయమున తాము సంబంధమును కలిగించుకొనకుండుటంజేసి, యాయడ్డముకూడ నిప్పు డూడి యెల్లవారును స్వేచ్ఛముగా భోగస్త్రీలతోడి సాంగత్య మును కలిగించుకొనుచున్నారు. బిళ్ళగోచిని పెట్టకుండుట తప్పుగా నెంచుచున్నను, కులమువారిప్పుడు వ్యభిచారమును తప్పుగా నెంచు టయే మానివేసినారు. కాఁబట్టి కులమువా రీ దురాచారమును మాన్పించుటకయి ప్రయత్నము చేయరని వేఱుగ చెప్పనక్కఱయే లేదు. ఈ మూఁడువిధములయిన సుఖములును మనశరీరమునకే సం బంధించినవగుటచేతను, అందుచేత నివి మనము పూర్ణముగా పొందినను మృగాదులకు కలుగు సుఖమునకంటె నెక్కువవి కానేరవు గనుకను, ఈభోగములయందు మృగాదులకులేని రోగాదికములగు బాధలు కొన్ని మనకెక్కువ యుండును గనుకను, ఆకష్టములతోఁ గూడిన సుఖమయినను శాశ్వతముగా నుండునది కాదు గనుకను, తెలి సినవారెవ్వరును నిమిషభంగురములయిన యీ తుచ్ఛసుఖములకే యాశపడి యుండరు. ధనమువలనను, వైషయికభోగములవలనను గలిగెడిసుఖమును క్షణభంగుర మయినదిగానే యుండును. ఈసత్య మును తెలిసికోలేక పలువురు, పేరుకొఱకు తమధనమునంతను పాడు చేసికొందురు. వివాహాదులయందు భూరిదక్షిణలక్రింద తమధనమును పాడుచేసికొని పలువురు కూటిపేదలగుటయు నీప్రసిద్ధి కాశపడియే. ఈకీర్తి యొకనియొద్ద వ్యర్థపఱుచుటకు ధన మెంతకాలముండునో

యంతకాలముమాత్రమే యుండును. ధనదానమును చేయుచున్నంత సేపును దాతలవిషయమయిన స్తోత్రపాఠము లాకాశమంటును; ఆధనదానము మట్టుపడినతోడనే స్తుతిపాఠములును మట్టుపడును. కాఁబట్టి పరుల పొగడ్తవలనఁ గలుగు సుఖమును చిరకాలముండునది కాదు. కాఁబట్టి ప్రాజ్ఞుఁడు పయినిజెప్పిన సుఖములలో దేనిని నమ్మికొని యుండక, శాశ్వతసుఖము లభించుమార్గమును గనుఁగొని దానిని సంపాదించుటకయి సర్వప్రయత్నములును జేయును. శాశ్వతసుఖము లభించుమార్గము ధర్మాచరణ మొక్కటి తప్ప మఱియేదియు లేదు. ధర్మమార్గమునఁ జరించుచున్నచో మనమనస్సాక్షి సదా మెచ్చుకొనుచు నిజమయిన యానందము నిచ్చుచుండును. ఈలోకములో మనము పూర్ణముగా నూతేండ్లు బ్రదికినను, ముందుండెడి యపరిమిత కాలమునుబట్టి విచారింపఁగా నిది పర్వతములో పరమాణువంతభాగ మయిన నుండదు. కాఁబట్టి యెల్లవారును నీలోకములో నెల్లకాలమును దుఃఖముకలిగినను దానికయిన నోర్చుకొని, అపరిగణనీయమయిన భావికాలములో నెల్ల శాశ్వతసుఖము నిచ్చుటకు సమర్థమయిన ధర్మమార్గముననే సుఖము పొందుటకు ప్రయత్నపడవలయును. ఇట్లు చెప్పుటచేత ధర్మమార్గమున వర్తించుటచేత నిహాలోకసుఖము కలుగదనియు, పరలోకసుఖము నపేక్షించి యిహాలోకసౌఖ్యముల నెల్లను మానుకోవలయుననియు నాయభిప్రాయము కాదు. ధర్మమార్గప్రవర్తనమువలన నిజమయిన సౌఖ్య మీహాలోకమునందును గలుగును; ఈ లోకమునందలి దేహాసంబంధములయిన సౌఖ్యములన్నియు ననుభవింపఁ దగినవే. కాని పరలోకసుఖమునకు భంగము కలిగించువఱకు నీలోకసుఖములను త్యజించి, ఇక్కడ నెన్నియాపదలు వచ్చినను వానికెల్లను సహించి ధర్మమార్గముననే సంచరింపవలనని నామతము.

నే నీదినమునఁ జెప్పఁ బూనుకొన్న స్వయంకృషి యీపరలోకసుఖమునకు భంగము రాకుండ ననుభవింపవలసిన సమస్తసుఖసాధనములను గూర్చినదై యుండును. పశుపక్ష్యాదులకు వేనికినిలేని యుక్తాయుక్త వివేకము మనకు కలిగియుండుటచేతనే యీధర్మమార్గప్రవర్తనము మనకు విధిగా నేర్పడినది గనుక, ఇదియే నిజముగా మానవధర్మమునకు సంబంధించినదని చెప్పవలసియున్నది. మన కీశ్వరుఁడు జ్ఞానమును ప్రసాదించి యున్నను, దాని నంతకంత కభివృద్ధి పొందఁదగిన దానిగానే చేసియున్నాఁడు. కాని యొక్కసారిగానే పరిపూర్ణత్వమును పొందియుండునట్లు చేసి యుండలేదు. మన కీశ్వరుఁడు దయ చేసియున్న సాధనకలాపములో నేదియు మనకృషిలేక యభివృద్ధి నొందునది లేదు. కాఁబట్టి జ్ఞానాభివృద్ధికిని మనకృషి యావశ్యకము. యుక్తాయుక్తవిచారమునుఁజేసి కర్తవ్యమును గనిపెట్టుటకొఱకే జ్ఞానము సాధనమగుటచేత, కార్యాకార్యనిశ్చయముచేసి యుక్తమార్గముననే నడవ తలంపుగలిగినవా రందఱును జ్ఞానాభివృద్ధికై సర్వప్రయత్నములు చేయవలెను. అన్యసాహాయ్యమక్కఱలేక మనుష్యుఁ డేవిషయమునందును పూర్ణముగా పని సాగింపనేరఁడు. ఆలాగుననే జ్ఞానసంపాదనమునందుఁగూడ మనుష్యున కితరసాహాయ్యము తప్పక కావలసియుండును. జ్ఞానాభివృద్ధికి తోడుపడు ముఖ్యసాధనము విద్య యనఁబడును. తనకంటె పూర్వులు వ్రాసియుంచిన పుస్తకములను జదువుటవలనను, తనకంటె నధికబుద్ధిమంతులయిన వారితో సహవాసము చేసి తనకు తెలియనివిషయములను వారినడిగి తెలిసికొనుటవలనను సాధారణముగా జ్ఞానాభివృద్ధి యగును. ఇట్టి సాహాయ్యమక్కఱలేక స్వానుభవమువలననే జ్ఞానాభివృద్ధిని చేసికొనువాఁడు కోటికొక్కఁడనో యొక్కఁ డుండవచ్చినను సామాన్యముగా పయి తోడుపాటువలననే జనులు జ్ఞానాధికులగుదురు. కాఁబట్టి యెల్లవారికిని జ్ఞానాభివృద్ధిచేసి

కొనుటకై పుస్తకములును గురువులును కావలసివచ్చును. అయినను పుస్తకములన్నియు యథార్థమునే బోధించునవిగా నుండవు. గురువు లందఱును శిష్యులమేలుకొఱకే పాటుపడువారయియు నుండరు. కాఁబట్టి మంచిపుస్తకములనే యభ్యసించుటకును, ఉత్తములయిన గురువులనే యాశ్రయించుటకును జాగ్రత్తపడవలయును. పుస్తకములయొక్కయు గురువులయొక్కయు నుపయోగము మనలను జ్ఞానవంతులనుగాఁ జేయుటకును, బహువిషయములయందు మన యాలోచనను జొప్పించి సాధకబాధకములను విచారించి కార్యనిర్ణయము చేయ సమర్థులనుగాఁ జేయుటకును, గాని మనయాలోచనను పోఁగొట్టి వానియం దున్నదెల్ల నంధప్రాయముగా విశ్వసించునట్లు చేయుటకుఁగాదు. మనకు మునుపున్న జ్ఞానమునుగూడఁ బోఁగొట్టుటకు సాధనములగునేని, అట్టిపుస్తకములును గురువులును లేకుండుట మంచిది. కాఁబట్టి నిజమైన జ్ఞానమును సంపాదించవలెనని యున్న పక్షమున, పుస్తకమునందున్న యంశములనుగాని గురువు చెప్పిన వాక్యములనుగాని సందేహముకలిగినప్పుడు నిష్పాక్షికబుద్ధితో మఱిమఱి విమర్శించి తనబుద్ధికవి సత్యములుగావని దృఢముగాఁ దోఁచునేని యెవ్వరు వ్యతిరేకముగాఁ జెప్పినను తన మనస్సునకు స్థిరమని సిద్ధాంతమయిన ప్రకారముగానే ప్రవర్తింపవలయును. పూర్వము పుస్తకములను రచించినవారును గురువులును మిక్కిలి బుద్ధిమంతులే యయినను మనుష్యులగుటచే వారికిఁగూడ భ్రమప్రమాదాదులు సహజములే గనుక, వారును కొన్నివిషయములయందు పొఱపడి యుండవచ్చును. ఏదో యొకవిషయమునందు వారిప్రమాదమును మనము సంస్కరించినంతమాత్రమున వారిగౌరవమున కేహానియు కలుగదు; అది తరువాతివారు జ్ఞానాభివృద్ధిని పొందుటకును సాధనమగును. అంతియేకాక స్వప్రయోజన పరులయి తమలాభమును

నిమిత్తమయి యసత్యములను బుద్ధిపూర్వకముగానే తమ పుస్తకములనిండ నెక్కించిన మహానుభావులును పలువు రుండియున్నారు. అట్టి స్వప్రయోజనపరులయిన పండితనామధారకులవలననే మనకు విశేషనష్టము కలుగును గాని మూఢజనులవలన నంతగా గలుగదు. ప్రతిదేశమునందును మతగురువులు స్వప్రయోజనపరులై వేదోక్తములని వేదబాహ్యములయిన సంగతులను పుస్తకములలో వ్రాసియు శిష్యులకు బోధించియు జనులను మోసముచేసి తాము లాభమును పొందుచుండుట సర్వసాధారణముగా జరుగుచునే యున్నది. అయినను కొన్ని దేశములలో విద్యాభివృద్ధియయి జనులలో నాగరికత యధికమైనకాలఁదిని మతగ్రంథములు దేశభాషలలో భాషాంతరీకరింపఁబడి వారిమోసములు మూలఁబడినవి. మనదేశములో సాధారణముగా తక్కువజాతులవారు విద్యాగంధమెఱుఁగక మూఢులుగానే యట్టై యుండుటవలనను, మతగ్రంథములు దేశభాషలలో భాషాంతరీకరింపఁబడక యుండుటవలనను, మతగురువుల మోసమీ దేశములో నిరర్గళముగా సాగుచున్నది. ఈయుపద్రవమును నివారించి దేశమునకు క్షేమము గలిగింపఁగోరు దేశాభిమానులగు మహాపురుషులందఱును జనులలో విద్యాభివృద్ధియగునట్లు చేయుటకును, మతగ్రంథములను తెనిఁగించుటకును, స్వలాభమునకయి గురుపరంపరలోనివారు వ్రాసికొన్న పుస్తకములయందలి దోషములను లోకమునకు వెల్లడిపఱిచి జనులకన్నులు తెఱచుటకును, సర్వవిధముల పాటుపడవలయును. అంతకంటె మనము లోకమునకుజేయు గొప్పయుపకారము మఱియొకటిలేదు. తమ్ము పూజించుటయు, తమకు ధనమిచ్చుటయు, తప్ప ముక్తికి వేఱుసాధనములు లేవని వ్రాసి ధనాకర్షణోపాయముగా శ్రుతిస్మృత్యుక్తములుకాని పెక్కునోములను వ్రతములను కల్పించి తదనుగుణములైన కల్పములతో నిండియున్న పుస్తకము

లను చేసినవారిని మనమెందఱిని జూచుచున్నాము కాముకి వాని యందు వారిని వారిజాతివారిని పూజించిననే పుణ్యమువచ్చునని బోధించుటతప్ప నిజమయిన భగవద్భక్తిని నీతిని యుక్తప్రవర్తనను బోధించువాక్యము లెక్కడనైనను గనుపట్టునా? అట్టి పుస్తకము లెంతశీఘ్రముగా నశించిన మనదేశమున కంతక్షేమము కలుగును. ప్రతిదేశములోను తెలిసినవారు మాత్రమే గురువులుగా నుండుట యాచారముగానున్నది. మనదేశమున మాత్రము పూర్వము తమ వృద్ధపరంపరలోనివారి కెవ్వరికో వారివృద్ధపరంపరలోనివారొకరు గురువులుగా నుండిరను హేతువుచేత వారివంశమునందు పుట్టిన పరమ శుంఠలు సహితము శిష్యపరంపరలోఁ జేరిన పండితులకుఁగూడ గురువు లగుట తటస్థించుచున్నది. గురుశుశ్రూషవలననే కాని ఫలసిద్ధిలేదని మనవారు చక్కఁగా మనసులకు నాటించి యుండుటచేత, శిష్యవృత్తాపహారు లగుట కెంతమాత్రమును చేతఁగాక శిష్యవిత్తాపహారులు మాత్రమే యయియున్న యీమహాగురువులపాదములు కడిగి నెత్తి మీఁద చల్లుకొనుచు పాదతీర్థమును లోపలికి పుచ్చుకొనుచు వారు చెప్పిన వాక్యములెల్ల వేదవాక్యములని భావించి యాదరించుచు జనులు తమధనమును వారికి కొల్లపెట్టుచుందురు. ఈహేతువుచేత మనదేశ మున కితరదేశములలో లేని నష్టములుకూడ నీగురుపరంపరవలనఁ గలుగుచున్నవి. ఈగురువేషధారులు తమయింటనున్న స్థావరజంగమ స్వత్వము తోడిపాటుగా తమశిష్యగణమునుగూడ భాగములువేసి పంచుకొనుచు జ్ఞానమునందుఁగూడ వారిని తత్తుల్యులనుగానే చేసి ధనాపహారణము చేయుచుందురు. ఈవిధమైన వృత్తిచేతనే జీవనము చేయువారు మఱియొకవిధముగా బోధించి సత్యమును వెల్లడి చేసినచో తమవృత్తికే భంగము కలుగును గనుక వారు సర్వవిధముల నీయాచారమునే కాపాడుచు తమకు వ్యతిరిక్తముగా సత్యము బోధింపఁ

జూచువారిని నాస్తికులనియు, బౌద్ధులనియు, మతదూషకులనియు పేరునుపెట్టి దూషించుచు పామరులను భ్రమింపఁజేయుచుందురు. కష్టార్జితవిత్తమువలన జీవనము చేయఁదగిన న్యాయమయిన వృత్తి యేదియు లేక పరులను మోసపుచ్చి వారు సంపాదించుకొన్నదాని మూలముననే జీవనము చేయవలసినవారీదేశములో నసంఖ్యముగా నున్నారనుట యెల్లవారికిని తెలిసిన విషయమే. అట్టివారిసంఖ్య క్షీణించువఱకును మనదేశము మంచిస్థితికి రానేరదు; పరులను యాచించి జీవనము చేయుటకంటె హేయమయినవృత్తి లోకములో మఱియొకటి లేదనియు, శరీరప్రయాసపడి న్యాయార్జితమైన ధనముతో కుటుంబసంరక్షణము చేసికొనెడి యేయధమవృత్తియైనను యాచ్నావృత్తికంటె వేయిరెట్లు మేలయినదనియు, వారిమనసులలో నాటించి కొంతవఱకైనను వారినావృత్తినుండి విముఖులను జేసినంగాని దేశాభివృద్ధికయి పాటుపడువారి ప్రయత్నములు సహితము నిరంతరాయముగా సాగనేరవు. ఇట్లు చెప్పుటచేత గురువు లక్కఱ లేదనియు, చదువక్కఱలేదనియు, నాయభిప్రాయ మెంతమాత్రమును గాదు. తనకంటె బుద్ధిశాలులును విద్యాధికులును నయిన వారితో సహవాసము చేయుచుండిననేకాని మనుష్యుఁ డెప్పుడును జ్ఞానాభివృద్ధిని కాంచనేరఁడు; అట్టిమహనీయులతోడి సహవాసమున కన్నను జ్ఞానాభివృద్ధికి మంచిపుస్తకములు పరమప్రయోజనకరములు. గొప్పవారితోడి సాంగత్యమువలనను, సద్గ్రంథపఠనమువలనను మనకుఁ గలుగవలసిన ప్రయోజనము మనలో శోధనయును తత్త్వవిమర్శనమును వృద్ధియయి మనముకూడ గొప్పవార మగుటయే. అట్లుగాక గురువులశుశ్రూష మనలను స్వతంత్రులనుగాను సత్కార్యాచరణము నందు ధైర్యవంతులనుగాను జేయక మనలను వారికి దాసులనుగా మాత్రముచేసి స్థావరపదార్థములనువలె వారాడించినట్లెల్ల నాడు

చుండునట్లు చేయునేని, అట్టిగురువులు లేకపోవుటయే మిక్కిలి యుత్తమ పక్షము; మనము చదివెడి పుస్తకములు మనలను జ్ఞానవంతులనుగాను సత్ప్రవర్తనము గలవారినిగాను జేయక యొకతెగవారిచేతులలో పనిముట్లవంటి వారినిగాఁ జేయునేని, అట్టిగ్రంథములను చదువకపోవుటయే బహుశ్రేయస్కరము. విద్య సత్యమును తెలుపుటకును యోగ్యులనుగాఁ జేయుటకును సాధనమయినదేకాని స్వంతప్రయోజనము కలది కాదని యీవఱకే సూచనగాఁ జెప్పియున్నాను. మనవారీసత్యమును మఱచిపోయి ప్రవర్తనమును విచారింపక విద్యనే పూజించుచున్నారు. అందుచేతనే మనదేశమున కనేకములయిన చెడుగులు మూడుటకుఁ గారణమయినది. మనవారు నడత మంచిది కాకపోయినను దానిని పాటింపక వ్యాకరణమునో మఱి యేయితరశాస్త్రమునో యభ్యసించినాఁడన్న హేతువుచేత నాతనిని నతిగౌరవము చేయుచు నాతని మాటలనన్నింటిని వేదాక్షరములనువలె విశ్వసింతురు. ఎన్ని శాస్త్రములను జదివినను నీతివర్తన ముండదేని, అట్టివాఁడు మానవరూపముననున్న ఘోరరాక్షసుఁడుకాని యంతకంటె నేవిధమునను అధికుఁడు కానేరఁడు. రాక్షసులు విద్యయందును, బుద్ధియందును, బలమునందును, దేవతలకంటె నధికులైనను వారు గర్హ్యులగుటకును దేవతలు పూజ్యులగుటకును గారణము రాక్షసుల దుర్గుణములును దేవతలసద్గుణములును తప్ప మఱి యేదిగలదు? కాఁబట్టి యెప్పుడును యుక్తప్రవర్తన మహనీయమైనదిగాని యదిలేని వట్టివిద్య కాదు. అదిగాక పండ్రెండుసంవత్సరములు వ్యాకరణశాస్త్రమునుగాని తర్కశాస్త్రమునుగాని గుడ్డిపాఠముగా మొదటినుండి చివరవఱకును చదువుటవలనఁగాని, అర్థమెఱుఁగక వేదమును రోకటిపాటగా వల్లెవేయుటవలనఁగాని కావ్యాలంకారనాటకముల నభ్యసించి నృత్తగీతాదులయందు సమర్థులగుటవలనఁగాని యెవ్వరును జనులకు జ్ఞానోపదేశ

మునుజేసి వారిని నడుపుట కర్తవ్యములుకారు. గుడ్డిపాఠముగా చదివిన చదువంతయు వ్యర్థమయినదే కాని ప్రయోజనకరమయినది కాదు. అర్థయుక్తముగాఁ జదివిన నీతిశాస్త్రములును తత్త్వశాస్త్రములును మాత్రమే పురుషులను జ్ఞానోపదేశకర్తలనుగాఁ జేయ సమర్థములగును. తక్కిన శాస్త్రములు సహిత మాయావిషయముల యందు పరమ ప్రయోజనకరములే యయినను, జనులకు పరమార్థమును బోధించి వారి ప్రవర్తనమును చక్కఁజేయుటకు మాత్రము పనికిరావు. కాఁబట్టి మన ప్రయత్నమంతయు దేశభాషలో నీతిగ్రంథములను ప్రకృతిశాస్త్రములను భగవద్భక్తిప్రతిపాదక పుస్తకములను సులభశైలిని రచియించి యెల్లవారికిని సుబోధములుగాఁ జేయుటయయి యుండవలెను. విద్య జ్ఞానమును పుట్టించును; ఆ జ్ఞానము యోగ్యముగా ప్రవర్తింప జేయుట కనుకూలపడవలయును. అంతేకాని యూరకే యిది మంచిదని తెలిసికొనుటవలన నేమియు ప్రయోజనములేదు. తెలిసినందుకు తప్పక యాప్రకారముగా నడవవలయును. కాఁబట్టి మన కృషి యాత్మకుఁగల గుణములలో నొకటియైన తెలివిని వృద్ధిపఱుచుకొనుటలో మాత్రమే కాక నీతిగుణమును ప్రేమాదులగువానిని కూడ సమానముగా నభివృద్ధిపొందించుటలో వినియోగపడవలెను. శరీరావయవములవలెనే యాత్మగుణములును పరస్పరము సమానముగా వృద్ధిపొందిననే సుఖదాయకములగును గాని యొకటి పెరిగి యొకటి తఱిగినచో సుఖప్రదములు కానేరవు. ఒక్కతలగాని, కడుపుగాని, కాలుగాని మిక్కిలి పెద్దదయి తక్కిన యవయవములు పెరుగకపోయినచో శరీరమున కెంత యసౌఖ్యము కలుగునో యెల్లవారికిని తెలిసియే యుండును. ఆ ప్రకారముగానే తెలివిమాత్రము వృద్ధినొంది నీతిలేకపోయినప్పుడుగాని నీతిగలిగి తెలివిలేకపోయినప్పుడుగాని, ఈ రెండును గలిగి భగవద్భక్తి లేనప్పుడుగాని, ఆత్మకు నిజమయిన సుఖము కలుగఁ

జాలదు. కాఁబట్టి యన్నిగుణములును సమానముగా పెరుగునట్లు చేయుటకయి మనము కృషి చేయవలెను. అప్పుడే సత్యమయిన సుఖము కలుగును. ఎల్లవారును శాశ్వతసుఖమునే కాంక్షింతురు. ఆశాశ్వతసుఖము మనకుఁగల సమస్తగుణములను శక్తులను సమానముగా వృద్ధిపఱుచుకొని భగవదాజ్ఞానుసారముగా నడుచుకొనుట వలనఁ గలుగును. భగవదనుగ్రహమును గోరి యాతని తృప్తికయి మనము విధాయకకృత్యములను చేయుచువచ్చినచో మన కెప్పుడును నసంతుష్టియు నసౌఖ్యమును గలుగవు. పయివారు లక్షమంది మనలను ద్వేషించుచున్నను మనయంతరాత్మ మనలను సంతోషపెట్టుచుండును. మనయానందము మనమనస్సులో నున్నది గాని బాహ్యప్రపంచమునందు లేదు. మనలను పయివారు కోటిమంది భూషించుచున్నను దుష్కార్యమును జేసితిరని లోపల నంతరాత్మ దూషించుచున్నయెడల మన కెంతమాత్రమును సౌఖ్యము లేదు. కాఁబట్టి మనము నేర్చుకొను విద్య యింతవారమయితిమిగదా యను మనస్సంతోషముకొఱకుఁ గాని, ఆధిక్యముకొఱకుఁ గాని, లాభముకొఱకుఁ గాని అయియుండక మనప్రవర్తనమును తిన్నపఱుచుకొనుటకొఱకును పరోపకారము నిమిత్తమును నయి యుండవలెను. అప్పుడా మనస్సంతోషాదులు తమయంతఁ దామే వచ్చును. మనవిద్యయొక్క ఫలము కామక్రోధాదులను నిగ్రహించి సత్యశౌచపరోపకారాదిగుణములను పయికిఁ దీయుటయే. అట్లుచేయుటయే యింద్రియనిగ్రహ మనఁబడును. కామాదులగు నరివర్గమునకును, సుగుణములకు స్థానమయిన యంతరాత్మకును ప్రతికార్యమునందును లోపల సదా యుద్ధము జరుగుచుండును. ఒక చక్కని సుందరిని చూచినతోడనే కామగుణముద్రేకించి దానిని గవయఁ జూచుచుండును; అప్పు డంతరాత్మ యడ్డువచ్చి పరకాంత కాసించుట దోషమని బోధించి వారింపఁ

జూచుచుండును. ఆపోరాటములో నొకవేళ కామమే విజయమునొందు యా సుందరి పొందు లభించినను అది దొంగవలె నొకమూల నొదిగియుండి ఎవ్వరేమనుకొందురో యని సిగ్గు పడుచుండవలసి నదే కాని నలుగురిలోను చెప్పుకొని నిర్భయముగా తల యెత్తుకొని తిరుగ వలనుపడదు; అంతరాత్మయే విజయము నొందు యా కానిపనిని మాన్పింపఁ గలిగెనా మనసునకు తృప్తియు సంతోషమును లోకమువలన మెప్పును కూడఁ గలుగును. కాఁబట్టి బుద్ధిమంతుఁడగువాఁడు మొదటినుండియు నింద్రియములను బుద్ధికి లోఁబడునట్లు చేసి యంతరాత్మ చెప్పినట్లు నడుచుకొనుట కలవాటు చేసికొనవలయును. అట్లు చేసినప్పుడే విద్య సార్థకమగును. మఱి యును మనము సత్యమును గ్రహింపవలెనను నుద్దేశ్యముతోనే సదా విద్య నభ్యసింపవలయును. సత్యమును కనుఁగొనవలెనను నాసక్తి లేక తమసామర్థ్యమును గనఁబఱచి ప్రఖ్యాతి గాంచవలెనను నాశ తో పనిచేయుటచేత గొప్ప బుద్ధిమంతులు సహితము విపరీతసిద్ధాంత ముల నేర్పరిచి తాము మోసపోవుటయే కాక జనులను సహితము భ్రమింపఁజేసి వారిని తప్పుమార్గమునఁబెట్టి నడిపించుచు వచ్చు చున్నారు. కాఁబట్టి మనయుద్దేశ మెల్లవిధముల సత్యమును గ్రహిం చుటకే యయి యుండవలయును. సత్యమును గ్రహింపవలయునను దృఢనిశ్చయము కలవారయి యెల్లవారును తమకున్న మనోగుణ ములనన్నిటిని వృద్ధిచేసికొనుటకయి కృషిచేయవలెను. జనుల ముఖ లక్షణములయందును కంఠస్వరమునందును పరస్పర భేదమున్నను కర్ణనాసికాద్యవయవములును నుచ్చారణక్రమమును సామాన్యముగా నున్నట్టే మనుష్యుల బుద్ధియందును పరస్పర భేదమున్నను సామాన్య గుణములు సహితము పెక్కులు గలవు. ఆ యా మనుష్యు లాయాప్ర త్తులకు పనికివచ్చుటకయి బుద్ధియందును వాంఛలయందును భేదమవ

శ్యముగా నుండవలసినదే. కొందఱు గణితాది శాస్త్రములయందు బుద్ధి వ్యాపించువారుగాను కొందఱు గానవిద్యాదులయందు ప్రవేశించు బుద్ధిగలవారుగాను కొందఱు శిల్పములయం దాసక్తికలవారుగాను కొందఱు వస్త్రాదినిర్మాణమునందు తమశక్తిని గనఁబఱుపవాంఛగలవారుగాను నానావిధముల నుందురు. వాని వాని యభిరుచినిబట్టి ఆయావృత్తులకుఁదగిన విద్య నేర్పవలసినదే కాని యంతటితో మాత్రము తృప్తినొంది యూరకుండక యందఱకును సామాన్యముగానుండు గుణములను వృద్ధిపఱుపఁజాలిన విద్యను కూడ తప్పక నేర్పవలయును. అట్టి విద్య యన్నివృత్తులకును గూడ నావశ్యకమే. ఒకఁడు రాజైనను, కాపైనను, వాణిజ్యము చేయుచున్నను, కృషి చేయుచున్నను, మట్టికుండలు చేయుచున్నను, బంగారునగలు చేయుచున్నను, చిత్రములు వ్రాయుచున్నను, గోడలకు మట్టిపూత పెట్టుచున్నను, లోకములోఁగల మరి యేవృత్తియందున్నను, తనవారియందు ప్రేమయు పరోపకారచింతయు భగవంతునియెడల భక్తియు యుక్తప్రవర్తనమును కలిగి యుండవలసినదే. అట్లున్నంతవఱకే జనుఁ డేవృత్తియందున్నను ప్రకాశించును. కాఁబట్టి వృత్తులకుఁ గావలసిన విద్యకంటెను ఈ కడపటఁ జెప్పినవానిని వృద్ధిపఱుచువిద్యయే ప్రతిమనుష్యునకు నవశ్యసంపాద్యము. నీతి మొదలగునవి లేకపోయినయెడల నెంత తెలివిగలవాఁ డేవృత్తియందున్నను గౌరవింపఁబడఁడు; వృత్తులకుఁ గావలసినవిద్య వాండ్రకి రాకపోవచ్చునుగాని యుక్తాయుక్తవివేకమును పుట్టించువఱకుఁ జాలినవిద్య కృషి చేసినయెడల మనుష్యమాత్రున కెవ్వరికిని రాకపోదు. నీతి మొదలయినవి యున్నయెడల మనుష్యుఁ డేవృత్తియం దున్నను గౌరవింపఁబడును. అది తెలియక యీదేశములో నల్పవిద్యను నేర్చినవారు సాధారణముగా తమవృత్తులు నీచము లయినవని భ్రమించి నాలుగక్షరములు

రాఁగానే తమ తొంటివృత్తులయందుఁ బ్రవేశింపనొల్లక యధమ వృత్తియైన సేవకవృత్తి కాళపడి రాజకీయోద్యోగములకయి తమ శక్తినంతను ధారపోసి కష్టపడుచున్నారు. లోకములో న్యాయమయిన వృత్తులన్నియు గౌరవావహము లయినవేకాని యందొక్కటియు గౌరవహీనతను దెచ్చునది లేదు. ఎంత మంచివృత్తియండైనను మూఢులును నీతిమాలినవారును బ్రవేశించినపక్షమున నది హీనమయిన దగును; ఎంత నీచముగా చూడఁబడు వృత్తియండైనను చదువుకొన్నవారును నీతిమంతులును బ్రవేశించినప్పుడనే దానికి గౌరవము వచ్చును. కాఁబట్టి మనదేశములో చదువుకొన్నవారు వివిధవృత్తులయందుఁ బ్రవేశించి వానికి గౌరవమును తెచ్చి యీవఱకు జనులలోఁగల దురభిప్రాయమును పోఁగొట్టవలయును. వృత్తులు క్రమపడినంగాని దేశ మెన్నటికిని భాగ్యసంపన్నము కాఁజాలదు. చదువుకొన్నవారు వృత్తులయందుఁ బ్రవేశించినచో మంచిసాధనములను కనిపెట్టి పనిని సులభపఱుచుటయేకాక విస్తారలాభకరముగా కూడ చేయవచ్చును. వృత్తులు కొన్ని యిప్పుడు నీచములుగా కనఁబడుచుండుట చదువుకొన్నవారందు ప్రవేశింపకపోవుటచేతనే కాని వేఱుకారణముచేత కాదు. తెలివిగలవాఁడు నీతిమంతుఁడయి యేవృత్తియందున్నను గౌరవమునకు లోపమురాదని దృఢముగా మనసునందు నమ్మి సమస్తవృత్తులను మంచిదశకు తెచ్చుటకు బ్రయత్నించుచు నీతి మొదలయిన యాత్మశక్తులనన్నిటిని వృద్ధిపఱుచుటకై తగినంతకృషి చేయుచుండవలెను. మనదేశమునందు వృత్తులు మిక్కిలి హీనదశయందుండుటచేతనే మనకు సామాన్యముగా కావలసినవస్తువులు సహిత మితరదేశములనుండివచ్చి మనసొమ్మంతయు నితరదేశములపాలయి మనదేశ మంతకంతకు బీదస్థితికి రావలసినంతగతి పట్టినది. మనదేశమునం దుపయోగపడెడు కత్తులు మొదలగునవి యితరదేశ

ములనుండియే వచ్చుచున్నవి; కట్టుకొను బట్టలు బహుతరముగా పర దేశములనుండియే వచ్చుచున్నవి; వ్రాసికొనుకాగితములన్నియు నన్యదేశ ములనుండియే వచ్చుచున్నవి. చదువుకొన్నవారును ధనికులును వృత్తు లను వృద్ధిపఱుచుటకయి తగినంతకృషిచేసి యీదేశమునందే ఆయా పనులకు తగినయంత్రములను స్థాపింపఁజేసి పని సాగించినంగాని లేనియెడల కొంతకాలములోనే మనదేశములోఁగల ధనమంతయు నన్యదేశముల పాలయి పోవుననుటకు సందేహము లేదు. అన్నివృత్తుల యందును ప్రవేశించి వానిని వృద్ధిపఱుచుటకు చాలినంతమంది చదువుకొన్నవారు బయలుదేఱుటకయి జనసామాన్యమునకు విద్య చెప్పింప సాధ్యమయినంత ప్రయత్నము చేయవలయును. జనసామా న్యమునకు విద్యాభివృద్ధియైనంగాని దేశముయొక్క స్థితి బాగుపడదు. పనిచేసి జీవనముచేయు తరగతులవారికి చదువుకొనుటకయి తీఱుబడి యుండదని కొందఱు చెప్పుదురు. అది కొంతవఱకు నిజమేకాని చదు వుకోవలెనని యాసక్తియున్నచో నవకాశ ముండకపోదు. అట్టివా రల యుపయోగమునకయి రాత్రులయందు విద్యచెప్పు పాఠశాలలను స్థాపింపవలయును. అట్లున్నచో పగలెల్లను పనిచేసి వచ్చినవారికి కొంచెమయినను విశ్రాంతిలేక రాత్రులుకూడ చదువుకొనవలెనన్న చో మిక్కిలి భారముగా నుండునని కొంద ఱాక్షేపింపవచ్చును. పగలు పనిచేసి వచ్చిన వారికి మంచిపుస్తకములను జదువుటయే యొక విధమయిన విశ్రాంతిగ నేర్పడి సంతోషకరముగాను శ్రమనివార కముగానుకూడ నుండును. చదువుకోవలెనని బుద్ధియున్నచో నితర సమయములయందు సహితము కావలసినంత యవకాశమును కలుగఁ జేసికోవచ్చును. పుస్తకములు, ఉపాధ్యాయులు, ఇతరసాధనములును కావలసినన్ని యుండియు ధనికులపిల్లలు లోకభాషనైనను పూర్ణముగా నభ్యసింపలేకపోవుటయు, అట్టిసాధనము లేవియు లేకపోయినను పని

వాండ్రబిడ్డలు సహితము కొందఱు విద్యాభిరుచిగలవారై కొంచెము తీఱిక చేసికొని చదివి స్వయంకృషిచేత బహుభాషలయందు పండితు లయి గొప్పవారగుటయు, ఇతర దేశచరిత్రములనుబట్టి మనము తెలిసి కొని యున్నాము. మఱియును విద్యవలన జనసామాన్యముయొక్క స్థితి బాగుపడువఱకును మనస్థితియు బాగుపడనేరదు. వారు మూర్ఖులుగానే యున్నయెడల వారు మనము చేయఁబూనుకొన్న దేశక్షేమకరకార్య ములకును మన మాచరింపఁబూను సత్కార్యములకును ప్రతిబంధము లను గల్పించుచు దేశాభివృద్ధికిని మన యభివృద్ధికినిగూడ భంగము కలిగింతురు. అనేకులు విద్యావంతులయి విదేశములకు వెళ్ళి సామ యికపరీక్ష నిచ్చి గొప్పయుద్యోగములం బ్రవేశించి దేశమునకు మేలు చేయవలె నను తలంపు గలవారయ్యు మూఢులయిన కులమువారు తమ్ము బహిష్కరింతురని భయపడి యేమియు చేయనేరక యూర కుండఁగా మనము చూచుచున్నాముకామా? ఎంతమంది వివాహా దులయందలి యతివ్యయమును మానుకొనఁ దలఁచియు మూఢు లయిన సామాన్యజనుల దూషణములకు వెఱచి మాన్యములో మడులో తాకట్టు పెట్టుకొని సోమరిపోతులను మేపుటకయి వందల కొలఁది రూప్యముల వెచ్చపెట్టవలసినవా రగుచున్నారు? అతిబాల్య వివాహము దూష్యమని యెఱిఁగియు దానిని వారింప నెంతో యిష్ట ముండియు జనుల మౌర్ఖ్యమువలన వారల మరలింప శక్యముగాక కులమునుండి తొలఁగింతురేమో యను భీతిచేత నెందఱు తమ కొమా ర్తెలకు సహితము బాల్యములోనే వివాహము చేయవలసినవా రగు చున్నారు? స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమని స్పష్టముగా తెలిసియుండియు దాని నుద్ధరించుట లోకోపకారమని దృఢిగా నమ్మియు తా మట్టిపనియందుఁ బ్రవేశింప నత్యంతాభిలాష కలిగి యుండియు, ఆ పేరుచెప్పిన పులులవలె కఱవవచ్చు మూర్ఖజనుల బెద

రింపులకు భయపడి యెంతమంది తమ గర్భవాసమునఁ బుట్టి పతులను పోఁగొట్టుకొని దురదృష్టవంతురాండ్రయియున్న పసిబాలికలకు సహితము వివాహము చేయఁజాలక యావజ్జీవమును వారిని దుస్సహ దుఃఖము పాలుచేసి కన్నకడుపు దహించుకొనిపోవ తాముకూడ తీరని వ్యధ ననుభవింపవలసిన వారగుచున్నారు? తెలియని జనుల యుపహాస్యములకు జడిసి యెందఱు తమ దేహసంరక్షణార్థ మనుకూలమైన వస్త్రములను ధరించుకొనుటకును పాదరక్షలను తొడుగుకొనుటకును సందేహపడుచున్నారు? కాఁబట్టి మొట్టమొదట జనసామాన్యమునకు విద్య నేర్పించు నుపాయమును జూడవలెను. సామాన్యజనులు మాత్రమే కాక మన యభివృద్ధి కడ్డమువచ్చెడువారు మఱియొక తెగవారుకూడఁ గలరు? మూర్ఖురాండ్రయిన మన స్త్రీలుగూడ మనము చేయఁబూనిన ప్రతిసత్కార్యమునకును ప్రతిబంధకారిణులుగా నుండుట స్వానుభవమువలన మనకందఱకును దెలిసియే యున్నది. వారు సదా మనతో నుండి పోరుచుండుటచేత వారి కిష్టములేని పనినిచేసి యింట నెమ్మదితో నుండుట దుర్ఘటము. మూర్ఖపువట్టు పట్టి నిష్కారణముగా ప్రాణత్యాగమునకు సహితము సిద్ధపడు భార్యలను తల్లులను తమమార్గమునకు ద్రిప్పఁజాలక వారికిజడిసి యెంతమంది తెలిసినవారు తాముకూడ మూర్ఖులవలె ప్రవర్తింపవలసిన వారగుచున్నారుకారు? ఎంతమంది సభలలో దేశాభివృద్ధికరములైన పనులను జేయుటనుగూర్చి ప్రసంగించుటలో సింహములవలె నుండియు పనికిమాలిన యాఁడువారికి భయపడి యింటికి వచ్చినతోడనే యాచరణముమాట యటుండఁగా సభలలో చేసిన యుపన్యాసాంశములను బిగ్గరగా పలుకనైనను సాహసింపలేక పిల్లులవలె నొదిగియుండవలసినవా రగుచున్నారు? సామాన్యజనుల ప్రతిబంధమునకంటెను మనకు స్త్రీలదే గొప్పప్రతిబంధము. కాఁబట్టి స్త్రీలకు విద్యచెప్పించుట యెల్లవారికిని ప్రథమకర్తవ్యము.

మనము నిజముగా నభివృద్ధి చెంద నపేక్షించినచో సాధ్యమయినన్ని బాలికాపాఠశాలలను రాత్రిపాఠశాలలను బెట్టించి స్త్రీలను సామాన్యజనులను విద్యగలవారినిగాఁ జేయవలయును. పాఠశాలలున్నను జ్ఞానాభివృద్ధి కనుకూలమయిన పుస్తకములు లేకపోయినయెడల మన ప్రయత్నము కొనసాగదు గనుక మనలో శక్తికలవా రందఱును దేశభాషలలో సులభశైలిని గ్రంథములను రచియించుటకు వెంటనే పూనవలయును. స్త్రీలలోను సామాన్యజనులలోను చదువుకోకుండ తెలివి గలవారును సత్కార్యమునకు తోడుపడువారును లేరా యని కొంద ఱడుగవచ్చును. అట్టివా రక్కడక్కడ నొకానొక రుండవచ్చును గాని జనసామాన్యముమీఁద విద్యలేక జ్ఞానవంతులు గుణవంతులు నగుట సంభవింపనేరదు. గనులలో దొరకెడురత్నమువలెనే వికాసము నొందెడుబుద్ధి స్వాభావికముగానే పలువురకున్నను విద్యచే మెఱుఁగు పెట్టినంగాని దాని ప్రకాశమంతయు వెల్లడియయి లోకమున కుపయోగపడదు. విద్యాభివృద్ధి యగుట యొక్క పుస్తకములమూలము ననే గాక వినోదకరములును నీతిబోధకములును జ్ఞానజనకములునైన విషయములను నమయోచితముగా వ్రాయు వార్తాపత్రికలమూలమున కూడ విస్తారముగా నగును. గనుక, అట్టి దేశభాషావృత్తాంతపత్రికలకు గూడ తగినంత ప్రోత్సాహమును కలిగింపవలయును. మిత్రులారా! ఈ పయినిచెప్పిన సంగతులను మీ మనసులయం దుంచుకొని మీమీ చేతనయిన విషయములలో పనిచేసి దేశాభివృద్ధికయి పాటుపడుఁడు. ఈ ఘనకార్యము మనమందఱముఁ గలిసి పనిచేసినం గాని యొక్కని వల్ల నెఱవేఱునది కాదు. రేపటిదినము మనది కాదు. కనుక వెంటనే పనికి పూని భూమిమీఁద మనజన్మములను సార్థకపఱుచుకొనుట కయి యెల్లవారమును బ్రయత్నింతము. కొందఱింకను కాలము రాలేదు రాలేదని యేమియు లోకోపకారము చేయఁజాలక తమ

కాలమును వ్యర్థపుచ్చుచున్నారు. ప్రారంభింపక యాకాశమువంక చూచుచు నూరకున్నచో కాల మెప్పుడును రానేరదు. పనికి పూని చేయ నారంభించినచో కాలము తనంతనే వచ్చును; రాకున్నచో మనము కాలమును బలవంతముగా నీడ్చుకొనియైనను రావచ్చును. మఱికొందఱు పని కారంభించి విఘ్నములకు జడిసి పూనినకార్యమును నడుమ విడిచిపెట్టుచున్నారు. మనము తొందరపడిన కార్యము లేదు. గింజ నాటినతోడనే యది వృక్షమయి కాయలు కాయదు. ఒక్క నారికేళఫలమును భూమిలో నాటిన పక్షమున దానిఫలముల ననుభవించుట కయి పదిసంవత్సరములైనను కాచుకొని యుండి యీలోపల చెట్టును బ్రతికించుటకయి నమస్తకష్టములను పడుచుండవలయును. అటువంటి యత్యల్పఫలము విషయముననే యింతకాలము కనిపెట్టుకొని యుండ వలసి యుండఁగా లోకమునకంతకు ననంతములయిన ఫలములనిచ్చు నుత్కృష్టవిషయములలో నేఁడు కాలేదే రేపు కాలేదే యని తొందర పడి పూనిన కార్యమును నడుమను విడిచిపెట్టిన మనము హాస్యాస్పదులము కామా? తొందరపడక కార్యగౌరవమునుబట్టి ఫలానుభవమున కయి తగినంతకాల మోర్పుతో కనిపెట్టుకొని యుండి కృషి చేయుచుండవలెను. మొదట మనప్రయత్నము విఫలమైనచో మనకార్యము సఫలమగువఱకును మానక మరల మరల ప్రయత్నము చేయుచుండవలెను. ఒకవేళ మనము దానిని ముగింపలేకపోతిమా మనతరువాతివారు ముగించెదరు; మనము కట్టిన యిండ్లును, తోఁటలలో నాటినవృక్షముల ఫలములును తఱుచుగా మనసంతతివారి కుపయోగపడునట్లే మనము నాటిన సత్కార్యబీజములును తరువాత మొలకయెత్తి యాకులువేసి కొమ్మలుహెచ్చి మహావృక్షమయి దేశమంతటను వ్యాపించి యమూల్యములయిన ఫలములనిచ్చుచు లోకమున కంతకును సుఖము నియ్యవచ్చును. విత్తనము నాటితిమని యైన మనకు తృప్తికలుగును. ఎంతటి

సత్కార్యమున కయినను పలువురు ప్రతిపక్షు లేర్పడుటచే విరోధములును, ప్రతిబంధములును, విఘ్నములును రావచ్చును. అటువంటి వానివలన మన మెప్పుడును నిరుత్సాహులము కాఁగూడదు; అవియే యిట్టి సమయములలో మనలను ధైర్యశాలులనుగాను సుస్థిరులనుగాను జేయుటకయి తోడుపడు సాధనము లగునట్లుగా చేసికొనవలయును. అటువంటి సమయములలో ప్రతిబంధముల నన్నిటి నెదిరించి దృఢముగా నిలిచి మన కార్యమును సాధించుకొనఁగలిగినంగాని మనము నిజముగా గొప్పవారమును సత్కార్యనిరతులమును గానేరము. కష్టములు వచ్చినప్పుడే యుపయోగపడని ధైర్యము మఱి యెప్పటి కుపయోగించును? ఇట్టి ధైర్యము కలిగియుండుటచేతనే శక్తిమంతులు చేయలేని కార్యముల ననేకములను శక్తిహీనులు పూనికతో సాధించియున్నారు; అది లేకపోవుటచే సమర్థులుసహిత మత్యల్పకార్యములను సాధింపలేకయున్నారు. సత్కార్యములు చేయవలెనని బుద్ధి యున్నమాత్రమున కేవలము ప్రయోజనము లేదు. కార్యమును సాధించుటకై మొట్టమొదట మనము ప్రయత్నము చేసినయెడల కార్యమును సాధింపఁగలమను నమ్మకమును నుత్సాహము నుండవలెను; తరువాత సరిగా పనియందు ప్రవేశించి పూనికగలిగి పాటుపడవలెను; అటుపిమ్మట నెన్నివిఘ్నములు వచ్చినను వెనుకతీయక యీశ్వరముఖమును జూచి ధైర్యముతో ప్రయత్నమును మానకుండవలెను. మనలను మన కార్యములను నిర్వహించుటకు శక్తులనుగాఁ జేయునది యొక్క యీశ్వరభక్తియే; అది లేనిచో విశేషశక్తిమంతులును కార్యనిర్వహణమునందు దుర్బలు లగుచున్నారు. మనము లోకోపకారకమయిన యొక క్రొత్తపనికి పూనుకొనఁగానే బహుజనులు మనకు ప్రతిపక్షులుగా నేర్పడి మితిమీఱిన విఘ్నముల నాపాదించి బాధించుచున్నప్పుడును లోకమునకు వెఱచి మిత్రులుసహితము మనలను విడనాడినప్పుడును మనకు ధైర్యసాహస

ముల నొసఁగుటకును మనల నుత్సాహపఱచుటకును భగవంతుని ప్రాపుగాక మఱియేమికలుగును? రాజాధిరాజులకెల్లను ప్రభువయి నిగ్రహానుగ్రహసమర్థుఁడయిన పరమేశ్వరుఁడు మన హృదయసింహాసనము నధిష్ఠించియుండి చేసిన సత్కార్యమును మెచ్చి శాశ్వతసుఖమిచ్చెదనని యంతరాత్మద్వారమునఁ బలికి ప్రోత్సాహపఱచుచు మనకు సహాయుఁడయి యుండఁగా, దుర్బలులయిన మానవాధములు కోటిమంది ప్రతిఘటించి నిలిచినను వారి తుచ్ఛమయిన కోపమునకు జడిసి వెనుకతీయుదుమా? సర్వాంతర్యామియైన యీశ్వరుఁడు చెంతనుండి చూచుచుండఁగా మనకు విధియైన కృత్యమును చేయక మూఢుల యనుగ్రహమునకాశపడి యూరకుండ నెట్లు సాహసింపఁగలము? మనము భగవంతుని ప్రాపునే నమ్ముకొని కార్యభారము నాతనిమీఁదవేసి పని సాగించుచో సత్కార్యాచరణమునందు ప్రోత్సాహమును ధైర్యమును, అకార్యకరణమునందు నిరుత్సాహమును, భయమును కలిగించి కాపాడి మన కతఁడే నిత్యానందము నిచ్చును.

సహాయకష్టకర్తలు.

By

K. VEERESA LINGAM

సకాయకష్టకర్మలు

వివేకనిధులారా !

మన దేశములోని కర్మోపజీవుల వృత్తులనుగూర్చి ప్రత్యేక ముగాఁ జెప్పఁబూనినచో ననేకోపన్యాసములు కావలసి యున్నవి. వాని కన్నిఁటికిని పీఠికగా నుపయోగించునట్లుగా నిప్పుడు సామాన్య ముగా నాకుఁ దోఁచిన యంశములను గొన్నిఁటిని జెప్పుచున్నాను. పూర్వకాలమునందు శిల్పములచేతను, కళలచేతను మిక్కిలి ప్రసిద్ధి కెక్కి సమస్తదేశములవారి గౌరవమునకును పాత్రమయి యుండిన మన హిందూదేశ మిప్పుడు శిల్పాదులయందు మిక్కిలి హీనదశను పొంది కేవల పరిహాసాస్పదముగా నుండక పోయినను బహుదేశముల వారి యనాదరణ కర్హమయి యున్న సంగతి యించుక ప్రపంచ జ్ఞానముగల వారి కందఱికిని దెలిసియున్న విషయమే గనుక దీనిని స్థాపించుటకయి నేనిక్కడ నిదర్శనపూర్వకముగా పెంచి చెప్పవల సిన యక్కఱ లేదు. ఈ దేశమునందలి శిల్పాదివృత్తులు నానాటికి క్షీణదశకు వచ్చుచుండుటచేతనే మన ముపయోగించుకొనుచు వచ్చు వస్తువులలో మూఁడుపాళ్ళు సాధారణముగా నన్యదేశములయందుఁ జేయఁబడి యిక్కడకు పంపఁబడినవిగా నున్నవి. అందుచేతనే యించు మించుగా మనము కట్టుకొను వస్త్రములును, బట్టలు కుట్టుట కుపయోగ పడు సూదులు దారములును, మనము వేసికొను గుడ్డగొడుగులును, వ్రాసికొను కాగితములును, పనిచేయించుకొనెడు కత్తులును, గృహము లకు వేయించుకొనెడు తాళములును, మఱియు గృహకృత్యముల కుపయోగించు వస్తువులనేకములును పరదేశమునుండి వచ్చునవిగా

నున్నవి. ఇట్లుండుటచేత క్రమక్రమముగా మనదేశమందలి ధనమంతయు నన్యదేశముల పాలయి పూర్వకాలమందు నిరుపమానధనసంపన్నమని ప్రఖ్యాతికెక్కి, ధనాశాపాశబద్ధులయిన విదేశరాజుల హృదయముల నాకర్షించుచుండిన యీదేశమున కంత కంతకు బీదస్థితి పట్టవలసిన గతి సంభవమగుచున్నది. మగ్గములు మూలపడినందున సాలెవాండ్రు విలువబట్టలు నేసిన చేతులతో మట్టిగోడలు పెట్టవలసినవారగుచున్నారు; కమ్మరులు కత్తులుచేసిన హస్తములతో కట్టెలు కొట్టవలసినవారగుచున్నారు. మనదేశపుస్థితి యభివృద్ధినొందక యిదేప్రకారముగా నుండెడుపక్షమున, నింకకొంతకాలములో దారిద్ర్యదేవత వచ్చి మనదేశములోనే స్థిరవాస మేర్పఱుచుకొనుటకు సందేహములేదు. అట్టి దౌర్భాగ్యదశ మనదేశమునకు పట్టకుండఁ జేయవలెనని కోరెడుపక్షమున మనదేశమందలి వృత్తులవివరమును తెలిసికొని, వాని యిప్పటిస్థితికిఁగల కారణములను కనిపెట్టి, ముందు వానినభివృద్ధికి తేఁదగిన మార్గముల నాలోచించి, తగిన కృషిచేయుట దేశాభిమానము గలవారి కందఱికి నవశ్యకృత్యము. కాయకష్టము నపేక్షించెడు పనులు అద్దములు, కుండలు మొదలయిన మట్టిపనులును, నగలు, పాత్రసామగ్రి, గునపములు మొదలయిన లోహపుపనులును, గుళ్ళు గోపురములు, విగ్రహములు, మొదలయిన రాతిపనులును, బల్లలు, పెట్టెలు, మొదలయిన కఱ్ఱపనులును, వస్త్రములు, కొమ్ముపెట్టెలు, రత్నకంబళములు మొదలయిన చేతిపనులును, మనదేశమునందనేకములు గలవు. ఇట్టి శరీరప్రయాసముతో చేరిన పనులు వృద్ధిపొందిననే దేశ మభివృద్ధిచెంది జనులు బుద్ధియందును ప్రవర్తనమునందును మేలిమిచెంది బాగుపడుదురు గాని యితరవ్యాపారములవలన బాగుపడనేరరు. ఈ లోకములో కష్టపడినంగాని ఫలమేవిషయమునందును

లభింపదు. పలువురు కష్టపడినంగాని మనము కడుపునిండ భోజనము చేసి జీవించుటకయినను శక్తులము కాము. చెమట యూడ్చి కష్టపడి పనిచేయువాఁడు దేహారోగ్యము కలవాఁడయి సుఖజీవనము చేయుటకు శక్తుఁడగుటయే కాక సాధారణముగా యుక్తప్రవర్తనము కలవాఁడు సహితమగును. కొన్నిసమయములయందు వాణిజ్యము వలన నధికధనలాభము కలిగినను, అది జూదమువంటిదే యగును గాని దేహపరిశ్రమమును విశేషముగా కోరెడు సేద్యము, శిల్పములు మొదలయిన వానితో సమాన మెన్నటికిని కాదు. బహుకారణముల చేత నోడవ్యాపారము లోనుగాఁగల వర్తకవ్యాపారములయందు లాభమునకు మాఱుగా బహుతరముగా నష్టమే కలుగుచుండ వచ్చును. అంతేకాక వాణిజ్యకర్మమునందు సామాన్యముగా పోటీ బయలుదేఱి తన తోడివారియందసూయయు ద్వేషమును పుట్టుటయే కాక యబద్ధము లాడుటకును పరులను మోసముచేయుటకును నవకాశమును ప్రోత్సాహమును గలుగును. ఇట్లు చెప్పుటవలన వాణిజ్యము కూడదని కాని వర్తకులందఱును మోసగాండ్రని కాని నా యభిప్రాయము కాదు. వర్తకులలో సత్యసంధులయి న్యాయమార్గము నతిక్రమింపక ఋజువుగా ప్రవర్తించువారును పలువురున్నారు. ఎంత దూరదేశమునం దుత్పన్నములయ్యెడు వస్తువులయినను పెరటి పంటయయి యందఱికి లభించి సౌఖ్యాభివృద్ధిని కలుగఁజేయుటకును వాణిజ్యమే సాధనభూతముగా నున్నది; ధూమనౌకలును ధూమశకటములును గలిగి సముద్రమధ్యమునందుండు ద్వీపాంతరములు సహితము నదులలోని చేరువలంకలవలెను దూరదేశములుసహితము పొరుగూళ్ళవలెను సులభగమ్యములుగానున్న యీ కాలములో నెల్ల దేశములయందును జేసెడు వివిధవస్తువు లొక్కచోట లభించు సదుపాయము

లుండుటయేకాక వాణిజ్యధర్మమునుబట్టి తఱుచుగా దూరదేశము లకు రాకపోకలు చేసి వివిధదేశములవారి యాచారవ్యవహారములను గుణదోషములను గుర్తెఱిగి నాగరికతయందు వృద్ధిపొందుటకు కావ లసినన్ని యవకాశము లుండియున్నవి. అయినను మనవారు చిర కాలాగత మయియున్న జాత్యనుబంధముచేత కట్టుపడి స్వేచ్ఛావిహా రమునకు శక్తులు కాకపోవుటవలన వాణిజ్యమువలన మన దేశమునకు కలుగవలసినంత లాభము కలుగకున్నది. అట్లయ్యును జనుల యభివృద్ధి కిని లాభమునకును కొంతవఱకు తోడుపడును గనుక వాణిజ్యముకూడ నవశ్యముగా నుండవలసిన దనియే నా యభిప్రాయము. కాని నే నిప్పుడు మీ మనస్సులయందు నాటింపఁదలఁచినది వర్తకవ్యాపారమునకంటె వృత్తులయందు సుగుణము లధికముగా నున్నవనియు మంచినడవడికను దిద్దుకొల్పు శక్తి కలదనియు, నందుచేత కాయకష్టముతో చేరిన పనుల ననాదరముచేయక వృద్ధిపఱుచుట దేశముయొక్క యోగక్షేమముల కత్యంతాపేక్షణీయమనియు స్పష్టపఱుచుట తప్ప మఱియొకటి కాదు. పూర్వోక్తములయిన శిల్పాదివృత్తులయందు తక్కిన పనులకంటె శరీర ప్రయాస మెక్కువ పడవలసియుండును గనుక కర్మోపజీవులకు కష్టములకు సహించు మేలిగుణమును, పూనికతో పనిచేయు నుత్సా హమును, పనిని కడముట్ట నిర్వహించు మనోదార్ఢ్యమును, స్వభావ సిద్ధముగానే కలుగును. ఈ ప్రకారముగా కష్టపడి పనిచేయవలసిన యావశ్యకములేని వ్యాపారములయందున్నవారికి తమ మనస్సుయొక్క సంపూర్ణశక్తి తెలియుటయు, మనోనార్ఢ్యమును, కష్టముల కోర్చుకొను శక్తియు, పూనిక కలుగుటయు సంభవింపనేరవు. శరీరకష్టము నపే క్షించెడు పనులయందు దేహాయాస మనివార్యమే యయినను, ఆ యా యాసముండుటచేతనే మనము పైనిచెప్పిన సహనాదిగుణములను

వహించుటకు శక్తుల మగుచున్నాము. ఆ యాయాసమువలననే మనము భూమిని ఫలవంతమునుగాఁ జేసియు, దానిలోహాదివస్తువులను మన కుపయుక్తములయిన వివిధరూపములకు మార్చియు, నానా విధసుఖములను భోగములను ననుభవించుటకు శక్తులమగుచున్నాము. కాఁబట్టి మనము శరీరప్రయాసము నెన్నఁడును తిరస్కరింపరాదు. తాము కష్టపడి యెఱుఁగక యనాయాసముగా నితరులను జేరి జీవించు వారు నిజమయిన సుఖము నెప్పుడు ననుభవింపఁజాలరు; పనిలేక యూరక సోమరితనమున కాలముపుచ్చుటకంటె నాయాసకరమును దుఃఖప్రదమును లోకమున మఱి యేదియు లేదు. కాఁబట్టి తమ జీవనమునకయి పరుల కాశపడి యుండక యెల్లవారును నేదోయొక విధమున పాటుపడి గౌరవముతో జీవనముచేయుటకయి ప్రయత్నింపవలయును.

మన మింతవఱకును పనియొక్క యుపయోగమునుగుఱించి ప్రసంగించితిమి గనుక, ఇఁక మన దేశమునందు శిల్పాదివృత్తులు హీనదశయందుండి లాభకరములుగా నుండకపోవుటకు కారణము లేవో తెలిసికొని యా లోపములను వారించి యభివృద్ధిపఱుచుటకు తగినసాధనముల నాలోచింతము. మన దేశములో కృష్యాదు లభివృద్ధి చెందకపోవుటకు కారణము లనేకములు కలవు. కాని వానిలో ముఖ్యము లయిన వానిని మాత్రమే యిచ్చట ముచ్చటింతము. వీనిలో మొదటి కారణ మేమే పనిలో నెవరి కభిరుచిగలదో వారాపనులయందు ప్రవేశించి పనిచేయకుండుట. చిత్రములు వ్రాయుటయందే ప్రవీణత గలవానిని బట్టలు నేయుటయందును బట్టలు నేయుటయందే నేర్పు గలవానిని చిత్తరువులు వ్రాయుటయందును, నియమించి నిర్బంధముగా పనిచేయించినచో నేపనియు తిన్నగాజరగక రెండును హీనదశయం

దుండుననుట బాలురకు సహితము తెలియునుగదా? మన దేశమునం దాయా వర్ణములవారే యాయాపనులను చేయవలయు ననెడి నిర్బంధ ముండుటవలన నొకకుమ్మరి దంతపుపనియం దెంత యభిలాషమును నేర్పును గలవాఁడయినను దానిని మాని కుండలనే చేయుచుండ వలెను; ఒకస్వర్ణకారుఁడు వస్త్రములను రత్నకంబళములను నేయుట యం దెంత యభిరుచియు బుద్ధియుఁ గలవాఁడయినను వానిని వదలి సుత్తితో వెండిబంగారములనే సాగఁగొట్టుచుండవలెను; ఒకచాకలి వస్త్రముల కంచులద్ది రంగులువేయుటయందెంత ప్రవీణుఁడయినను దాని జోలికిపోక మయిలబట్టలనే యుతుకుచుండవలయును; ఒకమంగలి చిత్రములు వ్రాయుటయందెంత ప్రజ్ఞగలవాఁడయినను దానిపేరు తలపెట్టక బోడితలలనే గొఱుగుచుండవలయును; ఒకయీడిగెవాఁడు బంగారపుపనియం దెంత సమర్థుఁడయినను దానివంకఁ బోక తాటి కల్లే గీఁచుకొనుచుండవలయును. అనావశ్యకమైన యిన్ని జాతిభేదముల చేత పనివాండ్రు స్వేచ్ఛగా తమ బుద్ధి ప్రవేశించిన పనియందు ప్రవేశించి తమసామర్థ్యమును కౌశలమును కనఁబఱుచుటకు వలను పడక తమ కిష్టములేని పనులయందే విధిలేక యావజ్జీవమును గడప వలసినవా రగుచున్నారు. అందుచేతనే యీ హిందూదేశమునందు శిల్పాదివృత్తు లెప్పుడు నుండవలసినంత మంచిస్థితియం దుండకున్నవి. సాధారణముగా విగ్రహారాధన మధికముగాఁగల దేశములయందు ప్రతిమలు చెక్కుటయు దేవాలయనిర్మాణమును మహోన్నతదశయం దుండవలసియుండును. ఈజిప్టుదేశమునం దున్న మిన్నందుగోపురములను వానిమీఁది పనిని చూచినవారు మానుషశక్తి యంతటి పరిపూర్ణతను పొందునాయని యద్భుతరసాక్రాంతులు కాకపోరు. విగ్రహారాధన మత్యంతప్రబలముగానున్న యీ దేశమునం దటువంటి

యాశ్చర్యజనకములయిన విచిత్రవిగ్రహములును నిరుపమానదేవాలయములును విశేషముగా లేకపోవుటకుకూడ జాతిభేదముల యధిక సంఖ్యయే కారణముగానున్నది. ఈ జాతిభేదములవలన నిష్ప్రయోజకులయిన సోమరిపోతులు సహితము జన్మప్రభావమువలన తామెక్కువవార మని గర్వించి గుణశక్తిసంపన్నులయిన యితరులను గౌరవింపక పరాభవించుటయు, లోకోపకారపారీణులయిన యుత్తమపురుషులు సహితము గుణశీలసామర్థ్యాదులచేత నసమానులయియుండియు జన్మదోషమువలన తలయెత్త వీలులేక యెక్కువవారమని మదించి తిరిగెడి యధములచే నవమానపఱుపఁబడి యర్హపదమును పొందక నిరుత్సాహులగుటయు, అందుచేత పరస్పరద్వేష ముదయించి యైకమత్యములేక దేశము చెడిపోవుటయు సంభవించుచున్నది. ఇప్పుడు చెప్పినరీతి జాతిభేదములు లేకపోయినను ధనపాండిత్యాధికారతారతమ్యాదులనుబట్టి కొంద రెక్కువవారును కొందఱు తక్కువవారు ననెడి భేద మెప్పుడు నుండును గాని యిప్పటివలె నయోగ్యులు తామధికులమని గర్వించుటయు యోగ్యులు హీనులుగా గణింపఁబడి లాఘవము పొందుటయు నంతగా నంభవింపవు. జాతిభేదమును గూర్చిన విచార మిక్కడ ననావశ్యక మగుటచేత నా యంశము నింతట విడిచిపెట్టి యెవ్వరేజాతియందున్నను తా మేదో యొక్కవృత్తినే యవలంబించి యామరణాంతమును దినములు పుచ్చుకతీఱ దను దుర్భ్రమ పడక, తమ కేవృత్తియం దభిరుచి గలదో దేనిమీఁద తమ బుద్ధి చక్కఁగా వ్యాపించునో దేనిని తాము జనరంజకముగా నిర్వహింప శక్తులగుదురో యా వృత్తినే యెల్లవారు ననుసరింప ప్రయత్నింపవలయుననియు, అట్లుచేసిననే కాని చేతిపనులు వృద్ధిచెంది లాభకరములుగా నుండవనియు, వారట్లు చేయునట్లు ప్రోత్సాహపఱుచుట

దేశాభివృద్ధి నపేక్షించు మనకందఱకు ధర్మమనియు నొక్కి చెప్పు చున్నాను.

మనదేశములో శిల్పాదుల హైన్యస్థితికిఁ గాలానుగుణముగా కావలసిన మార్పులను చేసికొనక పూర్వాచారమునుబట్టి యెప్పుడు నేక రీతిగా గుడ్డియెద్దు జొన్న పడ్డట్టు పనిచేయుచుండుట రెండవకారణ మని చెప్పవచ్చును. మనదేశములో నిప్పుడు పనిచేయుచున్న రీతి పూర్వకాలమునకు సరిపడినదే యున్నను నానావిధముల నభివృద్ధి చెందుచున్న యీకాలమున కెంతమాత్రమును తగియుండదు. బాల్య మున తొడుగుకొనెడు పాదరక్షలాకాలమున కెంతో యనుకూలముగా నుండినను బాలుఁడు పెద్దవాఁడై పాద మెదిగిన తరువాతకూడ నట్టి జోడునే తొడుగుకొనవలయు నన్నచో నది యుపయోగింపక పోవుట యేకాక కాలికి నష్టమునుకూడ కలిగించును. అదేప్రకారముగా ప్రపం చముయొక్క బాల్యస్థితియం దత్యంతోపయుక్తములుగా నున్న స్థితినే కాలానుసారమైన మార్పును చేసికొనక యిప్పటి వృద్ధిదశయందుకూడ నుపయోగింపవలెనన్నచో నష్టము కలుగక యేప్రకారము లాభకర ముగా నగును? అయోమార్గములమీఁద వాయువేగమున ధూమ శకటములు చౌకగా సరకులను గొనిపోవుచుండఁగా నాచేరువను మోటుబండ్లమీఁద మందగమనమున ప్రియముగా వస్తువులను గొని పోవ ప్రయత్నించుచో వృథాప్రయాసముగాక లాభ మెట్లు కలుగ నేర్చును? ఆవిరియంత్రములతో దినమునకు వస్త్రశతములను నేసి యల్పమూల్యమునకు విక్రయించుచుండగా పూర్వకాలపు మగ్గముల మీఁద మూఁడుదినములకొక బట్టను దింపి యెక్కువవెల కమ్మఁబూని నచో లాభ మేరీతిని కలుగును? కాబట్టి వృత్తులు నిజముగా లాభ కరములుగాఁ జేయవలె నన్నచో నీకాలమునకు తగిన పనిముట్లను

సంపాదించి యితరసాధనముల నన్నిటిని కాలానుసారముగా మార్చుకొని నేర్పుతో పనిచేయవలయును. ఇప్పటి యంత్రములు మొదలయినవి విశేషవిత్తసాధ్యములును మన . పనివాండ్రు ధనహీనులు నైనందున నట్టిపని యెట్లు పొసఁగునని యెల్లవారికిని స్థూలముగా తోఁచ వచ్చును. ఈయాక్షేపణ కొంతవఱకు ప్రబలమయినదే కాని ప్రతి క్రియ లేనిది కాదు. ఒక్కఁడు ప్రత్యేకముగాఁ జేయఁబూనినచో నెల్లపనులును నసాధ్యములుగానే కనఁబడును. ఆపనులే పదిమంది యేకీభవించి చేసెడిచో సులభసాధ్యములగుట యెల్లవారికిని నను భవసిద్ధమయి యున్నది. ఈలోకములో నెటువంటి దుస్సాధ్యములను నిమిషములో సుసాధ్యములనుగాఁ జేసెడి యద్భుతశక్తి యొకటి సంఘీ భావమునందున్నది. స్వప్రయోజనపరులయి యెవరిమట్టుకు వారు వేఱుపడక సంఘీభవించి యైకమత్యముతో పనిచేసినచో లోకములో సాధింపరాని కార్యములు బహుస్వల్పముగా నుండును. కాఁబట్టి శత కోటి సంఖ్యల జనులున్న యీదేశములో వేలకొలఁది జనులు కాకపోయి నను నూఱులకొలఁదియైనను సంఘములుగాఁజేసి కావలసినంత ధన మునుచేర్చి కావలసిన పనిముట్లను యంత్రాది సాధనములను సులభ ముగాఁ దెప్పించవచ్చును. ఈపని సంఘీభవించి చేయవలసినదేకాని యొక్కఁడనో లక్షాధికారులకు తప్ప సాధారణముగా నొంటరిగా చేయుట శక్యముకాదు. కాఁబట్టి మనదేశమున నిప్పు డడుగంటి యున్న కళలను శిల్పములను పునరుద్ధారణముచేసి దేశమును భాగ్య సంపన్నము చేయు తలంపుగల దేశాభిమాన మాననీయులు మనవారిలో నైకమత్యము పుట్టించి, సంఘీభవించుటవలని యనంతములైన లాభ ములను తెలిపి, యీదేశమున వస్త్రాదుల నిప్పటి యంత్రాదిసాహా య్యమునఁ జేయునట్లు చేయవలయును. కాలానుగుణములైన మార్పు

లను పొందక యెప్పుడు నేదేశము బాగుపడదని మీరు దృఢముగా నమ్మి దానికై తగినంతకృషి చేయుదురని మీకు మఱిమఱి తెలుపుచున్నాను.

ఈ హిందూదేశమున శిల్పాదులు వృద్ధిపొందక నీచదశయందుండుటకు మూఁడవకారణము కులానువృత్తు లవలంబించినవారు విద్యావిహీనులుగా నుండుట. ఏపనినిగాని చక్కగా నాలోచించి చేయనిచో, ఆపని క్రమముగా నెఱవేఱదని యెల్లవారికిని తెలియును. ఒకపని విషయమయి యాలోచించుటకు మొట్టమొదట వాని కార్యాంగవస్తు ధర్మములు తెలియవలెను. అట్లు తెలియనిపక్షమున వాఁడావిషయము నందు తనబుద్ధిని చొప్పించి పూర్ణముగా నాలోచించి చేసెను గని నంతకంతకు వృద్ధిపఱుచుటకును తదనుగుణముగా క్రొత్తపనిముట్లను బుద్ధిబలమున కనిపెట్టి నిర్మించుటకును శక్తుఁడు కాఁజాలఁడు. ఇందుకు నిదర్శనముగా కృషిచేయువాఁడు తన భూమిని సదా ఫలవంతముగాఁ జేసికొని యెక్కువలాభమును పొందదలచినయెడల వాఁడు మట్టిలో నుండు మూలపదార్థముల స్వభావమును, వానిలో నేవి యేపైరుకు ముఖ్యములో, యేపైరుతరువాత నేపైరు పెట్టినచో భూమి సారము చెడకుండ ఫలము నిచ్చుచుండునో, భూమి నిస్సారమయినచో ససారమునుగాఁ జేయుటకయి యెప్పు డెట్టువంటి యెరువు కట్టవలయునో, కాలువల నేప్రకారముగా త్రవ్వి నీరెట్లు ప్రవహింపఁజేయవలయునో, నాగేళ్లు మొదలయిన సాధనముల నేప్రకారముగా బాగుచేసి యుపయోగింపవలయునో, పొలములు దున్ను పశువుల నే ప్రకారముగా మేపవలయునో, వానికి రోగములువచ్చినప్పు డేప్రకారముగా నేమేమి చికిత్సలు చేయవలయునో, తెలిసికొనవలసి యుండును. అట్లు తెలిసికొని సాస్త్రానుసారముగా సేద్యముచేసి, పిత్రాచారమును బట్టియే

యెప్పుడు నేకరీతిగా వ్యవసాయము చేయువానికంటె ద్విగుణముగాను త్రిగుణముగాను ఫలమునొందవలె నన్నవాఁడు రసవాదశాస్త్రము, పశువైద్యశాస్త్రము, వ్యవసాయశాస్త్రము, మొదలయినవాని నెన్నిటినో నేర్చుకొనవలయును. కాలువలు త్రవ్వి సీరు నడుపువారు జలము యొక్క ధర్మములను తెలియుటకయి జలశాస్త్రమును జలయంత్రశాస్త్రమును నభ్యసింపవలయును. అద్దములు మొదలయిన వానిని జేయువారు తాము చేసెడిపనిని క్రమక్రమముగా నభివృద్ధిచేయ నపేక్షించినపక్షమున తదనుగుణములయిన జడపదార్థధర్మములను బోధించెడు ప్రకృతిశాస్త్రముల నవశ్యముగా గ్రహింపవలెను. ఇట్లేప్రవృత్తినభివృద్ధి పొందించి తగిన ప్రతిఫలము నిచ్చుదానినిగాఁ జేయవలె నన్నను దానితో సంబంధించిన విషయములను తగినంతవఱకుఁ జదివి దాని యభివృద్ధికయి యాలోచించుచు మునుపున్న లోపములను దిద్ది కావలసిన మార్పులను జేయుచు క్రొత్తపనిముట్లను కల్పించుచు పాటుపడక తప్పదు. ఇటువంటిపని విద్యాగంధములేని మూఢశిరోమణుల చేత కానేరదు. ఇట్లని వ్యవసాయము మొదలయినవి చేయువారందఱును ప్రతివిషయమునందును సంపూర్ణపాండిత్యము పొందవలెనని నేనిప్పుడు చెప్పవచ్చినవాఁడనుకాను. తాను చేసెడుపనిని సామర్థ్యముతోను సంపూర్ణోపయోగముగాను నిర్వహింపఁగోరినయెడల నట్టి పనితో సంబంధించిన జ్ఞాన మనివార్యముగా నుండవలయును గనుక కులవృత్తికి తగిన చదువు పనివాండ్రకు తప్పక చెప్పింపవలెనని మాత్రము నాతాత్పర్యము. శాస్త్రమునం దేశాఖ నభ్యసింపవలె నన్నను ముందుగా కొంతవఱకు భాషాజ్ఞానమును కలిగియుండవలసినదే గనుక, సమస్తవృత్తులవారికిని ప్రతిగ్రామమునందును పాఠశాలలుంపించి వారి నందఱఁ జదివించుట యుక్తము. ఇప్పుడు కులవృత్తులు

చేయువారందఱు చదువక్కఱలేకుండ తమతమ వ్యాపారములను చక్కఁబెట్టుకొనుచుండలేదా ? పొలములు దున్నువారికి చదువ నవకాశముండునా ? అని మనవారు కొందఱనవచ్చును. ఈవృత్తుల నెదుగుబొదుగులు లేక యిప్పటిరీతిగానే యుంచి శీఘ్రకాలములోనె దారిద్ర్యదేవతకు పట్టాభిషేకముచేసి మనదేశమును సమర్పింప నిశ్చయించుకొన్నయెడల పనివాండ్రకు చదువక్కఱయుండదు; గాని వారి నావేశించియున్న మూర్ఖతాపిశాచమును పాఱఁదోలి వృత్తుల నభివృద్ధినొందించి దేశమును భాగ్యలక్ష్మికి నివాసస్థానముగాఁ జేయ నుద్యమించి నప్పుడు మాత్రము వారికి విద్యఁజెప్పించి యభివృద్ధి మార్గము నాలోచించుటకు తగిన శక్తిని గలిగింపక తప్పదు. ఇఁక వారికిఁ జదువు నేర్చుకొనుట కవకాశముండునా యను విషయములో తమకు నావశ్యకమని తెలిసికొని వారు విద్యయందు శ్రద్ధగలవారయినచో నవకాశము కావలసినంత దొరకును. బుద్ధి కుదిరినచో నవకాశమెన్నటికిని దొరకకమానదు. పాఠశాలయందు మాత్రమే కాక యింటకూడ పాఠములు చెప్పుటకు నొకరిద్దఱుపాధ్యాయులుండ చదువుటకు కావలసినన్ని పుస్తకములుండి యితరసాహాయ్యము లనేకము లుండినను శ్రద్ధయొక్కటి లేకపోవుటచే ధనికుల బిడ్డలలో కొందఱి కొక్క విద్యయు రాకపోవుటయు పయిసాధనకలాపములో నొక్కటియు లేకపోయినను శ్రద్ధయొక్కటిమాత్ర ముండుటచే బీదబిడ్డలు కొందఱు విద్య లనేకము లల్పకాలములో గ్రహింపఁ గలుగుటయు, పలువు రెఱిఁగియుండవచ్చును. కాఁబట్టి యవకాశ ముండదనుమాటను దూరముగా నుంచి వృత్తులను మంచిస్థితికిఁ దీసికొని రాఁగోరెదము మనము పనివాండ్రకెల్లను విద్యయందు శ్రద్ధాభక్తులు కుదురునట్లు చేయుటకును, చదువునందు బుద్ధిగలవారి నిమిత్త

మయి పాఠశాలలను స్థాపించునట్లు చేయుటకును, శక్తివంచనలేక సమస్తప్రయత్నములు చేయవలయును. వీరికి పగటిపూట చదువు చెప్పెడి చిన్నపాఠశాలలు మాత్రమేకాక పగలు పనిచేసి వచ్చు వారి కుపయోగపడునట్లుగా తగినన్ని రాత్రిపాఠశాలలుకూడ స్థాపింపవలయును. ఈవిషయమున సీవఱకే దొరతనమువారును స్థలనిధిసంఘములవారును నగరపారిశుద్ధ్యవిచారణ సంఘమువారును శ్రద్ధపుచ్చుకొని కొంత పనిచేసియున్నారు. అయినను జనులతోడ్పాటులేక ప్రభుత్వమువారిప్రయత్నములు పూర్ణముగా కొనసాగఁజాలవు గనుక దొరతనమువారు పనిచేయుచున్నారని యుపేక్షచేయక జనసామాన్యముయొక్క వృద్ధికయి సాధ్యమైనంత పని చేయుట మనకుకూడ పరమధర్మమే.

ఈప్రకారముగా మనదేశమున వృత్తులుత్కృష్టదశను పొందక పోవుటకుఁ గల కారణము లనేకములున్నను వానినన్నిటిని వివరించుట కిప్పు డవకాశముచాలక యింకొక్క యంశమునుమాత్రము చెప్పి ముగించుచున్నాను. ఈదేశమునందు చదువుకొన్నవారు తాము వృత్తులయందు ప్రవేశించుట తమగౌరవమునకు హానికరమని దుర్భ్రాంతి నొంది వృత్తులపొంత పోనొల్లకుండుటకూడ వృత్తుల నికృష్టదశ కొక ముఖ్యకారణముగానున్నది. నాలుగుముక్కలు చదివినతోడనే తామేమో మహావిద్వాంసుల మయితిమనియు తమపాండిత్యమున కిఁక తాతముత్తాత లాచరించిన వృత్తి ననుసరించుట గౌరవలోపమనియు దురభిప్రాయపడి మనవారనేకులు తమదుష్పాండిత్యముచేత నెందుకుం బనికిరాక చెడిపోవుచున్నారు. ఇందుకు దృష్టాంతముగా నాచిన్నతనములో నొకమంగలి రాజమహేంద్రవర రాజకీయ పాఠశాలలో నాలవతరగతివఱకును జదివి చాలించి, తనకులానుగతమయినవృత్తి నవలంబించుట లాఘవాస్పదమని తన యల్పవిద్యా

ప్రభావముచేత నిశ్చయించుకొని, యుద్యోగమున కాశపడి యెల్లవారి నాశ్రయించి న్యాయమార్గమున సుఖజీవనము చేయుటకు చాలిన ధనమును వేఱువిధమున సంపాదించుకోలేక దారిద్ర్యభూతముయొక్క ప్రేరణముచేత చౌర్యమునందు ప్రవేశించి, కడపట చెఱసాలయందు పడి చెడి చిక్కులుపడఁగా నేను ప్రత్యక్షముగా చూచియున్నాను. ఇటువంటి యల్పవిద్యావంతులయిన మహాపండితులు తాము రాజకీయోద్యోగములకే యర్హులమనియు, ఇతరవృత్తులేవియు తమగౌరవమునకు తగనివనియు, తామెంత కష్టపడియైనను రాజకీయకార్యస్థానములయందు కొలువుకుదిరి తమయావజ్జీవమును దానికి ధారపోయవలయుననియు, దృఢనిశ్చయులై లోపల పొట్టకు తిండిలేక పోయినను పయికి బొట్టులును బట్టలును సవరించుకొని సంవత్సరముల కొలఁది జీతబత్తెములు లేక కార్యస్థానములవెంట నూరారఁదిరిగి వెట్టికి పనిచేయుచు, నైచ్యమునకు వెనుకతీయక యుద్యోగస్థుల యిండ్లచుట్టును దిరిగి బుజములు పడిపోవ వారిపిల్లలనుమోచి యాశ్రయించుచు, పేరులేని చిన్నయుద్యోగస్థులు సహితము వెట్టిపనిలో తప్పులెన్ని పెట్టు చీవాట్లే తమకు లాభముగా తమ జన్మములను సార్థకపఱుచుకొనుచుందురు. ఒక్క యల్పవిద్యావంతులకేకాక బహుపరీక్షలం గృతార్థులయిన వారికిని, రాజసేవకే యాశపడి తిరుగుచుండుటవలన నించుమించుగా నిటువంటిగతియే సంప్రాప్తమగుచున్నది. రాజకీయోద్యోగముల సంఖ్యకంటె పరీక్షలం గృతార్థులగువారి సంఖ్య యత్యధికమగుచున్నందున కొందఱికేకాని యందఱికిని పనులు దొరకనేరవు. ఒక్కపనికయి గోతిదరినక్కలవలె ననేకులు నోరుతెఱచుకొని కనిపెట్టుకొని యుండుటచేత నిప్పు డుద్యోగగౌరవమే చెడిపోయినది. రెండురూపాయల జీతమిచ్చినచో నలుగురు పరీక్షోత్తీర్ణులు దొరకు

చున్నారుగాని యెనిమిదిరూపాయలు జీతమిచ్చినను తిన్ననివంట బ్రాహ్మణుఁడు దొరకుట దుర్లభముగా నున్నది. ఈప్రకారముగాఁ జదువుకొన్నవారందఱును రాజసేవకొఱకే కాచుకొని యున్నయెడల మోసపోయి తుదకెందునకుం బనికిరానివారగుదురు. స్వాతంత్ర్యము లేకపోవుటచేత సేవకవృత్తి తక్కిన వృత్తులన్నిటికంటె మిక్కిలి యధమమయినది. కాఁబట్టి చదువుకొన్నవారు తప్పక వృత్తులన్నిటి యందును ప్రవేశించి పనిచేయవలసిన కాలము వచ్చినది. అట్లు ప్రవేశించుటచేత వారు తాము లాభమునుపొంది సుఖజీవనము చేయుటకు శక్తులగుటయేకాక వృత్తులను మంచిస్థితికి తెచ్చి దేశమునకు క్షేమము చేసినవారగుదురు. విద్యాధికులు ప్రవేశించినయెడల నన్ని వృత్తులును గౌరవావహములే యగునుగాని గౌరవమునకు భంగము తెచ్చెడి వృత్తి యేదియు నుండదు. ఇంతవఱకును చదువుకొన్నవా రెవ్వరును ప్రవేశింపక పోవుటవలన కొన్నివృత్తులు నీచములుగా తలంపఁబడుచున్నవేకాని నీచములగుటకు వృత్తులు చేసిన పాపమేదియు లేదు. ఎప్పుడును వృత్తులయందు ప్రవేశించినవారినిబట్టి వృత్తులకు గౌరవము రావలయునేకాని వృత్తులనుబట్టి ప్రవేశించినవారికి గౌరవము రాఁబోదు. పురుషునకు నిజముగా గౌరవము తెచ్చునవి సత్యమును శాంతమును యుక్తప్రవర్తనమును విద్యయుఁ గాని ధనసంపాదనమున కయి యవలంబించిన వృత్తులు కావు. ఇప్పుడు సర్వోత్కృష్టమయిన దని యెంచఁబడెడు వృత్తియందైనను నీతిమాలినవారును మూఢులును ప్రవేశించి పనిచేయఁజొచ్చినచో దాని గొప్పతనమంతయు మూఁడు దినములలో మూలఁబట్టి మిక్కిలి నీచమయినదగును. ఇప్పుడు మిక్కిలి నికృష్టమయినదని తలంపఁబడెడు వృత్తియందయినను చదువుకొన్న వారును యుక్తప్రవర్తనము గలవారును ప్రవేశించి పని సాగించు

చున్నచో నిమిషములో దాని కెక్కడలేని గౌరవమును వచ్చి సర్వజన సమాదరణీయ మగును. మనలోని చదువుకొన్నవా రీసత్యమును మనసునందు దృఢపఱుచుకొని కొందఱు ముందుగా తాము మార్గప్రదర్శకులయి జనులలోఁగల దురభిప్రాయమును తొలగించి వృత్తులను క్రమపఱిచి దేశమును ధనసంపన్నము చేయుటకయి ప్రయత్నింతురని దృఢముగా నమ్ముచున్నాను. అట్లు ప్రవేశించినవారు మంచిసాధనములను కనిపెట్టి పనిని సులభపఱిచి తావిత్తాఢ్యులయి మొత్తముమీఁద దేశమున కంతకును లాభము కలుఁగజేయ శక్తులగుదు రనుటకు సందేహముండదు. చదువుకొన్నవారు వృత్తుల నవలంబించి యుండుటచేత యూరపుఖండమునందు దినదినము నే ప్రకారముగా క్రొత్తసాధనములు కనిపెట్టఁబడి పని సులభపడుచున్నదో యెఱిఁగినవారి కీసంగతి వింతగా కనఁబడదు. మనదేశమునం దిప్పుడున్న యుపకరణములలో లోపము లేమి యున్నవనియు వానిని బాగుపఱుపవలసిన యావశ్యకమేమున్నదనియు కొందఱు భావింపవచ్చును గాని వారియూహ యెంతమాత్రమును సరియైనది కాదు. లోకములో మనుష్యుఁడుచేసిన కార్యములన్నియు నంతకంత కభివృద్ధి పొందఁదగినవిగా నుండును. ఈదినమున పూర్ణముగా నున్నట్టు కనఁబడునవి రేపటిదినము మరల నాలోచించినచో వానియందు కొన్నిలోపములగపడి మరల మార్పఁదగినవిగా కనఁబడుచుండును; కొన్నివస్తువులయందు లోప మొక్కసారిగా కనఁబడక పోయినను వానిని సులభముగా చేసెడు సాధనములయందు లోపములగపడి యభివృద్ధికి తగినవిగా నుండును. ఈ ప్రకారముగా నాలోచించిన కొలఁదిని పూర్వపువారెప్పుడును నెఱుఁగని క్రొత్తవస్తువులను నిర్మించువిధమును కనిపెట్టుటకును వానిని మేలిమి చెందించుటకును వానిని చేయుసాధనముల

బాగుపఱుచుటకును నావశ్యక మగపడును. దేశము నాగరికతయం దును సుఖభోగాదులయందును వృద్ధిపొందుట కిదేమార్గము. చదువు కొన్నవారు శిల్పాదివృత్తులయందు ప్రవేశించి కొన్ని సంవత్సరములు పూనికతో పనిచేయు భాగ్యము మనదేశమునకు లభించిన తరువాత అద్దములు, కుండలు, పెంకులు, ఇటుకలు, మొదలయిన మట్టిపనుల యందును, వంతెనలు, విగ్రహములు, మండపములు, దేవాలయ ములు మొదలయిన రాతిపనులయందును, బల్లలు, పెట్టెలు, మంచ ములు, బండ్లు మొదలయిన కఱ్ఱపనులయందును, కాలువలు, నూతులు, చెఱువులు మొదలయిన నీటిపనులయందును, చిత్రములు వ్రాయుట యందును, రంగులు వేయుటయందును, తివాచులు బట్టలు మొద లయినవి నేయుటయందును, బెత్తపుపనులయందును, కొమ్ముపనుల యందును, తక్కిన యన్నిపనులయందును, ఎంతో యభివృద్ధిసి చూడ వచ్చును. అప్పు డావిరియంత్రములును నీటియంత్రములును గాలియం త్రములును దేశమంతటను వ్యాపించి దేశము కన్నులపండువుగా నుండవచ్చును. ఇదియంతయు మనకిప్పుడు స్వప్నములోని వార్తగా తోఁచవచ్చునుగాని చదువుకొన్నవారు దేశాభిమానులయి తమ కృత్యమును తెలిసికొని వృత్తులయందు ప్రవేశించి దేశాభివృద్ధికి తమ శరీరములను ప్రాణములను ధారపోసినచో నచిరకాలములోనే యీ చెప్పినదంతయు మన కన్నులయెదుట నగపడుసత్యమే కావచ్చును. మనుష్యుల కుపచారములు చేయుట మొదలయినవి కొన్ని సేవకవృత్తు లేగనుకను, అన్నివృత్తులలోను సేవకవృత్తి యధమమయినది గను కను, పెంటలెత్తుట, దొడ్లుతుడుచుట, బట్టలుతుకుట మొదలయిన కొన్నిపనులు న్యాయముగానే యెల్లదేశములయందును సమస్తకాల ములయందును నీచములుగా చూడఁబడుచున్నవి. అందుచేత వాని

లంబించినవారికి తక్కినవృత్తుల నవలంబించిన వారికి గల గౌరవ ముండదు. దేశమందెంత విద్యాభివృద్ధియైనను సమస్త జనులును పండితులగుట యెన్నఁడును సంభవింపనేరదు; కొందఱు గాకపోయిన కొందఱయినను మూర్ఖులయి యుండకతప్పరు. అటువంటివారే సాధారణముగా నీకడపట చెప్పిన నీచవృత్తులయందు ప్రవేశించి పని చేయుచుందురు. అవి తప్ప గౌరవమునకు భంగము కలిగించెడు నట్టియు విద్యావంతుల కర్హములు కానట్టియు వృత్తులు మఱియేవియు లేవు. ఇవిసహితము మన దేశమునం దిప్పుడు గౌరవప్రదములుగా నెంచఁబడుచున్న భిక్షాదివృత్తులకన్న వేయిరెట్లు శ్రేష్ఠమయిన వనియే చెప్పవచ్చును. సోమరితనమున కాలము గడపుచు స్వకాయ కష్టపడక పరులవిత్తమువలన జీవించుటకంటె హేయమైనవృత్తి లోకములో నేదియు నుండదు. యాచ్ఞావృత్తి పరమనికృష్టమైన దనియు దానికంటె లాఘవాస్పద మయినది మఱియొకటి లేదనియు మనపూర్వు లనేకవిధములఁ జెప్పియున్నారు. వారిలో నొకకవీశ్వరుఁడు యాచకుఁడు గడ్డిపఱకకంటెను తేలికయనియు, గడ్డిపఱకలు గాలి కెగురఁగొట్టుకొని పోవుచుండఁగా యాచకుఁ డెగురకొట్టుకొని పోకుండుటకుఁగల కారణము దరికి చేరనిచ్చినచో వాఁడు తన్ను కూడ యాచించి పీడించునని గాలిదేవుఁడు భయపడుటయేయనియు, చమత్కారముగా చెప్పిన శ్లోకము ననేకులు చదివియుందురు. కాలకర్మ దోషమువలన నిప్పుడగౌరవముగా నెంచఁబడకున్న యాచ్ఞావృత్తి నశించి కష్టపడి స్వార్జితమువలన జీవించు వృత్తులే గౌరవావహములని యేర్పడినంగాని దేశమెన్నటికిని బాగుపడదు. చదువుకొన్నవారు వృత్తులయందుఁజేరి పనిచేసినఁగాని వృత్తులకు గౌరవము రాదు. మన తొల్లింటి మహానుభావులు నహితము తాము వృత్తులయందు

ప్రవేశించి యేవృత్తి నవలంబించినను న్యాయమార్గావలంబనులకు గౌరవలోపము లేదని లోకమునకుఁ జూపి యున్నారు. రాజసూయా ధ్వరముచేసి సార్వభౌముఁడైన ధర్మరాజంతవాని తమ్ములు నకుల సహదేవు లశ్వపాలనమును గోపాలనమును నీచముగా నెంచక పనిచేసి యున్నారు; దిగ్విజయముచేసి విజయుఁడని పేరొందిన యాసార్వభౌముని తమ్ముఁడే నాట్యాచార్యుఁడుగా నుదిరెను; చక్రవర్తియైన నలుఁడును, భీముఁడును వంటలవారుగా నుండుటకు సంశయింపలేదు. ఈకడపట చెప్పిన వారిరువురును విద్యాధికులగుటచే పాకకౌశలమునం దసమానులై నలపాక భీమపాకములని లోకులు సామెతగా చెప్పుకొనునంత ప్రసిద్ధి కెక్కిరి., అంతకుపూర్వమే వారికి చిరకాలాభ్యాసము లేక పాకవిద్యయం దటువంటినేర్పు కలుగుట సంభవింపదుగదా? అది యెట్లైన నను రాజాధి రాజులు పాదాక్రాంతులై పనిచేయ సమస్తగౌరవములను పొందిన కిరీటాధిపతులు సహితము సమయము వచ్చినప్పు డట్టి వృత్తుల నవలం బించుట గౌరవహీనతగా నెంచలేదనియు, వారటువంటివృత్తులయందు ప్రవేశించుటవలన వారిగౌరవము లేశమాత్రమును చెడలేదనియు, పయి నిదర్శనములవలన స్పష్టమగుచున్నది. అదిగాక మనఋషులును విద్వాంసులును పలువురు చతుష్షష్టికళల నభ్యసించి ప్రవీణులయినట్టు బహుగ్రంథములు సాక్ష్యమిచ్చుచున్నవి. పాక శిల్ప గజాశ్వశాస్త్రాదులు చతుష్షష్టికళలలోని చేరిన వౌటచేత పూర్వకాలమునందు మనలోని విద్వాంసులు బహువృత్తులకు గౌరవము తెచ్చిరనుట విస్పష్టమగు చున్నది. మఱియు నీపైని చెప్పిన శాస్త్రములకు ఋషులే కర్తలయి యున్నారు. కాఁబట్టి పూర్వపు విద్వాంసులమార్గము ననుసరించి యిప్పటి విద్యావంతులును వృత్తుల నవలంబించి యాయావిషయముల యందు గ్రంథములను రచించి వాని నభివృద్ధి పొందించినంగాని దేశాభి వృద్ధి కలుగదు.

మన దేశమునందలి శిల్పాదుల యభివృద్ధికయి యాయాజాతుల వారి యాయావృత్తుల నవలంబింపవలయు నన్న నియమమును పెట్టు టెవ్వరికి దేనియందభిరుచిగలదో వారాపనియందు ప్రవేశించుట యావశ్యకమనియు వస్తునిర్మాణక్రమము కాలానుగుణముగా మాఱ వలయుననియు, కర్మకారులు విద్యాభ్యాసము చేసినవారు కావలయుననియు, విద్యావివేకవంతులు వృత్తులకు పూనుకొనవలయు ననియు చెప్పియున్నాను. పుస్తకములయం దెంతచదివినను చదివిన విష యములను ప్రత్యక్షముగా చూచి గ్రహించినంగాని యావిద్య పూర్ణము కానేరదు. సంగీతశాస్త్రమునందు రాగలక్షణాదులను నేర్చుకొన్న మాత్రముచేతనే యెవ్వరును కర్ణరసాయనముగా పాడ శక్తులుకారు. కాబట్టి లోకములో ననుభవజ్ఞానములేని చదువంత ప్రశస్తము కాదు. శిల్పాదులయందు ప్రవేశించిన విద్యావంతులు యంత్రనిర్మాణాదులను గూర్చిన కేవల శాస్త్రజ్ఞానముతో తృప్తిపొందియుండక యంత్రముల నిర్మించి వానితో పనిచేసెడు దేశములకుఁ బోయి నిర్మాణకౌశలమును పనిచేయు క్రమమును కనిపెట్టి యనుభవజ్ఞానమునుకూడ సంపాదింపవల యును. అట్లుచేసిననే నిజమయిన యభివృద్ధి కవకాశము కలుగునుగాని యిల్లువదలక మూల కూరుచుండి యాకాశమువంక చూచి యాలో చించుచున్న మాత్రమున నభివృద్ధి కలుగదు.

మిత్రులారా! మనము విద్య చదువుకొన్నది మనస్వభావ మును శక్తిని గ్రహించి యుక్తాయుక్తముల నాలోచించుటకు శక్తుల మయి యుక్తమార్గమున నడుచుకొనునిమిత్తము గాని మనము చదువుకొన్నామని యితరులకు చూపుటకొఱకును ప్రతిష్ఠకొఱకును కాదు. తక్కినవారికంటె మనము వివేకుల మయినందుకు ఫలము మన మాత్మాభిమానము గలవారమయి, అంతరాత్మ చెప్పినదాని యందు

గౌరవముంచి, తదుక్తరీతిని ప్రవర్తించుట. అంతేకాని మన మంతరా[illegible] నడుగున త్రొక్కి మూర్ఖులయిన వారి మెప్పునకయి దానిని వారి[illegible] ప్రాయములకు బలివెట్టి యస్వతంత్రులమయి కీలుబొమ్మలవలె [illegible] లాడించిన [illegible]ల్లను నాడుచుండుట మన కెంతమాత్రమును ప్రా[illegible] కర్మము కాదు. మీరు మీస్వాతంత్ర్యమును మాటలచేత మాత్రమే[illegible] కార్యములచేతకూడ లోకమునకు వెల్లడిపరచి తెలియనివారు చే[illegible] పరిహాసములను లక్ష్యము చేయక మీరు న్యాయమని నమ్మిన ప్ర[illegible] రముగా శిల్పాదివృత్తులయందు మీలోతగినవారు ప్రవేశించి యి[illegible] లకు దారిచూపి లోకోపకారధురీణులగుదురని కోరుచున్నాను.

వేశ్యాకాంతలు.

By

K. VEERESA LINGAM

వేశ్యాకాంతలు.

సువివేకులారా!

నే నీదినమున ప్రసంగింపవలసినది వేశ్యావృత్తివిషయమే యయినను, ఆసంగతి నారంభించుటకు ముందు సుఖభేదములను గుఱించి కొంచెము ప్రస్తావింపవలసియున్నది. లోకములో నెవ్వ రెప్పు డేకార్యమును చేసినను, ఏకార్యమును త్యజించినను, తమ సుఖము నపేక్షించియే యని యెల్లవారు నెఱుఁగుదురు; కాఁబట్టి యెల్లవారును జేసెడు ప్రయత్నములన్నియు దుఃఖనివారణముకొఱకును సుఖసంపాదనముకొఱకును ననుట స్పష్టము. అందుచే నెంతమూఢుఁడును బుద్ధిపూర్వకముగా సుఖము పోఁగొట్టుకొని దుఃఖమును తెచ్చిపెట్టుకొనఁడు. అయినను తమయధీనములోనున్న విషయములలోనే పలువురు మూర్ఖత్వముచేతనో యింద్రియలోలత్వముచేతనో దూరము విచారింపక తాత్కాలికసుఖము వచ్చునని భ్రమపడి కార్యములను జేయుచుండుటవలన వారికి సుఖమునకు మాఱుగా దుఃఖమే బహుతరముగా సంప్రాప్తమగుచున్నది. అదిచూచి బుద్ధిమంతులగువారు తామొకకార్యమును జేయునప్పుడు సద్యఃఫలముమాత్రమే చూడక దానివలన ముందు కలుగఁబోవు ఫలములనుగూడ విచారించి కర్తవ్యాకర్తవ్య నిశ్చయముచేయుదురు. దానినిబట్టియే సర్వసాధారణముగా లోకములో నవివేకులు పలుకష్టముల పాలగుచు వచ్చుచుండుటయు సువివేకులు సుఖపరంపరను చెందుచుండుటయు సంభవించుచున్నది. ఈజగములో మృగ మొక్కటియే ముందుసంగతి బొత్తిగా

విచారింపక ప్రస్తుతసుఖముతోనే తృప్తిపొందియుండునది. మనుష్యుఁడెంత బుద్ధిహీనుఁడుగా నున్నను కొంచెముగానో గొప్పగానో భవిష్యత్సుఖమును చూచుకొనుచునేయుండును. కాఁబట్టి మనుష్యునకును మృగమునకును గల భేదము ముందుగా భావిసంగతులయొక్క విచారావిచారములలోనే యారంభమగును. మనుష్యుఁడు ముందుసంగతుల నెంతయల్పముగా విచారించువాఁడయిన నంత మృగప్రాయుఁడనియు, ఎంతయధికముగా విచారించువాఁడైన నంతజ్ఞానాధికుఁడనియు, చెప్పఁబడును. ఇప్పుడు చెప్పినదానివలన మనము చేయు వానిలో పలుకార్యములు సుఖదాయకములుగానే కనఁబడినను వానిలో కూడ సుఖతారతమ్యవిచారము చేయవలసిన యావశ్యకము తేలుచున్నది. మనకుఁ గలిగెడు సుఖమంతయు శరీరసుఖమనియు, ఆత్మసుఖమనియు రెండువిధములుగాఁ జెప్పవచ్చును. ఈరెండుసుఖములలో శారీరసుఖమునకంటె నాత్మికసుఖ ముత్తమమయినదని కొంచెము వివేకముగలవారందఱును ఏకవాక్యముగా నొప్పుకొనియున్నారు. దీనిలో దేహసుఖము మృగములకును మనకును సామాన్యమయినది; ఆత్మసుఖ మొక్కటియే మనుష్యుల మైనందున మన కధికముగా వచ్చినది. మనబాహ్యేంద్రియములను తృప్తిపఱచుటవలనఁ గలుగునది దేహసుఖము; నీతిమార్గమున నడుచుటవలనను భగవద్భక్తి మొదలయిన వానివలనను కలుగునది యాత్మసుఖము. ఇంద్రియసుఖము పశువులకును మనకును సామాన్యమయినదే కాఁబట్టి యింద్రియసుఖము నెంతయెక్కువగా ననుభవించినను దానివలన మనకు పశువులకంటె నాధిక్య మేమియు రాదు. ఇంద్రియసుఖముల కనుకూలమయిన పదార్థములను సంపాదించుకొనుటలోను వాని నుపయోగించుకొనుటలోను, మితము తప్పి యనుభవించుటవలనఁ గలుగు రోగాదులలోను

మృగములకు లేని కష్టము లనేకములు మనకు తటస్థించుచుండుటచేత నింద్రియసుఖములనే మరిగి యాత్మసుఖములను మఱచువారు పశుతుల్యులయినను గాక వారికంటెను హీనులుగ నున్నారు. కేవలేంద్రియసుఖపరాయణులయిన మానవాధములకువలె తిండినిమిత్తము పడవలసిన కష్టము లేవియు పశువులకు లేవు; వారివలె పశువులెప్పుడును తప్పత్రాగి దేహస్మృతి తప్పి పడిపోవు; అతిసంభోగము నాశించి సుఖరోగములను తగిలించుకొని బాధపడవు. కాబట్టి మన యాధిక్యమెల్లను మన యాత్మసుఖముల ననుభవించుటలో నున్నది. మన మెంతయధికముగా నాత్మసుఖములకయి ప్రయత్నించుచు వానిని పొందుచుందుమో వివేకలోకములో మనమంత యగ్రగణ్యుల మగుచుందుము. ఆత్మ నిత్యమయినదియు దేహ మస్థిరమయినదియు నగుటనుబట్టి స్వభావముచేతనే దేహసుఖ మస్థిరమయినదనియు, ఆత్మసుఖము స్థిరమయినదనియు స్పష్టమగుచున్నది. అధికసుఖమునకయి యల్పసుఖమును విడుచుట బుద్ధిమంతుల లక్షణము గనుక, ఆత్మానందమునకు భంగము రాకుండునంతవఱకే యింద్రియసుఖముల ననుభవించుచుండుటకై తెలివిగలవాఁ డెప్పుడును కృషిచేయుచుండవలెను. అనఁగా ఆత్మానందమునకు భంగము సంభవించునని తోఁచినయెడల శరీరసుఖమెంత యధికమైన దయినను దానిని మానుకొనవలయును. ఈ దేహాత్మసుఖములలో తారతమ్య మున్నట్లే ప్రత్యేకముగా దేహసుఖములలోను, ఆత్మసుఖములలోను కూడ తారతమ్యముండును. అందుచేతనే యధిక దేహసుఖము నపేక్షించి వివేకు లల్పదేహ సౌఖ్యములను విడిచి కొంచెము తాత్కాలిక కష్టములకయినను సహింతురు. మనము కొన్ని సమయములయందు జిహ్వాకింపుగా నుండు పంచభక్ష్యపరమాన్నములను భుజించుట మానుకొని నోటి కసహ్యముగా

నుండు కాలకూటవిషమువంటి చేఁదుమందులను కన్నులు మూసి కొని మ్రింగుచుండుట కింతకంటె వేఱు హేతువేమున్నది? ఆ కష్టపడుట యంతయు నప్పటి కింపు కాకపోయినను ముందు చిరసుఖ మనుభవింపఁ గలుగుదుమన్న యాశచేత నేకదా? చిరకాల మాహార నిద్రాదులను లక్ష్యముచేయక గురువు కొట్టినను తిట్టినను సహించి పాఠశాలయందు విద్యాభ్యాసము చేయుచు బహుకష్టముల కోర్చు కొనుట పడినప్రయాసమునకు మించినఫలము ముందు లభించునన్న కోరికవలన నేకదా? అల్పత్వాధికత్వభేదము మాత్రమే కాక మనము సుఖప్రదము లనుకొను వానిలో నిహపరలోకముల రెంటియందును సుఖమిచ్చునవి కొన్నియు, ఈలోకమునందు మాత్రమే సుఖమిచ్చు నవి కొన్నియు, అప్పటికి సుఖమిచ్చునవిగానే కనఁబడినను కడపట దుఃఖముగా పరిణమించునవి కొన్నియు ఉండును. సత్యము మొద లయినవి మొదటి తరగతిలోనివి; ఆహారాదులు రెండవతరగతిలోనివి; వ్యభిచారాదులు కడపటితరగతిలోనివి. ఈదుఃఖప్రదము లైన వానిలో గూడ కొన్ని యప్పుడే ఫలమిచ్చునవిగాను, కొన్ని యప్పటికి తెలియ కుండ లోలోపలనె పనిచేయుచు కొంతకాలమునకు తరువాత ఫల మిచ్చునవిగాను ఉండును. మనము గంధకద్రావకమును త్రాగిన యెడల వెంటనే నోరు భగ్గున మండి తాపము హెచ్చి యప్పుడే ఫల మగపడును; కలుషజలమును త్రాగినయెడల నప్పటి కేమియు కనఁ బడక క్రమక్రమముగా పనిచేసి యెప్పుడో వ్యాధిని తెచ్చిపెట్టి దీర్ఘ కాలమునకు ఫలమగపడును. తాత్కాలికముగా ఫలమగపడినను, అగపడకపోయినను బుద్ధిమంతుఁడగువాఁడు తానొకపనిని దూరము విచారించి యది యెప్పుడు నేహానిని చేయని నిర్దుష్టకార్యమయిన పక్ష మునకే చేయవలెను. ఈపయిని వివరింపఁబడిన సుఖములలో నిహపరలోక

ముల రెంటను సుఖమిచ్చునది యుత్తమమనియు, ఈలోకమున మాత్రమె సుఖమిచ్చునది మధ్యమమనియు, తాత్కాలికముగా మాత్రము సుఖమిచ్చునది యధమమనియు నేనిక్కడ చెప్పనక్కఱ లేకయే యెల్లవారికిని తెలియును. వానిలో నుత్తమసుఖమునిమిత్తమె మధ్యమాధమ సుఖములను వదలుకోవలెననియు మధ్యమసుఖము నిమిత్తమయి యధమసుఖములను వదలుకోవలెననియు, కూడ నెల్ల వారును నొప్పుకొనినయంశమే. ఇహమునం దాత్మానందమునకు లోపము లేకుండ పరమునందుకూడ కలిగెడు శాశ్వతానందమే మోక్షసుఖము గనుక, మహానుభావులగువా రాయొక్క పారమార్థికసుఖమునే మన స్సునం దుంచి దానినిమిత్తమె తక్కిన యెన్నిసుఖములనైనను తృణ ప్రాయముగా త్యజించి విషయసుఖములయందు కేవలము నిస్పృహా లగుచున్నారు. లోకములో నటువంటి మహాత్ములెప్పుడును మిక్కిలి తక్కువగానే యుండుటచేత వారివిషయమయి చెప్పుట యనావశ్య కముగనుకను, సామాన్యజనులీ విషయసుఖములనుకూడ ననుభ వింపవలసినవారే గనుకను, ఇప్పుడు చెప్పిన సుఖతారతమ్యాదులముందు చెప్పబోయెడి వేశ్యాసంభోగాది సుఖస్వభావగౌరవములను తెలిసికొను టకు చాలియుండును గనుక, ఇంతటితో నీవిషయమును చాలించి ప్రస్తుతవిచారణీయాంశము నారంభింతము.

ఈయొక్క హిందూదేశమునందు తప్ప మఱి యేదేశమునం దును, ఏకాలమునందును, దిగంబరులయి పశుప్రాయులయి వనా చరులుగా నుండు మూర్ఖశిరోమణులు మొదలుకొని దివ్యాంబరధారు లయి విద్యావివేకసంపన్నులయి సుందరమందిరములయందు వాసము చేయు నాగరికశిఖామణులవఱకు గల యేజాతివారిలోను, వ్యభిచా రమే ప్రతిష్ఠావహమయిన కులవృత్తిగా నెన్నుకొనిన సంభోగనియ

మము లేక స్వేచ్ఛగా విహరించు కులమువారున్నట్టు కనియు వినియు నుండలేదు. అదియేమి పాపకర్మమో గాని నిర్భాగ్యకరమయిన యీ దేశమునందుమాత్రము చిరకాలమునుండి మానహీనమయిన యీ పాడుపనికయి ప్రత్యేకముగా భోగకాంతలజాతి యొకటి యేర్పడి నేటివఱకును తెంపులేక బహుకాలసిద్ధముగా వచ్చుచున్నది. కాల కర్మవశముచేత మన దేశము నాశ్రయించియున్న వ్యభిచారహేతు మయిన యపకీర్తిభూతలమున కెల్లను సుస్థిరమయిన జంగమాలయ ములవలెనున్న యీభోగాంగనలజాతి యీదేశమున నెప్పుడు నామ మాత్రావశిష్టమగునో దురూహ్యముగా నున్నది. అయినను మన పూర్వులు వీరిని వ్యభిచారనిమిత్తముద్దేశింపలేదనియు, సంగీతము సర్వజనరంజకమయినది గనుకను, దానిలో మృదుమధురస్వరముగల సుందరులు నృత్తగీతాదులను నేర్చుకొని హస్తాద్యభినయములతో రాళ్లు కరఁగునట్లుగా పాడునప్పు డాస్థలము భూతలస్వర్గముగా నుండును గనుక కను నృత్తగీతాదుల యభివృద్ధినిమిత్తమే యేర్పఱిచిరనియు, చెప్ప వచ్చును. సంగీతమునందట్టి యద్భుతజగన్మోహనశక్తి యున్నదన్న మాట నేను లేదనను. సంగీత మొక్క మనుష్యులను మాత్రమే కాక చెవులుగల పశుప్రజంతువులనుగూడ నానందింపఁజేయఁగలదనియు నేనె ఱుఁగుదును. అందుచేత మన పెద్దలు "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసంఫణీ" యని సంగీతమును శిశువును పశువును పామునుగూడ గ్రహించునన్న వాక్య మతిశయోక్తిగాక కేవలము స్వభావోక్తియనుటే నా నిజమయిన తాత్పర్యము. సర్వజనమనోహరమయిన యీసంగీతము ముఖ్యముగా కాపాడవలసినవారు స్త్రీలేయనియు, వారికంఠమునందు పురుషకంఠమునకంటె నధికమార్దవము ● మాధుర్యము నుండు ననియు, అందుచేత లనువారు చెప్పు వాదాభినయమును, అట్టిమును

ప్రకటించు హస్తాభినయమును, భావాదులను బోధించు నేత్రాభినయ మును దానికి తోడుపడినచో రసజ్ఞులయినవారి కిచ్చుటనే సశరీర స్వర్గము లభించునట్లుండునని యు, నేను హాఢిగా గుర్తెఱుఁగుదును. కాఁబట్టి స్త్రీజనసామాన్యమున కలంకారభూతమయిన పాతివ్రత్య ముచే భూషితురాండ్రయి సర్వజనసమ్మాననార్హురాండ్రయిన కుల కాంతలయొద్దనే సర్వజనసమ్మోహనకరమయిన యీసంగీతవిద్య యున్న పక్షమున పయిని చెప్పిన గుణములను మాత్రమే కాక యింకను ననేకములయిన లాభములను కలిగి యిహపరసాధకమగుననుటకు లేశమయినను సందేహము లేదు. కాని మనదేశమున కట్టి భాగ్యము లభింపక యమూల్యమయిన యీగానవిద్య సంసారకల్పవృక్షమునకు వేరుపురుగులును, పాతివ్రత్యామృతరసమునకు విఱుగుడుమందులు నయిన వేశ్యలపాలపడుటచేత దానివలన కలుగవలసిన యుత్తమ లాభము లేవియు కలుగకపోవుట యటుండఁగా మీఁదుమిక్కిలి మితి మీఱిన యనర్థములుకూడ సంప్రాప్తము లగుచున్నవి. ఏఁబదిదివ్య వాసనలను చుట్టును పెట్టినను మధ్య నొకయుల్లిపాయను చితుకఁగొట్టి పెట్టినపక్షమున, ఆసువాసనల గౌరవమంతయు నడఁగిపోయి సహింప రాని దుర్గంధమే యెల్లయెడలను వ్యాపించునట్లు సంగీత మొక్కటియే కాక యింక వేయిసుగుణములుకూడ కలిగియున్నను వానికొక్క వ్యభి చారమును తోడుకలిసినయెడల నావేయిసుగుణములును మూలకట్టి దుర్భరమయిన యొక్క వ్యభిచారమే పయికివచ్చి లోకములో చేయఁ గలిగినంతనష్టమును చేసితీరును. వేశ్యల ప్రధానవ్యాపారము జార త్వముకాక నృత్యగీతాదులు గనుక వానినిమాత్రమే యనుభవించి తక్కిన విషయములయందు విముఖులయి జితేంద్రియులయి యుండ రాదాయని కొందఱడుగవచ్చును. దూరమునుండి పాడినపాటల

నెన్నిటినైనను జెప్పవచ్చునుగాని నిజముగా సమయము సంభవించి రత్నాభరణములతో దృష్టి మిఱుమిట్లుగొలిపి మతిభ్రమ కలిగించు వేశ్యలు తారసించినప్పు డెంతటి దృఢచిత్తులకును మనసు నిలుప శక్యముకాదు. మన గట్టితనమంతయు దూరముగానుండి నీతులు చెప్పునంతవఱకే సాగునుగాని మనమనసు నొక్కసారి యాప్రక్కకు పోనిచ్చినయెడల, అది నెగసమీపమునఁ బెట్టిన వెన్నవలె కరఁగి యా వంకకు వాలక మానదు. మననీతులును నిష్ఠలును నియమములును స్త్రీలచూపులు మనమీఁద ప్రసరింపకున్నంతవఱకే నిలుచునుగాని స్త్రీలగాలి మనమీఁద సోఁకినతరువాత నవియన్నియు ఝంఝూమారుతమునకు దూదిపింజె లెగిరిపోవునట్లు నానాముఖముల చెదరిపోవక యొక్కనిమిషమును నిలువఁజాలవు. ఒక్క మనమాట యెందుకు? ఇంద్రియనిగ్రహము చేసితిమని ప్రతిష్ఠవహించి సంసారము త్యజించి యడవులయం దాకలములు తినుచు తపస్సులుచేయు ఋషులయంతటి వారు సహితము మోహము పుట్టించు స్త్రీముఖ చంద్రబింబమును జూచి మోసపోయి తమతపస్సును గిపస్సును మఱచి యాస్త్రీలనె జపించుకొనుచు వారికి దాసులగుచు వచ్చినారని మనము వినియుండ లేదా ? అందుచేతనే భర్తృహరి

శ్లో. విశ్వామిత్ర పరాశర ప్రభృతయో వాతాంబు పర్ణాశనా
స్తేపి స్త్రీ ముఖ పంకజం సులలితం దృష్ట్వైవ మోహంగతాః
శాల్యన్నం సఘృతం పయోదధియుతం భుంజంతి యేమానవా
స్తేషా మింద్రియ నిగ్రహో యదిభవే ద్వింధ్యః ప్లవే త్సాగరే.

వాయుభక్షులును జలాహారులు నైన విశ్వామిత్రుఁడు పరాశరుఁడు మొదలయిన మహర్షులును స్త్రీముఖపద్మమును చూచినప్పుడు మోహ పరవశులగుచుండఁగా, నేతితోను పాలతోను పెరుగుతోను వరి

యన్నమతిను సంసారులకే యింద్రియనిగ్రహము కలిగిన యెడల వింధ్యపర్వతముసహితము సముద్రమునందు తేలవలసినదేయని చెప్పి యున్నాఁడు. పర్వతము సముద్రమునందు తేలుట యెంత యసాధ్యమో సంసారములో నున్నవారు చక్కని స్త్రీని చూచినప్పుడు మనస్సును నిగ్రహింపఁగలుగుట యంతయసాధ్యమని యీకపిసార్వభౌముని తాత్పర్యము. ఈవాక్యముయొక్క సత్యమును తేటపఱుచుటకయి నేను మీకిక్కడ నొకచిన్నకథను చెప్ప ననుజ్ఞ వేఁడుచున్నాను.

పూర్వము వేదాంతశాస్త్రప్రణేతయైన వ్యాసులయొద్ద బ్రహ్మవిద్య నభ్యసించుచు విజితేంద్రియుఁడనియు దృఢచిత్తుఁడనియు పేరు పొందిన జైమినిమహర్షి యొకనాఁడు వ్యాసవిరచితమయిన యొక గ్రంథమును జదువుచు దానియం దొకచోట "బలవా నింద్రియగ్రామో విద్వాంస మపి కర్షతి" బలవంతమైన యింద్రియవర్గము విద్వాంసుని సహిత మీడ్చునని యుండఁగా చూచి యింద్రియజాలము తనవంటి పండితుని సహితము తప్పుత్రోవ కీడ్చునా యన్న యహంకారముచేత గంటము చేతఁబుచ్చుకొని యీతాళపత్రముమీఁది "విద్వాంస మపికర్షతి" యనియున్న భాగమును "విద్వాంసం నాపకర్షతి" యని దిద్ది బలవంతమైన యింద్రియసమూహము విద్వాంసుని నాకర్షింపదని యర్థము కలుగునట్లు చేసెను. వ్యాసుఁ డదిచూచి యాశ్చర్యపడి తనశిష్యుని చిత్తస్థైర్యమును పరీక్షింపవలెనని బుద్ధిపుట్టి యాశ్రమమును భద్రముగా కాచుకొని యుండవలసినదని యాతని నొప్పగించి తాను మఱియొకపుణ్యాశ్రమమునకు పోయివచ్చెదనని చెప్పినడచెను. గురువుయొక్క యాజ్ఞాప్రకారముగా జైమిని తపోవనమును కనిపెట్టుకొని యుండి యొకవృక్షమూలమునఁ గూరుచుండి

వేదాంతశాస్త్రము చింతనము చేయుచుండఁగా సంజవేళను కనుచీఁకటిలో పాదములు మొదలుకొని శిరస్సువఱకును మేలిముసుఁగు వేసికొని లజ్జాభయములు నటింప మెల్లమెల్లఁగా నడుగులుపెట్టుచు నొక విగ్రహ మాసమీపమునకువచ్చి జాలి పుట్టించెడు హీనస్వరముతో రాత్రి పరుండుటకు తావిమ్మని వేఁడుకొనెను. వ్యాసశిష్యుఁ డామె నాదరించి సంకోచింపక తలుపులు వేసికొని లోపల నిర్భయముగా పరుండుమని నియమించి యొకగదిచూపి తాను మరలవచ్చి చెట్టు క్రింద కూరుచుండి చదువుకొనక యామె యెవ్వరైయుండునా యని యాలోచించుచుండెను. ఇంతలో చీఁకటిపోయి సంపూర్ణ చంద్రుఁ డుదయించి పట్టపగలని భ్రమించి కోకిలలు పాడునట్లుగా పండువెన్నెలలు కాయఁజొచ్చెను; కామాగ్ని రగులుకొనునట్లుగా మందమారుతము హాయిగా వీవనారంభించెను; ఆచల్లగాలిలో నాశ్రమవృక్షముల పువ్వుల కమ్మతావులు గుప్పున ముక్కున సోఁకి దేహము పులకితము కాసాగెను; ఆశ్రమమున నొంటిగా నున్న యట్టి సమయములో గదిలోనున్న సుందరి యాతని చిత్తమునందు నిలిచి భ్రమపెట్ట మొదలుపెట్టెను. అప్పు డాతఁ డాసుందరి యెవ్వరో యిట్టి వేళ నొంటిగ రా కారణమేమో తెలిసికొందమని లేచి పరస్త్రీతో మాటాడుట యుచితముకాదని బుద్ధి మరలించుకొని మరల కూరుచుండె యింతలో కాముఁడు తనశక్తి నంతను గనఁబఱచి చిత్తము య్యాలలూచి యాతని నపస్మారినిగాఁ జేయఁగా వెనుకకు నీడ్చు పాదములతో మెల్లగా గదిగుమ్మముచేరి పిలువసాగెను. ఎంతపిలిచినను గదిలోనుండి ప్రత్యుత్తరము రాకపోయినందున, ఆతని చిత్తము మఱింత సంచలించి చివరకు తనయింద్రియములు తనకు వశములు గాక తన్ను కామున కొప్పగింపఁగా నంతవఱకును సహాయముగా

నున్న వివేకము తన్ను విడిచిపాఱ నతఁడు మన్మథోపదేశముచేత నిచ్చిన వేసికొని గదిగోడయెక్కి గుబాలున లోపలదుమికెను. అట్లు దుమికి కన్నులు తెఱచి చూచునప్పటికి దీపమువెలుతురున జడలతోను గడ్డముతోను రుద్రాక్షమాలలతోను వ్యాసమహర్షి కన్నులయెదుట కనఁబడఁగా పయిప్రాణములు పయికిపోయి నిశ్చేష్టితుఁడయి దేహమెల్లను కంపమెత్తి చెమ్మట కాలువలుగట్ట కొంతసేపు చిత్రప్రతిమవలె నిలుచుండి తెలిసి తెచ్చుకొని "స్వామీ! చెడితి చెడితి" నని గురువు పాదములమీఁద పడెను. ఆయన శిష్యుని ప్రేమతో లేవనెత్తి భయముడిపి ధైర్యమునుచెప్పి పిమ్మట నవ్వుచు "బలవా నింద్రియగ్రామో విద్వాంస మపికర్షతి" యన్నమాట సత్యమేనా యని యడుగఁగా గర్వభంగము కలిగి సిగ్గుపడి కొంతతడవు నోటమాట రాక యతఁడు దుమికినప్పుడు కాలికి తగిలిన గాయపురక్తముతో "కర్షతి కర్షతి కర్షత్యేవ" యని "యీడ్చు నీడ్చును తప్పక యీడ్చు" నని మూమ్మాఱు గోడమీఁద వ్రాసెనఁట! స్త్రీలు తారసించినప్పుడు వనవాసులయిన జ్ఞానులయవస్థయే యిట్లగుచుండఁగా యౌవనమదాంధులయి సంసారసుఖములలో మునిఁగి తేలుచుండువా రెట్టియవస్థను పొందిరన్నను, ఆశ్చర్యపడవలసిన దేమున్నది? అందులోను వేశ్య లందఱివంటి సామాన్యస్త్రీలు గారు. ఉగ్గుపాలనుండియు పరివంచనచేయు నుపాయములనే నేర్చుకొని పరులసంసారములను కూలఁద్రోచియే తాము విత్తార్జనముచేసి యీభూలోకములో బాగుపడవలయునని దీక్షవహించి స్వప్నావస్థయందయినను పాపభీతి లేని మహానుభావురాండ్రు; అపయిని విత్తాపహారణముచేయు దొంగలకు తోడుపడు రాత్రినే తాము తోడుపఱుచుకొని సాధారణముగా దీపములవెలుతురున నూతనవేషములతో తళుకుబెళుక్కని మెఱసి బంగా

రపుసంకెళ్ళవలె నితరుల నాకర్షించి తమవలలోఁ బడవేసికొని బంధిం చుటయం దాఱితేఱినవారు; అదిగాక నృత్తవిద్య నధీనము చేసికొని తమకన్నులు త్రిప్పుమిషమీఁద చూపరులడెందములుత్రిప్పుచు తమ యాటతో సభలోని పెద్దలనుకూడ నాడింప శక్తి కలవారు; వీనికి మెఱుఁగు దెచ్చునట్లు మన్మథునయినను మరలుకొల్పి యింటిబంటును జేయించు పరమసామర్థ్యముగల యభినయమును చేతఁ జిక్కించు కొన్నవారు; వీని యన్నిటిశక్తులను దిగఁద్రొక్కి తాను మించి ప్రకా శింపఁగల ప్రభావముగలిగి యెటువంటి కఠినహృదయముల నయినను లక్కలాగున కరఁగించి రాగప్రవాహములో ముంచి తనప్రక్క కాక ర్షింపఁగల సంగీతము వారిజిహ్వాగ్రమున నటించు చుండును. ఇటువంటి యమోఘసాధనములు గలిగి యెక్కడఁ జూచినను సుందరవేషము లతో మేఁకవన్నెపులులవలె నేమఱియుండు వారిని మ్రింగ నోరు తెఱ చుకొని వేశ్యారూపముననున్న యపమృత్యుదేవతలు తమ స్థాలయ ములయందు మాత్రమేకాక మన సభాభవనములయందు సహితము స్వేచ్ఛగా సంచరింప నవకాశము కలిగి యుండఁగా యౌవనాంధ కారము కన్నులఁ గప్పుకొనుటచే దూరదృష్టి లేనివారై లోకాను భవము లేమిచే లోగుట్టు తెలియక పైరూపములను చూచి మోస పోవు దుర్బలులు మిడుత లగ్నిలో పడునట్లు వెదకుకొనుచు పోయి వారి వాత పడక యెట్లు తప్పించుకోఁ గలుగుదురు; అయినను మనదేశము నందున్న వారాంగన లందఱును పయినిచెప్పిన నృత్యకౌశలములయందుఁ గాని రూపమునందుఁగాని తక్కినవారికంటె నెక్కువవారుకారు. కొందఱు పాటపాడిన గార్దభములు తమ చుట్టమనుకొని చేరవచ్చు నంతటి యింపుగానే యుందురు; కొందఱాటపాడినను నిప్పుత్రొక్కిన మర్కటముల గంతులకన్న నెక్కువ రమ్యముగా నుండదు. అట్లయినను

శుభకార్యములయందు మేళములకువచ్చు వేశ్యలవలనఁ గలిగెడు నష్టమునకు మాత్రము లోపముండదు. ఎట్టివారయినను స్త్రీలు నామము చేతనే సుందరులు; యౌవనము వారికి తోడుపడి దేహమునకు లేని మెఱుఁగు తెచ్చును; ఇంకను గొంతకొఱఁతయున్న సర్వావయవముల యందును తళుకుతళుక్కని ప్రకాశించు నగలు దానిని మాటి వేయును; ఆపయిని దీపములవెలుతు రెట్టి కురూపముల నయినను సురూపములనుగాఁ జేసి కజ్జల నప్సరసలను గావించును; ఇవియన్నియు నిట్లుండఁగా వారు పాడుపాటలు జితేంద్రియులకైన నున్మాదము పుట్టించు కామశాస్త్రైక బోధకములు; వారభినయించునప్పుడు సాధ్యమయినంత వఱ కెల్లవారు తమ్మే యాభోగస్త్రీలు కౌఁగిలించుకొని ముద్దాడ వచ్చుచున్నా రనుకొనునంత భ్రమపడుట కవకాశము కలుగును. అట్టి సమయములో నెవ్వరి మనస్సులు సంచలింపకుండును? అట్లు సంచలించునప్పుడు వారు కులకాంతలై యుండి యందని ద్రాక్షపండ్లయిన నైననష్టమేమియు లేకుండవచ్చును. వారట్టివారునుగాక యొక్క కాసిచ్చిన రాత్రియెల్లను తమదేహములను కొల్లగా నంగహీనుల కయినను సమర్పింపఁ గంకణము కట్టుకొన్న వెలనూండ్రు; ఈవిధముగా వారు సులభసాధ్యలుగా నున్నప్పుడు కామాతురులకు వారిని చేర కుండుటకు సిగ్గును భీతియు నెక్కడనుండి వచ్చును? "కామాతురాణాం నభయం నలజ్జా" యన వినలేదా? వారవారు లట్టి స్వభావము కలవారు గనుకనే యొకకవిగ్రామణి,

శ్లో. జాత్యంధాయ చ దుర్ముఖాయ చ జరాజీర్ణాఖిలాంగాయ చ
గ్రామీణాయ చ దుష్కులాయ చ గళత్కుష్ఠాభిభూతాయ చ
యచ్ఛంతీషు మనోహరం నిజవపుర్లక్ష్మీ లవశ్రద్ధయా
పణ్యస్త్రీషు వివేక కల్ప లతికా శస్త్రీషు రజ్యేత కః॥

పుట్టుగ్రుడ్డివానికిని, ముఖమున పుండ్లుండు వానికిని, ముసలితనముచే నవయవపటుత్వము తప్పిన వానికిని, జడునకును, కులహీనునకును, కుష్ఠరోగికిని, ఒక్కరూక నిమిత్తము తనసుందరశరీరములను గుత్తకిచ్చుచు వివేకకల్పలతకు కత్తులవలె నుండు రావాంగనల నెవ్వఁడు కోరునని దూషించి యున్నాఁడు. మంచివారొకవేళ నీరీతిగానే భావించినను వారిమనస్సు లెప్పుడును వారిస్వాధీనములో నుండునవి కావు దృఢచిత్తుల హృదయములుసహిత మొకానొకప్పుడు వారివశములో నిలువక విహారి సంచరించును. వారారంభదశలో మణులు చెక్కిన సంకెళ్ళవలె నున్న భోగస్త్రీలను జూచినప్పుడు విముఖులయి దూరముగా తొలఁగి కూరుచుండియే చెవియొగ్గి సంగీతమును విన మొదలుపెట్టుదురు; అట్లు కొన్నిదినములు జరిగినతరువాత క్రమక్రమముగా చేరువను జరిగి పాట విననారంభింతురు; ఈవిధముగా మఱికొన్ని దినములు జరిగిన తరువాత నభినయమునుకూడఁ జూడవలయునని మొగమువంకఁ జూడ సాగుదురు; అటుపయిని దానిసౌందర్యమును జూడవలయు ననియే ముఖము తేఱిపాఱ చూడఁజొత్తురు; అంతకు వచ్చినతరువాత నిఁక వాగదు గనుక నొకనాఁడట్టిసౌందర్యవతితోడి సంభోగమునే కోరుదురు; కట్టకడపట నట్టనడుమనే నెప్పుడో యొకసారి యారవంతపనియుకూడ కానిచ్చి మాటదక్కించుకొని వివేకమును మనస్సులనుండి తఱిమివేసి దినదినక్రమమున వేశ్యలకు దాసులై వారితోడిదే లోకమని యుండి వేశ్యావృత్తి సర్వోత్కృష్ట మయినదని వాదములు చేయుచు తుద కామేఁకవన్నెపులుల నోళ్ళలోపడి యిల్లును దేహమును గుల్లచేసికొని యిహపరములకు దూరులై రోగములచేత బాధపడుచు వార్ధకము దాఁక బ్రతికినయెడల నప్పుడు భాగవతోత్తము లగుదురు. మునుపట శ్రీరంగనీతులను జెప్పినవారే యారీతిగా చేసి తుదకెంగానరబసికి

రాకపోయినవారుకాఁగా మనమెందఱినో చూచియున్నాము. పెద్దల నడతయే పిన్నలకు మార్గప్రదర్శక మగును గనుక పయి పెద్దలనుజూచి బాలురు సహితము తప్పుత్రోవలం బ్రవేశించి యిది యేమిరాయని యెవ్వరైన మందలించినచో సిగ్గువిడిచి వారు చేసినారుకారా వీరు చేసినారు కారా యని దృష్టాంతములు చూపుచు, అంతటితో నైన నూరకుండక తమ భార్య లందఱు త్రైలు కారనియు, తల్లిదండ్రులు చిన్న ప్పుడు తమయనుమతిలేక వివాహములు చేసిరనియు, సంభోగము లేనిమొదల నీర్యనష్టము కలిగి రోగములు వచ్చునసియు, కుయుక్తులు చెప్పి తమ బుద్ధివైశద్యమును వెల్లడించుకొనుచు, తామేమో యింద్ర భోగము ననుభవించుచున్నా మనుకొని సంతోషపడుచున్నారు. వారికి లభించిన యింద్రపదవి యంతయు నింద్రునకు జారత్వఫలముగా దేహమునిండ లభించిన సహస్రనేత్రములవలెనే తమ దేహములనిండ పెట్టనియలంకారముగా వేయికాయులను మచ్చలను సంపాదించుకొని కన్నులు గుంటలుపడి యేనుఁగులవంటివారు పీనుఁగులవంటివారగుట తప్ప మఱియొకటి కానరాదు. పెద్దలు గోతిలో పడుచున్నారను హేతువుచేత చిన్నలుకూడ పడవలయునని సుబుద్ధిమంతులును చెప్పరు గనుక పరులు చెడిరి కాన తామును చెడవలెననుటకు నొకటికారణ మొక కారణమే కానేరదు. కాఁబట్టి తమ దుశ్చేష్టల కితరులను నిదర్శనముగాఁ జెప్పుట కేవలము బుద్ధిహీనత. ఇఁక తమ భార్యలు రూపవతులు కారనెడు కారణము మొదటికారణమునకంటె శ్రేష్ఠమయినదని బుద్ధిమంతు లెవ్వరును పలుక సాహసింపరు. ఎల్ల వారును తమభార్యలు చక్కనివారు కావలెనని కోరుచుందురయే గాని తాము చక్కనివారగుదురా కారా యన్న యంశము విచా రింపరు. తమభార్య లోకవేళ తమకంటె చక్కనివారిమీఁద కన్ను

వేసి 'మీరు మాకంటె కందముగా నుండలేదు గనుక మేము మఱి యొకరిని జూచుకొందు'మని భర్తలు నేర్పిన యుక్తి మరల వారియెడ లం బ్రయోగింప సాహసించిన పక్షమున నీయపూర్వబుద్ధిమంతులు తాము చూపిన కారణముయొక్క గౌరవమును తెలిసికొని మూకీభావమును వహింతురేమోయని యాశ బాధించుచున్నది. కాని కాముని ప్రభావమును తలఁచుకొనఁగా నాయాశ కవకాశము కనఁబడదు. చిన్నతనములో తల్లిదండ్రులు తమయిష్టమును తెలిసికొనకయే వివాహము చేసినను తామప్పుడంగీకరించి యూరకుండుటచేత భార్యలెట్టి కురూపిణులయినను వారి నాదరించి యేలుట కెల్లవారును బద్ధులగుచున్నారు. మంచిభార్యకు లక్షణము గుణసంపదగలిగి యుండుట కాని చర్మముయొక్క రంగును ముఖముయొక్క గుండ్రతనమును కావు. బుద్ధిమంతుఁ డయినవాఁ డెప్పుడును "అమృతం సద్గుణా భారా" యన్న సన్నుత్తోక్తిని మనసునం దుంచుకొని భార్య గుణవంతురాలు కావలెననియే కోరునుగాని కేవల రూపవతి కావలెనని కోరఁడు. అదిగాక మనపూర్వులు "భార్యా రూపవతీ శత్రు" వనియే భావించుకొనుచుండిరి. ఈమార్యోక్తియొక్క సత్యము బృహస్పతి యంతటి బుద్ధిమంతున కనుభవమయిన యంశము. గుణవతిగాక భార్య రూపవతిమాత్రమే యగుట సంభవించిన పక్షమున తమవలెనే పయిత్తోలును జూచి యాశపడి వివిధకుతంత్రములు పన్ను మహాపురుషుల యనుగ్రహమువలన భార్య నిజముగా శత్రువే యగును గనుక భార్యతో సుఖపడవలెననుకొన్న భర్త తన కట్టి శత్రువును కోరకొనకుండుటయే క్షేమకరము. ఇటువంటి యుక్తిరత్నములను పన్ని నేర్చిన బుద్ధిమంతులకు బుద్ధి చెప్పుటకు వజ్రతుల్యములైన యామనస్సులను ఛేదింపఁజాలని వాగ్రూపమయినయిటువంటి రమ్యులహితోపదేశ

మునకంటె కార్యరూపమయిన ప్రబలహితబోధ తటస్థించి వారి కంటె రూపవతులయిన భార్యలు వారిని మీఱి తిరుగుట సంభవింప వలెను గనుక, వారిని సన్మార్గచరులనుగాఁ జేయుట కయినను దైవము వారికట్టి చక్కనిభార్యలను దయచేయునుగాక! అయినను లోకములో నన్నియు మనము కోరుకొనునట్లు సంభవింపవు; మనకు న్యాయముగా నేది లభించినదో మనము దానితోనే తృప్తినొంది యుండవలెను. అప్పుడే మనకు నిజమైన యానందము కలుగును. అందఱకును వీర్యనష్టము సంభవించుననికాని సంభవించు ననుకొన్నను బాలురందఱును తమవలె చెడి తిరుగుచున్నారనుట కాని తిరుగవలె ననుటగాని హాస్యాస్పదము గనుక, ఆవిషయమిక్కడ ప్రసంగింపవలసిన యావశ్యకము లేదు. ఈవేశ్యాసంభోగమువలన నొక వేళ కొన్ని స్వల్పలాభము లున్నవని చే వాదము నిమిత్తము క్షణకాల మంగీకరించినను, దానివలన కలిగెడి యనంతములయిన కీడులను తలఁచుకొన్న వారి కాలాభములు లవణమహాసముద్రములో రెండు మూఁడు తీయనీటిబొట్లవలె కనఁబడి మేను పులకరించి యటువంటిదశ పగవానికయినను వలదని తోఁచకమానదు; వేశ్యాపరాయణు లగు పురుషులకు మొట్టమొదట యశోహానియు, ధనహానియు, మాన హానియు, కలుగును—అనఁగా మానవంతుని సుఖజీవనమున కేమేమి కావలయునో యవి యన్నియు చెడును. వేశ్యలమూలమున నొకా నొకప్పుడు ప్రాణములవంటి మిత్రులతో సహితము విరోధము సంభ వించును; గౌరవమును పేరుండదు; "అరగడియ భోగము, ఆఱునెలల రోగము" అన్నట్లు నిమిషసౌఖ్యమున కాశపడి రోగములు తగిలించు కొని యెందఱు కలకాలమును దుఃఖపడుచున్నవారు కారు? వారు పడెడుదురవస్థలు తలఁచుకొన్న నెంతటి కఠినచిత్తునకును దేహము పుల

కరింపకపోదు. వేశ్యలమూలమున నెంతమంది లక్షాధికారులు సహితము భిక్షాధికారులయి తిండికిలేక దేహముచెడి మానహీనమైన బ్రతుకు బ్రతుకుచున్నారు కారు? మానములకు తోడుగా ప్రాణములను సహితము పోఁగొట్టుకొన్నవా రెందఱు లేరు? భోగస్త్రీల మూలమున నెందఱి బిడ్డలును భార్యలును కుటుంబములును చెడి తిండికి లేక కూటిపేద లగుచుండలేదు? ఎందఱిభార్యలు నాథుల చెడుతిరుగుళ్లు చూచి సహింపలేక మానముకంటె ప్రాణమధికము కాదని యెంచి యాత్మహత్యలు చేసికోలేదు? ఎందఱిభార్యలు మానమునకు కట్టుపడి యాత్మహత్యా పాపమునకోని గృహమున నొదిగియుండి చచ్చినవారికంటెను భాగ్యహీనలయి యావజ్జీవమును మనోవ్యధచేత కుంది కృశించుచున్నారు? పూర్వులు కూడఁబెట్టిపోయిన ధనమంతయు పోఁగా, తల్లిదండ్రులు ప్రేమతో నెత్తి పెంచిన దేహమంతయు చెడఁగా, కులకాంత లింటివద్ద నుస్సురని యహోరాత్రములు విలపింపఁగా, బిడ్డలు మొదలగువారు కడుపుకాలి మాడఁగా, యోగ్యులు నిందింపఁగా, గురువు లుపదేశించిన బుద్ధులన్నియు మంటఁగలియఁగా ఆత్మ పాపములపాలయి వ్యధచెందఁగా, వేశ్యాప్రియు లేసుఖమనుభవించెదరో యూహింపఁ దరము కాకున్నది. పాపమని చెప్పి యంతరాత్మ పెట్టు చీవాట్లమాట యటుండఁగా నాయంతరాత్మ మైమఱచి నిద్రించుచున్న కాలములో సహితము తామే యావేశ్యల యొక్క ప్రేమనంతను గుత్తగొనవలెనని విశ్వప్రయత్నములు చేయు పరమసాహసికులయిన విటులమూలమున నిద్రపట్టక మనస్సునకెంత మాత్రమును నెమ్మదిలేక యుండును. ఇట్లిహపరదూరమయి పాపైకమూలమయిన యీయకృత్యమునకుం జొచ్చి వేశ్యలమీఁదనె ప్రాణములు పెట్టుకొనియుండు పల్లవులపయి నాపల్లవపాణుల కెటువంటి

ప్రేమ యుండునోయని విచారింప నదియు సున్నగానే కనఁబడు చున్నది. వెలయాండ్రకు పలుకులయందు మాత్రమే తేనె లొలుకు చుండునుగాని హృదయము లెప్పుడును కఠినశిలలుగానే యుండును. దినమున కొక్క లక్షయుపపతులను గలసినను వారందఱును తమ పయినె యావారాంగనల కెక్కువ వలపుగలదని భ్రమించునట్లుగా మాయమాటలను కల్లవలపును ప్రకటించుచు హరించుటకు విటుల యొద్ద ధనమున్నంత కాలమును తాము వారి బహిఃప్రాణములవలె నటించుచు మెల్లగా నాభోగులను జోగులనుచేసి యాగణికామతల్లులు తమతల్లులచేత వారి నిల్లు వెడలఁగొట్టించి జ్ఞానులనుజేసి పైకము లేనివాఁడు పరస్త్రీ వర్జితుఁడన్నట్లు స్వభార్యానిరతులనుజేసి పంపించి వేయుదురు. ఈరీతి మోసపుకృత్యము లన్నియు వానికి తల్లిచను పాలతో సమానముగా నూఁతిపోసినవే గనుక, ఒకవేశ్య యొందఱిని మోసపుచ్చి యెంతధన మపహరించి యొందఱిని నీతిమార్గము నుండి తొలఁగించి యెన్నిసంసారములు పాడుచేసిన నంతప్రతిష్ఠ వహించుచుండును. పురుషుల సుఖముమాట యటుండఁగా నిఁక వేశ్యల సుఖ మేపాటిదిగా నుండునా యని విచారింపఁగా ఆసౌ భాగ్యమును సహితము తెలిసికొని యానందింపవచ్చును. అతిభోగము చేత వారికి సంతానము కలుగదు; రోగము లంటుకొని చిన్నతనము లోనే నిన్న స్నిగ్ధముగాను కోమలముగాను నున్న దేహమంతయు రేపు పుచ్చి గజ్జికాకరకాయవలెనయి చెడిపోవును; తాము చేయించు కొన్న యలంకారములకు మిన్నగాఁదు పెట్టిన భూషణములుకూడ తోడు పడును; కొంచెము వయసు దాఁటినతోడనే విటపురుషులు తమ్మువిడిచి యవలకు దాఁటఁగా, గడించినసొమ్ము వ్యాధులక్రింద వ్యయపడఁగా, వెనుకటి సంగీతనాద మిప్పుడు రోదననినాదముగా మాఱఁగా, ముప్పది

సంవత్సరముల ప్రాయముననే దేహము చెడిపోయి తిండికిలేక తమ పాపఫల మనుభవించుచు రోగములచేత బాధపడుచు నిట్టి కులవృత్తి నంగీకరించిన యీదేశముయొక్క యపకీర్తి మూర్తీభవించి యీరీతిని బహురూపముల మెలఁగుచున్నదో యన నభాగ్యదేవతలవలె నెల్లెడ దిరుగుచుందురు. ఇటువంటివా రగుటచేతనే వేశ్యల నెంతమాత్రము నాదరింపక వారెంత సౌందర్యవతులయినను శ్మశానకుసుమములనువలెఁ జూచి విడువవలయునని యొకకవీశ్వరుఁడు పలికియున్నాఁడు—

శ్లో. ఏతా హసంతి చ రుదంతి చ విత్తహేతో
ర్విశ్వాసయంతి పురుషం న తు విశ్వసంతి।
తస్మాన్నరేణ కులశీల సమన్వితేన
వేశ్యా శ్మశానసుమనా ఇవ వర్జనీయాః॥

వీరు ధనమునిమిత్తమయి నవ్వుదురు; ఏడుతురు; పురుషులను నమ్మింతురు; తాము వారిని నమ్మరు; కాఁబట్టి కులశీలములు గలవాఁడు వేశ్యలను వల్లకాటియందలి పువ్వులనువలె విడువవలయునని పయి శ్లోకమున కభిప్రాయము. మఱియు నింకొకచోట భర్తృహరి వేశ్యల పయి రోఁతపుట్టునట్లుగా,

శ్లో. క శ్చుంబతి కులపురుషో వేశ్యాధరపల్లవం మనోజ్ఞమపి
చార భట చోర చేటక విట నటనిష్ఠీవనశరావమ్॥

ఎంతమనోహర మయినదయినను దూతలకును భటులకును దొంగలకును దాసీకాంద్రకును విటులకును నటులకును తమ్మయుమియు పీకదానువంటి దయిన వేశ్యాధరమును కులపురుషుఁ డెవఁడు పానము చేయునని దూషించి యున్నాఁడు. ఇదేప్రకారముగా నొక తెలుఁగు కవియును,

చ. పడిగము తమ్ములం బుమిసియు పల్లవకోటికి నోరు, వేఁడి యం

గడి సవరంబు, సంత సొరకాయ లురోజము, లచ్చురచ్చసా
వడి మెడ, యూరుస్రల్ గమిడివాతియనంటులు, మోవిజిడ్డిగి
జ్జడి, వెలయాలి జీవనము జీవనమే తలపోసి చూడఁగన్.

నోటిని పీకుదాను గాను, కొప్పును బజారున కట్టిన సవరముగాను, స్తనములను సంతసొరకాయలుగాను, ఱొమ్మును రచ్చసావడిగాను, తొడలను వీధిముందరి యరఁటిచెట్లుగాను, అధరోష్ఠమును కల్లుపాయగాను వర్ణించి యున్నాఁడు. భర్తృహరి చెప్పినట్లుగా జారులు చోరులు నటులు విటులు మొదలయినవా రందఱును విచ్చలవిడిగా తమ్మ పెట్టుచుండుటచేత నోటిని పీకుదానుతో పోల్చుట మిక్కిలి సరిగానున్నది; కొనుటకు వెళ్ళిన వారెల్లను గిల్లి చూచుచుండులాగునే బహుజననఖక్షతములకు లోనయిన వేశ్యల స్తనములకు సంతసొరకాయలతోడి యుపమానము సరిగా కుదిరియున్నది; ఎంగిలియని చూడక యందఱును పానము చేయుచుండుటచేత వేశ్యలయధరోష్ఠమునకును కల్లుత్రాగు తాటాకులపాయకును సామ్యమెంతయైన చక్కఁగా నున్నది. ఇటువంటి వేశ్యలతోడి సాంగత్యమునకంటె నింద్యమయినది మానవంతునకు మఱి యేదియున్నది? అందుచేతనే మఱియొక సంస్కృతకవీశ్వరుఁడు

శ్లో. దర్శనా చ్చిత్తవైకల్యం స్పర్శనాత్తుధనక్షయః
సంభోగా త్కిల్బిషం పణ్య స్త్రీణాం ప్రత్యక్షరక్షసాం॥

పణ్యస్త్రీలను ప్రత్యక్షరక్షస్సులనుగాఁ జెప్పి వారిని చూచుట చేతనే చిత్తచాంచల్యమును, తాఁకుటచేతనే ధనక్షయమును, సంభోగము చేతనే పాపమును వచ్చునని చెప్పి యున్నాఁడు. ఇట్లింతదూరము చెప్పుట, దేవసభలయందును మఱి యేశుభకార్యములయందును వేశ్యలను రప్పించి యాదరింపఁగూడదని సాధించుటకొఱకే సుండీ.

అప్పుడు వేశ్యల మేళములే లేకపోయినయెడల సర్వజనాహ్లాదకర మయిన సంగీతము నశించుననియు, వివాహాదులగు సంతోషకార్యములయందు బంధుమిత్ర సమావేశ మయినప్పుడు వారికి హృదయాహ్లాదకరముగా నుండునది యేదియు లేకపోవుననియు, సంగీతము నిలిచిన నభినయశాస్త్రము నశించుననియు, కొందఱు భయపడుచున్నారు. అవి పోవుటవలన మనదేశమును రెండుపిశాచములు వదలినట్లు సంతోషింపవలయునే కాని యెంతమాత్రమును భయపడవలసిన పని లేదు. పయికి వెగటుగా కనఁబడినను మనకు మేలుకూర్చునవి మాత్రమే మనకు హితములును నాదరణీయములునుగాని పిశాచములవలెఁ బయికి నానావిధ సుందరరూపములతోఁ గనఁబడి భ్రమపెట్టి కడపట మనలను పాడుచేయునవి హితములు కావు. ఇప్పుడు మన దేశమునందు గానాభినయవిద్యలు రెండును తెలియనివారిని కుమార్గమునకు దింపి పాడుచేయుటకు మాత్రమే యుపయోగపడుచున్నవి కాని సన్మార్గమునకు త్రిప్పుటకు లేశమాత్రము నుపయోగపడుచుండ లేదు. అటువంటి యనర్థదాయకములయిన విద్యలు నశించినప్పుడు మనము చింతపడవలయునో సంతోషపడవలయునో బుద్ధిమంతు లూహించుకోఁ గలరు. అదికాక సర్వజనులను వశపఱుచుకొనఁదగిన యుత్కృష్ట సాధనము నొకదానిని దుర్మార్గులచేతిలో విడిచిపెట్టిన పక్షమున దానిని వారు తప్పక తమదుష్టకార్యములయం దుపయోగించుకొందురు గనుక దానివలన లోకమున కెప్పుడును మితిమీఱిన హాని కలుగుచుండునే కాని యొకప్పుడును లాభలేశ మయినను కలుగనేరదు. దుష్టనిగ్రహమును శత్రుసంహారమును జేసి దేశమును సంరక్షింపఁ గల శూరుని హస్తము నలంకరింపవలసిన దివ్యాయుధమును దీసికొని పోయి చోరుని హస్తమున పెట్టిన పక్షమున దానినాదొంగ మంచి

వారిని సంహరించి ధనము దోచుకొను తన కులవిద్యయందు తప్ప మఱి యెక్కడ నుపయోగించును? పాతివ్రత్యమునకు జన్మభూము లయి పురుషుల మనోవ్యధలను పాఱఁదోలి గృహమును భూతల స్వర్గముగాఁ జేయఁదగిన యిల్లాండ్రయొద్ద నుండవలసిన సంగీతవిద్యను దీసికొనిపోయి భార్యాభర్తల నెడఁబాపి సంసారములను గూలఁ ద్రోసి గృహములను మహారణ్యములనుగాఁ జేయ బిరుదు వేసికొన్న లంజెలకు సమర్పించిన పక్షమున, వారు దానిని కిరాతులు మచ్చు చూపి పక్షులను తమవలలలోని కాకర్షించునట్లు యౌవనవంతులను తమవలలోఁ జిక్కించుకొని పాడుచేసి పందువంటి కాపురములను పడఁగొట్టుటయందుఁ దప్ప మఱి దేనియందు వినియోగపఱుతురు? కాఁబట్టి యీ యుత్తమసాధనములను దుష్టశిరోమణుల చేతులలోనుండి యెంతశీఘ్రముగా తొలఁగింపఁ గలిగిన లోకమున కంత క్షేమకర మగును. అందుచేత మనము మొట్టమొదట చేయవలసినపని భగ వంతునిచేత లోకానుగ్రహార్థముగా ప్రసాదింపఁబడిన యమూల్య మయిన గానవిద్యామృతమును వారాంగనల నోళ్ళనుండి విడిపించి సంసా రులనోళ్ళకు చవిచూపుట. సంగీతమువలన నిజముగాఁ గలుగవల సినలాభములు మనము పనిచేసి యలసి యింటికి వచ్చినప్పుడు మన స్సునకు విశ్రాంతియు నుల్లాసమును గలిగించుట, కఠినచిత్తుల మనస్సు లనుసహితము రాగరసముచేత కరఁగించి వారికి దయాదాక్షిణ్యాదు లుదయించునట్లుచేసి నీతిమార్గమునకు మరలించుట, దుఃఖములను తొలఁగకుండఁజేసి హృదయముల కానందము పుట్టించుట, ఇంద్రియ సుఖములను మఱపించి చిత్తములను పారమార్థిక సుఖములకయి ప్రే రేచి భగవద్భక్తికి పురికొల్పుట, మహాత్ములుచేసిన ఘనకార్యములను వర్ణించు గీతములవలన దేశాభిమానము మొదలయిన సద్గుణములను

పెంపు చెందించుట, మొదలయినవి. ఇటువంటి యుత్తమగుణముల కు తేజము కావలసిన యీసంగీత మిప్పుడు లంజెల యధీనమయి యుండుటవలన దానియందలి సుగుణములన్నియు రూపుమాసి వాని స్థానమున దుర్గుణశతము లుద్భవిల్లి సంగీతవిద్యయందు సుగుణసంపత్తి కూడ నున్నదా యని సాధువులు శంకించునంతటి దుర్దశపట్టి యోగ్యులు దాని నభ్యసించుట తమగౌరవమునకు తగదని యెంచి సాధారణ ముగా మానుకొనుచున్నారు; ఈకాలమునందు వేశ్యలు పాడుగీతము లను నేర్చుకొని పాడువారి నెల్లవారును నీచులుగా నెంచి యాదరింప కుండుటయే యిందుకు చాలినంత నిదర్శనముగా నున్నది. అందుచేతనే సంగీతశాస్త్రము నభ్యసించినవారు సామాన్యముగా వేశ్యలకు చదువు చెప్పుకొని పొట్టపోసికొనవలసినవా రగుచున్నారు; వారిని తమసర సను గూరుచుండఁబెట్టుకొనుటయు తమపంక్తిని పెట్టుకొని భోజనము చేయుటయు నవమానకరమని తగుమనుష్యు లందఱును భావించు చున్నారు. అదిగాక మనదేశమునందిప్పుడు వేశ్యల సొమ్మయియున్న గానస్వభావ మెట్టిదాయని విచారింపఁగా వారిప్పుడు పాడుగీతము లన్నియు శృంగారరస ప్రధానములయి విటుల నాకర్షించుటకు మాత్రమె యనుకూలముగా నున్నవి. చెడుపాటలు పాడుటవలన చెడుతలంపులును, చెడుతలంపులవలన చెడుపనులును పట్టుపడి యీ సంగీతము నేర్చుకొన్నవారు సాధారణముగా జారత్వాది దోషములకు స్థానభూతులగుచున్నారు. వేశ్యలనెడి యీకప్పకూఁత పాములనోటి నుండి వెలువడు పాటలలోని దుర్నీతి యలంకారబహుళమయిన మృదు భాషలో నడఁగియుండి పయికెంతో యింపుగా నగపడి వెన్నమెత్తిన విషమువలె మోసపుచ్చి యపారమయిన హాని నాపాదించునదిగా నున్నది. ఈపాటలు మనకు నిజముగా మిత్రరూపమున నగపడు

గర్భశత్రువులు; మన కిటువంటి వానివలననే నష్టమధికముగా కలుగును; గాని నిజరూపమునఁ గనఁబడు క్రూరశత్రువులవలన సహిత మింతనష్టము కలుగదు. మనకిది శత్రువని ప్రత్యక్షముగా తెలిసి నప్పుడు దానికి లోఁబడకుండ మనము కాపుదలలో నుందుము. ఈ గీతములు తియ్యనిమాటలలో నిమిడి పయికి తమదుష్టస్వభావము నేమియు తెలియనీయక చక్కెరపూసిన విషమువలె ముగ్ధహృదముల నాకర్షించుచు చేయవలసిన నష్టమంతయు చల్లగా చేసివేసి జవసత్వము లుడిగి కార్యము మించినతరువాత పయివారికి తమశత్రురూపమును జూపుచున్నవి. ఇటువంటి హీనశత్రువులను రూపుమాపుటకంటె దేశక్షేమము కోరువారికి ముఖ్యకర్తవ్యము మఱియొకటిలేదు. ఈసత్ప్రయత్నముచేత శాస్త్రనామమును వహించి యయోగ్యముగా గౌరవము పొందుచున్న యీయభినయమును పాటలును మనదేశమును వదలి పాతాళము పట్టిననే, కులకాంతలు గానవిద్య నభ్యసింపఁగూడదని పుట్టిన విపరీతాభిప్రాయముచెడి, సంగీతమున కాశపడి పురుషులు భార్యలను విడనాడి భోగమువాండ్రపంచలు పట్టి తిరుగవలసిన దుర్గతి తొలఁగి, కులాంగనల మూలముననే యోగ్యులకు సంగీతమువలనఁ గలుగవలసినఫలము గలుగు భాగ్యములభించి, ప్రతిగృహము నానందమున కాటపట్టగుటకు కారణమగును. వేశ్యలు చేయు నభినయమంతయు సంభోగాదివర్ణనలతో నిండియుండి యౌవనదోషగ్రస్తులయియున్న నిరపరాధులను దోషములతో నెల్లను మహాదోషమయిన జారత్వమునకుదింపి వారిని పాడుచేయుటకు సాధనమయి దుష్టమయి నదిగా నున్నది. కాఁబట్టి వేశ్యావృత్తి పోవుటవలన నృత్తగీతాదులు నశించునని భయపడు బుద్ధిమంతులిప్పుడు కొంతధైర్యము తెచ్చుకొని యాయుత్తమవిద్యలు వారాంగనల పిడికిళ్ళనుండి విముక్తి నొంది

యితరులపాల బడుటవలన మఱింత గౌరవముపొంది యిప్పుడున్న దుష్టస్వభావమును విడిచి పరులకు హానిచేయుట మానుకొని నీతిని భగవద్భక్తిని వృద్ధిపఱచుచు దేశమునకు క్షేమమే చేయునని సంతోషింపవచ్చును. కులకాంతలు నృత్తగీతాదులు నేర్చుకొనుట యెంత మాత్రమును గౌరవలోపమయిన పనికాదు. అవియున్ననే కుటుంబములో నిజమయిన యానందమును సౌఖ్యమును కలుగును. భర్తలు పగలెల్లను బయిటఁబనిచేసి యలసి యిల్లుచేరునప్పుడు వారిశ్రమము తీర్చి సంతోషమియ్యఁగలిగినది సంగీతము తప్ప మఱి యేదియున్నది? మననాటకములను పురాణములను జూచినయెడల పూర్వకాలము నందు హిందూసుందరులు నృత్తగీతాదులు నేర్చుచు వచ్చి రనుటకు పెక్కు దృష్టాంతములు కనఁబడును. పూర్వకాలమునందు మనదేశమున నృత్తగీతాది వినోదముల నిమిత్తమై చారణలను సాంసారిక కాంతలే యేర్పఱుపఁబడి యుండిరి.

వివాహములు మొదలయిన శుభకార్యములుకూడ వధూవరులకు నీతినేర్పవలసిన పవిత్రసమయములగుటచేత నీతివనమునకు దావానలప్రాయులయిన వేశ్యల నచ్చటికిచేర్చి సిగ్గుపడక యానందింపఁ గలుగుట యాచారముయొక్క యద్భుతప్రభావమువలననే కదా? ఆహా! ఆచారమహిమము నేమని చెప్పవచ్చును! చిరకాలమునుండి వచ్చుచున్న యెడల ధర్మము నధర్మముగాను, అధర్మమును ధర్మముగాను తోఁపించి లోకము కన్నులుగప్పు శక్తి యొక్క యాచారము నందేకాక మఱి దేనియందున్నది? దురభిమానమును వదలి విచారింపఁగా పాతివ్రత్యమును నేర్చుకోవలసిన పెండ్లికూఁతులకును లంజెలయిన వేశ్యలకును ధర్మమునకును అధర్మమునకును గలంత వ్యత్యాసమున్నట్టు స్పష్టముకాకపోదు. కాఁబట్టి యట్టివేళలయందు వేశ్యలను

రప్పింపక యిహపర సాధనమయినదియు శ్రావ్య మయినదియు నగు భగవద్విషయికమైన సద్గానముతో కాలక్షేపముచేయుట యెంతయు నుచితముగ నుండును. భోగముమేళ మనఁగా స్పష్టమయిన భాషలో లంజెల దండనియేకదా యర్థము? మన మెంతో వేడుక పడి వధూవరుల బాగునుగోరి శుభకార్యము చేసికొన్నప్పు డానంద పరిపూర్తికయి మనకు పనికిమాలినలంజెలతోడి సాంగత్య మెందుకు? నీతిమాలిన లంజెలచేత పాడించు బూతుపాటలకన్న భగవంతుని దివ్య నామామృత మెవ్వరి చెవులకు మధురతరముగా నుండదు? ఒకవేళ నీశ్వరవిషయకములైన గీతములు పామరులకు కొందఱికి రుచింపక పోయినను పోనిండు. ప్రాజ్ఞులయినవారి కెవ్వరికిని దైవభజనము రుచింపకపోదు. ఈప్రకారముగా మనము వివాహాదులయందు పురుషులచేత భక్తివిషయమయిన గానములు పాడించుచు వచ్చినచో క్రమక్రమముగా ప్రోత్సాహము కలిగి పలువురు గానవిద్య నభ్యసించి నృత్తగీతాదుల నున్నతస్థితికి తీసికొనిపోదురు. వారాంగనలపాలయి పోయిన కుత్సితగాన మడఁగిపోయి పురుషులలో సద్గానము ప్రబలి సంగీతమున కెప్పటి గౌరవమురాఁగా మనస్త్రీలు దాని నభ్యసించి వివాహసమయములయందు మాత్రమేకాక యుక్తసమయముల యందెల్లను కూడ గృహములను సంతోషభరితములనుగాఁ జేయఁ గలుగుదురు. ఒకవేళ వేశ్యలపాటయందు రక్తి కొంచెమధికముగా నుండునేమో యని కొందఱు భ్రమపడినను దానియందు గుణములకంటె దోషములు సహస్రగుణము లధికముగా నుండుననుట నిర్వివాదాంశము గనుక దోషబాహుళ్యమయిన యీయత్యల్పసుఖమును మానుకొనుటయే మనకు పరమధర్మము. ఆయూశకుసహిత మవకాశములేక యీకాలమునందు వేశ్యలు వ్యభిచారమునే ప్రధాన

వృత్తిగా నేర్పుచుకొన్నారుగాని సంగీతమును కానేకాదు, చేసి కొన్నచో నాప్రధానవృత్తికి సంగీతము నొకయంగమునుగా మాత్రము కొందఱు చేసికొనుచున్నారు. ప్రగ్రామమునందును వేశ్యలసంఖ్యకు కలవు లేకపోయినను వారిలో శ్రావ్యముగా గీతములను పాడువారు మాత్రము దేశమున కొక్కరయిన నున్నారో లేరోయని శంకయింప వలసియున్నది. అందుచేత నిప్పుడీమేళములు "లంజెలు లేకున్నను గుడి రంజిల్లదు ప్రజలమనసు రంజిల్లదు" అన్ననీతిని స్థాపించుటకయి యలంకారముగా నుపయోగపడుచున్నవేకాని సంగీతమున కంతగా నుపయోగపడుచుండలేదు. వారిలో కొందఱు పాటపాడిరా యింట నెవ్వరో మృతినొంది యుందురని పొరుగువా రందఱును పరుగెత్తు కొని రావలసినదే; ఆటయాడిరా కాళ్ళక్రింద పుట్టెడు ధాన్యమున్నను నలిగి తెల్లనిబియ్యము కావలసినదే; అభినయము పట్టిరా కాళ్ళును చేతులును వంకరబోయెడు దొమ్మరోగమని వైద్యునిమిత్తము పరుగెత్తవలసినదే. ఏదియెట్లున్నను తాంబూలమునకు వచ్చినవారు మేళమొకమూల నాట్యమాడుచుండఁగా తామొకమూల ముచ్చటలాడుచు లేవఁబోవునప్పుడు వేశ్యలున్నారన్నమాటమాత్రము మఱచిపోక తండ్రితద్దినము మానుకొనియైనను విధిగా వారికి సమర్పింప వలసిన ముడుపు చెల్లించి వెళ్ళిపోవుచున్నారుగాని సంగీతసుఖము నంతగా ననుభవించుచుండఁగా చూడము. ఇఁక మేళములను రప్పించినవారో వేశ్యలచేత పాడించుట గౌరవావహమనుకొందురే కాని సంగీతము విని తామానందింపవలెనని యితరుల నానందింపఁజేయవలెనని పుట్టిన యుద్దేశముతో పిలిపింపరు. కాఁబట్టి మనవారు కొందఱనుకొనునట్లు వేడుకసమయములయందుఁగాని యితరసమయములయందుఁగాని సంగీతసుఖము ననుభవించువా రావగింజలో నరపా

లయినను లేరు. అందుచేత వేశ్యాస్త్రీలు పలువురు సంగీతమునందు మహాపాండిత్యము గలవారైనను, నాట్యమునందు భృంగికన్నను ప్రవీణు రాండ్రు కాకపోయినను పలుకుటుంబములను పాడుచేసి వేలకొలంది ధనమార్జించి మిద్దెలను మేడలను సహితము కట్టగలుగుచున్నా రనుటకు మనపట్టణములో మీరందఱును నెఱిఁగియున్న యొకటి రెండు నిదర్శనములే చాలియుండును. మనమండలమునందు లక్షల కొలంది జనులున్నను వేశ్యలసంగీతము విని యానందించుచుండు వారు లక్షకొకరయినను నున్నారో లేరోయని యనుమానింపవలసి యున్నది. కాఁబట్టి వేశ్యావృత్తి లేకుండునట్లు చేయుటవలన సంగీత వినోదము చెడునన్నమాట కల్ల; వారియొద్దనున్నది నిజమయినసంగీతమే కాదనియు, దానివలన నితరదేశములయందు కుటుంబములలో కలుగుచుండు లాభములేవియు కలుగకుండుటయేకాక యనంతము లయిన చెడుగులుకూడ కలుగుచున్నవనియు నయినే చూపియున్నాను; అదిగాక సంగీతము గణికల సొమ్మగుటవలన ప్రతికుటుంబమునందును కలుగవలసిన యానందము చెడుచున్నదనియు, గానవిద్య వేశ్యలలో నశించిపోయినయెడల నొక్కొక్క వారాంగనకు మాఱుగా వేవురేసి కులాంగనలయొద్ద వెలసి యిప్పు డిచ్చుచున్న విషతుల్యము లగు ఫలములకు మాఱుగా నమృతతుల్యములగు దివ్యఫలము లిచ్చు ననియు కనఁబఱిచి యున్నాను. వేశ్యల సంగీతము కొన్ని సత్ఫలము లనే యిచ్చునని యొప్పుకొన్నను, అది యావశ్యకమైన భోగ మును వినోదప్రదమును గనుక ప్రత్యక్షముగా కనఁబడు దుష్ఫలము లతో కూడిన వినోదమును సహితము మానుకోవలయుననియు కొంత వఱకు సాధించి యున్నాను. ఒకవేళ దాని నావశ్యకమునుగానే గ్రహించి సుఖప్రదమనియే యంగీకరించినను, ఇతరులకు చెఱిపి

మనము సుఖపడఁగోరరాదు. కనుక వివాహమాడి పతివ్రతలై పుత్రులతోను పుత్రికలతోను భర్తలతోను సంసారసుఖ మనుభవింపఁదగిన మానవతులను మానహీనలైన జారిణులనుగాఁజేసి యామూలమున సుఖించుట మానవధర్మము కాదు. బోసినోటివాఁడు పేలపిండిని మెచ్చుకొనినట్లు వదలుకచ్చువాఁడొకడు వేశ్యావృత్తిని శ్లాఘించుచు వేశ్యలు లేకపోయినయెడల సంసారులు పాడగుదురని చెప్పినను, అది యుక్తికిని అనుభవమునకును దూరమైనమాట యని ధీమంతు లందఱును తెలిసియుందురు. "మగనివద్ద జారత్వమును అత్తవద్ద చోరత్వమును నేర్చుకొనె" నన్నట్లు భర్తగా రమ్మవారి యింటికిఁ బోవ, భార్యగా రయ్యవారింటికిఁ బోయి యుభయులును పాడగుదురు. తల్లిదండ్రు లేలాగో యింకబిడ్డలు నదేవిధము. వేశ్యలు లేకపోయిన వ్యభిచారము పూర్ణముగాపోయి లోకమంతయు బాగుపడునాయని కొందఱు ప్రశ్న వేయవచ్చునుగాని సంఘములో నెప్పుడును కొందఱుగాకపోయిన కొందఱయినను చెడి గుడిసెవేటులై వ్యభిచరించుట సంభవింపవచ్చినను వారు వేశ్యలవలె వ్యభిచారమును పండ్లు మొలచినప్పటినుండియు విద్యగా నభ్యసించిన ప్రౌఢురాండ్రు కాకపోవుటచేత కలిగెడు నష్టము బహుగుణము లల్పముగా నుండుననిమాత్రము సమాధానము చెప్పఁగలము. ఏదేశమునందైనను బుద్ధిమంతులు చేయు ప్రయత్నమంతయు సాధ్యమైనంతవఱకును కీడును తొలఁగించి మేలును పెంపు చెందించు కొఱకేకాని మఱియేమియు కాదు. కాఁబట్టి దేశముయొక్క క్షేమము నిమిత్తమై యీదుర్వృత్తిని సాధ్యమైనంతవఱకు మాన్పఁ బ్రయత్నించుట విద్యాధికుల కందఱకును విధిగా నేర్పడుచున్నది. మనము సుఖముగా నున్నయెడల నెవ్వరేగంగలో మునిఁగిన మనకేమని స్వార్థపరులై యూరకుండుట

తెలివిగలవారి కర్తవ్యకృత్యముకాదు. కొంతవఱకైనను పరార్థపరుఁడై శక్తికొలఁదిని లోకమునిమిత్తము పాటుపడుట ప్రతిమనుష్యునకును ధర్మమై యుండఁగా విద్యాధికులకది ముఖ్యధర్మమని వేరె చెప్పవలయునా? మన మితరులకు బోధించునప్పుడు మనము నిషేధించిన పని ముందుగా మనము మాని చూపవలెను. అట్లు చేయక మనము మనశ్చాంచల్యముపొందక యుండఁగలము గదా యను గర్వముచేత మన మావేడుకకు కొంత యవకాశమిచ్చినయెడల పామరులు మన మాటలయందుకంటె చేష్టలయందే యధికవిశ్వాసముంచి వీరుమాటలయందు దేవతలైనను చేష్టలయందు మనతో సమానులే యని యెంచి మనహితోపదేశములను లక్ష్యముచేయక తాము మన మవలంబించిన మార్గమునే యనుసరించి యాపైని మనకంటె నాలుగు మెట్లెక్కువ యెక్కుదురు. కాఁబట్టి వినోదము తప్ప మఱియొకవిధమైన చెడుగు కలుగదనుకొన్నను, దానివలన నితరులకు కలిగెడుఫలమును కొంచె మాలోచించి పామరులకుకూడ మనకున్న పరిశుద్ధచింతనే యుండఁబోదని యెఱిఁగి లోకము నిమిత్తమైనను మనము కొన్ని చిఱుసుఖముల నవశ్యముగా మానుకొనవలయును. మనమనస్సుకూడ నొకవేళ చలింపవచ్చును గనుక ముందుగా చెడుమార్గమున ప్రవేశించుట కవకాశమిచ్చి యందు బ్రవేశించిన తరువాత వానితో పోరాడి కష్టముమీఁద మరలించుటకు ప్రయత్నించుటకంటె ప్రప్రథమముననే యామార్గమును మూసివేయుట మనకయిన నెంత క్షేమకరము! కొంద ఱంతయు నొప్పుకొని మాకిచ్ఛలేకయే మామిత్రుల ప్రోత్సాహముచేత నిట్లు చేయవలసినవారమైతిమని చెప్పవత్తురు. మన మిత్రులనిమిత్త మెన్నఁడయిన మనము కానిపని చేయవచ్చునా? మనము చేసిన సుకృతదుష్కృతములకు భగవంతుని సము

క్షమున మనమే యుత్తరవాదులము గావలసిన వారము కాని మన మిత్రులు కారు. కాఁబట్టి మనమాదోషమును మిత్రులమీఁద ద్రోసి వేయరాదు. మిత్రులకుఁగూడ ధర్మమును బోధించి వారిని మంచి మార్గమునకు ద్రిప్పుట మనకు విధి. మన మెన్నిపాట్లు పడినను వారు వినక చెడఁదలఁచుకొన్నపక్షమున వారి నంతటితో విడిచి వారిమైత్రికి వేయినమస్కారములుచేసి యూరకుండుట యెంతయు నుత్తమ కార్యము.

ఈవేశ్యావృత్తివలన నెవ్వరికి నేవిధమయిన సుఖమును గలుగ నేరదుకాని పయి కొకవేళ కొంచెము సుఖదాయకముగా కనఁబడినను ఈవఱకు చెప్పినదానివలన నిది యారంభములో వివరించిన సుఖభేదములలో మొదట సుఖములాగున కనఁబడి కడపట దుఃఖముగా పరిణమించుచున్న దానిలో తప్ప మఱియొకసుఖములో చేరదు గనుక దీనిని విడిచిపెట్టవలయునని మఱిమఱి చెప్పవలసిన యావశ్యకము లేదు. మనపూర్వులయిన నీవేశ్యావృత్తి నాదరించినవారు కారు. నృత్తగీతాది వినోదవిద్యలను వీరియధీనముచేయక సంసారులగు చారణాదులయందే యుంచిరి; మనపెద్ద లేధర్మశాస్త్రమునందును వారాంగనల ననులోమవిలోమసంకరజాతులలో నొకదానియందయిన నంగీకరించియుండలేదు. వీరికి దాయమెక్కడను వివరించి యుండ లేదు. వీరితో సంభోగించినవారికి ఘోరప్రాయశ్చిత్తమును విధించి పరాశరులవారు,

శ్లో. పశు వేశ్యాదిగమనే మహిష్యుష్ట్రీం కపీం తథా
ఖరీం చ సూకరీం గత్వా ప్రాజాపత్యం సమాచరేత్.

అని బ్రాహ్మణాదిజాతుల స్త్రీలతో వ్యభిచరించినందుకు వేఱువేఱు ప్రాయశ్చిత్తములు చెప్పిన తరువాత వేశ్యలనుగూడ పశువులతోన్య

గేదెలతోను కోతులతోను గాడిదలతోను పందులతోను గలిపి వానితో సంభోగించునప్పుడు చెప్పిన ప్రాయశ్చిత్తమునే వేశ్యాసంభోగమునకు జెప్పియున్నారు. అదిగాక మనధర్మశాస్త్రకర్తలు వేశ్యాప్రియులు పంక్తిబాహ్యులనియు వారికి రాజసభలలో కొలువు లియ్యకూడదని యు విధించియున్నారు. అందుచేతఁ బూర్వకాలమునందు వేశ్యల నుంచుకొన్నవా రెంతో హీనులుగా చూడఁబడుచుండిరి; మనరాజులు వారికి సభలలో పనులియ్యకుండిరి; కులమువారును వారిని మిక్కిలి తక్కువగాఁ జూచుచుఁడిరి. కాబట్టి యాకాలములో బహిరంగము గా వేశ్యల నుంచుకొనుట యెంతో తలవంపులుగానుండి మానాభి మానములు గలవా రందఱును వ్యభిచారమును మానుచవచ్చిరి. ఈకాలమందన్ననో యించుమించుగా మనరాజులందఱును నశించి నారు: ఉన్న కొందఱయినను దివానక్షత్రములవలె శోభింపకున్నారు; అందుచేత నీదేశోపద్రవమును నివారించుటకు వారుశక్తులు కారు; ఇట్టి దురాచారములను మాన్పుటకయి కులమువారి కిప్పుడు మునుపున్న నీతియు కట్టునుగూడ లేక విత్తమే ప్రధానమయియున్నది. కాఁబట్టి యిప్పుడేవిధమయిన యడ్డంకియు లేక వ్యభిచారమున్న తప్పుగానే తోచక యెల్లవారును హేరాళముగా వేశ్యల నుంచుకొనుచున్నారు; ఇప్పుడా వేశ్యాప్రియుల గౌరవమున కెంతమాత్రమును భంగము కలుగుచుండ లేదు. ఇప్పుడిప్పుడు విద్యాధికులయినవారు ప్రబలు లయి కొంతవఱకు దురాచారములను తగ్గించుటకు శక్తులగుచున్నారు. గనుక వారందఱునుజేరి యిటువంటి దుర్వృత్తియందు ప్రవేశించు వారిని చిన్నచూపునఁ జూచుచు పదిమంది సమావేశమైనచోట వారిని గౌరవింపక పోవుచు వచ్చినయెడల వ్యభిచారము కొంతవఱకయినను తగ్గునని నమ్ముచున్నాను. వ్యభిచారమునకయి యొకజాతి యేర్పడి

యుండుట మన దేశమునకంతకు నిందాకరము. అట్టి నిందను మన దేశ మెప్పుడు తొలఁగించుకొని నాగరికతగల దేశములలో తల యెత్తుకోఁ గలుగునోయని కాలమున కెదురుచూచుచు నట్టికాలమును శీఘ్రముగా తెచ్చుటకై మనచేతనైన ప్రయత్నము మనము చేయుచుండవలసియున్నది. ఈ దుష్కాలమును రూపుమాపుటకై సాధారణముగా వేశ్యలకు సంతానము లేకుండఁజేసి భగవంతుఁడే కావలసినంతపని చేయుచున్నాఁడు. ఆపనికి సాయముగా వేశ్యలితర బిడ్డలను పెంచుకొని వారిని పాడుచేయు దురాచారమును మనము పనిపూని తొలఁగించుచు వచ్చిన పక్షమున మన మనుకొన్న కాల మత్యంత శీఘ్రముగానే రాఁగలదు. మనము చేయవలసిన పనికి దొరతనము వారుకూడ మనకు సహాయులయి వ్యభిచారవృత్తికయి పిల్లలను పెంచుకొనుట యిండియాదేశపు శిక్షాస్మృతిలో శిక్షార్హమయిన నేరముగా విధించియున్నారు. మన మీవిషయమునందు శ్రద్ధవహించిన యెడల వివాహమాడి పతివ్రతలు కావలసిన బాలికలెందఱో వ్యభిచారకూపమునుండి బయలబడి సంసారసుఖ మనుభవింపఁగల వారగుదురు. అట్టి నోరెఱుఁగని నిరపరాధినులను రక్షించుటను మించిన పుణ్యకార్యము మఱియొకటి లేదు. కాఁబట్టి మనవారు వేశ్యలు పరుల ముద్దుబిడ్డలను పెంచుకొనకుండ నివారించుటలోను, శుభకార్యాదులయందు భోగముమేళముల పిలిపించి యాదరింపకుండుటలోను తగినకృషి చేయుదురని కోరుచు నింతటితో విరమించుచున్నాను.

ఐ క మ త్య ము

By

K. VEERESA LINGAM

ఐకమత్యము

ఓ మహాజనులారా !

నేనీదినమున మీకై కమత్యమునుగూర్చి కొన్నివాక్యములను చెప్పఁబోవుచున్నాను. మీరందఱును సావధానమనస్కులరయి యాలకింపుఁడు. అనేక లోకవిషయములం దేకాభిప్రాయము కలిగియుండుటయే యైకమత్యము. మనుష్యుఁ డెప్పుడును ఏఘనకార్యమును ఒంటిగాచేసి సర్వజనశ్లాఘాపాత్రముగా నిర్వహింపఁజాలఁడు; అల్పకార్యములను నిర్వహించుటలో నహితము మనుష్యుఁడు సామాన్యముగా అన్యులసాహాయ్యము నపేక్షింపవలసినవాఁడుగానే యున్నాఁడు. మనకు నిత్యమును కావలసియుండెడి యన్నవస్త్రముల విషయమునఁగూడ నెందఱో యెన్నివిధములనో పాటు పడవలసి యున్నది. ధాన్యము చల్లుటకు ముందుగా కొందఱు భూమిని దున్ని వెంటకట్టి బాగుచేయవలెను; విత్తనములుచల్లి మొక్కమొలిచినతరువాత కొందఱు పొలమునకు నీరుపెట్టి కలుపుతీసి కష్టపడవలెను; పయి రెదిగి కంకులు వేయనారంభించినది మొదలుకొని యెలుకలనుండియు చిలుకలనుండియు దానిని కాపాడుచు పండినతరువాత చేనుకోసి కొందఱు ధాన్యమును జాగ్రత్తచేయవలెను; ధాన్యమిల్లు చేరిన తరువాత కొందఱు దంపి యుముక మొదలయినవి తీసి బాగుచేసి బియ్యము చేయవలెను; కట్టకడపట కొందఱాబియ్యమును వండి పాకము చేయవలెను. ఇట్లిందఱు పాటుపడినంగాని సుఖముగా తినుట కొక్కని కొక్కపూట నోటికి పట్టెడన్నము రాదు. ఇవిగాక దున్నుటకు సాధనములయిన నాగళ్ళను, కోయుటకు సాధనములయిన కొడవళ్లను, దంపుటకు సాధనములయిన రోలు రోకళ్ళను,

వంటకు సాధనములయిన పాత్రములను, చేయుటకయి యెందఱో కష్టపడవలెను. ఈప్రకారముగానే మనము ధరించుకొను వస్త్రముల నిమిత్తముకూడ మొట్టమొదట ప్రత్తిని పయిరు చేయుటకును, నూలుగా మార్చి వస్త్రములు నేయుటకును, పలువురు పాటుపడ వలయును. మనము సుఖముగా నొకగృహమునందు వాసము చేయ వలెనన్న పక్షమున దానినిర్మాణము నిమిత్తమయి యిటుకలును పెంకులును పట్టువారును, గోడలు పెట్టువారును, తలుపులు మొదలయిన వానికి బల్లలు కోయువారును, మేకులు బందులు మొదలయినవి చేయు వారును, వివిధముగా పాటుపడువారనేకులు కావలెను. ఒక్క మనుష్యుఁ డింత యన్నముతిని, బట్టకట్టుకొని, నీడను పరుండఁగలుగు టకే యింతమంది పాటుపడవలసి యుండఁగా అనేకుల కుపయోగ పడెడు మహాకార్యముల విషయమయి యింతకంటె నెక్కువజనుల యొక్క తోడ్పాటావశ్యకముగా కావలసి యుండునని చెప్పనక్కఱ లేకయే యెల్లవారును సులభముగా నూహించుకోవచ్చును. కాఁబట్టి యీలోకములో సర్వకార్యసిద్ధులకును కొంచెముగానో గొప్పగానో పలువురుచేరి పాటుపడక తప్పదనియు, చేసెడి కార్యముయొక్క గౌర వాధిక్యమునుబట్టి యధికసంఖ్యాకుల తోడ్పాటుకావలసియుండుననియు, ఐకమత్యము లేక యొక్కకార్యము నిమిత్త మనేకులు కలియుట సంభ వింపనేరదనియు, పయినిచెప్పిన దానివలన స్పష్టమగుచున్నది. మను ష్యుని సుఖమునిమిత్తమయి కావలసిన ప్రతికార్యములోను పలువుర తోడ్పాటు కావలెనని యెప్పుడు తేలుచున్నదో యప్పుడే మనుష్యు లను పరస్పరసాహాయ్య మపేక్షించు జీవులనుగా పరమేశ్వరుఁ డుద్దే శించి సృజియించెననియు, ఈశ్వరోద్దేశమునకు విరుద్ధముగా నన్య సాహాయ్యము నపేక్షింపక మనుష్యుఁ డేకాకిగా నుండుటకు ప్రయ

త్నించినపక్షమున సుఖపడఁజాలఁడనియు, స్పష్టమగుచున్నది. కాఁబట్టి పలువురతోఁ జేరి సుఖించుట మనుష్యధర్మము; ఏకాకిగా నుండఁ గోరుట మృగధర్మము. ఇందుకు సందేహములేదు. పరస్పర సాహాయ్యము నపేక్షింపక మిత్రబాంధవాదులతోడి సంబంధమును పెట్టుకొనక యేకాకియై తిరుగువాఁడు మృగప్రాయుఁడయి మృగమువలెనే వసించుటకు గృహములేక గుహలలోను చెట్లనీడను శయనించుచు కందమూలాదులను భక్షించుచు దిగంబరుఁడయి సంచరింపవలసి వచ్చును. అట్లు సంచరించునప్పుడు సహితము మృగాదులకున్న సౌఖ్యములో నాల్గవ పాలయినను మనుష్యునకు గలుగదు. వానికివలె శీతవాతాతపబాధలనుండి తప్పించుట కర్హమయిన రోమాదులతో నిండియున్న దృఢచర్మము మనుష్యునకు లేదు; వానికివలె శత్రుజంతువులనుండి రక్షించుకొనుట కనుకూలములయిన కొమ్ములు మొదలయిన స్వాభావికసాధనము లేవియు మనుష్యునకు లేవు. కాఁబట్టి యన్యోన్యసాహాయ్యమును పొందుచు సంఘీభవించి యుండకపోయిన పక్షమున లోకములో మనుష్యునంత దుర్బలమయిన జంతువు మఱియేదియు లేదు. జంతువులలోపల మిక్కిలి చిన్నదని మనము భావించెడు చలిచీమ సమీపించినను భయపడి కుట్టునేమో యని మనుష్యుఁడు దూరముగా తొలఁగవలసినవాఁడగును. స్వభావముచేత నింత దుర్బలుఁడయిన మనుష్యుని బలమంతయు సంఘీభావముతో నున్నది. సంఘీభావము కలిగియున్నప్పుడు మనుష్యునకు సమస్తబలములును గలుగును. అతఁడప్పుడు ప్రపంచములోని సమస్త జంతువులను తనకు లోఁబఱుచుకొని వానికన్నిటికిని తాను ప్రభువయి తన యిష్టము వచ్చినవానిని రక్షించుటకును శిక్షించుటకును సమర్థుఁడగును. ఒంటిగాఁడయి యున్నప్పుడు లేడివంటి సాధుజంతువును సహి

తము వశపఱుచుకోలేనివాఁడు సంఘీభవించి సింహామువంటి క్రూర మృగముల మందలను సహితము వశపఱుచుకొనుటకును శక్తుఁడగును. కాఁబట్టి మనుష్యుని సుఖసంతోషాదులును, అభివృద్ధియు, సంఘబలము ననుసరించి యుండును. మన యనుభవమునుబట్టి చూడఁగా నొక్క మనుష్యులలో మాత్రమే కాక మృగాదులలో సహితము సంఘీభవించి యున్నవానిలోనే యభివృద్ధి విశేషముగా కానవచ్చుచున్నది. ఏకాకిగా నుండు పెద్దపులి సంవత్సరమునకు మూఁడు నాలుగేసి పిల్లలను పెట్టుచున్నను పులులసంఖ్య విశేషవృద్ధి చెందకుండుటయు సంవత్సరమున కొక్కదూడను మాత్రమే యీనుచున్నను గోవులసంఖ్య యత్యధికమయి యూరూరను మందలుగా పెరుగుచుండుటయు మన కనుభవసిద్ధమయి యున్నది. అయినను సమస్తజంతువులలోను మనుష్యుఁ డొక్కఁడే సంఘీభావమును బొందిననేకాని సుఖపడనివాఁడుగాఁ గానఁబడుచున్నాఁడు. కేవల మృగమువలె భార్యాభర్త్రాది సంబంధములను బొత్తిగా లేనివారు కాకపోయినను మనవలె పట్టణముల యందుండి బహుజనులతోడి సంబంధమును గలిగి యుండక యడవుల యందు పరిమితజనులతో నుండు కోయవాండ్రు మొదలయిన వారిని సహితము మనము మృగప్రాయులనుగా భావించుచున్నాము. మనము వారి నట్లు పశుతుల్యులనుగా గణించుటకుఁ గల ప్రధానకారణము వారు పలువురతోడ సహవాసముచేసి యందువలనఁ గలుగు సుఖాదులను బొంద నెఱుఁగకుండుటయే కాని వేఱుకాదు. కాఁబట్టి మనుష్యుఁ డెంత యెక్కువమందితో సహవాసము చేయుచు పరస్పరసౌఖ్యము నిమిత్తమయి కలిసి పాటుపడుచుండునో యంత యెక్కువ నాగరికుఁడు గాను సుఖమనుభవించువాఁడుగాను ఉండును. ఇట్లెంతమందితోఁ గలియుటకును పరస్పరసాహాయ్యము చేసికొని సుఖపడుటకును మను

ష్యులలో నైకమత్య మవశ్యముగా నుండవలెను. ఐకమత్యము లేని యెడల ననేకు లేకీభవించుట కలుగనేరదు. ఒక్కపట్టణములోని వారిలోఁగాని యొక్క దేశములోని వారిలోఁగాని బహుసంఖ్యాకు లైక మత్యము కలిగి కలిసి యుండనిపక్షమున వారిలో పరస్పరద్వేషమును వైషమ్యమును కలుగును; వైషమ్యము గలగిన తరువాత వారిలో వారు బాహుయుద్ధమున కొకవేళ దిగకపోయినను వాక్కలహముల కును పరస్పర దూషణములకును దిగుదురు. ఐకమత్యము లేకపోవుట వలన సర్వజనోపయుక్తములైన ఘనకార్యములను వేనిని వారు చేయుటకు సమర్థులు కారు. ఒకరాష్ట్రప్రజలలో నైకమత్యము తగ్గి యుండుట చూచి యన్యరాష్ట్రములవా రట్టి జనులను లోకువ చేసి వారిని జయించి దేశము నాక్రమించుకొని స్వలాభముకొఱకు నిరంకు శముగా ప్రభుత్వము చేయుదురు. జనులలో సంపూర్ణైకమత్యమే యున్నపక్షమున శత్రువులు మొదలయినవారు వారికి కీడు చేయలేక పోవుటయేకాక వారిని జూచి భయమును సహితము పొందుచుందురు. సమస్తశ్రేయములకును మూలాధారమయిన యైకమత్యమే జనులలో లేకుండినయెడల, వారిలో నన్యోన్యమైత్రియు ప్రేమయు నుండవు; అందుచేత వారికి నిజమయిన నెమ్మదియు క్షేమమును కలుగవు. ఒక తెగవారి మేలొక తెగవారి కీడుగా నుండును; అందుచేత నొకతెగ వారి యభివృద్ధి కొకతెగవా రెప్పుడును భంగము కలుగఁజేయుటకే చూచుచుందురు. దేశమునం దిట్టివి యెప్పుడు వ్యాపించి యుండునో యప్పుడు మొత్తముమీఁద దేశాభివృద్ధి కలుగక యొకతెగవారు చెడుటచేత రెండవతెగవారు బాగుపడి సంతోషించుచు, సంతోషించు తెగవారియొక్క యుచ్ఛదినములు పోయి వా రడుగంటి నప్పుడు పయికి లేచినవారు సంతోషించుచు నుండుట మాత్రము సంభవించును. కాఁబట్టి

జనసామాన్యముయొక్క క్షేమలాభములను కోరెడు దేశాభిమానులందఱును సాధ్యమయినంతవఱకు జనులలో బహువిషయములయం దైకమత్యము కుదురునట్లు చేయుటకయి తమ యావచ్ఛక్తిని కృషిచేయుచుండవలెను.

అధికప్రయాసమును బొందినను ఒక్కనికి సాధ్యము కాని పని, పలువు రైకమత్యము కలిగి పాటుపడెడు పక్షమున సులభసాధ్యమగును. ఇందు కొక్క చిన్న నిదర్శనము చూడుఁడు. ఉత్సవాదులయందేనుఁగంత బలముగల సర్వసంపన్నుఁడు తన యావచ్ఛక్తిని వినియోగించి లాగినను కదలని రథమును బలహీనులయిన బాలురు సహితము పలువురు చేరి యవలీలగా లాగి వీథులవెంబడిని పరుగెత్తింపఁ గలుగుచున్నారు. జనులలోఁగల యైకమత్యమే నిజమయిన నాగరికమునకు గుఱుతు. లోకములో నెవ్వే దేదేశమువా రభివృద్ధి నొంది మహోన్నతదశను వచ్చినను, వారిలోఁగల యైకమత్య ప్రభావము చేతనే కాని యదిలేని దేహబలముచేతను విద్యాబలముచేతను గాదు. ఐకమత్యము జనులలో నెప్పుడు తగ్గిపోయి పరస్పరద్వేషాదు లేదేశమునందు ప్రబలునో యప్పుడే యా దేశము తన యౌన్నత్యము నంతను బోఁగొట్టుకొని సమస్తకష్టములకును లోఁబడవలసిన దగును. మన దేశము చిరకాలము క్రిందటనే పూర్వమునందున్న స్వాతంత్ర్యమును బోఁగొట్టుకొని యన్యదేశీయుల యధీనమగుటయు మనవారిలో నైకమత్యము చెడి, జాతి మత ద్వేషాదులు ప్రబలుటచేతనే కాని వేఱుకారణముచేతఁ కాదు. ఇరువదియైదు కోట్ల జనులు గల మనదేశమునందే పూర్ణమయిన యైకమత్య ముండియున్నయెడల, ఎంతటి బలవంతులయినను మన దేశమువంక త్రేఱిచూడనయినను శక్తులయి యుందురా? అన్యదేశీయులయిన దుష్టపరిపాలకులకు దాసులయి మన పూర్వులు వారి

వలన నెన్నిదుర్దశల ననుభవించినారుకారు? క్రూరులయిన కొందఱి తురుష్క ప్రభువుల కాలములో మనదేశమునకు సంప్రాప్తములయిన కడగండ్లను తలఁచుకొనఁగా మనమనస్సు లిప్పుడును నొచ్చుచున్నవి. ఆకాలమునందు మనస్త్రీలకు సంభవించిన విపత్తులను తలఁచుకొందు మేని మనదేహము లిప్పుడును కంపముకొందవా? మనభాగ్యము వలన మనదేశమున కిప్పుడు న్యాయైకావలంబులయిన హూణప్రభువులు రాజ్యమునకు వచ్చి సర్వజనక్షేమకరముగా ప్రజాపరిపాలనము చేయుచున్నారు గనుక మన మిప్పుడు పూర్వకష్టములనన్నిటిని మఱచి మరల తలయెత్తుకొని తిరుగుచు సుఖింపఁగలిగియున్నాము. ఈమధ్య కాలమునందు మనదేశ మెప్పుడు ననుభవించి యెఱుఁగని సత్పరిపాలన సుఖమును మనదేశమునకు క్రొత్తగా చవి చూపుచుండుట యేకాక యీహూణప్రభువులు తమలోఁగల యైకమత్యమువలన మన కైక మత్యమునుగూడ నేర్పుచున్నారు. వారిలో నెంతటి యైకమత్యము నుండనిపక్షమున సంఖ్యయందు నాలవ వంతయినను లేని జనులు సముద్రములు దాటి విదేశమునుండి వచ్చి యింత గొప్పదేశమును ఏకచ్ఛత్రముగా పాలింపఁ గలుగుదురా? ఐకమత్యము లేకపోయిన యెడల సంఖ్యకు జను లెందఱుండినను పరుల కశ్రమ సాధ్యులగుదురు. ప్రత్యేకముగా నొక్కొక్క కట్టెచొప్పున నెన్నిటినైనను విఱుచుట కొక్కనికి శక్యమగును. ఆ కట్టెల నన్నిటినికాక కొన్నిటినైనను మోపుగాకట్టి విఱువుమన్నచో నొక్కనికి కాదుకదా పలువురకైనను సాధ్యము కాకయుండును. మృగకీటకాదులు సహితము కొన్ని సంఘీభవించి గొప్పకార్యములను సాధించి లాభమును పొందుచున్నవి. అడవులలో గుఱ్ఱములు మొదలయిన మృగములు కొన్ని మందలుగా వసించుచు సింహములకు సహితము లోనుగాక నిలిచి గెలుచుచున్నవి. అంతటి పెద్దజంతువులమాట విడిచి గుంపులుకూడి యుండెడు చిన్నజంతు

వులసంగతి చూతము. అసంఖ్యముగా నిత్యమును మనకాళ్ళక్రింద పడి నలుగుచుండెడి చీమలవంటి యత్యల్పజంతువులు సహితము బారులు చేరి బలవంతమయిన కాలసర్పమును సహితము నిమిషములో నంతము నొందించుచున్నవి. అల్పమృగాదులే సంఘీభవించి యిటువంటి లాభ ములను పొందుచుండఁగా జ్ఞానాదిసమస్తసాధనములచేతను వాని కంటె బహుగుణము లధికులని ప్రఖ్యాతి నొందుచున్న మనుష్యులు మాత్రము సంఘీభవించి యైకమత్యము కలవారయి తమ్మును తమ దేశమును వృద్ధిపొందించుకొని యనంతములయిన సౌఖ్యలాభముల నేల పొందరాదు ? జంతువులలో మాత్రమే కాదు, ప్రాణములేని జడపదార్థములలో సహితము సంఘీభావమువలన నద్భుతమైనశక్తి యొకటి పుట్టుచున్నది. గట్టిగా పట్టుకొన్నయెడల ప్రత్యేకముగా నున్నపుడు తెగిపోయిన గడ్డిపోచలే యన్నియుఁ గలసి పెంటిగా నేర్పడి మదపుటేనుఁగును సహితము బంధింపఁగలుగుచున్నవి. ఒక్కొక్కటిగా నున్నప్పుడు చిన్నరోటినైనను నీడువలేని నూలుపోగులు సంఘీభవించి పగ్గమయి బలమయిన రథమును సహిత మీడ్వఁగలుగుచున్నవి. ఈ ప్రకారముగా సంఘీభవించి యుండెడు మఱియేవస్తువులను జూచినను మన కవియన్నియు సంఘీభావమువలనఁ గలుగు ఫలమిట్టిదిసుమా యని బోధించుచుండునట్లుండును. వీనిని జూచియైన మనవారైకమత్య మును సంఘీభవించు విధమును నేర్చుకొని వానిని సత్కార్యములయం దుపయోగించినచో తాము బాగుపడుటయేకాక శీఘ్రకాలములోనే మనవారు దేశమునంతను బాగుచేయుటకు శక్తులగుదురు. ఐకమ త్యములేనిదే ఏదేశమునందును, ఏకాలమునందును ఏమంచిపను లును వర్ధిల్లవు. దేశాభివృద్ధికరములయిన వాణిజ్యాదులయందును, శిల్పాదులయందును, శాస్త్రములయందును, విద్యలయందును, అభివృద్ధి కైకమత్య మవశ్యముగా కావలెను. ఐకమత్యములేక యివికాని మఱి

యేవృత్తులునుకాని మంచిదశకు రానేరవు. ఐకమత్యాభావమువలననే మనదేశములో వాణిజ్యాదులు సహితము ప్రబలకున్నవి. పదిమందిచేరి పనిచేయుట యన్నమాట మనవారెఱుఁగరు. మనవారు తామే బుద్ధిమంతుల మనుకొని యెవ్వరిని నమ్మక ప్రవర్తించుచు సంఘముల వలని లాభములను పొందఁజాలకున్నను మానవధర్మమునుబట్టి యెవ్వరినో యొకదొంగను నమ్మి యావంచకుని తేనెమాటలకు మోసపోయి సొమ్మును పోఁగొట్టుకొనుచున్నారు. అదిచూచి తక్కినవారు పరులను నమ్మిన మోసముగలుగునని నిశ్చయించుకొని యెవ్వరితోను గలియక యేకాకులయి తగినలాభమును పొందఁజాలకున్నారు. కొందఱు మాత్ర మిప్పుడిప్పుడు కొన్నిచోట్ల వాణిజ్యసంఘములుగాఁ జేరి వ్యాపారముచేయుట కారంభించుచున్నారు. అయినను పెక్కుచోట్ల కృష్ణమ్మసెట్టి సహోదరు లాదిగాఁగల నామములను వహించి పలువురను భ్రమింపఁజేయుచున్నారు. ఆ వాణిజ్యసంఘములో నెందఱుచేరి యున్నారోయని విచారించినచో పయిసెట్టిగారును తమ్ముఁడును తప్ప మఱియెవ్వరు నుండరు. పరులమీఁదకూడ విశ్వాసముంచి వారిని గూడఁ దమలోఁ జేర్చుకొని సంఘీభవించి వ్యాపారము చేయుచు వచ్చినచో నొకానొక దుష్టుఁడొకచోట మోసముచేసినను తఱుచుగా నట్టిమోసములు జరగక లాభము కలుగుచుండుటకు సందేహముండదు. ఒక్కని కొక్క వ్యాపారమునందు విశేషవిత్తమును వ్యయపెట్టుటకును విరివిగా పనిసాగించుటకును శక్తియుండదు. పలువురు చేరుటవలన మనుష్యబలము ధనబలమునుకూడ కలిగి విరివిగా వ్యాపారము సాగించుటకును విశేషలాభమును పొందుటకును అవకాశముండును. వాణిజ్యాదులయందు మాత్రమేకాక లోకోపయుక్తములయిన సమస్తకార్యములయందును సంఘములుగాను సమాజములుగాను కూడి పనిచేసినచో నొక్కఁడసాధ్యమని యూహించెడు

పనులను సహితము సులభముగా సాధింపఁగలుగుదురు. ఈ హేతువుచేతనే తగినతోడ్పాటును పొందకపోవుటవలన విశేషవిత్తవంతులును బుద్ధిశాలులును నిర్వహింపలేని ఘనకార్యములను బహుదేశములలో సామాన్యులు పలువురుకూడి పనిచేసి నిర్వహించియున్నారు. పశ్చిమఖండవాసు లిప్పుడు యంత్రనిర్మాణాదులయందును శాస్త్రాదులయందును సమగ్రతములయి యుండుటకు కారణము వారు సంఘములుగాచేరి పనిచేయుటయే. మతమును వ్యాపింపఁజేయవలెనన్నను, త్రాగుబోతుతనమును మాన్పవలెనన్నను, జ్యోతిశ్శాస్త్రమును వృద్ధిచేయవలెనన్నను, లోకమున కుపయోగించు మఱి యేపనిని చేయవలెనన్నను, తెలివిగలవారు పలువురాయా విషయములను వ్యాపింపఁజేయుటకయి సంఘములుగాచేరి కలిసి పనిచేయుదురు. ఇట్టిసంఘములు యూరోపుఖండమునందు లక్షలున్న వనుట యతిశయోక్తి గాదు. వారిని జూచి మనవా రిప్పుడీదేశములోని ముఖ్యపట్టణములలో నెల్లను సమాజము లేర్పఱిచి పనిచేయుటకు నేర్చుకొనుచున్నారు. సమాజములు చేరి యెంతటి ఘనకార్యములయినను నిర్వహింపవచ్చును. సమాజములయందున్న యద్భుతశక్తి మఱి దేనియందును గానరాదు. సమాజములవలన తమయభిప్రాయములను మహాజనులలో సులభముగా వ్యాపింపఁజేయుట కవకాశము కలుగును; ఒక్కరీతి యభిప్రాయము గలవారందఱును దూరముగా నున్నను చేరువగానున్నను కలియుట సంభవించును; అట్టివారందఱును జేరినపక్షమున నొక్కమహాసేనవలె నయి సులభముగా జయము కలుగును. సమాజములలో తఱచుగాచేరి సంభాషించుటవలనను చర్చించుటవలనను ధైర్యమును ఉత్సాహమును కలుగును; అనేకులు చేరి యాలోచించుటవలన మంచియుపాయములు తోఁచును; తాము పూనిన కార్యములకు తోడ్పడువారును వాని నామోదించువారును

కొందఱు కలరని యెఱిఁగినందున ప్రతిసామాజికునకును కార్యాచరణమునందు ద్విగుణమయిన బలము కలుగును; జ్ఞానాభివృద్ధి కలుగును; సమాజములకు తఱుచుగా వచ్చుచుండుటవలనను వారి ప్రసంగములను వినుచుండుటవలనను జనులలో నైకమత్యమును సత్కార్యాచరణమునం దాసక్తియు కలుగును; చెప్పఁబూనినచో సమాజములవలనఁ గలిగెడు లాభము లిటువంటి వనేకములున్నవి. ఒకసమాజముయొక్క యుపయోగమును నిర్ణయించుట యాసమాజము చేసిన పనివలనఁగాని వారు పలికినమాటవలనఁ గాదు. కాఁబట్టి, యీసమాజమువారు కేవల ప్రసంగములతోనే సరిపుచ్చక దేశక్షేమకరమయిన పనినికూడ కొంత శీఘ్రకాలములోనే నిర్వహించి తమకార్యములవలన సమాజములవలన ప్రయోజనమును లోకమునకుఁ జూపఁ బ్రయత్నింతురని. నమ్ముచున్నాను. సమాజము లెప్పుడును జనులలో తెలివిని అభివృద్ధి చేయుటకును, ఆలోచనను పెంపుచేయుటకును, సత్ప్రవర్తనమును ప్రోత్సాహపఱుచుటకును, దుష్టత్వమును నడఁచివేయుటకును, స్వాతంత్ర్యమును వివేకమును బలపఱుచుటకును, సత్యమును వ్యాపింపఁజేయుటకును, ఇతరవిధముగా దేశక్షేమమును కలుగఁజేయుటకును అయి యుండవలెను. ఈవిధమయిన లాభములేవియు లేక కేవల వినోదముకొఱకును కాలయాపనముకొఱకును సభలు చేసెడు పక్షమున సామాజికులకుఁగాని జనులకుఁగాని యట్టి సమాజములవలన ప్రయోజనము లేశమును గలుగదు. కాఁబట్టి, మనసమాజము పయిని వివరించినవానిలో కొన్నిటినైన నిర్వహింపఁగలుగవలయు ననియు, చిరకా కాలము నెలవుకొనవలయు ననియు కోరుచు, నాకోరికను సఫలముచేయు భూతదయాపరుడైన యీశ్వరుని ప్రార్థించుచు, ఈవిషయమును ముగించుచున్నాను.

దా న ము లు.

By

K. VEERESA LINGAM

దానములు

మానవకోటి కీశ్వరుఁడు ప్రసాదించిన గుణములలో నెల్ల కరుణాగుణ ముత్తమోత్తమమయినదిగా నున్నది. రెండు ప్రయోజనముల నుద్దేశించి సర్వకారుణ్యుఁడయిన యీశ్వరుఁ డా యుత్తమగుణమును మనకు ప్రసాదించుచున్నాఁడు. అందొకటి పరోపకారము; రెండవది క్షమ. పరోపకార మనఁగా పరమేశ్వరుఁడు మన తోఁబుట్టువులనుగా సృజించిన మానవకోటియెడల దయగలిగి వారి సౌఖ్యాభివృద్ధికొఱకును దుఃఖశాంతికొఱకును శక్తికొలఁదిని సాహాయ్యము చేయుట క్షమ యనఁగా పరులు మన కపకారము చేసినను వారియందు ద్వేషము వహింపక వారికి కీడుచేయక యోర్చుకొని యుండుట ఈ రెంటిలో పరోపకారవిషయమైన మొదటిధర్మమును గుఱించి మాత్ర మీసారి కొంచెము ముచ్చటింతము. లోకములో పరోపకారము చేయు విధ మనేకరీతులుగా నుండును; అందొకటి దానము.

దానమును పాత్రులయినవారి కెల్లవారును తమ శక్తికొలఁదిని చేయుచుండుట మానవధర్మము. మనము వీధులయందు నడుచునపుడు దేహమున గాయములుకలిగి బాధపడుచుండెడి వాని నెవ్వనినైనఁ జూచిన పక్షమున మనకు వానియెడల జాలిగలిగి సాహాయ్యము చేయవలెనని బుద్ధిపుట్టును; అప్పుడే మనము దేహమునిండ గాయములు చేసికొని బలవంతముగా భిక్షమును గ్రహించుటకయి ప్రయత్నించు బండవాని నెవ్వనినైనఁ జూచిన పక్షమున మనకు వానిమీఁద కోపము వచ్చి వానిని శిక్షింపఁ జేయవలెనన్న బుద్ధిపుట్టును. ఈవిధముగా గాయములుగల వారిలో నొక్కనియందు సహజముగా మనకు దయగలుగుటయు మఱియొక్కనియందు కోపము కలుగుటయు విచారిం

పఁగా మన దయకును దయాగుణమునుబట్టి కలుగవలసిన యుపకారము నకును సర్వజనులును పాత్రులుకాక కొందఱుమాత్రమే పాత్రులనుట భగవదుద్దేశమయినట్లు స్పష్టముగా తెలియవచ్చుచున్నది. పాత్రా పాత్రవిచారము పెట్టుకోక 'దేహి' యని చేయిచాచి యాచించిన వానికెల్లను దానము చేయవలెనని కొందఱును, కొన్ని తెగలవారికి మాత్రమే దానము చేయవలెనని మఱికొందఱును, విపరీతాభిప్రా యములు కలిగియున్నారు గాని యిరు తెఱఁగులవారి యభిప్రాయము లును సరికావు. యోగ్యాయోగ్య విచారముచేయక చేసెడి దానము వలనఁ గలిగెడు కష్టములు యుక్తస్థలమునందు తెలుపఁబడును గనుక, ముందుగా కొన్ని తెగలవారికే దానము చేయవలె నన్న యంశము విచారింతము. భగవంతుని దృష్టియందు మనుష్యులందఱును సమా నులు; మానవకోటియంతయు తనచే సృజింపఁబడిన పెద్దకుటుంబ మగుటచేత, ఆయన కందఱియందును సమానప్రేమమే కలిగి యున్నది. ఆయన యేకరీతిగా జనుల నందఱిని పుత్రప్రేమతోఁ గాపా డుచు, సృష్టపదార్థములవలని లాభముల నందఱికిని సమానముగానే యనుగ్రహించి యున్నాఁడు. ధనికులు, దరిద్రులు, నాగరికులు, గ్రామ్యులు, నల్లవారు, తెల్లవారు, హిందువులు, తురుష్కులు, పండితులు, పామరులు అను భేదమును చూడక యీశ్వరాజ్ఞానుసార ముగా సూర్యుఁ డెల్లవారికిని కాఁకను, వెలుతురును నిరంతరము నిచ్చు చున్నాఁడు; ఈశ్వరేచ్ఛానుసారముగా మేఘములందఱికిని వర్షజలము నిచ్చుచున్నవి; వాయు వందఱిమీఁదను ప్రసరించుచున్నది. మానవ కోటికంతకు నొక్కరీతి దేహములను, అవయవములను, ఆలోచనను, బుద్ధులను, గుణములను, లోపములను, సుఖసాధనములను, పరమే శ్వరుఁడు ప్రసాదించియున్నాఁడు. కాఁబట్టి, యీశ్వరుని బిడ్డలవంటి

వారయిన మనుష్యులందఱును సోదరభావము కలవారయి పరస్పర సాహాయ్యమునకును, ప్రేమకును అర్హులయి యున్నారు. ఈశ్వరుఁ డనుగ్రహించిన యపరిమిత సుఖములను నిత్యము ననుభవించుచు, ఈశ్వరానుగ్రహమువలననే ముందు శాశ్వతానందమును పొందఁ గోరియున్న మనము పయి హేతువులనుబట్టి విచారింపఁగా మనజాతివాఁ డని, మనమతమువాఁడని, మనదేశమువాఁడని, భేదభావము చూపక యర్హుఁడైనప్పుడు మానవసామాన్యమున కెల్లను చేతనైన విధమున తోడుపడవలయునని యేర్పడుచున్నది. అయినను మనకు మనుష్యులతో నుండు పరస్పరసంబంధతారతమ్యమునుబట్టి మనము చేయు దానములు మన సమీపమున నుండు వారికి ముందుగా చెంద వలసియుండును. అట్లగుట యనివార్యమేయైనను సమయము తట స్థించి మనకు శక్తికలిగియున్నప్పుడు దూరదేశములవారికి సహితము మనము ధనాదిసాహాయ్యమును చేయక యూరకుండరాదు. మన కుటుంబమును పోషించుట మనకు ప్రథమ ధర్మము; తరువాత ధన మున్నచో నిఱుపేదలయి పాటుపడ శక్తిలేని బంధువులకును, గ్రామ వాసులకును, దేశస్థులకును తోడుపాటు చూపవలెను. ఈ దేశములో కొందఱింట భార్యాపుత్రాదు లన్నవస్త్రములకు లేక కష్టపడు చుండఁగా, ప్రసిద్ధికయి యప్పుచేసియయినను దానములుచేసి మహాదాతలని పేరుపొందఁ జూచుచున్నారు. ప్రతిపురుషుఁడును తనభార్యను బిడ్డలను, వృద్ధులగు తల్లిదండ్రులను వివాహములుకాని చెల్లెండ్రు మొదలయిన కుటుంబమును పోషించుటకు ముఖ్యబద్ధుఁ డగుచున్నాఁడు. ఇట్లు ధర్మానుబంధముగా తన పాలఁబడిన కుటుంబ మును అనాదరించి వారి యావశ్యకములకు కొఱఁతకలిగించి స్వభావ విరుద్ధముగా దాత ననిపించుకొనుటకయి పరులకు దానమిచ్చువాఁడు,

తవగోవులను జంపి వాని చర్మములతో చెప్పులను కుట్టించి పరులకు దానము చేయు ధర్మాత్ముని వంటి వాఁడగును. అట్లుగాక తీర్వ లేని యప్పులుచేసి దానములు చేయువాఁడు పరులసొత్తును దొంగిలించి దాని నన్యులకిచ్చెడు పగటిదొంగగాను, ఎఱిఁగియుండి యట్టి ధనమును దానముగా స్వీకరించువారు దొంగసొత్తును హరించెడు పాపులుగాను, ఉందురనుటకు లేశమయినను సందేహము లేదు. కాఁబట్టి వివేకు లగువారు దానము నిమిత్తమయి తామెప్పుడును ఋణములు చేయక తమకున్న దానిలో తమ కుటుంబసంరక్షణమునకు వ్యయమయినది పోఁగా నేదయిన మిగిలిన పక్షమున దానిని దానధర్మముల కుపయోగింప వలెను. తీర్వ లేని యప్పులను చేసెడివారు దొంగలకన్నను పరమాధము లని చెప్పవలసియున్నది. దొంగ లెత్తుకొనిపోయిన సొమ్మిఁక రాదని నిరాశచేసికొని యజమాను లొక్కసారి యేడిచి యూరకుందురు. రానియప్పుల నిచ్చిన వారో యెప్పుడో వచ్చునన్న యాసచేత ప్రయాస పడి వెనువెంట తిరుగుచు నిత్యము నేడ్చుచుందురు. అప్పులపాలయి నవారికి సమస్తగౌరవములును నీతియుకూడ చెడును. అప్పిచ్చిన వాఁడు కనఁబడినచోటనెల్ల నడుగుచుండినచో, అవమానకరముగా నుండును. అప్పులవారి బాధ తప్పించుకొని వారిని త్రిప్పుటకయి సాకులు కల్పించి కల్లలాడుచు పుచ్చుకొన్నవాఁడు పలువిధములయిన నైచ్య ములకు లోఁబడవలసివచ్చును. కాఁబట్టి యెల్లవారును మితముగా వాడుకొనుచు, వ్యాధులు వచ్చునప్పటికిని, పని లేక యుండునప్పటికిని వృద్ధత్వము వచ్చునప్పటికిని కొంచెము కూడఁబెట్టుచు, శక్తికి మించ కుండ తగిన దానధర్మములు చేయుచుండవలెను. ఇట్లు చెప్పుటచేత ధనము నిలువ లేనివాఁడు దానధర్మములు మాని లుబ్ధశిరోమణిగా నుండవలెనని చెప్పుట నాయభిప్రాయ మెంతమాత్రమును గాదు.

భగవదనుగ్రహమువలన నిరంతరమును మతిమీరిన సుఖముల ననుభవించుచు పరలోకసుఖమునిమిత్తమయి దయచూడుమని యీశ్వరుని వేడుకొనుచుండెదు మన మాయన బిడ్డలును మనసోదరులు నయి నమానవకోటియెడల నాదరమును ప్రేమమును గౌరవమును కనఁబఱిచి శక్తులమై యున్నంతవఱకు మనము కొంతకష్టపడియైన గతిలేనివారికి తగిన తోడ్పాటును జూపి కేవల వాగ్విడంబనమువలనఁ గాక కార్యములచేతఁ గూడ మనము తదనుగ్రహము పొందుట కర్హులమని చూపకపోతిమేని, మనమెట్లు భగవత్కటాక్షమునకు పాత్రులమయి నిత్యానందపదవి పొంది సుఖింపఁ గలుగుదుము ? అర్హులయియున్న సమస్తజనులయెడలను మన యౌదార్యమును నమయోచితముగా చూపుట యావశ్యకమేయైనను, ఒక్కఁడెప్పుడును సమస్తదేశముల వారికి నుపకారము చేయుటకు సమర్థుఁడు కాఁజాలఁడు. కాఁబట్టి ప్రతిమనుష్యుఁడును శక్తికొలఁదిని చేరువ నున్నవారి కుపకారము చేయుటకై ముఖ్యముగా పాటుపడినఁ జాలును. దేశమునకెల్ల మహోపకారము చేయఁదలఁచిన పక్షమున, ఇతర ఘనకార్యములయందువలెనే సంఘీభవించి మహాపురుషులు పూనుకొని నిర్వహింపవలెను. మనదేశములో ప్రత్యేకముగా నొక్కరొక్కరు చేయుటయేకాని సంఘీభవించి లోకోపకారములయిన పుణ్యకార్యములను చేసెడి యుత్తమమార్గము నింకను మనవారు గ్రహింపలేదు.

దానములని చెప్పఁబడువానిలో విద్యాదానము, అన్నదానము, వస్త్రదానము, ఔషధదానము, ధనదానము ముఖ్యములు. ఈ దానములలో నెల్ల విద్యాదాన మనఁగా జ్ఞానదానము సర్వోత్కృష్టమైనది. ప్రపంచయాత్ర నిర్వహింపవలసిన మనుష్యనామము గలవారి కెల్లను జ్ఞాన మావశ్యకమే గనుక సర్వజనావశ్యస్పృహణీయ

మయిన విద్యాదానముతో సమానమయినది లోకములో మఱియొ కటి లేదు ? దీనికి కొందఱు పాత్రులనియు కొందఱు పాత్రులు కార నియు నియమము లేదు. ఈవిద్యాదానమునకు జాతిమతాది భేదం ములు లేక శ్రద్ధాళువులైన స్త్రీలును పురుషులును సమ సమానవు లును సమానార్హులు. ఈదానమువలన దాతకును ప్రతిగ్రహీతకును కూడ లాభమును గౌరవమును గలుగును. దీనివలన నుభయులకును జ్ఞానాభివృద్ధి యగునేకాని తక్కిన దానములయందువలె నెవ్వరికిని తక్కువ పడదు. ఇతరదానములవలెఁగాక యిది యిద్దఱికి [illegible]హపర సాధనమయినది. మనదేశములో విద్యయను పదార్థ[illegible]నే కొందఱు విపరీతార్థమున గ్రహించుచున్నారు. పదార్థవిషయ[illegible]సన [illegible]ధము జ్ఞానము విద్యగాని, స్వప్రయోజనపరులు స్వలాభార్థముగాను, తాము మితజ్ఞులమని లోకమునకు తెలిసిన హానివచ్చునని భావించుచు మహా పండితులు తాము సర్వజ్ఞులని చూపుటకుఁగాను, వ్రాసిన మోసపు వాక్యములును తెలియని విషయములును విద్య కాదు. సత్యమునకు దూరములయిన విషయములను నేర్చుకొనుటవలన లోకమునకు నష్టము గలుగును గాని లాభ మెంతమాత్రమును కలుగదు. కాఁబట్టి విద్య నుపదేశించువాఁడును గ్రహించువాఁడును గూడ సత్యప్రవచము నందును సత్యగ్రహణమునందును బద్ధాదరులయి యుండవలెను. విద్య పుస్తకరూపముగానే యుండవలసిన దన్న యావశ్యకము లేదు; అది వాగ్రూపముగా నున్నను ఉండవచ్చును. వాగ్రూపముగా నీతులు మొదలయిన సద్విషయములను బోధించువాఁ డొక్కఁడు మనవా రిప్పుడు చదివించెడు వేయిగ్రంథములు గలిగించెడు దానికన్న లోకమున కెక్కువ లాభము కలిగింపవచ్చును. సత్యమెక్కడ నున్నను పవిత్ర మయినదే గనుక మనదనెడి దురభిమానమును విడిచి సత్యములైన

విషయము లెవరి గ్రంథములలో నున్నను, ఏ భాషయం దున్నను, గ్రహించుటకయి ప్రయత్నింపవలెను. విద్య గ్రహించుటకు శ్రద్ధ గలవా రందఱును యోగ్యులేయయినను విద్యోపదేశము చేయుటకు మాత్ర మెల్లవారును యోగ్యులు కారు. విద్యాదానమునకు చిర కాలము కష్టపడి పరిశోధించి యుత్తమజ్ఞానమును లోకానుభవమును పొందిన సుజ్ఞానులు మాత్రమే యాచార్యులుగా నుండుట కధికారులు. విద్యాదాన మన్ని దానములలోను శ్రేష్ఠతమమయినది. గనుక, విద్యా దాతలకు అన్నప్రదాతలు మొదలయినవారికంటె నెక్కువ గౌరవమును పూజ్యతయు కలిగియుండవలసినది. అట్లయ్యును మనదేశములో నన్నప్రదాతకుఁగల గౌరవము విద్యాప్రదాతయయిన యుపాధ్యా యునకు లేదు. ఇందునకుఁ గారణమేమని విచారించుటకయి దూరము పోవలసిన పనిలేదు. మనదేశముయొక్క దౌర్భాగ్యముచేత నిరక్షరకుక్షులును, బాహ్యవేషములును పటాటోపములును గలిగి పారంపర్యముగా శిష్యపరంపరను వంచించి ధనార్జనముచేసి కుటుంబ భరణము చేసికొనమరిగిన గురునామధారులును, మన పిన్నపెద్దలకు విద్యాగురువు లగుటచేత మన యుపాధ్యాయుల కింతటిగతి పట్టినది. ఎంతో విద్యావంతుఁడును బుద్ధిమంతుఁడును అగువాఁడు పిల్లలకు చదువు చెప్పుటకు పూనుకొనవలసినదానికి మాఱుగా మనదేశములో నిప్పు డేవృత్తికిని పనికిరానివాఁడు బడి పెట్టుకొని బాలురకు విద్యోప దేష్ట యగుచున్నాఁడు. అటువంటి మహోపాధ్యాయులు బాలురను తరింపఁజేయుటకయి మనదేశమునం దంతటను నిండియుండఁగా, విద్యగల మంచియుపాధ్యాయుల గౌరవము తగ్గుటలోను దేశములో మాఢ్య మెక్కువ యగుటలోను వింత యేమున్నది? దేశముయొక్క స్థితిని బాగుపఱిచి జనులను విద్యాధికులనుగాఁ జేయవలెనన్న చింత

గల దేశాభిమాను లందఱును సర్వవిధముల ప్రయత్నముచేసి సాధ్య మయినంతవఱ కిటువంటి యుపాధ్యాయుల సంఖ్యను తగ్గించి, వారిస్థాన మున తెలిసినవారిని విద్యాదానమునకు నియోగించి, ధనికులలో మాత్రమేకాక సామాన్యజనులలోను స్త్రీలలోనుకూడ సువిద్య వ్యాపించునట్లు చేయవలెను. తక్కువ జాతులవారును స్త్రీలును గూడ విద్యగలవారయి కార్యాకార్యములను చక్కగా విమర్శింపఁగలవా రగువఱకును విద్యాధికులయియున్న గొప్పజాతులవారికిని పురుషుల కును తగినంత యభివృద్ధియు సుఖమును గలుగవు. మనము జనసామా న్యమును విద్యాసంపన్నముగాఁ జేసి వారిని మనతో సమానులనుగాఁ జేయుటకయి ప్రయత్నింపక పోయిన పక్షమున సహవాసదోషముచేత మనమే యించుమించుగా వారితో సమానులమయి మూర్ఖులవలె సంచరింపవలసిన వారమగుదుము. విద్యావిహీనులు పశువులని యెల్ల వారును చెప్పుచున్నారు గదా ? మనము స్త్రీలకు విద్య చెప్పింపక వారిని పశువులవలెనుంచి వారితో సహవాసము చేయుచుండెడు పక్షమున మనుష్యులు పశువులతో సహవాసము చేసెడునట్లేకదా యగును ! మనమెంత విద్యాధికులమని స్వతంత్రులమని గర్వపడు చున్నను, మన యిండ్లకడ స్త్రీలమాటనె విని వారి యిష్టానుసారముగా నడుచుచున్నామనుట యెల్లవారికి ననుభవసిద్ధమే. స్త్రీలను విద్యా విహీనులనుగాఁ జేసి మనము వారి యాలోచనప్రకారముగా వర్తించు చున్నామనుట కర్థము మనుష్యులు పశువులచేత నడపఁబడుచున్నా రనియో జ్ఞానులు మూఢులచేత నడపఁబడుచున్నారనియో యగును. మన కిప్పుడు పట్టియున్న యీదురవస్థను తొలఁగించుకొని మనము సుఖాభివృద్ధిని పొందవలెనన్న పక్షమున, మనస్త్రీలను విద్యావతు లనుగాఁజేసి వారిని మనతో సమానురాండ్రనుగా దిద్ది వారు మన

కాలోచన చెప్పుట కర్తవ్యారాంద్రగునట్లు చేయవలెను. జనసామాన్యము యొక్కయు బాలికలయొక్కయు విద్యాభివృద్ధి నిమిత్తమయి ధర్మ పాఠశాలలను పెట్టించుటతో సమానమయిన యుపకారమును పుణ్యమును ఇతరములయిన దానములు వేయిచేసినను కలుగవు. కాఁబట్టి మనవారందఱును పయిరీతి పాఠశాలలను దేశమంతటను స్థాపించి పేదలకును స్త్రీలకును విద్యాదానము చేయించి పుణ్యమును కట్టుకొనఁ బ్రయత్నింతురని దృఢముగా నమ్ముచున్నాను.

సమస్తధర్మములకును దేహ మాధార మగుటచేతను, దేహ ధారణమున కన్న మాధారమగుటచేతను, తక్కిన దానములలో నన్నదానము శ్రేష్ఠమయినదని చెప్పవచ్చును. ప్రతి దానమునకును ప్రతిగ్రహీతయొక్క సుఖాభివృద్ధియో దుఃఖోపశమనమో ఫలముగా నుండవలెను; దానివలన నేకీడును కలుఁగఁగూడదు. అట్లుండునట్లు చేయుటకయి దానివిషయమున పాత్రాపాత్రవిచారము ముఖ్యముగా చేయవలెను. ఇప్పు డన్నదానమున కెట్టివారు పాత్రులన్న విషయమును ముందుగా విచారింతము. క్షుద్బాధ యందఱికిని సమానమే గనుక, ఆఁకలిగొనియున్నవాఁడెల్ల నన్నదానమునకుఁ బాత్రుఁడని సామాన్యముగాఁ జెప్పుదురు. కాని సూక్ష్మదృష్టితో విచారించెదు పక్షమున వారిమాట సరియైనది కాదని తోఁచకపోదు. ఎక్కడనో భాగ్యహీనులయిన కొందఱికి తప్ప భగవంతుఁ డందఱికిని కరచరణాద్యవయవములను ప్రసాదించియున్నాఁడు. అట్లు ప్రసాదించి యుండుటచేతనే యవయవపటుత్వము గలవా రందఱును వాని నుపయోగించుకొని పాటుపడి జీవనము చేయవలెననుట భగవదుద్దేశమనియు, వాని నుపయోగపఱుచుకొని పాటుపడక సోమరిగా తిరుగువాఁడు భగవదాజ్ఞ నుల్లంఘించినవాఁ డగుటచేత దానిఫలము ననుభవింపవలసినవాఁ

డనియుఁ విస్పష్టమగుచున్నది. కాఁబట్టి దృఢకాయులయి పాటుపడి జీవింప శక్తికలవా రన్నదానమున కర్హులు కారని చెప్పనక్కఱ లేకయే బోధపడుచున్నది. రోగములచేతను, ముసలితనముచేతను, అంగవైకల్యముచేతను, దైవికములయిన యితరాపత్తులచేతను పాటుపడి సంపాదించుకోలేని నిరాశ్రయులయిన బీదవాండ్రును, తల్లిదండ్రులు లేని దిక్కుమాలిన పసిబిడ్డలును, గతిలేని వితంతువులును, అన్నదానమున కర్హులు. ఇట్టి లోపములు గల వా రన్నాతురులయి వచ్చినప్పుడు బ్రాహ్మణుఁడని, పంచముఁడని, హిందువని, తురుష్కుఁడని చూడక యెల్లవారికిని సమానముగా శక్తి కొలఁదిని దానము చేయవలెను. వీరికి చేయు దానము సదా ప్రీతిపూర్వక మయినదిగా నుండవలెను. వీరుగాక మన మన్న మిచ్చి సత్కరింపవలసినవా రింకొక తెగవారుకూడ నున్నారు. వారు పరదేశమునుండి యాకస్మికముగా వచ్చిన యభ్యాగతులు. వారికి జరుగుఁబాటు కలిగియున్నను గ్రామమునకు క్రొత్తవారగుటచే వారికిఁ గావలసిన యానుకూల్యములు సులభముగా లభింపనేరవు గనుక, అట్టి యతిథులను భోజనాదులచేత వచ్చిన దినమున సత్కరించుటకూడ మనకు విధిగా మున్నది. వీరికి చేసెడు భోజనాదిసత్కారము పయివారి దానివలె కేవల దయతో చేయునదిగా నుండక పూజ్యతాబుద్ధితో చేయునదిగా నుండవలెను. ఇటువంటివారికిఁ గాక పాటుపడి సంపాదించుకోఁగలవారై దృఢశరీరులయ్యును దేహములు దాఁచుకొని పాటుపడక సోమరులై పరులను యాచించి తిన మరగిన సోమరిరాములకును, హేయాతిహేయమయిన యాచనయే కులవృత్తిగాఁ జేసికొని మానావమానములు మాని నైచ్యముగా తిరుగు యాచకచక్రవర్తులకును దానములు చేయ మొదలు పెట్టితిమేని దానివలన లేశమయినను ప్రయోజనము కలుగక

పోవుటయేకాక బహువిధములయిన యనర్థములును తటస్థించును. ఏమి కాలకర్మదోషముననో కాని మనదేశమునం దిప్పు డీ దానవిషయమయి విపరీత ప్రవర్తనము కానఁబడుచున్నది. కటికిదరిద్రులయిన కుంటివాండ్రును గుడ్డివాండ్రును క్షుత్పీడచేత బాధపడుచు గుమ్మములవద్ద నిలిచి వీధులలో గొంతుపగుల దీనాలాపము లఱచుచుండఁగా మనవార లనేకులు వారి మొఱ్ఱలాలకించి బిచ్చముపెట్టిన మహాపాతకమువచ్చి తమ్ముఁ జుట్టుకొనునని భయపడి వారికి భిక్షము పెట్టక పోవుటయేకాక మీఁదుమిక్కిలి వాండ్రను దుర్భాషలాడి వెడలఁగొట్టి, పాటుపడి నలుగురను పోషింప శక్తికలిగియు పాటుపడక ముఖస్తుతులుచేసి వంచించి ధనమును గొనెడు దృఢకాయులకు సంతోషపూర్వకముగా దానములు చేయుచున్నారు. అట్లు చేయుటచేత యాచనయే వృత్తిగాఁ గలవారు మానవకోటి కలంకారములుగా నుండు మానము, లజ్జ మొదలయిన యుత్తమగుణములను పోగొట్టుకొని సోమరితనమునకు ఫలములయిన వంచనము మొదలయిన నీచగుణములను పొంది పాడగుచున్నారు. జూదము లాడుట, కొండెములు చెప్పుట, ఇచ్చకము లాడుట, కూటసాక్ష్యములు పలుకుట, కుటుంబ కలహములు పెట్టుట, మిత్రభేదము చేయుట మొదలయిన యకార్యకరణము లనేకము లీ సాపాటురాములయందే తఱచుగా కానఁబడుచున్నవి. ఇట్టివా రుదరము నిమిత్తమయి బహువిధవేషములను వేసి, సత్యమును విడిచి తమయింట శ్రాద్ధమనియు, వివాహమనియు, వడుగనియు, యజ్ఞమనియు, యాగమనియు బొంకి వంచించి ధనమును గొనుచు, సత్రములు పెట్టించెదమని సమారాధనములు చేయించెదమని గుళ్ళు గోపురములు మండపములు కట్టించెదమని చెప్పి భ్రమపెట్టి గడించి గృహములు కట్టించుకొని భార్యలకు నగలు చేయించుకొనుచు,

ఊరూరఁ దిరిగి సత్రములకు సమారాధనములకుఁ బోయి పరాన్నముతో కడుపు నింపుకొనుచు, బైరాగులమని జోగులమని మాంత్రికులమని నటించి బెదిరించి ధనాపహారణము చేయుచు; కాకులవలె నఱచుచు నిండ్లకడను రేవులకడను కాచి, కాసుపీసములు పెనఁగులాడి గ్రహించుచు, వివాహాదులయందు దొమ్మిచేసి చేతులు విఱిచియు తోరణములు త్రెంచియు తిట్లుతినియు కొట్లుపడియు దక్షిణలందుచు, చూచువారు నవ్వినను పెట్టువారు తిట్టినను లక్ష్యము చేయక కొల్లగాండ్రవలె మీఁదఁబడి బలవంతముగా లోకువైనవారి చేతులలో ధనము లాగుకొనుచు, ఎంత యిచ్చినను తృప్తినొందక సంతుష్టి లేక యియ్యనివారిని పాపులని తిట్టుచు, శుభకార్యములు లేనియెడల నింటింట శ్రాద్ధములు కావలెనని కోరుచు, చావులు వేఁడుచు, ఇంట ధనమున్నను మూఁడుజాములవఱకును మెతుకులు తినక మాడుచు, తేరతిండ్లకయి వెతకులాడుచు, నానావిధదుర్వ్యవర్తనలచే నరోగ్యముగా కాలము గడుపుచున్నారు. ఇటువంటి యవలక్షణములుగల సోమరిసార్వభౌములసంఖ్య యిప్పుడు బ్రాహ్మణేతరులయందును దినదినాభివృద్ధి చెందుచున్నది. ఇంటింటఁ దిరిగి బిచ్చమెత్తుచు, సందయినయెడ నెవ్వరును లేకుండఁ జూచి చేతికి దొరకిన వస్తువులను దొంగిలించుచు, భిక్షమే వృత్తిసిగాఁ జేసికొన్న దృఢదేహులయిన హీనజాతులవారి నెందఱినో మనమిప్పుడు ప్రతిగ్రామమునందును దండోపతండములుగాఁ జూచుచున్నాము. ఇట్టివారికి బిచ్చము పెట్టెడి యాచారము మనదేశములో లేకయుండినయెడల, వారందఱును పాటుపడి గౌరవముతోఁ గూడిన జీవనము సంపాదించుకొని తాము బాగుపడి పరులకు శ్రమయియ్యక లోకమున కుపకారులయి యుందురుగదా ? వీరు వ్యవసాయమునందు ప్రవేశించిన, పంట లధిక

మగును; మఱి యేవృత్తియందు ప్రవేశించినను, ఆయావృత్తు లధిక లాభకరము లగును. అంతేకాక వీరు న్యాయముగా పాటుపడి సుఖ జీవనము చేయుచుండినయెడల వీరి పోషణమునకయి వ్యయ మయ్యెడు సొమ్మంతయు జనులవద్దనుండి జను లధికధనసంపన్ను లగుదురు. మన మీ యనర్థములను తొలఁగింపవలెనన్నచో మనవా రాచరించెడి యవిచారమూలకములయిన యీ దానములను కట్టి పెట్టవలెను. కావలసియుండినయెడల బీదలయి దృఢకాయులయి యుండెడి వారికి మనము చేయవలసిన సాహాయ్య మొక్కటి యున్నది. మనదేశమునం దక్కడక్కడ పనిశాలలు పెట్టించి, పనిపాటులు లభింపని యిటువంటి బీదలచేత నందు పనిచేయించి జీవనమున కిచ్చుచు వచ్చినచో వాండ్రకు జీవనము నడచుటయే కాక వాండ్రు చేసిన పనివలన అయ్యెడు వ్యయములును కలిసివచ్చును. కాఁబట్టి మనవా రింక పరాన్నభక్షణవ్రతులకయి యన్నసత్రములను వృద్ధిపొందింపఁ జూడక వాని స్థానమున బీదలకయి కర్మశాల లను పెట్టించుటకయి చూడవలెను. పయిని చెప్పిన వికలాంగులు మొదలయిన యశక్తులకు మాత్రమే యన్నసత్రము లుండవలెను. కాని యితరుల కక్కఱ లేదు. మనవారనేకు లితరుల కష్టములను బాధలను తొలగించుటకయి దానములుచేయక పేరునిమిత్తమును ముఖస్తుతుల కుబ్బియు దానములు చేయుచున్నారు. సదుద్దేశముతో హృదయపూర్వకముగా చేయని యిటువంటి దానములవలన ప్రయో జనము లేశమయినను లేకపోవుటయే కాక మితిమీఱిన యనర్థము లును కలుగుచున్నవి. పేరున కాశపడి, ముఖస్తుతుల కాశపడి, వివాహా దులయందు శక్తికిమించిన దక్షిణ లిచ్చి, అప్పులపాలయి చెడిపోయిన వారెందఱున్నారో కొంచెము విచారించిన యెడల వారి మనస్సులకే

విశదమగును. కేవల కీర్తికే యాశపడి దానములు చేయువారు కొందఱు పరులు తమ్ము దాత లనుకొనవలెనని యితరులు చెంత నున్నప్పు డపాత్రునకయిన దంభమునకయి దానములు చేయుచు, పరు లెదుటలేనప్పు డుత్తమపాత్రునకయిన చిల్లిగవ్వ యియ్యక సాగనంపుచుందురు. అటువంటివారు సత్యమయిన దాతలు గాక పరులను వంచించు పెనుమోసగాండ్రగుదురు. కాఁబట్టియే యొక చేయి చేసిన దానమును రెండవచేయి యెఱుఁగకుండునట్లుగా గుప్త దానము చేయవలెనని పెద్దలు చెప్పుదురు. నిజమయిన దాతకు ప్రసిద్ధి తాను కోరనక్కఱలేక తనంతనే వచ్చును. కొమ్మల మఱుఁగున నున్నను పుష్పముయొక్క సువాసన పయికి వచ్చునట్లుగా, గుప్తదానము చేసెడు త్యాగుల యౌదార్యమును తాను చాటుకొనకయే జగత్ప్రసిద్ధమగును. కొందఱు ఘనులు, ధనికులు తమగ్రామములకు వచ్చుచున్నారన్నవార్త చెవి సోఁకఁగానే యెదురుపోయి కొనివచ్చి వారికి సమస్తోపచారములును చేసి విందులు చేయుచు, దరిద్రులు తమ యిండ్లకు వచ్చి పిడికెడు బియ్యము బిచ్చము పెట్టుఁడని దీనత్వముతో వేఁడుకొన్నను వినిపించుకొనక యాదీనులను తిట్టి కొట్టి తఱిమివేయుదురు. అట్టివారు చేయువ్యయము జలములేక యెండఁబాఱుచున్న చేలకు నీరుపెట్టక, అతివృష్టిచే మురిగిపోవుచున్న పొలములకు నీరు పెట్టినట్టు నిష్ఫలమగును. ఇఁకఁ గొందఱు మనస్సులో సమాధానము లేకపోయినను యాచకులు తమ్ము తిట్టుదురో బండతనము చేయుదురో యని భయపడి వారికి కాసువీసము లిచ్చి పంపివేయుదురు. అట్టి దురాగ్రహగ్రస్తులయిన యాచకపిశాచముల శాపములు వారికే తగులునుగాని వారికి ధనమియ్యనివారి కెంతమాత్రమును తగులవు. అట్టి దానము దారిదోపుడుకాండ్ర కట్టపెట్టునకు

వెలచి ధనకనకాదుల నిచ్చెడు మహాదానమునకంటె శ్రేష్ఠమయినది కాదు. అట్టి యాచకులును దొంగలకంటె నేవిషయమునను మంచి వారుకారు. దొంగలు చీఁకటిరాత్రులలో నప్పుడప్పుడు నిద్రపోవు చుండఁగా కొందఱియిండ్లలో ధనాపహారణము చేయుదురు. కాని యీ పగటిదొంగలో ప్రతిదినమును పట్టపగలు మేలుకొని యుండఁ గానే యెల్లవారల యిండ్లకడను ధనాపహారణము చేయుదురు. ఇట్టి వీరికి దానముచేసి ప్రోత్సాహపఱుచుట దొంగలను పోషించి పరు లను దోచుకొనుట కయి ప్రోత్సాహపఱుచుట వంటిది. ఇటువంటి దానములుగాక మనలో మతోన్మాదముగలవారు కొందఱు తోడి మానవులు తిండిలేక పరితపించుచున్నను వారికి తోడ్పడక దయాలే శములేక మాంసమును చేపలను కొని, గ్రద్దలను వెదకుకొనుచుఁ బోయి పిలిచి యెగరవేయుచు, బియ్యము మూడికట్టుకొని పోయి చెట్లు పుట్టలు వెదకి చీమలకుఁ బోయుచు ప్రొద్దుపుచ్చుచున్నారు. మన లోని తెలివిగలవా రిటువంటి మూఢతాజన్యములయిన దానము లను సహితము వారించి గతిలేని వృద్ధులు మొదలయినవారి కిచ్చు టయే భగవత్ప్రీతికరమని తెలియనివారి మనస్సులలో నాటుకొను నట్లు చేయవలెను.

కడుపున కన్న మమరిన తరువాత కట్టుకొనుటకు బట్ట యావ శ్యము కాఁబట్టి యన్నదానము తరువాత వస్త్రదానము ముఖ్యమయిన దని చెప్పవచ్చును. వస్త్రదాన మన్నదానమువలె ప్రతిదినము చేయ వలసిన పనిలేదు; సంవత్సరమునకు రెండుపర్యాయములు చేసినఁ జాలును. ముఖ్యముగా శీతకాలమునకుముందు బీదలకు వస్త్రదానము చేయుట మిక్కిలి యుపయుక్తముగా నుండును. అన్నదానార్హులని చెప్పఁబడిన యగతికులగు రోగపీడితులు వృద్ధులు వికలాంగులు మొదలయినవారే యీ దానమునకును ముఖ్యార్హులు.

విద్యాదానమునకును అన్నదానమునకును తరువాత ఔషధ దానము ప్రధానమయినదని చెప్పవచ్చును. ఈ యౌషధదానము నకు రోగపీడితులయి దిక్కులేక యున్నవారు పాత్రులు. అట్టిరోగుల కొక్క యౌషధమును మాత్రమే కాక యారోగ్యమున కావశ్యకము లయిన పథ్యపానములను వస్త్రాదులను కూడ సమకూర్పవలయును. అన్నదానాదులు చేయుటకు ధనికులందఱు నర్హులే యయినను, ఈ దానమునకు మాత్ర మెల్లవారు నధికారులు కారు. రోగస్వభావమును గుణమును చక్కగా తెలిసికొని తగిన చికిత్సచేయఁగల వైద్యుఁడు మాత్రమే మందులనిచ్చుట కర్హుఁడు. అట్లుగాక యెల్లవారును వైద్య వేషము ధరించి మందులసంచులు గొని యౌషధదానము చేయ మొదలుపెట్టినయెడల ప్రమాదము సంభవించి రోగియొక్క బాధ నివారణమగుటకు మాఱుగా హెచ్చుకావచ్చును. ఒకానొకప్పుడు భిషగ్వేషధారుల యజ్ఞానముచేత రోగికి ప్రాణోపద్రవముకూడ సంభవింపవచ్చును. కాఁబట్టి యౌషధదానమునకయి ధర్మవైద్య శాలలు పెట్టించి వానియందు వైద్యశాస్త్రాభ్యాసముచేసి యనుభవ శాలులయియున్న ఘనవైద్యుల నధికారులనుగా నియమించుటయే కాక, భూభారము నడఁచుటకయి యవతరించిన యమదూతలవలె నెల్లయెడలను వ్యాపించి యున్న వైద్యవేషధారులు స్వకుటుంబభర ణార్థమయి తోఁచిన మందుల నిచ్చుచుండెడి మనదేశమునందలి గొప్ప దురాచారమును మాన్పుటకయి సకలవిధములఁ బ్రయత్నింపవలెను.

ధనదానమును గుఱించి విశేషముగా చెప్పవలసిన యావశ్యకము లేదు. అది తనంత నుపయోగపడునది కాదు; దాని నెవ్వరును కొరుకు కొని తినరు. అన్నవస్త్రాదుల నిమిత్తమును, విద్యనిమిత్తమును, మందు నిమిత్తమును, ధనము కావలసి యుండును. ఆ యా దానముల కెవ్వ

రర్థులో వారు మాత్రమే ధనదానమున కర్హులుగాని యితరులు కారు. పండితులు మొదలయిన వారినికూడ ధనదానముచే సత్కరించి మంచి విద్యలను ప్రోత్సాహపఱుపవచ్చును. ప్రత్యేకముగాఁ జేయవలసిన దానము లనివార్యముగా కొన్ని యున్నను, బహుజనోపకారార్థమయి చేయవలసిన ధర్మము లనేకములు సంఘీభవించి యైకమత్యముతోఁ జేయవలసి యుండును. పయిని చెప్పిన దానములలో విద్యాదానము నిమిత్తము ధర్మవిద్యాశాలలను, అన్నదానము నిమిత్తమయి యన్నసత్రములను, బీదల పనిపాటుల నిమిత్తమయి కర్మశాలలను, ఔషధదానము నిమిత్తమయి ధర్మవైద్యశాలలను, స్థాపింపవలయును. ఈ మహాకార్యముల నొక్కొక్కరు పూనుకొనుటకంటె పలువురు చేరి చిన్నచిన్న మొత్తములను చందాలు వేసి చేసినను శ్రేష్ఠతరముగా జరపవచ్చును; ఇవిగాక మిగిలిన చిల్లరదానము లంతగా నావశ్యకములు కావు. వానిని చేసినను చేయవచ్చును; చేయకపోయినను చేయకపోవచ్చును. చేయుటవలన విశేషప్రయోజనము లేదు; చేయకపోవుటవలన విశేషనష్టమును లేదు. కాఁబట్టి వానివిషయమయి యిక్కడ ప్రస్తావింపక యీ ప్రసంగము నింతటితో విరమించుచున్నాను.

రాజమహేంద్రవర స్త్రీ పునర్వివాహ చరిత్రము.

By

K. VEERESA LINGAM

రాజమహేంద్రవర స్త్రీ పునర్వివాహ చరిత్రము

ఓ మిత్రులారా !

స్త్రీపునర్వివాహ విషయకములయిన యుపన్యాసములను విని విని మీరు విసుగుచెంది యుందురు. బహుస్థలములయందు ఉపన్యాసములు చేసి చేసి నేనును విసిగియున్నాను. కొన్ని సంవత్సరములనుండి యేపట్టణమునందుఁ జూచినను, ఏసభలయందు విన్నను, ఏవృత్తాంత పత్రికలయందుఁ జదివినను, ఈ విషయమయిన చర్చలకును, ఉపన్యాసములకును, వాదప్రతివాదములకును విరామము కానరాకున్నది. వితంతువివాహములు తగుననువారును తగవనువారును కూడ శాస్త్ర వచనములతోను యుక్తులతోను పుస్తకములు నింపివేసినారు. ఈ విధముగా ఎక్కడఁజూచినను కావలసినన్ని ప్రసంగములును వాగ్వాదములును పుష్కలముగా నడుచుచున్నను, చినుకులయినను లేక వట్టి యుఱుములతోను మెఱుపులతోను సరిపోయెడు శుష్కమేఘాడంబరమువలెనే చెవులు చిల్లులు వోయెడి యీ వాగాడంబరమువలనను ఫలమేమియు కలుగక కార్యములకు మాత్ర మింతవఱకును పెద్ద కఱవే పట్టియున్నది. కార్యమునకు ముందు కొంతకాలము మాటలావశ్యకములే యయినను, ఎల్లకాలమును మాటలతోనే కూరుచుండుట మాత్రము శ్లాఘాపాత్రము కాదు. మాటలు కావలసిన కాల మీవఱకే దాటిపోయినది. శ్రుతిస్మృతివిహితమైన ధర్మస్వరూపమును తెలిసికొన నిష్టమును శక్తియుఁ గలవారి కందఱికిని శాస్త్ర మెట్లున్నదో యీవఱకే తెలిసిపోయినది. స్త్రీపునర్వివాహమువలని సాధకబాధకములును లాభనష్టములును బహుకాలముక్రిందటనే యెల్ల

వారికిని ప్రతిదినఘంటాఘోషము లయిపోయినవి. కాఁబట్టి యిఁక కావలసినవెల్లను కార్యములు కాని మాటలు కావు. లక్ష పోడిమాటలు చెప్పుటకన్న ఒక్క కార్యమునుచేసి చూపుటవలన జనుల మనస్సులు పూర్వాచారమునుండి శీఘ్రముగా మరలి సహస్రగుణము లధికమయిన ఫలము కలుగును. కొందఱు ప్రయాసమున కోర్చి తాము మొట్టమొదట పనిచేసి చూపనిదే యెంతటి మంచికార్యమైనను కేవల ధర్మోపదేశమాత్రముచేత లోకములో వ్యాపింపదు. కాఁబట్టి యిప్పుడు కష్టములకు సహించి ధైర్యము వహించి కార్యములను నిర్వహించి, అంకురించిన సత్కార్యబీజమును కబళింప నోరప్పళించెడు విఘ్నమృగశతములనుండియు పామరజనదూషణాకాలవాయువునుండియు దానిని సంరక్షించుచు రావలయును. క్రొత్తగా కార్యము లారంభించువారికి ఈవఱకు మఱియొకచోట పనిచేసి కష్టనిష్ఠురములకు లోనయియున్న వారియొక్కయు జరిగిన కార్యములయొక్కయు చరిత్రము కొంత సహాయపడవచ్చును గనుక రాజమహేంద్రవరమున జరిగిన స్త్రీ పునర్వివాహచరిత్రమును మీకించుక చెప్ప ననుజ్ఞ వేఁడుచున్నాను.

మనదేశములో జనసామాన్యముయొక్క సుఖాభివృద్ధికి భంగకరములుగా నున్న బహుదురాచారములను సాధ్యమైనంతవఱకు తొలఁగింప ప్రయత్నింపవలయునన్న బుద్ధి యీశ్వరానుగ్రహమువలన చిరకాలముక్రిందటనే నాకు మనస్సులో నంకురించియుండెను. ప్రాయమధికమయినకొలఁదిని నా కా యభిలాష బలపడసాగెను. దేశాభివృద్ధి నపేక్షించెడు నామిత్రులు కొందఱి సాహాయ్యమువలన కొన్నివిషయములలో కొంతవఱకు ప్రజోపయుక్తములయిన కొన్నిమార్పులను మా పట్టణములో కలుగఁజేయుటకును నేను కర్తుఁడ నయినాను.

అయినను స్త్రీపునర్వివాహ మీదేశములో వ్యాపించుటకు తగిన కాలము వచ్చినదనికాని ప్రయత్నము చేసినచో దానిని నెలకొల్పుట నావంటివారికి సాధ్యమగుననికాని నేనప్పుడు తలఁచి యుండలేదు. భ్రూణహత్యాదులు నశించి స్త్రీపునర్వివాహములు నిరాటంకముగా జరుగుచు బాలవితంతువులు ద్వితీయభర్తలతో సుఖించుచుండఁగా చూడవలెనని నాకెంత యభిలాష యుండినను, ఒక్కసారిగా ఇంతటి గొప్పమార్పు నిమిత్తమయి ప్రయత్నముచేయుటకు నాకు సాహసము పుట్టలేదు. ఇట్లుండఁగా పాఠశాలలో నా సహపాఠియు దేశాభిమానియు నైన నా ప్రియమిత్రుఁ డొకఁ డొకనాఁడు నా యొద్దకు వచ్చి మనము స్త్రీపునర్వివాహవిషయమయి కృషి చేయవలయునని యత్యంతాతురతతో చెప్పెను. అట్లుచేయుట యావశ్యకృత్యమని నేనెంత దృఢముగా విశ్వసించియున్నను, చేయవలెనని నాకెంత యభిలాష యున్నను, విశేషపాండిత్యముకాని ధనముకాని లౌకికాధికారముకాని లేని నావంటివారిట్టి మహాకార్యము తలపెట్టిన ప్రయోజనము లేదని యెంచి నామిత్రుని నేనంతగా ప్రోత్సాహపఱుపక యుపేక్ష చేయఁజొచ్చితిని గాని యతఁడే ప్రతిదినము నాయొద్దకు వచ్చి ప్రోత్సాహకరములయిన మాటలుచెప్పి నన్ను పురికొల్ప నారంభించెను. అతఁడీప్రకారము కొన్నిదినములు నాకుత్సాహము పుట్టించి యీ కార్యము నిమిత్తమయి ప్రయత్నము చేయతగిన సమయము వచ్చినదని కొందఱు వైదికులచేతఁగూడ చెప్పించి నన్ను బలవంత పెట్టఁగా, అన్నలు తన్ను విడిచిపెట్టినను బంధువులు బాధించినను కడవఱకును నాతో నిలిచి పనిచేయునట్లు నామిత్రునిచేత వాగ్దానము చేయించుకొని, ఒకదిన మాతఁడు వ్రాసితెచ్చిన సభాహ్వాన పత్రికమీఁద నా చేవ్రాలు చేసి ప్రకటించితిని. ఈ యాహ్వాన

పత్రికను చూచినతోడనే శుద్ధవైదికవృత్తియందున్న మా పట్టణము లోని పండితులందఱును నామీఁద కత్తులు నూఱుట కారంభించిరి; పూర్వాచారపరాయణులయియున్న లౌకికశిఖామణులును వారికి తోడ్పడి, నన్ను సాధింప దీక్షవహించి యుండిరి. ఈ ప్రకారముగా ప్రతిపక్షులు తమ సాధనములతో సంసిద్ధులయి యుండఁగా, నేను పంపిన యాహ్వానపత్రిక ననుసరించి యీ విషయమయి నే నుపన్యాసింపవలసిన దినమును వచ్చినది. అప్పటికి నాకు స్త్రీపునర్వివాహవిషయమయి యేమి గ్రంథములున్నవో తెలియవు. విద్యాసాగరుని గ్రంథమున్నట్టు మాత్రము తెలియునుగాని, ఆ గ్రంథమును నాకప్పుడు లభింపలేదు. మనుస్మృతియు, పరాశరస్మృతియు, యాజ్ఞవల్క్యస్మృతియు మాత్రమప్పుడు నా యొద్దనున్నవి. ఈ విషయమయి పురుషార్థప్రదాయినిలో నొకరు ప్రచురించిన చిన్న గ్రంథ మొకటి నాకు చిక్కినది. ఈ గ్రంథముల సాహాయ్యముతో నాబుద్ధికి తోఁచిన యుక్తులనుచేర్చి యొక యుపన్యాసము వ్రాసి దానిని శ్రీవిజయనగరపు మహారాజుగారి బాలికాపాఠశాలామందిరమున జరిగిన మహాసభలో ౧౮౭౯ వ సంవత్సరము జూలయి నెలలో మొట్టమొదట చదివినాను. నా యుపన్యాసము బహుజనుల మనస్సులను కరఁగించినను, పండితుల కోపాగ్నికి నేతిధారయయి వారిని మఱింత కుపితులనుగాఁ జేసినది. ఆ దినమున వాదమెట్లుజరుగునో వినవలె ననియు, పండితుల విజయమును చూడవలెననియు, బహువిధాభిప్రాయములతో గుంపులుగా వచ్చిన జనులతో అయిదాఱువందల జనులు పట్టఁదగిన సభామందిరమంతయు నూవులు పయికి చల్లినను క్రింద రాలనట్టుగా క్రిక్కిఱిసిపోయినది. నా యుపన్యాసము కాఁగానే ఆ మహాసంఘములో నుండి వృషభముమీఁదికి లేచు వ్యాఘ్రములవలె పండితు లనేకులు

లేచి శ్రీశంకరాచార్యస్వాములవారివద్ద ముఖ్యపండితులుగా నుండిన అద్దేపల్లి కృష్ణశాస్త్రులవారు మొదలైనవారు తమ పాండిత్యమునంతను కనఁబఱిచి నన్ను బహువిధముల దూషించి 'నష్టే మృతే' త్యాది పరాశరస్మృతివచనమున కనేకవిరుద్ధార్థములు కల్పించి పరిహాసముచేసి ప్రత్యుత్తరము చెప్పుటకు నా కవకాశ మియ్యక, పయివారము నా యుపన్యాసముమీఁది ఖండనోపన్యాసములు చదివెదమని వాగ్దానములుచేసి నాటికి సభనుండి వెడలిపోయిరి. ఆ దినము మొదలుకొని పట్టణమునందంతటను ప్రతిగృహమునందును స్త్రీపునర్వివాహవిషయమయిన చర్చలే జరుగనారంభించినవి. ఆ కాలమునందు విధవావివాహమన్న శబ్ద మందఱికిని శూలమువలె సోఁకి కర్ణకఠోరముగా నుండెను. నన్నావఱ కితరవిషయములయందు భూషించువారును ఈ విషయమునందు దూషింప నారంభించిరి. నామిత్రులు సహితము కొందఱు నన్ను నిరుత్సాహపఱుపసాగిరి. పండితులందఱును నామీఁద ధ్వజమెత్తి, చూచువారు లేక మూలఁబడియున్న ప్రాతతాటాకుపుస్తకముల నన్నిటిని పయికితీసి బూజు దులుప మొదలుపెట్టిరి. ఏ గ్రంథము నడిగినను వీరు నాకొక్కపర్యాయ మెరవియ్యకపోవుటయే కాక గ్రంథనామములయినను నాకు తెలుపక మఱుఁగుపఱచుచు వచ్చిరి. నా పక్షమున కొందఱుమిత్రులున్నను వారప్పుడు చేయఁగలిగిన సాహాయ్య మత్యల్పముగా నుండెను. మొదట నన్నీకార్యమునకు పురికొల్పిన మిత్రుఁడు మాత్రము సంస్కృతమునందు కొంత పాండిత్యము కలవాఁడగుటచేత నాకు బహువిధముల తోడుపాటుగా నుండెను. నాకింతలో కాశీపట్టణమునుండియు కాళీఘట్టపట్టణము నుండియు బొంబయినుండియు కావలసిన పుస్తకములన్నియు వచ్చినవి. ముప్పది స్మృతులకంటె నధికముగా నాకప్పుడు లభించినవి. అవి యన్నియు చదువుటకు నా

కప్పు డవకాశము లేకపోయినను, ఈశ్వరుఁడు మాత్రము నాకు మిక్కిలి సహాయుఁడయి యుండుటచేత నేను చూచిన భాగములోనే నావాదమున కనుకూలమయిన ప్రమాణవచనము లనేకము లప్రయత్నముగా దొరకెను. ఈప్రకారముగా సత్యబలమును దైవబలమును నాపక్షమునం దుండుటచేత నాకు ధైర్యము హెచ్చి నేనుత్సాహముతో పనిచేయఁగా, పండితు లుపన్యాసములు చేసిన సభనాఁడు నాప్రతివాదమును విన్నమీఁదట జనుల కందఱకును పండితులవాద మసారమనియు స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమనియు అభిప్రాయము కలుగ నారంభించెను. పండితులు నన్ను బహిరంగముగా సభలయం దోడించలేక బహువిధమాయోపాయములు ప్రయోగింపఁజొచ్చిరి. కొందఱింటింటికి తిరిగి శాస్త్రజ్ఞానములేని పెద్దమనుష్యులవద్ద నేను చేసిన వపార్థములనియు, శాస్త్రము స్త్రీపునర్వివాహము నంగీకరింపదనియు, కలియుగము గనుక వర్ణసాంకర్యము కలిగి లోకము చెడిపోవుననియు, చాట మొదలుపెట్టిరి. కొందఱు నయమున భయమున నన్ను మఱలింపఁ జూచిరి. కొందఱు నన్నకస్మాత్తుగా పిలిపించి వాదములో నోడించి శాస్త్రవిషయమున జనులకు కలుగుచున్న విశ్వాసమును చెడఁగొట్ట ప్రయత్నించిరి. అక్కడి పండితులు తాము వాదమునందు నిర్వహింపలేక యితరస్థలములనుండి పండితులను పిలిపించుటకై ప్రయత్నించి, ఆవిషయమునను లబ్ధమనోరథులుగాక విశాఖపట్టణమండలమునందలి యొకరాజుగారిచే నొక ఖండనగ్రంథమును వ్రాయించి తెప్పించి, పండితు లందఱును దానియందు తమకు తోఁచినవిషయములను చొప్పించి, పుస్తకములోని సంగతులు మాపక్షమువారి కెవ్వరికి తెలియకుండ రహస్యముగా నుంచి, కాశీ మొదలైన స్థలములయందు చిరకాలము వసించి మంత్రశాస్త్రప్రవీణుఁ

డని ప్రసిద్ధిఁగాంచిన మహాతంత్రజ్ఞుఁడైన జోస్యుల పేరిచయనులు గారిలోపల నొకసభ చేసి, ఆసభకు స్త్రీపునర్వివాహప్రతిపక్షులను మాత్రమే యాహ్వానముచేసి నన్నకస్మాత్తుగా పిలుచుకొనిపోయి, పయిగ్రంథమును జదివి యందలి యంశముల కారణముననే యుత్తరము చెప్పవలయునని యడిగి నన్ను పరాజితుని జేయఁజూచిరి. కాని యీశ్వరానుగ్రహమువలన నేను సమయోచితములయిన ప్రత్యుత్తరముల చెప్పనారంభింపఁగా, ప్రజలకు తమమాటలయందు విశ్వాసము చెడునని భావించి యాపండితులు నాయుత్తరములను వినక కడుపునొప్పి యని యొకఁడును కాలునొప్పియని యొకఁడును లేచిపోయిరి. అటు తరువాత పరమతాంత్రికుఁడయిన యాచయనులుగారు నన్నొంటిగా పిలిచి నన్నును నాపూర్వులను స్తుతిపాఠములతో శ్లాఘించి పూనిన కార్యమునుండి మరలింప బ్రయత్నించెను గాని దైవయత్నమువలన ఆపండితసత్తముని కోరిక సఫలము కాక, విధవావివాహవృక్షమును మూలచ్ఛేదము చేయుటకయి దీక్షవహించిన సభల కాలయమయి బ్రాహ్మణశ్రేణిలో శుద్ధశ్రోత్రియుల యిండ్లనడుమనున్న యాగృహమే యిప్పుడు విధవావివాహప్రవర్తకసమాజమువారి యధీనమయి యీ నూతనదంపతుల కాపురమున కాలయమయి యున్నది. నేను మొట్టమొదట నిచ్చిన యుపన్యాసము ప్రకటింపఁబడఁగానే తెలుఁగుదేశమునందంతటను స్త్రీపునర్వివాహవిషయమైన వాదములే ప్రబలి మండనవాదులు నాపుస్తకము నాధారము చేసికొని శాస్త్రమును యుక్తులను చెప్పఁబూనుటయు, ఖండనవాదులు బహువిధముల పూర్వపక్షములు చేయబూనుటయు కొంతకాలము జరిగెను. గుంటూరు నుండి భువనగిరి పరదేశిసోమయాజులుగారును, బందరునుండి శ్రౌతము కోటీశ్వరశాస్త్రులుగారును, చెన్నపురినుండి కొక్కొండ వేంకటరత్నము

పంతులుగారును, వర్తమాన రత్నాకర విలేఖకులును, కాకినాడనుండి ఓగిరాల జగన్నాధముగారును, విశాఖపట్టణమునుండి దంతులూరి నారాయణగజపతిరాజుగారును, రాజమహేంద్రవరమున వేదము వేంకటరాయశాస్త్రులుగారును, ఇంకను ననేకులును నా ప్రథమోపన్యాసము మీఁద ఖండన గ్రంథములను వ్రాసిరి. ఈ ఖండన గ్రంథములయందలి ముఖ్యాంశములకును రాజమహేంద్రవరమునందలి పండితులు చెప్పిన యంశములకును ఉత్తరముగా నేను మరల శ్రీవిజయనగరము మహారాజుగారి బాలికాపాఠశాలలో జరిగిన మహాసభలోనే నా ద్వితీయవిజ్ఞాపనము నుపన్యసించి ప్రకటించినాను. ఇదిగాక బహుస్థలములయం దీవిషయమై వ్రాయుచు, వచ్చిన ప్రతివాదుల వాదములకెల్ల నుత్తరములు ప్రకటించుచు వచ్చినాను. తీఱికయున్నప్పు డితరస్థలములకు పోయి యుపన్యాసములు చేయుటకును ప్రయత్నించుచు వచ్చినాను. నేను మొట్టమొదట కాకినాడకుపోయి యుపన్యాసము చేసినప్పు డక్కడి బ్రాహ్మణులు నా మీఁద రాళ్ళు వేయుటకును యత్నించినారు. ఈకార్యమునకు విఘాతము కలుగఁజేయుటకయి యెంద ఱెన్నివిధముల ప్రయత్నములు చేసినను, మాది న్యాయపక్షమయినందునను, న్యాయ మెక్కడ నుండునో దేవుఁడక్కడ నుండును గనుకను, దేవుఁ డేవంక నుండునో యావంక జయము కలుగుట సహజమగుటచేతను, నాతోడివారును నేనును సంఖ్యయం దతిదుర్బలులమైనను, విద్యాధికులము కాకపోయినను, మా ప్రయత్నములే కొనసాగుచువచ్చి శత్రువులకృషి యంతయు విఫలము కాసాగెను. ఈవిషయమై తఱచుగా వాదప్రతివాదములు జరుగుచువచ్చుటచేత విధవావివాహమన్న శబ్ద మారంభదశయందు పలె చెవులకు కటువుగా నుండక కొంతకాలములో జనులకది పరి

చితపదమై పోయినది. అనేకులకు విధవావివాహములు శాస్త్రసమ్మతములనియు, అవశ్యాచరణీయములనియు, అభిప్రాయము కలుగసాగెను. బాలవితంతువుల సంరక్షకు లనేకులు తమ వితంతుకన్యలకు పునర్వివాహములు చేయ నుద్దేశించుకొన మొదలుపెట్టిరి. ఇంతకు మునుపే శ్రీ పైడా రామకృష్ణయ్యగారు తమ సహజౌదార్యముతో ముప్పదివేలరూపాయలను ఈకార్యమునిమిత్తమయి యిచ్చెదమని వాగ్దానము చేసినారు. ఈ సమయములో స్త్రీపునర్వివాహములయం దత్యంతాభిరతిగల ఆత్మూరి లక్ష్మీనరసింహముగారు మా పట్టణమునకు ప్రాడ్వివాకుఁడుగా వచ్చుటకూడ దైవవశముచేత సంభవించినది. వివాహములు జరిగెడు పక్షమున తాము భోజనములకు వచ్చెదమని ముప్పదిమందికంటె నధికముగా లౌక్యులైన బ్రాహ్మణులు వాగ్దానములు చేసినారు. వితంతుకన్యలు దొరికినపక్షమున తాము వివాహమాడెదమని మా శాస్త్రపాఠశాలలోని విద్యార్థులనేకులు బయలు దేఱినారు. ఈ కార్యములో నాకు విద్యార్థులే ముఖ్యసహాయులుగా నుండి నా కంగరక్షకులుగాకూడ నుండుచు వచ్చినారు. ఇంచుమించుగా రెండుసంవత్సరము లీప్రకారముగా వాదములైన తరువాత కార్యము లేని నిరర్థకవాదములతోఁ బ్రయోజనము లేదని తెలిసికొని, యేలాగున నైన కొన్నివివాహములు జరపవలెనని నిశ్చయించుకొని, మాలో నయిదుగుర మొక అంతరంగికసమాజముగా చేరి మా ప్రయత్నము లితరులతో ప్రాణమిత్రులతోనైనను జెప్పకుండునట్లు మాలో మేము ప్రమాణములు చేసికొని, రహస్యముగా కార్యాలోచనము చేయుట కారంభించినాము. మనదేశములో సాధారణముగా పేరునకు పూసజము లనేకము లుండుటయేకాని, అందఱును గలిసి యైకమత్యముతో పనిచేయుచుండుట కానము. ఏ పని చేసినను సమాజముపేరు పెట్టి

యొక్కరే చేయుచుండవలెను. ఈ విషయములో శ్రద్ధవహించి పని చేయు సామాజికులుగల సమాజము నేర్పఱుపవలయునని నేను పలుమాఱు ప్రయత్నములు చేయుచు వచ్చితిని గాని, ఆ సమాజములలో నొక్కటియు చిరకాల ముండుటకాని, యైకమత్యముతో పనిచేయుట కాని తటస్థింపలేదు. ఈ రహస్యసమాజములో మాటాడుకొన్న సంగతులుసహిత మేలాగుననో కాని మఱునాటికే ప్రతిపక్షులయొద్దకు పోసాగెను. మే మీ ప్రకారముగా కార్యములు జరుపుటకు కృతనిశ్చయులమయి గూఢముగా పనిచేయుచుండుటయు, వివాహములు జరిగెడు పక్షమున భోజనముల కెవ్వరు వచ్చెదరో, తాంబూలముల కెవ్వరు వచ్చెదరో, ప్రతిపక్షము పూనక సహాయులుగా నెవ్వరుందురో తెలిసికొనుటకై లక్ష్మీనరసింహముగారిలోపల రెండుసభలు చేయుటయు, చూచి స్త్రీపునర్వివాహనిషేధకపక్షమువారు భయపడి మా ప్రయత్నములు మాటలతో పోక కార్యములకు వచ్చునని సంచలించి తొందరపడి మా ప్రయత్నములకు విఘ్నములు కలుగఁజేయుటకయి వారును సభలుచేరి యుపాయముల నాలోచింప మొదలుపెట్టిరి. ఒక దినమున పూర్వాచారపరాయణులయిన లౌకికులును వైదికులును మార్కండేశ్వరుని యాలయములో సభచేరి నన్ను వర్ణమునుండి బహిష్కారము చేయుటకును విధవావివాహముల కేవిధమైన తోడ్పాటు చూపెదమన్నను వారిని బహిష్కరించెదమని భయపెట్టుటకును ముందే నిశ్చయించుకొనివచ్చి, వారిలోని మూర్ఖులైన కొందఱు బ్రాహ్మణులు నన్ను కొట్టవలెననికూడ నుద్దేశించిరి. ఈ సంగతి కొంచెము పట్టణములో తెలియఁగానే సభ యారంభమైన యర గంటలోపల దేవాలయమంతయు పాఠశాలలోఁ జదువుకొను రెండు వందలవిద్యార్థులతో నిండిపోయినది. నా విషయమై దాక్షిణ్యము

జరిగింప నెంచిన యా దుష్టులు విద్యార్థులసంఖ్యను జూచి భయపడి తమ కేమి పరాభవము సంభవించునోయని మెల్లఁగా నావలకు జారిరి. సభవారును మొట్టమొదట నుద్దేశించుకొని వచ్చినపని జరప నేరక తమయిండ్లకు బోవలసినవారైరి. ఆదినము మొదలుకొని పట్టణములో సంక్షోభమును కక్షలును ప్రబలసాగెను.

ఇప్పటికి వితంతువులైన తమకన్యలకు వివాహములు చేసెద మని బయలు దేఱినవారనేకు లేర్పడినను తాము ముందుగా నడు గిడుదు మనువారు మాత్రము కనఁబడలేదు. ఎల్లవారును ముందొక వివాహ మయినయెడల తాము రెండవవారముగా నుందు మనువారే కాని తామే మొదటివారుగా నుందుమనువారు కానరాలేదు. అట్లుండుట లోకస్వభావమే. ముందుగా నెవ్వరైన ప్రవేశించుట చూచి వారికి కష్టములు వచ్చినచో తాము ప్రవేశింపక తొలఁగుటకును కష్టములు రానిచో తామును ప్రవేశించి సుఖ మనుభవించుటకును జను లెప్పుడును సామాన్యముగా కోరుచుందురు. మా ప్రయత్నము లిట్లుండఁగా కృష్ణామండలమునుండి మామిత్రులైన దర్భా బ్రహ్మా నందముగారు తమవైపున నొకగ్రామములో నొక బ్రాహ్మణవితంతు కన్య యున్నదనియు, మనుష్యులను పంపినయెడల వారివెంట తల్లి యాచిన్నదానిని పంపు ప్రయత్నము తాము చేసెదమనియు నాకొక జాబు వ్రాసిరి. ఈవిధముగా మొట్టమొదట వివాహము చేయువారు కూడ తటస్థించినందుకు సంతోషించి యీవిషయమై విశేషశ్రద్ధను వహించి సర్వవిధముల నాకు సహాయులుగా నుండిన లక్ష్మీనర సింహముగారి నడిగి పుచ్చుకొన్న తెలివిగల యిద్దఱు మనుష్యులను తోడిచ్చి, యీకార్యములయం దత్యంతాదరము కలిగి ప్రథమశాస్త్ర పరీక్షయందు కృతార్థుఁడై మాతో మొదటినుండియు పనిచేయు

చుండిన సోమంచి భీమశంకరముగారిని నాజాబుతో బ్రహ్మానందము గారియొద్దకుఁ బంపితిని. ఇటువంటి కార్యములలో పేరు పైకి తెలిసినచో కార్యభంగము కలుగును గనుక, ఆ చిన్నది యేగ్రామమునం దున్నదో, తల్లి పేరెవరో యేమియు మేము పంపిన మిత్రునకుసహితము చెప్పక రహస్యముగానే యుంచి బ్రహ్మానందముగారిని చూచిన తరువాత సమస్తమును వారే చేసెదరని మాత్రము చెప్పితిమి. వీరు బయలు దేఱిన రెండుదినముల కెల్లను తాముద్యోగాంతరముమీఁద నూఱు యి మయిళ్లదూరములో నున్న మఱియొక గ్రామమునకు పోవుచున్నా మనియు కొన్నిమాసములవఱకును మరల వచ్చుటకు వీలుపడదనియు పదిరోల వచ్చినతరువాతనే యీకార్యము విషయమై కృషిచేయవచ్చు నట్టియు బ్రహ్మానందముగారివద్దనుండి నాకు జాబు వచ్చినది. మా మిత్రుఁడు బయలుదేఱి పోయిన గ్రామము మాపట్టణమునకు నూట యేఁబది మయిళ్ల దూరములో నున్నది. అక్కడకు పొగబండ్లు లేవు; తంతిసమాచార మందదు. అట్టి స్థితిలో మేమందఱము నాలోచించి వివరముగా జాబువ్రాసి మనుష్యుని పంపుట యుచితమని నిశ్చ యించి, ఆ చిన్నది వసించు గ్రామమును తల్లి యింటిపేరును, పేరును జరపవలసినకృత్యమును వివరముగా తెలుపుచు మామిత్రున కొక జాబువ్రాసి, దానికి లక్కముద్రలువైచి విశ్వాసపాత్రుఁడయిన మనుష్యుని చేతికిచ్చి పంపితిమి. ఈలోపల మామిత్రుఁడు గమ్యస్థా నముచేరి విచారింపఁగా బ్రహ్మానందముగా రావలకే గ్రామము విడిచి దూరగ్రామము పోయినట్టు తెలియవచ్చినది. పోవలసిన గ్రామమేదో, చేరవలసిన చిన్నదెవరో తెలియదు; తాము వచ్చిన కార్యమునైనను మఱియొకరితో చెప్ప వల్లకాదు; తుదకు తా మెవ్వరోకూడ తెలుపనయినను తెలుప వల్లకాదు; ఈ స్థితియం

దేమియు నాలోచన పాలుపోక బుద్ధిమంతుఁడు గనుక తొందరపడి గ్రామము విడిచి రాక మాయుత్తరము నపేక్షించి మామిత్రుఁడా గ్రామములోనే వేచియుండఁగా, మేము పంపిన మనుష్యుఁడు పోయి కలిసికొని మాజాబు నిచ్చెను. అప్పుడు పోవలసిన గ్రామమునకు వారందఱును బయలుదేఱిరి. ఆచిన్నదాని తల్లిదండ్రులు ధనికులై గొప్ప వంశమునందుఁ బుట్టినవారు; ఈకార్యము తల్లి కొక్కతెకు తప్ప బంధువర్గమున కెవ్వరికిని ఇష్టము లేదు; ఆచుట్టుపట్టుల గ్రామములన్నియు వారి బంధువులతో నిండియున్నవి; ఈసంగతి కొంచెము తెలిసినచో మోటు గ్రామములవా రెంత దౌర్జన్యము జరిగింతురో యెల్లవారు నెఱిఁగియుందురు; ఆప్రక్కల మామిత్రునకు సాయము చేయువా రొక్కరును లేరు. ఇటువంటిస్థితిలో నామిత్రుఁడు చక్కఁగా నాలోచించి తా మెక్కడకుఁ బోవుచున్నారో బండివాండ్రకు సహితము చెప్పక రాత్రి రెండుజాములప్పు డాగ్రామము చేరి ప్రయాసముమీఁద వారియిల్లు తెలిసికొని చిన్నదానితల్లిని లేపి రహస్యముగా తాము వచ్చినసంగతి తెలుపఁగా, ఆమె బ్రహ్మానందముగారు రానిదే తాను పిల్లను పంపనని చెప్పెను. వారారాత్రి యామె నెలాగుననో బతిమాలి యేమేమో చెప్పి యొప్పించి పిల్లదాని నొంటిగా వచ్చినట్లొడఁబఱిచి తెల్లవాఱకమునుపే యాచిన్నదానిని తీసికొని బయలుదేఱి యాదిన మేగ్రామమునను దిగి వంటచేసికొని భోజనము చేయక యటుకులే తిని యుండి, యెవ్వరు వచ్చి పట్టుకొందురో యను జంకుచేత శీఘ్రప్రయాణములుచేసి కొన్నిదినములలో తామాచిన్నదానిని సురక్షితముగా తెచ్చి మాయింటివద్ద చేర్చిరి. ఆమఱునాఁడే యీసంగతి యూరంతయు పొక్కి యాచిన్నదానిని చూచుటకయి జనులు తీర్థప్రజవలె రాసాగిరి. అందుచేత కొన్నిదినములు మాయిల్లు

తిరుమల వేంకటేశ్వరులవారి యాలయమువలె వచ్చెడివారితోను పోయెడువారితోను సందడిగా నుండెను. అప్పుడు మేము వరునిగూర్చి విచారింపఁజొచ్చితిమి. ఈ ప్రయత్నము మేమారంభించినది మొదలుకొని తల్లిదండ్రులు భయపడి సమస్తప్రయత్నములును చేసి బహ్మచారులయిన విద్యార్థులకు బలవంతపెట్టి వివాహములు చేయ నారంభించిరి. అందుచేత నావఱకు వివాహమాడ నిశ్చయించుకొన్న విద్యార్థులలో కొందఱికి వివాహము లయిపోయినవి. ఉన్నవారిలో కొందఱ అన్యశాఖలవారగుటచేత పనికిరాక పోయినారు. మిగిలినవారిలో మంచివారి నేర్పఱుచుట కాలోచించుచుండఁగా, ఆవఱకు నావద్దనుండి విద్య నేర్చుకొని సర్వకళాశాలాప్రవేశపరీక్షయందు తేఱి, అప్పుడు విశాఖపట్టణములో నిరువదిరూపాయలపనిలో నున్న యిరువదిరెండుసంవత్సరములప్రాయముగల యొకచిన్నవాని భార్య యాకస్మికముగా పోవుట తటస్థించెను. అతఁడీవితంతువివాహములు మొదలయిన క్రొత్తమార్పులయందాసక్తియు నుత్సాహమును గలవాఁడు. నేనాతనికి జాబు వ్రాయఁగా తానీచిన్నదానిని వివాహమాడుట కంగీకరించెను. అతఁడు చిన్నవాఁడగుటచేతను విద్యగలవాఁడగుటచేతను మంచి యుద్యోగమునం దుండుటచేతను పలువు రాతనికి పిల్ల నిచ్చెదమని తిరుగుచున్నను వారి నందఱిని నిరాకరించి, వితంతువివాహము చేసికొని బుద్ధిపూర్వకముగా ననేకకష్టములు పొందుటకు సాహసించిన యాతని ధైర్యమును పరోపకారచింతయు మిక్కిలి శ్లాఘింపఁదగి యున్నవి. ఆతనికి మఱింత ప్రోత్సాహము కలిగించి దర్భా బ్రహ్మానందముగారి తమ్ములయిన వేంకటశాస్త్రిగా రాతనిని వెంటఁబెట్టుకొని రాజమహేంద్రవరము వచ్చిచేరిరి. అంతవఱకును జనులు పరిపరివిధముల నూహలు చేయనారంభించిరి. కాని వరుఁడెవ్వరో

యెవ్వరికిని నిశ్చయముగా తెలిసినదికాదు. వరుఁడు గోగులపాటి శ్రీరాములుగారని తెలిసినతోడనే మా పట్టణములోని యాతనిబంధువులు మొదలయినవారు వచ్చి వివాహము చేసికోవలదని హితోపదేశములుచేసి కార్యముగానక మరలిపోవుచువచ్చిరి. వివాహము జరుగునని రూఢిగా తెలిసిన తరువాత మా పట్టణమునందు పుట్టిన సంక్షోభ మింతంతయని చెప్పుటకు శక్యము కాదు. అవఱకు నిశ్శబ్దముగనుండిన మా పట్టణమంతయు మహావాయువుచేత సంక్షోభము నొందిన మహాసముద్రమువలె కలఁగ నారంభించినది. ఎక్కడ చూచినను సభలే; ఎక్కడ చూచినను వీధులలో గుంపులుకూడి గుజగుజలాడుచుండుటలే; ఎక్కడ చూచినను కోపవాక్యములే; ఎక్కడ చూచినను బెదిరింపులే; ఈ యాకస్మికసంక్షోభములో తామంతకు మునుపు పేరులేక మూలఁబడియున్న యనామధేయు లనేకులు సుప్రసిద్ధులయినారు; వివాహములలో తోరణములు త్రెంపి పెనఁగులాడి చేతులు విఱిచి సంభావనలు గొను మహాపురుషులు సభాపతులయినారు; ఇచ్చకములాడి యింటింటఁదిరిగి బిచ్చమెత్తుకొను తుచ్ఛులు సందడిగాతిరిగి సమాచారములు తెచ్చుట కెంతో పెద్దలయినారు. వీరి యాటోపమును జూచి నా మిత్రులుసహితము కొందఱు నాతో మాటాడుటకే భయపడినారు; స్త్రీపునర్వివాహవిషయమయి తమ ప్రాణములనైన నిచ్చెదమని యితరులకు జాబులు వ్రాసి యాంతరంగికసమాజములో చేరియున్నవారు సహితము పెండ్లికి వచ్చు మాట యటుండఁగా మావీధిని నడుచుటకే జంకుపడి కార్యస్థానమునకుఁ బోవునప్పుడు చుట్టుతిరిగి మఱియొక మార్గమునఁ బోవువారైరి. మాయింట వంటచేయు పనికత్తెకూడ మమ్మాగవఱకే విడిచిపెట్టెను; పురోహితుఁడు మాయింట శుభకర్మలు చేయించుటకయి

రాక మానుకొనెను. బంధువులందఱును నన్ను పలువిధముల నిందించుచు జాతిభ్రష్టునివలె చూడసాగిరి. వివాహదినమున మా యింట మాత్రమే కాక మా యింటిచుట్టును వీధిపొడుగునను రక్షకభటులు కావలి కావలసివచ్చినది. ఇటువంటి సంక్షోభములో 1878 వ సంవత్సరము డిసెంబరు నెల 11 వ తేది రాత్రి రాజమహేంద్రవరమున మొదటి స్త్రీపునర్వివాహము జరిగినది. ఆవివాహమునకు మొదటి నుండియు నాతో నుండి పనిచేసిన మిత్రుడు రాలేకపోయినను ధైర్యశాలులును దేశాభిమానులు నయిన నా మిత్రులనేకులు తాంబూలములకు మాత్రమేకాక భోజనములకు సహితము వచ్చిరి. అట్టి యమూల్యమయిన సాయముచేసి నాకు తోడుపడి పెక్కుకష్టములకు లోనయిన వారియెడల నే నెల్లకాలమును కృతజ్ఞుడనయి యుండవలెను. వారిలోను నాకు మొదటనుండియు పరమాప్తుడయి, ఒక్క యీ కార్యమునందుమాత్రమేకాక దేశక్షేమము నిమిత్తమయి నేను చేయ తలపెట్టిన మంచికార్యములలో నెల్లను నాకు కుడిభుజమయి యుండి, పయికి పేరు నాదయినను చాటున నాకంటెను బహుగుణము లధికముగా పనిచేయుచు వచ్చుచున్న బసవరాజు గవర్రాజుగారి సాహసచరిత్రము నిచ్చట ముఖ్యముగా శ్లాఘింపవలసి యున్నది. పదిమంది యొక్కసారిగా లోకాంతరగతులయినప్పుడు పుట్టునంత సంక్షోభము ఈ వివాహదినమున వారియింట పుట్టినది. భార్యవంకవారును తనవంకవారు నయిన బంధువు లనేకు లొక్కసారిగా గొల్లున గోలపెట్టి మధ్యాహ్నసమయమున మృతుని నిమిత్తమయి యేడ్చునట్లేడ్చుచు శపించుచు లేచిపోయిరి. తల్లిదండ్రులు చిన్నతనములో పోయినప్పటినుండియు పెంచి పెద్దవానిని జేసిన పెద్దతల్లి తన్ను విడిచిపోయినను వెనుక తీయక, లోకోపకారము నిమిత్తమయి యెన్నికష్టములు వచ్చినను

సహించుకొని యుండి, భార్య దీర్ఘవ్యాధిచేత బహుమాసములు మంచ మెక్కియుండి బంధువులు రాక బహుబాధలు తటస్థించినను ప్రాయశ్చిత్తమన్న పేరున్నైనను తలపెట్టక, ఈ దినమువఱకును పరోపకారమయిన యీ కార్యమునిమిత్తము వ్యయప్రయాసములను సంతోషపూర్వకముగా వహించుచున్న యీ నామిత్రుని నెట్లు శ్లాఘింపవలయునో నేనెఱుఁగకున్నాను. ఈపక్షమునఁ జేరి వివాహసమయమున భోజనములు చేసినవారందఱును కొంచెముగానో గొప్పగానో యీ విధమయిన శ్రమల కోర్చినవారే. పలువురు విధిలేక ప్రాయశ్చిత్తములు చేయించుకొని మమ్ము విడువవలసినవారయినను వారిమనస్సు లిప్పటికిని మాపక్షముననే యున్నవనుటకు సంశయము లేదు. ఒకరు రాజకార్యముమీఁద గుంటూరు వెళ్ళవలసినవారయి యక్కడ నీళ్ళ బ్రాహ్మణులు దొరకకయు కాపురముండుట కిండ్లు దొరకకయు బహుబాధలు పొంది యిష్టము లేకయే ప్రాయశ్చిత్తమునకు లోను కావలసినవారయిరి; ఆయన భావమఱిది మఱియొక రారంభదశ యందలి కష్టముల కన్నిఁటికిని తాళి మొన్నటివఱకును మాలోనేయుండి యెదిగి యీడేరి కాపురమునకు సిద్ధముగా నుండిన తనతోడఁబుట్టిన పడుచు నత్తవారు తీసికొనిపోవనందున ప్రాయశ్చిత్త మంగీకరింపవలసినవారయిరి; మఱియొకరు పెద్దకుటుంబమగుటచేత తమకొడుకులకును కుమార్తెలకును సంబంధములు దొరకవన్న భీతిచేత ప్రాయశ్చిత్తము చేసికొనిరి. మొట్టమొదట దూరదేశముపోయి కన్యకను తీసికొనివచ్చి యెంతోపనిచేసిన నామిత్రుఁడు సహితము తన మేనమామ కాలము చేసినప్పుడు గత్యంతరములేక ప్రాయశ్చిత్తమున కొప్పుకొనవలసినవాఁడయ్యెను. కొందఱు తొందరపడి ముందుగా ప్రాయశ్చిత్తములు చేసికొన్నను, ఇటువంటి సమయములో ధైర్యము నిలుపలేక

పోయినందుకు వారిని నిందింపవలసిన పనిలేదు. మొట్టమొదటి రెండు వివాహములకు రెండుమూడు వేల రూపాయలను గవ్వలవలె వ్యయము చేసి, వివాహము లాడిన దంపతులు కాపురము లుండుటకయి గృహములను కట్టించి యిచ్చి, తరువాత స్త్రీపునర్వివాహముల నిమిత్తమయి పదివేలరూపాయ లొక్కసారి రొక్కముగా నిచ్చి, తమవ్యవహారము నం దించుమించుగా లక్షరూపాయలు నష్టము వచ్చినను, వచ్చిన నష్టమునకు కారణ మీకార్యములలో ప్రవేశించుటయే యని పామరులు ఘోషించుచున్నను లేశమును వెరుకతీయక, నేటివఱకు వివాహములు చేసికొన్నవారికిని వివాహములతో సంబంధించియున్నవారికిని సర్వవిధముల సాహాయ్యము చేయుచున్న శ్రీ పైడా రామకృష్ణయ్యగారి యంతటి ధైర్యౌదార్యశాలి సహిత మాసంక్షోభముతో మనస్థైర్యమును నిలుపలేక ప్రాయశ్చిత్తము చేసికోవలసి వచ్చినప్పుడు, బయల మిత్రులును బంధుజనులును కులమువారును బహువిధముల దూషించి బెదరించుచుండఁగా, ఇంట భార్యలును తల్లులును బహువిధముల విలపించుచు మనస్సు కలంచుచుండఁగా, మతగురువులు బహిష్కారపత్రికలు పంపి భీతి గొలుపుచుండఁగా, సామాన్యజనులు ధైర్యము నిలుపఁగలుగుదురా? ఈ సంగతి యటుండనిచ్చి వివాహచరిత్రము నించుక చిత్తగింపుఁడు.

వివాహవ్యయముల నిమిత్తమయి రామకృష్ణయ్యగారవఱకే మావద్దకు వేయిరూపాయలను పంపియుండిరి. మా పురములోని ప్రముఖు లనేకులు వివాహమునకు చాకలివాండ్రను వాద్యగాండ్రను కూడ రాకుండఁ జేయుటకయి బహువిధముల ప్రయాసపడిరి. పెండ్లిలో మేళములకు వచ్చిన వేశ్యలనుగూడ వెలివేసి వారియొద్ద నుండి కొంతసొమ్ము తీసికొనిరి. ఇటువంటి బాధలచేత మేమెక్కువ

ధనమిచ్చి పట్టణములో వాద్యములు వాయించు మంగలివాండ్ర నెల్లను పెండ్లిలో కుదుర్చవలసివచ్చినది. వీరినందఱిని వెలివేసిన పక్షమున తలలు గొఱుగువారు లేకయు శుభకార్యములయందు వాద్యములు వాయించువారు లేకయు మాకంటె తామే యెక్కువ కష్టపడవలసి వచ్చును గనుక మా ప్రతిపక్షులు బుద్ధిమంతులయి యట్టిప్రయత్న మును మానుకొనవలసినవా రయినారు. అప్పుడావఱకు పనిలేక సోమరులుగా తిరుగు బ్రాహ్మణవేషధారుల కందఱకును పుష్కలముగా చేతులనిండ కావలసినంతపని దొరికినది. కొందఱు మేము కుదుర్చు కొన్న వంటబ్రాహ్మణులయొద్దకుపోయి వాండ్రను బెదిరించియు లంచము లిచ్చియు, రాకుండఁ జేయుచువచ్చిరి; కొందఱు వివాహ తంత్రము నడుప నిర్ణయించుకొన్న పురోహితుని పట్టుకొని దూషించి భయపెట్టి మొగము చాటువేయించుచు వచ్చిరి; కొందఱు వీధుల మూలలను మాయింటి యెదుటను గూరుచుండి మాయింటికి వచ్చు వారిని మాత్రమేకాక మావీధి పట్టుకొనిపోవువారిని సహితము బహి ష్కారపత్రికలను తెప్పించుటకయి పేరులు వ్రాసికొన మొదలుపెట్టిరి. ఇటువంటి దుష్ప్రయత్నములలో విద్యావిహీనులయి వైదికవృత్తియం దున్న పూర్వాచారావలంబకులు మాత్రమేకాక యింగ్లీషునందు పాండి త్యము కలిగి పట్టపరీక్షయందును ప్రథమశాస్త్రపరీక్షయందును కృతార్థులయి మావద్ద విధవావివాహముల కనుకూలముగా మాటా డుచు స్త్రీపునర్వివాహమును తామామోదించినట్లు చేవ్రాలు చేసిన మహానుభావులుకూడ కొందఱుకూడి తామే ప్రధాననాయకులయి, తాము చదువుకొన్న విద్యకును పొందిన స్థితికినికూడ నగౌరవము తెచ్చి నందున కెంతయు చింతిల్లవలసియున్నది. పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రము తొడిగిన ట్లింతమంది యనాథకాంతలమీఁద ధ్వజమెత్తినను, ఈశ్వ

నాఁటినుండియు జనులవలని బాధ లంతకంతకు ప్రబలసాగినవి. ఈ వివాహములను చేయించినవారిని చేసికొన్నవారిని భోజనములకు పోయిన వారిని మాత్రమేకాక చూడఁబోయినవారిని సహితము పలువిధముల బాధలు పెట్ట నారంభించిరి; ఈ శుభకార్యములయందు కొంచెము సంబంధ మున్నవారి నందఱిని వారు కాపురమున్న యద్దెయిండ్లలో నుండి లేవఁగొట్టిరి; కాపురముండుట కెవ్వరు నిండ్ల నియ్యకుండిరి; నూతులలో నీళ్ళు తోడుకోనియ్యకపోయిరి; నీళ్ళు తెచ్చు బ్రాహ్మణులను త్రేకుండఁ జేసిరి; శుభాశుభకార్యములకు పురోహితులను బ్రాహ్మణులను రాకుండఁ జేసిరి; దేవాలయములకు పోనియ్యకపోయిరి; బంధువులు మొదలయిన వారిని పోకుండఁ జేసిరి; కనఁబడినచోట్ల మొగము ముందఱనే దూషింపసాగిరి; మఱియు నింక నెన్నివిధముల వారా యాస పెట్టఁగలుగుదురో యన్నివిధములను శ్రమ కలుగఁజేయ సాగిరి. అంతేకాక తాము బాధించి యెదురు తమ్మే బాధించుచున్నారని యల్లరిచేసి దొంగయభియోగములు చేయసాగిరి. అల్లరిమూక మాట యటుండఁగా మండలన్యాయసభలో న్యాయవాదిగానున్న యొకబ్రాహ్మణోత్తముఁడే యొకదినమున బొట్టు గోకివేసికొని భోజనము చేయునట్లు నటించుచు తనవెంట కొంత బ్రాహ్మణులమూకను జేర్చుకొని యొకవిజ్ఞాపనపత్రికతో దండవిధాయకునియొద్దకు పోయి వితంతువివాహవిధాయకపక్షమువారి నాయకులు దేవాలయములు దూరి తమ కనేకవిధముల తొందరలు కలుగఁజేయు చున్నారని యేడ్చుచు మొఱ్ఱపెట్టుకొనునంతటి నైచ్యమునకు లోఁబడెను. ఈ పక్షములో చేరినవారు రాజకీయోద్యోగములలో నున్నయెడల వారి మీఁద లేనిపోని దోషముల నారోపించి వారిని పనినుండి తొలఁగింప వలయుననియు మఱియొకచోటికి మార్చవలయుననియు పయి యధి

కారుల కాకాశరామన్న విన్నపములను పంప మొదలుపెట్టిరి. పాఠశాలలో నుపాధ్యాయులుగా నున్నయెడల వారి నాకొలువులనుండి తొలఁగింపవలయునని విశ్వప్రయత్నములు చేసిరి. ఈ ప్రకారముగా నుపాధ్యాయపదమునుండి ప్రతిపక్షులు తొలఁగింప పాటుపడిన వారిలో నొకరు తల్లిదండ్రులను తోడఁబుట్టినవారిని విడిచి మాతో చేరి భోజనము చేయుటయేకాక గతసంవత్సరమున వితంతువును వివాహము కూడ చేసికొనెను. ఈ బాధ లిటుండఁగా కొన్నిదినములలో ముప్పది మందికి శ్రీశంకరాచార్యస్వాములవారియొద్దనుండి బహిష్కారపత్రికలుకూడ వచ్చినవి. ఆ పత్రికలను జూచి పరమానందభరితులయి శ్రీ విజయనగరము మహారాజుగారి బాలికాపాఠశాలలో సభచేసి, ఆవల కిచ్ఛకములాడుచు చిత్తము చిత్తమని యనుగ్రహమును వేచి తిరుగు నవామధేయులుకూడ తమకంటె నెక్కువవారి పేరులను గౌరవసూచకమయిన 'గా'రను మాటయైన చేర్పకుండ నుచ్చరించి లాఘవపఱచి మహాజనమధ్యమున వారిని వెలివేసితి మనియు, శుభాశుభ కార్యములయందు వారియిండ్ల కెవ్వరును పోఁగూడదనియు, వారిని పిలువకూడదనియు, వారిని దేవాలయములకు పోనియ్యకూడదనియు కేకలువేయుచు బల్లమీఁద నెక్కి గంతులు వేసిరి. ఇటువంటి దుస్సహములయిన బాధలకు తాళఁజాలక పలువురు ప్రాయశ్చిత్తములు చేసికొనిరి. ఈ యవమానమునకు సహింపలేక, ఆత్మూరి లక్ష్మీనృసింహముగారు శ్రీశంకరాచార్యస్వాములవారిమీఁద తెచ్చిన యభియోగము కొట్టుపడిపోవుటచేతకూడ ప్రతిపక్షులు మా పక్షము వారిని మఱింత లోకువచేసి గేలిచేయసాగిరి. ఏ వంకఁ జూచినను కష్టములును వ్యసనములును చుట్టుకొనియుండి యంధకారబంధురములయి యీ దినములు స్త్రీపునర్వివాహవిధాయకపక్షమువారికి దుర్దిన

ములుగా నుండెను. ఆవఱకు వితంతువివాహములు చేసెదమని ముందుకు వచ్చినవా రావేరునైనను తలపెట్టక పిలిచినను పలుకక పలాయితులయిరి. ప్రతిపక్షులు తమకు సంపూర్ణజయము కలిగిన దనియు విధవావివాహపక్షము మరల నెప్పటిని తల యెత్తలేకుండ స్థిరముగా చెడినదనియు పరమానందహృదయులయి మిన్నందియుండిరి. మాలోని మహాధైర్యవంతులు సహిత మిఁక వివాహములు కావని యధైర్యపడి నిరుత్సాహు లయిరి. ఇటువంటి చెడుదినముల యందు సహితము మమ్ము చేయివిడువక రహస్యముగా మాకు బహు విధముల తోడుపడినవారు సహితము కొంద ఱుండకపోలేదు. వారిలో న్యాపతి సుబ్బారావుపంతులుగారు మాకారంభదశనుండియు నాలో ముందడుచు సర్వవిధముల సాయముచేసినారు. మాకు పాఠశాల యూస స్థులనేకులు పెట్టనికోటగా నుండి చేతనయిన విధముల సాగిరి. వారు; కొంద ఱెక్కడకు పొమ్మన్నను పోయి చేయుమన్న రని యడవవారెఱుఁగకుండ చేయుచువచ్చిరి. విద్యార్థులకు మా మాట యభిమానమున కొక్క చిన్ననిదర్శనము చెప్పెదను. లక్ష్మీ కొయుకల్లాయిగారు తెచ్చిన యభియోగము పోయినతరువాత శ్రీశంకరా చార్యులవారును వారిని పురస్కరించుకొనియున్నవారును మహో చ్ఛ్రాయదశయందుండి విజయగర్వముచేత మిన్నును మన్నును గాన కుండిరి. ఆ యభియోగము పోయిన మఱునాఁడు శ్రీశంకరాచార్య స్వాములవారిని మహావైభవముతో రాజమహేంద్రవరమున వీధు లలో నూరేగించుటయే కాక, ఆ వార్త తంత్రీముఖమున కాకినాడకు పంపఁగా నచ్చటివా రాలేఖను పల్లకిలో పెట్టి యూరేగించి గొప్ప యుత్సవముచేసి గొప్ప యాడంబరముతో పోయి పయిడా రామ కృష్ణయ్యవారి యంతటి ధనికునిని చెల్లుబడిగలిగినవానిని సహితము

లక్ష్యముచేయక, ఆయన గుమ్మమువద్ద చప్పటలుగొట్టి కేకలు వేసి చేయఁగలిగినంత యల్లరి చేసిరి. ఇటువంటి సంతోషదినములలో స్వాములవారు రాజమహేంద్రవరమును విడువక మా పక్షమువారికి మఱింత యవమానము కలుగుటకయి ప్రతిదినమును వాద్యములతో వీధులగుండ నూరేగుచు భిక్షలు చేయుచు కొన్నిమాసము లక్కడనే నిలిచియుండిరి. ఆ కాలములో స్వాములవారు విధవావివాహముల నెంత నిషేధించుచు వచ్చినను ఘోటకబ్రహ్మచారులయిన వారి శిష్యులుమాత్రము రండలతోడ రాత్రు లమంత్రకము లయిన వివాహములను రహస్యముగా జరపుచునే వచ్చిరి. పాఠశాలలోని విద్యార్థులు కొంద ఱీసంగతిని కనిపెట్టి యొకనాఁటిరాత్రి వేచియుండి యొక బ్రాహ్మణవిధవతో సంసారముచేయుచున్న బ్రహ్మచారి శిష్యుని పట్టుకొని, ఆ యపూర్వదంపతులను వీధిలోని కీడ్చుకొని వచ్చి యెల్లవారికిని చూపి యవమానపఱిచిరి. అందుచేత స్వాములవారి శిష్యుల కందఱికిని పాఠశాలలలోని విద్యార్థులమీఁద ద్వేషము పుట్టి, వారిబాలురమీఁద నేలాగునన్నను పగతీర్చుకోవలెనని నిశ్చయము చేసికొని యుండిరి. ఇట్లుండఁగా వారికి సమయమును వెంటనే దొరకినది. రెండుదినము లయిన తరువాత పగలు పండ్రెండుగంటలవేళ స్వాములవారి శిష్యులు గోదావరిలో స్నానము చేయుచుండఁగా, పాఠశాల విడిచినపిమ్మట విద్యార్థు లిద్దఱక్కడకు స్నానమునకు పోయిరి. వారిని చూచి యా స్వాములవారి శిష్యులు పాఠశాలలం జదువుకొను విద్యార్థుల నందఱిని కలిపితిట్టఁగా ఎవరు తప్పిదముచేసిరో వారిని తిట్టవలయును కాని మొత్తముమీఁద తిట్టుట న్యాయము కాదని యొక విద్యార్థి పుందలించినందున వాక్కలహము ముదిరి పిండివంటలు నిత్యమును తిని బలిసియున్న యాశిష్యు లాచిన్నవానిని పట్టుకొని

నిష్కరుణులయి క్రూరముగా కొట్టిరి. అప్పుడక్కడ నున్న రెండవ విద్యార్థి పాఱిపోయి యీ సమాచారమును పట్టణములో చెప్పఁగా, పాఠశాలలోని విద్యార్థు లనేకులు కూడుకొని తమ తోడిబాలకుని క్రూరముగా కొట్టినందునకై యీ దుండగపుశిష్యులను దండింపవలయు నని ప్రతిజ్ఞచేసికొని గుంపులుకూడి కోపముతో స్వాములవారున్న గృహముముందు వీధిలో తిరుగసాగిరి. విద్యార్థుల యాగ్రహమును జూచి భయపడి యీ శిష్యులు వీధిలోనికి రాక యింటిలో నడఁగి యుండుటయే కాక యిద్దఱురక్షకభటులను సహాయులుగా తెచ్చుకొని గుమ్మములో కావలి యుంచుకొనిరి. విద్యార్థు లాప్రకారముగా రాత్రి జాముపఱకును తిరిగి స్వాములవారి శిష్యు లిల్లు వెడలివచ్చు జాడ కానక విసిగి నాఁటి కిండ్లకు పోయిరి. శిష్యు లటుతరువాత సహి తము వీధిమొగముచూచుటకు సాహసింపలేక తమకు కావలసిన వస్తువులను గోడచాటుననుండి పొరుగువారిని బతిమాలుకొని తెప్పించుకొని, దాహశాంతికయి మంచినీరు కావలసిరాఁగా రాత్రి రెండుజాములవేళ నందఱును కఱ్ఱలుపట్టుకొని గుంపులుగా బయలుదేఱి యారక్షకభటులను వెంటనుంచుకొని గోదావరికిపోయి నీరు తెచ్చుకొనిరి. మఱునాఁటి యుదయమున యథాప్రకారముగా విద్యార్థులు పాఠశాలకు పోయిరి. ఆ మధ్యాహ్నము విద్యార్థులు నంతడి యంతగా వీధులలో కానరాక పోయినందున కొంతధైర్యము తెచ్చుకొని యీ శిష్యులును వీధిత్రొక్క సాహసించి యయిదాఱుగు రొకకూటమిగా చేరి బహిర్భూమికి పోవు నిమిత్తమయి రెండుమూడుగడియల ప్రొద్దుండఁగా గోదావరియొడ్డున నున్న యిసుకతిప్పకేసి నడిచిరి. ఈ సంగతి యేలాగుననో యొకవిద్యార్థి కనిపెట్టి తక్కినవారికి సమాచారము పంపెను. ఆ శిష్యులును బాహ్య భూమికిపోయి మరలివచ్చుచు గోదావరియొడ్డుననున్న ధాన్యపుపాక

లను సమీపించునప్పటికి, వారియెదుట దండధరులవలె కొందఱు విద్యార్థులు కనఁబడిరి. వారు కంటపడఁగానే గుండెలు పగిలిపోయి బెదరి ముందుకు నడువ కాళ్ళురాక బెదరిబెదరిచూచుచు నలుప్రక్క-లను చూపు నిగిడింపఁగా నానాముఖముల విద్యార్థులు గుంపులు గుంపులుగా వచ్చుచుండిరి. ఆ సంఖ్యను చూడఁగానే శిష్యులకు మునుపున్న ధైర్యముకూడ మూలముట్టుగపోయి యెదిరించుటకయి ప్రయత్నమైనను చేయక పిక్కబలము చూపి పాఱిపోవుటకు కాళ్ళకు బుద్ధి చెప్పిరి. విద్యార్థులు ముందు వచ్చువారిని పట్టుకొని పాదరక్ష ప్రయోగములచేత బుద్ధిచెప్పి దానుల మనిపించుకొని యా శిష్యులను విడిచిపెట్టిరి. ముందు పరుగెత్తినవారి యవస్థను జూచి వెనుకటివారు తాము వారి దారి పట్టక ప్రాణరక్షణార్థమయి గోదావరిలో దిగి కంఠము లోతువఱకును పాఱిపోయిరి. విద్యార్థులు కొందఱు వారిని వెంబడించి పట్టుకొని నీటిలో ముంచి లేవనెత్తి కొన్ని నిమిషములు వారి తలలను మద్దెలలనుగాఁజేసి వినోదించి తమ తోడివిద్యార్థి నన్యాయముగాఁగొట్టిన ఋణమును వడ్డీతోకూడ తీర్చుకొనిరి. ముట్టమొదట దెబ్బలుతిని తప్పించుకొనిపోయిన యిద్దఱు శిష్యులును వాయువేగమున పరుగెత్తి స్వాములవారి సన్నిధానము చేరి కన్నీటితో పాదములు కడుగుచు పురాణవిద్యాశాలలోని బాలురవలన జగద్గురువుయొక్క శిష్యులకు సంప్రాప్తమయిన కష్టపాటును విన్నవించుకొని, అక్కడనున్న రక్షకభటులతోడ కొన్ని నిమిషములలో మరల యుద్ధభూమి చేరిరి. రక్షకభటు లాశూరులతో రణరంగమును చేరునప్పటికక్కడ రెండువందల విద్యార్థులకంటె నధికముగా చేరి యుండిరి. నీటిలోనున్న విద్యార్థు లారక్షకభటులను జూచి శిష్యులను విడిచిపెట్టి తాము నీటిలో మునిఁగి యీఁది మఱియొక రేవున తేలి యింటికి

పోయిరి. చేతిలోని పాత్రలను నీటిలోఁ బోఁగొట్టుకొని యపాత్రులయిన యాశిష్యులను వెంటఁబెట్టుకొనిపోయి రక్షకభటులు వారి స్వాములవారితోఁ జేర్చిరి. స్వాములవారు శిఖాయజ్ఞోపవీతములను విసర్జించినను రాగద్వేషాదులనుమాత్రము విసర్జింపనందున శిష్యులకు సంభవించిన దుర్దశనిమిత్తమై కొంతసేపు విలపించి యావిద్యార్థులను శపించి యూరిలోనివారు తమ్ము వచ్చి ప్రార్థించి యలుకతీర్చెదరేమో యని పీఠమును విడిచి లేచిపోయెదనని వారికిని వీరికిని సమాచారములు పంపెను. ఆ రాత్రి పట్టణములో బడిపిల్లలు స్వాములవారి శిష్యులను కొట్టి చంపిరనియే ప్రవాదము పుట్టెను. అందుచేత విధవావివాహములకు ప్రతిపక్షులుగా నున్నవారు వీధులలో మొగము చూపుటకే తెగింపలేకపోయిరి. ప్రథమశాస్త్రపరీక్షనిచ్చి న్యాయవాదిగా నుండి స్త్రీపునర్వివాహనిషేధవాదులకు నాయకుఁడుగా నుండిన యొక ప్రబలగృహస్థాసమయమున చల్లగాలి నిమిత్తమై గోదావరి యొడ్డున కూరుచుండి యుండి యాశిష్యులవార్త చెవిసోఁకఁగానే యధైర్యము పుట్టి తనసేవకుని చేతిదీపము నారిపించి తలనిండ ముసుఁగు వేసికొని రాజమార్గమున నడవక ప్రాణము లరచేతిలో పెట్టుకొని సందుల గుండపోయి యిల్లుచేరి తిరిగిచూచెను. అటువంటి స్థితిలో స్వాములవారికి ముఖ్యబలముగా నున్నవారొక్కరును వారి నూరార్పుటకయి యా రాత్రి పీఠదర్శనమునకురాక, తత్క్షణ మూరు విడిచి పొమ్మని లోకగురువుల కాలోచన చెప్పిరి. విద్యార్థులు తమ విద్యాశాల నుండి రాకమునుపే స్వాములవారు మఱునాఁటియుదయమున పీఠమును మా పట్టణమునుండి తరలించి పొగయోడకు కట్టిన పడవలలో శిష్యబృందముతో తాము నదిని తరించి భిక్షలు చేయింపలేక శ్రమపడుచున్న మా పురమువారినికూడ తరింపఁజేసిరి. మొదట దెబ్బలుపడిన

విద్యార్థి స్వాములవారి శిష్యులమీఁదను, స్వాములవారి శిష్యులు విద్యార్థులమీఁదను ధర్మసభలలో నభియోగములు తెచ్చిరి; కాని దండవిధాయకుఁడు జగద్గురునిశిష్యుల కై దేసిరూపాయలు ధనదండనము విధించి ఋజువు లేనందున విద్యార్థులను విడిచిపెట్టెను.

ఇది యిట్లుండఁగా నేత్రపర్వముగాఁ జూచినను కష్టములే కనఁబడుచు, మరల వితంతువివాహము లగునన్న యాశ కవకాశము లేక, పూర్విన కార్యము అకాలనాశనము నొందిన ట్లగపడుచున్న యాకాలములో ఏలాగునన్నైనను కొన్ని కార్యములు చేసి యిటువంటి సత్కార్యము మనుష్యకుటిలప్రయత్నమువలన నిర్మూలము కానేరదని లోకమునకు చూపవలెనని మా పక్షమువారు మఱింత ధైర్యోత్సాహములతో బహుప్రయాసముల కోర్చి పనిచేయసాగిరి; కాని మొట్టమొదట మా కృషి సఫలమగునట్లు కనఁబడలేదు. ఆవఱకు తమ వితంతుకన్యలకు వివాహముచేయుఁడని మమ్ము బ్రతిమాలుకొన్న వారికడకు పోయి మేమే బతిమాలుకొనఁగా మాతో మనసిచ్చి మాటాడక పోవుటయే కాక మామీఁద కోపమును సహితము పడి, అట్టియనుచిత ప్రసంగమును చేసినందుకు మమ్ము తిట్టసాగిరి. మఱికొందఱు మమ్ము తమయిండ్లకే రానీయక పోయిరి. వివాహములనిమిత్తమయి మమ్ము ప్రార్థించిన వారొక్క బాలవితంతువుల సంరక్షకులు మాత్రమే కాక విద్యావతులైన బాలవితంతువులుకూడ మాకు పలువురు జాబులు వ్రాసి యుండిరి. ఇఁక వారితో నుత్తరప్రత్యుత్తరములు జరపి కార్యసాఫల్యము చేయవలెనని మేము ప్రయత్నింపఁగా, మా జాబులా యనాథకాంతలను చేరుటయే యసాధ్యమాయెను. ఈ సమయములో మాకు పాఠశాలలోని విద్యార్థులు చేసిన సాయ మెప్పటికిని మఱువఁదగినది కాదు. మా విద్యార్థులలో కొందఱు లోకోపకార

కార్యార్థమై యగ్నిహోత్రములో దూఁకుమన్నను దూఁకుటకు వెనుక తీయనివారుండిరి. ఆ కాలములో నిరువదిరూపాయల యుద్యోగము లోనుండి ప్రవేశపరీక్షం దేఁటి బంధుజనమును విడిచి మాలోఁ జేరి యున్న యొకరు నల్లగొండ కోదండరామయ్యగారు. నేనీ చెన్నపురము రావలెనని బయలుదేఱినప్పుడు నాకు సహాయుఁడయి వంటచేసి పెట్టుటకు సహితము పూనుకొని నేను సముద్రములోని పొగయోడను చేరుటకయి పడవ నెక్కఁబోవునప్పుడు ఝంఝూమారుతము ప్రబలముగా వీచుచు సంతతధారగా వర్షము కురియుచు సముద్రతరంగములు పర్వతోపమానములుగా నుండుటచేత మిత్రులు బహువిధముల పోవలదన్నను మానక నా వెంట సంతోషపూర్వకముగా చిన్నపడవలో సముద్రమునం దయిదుమైళ్ళు ప్రయాణముచేసి యా భయంకరస్థితిలో ధూమనౌకాధికారి యపాయకరమని యెంచి మమ్మెక్కించుకోక నిరాకరించుటవలననే వ్యసనముతో వెనుకకు మరలినసంగతి మీరు విన్నయెడల విద్యార్థు లెంతటి ధైర్యోత్సాహములును విశ్వాసమును కార్యనిర్వహణాసక్తియు లోకోపకార చింతయు కలవారయియుండిరో మీరే తెలిసికోవచ్చును. వారే యర్ధరాత్రమున నెంతిదూరమున నున్న యే గ్రామమునకుఁ బోయి యెవ్వరితో మాటాడి యే కార్యమును చేసికొనిరమ్మన్నను మాఱుమాటచెప్పక చెప్పినట్లు చేసికొని వచ్చుచుండిరి. ఇటువంటి తోడ్పాటు చేతనే మే మనేకకార్యములు నిర్వహింపఁ గలిగితిమి.

ఈ కాలములో మా పట్టణమునకు నాలుగామడలదూరములో నున్న పెద్దాపురములో చదువుకొన్న యొక మాధ్వబాలవితంతు వుండెను. ఈ చిన్నదానిని వివాహమాడుటకు కాకినాడలో నొకయుపాధ్యాయుఁ డొప్పుకొనెను. తల్లిదండ్రులావలఁకు వివాహము చేయుట

నుద్దేశించి యుండినను, అప్పుడు పుట్టిన సంక్షోభమునకు జడిసి మే మెన్నివిధములచేత చెప్పినను వినక పోయిరి. చిన్నది పదియాఱుసంవత్స రములు దాఁటినదగుటచేతను, ఆ చిన్న దానకే తనయభిమతమును తెలిపియుండుటచేతను, ఆచిన్నదానితోనే స్వతంత్రముగా నుత్తర ప్రత్యుత్తరములను జరపుట యుక్తమని తలఁచితిమి. కాని తల్లిదండ్రు లును బంధువులును విరోధులుగా నుండుటచేతను, వారిసంగతి నా వఱకే యెఱిఁగినవారగుటచేత భద్రముగా కాచుచుండుటచేతను, మాకాపని యొకపట్టున సాధ్యమయినదికాదు. అయినను స్త్రీపున ర్వివాహపక్షమునం దత్యంతాభిమానము కలిగి ఆ కాలమునందు పెద్దా పురములో నుండతటస్థించిన యొకమిత్రుని సాహాయ్యముచేత మే మాచిన్నదానియింట పనిచేసెడి యొకకుఱ్ఱవానిగుండ నుత్తరప్రత్యు త్తరములను జరపనారంభించితిమి. వయస్సులో నున్నవారికి నిరంతర వైధవ్యదుఃఖమునకంటె మరణమే శ్రేష్ఠముగా నగుపడును గనుక, తానేలాగునసైన దుస్సహబాధనుండి బయలపడి సుఖింపఁగోరి యా చిన్నదే తన్నుఁ గొనిపోవుటకుఁగల వివిధమార్గములను మా కుపదే శించినది. ఆమె చెప్పిన యుపాయము ననుసరించి తగినంతమందిని పల్లకి మోచువారిని నియమించి, ఆ పల్లకితో మామిత్రుని నొకనిని కొందఱుభటులను సాయమిచ్చి పంపి సంకేతస్థలమున రాత్రివేళ ఆచిన్నదానిని కలిసికొని యామెను పల్లకిలో నెక్కించుకొని తెల్లవారు నప్పటికి రాజమహేంద్రవరము తీసికొనివచ్చి విడుచునట్లు తగిన యేర్పాటు లన్నియు చేసితిమి. కాని యా సంగతి యేలాగుననో కొంచెము పొక్కి ఆ చిన్నదాని బంధువులకు ముందుగా తెలియఁగా వారు జాగరూకులయి యుండుటచేతను, అక్కడకుపోయిన మా మనుష్యుల తెలివితక్కువచేతను, ఆ యేర్పాటు లేమియు తిన్నగాజరగక

వ్యయప్రయాసములకు లోనయి మావారు పోయిన దారినే వట్టిచేతు లతో మరల రావలసినవారయినారు. అటుమీఁదట మేము చేసిన ప్రయత్నమును చిన్నదానిపేరును సమస్తజనులకును వెల్లడియయి పోయినవి. ఎల్లవారును ఈ వివాహమునకు విఘ్నము కలుగఁజేయుట కయి చేయవలసిన ప్రయత్నముల నన్నిటిని జేసిరి. అయినను మా యుత్తరప్రత్యుత్తరములసంగతి మాత్ర మెవ్వరికిని తెలియక మిక్కిలి రహస్యముగానే యుండినది. అందుచేత మేము మఱియొక యుపా యము నాలోచించి మా వర్తన మెవ్వరికిని భేద్యము కాకుండునట్లు గోప్యముగా నిర్వహించి పరమనిపుణుఁడును మాకు పరమవిశ్వాసియు నయిన యొకమనుష్యుని పెద్దాపురమునకుఁ బంపితిమి. అతఁ డెవ్వరికి ననుమానము కలుగకుండ మార్గస్థునివలె నటించి రాత్రి వారివీధి యరుగుమీఁదనే పరుండి తనసందేశము నాచిన్నదానికి తెలిపి నేర్పుతో పనిచేసెను. అమావాస్యనాఁడు రాత్రి రెండుజాములవేళ మబ్బుపట్టి చినుకులు పడుచుండఁగా తనతండ్రికి తలనొప్పి వచ్చుట చేత నుపచారములు చేయుచున్న తల్లి మొదలయినవారి నేమఱించి లఘుశంకకు పోవుమిషమీఁద వీధిలోనికి వచ్చి యాచిన్నది మా మను ష్యునితో తాను వచ్చుటకు సిద్ధముగా నున్నసంగతి తెలిపెను. అతఁడు వెంటనే యాచిన్నదానిని వెంటఁగొని బయలుదేఱి యా చిన్నదాని కావలకు తీసికొనిపోయిన బట్టలుకట్టి పురుషవేషమువేసి, పగలు చూచు కొనివచ్చిన మాఱుమూలదారిని గాఢాంధకారములో, వానలో తడి యుచు పరుగెత్తి కొంతదూర మాచిన్నదానిని నడిపించియు కొంత దూర మెత్తుకొని మోచియు తెల్లవాఱునప్పటికి రెండామడలు నడచి, అక్కడ బండిచేసికొని మఱునాఁడు రెండుజాములవేళ నామెను మా యింటికిఁ జేర్చెను. ఆచిన్నది యిల్లు దాఁటిన నాలుగైదు నిమిషముల

కొల్లను తల్లి మొదలయినవా రామె పోయిన సంగతిని కనిపెట్టి చుట్టు పట్ల వెదకనారంభించిరి. ఆమె యింకునిమిత్తమే పోయినదని వారు గ్రహించి బంధువులతోడను పొరుగువారితోడను చేరి నానాముఖ ముల పరుగెత్తి యన్నిదారులను వెదకి యెక్కడను కానకపోయిరి. అంతట వారందఱు నాలోచించుకొని నగలెత్తుకొని పాఱిపోయిన ట్టాచిన్నదానిమీఁద పోలీసువారివద్ద ఫిర్యాదుచేసి యామెను పట్టు కొనుటకయి యారాత్రియే వారంటు పుట్టించుటయేకాక, ఆచిన్న దానిని దొంగిలించితిమని మామీఁద నేరమును మోపి దండవిధా యకునివద్ద నొకయభియోగమును దెచ్చిరి. మఱునాఁడీసమాచారము నాకు తెలియఁగానే వారంటు తప్పించుటకయి పోలీసు సూపరింటెం డెంటుగారింటికి పోఁగా, ఆయన కాకినాడకు పోయినట్టు తెలిసినది. అప్పు డింటికివచ్చి పోలీసిన్స్పెక్టరును నేను మరల వచ్చుపర్యంతమును వారంటుమీఁద చిన్నదానిని పట్టుకొనకుండునట్లు ప్రార్థించి వెంటనే బయలుదేఱి పడవమీఁద మఱునాఁటి మధ్యాహ్నమునకు కాకినాడచేరి యక్కడ విచారింపఁగా పోలీసు సూపరింటెండెంటు పెనుగుదు రను గ్రామమునకు పోవునట్లు తెలియవచ్చినది. అప్పుడు వ్యసనము మఱింత యధికమయి భోజనము లేని విచారమును మఱచి పెనుగుదురు పోవుటకయి ప్రయత్నించుచుండఁగా పోలీసు సూపరింటెండెం టప్పుడే మరలవచ్చి కాలువలో పడవమీఁద నున్నట్టును మఱిగంట సేపటిలో చామర్లకోటకు పోవునట్లును వర్తమానము తెలిసినందున, ఆయెండలో పరుగెత్తి సాయంకాలము నాలుగుగంటలవేళ కాలువ మీఁదిపడవలో ఆదొరగారిని సందర్శించి సంగతి విన్నవించుకొనఁగా నతఁడాచిన్నదానిని పట్టుకొనకుండ పోలీసుఉద్యోగస్థుల కుత్తరువు పంపెద ననిచెప్పి నన్ను పంపివేసెను. ఇఁక పెండ్లికొమారుని తీసి

కొనిపోవలసినపని మఱియొకటి యున్నది. అందుచేత నే నక్కడినుండి తిన్నఁగా హిందూపాఠశాలకుఁబోయి యక్కడ నుపాధ్యాయుఁడుగా నున్న యాతనిని కలిసికొని రమ్మని పిలువఁగా, అతఁడీ యభియోగము వలనను జనులవలని భీతివలనను కొంతజడిసి నావెంట రాకుండుట కయి కొన్నిసాకులు చెప్ప మొదలుపెట్టెను. కాని, నేనన్నిటికిని తగిన పరిహారములు చెప్పి యక్కడనుండియే తిన్నఁగా నే నాతనిని బల వంతముగా పడవవద్దకు తీసికొనిపోయి నా గదిలో కూరుచుండఁబెట్టు కొనఁగా, అతఁడు నన్ననేకవిధముల ప్రార్థించియు నేను పూనిక విడువ నందున నామాట తీసివేయలేక నాతోవచ్చి మఱునాఁడు తెల్లవాఱిన తరువాత బట్టలన్నియు నా గదిలో యుంచి లఘుశంకకు పోయి వచ్చెదనని నాతో చెప్పి పడవదిగి వెనుకకు పాఱిపోయెను. నేను మాత్రము నాఁడు మధ్యాహ్నము రెండుగంటలకు రాజమహేంద్రవ రముచేరి ముందుగా తంతివృత్తాంతకార్యస్థానమునకు పోయి పెండ్లి కొమారుని చర్యను కాకినాడలోని నా మిత్రులకు తంత్రీముఖమున తెలిపి యింటికి పోయి మూఁడవనాఁడు మధ్యాహ్నము మూఁడుగంటలకు భోజనము చేసితిని. తరువాత కాకినాడకు మనుష్యులను బంపి పెండ్లి జరగకుండ చేయుటకై వివిధనూూపాయములను పన్నుచున్న విరో ధుల ప్రయత్నముల కన్నిటికిని ప్రతిక్రియలుచేసి ఇదే సమయమని పెండ్లికొమారుని బాధింప నెంచిన ఋణప్రదాతలనుండి యాతనిని విముక్తిని జేసి తుదకాతనిని రాజమహేంద్రవరమునకు మఱల రప్పిం చితిమి. పెండ్లికొమారుని ఋణవిముక్తిని చేయుటకై యప్పుడిచ్చిన రెండువందలరూపాయలును తప్ప పెండ్లికొమాళ్ళ కెవ్వరికి నిందు నిమిత్తమయి చిల్లిగవ్వయైనను లంచ మియ్యలేదు. వితంతువులను వివాహమాడిన పాఠశాలలోని విద్యార్థులందఱును లోకోపకారా

ర్థము పరిశుద్ధచింతతోనే వివాహములు చేసికొనిరి కాని యెంతమాత్ర యును ధనాశచేత కాదు. అటుతరువాత పెండ్లికొమూర్తె యొక్క తల్లి మొదలగు బంధువులు మా యింటికివచ్చి యేడ్చియు కేకలు వేసియు బెదరించియు బుద్ధులుచెప్పియు బ్రతిమాలియు వాగ్దానములు చేసియు, పెండ్లికొమూర్తెను మరల తీసికొనిపోవుటకై నానావిధముల పాటు పడిరి. కాని వారిప్రయత్నములన్నియు విఫలములైనందున వారు నిరా శులై వెనుక మరలవలసినవారయిరి. అటుపిమ్మట పెండ్లికొమారుని యొక్క యన్నగారును రాజమహేంద్రవరమువచ్చి మంచిమాటలుచేత నాతనిని తీసికొనిపోవలెనని యెన్నో యుపాయములు చేసెను. గాని యాతని యుపాయములును సఫలములైనవి కావు. అటుతరువాత వివాహమగువఱకును పెండ్లికొమారుఁడు మరల పాఱిపోకుండ కంటికి రెప్పవలె నొకరు విడిచి యొకరము కాచి, ౧౮౮౨ వ సంవత్సరము అక్టోబరు నెలలో బహుకష్టముమీఁద మూఁడవ వివాహమును నిర్వ హింపఁగలిగితిమి. ఈ వివాహమునకు మాకు మొదటివివాహమున కంటెను పదిరెట్లు ప్రయాసమెక్కువయ్యెను. మొదటివలెనే యిప్పు డును రక్షకభటులు మాయిల్లుకావలికాయవలసివచ్చెను. ఈవివాహము నకు విశేషవ్యయముచేసి మొదటికంటె నధికవైభవముతో జరపి తిమి. ఇంత ధనవ్యయము చేసినను, ఇంతమంది రక్షకభటులు కావలి కాచినను ఉత్సవసమయమునందు దుష్టులు కొందఱు పెండ్లిపల్లకిమీఁద రాళ్ళు విసరిరి. ఆవల విమర్శమీఁద ప్రతిపక్షు లావఱలో తెచ్చిన యభియోగము లన్నియు కొట్టుపడిపోయినవి. ఈ వివాహముతోనే ప్రతిపక్షుల గర్వము సగమడఁగినది గాని తరువాత జరిగిన నాలవ వివాహముతో పూర్ణముగా గర్వభంగమైనది. ఈ వఱకు జరగిన వివాహములు మూఁడును లౌకికులుగా నుండు నియోగిబ్రాహ్మణుల

లోను మాధ్వబ్రాహ్మణులలోను జరగినవి; వైదికులలో మాత్ర మా వఱకు జరగలేనందున వారది గొప్పప్రతిష్ఠగా చెప్పకొనుచు తమ వారిలో నట్టివివాహము జరుగుట యసాధ్యమని దంభములు పలుకుచువచ్చిరి. కాకినాడలో ను తమవైదికకుటుంబమునందు పుట్టి చదువుకొన్న యొకబాలవితంతు వుండెను. ఇట్లు వివాహములు జరుగుచుండుట విని యీామె మనస్సులో తానుగూడ వివాహమాడుట కెంతో యభిలాషపడుచుండెను. ఆమెయింటియెదుటనే కాపురమున్న యొక పెద్దమనుష్యుఁడీసంగతి కనిపెట్టి, అతఁడీకార్యములయందు విశేషాభిమానము కలవాఁడగుటచేత మెల్లగా ఆ చిన్నదానితో మాటాడి మా కా సంగతి తెలియఁబఱచెను. మేమును తగినప్రయత్నములను చేయుచుంటిమి. ఇట్లుండఁగా నొకనాటిరాత్రి పదిగంటలవేళ నొక యూరేగింపుమహోత్సవము జరగుచుండఁగా దానిని చూచుటకయి యా చిన్నది వెలుపలికి వచ్చి నా మిత్రునిజూచి తన్నిప్పుడు రాజమహేంద్రవరము పంపఁగలరా యని యడిగెను. అతఁడాప్రకారము చేసెదనని చెప్పి యా నిముషమునందే మూడవవితంతువివాహము చేసికొన్న మా మిత్రునితోఁ గలిసికొని పల్లకిని సిద్ధముచేయించి యా రాత్రివేళనే రాజమహేంద్రవరమునకు పంపిరి. తెల్లవాఱునప్పటి కాకస్మికముగా పల్లకివచ్చి మా గుమ్మములో దిగఁగా, మే మా చిన్న దానిని లోపలికి తీసికొనిపోయి భద్రముగా నుంచితిమి. ఆ చిన్నదాని యన్నగారును మేనమామలును బంధువులును లౌకికోద్యోగములయం దుండి ప్రబలులుగా నున్నవారు; పినతండ్రులు మొదలైనవారు కొందఱు యజ్ఞాదిక్రతువులుచేసి పండితు లనిపించుకొనుచున్న శిష్ట సంప్రదాయములోనివారుగా నున్నవారు. ఆమె మేనమామ లా రాత్రియే రాజమహేంద్రవరముననున్న బంధువులకును పోలీసువారికిని

తంత్రీవార్తలు పంపుటయేకాక మఱునాఁడు పడవమీఁద బయలు దేఱి తామే రాజమహేంద్రవరమునకు వచ్చిరి. వారువచ్చి చిన్నదానిని తమవెంట రమ్మని బహువిధముల బ్రతిమాలుకొనిరి. కాని చిన్నది వారి కోరిక చెల్లింప నంగీకరింపనందున మంచివరుని జూచి వివాహము చేయుమని యామెను నా కొప్పగించి తమయూరికి పోయిరి. ఆ చిన్న దానికి వివాహము చేయ నుద్దేశించి యామె యన్నగా రావఱకు నాతో ననేకపర్యాయములు మాటాడి జాబులు వ్రాసినవాఁడే యయినను, బహిష్కారపత్రికలు మొదలైనవి వచ్చిన తరువాత వెనుకతీసి తాను కార్యము చేయుటకు సాహసింపలేకపోయెను. ఈ చిన్నదానిని వివాహ మాడిన యాతఁడును శుద్ధశ్రోత్రియవంశమునందు పుట్టి వైదికవృత్తి యందున్న యన్నలను తండ్రిని కలిగియున్నవాఁడు. దేశాభిమానము కలిగి యిట్టి జనక్షేమకరములైన కార్యములయం దుత్సాహము కలిగి సర్వవిధముల నాకు సహాయములుగా నుండిన విద్యార్థులలో నితఁ డొకఁడు. ఇతఁడు (పులవర్తి శేషయ్యగారు) సర్వకళాశాలాప్రవేశ పరీక్షాసిద్ధుఁడయి యిప్పుడు మండలన్యాయసభయం దుద్యోగములో నున్నవాఁడు. ఇటీవల నే నీతని నొకవితంతుకన్యను తీసికొనివచ్చుట కయి పంపినప్పుడు వారివస్తువులను మోసికొని వచ్చుటకయి కూలి వాఁడు దొరకకపోఁగా, లేశమయినను వెనుకతీయక యభిమానమును విడిచి కార్యసాధనమే ముఖ్యప్రయోజనముగా నెంచుకొని తానే కావడిని కొన్నిక్రోసులు మోచుకొనివచ్చి కార్యమును నిర్వహించిన వాఁడు. ఇతఁడొకపర్యాయము తండ్రి తనకు వివాహముచేయ సిద్ధ పడినప్పుడు వితంతువివాహమునిమిత్తమే తా నా వివాహమును నిరాకరించిన ధైర్యశాలి. ఇతఁడును, నాతో చెన్నపురికి రా ప్రయాణ మయి తరువాత పడవవితంతువివాహమాడిన యాతఁడును, మొట్ట

మొదట స్వజాతివితంతువులు దొరకకపోవుటచేత నింతకాలము నిలిచి యున్నవారేకాని దొరకినయెడల వీరే వితంతువివాహమునకు ప్రథము లుగా నుండవలసినవారు. ఈ నాలవవివాహ మయినపిమ్మట ప్రతి పక్షులు తమ ప్రయత్నములవలన కార్యములేదని తెలిసికొని నిరు త్సాహులయి ప్రత్యక్షముగా బాధించుటకును కార్యవిఘాతము చేయ పాటుపడుటకును మానుకొని యుపేక్షాపరులు కాసాగినారు. మేము విశేషప్రయత్నము చేసినదీ నాలుగువివాహముల వఱకేకాని తరువాత దంపతులు తమంతట తామే ధా మొదలుపెట్టినారు. ఇప్పటికి మా సమాజముయొక్క యాదరణముక్రింద పంద్రెండు స్త్రీపునర్వివాహములు జరిగినవి. వైశ్యు లిట్టికార్యములకు సాహసించుట పరమాద్భుతమే యయినను, ఈ జరగిన వివాహములలో రెండు వైశ్యస్త్రీపునర్వివాహ ములుకూడా నున్నవని తెలుపఁగలిగినందులకు నా కెంతో సంతోష ముగానున్నది. ఈ వివాహములైన వారందఱు సంచుమించుగా సుఖు లయియే యున్నారు. కొందఱి కీవఱకే సంతానము కలిగినది; మఱి కొందఱికి కలుగనున్నది. బహుప్రయాసముతో నాటిన సత్కార్యబీజ మీ ప్రకారముగా కొమ్మలెత్తి పుష్పించి ఫలించి దినదినాభివృద్ధి చెందుచుండఁగా చూచుట యా వృక్షమును నాటినవారి కెంతసంతోష కరముగా నుండును! మధ్య వేయికష్టములు వచ్చినను కార్యసాఫల్య మయినతరువాత తొంటిప్రయాసమేదియు గణనకురాదు. పదిమంది చేరినతరువాత కొన్ని మనస్తాపములును చిక్కులును గలుగక మానవు. గాని చేసినమహాకార్యమును తలఁచుకోఁగా, అవి యెంతమాత్రమును గణనకు తేఁదగినవిగా నుండవు. కొందఱు ధనాశాపరులుగా నుండి పలుమిమలమీఁద తొందరలు కలుగఁజేయవచ్చును; కొంద అవివేకము చేతను కొందఱు దుస్స్వభావముచేతను తగవు లాడవచ్చును. ఆరంభ

ములో మాకింకను బహువిధములయిన చిక్కులు తటస్థించినవి. మమ్ము కొందఱు మోసముచేసి సొమ్మపహరించినవారును ఉన్నారు. మొదటి రెండువివాహములు నయినతరువాత బహువిధమనస్తాపములు సంభవించిన కాలములోనే వివాహితయైన రెండవవితంతుకన్యయొక్క తండ్రి లోకాంతరగతుఁడగుట తటస్థించెను. అప్పుడు వాహకు లెవ్వరును దొరకకపోయినను మాలో మేమే శవమును స్మశాన వాటికకు తీసికొనిపోయి దహనసంస్కారము జరిగించి, పుస్తకము చూచి చదివి యపరక్రియలను నేనే జరగింపవలసినవాఁడ నయినాను. వంటబ్రాహ్మణులు మొదలయినవారు బెదరించి లేచిపోవుచు రాఁగా, అటుతరువాత జరగిన యయిదవవివాహమునకు నాభార్యయే గోదావరి నుండి నీళ్ళు మోచుకొనివచ్చి వంట మొదలయిన పనులెల్లను నిర్వ హింపవలసిన దాయెను. ఇట్టికష్టములను నివారించుటకై మేము సాధ్యమయినంత ప్రయత్నముచేసి ఆఱవవివాహమును వంటలు మొద లైనవి చేయఁగలిగిన బ్రాహ్మణునకే చేసి వంటబ్రాహ్మణులవలని బెద రింపులను తప్పించుకోఁ గలిగితిమి. ఏడవవివాహమే మొదటికోమటి వివాహము. మూఁడవదైన మాధ్వవివాహము జరగినప్పుడు పల్లకి చుట్టును రక్షకభటులు కావలియున్నను రాళ్ళురువ్వినకాలము పోయి, ఏడవదయిన యీ కోమటివివాహము జరగినప్పటికి రక్షకభటుల సాహాయ్య మక్కఱలేకయే దంపతులను రాత్రివేళ వీధులగుండ నిర్భ యముగా నూరేగింపఁగలిగిన కాలము వచ్చినది. ఎనిమిదవవివాహము నేను దంపతుల నిక్కడకు తీసికొని వచ్చుటచేత ఈ పట్టణమునందే జరిగినది. తొమ్మిదవవివాహమే రెండవ కోమటివివాహము. పదవ వివాహము రాజమహేంద్రవరములో జరపిన బ్రాహ్మణవివాహము. తరువాతి రెండువివాహములును కొన్నిమాసములక్రిందట బళ్ళారిలో

జరుపఁబడినవి. మా సమాజమువారే తాము ధనవ్యయముచేసి యీ చెన్నపురియందును బళ్ళారియందునుకూడ వివాహములు చేయించు టనుబట్టి చూడఁగా, ఒక్క మాపట్టణమునందేగాని మా మండలము నందేకాని తెలుఁగుదేశమునందు మాత్రమే కాని వివాహములు చేయించుట మా సమాజోద్దేశము కాదనియు ధనమున్నయెడల నీ చెన్నపురి రాజధాని క్రింది దేశములలో నెక్కడ జరగినను వివాహములకు తోడుపడుటయే మా యుద్దేశమనియు మీకు తేటపడి యుండవచ్చును. మేము మాప్రాంతముల జరగిన వివాహములలో నొక్కరికిని లంచ మియ్యలేదని యీవఱకే చెప్పియున్నాను. మూడవ వివాహమునకు పెండ్లికొమారుని ఋణవిముక్తునిగాఁ జేయుటకయి యిచ్చిన రెండు వందలరూపాయిలును గాక మఱిరెండువందలరూపాయలిచ్చి అప్పులవా రమ్ముకొనిపోవ సిద్ధముగా నున్న రెయికపొలమును విడిపించి యిక్కడ వివాహమయిన యెనిమిదవదంపతుల కియ్యవలసి వచ్చినది. మేము రొక్కముగా నిచ్చిన సొమ్మింతే. తక్కినది వివాహవ్యయములక్రిందను, పెండ్లికూఁతుల కిచ్చిన రెండేసివందలరూపాయల యాభరణముల క్రిందను, దక్షిణలక్రిందను, బట్టలు మొదలయిన వానిక్రిందను, ఈ నూతనదంపతులు కాపురముండుటకై కొన్న యిండ్లక్రిందను వ్యయ పడిపోయినది. వివాహములనిమి తమై ... తీసికొని వచ్చినప్పు డొక్క ... వేర్వేఱ దంపతుల నిక్కడకు ... ప్రయాణవ్యయములకే మూడు నాలుగువందల రూపాయ ... ఆ తరువాత నీప. ఇవిగాక ప్రతిమాసమును పురోహితునియొక్కయు వంటబ్రాహ్మణులయొక్కయు జీవితములకును పాఠశాలలం జదువు కొను వివాహితుల భరణమునకును పుస్తకాదులకును కొంతవ్యయము చేయవలసి యున్నది; ఈ వ్యయములన్నియు శ్రీ పైడా రామకృష్ణయ్య గారు మహోదార్యముతో మా సమాజమునకు దయచేసిన పదివేల

రూపాయలతోనే జరుపఁబడినవి. ఈయన సాహాయ్యమే లేకయుండిన యెడల మేమిందులో నొక్కవివాహమునైనను జేయుటకు సమర్థుల మయియుండము. కాఁబట్టి యీవివాహముల కంతకును మూలాధార మీ మహాపురుషుఁడేయని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈయన కీమధ్య లక్షయేఁబదివేలరూపాయలు నష్టము వచ్చినను, ఇప్పటికిని బహువిధముల నీమహాకార్యములకు తోడుపడుచునే యున్నాఁడు. ఈ పదివేలరూపాయలును గాక మొదటి రెండువివాహములకు నయిన సమస్తవ్యయములను వహించుటయేకాక, ఈయనయే కొన్నిగృహ ములను సహితము పునర్వివాహదంపతులు కాపురముండుటకయి సమాజమువారి వశమున నుంచియున్నాఁడు. పరోపకారశీలుఁడయిన యీ దయాశాలియొక్క యీ యోగ్యదానమును నేను వర్ణింపవలసిన పనిలేదు. ఈ యిచ్చినధనము పోయినను, తనువులు పోయినను, మఱి యేమి పోయినను, ఈయన కీర్తి యీభూమండలములో స్థిరముగా నుండకపోదు. నావంటివారు కొందఱు పనిముట్లవలె కొంత యుప యోగపడినను, ఈ కార్యవ్యాపనమున కీతనుఁడే ముఖ్యకారణుఁడు. మన హిందూదేశమునందలి ధనికులలో నిటువంటి పరోపకారచింత గల దానశీలురు మఱిపదిమంది యున్నయెడల నీభరతఖండ మత్యల్ప కాలములోనే తొల్లింటి మహోన్నతదశకు వచ్చి బాగుపడుననుటకు సందేహము లేదు. ఇటువంటి లోకోపకారధురీణు లనేకులు శీఘ్ర కాలములోనే మన దేశమున కలంకారభూతులుగా జనించి యీ భరత ఖండముయొక్క పురోభివృద్ధికి తోడుపడుదురుగాక !

దేశాభివృద్ధికి హేతుభూతమయి లోకోపకారకమయిన యీ కార్యమునకు తోడుపడి, దుస్సహవైధవ్యదుఃఖములపాలయి గతి గానక బాధపడుచున్న యనాధయువతులను సాధ్యమయినంతవఱకు

దుఃఖసముద్రములోనుండి రక్షించుటయే దేశాభిమానలేశము గల పుణ్యపురుషుల కందఱికిని మహార్హకృత్యమన్న సంగతి మీవంటి వివేకులకు నేనిప్పుడు చెప్పవలసిన యావశ్యకము లేదు. అందఱును శ్రీ పైడా రామకృష్ణయ్యగారివలె వేలకొలఁదిరూప్యముల నిచ్చుటకు శక్తులుకారు; బంధువులు మొదలయిన వారిని త్యజించి కులజనులకు విరోధులయి లోకోపకారార్థమయి యిట్టి కార్యములలో ప్రవేశించి పనిచేయుటకును నెల్లవారును శక్తులు కారు. అయినను తమకిష్టమున్నయెడల తోఁచిన ధనప్రదానముచేసి బొత్తిగా సహాయపడలేని వారుమాత్ర మొక్కరును ఉండరు. ఇప్పుడు కార్యముల నిమిత్త మనేకులు క్రొత్తవారు వచ్చుచున్నారు; రెండుమూడు కార్యము లీవఱకే సిద్ధముగా నున్నవి. కేవల ధనలోపముచేతనే వాని నిప్పుడు నిర్వహించుటకు మేము శక్తులము కాక యున్నాము. ఇంతేకాక యీవఱకు వివాహములు చేసికొన్నవారికిని కొన్నివిధముల సాహాయ్యములు కావలసియున్నవి. మీవంటి విద్యాధికులు తెలిసివా రింతమంది దేశమందంతటను నిండియుండఁగా ధనాభావమువలన కార్యములు కాకున్నవన్న నిందమాత్రము రాదని దృఢముగా నమ్మి యున్నాను; నా విశ్వాస మెంతవఱకు సత్యమో ముందు చూడవలసియున్నది. ఈ దేశాభిమానులందఱు నొక్కొక్క రూపాయచొప్పున నిచ్చినను మొత్తముమీఁద వేలకొలఁది రూపాయలు పోగుపడవచ్చును. సంఘమునం దెంతశక్తియైన నున్నదికదా? శక్తికొలఁదిని మీవంటివా రీవిషయమున తోఁచినంత ధనసహాయ్యమును చేసినయెడల, అందువలన నెవ్వరికిని నష్టము కలుగదు గాని యనేక బాలవితంతువులను దుర్భరసంతతవైధవ్యబాధలనుండి తొలఁగించి కాపాడి లోకమునకు మహోపకారము చేయవచ్చును. ఎవ్వరికిని భారముగా నుండని యీ

యుత్తమకార్యమునకు మీరు తోడుపడెడు పక్షమున, ఇంతవఱకును కాయకష్టపడి శ్రీ పైడా రామకృష్ణయ్యగారి ధనముతో చేసిన పనినే నేఁటినుండి మీ ధనముతో చేసి చేతనయినంత కృషి చేసి మీ ధనము సార్థకపడునట్లు సాధ్యమయినన్ని వివాహములను జేయింపఁ బ్రయత్నించెదను. ధనసాహాయ్యమును శరీరప్రయాసమును లేని వాగ్రూపకమయిన దేశాభిమానముతో లేశమును ప్రయోజనము లేదు. కార్యములు లేని మాటలుచేత నీవఱకే మనదేశము మిక్కిలి చెడియున్నది. ఇఁకముందట్టి చెఱుపు మఱేమియు కలుగకుండునుగాక! నేనిప్పుడు మీవంటివారివద్ద చేసెడు ప్రార్థన వృథా పోదను నమ్మకముతో, మీకు తోఁచినంత ధనసహాయ్యమును నెలచందాలను దయచేసి కార్యనిర్వహణ భారమును మీరు వహింతురని మఱిమఱి వేఁడుచున్నాను. దైవము మీమనస్సులయందు చొచ్చి, దిక్కులేని లెక్కలేని యనాథయువతులను రక్షింప సహాయపడిన పుణ్యము మీకు దక్కించునుగాక!

స్త్రీపునర్వివాహ విషయకోపన్యాసము

రచయిత:

కందుకూరి వీరేశలింగంపంతులు

★

ప్రకాశకులు:

హితకారిణీసమాజము,
రాజమహేంద్రవరము.

1950

[వెల రు 0-6-0

స్త్రీపునర్వివాహ విషయకోపన్యాసము

అ స్మ ద్దే శీ యు లా రా!

ఈదినమున నేనుపన్యసింపఁబూనిన విషయము మీకు వినుటకును నాకు చెప్పుటకునుకూడ నెంతమాత్రమును సహ్యముకానిదే. ఈ విషయము వినుటకు మీకెంత భారముగా నుండునో చెప్పుటకు నాకు నంతభారముగానే యుండును. కాని యీపని మనకెంత సంతాపకరమయిన దయినను మనప్రయత్నమువలన దురంతమైన మానుషసంతాపము కొంతవఱకైనను తొలఁగవచ్చునన్న యాశకనఁబడుచున్నంతవఱకును మనమీవిషయమున కొంచెమైనను విముఖులము కాఁగూడదు. మనమీ లోకములో జన్మమెత్తినది న్యాయపక్షము నవలంబించి కొంచెముగానో గొప్పగానో యన్యాయముతో ప్రతిదినమును పోరాడుచు సాధ్యమైనంతవఱకు న్యాయమును సేవించి సుఖాభివృద్ధిచేయుటకొఱకే. అన్యాయమెంత కాలమునుండి నిరంతరాయముగా సాగుచున్నను, ఒకానొకప్పుడది యెంతప్రబలముగా కనఁబడినను, ప్రముఖు లెంతమంది దానిని చేపట్టియున్నను, న్యాయమునకంటె నన్యాయమునకెక్కువ శక్తివచ్చునని మాత్రము మీరుస్వప్నావస్థయందును నమ్మఁబోకుఁడు. న్యాయస్వరూపుఁడైన సృష్టికర్తయే యొకఁడుండి యతఁడే యీలోకవృత్తమును నడిపించుచు పరిపాలించుచున్నంతవఱకు భూమిమీఁద న్యాయమునకట్టి దుర్గతియెన్నఁడును పట్టనేరదు. లోకములో నన్యాయమెప్పుడు ప్రబలి యున్నతస్థితిని పొంది దుస్సహమగునో యప్పుడే మానవకోటియందు దానిని నిర్మూలింపవలెనన్న బుద్ధి యుదయించి తదనుకూలమైన యుత్సాహమును రోషమును సాహసమును ధైర్యమును పూనికయుపుట్టి దానివినాశనమున కెంతో సులభముగా దారియేర్పడును. అన్యాయము ప్రత్యక్ష

ముగా తలయెత్తి న్యాయమునడఁగఁ ద్రొక్కుటకై సిద్ధపడినప్పుడన్యాయముమీఁద ధ్వజమెత్తి దానిని రూపుమాపుటకై ప్రయత్నింపని వారు కేవల వివేక శూన్యులుతప్ప మఱియెవ్వరుందురు? అధర్మముతో పోరాడి విజయమునొంది న్యాయమును ప్రతిష్ఠాపించుటకై కత్తులు కఠారులు ధనము బలము మొదలయిన దుస్సాధ్యములగు దుర్బలసాధనము లేమియు నక్కఱలేదు; సత్యము, కారుణ్యము, ఉత్సాహము, సాహసము మొదలయిన సర్వజన సాధ్యములగు నమోఘసాధనములతోనే యెంతపనినైనను చేయవచ్చును. కాఁబట్టి ప్రపంచములో ధర్మబలముతో సమానమైనబలము మఱియొకటి యేదియులేదు. దేహబలము లేకపోయినను, మనుష్యబలము లేకపోయినను, సాధనబలము లేకపోయినను, మఱియేబలము లేకపోయినను, ధర్మబలమొక్కటిమాత్రముండెనా?

యెంతటి యసాధ్యకార్యములనైనను దుర్బలులుసహితమొక్క నిమిషములో సాధ్యములను జేసికోవచ్చును; అదియొక్కటిలేకపోయెనా ప్రబలులు సహితమెంతకాలమో కృషిచేసియు నొక్కయల్పకార్యమును సాధింపలేకపోవుదురు. ధర్మబలమున్నవానికే దైవబలమును మనోబలమును సమస్తబలములును కలుగును. కాఁబట్టి యెల్లవారును ముందుగా సమస్తమునకును ధర్మబలమునే సహాయపఱచుకొనుటకై ప్రయత్నింపవలయును. ధర్మబలము తోడుపడిన యెడల మనహృదయములనుండి వెలువడు మాటలే మహామంత్రములై విరోధులనైనను వశ్యులనుగాఁజేయును; మన యాలోచనయందే యప్పుడద్భుతమైన సమ్మోహనశక్తి పుట్టును. కాఁబట్టి ప్రత్యేకముగా మాటలును తలంపులునుకూడ వ్యర్థములుకావని యెఱిఁగి మనమొక వేళ వేఱువిధముగా తోడుపడలేక పోయినను వాఙ్మనః క్రియలచేతనైనను మంచిపని కెప్పుడును తోడుపడుచుండవలయును; లోకాపాయ

కరములైన యాచారముల విషయమై యాలోచించి ప్రసంగించుట వలనను కొంతయక్రమ మడఁగి ధర్మము వర్ధిల్లి లోకోపకారము కలుగుటకు శీఘ్రముగా మార్గమేర్పడవచ్చును గనుక, నేనిప్పుడు చెప్పఁ దలఁచుకొన్న వాక్యములను శ్రద్ధవహించి విని విన్నదానిని సావకాశముగా నాలోచించి యాలోచించినదాని నితరులతో చర్చించుటచేత నైనను మీరందఱును సత్కార్యవ్యాపనమునకు తోడుపడుదురని దృఢముగా నమ్ముచున్నాను.

భగవంతుఁడు దయాధర్మస్వరూపుఁడనియు, ఆతని సృష్టిలోని సమస్త ప్రాణులును స్వభావముచే నెప్పుడును సుఖమునే యనుభవింపుచుండునవియు. అందుచేత సామాన్యముగా నెల్లజంతువులును సుఖము ననుభవింపవలయుననియే భగవన్మతమనియు, సమస్తమతములవారును సమస్తదేశములవారును నిర్వివాదముగా నంగీకరించియున్న పరమసిద్ధాంతాంశమేకదా! లోకములో సమస్తజీవరాసులును నైసర్గికముగా సదాసుఖమేయనుభవింపుచుండుటయు, వానికెప్పుడయిన దుఃఖము సంప్రాప్తమైన యెడలనది యశ్రద్ధచేతఁగాని యజ్ఞానముచేతఁగాని భగవదుద్దేశము నతిక్రమించి ప్రవర్తించుట వలననో పరులయక్రమము వలననో యాగంతుకముగా వచ్చుచుండుటయు నెల్లవారును కొంచెము విమర్శించినచో ననుభవముచేతనుగూడ నెఱుఁగవచ్చును. అయావస్తువుల తత్త్వము నెఱిఁగి క్రమముగా నుపయోగించుకొన్నచో సృష్టిలోని గణనాతీతములైన సమస్తపదార్థములు నేదోయొక విధముగా మనసుఖసంతోషముల కే తోడుపడుచున్న యంశము వివేకము గలవారి కెవరికి తెలియకుండును?

సృష్టిమర్యాదనుబట్టియు దానివలనఁ దెలిసికోఁ దగినంతవఱకు భగవత్స్వభావమును బట్టియు విచారింపఁగా భగవచ్ఛాసన మెప్పుడును ప్రజాసుఖమునకే యనుకూలముగా నుండుననియు ప్రజాసౌఖ్యమునకు ప్రతికూలముగానుండు కట్టుపాటులన్నియు భగవన్మత విరుద్ధములై

పాపైకమూలము లయియుండుననియు మందమతి సహితము సులభముగా తెలిసికోవచ్చును. కాఁబట్టి లోకములో కొందఱెప్పుడును దుఃఖపడుచు నుండవలెనని యే భగవదిచ్ఛయనియు ధర్మమనియు బోధించువారు కేవలవంచకులనియు భగవత్సంకల్ప మాప్రకారముగా నుండుననుట యపచారమనియు దైవదూషణమనియు జ్ఞానలేశము గలవారందఱును తెలిసికోవలెను. ఎప్పుడును బహుజన సుఖదాయకమయిన కార్యమే పుణ్యకార్యము; బహుజన దుఃఖకరమయిన కార్యమే పాపకార్యము. పుణ్యపాప నిర్ణయము చేయుటకు లోకములో నింతకంటె మంచిసాధనము మఱియొకటిలేదు. అందుచేతనే మనపెద్దలు చక్కఁగావిచారించి—

"శ్లో॥ శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తంగ్రంథకోటిభిః।
పరోపకారఃపుణ్యాయ పాపాయపరపీడనమ్॥"

అని పరోపకారమే పుణ్యమును పరపీడనమే పాపమునన్న సర్వశాస్త్రసారాంశమయిన పరమార్థమును రెండుమాటలతో చెప్పియున్నారు. కాఁబట్టి సమస్తకార్యములయందును మనమీ యమూల్యమయిన యుత్తమవాక్యమును మూలసూత్రముగా గ్రహించి శిరసావహించుకొని నడవవలయును. ఈశ్వరేచ్ఛానుసారముగా ప్రవర్తించుచు దయానిధియైన యాయన యనుగ్రహమునకు పాత్రులమయి యిహపరలోక సుఖములను పొంది యానందింప దలఁచుకొన్న పక్షమున మనము చేయవలసిన ప్రయత్నములన్నియు జనసామాన్యమునకు సుఖాభివృద్ధియగుటకును దుఃఖముతగ్గుటకును ననుకూలమయినవిగా నుండవలెను; కాఁబట్టి మన మేరాజశాసనమును విధించినను, ఏకులధర్మమును నిర్ణయించినను, ఏమతనియమమును జేసినను, అవియెప్పుడును సాధ్యమయినంత యధిక సంఖ్యాకులకధికసుఖము కలుగఁజేయుట

కనుకూలపడునట్లుగా నుండవలయును. అట్లుండక యవి ప్రత్యేకముగా నొక్క తెగవారి మేలునకే యనుకూలముగానుండి, ఇతరుల కందుమూలమున బాధ కలుగుచున్న పక్షమున నా యేర్పాటు లెన్నటికిని భగవదిచ్ఛానుసారములు కానేరవనియు నవిక్రూరమయిన పిశాచముయొక్క ప్రేరణమువలన చేయఁబడినవనియు రూఢిగా నమ్మవచ్చును. లోకవృత్తమునందు మనకితరులతోడి సంబంధమనివార్యముగనుక పరస్పర సాహాయ్యము లేక మనకీలోకములో నిజమయిన సౌఖ్యమేలేదు; ఇతరులు సుఖించునప్పుడే మనమును సుఖపడుదుము. అందఱును స్వప్రయోజన పరులయి ప్రతిపురుషుఁడును పరులసుఖమును విచారింపక యొక్క తనసౌఖ్యము నిమిత్తమే పాటుపడెడు పక్షమున లోకములో నెవ్వరికిని సుఖము కలుగక మన మందఱమును మృగములకంటెను హీనులముగా నుందుము. స్వప్రయోజన పరత్వము నెంతవఱకు విడిచిపెట్టి లోకోపకారము నిమిత్తమయి జనులెంతపాటు పడుదురో వారి స్థితియంత యుత్కృష్టదశనుపొంది వారంత సుఖాధిక్యమును పొందుచుందురు. కాఁబట్టి సుఖమనఁగా జనసామాన్యముయొక్క సుఖమే కాని యొకజాతి వారియొక్కగాని తెగవారియొక్కగాని సుఖమెన్నటికిని కాదు. మనము ముఖ్యముగా జనసామాన్యముయొక్క సుఖము నిమిత్తమై పాటుపడినప్పుడే లోకమున కంతకును సుఖముకలుగును. లోనసుఖము నిమిత్తమయి చూచునప్పు డెవ్వరికిని సాధ్యమయినంతవఱకు నిష్కారణముగా బాధకలుగకుండునట్లు చూడవలయును. ఒకవేళ కొందఱికి నష్టము కలుగకుండ జనసామాన్యము యొక్క సుఖాభివృద్ధికి తగిన యేర్పాటేదియైనను చేయశక్యము కాకపోయినయెడల నే విధముగాఁ జేసిన నత్యల్ప సంఖ్యాకుల కత్యల్ప బాధకలిగి బహుజన సుఖావహమగునో యావిధముగా దానినిచేయవలెను. మనయొక్క కార్యముయొక్క యోగ్యతా యోగ్యతలను విచారించునప్పుడు భగ

వత్సమ్మతమయిన యీ ధర్మమును దృఢముగా మనసునందు నిలుపు కొనవలెను.

మనుష్యులకు మృగాదులకులేని యుక్తాయుక్తవివేక మొకటి యధికముగా నున్నది; అవివేకమును భగవంతుండు వారికి ప్రసాదించి నందుకు ఫలముగా వారొక కార్యమును చేయునప్పుడు దేశకాల పాత్రాదులను విమర్శించి యయుక్తమును విడిచి యుక్తమయిన దానినే చేయవలసిన వారగుచున్నారు; అందుచేత మృగాదులవలెఁగాక మనుష్యుల యాచార వ్యవహారాదులు కాలాను గుణముగా మాఱు చుండుట యనివార్యమునై యున్నది. జనులు వివర్శకులయి భగవం తుఁడు తమకు దయచేసిన యుచితానుచితజ్ఞానమును సార్థక పఱుచుకొను చు దేశకాల స్థితిగతులను చక్కఁగా నాలోచించి దేశక్షేమకరములయిన మార్పులను నిశ్శంకముగా చేసికొనుచు వచ్చినచో వారు క్రమక్రమ ముగా మహోన్నత దశకు వచ్చి నాగరికాగ్రగణ్యులై యుక్తప్రవర్త నముచేత దేవతాతుల్యులగుదురు; అట్లుగాక యీాశ్వరోద్దేశమునకు వ్యతిరిక్తముగా జనులు విమర్శకులయి తమ వివేకమునంతను పదటఁ గలిపి దేశకాలానుగుణముగా ప్రజాక్షేమ కరములయిన మార్పులను చేసికొనక పూర్వులచే నాచరింపఁబడినదే మంచిదని కూయుచున్న పక్ష మున నభివృద్ధియున్నమాట లేక జనులంతకంతకు మూఢులయి హీన దశనుపొంది కడపట మృగప్రాయులగుదురు. ప్రకృతి ధర్మమును బట్టి మనముద్దేశించినను ఉద్దేశింపకపోయిననుగూడ మన యాచారా దులలో మనకు తెలియకయే యేదో యొకవిధముగా మార్పుకలుగు చునే యుండును. ఒక్క మృగాదులు మాత్రమే యెప్పుడును మార్పు లేకుండ నుండునవి. మనుష్యులలో మార్పు కలుగకుండుట యసా ధ్యము; విమర్శలేనిచో కలిగెడు మార్పుమాత్రము సాధారణముగా

సుఖప్రద మయినదిగా నుండదు. వివర్శలేకయే కార్యములను జేయుచు వచ్చినచో మనకాచారమే పరమదైవతమయి యుచితానుచిత వివేకమును మన మనసులనుండి దూరముగా పాఱఁదోలి తుదకు మానుష ధర్మమే మనలను విడిచి పోవునట్లుచేయును. అప్పుడు మనము దురాచార భూతమునకు సంపూర్ణదాసులమయి దయాదాక్షిణ్యాదులను వదలివేసి యదినడిపించి నట్లెల్ల గుడ్డివానివలె కన్నులు మూసికొని నడుచుచు వివేకము మనలను వదలుటచేత విపరీతబుద్ధి కలవారమయి మంచిని చెడ్డగాను చెడ్డను మంచిగాను భావించుకొనుచు పాపభీతి యొఱుఁగక యెంతటి క్రూరకృత్యమున కయినను వెనుకతీయనివార మగుదుము. మనలోని రాజపుత్రులు వివాహముల యందలి యతివ్యయమును మాని సుఖపడవలసిన పనికి మాఱుగా వివేకరహితులయి ధనాభావముచేత తమకడుపునపుట్టిన స్త్రీశిశువులనే కరుణమాలి వధించెడి కిరాతవృత్తిని పూనఁగలుగుటయు, పలువురు సత్యమయిన యీశ్వరుని మఱచిపోయి కాళికాశక్తి మొదలయిన పేళ్ళుపెట్టిన రాతిబొమ్మలకు తృప్తికలుగునని దయాశూన్యులయి తమతోడి మానవులను కొన్ని సమయములయందు తాము కన్నబిడ్డలనుకూడ బలవంతముగా బలిపెట్టు ఘోరరాక్షస కృత్యమును వహింపఁ గలుగుటయు, కొందఱుపుణ్యము వచ్చుననియు నాపన్నివారణమగు ననియు భ్రమపడి ప్రేమాను బంధమును తెగఁగోసి తమగర్భమున జనించిన శిశువులను గొనిపోయి మొసళ్ళకాహారముగా గంగాగర్భమున పాఱవేయు ప్రత్యక్షపాపకార్యమున కొడిగట్టఁ గలుగుటయు, ఆచార పిశాచ ప్రభావము వలననే కదా? మనమీదినమునఁ బ్రశంసింపఁబోయెడు దయనీయులయిన బాలవితంతువుల దరిలేని మరణాంత దుర్దశలుచూచి మనవారి మనసులు కరఁగ కుండుటయు, ఆయనాథ యువతుల వచింపరాని దురవస్థలను వారించుటకయి చేసెడి పరోపకార పరాయణులయుత్తమ

ప్రియత్నములకు మనవారింతమంది విరోధులయి నానావిధముల ప్రతిబంధములను విఘ్నములను కల్పించి కార్యవిఘాతముచేయఁ జూచుచుండుటయు, కూడ నాచార పిశాచావేశబలమువలన కలిగినవికారముచేత వివేకముచెడి తమ్ముఁ దామెఱుఁగనేరని యవస్థలోనుండుట చేతనే కదా? ఓకూ్రరాచారపిశాచమా! నీపేరు తలఁపునఁ బాఱినంతమాత్రమున నాదేహమిప్పుడు కంపమెత్తి నీమీఁద పట్టరాని కోపము వచ్చుచున్నది. ఓ పాపపుదురాచారమా! లోకములోని సమస్త దేశములకును శిరోభూషణమయి సకలదేశములవారి గౌరవమునకును పాత్రమయియుండిన మాభరతఖండమునందు దొంగవలె నెప్పుడో యేలాగుననో మెల్లఁగాఁ బ్రవేశించి యెవ్వరును కనిపెట్టకుండ క్రమక్రమముగా ప్రబలి యందఱికన్నులను గప్పి ద్రోహివయి కొంతకాలమున కీశ్వరుని ధర్మాధికారమునే నీవాక్రమించుకొని స్థిరపడి యమాయికులయిన యస్మద్దేశీయులను మోహపఱిచి వశ్యులను జేసికొని నీదుప్రభుత్వము నెల్లయెడలను స్థాపించి వారిమీఁద నిరంకుశాధికారమును చెల్లించుచు వివేకముచెఱిచి యనుదినమునె దఱిచే నెన్నిదుష్కార్యములను చేయించుచున్నావు! నీవు వచ్చిచేరి యుక్తాయుక్త వివేకమును మావాగల హృదయపీఠములనుండి తఱిమివేసినావు; సమస్తసుగుణముక్తావళికిని నాయకమణియైన కారుణ్యమును హృదయపేటిక చేరకుండరూపుమాపినావు; సుఖవృక్షమునకు పాదుకానున్న దేశాభిమానమును హృదయక్షేత్రములనుండి వేళ్ళతో పెల్లగించివేసి యాస్థానమున సత్యజ్ఞానదయాదాక్షిణ్య వివేకాదులకు విఱుగుడు మందుగానుండు దురభిమాన విషవృక్షములను గట్టముగా నాటినావు. నీవువచ్చి యాశ్రయించి నీ ప్రభుత్వము బలపడిన పాపముచేతనేకదా విద్యావివేకాదులయం దనన్యసాధారణ మహిమ నొందియుండి యితరదేశముల హీనదశనుజూచి పరితాపపడుచుండిన మా హిందూదేశమునకు

పూర్వపు మహోన్నత స్థితి యంతయు కాలక్రమమున మూలపట్టి విద్యావివేకాదులయందు దినదినాభివృద్ధినొందుచున్న యీ యన్యదేశములే యిప్పటి హీనదశనుజూచి పరితాపపడవలసిన దుర్గతిపట్టవలసి వచ్చినది. నీయధికార ప్రాబల్యయము ముదిరిన దోషముననేకదా లేశమైన నభివృద్ధి కవకాశములేక సకలదేశముల గౌరవమునకును పాత్రమైయుండిన యీభరతఖండము నానాటికి క్షీణదశనుపొంది యిప్పుడితరదేశముల పరిహాసమునకు పాత్రముకావలసిన దగుచున్నది. నీకు గురుత్వము సంప్రాప్తమైన దుర్యోగముచేతనేకదా నాప్రాణతుల్యమైన యీయార్యావర్త దేశము నిజమయిన తనసుగుణ సంపదనంతను పోగొట్టుకొని కేవలబాహ్యవేష ధారణముతోనే తృప్తి వహింపవలసినదైనది. సకలశాస్త్రములకును కళలకును సద్గుణములకును సద్వర్తనముకును నాటపట్టయియుండిన యీనాజన్మదేశముయొక్క పూర్వావస్థ తలంచుకొన్నకొలందిని నీమీఁదకోపమును దేశముయొక్క యిప్పటి దుస్థితినిగూర్చి సంతాపమును హెచ్చుచున్నది. మా ప్రియదేశముయొక్క యనర్థమునకెల్లను మూలమునైన మోహాచార పిశాచమా! నీవేయిప్పుడు క్షణకాలము రూపముదాల్చి నాయెదుట నిలువఁబడితివా, హత్యచేసిన పాపము వచ్చినను వేయుఁ కసిదీఱ నిన్నొక్క సారిగా మెడనులిపి చంపివేసి, ఈదేశమును పట్టుకొన్న పీడను నేటితో వదల్చి ఋణవిముక్తుఁడనై కృతార్థుఁడనగుదును. నిన్నెలాగునైన రూపుమాపి దేశమును మరలనెప్పటి ప్రకారముగా నీశ్వరశాసనమున నొప్పింపఁగలిగినప్పుడుగదా నాకుకోపశాంతి కలుగును. మాననీయులగు హిందూమహాజనులారా! ఆచారపిశాచము మనల నీప్రకారముగా దారితప్పించి తప్పుత్రోవనుబెట్టి ప్రతినిమిషమును మన యభివృద్ధిమార్గమున కడ్డముగా కంటకప్రాయములగు ప్రతిబంధశతములను కల్పించి బహుకాలమునుండి తరతరములు బాధింపుచుండగా,

తెలిసియు మనమింకను నెంతకాలము పౌరుషము విడిచి భగవదాజ్ఞారూపమయిన శాస్త్రదేవతాధికారమును తానక్రమముగా నాక్రమించుకొని మనలను బుద్ధిహీనులనుజేసి మనమీఁదనెక్కి త్రొక్కుచున్న యాచారమను ద్రోహికి పరమభృత్యులమై కన్నులుమూసికొని హైన్యముతో దాస్యముచేయుచు మనమేలునైనను విచారింపక యజ్ఞానాంధకారమునఁ బడియుందము? ఎఱిఁగి యెఱిఁగి లేశమైనను పూజార్హతలేని యీద్రోహిని కాళ్ళును చేతులును కట్టుకొని యారాధించుచు మనయభివృద్ధినికూడ నిరాకరించి వేరుపురుగువలె పైకి తెలియకుండాలోలోపలనే మనసౌఖ్యవృక్షమును మూలముతో ఛేదింపఁబాటుపడుచున్న యీతని క్రౌర్యముయొక్క దుష్ఫలములను పలుమాఱు ననుభవింపుచుండియు తెగువలేక యెంతకాలము పూజార్హమైన శాస్త్రదేవతనుకూడ నీక్రూరునకు దాసినిజేసి సమర్పించి యశక్తులమైయుందము. ఇప్పుడిప్పుడు వివేకమాంత్రికుఁడు కాలమహిమచేత మనహృదయభవనములయందు బ్రవేశించి మహాతమమును క్రమక్రమముగా చెదరగొట్టుచున్నాఁడు గనుక వెనుకటివారివలె మనమిప్పుడు దురాచార గ్రహముయొక్క సమ్మోహన మంత్రప్రభావముచేత పూర్ణముగా కట్టుపడి యుండలేము. మనమాచారమునకు సేవచేయవలసినపని లేదనియు, మనకు భగవంతుఁ డొక్కఁడే సర్వాధికారియనియు స్పష్టముగా తెలిసియున్నాము. కాఁబట్టి సోదరులారా! మనమింతటనైనను తెలివితెచ్చుకొని మాంద్యమునుండి లేచి దేవకార్యవిషయమై వీరభటులవలె నడుములుకట్టుకొని నిలువఁబడి యీశ్వరాధికారము నపహరించి యేలుచున్న యాచారనామక ద్రోహిని బలవంతముగా సింహాసనమునుండి పడనీడిచి యీశ్వరుని సింహాసనము నీశ్వరుని కర్పించి మనము దాస్యమునుండి విముక్తులమై స్వచ్ఛందదశనుపొంది యీశ్వరశాసనమును తలధరించిచేయుచు నాతని

పరిపాలనములోనుండి పూర్వకాలమునందు మనదేశము నలంకరించిన మనుగౌతమాదికీర్తిశరీరుల సంతతివారమని చెప్పుకొనుట కర్హుల మగుటకు ప్రయత్నింతము లెండి.

ఆచారపిశాచమును హృదయపీఠములనుండి పాఱఁదోలి వివేకమును స్థాపించి యీశ్వరాజ్ఞానుసారముగా ప్రవర్తింపుచు మనము సుఖపడి యితరులనుసుఖింపఁజేయుటకై కేవలప్రమాణబద్ధులముకాక కార్యసమయములయందు విషయవిచారముకూడ చేసి సాధక బాధకముల నాలోచించి తేలినసిద్ధాంతాంశము నవలంబించుచుండవలయును. నిష్పాక్షికబుద్ధితో చేయు తత్త్వవిచారమునుమాని వేసి కేవలప్రమాణబద్ధుల మగుదుమేని క్రూరాచారములకును స్వప్రయోజనపరుల కుత్సిత కల్పనలకును లోనయి మనసుఖమును లోకసుఖమునుగూడ చెడఁగొట్టుకొందుము. తత్త్వవిమర్శకు ప్రతిబంధకరములయిన దురభిమానమును జయకాంక్షను దూరీకరించి యొకవిషయమును చర్చించి పరిశోధించుటకును, ఈశ్వరముఖమును జూచి సత్యమునే పరిగ్రహించుటకును కృతనిశ్చయులమయి యాప్రకారముగా వర్తింతుమేని మన మాచారమునకు భక్తులము కాకుండుటకును సమస్తసుఖములను పొందుటకును శక్తులమగుదుము. కార్యాకార్య పరిశోధనముచేసి కాలానుగుణముగా దోషబాహుళ్యము గలవానిని త్యజించుచు గుణబాహుళ్యము గలవానిని భజించుచు నుండకుందుమేని పూర్వాచార మెంతప్రబలముగా నున్నను ప్రమాణవచనములెంత కట్టుదిట్టముగా నున్నను వానినతిక్రమించి భగవంతుఁడు మనకనుగ్రహించియున్న స్వాతంత్ర్యప్రభావమునుబట్టి మనుష్యప్రకృతి మార్పుచెందక యెప్పుడును స్థిరముగా నేకరీతిగా నుండునదికాదు గనుక మనకు తెలియకయే మనయాచారాదులలో మార్పులుగలుగుచు విమర్శతో చేయఁబడినవి

కాకపోవుటచే తఱుచుగా నవి చెడుగునకే కారణమగుచు నక్లేర్పడిన దురాచారములు కాలమహిమచేత కొంతకాలమునకు సదాచారములుగానే తోఁచి లోకములో చెడుగభివృద్ధిచెందును. అప్పుడావిషయమున విమర్శయారంభమయినచో దాని నవలంబించిన వారికి దురభిమానము తోడుపడి వివేకమును కప్పివేయఁగా వారు తమ యాచారమే సదాచారమనియు, అదియే సృష్ట్యాదినుండియు వచ్చుచున్నదనియు, అదియే శాస్త్రసమ్మతమనియు, పట్టుపట్టి వాదించి జయకాంక్షతో పోరాడి సత్యగ్రహణమునం దాదరములేక శాస్త్రముల కాచారానుగుణముగా నర్థముచేయుపాటుపడుచు లోకమునకు మితిమీఱినహాని నాపాదింతురు.

ఎంత నష్టకరమయినను దురాచారమయినను కొంత కాలమునుండి వచ్చుచున్న పక్షమున సదాచారముగానే కనఁబడునని చూపుటకయిపయినిచెప్పిన రెండుమూడు నిదర్శనములే చాలును. గనుక నిఁక నిక్కడ లక్ష్యబాహుళ్య మక్కఱలేదు. లోకములో మన మంతకంతకు విద్యాబుద్ధులలో నభివృద్ధి నొందుచుండుటయు, అభివృద్ధికి తగినట్టుగా నాయాకాలములయందు మార్పులు కలుగుచుండుటయు, ఆ మార్పులు దేశక్షేమ కరములుగా నుండవలయుటయు, భగవదుద్దేశమే గనుకను, విషయ విచారములేక యోగ్యమైన మార్పులు కలుగుట సంభవింపదు. గనుకను, మనమిది పూర్వాచారము కాదా యనువిచారమును మాని యిది లాభకరమయినదా నష్ట కరమయినదా ప్రస్తుత స్థితి కనుకూలమయినదా ప్రతికూలమయినదా యని విచారించుచు కాలమునకు తగిన లాభకరములయిన మంచిమార్పుల నెప్పుడును చేసికొను చుండవలయును.

మౌఢ్యముచేతను స్వార్థపరత్వము చేతను చేయఁబడిన బహుజనానిష్టకరములయిన యేర్పాటులుకొన్ని యాచార ప్రభావమువలన

మంచివిగానే కనఁబడినను, అవి భగవదుద్దేశమునకు విరుద్ధములయిన నందున సర్వదేశములయందును సర్వకాలములయందును వ్యాపింపక యెప్పుడో యొకప్పుడు నశింపఁదగి యుండును. ఎంతకాలమునుండి వచ్చుచున్న యాచారమయినను మానుషస్వభావమును బొత్తిగా చంపివేయలేదు. నశించిన దనుకొనుచున్నప్పుడు కూడ మానుషస్వభావము లోపల నడఁగియుండి యెప్పుడో మరల బయలుదేరి కడపట విజయము నొందక మానదు. కాఁబట్టి ప్రకృతి ధర్మవిరుద్ధములును నష్టకరములునయిన మనుష్య సంకేతము లెంతకాల మాచరింపఁబడుచు వచ్చినను కడకెప్పుడో రూపుమాయ వలసినవే. అందుచేతనే చిన్నతనములో భర్తలను పోఁగొట్టుకొన్న యబలలను పునర్వివాహము చేసికోనియ్యని ప్రకృతి విరుద్ధమయిన క్రూరాచారము లోకమందంతటను వ్యాపింపఁగలిగి నదికాదు; అన్ని కాలములయందును తలయెత్తఁగలిగినదియుఁగాదు. మనలోని పామరు లీయాచారము జగత్తునందంతట ననాదిగా వచ్చుచున్నదని భ్రమించుచున్నను, నిజముచేత ప్రపంచములో షోడశభాగములో నయినను లేనట్టు కొంచెము భూగోళశాస్త్రజ్ఞానము గలవారి కందఱికిని తెలియును. ఇప్పుడీ భూమండలములో వ్యవహరింపఁబడుచున్న నైదుఖండములలో నొక ఖండములో నయినను పూర్ణముగా నీయాచారములేదు. ఆయున్న యొక్కఖండములో నయినను బహుదేశముల యందుండక యొక్క హిందూదేశమునందు మాత్రము వ్యాపించియున్నది. ఆ హిందూ దేశములో నయిన నన్నిమతములవారిలోను లేక యొక్క హిందూమతావలంబకులలో మాత్రము కనఁబడుచున్నది. ఆ హిందూమతావలంబకులలో నయిన సమస్త వర్ణములవారిలోను నుండక యొక్క యగ్రవర్ణముల మూటిలోను మాత్రమే పొడచూపుచున్నది. ఆమూఁడువర్ణముల వారిలోనైన నెల్లకాలము నుండక కలినిషేధములలో పరిగణింపఁబడి యుండుటచేత ప్రత్యేక

ముగా నొక్క యీకలియుగములో మాత్రమే వచ్చినది. ఈ కలి యుగములో నయినను నిరాక్షేపముగా వ్యాపింపక ప్రథమ పాదము లోనే బహుకాలమునుండి వివేకిలోకముచే దూషింపఁబడుచు నిదివఱకే యీ దురాచారదుర్గము సంచలించి యడుగు కదిలి యున్నది. ఇప్పుడు దేశమందంతటను వ్యాపించుచున్న విద్యాప్రభావమువలన ప్రకృతి విరుద్ధ మయిన యీ దురాచారమిఁక నెంతకాలమో మొదలంట కూలక నిలువనేరదు. స్వభావ విరుద్ధమయిన యీ ఘోరాచార మెప్పుడో మాసిపోయుట యనివార్యమే యయినను దేశక్షేమము నపేక్షించు దేశాభిమాన మాననీయుల కందఱకును దాని వినాశమును వేగిరపఱచుటకయి వలయు ప్రయత్నముల నెల్లను జేయుట విధిగా నున్నది. ప్రస్తుతాచారమును మానుఁడని మీ కుపదేశించుటకు ముందుగాదాని వలన జనసంఘమున కిప్పుడు కలుగుచున్న నష్టములను దానిని మానుటవలన కలుగఁబోవు లాభములను మీకుఁ గొంత చూపవలసి యున్నది. అవి యన్నియు రసపుష్టిగల ప్రౌఢవాక్యములతో మీ హృదయములు కరఁగునట్లుగా నుపన్యసించుటకు నేనుశక్తుఁడను కాక పోయినను లోకోపకార బుద్ధియు ననాథయువతుల దురవస్థయు నన్ను బహువిధములఁ బ్రేరేప నాపక్షమునానున్న సత్యబలమును నమ్ముకొని నాకుతోచిన సంగతులను కొన్నిటిని చెప్ప సాహసముచేయుచున్నాను.

సర్వజ్ఞుఁడయిన యీశ్వరుఁడు స్త్రీపురుష భేదములేక మనుష్య సామాన్యమంతయు నీ లోకములో సాధ్యమయినంత సంపూర్ణసుఖము ననుభవించుటకే యుద్దేశించి యున్నాఁడు. ఇహలోకములో పొందదగినవానిలో కామసుఖ మొకటి ముఖ్యమయినది. సర్వదయాపరుఁడయిన జగదీశ్వరుఁడు పురుషులకువలెనే స్త్రీలకును క్షుత్పిపాసాదుల వలెనే కామమును బ్రసాదించి యున్నందున, పురుషులుగాని, స్త్రీలు

గాని దానిని యుక్తరీతిని శాంతిపొందించుకొని సుఖపడవలయుననియే యీశ్వరసంకల్ప మగుట స్పష్టము. కాబట్టి చౌర్యాదుల యందు ప్రవేశింపక యుదరపోషణము చేసికొనుట యెట్లు న్యాయమో వ్యభిచారాదులయందుఁ బ్రవేశింపక కామశాంతి చేసికొనుటయు నట్లే న్యాయమగును. కామశాంతికయియేర్పడిన న్యాయమార్గము వివాహబంధము. మనమా ధర్మమార్గము నవరోధించి మనవారి నెంత నిర్బంధములో నుంచినను స్వర్గమునచ్చునన్న యాశచూపి యెన్ని సుబోధలు చేసినను మనుష్య ప్రకృతి యడఁగక యధర్మమార్గమున నడుచునుగాని యెల్ల వారికి నింద్రియ నిగ్రహము కలుగనేరదు. సమస్తమును తెలిసి, సర్వ సంగములును పరిత్యజించి, సంసార బంధమును కోసివేసి, శరీరములు కృశింపఁజేసి, అడవులలో కందమూల ఫలాదులు తినుచు తలక్రిందుగా తపస్సుచేయు ఋషులవంటి మహానుభావులే యప్పుడప్పుడు కామవికారమునకు లోనయి వివేకము పోఁగొట్టుకొని యకార్యకరణమునకు ప్రవేశింపుచుండఁగా, ఉప్పును పులుసును తినుచు సంసారసుఖములలో సదా మునిఁగి తేలుచు మంచివయస్సులో సుందర మందిరములయందు వసించి యుండువారికి కామమును జయించుట శక్యమగునా? శక్యము కాదు గనుకనే భర్తృహరి—

శ్లో. విశ్వామిత్రపరాశర ప్రభృతయో వాతాంబు పర్ణాశనా
స్తేపిస్త్రీ ముఖపంకజం సులలితం దృష్ట్వైవ మోహంగతాః
శాల్యన్నంసఘృతంపయో దధియుతంభుంజంతి యేమానవాః
తేషామింద్రియనిగ్రహోయది భవేద్వింధ్యః ప్లవేత్సాగరే.

అని విశ్వామిత్ర పరాశరాదులయిన వాతాంబు పర్ణాశనులు సహితము సుందరమయిన స్త్రీముఖపద్మమును జూచి మోహపరవశు

లగుచుండఁగా నెయ్యి, పాలు, పెరుగు మొదలయిన వానితో వరియ న్నము భక్షించు మనుష్యులకే యింద్రియనిగ్రహము కలుగు పక్ష మున వింధ్యపర్వతము సముద్రమునందు తేలవలసినదే యని చెప్పు చున్నాఁడు. ఋషుల సంగతి యిట్లుండఁగా విద్వాంసుల సంగతి చెప్పు చుమనువు—

శ్లో. మాత్రాస్వస్రాదుహిత్రావా నవివిక్తాసనోభవేత్
బలవానింద్రియగ్రామో విద్వాంసమపికర్షతి.

బలవంతమయిన యింద్రియవర్గము విద్వాంసులను సహిత మీడ్చును గనుక తల్లితో నైనను తోడఁబుట్టిన పడుచుతో నైనను కొమార్తెతోనైనను రహస్యముగా కూరుచుండఁ గూడదని విధించి యున్నాఁడు. తల్లి మొదలయిన వారితోనే విద్వాంసులు సహిత మొంటిగా కూరుచుండఁ గూడదన్నప్పుడు మూఢుల విషయమయి చెప్పనక్కఱయేలేదు. ఆకలములు తినుచు నడవులయందు దినుపగోచులు కట్టుకొనివసించు తపసులయొక్కయు జననీజనకులను విడిచి గురుకుల వాసము చేయుచు నిష్ఠతో విద్యాభ్యాసముచేయు విద్వాంసుల యొక్కయు పాట్లే యిట్లుండఁగా నిఁక విద్యాగంధమే యెఱుఁగక యుక్తాయుక్తవివేక మంతకుముందే లేక యింద్రియ సుఖానుభవము నకు నిదానములయిన సుందరమందిరములయందు సదా యౌవన వంతులయిన సుందరపురుషులమధ్యమున మెలఁగుచు నుప్పును పులు సును జిహ్వాకింపుగా తినుచు వయసులోనుండి తమయొక్క యింద్రియ వర్గమేకాక వివిధమాయోపాయములుపన్ను దుష్టపురుషులుకూడ కామోపభోగములకయి పురికొల్ప స్వభావచంచలలయి యనాథలగుట చేస్వేచ్ఛానుచారిణులయిన యబలలకు మనస్థైర్యముతో నింద్రియ నిగ్రహముచే యశక్యమగునని స్వప్నావస్థయందయినను నమ్మ

వచ్చునా? కాముని డాకకు మహావిద్వాంసుల మనస్సులే గాలిలోని దీపములవలె నల్లలనాడుచుండఁగా నిఁక చెదరక నిలుచుట కబలలయిన యనాథబాలల మనసులెంతపాటివి? మీరెంతకష్టపడి శిరోజములు తీయించి బోడితల చేసినను, ఆభరణములను తీసివేసి విరూపిని జేసినను, మూడుపూటలును భోజనము చేయనీయక కడుపుమాడ్చినను, కటికినేలను పరుండనియమించి దేహమంతయు నొవ్వఁజేసినను, మఱి యిట్టి దురవస్థలనెన్నిటిని తెచ్చిపెట్టినను, స్వభావసిద్ధముగా యువతులకు భగవంతుఁడు దయచేసిన కామమును మాత్రము మీరుతీసివేయ శక్తులుకారుగదా? వయసులోనున్న పురుషునకు భార్య పోయినంత మాత్రముచేత కామముడుగకుండుట మగవాఁడు మరల వివాహము చేసికోవలెనని యీశ్వరేచ్ఛయయినట్టే ప్రకారముగా నూహింపఁదగి యున్నదో అదేప్రకారముగా భర్త పోయినంత మాత్రముచేత యువతికి కామము పోకుండుటయు స్త్రీపునర్వివాహముకూడ భగవన్మతమే యని తెలిసికోఁదగి యుండలేదా? భగవంతునితో ప్రతిఘటించి భగవదుద్దేశమునకు విరోధముగా పనిజేసి మీరెన్నటికి కడతేఱఁగలుగుదురు? ఈశ్వరేష్టమును వ్యతిరేకించి మీరెట్లిహపరసుఖములను పొందఁగలుగుదురు? భగవదుద్దేశమునకు వ్యతిరిక్తమయిన పనియందు ప్రవేశించుట కేవల ఘోరరాక్షసకృత్యమనుగాని లేశమయిన మానుష స్వభావమున కర్హకృత్యమగునా? ఈశ్వరుఁడు సుఖమనుభవింప సృజించినవారిని మనయావచ్ఛక్తిని ధారపోసికష్టముల పాలుచేయ పాటుపడుట యెంతపాపకార్యము? ఎంతక్రూరకృత్యము? ఎంతదుష్కార్యము! మనదేశములోని కూరాచారమును బట్టి యీదేశపు వితంతువు లనుభవింపవలసిన దుర్దశలను తలఁచుకొన్నంతమాత్రమున పగవారి మనస్సయినను కలుక్కుమనక మానదుగదా? వారిదురవస్థలు మనస్సునకు తగిలినంతమాత్రముచేత దిక్కుమాలిన పక్షులు మొదలు

విఱిచి చంపెడు దయారహితులయిన కిరాతుల కయినను మనస్సు దహించుకొనిపోయి జాలిపుట్టదా? అట్టి దయాశూన్యులయిన యన్యులకేయట్లు జాలికలుగుచుండఁగా మన బాలవితంతువుల దుర్గతిచూచి మనకేల కొంచెమయినను కనికరము పుట్టఁగూడదు? తమ వేడుకనిమిత్తమయి కడుపునపుట్టిన కన్నులుతెఱవని పసిపిల్లలకుమంగళసూత్రధారణమిషమున మెడకొక త్రాడుకట్టి, బలినిమిత్తమయి గుడికి మేకనీడ్చుకొనిపోవునప్పుడు వేపరొట్ట కట్టినట్టుగా చేతులకు తోరముకట్టి, వాద్యములఘోషతో వివాహమని పేరుపెట్టి యదియేమో కన్యావరులకే తెలియని జాతరవంటి యొక తంతునడపి, యిదియంతయు నేదో క్రొత్తబట్టలు కట్టుకొని పిండివంటలుతినెడి మహోత్సవ మను కొన్న సంతోషదినములు దాటినతరువాత భర్తపోయినాఁడన్న పిడుగువంటి దుఃఖవార్త కుటుంబమునంతను దుఃఖసముద్రములో ముంచినప్పుడును——

ప్రాణాధికలగుచున తమ ముద్దుకూఁతులను బ్రతికియున్నంతకాలమును దుస్సహాపై ధన్యదశకు తెచ్చిన దురదృష్టమును తలఁచుకొని తలలుపీడ ఱొమ్ములు బాదుకొనుచు తల్లిదండ్రులు పెద్దపెట్టున రోదనము చేయునప్పుడును వారియొద్దకుఁబోయి మొగములవంక తెల్లపోయి చూచుచు "అమ్మా! ఎందుకేడ్చుచున్నావు? నాయనా? ఏల యేడ్చుచున్నావు?" అని నెఱుఁగని ప్రశ్నలువేయుచు తమకుముందు ప్రాపింపఁబోయెడు దురవస్థను లేశమయినను చింతింపఁజాలని పసిబిడ్డల యవస్థ చూచియైనను మీ మనసులు కరఁగకున్నవా! విన్నమాత్రముచేతనే గుండెలుబద్దలయ్యెడి యిటువంటి వార్తలను మీ హృదయములకు నాటునట్లుగా వర్ణించుటకయి కాళిదాసునివంటి మహాకవిశక్తిసంపన్నుఁడొకఁడుండిన మీమనసులయందప్పుడయినను జాలపుట్టునేమో! మఱి యెవ్వరికి పుట్టకపోయినను కడుపుసకన్న తల్లిదండ్రులకైన నాముఁగ్ధ

బాలికలయందు కరుణపుట్టి వారిని పునర్వివాహముచేసి సుఖపెట్టవలె నన్న బుద్ధి జనింపఁగూడదా? నిన్నమొన్నటివఱకు నెంతో ప్రేమతో పెంచి ప్రాణములనెల్లను వారిమీదనే పెట్టుకొనియుండి భర్తపోయినా డన్న పాడువార్త విన్నమాత్రమున సమస్తాలంకారములను తీసివేసి విరూపినిజేసి ముసుఁగువేసి మూలకూరుచుండఁబెట్టి చచ్చియు చావ కుండ దినమున కొక్కపూటనే యిన్నిమెతుకులు వేయుచుకట్టుకో తిన్నని గుడ్డనైన నియ్యక ముతకబట్ట చుట్టఁబెట్టి పుత్రికల జన్మములను దుఃఖభాజనములనుగాఁ జేయుటకై తల్లిదండ్రుల కెట్లుమనసొప్పుచు న్నది? ఏకగర్భవాసమున జన్మించన తోఁబుట్టుపడుచులును, ఇంటఁజొ చ్చిన కోడండ్రు మొదలయిన వారును రాత్రింబగళ్ళు కంటికినేలకు నేక ధారగా నేడ్చుచు మరణపర్యంతము వైధవ్యదుఃఖము ననుభవింపుచుం డఁగా కన్నులుపెట్టుకొని చూచుచు అన్నదమ్ములును అత్తమామలును బావమఱఁదులును నిర్దయులై యెట్లుచూచి సహింపఁగలుగుచున్నారు. అనాథలైన తమవారి ముద్దరాండ్రు సమస్తదుఃఖములకులోనై యెన్న రాని కడగండ్లు పడుచుండఁగా వారివిషయమయి కొంచెమయినను జాలి వహింపక వారియాపత్తులను నివారించుటకు లేశమయినను ప్రయత్న ముచేయక రక్తసంబంధముగల బంధువులందఱును తాముమాత్రము హాయిగా సంసారసుఖమననుభవించుట కెట్లు సిగ్గుపడకున్నారు. ఓజను లారా! మన బాలవితంతువులు పడు బాధలు చూచి యన్యదేశీ యులు సహితము హృదయములు నీరుగాకరుగ పరితపించుచు వారి కష్టముల నేలాగుననైన గట్టెక్కించి యాపన్నివారణముచేసి దేశ మును సుఖస్థితికి తీసికొనిరావలెనని సర్వప్రయత్నములును జేసి పాటు పడుచుండఁగా, ఒక్కదేశమునఁ బుట్టి యొక్కవేదమునునమ్మి యొక్క కుటుంబమువలెనున్న మీరుమాత్రము చీమకుట్టి నట్టయినను లేకహృద యములు రాయిచేసికొని యేల నిర్విచారముగా నున్నారు?

అనాథలయిన యాడువారిమీఁద కరుణపుట్టుటకు మాఱుగా వారిమీఁద మీకు ద్వేషమేలపుట్టవలెను? మీరు మీశక్తినంతయు వినియోగపఱిచి యనాథలయిన యువతుల సౌఖ్యమునకుఁగల న్యాయ మార్గమును మూసివేయుటచేత వారు ప్రకృతినిజయింపనేరక యింద్రియ దౌర్బల్యమువలనను కామప్రేరణమువలనను కాముకజనప్రార్థనమువల నను పురికొల్పఁబడి యున్మత్తురాండ్రయి తప్పుత్రోవలు త్రొక్కుట వలన మీకు కలుగుచున్న ముప్పులనైన విచారాలోచించుచున్నారా? కామనివారణమున కన్యసాధనమును గానక ప్రకృతి చంచలలయిన యనథకామినులు దోషములలోనెల్లను మిక్కిలి దోషమయినను వ్యభి చారమునందు ప్రవేశించి సమస్తానర్థములను తెచ్చిపెట్టుచుండుట మీదృష్టి గోచరమగుచుండలేదా? వ్యభిచారమే సమస్తానర్థములకును మూలమైనది. లోకములో జరిగెడు నరహత్యలలో ముప్పాతిక మూఁడు వీసములు వ్యభిచారసంబంధమునుబట్టి జరగినవేయై యుండును. మాన వంతుఁడయినవాఁడు తనవారు మఱి యేయపరాధము చేసినప్పుడయి నను చూచి సహించి యూరకుండఁగలుగునుగాని జారత్వము కంటఁ బడ్డప్పుడు మాత్రము జారపురుషునిగాని స్త్రీనిగాని యిద్దఱినిగాని కత్తిడయిన పొడిచివేయవలె నన్నంత యాగ్రహముురాక యూర కుండజాలఁడు.

జారత్వమొక్క మగనికి మాత్రమేకాక యత్తమామలకును బావమఱదులకును తల్లిదండ్రులకును నన్నదమ్ములకును గూడ మా యని యపకీర్తికరముగా నుండును; బంధువులకెల్ల నవమానకరముగా నుండును. అందుచేతనే యభిమానవంతులయిన వారు తమయింటనెవ్వ రయిన వ్యభిచరించు చున్నారన్న యనుమానము కలిగినంత మాత్ర మునకూడ హృదయములు నిప్పులలో పొరలించినట్లుమండ తమస్త్రీ లనో యనుమానింపఁబడిన జారపురుషులనో చంపినదాఁక నిద్రపట్టక

పిమ్మట తాముకూడ దొరతనమువారి కఠిన శిక్షలకు ప్రాణములను దేహములను సమర్పించుచున్నారు. అంకుతనము బయలపడినప్పుడు బంధువులు మొదలైనవారాడు ములుకులవంటి కానిమాటలకు తాళఁజాలక రోషముచేత నూతిలోనో గోతిలోనో పడి ఆత్మహత్యలు చేసికొన్న వితంతువు లెంతమంది యున్నారు కారు? ఇది యంతయు విచారింపఁగా మీరున్యాయమైన పునర్వివాహము నరికట్టుట పరమహేయమైన గూఢవ్యభిచారమునకు నరహత్యలకును స్త్రీహత్యలకును కారణమగుచున్నదని మీకు బోధపడుచుండలేదా? ప్రజాసౌఖ్యమునిమిత్తమై ధర్మశాస్త్రములనుజేసి శాస్త్రోపదిష్టప్రకారముగా జనులను నడిపించి ప్రసిద్ధిగన్న యార్యులసంతతివారమని పేరుపెట్టుకొనియు మీరు వారు చేసిన నియమములను మీఱి శాస్త్రవిహితమైన పునర్వివాహమును చేసికోనియ్యక యుత్తమురాండ్రు కాఁదగిన గతిలేని యనాథ కామినులను పకలబాధలును పెట్టి వేశ్యలకన్నను హీనముగా వ్యభిచరించుటకై దింపుటమీకు నగుపాటుకాదా?

ఈవ్యభిచారమువలనఁ గలుగుచున్న నష్టము లివిమాత్రమే కావు. ఇంతకన్నను ఘోరములైన వనేకములున్నవి. వితంతువులు చిన్నతనములోనే స్వతంత్రురాండ్రయి మగని సొత్తంతయువచ్చి తమ్ముజేరిన పక్షమున మఱింత సులభముగా చెడిపోయి తమధనమంతయు మక్కువగల పరపురుషులకు పలుమిషలమీఁద దోచిపెట్టి వయసు మళ్ళిన తరువాత కూటికిని గుడ్డకునులేని నిర్భాగ్యురాండ్రయి యటుకులు కొట్టుకొనియో పూటకూళ్ళు పెట్టియో బంధువులయింటఁ జేరి రోతమాటల కెల్లను తలయొగ్గి వారికుపచారముచేసియో బ్రతుకవలసినవారగుచున్నారు. అట్లు ధనముచేత చిక్కకపోయినా వెలిచవిమరిగిన బాలవితంతువులు పుట్టినింటనో యత్తింటనో యుండి గృహయజమానుల యింటికి తెచ్చిన యుప్పులోనుప్పును పప్పులో పప్పును తమజార

పురుషుల యిండ్లకు నడిపించుచుందురు. కొన్ని సమయములం దంతటితో సరిపెట్టక సమయము దొరికినప్పు డింటనున్న వెండిగిన్నెలో నగలో దొంగిలించి రహస్యముగా వాని నుపతుల పాలుచేసిన విధవలును పలువురున్నారు.

ఆచౌర్య మొకవేళ పట్టుపడినప్పుడుకూడ గృహయజమానులు వెల్లడిచేయక నలుగురకును దెలిసినందము కే యప్రతిష్ఠయని దొంగను తేలుకుట్టినట్టుగా నోరెత్తక యూరకుండవలసిన వారగుచున్నారు. మానహానికంటె ధనహాని యధికమైనదికాదు గనుక మనమీవిషయము నంతగా నొక్కి చెప్పనక్కఱలేదు.

కొందఱు విధవలింటంగల నిర్బంధములకు కట్టుపడియుండలేక కామపరాధీనలయి ప్రియజనకుని ప్రియతరులయిన సోదరులను ప్రియతము రాలయిన తల్లిని నెంతో కష్టముమీఁద విడిచి యేరాత్రివేళనో తమచేతఁ జిక్కినంత సొమ్ముపట్టుకొని తరలించి యేచాకలవానినో యే మంగలివానినో యేతురకవానినో యేదూదేకులవానినో తీసికొనిలేచి పోయి యూరనెక్కడనో గుడిసె వేయుచున్నారు. నడుమ చెడి కులటలయిన యీసాంసారిక నారులగతి మొదటినుండియు కులటలయి వ్యభిచారమే కులవిద్యగానున్న వేశ్యలస్థితికన్నను వేయిమడుఁగులు హీనమయినదిగా నుండును. వేశ్యలు తామితరులను మోసపుచ్చి వారి ధనము నపహరించి తాము బాగుపడుదురు; ఈస్వైరిణులో తామే యితరులచే మోసపోయి తమధనమును వారికి దోచిపెట్టి తాము చెడి పోయి దేహము చెడఁగొట్టుకొని పూటకూటికి గతిలేనివారగుదురు.

వేశ్యలుగ్గుపాల నాటినుండియు నభ్యసించిన మాయలును వేషములును చతురవాక్యములును కల్లవలపులును వీరిచేతఁగావు. వారికివలె కష్టకాలములయందు తోడుపడుటకు వీరికి బంధువర్గమును కులమువారును లేరు. ఇట్లిన్ని విధముల వీరిస్థితి పరమహేయముగానున్నను, నిజ

ము విచారింపఁగా నింటనుండి వ్యభిచరించు వారికంటె నిల్లువిడిచి బహిరంగముగా లేచిపోయినవారే కొంతయుత్తములని చెప్పవచ్చును. ఇల్లు విడిచి లేచిపోయినది తానొక్కతె మాత్రమే చెడిపోయి జాతిభ్రష్టురాలగుచున్నదిగాని, ఇంటనుండి వ్యభిచరించుదానివలె తన కుటుంబము వారిని బంధువులనుగూడ భ్రష్టులనుజేసి వర్ణసంకరులను జేయదు. అయినను తమయింటనున్న స్త్రీ లేచిపోయి తమకన్నుల యెదుట ప్రత్యక్షముగా కులహీనునితో సంసారము చేయుచుండఁగా చూచుటకంటె నవమానకరము మఱియొకటిలేదు. గనుకను, మానహానికంటె మరణమయినను మేలుగా తోచును. గనుకను, ధనికులైనవారట్టి విధవలను మెల్లగా బ్రతిమాలుకొని యాత్రకు వెళ్ళినదనియో బంధుగృహమునకు వెళ్ళినదనియో చెప్పి తీసికొనివచ్చి మరల నింటఁబెట్టుకొని విటపురుషులను సమాధానపఱిచి వాండ్రకు మఱింత స్వాతంత్ర్యమునిచ్చి గూఢవ్యభిచారాసులను ప్రోత్సాహపఱుపవలసిన వారగుచున్నారు.

కొన్నిసమయములందు కులమువారు తమ బహిష్కార పత్రికలతో గృహయజమానులను బెదరింప బయలువెడలినను ధనార్జనము కంటికగుపడినతోడనే భ్రమపడి దక్షిణతోఁగూడిన సమారాధనముతో తృప్తినొంది పిండివంటలను భక్షించి యాసాంకర్యమును తాము కూడపంచుకొని కృతార్థులగుచున్నారు. ఓమహాజనులారా! ఈవర్ణసాంకర్యమెల్లను పునర్వివాహమును మాన్పిన మహాఫలమేకదా! ఈప్రకారముగా సద్వంశమునఁ బుట్టిన ఘూబాలవితంతువులు వంటబ్రాహ్మణులతోను, మ్లేచ్ఛభటులతోను, చాకలవాండ్రు మొదలయిన హీనజాతులతోను చెడితిరుగుచుండుట మీకుప్రతిష్ఠగానే తోచుచున్నదా?

బంధువులకు తమఇంటనున్న యౌవనవతులైన విధవలవలన రెండువిధములైన దుఃఖములు కలుగుచున్నవి. ఆవితంతువులట్టి దురవస్థ

పాలైయుండఁగా చూచెడు దుఃఖముమాట యటుండఁగా వారు దుష్టమార్గముల ప్రవేశింపకుండ కాపాడుటకై పడెడు దుఃఖ మొకటియు వారి దుశ్చేష్టల వలన నేదిద్దైన సంభవించినయెడల దానిని నివారించుకొనుటకయి కలిగెడు దుఃఖము మఱియొకటియు. విధవ లకు పరపురుషసంభోగమునకు ఫలముగా నెప్పుడయినను గర్భము నిలువకమానదు. రండా గర్భముదాచినను నష్టమే వెల్లడిచేసినను నష్టమే.

ఆసంగతి ఇతరులకు తెలిసి పోవునన్న భీతిచేత వితంతువులేసాధ్య మైనంతవఱకు దాచిపెట్టి కులమువారికన్నులు కప్పి తమకు గర్భప్రదా నముచేసిన మహాపురుషుల సాహాయ్యముచేతనో తార్పుకత్తియలసా హాయ్యముచేతనో రహస్యముగా మందులు తెప్పించుకొని గర్భపాత ములుచేసి కొనుచున్నారు. కొన్ని సమయములయం దింతవఱకును నిర పరాధినులుగానుండు తల్లులుసహితము మీా ఘోరపాతకమునకు సహాకారి ణులు కావలసివచ్చును. వారప్పుడు కూతులకు కడుపువచ్చినదని సం తోషించి సూడిదలు పెట్టుటకు మాఱుగా దుఃఖించుచు పిండమువడి పోవుటకు మందులు పెట్టవలసిన వారగుదురు. కొందఱికి యుక్తసమ యములో మందులు లభింపకయు, లభించినను కొన్ని సమయముల యందు దైవయత్నముచేత మనుష్యప్రయత్నములన్నియు విఫలములై వేసినమందులు ఫలింపకయు, మాలుపెరిగి శిశుజననము సంభవించును. అప్పుడు చేయవలసినదంతయు నేవిధముననో కులమువారి కన్నులుకప్పి నిందఁబాపుకోవలెను. కులముకన్నులు కప్పుట కేలాగున శక్యమగును? శిశుహత్యతప్ప దానికి సాధనాంతరము కనఁబడదు. కులమంతయు శిశు హత్యలోనున్నది. శిశువును చంపినచో కులమునిలుచును. చంపకున్న చెడిపోవును. కన్నకడుపగుటచేత శిశువుమొగముచూచి చేతులారచంప బుద్ధిపుట్టక మఱియేమి చేయుటకును తోచక మనస్సులో వేయితేళ్ళును జెఱ్ఱులును కుట్టినట్టు బాధపడుచు కులమునకు వెఱచి తల్లియాపాప

మున కొడికట్టవలసి వచ్చుచున్నది. ఓ పాపపురుషుడా! నీవెంతకరుణమాలిన క్రూరరాక్షసివిగా నున్నావు! ఇదివఱకెన్ని లక్షలమందిచక్కని శిశువులను నీపొట్టను బెట్టుకొన్నావు! నీవింకను నెంతకాలము శిశుకళేబరములతోనే దేహము పెంచుకొనెదవు? నీయశనాశకెన్నటికైన నంతమున్నదా లేదా? ఓహిందూమహాజనులారా! చంపి పాఱవేయఁబడియున్న లేతశిశువుల ముద్దుమొగములను జూచినప్పుడు మృగపక్ష్యాదుల మెడలువిఱిచి పచ్చినెత్తురుద్రాగు ఘోరకిరాతులకయినను దయపుట్టుచుండఁగా మీకేల ఇంచుకయినను కనికరము పుట్టదు? మీహృదయములను భగవంతుఁడినుముతోను రాతితోను జేసినాఁడా? వారి తీవ్రసంతాపమును హృదయములకెక్కింపఁగల మహానుభావుఁ డొకఁడున్న యెడల నినుపబొమ్మలును రాతిబొమ్మలునుగూడ నిలువున నీరయి కరఁగి పాఱకుండవని నేను భావించెదను. మీకీహింసయంతయు చూచుటకు వినోదకరముగానున్నదా? కూనలను నీళ్ళాడినప్పుడు పురుళ్ళుపోసి మనుమలను మనుమరాండ్రను పెంచవలసిన తల్లులను శిశుహత్యలకును గర్భస్రావములకును శోకపడునట్లుచేయుట మీకు వేడుకగానున్నదా? చూచిచూచి శిశువులను చంపనేరని నాఁడు పురుషశిశువులను మూలనాదిగలకియ్యఁగా గొప్పవాండ్రకడుపునఁ బుట్టి యుద్యోగములుచేయుచు నూళ్ళేలవలసిన యాబిడ్డలు మీకన్నులముందఱనే వీధులలో పెంటలు తుడుచుచు మఱికిచీళ్ళెత్తుచు నీచపనులు చేయుచుండఁజూచుట మీకు కన్నులపండువుగానున్నదా?

ఆడుశిశువులను వేశ్యలపాలుచేయఁగా నుత్తమవంశమునందుఁ బుట్టి పతివ్రతాశిరోమణులు కాఁదగిన యాకన్నియలు కన్నకన్న వాండ్రతోను వ్యభిచరించుచు గజ్జెకట్టుకొని ఇంటింట నాడవలసిన వారగుచుండఁగా చూచుటమీకు నేత్రోత్సవముగానున్నదా? వేసినమందులు వికటించి కడుపులోనున్న పిల్లలతోడిపాటుగా తల్లులుకూడ నెందఱు

స్వర్గస్థలగుచుండ లేదా? ఇవి యన్నియు మీకు పుణ్యకర్మలుగానే తోచి పునర్వివాహ మొక్కటి మాత్రమే మీమనస్సులకు పాపకర్మముగా తోచుచున్నదా? ఇవి యన్నియు మీరు పునర్వివాహము నంగీకరింపక పరలోకమునం దనుభవించుటకయి కూడఁ బెట్టుకొనుచున్న దుష్ఫలములేసుండీ.

ఇప్పటి మన దేశపు శిక్షాస్మృతిలో గర్భపాతములును శిశుహత్యలును నేరములని యేర్పడియుండుటచేత నేరములను పట్టుకొనుటకయి నియమింపఁబడియున్న రాజభటులు కొన్నిసమయములయందు లంచములు పుచ్చుకొని భాగ్యవంతులను వదలిపెట్టుచు వచ్చినను ధనదానముచేత వారిని తృప్తిపఱుపలేని నిర్భాగ్యురాండ్రయిన విధవలినైనను కొంతవుందిని రచ్చకీడ్చుచున్నారు. అపరాధము ఋజువుపడిన పక్షమున గర్భస్రావములనిమిత్తమయి మందుల నిచ్చినవారికిని పుచ్చుకొన్నవారికిని తోడుపడినవారికిని కూడ శిక్షకలుగుచున్నది; అదేప్రకారముగా శిశుహత్యలు చేసినవారికిని చేయించినవారికిని సహాయులైన వారికినికూడ క్రూరశిక్షలగుచున్నవి.

కులమునుత్యజింపలేక దానియందని యభిమానముచేత తమ కడుపునపుట్టిన బిడ్డలనుసహితము దయమాలి చంపుట కొప్పుకొన్న యనాథలను మాలవాండ్రచేత నురితీయించునప్పుడా మాలవాండ్రకును దుఃఖము పొరలివచ్చి కన్నులనీరు కాలువలు గట్టుచుండఁగా కులము వారికి సంతోషకరముగానున్నదా! ఈ నేరములుచేసినవారు మాత్రమే కాక నేరముచేసిన ట్లనుమానింపఁబడినప్పుడును మూలనున్న నిరపరాధినిలగు వారుకూడ సభలకీడ్వఁబడి యవమానమును మాయని యపకీర్తిని పొందవలసిన వారగుచున్నారు. ఒకవేళ నేరము ఋజువుపడక వ్యవహారము తేలిపోయినను దానిని తప్పించుకొని బయలపడుటకై చేయవలసిన రహస్యవ్యయములమాట యటుండఁగా రాజసభలకెక్క

నలువురనోళ్ళలోనుపడి నిర్దోషులయిన తల్లిదండ్రులు మొదలయిన వారును వ్యయప్రయాసములనొంది నిందలపాలయి యెప్పుడును పదిమందిలో తలయెత్తుకొని తిరుగలేనివారగుచున్నారు. ఈయపకీర్తికి వెఱచి మందులు మాకులు తెచ్చియియ్యలేక కడుపువచ్చినదని తెలియఁగానే తమ విధవకూతులకే విషముపెట్టి కడతేర్చిన తల్లిదండ్రులెంతమంది యున్నారుకారు?

చిరకాలాచార మహిమచే పాపకార్యమని భ్రమించిన ధర్మకర్మమును నివారించుటకయి మందభాగ్యులయిన బంధువులు ప్రత్యక్షపాతకములయిన యెన్ని ఘోరకృత్యముల కొడిగట్టి వంశపారంపర్యము వఱకును తెగని పాపమును మూటకట్టుకొనుచున్నారు? బాలవితంతువులకు వివాహములేని యీ ఘోరదురాచారము వలననేకదా దోషము చేసిన వారలుండఁగా నిర్దోషులయిన బంధువర్గమునకుకూడ మానహానియు రాజదండనమును నిష్కారణముగా కలుగుచున్నవి?

వివాహములులేక చెడి వెలిచవులు మరిగిన బాలవిధవలతోడి సహవాసదోషముచేత గృహములనుండు పుణ్యస్త్రీలు సహితము పలువురు భర్తలుండియు జారకాంక్షలం బ్రవర్తించి చెడిపోవుచున్నారు. లోకములో సామాన్యముగా చెడునడతలం బ్రవేశించు వారితరులను సాధ్యమయినంత మందిని తమతో సమానులనుగాఁ జేసికొని తమ తప్పునందలి లాఘవమును తగ్గించుకొనుటకయి చూచుచుండుట సహజగుణము. ఆ ప్రకారముగానే దుర్వృత్తియందు ప్రవేశించిన వితంతువులు తమనేరము మాసిపోవుటకయి తమప్రావీణ్యము నంతనుజూపి సాధ్యమయినంతవఱకు మగవాండ్రను సహితము జారత్వమునఁ బ్రవేశపెట్టి, తాచెడ్డకోతి వనమెల్లను జెఱిచిన దన్నట్లు చేతనయినంతవఱకందఱిని తమవంటివారినిగాఁ జేయుచుందురు.

ఈపనికనుకూలముగా సమస్తమును మనచేత చేయించువాఁడు భగవంతుఁడే భగవంతుఁడే కనుక మనమేమిచేసినను దోషములేదన్న మిట్టవేదాంతమును తాము ముందుగా నేర్చుకొని యనుష్ఠించుచు పరులను భ్రమింపఁజేయుటకయి పయికి జపతపములఁ జేయుచు మేక వన్నెపులులవలెనుండి జారత్వము రుచిపడ్డ వితంతువులు కొందఱింట నున్నవారు పతివ్రతలుగానున్నచో తమపయి యాటలు సాగవనియు తమ్ము తప్పుపట్టుచుందురనియు నెంచి తాము నేర్చుకొన్న వేదాంతమునే సమయముచూచి మనసుల కెక్కునట్లుగా నింటనున్న పుణ్యస్త్రీలకుఁగూడ నుపదేశించుచు చిరబోధవలన మనస్సులకు నాటించి వారినిగూడ తమమార్గమునకే దింపుచుందురు. నీటిబొట్టునంటి మృదుపదార్థముపిడుపక పడఁగాపడఁగా రాతివంటి కఠినవస్తువులే క్రమక్రమముగా నఱుగుచుండఁగా తోడివారల దృఢోపదేశములువినఁగా వినఁగా లక్కవంటి స్త్రీలమనస్సు కరుగకుండునా? ఈప్రకారముగాపుణ్యాంగనలలో నొకరినిజూచి యొకరు పాడయినవారసంఖ్యముగా నున్నారని మనలో నెఱుఁగనివారెవరు? అప్పుడొక్కతె నీవు ఱంకుచేసితివని రెండవదాని నాక్షేపించినచో మరల దానిచేత నామాటయే తాను ననిపించుకోవలసివచ్చునని కుక్కినపేనులాగున నోరుమూసికొని పడియుండవలసివచ్చును.

అందుచేత జారత్వము పుణ్యస్త్రీలలోను నిరంకుశముగాచెల్లుచు సమస్తానర్థములకును మూలమగుచున్నది. కాఁబట్టి బాలవితంతువులకు వివాహములేని యీక్రూరాచారమే మగఁడుగలవారినికూడ చెడుమార్గమునదింపుటకుఁ గారణమగుచున్నది.

ఒక్కొక్కపురుషున కొక్కొక్కస్త్రీ భార్యగా నుండవలెనని యుద్దేశించి భగవంతుఁ డించుమించుగా స్త్రీపురుషులను సమానసంఖ్య గలవారినిగానే సృజియించి యుండుటచేతను, మనదేశములో సాధారణ

ముగా లెక్కకెక్కువగా నుండు స్త్రీలు బాల్యములోనే విధవలయి భార్యాత్వ మునకంగీకరింపఁబడక వ్యర్థురాండ్రుగా నుండుటచేతను, భార్యలుపోయిన వారుకూడ మరల కన్యలనే వివాహము చేసికొనవలసినవా రగుచుండుట చేతను, సంఖ్యాతీతులయిన పురుషులు వివాహములుకాక బాధపడు చుండుటకును వారు మదనవేదనకు తాళఁజాలక వ్యభిచారమునందుఁ బ్రవేశించి రోగములు తగిలించుకొని దేహములు చెడఁగొట్టుకొనుట కును సాంసారికస్త్రీలను ప్రయత్నముచేసి చెఱుపుటకును కారణ మగు చున్నది. ఈ హేతువుచేత వివాహమున కర్హురాండ్రయిన స్త్రీలసంఖ్య మిక్కిలి తక్కువయయి పురుషులనేకులకు వేగిరము వివాహములు కాక పోవుటచేత వారుమూడేండ్ల పిల్లదొరకినను చాలునని యెంతసొమ్మయి నను వెచ్చించి భార్యలను కొనుటకు సిద్ధపడుచున్నారు; వారియాతుర తనుజూచి యాశాపిశాచగ్రస్తులయిన తల్లిదండ్రులు ధర్మమునుమఱచి రాక్షసకృత్యమని వెఱవక ధనమున కాశపడి తమపుత్రికలను వృద్ధుల కును దరిద్రులకును వ్యాధిగ్రస్తులకును వికలాంగులకును దయావిహీను లయి విక్రయించి కడుపునపుట్టిన పసిబిడ్డల గొంతుకలుకోయుచున్నారు చిన్నప్పటినుండియు పెంచి పెద్దవానినిచేసి విశ్వాసముచేత తమ్మాఁజేర వచ్చిన పిట్టలను తమపొట్టకయి గొంతుకలుకోసి చంపు కిరాతులకును పితృరూపమున నవతరించిన యీకిరాతకులకును భేదమంతగా లేకపోయి నను తమకడుపునపుట్టిన బిడ్డల నీ ప్రకారముగాఁ జేసి పరమాంస విక్ర యముచేయు నొల్లని యాకిరాతులే వీరికంటె సహస్రగుణముల మంచి వారని చెప్పవచ్చును. ఓకులజనులారా! స్త్రీపునర్వివాహమును మానిపి జ్ఞానములేని ఘాతుకమృగములలో నయినను కనఁబడని యీస్వజాతి హింసమమానవకోటిలో ప్రోత్సాహపఱుచుట మీ కులగౌరవమున కర్హమయిన పనిగానితోఁచు చున్నదా?

ఇంతేకాక వయస్కాలములో భార్యావిహీనులు కాతటస్థించిన పురుషులు వితంతువివాహములు లేకపోవుటచేత తామెదిగిన స్త్రీలను వివాహమాడ లభింపక చిన్నపిల్లలనే పెండ్లియాడవలసిన వారయి వా రెదిగి కాపురమునకు వచ్చునఱకును కామబాధకు సహించియుండలేక వ్యభిచారమునకు దిగి సుఖరోగములపాలయి తాము చెడుటయేకాక భార్యలదేహములనుగూడ చెడఁగొట్టియు, ఈడేరనిపిల్లలకే గర్భాధానము చేయునట్లు తొందరపెట్టి యేడుపులతోను పెడబొబ్బలతోను శోభనగృహమును దుఃఖమందిరమును గాఁజేసి తరువాత పెక్కుబాధలనుపొందియు, బహుకష్టముల ననుభవింపవలసిన వారగుచున్నారు.

చిన్నతనమగుటచేత రెండవపెండ్లిభార్యలు గృహకృత్యములు చక్కబెట్టుకొనుటకు చేతఁగాక యిల్లు పాడుచేయుదురు; ముసలి భర్తలకును పడుచుభార్యలకును మనస్సులును కలియక తఱుచుగా యౌవనవతులయిన యాభార్యలకౌఁగిలింతలు ముదిభర్తలకన్న మంచపు పట్టెలకే యధికముగా లభించుచు పెక్కుచోట్ల వారి సంభోగసుఖము పతులకన్న నుపపతులకే విశేషముగా లభించుచుండును. ఈప్రకారముగా చెప్పుచుఁబోయినచో స్త్రీపునర్వివాహము లేకపోవుటవలన మనదేశమునకు మూడుచున్న కీడు లనంతముగానున్నవి. న్యాయదృష్టిచేత విమర్శించి చూచువారి మనస్సులను స్త్రీపునర్వివాహమునకు సుముఖములనుగాఁ జేయుట కీచెప్పినవే చాలియుండునుగనుకను, ధర్మదృష్టిలేక యాచారమే ప్రధానమని భల్లూకపుపట్టుపట్టి కూరుచుండువారిని సమాధానపఱుచుటకయి లక్షయుక్తులు చెప్పినను కార్యము లేదుగనుకను, ఈనష్టపరంపరనుపెంచి చెప్పమానుకొనియెదను.

ఇంతవఱకును చెప్పినప్రకారముగా దుష్ప్రవర్తనమునందుఁ బ్రవేశింపని బాలవిధవలు పలువురున్నను వారి బ్రతుకుసహితము విరామములేని దుఃఖపరంపరతోనే నిండియుండి మిక్కిలి శోచనీయముగా

నుండుననుటకు సందేహములేదు. వారి ప్రేమకంతకును ముఖ్యాస్పదుఁ డయిన ప్రాణనాయకుఁడీలోకమును విడిచిపోయినందున వారు సుఖపడి మఱుఁగుచొచ్చుట కీప్రపంచములో నాధారమేదియులేదు. దుఃఖ బహుళమయిన యీలోకములో వివాహబంధమువలని సుఖమనుభ వించునప్పుడే స్వగృహము భూతలస్వర్గమువలె నుండును. అది లేన ప్పుడు దివ్యమందిరములు మహారణ్యసదృశములుగానుండి జీవనమే దుర్భరముగానుండును. లోకములో మనుష్యుల సుఖమంతయు నితరే తర సంబంధమువలనను, అన్యోన్యసాహాయ్యమువలనను, పరస్పర బాంధవ్యమువలనను, కాని యెవ్వరిసంబంధమునులేక యేకాకిగా నుండువాని కేసుఖమునులేదు. ఈపరస్పర సంబంధములకును ప్రజాభి వృద్ధికిని యోగక్షేమములకును సుఖసంతోషములకును నిదానమయి నది వివాహబంధము.

వివాహబంధమువలననే భార్యలు, భర్తలు, తల్లులు, తండ్రులు, అత్తలు, మామలు, బావలు, మఱఁదులు, అన్నలు, తమ్ములు, అక్కలు, చెల్లెండ్రు, వదినెలు, మఱదండ్రు, కొడుకులు, కూతులు, మొదలయిన సుఖావహమగు బంధువర్గమంతయు నేర్పడును. వివాహ బంధమువలననే స్త్రీపురుషు లొక్కదేహులయి, ఒకరినొకరు ప్రేమిం చుచు, ఒకరినొకరు సుఖపెట్టుచు, ఒకరినొకరు గారవించుచు, ఒకరి కొకరు తోడుపడుచు, ఆరోగ్యదశయందును రోగసమయమునందును, సుఖకాలమునందును కష్టకాలమునందును, ఐశ్వర్యస్థితిలోను దారిద్ర్య దశలోను, యావజ్జీవము నెడఁబాయక సుఖింపుచుందురు. వివాహ బంధమునకు బద్ధులయి జీవించునప్పుడే స్త్రీపురుషుల కెడతెగని మైత్రి కలిగి, నీతియు గుణసంపదయు వృద్ధినొంది, దైవభక్తి హెచ్చి పాపభీతి యుదయించి, సత్ప్రవర్తనముకలుగును. వివాహబంధమువలన పురుషు నకు సంసారభారము మీదపడి దుర్వృత్తి కవకాశములేక కుటుంబ

భరణము నిమిత్తమును పుత్రాదుల విద్యాభివృద్ధుల నిమిత్తమును పాటుపడవలసినట్లే స్త్రీకిని గృహకృత్యనిర్వాహభారము పతిశుశ్రూష శిశుపోషణాదులు మొదలయిన పనులు పయినిబడి శుష్కకలహములకు పరదోషకథలకు నవకాశములేక పాతివ్రత్యమును మంచినడవడియును పట్టుబడును. దిక్కులేనివారికిని దిక్కుకలుగుటయు వార్ధకమునందును భరణరక్షణములు గలుగుటయు వివాహబంధమువలనఁగాక మఱి దేనివలనఁగలుగును! వివాహబంధమే లేనియెడల స్త్రీపురుషుల పరస్పరసబంధమును ప్రేమానుబంధమునులేక, శిశుపోషణము జరగక బిడ్డలవిద్య వృద్ధికాక, కాలక్రమమున మనుష్యులు మృగప్రాయులుకారా!

ఏకాకిత్వముచేత దేహమునకును మనస్సునకును తగినంత పనిలేక, పాపచింతనలుగలిగి, మనుష్యులు పాపకార్యములయందు తగులుకొనరా? మగనితోను పుత్రులతోను నున్నప్పుడు కష్టములు సహితము నిరుత్సాహమును నిరాశను కలుగనీయక ధర్మమార్గమున నడిపించుటకును భగవద్భక్తిని వృద్ధిచేయుటకును శాంతము ధైర్యము మొదలయిన వానిని నేర్పుటకును సాధనములగును. పుత్రాదుల సంరక్షణము నిమిత్తమును విద్యానిమిత్తమును తమకడుపు కట్టుకొని సకలశ్రమలకును లోనయినను తల్లులెంతమంది లోకములో తమవంటి ధన్యురాండ్రెవ్వరును లేరని సంతోషింపుచున్నారు? పుత్రులతోఁగూడి యనుభవించు సుఖముద్విగుణముగా కనఁబడును; కష్టము సగమునగ్గి నట్టుండును. ఆ పరియోజకుఁడయినను దరిద్రుఁడయినను మగనితోఁగూడి సంసారసుఖమనుభవించునప్పుడు చుట్టును కష్టములుండి మహారణ్యమధ్యముగా నున్నను గృహము స్వర్గమువలెనే యుండును. మగఁడొక్కఁడుదాంటిపయిని మఱియేవి లేకపోయినను, ఆలోపములేవియు కనఁబడవు; అన్నియు నుండి మగఁడొక్కఁడు లేకపోయెనా లోకములోని వన్నియు లోపములుగానే తోచును. మగఁడున్న యెడల భార్యమానమును కాపా

డును; కుటుంబమును పోషించును; గౌరవమును కలుగఁజేయును. అవి
యేవియు లేకపోయినను పతిపుత్రాదుల సమావేశమే స్త్రీకి సంతోష
జనకముగా నుండును; ప్రణయకలహములు సహితము మనోహరముగా
నుండును. భర్తలేనియెడల స్త్రీ తన్నొరు లవమానపఱిచిన యెడల
నెవ్వరితోఁ జెప్పుకొని దుఃఖశాంతి పొందును? కష్టములు వచ్చినప్పుడు
తానెవ్వరి మఱుఁగుచొచ్చును? మనోవ్యాకులత కలిగినప్పుడు తన్నుఁ
జేరఁదీసి యాదరించువారెవ్వరు? తనమనస్సు దుర్విషయముల మీఁదికి
పోయినప్పుడు బుద్ధిచెప్పి మరలించువారెవ్వరుందురు? కార్యాకార్య
విచారమునందు సంశయము కలిగినయెడల మనసిచ్చి యాలోచన చెప్పు
వారెవరుందురు? తనరూపమును గుణసంపదను జూచి మెచ్చుకొనువా
రెవరుందురు? భర్తృవియోగము వలన స్త్రీల కిటువంటి సుఖములన్ని
యుపోయి బహుకష్టము లాశ్రయించినప్పుడు కులమయినను వారిని
మఱింత హింసపెట్టుటకు సిద్ధపడునే కాని వారియెడల లేశమయినను
కనికరముపూని దుఃఖనివారణమునకు సాధనమును జూపకున్నది. పతి
పోయిన యుత్తరక్షణమునుండియు సమస్తసుఖములకు నాధారభూత
మయిన యీప్రపంచము వారిపాలిటికి బహుళదుఃఖప్రదముగామాత్ర
భారముగా కనఁబడుచుండును. నొసట కుంకుమబొట్టు పోయిలోని
బూడిదబొట్టుగా మాఱుచున్నది; చేతుల బంగారు కంకణములు రాగి
పట్టెలుగా మాఱుచున్నవి; మెడలోని ముత్యాలహారములు తులసి
పూసలపేరులుగా మాఱుచున్నవి;

అమూల్యములయిన సరిగంచు పట్టుచీర లంచులేని పనికిమాలిన
ముదిగుడ్డలుగా మాఱుచున్నవి; పట్టెమంచములమీఁది మెత్తని పఱు
పులు కటికినేలను తాటిచాపలుగా మాఱుచున్నది; పిండివంటలతోడి
షడ్రసోపేతములయిన లుప్పిడిపిండిగా మాఱుచున్నవి. మనుష్యులు
నడుమపెట్టిన యలంకారములనుమాత్రమే కాక భగవంతుఁడు పుట్టుక

తోనే దయచేసిన నల్లని నిడుదశిరోజము లనెడి యమూల్యాలంకార ములనుగూడఁ దీసివేయించుట సుందరుల కెంతసంతాపకరముగా నుండును? చిన్నప్పటినుండియు చమురురాచి పెంచుకొని నిత్యమును దువ్వుకొనుచు పువ్వులు ముడుచుకొనుచు ప్రాణముతో సమానముగాఁ జూచుకొనుచున్న తలవెండ్రుకలను మంగలివానికఠినకత్తుల కొప్ప గించుటకంటె మానవతుల కొక్కసారిగా తలకొట్టివేయుటయే యుత్తమముగా తోచదా! గతదినమువఱకును మూడుపూటలును కడుపునిండ సుఖభోజనము చేయుదానిని ప్రాణము కొసపిల్లునట్లుగా మూడుజాములకిన్ని మెతుకులువేసి మాడ్చి జీవచ్ఛవమునుగా నుంచుట యెంతదుఃఖకరముగానుండును! పెండ్లిదినములలోతప్ప మంగళసూత్రం కట్టినవాని మొగమెప్పుడును మరల చూడకపోయినను లోకులు భర్త యని పిలుచువాఁడు కాలధర్మము నొందినంతమాత్రముచేత తైలాభ్యం జనాది సమస్తభోగములను మాపించి పసిబాలికను సహితము సమస్త సుఖములకును దూరముగా చేయుట యెంతపరితాపకరము?

“పర్యంకశాయినీ నారీవిధవాపాతయేత్పతిమ్” అనుటవలన, ఆ చిన్నది యొక్కసారి మంచముమీద పరుండెనా స్వర్గములోనున్న భర్తతలక్రిందుగా నధోలోకమునఁ గూలునట! ఆముద్దరాండ్రకు పూర్వము తాము పెట్టుకొన్న నగలను చూచినను, కట్టుకొన్నబట్టలు చూచినను, పరుండుమంచములు పఱపులు చూచినను, మనస్సుదహిం చుకొనిపోయి దుఃఖము పొరలిపొరలి రాదా? తనయీడు సువాసనులు నగలు పెట్టుకొన్నను మంచిచీరెలు కట్టుకొన్నను తమ బ్రదుకాప్రకార ముగా కాలిపోయిన దాయని మనస్సు భగ్గున మండుకొనిపోదా? తన తోడివారు శుభకార్యములయందు పేరంటములకుఁ బోవుచున్నను భోజ నములకు పోవుచున్నను తానట్టినోము నోచుకోలేదుగదా యని గుం డెలు బద్దలుకావా? తనతోడివారు బిడ్డలను కని పెంచుచు మగనితో

సంసారము చేయుచుండుట చూచునప్పుడును వారిసుఖమును తలంచుకొన్నప్పుడును కడుపు పగిలిపోదా? భర్తలుపోయిన ముద్దరాండ్రెంత పిన్నవయసువారయినను పొరుగింట వివాహాది మహోత్సవములు జరగుచున్నప్పుడుకూడ పోయి వేడుకచూచుటకు నోచుకోలేదుగదా? పొరుగింటిదాఁక పోనేల? తమయింట నేశుభకార్యము జరగుచున్నను నలుగురితోను గలిసి సంతోషముగా తలయెత్తుకొని తిరుగుట వల్లగాక యెవరికంటను బడక దైవమింత జేసెనుగదా యని యేడ్చుచు నేమూలనో యుడిగిపడి యుండవలెను. వేయిమాటలెందుకు? లోకములో పండుగులు మొదలయినవి వచ్చి యందఱకును సంతోషదినములుగా నుండునని యెల్లను వారికి దుఃఖదినములుగా నుండును. పెద్దలయిన తల్లిదండ్రులు గదిలోపలనుండి సుఖమనుభవించుచున్నప్పు డీవల పంచనుజేరి యొక్కరాత్రి విధవలయిన జవ్వనులు పడుక్లేశ యింతంతని యెవ్వరికి చెప్పశక్యమగును? మగడుపోయిన కూతురు తమపడకగది గుమ్మము వెలుపల కటికినేలను చాపమీఁద నొంటిగా కూలి తన దుర్గతి దలఁచుకొని విలపించుచుండఁగా దయాలేశముగల జననీజనకులకు రాత్రులు తాము లోపల పట్టెమంచములమీఁద శయనించి నిర్విచారముగా సుఖమనుభవించుటకంటె మరణమునొంది స్వర్గసుఖమనుభవించుట యుక్తముగా తోచదా? పుట్టినప్పటినుండియు ప్రేమతో పెంచి తమప్రాణములకంటె నెక్కువగాఁ జూచు కొనుచున్న తల్లిదండ్రులకు జీవితేశ్వరులను పోఁగొట్టుకొని దుఃఖసాగరమునందు మునిగి తమ పాలబడ్డ ముద్దుకూతుల నాదరించి పతిశోకమును మఱచునట్లు చేయుటకును మాఱుగా కరుణమాలి క్రూరమయిన కులాచారమునకు దాసులయి వారిని విరూపము నొందించి యావజ్జీవము తీఱని కష్టములపాలు చేయవలసివచ్చుట యెంత మనస్తాపకరముగా నుండును.

అట్టి యనాథకాంతల దుఃఖములనుజూడ నోచుకొన్న యత్త మామలకును బావమఱఁదులకును తక్కిన బంధువర్గమునకును కలకాల దుఃఖము కలుగుచుండదా? మన దేశములో విధవాధర్మములేవో కొంచెము మనస్సు నందుంచుకొనుఁడు.

"శ్లో॥ రండానాం సతతంధర్మః ఉదయాత్సరమేవవై। నిత్యస్నానం తతో బంధు సన్నిధానేవసంతతం॥ నివాసోగుహ్యాసంభాషా సచ్ఛ్రశూషా సదాశ్రయః। చతుర్థకాలభుక్తిశ్చ దధిక్షీరాజ్యవర్జనం॥ సుగంధవస్త్రాలంకార గీతాదీనాం విసర్జనం తాంబూలాంజనపుష్పాణాం సతతం దూరవర్జనం॥ ఖట్వాతల్పాదిశయనం శరీరోద్వర్తనం స్రజం। అభ్యంజనంచోష్ణవారిస్నాన మాందోళికాదికం॥ పునరన్యానిసర్వాణి వస్తూని నచకామయేత్। దురాలాపం దుష్టచింతాం నిగ్రహానుగ్రహార్థతాం॥ పుణ్యాధికార కళ్యాణయజ్ఞ కార్యాదికర్తృతాం। కుర్వతీతాడనీయా పాతత్స్వీయగురుసంజనైః॥ క్షారంచలవణం దివ్యం మధురంసూపకం తథా। వర్జయిత్వావిశేషేణతిక్తం కటుకమేవచ। ప్రాశయేద్భోజయేన్నిత్యం గ్రాసార్థేనైవజీవనం॥ ఆషష్ఠివర్ష పర్యంతమేవం కాలంప్రయత్నంః। ప్రాణవృత్తిం ప్రకుర్వీతవయసశ్చరమేతతః"

అను కపిలస్మృతి ప్రకారము భర్త కాలముచేసిన యబల పెరుగుత్రాగకూడదు; పాలుత్రాగకూడదు; సుగంధము దరికి చేరనీఁగూడదు; మంచిబట్టకట్టుకోఁగూడదు; అలంకారముకూడదు; పాటవినఁగూడదు; తాంబూలము వేసికొనకూడదు; కాటుక పెట్టుకొనరాదు; పుష్పములను దగ్గరకు రానీయరాదు; మంచము పరుపు మొదలైన వానిమీఁద పరుండఁగూడదు; శరీరము నలుగుపెట్టుకోరాదు; తల యంటుకోరాదు; వేడినీళ్ళు పోసికోరాదు; పల్లకి బండి మొదలైనవి యెక్కఁగూడదు; ఇటువంటి ఇతరములైన సమస్త వస్తువులను కోరరాదు; ఒకరిమీఁద దయచూపరాదు; కోపపడఁ

గూడదు; పుణ్యకార్యములు చేయఁగూడదు; శుభకార్యములు చేయఁగూడదు; ఈకార్యములలో నేవిచేసినను తల్లిదండ్రులచేతను బంధువులచేతను దెబ్బలుతినవలెను; ఉప్పుతినఁగూడదు; పప్పుతినగూడదు; ఒగరును చేదును కారమును మాత్రమే తినవలెను; అఱువదిసంవత్సరములు వచ్చువఱకు నొక్కపూట సగముతిండి తినవలెను. ఇవిగాక 'రండాపాకం సదాత్యాజ్యం ప్రవదంతిమనీషిణః' శ్రాద్ధాదులయందును శుభకార్యములయందును మాత్రమేకాక ఇతరసమయములయందును విధవ చేసిన పాకము నెవ్వరును భుజింపరాదు. లోకములో నాడుపుట్టుకపుట్టి మగనిని పోగొట్టుకొని కలకాలము నిటువంటిబాధలు పడుచుండుటకంటె నొక్కసారిగా మరణము నొందుట యెంతహాయిగా నుండును? దొరతనము వారు క్రూరకృత్యమని తలంచి సహగమనమునుమాన్పించి లోకోపకారము చేసినను భాగ్యహీనలయిన విధవలదురవస్థలను తలఁచుకొనఁగా వారిపాలిటికది యొకయపకారమే యయినదనియు వారికందువలన నుద్దేశించిన మేలు కలుగలేదనియు నేను భావించెదను. ఈప్రకారముగా బ్రతికియున్నంత కాలమును సమస్తసుఖములను బాసి నిరంతరదుఃఖమును తీవ్రమనోవేదనను పొందుచుండుటకంటె బ్రతికి యుండఁగానే చచ్చినశవముతో పెట్టికట్టి కాల్పఁబడి కాని పూడ్వఁబడికాని గడియలో ప్రాణవియోగమును పొంది యీబహుళదుఃఖములనుండి విముక్తిపొందఁగాంచుట యెవరికభ్యర్థనీయముగాఁ గనఁబడదు? ఇట్లు చెప్పుటచేత సహగమనమును మాన్పినఫలము స్త్రీలకు కలిగించుటకై పునర్వివాహములను తగినంత ప్రోత్సాహ పఱుపవలయుననియు పునర్వివాహముచేసి కొన్నంతమాత్రముచేత పెద్దపులులవలె మీఁదపడి బాధింపఱంకెలువేయు మతాచార్యాదుల యుపద్రవములనుండి యనాథబాలికల రక్షింప వలయుననియు నాయభిప్రాయమేకాని సహగమనము క్రూరకృత్యముకాదని కాని దానిని మాన్పఁగూడదని కాని నాయభి

ప్రాయమెంతమాత్రమును గాదు. మనదేశములోని విధవలుపడు బాము లివిమాత్రమే కావు. అనాథలయిన కాంతలు తమజీవనాంశమునకై భర్తబంధువులతో తగవులుపడి దారిగానక న్యాయసభలలో వ్యాజ్యములకు దిగినప్పుడు భర్తలు ఋణములు చేసిపోయిరనియు, పిత్రార్జితమయిన సొత్తులేదనియు, ఉన్నది స్వార్జితమనియు, ఆసతులు వ్యభిచారిణులనియు, వాదించి దొంగసాక్షులను కుదిర్చి యప్రమాణములు చేయించి యసత్యము పలికించి వివిధమాయోపాయములుపన్ని వారి భరణము నెగఁబెట్టయత్నింతురు. ఒకవేళ నాపురుషోత్తముల ప్రయత్నములు ఫలింపక భగీరథప్రయత్నముమీఁద నావిధవలకు న్యాయాధిపతియొక్క పూటతిండికై నను చాలీచాలనట్టుగా తీర్పు చెప్పినయెడల దాని నపహరించుటకై యున్నసొత్తును బంధువులపేర వ్రాయించియు రాజభటులు వచ్చినప్పుడు తాము మొగము చాటువేసి సొత్తేమియు నగుపడకుండ దాచియు, మాయవేషము లెన్నిన్నియో వేయుదురు. ఓహో! మగఁడుచచ్చి యేడ్చుచున్న యనాథల కొక్కపూట తిండికి చాలీచాలని జీవనాంశము నియ్యవలసివచ్చునని వారి మగలభాగము నంతయు వేసికొనియు మనవారు వితంతువులమీఁద లేనిపాపములు మోపి యెటువంటి యకృత్యములకులోనయి తాము సుఖపడఁజూచుచున్నారు. ఇటువంటి గతిమాలిన విధవలు పుట్టినిల్లుచేరి వారియండను జేరి బ్రతుకవలసియుండును. తల్లిదండ్రులొకవేళ తమ యనాథపుత్రికలను వీలైనంతప్రేమతోనే చూతురన్నను, వదినెలును, మఱదండ్రును వారిమీఁదఁ దనుకాప్రేమ యుండనేరదు. గనుక పోయినభర్తల నిమిత్తమయి వారేడ్చునప్పుడెల్ల వారములేక వర్జ్యములేక నిండిన ఇంటిలో నేడ్చుచున్నదనియు దొంగయేడుపనియు తప్పులుపట్టుచు, వారిభరణమునుగూడ తామేపుచ్చుకొని మూడుజాముల కిన్ని మెతుకులువేసియు దానెదుబ్రమింగునని విసుగుకొనుచు, ఒక్కపూట పట్టెడు మెతుకులకై

యహోరాత్రములు విరామము లేకుండ నింటి పనినంతయుఁ జేసి యడ్డ మైనవాండ్రచేతను రోతమాటలుపడుచు నెవ్వరేకాని కూతలు కూసి నను తలయొగ్గి యూరకున్నను మఱింతబాధపెట్టుచు, వారిజీవనమును దుర్భరముగాఁ జేయుచుందురు.

ఇంట నెవరికేవిపత్తు సంభవించినను విధవలే దానికి కారణ మగుదురు! వీధిలోనికి ప్రయాణమైనప్పుడు విధవముఖము కనఁబడినను విధవ యెదురుగావచ్చినను దుశ్శకునమైనదని యెల్లవారును చెడతిట్టు దురు. ఎంతో ప్రేమతోఁ జూచుచుండు సోదరులుసహితము నిద్రలేచిన తోడనే విధవతోడఁబుట్టినపడుచు కనఁబడినపక్షమునను ప్రొద్దుననేలేచి విధవముండ మొగముచూచితిని నేడేమికీడు మూడునోయని చిరాకు పడుచుందురు. వారిని చూచినవారందఱును వారెంతోపాపముచేసిన వారినిగా భావింతురు; ఈనిర్భాగ్యురాలు భార్యయయి మగనిని చంపినదని దూషింతురు. ఆహా! ఈలోకములో విధవలకు సుఖమన్న మాటయేయుండక వారిజీవనమే నిరర్థకమై వారుబ్రతికియుండియు చచ్చినవారితో సమానలుగానే యుందురుగదా? ఓహిందూమహా జనులారా! పరులవలని బాధలక్కఱలేక ప్రాణవల్లభులు పోవుటచేతనే దుర్వార దుఃఖములపాలయి కుమిలి కృశించుచు నెల్లవారికిని దయ నీయులు కాఁదగిన యనాధయువతులను కరుణించి యాదరించుటకు మాఱుగా మీదుమిక్కిలి నిష్కరుణులయి పొట్టకు తిన్నగా మూడు పూటలును తిన్నంత యన్నమునైన పెట్టక సగముమాడ్చి చంపుచు గృహమునఁగల హీనమయిన కష్టపుపనియంతయు వారిమీఁదనే వేసి మీరనేకవిధముల బాముపెట్టుచుండుటచేతనేకదా లోకములో దయను పురికొల్పవలసిన "విధవా" శబ్దము భాషలోని పదములలోనెల్లను కర్ణకఠోరమైనదిగా మాఱిపోయినది! "విధవ" యను పేరుకంటెను నీచమయినదియు, అవమానకరమయినదియు రోషమును కలిగించు

వదియు, మన దేశములో మఱియొకపదమున్నదా? ఎంతనీచునినయినను "విధవా" యని పిలిచినంతమాత్రమున మండిపడి వాఁడదియెంతో గొప్పతిట్టుగా భావించుకొని తన్నామాట యన్నవానిని మ్రింగివేయఁ జూచుచున్నాఁడు. ఒకనిని "పశువా" యన్నను కొంత సహింపఁ గలుగునుగాని "విధవా" యన్ననించుకయు తాళఁజాలఁడు. దీనినిబట్టి విధవలయవస్థ మృగములదానికంటెను మన దేశములో హీనమయి నదిగా నున్నట్టు మీరూహించుకోవచ్చును. అయ్యో! ఇటువంటి సంతాపకరమయిన దశలోనిలిచి యనాథలయిన యబలలెంతకాలము నుండి మన దేశములో కన్నులనీరుకార వెతకుడుచుచున్నారోకదా! కటకటా! ఈయనాథకాంతలకన్నులనుండి వెలువడిన జలమంతయు నిలువయుండిన యెడల దేశమునందంతట నెన్నిబాష్పనదులు ప్రవహించుచు నెన్నిమహాసముద్రము లేర్పడునో! ఓనిర్భాగ్య వితంతువులారా! మీ యాపదలు తలచుకొన్నప్పు డెటువంటి రాతిగుండెయయినను నీరుగా కరుగకుండునా? పాపపువిధి మిమ్మమఱియొకచోట పుట్టింపక యీహిందూదేశమునందు దయాశూన్యులయిన ద్విజులకడుపున నేలపుట్టించుచున్నాఁడు? మీరిందు జన్మింపక పక్షుల మెడలువిఱుచుకొనితిను కిరాతుల కడుపునఁబుట్టినను పునర్వివాహములు గలిగి కొంత సుఖపడుదురుగదా? ఈదేశమున నగ్రవర్ణముల వారిలో స్త్రీలయి పుట్టెడుపాపము పగవారికయినను కలుగక పోవునుగాక! ఓమహాజనులారా! మీరొక్కనిమిషము పక్షపాతముమాని స్త్రీలయవస్థను సమబుద్ధితో విచారించి స్త్రీపునర్వివాహమున కనుజ్ఞయిచ్చి శుద్ధమయియుండిన మన యార్యకులమునకంతకు నపకీర్తికరముగానున్న యీదురాచారకళంకమును బాపుకొని హిందువులనాథలను హింసపెట్టుచున్నారన్న యీ నిందను సాధ్యమయినంత శీఘ్రముగా తొలఁగించుకొనుటకయి ప్రయత్నింపుఁడు.

ఒకపురుషుఁడు తన జీవితకాలములో నెంతమంది భార్యలనయినను చేసికోవచ్చును; ఒకస్త్రీ పసితనములో భర్తపోయినను యావజ్జీవమును మరల వివాహము చేసికోఁగూడదు. కామునుఁడిగి కాటికి కాళ్ళుచాచుకొనియున్న ముసలివానికిసహితము భాగ్యహీనురాలయిన మూఁడేండ్ల పసికూనను వివాహమాడి యావజ్జీవమును దాని కొంపతీసి హింసింప ననుజ్ఞయిచ్చి, మూఁడేండ్ల ముద్దరాలికి మగఁడుపోయినను బ్రతికియున్నంతకాలమును వివాహములేక రూపమును యౌవనము నడవిలోఁగాచిన వెన్నెలకాఁగా ప్రాణమున్నంతకాలమును దుఃఖపడవలెనని నిర్బంధించుట యేమిన్యాయము? ఏమిధర్మము? విధవావివాహము మంచిదని జంకమాని నిశ్శంకముగా బహిరంగముగా సభలలో చెప్పలేకపోయినను, కులమువారియెదుట నొప్పుకోలేకపోయినను, గృహమునకుపోయి తనముద్దులకూఁతురు సంపూర్ణయౌవనమధ్యమున ననాథయయి దీనముఖముతో శోకదేవతరూపముదాల్చి వచ్చినట్లు సుఖహీనయయి యింటమూలఁ గూర్చుండఁగా చూచునప్పుడును రూపమున రతీదేవిని మించెడి తనప్రియసోదరి సంపూర్ణచంద్రబింబమును బోలెడు ముఖము వాడిపోయి పోయినభర్తకయి దుఃఖించుచు పుష్పపల్లవసమావృతమైన కోమలలత యకాలమున చీడపట్టి యెండఁబాఱినట్లుగా కుందనమువంటి యంగములు శోషిల్లి వయస్కాలమున శుష్కింపఁగాఁ జూచునప్పుడు హృదయముపగిలి పాపపు పూర్వాచారమును నిందించి పునర్వివాహములను కోరనివాఁడెవఁడుండును? ఇంచుమించుగా లోకములో స్త్రీపురుషులు సమానముగా నుండుటయు, వయసుచెల్లి సుఖపడవలసినకాలము పోకముందే పురుషులకనేకులకు భార్యలుపోయినట్టే స్త్రీలకును భర్తలు పోవతటస్థించుచుండుటయు చూడఁగా పురుషులవలెనే స్త్రీలును పునర్వివాహము చేసికోవలసినది భగవదిష్టమనియు ధర్మమనియు మీకు తేటపడుచుండలేదా? ప్రపంచ

ని లో స్త్రీలును పురుషులును సంఖ్యయందించుమించుగా సమానము గానే యున్నను, పురుషులు యుద్ధాదులవలనను సముద్రయాత్రలు మొదలయిన కష్టకార్యములవలనను సులభముగా నశింపవలసినవారుగా నుందురుగనుక సామాన్యముగా పురుషులసంఖ్యయే కొంచెమధికముగా నుండును. దీనినిబట్టి విచారింపఁగా నొక్క పురుషున కొక్క స్త్రీయుండి వివాహసంబంధమువలన వారుపరస్పర సుఖమనుభవింపవలసిన వార నుట కరతలామలకమగుచున్నది కాదా? అట్లు లేకపోవుటవలన నొక్క స్త్రీలుమాత్రమే కాక మొత్తముమీఁద పురుషులును బహుబాధలకు లోనుగావలసినవారగుదురు. మూఁడునాలుగు సంవత్సరముల క్రిందట గణించిన లెక్కప్రకారముగా మనహిందూదేశములో ౧౯,౨౮,౫౧, ౫౨౩౧ జనులున్నట్లు కనఁబడుచున్నది. వారిలో ౧౨,౮౫,౪౧,౮౯౧ రు పురుషులు; ౧౨,౩౫,౭౫,౫౭౦ రు స్త్రీలు. ఆస్త్రీలలో నాలవవంతు కంటె నధికముగా ననఁగా ౨,౦౫,౩౮,౬౨౬ ను విధవలుగా నున్నారు. వారిలో తొమ్మిదిసంవత్సరములకు లోపు వయసువారు ౭౮,౫౭౬ మను తొమ్మిదిసంవత్సరములకు పయిఁబడి పదునాలుగు సంవత్సరములకు లోపలి వయస్సులో నున్నవారు ౨,౦౭,౩౮౮ మను, పదునాలుగు సంవత్సరములుదాటి పందొమ్మిది సంవత్సరములకు తక్కువప్రాయముగా నున్నవారు ౩,౮౨౩౬ రును, మొత్తమిరువది సంవత్సరములకు లోపలియీడుగల బాలవిధవలే మూఁడులక్షల యిరువది తొమ్మిదివేల తొంబండ్రున్నారు. మనహిందూదేశములో ప్రతి సంవత్సరము నిన్నిలక్షలయనాథ బాలికలు పతివిహీనలయి కలకాలమును తీఱని వెతలపాలగుచుండఁగా ప్రతిక్రియ చూడక యుపేక్షించి యూరకుండుట దయాలేశముగలవారికి ధర్మమగునా? భగవంతునిబిడ్డలై మనదేశమునఁ బుట్టిన యనాథబాలిక లింతమంది ప్రతిదినమును మనకన్నులయెదుట కన్నులనీరు సంతతధారగా కారనేడ్చుచు గతిలేక

బాధపడుచుండఁగా దయఁజూపలేని మనము సిగ్గులేక యే మొగము పెట్టుకొని మావిషయమున దయచూపుమని భగవంతుని వేడుకోఁగలము?

ఆసంగతి యటుండనిండు. స్త్రీపునర్వివాహములకు ప్రతిపక్షులుగానున్నవారు విధవోద్వాహములు చేసినను వ్యభిచారము మానదనియు వానివలన శిశుహత్యలకు మాఱుగా పతిహత్యలు జరుగుననియు, అతిప్రజాభివృద్ధి కలిగి దేశమునకు క్షామము సంభవించుననియు, మనము వివాహమాడిన స్త్రీలు మన మరణానంతరమయినను మఱియొక భర్తతో కాపురము చేయుదురన్నమాటయే వినుట కసహ్యముగా నుండుననియు, వితంతువులు తమస్థితి కలవాటుపడి సుఖమునే యనుభవించుచున్నారనియు, ఒకభర్తను పొందిన స్త్రీతోడి సంభోగమున కెవ్వరు నంగీకరింపరనియు, గొల్లలు మొదలయినవారివలెనే యగ్రవర్ణములవారిలోకూడ మాఱుమనువులు చేసినయెడల వారిగౌరవము పోవుననియు, వివిధములయిన యాక్షేపములను జేయుచున్నారు.

విధవావివాహములు నెలకొల్పినంతమాత్రముచేత వ్యభిచారము సంపూర్ణముగా నశించునని నేనును చెప్పఁజాలనుగాని చాలవఱకు తగ్గునని మాత్రము దృఢముగాఁ జెప్పఁగలను. ఒకదోషమును మనము పూర్ణముగా నశింపఁజేయలేము గనుక సాధ్యమయినంతవఱకు దానిని తగ్గించుటకయి ప్రయత్నము చేయఁగూడదనుట సయుక్తికముకాదు. లోకములో నధర్మమెప్పుడును పూర్ణముగా నశించుట సంభవించదు గనుక బుద్ధిమంతులగువారు సాధ్యమయినంతవఱకు మేలును పెంపు చెందించుటకును కీడును తగ్గించుటకును సదాపాటుపడుచుండవలయును. రక్షకభటులు నేరములన్నిటిని పట్టుకోలేరుగనుక, ఆరక్షకశాఖనే తీసి వేయవలెననుట యుచితముగా నుండుననియు న్యాయాధిపతులన్ని వ్యవహారములలోను న్యాయమును కనుగొనలేరుగనుక దొరతనము

వారు న్యాయసభలన్నియు నెత్తివేయవలెననుట బుద్ధిమంతు లంగీకరింపఁదగియుండునా?

ఔషధములవలన సమస్తరోగములును కుదురుచుండలేదుగనుక వైద్యమెప్పుడును చేయింపఁగూడదనుట వివేకులు మెచ్చఁదగియుండునా? జగత్తులో మనము చేయవలసిన పనులన్నియు శక్యమయినంతవఱకు కీడును తగ్గించి సుఖాభివృద్ధిచేయుటకొఱకే గనుక, మనము స్త్రీపునర్వివాహము నంగీకరించుటయు దోషనివారణమయి సుఖాభివృద్ధికలుగుకొఱకే యయియుండవలెను. స్త్రీపునర్వివాహమును పునరుద్ధారణము చేయుటవలన నొక్క వ్యభిచారముమాత్రము పూర్ణముగా పోకపోయినను గర్భస్రావములును భ్రూణహత్యలును శిశుహత్యలును పూర్ణముగా నశించుననుటకు సందేహములేదు. పుణ్యస్త్రీలకువలెనే వయసులోనున్న విధవలకును కామశాంతికయి న్యాయమయిన మార్గమును కనఁబఱిచినయెడల వారప్పుడు వ్యభిచరింతురేని దొంగలను శిక్షించినట్లు శిక్షించి వ్యభిచారమునడఁచుటకు సాధ్యమగునేకాని మఱియొకవిధముగా సాధ్యముకాదు. ఆఁకలిగొనియున్న వానిని గొనిపోయి భోజనపదార్థములతో నిండియున్న యొకగదిలోపెట్టి తాళము వేసి న్యాయమార్గమున పాటుపడి సంపాదించి క్షుత్తుతీర్చుకొనుట కవకాశమియ్యక నిరోధించి వారు క్షుద్బాధకు తాళలేక యాగదిలోని యాహారపదార్థములలో నేదయినభక్షించినచో వారిని దొంగతనము చేసిరని దండించుట యెంతన్యాయముగానుండునో, అట్లా దొంగతనమును మాన్పుట యెంతవఱకు సాధ్యమగునో మీరే యాలోచించుకొండు. అట్టిస్థితిలో పయినిర్బంధములనుబెట్టి శిక్షించువారినే యందఱును క్రూరులందురుగాని దుస్సహమయిన క్షుత్తును తీర్చుకొనుటకయి యా భోజ్యపదార్థభక్షణము చేసినవారి నెవ్వరును దోషులని దూషింపరు.

కాఁబట్టి యీసంగతిని మీరుమనసునం దుంచుకొని, కామపీడితులయియున్న యనాథయువతులను కాముకజన మధ్యమున వసించునట్లుచేసి కామశాంతికయి వారికున్న న్యాయమార్గమును నిరోధించి యందుచే వారక్రమమునకు దిగునట్లుచేసి తరువాతనయినను క్రమమయిన మార్గముచూపఁ బ్రయత్నించుటకు మాఱుగా వారిని శిక్షింతుమందురేని వివేకులయినవారు మిమ్మెట్టివారినిగా భావింతురో మీరే సమబుద్ధితో విచారించుకొనుఁడు. క్షుద్బాధవలె కామబాధయంతనివారించుకో శక్యముకానిదాయని మీరడుగవచ్చునుగాని పయినుండి యితరులవిషయమయి తేరగామాటలు చెప్పుటకంటె కామనిగ్రహము చేయుట యౌవనదశలో నెంతసాధ్యమగునో వివాహమును మానుకొని స్వవిషయములో ననుభవముచేత పరీక్షించిన పక్షమున మీకే స్పష్టముగావిశదమగును. విద్యావివేకములుగలిగి స్థిరచిత్తులమని చెప్పుకొనుచు కొంతకాలము భార్యతో విషయసుఖము లనుభవించి సంతానము, బడసి వయసు చెల్లిన పురుషులే భార్యపోయినప్పుడు కామము జయింపలేక మూడేండ్లదానిని వివాహమాడి దానినిమిత్తమయి యాశపడి కనిపెట్టుకొని యుండవలసి వచ్చుచుండగా, ఇఁక మూడేండ్లప్పుడు ముండలయి యదపాజ్ఞలు లేక పెరిగి మూర్ఖురాండ్రగుటచేత నుచితానుచితవివేకము లేనివారయి స్వభావచంచలలయి యౌవనమదముచేత దేహములు తెలియకుండు స్త్రీలకా యెల్లకాలము నింద్రియనిగ్రహముచేయుట శక్యమగును? పురుషులకంటె స్త్రీలకు కామమెక్కువగానుండునన్న మనపుస్తకములమాట యటుండనిచ్చి స్త్రీలకును పురుషులకును కామము సమానముగానే యుండునన్న సత్యమునుకూడ మాటుపఱచి ప్రతిపక్షులవాదమునకు నిక్కిలి యనుకూలముగా నుండులాగున పురుషులకన్న స్త్రీలకే తక్కువకామముండునని యంగీకరించినను, అప్పుడు సహితము వితంతువివాహ మనావశ్యకమని యేర్పడనేరదు? సోమయ్యా

కంటె సోమన్న కాఁకలి తక్కువగనుక సోమమ్మను తిండిపెట్టక మాడ్చి చంపవలయునని మతిమంతుఁ డెవ్వఁడు సాధింపఁదలఁపడును? అంతటిధీమంతుఁ డొకఁడుండెనా సోమమ్మకంటె సోమన్నకు కామము తక్కువగనుక సోమమ్మను వివాహమాడనియ్యక బాధింపవలయుననియు నతఁడు సిద్ధాంత మేర్పఱుప సాహసింప వచ్చును. కాఁబట్టి వితంతువులకు వివాహమువలన వ్యభిచారము పూర్ణముగా మానదని యేర్పడినను, స్త్రీలకు కామము తక్కువేయని యొప్పుకొన్నను, అధర్మమెంత తగ్గినంత క్షేమకరముగనుకను బలహీనులను సహితము వారు పొందఁదగినంత సుఖమును పొందనియ్యక హింసించుట న్యాయముకాదు. గనుకను స్త్రీపునర్వివాహ మావశ్యకమని యేర్పడక తప్పదు.

మనపెద్దలు కొందఱు స్త్రీపునర్వివాహములు వ్యాపించినచో శిశుహత్యలకు మాఱుగా పతిహత్యలు జరుగునని భయపడుచున్నారు కాని వారిమాటలంతగా నాదరణీయములుగావు. ఇతరులను పాడుచేసి తాముసుఖపడువా రెప్పుడును తమ వలన నపకారము నొందినవారి విషయమయి భయపడుచుండుట సహజమేగనుక, మనవారికిప్పుడు కలిగెడు భయమందువలన వచ్చినదేకాని నిజమయినదికాదు. ఈదేశమునందేకాదు ప్రతిదేశమునందును పరులను నిర్బంధపెట్టి తాము సౌఖ్యమనుభవించు వారానిర్బంధము మానినయెడల కీడుమూడునని తలఁచుచునే యుందురు. కాని కీడు తొలఁగించుటవలన కీడుకలుగుటమాత్ర మెక్కడను లోకానుభవ విరుద్ధము. ఒక్క యీ హిందూదేశమునందు తప్ప తక్కిన సమస్తదేశములయందును స్త్రీపునర్వివాహములున్నవి గదా. వానిలో నెక్కడనయినను పతిహత్యలు జరుగుచున్నట్లు మీరు వినియున్నారా? ఏదేశమునాటో మన కేటికి? ఈహిందూదేశములోనే మాఱుమనుములున్న గొల్లలు మొదలయినవారిలోనే భార్యలు భర్తలను చంపుచున్నట్లెప్పుడయిన మీకర్ణగోచరమయినదా? ఎవ్వరిలోన

లేనిభయము నిష్కారణముగా మీకేలరావలెను? భార్యపోయినయెడల మరలవివాహమాడ వచ్చునని మీరు ప్రతిదినమును భార్యలనూరక చంపుచున్నారా? ముసలిమగనికి పడుచుభార్యయు, రూపహీనునకు రూపవతియు, దరిద్రునకు సుదవతియు, సంభవించినప్పుడు యౌవనవంతుని రూపవంతుని ధనవంతుని సంపాదించుటకయి భార్య భర్తకు విషము పెట్టునన్నభయము మీబుద్ధికికల్పితమే కాని మఱియొకటి కాదు. ఎంత తెలివిమాలినదయినను తానుముందు మఱియొకభర్తను చేసికొని సుఖముగా బ్రతుకఁగోరినప్పుడు హత్యచేసి తనప్రాణముమీఁదికి తెచ్చిపెట్టుకొనునా? ముందువివాహమాడఁ దలఁచు కొన్నపురుషుని సాహాయ్యమయిన నక్కఱలేక యొకస్త్రీ విషాదులు సంపాదించి పతిహత్యచేయుటకు శక్తురాలగునా? ముందు తనకంటె మంచివాఁడు తటస్థించిన యెడల తనగతియు పూర్వపుభర్తతోడిదే యగునని తలఁపక యాదుర్మార్గురాలిని వివాహము చేసికొనుట కెవ్వఁడయిన నొడఁబడునా? నరహత్యచేయుటకు పాపభీతియుండదా? పాపభీతిలేకపోయినను మగనినిచంపి మఱియొకనిని వివాహము చేసికొనుటకయి యాకాలమునందు రూపవంతుఁడును ధనవంతుఁడును యౌవనవంతుఁడును దీర్ఘకాలపు బ్రహ్మచారిగానో యప్పుడు భార్యపోయినవాఁడుగానో యుండుట తటస్థించి యట్టి హంతకురాలితో సమానమైన కులమువాఁడును శాఖవాఁడును భిన్నగోత్రుండునునయి యేండ్లచేత పెద్దవాఁడయి యామెను వరించుట సాధారణముగా సంభవింపఁదగియున్నదా? వీనినన్నిటిని న్యాయబుద్ధితో నాలోచించిన యెడల పతిహత్యల కవకాశములేదని యీ యాక్షేపము చేసెడివారికే తెలియువచ్చును.

ఇఁక స్త్రీపునర్వివాహమువలన మితిమీఱిన ప్రజాభివృద్ధియయి కాటకములును దారిద్ర్యమును సంభవించునని భయపడువారి భీతిని మాన్పుటకయి కొంత ప్రయత్నింతము. ఈయతిప్రజాభివృద్ధియు కాట

కములును స్త్రీపునర్వివాహములున్న యితర దేశములకు వేనికిని కలుగక యొక్క హిందూ దేశమునకుమాత్రమే కలుగునా? మనహిందూ దేశమునందింకను కావలసినంత నేల సేద్యములేక బీడుగాపడియున్నది; అరణ్యములుకొట్టి బాగుచేయువారులేక రోగజనకములై కొండ వాండ్రకుమాత్రము వాసయోగ్యములయి బహుయోజనవిస్తీర్ణమయిన ప్రదేశములనేకము లించుమించుగా ప్రతిమండలమునందును ఫలపఱుచుకొను దిక్కులేక వ్యర్థముగాపడియున్నవి; మన దేశమునందలి వృత్తులును హస్తకర్మలును తగిన వారవలంబింపక యింకను మిక్కిలి హీన దశయందేయుండి ప్రజాభివృద్ధిని కోరుచున్నవి. మన దేశమునందు యౌవనదశయందున్న విధవలందఱును వివాహములాడి సంతానము గాంచి పుత్రులతోను పౌత్రులతోను దినదినాభివృద్ధి నొందునంతటి భాగ్యమే మన దేశమున కులభించినను, అప్పుడు సహితము వారందఱును పయినిచెప్పిన వ్యర్థముగానున్న భూమినంతను ఫలమునకుం దెచ్చి దేశమును మంచిస్థితికి తెచ్చి తాము సుఖపడుటకే సమర్థులగుదురు. అంతేకాక యిప్పుడు మన దేశమునందు పండినపంట లితర దేశములకు విశేషముగా నెగుమతి చేయంబడుచున్న సంగతి యందఱు నెఱింగి యుందురు. ఇప్పుడున్న ప్రకారమే భూమియుండి యభివృద్ధిలేక యిప్పటి ప్రకారముగా భూమి ఫలింపుచున్నను మన దేశములోని పంటయొక్క సారిగా జనసంఖ్య యిప్పటికంటె ద్విగుణమయినను వారికందఱికిని చాలియుండును. కాంబట్టి ప్రజాభివృద్ధికలిగి కాటకములు సంభవించి తాము తిండికిలేక చచ్చిపోదుమని భయపడువారు విధవోద్వాహము వలన తమకిప్పుడువచ్చిన యుపద్రవములేదని తెలిసికొని గుండెకుదిరి హాయిగా నిద్రపోవచ్చును. ఇంకముందు పుట్టంబోవువారు వసించుటకు స్థలములేక చచ్చిపోదురని భయపడుటకును వారినిమిత్తమయి యాసియాఖండమునందించుమించుగా నిర్మానుష్యమయి వాసయోగ్య

మయిన భూమి కావలసినంతయున్నది గనుక, ఆభయమునకు నవ
కాశములేదు. ఈబుద్ధిమంతులిప్పుడు విధవలమూలమున ప్రజాభివృద్ధి
కలుగుచుండలేదని సంతోషింపుచున్నను దేశస్థితిని చక్కగా విమర్శిం
చినచో వారి యానందమున కంతగా నవకాశము కనఁబడదు. విధవలు
పలువురిల్లువిడిచి లేచిపోయి బహిరంగముగా నెవ్వరినోయుంచుకొని కని
పెంచుచు ప్రజాభివృద్ధిని చేయుచునేయున్నారు. వీరుగాక ఇల్లువదల
లేని వితంతువులును శిశుహత్యలనెన్నిటినిజేసినను కావలసినంతమంది
కూఁతురులను కొడుకులను గని వేశ్యలకును మాలమాదిగలకును నీచ
కులమువారికినిచ్చి సాధ్యమయినంత ప్రజాభివృద్ధినిచేయుచునేయున్నారు
ఇప్పుడును ప్రజాభివృద్ధి యేలాగునను మానలేదుగాని ముందు వితంతు
వివాహములే ప్రబలి సర్వత్రవ్యాపించినయెడల నిప్పటివలె సంకర
సంతానము వృద్ధినొందక న్యాయమయిన యోగ్యసంతానము వర్ధిల్లి
దేశక్షేమమున కనుకూలపడును.

అంతేభేదముగాని స్త్రీపునర్వివాహమువలన వ్యత్యాసమంత
కంటె విశేషముగా నుండదు. ప్రజాభివృద్ధికలుగకుండ వారించి
భూభారమునడఁచి దేశసంరక్షణముచేయ దీక్షవహించిన యీమహాను
భావులు పరులకుమాత్రమే యుపదేశింపక యీవిషయమున తాము
కూడ కొంతతోడుపడిన నెంతశ్లాఘాపాత్రముగా నుండును! వారి పరోప
కార చింతయంతయు ననాథలను దుఃఖపెట్టి వారి జీవనము వ్యర్థము
చేయ పాటుపడుటతోనే సరిపోవలెనా? భార్యలను పోఁగొట్టుకొన్న
ముసలివాండ్రయిన తాము ద్వితీయవివాహములు మానివేసి యీ
ఘనకార్యమునకు తోడుపడరాదా? అట్లు తోడుపడి విధవలమీఁద
వేయఁదలఁచిన దుస్సహమయిన భారములో కొంత తామును వహించి
నప్పుడుగదా లోకము వారిపరిశుద్ధచింతను మెచ్చుకోఁ దగియుండును?
అనాథలయిన స్త్రీల నేడిపించుట కీపరోపకారచింత యక్కఱలేకయే

కావలసినన్ని కష్టములున్నవి. కాఁబట్టి బుద్ధిమంతులయిన యితర దేశస్థులు పరిహసించునట్లు విద్యాసంపన్నులయిన మనవారు స్త్రీలను బాధించి వారిబ్రతుకు నిరర్థకముచేసి దుఃఖములపాలుచేయుటకయి యిటువంటి హేతుకల్పనములు చేయకుందురని కోరుచున్నాను.

కొందఱు మనభార్యలు ముందు మఱియొకరిని వివాహమాడఁ బోవుదురన్న యవమానవాక్యము నెట్లుసహింపఁగలుగుదుమని చెప్పుచున్నారు. అట్టివారు తమజీవితకాలము నేకాక తమ మరణానంతరమును తమ్ము భర్తలని చెప్పుకొను దురదృష్టము వహించిన కాంతలు వివాహ సుఖ మనుభవింతురన్న మాటనయినను విని సహింపలేరట! ఆమాట విన్న స్వర్గములోనున్న తమ యాత్మలకుఁగూడ విశ్రాంతికలుగదట! భార్యలు చచ్చినతరువాతనేకాక వారు జీవించియున్న కాలములో సహితము తాము మనసువచ్చినంతమంది స్త్రీలను వివాహము చేసికొ వచ్చునట! అట్లుచేయుట భార్యల కవమానకరముకాదట! తాము మృతులయి యీలోకమును విడిచిపోయిన తరువాతనయిన తమ్ము తలఁచుకొని కలకాలమును కష్టపడక కొంతకాలమయినను తమభార్యలు వివాహమాడి సుఖపడిపోవుదురన్న పిడుగువంటిమాట యొక్కటియే మిక్కిలి యవమానకరమట! ఇటువంటి సచ్చింతికల మహానుభావులతో వాద మేటికి? యుక్తులేమిటికి! వట్టి కంఠశోషణము.

వితంతువులకు తమ స్థితిసహజముగానే కనఁబడి చిరకాలాభ్యాసమువలన వారు సుఖమునే యనుభవించుచున్నారు గాని కష్టపడుచుండుటలేదన్న యంశమును కొంత విచారింతము. విధవలు కష్టములకలవాటుపడి యావిషయమయి వారేమియు మొఱపెట్టుకొనుచుండలేదనుట కభిప్రాయము చిరకాలాచారము మానవధర్మమయిన మానావమాన వివేచనమును చెడఁగొట్టి వారిని మృగములవలెను వృక్షములవలెను చేసినదనుటతప్ప మఱియొకటికాదు. అట్లగుట

మనకే యవమానకరము. వారిప్పుడు తెలిసికోలేకపోయినంత మాత్ర ముచేత వితంతువులను మనము పెట్టుబాధ యోగ్యమయినదగునా? విధవలు తమ కష్టదశను బొత్తిగా తెలిసికొనుచుండ లేదనుటయు సత్యముకాదు. మనదేశపువితంతువులు సుఖమనుభవించుచున్నారనుట కంటె పెద్దయసత్యమును మఱియొకటిలేదు.

అట్టి యవస్థయే సుఖమయినయెడల మనవారు పట్టుపంచచము లును పట్టుపుట్టములును మానివేసి కటికినేలనుపరుండుచు, పూటపూటకు రుచ్యములయిన కూరలతోను పెరుగుతోను పాలతోను నేతితోను సుఖభోజనమునువిడిచి యొంటిపూటతినుచు, వస్త్రాద్యలంకారములను తీసివేసి బోడితలలు చేసికొని కావలసినంత సుఖమనుభవింపవచ్చును. పురుషులెంతపిన్న వయసువారయినను వివాహసమయము నందుతప్ప భార్యల మొగము చూడనివారయినను భార్యలుపోఁగానే వారినిపట్టి తల గొఱిగించి విరూపులనుజేసి తిన్నగా తిండిపెట్టక కఠినపుకాలవేసి శక్తి మించినపని చేయించుచు వస్త్రాద్యాలంకారములను వేనిని ధరింపనీయక వీధిమొగము చూడకుండ నిర్బంధించి మూలనదిమిపెట్టి మరల నెప్పటి కిని పెండ్లిలేకుండఁజేసి పొడకనఁబడినప్పు డెల్లను దుశ్శకునమయినదని తిట్టుచు వితంతువులను పెట్టెడు కష్టములు తమ్ముఁ బెట్టినప్పుడుకాని పురుషులు వారిసౌఖ్యమును పూర్ణముగా తెలిసికొనుటకు శక్తులుకారు వితంతువులు కొంత సుఖమనుభవించుటయు వాస్తవమేమయినను, ఆ సుఖమునకు మాత్రము మనము కారణభూతులముకాము. వారికష్టము లను దుస్సహముగాఁ జేయుటకయి మనచేతనయినంత పని మనముచేసి నాము. వారిజీవనము దుఃఖభాజనముగాఁ జేయుటకయి యీచేసిన దానికంటె మన మెక్కువయేమి చేయఁగలము? అనాధలయి మనపాలఁ బడిన యబలల జీవనమును మనమెంత సుఖహీనముగాఁజేయపాటు పడినను కరుణాపరిపూర్ణుఁడయిన పరమేశ్వరుఁడీ లోకములో నెవ్వరిని

ధర్మమును మీరినప్పుడుతప్ప సంపూర్ణదుఃఖము నెప్పుడును పొంద నియ్యఁడుగనుక, మొలబంటిదుఃఖములో మోకాలిబంటి సుఖమున్నట్లా దౌర్భాగ్యస్థితిలోనే వారు కొంచెము సుఖమనుభవింపు చున్నారు.

ఆపన్నుల నెప్పుడు నుపేక్షింపనివాఁడును మహారణ్యమధ్యము నందు సహితము మధురోదకమును వర్షించి ముండ్లమొక్కలను సహితము పోషించువాఁడునునయిన యాపరమ దయాళుఁడు చిరకాలము నుండి కష్టపరంపరపాలయి దిక్కుమాలియున్న వితంతువుల యాపర హృదయములయందు మాత్రము కొన్ని సంతోష బీజములనునాటి పెంచకుండునా? అయినను విధవలప్పుడు పొందుసంతోషమును తృప్తిని జూచినను దేశాభిమానముగల వారందఱును విచారపడవలసిన దే. లోకములో పిచ్చివాండ్రు తమస్థితి తెలిసికోలేక పొందెడి యానంద మెటువంటిదో యీవితంతువుల యానందము నట్టిదే కాని యంత కంటె యోగ్యమయినదికాదు. వారిస్థితి వారికి నిజముగా తెలియదు గనుకను, ఆలోచనలేనివారుగనుకను, మూర్ఖురాండ్రుగనుకను, వారు సంతోషింపఁగలుగుచున్నారే కాని జ్ఞానభానుకిరణ మొక్కటి గాఢాంధ కారావృతమయియున్న వారిహృదయకుహరమునందు ప్రవేశించి యక్కడి యజ్ఞానతిమిరమును కొంచెము తొలఁగింపఁ గలిగినయెడల నిమిషములో వారిసంతోషమునుపోయి యాసుఖమంతయు దుఃఖ ముగా పరిణమించుటకు సందేహము లేదు.

అట్టి జ్ఞానోదయము గలిగిన మఱుసటిక్షణమునందు పురుషులు తమవిషయమై చేసిన యన్యాయమయిన యపకృతికి మనమీద వారి కెంతకోపము వచ్చునో యప్పుడు చూడవలసియున్నది. మనకులసం రక్షణార్థమై వితంతువులాలాగున కష్టపడుటవిధియేయని భావించు వారును కొందఱున్నారు. మన కులసంరక్షణార్థమయినయే యన్యాయ మును, హింసయు, క్రూరత్వమును కావలసి యున్నయెడల, అట్టి

యధర్మమూలమయిన కులము భూమిమీఁద లేకుండ నశించును గాక! ఈయనాథలకష్టములమీఁదనే నిలిచెడు కులమెంత శీఘ్రముగా నశించిన మనకంత మేలు కలుగును. కాఁబట్టి యనాథల కన్నీటిచేతనే పెరిగెడు పాడుకుల మొక్కసారిగా పాడుకానిండు. మనకులమునకు పరపీడవలననే బ్రతుకవలసిన దుర్గతి సంభవించినప్పుడు దయ, దాక్షిణ్యము, ధర్మము మొదలయిన పదములు భాషలో నశింపవలసినవే. భూలోకమున మనుష్యజన్మ మెత్తినవారిని మృగములకంటెను హీనదశనొందునట్లు చేయుటకంటె భూమిని మృగములపాలు చేసి యవి కాపురముండుటకే విడిచిపెట్టి మనుష్యులు మూలముట్టుగ నశించుట యుత్తమము కాని భగవంతుని రాజ్యములో నొకరి దుఃఖమువలననే యితరులు శాశ్వతముగా సుఖింపవలసిన యవస్థమాత్ర మెన్నటికిని సంప్రాప్తముకాదు. అనావృష్టివలన పంటలు పండునని మీరునమ్మిన యెడల స్త్రీలబాధ వలననే మీకుక్షేమము కలుగుననియు మీరప్పుడు నమ్ముఁడు. న్యాయస్వరూపుఁడును కరుణానిధియునయిన పరమేశ్వరుఁడే మనలను పరిపాలించుచున్న పక్షమున స్త్రీలను పెట్టుబాధలవలనను ప్రకృతిధర్మములను మీఱుటవలనను మనకుఁగాని మరియెవ్వరికిఁ గాని యిహలోకసుఖమయినను పరలోకసుఖమయినను కలుగునని నమ్ముట కేవలము వెఱ్ఱితనము. ఎల్లకాలమును వితంతువు లీలాగుననే యన్యాయముగా బాధపడుచుండ వలసినయెడల యయినిభగవంతుని సత్యపాలనమే లేకపోయి దయావిహీనుఁడయిన క్రూరరాక్షసుఁడెవఁడో యీ ప్రపంచమును పాలించుచుండి యుండవలెను. పరలోకసుఖము నిమిత్తమయి యిటువంటికిరాతకృత్య మావశ్యకమనుట యీశ్వరదూషణమును సత్యదూషణమును న్యాయదూషణమును గాని వేఱుకాదు. భగవంతునియందును సత్యమునందును న్యాయమునందును విశ్వాసములేక చిరకాలమునుండి వచ్చుచున్న యాచారమునందే పరమ విశ్వాస

ముంచి దానినిసదా కనుచుండుటచేతను దాని క్రౌర్యమున కలవాటు పడి యుండుటచేతను మనదేశమునందీ యనర్థమున కింతకును కారణ మయినది. చిరపరిచయమువలన చెడుగును మంచినిగాను పరులను బాధించి పొందు సుఖమును న్యాయముగాను లోపించుపరమసామర్థ్య ముగల యాచారమునందు విశ్వాస బుద్ధిలేక సత్యమునందు విశ్వాసము కలిగిన యెడల పరపీడనమును పాపకార్యములును మఱునాటికి నశించును.

ఒకసారి భర్తనుపొందిన స్త్రీతోడి సంభోగమున కెవ్వరాశ పడుదురనియు మీరు సందేహింపవలసినపనిలేదు. మనవారికానీతియే యుండిన యొకరు సంభోగించిన స్త్రీతోడి పొందే రోతగాతోఁచునేని మనదేశములో వ్యభిచారమే లేకపోయియుండును; పయికి పెద్దమను ష్యులవలె పగలెల్లను వేషములువేసికొని తిరుగుచు చీఁకటిపడఁగానే భార్యలనువిడిచిపెట్టి లంజెలయిండ్లకు వెంచేసెడు మహానుభావులే మన దేశము లేకపోయియుండురు; దుర్నీతికిపట్టుకొమ్మలయి బహుసంసార ములనుకూలఁద్రోయుటయే కులవిద్యగాఁగల వేశ్యలందఱును మహా పతివ్రతలయియేయుందురు; మనదేశమునందు కులటలన్న పేరేలేక పోయియుండును; బాలవిధవలకిప్పటివలె వ్యభిచారదోషమును గర్భ పాతాది మహాపాతకములును సంభవింపకయేయుండును; నిత్యమును కన్నకన్నవానితో నెల్లనుగలియు వేశ్యలపాదములాశ్రయించి తమ ధనమును కొల్లపెట్టు మహాపురుషులవంటివారికా యెప్పుడో భర్త పోయిన స్త్రీని వివాహమాడుట రోతగానుండునది! ఇప్పుడీటువంటి వికృతవేషములతోనున్నప్పుడే విధవలతోడి పొందసహ్యముగానుండ నప్పుడు వారీవికృతవేషమునుమార్చి సువాసినీ చిహ్నములను ధరించి నప్పు డెవ్వరికయిన మఱియొక విధముగానుండునా? కొంతకాల మాచారము సాగినతరువాత ద్వితీయవివాహమందఱకును మొదటి

వివాహముకంటె వేఱుగాఁ తోఁచనే తోఁచదు. ఇంతకును మనవారు ముందుగా నట్టివారిజోలికిపోక పురుషసంభోగ మెఱుఁగని బాలవితంతువులకయినను పునర్వివాహమున కనుజ్ఞ యిచ్చినతరువాతఁగదా పెద్దవారి సంగతి యాలోచించవలెను?

గొల్లలు మొదలయినవారితోఁడి పాటుగా మనలోఁకూడమాఱుమనుము లున్న యెడల మన యాధిక్యముపోయి మనమును వారితో సమానులము కామాయని యగ్రవర్ణములవారు కొందఱనుమానించుచున్నారు. వారితో సమానముగా భోజనముచేయుచుండుటవలన మన యాధిక్యముపోలేదు; వారితో సమానముగా బట్టలుకట్టుకొను చుండుటవలన మనగౌరవము పోలేదు; వారితో సమానముగా వివాహముఁగాడుచుండుటవలన మన శ్రేష్ఠతపోలేదు. వారితో సమానముగా మనమన్ని పనులు చేయుచున్నను పోక, ఇప్పుడు జరుగుచున్నట్టుగా పాపమూలమయిన గర్భస్రావములు శిశుహత్యలు మొదలయినవానివలననుపోక, శాస్త్రసమ్మతమయిన పునర్వివాహములను మనస్త్రీలకుఁ జేసి యీ మహాపాతకముల నన్నిటిని పోఁగొట్టుకొనుట వలననా మనగౌరవము పోవును? మనకుశిశుహత్యలతోను గర్భపాతములతోను నిలిచెడు గౌరవముపోయినను పోనిండు.

ఓహిందూమహాజనులారా! నేనీవిషయము నిదివఱకే యెక్కువగాఁ జెప్పియున్నాను. మనపూర్వులు ధర్మశాస్త్రములనుజేసి లోకమును యుక్తమార్గమున నడిపించియుండఁగా వారి సంతతివారమయ్యును మనమనుష్యులను మంచిమార్గమున నడిపించుమాట యటుండ మనమయినను యుక్తమార్గమున ప్రవర్తింపక మన స్త్రీలగతినయినను బాగుచేసికోలేకుంట యెంతయు నవమానకరముగానున్నది. స్త్రీలకు పునర్వివాహము నంగీకరించుటవలన వారికి లాభమేకాని యెవ్వరికి నేవిధమైన నష్టమునులేదు. మనము వితంతూద్వాహము కూడదనుట

వలన మనయోగ్యతలేనితనము బయలుపడునేకాని వేఱుసుగుణమేదియు వెల్లడికాదు మనకడుపునపుట్టిన యనాథలైన బాలికలయెడలనే దయఁ జూపలేనిపక్షమున మనమేమొగముపెట్టుకొని మాపాపములు క్షమించి దయచూపుమని యీశ్వరుని నిత్యమును వేడుకోఁగలము? ఈశ్వరుని యొక్క సమస్తకళ్యాణగుణములకును దయయేకదా శిరోమణియయి సృష్టియందెల్లయెడలను బ్రకాశింపుచున్నది! తన యల్పాయుష్కాలములో లోకములోని సమస్తజీవరాసులును నపారమయిన సుఖమనుభవింపుచుండుట కాతనిదయకాక మఱియేమికారణమున్నది? ఘాతుకమృగములు సహితము స్వజాతిమృగములను బాధింపక ప్రేమచూపుచుండఁగా జ్ఞానసంపదచేత నత్యధికులమయిన మనము లాభలేశమైనను లేక నిష్కారణముగా మన తాతలును ముత్తాతలును బాధపెట్టిరను ప్రబలహేతువుచేత కరుణమాలి యనాథలయి దిక్కుమాలి మనలను జేరిన యాఁడువారిని హింసపెట్టుట ధర్మమగునా? నష్టకరమైనప్పుడెల్లను పూర్వాచారమును మార్చుకొనుచుండుటకు మనపూర్వులెప్పుడయిన వెనుకతీసిరా?

శ్లో॥ పరిత్యజేదర్థకామౌ యౌస్యాతాం ధర్మవర్జితౌ
ధర్మం చాప్యసుఖోదర్కం లోకవిక్రుష్టమేవచ॥

అని ధర్మశాస్త్రకర్తలలోనెల్ల నగ్రగణ్యుఁడైన మనువు అసుఖకరమును లోకమునకు శోకకరమునైన ధర్మమునయినను విడువవలయునని విధించియుండలేదా? స్త్రీపునర్వివాహమును సమస్తధర్మశాస్త్రములును బ్రతిపాదించుచున్నవి గనుక మనమిప్పుడు చెడినధర్మమును పునరుద్ధారణముచేయవలసియున్నది కాని ధర్మవిరుద్ధముగాఁ జేయవలసినదేమియులేదు. ఆచారవిరుద్ధముగా మనమిప్పు డీయనాథలవిషయమున నేమియుఁ జేయిలేకపోయిన నిమిషమాత్రమును భావింపఁ బోకుఁడు. మనము చేయఁగలిగినది కావలసినంతేయున్నది. రాజుల

కంటెను సేవలకంటెను ధనముకంటెను సాధనములకంటెను లవత్త
మైన సత్యబలము ధర్మబలమును మనపక్షముననున్నవి గనుక, వా
సాహాయ్యముచేత మనమెంతటిపనినైనను నిర్వహింపసమర్థులమగుదుము
ఈ ధర్మబలము ముందఱ తక్కిన సమస్తబలములును పాదాక్రాంత
ములు కావలసినవే. కాఁబట్టి యెంతకాలమునుండియున్నను హింసయు
ధర్మమును దుర్బలములయినవని తెలిసికొని సత్యమునందు విశ్వాస
ముంచి న్యాయమే నిజమైన బలమని నమ్మికొని ధర్మస్థాపనముకయి
ప్రయత్నింపుఁడు. నేనిప్పుడు చెప్పినసంగతులు చక్కఁగా నాలోచించు
కొని పామరుల మాటలను పాటిగాఁబట్టక మీయంతరాత్మ బోధించు
నట్లు ప్రవర్తింపుఁడు.

శ్లో॥ యత్కర్మకుర్వతో స్యస్యా త్పరితోషోంతరాత్మనః
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్॥

అను మనువచనమును మూలసూత్రముగాఁగొని మీరేపనిని జేసిన మీయంతరాత్మ సంతోషించునో యాపనిని జేయుచు నంతరాత్మకతుష్టికరమయినపనిని మానుఁడు. ఇప్పుడున్నదే మంచిదన్న దురభిమానము నొక్కదానిని విడిచిపెట్టితిరా యీశ్వరుఁడు మిమ్ము సత్యమార్గమున ప్రవేశపెట్టి మీమూలమున మీకును దేశమునకును కూడ క్షేమము కలుగఁజేయును. దీనదయాళుఁడయిన పరమేశ్వరుఁడు మీ హృదయములయందుఁజొచ్చి గతిమాలియున్న హిందూవితంతువుల మొఱ్ఱ యాలకించి వారి దురవస్థ తొలఁగించి దరిచేర్చుటకు మీకు బుద్ధి పుట్టించును గాక!

మోడరన్ ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము.

స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము.

By

K. VEERESA LINGAM

స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము.

అస్మద్దేశీయులగు వివేకమహితులారా!

నేనిప్పుడు చేయఁబోయెడి యీచిన్నవిన్నపమును సదయహృదయులరయి యాలకించి, నిష్పక్షపాతబుద్ధితోను న్యాయైకదృష్టితోను సావధానముగా విమర్శించి, సత్పక్షమని మీమనస్సులకుఁ దోఁచినంతవఱకు నంగీకరింతురని మిమ్ముందఱను మిక్కిలి వినయముతో బ్రార్థించుచున్నాను. ఇప్పటి యాచారమునుబట్టి నావాక్యము లొకవేళఁ గొందఱిచెవులకు మొట్టమొదట వెగటుగా తోఁచవచ్చును; కాని, కొంచెము పారమార్థికబుద్ధితో పరిశీలించి చూచినయెడల గ్రాహ్యములుగాఁ గనఁబడకపోవని నమ్మెదను. మనము భ్రాంతిగా విషయవిచారమును మాని ప్రస్తుతాచారమునే ప్రమాణమని పట్టుపట్టి కూర్చుందుమేని, అభివృద్ధి నొందుటకు లేశమయినను నవకాశము లేకపోవుటయేకాక క్రమక్రమముగా మనము దురాచారములయందు తగులుకొన్నవారమయి మానుషధర్మమును మఱచి చెడిపోవుదుము. ఇతరుల దృష్టియందెంత క్రూరకృత్యముగాఁ గనఁబడినను, ఎవరి యాచారము వారికి మంచిదిగానె కనఁబడుట స్వాభావికము. బహుకాలమునుండి వచ్చుచున్నందున వివాహములయందు విస్తారధనమును వెచ్చించెడి యాచారమును మీఱఁజాలక, అంతటిధనమును దెచ్చుకో శక్తి లేక వివాహములయందలి యతివ్యయమును మానుటకు బదులుగా పుట్టినతోడనే తాముకన్న స్త్రీశిశువులను నిర్దాక్షిణ్యముతో వధించెడి దురాచారమును న్యాయైకావలంబకులైన మన దొరతనమువా రిప్పటికిని రాజపుత్రులలో మొదలంట మాన్పఁజాలకున్నారు.

కాళికాశక్తికి మొదలగు గ్రామదేవతలకు సంతృప్తి గలుగునని తమ కన్నబిడ్డలను తమ తోడిమానవులను బలిపెట్టు రాక్షసకృత్యమును మాన్పించిన దొరతనమువారిని దేశోపద్రవము తెచ్చిపెట్టినట్టు భావించువారు మనదేశములో నెంద ఱున్నారుకారు? పుణ్యము వచ్చునను భ్రాంతిచేత మొసళ్ళ కాహారముగా తమబిడ్డలను గంగా గర్భమున పాఱవేయు దురాచారము మనదేశములోనే యెంతకాలము నడిచినది కాదు? దురాచారమయినను చిరకాలమునుండి యను ష్ఠింపఁబడుచు వచ్చినేని సదాచారముగానే తోఁచునని చూపుట కీరెండుమూడు నిదర్శనములు నిప్పటికి చాలియుండునని యీవిషయ మును నేనింతటితో విరమించుచున్నాను.

అట్టి దురాచారముల దెలిసికొని పరిత్యజించుటకయి, విషయ విచారముచేసి మనలో మనము చేయు పరిశోధనముగాని, యితరులు చేసెడి యాక్షేపణములుగాని సాధనములుగా నుండును. ఆత్మశోధన మునకు గర్భశత్రువయిన దురభిమానమును మన మనసులలోనుండి పాఱఁదోలువఱకును, నిష్పక్షపాతబుద్ధితో కార్యాంశమును విచారించి మంచిసిద్ధాంతము నేర్పఱుచుకొని దురాచారమును త్యజించి సత్ప క్షము నవలంబించుటకు మన మెన్నఁడును శక్తులము కానేరము. అయినను అట్టి దురభిమానమును విడిచిపెట్టుట మహానుభావులయిన కొందఱికేకాని యందఱికిని సాధ్యముకాదు; అట్లయ్యును అన్యులు మనది దురాచారమనియు రాక్షసకృత్యమనియు దూషించుచుండఁ విని సహింపలేము. అట్టిదూషణ ప్రసక్తించినప్పుడు తత్త్వవిచారము చేసి యట్టిదూషణ క్రమమయినదా కాదా యని విమర్శించి క్రమ మయినదే యని తేలెడుపక్షమున మన వర్తనమును దిద్దుకొనుటకును అక్రమమయినదని తేలెడుపక్షమునఁ బ్రతిపక్షుల మాటలను పాటిగాఁ

గొనక నిరాకరించి యూరకుండుటకును మనము ప్రయత్నింప వలయును గాని, స్వాభిమానముచే మనము పట్టినకోడికి మూడే కాళ్ళనుచుండుట న్యాయము కాదు. కాఁబట్టి తమయొక్కయు దేశముయొక్కయు క్షేమలాభములను గాంక్షించు వారందఱును సర్వవిధముల శోధించు సత్యమును గనుఁగొని పిచ్చి కుదిరినది రోకలి తల జుట్టుమనక, యేర్ప డిన సిద్ధాంతప్రకారముగాఁ దాము ప్రవర్తించుచు ఇతరులను బ్రవ ర్తింపఁ జేయవలయును. ఈదురాచారమువలన నాకు ప్రత్యేకముగా సంభవించెడు నష్టమేమియు లేదు; కాఁబట్టి యితరులేగంగలో మునిఁ గిన నాకేమని యూరకుండుట మానుషస్వభావమునకు పొసఁగి యుండదు. కాఁబట్టి యీవిషయమును నేను పెంచి చెప్పనక్కఱ యుండదు; స్వోదరపూరణమాత్ర ప్రయోజనుఁడయి లోకోపకార చింతలేని మనుష్యశరీరధారి భూమికి భారముగానుండి పశుపక్ష్యా దులకన్నను నిరర్థకజన్ముఁడని చెప్పుటయే యిచట చాలియుండును.

నేనిప్పుడు చెప్పఁబోయెడు స్త్రీపునర్వివాహవిషయము పరులు ఆక్షేపించి చెప్పువఱకును మనకుఁ దెలియనంతటి స్వల్పాంశము కాదు. ఈవఱకే బహుశతాబ్దములక్రిందట కృష్ణదేవరాయలవారి కాలమున పండితమండలాగ్రగణ్యులుగానుండి, నేఁటివఱకును పండితులందఱిచే ఈశ్వరావతారమని శ్లాఘింపఁబడుచున్న జగదేకపండితులగు అప్పయ్య దీక్షితులవారు స్త్రీపునర్వివాహవిషయమయిన సాధకబాధకములనెల్ల నాలోచించి, స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమనియు దోషనివా రకమనియు సిద్ధాంతీకరించినట్టును, ఆకాలమునందు విద్యాపీఠములయిము లని ప్రసిద్ధిగన్న కాశీ మొదలైన పట్టణములకెల్లను బోయి పండితులతో వాదించి తమసిద్ధాంతమును శాస్త్రముచేతను యుక్తిచేతను గూడ స్థాపించినట్లును, అదిచూచి పరాజితులయిన మనపండితులు ప్రపం

చాంతము సంభవించినట్లు దుఃఖపడి యందఱును గట్టకట్టుకొని పోయి దీక్షితులవారి మాతను దీనులయి ప్రార్థించి యామెచేత ముందుగాఁ దనకుఁ బునర్వివాహము చేసిన పిమ్మట మఱియొకస్త్రీకిఁ జేయవలసిన దని కుమారునకుఁ జెప్పించి స్త్రీపునర్వివామును మానిపించి లబ్ధ మనోరథులైనట్టును, ఇప్పటి మనపెద్దలే చెప్పుచున్నారుగదా? పూర్వోక్తదీక్షితులవారికిఁ దరువాత సహితము లోకోపకారపారీణు లైన పలువురు పండితోత్తములు స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మత మని పెక్కుగ్రంథములను వ్రాసియున్నారు. స్త్రీపునర్వివాహము లేకపోవుటవలనఁ గలిగెడు నష్టములనుగాని, ఉండుటవలనఁ గలిగెడు లాభములనుగాని, వానిని స్థాపించుటకయి కావలసిన యుక్తిశాస్త్ర ములనుగాని చూపుటలో వారిలో నెవ్వరితోను సమానుఁడను కాక పోయినను, మీమనసుల కెక్కునట్టుగా రసపుష్టిగల మంచిశైలితో నుపన్యసింప శక్తుఁడను గాకపోయినను, లోకోపకారచింతయు స్త్రీల దురవస్థయు నన్నుఁ బ్రేరేప ధైర్యము తెచ్చుకొని పూర్వపు మహాను భావులు ప్రదర్శించిన మార్గమునే యనుసరించి కొంచెము ప్రసంగింప సాహసించుచున్నాను.

సర్వసముఁడైన జగదీశ్వరుఁడు పురుషులకువలెనే స్త్రీలకును ఆఁకలి మొదలగువాని నెట్లు గలుగఁజేసి యున్నాఁడో అదేప్రకార ముగా కామమును సహితము కలుగఁజేసి యున్నాఁడు; వానిని యుక్త మయినరీతిని శాంతిపొందించుటచేతనే స్త్రీలకుఁగాని పురుషులకుఁగాని సౌఖ్యము కలుగును. కాఁబట్టి చౌర్యము మొదలగు దుర్వృత్తులయందుఁ బ్రవేశింపక యాఁకలిని దీర్చుకొనుట యెట్లు న్యాయమో వ్యభిచారము నందుఁ బ్రవేశింపక కామమును నిర్వర్తించుకొనుట అట్లే న్యాయము. అయినను క్షుత్పిపాసాదులవలె కామశాంతిని పొందించుకొనుట యని

వార్యము కాకపోయినను, కామమును జయించుటసహితము సాధారణముగా మనుష్యమాత్రునకు సాధ్యముకాదు. అడవులలో నాకలములు తినుచుండు యోగులు సహితము కామమోహితులై, యకార్యకరణమునకుం జొచ్చిరన, ఇఁక నితరులమాట చెప్పవలసినదేమున్నది? ఇందుకు దృష్టాంతముగా మన తొంటిపండితులు వ్రాసిన శ్లోకము నొకదాని నిందుదాహరించుచున్నాను:—

"శ్లో॥ విశ్వామిత్ర పరాశర ప్రభృతయో వాతాంబు పర్ణాశనా

స్తేపి స్త్రీ ముఖ పంకజం సులలితం దృష్ట్వైవ మోహం గతాః

శాల్యన్నం సఘృతం పయో దధి యుతం భుంజంతి యే మానవాః

తేషా మింద్రియ నిగ్రహో యది భవే ద్వింధ్యః ప్లవే త్సాగరే॥"

విశ్వామిత్రుడు, పరాశరుఁడు మొదలగు వాతాంబు పర్ణాశనులయినను, సుందరమయిన స్త్రీముఖమును జూచి మోహమును పొందుచుండగా, నెయ్యి, పాలు, పెరుగు వీనితో వరియన్నమును భక్షించు మనుష్యుల కింద్రియనిగ్రహము కలుగునేని, వింధ్యపర్వతము సముద్రమునందు తేలవలె నని పయిశ్లోకమున కర్థము. ఇట్లు కొంచెముగానో గొప్పగానో విద్యాభ్యాసము చేసి యుక్తాయుక్తములను దెలిసిన పురుషుల విషయముననే కామమును జయించుట పర్వతము సముద్రములో తేలునంత యసాధ్యమయినచో, విద్యాగంధ మయిన నెఱుఁగకుండు మన దేశపు స్త్రీలవిషయమున నెట్లుండునో మీరే యూహింపఁదగి యుందును. అంతియకాక మన పూర్వులు

"శ్లో॥ స్త్రీణాం ద్విగుణ ఆహారో బుద్ధి శ్చాపి చతుర్గుణా

సాహసం షడ్గుణం చైవ కామశ్చాష్టగుణో భవేత్॥"

అని స్త్రీలకుఁ బురుషులకంటె నాలురెట్లు సాహసమును, ఎనిమిదిరెట్లు కామమును గలదని వ్రాసియున్నారు. పురుషులతో

సమానముగానే కామమున్నను దానిని నిర్జించుటకు స్త్రీలకు సాధ్యము కాదని యేర్పడుచుండఁగా, మనవారు చెప్పినట్లు నిజముగా నెనిమిది రెట్లు కామమే యున్నయెడల వారు దానిని మల్లించుకోఁ గలుగుదు రనుటకంటె వెఱ్ఱి వేఱొకటిలేదు; అట్టిచో సాహసముకూడ నాలు రెట్లున్నచోఁ జెప్పవలసినదే లేదు. అట్లుగాక స్త్రీలకు పురుషులతో సమానమయిన సాహసమును కామమును గలిగి యుండునన్నను, ఉప్పును బులుసును దినుచు యౌవనదశయందుండు స్త్రీలకు కామ మును వారించుకొనుటకు శక్యమగునని మనము స్వప్నావస్థయం దయినను దలంపవచ్చునా? పురుషునకు భార్య పోయినంత మాత్రమున కామ ముడుగకుండుట పురుషుఁడు పునర్వివాహము చేసికోవలెనని భగవదిచ్ఛ యయినట్లు ఏప్రకారముగా నూహింపఁదగియున్నదో, ఆప్రకారముగానే భర్త పోయినంతమాత్రమున స్త్రీకి కామము పోకుండుటయు స్త్రీపునర్వివాహముకూడ భగవన్మతమని తెలికోఁ దగి యుండలేదా? భగదుద్దేశమునకు వ్యతిరిక్తమయిన పనిని జేయఁగోరుట మనుష్య స్వభావమునకు లేశమయిన న్వార్థమయిన పని యగునా? సుఖ మనుభవింపవలెనని యుద్దేశించి యీశ్వరుఁడు సృష్టించిన వారిని, కష్టముల పాలుసేయ మన యావచ్ఛక్తిని వినియో గించుట యెంత క్రూరకృత్యము? వితంతువులైన మన స్త్రీలగతిని తలఁచుకొన్నప్పుడు పగవారికయినను మనసు దహించుకొనిపోవు నపుడు, మనకేల కొంచెమయినను కనికర ముండఁగూడదు? తమ కడుపునఁ బుట్టిన బిడ్డలకు పసితనములో పెండ్లియనఁగానేమో తెలి యక యది క్రొత్తవస్త్రములను గట్టుకొని పిండివంటలు తిని వాద్య ముల మ్రోతతో జరుపు నొకవేడుక యనుకొనుదశలో వివాహములు చేసి, మగఁడు పోయినాఁడని జననీజనకులు శోకమును పొందు

చుండఁగా "అమ్మా! యేల యేడ్చెదవు?" "నాయనా! యెందుకు దుఃఖించెదవు?" అని యడుగు పుత్రికలను జూచి దల్లిదండ్రుల కయిన నేల కరుణ పుట్టరాదు? నిన్న మొన్నటివఱకును నెంతో ప్రేమతోఁ బెంచి ప్రాణములనెల్ల వారిమీఁదనే పెట్టుకొని యుండి, మగఁడు పోయినాఁడన్న మాటను విన్నమాత్రమున సమస్తాలంకారములను దీసివేసి, తల గొఱిగించి ముసుఁగువేసి మూల కూరుచుండఁబెట్టి, విరూపినిఁజేసి చచ్చియుఁ జావకుండ దినమున కొక్క పూటనే మెతుకులు వేయుచు, కట్టుకోఁ దిన్నని బట్టనైన నియ్యక ముతకబట్టనే యిచ్చుచు, పుత్రికల జన్మములను దుఃఖభాజనములు చేయ నెట్లు మనసొప్పుచున్నది? ఏకగర్భవాసజనితలయిన తోఁడఁబుట్టిన పడుచులును, తమ యింటఁ జొచ్చిన కోడండ్రును, కంటికి నేలకు నేకధారగా నేడ్చుచు, మరణ పర్యంతము దుఃఖమును గుడుచుచుండఁ గనులు పెట్టుకొని చూచుచు అన్నదమ్ములును, మామలును, మఱఁదులును, బావలును నెట్లు నిర్దయులయి సహించి యూరకుండఁగలుగుచున్నారు? రక్తసంబంధము గల బంధువులందఱును అనాథలయిన తమవారిలలనలు సమస్తదుఃఖములకును లోనై యెన్నరాని కడగండ్లు పడుచుండఁగా వారివిషయమయి లేశమయినను జాలిఁబొందక వారియాపత్తులను నివారించుటకుఁ గొంచెమయినను ప్రయత్నముచేయక యెట్లు తాము సుఖమనుభవింప సిగ్గుపడకున్నారు? అస్మద్దేశీయులారా! మనవితంతువుల దురవస్థను జూచి యన్యదేశీయులు సహితము మనసులు నీరుగా కరఁగ పరితపించి వారి యాపన్నివారణమునకయి సర్వప్రయత్నములు చేయుచుండఁగా ఒక్కదేశమునఁబుట్టి యొక్కవేదమును నమ్మి యొక్క కుటుంబమువలె నున్న మీరుమాత్ర మేల మీహృదయములను రాయిచేసికొని నిర్విచారముగ నున్నారు? భర్తృవిహీనలయిన

కాంతలదుర్దశను తొలఁగించుటకుఁ జేయు ప్రయత్నముమాట యటుం డఁగా, మీరదుమిక్కిలి వారిని ముందు కూడ నిర్భాగ్యురాండ్రనుగాఁ జేయుప్రయత్నము నయిన నేల విడువకున్నారు? అనాథలై నయాడు వారియెడ కనికరమును జూపుటకు మాఱుగా, వారినిమిత్త మింత ద్వేషము నేలపూనెదరు? మీచేతనైనపని మీరు వారిశిరోజము లను తీసివేయింపఁ గలరు; ఆభరణములను ధరించుకోకుండ మాన్పఁ గలరు; రెండుపూటలను భోజనము చేయనీక కడుపు మాడ్పగలరు; మఱియు నిట్టిదురవస్థల నెన్నిటి నయినఁ దెచ్చి పెట్టఁ గలరు; కాని స్వభావసిద్ధముగా వారికి భగవంతుఁడు కలుగఁజేసినకామమును మా త్రము తీసివేయ శక్తులరు కారుగదా? అట్టి వారి స్వాభావికమైన కామము శాంతిపడుటకుఁగల క్రమమైనమార్గమును మీరు మీశక్తి యంతయు వినియోగించి నిరోధించుటవలన, మీకుఁ గలుగుచున్నకష్ట ముల నయిన మీరాలోచించుకొనుచున్నవారు కారు. ఇఁకనైనను మేలుకొని కన్నులు తెఱచిచూచి, యిప్పుడు కలుగుచున్న యవమాన కరములైన పలునష్టములను దెలిసికొనఁ బ్రయత్నింపుఁడు. ఈనష్టము లన్నియు మీకీవఱకుఁ దెలియనివి కాకపోయినను, తెలిసినవారికిసహి తముస్మరణకుఁదెచ్చుట యప్పుడప్పు డావశ్యకమగును గనుక వానిలోఁ గొన్నిటిని సంగ్రహముగా వివరించుచున్నాను. సావధానమనస్కుల రై యాలకింపుఁడు.

విద్వాంసులు సహితము కామవికారమునకు లోఁబడక తప్పిం చుకో నేరరు గనుక, ప్రకృతిచంచలలైన కామినులు బొత్తిగానే కామము నడఁచుకోలేక విధవలైనహేతువుచేత భర్తవలనిభయము నైన నెఱుఁగక సులభముగా నింద్రియసుఖవాంఛం దగులుకొని, దోషములలో నెల్లను మిక్కిలి హేయ మయినవ్యభిచారమునందుఁ

ప్రవేశింతురు. తిన్నగా నాలోచించి చూడఁగా లోకములోని నరహత్యలలో ముప్పాతిక మువ్వీసము వ్యభిచారసంబంధమునుబట్టి వచ్చినవే యైయుండును. మానవంతుఁడైనవాఁడు తనకుటుంబములోఁ జేరిన స్త్రీ మఱియే నేరమును జేసినను చూచి యూరకుండఁ గలుగునుగాని ఱంకుతనమును జూచినప్పుడు మాత్రము సహించి యూరకుండఁ జాలఁడు. ఱంకుతన మొక్క మగనికి మాత్ర మవమానకరముగా నుండునని మీరు భ్రమింపఁ బోకుఁడు; తల్లిదండ్రులకును, అన్నదమ్ములకును, అత్తమామలకును బావమఱఁదులకును, అందఱకును అపకీర్తిఁ దెచ్చి పదిమందిలో వారు తలయెత్తి తిరుగ లేకుండఁ జేయును; బంధువుల కెల్లను అపఖ్యాతిగా నుండును; తుదకు కులము వారికి సహితము తలవంపుగా నుండును. ఇట్లుండుటంబట్టియే యభిమానవంతులగువారు అనాథలైన తమ వదినె మఱదండ్రుగాని అక్కచెల్లెండ్రుగాని జారత్వమునం బ్రవర్తించుచుండఁగా జూచి యోర్వలేక కొన్ని సమయములయందు తమ స్త్రీలను మఱికొన్ని సమయములయందా స్త్రీల నిమిత్తము వచ్చిన జారపురుషులను పొడిచివేసి చంపి తాముగూడ దొరతనమువారి కఠినశిక్షలకు శరీరములను ప్రాణములను నొప్పగించుచున్నారు. ఱంకుతనము బయలఁబడినపుడు తమ బంధువులును పొరుగువారును ఆడు ములుకులవంటి కాసిమాటలను పడలేక నూతిలోనో గోతిలోనో పడి యాత్మహత్యలు చేసికొను వితంతువులును పలువురు గలరు; దీనినిబట్టి చూడఁగా స్త్రీ పునర్వివాహము లేకపోవుటవలనఁ గలిగిన వ్యభిచారము స్త్రీహత్యలకును నరహత్యలకును కారణ మగుచున్నది.

వితంతువులు చిన్నతనములోనే స్వతంత్రురాండ్రయి మగని సొత్తంతయు వచ్చి తమకుఁ జెందినపక్షమున, పలువిషయములలోఁ

చెడిపోయి ధనమునంతను మక్కువగల పురుషుల పాలుచేసి యచిర కాలములోనే కూటికిని గుడ్డకును లేని యనాథలగుచున్నారు. ఇంత యేల? స్వతంత్రురాండ్రైన విధవలు జారత్వవిషయమునఁ దమ సంస్థానములను సహితము పోఁగొట్టుకొని, కొడుకులు బ్రతికియున్న యెడలఁ దమకు స్వాతంత్ర్యము లేకపోవునని యెంచుకొని కన్నకొడుకులనొండె దత్తపుత్రులనొండె చంపింపను వారికి విషాన్నము పెట్టింపను సాహసించినవారిని మీరు కనియు వినియు నున్నారు. అట్టివారలు పలువురున్నను, సభలలో వారిపేరులు వెల్లడించుట యుచితము కాదు. ఈవిషయమున మీమనస్సులే మీకు సాక్ష్యము నియ్యవచ్చును. వెలిచవి మరగిన స్వతంత్రురాండ్రు గాని విధవలు సహితము పుట్టినింటనో యత్తింటనో యుండి పురుషు లింటికిఁ దెచ్చిన వస్తువులలో నుప్పులో నుప్పును, పప్పులో పప్పును పరపురుషులకు పెట్టువారును నెక్కడఁ జూచినను లెక్కకు మిక్కిలిగాఁ గలరు. ఇంటఁగల నగలను దొంగిలించి, రహస్యముగా నుపపతులకు సమర్పించుచుండు విధవలును గొందఱున్నారు. ఇట్టిచెడువృత్తి ధనహానికిని గారణ మగుచున్నది.

కొందఱు విధవలు ఇంటఁగల నిర్బంధమునకు కట్టువడి యుండ లేక, కామాధీనలయి యేరాత్రివేళనో తమ చేతఁజిక్కినంత సొమ్ముతో నుపకాంతుని నెవ్వనినో తీసికొని లేచిపోయినవారును కనఁబడుచున్నారు. ఇంటనుండి వ్యభిచరించువారికంటె అట్లు లేచిపోయినవారే కొంత యుత్తమురాండ్రనవచ్చును. ఒకతె యిల్లు విడిచి లేచిపోయె నేని, తానొక్కతె మాత్రము జాతిభ్రష్టయై చెడిపోవును; ఇంటనుండి వ్యభిచరించునదో, తన కుటుంబమువారిని బంధువులను కూడ భ్రష్టులను జేసి, వర్ణసాంకర్యము చేయుచున్నది. లేచిపోయిన విధవలనుగూడ మరల

దీసికొని యింటఁ బెట్టుకొని, వర్ణసాంకర్యమును జేయువారు గొప్పగొప్ప వారిలోనే యనేకు లుండియున్నారు. మన బ్రాహ్మణోత్తములందఱును తలకొక్క రెండణాలు దక్షిణయిత్తురని యాశపడి సంతర్పణములయందును సమారాధనములందును అట్టివారి యిండ్లకు భోజనములకు వెళ్ళి యాసాంకర్యమును తాముకూడ పంచుకొని సంకరులగుచున్నారు. ఈప్రకారముగా నీదుర్వృత్తి వర్ణసాంకర్యమునకును గారణ మగుచున్నది.

మనపెద్దలనుగ్రహించి పునర్వివాహము లేకుండఁ జేసినను, భగవంతుఁ డనుగ్రహించి కామమును మాత్రము తీసివేయనందున యౌవనవతులయిన విధవలు పరపురుష సంభోగమునకు ఫలముగా గర్భమును ధరించి, ఆసంగతి యితరులకుఁ దెలియునన్న భీతిచేత తమకు గర్భప్రదానముచేసిన మహాపురుషుల సాహాయ్యముచేతనో, అట్టి పురుషసింహములను తార్చుటయందు సమర్థురాండ్రైన తార్పుకత్తెయల తోడ్పాటుననో, మందులు తెప్పించుకొని గర్భపాతములను జేసికొనుచున్నారు; అట్టిసదుపాయము లభింపని యనాథయువతులు నవమాసములును గర్భమును ధరించి బిడ్డలనుగని కన్నబిడ్డల ముద్దుమొగములను జూచి చంపఁ జేతులాడక, జాతికట్టుపాటును మీఱుటకు శక్తురాండ్రుగాక పరితపించి తుదకెట్లో తెగించి మిక్కిలి దుఃఖముతో శిశుహత్యలను చేయ సాహసించుచున్నారు. చంపి పాఱవేయఁబడియున్న యట్టి లేతశిశువులను జూచినప్పుడు మనహిందువుల కొక్కరికి తప్ప, మృగపక్ష్యాదుల మొదలువిఱిచి చంపు ఇతరజాతులలోని కిరాతుల కయినను జాలిపుట్టి యట్టి ఘోరకృత్యమును మాన్పింపవలెనను బుద్ధి పుట్టకపోదు. గర్భస్రావమునకయి పుచ్చుకొన్న మందులు కొన్నిసమయములయందు వికటించి పుచ్చుకొన్నవారికే ప్రాణాంత

మును కలుగఁజేయుటయుఁ గలదు. దీనినిబట్టి విచారింపఁగా స్త్రీపునర్వివాహము లేకపోవుట భ్రూణహత్యలకును శిశుహత్యలకును గూడఁ గారణ మగుచున్నది.

ఇప్పటి మనదేశపు శిక్షాస్మృతిలో గర్భపాతములును శిశుహత్యలును నేరములని యేర్పఱుపఁబడి యుండుటవలన, రాజకీయ భటులా నేరములను పట్టుకొనుటకయి పూనుకొని తఱుచుగా భాగ్యవంతులకడ ధనమును స్వీకరించి విడిచిపెట్టుచు వచ్చినను ధనదానముచేత వారిని దృప్తిపఱుపలేని నిర్భాగ్యులైనను రచ్చ కీడ్చుచున్నారు; నేరము ఋజువుపడినపక్షమున, గర్భస్రావము నిమిత్తమై యౌషధములను దెచ్చినవారికిని పుచ్చుకొన్నవారికిని సహాయపడిన వారికిని ప్రేరకులుగా నున్నవారికిని దండనము కలుగుచున్నది; అదే ప్రకారముగా శిశుహత్యలయందును జేసినవారికిని చేయించిన వారికిని తోడుపడువారికిని శిక్ష యగుచున్నది. ఒకవేళ నేరము ఋజువుపడక వ్యవహారము కొట్టుపడిపోయినను, దానిని తప్పించుకొని బయలపడుటకయి చేయవలయు రహస్యములయిన ప్రయత్నములకయి ధనము వెచ్చపెట్టవలసి వచ్చుటయేకాక రాజసభలకెక్కి నలువురనోళ్ళలోను పడి తల్లిదండ్రులు మొదలగువారు మానసష్టమును శరీరాయాసమును పొందవలసిన వారగుచున్నారు. దీనినిబట్టి విమర్శించిన, మన యీదురాచారము నేరము చేసినవారికి మాత్రమేగాక నిర్దోషులయిన యితరులనేకుల మానభంగమునకును రాజదండనమునకును గారణ మగుచున్నది.

ఇట్టి స్వైరిణులయిన విధవలతోడి సహవాసదోషముచేత గృహమున నుండు పుణ్యస్త్రీలు కొందఱు భర్తలుండియు జారకాంక్షలం బ్రవర్తించి చెడిపోవుచున్నారు. తాఁజెడ్డకోతి వనమెల్లను జెఱిచిన

దన్నట్లు, విధవలయి చెడునడతలం బ్రవర్తించు స్త్రీలు, సమస్తమును జేయించువాఁడు భగవంతుఁడే గనుక మనమేమిచేసినను దోషము లేదను మిట్టవేదాంతము నొకదానిని నేర్చుకొని పైకి జపములను దపములను చేయుచు ఇంట నున్నవారు కొందఱు పతివ్రతలుగా నున్న దమపయిమాటలు సాగవని, తాము నేర్చుకొన్న వేదాంతమును వారికిఁగూడ నుపదేశించుచు మెల్లగా వారినిగూడఁ దమమార్గములకు దింపుచుందురు. నీటిబొట్టువంటి మృదుపదార్థము పడగా పడఁగా రాయి యంత కఠినవస్తువే యఱుగుచుండఁగా వారిదృఢమయిన యుపదేశములను వినఁగా వినఁగా లక్కవంటి స్త్రీల మనస్సు కరఁగక పోదు గనుక పుణ్యాంగనలలో నొకరిని జూచి యొకరట్లు పాడయిన వారును అసంఖ్యముగా నున్నారు. కాఁబట్టి మన యీదురాచారము భర్తలున్న వారిని సహితము చెడుమార్గమునఁ బ్రవర్తింపఁజేయుటకును గారణమగుచున్నది.

ఇంచుమించుగా భగవంతుఁడు స్త్రీపురుషులను సమానసంఖ్య గలవారినిగా సృజియించి యొక్క పురుషున కొక్క స్త్రీ యుండవలెనని యుద్దేశించి యున్నను మనదేశములో లెక్కకెక్కువగా నుండు స్త్రీలు విధవలయి వ్యర్థురాండ్రగుచుండుట వలనను, మృతభార్యులగు పురుషులు మరల కన్యకలనే వివాహము చేసికొనుచుండుటవలనను, సంఖ్యాతీతులయిన పురుషులు వివాహముకాక బాధపడుచుండుటకును మదనవేదనకుఁ దాళఁజాలక వ్యభిచారమునం బ్రవేశించుటకును గారణమగుచున్నది. తమకు వేగిరము వివాహములు కాకపోవుటవలన పురుషులు మూఁడేండ్లపిల్ల దొరకినను చాలునని యెంత సొమ్మయిన వెచ్చించుటకు సిద్ధపడుచున్నారు; ఆశాపిశాచాగ్రస్తులైన తల్లిదండ్రులు ధనమున కాశపడి రాక్షసకృత్యమని వెఱతీయక తమపుత్రికలను

ముసలివాండ్రకును వ్యాధిగ్రస్తులకును వికలాంగులకును సహితము విక్రయించి సొమ్ము గడించుకొనుచున్నారు. కాబట్టి నరమాంసవిక్రయమునకును కొంతవఱకు మన యీదురాచారమే కారణ మగుచున్నది.

ఈరీతిని జెప్పఁ బూనుకొన్నచో స్త్రీపునర్వివాహము లేక పోవుటవలనఁ గలుగు ననర్థము లెన్నియైన నున్నవి. మీరు నిష్పక్షపాతబుద్ధితో విచారించి చూచునెడల, మనలోని యీదురాచారమును నివర్తింపఁ జేయుటకు బ్రయత్నించుట యావశ్యకమని తోఁపఁ జేయుట కీపయిని చెప్పినవే చాలియుండును; పక్షపాత మవలంబించి యున్నయెడల, నేనింక లక్షనష్టములను గనఁబఱిచినను బ్రయోజన ముండదు. మీమనసున కెక్కునట్లుగా వర్ణించుటకై కాళిదాసాది మహాకవులయొద్దఁగల వర్ణనాసామర్థ్యమును నాయొద్ద లేదు; మిమ్మందఱను వశపఱుచుకొని యొప్పించుటకై నేనింతవఱకును జెప్పినదానిలో నేదియు నింద్రజాలము లేదు; మంత్రములును లేవు. మీరందఱు నెఱిఁగియున్న సంగతులలోనే కొన్నిటిని తేటతెలుఁగు మాటలతోఁ జెప్పియున్నాను; నేను జెప్పెడి యీపొడిమాటలకన్నను మీరు ప్రతిదినమును బ్రత్యక్షముగఁ జూచుచుండు అనంతనిదర్శనములే స్త్రీపునర్వివాహము లేకపోవుటవలనఁ గలుగు నష్టములను మీకుఁ జక్కఁగా బోధించి యుండవచ్చును. పయిని జెప్పినట్టు దుష్ప్రవర్తనమునఁ బ్రవేశింపని విధవలస్థితి సహితము మిక్కిలి శోచనీయమనుటకు సందేహము లేదు. విధవయయిన కన్యక జీవనమే వ్యర్థమగుచున్నది; వారికి సుఖమన్నమాటయే యుండదు; సమస్తభోగములును వారికి ఆకాశకుసుమ సదృశములయి యుండును; వారిని జూచినవారందఱును వారినెంతో పాపము చేసినవారినిగా భావింతురు; వారు బ్రతికియుండియుఁ జచ్చిన

వారితో సమానలయి యుందురు. అట్టివా రింట నుండఁజూచు తల్లి దండ్రులకును అత్తమామలకును కలకాలము దుఃఖము కలుగు చుండును. ఇట్టియాపదల నన్నిటిని తలఁచుకొనునప్పుడు దయార్ద్ర హృదయులయిన వారి కందఱికిని స్త్రీపునర్వివాహము చేయఁగూడ దని వేయిశాస్త్రములు చెప్పినను వాని నన్నిటిని మీఱి యొక్క సారిగా స్త్రీపునర్వివాహములు చేయింపవలయునని లేచునంత సాహ సము పుట్టక యుండదు. మనవారు స్త్రీలవిషయమునయిన తమ నిర్దా క్షిణ్యమును క్రూరత్వమును మన వేదములమీఁదను శాస్త్రముల మీఁదను త్రోసివేసి తాము నిర్దోషులుగాఁ గనఁబడుట కెంతప్రయ త్నించుచున్నను, మన హిందూజనులవలె హిందూవేదమును హిందూ ధర్మశాస్త్రములును ఈవిషయమున క్రూరములుగా నున్నవి కావు. మనవారందఱును సర్వోత్కృష్టప్రమాణమనియు నీశ్వరకృతమనియు నంగీకరించిన వేదమునందే,-

శ్రుతి॥ ఉదీర్ష్వనార్యభిజీవ లోక మితాసు మేత ముప శేష ఏహి-

హ స్తగ్రాభస్య దిధిషో స్త్వమేతత్పత్యుర్జనిత్వ మభిసంబభూవ-

అరణ్యకము, ౬ ప్రపాఠకము, ౧ అనువాకము.

అని యున్నది. మాధవాచార్యులను పేరంబరఁగు విద్యారణ్యులవారు పై శ్రుతికి వేదార్థప్రకాశాఖ్య వ్యాఖ్యానమునందు వ్రాసియున్న యర్థ మునే నేనిందు వ్రాయుచున్నాను—

హేనారి! త్వం ఇతాసుం=గతప్రాణం, ఏతం=పతిం, ఉప శేషే=ఉపేత్య, శయనం కరోషి; ఉదీర్ష్వ=అస్మాత్పతిస మీపా దుత్తిష్ఠ; జీవలోకమభి=జీవవంతం ప్రాణిసమూహ మభిలక్ష్య, ఏహి=ఆగచ్ఛ; త్వమ్, హ స్తగ్రాభస్య=పాణి గ్రాహవతః, దిధిషోఃపునర్వివాహేచ్ఛోః, పత్యుః, ఏతత్,

జనిత్వం=జాయాత్వం, అభిసంబభూవ=ఆభిముఖ్యేన సమ్యక్ ప్రాప్నుహి.

(రెండుమాఱులు వివాహమూడు స్త్రీ పునర్భువనియు, పునర్భువును వరించువాఁడు దిధిషువనియుఁ జెప్పఁబడుదురు. 'పునర్భూ ర్దిధిషూ రూఢా ద్విస్తస్యా దిధిషుః పతిః' అని యమరము.)

ఊర్ధ్వదైహిక కాండయందలి పూర్వక్రియయందు విధింపఁబడిన సహగమనమును జేయుటకు మృతభర్తృక భీతురాలయిన యెడల, సహగమనము చేయని యామెయొద్ద బంధువు లీమంత్రమును జదివి యామెను లేవఁదీయవలెనని విధి గలిగి యున్నది. 'ఓ నారీ! ప్రాణము పోయిన యీపెనిమిటి యొద్ద నేల పడి యుండెదవు? జీవించి యున్న వారిని జూచి లేచిరా. పునర్వివాహము చేసికొనఁగోరు పురుషునకు భార్యవు కమ్ము.' అను నర్థమిచ్చెడి యీమంత్రమును మఱిది మొదలగువారు పెనిమిటిపోయిన స్త్రీ యొద్దఁ జదివి యామె నూఱడింతురు. ఈశ్రుత్యర్థము మఱింత స్పష్టమగునను నుద్దేశముతో, బంధువులు ప్రేతనుగూర్చి చెప్పెడి పితృమేధమునందలి దీని పై మంత్రమును గూడ నర్థసహితముగా నిందు క్రింద వ్రాయుచున్నాను—

శ్రుతి॥ ఇయం నారీ పతిలోకం వృణానా నిపద్యత ఉపత్వా మర్త్య ప్రేతం ।. విశ్వం పురాణ మనుపాలయంతీ తస్యై ప్రజాం ద్రవిణం చేహ దేహి॥

హేమర్త్య=ఓమనుష్యుఁడా, ఇయం నారీ=ఈ స్త్రీ, పతిలోకం=పెనిమిటివైన నీలోకమును, వృణానా=కోరుచున్నదై, ప్రేతం=ప్రేతవగు, త్వాం = నిన్ను, ఉప=సమీపమునందు, నిపద్యత=పడియున్నది. పురాణం=ప్రాచీనమగు, విశ్వం = ప్రపంచమును,

అనుపాలయంతీ = అనుసరించి ప్రవర్తించుచున్నది.
తస్యై = ఆచిన్నదానికొఱకు, **ప్రజాం** = సంతానమును,
ద్రవిణంచ = ధనమును, **ఇహ** = ఈలోకమునందు,
దేహి = బాగుండునట్లు చేయుము.

చచ్చిపోయిన పెనిమిటి శవమువద్ద భార్య పడియున్నప్పుడు, ప్రేతము నుద్దేశించి యీమంత్రమును బంధువులు పఠింతురు. 'ఓ చచ్చిపోయినవాఁడా! నీభార్య నీలోకమును గోరి ప్రేతవగు నీసమీపమున పడియున్నది; ప్రాచీనమయిన యీప్రపంచధర్మము ననుసరించి ప్రవర్తించుచున్నది. కాఁబట్టి దీఁకి సంతానమును ధనమును వృద్ధిపొందిబాగుండునట్లు చేయుము.' అని యీ మంత్ర తాత్పర్యము. "ఉదీర్ష్వ" ఇత్యాది మంత్రమును పుత్రులు లేని స్త్రీయొద్దనే చదువుదురు. కాఁబట్టి యీమె కావలెకే పుత్రులు కలరని చెప్పుట కవకాశము లేదు.

శ్రుతిని మించిన శబ్దప్రమాణము వేఱొకటి లేదు గనుక, దీనిని బట్టి సర్వవిధముల స్త్రీ పునర్వివాహ మంగీకర్తవ్యమెనట్లు స్పష్టమగుచున్నది. ఇందలి వారెవ్వరైనను స్త్రీ పునర్వివాహమును నిషేధించు శ్రుతికూడ నున్నదని యీక్రింద నుదాహరించిన దానిం జదువవచ్చును:—

శ్రుతి. యదేకస్మిన్ యూపే ద్వే రశనే పరివ్యయతి తస్మా దేకో ద్వే
జాయే విన్దతే - యన్నైకాగ్ం రశనాం ద్వయో ర్యూపయోః
పరివ్యయతి తస్మాన్నైకా ద్వౌ పతీ విన్దత్తే.—యజుస్సంహిత.

ఒకయూపమున రెండుత్రాళ్ళు గట్టవచ్చును గాన, నొక్కఁడు ఇద్దఱు భార్యలను పొందవచ్చును; ఒకత్రాటి ననేక యూపములకుఁ గట్టుట లేదు గనుక, ఒకర్తె యనేక భర్తలను పొందదని పై శ్రుత్యర్థము.

ఒకని కిద్దఱు భార్యలని చెప్పిన తోడనే బాలుఁడు సహితము ఏకకాలమం దాతని కిద్దఱు భార్యలు గలరని తెలిసికొనును గాని మునుపు పోయిన భార్యయుఁ దరువాత వివాహమాడిన భార్యయుఁ గలిసి యిద్దఱు భార్యలున్నారని యెప్పుడు నూహింపఁడు; అదేప్రకారముగా నొక స్త్రీ కిద్దఱు భర్తలన్నచో నేకకాలమం దిద్దఱు భర్తలనియే యూహించును. దీనినిబట్టి విచారింపఁగాఁ, బై శ్రుతికి పురుషున కేకకాలము నందే యిద్దఱు భార్య లుండవచ్చుననియు, స్త్రీకొక భర్త యనంతరము మఱియొక భర్త యుండవచ్చును గాని యేకకాలమం దిద్దఱు భర్త లుండఁగూడదనియు తాత్పర్య మయినట్టు కరతలామలకముగా గనఁబడుచున్నది. "అగ్నిష్ఠం ద్వాభ్యాగ్ం రశనాభ్యాం పరివీయ" అని పయిని జెప్పఁబడిన యగ్నిష్ఠ మను యూపమునకు రెండుంశనలు గట్టవలెనని విధించెడి యీసూత్రమును ఏకకాలమం దనుటనె సూచించుచున్నది. ఒకవేళ నీశ్రుతికి స్త్రీపునర్వివాహ నిషేధమే యర్థమని యొప్పుకొన్నను, నేనిప్పుడు చెప్పుచున్న సంగతి కెంతమాత్రమును దౌర్బల్యము గలుగదు.

శ్లో॥ ధర్మజిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః।
శ్రుతి ద్వైధం తు యత్రస్యా త్తత్ర ధర్మా వుభౌ స్మృతౌ॥

అను మనువచనముం బట్టియు,

వ్యా. యత్ర పునః శ్రుత్యో రేవ ద్వైధం పరస్పర విరుద్ధార్థ ప్రతిపాదనం తత్ర ద్వావపి ధర్మౌ.,

అను కుల్లూకభట్ట వచనముంబట్టియు, శ్రుతియందు పరస్పర విరుద్ధ ధర్మబోధకవచనము లున్నపక్షమున వికల్పమున రెండును గ్రాహ్యములే యగును. కాఁబట్టి యీశ్రుతికిఁ బ్రతిపక్షులు చెప్పునర్థము నొప్పుకొన్నను, స్త్రీపునర్వివాహము చేయవచ్చుననియే యేర్పడును.

మఱియు నొకపండితుఁడు వాదము కొఱకీశ్రుతికి విరుద్ధమైన యర్థమునే యొప్పుకొని, విశేషముచేత సామాన్యము బాధింపఁబడును గనుక స్త్రీ యిద్దఱుభర్తలం బొందఁగూడదను సామాన్యవిధి "ఉదీర్ష్వ నారి" అను మృతభర్తృకయయి తన్ను మఱియొక పెనిమిటి చెందఁ గోరుట కవకాశముగల స్త్రీవిషయమగు విశేషవిధిచే నితర స్త్రీ విషయముగాఁ బర్యవసితంబగునని సాధించియున్నాఁడు. "యదేకస్మిన్" ఇత్యాది శ్రుతివాక్యమునకు నేను మొదటఁ జెప్పిన యర్థమే సరియైన దని స్థాపించుటకు శ్రుత్యంతరము సహితముగలదు. అదియేదనినః—

శ్రుతి. "తస్మాదేకస్య బహ్వ్యో జాయా భవన్తి; నైకస్యై బహవ స్సహపతయః —ఋగ్వేదము.

'కాఁబట్టి యొకనికి ఏకకాలమునందు బహుభార్య లగుదురు; ఒకతెకు ఏకకాలమునందు బహుపతులు కలుగరు, అని యీశ్రుత్యర్థము. ఈ శ్రుతి కీయర్థమును నేను మాత్రము క్రొత్తగాఁ జేసినది కాదు; పూర్వపు పెద్దలును ఈప్రకారముగానే యర్థమును జేసియున్నారు.

"శ్లో॥ గ్రహణం సహశబ్దస్య పర్యాయా ద్బహవో ధవాః,
స్యురితి ప్రతిపత్త్యర్థం ప్రాజాపత్యే వచస్తథా.

పయిశ్రుతి యందు 'సహ' శబ్దగ్రహణము పర్యాయముచేత బహుభర్త లగుదురనుట కని ప్రాజాపత్యవచనము. భారత వ్యాఖ్యానమునందు నీలకంఠాచార్యులును,-

వ్యా. నైకస్యైబహవ స్సహపతయః। సహేతి యుగప ద్బహుపతి నిషేధో- నతు సమయ భేదేన.

అని యొకస్త్రీకి ఏకకాలమునందు బహుపతులు నిషేధమగునే కాని భిన్నకాలములయందుఁ గాదని పయి శ్రుత్యర్థమును బరిష్కరించి యున్నారు. వీని నన్నిటిని బరిశీలించి చూడఁగా స్త్రీ పునర్వివాహము వేదవిహితమని తేటపడుచున్నది.

"యస్తు వేదవిశ్వాస రహితో ధర్మాత్పరాఙ్ముఖః తన్నానుష్ఠతి,
స జన్మనా బ్రాహ్మణోపి కర్మచణ్డాలో భవేత్."

అని యెవఁడు వేదమునందు విశ్వాసము లేనివాఁడయి, అందలి ధర్మములయందు విముఖుఁడయి వాని ననుష్ఠింపకుండునో వాఁడు జన్మముచేత బ్రాహ్మణుఁడయినను కర్మముచేత చండాలుఁడేయని మాధవాచార్యులు వ్రాసియున్నాఁడు గనుక, వేదచోదితమయిన పూర్వోక్త ధర్మము ననుష్ఠింపరాదనువారుందురని నేను నమ్మఁజాలను. వేదార్థములను బోధించుటచేతనే స్మృతులకుఁ బ్రామాణ్యము కలుగును గనుక, శ్రుతివిరుద్ధముగా నన్ని స్మృతులయందును ఈపునర్వివాహము కూడదని యున్నను అంగీకరింపఁదగినది కాదు. శ్రుతికి విరుద్ధమయినచో స్మృతి గ్రాహ్యము కాదనుటకుఁ బ్రమాణములు,—

శ్లో॥ "శ్రుతి స్మృతి విరోధేతు శ్రుతిరేవ గరీయసీ
అవిరోధే సదాకార్యం స్మార్తం వైదిక వత్సదా."

శ్రుతి స్మృతులకు విరోధమున్నయెడల శ్రుతియే గౌరవింపఁదగినదనియు విరోధము లేనియెడల శ్రుతివలెనే స్మృతియు నాదరింపఁదగినదనియు జాబాలియు,

"ధర్మంచ జ్ఞాతు మిచ్ఛంతాం ప్రకృష్టప్రమాణం శ్రుతిః,
ప్రకర్ష బోధనేనచ శ్రుతి స్మృతి విరోధే స్మృత్యర్థో నాదరణీయః",

ధర్మమును దెలిసికోనిచ్ఛగలవారికి శ్రుతియే ప్రకృష్టప్రమాణమనియు, శ్రుతికి విరోధమయిన స్మృత్యర్థము అనాదరణీయమనియు కుల్లూకభట్టును, మీమాంసాశాస్త్రమున

"విరోధేత్వనపేక్ష్యం స్యాత్ అసతిహ్యనుమానం; శ్రుతివిరోధే స్మృతివాక్యం అనపేక్ష్యం అప్రమాణం అనాదరణీయం చ."

స్మృతి శ్రుతికి విరోధమయినప్పుడు ఆ స్మృతికి వేదమం దాధార ముండునని యనుమానము లేకపోవుచున్నదనియు, శ్రుతికి విరోధ మయిన స్మృతివాక్యమును అపేక్షింపరాదు ప్రమాణముగా నెత్తుకో రాదు ఆదరింపరాదనియు, జైమిని మహర్షియు వ్రాసియున్నారు. పై వచనములనుబట్టి శ్రుతికి విరుద్ధముగా స్మృతుల యందు స్త్రీపున ర్వివాహ నిషేధకవాక్యము లున్నను, అవి గ్రహింపఁదగినవి కావని తెల్లమగుచున్నదికదా! ఇట్లు చెప్పుటచేత స్మృతి స్త్రీపునర్వివాహ మును నిషేధించుచున్నదని నా తాత్పర్యము కాదు; ఊరక వాదము కొఱకు స్మృతి నిషేధించినను అది ప్రమాణము కాదని చూపుట కయి యీచర్చను జేసితినే కాని స్మృతియు ఈపునర్వివాహము నంగీక రించుచునే యున్నది.

శ్లో॥ కృతేతు మానవా ధర్మా స్త్రేతాయాం గౌతమా స్మృతాః।
ద్వాపరే శాంఖ లిఖితాః కలౌ పారాశరా స్మృతాః॥

అనుబృహస్పతి వచనమువలనను, సమస్తమహర్షులును వ్యాసుని వెంటఁ బెట్టుకొని పరాశరుని యొద్దకుఁ బోయి కలియుగ ధర్మములను జెప్పుఁ డని ప్రార్థింపఁగా, పరాశరులవారు కలియుగధర్మములను వారి కుప దేశింపఁ బూనుకొన్నట్టున్న పరాశర స్మృతియందలి ప్రతిజ్ఞవల్లను, కలి యుగమునకు స్మృతులలోనెల్లఁ బరాశరస్మృతియే ప్రధాన మయిన దని విస్పష్టమగుచున్నదిగదా! అట్టి పరాశర స్మృతిలోనే,-

"శ్లో॥ నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ।
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధియతే॥"

అని పెనిమిటి దేశాంతరముపోయి సమాచారము తెలియని వాఁడయి నను, మరణము నొందినను, సన్యసించినను, నపుంసకుఁ డయినను, పతితుఁడయినను, స్త్రీపునర్వివాహము కూడునని విధి యున్నది.

ఈవిధి యుగాంతరవిషయమని మూలవిరుద్ధముగాఁ జేయు మాధవీయ వ్యాఖ్యానములును, పరివేదినీపరమని చేయు సందర్భశుద్ధిలేని యర్థములును, బ్రాహ్మణపరము కాదని చెప్పు ననాలోచితోక్తులును, బొత్తిగాఁ బాటింపఁదగినవి కావు. ఇది యుగాంతర విషయమన్నచో, ఈస్మృతి కలియుగము నిమిత్తము చేయఁబడినదన్న పరాశరుల ప్రతిజ్ఞకే భంగము వచ్చును; గనుక, "అయంచ పునరుద్వాహో యుగాంతర విషయో ద్రష్టవ్యః" అనుటచే, ఈపునర్వివాహము యుగాంతర విషయమని మాధవాచార్యులవారు చెప్పవచ్చినవారు కారనియు, "ఆయుగాంతరవిషయో ద్రష్టవ్య" యని పదచ్ఛేదము చేసికోవలయుననియు, ఈవిధి యెవ్వరయిన యుగాంతవిషయమని భ్రమింతురేమో యని యిది యుగాంతరవిషయము కాదని తెలిసికోఁదగిన" దని స్పష్టపఱిచియున్నా స్మృతి గ్రాహ్యాము కుఁ యర్థము వ్రాసి యున్నాఁడు. ఆయర్థము తాను

శ్లో॥ "శ్రుతిస్మృత్యోరుక్త యితరస్థలములయందలి వ్యాఖ్యానమునకు అవిగా నున్నను యుక్తికి సరిపడియే యున్నది గనుక, ఒకవేళ శ్రుతి ... చార్యులవారి తాత్పర్యమును అదియే యయి యుండవచ్చును. "ఉదీర్ష్వనారి" ఇత్యాది శ్రుతివాక్యములకు స్త్రీపునర్వివాహము కూడుననియర్థము వ్రాసిన మాధవాచార్యులే, మరల స్వోక్తి వ్యాఘాతముగాను, మూలవిరుద్ధముగాను, ఈయుగమున స్త్రీపునర్వివాహము నిషేధమని వ్యాఖ్యానము చేయునని నమ్మఁదగియు నుండదు. ఇప్పుడు చెప్పినయర్థమే సరి యయినచో, మాధవాచార్యులవారు,-

"శ్లో॥ ఊఢాయాః పునరుద్వాహం జ్యేష్ఠాంశం గోవధం తథా ।
కలౌ పంచ నకుర్వీత భ్రాతృజాయాం కమండలుమ్ ॥

అను నాదిత్యపురాణవచనమునుబట్టి, పయివిధి కలియుగనిషేధములలో జేరినదేమో యని సాధారణులు భ్రాంతిపడుదు రని యెంచి,

తద్భ్రాంతి నివారణార్థముగా "ఊఢా శబ్దేన విధివదూఢా గ్రాహ్యా అన్యత్ర పునరుద్వాహ స్యాత్రా ప్యంగీకృతత్వాత్" అని పూర్వ కాలమునందు మొదటి వరునికంటె మంచివరుఁడు దొరికిన పక్షమున వివాహిత యయిన కన్యకకు మరల వివాహము చేయు విధికలదు గానఁ బై నిషేధ మట్టి యూఢావిషయమనియు, 'అపి శబ్ద సారస్యముచేత ఆయూఢలలోను అక్రమోఢ యనఁగా బలవంతముగా నెత్తుకొని పోయి కాని మఱియొకవిధముగా మోసముచేసి కాని విధియుక్తముగా వివాహము చేసికోఁబడిన కన్య పునర్వివాహమునకు యోగ్యురాలే యనియుఁ దెలియ వ్రాసియుందురు. ఊఢయనఁగా విధుక్తముగా వివాహము చేయఁబడిన స్త్రీ. "పరివేదన పర్యాధానయోరివ స్త్రీణా పునరుద్వాహ స్యాపి ప్రసంగాత్ క్వచిదభ్యనుజ్ఞాం దర్శయతి" పరివేదన పర్యాధానములకువలెనే స్త్రీల పునర్వివాహమునకును ప్రసంగమువలన కొంచె మభ్యనుజ్ఞ ప్రదర్శించి యున్నాఁడను మాధవీయ వ్యాఖ్యానము వల్లను, మూలములోని 'నారీణా' మను స్త్రీసామాన్యవాచక ప్రయోగమువల్లను, వ్యాఖ్యానమునందును "స్త్రీణా" మనియే దానికర్థము వ్రాయఁబడుటవల్లను, ప్రకరణమువల్లను గూడ "నష్టే మృతే" ఇత్యాది విధి పరివేదిపరముకాదని బాలురకు సహితము తెలియును. ఇది యాచారకాండమునందు లేక ప్రాయశ్చిత్త కాండమునందున్న దనుట యొక యాక్షేపము కాదు; ప్రాయశ్చిత్త సంబంధములేని పెక్కువిషయము లాకాండమునందుఁ జేరి యున్నవి. అంతియకాక ప్రాయశ్చిత్తకాండమునందుఁ జెప్పిన యీవిధులను గాకవేఱుగా భర్త పోయిన స్త్రీలవిషయమయి సహగమనాది విధులను మఱెక్కడను పరాశరులవారు వ్రాసియుండలేదు. ముందెవ్వరో తనస్మృతికి వ్యాఖ్యానము చేయువారు చెప్పుదురని, పరాశరుఁడు తనస్మృతిలో సామా

న్యముగా మృతభర్తృకల విషయమయిన ధర్మములను విడిచిపెట్టు ననుట యుక్తికిని అనుభవమునకును విరుద్ధమగునుగదా? అంతియ కాక పరాశరులవారు తన స్మృతియందు ప్రాయశ్చిత్తముతో సంబంధములేని "ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమకస్సుతః। దద్యాన్మాతా పితావాపి సపుత్రో దత్తకస్స్మృతః॥" (ఔరసుఁడు, క్షేత్రజుఁడు, దత్తుఁడు, కృత్రిమసుతుఁడు, కొమాళ్ళు; తల్లిదండ్రులచే నియ్యఁ
బడినవాఁడు దత్తుఁడు) ఇత్యాది వచనములను ప్రాయశ్చిత్తకాండములో
విషయో ప్ర
మని మాధవాచార్యులు; ప్రాయశ్చిత్తమును విధించెడి, "శ్లో॥ క్షత్రియం
తరవిషయో ద్రష్టా బ్రాహ్మణో యోనుగచ్ఛతి। ఏకాహమశుచిర్భూత్వా
యెవ్వరయిన శుధ్యతి॥" (క్షత్రియుఁడు మృతుఁడయినప్పుడు అజ్ఞానముచేత
... వెళ్ళిన బ్రాహ్మణుఁడు ఒకదిన మశుచిగానుండి పంచగవ్య
స్మృతి (గ్రాహ్యుఁడగును) ఇత్యాది వచనముల నాచార కాండమున వ్రాసి
శ్లో॥ "శ్రుతి కాఁబట్టి యొకకాండమునందున్నవానికే యెక్కువ గౌర
వ మియ్యవలెననుట యుక్తియుక్తము కాదు. సందర్భము తెలియుటకయి పూర్వోత్తర శ్లోకములఁ గూడ నిందుదాహరించుచున్నాను.—

శ్లో॥ "జ్యేష్ఠభ్రాతా యదాతిష్ఠే దాధానం నైవకారయేత్।
అనుజ్ఞాతస్తు కుర్వీత శంఖస్య వచనం యథా॥" ౨౭

పరాశరుఁడు వివిధధర్మములను జెప్పుచు ఇరువది యేడవ శ్లోకముచేత, అన్న యుండఁగా తమ్ముఁడు ఆధానము చేయఁగూడదనియు, శంఖుని వచన ప్రకారముగా అనుజ్ఞనుపొంది చేయవచ్చుననియు జెప్పినాఁడు;

శ్లో॥ "నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే॥" ౨౮

అను నిరువదియెనిమిదవ శ్లోకముచేత, పయిని జెప్పిన అయిదు ఆపదల

యందును స్త్రీలు పునర్వివాహము చేసికొనవచ్చునని చెప్పినాఁడు;

శ్లో॥ మృతే భర్తరి యానారీ బ్రహ్మచర్యే వ్యవస్థితా।
సామృతా లభతే స్వర్గం యథా తే బ్రహ్మచారిణః॥ ౨౯

అను నిరువదితొమ్మిదవ శ్లోకముచేత, మగఁడు పోయినపిమ్మట యేస్త్రీ బ్రహ్మచర్యము నందు వర్తించునో ఆస్త్రీకి మరణానంతరము బ్రహ్మచారులకు వచ్చు స్వర్గము లభించునని చెప్పినాఁడు;

శ్లో॥ "తిస్రఃకోట్యర్థకోటీచ యాని లోమాని మానుషే
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి॥" ౩౦

అను ముప్పదవ శ్లోకముచేత, పెనిమిటితో సహగమనము చేయు స్త్రీ మనుష్యశరీరముమీఁద నెన్ని రోమములుండునో యన్ని సంవత్సరము లనఁగా మూఁడుకోట్ల యేఁబదిలక్షల సంవత్సరములు స్వర్గమునందు వసించునని చెప్పినాఁడు. పూర్వోక్తశ్లోకములోని "ప్రవ్రజితే" యను పదముచేత, ఈవిధి బ్రాహ్మణేతరులకేయని చెప్పుటకు లేశమయినను అవకాశ ముండదు. ఇప్పుడు ముద్రితమయియున్న మనుస్మృతిలో ఈశ్లోకము కనఁబడక పోయినను, పరాశరులవారు దీనిని మనుస్మృతిలోనుండి తీసికొన్నట్టు మాధవాచార్యులవా రొకచోట వ్రాసి యున్నారు. అట్లయినచో

శ్లో॥ వేదార్థోప నిబద్ధత్వాత్ ప్రాధాన్యంతు మనోః స్మృతం।
మన్వర్థ విపరీతాయా సాస్మృతి ర్న ప్రశస్యతే॥

అను నాపస్తంబ స్మృతి వచనమును బట్టి సర్వస్మృతులకంటె ఉత్కృష్ట మయిన మనుస్మృతియును ముఖ్యముగా కలియుగము కొఱకే యేర్పఱుపఁబడిన పరాశరస్మృతియును కూడ స్త్రీపునర్వివాహము నంగీకరించుచునే యున్నవి. స్త్రీపునర్వివాహము ధర్మశాస్త్రసమ్మతమగుటకు స్మృత్యంతరములయందును ప్రమాణవచనములు పెక్కులు

గలవు. అందుఁ గొన్నిటి నిందు క్రింద ప్రదర్శించు చున్నాను:—

శ్లో॥ "పాణిగ్రాహే మృతే కన్యా కేవలం మంత్ర సంస్కృతా।
సాచేదక్షతయోనిస్స్యా త్పున స్సంస్కార మర్హతి."

పాణిగ్రహణము చేసికొన్నవాఁడు మృతినొందినప్పుడు, మంత్రయుక్తముగా వివాహముచేసికొన్న స్త్రీకి అక్షతయోనియైన పక్షమున మరల వివాహము చేయవచ్చునని వాసిష్ఠ స్మృతియందును,

శ్లో॥ ఉద్వాహితాపి యాకన్యా న స్యా త్సంప్రాప్త మైథునా।
పునస్సంస్కార మర్హేత యథాకన్యా తథైవసా."

వివాహము చేసికొన్నదైనను పురుష సంసర్గమెఱుఁగనిదై యున్న యెడల, కన్యక కెట్లో యట్లే దానికిని వివాహము చేయవచ్చునని నారదస్మృతియందును,

శ్లో॥ 'దేయాన్యత్ర వివాహితాపిచ బలాద్యావిద్ధయోని ర్నచేత్'

పెండ్లియైనదైనను పురుషసంభోగము లేనిదైనచో మఱియొకనికిచ్చి బలాత్కారముగా వివాహము చేయవచ్చునని మార్కాండస్మృతి యందును, పునర్వివాహ మంగీకరింపఁబడి యున్నది. మఱియు "నష్టే మృతే" యనుశ్లోకము నారదసంహితయందును గైకొనఁబడి యున్నది; మఱియు మనుస్మృతియందు మఱియొకచోట

శ్లో॥ "సాచే దక్షతయోని స్స్యా ద్గత ప్రత్యా గతాపివా
పౌనర్భవేన భర్త్రాసా పునస్సంస్కార మర్హతి॥"

అని యక్షతయోనియైన స్త్రీకిఁ బునర్వివాహ మొప్పుకోఁబడి యున్నది. యాజ్ఞవల్క్య స్మృతియందును

శ్లో॥ "అక్షతాచ క్షతాచైవ పునర్భూ స్సంస్కృతా పునః"

అని అక్షతయోనియైనను కాకపోయినను గూడ పునర్భూవివాహ మంగీకరింపఁబడి యున్నది. "ప్రథమ మేకస్యజాయా భూత్వా పునః

అన్యస్య జాయా భవతీతి పునర్భూః" అని ముందొకనికి భార్యయై మరల మఱియొకనికి భార్య యగునది పునర్భువని గురుబాల ప్రబోధిక యందు పునర్భూ శబ్దమునకు వ్యుత్పత్త్యర్థము వ్రాయఁబడి యున్నది. ఇంతవఱకును వ్రాసిన దానినిబట్టి స్త్రీపునర్వివాహము ధర్మశాస్త్ర సమ్మతమని కూడ విశదమయినదిగదా? పెనిమిటి బ్రతికియుండగానే మఱియొక మంచివరుఁడు దొరకినయెడల స్త్రీకిఁ బునర్వివాహమును విధించు మనస్మృతులు నిజముగా భర్తృవియోగమును పొంది యాపద్దశయందుండు స్త్రీకిఁ బునర్వివాహమును విధించకపోవునా? మంచి వరుఁడు దొరకినపుడుకూడ స్త్రీకిఁ పునర్వివాహమును విధించు స్మృతి వచనముల నొకటి రెంటి నిందు క్రింద వ్రాయుచున్నాను —

శ్లో॥ దత్తామపి హరేత్పూర్వా చ్ఛ్రేయాం శ్చే ద్వర ఆవ్రజేత్."

యా. స్మృ.

శ్లో॥ "హీనశ్చే త్కులశీలాభ్యాం హరే త్కన్యాం నదోషభాక్
నమంత్రాః కారణం తత్ర నతు కన్యానృతం భవేత్॥"

శా. స్మృ.

పైనుదాహరించిన "ఊఢాయాః పునరుద్వాహమ్" మొదలుగాఁ గల యాదిత్యపురాణవచనమును, "దత్తా యైవ కన్యాయాః పునర్దానం వరస్యచ" అను బృహన్నారదీయవచనమును, భర్త జీవించియుండఁగా జేయు పూర్వశ్లోక ద్వయోదాహృత స్త్రీపునర్వివాహమును నిషేధించుటకై పుట్టఁబడియుండును. ఇవి గట్టిగా స్త్రీపునర్వివాహమును బొత్తిగా గలియుగమున నిషేధించుటకై పుట్టినవేయని మీరు వాదించెదు పక్షమున, అవి ప్రమాణములే కావని నేను దృఢముగాఁ జెప్పఁగలను. పైనిజెప్పిన రెండువచనములును అష్టాదశపురాణములలోనివి కాక, ఉపపురాణములలోనివయి యున్నవి. అందులోను "ఊఢాయాః

పునరుద్వాహ" మన్నది ముద్రింపఁబడిన యాదిత్యపురాణములో లేనే లేదు. ఒకవేళ నీరెండువచనములును అష్టాదశ పురాణములలో నొక దానిలోనివే యైనను గ్రాహ్యములుగావు. ఎట్లన

శ్లో॥ "శ్రుతి స్మృతి పురాణానాం విరోధో యత్ర దృశ్యతే।
తత్ర శ్రౌతం ప్రమాణంతు తయోర్ద్వైధే స్మృతి ర్వరా॥"

అను వ్యాస వచనమునుబట్టి శ్రుతిస్మృతి పురాణములలోవిరోధము సంభవించినపుడు శ్రుతియే ప్రమాణమనియు, స్మృతికిని పురాణమునకును భేదము సంభవించినయెడల స్మృతియే శ్రేష్ఠమనియు సిద్ధాంత మగును వివాహము స్త్రీపునర్వివాహము వేదవిహితమయినప్పుడు స్మృతియుఁ యెడల, కన్యకూడ విరోధముగా నున్నను అవి కొంచెమగుచునను నారదస్మృతిం గావు; అటువంటిస్థితిలో స్మృతియొక్కటియే విరోధముగా శ్లో॥ 'శ్రోత్రియము పనికిరాని పురాణము శ్రుతియు స్మృతియుఁగూడ పెండ్లియైనదియుండఁగా తద్విరోధముగా నెట్లు పనికివచ్చును? కాఁబట్టి బలాత్కారవచనములు శ్రుతి స్మృతుల నెంతమాత్రమును బాధింపయాల. ఇట్లన్నచో నిఁక స్మృతిపురాణములతో నేమి ప్రయోజనమున్నదని మీరు శంకచేయవచ్చును. శ్రుతిలోఁ జెప్పఁబడనిదాని విషయమయి స్మృతియు, శ్రుతి స్మృతులలోఁ జెప్పఁబడని దాని విషయమయి పురాణమును, ప్రమాణములు గనుక వానివలనను ప్రయోజనము కలదని నేనుజెప్పెదను. ఇందుకు నిదర్శనముగా నాపస్తంబుల వారి వాక్యముల నిందుదాహరించెదను.—

శ్లో. "య దదృష్టంహి వేదేషు తద్ద్రష్టవ్యం స్మృతౌ కిల
ఉభాభ్యాం యదదృష్టస్తు తత్పురాణేషు పఠ్యతే.

శ్లో॥ శ్రుతి స్మృతి పురాణేషు విరుద్ధేషు పరస్పరం,
పూర్వం పూర్వం బలీయం స్యా దితి న్యాయవిదో విదుః,"

వేదములయందుఁ గనఁబడని విషయములను స్మృతివలన గ్రహింపవలయును; ఆ రెంటియందును గనఁబడని విషయములను పురాణముల నుండి గ్రహింపవలయును; శ్రుతిస్మృతిపురాణములలో విరోధము కనఁబడునపుడు వెనుకటిదానికంటె ముందుది బలీయమయినదని న్యాయవిదులు చెప్పుదురు, అని పై శ్లోకద్వయమునకును తాత్పర్యము. ఇట్లింతదూరము చెప్పుటచేత పురాణములు స్త్రీపునర్వివాహమును నిషేధించుచున్నవని నామతము కాదు; ముఖ్యములైన పురాణములును స్త్రీపునర్వివాహము నంగీకరించుచునే యున్నవి. అందఱిచేతను పంచమవేదమని యంగీకరింపఁబడిన భారతమునందు,

"శ్లో॥ అర్జునస్యాత్మజః శ్రీమా నిరావా న్నామ వీర్యవాన్
సుతాయాం నాగరాజస్య జాతః పార్థేన ధీమతా
ఐరావతేన సా దత్తా హ్యనపత్యా మహాత్మనా
పత్యౌ హతే సుపర్ణేన కృపణా దీనచేతనా ॥"

అని యర్జునుఁడు మృతభర్తృక యయిన యులూచిని శాస్త్రీయముగా వివాహము చేసికొని యిరావంతుఁడను పుత్రుని బడసినట్టు భీష్మపర్వమునఁ జెప్పఁబడి యున్నది; అరణ్యపర్వమున దమయంతికి ద్వితీయ స్వయంవరమని చెప్పిపంపఁగా నామెను పునర్వివాహము చేసికోవలెనను నిచ్ఛతో ఋతుపర్ణసంతతి రాజర్షి వచ్చినట్టు చెప్పఁబడి యున్నది. "అక్షతా భూయ స్సంస్కృతా పునర్భూః" అని విష్ణుపురాణమునందు అక్షత యయిన పునర్భూ వివాహము కంఠోక్తిగానే విధింపఁబడి యున్నది. ఇవి యన్నియు విమర్శింపఁగా స్త్రీపునర్వివాహము శ్రుతిస్మృతి పురాణ సమ్మతమను నిష్కృష్టాంశము తేలుచున్నది.

ఇఁక మీరు స్త్రీపునర్వివాహమునకు శాస్త్రసమ్మతి యున్నను శిష్టాచారము కావలె నందురేమో శాస్త్రతిరస్కారముచేసి మనసు

వచ్చినట్లు ప్రవర్తించువారు శిష్టులు కారు గనుక, శాస్త్రవిహితమైన పనికి వేరుగ శిష్టాచారము గనఁబఱుపవలసిన యక్కఱ యుండదు.

"లోకేప్రేత్యవిహితోధర్మః - తదలాభే శిష్టాచారః ప్రమాణం"

అను వ్యాస వచనమును బట్టియు,

"శ్లో॥ ధర్మజిజ్ఞా సమానానాం ప్రమాణం ప్రథమం శ్రుతిః।
ద్వితీయం ధర్మశాస్త్రంతు తృతీయం లోకసంగ్రహః॥"

ధర్మజిజ్ఞాస చేయువారికి ప్రథమప్రమాణము వేదమనియు, రెండవ ప్రమాణము ధర్మశాస్త్రమనియు, మూడవప్రమాణము లోకాచారమనియు చెప్పు భారతానుశాసనికపర్వ వాక్యమును బట్టియు,

"శ్లో॥ న యత్ర సాక్షాద్విధయో నవిషేధాః శ్రుతౌ స్మృతౌ।
దేశాచార కులాచారా స్తత్ర ధర్మం నిరూప్యతే॥"

శ్రుతి స్మృతులకు విరోధముగా నుండనపుడు మాత్రమే దేశాచార కులాచారములు ధర్మములను జెప్పుననియున్న స్కాందపురాణవచనమును బట్టియు, శాస్త్రములోఁ జెప్పని విషయములకుమాత్రమే శిష్టాచారము ప్రమాణము గనుక, శాస్త్రోక్తమయిన స్త్రీపునర్వివాహమునకు శిష్టాచారముతో బనిలేదు. కావలయునన్న అర్జునుఁడు విధవయయిన యులూచిని బెండ్లియాడుటయు, ఋతుపర్ణుఁడు దమయంతిని ద్వితీయ స్వయంవరమున వరింపఁ జనుదెంచుటయు శిష్టాచారములే. ఇప్పటివారిలోనే కావలెనన్న, పునహా మొదలగు దేశములయం దిప్పుడు జరుగుచున్న స్త్రీపునర్వివాహములే శిష్టాచారమునకు నిదర్శనములని చెప్పవచ్చును. మనయాంధ్రదేశమునందే యీయాచారమును జూపవలయునన్న, మనశాస్త్రమునకే బద్ధులైయున్న గొల్లలు మొదలగువారియందుఁ బునర్వివాహము స్త్రీలలో జరుగుచుండుటను దృష్టాంతముగాఁ జెప్పవచ్చును. గొల్లలు మొదలగువారి యాచారము

శిష్టాచారమని నేను చెప్పరాను గాని, నిరక్షరకుక్షులగుటచేత నెప్పుడును గతానుగతికులుగానే యుండవలసిన వారియందీ యాచారము నడుమఁ దెచ్చిపెట్టుకోఁబడ్డదనుట కవకాశ ముండదనియు, అందువలన హిందువులలో స్త్రీలకుఁ బునర్వివాహము చేసెడి యాచారము పూర్వమునుండియు నుండి మధ్య గొప్పజాతులవారు విడిచిపెట్టినను వారిలో మాత్రము నేఁటివఱకును వచ్చుచున్నదనియు మాత్రము చెప్పెదను. ఇందువలన స్త్రీపునర్వివాహము శ్రుతి స్మృతి పురాణ శిష్టాచారముల చేతను యుక్తిచేతను అవశ్యకర్తవ్యమని కనబడుచున్నది.

పురాణవచనములు శ్రుతి స్మృతులను బాధింపలేకపోయిన యెడల,

శ్లో॥ అశ్వాలంభం గవాలంభం సన్యాసం పలపైతృకమ్ ।
దేవరాచ్చ సుతోత్పత్తిః కలౌ పంచ వివర్జయేత్ ॥

అని కలినిషేధములలోఁ జేరిన యీకార్యములనెల్ల మరల నాచరింపవలసినదే విధి యగునాయని కొందఱడుగుదురు. ఈశ్లోకమును, పూర్వోక్త బృహన్నారదీయాదిత్య పురాణవచనములును, "కాలికాక్షతయోనోశ్చ వరేణాన్యేన సంస్కృతిః" ఇత్యాద్యక్షతయోనికా పునర్వివాహ నిషేధవచనములును, శ్రుతి స్మృతులకంటెఁ బురాణములు బలీయములని సాధించుటకుఁ బనికిరావుగాని, పూర్వకాలమునం దక్షతయోనికా వివాహాదు లాచరింపఁబడుచు వచ్చెననుటకును, ఆయాకాలములవారు దేశకాలవైపరీత్యములనుబట్టి లోకవిరుద్ధములుగాఁ దోఁచిన శాస్త్రవిహితధర్మములను కాలానుగుణముగా నప్పుడప్పుడు మార్చుకొనుచు వచ్చిరనుటకును నిదర్శనములుగా నుండును. దైవకృతములని యెన్నఁబడిన శ్రుతి స్మృతులలోని విధులనే యిష్టానుసారముగా మార్చుటకును వారి తరువాతివారికిని స్వాతంత్ర్యముండునేని,

మొన్న మొన్న పుట్టిన కట్టుబాటులను నష్టికరములని యేర్పడినప్పుడు మనము మాత్ర మేల మార్చుకోరాదు ? తన పూర్వపువారు కలియుగమున నిషేధించిన సన్యాసమును శంకరాచార్యులు మరల స్థాపించుటయు గాలానుగుణముగా విధులు మార్పుచెందవలయు ననుటకును, చెందుచు వచ్చుననుటకును దృష్టాంతమయి యున్నది. పయినిజెప్పిన నిషేధములన్నియు నష్టికరములుగాఁ గనఁబడినందు వాని యాచరణమును మానుకొన్నను సర్వవిధములచేతను లాభకరమయిన యీ స్త్రీపునర్వివాహమును అగ్రవర్ణములవారెందుకు మానుకొన్నారని మీరు శంకింపవచ్చును. తక్కువజాతులవారగు రజకులు మొదలయిన వారు చేసెడి పనినే యగ్రజాతులవారగు మనమును జేసినయెడల మన యాధిక్యమేమను దురభిమానముచేతనో, అప్పుడు దుష్టరాజులు రాజ్యము చేయుచున్నందున స్త్రీపునర్వివాహవిధి యున్నపక్షమున వారు బలవంతముగా భర్తలను జంపించి వారి చక్కని భార్యలను గైకొందురను భయముచేతనో, స్త్రీలే మఱియొక పురుషునిమీఁద తమకు బుద్ధిపుట్టినప్పుడు భర్తలను విషప్రయోగాదులచేఁ జంపి తమ యిష్టమువచ్చిన వారిని పెండ్లియాడుదురను పిచ్చియూహచేతనో, సంతులేని వితంతువులసొత్తును అపహరింపవచ్చునను బంధువుల దుర్బుద్ధిచేతనో, మఱి యిట్టి యేయితర కారణముచేతనో మనపూర్వులట్టి వివాహములను మాన్పియుంచారు. ఈకాలమున నట్టి బాధకములేవియు లేకపోవుటచేతను, స్త్రీపునర్వివాహము లేకపోవుటవలన జరగు ఘోరకృత్యములసంఖ్యములుగాఁ గనబడుచున్నందునను, మరల కాలానుగుణముగా ఆచారమును మార్చుకొనుటయందే యాక్షేపణమును గనఁబడదు. ప్రభువుల ధర్మపరిపాలనముయొక్క తారతమ్యమును బట్టియే ధర్మములు నడచుచు వచ్చునుగాని పూర్వకాలమే మంచి

దనికాని యీకాలము చెడ్డదనికాని యెంచ వల్లకాదు. కృతయుగము నందును వేనుఁడు మొదలగు దుష్టప్రభువులు రాజ్యము చేయుకాలములో ధర్మములు చెడిపోయినట్లును, త్రేతాయుగములో రావణుఁడు మొదలగువారు దేశోపద్రవమును జేసినట్లును మన స్మృతులును పురాణములును జెప్పుచున్నవిగదా ? ధర్మములు క్రమముగా జరుగునేని, ఇదియే కృతయుగమగును; యుగభేదముచే నొక లాభకరమయిన పని యీయుగమున మాత్రము జరగరాదనుట వెట్టిమాట. దీనిని బట్టియే మనుస్మృతి నవమాధ్యాయమునందు,-

శ్లో॥ "కృతం త్రేతా యుగం చైవ ద్వాపరం కలి రేవచ
రాజ్ఞోవృత్తాని సర్వాణి రాజాహి యుగముచ్యతే.
కలిః ప్రసుప్తో భవతి సజాగ్ర ద్ద్వాపరం యుగమ్
కర్మ స్వభ్యుద్యత స్త్రేతా విచరంతు కృతం యుగం॥"

కృత త్రేతా ద్వాపర కలియుగంబులు రాజకృతములే యనియు, రాజులనుబట్టియే యుగవ్యవహారము గలిగెననియు, రాజు తెలియనివాఁడగుచో కలియనియు, తెలిసియు నడవకున్న ద్వాపర మనియు, నడవఁ బ్రయత్నము చేయుచో త్రేతయనియు, కార్యములు సాగించినచోఁ గృతయుగమనియుఁ జెప్పఁబడి యున్నది. దీనినిబట్టి విచారింపఁగా యుగభేదములనుబట్టి ధర్మవ్యవస్థ లేర్పఱుచుట రాజులయొక్క ప్రభుత్వస్థితినిబట్టి యప్పటి సాధక బాధకముల నాలోచించి కాలానుగుణముగాఁ గావలసిన మార్పుల నేర్పరఱుచుకొనుటయేకాని వేఱుకాదని తోఁచుచున్నది. కాఁబట్టి యిప్పటి కాలమున కనుకూలముగా మనవిూ భ్రూణహత్యాది దోషనివారకమయిన యాచారము నేర్పఱుచుకొనుట సర్వవిధముల శ్రేయోదాయకమును నిర్బాధకమును అని తోఁచుచున్నది.

"శ్లో॥ పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే।
పుత్రో రక్షతి వార్ధక్యే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి॥"

అను శ్లోకమును జదివి మొన్న నొకపండితుఁడు స్త్రీపునర్వివాహము వలన స్త్రీకి స్వాతంత్ర్యము కలుగుననియు; స్త్రీకి స్వాతంత్ర్యము నెప్పుడు నియ్యఁగూడ దనియు, స్త్రీపునర్వివాహమున కదియే యాక్షేపణమనియుఁ జెప్పియున్నాఁడు. స్త్రీపునర్వివాహమువలన స్త్రీలకు వచ్చు స్వాతంత్ర్యమేదియు లేదు; మగఁడు పోయిన స్త్రీని ఆజ్ఞ పెట్టువారు లేకుండఁజేసి స్వేచ్ఛగా వదలివేసిననే స్వాతంత్ర్యము కలుగును గాని, భర్త యొకఁడుండినపక్షమున స్వాతంత్ర్య మెన్నటికిని కలుగనేరదు. "భర్తా రక్షతి యౌవనే" యౌవనమునందు భర్త రక్షించునని యుండుటచేత, యౌవన మున్నంతవఱకును స్త్రీకి భర్త యుండి యామె యాతని యాజ్ఞలో నుండవలెనని యేర్పడి యౌవనమున భర్త పోయిన స్త్రీకి పునర్వివాహము విధ్యుక్తమయినట్టే తేటపడుచున్నది.

ఓపండితసార్వభౌములారా! శాస్త్రములకుఁ బ్రత్యక్షవిరోధముగా ననేక దుశ్చేష్టలు జరుగుచుండఁగా కన్నులు పెట్టుకొని చూచుచు నోరెత్తలేక యూరకుండెడి మన మీ యనాథలయిన యబలల విషయములో మన పాండిత్యమునంతను గనఁబఱిచి, దురభిమానులు మెచ్చునట్లు శాస్త్రమున కపార్థములు గల్పించి, కోమలుల సౌఖ్యమునకు విఘాతము కలిగించి యందువలన వారు బహుదుష్కార్యములకు దిగునట్లు చేయ మన యావచ్ఛక్తిని వినియోగింపవలయునా? పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రము వేసినట్లును, ఆఱునెలలు సాముచేసి మూల మన్న ముసలిముండను గొట్టినట్లును, ఎంతోకాలము కష్టపడి మనము చదువుకొన్న చదువునంతను మగఁడు చచ్చిన యాఁడువారిని బాధించు

టకే ధారపోయవలయునా ? మన విద్యను వివేకమును గతిలేని యనాథలను దుస్థితినుండి తొలఁగించి కాపాడుట కయి యుపయోగింపరాదా? "శ్లో॥ యత్పాపం బ్రహ్మహత్యాయాం ద్విగుణం గర్భపాతనే। ప్రాయశ్చిత్తం న తస్యాస్తి తస్యా స్త్యాగో విధీయతే." అను పరాశరస్మృతి ప్రకారముగా బ్రహ్మహత్యకంటెను ఘోరపాతకమయి ప్రాయశ్చిత్తము సహితములేని భ్రూణహత్యాదులకు మూలమయిన దానిని వృద్ధిపొందించుటకయి శాస్త్రతిరస్కారమును జేయ శంకింపక, అట్టి ఘోరపాతకము లడఁగునట్లు బహుజనోపకారకముగా శాస్త్రసమ్మతమయిన స్త్రీపునర్వివాహము జరుగుట కనుజ్ఞ యియ్యక, మూఢులయిన జనుల మెప్పుకొఱకు మన మాత్మవంచకులమయి పాపభీతి లేక శాస్త్రమునకు విపరీతార్థములుచేసి దురాచారమును నిలువఁబెట్టుటకయి మన శక్తినంతను వినియోగించిన ముందు మనకేమి ప్రతిష్ఠ రాఁగలదు ? ఈశ్వరుఁడైనను మనల నెట్లు మెచ్చును ? కాఁబట్టి యితరుల మెప్పును విచారించుటకు ముందు తాము చేయుపనిని తమ యంతరాత్మ మెచ్చునో లేదో ముఖ్యముగా విచారింపఁ బండితమండలి నెల్లను మిక్కిలి వినయముతోఁ బ్రార్థించుచున్నాను.

అన్నివిధములచేతను స్త్రీపునర్వివాహ మీకాలమున నవశ్యాచరణీయమని విదితమగుచున్నను, దానికి ప్రతిబంధకముగా కొందఱు కొన్ని యాక్షేపణములు పలుకుదురు. స్త్రీపునర్వివాహమునకు విధియున్నప్పుడు "స్త్రీపునర్వివాహమంత్రము లెక్కడ నున్నవి?" "ఒకసారి యియ్యఁబడిన స్త్రీని మరల నెట్లియ్యవచ్చును?" "పూర్వభర్తయాబ్దిక మెవ్వరు పెట్టుదురు?" మొదలయినవి గొప్పయాక్షేపణాంశములుగావు. స్త్రీపునర్వివాహ విధు లుండి, వివాహమంత్రములను మార్చవలసిన విధులుండకపోవుటచేత, ప్రథమవివాహమునం దేయే

మంత్రములున్నవో ద్వితీయ వివాహమునందును ఆయామంత్రములే పనికివచ్చును. మృతభర్తృకకు సహితము రజస్వల కాకమునుపు కన్యా శబ్దవ్యవహారము గలదు.

శ్లో॥ అష్టవర్షా భవేత్కన్యా నవ వర్షాతు రోహిణీ
దశవర్షా భవేద్గౌరీ అత ఊర్ధ్వం రజస్వలా॥

అని యున్నను, పండ్రెండు సంవత్సరముల వయస్సుగల చిన్నదానికి వివాహము చేయునపుడు సహితము "కన్యా" మనుటకు మాఱుగా "రజస్వలా" మని, యేవివాహమునందును మంత్రమును సంస్కరించుటయు లేదు. స్త్రీపునర్వివాహము చేయవలయునని విధి యెప్పుడున్నదో, అప్పుడే దత్తయైన స్త్రీ మరల నియ్యఁబడుట కర్హురాలని శాస్త్రమువల్లనే తెలియవచ్చుచున్నది. ఒకసారి దత్తయయిన స్త్రీ మరల నియ్యఁబడఁగూడదనెడిపక్షమున, పూర్వోదాహృతములైన ఊఢా పునర్వివాహ విధాయక స్మృతివచనములును,

శ్లో॥ "ప్రతిగృహ్య యః కన్యాం వరో దేశాంతరం వ్రజేత్
త్రీ నృతూ నృమతిక్రమ్య కన్యాఽన్యం వరయే ద్వరమ్॥"

ఇత్యాది గణనాతీతములైన స్మృతివచనములును వ్యర్థములయి పోవును. కాఁబట్టి "యిచ్చిన కన్యను మరల నియ్యరా" దను వచనము నకు వివాహిత యయినదాని నక్రమముగా మఱియొకని కియ్యరా దనికాని, స్మృతిలో నుదాహరింపఁబడిన స్థలములలోఁ దప్ప వేఱుచోట్ల నియ్యరాదనిగాని యర్థము చెప్పుకోవలెను. అంతియకాక కన్యా దానము వధూవరు లిద్దఱును యావజ్జీవము పరస్పర సౌఖ్యము నిమి త్తము కలిసి యుండుటకై యేర్పఱుచుకొన్న యొకవిధమయిన యొడంబడికయొక్క పూర్వాంగమేగాని, దాత తనస్వత్వమును వదలుకొని యచేతన పదార్థమునువలె ప్రతిగ్రహీత తన మనసువచ్చినట్టు

చేసికొనుటకయి యిచ్చుటకాదు. అట్లు కానియెడల మన ధర్మశాస్త్ర ప్రకారము ఆకన్యక విషయమయిన స్వత్వమును బొత్తిగా లేనివారు సహితము దానముచేయుట కెట్లర్హులగుదురు ?

"శ్లో॥ పితా దద్యా త్స్వయం కన్యాం భ్రాతా వానుమతే పితుః
మాతా మహో మాతులశ్చ సకుల్యో బాంధవ స్తథా
మాతా త్వభావే సర్వేషాం ప్రకృతౌ యది వర్తతే
తస్యా మప్రకృతిస్థాయాం కన్యాం దద్యు స్స్వజాతయః ॥"

అను నారదసంహితా వచనమునుబట్టి, పిత్రాద్యభావమునందు బంధువులును స్వజాతివారును కన్యాదానము చేయవచ్చునని కనఁబడుచున్నది. వివాహములయందలి కన్యాదానము చేయుట, ఆకన్యవిషయమయిన స్వత్వముగలవారు తమకుఁగల స్వత్వము వదలుకొనుటయే యనెడుపక్షమున, బాల్యములోనే జననీజనకులు మొదలైనవారిని పోఁగొట్టుకొన్న కన్యలగతి యేమి కావలయును ? స్త్రీపునర్వివాహమయినతోడనే పూర్వపుగోత్రమునుండి యన్యగోత్రమునకు మాఱిపోవును గనుకను, ఒకగోత్రమువారికి అన్యగోత్రమువారు ఆబ్దికాదులు పెట్టుట యశాస్త్రీయము గనుకను, స్త్రీ నూతనగోత్రమునకు మాఱినతోడనే పూర్వభర్తతోడి సంబంధమంతయు వదలిపోవును. అందుచేత నాతని యాబ్దికాదులును నష్టమైపోవును. ఒక్క స్త్రీల విషయమునందే యిట్లుకాదు. ఒకపురుషుఁ డన్యగోత్రమునకు మాఱినప్పుడును అట్లే యగును. ఒక్కఁ డన్యగోత్రపువారికి దత్తుఁడయ్యేనేని, జనకపితతోడి సంబంధము బొత్తిగా వదలిపోవుట మన మందఱమును చూచుచునే యున్నాము గనుక, దీని విషయమయి నేను విస్తరించి చెప్పనక్కఱలేదు. మఱియును దాయవిషయమును, స్త్రీపునర్వివాహము శాస్త్రీయమును విషయమును, ప్రథమవివాహ మంత్రములే

ద్వితీయవివాహమునఁ బనికివచ్చునను విషయమును, మన దొరతన మువారిప్పుడొక రాజశాసనమువలన స్థిరపఱిచియే యున్నారు.

ఈ వఱకే యీవిషయమును విస్తారముగాఁ జెప్పియున్నాను. స్త్రీపునర్వివాహము యుక్తికిని శాస్త్రమునకునుకూడ ననుకూలముగా నున్నదనియుఁ గొంతవఱకుఁ జూపియున్నాను. శాస్త్రమునకుఁ దమ యిష్టానుసారముగా విపరీతమయిన యర్థమును జెప్పఁగల పండితోత్త ములు పలువురున్నారనియు నేనెఱుఁగుదును. శాస్త్రవిచారముతోడ వస్తువిచారమును సహితము చేయవలెను. అట్లు చేయనియెడల విపరీత సిద్ధాంతము లేర్పడును. శర్కరరుచి యెట్టిదో సాధింపఁ బ్రయత్నింపక "అన్నిటిలో శర్కరయ మధుర మయిన" దను వాక్యమును బట్టియే విమర్శకుం బూనుకొన్నచో, అన్నిటిలోను శర్కరయే మధురమయిన దని సాధారణముగాఁ జెప్పెడి యర్థమును ఖండించి పండితసార్వ భౌములు 'శర్కర అమధురమయిన' దని పదవిభాగమునుజేసి తమ యర్థమును సాధింపవచ్చును. అందుచేత సత్యము మూలబడి, శర్కర అమధుర మయిన దనఁగా తియ్యనిదని యేర్పడక, పుల్లనిదో చప్ప నిదోయని సిద్ధాంత మేర్పడవచ్చును. సాధారణముగా పామరులు, చదువుకొన్నవారేమి చెప్పినను మాఱుమాటాడక విశ్వసింతురు. కాఁబట్టి పలువురు పామరులుచేరి చేయు హానికంటె విపరీతబుద్ధి యయిన యొక్క పండితుఁడు చేయుహానియే లోకమున నత్యధికముగా నుం డును. అందుచేతనే "సాక్షరా విపరీతాశ్చే ద్రాక్షసా ఏవ కేవలమ్" అను సదుక్తి లోకములో వెలసి యున్నది. మనలోఁ జదువుకొన్నవా రెవ్వరును స్వప్రయోజనమునే ముఖ్యముగాఁ జూచుకొనక, నూఱు వచ్చినను నూఱు పోయినను లోకోపకారమునకయి తమయావచ్ఛక్తిని వినియోగించి దేశమును మంచిస్థితికి దెచ్చుటకుఁ బ్రయత్నింతు

రని మిక్కిలి ప్రార్థించుచున్నాను. మనవారీవఱకే శాస్త్రనిషిద్ధము లయిన సముద్రయానము మొదలగువానిని సర్వసాధారణముగాఁ జేయుచున్నారు; శాస్త్రవిహితములయిన బ్రహ్మచర్యము మొదలగువానిని బొత్తిగా మానివేయుచున్నారు; ఆచారమునైనను నంతగా గౌరవించుచున్నట్టు కనఁబడదు. కొన్నిసంవత్సరముల క్రిందట ధూమనౌక లెక్కి సముద్రయాత్రచేయుట బొత్తిగా ఆచారము గాకపోయినను, ఇప్పుడు ధారాళముగా బ్రాహ్మణులలోని శ్రోత్రియులు సహితము ధూమనావలమీఁద సముద్రయానమును జేయుచున్నారు. ఈవిధముగాఁ దమరొక్కరి సదుపాయమును గోరి శాస్త్రమును మీఱుటకు సాహసించుచున్నప్పుడు, లోకోపకారార్థమయి శాస్త్రము వ్యతిరేకముగా నున్నను దానిని మీఱుట దోషమని తోఁచదు; ఐనను లోకోపకారమయిన యీపనికి శాస్త్రమును విరోధముగా లేదు. స్త్రీపునర్వివాహము లేకపోవుటవలనఁ గలిగెడు నష్టము లెల్లవారికిని జక్కఁగాఁ దెలియును; అట్టినష్టముల ననుభవముచేత నెఱిఁగియున్నవారును పలువురు గలరు; నూటిలో తొంబదిమందికి మనసులో స్త్రీపునర్వివాహము కావలెననియు, అది దోషనివారకమనియు నే యభిప్రాయమున్నది. కాని నలుగురును ఏమనుకొందురోయను భీతిచేత చిరకాలమునుండి వచ్చుచున్న యాచారమునకు విరుద్ధముగాఁ జెప్ప తెగింపకున్నారు. “గతానుగతికో లోకో న లోకః పారమార్థికః” అన్నట్లు జనులందఱును ఒకరు పోయినట్లు మనమును బోవుద మనువారేకాని పారమార్థికబుద్ధితో న్యాయమయిన పని జనవిరుద్ధముగా నున్నను దానిని నిర్వహింతమని పూనుకొని నిలుచువారు లేరు. కొందఱికి పూనుకొని నిలువవలెనని యభిప్రాయ మున్నను, తోడుపడువారు లేకయు ప్రోత్సాహపఱచువారు లేకయు పైకిరాక, పూర్వమెంతో గొప్ప

వారు తలపెట్టినప్పుడే సాగనిచ్చని సాధారణులమగు మనము తల పెట్టినప్పుడగునా" యని నిరుత్సాహులయి యూరకుండుచున్నారు. సమస్త సాధనకలాపమును గల రాజాధిరాజులు సహితము చేయలేని పనిని ధైర్యస్థైర్యములు గల సాధారణులు స్వల్ప సాధనములతో సాధించి యున్నారు. ఒకపనిని నిర్వహించుటకు ధైర్యస్థైర్యములు సాధనములుగాని, గొప్పతనమును ధనమును ముఖ్యసాధనములు గావు. మన మింత యల్పసంఖ్యాకుల మేమి చేయఁగల మనియు సంశ యింపఁ బనిలేదు. ఆరంభమున నేదియు ప్రపంచములో చిన్నది కానిది పెద్దదయినది లేదు. దేశమంతటను బ్రవహించి సస్యములను ఫలవంతములనుగాఁ జేయుచు జంతుసమూహమునకెల్లను మధురోద కమునిచ్చుచు లోకోపకారములుగా నుండు పెద్దనదులన్నియు మొట్ట మొదట నొకటిరెండు చిన్నయూటలనుండి పుట్టినవే. మొట్టమొదట మనమిప్పు డొక్కయూరివారమే యయినను, కాలక్రమమున దేశ మంతయు మనలోనే చేరవచ్చును. మనము పూనిన పక్షముయొక్క న్యాయమునుబట్టి మనలో పలువురు చేరుదురుగాని మనసంఖ్యాధిక్య మును జూచి కాదు. కాఁబట్టి మీరు సంఖ్యయందు తక్కువగా నున్నను, ధైర్యముతోను స్థైర్యముతోను పనిచేయుదురేని మన దేశమునందలి స్త్రీలగతిని బాగుచేయుటకయి పూనుకొనువారిలో మీరే యగ్రగణ్యులుగానుండి శాశ్వతమయిన కీర్తిని పొందుదు రనుటకు సందేహములేదు. మనస్సునకు యుక్తమని దృఢముగా దోఁచినపనిని భగవంతునిమీఁద భారమువేసి మూఢజనులును వేదజడులును జేయు దూషణములకు వెఱవక, యథాశక్తిని వినియో గించి నిర్వహింపవలయును. ఏసత్కార్యమునందుఁగాని చక్కఁజేసిన వారికేగాక, చేయించిన వారికిని ప్రేరేపించినవారికిని అందున కామో

దించినవారికినికూడ ఫలముకలదని బోధించు పండితోక్తి నిందుదా హరించుచు నిప్పటి కీవిషయము నింతటితో విరమించుచున్నాను.

శ్లో॥ కర్తా కారయితా చైవ ప్రేరక శ్చానుమోదకః।
సుకృతే దుష్కృతే చైవ చత్వార స్సమభాగినః॥

సర్వకారుణ్యుఁడును దీనజనబాంధవుఁడును అయిన ఈశ్వరుఁడు మీ కందఱకును స్వప్రయోజనపరులయి యుండ బుద్ధి పుట్టకుండునట్లును లోకోపకారపారీణులు కావలెనను బుద్ధి యుదయించునట్లును అనుగ్రహించునుగాత !

స్త్రీపునర్వివాహవిషయక
ద్వితీయవిజ్ఞాపనము.

By

K. VEERESA LINGAM

స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనము.

అస్మద్దేశీయులగు సదయహృదయులారా!

గతమాసమున స్త్రీపునర్వివాహవిషయమయిన యుపన్యాసము నొకదానినిఁ బ్రచురించియున్నానుగదా? ఏమో వ్రాసినానని యనాదరింపక పలువురు పండితులును మహాజనులును దానిని సావధానముగాఁ జదివి యాదరించుటచే నేనుపడిన ప్రయాసమంతయు సఫలమయినదని యెంతయు హర్షించుచున్నాను. నేనాయుపన్యాసమును సభలోఁ జదివినతోడనే యచ్చటిపండితులు కొందఱు 'పతి' శబ్దమునకు భార్య యను నర్థములేదనియు, 'పతౌ' యనుదానికి పతిసదృశుఁడర్థమనియు కొన్నియాక్షేపణములను జేసి విచారణీయాంశముతో సంబంధింపని సంగతులనుకూడ చాలసేపు చెప్పిరి. ఆదినమున నాకుఁ బ్రత్యుత్తరము చెప్పుట కవకాశమియ్యనందునను పండితు లసత్యము చెప్పదురాయను విశ్వాసముచేతను, సామాన్యజనులు కొందఱు మొట్టమొదట వారివాదముకూడ న్యాయమయినదేమోయని భ్రమపడినను, రెండవసారి వారు మొదట వాదించినవాదమును గట్టిపెట్టి కొంతవఱకు నేనుజెప్పిన యర్థములనే యొప్పుకొన్నందున నందఱికిని సంశయనివారణ మయినది. నాయుపన్యాసమునకు ఖండనగ్రంథమును తెలుఁగుభాషలో వ్రాసికొనివచ్చి చదివెదమని వారు మొదటిసభదినమున వాగ్దానముజేసియు వారట్లుచేయక సంస్కృతమున వ్రాసికొనివచ్చినందునను వారి కాధారముగానున్నవన్న భారద్వాజసూత్రాదులు తీసికొనిరాక నిరాధారములైన మాటలను జెప్పుచు వచ్చినందునను వారివాదమేదియు జనులు గ్రహింపలేక యెల్లరి

చేసిరి. మరల పదియేను దినములకు జరగఁబోవు సభయందు వారు తమ ఖండనగ్రంథమును తెనుఁగున వ్రాసికొని వచ్చెదమనియు భారద్వాజ సూత్రమును దెచ్చెదమనియు వాగ్దానము చేసినమీఁదట నాటికి సభ ముగిసినది. మరల జరిగిన సభనాఁడు వెనుకటిసభయందు నిర్ణయ మయినప్రకారముగా సభికులందఱును పండ్రెండుగంటలకే వచ్చినను పండితులుమాత్రము మూఁడుగంటలకువచ్చి తమయుపన్యాసమును జదివిరికాని భారద్వాజసూత్రమును దీసికొని రాలేకపోయిరి. వారి యుపన్యాసము ముగిసినతోడనే నేనును తోఁచినంతవఱకు సదుత్తర ములను జెప్పినాను. నాటి వారివాదములో ముఖ్యమయినది శ్రుతి స్మృతులకంటె శిష్టాచారము ప్రధానమయిన దనుట. ఇది యిట్లుం డఁగా నామఱుసటి భానువారమునాఁడు జోస్యుల వేరిచయనుల గారిలోపల మఱియొక సభచేసి, ఆసభకుఁ దమపక్షమున కనుకూలురై యున్నవారని తోఁచినవారిని మాత్రమే యాహ్వానముచేసి యెక్కడి నుండియో వ్రాయించి తెప్పించిన నాయుపన్యాసముమీఁది ఖండన మును అద్దేపల్లి కృష్ణశాస్త్రులుగారు చదివిరి. ఆఖండనమునకు, సమాధానము చెప్పుటకయి నాకవకాశము నిచ్చెదమని సభికులంద ఱును వాగ్దానముచేసియు, వారిసిద్ధాంతమును నేను పూర్వపక్షము చేయ నారంభించిన కొంతసేపటికి కడుపునొప్పియని యొకరును కాలు నొప్పియని యొకరును లేచిపోవ మొదలుపెట్టిరి. కృష్ణశాస్త్రులవారు తమకుఁ జెప్పుట కేమియుఁ దోఁచనప్పుడు "ఏమియుం దోఁచకున్న వెక్కిరించు" మన్న సామెతను జ్ఞప్తికిఁ దెచ్చుకొని, "శేషం కోపేన పూరయే" త్తను నార్యోక్తికిని లక్ష్యభూతులగుచువచ్చిరి. "బోద్ధారో మత్సరగ్రస్తాః" అను పండితోక్తిని పలుమాఱుచదివియు నేనేమో యనుకొనుచుంటినిగాని యీపండితులవాదమును జూచినతరువాత

దానిసత్యము లక్ష్యసహితముగా నాకు బోధపడినది. వారిఖండన గ్రంథములలోపల సారమంతగా లేకపోయినను, "దుర్మదధ్వాంత రవి" మొదలగు పెద్దపేళ్ళనుమాత్రము వానికిఁబెట్టి ఘృతకోశాతకీ న్యాయమున వానిని సార్థకపఱచిరి. వారి ఖండనగ్రంథములను జదివి పదిమూఁడుదినములకంటె నెక్కువగానయినను, వారిలో నొక్కరును తమగ్రంథముయొక్క ప్రతిని నేటివఱకును నాకియ్యనందున వానికిఁ బూర్ణముగాఁ బ్రత్యుత్తరములను వ్రాయుటకు శక్తుఁడనుగాకపోయి నను జ్ఞాపకమున్నంతవఱకును వానికి సమాధానములు వ్రాయుటయే కాక మఱికొన్ని విశేషాంశములఁగూడ నిందు వ్రాయుచున్నాను. ఇక్కడిపండితులు మొదట తామువ్రాసిన ఖండనగ్రంథములు బాగుగ నుండలేదని మరల వ్రాయుచున్నారని వినుచున్నాను. నాయందుఁ గరుణించి పండితులును మహాజనులును నావిన్నపమును సావధాన ముగాఁ జిత్తగించి సత్యమును గ్రహింతురని వినయపూర్వకముగాఁ బ్రార్థించుచున్నాను.

శాస్త్రమునకంటె శిష్టాచారము ప్రబలమైనదను విషయమును మొట్టమొదట విచారింతము. మొట్టమొదట శాస్త్రమును తిరస్కరించి తమ యిచ్ఛానుసారముగాఁ బ్రవర్తించువారు శిష్టులేకారు; ప్రతిపక్షు లయినను శిష్టులసదాచారమునే యనుసరింపవలయునని చెప్పెదరు. కాని వారిదురాచారములనుకూడ ననుసరింపవలయునని చెప్ప సాహసింపరని నేనుదలంచెదను.

శ్లో॥ యస్మిన్ దేశే యదాచారః పారంపర్య క్రమాగతః।
శ్రుతిస్మృత్యవిరోధేన సదాచార స్స ఉచ్యతే॥

అను బోధాయనవచనమునుబట్టి యేదేశమునం దేయాచారము శ్రుతి స్మృతి విరోధములేకుండ పారంపర్యక్రమముగా వచ్చినదో యదే

2

సదాచారమని స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈయర్థమునే

శ్లో॥ అనుష్ఠితంతు యద్దేవై ర్మునిభి ర్యదనుష్ఠితం।
నానుష్ఠేయం మనుష్యై స్త దుక్తం కర్మసమాచరేత్॥

అను స్మృతివాక్యమును చెప్పుచు, దేవతలచేతను మునులచేతను జేయఁబడినది మనుష్యులచే ననుష్ఠింపఁదగినది కాదనియు వారిచే (శ్రుతిస్మృతులయందుఁ) జెప్పఁబడిన కర్మలనే చేయవలయుననియు విధించుచున్నది. దేవతలయొక్కయు మునులయొక్కయు శ్రుతి స్మృతి విరుద్ధమయిన యాచారమే మనకు గ్రాహ్యము కాకపోవుచుండఁగా సామాన్యమానవులయొక్క యాచారము గ్రాహ్యముకాదని వేఱుగఁ జెప్పనక్కఱయే యుండదు. లోకాచారమునకంటె శ్రుతి స్మృతులే బలవత్తరములని చూపుటకై నేనీవఱకే నాయుపన్యాసమునందు వ్యాస, భారత, స్కాందవచనముల నుదాహరించియున్నాను. "ఆగమేతిహాసపురాణోక్తాచారస్తు వేదానుకూలవత్వా గ్రాహ్యాః అగ్రాహ్య ఏవ తత్ప్రతికూలే" యని, ఆగమేతిహాసపురాణోక్తములయిన యాచారములు వేదానుకూలము లయినప్పుడుమాత్రమే గ్రాహ్యములనియు తత్ప్రతికూలము లగ్రాహ్యములే యనియు శంకరవిజయమునందుఁ జెప్పఁబడియున్నది.

శ్లో॥ స్మృతి ర్వేద విరోధేతు పరిత్యాగో యథా భవేత్।
తథైవ లౌకికం వాక్యం స్మృతిబాధే పరిత్యజేత్॥

అను ప్రయోగపారిజాతమునం దుదాహరింపఁబడిన స్మృతివాక్యమును వేదమునకు విరోధముగానున్న స్మృతి యేప్రకారముగా పరిత్యజింపఁబడునో ఆదేప్రకారముగా స్మృతివిరోధమయిన యాచారమును పరిత్యజింపవలయునని చెప్పుచున్నది.

శ్లో॥ శ్రుతిస్మృతీ మమైవాజ్ఞే యస్తే ఉల్లంఘ్య వర్తతే।
ఆజ్ఞాచ్ఛేదీ మమ ద్రోహీ సవధ్యో నాత్ర సంశయః॥

శ్రుతి స్మృతులు నా (యీశ్వరుని) యాజ్ఞలేగనుక వాని నుల్లంఘించి ప్రవర్తించువాఁడు నా (యీశ్వరుని) యాజ్ఞను మీఱిన నాకు ద్రోహియయి నిస్సందేహముగా వధ్యుఁడగు ననియు,

శ్లో॥ తస్మా చ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యా కార్య వ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి॥

కాఁబట్టి కార్యాకార్య వ్యవస్థ చేయుటకు నీకు శాస్త్రమే ప్రమాణము; శాస్త్రవిధానమును గుర్తెఱిఁగి యీలోకమున నీవేపనిని కాని చేయఁదగుననియు భగవద్గీతలయందును, మఱియుంగల యనేకప్రమాణ గ్రంథములయందును శాస్త్రముయొక్క యాధిక్యము సహస్రముఖముల ఘోషింపఁబడియున్నది. ఇట్లుండఁగా మన ప్రతిపక్షులు శాస్త్రమున కన్న ఆచారమే యెక్కువయినదని యేల వాదించుచున్నారో తెలియఁజాలకున్నాము. ఇట్లు వాదించుటకు వారికి శాస్త్రములయందుఁ బ్రమాణబుద్ధియైనను లేకపోవలెను; లేదా, బహుజనులచేత నాచరింపఁబడుచుండు దానికి శాస్త్రమునందు గతిలేకపోవునాయని యూహయైనను పుట్టవలెను. ఉండునేమోయని యనుమానింపఁదగిన దానికంటెఁ బ్రత్యక్షమయిన శ్రుతియే బలీయమగును గనుక, "శ్రుతిర్హి బలీయ స్యా దానుమానికా దాచారాత్" అను సూత్రమునుబట్టి వారి యాకడపటి యూహకును నవకాశము లేదు. శ్రుతి స్మృతులకంటె నాచారమే బలీయమనుటకు ప్రమాణగ్రంథములనుండి వారొక్క యుదాహరణమునయినను జూపఁగలిగినవారు కారు; తమకేమో లాభకారి యనుకొని తైత్తిరీయోపనిషత్తు శిక్షా

వల్లిలోని యీక్రింది శ్రుతివాక్యమును మాత్రము వారుదాహరించిరి :—

యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని-నోఇతరాణి.

యాన్యస్మాకగ్ం సుచరితాని తాని త్వయోపాస్యాని-నోఇతరాణి-

'ఏవి నిందితములుకాని కర్మలో యవియే యనుష్ఠింపఁదగినవి కాని యితరములు కావు; మాసుచరితలేవియో యవియే నీచే నుపాసింపఁదగినవికాని తక్కినవి కావు' అని బోధించుటవలన నీశ్రుతియు శాస్త్రవిరుద్ధాచారమును నిషేధించుచునే యున్నది. దీనియర్థ మెల్లరకును దేటపడుటకయి యీశ్రుతియొక్క శంకర రామానుజ భాష్యముల నిందు వ్రాయుచున్నాను :—

యాన్యపిచాన్యాని-అనవద్యాని=అనిందితాని, శిష్టాచారలక్షణాని-కర్మాణి-తాని సేవితవ్యాని త్వయా నో కర్తవ్యాని=నకర్తవ్యాని ఇతరాణి, సావద్యాని శిష్టకృతాన్యపి; యాన్యస్మాకం=ఆచార్యాణాం సుచరితాని=శోభనచరితాని, ఆమ్నాయాద్యవిరుద్ధాని=తాన్యేవ త్వయోపాస్యాని-అదృష్టార్థాన్యనుష్ఠేయాని=నియమేనకర్తవ్యానీత్యేతత్-నోఇతరాణి=విపరీతాన్యాచార్యకృతాన్యపి.

అని శంకరాచార్యులును,

శిష్టాచారేష్వపి శ్రుతి స్మృతివిరోధశూన్యతయా యాని సుచరితాని తాన్యేవ హోళాదికాని గ్రాహ్యాణి-నలోభాదిమూలచరితానీత్యర్థః

అని రామానుజాచార్యులును, పై శ్రుతివాక్యమునకు వేదవిరుద్ధములుకాని యాచార్యుల యాచారములను గ్రహింపవలయునేకాని వేదవిరుద్ధములైన శిష్టాచారములను గ్రహింపఁగూడదని స్పష్టముగా వ్యాఖ్యానము చేసియున్నారు. ఏవిధమునఁజూచినను శాస్త్రము శిష్టాచారమునకంటె దుర్బలమైనదని సాధించుట కాధారము లేశమైనను గనఁబడదు. ఇట్లున్నను మనదేశ మేమి పాపము చేసికొన్నదో

కాని శాస్త్రముయొక్క యధికారమును దానక్రమముగా నాక్ర మించుకొని యెల్లయెడలను ఆచారమే మనదేశమునందు నిరంకుశాధి కారమును చెల్లించుచున్నది. జనులును విషయవిచారమును బొత్తిగా మానివేసి యాచారమున కత్యంతము దాసులై యది నడిపించునట్లెల్లను నడుచుచున్నారు; శాస్త్రమున కాచారానుకూలముగా నపార్థములు కల్పించి, శాస్త్రదేవతను ఆచారపిశాచమునకు లోఁబఱిచి దాసినిగాఁ జేయుచున్నారు. ఓయాచార పిశాచమా! నీవు వచ్చి యాశ్రయించి స్థిరపడినతరువాత నేకదా యీహిందూదేశము తక్కిన దేశముల హీనదశను జూచి పశ్చాత్తాపపడు పూర్వపుస్థితిని బోగొట్టుకొని తన్నుఁజూచి యితరదేశములవారే పశ్చాత్తాపపడవలసిన యిప్పటిదశకు వచ్చినది. నీయధికారప్రాబల్యము ముదురుటచేత నేకదా లేశమయిన నభివృద్ధి కవకాశములేక దేశము నానాటికి క్షీణదశను బొందుచున్నది? నీకు పరమభక్తులౌటచేత నేకదా జనులు తమ మేలునైన దెలిసికోలేక యెవ్వరైన నిన్నతిక్రమించి యించుక దేశమునకు క్షేమకరమయిన పనికిఁ బూనినచో వారిని బహువిధముల దూషించుచు 'మీతాతలును ముత్తాతలును మీపాటి బుద్ధిమంతులు కారా? వారు చేయని కార్యమును మీరేల చేయవలె' నని యాక్షేపించుచు నీయధికారమును స్థాపింపఁ జూచుచున్నారు? అభివృద్ధికయి ప్రయత్నముచేయువారి మాటలను విన్నమాత్రముననే పాపమువచ్చి చుట్టుకొనునని యెంచి కొందఱు దూరదూరముల తొలఁగుచున్నారు. ఓయాచారపిశాచమా! నీవు వచ్చి చేరి యుక్తాయుక్తములను విచారించి తెలిసికొనుశక్తిని మనుష్యుల మనస్సులలోనుండి పాఱఁదోలినావు; సమస్తసుగుణములకును శిరోభూషణమయిన కారుణ్యమును మొదలంట పెల్లగించివేసినావు; నిజమయిన

యోగ్యత లేకపోయినను బాహ్యవేషధారణముచేతనే గౌరవము కలుగునట్లును బాహ్యచిహ్నభావమాత్రమున యోగ్యులకగౌరవము కలుగునట్లును జేయుచున్నారు. ఓజనులారా! మీరింకను నెంతకాలము తుచ్ఛమయిన యాచారమునకు కన్నులు మూసికొని దాస్యము చేయుచు మీలాభమును సహితము తెలిసికోలేక యజ్ఞానాంధకారమునఁ బడియుండెదరు? దేవుఁడిచ్చిన జ్ఞానమును పదటఁ గలిపి మీయభివృద్ధిని నిరాకరించి యెంతకాల మీలాగున క్రూరమయిన యీ దురాచారమునకు దాసులయి యుండెదరు? ఇంతటనైనను తెలివితెచ్చుకొని మనమేలును కన్నులు తెఱచి చూచి శాస్త్రముయొక్క నిజమయిన తాత్పర్యమును గ్రహించి దాని ననుసరించి ప్రవర్తింప యత్నింపుఁడు. మనము పూర్వాచారము మీఱరాదనుకొన్నను మనకుఁ దెలియకనే కొన్నిమార్పులు కలుగుచుండును. మృగాదులుమాత్రమే మార్పులేక యెప్పుడు నేకరీతిగా నుండునుగాని మనుష్యులలో మార్పులు గలుగుచుండుట సహజగుణము. మనము విషయవిచారమును బొత్తిగాఁ గట్టిపెట్టి పూర్వపుదే మంచిదని పట్టుపట్టి కూరుచుండుటచే నిప్పుడు మనలోఁ గలుగుచున్న మార్పులన్నియు తఱుచుగా చెడుగునకే కారణమగుచున్నవి. ఒకదానిని క్రొత్తగా నేర్పఱిచి సమర్థించుట కష్టమయినను నేనిప్పుడు పూనుకొన్న కార్యమునందు క్రొత్తదేదియు లేదు; శాస్త్రమహాసముద్రమున నాచారమను నాచుచేఁ గప్పఁబడి స్పష్టముగాఁ గనఁబడకున్న పూర్వరూపమునే మీకు నేను జూపఁబూనుకొన్నాను. నేను పూనిన కార్యమునకుఁ బ్రతిపక్షులయి సింహములవలె నిలువఁబడిన పండితులతో నెదిరించి నాపక్షమును సాధించుటకుఁ దగినంత సామర్థ్యము నావద్దలేకపోవుట వాస్తవమే యైనను, నేను పూనిన

పక్షముయొక్క బలమును విచారింపఁగా నాకంటె నసమర్థులును దానిని సాధింపవచ్చునను నమ్మకము తోఁచుటఁబట్టి సాహసించుచున్నాను.

వేదము స్త్రీపునర్వివాహము నంగీకరించునా యంగీకరింపదా యను నంశమును మొట్టమొదట విచారింతము.—

శ్రుతి. "ఉదీర్ష్వ నార్యభిజీవలోక మితాసు మేత ముపశేష ఏహి।
హస్తగ్రాభస్య దిధిషో స్త్వ మేత త్పత్యుర్జనిత్వ మభిసంబభూవ"

ఈశ్రుతికి విద్యారణ్యులవారు వ్రాసిన వ్యాఖ్యానము నీవఱకే వ్రాసియున్నాను కాఁబట్టి యీసారి దానియర్థమునుమాత్ర మిం దుదాహరించుచున్నాను.

నారి=ఓనారీ, (నీవు) ఇతాసుమ్ =గతప్రాణుఁడయిన, ఏతం =ఈపతిని గూర్చి, ఉపశేషే =సమీపమున పడియున్నావు, ఉదీర్ష్వ =(పతిసమీపమునుండి) లెమ్ము; జీవలోక మభి =జీవించియున్న ప్రాణిసమూహమునుజూచి, ఏహి =రా. త్వమ్ =నీవు, హస్తగ్రాభస్య=పాణిగ్రాహకుఁడును, దిధిషోః =రెండవమాఱు వివాహమాడ నిచ్ఛగలవాఁడును (అయిన) పత్యుః =భర్తను, ఏతత్ =ఇటువంటి, జనిత్వం =భార్యాత్వమును, అభిసంభభూవ =అభిముఖ్యముచే చక్కఁగా పొందుము. ఇట్లు స్త్రీపునర్వివాహమును విధించునది యీశ్రుతి యొక్కటియేకాదు. అధర్వవేదము నందలి యీక్రింద నుదాహరింపఁబడిన వాక్యమును స్త్రీపునర్వివాహమున కవకాశము నిచ్చుచునే యున్నది.—

శ్రుతి॥ యా పూర్వం పతిం విత్వా అథాఽన్యం విందతే పతిం।
పంచౌదనం చ తావజం దదాతో నవియోషతః॥
సమానలోకో భవతి పునర్భువా పరః పతిః।
యోఽజం పంచౌదనం దక్షిణాజ్యోతిషం దదాతి॥

ఒకస్త్రీ మొదట నొకనిని పెండ్లిచేసికొని తరువాత మఱియొకరిని పెండ్లి చేసికొన్నయెడల, వారు అజాపంచౌదనము చేసిరేని వారెడఁబాయకుందురనియు, అజాపంచౌదనము చేసినపక్షమున రెండవభర్త పునర్భువృతోడ సమానలోకమును పొందుననియుఁ బై శ్రుతి కర్థము. పూర్వకాలమునందు బ్రాహ్మణుఁడు బ్రాహ్మణేతర జాతులలోని స్త్రీలను మాత్రమేకాక, ద్విజాతులలో బ్రాహ్మణేతరుల విధవలనుగూడ వివాహ మాడఁదగినట్లు వేదమువల్లఁ గనఁబడుచున్నది. ఇందుకు నిదర్శనముగా నథర్వవేదమందలి వాక్యము నిందు క్రింద నుదాహరించు చున్నాను.—

శ్రుతి॥ ఉదయ త్పతయో దశ స్త్రియాః పూర్వే అబ్రాహ్మణాః।
బ్రహ్మచేత్ హ స్త మగ్రహీత్ సఏవ పతి రేకధా॥
బ్రాహ్మణ ఏవ పతిర్నరాజన్యో న వైశ్యః।
త త్సూర్యః ప్రబ్రువా నితి పంచేభ్యో మానవేభ్యః॥

ఒక స్త్రీకి మొదట బ్రాహ్మణులు కానివారు పదిమంది భర్తలయి, ఆమెను బ్రాహ్మణుఁడు పాణిగ్రహణము చేసికొనుపక్షమున, అతఁడే యామెకుఁ బెనిమిటియనియు, బ్రాహ్మణుఁడే పతిగాని రాజన్యుఁడును వైశ్యుఁడును కాఁడనియు, ఈయర్థమును అయిదుజాతుల మానవులకును సూర్యుఁడు చాటుచు తిరుగుచున్నాఁడనియు, పై శ్రుతి బోధించుచున్నది. ఈచెప్పినవానివల్ల శ్రుతి స్త్రీపునర్వివాహము నంగీకరించుచున్నట్టు విస్పష్ట మగుచున్నది. ఇంతియేకాక పూర్వము నేనుదాహరించిన యీక్రింది ఋగ్వేదవాక్యమును సూచనఁగా స్త్రీపునర్వివాహము నంగీకరించుచునే యున్నది:—

శ్రుతి. ఏకస్య బహ్వో జాయా భవన్తి। నైకస్యై బహవ స్సహ పతయః.

ఈ శ్రుతియం దొకపురుషునకు బహుభార్యలగుదురని సాధారణ ముగాఁ జెప్పఁబడి, ఒకస్త్రీకి ఏకకాలమునందు బహుపతులు కారని చెప్పఁబడుటయే భిన్నకాలములయందు స్త్రీకి బహుభర్తలు కావచ్చు ననుట తేలుచున్నది. ఈయర్థమునే భారత వ్యాఖ్యానమున నీలకంఠా చార్యులవారును స్పష్టపఱిచి యున్నారు. మనవారు కొందఱు సహ శబ్దమునకు మఱియొక యర్థమును చేయఁజూతురు గాని, వారు దాని కేయర్థమును చెప్పినను ఇతర శ్రుతివాక్యసమన్వయముచేత దీనికి స్త్రీల కేకకాలమునందు మాత్రమే బహుభర్త లుండఁగూడ దన్న యర్థము సిద్ధమగును. ఈ దేశమునందు ముద్రింపఁబడిన పరాశర స్మృతి వ్యాఖ్యానములో నీశ్రుతిలోని "సహ" శబ్దమునకు మాఱుగా "స్యుః" అని కానఁబడుచున్నది. కాని, తక్కిన సమస్తముద్రితపుస్తక ములయందును "సహపతయః" అనియే యుండుటవల్లను, పూర్వులు వ్రాసిన వ్యాఖ్యానములలో సహశబ్దమునే స్వీకరించి యుండుటవల్లను, ఋగ్వేదములలో నల్ల "నైకస్యై బహవ స్సహపతయః" అను పాఠమే పారంపర్యముగా వచ్చుచుండుటవల్లను, 'స్యుః' అను పాఠము లేఖక ప్రమాదజనితమయి యుండవచ్చును. ఇట్లు ఋగ్వేదమునందును, యజుర్వేదమునందును, అధర్వవేదమునందును స్త్రీపునర్వివాహమునకు విధులే కనఁబడుచున్నవి కాని నిషేధవచనము లెందును గనఁబడు చుండలేదు. ఎటువచ్చినను మన ప్రతిపక్షులు నిషేధవాక్యమని యీ క్రింద నుదాహరించిన యజుర్వేదవాక్యమును గనఁబఱుతురు :—

శ్రుతి॥ యదేకస్మిన్ యూపే ద్వే రశనే పరివ్యయతి
తస్మా దేకో ద్వే జాయే విందతే
యన్నైకాగ్ం రశనాం ద్వయో ర్యూపయోః
పరివ్యయతి తస్మా న్నైకా ద్వౌ పతీ విందతే॥

ఈ శ్రుతియు స్త్రీల కేకకాలమునందే బహుపతిత్వమును నిషేధించు చున్నదిగాని భిన్నకాలములయందుఁ గాదు. వ్యాఖ్యానమున కెప్పుడును స్వతంత్రప్రమాణత లేదు గనుక, మూలవిరుద్ధముగానున్న వ్యాఖ్యానమెప్పుడును గ్రాహ్యముగాదు. అయినను, విద్యారణ్యుల వారు కాలభేదమునందుఁగూడ స్త్రీకి బహుపతు లుండఁగూడదని వ్యాఖ్యానములో వ్రాసినవారు కారు; ఈసంగతి యెల్లవారికిని దెలియుటకయి యీశ్రుతియొక్క విద్యారణ్యభాష్యము నిందు క్రింద వ్రాయుచున్నాను:—

యద్యస్మాత్, ఏకస్మిన్ యూపే పురుషస్థానీయే, ద్వే రశనే, రజ్జూ స్త్రీస్థానీయే, పరివ్యయతి=పరివేష్టయతి, తస్మాత్, ఏకః పుమాన్ ద్వే జాయే, విందతే=అనుభుఙ్క్తే, యద్యస్మాత్, ఏకాం రశనాం ద్వయోర్యూపయోః న పరివ్యయతి, తస్మాత్, ఏకా స్త్రీ ద్వౌ పతీ, న విందతే=న ప్రాప్నోతి.

పయిశ్రుతి యేకకాలమునందే స్త్రీలకు బహుపతిసంభవమును నిషేధించుచున్న దనుట కాధారము లనేకములు గలవు. ఈ శ్రుతి వాక్యము "అగ్నిష్ఠ"మనుయూపమును గూర్చినమంత్రము. "అగ్నిష్ఠం ద్వాభ్యాగ్ం రశనాభ్యాం పరివీయ" అనుమాత్రమునుబట్టి యేక కాలమునందే యగ్నిష్ఠయూపమునకు రెండురశనలను జుట్టఁబెట్టుదురు; ఒక్కయూపమున కేకకాలమునం దేప్రకారముగా రెండురశనలను జుట్టుదురో యదేప్రకారముగా నొకపురుషుఁ డేకకాలమునం దిద్దఱు స్త్రీలను బొందునని దృష్టాంతమునుబట్టి శ్రుతియొక్క పూర్వార్థమున కర్థము స్పష్ట మగుచున్నది. పయివాక్యమున కేకకాలమునందని యర్థ మగుచుండఁగా, క్రిందివాక్యమునకు భిన్నకాలములయందుఁగూడఁ గూడదని యర్థము చెప్పుటకు తదర్థబోధక మయినపదము లేకుండ

పిలుపడదు గనుక, ఒక రశన నేకకాలమునం దేప్రకారముగా రెండు యూపములకుఁ జుట్టరో యదేప్రకారముగా నొకస్త్రీ కేకకాలమునం దిద్దఱు భర్తలుండరని శ్రుత్యర్థము. పయిశ్రుతి యూపసామాన్యమును గురించినదిగాక విశేషముగా నగ్నిష్ఠయూపమును గురించి చెప్పఁబడినది గనుక, యూపసామాన్యమునం దెప్పుడయిన నొక రశనను రెండుయూపముల కేకకాలమునందుఁగాని పర్యాయమునఁగాని కట్టుచురా యనునది యిక్కడ విచారణీయాంశము గాదు. భారతమునందును, పూర్వోక్త ఋగ్వేదవాక్యమును ఈ శ్రుతియుఁ గూడ ద్రౌపదీ వివాహఘట్టమున నేకకాలమునందు స్త్రీలకు బహుపతిత్వము నిషేధమనిచూపుటకే యుదాహరింపఁబడి యున్నది.

శ్లో॥ సర్వేషాం ధర్మతః కృష్ణా మహిషీ నో భవిష్యతి।
ఆనుపూర్వేణ సర్వేషాం గృహ్ణాతు జ్వలనే శరాన్॥

'ధర్మమార్గమున మాయందఱకును ద్రౌపది భార్య కాఁగలదు. జేష్ఠానుక్రమముగా నందఱిబాణములను అగ్నిసమీపమున గ్రహించునుగాక' యని యుధిష్ఠిరుఁడు ద్రుపదునితోఁ జెప్పినప్పుడు, ద్రుపదుఁడును బూర్వోక్తఋగ్వేదవచనార్థమును మనసునందు నిలుపుకొని

శ్లో॥ ఏకస్య బహ్వ్యో విహితా మహిష్యః కురునందన।
నైకస్యా బహవో లోకే శ్రూయంతే పతయః క్వచిత్॥

అని స్త్రీల కేకకాలమునందు బహుపతిత్వనిషేధమును జెప్పియున్నాడు. శ్రీమాధవాచార్యులవారును పరాశరస్మృతి వ్యాఖ్యానమునందును స్థూలసూక్ష్మధర్మవివేచనమును జేయుచు, పైకి నధర్మముగాఁ గనఁబడు ద్రౌపదీవివాహమునందలి బహుపతిత్వమును సూక్ష్మధర్మమునుగాఁ జెప్పి ద్రుపదుఁడు లోకవిరుద్ధమని చెప్పిన వాక్యము నందుకొని, "తిర్యక్ష్వపి ఏకస్యాం గవి వృషభద్వయయుద్ధ

దర్శనాత్” తిర్యగ్జంతువులయందుసహిత మేకయూపు విషయమయి రెండుగి త్తలుపోరాడుట చూచుచుండుటవలన లోకవిరుద్ధము స్ఫుటమే యనియు, “వేదేప్యేవం శ్రూయత్తే” వేదమునందు నిటులే చెప్పఁబడు చున్నదని ‘ఏకస్య బహ్వ్యో’ యను శ్రుతిని “యదేకస్మిన్ యూపే” యను శ్రుతిని నుదాహరించియున్నారు. మాధవాచార్యులవా రిచ్చిన దృష్టాంతమువల్లను, వేదమును ఆ యర్థమునే యిచ్చుచున్నదని కంఠో క్తిగాఁ జెప్పుటవల్లను, పయి శ్రుతిద్వయమును ఏకకాలమునందే స్త్రీలకు బహుపతిత్వ నిషేధము చేయుచున్నదని మాధవాచార్యుల వారి తాత్పర్యమయినట్లు బాలురకుసహితము తేటఁపడగలదు. ఒక వేళఁ బ్రతిపక్షుల యిష్టానుసారముగా “యదేకస్మిన్ యూపే” యను శ్రుతికి వాదము నిమిత్తమయి ఏకకాలమునందుఁగాని భిన్నకాల ములయందుఁగాని స్త్రీలకు ద్విపతిత్వనిషేధమునే యొప్పుకొన్నను, శాస్త్రసమన్వయరీతిచేత సామాన్యవిశేషవ్యవస్థను జేయఁగా స్త్రీ కిద్దఱుభర్తలు గూడదన్నసామాన్యవిధి భర్తమరణము సంభవించి నప్పుడు పునర్వివాహము చేసుకోవచ్చునని విధించు “ఉదీర్ష్వ నారి” యను విశేషవిధిచేత బాధింపఁబడి మృతభర్తృక యయినప్పుడు తప్ప స్త్రీకిఁ బునర్వివాహము లేదని సిద్ధాంత మగుచున్నది. ఈ ప్రకార ముగా విశేషసామాన్య భావముచేత వ్యవస్థచేయుట కవకాశము లేక రెండును సమానబలము గలవిగా నున్నప్పుడుసహితము పూర్వోప న్యాసమునం దుదాహృతము లయిన ‘ధర్మజిజ్ఞాసమానానాం’ మొద లయిన స్మృతివచనములచేతను, ‘విహితప్రతిషిద్ధత్వే వికల్పే పర్యవ సానం’ అను న్యాయముచేతను వికల్పముగా స్త్రీపునర్వివాహ మంగీ కార్యమేయగును. ఏ విధముచేతఁ జూచినను స్త్రీపునర్వివాహము వేదవిహితమే యని నిష్కృష్టాశయము తేలుచున్నది. మఱియు నీ

నదుమ వర్తమానతరత్నాకర పత్రికాధిపతిగారు,-

"సూర్యాభ్యుదిత స్సూర్యాభినిర్ముక్తే -సూర్యాభినిర్ముక్తః కునఖ -కునఖీ శ్యావదతీ -శ్యావద న్నగ్రదిధిషౌ -అగ్రదిధిషుః పరివిత్తే -పరివిత్తో వీరహాణి"

ఇత్యాది శ్రుతివాక్యమును వ్రాసి "సూర్యోఁ దుదయించునపుడు నిద్ర పోవువాఁడు మహాపాపి. అస్తమించునపుడు నిద్రపోవువాఁడు వానికంటె నధికుఁడు. వానికంటె పుప్పిగోళ్ళవాఁ డధికుఁడు. వానికంటె నల్లని దంతములుగలవాఁ డధికుఁడు. వానికంటె దిధిషుఁడు (అనఁగా వితంతు వులను పరిగ్రహించినవాఁడు) అధికుఁడు. వానికంటె నగ్రజునకు వివా హము కాకముందు వివాహితుఁడగువాఁ డధికుఁడు. వానికంటె వీర హత్య చేసినవాఁ డధికుఁడు' అని యర్థము వ్రాసి దిధిషుఁడు మహా పాపి కనుక వేదము మహాపాపిని వివాహము చేసికొమ్మనునా యని శంకించియున్నారు. దిధిషు వనఁగా వితంతువును వివాహము చేసి కొనువాఁ డని యర్థము వ్రాయుట కేవలము పొరపాటు. "పున ర్భూ దిధిషూ రూఢా ద్వి స్తస్యా దిధిషుః పతిః" అను నిఘంటువుంబట్టి రెండవమారు వివాహము చేసికొనుదాని భర్త దిధిషుఁ డనఁబడును. పూర్వోక్తశ్రుతియందు దిధిషునికన్నను మహాపాపి యని చెప్పఁబడిన పరివిత్తికి కుబ్జత్వాదిలోపములయం దేప్రకారముగా స్మృతివాక్య మునుబట్టి దోషము లేదో, యదే ప్రకారముగా మృతభర్తృకను వివాహము చేసికొను దిధిషునకును శ్రుతిస్మృతివాక్యబలమునుబట్టి దోష ముండదు; శాస్త్రవిరుద్ధముగా పునర్భువును వివాహము చేసి కొన్న దిధిషుఁడుమాత్రమే దోషి యగును. ఈ యర్థమే పయి శ్రుతిద్వయ సమన్వయమువలనం దేలును.

ఈ వఱకుఁ గొంత శ్రుతివిచారము ముగిసినది గనుక, ఇఁక స్మృతులవిషయమై కొంత చర్చింతము. ఈ విషయము నీవఱకే విద్యాసాగరుఁడు మొదలగు గొప్పపండితులు విశేషముగా వ్రాసియున్నారు. నేనును వారిమార్గమునే యనుసరించి కొన్నివిశేషాంశములనుగూడ నందందుఁ దెలిపెదను. మనుస్మృతి మొదలుగాఁగల ధర్మశాస్త్రము లనేకములు కలవు; వానికర్తల నామధేయములు యాజ్ఞవల్క్యస్మృతి మొదలగువానియందుఁ జెప్పఁబడియున్నవి. వేదములయం దన్నిధర్మములును జెప్పఁబడియుండలేదు గనుకను, కాలభేదమునుబట్టి యాయా యుగములకు వేఱువేఱుగ విశేషధర్మములు కావలసివచ్చును గనుకను, ఆయా యుగములకు విశేషధర్మము లేర్పడియున్నవి. అందుచేత స్మృతులయందుఁ జెప్పఁబడిన ధర్మము లన్నియుఁ బ్రతియుగము నందును అనుష్ఠింపఁబడవలసిన యావశ్యకము లేదనియు, ప్రత్యేకముగా నేయుగమున కేస్మృతి యేర్పడియున్నదో యా యుగమునకా స్మృతియందుఁ జెప్పఁబడిన ధర్మములే ముఖ్యములనియు, అనుక్తములనుమాత్ర మితరస్మృతులనుండి గ్రహింపవలయుననియు, విస్పష్టమగుచున్నది.

శ్లో॥ అన్యే కృతయుగే ధర్మా స్త్రేతాయాం ద్వాపరే పరే।
అన్యే కలియుగే నౄణాం యుగహ్రాసానురూపతః॥

అను మనువచనము యుగానుసారముగా, కృతయుగధర్మములు వేరనియు, త్రేతాయుగపువి వేరనియు ద్వాపరయుగపువి వేరనియు, కలియుగపువి వేరనియు, స్పష్టముగాఁ జెప్పుచున్నది. ఇఁక నేయుగమున కేస్మృతి ముఖ్యమయినదని విచారింపఁ బూనుకొందుమేని,

శ్లో॥ కృతే తు మానవా ధర్మా స్త్రేతాయాం గౌతమా స్మృతాః।
ద్వాపరే శాంఖలిఖితాః కలౌ పారాశరా స్మృతాః॥

అను పారాశరస్మృతివచనమునుబట్టి కృతయుగమునకు మనుస్మృతియు, త్రేతాయుగమునకు గౌతమస్మృతియు, ద్వాపరయుగమునకు శాంఖలిఖితస్మృతులును, కలియుగమునకు పారాశరస్మృతియు ప్రధానములయి యున్నట్టు కరతలామలకముగాఁ దెలియవచ్చును. పరాశరస్మృతి ప్రథమాధ్యాయమునందు ఋషు లందఱును వ్యాసునియొద్దకుఁ బోయి,-

శ్లో॥ మానుషాణాం హితం ధర్మం వర్తమానే కలౌ యుగే ।
శౌచాచారం యథావ చ్చ వద సత్యవతీసుత ॥

వర్తమానకలియుగమునందు మనుష్యులకు విహితములగు ధర్మములను జెప్పుమని యడుగఁగా నతఁడు సమస్తధర్మములును దనకుఁ దెలియవు గనుకఁ దన తండ్రియైన పరాశరు నడుగుదమని చెప్పి, వారి నందఱిని నాతనికడకుఁ దీసికొనిపోయి యడుగఁగాఁ బరాశరుఁడు చెప్పినట్లుండుటచేతఁ బరాశరస్మృతియందలి ధర్మము లన్నియుఁ గలియుగధర్మములే యని నిస్సందేహముగాఁ దెలియవచ్చుచున్నది. అంతియకాక పరాశరస్మృతియొక్క ద్వితీయాధ్యాయముయొక్క మొదట,-

శ్లో॥ అతః పరం గృహస్థస్య ధర్మాచారం కలౌ యుగే ।
ధర్మసాధారణం శక్యం చాతుర్వర్ణ్యాశ్రమాగతం ।
సంప్రవక్ష్యా మ్యహం పూర్వం పరాశరవచో యథా ॥

పూర్వము పరాశరుఁడు చెప్పినట్టుగా కలియుగమునందలి గృహస్థధర్మాచారములను చాతుర్వర్ణ్యాశ్రమాగతములై శక్యములయిన సాధారణధర్మములను జెప్పుచున్నానని యుండుటయు, పరాశరస్మృతిలోని వన్నియు కలిధర్మములే యని స్థిరపఱుచుచున్నది. పరాశరస్మృతియందలి నాలుగవ యధ్యాయములో,-

శ్లో॥ నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ।
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే॥

అని పతి నష్టుఁ డయినప్పుడును, మృతుడయినప్పుడును, సన్యసించి నప్పుడును, నపుంసకుఁడై నప్పుడును, పతితుఁడై నప్పుడును, ఈ యయిదాపదలయందును స్త్రీకిపునర్వివాహము విధింపఁబడి యున్నది. ఈ శ్లోకములోని పదములనుబట్టిగాని, ప్రకరణమునుబట్టిగాని, దీనికి మఱియొక విధముగా నర్థము చెప్పుటకు వీలులేదు. దీని కితరస్మృతుల తాత్పర్యానుసారముగా నర్థము చేయవలసిన యావశ్యకమును లేదు. కలియుగధర్మప్రవర్తకమైన యొకస్మృతియందుఁ బ్రత్యేకముగాఁ గలియుగమునందే యాచరణీయమయిన యొకధర్మము చెప్పఁబడి అది యితరయుగధర్మప్రవర్తకములయిన బహుస్మృతులకు విరుద్ధమయి నప్పుడు, అన్నిస్మృతులతోను సమన్వయించునట్లుగా మొదటి స్మృతి వాక్యమున కర్థము చెప్పవలెనన్నచో నట్టి స్మృతివలనఁ బ్రయోజనమే లేకపోవును; కాలానుగుణముగా యుగధర్మములు వేఱువేఱుగా నుండునను మన్వాదివచనములును వ్యర్థములయి పోవును.

కలిధర్మబోధకమయిన యీ పరాశర స్మృతికి వ్యాఖ్యానము చేసిన వారిలో మాధవాచార్యులును నందపండితుఁడును ప్రసిద్ధులు. వారిరువురును స్త్రీపునర్వివాహము కూడదను కోటిలో చేరినవారే యయినను, పూర్వోదాహృతమయిన "నష్టే మృతే" యను శ్లోకమునకు మొదట వ్యాఖ్యానము చేసిన మాధవాచార్యుఁ డొకవిధముగాను, తరువాత వ్యాఖ్యానముచేసిన నందపండితుఁ డొకవిధముగాను, అర్థమును వ్రాసియున్నారు. వారిలో మాధవాచార్యుఁడు "పరివేదన పర్యాధానయో రివ స్త్రీణాం పునరుద్వాహస్యాపి ప్రసంగాత్ కించి దభ్యనుజ్ఞాం దర్శయతి" అని పరివేదనపర్యాధానములకువలెనే స్త్రీల

పునర్వివాహమునకును ప్రసంగమువలనఁ గొంచె మనుజ్ఞను జూపు చున్నాఁడని, యిది స్త్రీపునర్వివాహవిధి యయిన ట్లొప్పుకొని, "అయంచ పునరుద్వాహో యుగాంతర విషయో ద్రష్టవ్యః" అని యీ పునర్వివాహము యుగాంతరవిషయముగాఁ జూడఁబడఁదగినదని వ్రాసి తన వాక్యమున కాధారముగా "తథా చాదిత్యపురాణం ఊఢాయాః పునరుద్వాహం జ్యేష్ఠాంశం గోవధం తథా। కలౌ పంచ నకుర్వీత భ్రాతృజాయాం కమండులు-మితి" యని యాదిత్యపురాణములోనిదని యొకశ్లోకమును వ్రాసిరి. ఈశ్లోక మాదిత్యపురాణములోగాని, నాగరపుస్తకమున నున్నట్టు ఆదిపురాణములోఁగాని కనఁబడనట్టు వ్రాసి, "నష్టేమృతే" యనువచనము యుగాంతర విషయమను మాధవోక్తికి "కలౌ పారాశరాస్మృతాః" అనుమూల వచనవిరోధమును, "అతః కలౌ ప్రాణినాం ప్రయాససాధ్యే ధర్మే ప్రవృత్త్యసంభవాత్ సుకరో ధర్మోఽత్ర బుభుత్సితః" కలియుగము నందు మనుష్యులకు ప్రయాససాధ్యములయిన ధర్మములయందుఁ బ్రవర్తించుట యసంభవము గనుక సుకరములైన ధర్మములు పరాశరస్మృతిలోఁ జెప్పఁబడుననను స్వవ్యాఖ్యాన విరోధమును, గ్రంథములోఁ గనఁబడని "ఊఢాయాః పునరుద్వాహ" మను శ్లోకమును గైకొనుటచే వివాదగ్రస్తవచన ప్రామాణ్యాశ్రయమును, పురాణమున కంటె స్మృతి బలియమను వ్యాసవచనవిరోధమును, "ఊఢాయాః పునరుద్వాహ" మను పురాణవచనము సామాన్యముగా వివాహితకుఁ బునర్వివాహమును నిషేధించుచు "నష్టే మృతే" యను పరాశరవచనము విశేషముగా నయిదాపదలయందు మాత్రము పునర్వివాహమును విధించుచుండుటచేత సామాన్యవిశేషభావవిరోధమును, పొసఁగునని పండితులీవల నాక్షేపించి దోషపంచకమును గనబఱిచి

యున్నారు. ఈ ప్రకారముగానే చతుర్వింశతిస్మృతివ్యాఖ్యయందు భట్టోజిదీక్షితులును,—

"న చ కలినిషిద్ధస్యాపి యుగాంతరీయ ధర్మస్యైవ నష్టే మృతే ఇత్యాది పరాశరవాక్యం ప్రతిపాదక మితి వాచ్యం—కలౌ వనుష్ఠేయాన్ ధర్మా నేవ వక్ష్యామీతి ప్రతిజ్ఞాయ తద్గ్రంథస్యప్రణయనాత్"

కలియం దనుష్ఠింపఁదగిన ధర్మములనే చెప్పుచున్నానని పరాశరుల వారే ప్రతిజ్ఞ చేసియుండుటవలన "నష్టే మృతే" ఇత్యాది పరాశర వాక్యము యుగాంతరవిషయమును కాదని రూఢి చేసి యున్నారు. మాధవాచార్యులకును తరువాత ఈసందేహమేకలిగి ద్వాదశాధ్యాయ వ్యాఖ్యానావసానమునందు,—

"నను వ్యాసేన కలిధర్మాణాం ప్రవృత్తత్వాత్ కలౌ పారాశరాః స్మృతా ఇతి పరాశరేణో త్తరితత్వాచ్చ పరాశరోక్తా స్సర్వే కలిధర్మా ఏవేతి వక్తవ్యం"

వ్యాసునిచేఁ గలిధర్మములే యడుగఁబడుటవలనను గలియందుఁ బారాశరస్మృతి యని పరాశరునిచేతనే యుత్తరము చెప్పఁబడుట వలనను పరాశరోక్తధర్మము లన్నియు కలిధర్మములే యని యొప్పుకొని,—

"కిం చ శేషం మునివిభాషిత మితి ఇతరమున్యుక్తకలి నిషేధానా మప్యభ్యుపగతిః స్పష్టం లక్ష్యతే"

అయినను 'శేషంమునివిభాషితమ్' అనుటవలన నితరమునులచేఁ జెప్ప బడినకలినిషేధములకు గతి కలుగుట స్పష్టముగాఁ గనఁబడుచున్నదని,-

"నష్టే మృతే ప్రవ్రజిత ఇతి పునరుద్వాహవిధిః పరివేద నాద్యక్రమవివాహవిషయత్వేన అన్యథా సిద్ధః"

'నష్టే మృతే ప్రవ్రజితే' ఇత్యాది పునర్వివాహవిధి పరివేదనాద్యక్రమ వివాహవిషయమగుట యన్యవిధముగా సిద్ధించుచున్నదని వ్రాసి యున్నారు. 'అన్యథా' యనఁగాఁ బరాశరస్మృతివచనముచేతఁగాక 'ఊఢాయాః పునరుద్వాహ' మను పురాణవచనముచేత సిద్ధించుచున్న దని మాధవాచార్యుల తాత్పర్యము. పరాశరులవారు "శేషం ముని విభాషిత" మని చెప్పుటచేఁ దనస్మృతియందుఁ జెప్పఁబడక మిగిలిన విషయములకు ఇతరమునివాక్యము లనఁగా నితర ధర్మశాస్త్రవాక్య ములు ప్రమాణములనిరే కాని మాధవాచార్యు లర్థముచేసినట్లు తన స్మృతియందుఁ జెప్పఁబడిన ధర్మములకు విరోధముగా నుండు నితర పురాణవాక్యములుగూడ ప్రమాణములని చెప్పినవారు కారు. కాఁబట్టి మాధవాచార్యులవారి యీవాదమును నిరాధారమయినదే. మఱియు నీమాధవాచార్యులే 'శేషం మునివిభాషిత' మనుచోట శేషమనఁగా నవశిష్టమని వ్యాఖ్యానము వ్రాసియున్నారు. ఇంతియేకాక మాధవా చార్యులు "నష్టే మృతే" యను పునర్వివాహవిధి యుగాంతరవిషయ మనుటచే మూలగ్రంథమునందలి యుత్తరశ్లోకముల సంబంధమునకును, వానికిఁ దాను వ్రాసిన వ్యాఖ్యానమునకును గూడఁ బొసఁగుబాటు లేకపోవలసివచ్చినది. పరాశరులు మొదట స్త్రీలకుఁ బునర్వివాహమును జెప్పి, తరువాత బ్రహ్మచర్యమును జెప్పి, తదనంతరము సహగమనమును జెప్పి, ఆమూటిలో నేదియైనను జేయనచ్చునని విధించిరి. ఆమూటిలో నొకటి పూర్వయుగముల కయినచోఁ దక్కినవియుఁ బూర్వయుగములకే కావలసివచ్చును. లేదా, అన్నియుఁ గలియుగమున కయినను గావలసి యుండును.

"శ్లో॥ మృతే భర్తరి యా నారీ బ్రహ్మచర్యే వ్యవస్థితా।
సా మృతా లభతే స్వర్గం యథా తే బ్రహ్మచారిణః॥"

అను తరువాయి శ్లోకమునకు వ్యాఖ్యచేయుచు మాధవాచార్యులవారు "పునరుద్వాహ మకృత్వా బ్రహ్మచర్య వ్రతానుష్ఠానే శ్రేయోతిశయం దర్శయతి" యని వ్రాసియున్నారు. ఇవి రెండును ఏకయుగమునందే కాకపోయినయెడల, పునరుద్వాహము చేసికోక బ్రహ్మచర్యవ్రతమును జేయుటయందు శ్రేయోతిశయమున్నదని చెప్పుట కెట్లు వీలుకలిగి యుండును ? మాధవాచార్యులు గొప్పవాఁడే యయినను "ప్రమాదో ధీమతామపి" యని యుండుటవలన, ఈవిషయమున వారేఁడు పొఱ పడిన స్థలములయందు,

"మాధవస్తు సామాన్య వాక్య నిర్ణయం కుర్వన్ భ్రాంత ఏవ" అని నిర్ణయసింధువు మొదలయిన గ్రంథములయందు కమలాకరభట్టు మొదలగువారాక్షేపించి వ్రాసియే యున్నారు. ఈబాధకముల నాలోచించి, 'అయం చ పునరుద్వాహో యుగాంతరవిషయ' మనుచోట 'అయుగాంతరవిషయ' మని పదచ్ఛేదము చేసికోవలెననియు, అది యే మాధవాచార్యుల తాత్పర్యమనియు, ఆపునర్వివాహము ప్రకరణమునుబట్టి పరివేదినీపరమగుననియు, కనుకనే మాధవాచార్యులు అగ్రేదిధిషూప్రాయశ్చిత్తస్థలమునందు "నష్టాది నిమిత్తేషు తు నష్టే మృతఇతి వక్ష్యమాణం ద్రష్టవ్య" మని వ్రాసియున్నారనియు నంది రాజు లక్ష్మీనారాయణదీక్షితులుగారు వ్రాసియున్నారు. కాని యీవిధముగా పదచ్ఛేదముచేయుట యెంతమాత్రము యుక్తముగాఁ గనుపట్టను. ఎట్లన్న—శబ్దశక్తిచేతఁగాని ప్రకరణమునుబట్టిగాని 'నష్టే మృతే' యను పునర్వివాహవిధి పరివేదినీపరముగాదని సాధారణ సంస్కృతభాషా పరిజ్ఞానముగల బాలురకునహితము సులభముగాఁ దెలియును. మూలములో నెక్కడను బరివేదినియను నర్థమిచ్చు పద

ములేదు; వ్యాఖ్యానము నందయినను స్త్రీణా మనియే సామాన్య
ముగా వ్రాయఁబడినదిగాని పరివేదినీపదము గాని తదర్థబోధక పదాం
తరముగాని వేయఁబడి యుండలేదు. ప్రకరణమునుబట్టి విచారించినను
'నష్టే మృతే' యనుశ్లోకము పర్యాధానవిధి తరువాత నున్నదిగాని పరి
వేదినీవిషయము చెప్పఁబడిన తరువాతలేదు. పునర్వివాహవిధి పరివేదినీ
పరమగునెడల, బ్రహ్మచర్యమును సహగమనమునుగూడ పరివేదిను
లకే యగునుగనుక, పరాశరులవా రొక్క పరివేదినులకు మాత్రమే
బ్రహ్మచర్యమును సహగమనమును విధించి స్త్రీలకు సామాన్యముగా
మానివేసినారని చెప్పుటకంటె విరుద్ధము మఱియొకటి యుండదు.
'అయంచ పునరుద్వాహో అయుగాంతర విషయో ద్రష్టవ్య' యనుచో
యుగాంతరవిషయమని యర్థము చేసితిమేనిఁ బూర్వ మొకచోట
'నష్టే మృతే' యనుదానినె మనువచనముగా వ్రాసి "సోయం పునరు
ద్వాహో యుగాంతరవిషయః" (ఈపునర్వివాహము యుగాంతరవిష
యము) అని వ్రాసియున్నాఁడు గాన నిచ్చట నీపునర్వివాహమును
యుగాంతరవిషయమేయని సముచ్చయార్థకమయిన 'అయంచ' యను
దానిలోని చ కారమున కర్థము పొసఁగియుండునుగాని, అయుగాంతర
విషయమని పదచ్ఛేదము చేసినచో చ కారమువలన నేమిప్రయో
జన ముండును ? అంతియకాక 'తథాచాదిత్యపురాణ' మని యాదిత్య
పురాణవచనమును వ్రాయుటచే నాదిత్యపురాణవచనము పూర్వవా
క్యమున కుపష్టంభకముగాఁ గదా యుండవలయును? అయుగాంతర
విషయమని పదవిభాగము చేసెడి పక్షమున, కలియుగమున నూఢా
వివాహమును నిషేధించు వచనము కలియుగమునకే యీవిధి యని
చెప్పు పూర్వవాక్యమున కెట్లుపష్టంభకము కాఁగలదు? 'ఊఢాయాః
పునరుద్వాహ' మను వచనము మొదటఁజెప్పినట్లు యుగాంతరవిషయ

మనుటకును, తరువాతఁ జెప్పినట్టు అయుగాంతర విషయ మనుటకును గూడ నేప్రకారముగా నుపష్టంభకప్రమాణము కాఁగలదు? కాఁబట్టి యుగాంతరవిషయమనియే మాధవాచార్యులవారి యభిప్రాయము గాని అయుగాంతరవిషయమనికాదు. వెనుక 'నష్టాది నిమిత్తేషు తు నష్టే మృత ఇతి వక్ష్యమాణం ద్రష్టవ్య' మని నష్టాది నిమిత్తముల యందో ముందుఁ జెప్పఁబోవు నష్టేమృత ఇత్యాది విధి చూడఁదగిన దనుటవలన పరివేదినుల విషయమయినకూడ నష్టాది నిమిత్తములయందావిధిని జూడవలసినదని మాత్రమే మాధవాచార్యుల తాత్పర్యము గాని 'నష్టే మృతే' యను విధి పరివేదినీపరమేయని యెంతమాత్రమును కాదు.

ఇఁక రెండవ వ్యాఖ్యానకారుఁడయిన నందపండితుఁడు 'నష్టే మృతే' యను విధి వాగ్దత్తాపరమని యీక్రింద నుదాహరించిన రీతిని వ్యాఖ్యానము చేసియున్నాఁడు—

"నన్వస్తు పరివేదనే కన్యయా జ్యేష్ఠసమర్పణానంతరం పునస్తేనైవ వివాహో వాగ్దానానన్తర మనిష్పన్నే వివాహే తు వరవైగుణ్యే జ్ఞాతేకథ మిత్యత ఆహ-నష్టే మృత ఇతి వాగ్దానానన్తరం పాణిగ్రహణప్రాక్ ఏతా ఉత్పత్స్యమానపతిత్వే పూర్వస్మిన్వరే నష్టే దూరదేశగమనేనాఽపరిజ్ఞాతవృత్తాంతే నారీణాం కన్యానా మన్యః పతి ర్విధీయతే- తథాహ నారదః -పరిగృహ్యాతు యః కన్యాం వరో దేశాంతరం వ్రజేత్ । త్రీనృతూన్సమతిక్రమ్య కన్యాఽన్యం వరయే ద్వరం॥ స్త్రీపుంసయోస్తు సంబంధా ద్వరణం ప్రాగ్విధీయతే । వరణా ద్గ్రహణం పాణేః సంస్కారోపి విచక్షణైః ॥ తయో రనియతం ప్రోక్తం వరణం దోషదర్శనాత్ ॥ ఇతి."

'నష్టే మృతే' యను విధి వాగ్దత్తాపరమయినట్టు ప్రకరణమును బట్టియుఁ గనఁబడదు; శబ్దశక్తిచేతను ఆ యర్థము రాదు. మూలము

లోని నారీణా మను పదము వివాహితలయిన కాంతలకేగాని యీ విధి వివాహముకాని కన్యలకుఁ గాదని సూచనగాఁ జెప్పుచున్నది. వాగ్దత్త యొక్క కాఁబోవువరుఁడు దేశాంతరము పోవుట మొదలయినవి యాపదలు కాఁజాలవు గనుక, అయిదాపదలయుందని యుండుటచేతనే వివాహితలయిన స్త్రీలకే పునర్వివాహము విధింపఁబడినట్టు తెలిసికోఁదగియున్నది. పునర్వివాహము వాగ్దత్తలకే యనునెడల, ప్రకరణమునుబట్టి బ్రహ్మచర్యమును సహగమనమునుగూడ వాగ్దత్తలకే యయి పరిహాసాస్పదమయిన యర్థము సిద్ధించును. మఱియు

శ్లో॥ "నోదకేన నవా వాచా కన్యాయాః పతి రుచ్యతే।
పాణిగ్రహణసంస్కారాత్ పతిత్వం సప్తమే పదే॥

అను నారదసంహితావచనమును బట్టియు

"శ్లో॥ నోదకేన న వా వాచా కన్యాయాః పతి రుచ్యతే।
పాణిగ్రహణసంస్కారో నియతం పతిలక్షణం॥"

అను పరాశరవచనమును బట్టియు, ఉదకదానముచేతఁగాని వాగ్దానము చేతఁగాని కన్యకయొక్క వరునకు పతిసంజ్ఞ లేదనియు, పాణిగ్రహణానంతరముననే పతిసంజ్ఞ కలుగుననియు స్పష్టమగుచున్నందునను, మూలమునందు పతిశబ్దమే ప్రయోగింపఁబడి యున్నందునను, 'నష్టే మృతే' యను శ్లోకము విధించు పునర్వివాహము వివాహితలకేగాని వాగ్దత్తలకుఁ గాదని కరతలామలకముగాఁ దెలియవచ్చుచున్నది. పతిశబ్దమునకు లక్షణచేత కాఁబోవు పతియని యర్థము చేసికొని వాగ్దత్తాపరమున నన్వయించుకోవలెనని కాశీస్థ రామశాస్త్రులవారనిరి. శబ్దశక్తిచేతను ప్రకరణముచేతను పదముయొక్క వాస్తవార్థము సమన్వయింపని పక్షమున లక్షణచేత వేఱర్థమును గ్రహింపవలయునుగాని, సర్వవిధముల నిర్బాధకమయి స్పష్టమయిన యర్థము నిచ్చు

చున్నప్పు డేల లక్షణచేత విపరీతార్థమును దెచ్చిపెట్టుకో వలయునో యూహింపఁజాలకున్నాను. వ్యాకరణశాస్త్రమునుబట్టి "పత్యౌ" యని యుండవలసిన దానికి 'పతౌ' యని యుండుటవలన నా పదమునకు పతి సదృశుఁడని యర్థము చేసికోవలెననియు, అపతౌ యని పదవిభాగము చేసి నియోగపరముగా నర్థము చెప్పుకోవలెననియు, కాశీనథ బాల శాస్త్రిలవారు చెప్పిరి. ఆర్షప్రయోగమగుటచేత వ్యాకరణదోష మిచ్చట ప్రవర్తింపదు. అయినను మనోరమయందు "పతౌ" యను రూపమును సాధువే యగుట విశదపఱుపఁబడి యున్నది.—

సూ. 'పతి స్సమాస ఏవ' (పతిశబ్ద స్సమాస ఏవ ఘిసంజ్ఞికః వార్తికము) ఏవకార ఇష్టతో అవధారణార్థః-అన్యథా హి సమాసే పతిరేవేతి సంభావ్యేత -ధాత్వాదే రిత్యా దిజ్ఞాపకానుసరణే చ ప్రతిపత్తిగౌరవం స్యాత్ -అథకథం 'శీతాయాః పతయే నమః'- పరాశరశ్చ 'నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ' వితి ఉచ్యతే -పతి రితి ఖ్యాతః పతిః -ణౌటి లోపే అచఇరిత్యౌణాదికః- అయం పతిశబ్దః పతి స్సమాస ఏవేత్యత్ర న గృహ్యతే- లాక్షణిక త్వాత్ -ఏతేన 'కృష్ణస్య సఖ రర్జున' ఇతి భారతం -సఖినా వాన రేంద్రేణే' తి చ రామాయణం చ వ్యాఖ్యాతం."

పయి నుదాహరింపఁబడిన మనోరమా వ్యాఖ్యానముం బట్టియు, 'శీతాయాః పతయేనమః' ఇత్యాది ప్రయోగములు రామాయణాది గ్రంథములం గనఁబడుచుండుటం బట్టియు, "పతౌ" యను రూపమును సాధువేయని స్పష్టమగుచున్నది. "షష్ఠ్యా ఆక్రోశే" అను సూత్రమును బట్టి నిందార్థమునందును మఱికొన్ని విశేషశబ్దములయందును దప్ప షష్ఠీవిభక్తియుం దలుకస్సమాసము శబ్దశాస్త్రమునందు విధింపఁబడి యుండలేదు గనుక, "శీతాయాః పతయేనమః" ఇత్యాది స్థల

ములయం దలుక్తమాసమని చెప్పుటకు వీలు లేదు. కాఁబట్టి యిచ్చట పతిశబ్దమునకు భర్తయనియే యర్థమగుట విస్పష్టమగుచున్నది. వారు 'నష్టే మృతే' యను విధి నియోగపరమనుట కాధారలేశము గాని లేకపోవుటచేతను, విధవానియోగము పూర్వయుగములందు సహితము మన్వాదులచేఁ బశుధర్మమని నిందింపఁబడి యుండుటచే తను, పరాశరస్మృతియందలి స్త్రీపునర్వివాహవిధి నియోగపరము కాదని నేను జెప్పనక్కఱలేకయే యెల్లరును సులభముగాఁ దెలిసి కోవచ్చును.

'నష్టేమృతే' యనుశ్లోకమును పరాశరులవారు నారదస్మృతి నుండి గ్రహించియున్నారు; నారదస్మృతిని జూచినను, ఈస్త్రీపునర్వి వాహము వాగ్దత్తావిషయము కాదని తేటపడగదు. నారదస్మృతి—

శ్లో॥ నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ ।
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతేః ॥
అష్టవర్షా ణ్యుదీక్షేత బ్రాహ్మణీ ప్రోషితం పతిమ్ ।
అప్రసూతా తు చత్వారి పరతోన్యం సమాశ్రయేత్ ॥

భర్త నష్టుఁడయినపుడు బ్రాహ్మణస్త్రీ సంతానము గలదయినయెడల నెనిమిదిసంవత్సరములును, సంతానము లేనియెడల నాలుగుసంవత్సర ములును జూచి వేఱొకనిని వివాహము చేసికోవలసినదని విధించుట వలన నయివిధి వాగ్దత్తాపరమని మందమతి సహితము చెప్పఁజాలడు.

అద్దేపల్లి కృష్ణశాస్త్రులుగారు చదివిన ఖండన గ్రంథములో "నష్టే మృతే" యను పునర్వివాహవిధి సంకరులకని యొకచోటను, వాగ్దత్తలకని మఱియొకచోటను వ్రాసినారు. వాగ్దత్తలకని యర్థము చేయకపోయిన పక్షమున,-

శ్లో॥ పర పూర్వ స్త్రియాః పుత్రా న పిండం నోదక క్రియాః।
కన్యాయాః పూర్వ భర్తా చ ధర్మాధర్మౌ వ వాప్యతే॥

అని పరపూర్వస్త్రీయొక్క పుత్రులు పిండమును ఉదకక్రియయును గలవారు కారనియు, ఆ కన్యయొక్క పూర్వభర్త ధర్మాధర్మములను పొందఁడనియుఁ జెప్పిన పరాశరవచనమునకు బాధకలిగి, పరాశరుని చేత దూషింపఁబడిన పునర్వివాహమునకు ప్రవర్తనము కలుగునని చెప్పిరి. కాని పరాశరులవారు దూషించిన పరపూర్వ, మగఁడుండఁగా నతనిని విడిచి మఱియొకనిని జేరినదిగాని విధివిహితముగా వివాహమైనది గాదు; ఈయర్థమునే సూచించుచు మనువు పరపూర్వాలక్షణమును వ్రాసియున్నాఁడు—

శ్లో॥ పతిం హిత్వాపకృష్టం సముత్కృష్టం యా నిషేవతే।
నింద్యైవ సా భవే ల్లోకే పరపూర్వేతి చోచ్యతే॥

తక్కువవాఁడయిన పతిని విడిచి గొప్పవాని నెవతె పొందుచున్నదో యా స్త్రీ లోకములో నింద్యురాలగుననియు, అట్టిస్త్రీ పరపూర్వ యని చెప్పఁబడుననియు, మనువు పంచమాధ్యాయమున వ్రాసి యున్నాఁడు. మృతభర్తృకకు వివాహము గలదని సూచించు వాక్యము పరాశరస్మృతియందు మఱియొకటికూడఁ గలదు.

శ్లో॥ విధవా యా భవేత్కన్యా నిర్దోషా భర్తృ వర్జితా
తస్యావాసః పితు ర్వేశ్మ న లజ్జా చైవ సర్వదా॥

విధవయయిన కన్య నిర్దోషురాలయి భర్తచేత విడిచిపెట్టఁబడినప్పుడు సర్వదా పితృగృహమున వాసము చేయవలయునని, విధవ భర్తచేత విడువఁబడి యనిన తోడనే పునర్వివాహము గలదని పామరులును సులభముగా నూహింపదగియున్నది. ఈ శ్లోకమును కృష్ణశాస్త్రిగారు చదివిన ఖండనగ్రంథములో నుదాహరింపఁబడిన "పరపూర్వ

స్త్రియా" యను శ్లోకమును నాగరప్రతులయందుఁ గనఁబడుచున్నను, ఈ దేశమున ముద్రితమైయున్న తెనుఁగుపుస్తకములందుఁ గానరాకున్నవి. తమ వ్యాఖ్యకు విరుద్ధముగా నుండునని నందపండితాదులో, లేక యిక్కడ పుస్తకమును ముద్రించినవారో యీ శ్లోకములను దీసివేసియుందురు. తమ గ్రంథమునందు గ్రొత్తశ్లోకములను జేర్చకుండుటకును మునుపున్నవానిని తీసివేయకుండుటకును పరాశరులవారు తమ స్మృతియందలి శ్లోకసంఖ్యనుగూడ కడపట నిచ్చియున్నారు. మాధవాచార్యులవారును వ్యాఖ్యానములో "వచనాంతరాణా మావాపోద్వాప నివృత్తయే సంఖ్యాభిధానం" అని యీ సంగతినే వ్రాసియున్నారు.—

శ్లో॥ ఏత త్పారాశరం శాస్త్రం శ్లోక పంచశతాధికమ్।
త్రిసప్తతి సమాయుక్తం ధర్మశాస్త్రస్య సంగ్రహః॥

ఈ పరాశరవచనమునుబట్టి పరాశరస్మృతిలో నైదువందలడెబ్బదిమూఁడు శ్లోకము లుండవలసినను, శ్లోకమును క్రమముచేసి లెక్కించి చూచినవారందఱును ఏడెనిమిదిశ్లోకములు తక్కువగా నుండుటను కనిపెట్టఁగలరు. శ్లోకసంఖ్య తక్కువగుటకుంగల కారణము గ్రంథములోనుండి కొన్నిశ్లోకములు తీసివేయఁబడుటతప్ప మఱియొకటి యని యూహింపఁదగియుండదు.

స్త్రీపునర్వివాహము కలియుగనిషేధములలోఁ జేరియున్నది గాన, ఆచరణీయముకాదని కొందఱందురు. ఏ గ్రంథమునందును మృతభర్తృకావివాహము నిషేధింపఁబడి యుండలేదు; ఒకవేళ నిషేధింపఁబడి యున్నదని యొప్పుకొన్నను, కలిధర్మప్రవర్తక మయిన పరాశరస్మృతి వచనమునకంటె పురాణవచనములు దుర్బలములయినవి గనుక, అవి యంగీకరింపఁబడదగినవియు గావు. విధవావివా

హమును నిషేధించుచున్నవన్న వచనముల నించుక విచారింతము. "...యాః పునరుద్వాహ" మను నాదిపురాణవచనము సాధారణ ... వివాహితలకుఁ బునర్వివాహమును నిషేధించుచున్నదిగాని ...భర్తృకలను నిషేధించుటలేదు. "దేవరాచ్చ సుతోత్పత్తి ... కన్యా ప్రదీయతే" యను క్రతువచనమును "దత్తాయా శ్చైవ ...యాః పునర్దానం పరస్యచ" అను బృహన్నారదీయ పురాణ వచనమును, "దత్తా కన్యా ప్రదీయతే" యను నాదిత్యపురాణవచనమును, సామాన్యముగా దత్తయైన స్త్రీయొక్క పునర్వివాహమును నిషేధించుచుండఁగా, అయిదాపదలయందుమాత్రము విశేషముచేత పరాశరవచనము స్త్రీపునర్వివాహమును విధించుచున్నది. కాఁబట్టి ...యీ నిషేధవచనములన్నియు మంచివరుఁడు దొరకినపుడు కన్యను ...యొకనికిచ్చు పూర్వయుగాచారమును నిషేధించుచున్నవే కాని, ...ధర్మప్రవర్తకమగు పరాశరవచనమును నిషేధించుచుండలేదు; ...ట్లు నిషేధించుట కవి చాలినవియుఁ గావు. ఎట్లన్నను:—ఆదిత్య పురాణాదులు పరాశరుఁడు విధించిన ధర్మములలోని యశ్వమేధాదులను ...లియుగ నిషేధములని చెప్పుచున్నను, స్మృతికంటెఁ బురాణము దుర్బలమైన దగుటచే వానిని బాటింపక శూద్రకుఁడు, ప్రవరసేనుఁడు మొదలగురాజులు కలియుగములోనే యశ్వమేధాదులను జేసియున్నట్టు గ్రంథములు చెప్పుచునేయున్నవి. కాఁబట్టి యొకవేళ నేపురాణ మయినను పరాశరస్మృతిలో విధింపఁబడియున్న స్త్రీపునర్వివాహమును నిషేధించినను, ఆ నిషేధము గ్రాహ్యము కాకయేపోవును.

విధవావివాహమును స్మృతులు కొన్ని నిషేధించుచున్నవి. కాఁబట్టి యది యిప్పు డాచరణీయముకాదని కొందఱు చెప్పిరి. కాని ...స్మృతియు స్త్రీపునర్వివాహమును నిషేధించి యుండలేదు; ఉండి

నను, అవి యితరయుగములకుఁ బనికివచ్చు స్మృతులు కాఁబట్టి యీ కలియుగమునకయి ముఖ్యముగాఁ జేయఁబడిన పరాశరస్మృతిని బాధింపను జాలవు.

శ్లో. అజ్ఞాతశ్చ ద్విజో యస్తు విధవా ముద్వహే ద్యది
పరిత్యజ్య చ తాం చైవ ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥

అను వసిష్ఠవచనము నొకదానిని [illegible]తము "ఏ ద్విజుఁడైనను అజ్ఞానమువలన విధవను వివాహమాడెనేని దానిని బరిత్యజించి ప్రాయశ్చిత్తము చేసికోవలె" నని విధవావివాహమునకు బాధకముగాఁ దీసికొనివచ్చిరి. పూర్వయుగములయందు సహితము స్మృతికర్తలు స్త్రీపునర్వివాహము నంగీకరించినను, కొందఱక్షతయోనులకు మాత్రమే వివాహము చేయవలెనని చెప్పిరి. పయిచెప్పిన సామాన్యవిధికి బాధకముగా,—

శ్లో॥ పాణిగ్రాహే మృతే బాలా కేవలం మంత్రసంస్కృతా ।
సా చే దక్షతయోని స్స్యా త్పునస్సంస్కార మర్హతి. ॥

అను విశేషవిధినిగూడ వసిష్ఠుఁడే చెప్పియున్నందున, ఈతఁడును అక్షతయోనికి మాత్రమే వివాహము చేయుమనువారిలోనివాఁడు. తక్కిన స్మృతులయం దెక్కడనుగాని స్త్రీపునర్వివాహమును నిషేధించు వాక్య మొక్కటియైనను గానరాదు. "వేదార్థోపనిబద్ధత్వా" దిత్యాది వాక్యములవలన సర్వస్మృతులలోను మనుస్మృతి యుత్కృష్టమయినదనియును, దానికి విరుద్ధముగానున్న స్మృతు లంగీకరింపఁదగినవి కావనియు మనుస్మృతిలో విధవావివాహము నిషేధింపఁబడియున్నదనియు, అందుచేఁ బరాశరవచనము చెల్లదగినది [illegible]కాదనియుఁ గొందఱనిరి. మనుస్మృతి కృత[illegible]యుగధర్మప్రవర్తకమయినది కాఁబట్టి ఆయుగమునందు మాత్రమే [illegible]తరస్మృతులకంటె [illegible]యమయి

నదిగాని, కలియుగధర్మప్రవర్తకమయిన పరాశరస్మృతికంటె బలీయమైన దెన్నటికిని గానేరదు. అయినను మనుస్మృతియు స్త్రీపునర్వివాహము నంగీకరించుచునే యున్నది. కాని, కొందఱు భ్రాంతిపడునట్లు నిరాకరించుచుండలేదు. ఇప్పటి ముద్రిత పుస్తకమునందు కనఁబడక పోయినను "నష్టే మృతే" యను శ్లోకము మనుస్మృతిలోఁగూడ నున్నట్టు మాధవాచార్యులు వ్రాసిన దానివల్లనే తెలియవచ్చుచున్నది గదా? నారదసంహితనుబట్టికూడ అది మనుస్మృతిలోనిదే యయినట్టు స్పష్టమగుచున్నది. ఎట్లన్న—నారదసంహిత ప్రారంభమునందు,—

"భగవా న్మనుః ప్రజాపతిః సర్వభూతానుగ్రహార్థ మాచారస్థితిహేతుభూతం శాస్త్రం చకార తదేతత్ శ్లోకశతసహస్ర మాసీత్ తేన అధ్యాయసహస్రేణ మనుః ప్రజాపతి రుపనిబధ్య దేవర్షయే నారదాయ ప్రాయచ్ఛత్-స చ తస్మా దధీత్య మహత్త్వా న్నాయం గ్రంథః సుకరో మనుష్యాణాం ధారయితు మితి ద్వాదశభిః సహస్రైః స్సంచిక్షేప-తచ్చ సుమతయే భార్గవాయ ప్రాయచ్ఛత్-స చ తస్మా దధీత్య తథైవాయుర్హ్రాసా దల్పీయసీ మనుష్యాణాం శక్తి రితి జ్ఞాత్వా చతుర్భిః సహస్రైః సంచిక్షేప - తదేతత్ సుమతికృతం మనుష్యా అధీయతే - విస్తరేణ శతసహస్రం దేవగంధర్వాదయః యత్రాయ మాద్యః శ్లోకో భవతి :—

ఆసీ దిదం తమోభూతం న ప్రాజ్ఞాయత కించన।
తతః స్వయంభూ ర్భగవాన్ ప్రాదురాసీ చ్చతుర్ముఖః॥

ఇత్యతే మధికృత్య క్రమా త్ప్రకరణాత్ ప్రకరణ మనుక్రాంతం తత్ర తు నవమం ప్రకరణం వ్యవహారో నామ యస్యేమాం దేవర్షి నారదః సూత్రస్థానీయాన్ సూత్రకాన్ చకార."

అని మనువు మొదట లక్షగ్రంథమును వ్రాసి యాసంహితను నారదున కీయఁగా, ఆతఁడు దానిని మనువునొద్దనే చదివి మనుష్యులకు సులభముగాఁ దెలియుటకయి దానిని సంగ్రహపఱిచి పండ్రెండువేలగ్రంథముగా వ్రాసి భార్గవుఁడయిన సుమతి యనువానికిఁ జెప్పినట్టును, మనుష్యులయొక్క అల్పజీవితకాలమును దలఁచి యతఁడు మరల దానిని నాలుగువేల శ్లోకములుగా సంగ్రహించి మనుష్యులలో వ్యాపింపఁజేసినట్టును, నారదస్మృతియందు వ్రాయఁబడి యుండుట చేత నారదసంహితలోనివన్నియు మనుస్మృతియందుఁ జెప్పఁబడినవే యనుటకు సందేహముండదు. "నష్టేమృతే" యను విధి స్పష్టముగా నారదసంహితయందుఁ గనఁబడుచున్నది. కాఁబట్టి యది మనుస్మృతిలోనిదే యనుట స్పష్టము. దీనినిబట్టి విచారింపఁగా మనుస్మృతి పూర్వోక్తములయిన అయిదాపదలయందును స్త్రీ పునర్వివాహము నంగీకరించుచున్నదని నిశ్చయముగాఁ దేలుచున్నది. ఇఁక మనుస్మృతిలో విధవావివాహము నిషేధింపఁబడి యున్నదని ప్రతిపక్షులు గనఁబఱుచు ప్రమాణములనుగూర్చి కొంచెము విచారింతము :—

"న ద్వితీయశ్చ సాధ్వీనాం క్వచిద్భర్తోపదిశ్యతే"

పుణ్యసతులకు రెండవవాఁ డెప్పుడును భర్తయని చెప్పఁబడఁడను శ్లోకార్థమును మాత్రము వ్రాసి తమపక్షమును సాధింపవలెనని స్త్రీపునర్వివాహ నిషేధవాదులు ప్రయత్నించిరి కాని తక్కిన భాగమునుగూడ సంపూర్ణముగా నుదాహరించినచో వారి యభిమత మెంతమాత్రమును కానేరదు. సందర్భము చక్కఁగాఁ దెలియుటకయి దాని పూర్వశ్లోకములనుగూడ నిం దుదాహరించుచున్నాను :—

శ్లో॥ మృతే భర్తరి సాధ్వీస్త్రీ బ్రహ్మచర్యే వ్యవస్థితా
స్వర్గం గచ్ఛ త్యపుత్రాపి యథా తే బ్రహ్మచారిణః

అపత్యలోభా ద్యాతుస్త్రీ భర్తార మతివర్తతే
సేహ నిందా మవాప్నోతి పరలోకా చ్చ హీయతే
నాన్యోత్పన్నా ప్రజాస్త్రీహ న చాప్య న్యపరిగ్రహే
నద్వితీయశ్చ సాధ్వీనాం క్వచి ద్భర్తోపదిశ్యతే ॥

భర్తపోయిన సాధ్వియయిన స్త్రీ బ్రహ్మచర్యమునందు వర్తించునేని పుత్రవిహీనురాలయినను బ్రహ్మచారులవలెనే స్వర్గమును పొందు ననియు, సంతానాపేక్షవలన నేస్త్రీవ్యభిచరించునో యాస్త్రీ యిహమున నిందను పొందుటయేకాక పతిలోకమును సహితము పోఁగొట్టు కొనుననియు, అన్యునివలనఁ గలిగినవారు స్త్రీకి క్రమమయిన సంతానము కారు. పరుని భార్యయందుఁ గలిగినవారు కన్నపురుషుని సంతానము కారు. శాస్త్రమునం దెక్కడను సాధ్వులయిన స్త్రీలకు రెండవ వాఁడెప్పుడును భర్తగా విధింపఁబడలేదనియు, మనువు వ్యభిచారము కూడదని చెప్పినవాఁడేకాని పునర్వివాహముకూడదని చెప్పవచ్చిన వాఁడు కాఁడు. "అనంతాః పుత్రిణాం లోకాః। నాపుత్రస్య లోకో స్తీతి శ్రూయతే" యని యుండుటవలనఁ బుత్రులు లేనివారికిఁ బరలోకము లేదను భ్రాంతిచేత సంతానార్థము స్త్రీ వ్యభిచరించునేమోయని, బ్రహ్మచర్యము చేసినను స్వర్గము కలదనియు, వ్యభిచరించి కన్నవాఁడు పుత్రుఁడు కాఁడుగనుక నట్టిసంతానమువలనఁ బ్రయోజనము లేదనియు ద్వితీయుఁ డనఁగా విధివిహితముగా వివాహమాడిన పెనిమిటికంటె నన్యుఁ డెప్పుడును స్త్రీకి భర్తకాఁజాలఁడనియు మనువు వ్రాసియున్నాఁడు. కాఁబట్టి ప్రతిపక్షు లుదాహరించిన శ్లోకార్థము ద్వితీయ వివాహము కూడదనుట కెంతమాత్రము నుపయోగింపదు.

మఱియును మనప్రతిపక్షులు తమపక్షమును సాధించు కొనుటకయి యీక్రింద నుదాహృతమయిన మఱియొక శ్లోకార్థమును

గూడఁ గనఁబఱిచి యున్నారు—

"న వివాహవిధా వుక్తం విధవావేదనం పునః"

ఇదియును బూర్వోత్తర సందర్భములను జక్కఁగా విమర్శించి చూచిన యెడల వారివాదమున కించుకయుఁ బనికి రాదు. సంగతి సందర్భము తెలియుటకయి పూర్వోత్తర శ్లోకముల నిందుదాహరించెదను:—

శ్లో॥ దేవరా ద్వా సపిండా ద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా।
ప్రజేప్సితాధిగంతవ్యా సంతానస్య పరిక్షయే॥
విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతో నిశి।
ఏక ముత్పాదయే త్పుత్రం నద్వితీయం కథం చన॥
ద్వితీయ మేకే ప్రజనం మన్యంతే స్త్రీషు తద్విదః।
అనిర్వృతం నియోగార్థం పశ్యంతో ధర్మత స్తయోః॥
విధవాయాం నియోగార్థే నిర్వృత్తే తు యథావిధి।
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరమ్॥
నియుక్తౌ యౌ విధిం హిత్వా వర్తేయాతాం తు కామతః।
తావుభౌ పతితౌ స్యాతాం స్నుషాగ గురుతల్పగౌ॥
నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః।
అన్యస్మిన్ హి నియుంజానా ధర్మం హన్యుస్సనాతనం॥
నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్।
న వివాహ విధా వుక్తం విధవా వేదనం పునః॥
అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః।
మనుష్యాణా మపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి॥
స మహీ మఖిలాం భుంజ న్రాజర్షిప్రవరః పురా।
వర్ణానాం సంకరం చక్రే కామోపహతచేతసః॥

తతః ప్రభృతి యో మోహాత్ ప్రమీతపతికాం స్త్రియం।
నియోజయత్యపత్యార్థం తం విగర్హంతి సాధవః॥

అని మనువు నియోగమునుగూర్చి వ్రాయుచు, సంతానము లేనప్పుడు స్త్రీ దేవరునివలనఁగాని సపిండునివలనఁగాని నియోగమువలనఁ గుమారుని గనవచ్చును మొదలయిన సంగతులను మొదట వ్రాసి, తరువాత ద్విజాతులచేత విధవ నియోగింపఁబడఁదగినది కాదని వ్రాసి, వెంటనే 'వివాహమంత్రములయం దెక్కడను నియోగము చెప్పఁబడలేదు. వివాహవిధులయందు మరల విధవాగ్రహణమును జెప్పఁబడలే దని వ్రాసి, యావెనుకను పండితులయిన ద్విజులచే నది పశుధర్మమని నిందింపఁబడిన దనియు వేనుని రాజ్యకాలములో జరిగి వర్ణసంకరమయినదనియు,' కాఁబట్టి సంతానార్థము నియోగించుటను సాధువులు గర్హింతురనియు బహువిధముల నియోగమును దూషించియున్నాఁడుగాని, విధవావివాహమును నిందించియుండలేదు. నియోగప్రకరణ మధ్యమున సందర్భములేకుండ నొక్కమాటను మాత్రము విధవావివాహమునుగూర్చి వ్రాయుననుట యుక్తి కెంతమాత్రమును సరిపడి యుండదు.

నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్।
న వివాహవిధా వుక్తం విధవా వేదనం పునః॥

అనుశ్లోకమునకు వివాహమంత్రములయం దెక్కడను నియోగమునుం జెప్పఁబడలేదు. విధవాగ్రహణమును వివాహవిధులయందుఁ జెప్పఁబడలేదనియే యర్థమగునుగాని ప్రత్యేకముగా విధవావివాహము వివాహమంత్రములయందుఁ జెప్పఁబడలేదని ప్రకరణానుసారముగా లేశముగాని యర్థము చెప్పుట కవకాశములేదు. కాఁబట్టి యిక్కడఁ జెప్పిన విధవావేదనము నియోగాంగవివాహమయి, విధవ నొకరి

దగ్గఱకు వెళ్ళుమని నియోగించుటకుఁగాని, యామె నొకరు స్వీకరించుటకుఁగాని మంత్రములు లేవని పైశ్లోకమునకుఁ దాత్పర్యమగును. వేదనమను పదము గ్రహించుట యను యర్థమిచ్చు విద్ ధాతువునుండి పుట్టిన విశేష్యము. ఈధాతువునుండి పుట్టిన 'విందేత' యను రూపమును పూర్వోదాహృత శ్లోకములకుఁ దరువాతి శ్లోకమునందు నియోగమునందు స్వీకరించుటకే మనువుపయోగించి యున్నాఁడు. ఆశ్లోకముల నిందు క్రిందఁ బొందుపఱుచుచున్నాను.—

శ్లో॥ "యస్యా మ్రియేత కన్యాయా వాచా సత్యే కృతే పతిః।
తా మనేన విధానేన ద్విజో విందేత దేవరః॥
యథావిధ్యఽధిగ మ్యైనాం శుక్లవస్త్రాం శుచివ్రతాం।
మిథో భజేతా ప్రసవా త్సకృ త్సకృ దృతావృతౌ॥

విధవావేదనమనుచోట నియోగాంగవివాహమని యర్థము చెప్పక స్వతంత్రవివాహమని యర్థము చేసినచో, "నష్టే మృతే" యను మనువచనమునకే విరుద్ధమగును; అంతియకాక మఱియొకచోట మనుస్మృతియందే యీక్రిందిశ్లోకములచే విధింపఁబడిన విధవావివాహమునకును గతి లేకపోవలసివచ్చును:—

శ్లో॥ యా పత్యా వా పరిత్యక్తా విధవా వా స్వయేచ్ఛయా।
ఉత్పాదయే త్పునర్భూత్వా స పౌనర్భవ ఉచ్యతే॥
సా చే దక్షతయోని స్స్యా ద్గతప్రత్యాగతాపి వా।
పౌనర్భవేన భర్త్రా సా పున స్సంస్కార మర్హతి॥

ఏ స్త్రీ పతిచేత విడువఁబడిగాని విధవయయి స్వేచ్ఛచేతఁగాని మఱియొకనికి సంతానము గనునో యా స్త్రీ పునర్భువనియు తత్పుత్రుఁడు పౌనర్భవుఁడనియు చెప్పఁబడుదురనియు, ఆ స్త్రీ యనఁగా పతిచే విడువఁబడినట్టిగాని విధవయైనట్టిగాని స్త్రీ యక్షతయోని యైనచో

పౌనర్భవుఁడయిన భర్తచే వివాహసంస్కారమున కర్హురాలనియు మొదటి పెనిమిటిని విడిచి మఱియొకనిం జేరి మరల మొదటి పెనిమిటి కడకు వచ్చిన స్త్రీ మొదటిపెనిమిటితోడి వివాహసంస్కారమున కర్హురాలనియు, పై శ్లోకముల కర్థము. ఇక్కడ నక్షతయోనియైన విధవకు శాస్త్రీయమయిన పునర్వివాహమును విధించుచున్న మనువే వెనుక విధవావివాహమునకు మంత్రములు లేవనుటకంటె వింత మఱియొకటి యుండదు. కాఁబట్టి యెల్లవిధముల స్త్రీపునర్వివాహము మనుస్మృతిచే విధింపఁబడినదనియు, మనువెక్కడను విధవావివాహమును నిషేధించలేదనియు, పైని చెప్పిన సంగతులవల్ల స్పష్టముగాఁ దెలియ వచ్చుచున్నది. బ్రహ్మపురాణములోని యీక్రిందిశ్లోకములును ఈ పై నుదాహరింపఁబడిన మనువచనముల యర్థమునే బోధించుచున్నవి:—

శ్లో. మృతే భర్తరి యా నారీ త్యక్తవత్యథా తం స్వయమ్ ।
సవర్ణా జ్జనయే ద్గర్భం భర్తుః పౌనర్భవం సుతమ్ ॥
యది సా బాలవిధవా బలా త్త్యక్తాఽధవా క్వచిత్ ।
తథా భూయ స్తు సంస్కార్యా గృహీతా యేన కేన చిత్ ॥

పరిశీలించి చూడఁగా నితరయుగధర్మబోధకములైన స్మృతుల యందు సహిత మెక్కడను స్త్రీపునర్వివాహ నిషేధవాక్యములు లేవు; స్త్రీపునర్వివాహవిధాయక వచనములు పెక్కులు గలవు. వానిలోఁ గొన్నిటిని నామొదటి యుపన్యాసమునం దుదాహరించి యుంటినిగాన వాని నిచ్చట మరల వ్రాయుట మానుచున్నాను. మనప్రతిపక్షులు పునర్వివాహము చేసికొన్న స్త్రీలు పునర్భవులని చెప్పఁబడి కొన్ని స్మృతులలో వారు దూష్యురాండ్రుగాఁ బరిగణింపఁ బడినారని యీ క్రింది శ్లోకములను జనఃపుదురు.—

సప్త పౌనర్భవాః కన్యాః వర్జనీయాః కులాధమాః ।
వాచా దత్తా మనోదత్తా కృతకౌతుకమంగళా ॥
ఉదకస్పర్శితా యా చ యా చ పాణిగృహీతికా ।
అగ్నిం పరిగతా యా చ పునర్భూప్రభవా చ యా ॥
ఇత్యేతాః కాశ్యపేనోక్తా దహన్తి కుల మగ్నివత్.

వాగ్దత్త, మనోదత్త, కృతకౌతుకమంగళ, ఉదకస్పర్శిత, పాణిగృహీతిక, అగ్నింపరిగత, పునర్భూప్రభవ అను నేడుగురును వర్జనీయలైన పునర్భువులుగానే చెప్పఁబడినను, వారిలో మొదటి నలువురకు నీ యుగమునందు ధారాళముగా వివాహములు జరుగుచు వారు దూష్యురాండ్రుగా నెంచఁబడకపోవుటయు, పునర్భువులని పిలువఁబడకపోవుటయు నెల్లవారికిని విశదమైయే యున్నది. కాఁబట్టి యట్టి స్త్రీలకు పునర్భూ వ్యవహారము పూర్వయుగములయందేకాని యీయుగమునందు లేదని బాలుఁడైనను దెలిసికొనును. పూర్వయుగములయందు సహితము పునర్భూవివాహము మను యాజ్ఞవల్క్యాదులచే నంగీకరింపఁబడియే యున్నదని పూర్వోదాహృత మైన "యా పత్యా వా పరిత్యక్తా" యను మనువచనమువలనను, "అక్షతా చ క్షతా చైవ" యను యాజ్ఞవల్క్య వచనమువలనను, "యా చ క్లీబం పతిత మున్మత్తం వా పతి ముత్సృజ్య అన్యం పతిం విన్దతే వా సా పునర్భూ భవతి" యను వసిష్ఠవచనమువలనను, స్పష్టపడుచునే యున్నది. పునర్భూ సంతానమును క్రమమయినదే యనుటకును, పౌనర్భవులు దాయార్హులును పిండదానార్హులు ననుటకును మను, యాజ్ఞవల్క్య స్మృతులనుండి ప్రమాణములను గనఁబఱిచెదను. ద్వాదశవిధ పుత్రులను జెప్పిన తరువాత—

క్షేత్రజాదీన్ సుతా నేతా నేకాదశ యథోదితాన్ ।
పుత్ర ప్రతినిధీ నాహుః క్రియాలోపా న్మనీషిణః ॥

పరలోకక్రియలు లోపించునపుడు క్షేత్రజాదులగు పదునొకండుగురు పుత్రులను వరుసగా పుత్రప్రతినిధులనుగా పెద్దలు చెప్పిరనియు,-

శ్రేయస శ్ర్శేయసో లాభే పాపీయా న్రిక్థ మర్హతి ।
బహవ శ్చేత్తు సదృశా స్సర్వే రిక్థస్య భాగినః ॥

ఔరసాది పుత్రులలో మొదటితరగతివారు లేనపుడు వరుసగా తరువాతి తరగతివారు దాయమును పొందుదురనియు వారు పలువురున్న యెడల సమానభాగములను పొందుదురనియు మనువును,-

పిండదోంశహర శ్చైషాం పూర్వాభావే పరఃపరః ।

పూర్వపువారు లేనపుడు తరువాతివారు క్రమముగా పిండప్రదానమునకును దాయమునకును అర్హులగుదురని యాజ్ఞవల్క్యుఁడును, పౌనర్భవులు పిండప్రదాన దాయహరణ పాత్రులని చెప్పియున్నారు. పరాశరులవారీయుగమున రెండవమారు వివాహమాడిన స్త్రీలసంతానమునకు పౌనర్భవులను నామము తీసివేసి వారి నౌరసులనుగానే చెప్పియున్నాఁడు; పునర్వివాహము చేసికొను స్త్రీలకును ఈయుగమున పునర్భూ సంజ్ఞ లేదు. పూర్వయుగములయందువలె వారించుకయైనను తక్కువవారుగా నెంచఁబడక ప్రథమవివాహమాడిన భార్యతోను, అట్టి భార్యవలనఁ గలిగిన సంతానముతోను సమానముగా గౌరవింపఁబడవలయుననియే పరాశరుల తాత్పర్యము.

"ఔరసః క్షేత్రజ శ్చైవ దత్తః కృత్రిమక స్సుతః."

అని పరాశరుఁడు కలియుగమున నాలుగువిధములయిన పుత్రులను మాత్రమే యంగీకరించియున్నాఁడు. స్వక్షేత్రజుఁడే యౌరసుఁడని యర్థముచేసి పరాశరునిమతమున మూఁడువిధములయిన పుత్రులే

కలరని కొందఱు చెప్పియున్నారు. ఈదేశమునం దౌరసపుత్రుఁడును, దత్తపుత్రుఁడును మాత్రమే యంగీకరింపఁబడుచున్నను, కాశీ మొదలగు స్థలములయందలివారు కృత్రిమకసుతుని గూడ సంగీకరించుచున్నారు. దీనిని విచారించియే నందపండితుఁడు దత్తకమీమాంసయందు,—

"దత్తపదం కృత్రిమస్యా ప్యుపలక్షణం, ఔరసః క్షేత్రజ శ్చైవ దత్తః కృత్రిమక స్సుత ఇతి కలిధర్మప్రస్తావే పరాశరస్మరణాత్"

అని కృత్రిమపుత్రునిగూడ కలియుగమునందు గ్రహించి యున్నాఁడు. పరాశరస్మృతి ననుసరించియే కలియుగమునం దర్జునుఁడు మృతభర్తృకయైన యులూచిని వివాహము చేసికొనియున్నాఁడు. ఈ క్రింద నుదహరించిన భారతశ్లోకములవలన ఉలూచి క్రమమయిన భార్యగా నెంచబడుటయు, ఆమెవలన నర్జునునకుఁ గలిగిన పుత్రుఁ డౌరసుఁడనియె చెప్పఁబడుటయు, సులభముగాఁ దెలిసికోవచ్చును:—

అర్జునస్యాత్మజ శ్శ్రీమా న్నిరావా న్నామ వీర్యవాన్
సుతాయా నాగరాజస్య జాతః పార్థేన ధీమతా
ఐరావతేన సా దత్తా హ్యనపత్యా మహాత్మనా
పత్యౌ హతే సుపర్ణేన కృపణా దీనచేతసా
భార్యార్థం తాం చ జగ్రాహ పార్థః కామవశానుగాం
అహన న్నర్జున శ్చాపి నిహతం పుత్ర మౌరసం
జఘాన సమరే శూరాన్ రాజ్ఞ స్తాన్ భీష్మరక్షిణః.

అర్జునుఁడు కలియుగములోని వాఁడాయని సందేహము తోఁచినవారు యుధిష్ఠిరశకసంవత్సరములను దెలిసికొందురేని సంశయ నివారణముం జెందగలరు. మఱియును రాజతరంగిణియందు,-

శతేషు షట్సు సార్థేషు త్ర్యధికేషు చ భూతలే
కలౌ గతేషు వర్షాణా మభవన్ కురుపాండవాః॥

కలియుగమునం దాఱువందల యేఁబదిమూఁడు సంవత్సరములయిన తరువాత కురుపాండవు లున్నారని స్పష్టముగాఁ జెప్పఁబడి యున్నది. అద్దేపల్లి కృష్ణశాస్త్రులుగారు చదివిన ఖండనగ్రంథములో,—

స నాగలోకే సంవృద్ధో మాత్రా చ పరిరక్షితః।
పితృవ్యేణ పరిత్యక్తః (పార్థద్వేషా ద్దురాత్మనా॥)

అను భారతశ్లోకములోని మొదటి మూఁడు పాదములు మాత్రము వ్రాసి "పార్థద్వేషా ద్దురాత్మనా" యను నాలవపాదమును విడిచిపెట్టి, ఇరావంతుఁడును దల్లియు జాతిబహిష్కృతులుగాఁ జేయఁబడిరనియు, తండ్రిచేత విడిచిపెట్టఁబడియె; అతఁడు నాగలోకమునందు పెరిగెననియు, 'మాత్రా చ పరిరక్షిత' యనుటచే మాతామహాది బంధువులచేఁగూడ విడువఁబడినట్లు కనఁబడుచున్నదనియు, పితృవ్యులచే విడువఁబడుట స్పష్టముగానే చెప్పఁబడి యున్నదనియు, స్వకపోలకల్పితములైన కొన్నియూహలనుజేర్చి, ఆయుపన్యాసకులు మోసముచేసి గెలుపుగొనుటకుఁ బ్రయత్నించిరి. కాని పూర్వోదాహృత శ్లోకములోని నాలవచరణమువల్లఁ బినతండ్రి దుర్మార్గముగా పార్థునియెడఁ గల ద్వేషముచేతనే యిరావంతుని విడిచిపెట్టెను గాని మఱియొక కారణముచేత కాదనియు, 'మాత్రా చ' యని చకారమును బ్రయోగించుటచే తల్లి మొదలగు బంధువులచేఁ బెంపఁబడినాఁడనియు, తల్లి పుట్టినింట నున్నది గనుకనే నాగలోకమునందుఁ బెరిగినాఁడనియుఁ దేటపడి వారు విఫలమనోరథులయిరి. ఈ వివాహము కర్మభూమియైన భరతఖండమునందు జరగక నాగలోకమునందు జరిగినది గనుక దృష్టాంతముగాఁ దీసికొని రాఁగూడదని కొందఱనిరి; కాని యట్లుచెప్పు వా రీకాలము

నం దెవ్వరైన నితరదేశమునకుఁ బోయి విధవను వివాహమాడి వచ్చి నచో నంగీకరింతురాయని యడిగినప్పుడు నిరుత్తరులౌదురు.

స్మృతులలో కన్యకకే వివాహము చేయవలసిన దని యుండుట చేతను, వివాహమంత్రములలో కన్యాశబ్దమే కనఁబడుచుండుటచేతను, కన్యావివాహముమాత్రమే చేయవలయును గాని విధవావివాహము చేయఁగూడదని కొందఱాక్షేపించిరి. పూర్వోక్తమయిన "విధవా యా భవేత్కన్యా" యను పరాశరవచనమునుబట్టి విధవకు సహితము కన్యా వ్యవహారము కలదుగాన, కన్యయే దానయోగ్యురాలను స్మృతులును వివాహమంత్రములును మృతభర్తృకకు సహితము పనికివచ్చును. కన్యాశబ్ద మొకవేళ నవివాహితలకే చెల్లవలయు నన్నను,-

శ్లో॥ అవిప్లుతబ్రహ్మచర్యో లక్షణ్యాం స్త్రియ ముద్వహేత్ ।
అనన్యపూర్వికాం కాంతా మసపిండాం యవీయసీమ్ ॥

అస్ఖలితబ్రహ్మచారి లక్షణవంతురాలును పరపూర్వకానిదియు మనోహరురాలును అసపిండురాలును వయస్సుచేఁ జిన్నదియు నైన స్త్రీని వివాహమాడవలయునని యాజ్ఞవల్క్యుఁడు విధించినట్లే,—

"శ్రుతిశీలినే విజ్ఞాయ బ్రహ్మచారిణేఽర్థినే దేయా"

వేదాభ్యాసము చేసినట్టియు సదాచారసంపన్నుఁడును జ్ఞానవంతుఁడును బ్రహ్మచారియు నైన వరునకే కన్య నీయవలయునని బోధాయనులును చెప్పియున్నారు. వీరిట్లు సామాన్యముగాఁ జెప్పినంతమాత్రమున బ్రహ్మచారులు కాని పురుషులకు వివాహము కూడదని కాని, కన్యలు కాని స్త్రీలకు వివాహము కూడదని కాని చెప్ప వల్లకాదు. ఇవి సామాన్య విధులగుటచేత విశేషవిధులనుబట్టి పురుషుల కెట్లో యట్లే స్త్రీలకును పునర్వివాహము చేయవచ్చును. పూర్వోదాహృతమయిన మనువచనమునుబట్టి యనన్యపూర్విక యనుచోఁ బతి యుండఁగా

నతనిని విడిచిపెట్టి మఱియొకనిని బొందు స్త్రీ యని యైనను జెప్ప వచ్చును. పురుషుని ద్వితీయవివాహమునకువలెనే స్త్రీల ద్వితీయవివాహమునకును వివాహమంత్రము లిప్పు డున్నట్టుగానే పనికివచ్చును. పురుషుని ద్వితీయవివాహమునందును "స్నాతకాయ కన్యార్థినే తుభ్య మహం సంప్రదదే" యనియే దానవాక్యములో స్నాతకున కిచ్చునట్లు చెప్పఁబడి యున్నది. ఒకసారి భార్య పోయినవాఁ డెప్పుడును స్నాతకుఁడు కానేరఁడుగదా? విధవ కన్యయైనను గావచ్చునుగాని విధురుఁ డెప్పుడును స్నాతకుఁడు కానేరఁడు. వివాహమంత్రములలో విధురునకు స్నాతకశబ్ద ముపయోగింపఁబడునపుడు, విధవకుఁ గన్యాశబ్దము నుపయోగించుటవలనను బాధక మేమియు లేదు.

ఒకసారి యియ్యఁబడిన కన్య మగల నియ్యఁబడఁగూడ దనియు, కన్యాదానమాత్రమున జనకునకు పుత్రికయందుఁ గల స్వత్వ మంతరించును గాన మరల నిచ్చుట కధికార ముండదనియు, కొందఱు వాదింతురు. స్త్రీపునర్వివాహమునకు విధు లెవ్వి యున్నవో యప్పుడే యియ్యఁబడిన కన్య మరల నియ్యఁబడవచ్చు నని శాస్త్రసిద్ధాంతమనియు, కన్యకవిషయమయిన స్వత్వము లేనివారు సహితము కన్యాదానము చేయవచ్చునని శాస్త్ర మంగీకరించుచున్నందున కన్యాదానము వధూవరు లిద్దఱును యావజ్జీవము పరస్పరసౌఖ్యము నిమిత్తము కలిసియుండుటకై యేర్పడిన వివాహబంధము యొక్క పూర్వాంగమే కాని దాత కన్యయెడఁ గల తన స్వత్వమును వదలుకొని యచేతనపదార్థమువలెఁ బ్రతిగ్రహీత తన మనసువచ్చినట్టు చేసికొనుటకై యిచ్చుట కాదనియు, వెనుకనే వ్రాసియున్నాను. కన్యాదానమాత్రమున జనకునికి దుహితయందుఁ గల స్వత్వము నశింపదనుటకుఁ బెక్కునిదర్శనములు గలవు. తక్కిన సమస్తదానములయందును

"సంప్రదదే న మమ" ఈ వస్తువు నీ కిచ్చుచున్నా నిఁక నాది కాదని యుండఁగా కన్యాదానమునందు మాత్రము "న మమ" నాది కాదను మాట లేకపోవుటయు, కన్యాదాన మాత్రముచేతనే కన్య మగని యధీనురాలు గాక యుక్తవయస్సు వచ్చు పర్యంతము జనకుని యింటనే యుండుటయు, దానమాత్రముచేతనే పుత్రికాత్వము పోక జనకుని పౌత్రునకుఁ బుత్రికయు నామెపుత్రులును కర్తలగుటయు, విధవయగు స్త్రీకి పరాశరుఁడు పితృగృహనివాసమును విధించుటయు, దుహిత విషయమైన స్వత్వము తండ్రికిఁ గన్యాదాన మాత్రమున పోవదను టకుఁ జాలిన నిదర్శనములుగా నుండవచ్చును. అచేతన పదార్థములను రాజు దానము చేసినపుడు సహితము ప్రతిగ్రహీతయుఁ దద్వంశము వారును నశింతురేని దాని స్వత్వము మరల రాజునకే వచ్చుచున్నది. వివాహమాత్రమున జనకునకుఁ బుత్రికయెడఁ గలుగు స్వత్వము నశింపదు గనుకనే, అర్జున వివాహమునం దులూచిని తండ్రియైన యైరావతుఁడే మరల దానముచేసియున్నాఁడు. "ఐరావతేన సా దత్తా" యను భారతవచనమునుబట్టి యీ సంగతి యెల్లరకును దెలిసియే యున్నది.

దమయంతీ పునస్స్వయంవరము మిష చేఁ గల్పింపఁబడినది గాని నిజముగా జరుగలేదు గనుక దానిని దృష్టాంతముగా పుచ్చుకో గూడదనియు, ఋతుపర్ణుఁడొక్కఁడు తప్ప ఇతరరాజు లెవ్వరును రాలే దనియు, నలుఁడు ధర్మవిరుద్ధమైనపని చేసినందునకై దమయంతిని దూషించినాఁడనియు, ప్రతిపక్షులు చెప్పిరి. దమయంతీ పునస్స్వయం వరమును నేను జెప్పుట పూర్వకాలమునందు స్త్రీపునర్వివాహ మాచ రించెడి యాచారమున్నదని కనబఱుచుటకే కాని దమయంతి ద్వితీయ వరుని బెండ్లియాడె ననియు, దురుద్దేశముతోనే యామె సమాచ

రము పంపెననియుఁ జూపుటకుఁగాదు. ఆకాలమున స్త్రీలకు రెండవ వివాహము చేసెడి యాచారమే లేనిపక్షమున, రాజర్షియైన ఋతుపర్ణుఁ డయోధ్యనుండి యామెను జేపట్టవలెనని వచ్చుటయే సంభవింపకపోయి యుండును; పతివ్రతాతిలకమయిన దమయంతియు నామెతండ్రియు నధర్మమైన పనికై రమ్మని వర్తమానమును బంపకయు నుందురు. అందఱును పునస్స్వయంవరమునకు రాకపోవుటకుం గలకారణము వారు పిలువఁబడకపోవుటయేకాని దోషమను తలంపు కాదు. దమయంతి సుదేవునిఁ బంపునప్పు డాతనితో,-

> అస్థాస్యతి పునర్భైమీ దమయంతీ స్వయంవరమ్
> తత్ర గచ్ఛంతి రాజానో రాజపుత్రా శ్చ సర్వశః.

"దమయంతి ద్వితీయస్వయంవరంబు రచియింపఁబోయిన నందులకు భూవలయంబునంగల రాజులెల్లను బోయెద" రని ఋతుపర్ణునకుం జెప్పుమనియే పలికెను. నలుఁడావార్తను విన్నప్పుడును,-

> మమ శోకేన సంవిగ్నా నైరాశ్యా త్తనుమధ్యమా
> నైవం సా కర్హిచి త్కుర్యా త్సాపత్యా చ విశేషతః.

"సాధ్వి నాకుఁ గూర్చి సంతతి కలయది చెలువ యిట్టులేల చేయు" నని దమయంతి ద్వితీయవివాహమును జేసికొనకపోవుటకుఁ దనయెడలఁ గల ప్రేమయును సంతతి కలిగియుండుటయునే కారణములుగా గణించుకొన్నాఁడు గాని యీకార్య మధర్మమయినదని యించుకయు నెంచుకోలేదు. అతఁడు దమయంతిని జూచి కోపముతోఁ బలుకు నప్పుడును,-

> కథం ను నారీ భర్తార మనువర్త మనువ్రతమ్
> ఉత్సృజ్య వరయే దన్యం యథా త్వం భీరు కర్హిచిత్.
> దూతా శ్చరంతి పృథివీం కృత్స్నాం నృపతిశాసనాత్

భైమీ కిల స్మ భర్తారం ద్వితీయం వరయిష్యతి
స్వైరవృత్తా యథాకామ మనురూప మివాత్మనః.

అనురక్తుఁడును ననువ్రతుఁడును నైన భర్తను వదలి యన్యుని వరియించుట తగునా యనియు, రాజాజ్ఞ వలన దూతలు దమయంతి రెండవ పెండ్లి యాడునని చెప్పుటకయి తిరుగుచున్నారనియు, స్వైరిణివిధమున నిట్లు చేయుట యర్హమా ? యనియు నిష్ఠురోక్తులాడెనే కాని శాస్త్రవిరుద్ధమయిన పనిని జేయుచున్నావని దోషారోపణము చేయ గలిగినవాఁడు కాఁడు. దీనినిబట్టి పూర్వము స్త్రీలు పునర్వివాహమును జేసికొనెడి యాచారమున్నట్లు తేటపడుచునే యున్నది.

ఇఁక దాయవిషయమయి యెక్కడనైనను విధులున్నవా యని కొందఱు శంకింతురు. స్త్రీకి ద్వితీయభర్తవలనఁ గలిగిన పుత్రులు పూర్వయుగమునందు పౌనర్భవులని పేర్కొనఁబడి, అట్టివారికి వచ్చు దాయముయొక్క వివరణము మను యాజ్ఞవల్క్య స్మృతులయందుఁ గనఁబడుచున్నను, ఆ విధు లీయుగమున కెంతమాత్రమును చెల్లుబడి కావు; పరాశరులవారు స్త్రీకి ద్వితీయభర్తవలనఁ బుట్టిన సుతులను గూడ నౌరసులనుగానే చెప్పినందున, ఈ యుగమున వారికిఁ బ్రథమ వివాహమునందుఁ బుట్టిన వారివలెనే దాయము వచ్చును. దొరతనము వారు విధవాపునర్వివాహశాసనమును జేసి దానియందు స్త్రీల యొక్క దాయనిర్ణయమును జేసియున్నందున, అందునకు విరుద్ధముగా మన ధర్మశాస్త్రమునం దేమున్నను చెల్లనే చెల్లదు. ఆ శాసనము యొక్క రెండవ ప్రకరణమునందు "భరణరూపమునఁగాని" భర్తకైనను అతని వంశజులకైనను వచ్చు దాయరూపమునఁగాని, పునర్వివాహము చేసికొనుటకు స్పష్టముగా ననుజ్ఞ యియ్యక దానవిక్రయముల కధికారము లేకుండ జీవితకాలమునం దనుభవించుటకు మా

ర్త్రమే మరణశాసనమువలనఁ జెందఁజేసెడునట్టి గాని, మృతుఁడయిన భర్తయొక్క సొత్తునందలి స్వత్వమును సంబంధమును పునర్వివాహ మయినతోడనే యామెను విడిచిపోయి, యామె మృతినొందినప్పు డేలాగుననో యదేప్రకారముగా నామె పూర్వభర్తయొక్క బాధ్యు లకుగాని యామె మరణానంతరము సొత్తునకుఁ గర్తలు కాఁదగినవా రికిఁగాని చెందు” నని విధింపఁబడియున్నది. దీనినిబట్టి చూడగాఁ బునర్వివాహమాడు స్త్రీయొక్క నగలు మొదలయిన స్త్రీధనమును చరరూపకమయిన సొత్తును తప్ప తక్కిన స్థిరరూపకమయిన పూర్వ భర్తయొక్క వసతి మొదలగునవి యన్నియు నాతని జ్ఞాతులకే చేరు నని విదితమగుచున్నది.

అస్మద్దేశీయులగు దయార్ద్రహృదయులారా! సమస్తసద్గుణ హారావళికిని దయయే నాయకమణియని మీరందఱు నెఱిఁగియే యున్నారుగదా? ఈశ్వరునియొక్క సమస్తకళ్యాణగుణములకును దయయే శిరోభూషణమై సృష్టియం దెల్లెడలను బ్రకాశించుచున్నది. లోకములోని సమస్తజీవరాసులును తమ యల్పాయుష్కాలములో నపారసుఖమును బొందుచుండుటకు భగవంతునికి వానియెడల గల నిర్హేతుకజాయమానకటాక్షము తప్ప వేఱుకారణ మేదియున్నదని మన మూహింపఁగలము? ఒకరి యాపదను జూచినపుడు దయార్ద్ర హృదయుఁడై యాపన్నివారణమునకుఁ దగిన సదుపాయమును జింతిం చువాఁ డెవఁడో వాఁడొక్కఁడే నిక్కమైన మానవుఁడు గాని, తక్కిన దయాశూన్యు లందఱును మనుష్యరూపముననున్న ఘాతుకమృగములే యగుదురు. ఎట్టి ఘాతుకమృగమయినను తన యాహారమునిమిత్తము ఇతరజాతిజంతువులను హింసించును గాని స్వజాతిమృగములను హిం సింపదు. తెలివిలేని మృగములయందు సహిత మిట్టి మేర యొకటి గన

బడుచుండఁగా జ్ఞానసంపదచే నత్యధికులయిన మనుష్యులయందు తమకు లేశమయినను మేలు లేకపోయినను వెనుకటివారు బాధ వెట్టుచువచ్చిరను హేతువునుబట్టి యనాథలైన యబలల హింసవెట్టు గుణముండుట ధర్మ మగునా ? మనము ప్రతిదినమును గరుణఁ జూపు మని సర్వకారుణ్యుఁడయిన యీశ్వరునిఁ బ్రార్థించుచు, మనము మాత్ర మట్టి కరుణనేల దిక్కుమాలిన యనాథలయందుఁ జూపరాదు ? శాస్త్రమో సమస్తవిధముల స్త్రీపునర్వివాహమును విధించుచున్నది. ఐనను శాస్త్రమునకు కుత్సితార్థములను గల్పించి యనాథలయిన స్త్రీలను సాధింపఁ గంకణము గట్టుకొన్న పండితమండలాగ్రగణ్యులును అందందు పలువు రుందురు. నిద్రపోయెడివానిని లేపవచ్చునుగాని మేలుకొన్నవానిని లేపుట శక్యము కాదు; కాఁబట్టి యట్టి పండితసత్తములను బోధించుటకు బ్రహ్మయైనను శక్తుఁడు కానేరఁడు. ఎద్దుపుండు కాకికి ముద్దు కానట్టు అనాథస్త్రీల కష్టములును వారిమనసులను గరఁగింపఁ జాలవు. ఆరంభదశయం దెంత మంచికార్యమును గాని కొందఱు దూషించుచునే యుందురు. పామరుల దూషణమును పాటిగాఁ బట్టక సాహసించి, బాల్యముననే భర్తలను పోఁగొట్టుకొన్నవారి జనకులును లోకోపకారచింత గలవారును కార్యమునకుం జొచ్చినచో నిప్పుడు దూషించువారే పిదప భూషించెడికాలము వచ్చును గాని రాకపోదు. శాస్త్రనిషిద్ధకార్య మని భ్రమపడి వివాహమును జేయుట మానుకొని, అందువలనఁ గలిగెడి ప్రత్యక్ష ఘోరపాతకములైన గర్భపాతములను శిశుహత్యలను జూచియూరకుండుట ఇహపరసుఖదాయక మగునా? కన్నబిడ్డలకు శాస్త్రీయముగా వివాహములు చేయక స్వయంకృతాపరాధమువలన వారు చెడుతెరువులం బ్రవర్తింప సన్మార్గమునం బ్రవర్తించుమార్గమును జూపక మీఁదుమిక్కిలి విటులను

జంపింపఁ జూచుట మనుష్యకృత్యమగునా? సద్వంశమున జనించిన కన్యలు ద్వితీయవివాహము లేకపోవుటచే నిల్లు విడిచి లేచిపోయి బహిరంగముగా వ్యభిచరించుచు జాతిభ్రష్ట లగుచుండఁ జూచుచు నూరకుండుట మనకు గౌరవావహ మగునా? రాజదండనమునకు వెఱచి కన్నబిడ్డలను జంపక చండాలురు మొదలగువారి కియ్యఁగా ఉత్తమజాతులయందుఁ బుట్టిన యట్టిబాలురు చండాలురై చెప్పరాని పనులను జేయుచుండఁగా జూచుట మనకు లాఘవము కాదా? ఇట్టి గణనాతీతము లయిన దుష్కృత్యముల కొడిగట్టుటకంటె సమస్తదోష నివారకమును శాస్త్రీయము నైన వివాహమునే చేయరాదా? ఓ జనులారా! భగవంతుఁడు మనకు జ్ఞానమును దయచేసియున్నందుకు దానిని సార్థక పఱచి, లోకముయొక్క మేలును జింతించి ప్రస్తుతమున రజస్వల కాకమునుపు భర్తలను పోఁగొట్టుకొన్న స్త్రీలకయినను పునర్వివాహమున కనుజ్ఞనియ్య మిక్కిలి ప్రార్థించుచున్నాను. మీకట్టి సద్బుద్ధి నుదయింపఁజేయుటకయి కరుణానిధియైన పరమేశ్వరుని త్రికరణశుద్ధిగాఁ బ్రార్థించి, ఇప్పటి కీవిషయము నింతటిలో విరమించుచున్నాను.

స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము

By

K. VEERESA LINGAM

స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము

ఉపోద్ఘాతము.

సువివేకులారా !

ఇప్పు డిక్కడ స్త్రీపునర్వివాహవిషయకమయిన చర్చ విశేషముగా జరుగుచున్నందున సత్యమును తెలిసికొనుటయం దిష్టముగల వారి యుపయోగమునిమిత్తమయి యీ విషయమునఁ గల శాస్త్రసంబంధమయిన సాధక బాధకములను పూర్ణముగా తెలుపవలసియేయున్నను, అట్టిపని చేయుట కిప్పు డవకాశము చాలదు గనుక సంగ్రహముగా నేనీ యుపన్యాసమును జేయుచున్నాను. మన దేశములో స్త్రీపునర్వివాహ మాచారములో లేకపోవుటవలన బాలవితంతువులలో సాధారణముగా నడుచుచున్న హేయమయిన వ్యభిచారమును, కామోద్రేకముచేత జాతిగుణవివేచనము లేక వితంతువులు పరపురుషులతోఁ జేయు జారత్వమును, మానవంతులగు బంధువుల కంటఁ బడ్డప్పుడు కోపావేశముచేత ననివార్యముగా సంభవించు నరహత్యలు మొదలగు ఘోరకృత్యములును, వ్యభిచారమును మరగిన వితంతువులు ఉపపతుల నిమిత్తమునఁ జేయు దుర్వ్యయములును, అట్టి యనాథయువతులు తమకు తోడుగా నుండుటకయి మగఁడుగల భార్యలనుగూడ వ్యభిచారమునకు దింపఁగా వారిభర్తలు మొదలయిన వారికిఁ గలిగెడి యవమానమనఃఖేదములును, ఇంటఁగల నిర్బంధములకు తాళఁజాలక కామప్రేరణచేత వీధి కెక్కి నీచులగు విటపురుషులతోడ బాలవితంతువులు లేచిపోయినప్పుడు బంధువర్గమునకుఁ గలుగు తలవంపు

లును, వితంతువుల వ్యభిచారమునకు ఫలముగా గర్భము నిలిచి నప్పుడు జరపఁబడు గర్భస్రావములు, భ్రూణహత్యలు, శిశుహత్యలు మొదలగు దారుణకృత్యములును అనేకములు కలవు. అట్టి క్రూరకృత్యములు రాజకీయాధికారులకుఁ దెలిసి వానితో సంబంధించినవారినెల్ల రచ్చకీడ్చినప్పుడు నిర్దోషులకు సహితము ప్రాప్తములగు శిక్షలును, మానభంగములును, ముసలివాండ్రుసహిత మిరువురను మువ్వురను బాలికలనే వివాహమాడుచుండుటవలనను, బాల్యముననే భర్తలను పోగొట్టుకొన్న చిన్నకన్నియలు సహితము వివాహమున కక్కఱకురాక వ్యర్థురాండ్రగుచుండుటవలనను కన్నియలకు కఱవువచ్చి, ధనపిశాచగ్రస్తులైన జనకులు నరమాంసవిక్రయమునకు వెఱవక వందలకొలఁది రూప్యములను స్వీకరించి తమ ముద్దుకూతులను వృద్ధవిగ్రహములకు వివాహవ్యాజమున బలి పెట్టుచుండుటచే ప్రబలుచుండు కన్యాశుల్కమును, వ్యభిచరించి శిశువులను చంప చేతులాడక కులమువారికి వెఱచి దయార్ద్రహృదయముగల బాలవితంతువులు వారిని విజనప్రదేశమునఁ బాఱవేయఁగా మాలమాదిగలు వారి నెత్తి పెంచి బ్రాహ్మణాద్యుత్తమవంశసంభవులయిన యా బాలకులను పరమ నీచములయిన పనులయందు నియోగించినప్పుడు చూడెడి జనస్త్రీప్రభృతులకు గలిగెడు మనఃపరితాపమును, వివాహమనఁగా నెట్టిదో యెఱుఁగని యజ్ఞానదశయందే పతులు పరలోకగతులుకాఁగా శోకసముద్రమున మునిఁగి పెద్దపెట్టున నేడ్చుచుండు జననీజనకులచెంతకుఁ బోయి పసిబాలికలు దుఃఖకారణమును దెలిసికోలేక యెఱుఁగని ప్రశ్నలు వేయునప్పుడు తల్లిదండ్రులకు మాత్రమేకాక కన్నవారికిని విన్నవారికినిఁగూడ గలిగెడి గుండెలవిసెడి సంతాపమును, చెడునడతలు ప్రవేశింప సాధ్వులు సహితము తోడి పడఁతులు కని పెంచుచున్నప్పుడును, సరివారు ముద్దు

లను ముచ్చటలను ననుభవించు చున్నప్పుడును, వృద్ధులగు తల్లిదం
డ్రులు కూడ గదులలో పట్టెమంచములమీఁద రాత్రులు సుఖముగా
శయనించుచుండఁగా తా మొంటిగా గుమ్మములవద్దను పంచను జేరి,
కటికినేలను బరుండి, వా రనుభవించు సుఖమును తమ దురవస్థను తలం
చుకొను నప్పుడును పొందు వ్యాకులభావమును, తమ కడుపునఁ బుట్టిన
బాలికలు పసితనములోనే విధవలయి తిన్నని బట్టయు కడుపునిండ
రెండుపూటలు తిన్నంత యన్నము నైన నెఱుఁగక తలలు గొఱిగించు
కొని విరూపురాండ్రయి యింటిపని యంతయుఁ జేయుచుండియు నెల్ల
వారిచే రోతమాటలు పడుచు నెడతెగని దుఃఖము ననుభవించుచుం
డఁగా చూడలేక శోకించు తల్లిదండ్రుల మనోవేదనయు, ఇటువంటివే
యనంతము లయిన యితర దుఃఖ విషయములును, ప్రతిదినమును ప్రత్య
క్షమునఁ గనఁబడినప్పుడు దయ యెట్టిదో యెఱుఁగని కిరాతునివంటి
వానికి సహితము మనసు కరఁగి యీ దురాచారమును మాన్పింప
వలె నని పలుమాఱు మనసులో నూహ పుట్టియు దుర్లంఘ్యము
లయిన శ్రుతిస్మృతులేమో యీ విషయమున క్రౌర్యమును వహించు
చున్న వని యాచారపిశాచ ప్రేరణమున నొక భ్రమ పొంది, నిరాశను
జెంది యూరకుండవలసిన గతి సంభవింపక మానదు. కాఁబట్టి తాము
చేసెడి యెల్లపనులను శాస్త్రానుగుణ్యముగానే నడపవలయు నను నియ
మము గల హిందువులను పూర్వాచారమునుండి మరలించుట కయి
శాస్త్రప్రమాణములు మాత్రమే కావలసి యుండును గాని యుక్తు
లును, లోకనిదర్శనములును నావశ్యకములు కావు. ఇట్టి విషయముల
యం దొక సిద్ధాంతము నేర్పఱుచుకొనుటకు ప్రమాణములు కొందఱు
శ్రుతి స్మృతి పురాణము లనియు కొందఱు శ్రుతి స్మృతి శిష్టాచారము
లనియు నిర్ణయించి యున్నారు.

శ్లో. య దదృష్టం హి వేదేషు త ద్ద్రష్టవ్యం స్మృతౌ కిల
ఉభాభ్యాం య దదృష్టస్తు త త్పురాణేషు పఠ్యతే.

వేదములయం దేది కనఁబడదో యది స్మృతులయందుఁ జూడఁబడఁ దగిన దనియు, ఆ రెంటియందును కనఁబడనిది పురాణముల యందుఁ జెప్పఁబడు ననియు, ఆపస్తంబస్మృతి యందును,—

శ్లో. ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం ప్రథమం శ్రుతిః
ద్వితీయం ధర్మశాస్త్రం తు తృతీయో లోకసంగ్రహః.

ధర్మజిజ్ఞాసముఁ జేయు వారికి మొదటి ప్రమాణము శ్రుతి యనియు, రెండవ ప్రమాణము స్మృతి యనియు, మూడవ ప్రమాణము లోకాచార మనియు భారతానుశాసనిక పర్వమునందును జెప్పఁబడి యున్నది. పురాణాచారముల విషయ మయి భిన్నాభిప్రాయము కలిగి యున్నను, శ్రుతిస్మృతులు పరమప్రమాణము లనుటమాత్రము నిర్వివాదాంశము.

శ్లో. శ్రుతిస్మృతిపురాణేషు విరుద్ధేషు పరస్పరం
పూర్వం పూర్వం బలీయం స్యా దితి న్యాయవిదో విదుః.

శ్రుతిస్మృతి పురాణములలో పరస్పరవిరోధము సంభవించి నప్పుడు పురాణమునకంటె స్మృతియు, స్మృతికంటె శ్రుతియు బలీయములని యాపస్తంబుఁడు చెప్పి యున్నాఁడు. శ్రుతులలోఁ గాని, స్మృతులలోఁ గాని విరోధవచనములు కనఁబడినప్పు డవి యన్నియు సమన్వయించున ట్లర్థము చేయవలయుననియు, అవి యేవిధముచేతను సమన్వయించనప్పుడు ధర్మము వికల్పముగాఁ జెల్లు ననియు, వేదార్థమును వ్యాకరణాది షడంగముల ననుసరించియే చేయవలయు ననియు, స్మృతులలో చతుర్యుగసాధారణ స్మృతులకంటె నా యా యుగస్మృతు

లాయా యుగములయందు బలవత్తరము లనియు, పదముల కర్థమును జేయునప్పుడు విశేషబాధకము వచ్చినప్పుడు తప్ప యౌగికార్థమును గ్రహింపఁ గూడదనియు, నిఘంటువులయందుఁ గనుపట్టు రూఢార్థమునే గ్రహింపవలయుననియు, శాస్త్రములయందలి పారిభాషికములయిన పదములను పారిభాషికములయిన యర్థములయందే గ్రహింపవలెననియు, విశేషవిధులున్న స్థలములయందు సామాన్యవిధులు ప్రవర్తింపవనియు, వ్యాఖ్యానము లెప్పుడును స్వతంత్రప్రమాణములు కావనియు, మన పూర్వులు నియమములు చేసియున్నారు. ఈ నియమములతోనే వరుసగా స్త్రీపునర్వివాహమునకు సాధకబాధకములుగా నుండు శ్రుతిస్మృతిపురాణవచనముల నుదహరించుచు, వానియర్థనిర్ణయమును జేయుటకుఁ బ్రయత్నించెదను.

శ్రుతి ప్రమాణములు.

మొట్టమొదట శ్రుతి ప్రమాణములను గూర్చి విచారింతము. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వవేదము అని శ్రుతి నాలుగుభాగములు గలది.

౧. ఉదీర్ష్వ నా ర్యభి జీవలోక మితాసు మేత ముపశేష ఏహి
హ స్తగ్రాభస్య దిధిషో స్త్వ మేతత్పత్యు ర్జనిత్వ మభిసంబభూవ.

ఓ నారీ! చచ్చియున్న యీ పెనిమిటియొద్ద పడియున్నావు; బ్రతికియున్నవారిని జూచి లేచిరా; పాణిగ్రాహకుఁడును వితంతువును వివాహమాడ నిచ్ఛగలవాఁడుచు నగుభర్తకు భార్యవు కమ్ము. అని యీ శ్రుత్యర్థము.

ఈ శ్రుతి యజుర్వేద తైత్తిరీయారణ్యకములోని యాఱవ ప్రపాఠకమునందలి పదునాలవ యనువాకము. ఇది వేదమునందు మృత్యుఁడ

యున యాహితాగ్ని బ్రాహ్మణుని భార్యను గూర్చి చెప్పఁబడిన వాక్యము. 'ఇయం నారీ' యను మంత్రప్రకారముగా మృతభర్తృక పెనిమిటి శవమునొద్ద పడియుండఁగా బంధువు లీ మంత్రమును జెప్పి యామెను లేవఁదీసికొని వత్తురు. సంతానమున్నను, లేకపోయినను, ఆహితాగ్ని బ్రాహ్మణుని భార్యవంటిదానికే వేదము పునర్వివాహమును విధించుచున్నప్పుడు బాల వితంతువులకు వివాహము విధించు ననుట నిరాక్షేపము కాదా ? పితృమేధమునందలి యీ మంత్రమును సహగమనము చేయని స్త్రీలయొద్దనే చదివి లేవఁదీయవలెనని విధులు గలవు. కల్ప సూత్రములలో నొకటగు భారద్వాజ సూత్రము "తాం ప్రతీత్థ ఏకధనే నోత్థాపయ త్యన్యో వా బ్రాహ్మణ ఉదీర్ష్వనారీతి" యని మృతభర్తృకను మఱఁదిగాని మఱియొక బ్రాహ్మణుఁడుగాని లేవఁదీయవలయు నని విధించుచున్నది. "తాం ప్రతిగతః సవ్యేపాణా వభిపాదోత్థాపయతి" యని విద్యారణ్యులవారు భాష్యమునం దుదాహరించిన కల్పసూత్రము కుడిచేతితో పట్టుకొని లేవ నెత్తవలయు నని యొకవిశేషమును గూడ జెప్పుచున్నది.

ఈ శ్రుతియొక్క యర్థము స్త్రీ పునర్వివాహపక్షమున స్పష్టముగానే యున్నను, ఈ విషయమును మఱింత బలపఱుచుటకయి దీని పూర్వశ్రుతిని గూడ నిందుదాహరించుచున్నాను.

౨. ఇయం నారీ పతిలోకం వృణానా నిపద్యత ఉప త్వా మర్త్యప్రేతం విశ్వం పురాణ మనుపాలయంతీ తస్యై ప్రజాం ద్రవిణం చేహ దేహి. యజుర్వేదము.

ఓ మృతుఁడా ! నీభార్య నీలోకమును గోరుచు ప్రేతవగు నీయొద్ద పడియున్నది; ప్రాచీన మగు పాతివ్రత్యధర్మము ననుసరించి వర్తించుచున్నది; ఈలోకమున నీమెకొఱకు సంతానమును ధనమును కలుగు

నట్లు చేయుము—అని పై శ్రుతి కర్థము. "అత్ర పత్నీ ముపనిపాతయ తీ యం నారీతి" యను కల్పసూత్రమునుబట్టి భార్యను చచ్చిన భర్త సమీపమున పరుండబెట్టి, బంధువులు ప్రేతము నుద్దేశించి యీమంత్రమును పఠింతురు. బంధువులు ప్రేతపత్నికొఱకు (పునర్వివాహమువలన) సంతానాదికము కలుగున ట్లనుగ్రహింపవలయునని ప్రేతమును గోరుటయు పునర్వివాహము చేసికొనఁగోరువానికి భార్యవుకమ్మని ప్రేతపత్నిని గోరుటయు చూడఁగా స్త్రీపునర్వివాహము వేదవిహిత మనుట కరతలామలక మగుచున్నది. సూత్రకారు లందఱును ఐకకంఠ్యముతో పూర్వోక్తమంత్రద్వయమును పఠింపవలసినవారు మఱది మొదలగు బంధువులే యని విధించుటవలన, కర్మచేయవలసిన పుత్రులను వదలిపెట్టి తదితరులను నియమించుటచూడ పుత్రసంతానము లేనివారి విషయముననే యీ రెండుమంత్రములు వినియోగపడవలసిన ట్లూహింపదగియున్నది. అందుచేతనే పితృమేధానుక్రమణికయందు "ఏతన్మంత్రద్వయం సపుత్రకాయా నాస్తి" యను వాక్యము కనబఁడుచున్నది. దీనినిబట్టి విచారింపఁగా వేదము సంతానవతులుగూడ పునర్వివాహము చేసుకోవచ్చునని చెప్పుచున్నను, సూత్రకారులు మాత్రము సంతానములేని కాంతలకుమాత్రమే పునర్వివాహానుజ్ఞ నియ్య నుద్దేశించిన ట్లూచఁదగియున్నది.

3. యా పూర్వం పతిం విత్వాథాఽన్యం విందతే పతిం
పంచౌదనం చ తావజం దదాతో న వియోషతః. ౨౭
సమానలోకో భవతి పునర్భువా పరఃపతిః
యోఽజం పంచౌదనం దక్షిణా జ్యోతిషం దదాతి. ౨౮
అనుపూర్వవత్సాం ధేను మనడ్వాహ ముపబర్హిణం
వాసో హిరణ్యం దత్వా తే యాంతి దివ ముత్తమమ్. ౨౯

అథర్వసంహిత, ౯ కాండ, ౫ ప్రపాఠకము.

ఒకస్త్రీ మొదట నొకనిని వివాహమాడి మరల మఱియొకనిని వివాహము చేసుకొన్నయెడల, అజాపంచౌదనముచేసిన యా దంపతు లెడఁబాయకుందురనియు; దక్షిణాపూర్వకముగా నజాపంచౌదనవ్రతము జేసినయెడల పునర్భువు రెండవభర్తలోకమును పొందు ననియు, సవత్సకగోదానాదులనుజేసి వారు త్తమలోకమును పొందుదురనియు, పై శ్రుతి తాత్పర్యము. స్త్రీపునర్వివాహము నింతకన్న స్పష్టముగాఁ జెప్పు శ్రుతికి యుండనేరదు. పూర్వకాలమునందు బ్రాహ్మణులు బ్రాహ్మణేతరజాతులలోని స్త్రీలను మాత్రమేకాక, బ్రాహ్మణేతర జాతుల విధవలనుగూడి వివాహమాడుచు వచ్చిన ట్లీక్రింది యధర్వవేద వచనము చూపుచున్నది.

౮. ఉత యత్పతయో దశ స్త్రియాః పూర్వే అబ్రాహ్మణా
బ్రహ్మా చేత్ హస్త మగ్రహీత్ స ఏవ పతి రేకథా
బ్రాహ్మణ ఏవ పతి ర్న రాజన్యో న వైశ్యః తత్సూర్య
ప్రబ్రువ న్నేతి పంచభ్యో మానవేభ్యః.

అధర్వసంహిత.

ఒకస్త్రీకి మొదట బ్రాహ్మణులు కానివారు పదిమంది భర్తలయి యామెను బ్రాహ్మణుఁడు పెండ్లి చేసికొన్న పక్షమున, అతఁడే యామెకు పతికాని, రాజన్యుఁడును వైశ్యుఁడును కాఁడనియు, ఈ యర్థమునే యైదుజాతుల మానవులకును సూర్యుఁడు చాటుచు తిరుగుచున్నాఁడనియు ఈశ్రుతి బోధించుచున్నది.

౫. తస్మా దేకస్య బహ్వో జాయా భవన్తి
నైకస్యై బహవ స్సహ పతయః
ఋగ్వేదము, ఐతరేయబ్రాహ్మణము, 3 పంచిక, ౨౨ ఖండ.

"ఆ కారణమువలన నొకపురుషునకు బహుభార్య లగుదురు; ఒకస్త్రీకి 'ఏకకాలమునందు' బహుభర్తలు కారు" అని యీ శ్రుతి కర్థము. పురుషవిషయమున కాలభేదమును దెలుపు పదమును బ్రయోగింపక, స్త్రీవిషయమున నేకకాలమునందని తెలియఁజేయు "సహ" శబ్దమును బ్రయోగించుటచేతనే స్త్రీలకు భిన్నకాలములయందు వేఱు వేఱు భర్త లుండవచ్చు నన్నమాట స్పష్టమగుచున్నది. భారత వ్యాఖ్యానమునందు నీలకంఠాచార్యులవా రీశ్రుతికి "సహేతి యుగపద్బహుపతిత్వ నిషేధో నతు సమయభేదేన" యని 'సహ' యనుట వలన నేకకాలమునందు బహుపతిత్వనిషేధమే కాని కాలభేదమునందుఁ గాదని యర్థము వ్రాసియున్నారు.

౬. సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః
తృతీయో అగ్నిష్టే పతి స్తురీయ స్తే 'మనుష్యజాః.'

ఋగ్వేదము, ౧౦ మండలము, ౩ అధ్యాయము, ౮౫ సూక్తము

'నీకు సోముఁడు మొదటి భర్త; రెండవభర్త గంధర్వుఁడు; మూడవభర్త అగ్ని; నాలవభర్త నీకు మనుష్యునివలనఁ బుట్టినవాఁడు' అని యీశ్రుతి తాత్పర్యము. ఇది వివాహమంత్రములయందు వచ్చును. నీకు (స్త్రీకి) నాలవభర్త మనుష్యునివలనఁ బుట్టినవారు "మనుష్యజాః" అని బహువచనమును బ్రయోగించుటచేత స్త్రీలకు భిన్నకాలముల యందు బహుభర్త లుందురని యీ శ్రుతి సూచించుచున్నది. "తురీయః" అను విశేషణ మేకవచనమునం దుండుటచేత నొక్కకాలమునం దొక్క భర్తమాత్రమే యుండవలయుననియు "మనుష్యజాః" అని విశేష్యము బహువచనమునం దుండుటచేత నొక పతి యనంతరము మఱియొక పతి చొప్పున బహుభర్త లుందురని పారస్యము కనుపట్టుచున్నది.

౭. కుహస్విద్దోషా కుహవస్తోరశ్వినా కుహాభిపిత్వం
కరతః కుహోషతుః కోవాంశయుత్రా 'విధవేవ దేవరం'
మర్యన్నయోషా కృణుతే సదస్థ ఆ.

ఋగ్వేదము, ౮ అష్టకము.

ఈ ఋగ్వేదవచనమునందు "విధవ పాన్పునందు దేవరుని కొఱకు కనిపెట్టుకొని యున్నట్లు" అని యొక యుపమానము కనఁబడుచున్నది. వేదమునం దెక్కడను నియోగము విధింపఁబడి యుండలేదనియు, స్త్రీ మఱఁదిని వివాహమాడెడి యాచారము కనఁబడుచున్నదనియు, ఎల్లవారును నెఱిఁగి యుండవచ్చును. అందుచేతనే యీ దేవరశబ్దమునకు నిరుక్తమునందు 'ద్వితీయవరుఁడు' అని యర్థము వ్రాయఁబడి యున్నది.

నిరుక్తము—క్వస్విద్రాత్రౌ భవథః క్వ వా క్వాభిప్రాప్తిం
కురుధః క్వ వసథః। కోవాం శయనే విధవేవ దేవరం
దేవరః కస్మాద్ద్వితీయో వర ఉచ్యతే॥

ఈ శ్రుతికూడ పూర్వకాలమునందు విధవలు ద్వితీయభర్తలతో సుఖ మనుభవించుచుండుట సర్వసాధారణముగా నుండెనని చూపుట కనుకూలపడుచున్నది.

౮. అంతేకాక వేదమునం దనేకస్థలములలో దిధిషువు పేరుదాహరింపఁబడి యున్నది. "పునర్భూ దిధిషూ రూఢా ద్విస్తస్యా దిధిషుః పతిః" అను నమరకోశమువలన వివాహితయొక్క ద్వితీయభర్త దిధిషువని యెల్లవారు నెఱిఁగియుందురు. తైత్తిరీయబ్రాహ్మణమున 3 కాండ, ౪ ప్రపాఠకము, ౧ అనువాకమునందు, అరాధియను దేవతకు దిధిషువును బలిపెట్టవలసినట్టు చెప్పఁబడి యున్నది. ఆ యనువాకమునందే వేఱువేఱు దేవతలకు వరుసగా పిల్లలను, స్త్రీలను, వృద్ధులను,

వేదము చదివిన బ్రాహ్మణులను బలిపెట్టవలసినట్టుకూడఁ జెప్పఁబడి యున్నది. ఇప్పుడు చెప్పినదానివల్లను, నరమేధయాగ ముండుటవల్లను, పూర్వకాలమునందు నరబలు లుండెననుట స్పష్టము. వేదమునందు దిధిషుశబ్దము పలుచోట్ల కనఁబడుచుండుటవలన, ఆకాలమునందు పురుషులకువలెనే స్త్రీలకును పునర్వివాహములు సాధారణముగా నున్నట్టు తెలియవచ్చుచున్నది.

౯. ఋగ్వేద, ౮ అష్టకము, ౧౦ మండలము, ౧౦౯ సూక్తమునందు ఒకబ్రాహ్మణుని భార్యయగు 'జుహు' అనెడిస్త్రీ బృహస్పతికి మరల వివాహము చేయఁబడినట్టు చెప్పఁబడి యున్నది. దీనివలన వేదమునందు స్త్రీపునర్వివాహమును విధించునట్టియు సూచించునట్టియు వచనములు మాత్రమేకాక సరిగా స్త్రీ పునర్వివాహము జరిగిన నిదర్శనముకూడ స్పష్టముగాఁ గానవచ్చు చున్నది.

స్త్రీ పునర్వివాహము వేదచోదితమని చూపుట కిట్టిన్ని సాధకములు గనుపట్టుచున్నప్పుడు ప్రతిపక్షులు వేదమునుండి యొక్క బాధక వచనమునైనఁ గనఁబఱుపఁ గలుగుదురా? వారు తీసికొనివచ్చెడి దంతయు,—

యదేకస్మిన్ యూపే ద్వే రశనే పరివ్యయతి తస్మాదేకో
ద్వేజాయే విందతే । యన్నైకాగ్ం రశనాం ద్వయో
ర్యూపయోః పరివ్యయతి తస్మాన్నైకా ద్వౌ పతీ విందతే.

కృష్ణ యజుర్వేదము, ౬ కాండము, ౬ ప్రపాఠకము, ౪ అనువాకము.

ఒక యూపమునకు రెండుత్రాళ్ళను గట్టునట్లే యొకని కిద్దఱు భార్య లుందురు; ఒక త్రాడును రెండుయూపములకు కట్టకూడనట్లే ఒకస్త్రీ కిద్దఱు భర్త లుండరను నర్థమిచ్చెడి యీ యొక్క స్మృతియు తప్ప వేఱేదియుఁ గానరాదు. ఈ శ్రుతి యేకకాలమునందే స్త్రీలకు

బహుపతులను నిషేధించుచున్న దనుట కొంచె మాలోచించువారి కందఱికిని దెలియును. దీనికి వినియోజక వాక్యమైన "అగ్నిష్ఠం ద్వాభ్యాగ్ం రశనాభ్యాం పరివీయ" యను కల్పసూత్రము ఏకకాలము నందే యూపమునకు రశనాద్వయబంధమును విధించుచు నయి నిర్బంధ మేకకాలమునందు మాత్రమే యని స్పష్టపఱుచుచున్నది. దృష్టాంత మునుబట్టి చూచినను, ఒకత్రాటిని రెండు స్తంభముల కేకకాలము నందు కట్టుట యశక్యముగాని యొక స్తంభమున నున్నదానిని విప్పి మఱియొక స్తంభమునకుఁ గట్టుట యసాధ్యము కాదు. కాఁబట్టి కాలాంతరములయందు స్త్రీలకు భిన్నపతులుండుట కే యాక్షేపణ మును గనఁబడదు. పూర్వోక్తములయిన శ్రుతివచనములతో సమన్వ యించునట్లు అర్థము చేసెడి పక్షమున దీనికి మఱియొక యర్థమును గల్పించి సాధించుట కెవ్వరికిని శక్యముకాదు. అంతేకాక యీ శ్రుతి యందలి నిషేధము సామాన్యముగా నున్నది; ఉదీర్ష్వనారీత్యాది శ్రుతులు విశేషముగా మృతభర్తృకకు పునర్వివాహమును విధించు చున్నవి. కాఁబట్టి మృతభర్తృకకు తప్ప ద్వితీయభర్త యుండఁగూడ దనియైనను విశేషసామాన్యభావముచేత నీ శ్రుతి కర్థము చేయ వచ్చును. ఇంతవఱకును విచారించిన దానినిబట్టి శ్రుతులలో పరస్పర విరుద్ధములగు వచనములేవియుఁ గనఁబడ లేదు గాని, ఒకవేళ కనఁబడినను,—

శ్లో. ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః
శ్రుతి ద్వైధంతు యత్రస్యా త్తత్ర ధర్మౌ వుభౌ స్మృతౌ.

అను మనువచనమునుబట్టి శ్రుతి రెండువిధములఁ జెప్పిన యెడల వికల్పముచేత రెండును ప్రమాణములే యగును గనుక,

అప్పుడు సహిత మిష్టమున్నవారు వివాహము చేసుకోవచ్చుననియే పరమసిద్ధాంత మేర్పడును.

ధర్మనిర్ణాయక గ్రంథములలోనెల్ల నుత్కృష్ట ప్రమాణమయిన శ్రుతి సోమిదేవివఱకును స్త్రీల కందఱికిని పునర్వివాహము నంగీకరించుచున్నదనియు, అట్టి పునర్వివాహితను విడువఁగూడదనియే కాక యాదంపతులకు పుణ్యలోకము వచ్చుననికూడ తెలుపుచున్నదనియు ఇంతవఱకును వ్రాసినదాని వలన విస్పష్టముగాఁ గనబఱచియున్నాను.

చతుర్యుగ సామాన్య స్మృతి ప్రమాణములు.

స్మృతి ప్రమాణముల నుదాహరించుటకు ముందు సమస్తస్మృతులును సమానబలము కలవి యగునో కావో, కానియెడల నే స్మృతు లెప్పుడు బలవత్తరములో వివరింపవలసియున్నది.

శ్లో. అన్యే కృత యుగే ధర్మాస్త్రేతాయాం ద్వాపరే పరే
అన్యే కలియుగే నృణాం యుగ హ్రాసానురూపతః.

అను మనువచనమునుబట్టి యుగసామర్థ్య దౌర్బల్యానురూపముగా కృతయుగ ధర్మములు వేఱనియు, త్రేతాయుగ ధర్మములు వేఱనియు, ద్వాపరయుగ ధర్మములు వేఱనియు, కలియుగ ధర్మములు వేఱనియు తెలియవచ్చుచున్నది. ఇఁక నే యుగములో నే ధర్మశాస్త్రము ప్రబలమైనదో నిర్ణయింపవలయును.

శ్లో. కృతేతు మానవా ధర్మా స్త్రేతాయాం గౌతమాః స్మృతాః
ద్వాపరే శాంఖలిఖితాః కలౌ పారాశరాః స్మృతాః.

అను బృహస్పతి పరాశర వచనములవలన కృతయుగమునందు మనుస్మృతియు, త్రేతాయుగమునందు గౌతమస్మృతియు, ద్వాపరయుగమునందు శంఖస్మృతియు లిఖితస్మృతియు, కలియుగమునందు పరా

శరస్మృతియు ముఖ్యములైనవని స్పష్టపడుచున్నది. ఆయా యుగముల యందు క్రమముగా పూర్వోదాహృతములయిన స్మృతులు మాత్రమే ప్రమాణములైనచో యాజ్ఞవల్క్యాది సమస్తేతర స్మృతులును నిష్ప్రయోజనములు కావలసివచ్చునని కొందఱికి సందేహము పుట్ట వచ్చును. ఆ యుగస్మృతియందుఁ జెప్పఁబడని యంశములలో తక్కిన స్మృతులును ప్రమాణములే యగును గనుక, అన్నిటివలనను ప్రయోజనము గలదు. ఈ స్మృతులలో పరస్పరవిరోధము కలిగినప్పుడు ధర్మము వికల్పమని యాజ్ఞవల్క్యస్మృతి వ్యాఖ్యానమునందు విజ్ఞానేశ్వర యోగి నిర్ణయించియున్నాఁడు.

మ ను వు.

౧ శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

పతి దేశాంతరగమనముచేత నష్టుఁడైనప్పుడును, మృతుఁడైనప్పుడును, సన్యసించినప్పుడును, నపుంసకుడైనప్పుడును, కులభ్రష్టుడయినప్పుడును, ఈ యైదాపదలయందును స్త్రీలకు మఱియొక భర్త విధింపఁబడుచున్నాఁడు—అని పై శ్లోకార్థము. ఇది యిప్పుడు ముద్రితమైయున్న మనుస్మృతియందుఁ గనఁబడదు కాని మాధవాచార్యుని కాలమువరకు మనుస్మృతిలో నీ వచనమున్నట్టు పరాశరమాధవీయములో వివాహప్రకరణమున మాధవాచార్యులీ వచనము మనుస్మృతిలోనిదని యుదాహరించుటవలన విస్పష్టమగుచున్నది. నారదస్మృతి కూడ పై వచనము మనుస్మృతిలోనిదే యయినట్టు సాక్ష్యమిచ్చుచున్నది.

శ్లో. ప్రోషితో ధర్మకార్యార్థం ప్రతీక్ష్యోష్టౌ నర స్సమాః
విద్యార్థం షడ్యశోర్థం వా కామార్థం త్రీంతు వత్సరాన్.

అను మనుస్మృతిలోని తొమ్మిదవ యధ్యాయమునందలి యీ శ్లోకమునకు ముందు "నష్టే మృతే" యను శ్లోకము పూర్వముండి యున్నట్టూహింపఁదగియున్నది. భర్త ధర్మకార్యార్థము దేశాంతర గతుఁ డయినపక్షమున నెనిమిది సంవత్సరములును, విద్యార్థమైనయెడల నాఱుసంవత్సరములును, కీర్తికొఱకుఁగాని కామముకొఱకుఁగాని యయిన యెడల మూఁడుసంవత్సరములును ప్రతీక్షింపవలసినట్టుమాత్రము పయి శ్లోకమువలనఁ గనఁబడుచున్నది గాని తరువాత భార్య యేమి చేయవలెనో యెక్కడను గనఁబడదు. "నష్టే మృతే" యను శ్లోక మిక్కడ నున్న పక్షమున తరువాత మఱియొకనిని వివాహమాడ వలయునన్న మాట స్పష్టము. ఇందలి యెనిమిదిసంవత్సరముల మితియు భర్త నష్టుఁడయినయెడల భార్య పునర్వివాహమునకు వేచియుండ వలసిన కాలమును దెలుపు ముం దుదాహరింపఁబోయెడి నారద వచనముతో నేకీభవించుచున్నది. ఎనిమిది సంవత్సరముల తరువాత భార్య భర్తను వెదకుకొనుచు పోవలయునని కుల్లూకభట్టు వ్యాఖ్యానములో వ్రాసినాఁడుగాని, నష్టుఁడయినవాని నిమిత్తమయి యెనిమిది సంవత్సరములు వేచియుండి తరువాత వెదుకుకొనుచు వెళ్ళవలయునన్న మాట సయుక్తికము కానేరదు. "ఊర్ధ్వం భర్త్రంతర పరిగ్రహే న దోషో స్తీత్యభిప్రాయః" అని తరువాత మఱియొక భర్తను గ్రహించుట యందు దోషములేదని వ్రాసిన శ్రీనందన వ్యాఖ్యానమే యెంతయు యుక్తియుక్తమయినది.

౨ శ్లో. సా చేదక్షతయోనిః స్యాద్గతప్రత్యాగతాపి వా
పౌనర్భవేన భర్త్రా సా పునస్సంస్కార మర్హతి.

ఆ స్త్రీ (విధవయైనట్టిగాని భర్తచేత విడువఁబడినట్టిగాని స్త్రీ) వెళ్ళి మరల వచ్చిన దయినను అక్షతయోనియైనయెడల పునర్భువును

వివాహమును చేసికొనెడు భర్తచేత మరల వివాహమున కర్హురాలగు చున్నది—అని యీ మనువచనమున కర్థము. "క్షతా సంస్కారా త్ప్రాగేవ పురుష సంబంధ దూషితా" అను మితాక్షరావచనమును బట్టి పునర్వివాహమునకు మునుపే పురుషసంభోగముచేత దూషితురాలయిన స్త్రీ క్షతయనఁబడును; అట్టి పురుషసంభోగమును పొందనిది అక్షతయోని. "వైవాహికో విధిః స్త్రీణాం సంస్కారో వైదికః స్మృతః" అను మనువచనమును బట్టి స్త్రీలకు వివాహము సంస్కార మనఁబడును.

నారదుఁడు.

3. శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

ఈ శ్లోకమును నారదుఁడు మనుస్మృతి నుండియే గ్రహించి యున్నాఁడు. ఇది వాగ్దత్తాపరమని, నియోగపరమని వ్యర్థవాదములు చేయువారిని సమాధానపఱుచుటకయి దీని క్రింది శ్లోకములను గూడ సందర్భోచితముగా నిందుదాహరించుచున్నాఁడను. పయిని జెప్పఁబడిన యయిదాపదలలోను నష్టుని విషయమునందును, నపుంసకుని విషయమునందును మాత్రమే కాలనియమము కావలసియుండును.

శ్లో. అష్టౌ వర్షాణ్యపేక్షేత బ్రాహ్మణీ ప్రోషితం పతిమ్
అప్రసూతా తు చత్వారి పరతోఽన్యం సమాశ్రయేత్
క్షత్రియా షట్సమా స్తిష్ఠే దప్రసూతా సమాత్రయమ్
వైశ్యా ప్రసూతా చత్వారి ద్వే వర్షే త్వితరా వసేత్
న శూద్రాయాః స్మృతః కాల ఏవ ప్రోషితయోషితాం
జీవతి శ్రూయమాణే తు స్యాదేష ద్విగుణోవిధిః.

భర్త నష్టుఁడైనయెడల బ్రాహ్మణస్త్రీ యెనిమిదిసంవత్సరములును, సంతానము లేనియెడల నాలుగుసంవత్సరములును వేచియుండి మఱియొకనిని సమాశ్రయింపవలెననియు; క్షత్రియస్త్రీ యాఱుసంవత్సరములును, సంతానవంతురాలు కానియెడల మూఁడు సంవత్సరములును, వైశ్యస్త్రీ సంతానము కలది నాలుగు సంవత్సరములును, సంతానము లేఁది రెండుసంవత్సరములును కనిపెట్టియుండి తరువాత మఱియొకని నాశ్రయింపవలయు ననియు; శూద్రస్త్రీల కట్టి కాలనియమము లేదనియు; భర్త జీవించినవార్త తెలియవచ్చుచున్న యెడల పై కాలమునకు ద్విగుణకాలము వేచియుండవలెననియు; "నష్టే మృతే" యను శ్లోకముక్రింద నవ్యవధానముగా నున్న యీ శ్లోకములు చెప్పుచున్నవి. సంతాన మున్నవారికి నియోగము లేదు గనుకను, వాగ్దత్తలకు సంతానము గలుగుట యసందర్భము గనుకను, పయివిధి వాగ్దత్తాపరమని కాని, నియోగపరమని కాని చెప్ప వలనుపడదు. మఱియును,—

౮. శ్లో. ఈర్ష్యా దండాదయోఽన్యేచ చత్వార స్సముదాహృతాః
త్యక్తవ్యా స్తే పతితవత్ క్షతయోన్యా అపిస్త్రియా ॥
ఆక్షిప్తమోఘబీజానాం కృతేపి పతి కర్మణి
పతి రన్యః స్మృతో నార్యా వత్సరార్థం ప్రతీక్ష్య తు ॥

అను తరువాతి శ్లోకములు, ఈర్ష్యాదండాదు లగు నలుగురు నపుంసకులును క్షతయోనియైనను స్త్రీచేత పతితులవలె విడువఁదగిన వారనియు, ఆక్షిప్తమోఘబీజుల విషయములో పతికర్మ జరిగినను ఆఱుమాసములు ప్రతీక్షించి స్త్రీ మఱియొక పతిని గైకొనవచ్చు ననియు చెప్పుచున్నవి. వాగ్దత్తలకను పక్షమున వారు క్షతయోను లగుట కాని పతికర్మ జరగుటకాని సంభవింపనేరదు. నియోగ మను

పక్షమున బ్రతికియున్న మగని యనుమతి లేక పతిని పతితునివలె త్యజించి స్త్రీ స్వతంత్రించి మఱియొక పతిని చేకొనుట సంభవింపనేరదు. కాఁబట్టి "నష్టే మృతే" యనుశ్లోకము నారీ పునర్వివాహపర మనక తప్పదు.

౫. ఉద్వాహితాపి యా కన్యా నచే త్సంప్రాప్త మైథునా
పున స్సంస్కార మర్హేత యథా కన్యా తథైవ సా ॥

కన్య వివాహితురా లయినను పురుషసంభోగము పొందని దయిన పక్షమున కన్యక వలెనే పునర్వివాహమునకు యోగ్యురా లగును.

శాతాతపుఁడు.

౬. శ్లో. వరశ్చే త్కులశీలాభ్యాం నయుజ్యేత కదా చ న
న మంత్రాః కారణం తత్ర న చ కన్యానృతం భవేత్ ॥
సమాచ్ఛిద్యతు తాం కన్యాం బలా దక్షతయోనికాం
పున ర్గుణవతే దద్యా దితి శాతాతపోఽబ్రవీత్ ॥
హీనస్య కులశీలాభ్యాం హర న్కన్యాం న దోషభాక్
న మంత్రాః కారణం తత్ర నచ కన్యానృతం భవేత్॥

వరుఁడు కులశీలములచేత హీనుఁ డయినప్పుడు అక్షతయోని యైన కన్యను బలవంతముగా పుచ్చుకొని మరల గుణవంతుని కీవలయు ననియు, అట్టిచో వివాహమంత్రములు ప్రయోజనకరములు కావనియు, కన్యానృతము సంభవింప దనియు, పై వచనముల తాత్పర్యము.

వసిష్ఠుఁడు

౭ శ్లో. పాణిగ్రాహే మృతే బాలా కేవలం మంత్రసంస్కృతా
సా చే దక్షతయోని స్స్యాత్ పునస్సంస్కార మర్హతి॥

పాణిగ్రహణము చేసినవాఁడు మృతుఁ డయినప్పుడు, కేవల మంత్ర సంస్కృతురా లయిన కన్య అక్షతయోని యైనయెడల పునర్వివాహమున కర్హురా లగును.

౮. శ్లో. కులశీల విహీనస్య షండాది పతితస్య చ
అపస్మారీ విధర్మస్య రోగిణాం వేషధారిణాం
దత్తామపి హరేత్కన్యాం సగోత్రోఢాం తథైవ చ॥

భర్త కులశీలములచేత హీనుఁడును, షండుఁడును, పతితుఁడును, వెఱ్ఱివాఁడును, విధర్ముఁడును, రోగియు, వేషధారియు, సగోత్రుఁడును, అయిన యెడల దత్తురాలయినను కన్యను మరల పుచ్చుకోవలెను.

కాత్యాయనుఁడు.

౯. శ్లో. స తు యద్యన్యజాతీయః పతితః క్లీబ ఏవ చ
వికర్మస్థ స్సగోత్రోవా దాసో దీర్ఘామయోపి వా
ఊఢాపి దేయా సాన్యస్మై సప్రావరణభూషణా.

మగఁడు అన్యజాతీయుఁడును, నపుంసకుఁడును, వికర్మస్థుఁడును, సగోత్రుఁడును, దీర్ఘరోగియును అయినప్పుడు వివాహితురాలయినను స్త్రీ వస్త్రములతోను నగలతోనుకూడ మరల మఱియొకని కియ్యఁదగినది.

ఈరీతి వచనములే ప్రజాపతిస్మృతియందును, బోధాయన స్మృతియందును, మఱికొన్ని చోట్లనుగూడ కానఁబడుచున్నవి. వీనిలో కొన్ని విధవావివాహమునుగూర్చి చెప్పకపోయినను సాధారణముగా స్త్రీపునర్వివాహమునుగూర్చి చెప్పుచున్నవి గనుక, సప్తపద్యనంతరము కన్యను మఱియొకని కియ్యఁగూడదను వారి వాదమును ఖండించుట కివియన్నియు పరమప్రయోజనకరములుగానే యుండును. స్త్రీ పున

ర్వివాహమున కనుజ్ఞ యిచ్చుచున్న తొమ్మిది స్మృతులలోను అయిదు విధవావివాహము లంగీకరించుచున్నవి. తక్కిన స్మృతులన్నియు నీవిషయమున మూకీభావమును వహించుచున్నవి. ఇట్లన్ని స్మృతులు స్త్రీపునర్వివాహము నంగీకరించుచుండఁగా స్త్రీపునర్వివాహమును నిషేధించు స్మృతి యొక్కటియైనను గనఁబడదు. ప్రతిపక్షులు కష్టపడి తీసికొనివచ్చినదంతయు నీ క్రింద నుదహరింపఁబడిన యొక్క యాశ్వలాయనవచనము.

శ్లో. అజ్ఞాతశ్చ ద్విజో యస్తు విధవా ముద్వహేద్యతి
పరిత్యాజ్య చ తాంచైవ ప్రాయశ్చిత్తం సమాచరేత్.

ద్విజుఁడు తెలియక విధవను వివాహము చేసికొన్న పక్షమున దానిని పరిత్యజించి ప్రాయశ్చిత్తము చేసుకోవలెనని పై వచనమున కర్థము. ఇది యొక్కటితప్ప ఖండనవాదుల కాధారము లేశ మయినను లభింపలేదు. దీనికైనను,—

శ్లో. పాణిగ్రాహే మృతే బాలా కేవలం మంత్ర సంస్కృతా
సాచే దక్షతయోనిః స్యా త్పునస్సంస్కార మర్హతి.

ఇత్యాది పూర్వోదాహృత స్మృతివచనములతో సమన్వయించు నట్లుగా నర్థముచేయునప్పుడు సామాన్యవిశేషభావముచే క్షతయోనికా పునర్వివాహనిషేధము మాత్రమే యర్థమగును. పూర్వోక్తము లయిన స్మృతివాక్యములను బట్టి విచారింపఁగా కొందఱు స్మృతికర్త లక్షతయోనికావివాహమును మాత్ర మంగీకరించినట్టును, కొంద అక్ష తయోనులకును క్షతయోనులకును కూడ వివాహ మంగీకరించినట్టును స్పష్టమగుచున్నది. ఋషులలో నిట్టి యభిప్రాయభేద మున్నను, స్త్రీపునర్వివాహము నంగీకరింపని ఋషి యొకఁడును కనఁబడఁడు. ఈ యాశ్వలాయనుఁ డక్షతయోనికా వివాహమును మాత్ర మంగీక

రించు తరగతిలోనివాఁడుగా నున్నాఁడు. ఇంతవఱకును జూపిన వచనములవలన స్త్రీపునర్వివాహము వేదమునుబట్టి మాత్రమే కాక చతుర్యుగసామాన్యములయిన సమస్త స్మృతులనుబట్టియుకూడ నిర్వివాదముగా స్థాపన మగుచున్నది గదా ? ఇట్టిన్ని ప్రబలనిదర్శనము లున్నను పాటింపక విరోధులు తమవాదమున కేమో సాధకములుగా నున్న వనుకొని సంతోషించు మన్వాది వచనములనుగూర్చి కొంచెము విచారింతము.

బాధక స్మృతులు.

౧. శ్లో. న ద్వితీయశ్చ సాధ్వీనాం క్వచి ద్భర్తోపదిశ్యతే.

౨. ఆసీతా౽మరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ.

అను మనువచనముల నుదాహరించి స్త్రీల కెక్కడను ద్వితీయ భర్త విధింపఁబడలేదనియు, మృతభర్తృక మరణాంతమును బ్రహ్మచారిణి యయియే యుండవలయు ననియు, ప్రతిపక్షులు చెప్పుచున్నారు. పూర్వోక్తవచనము లెక్కడ చెప్పఁబడినవో సందర్భము కొంచెము విచారించిన పక్షమున, అవి పునర్వివాహ నిషేధకములు కావని బాలుఁడయినను తెలిసికొనవచ్చును.

మనుస్మృతి పంచమోధ్యాయము.

శ్లో. యస్మై దద్యా త్పితా త్వేనాం భ్రాతా వా౽నుమతే పితుః
తం శుశ్రూషేత జీవంతం సంస్థితం చ నలంఘయేత్. ౧౫౧

మంగళార్థం స్వస్త్యయనం యజ్ఞశ్చాసాం ప్రజాపతేః
ప్రయుజ్యతే వివాహేషు ప్రదానం స్వామ్యకారణం. ౧౫౨

అనృతావృతుకాలే చ మంత్రసంస్కారకృత్పతిః
సుఖస్య నిత్యం దాతేహ పరలోకే చ యోషితః. ౧౫౩

విశీలః కామవృత్తో వా గుణైర్వా పరివర్జితః
ఉపచర్యః స్త్రియా సాధ్వ్యా సతతం దేవవ త్పతిః ॥ ౧౫౪

నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో నవ్రతం నాప్యుపోషితం
పతిం శుశ్రూషతే యేన తేన స్వర్గే మహీయతే. ౧౫౫.

పాణిగ్రాహస్య సాధ్వీ స్త్రీ జీవతో వా మృతస్య వా
పతిలోక మభీప్సంతీ నాచరే త్కించి దప్రియమ్. ౧౫౬.

కామంతు క్షపయే ద్దేహం పుష్పమూలఫలై శ్శుభైః
న తు నామాపి గృహ్ణీయాత్ పత్యౌ ప్రేతేఽపరస్య తు. ౧౫౭.

ఆసీతాఽమరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీ త మనుత్తమమ్. ౧౫౮.

అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణాం
దివం గతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్. ౧౫౯.

మృతే భర్తరి సాధ్వీ స్త్రీ బ్రహ్మచర్యే వ్యవస్థితా
స్వర్గం గచ్ఛ త్యపుత్రాపి యథా తే బ్రహ్మచారిణః. ౧౬౦.

అపత్యలోభా ద్యాతు స్త్రీ భర్తార మతివర్తతే
సేహ నిందా మవాప్నోతి పతి లోకాచ్చ హీయతే. ౧౬౧.

నాన్యోత్పన్నా ప్రజా స్త్రీహ నచాప్యఽన్యపరిగ్రహే
నద్వితీయశ్చ సాధ్వీనాం క్వచి ద్భర్తోపదిశ్యతే. ౧౬౨.

పతిం హిత్వాపకృష్టం స్వ ముత్కృష్టం యా నిషేవతే
నిందైవ సా భవేల్లోకే పరపూర్వేతి చోచ్యతే. ౧౬౩.

వ్యభిచారాత్తు భర్తుః స్త్రీ లోకే ప్రాప్నోతి నింద్యతామ్
సృగాలయోనిం ప్రాప్నోతి పాపరోగైశ్చ పీడ్యతే. ౧౬౪.

మనువు స్త్రీధర్మములను వివరించుచు, ౧౫౧వ శ్లోకముచేత తండ్రికాని, తండ్రి యనుమతిని భ్రాతకాని యెవనికిచ్చి వివాహము చేయునో యతనికి స్త్రీ బ్రతికియున్నంతవఱకు పరిచర్యచేయుచు, చచ్చిన తరువాతను వ్యభిచరింపఁ గూడదని చెప్పినాఁడు. "నలంఘ

యేత్" అనుపదము నాధారముచేసికొని పునర్వివాహము చేసికొనఁ గూడదని ప్రతివాదు లర్థము చేయఁజూతురు గాని యట్టి తలంపు వ్యర్థము. వాఖ్యానములో కుల్లూకభట్టు సహితము (నాతిక్రమేత్ వ్యభిచారేణ తదీయ శ్రాద్ధతర్పణాఽకరణేన పారలౌకికకృత్య ఖండనేన చ) వ్యభిచారముచేతను శ్రాద్ధతర్పణాదులు చేయక పోవుటచేతను పారలౌకికకృత్య ఖండనముచేతను అతిక్రమింపఁగూడదనియే యర్థము వ్రాసియున్నాఁడు. తరువాత ౧౫౭ వ శ్లోకము వఱకును సువాసినీ ధర్మములను బోధించుచు స్త్రీకి భర్తయే యిహపర లోకములయందు సుఖదాయకుఁడనియు, అతఁడు మంచినడత లేనివాఁడయినను కామ వ్యాపారమునందు వర్తించువాఁ డయినను గుణహీనుఁ డయినను విడిచిపెట్టక పతివ్రతయైన స్త్రీ పతికి పరిచర్య చేయవలయు ననియు, స్త్రీకి పతి శుశ్రూషకంటె వేఱుగ నుపవాసములును, వ్రతములును, యజ్ఞములును లేవనియు, పతిలోకమును గోరెడి స్త్రీ పతి జీవించి యున్నను మృతుఁడైనను కోంచెమయిన నతనికి నప్రియము చేయఁగూడదనియు చెప్పియున్నాఁడు. ఇక్కడ నప్రియమను స్థలమునందును, వ్యభిచారముచేతను విహితశ్రాద్ధఖండనముచేతను ననియే వ్యాఖ్యానము చేయఁబడినది గాన ప్రతివాదులు దానికి మఱియొక్క యర్థమును కల్పింపఁబూనుట వృథాప్రయాసము. అటుతరువాత మనువు విధవా ధర్మములను జెప్పుచు ౧౬౧ శ్లోకము వఱకును పుష్పమూలఫలాదుల చేత దేహమును శుష్కింపఁ జేయవలయు ననియు, పరపురుషుని యొక్క నామోచ్చారణమునైనను చేయఁగూడ దనియు, మరణము వరకును బ్రహ్మచారిణియై నియమము గలదియై యుండవలసిన దనియు, సంతానము లేకపోయినను కుమారబ్రహ్మచారులు స్వర్గమును పొందినట్టె భర్త పోయినతరువాత బ్రహ్మచర్యవ్రతమును నడి

పెడి సాధ్వియు సంతానహీనురాలయినను స్వర్గమునకు వెళ్ళునవియు, సంతానాపేక్షవలన భర్తనతిక్రమించి వర్తించు స్త్రీ యీ లోకమున నింద పొందుటయేకాక పరలోకమునుండి భ్రష్టురా లగుననియు, చూపియున్నాఁడు. "అతివర్తతే" యనుదానికి 'వ్యభిచరతి" యనియే కుల్లూకభట్టరము వ్రాసి యున్నాఁడు. విధవకు బ్రహ్మచర్యమును చెప్పినంతమాత్రమున మృతభర్తృకలు మఱియొకలాగున నుండగూడ దనియే సిద్ధాంత మేర్పరచినయెడల, సాచే దక్షతయో నీత్యాది పునర్వివాహవిధులును సహగమనవిధులును నిరర్థకములు కావలసివచ్చును. అటుపిమ్మట పరునివలనఁ బుట్టినవాఁడా స్త్రీకిఁగాని యా పరపురుషు నకుఁగాని పుత్రుఁడు కాఁడనియు, ద్వితీయుఁ డనఁగా భర్తృవ్యతిరిక్తుఁ డయిన జారపురుషుఁడు సాధ్వుల కెప్పుడును భర్త యనిపించుకొనఁ డనియుఁ ౧౬౨ వ శ్లోకముచేతఁ జెప్పియున్నాఁడు. కడపటి రెండు శ్లోకములచేతను తక్కువవాఁడైన భర్తను విడిచి గొప్పవానినాశ్రయించు నది యీ లోకమున నింద్యురాలయి పరపూర్వ యనఁబడు ననియు వ్యభిచరించు స్త్రీ యీ లోకమునందు నిందను పొంది నక్కజన్మమెత్తి పాపరోగములచేత పీడింపఁబడుననియు చూపబడినది. కాఁబట్టి విధవా ధర్మముల నిరూపించెడునట్టియు వ్యభిచారమును దూషించెడు నట్టియు పయివచనములలో నేదియు పునర్వివాహమును నిషేధించుట కుద్దేశింపఁబడ లేదని ప్రకరణమునుబట్టి బాలుఁడయినను సులభముగా తెలిసికొనవచ్చును.

శ్లో. పాణిగ్రహణికా మంత్రాః కన్యాస్వేవ ప్రతిష్ఠితాః

నాఽకన్యాసు క్వచిన్నౄణాం లుప్తధర్మక్రియా హి తాః.

మను. అ. ౮, శ్లో. ౨౨౬.

వివాహమంత్రములు కన్యలవిషయమే ప్రతిష్ఠింపఁబడి యున్న వనియు, ధర్మక్రియలు లేనివా రగుటవలన కన్యలు కానివారి విషయమయి కావనియు, మనువు చెప్పుటవలన కన్యలకే కాని విధవలకు వివాహము కూడదని ప్రతిపక్షులు చెప్పుదురు. ఇక్కడ ఆ కన్యలనఁగా వ్యభిచారాదులచేత కన్యాత్వము చెడఁగొట్టుకొన్నవారే కాని విధవలు మొదలయినవారు కారు. "లుప్తధర్మక్రియాః" అను హేతువును జెప్పుటవలనను, విధవలు ధర్మక్రియలు లేనివా రని యెవ్వరును చెప్పసాహసింపఁ జాలరు గనుకను, ఆ కన్యలను విధవలనుగాఁ జెప్పుటకు లేశమయిన నవకాశము లేదు. మఱియు నట్టియర్థమును జెప్పితిమేని, స్త్రీపునర్వివాహమును విధించు శ్రుతిస్మృతివచనము లన్నియు నర్థహీనము లయిపోవును. ఇదియంతయు నాలోచించియే కుల్లూకభట్టు వ్యాఖ్యానములో శాస్త్రవిహితమయిన వివాహరీతిని గాక యన్యవిధమున క్షతలైన వారని యకన్యల కర్థము వ్రాసియున్నాఁడు. అదిగాక విధవలకును వివాహితలకును స్మృతులయందు కన్యాపదవ్యవహారము కలదు,—

శ్లో. విధవా యా భవే త్కన్యా నిర్దోషా భర్తృవర్జితా
తస్యాఽవాసః పితుర్వేశ్మ సలజ్జా చైవ సర్వదా.—పరాశరుఁడు.

శ్లో. కన్యాయాం దత్తశుల్కాయాం మ్రియేత యది శుల్కదః
దేవరాయ ప్రదాతవ్యా యది కన్యాఽనుమన్యతే.— మనువు.

కన్యాశబ్దము వివాహితలయందుఁగూడ వర్తించును గనుకను, విధవావివాహము మనుస్మృతియందే విధింపఁబడినది గనుకను, చెడి తిరిగెడివారికి మాత్రమే వివాహము లే దని మనువాక్యమున కర్థము చేయక తప్పదు.

శ్లో. సకృదంశో నిపతతి సకృ త్కన్యా ప్రదీయతే
సకృ దాహదదా నీతి త్రీణ్యేతాని సతాం సకృత్.

మను, అ. ౯, శ్లో ౪౭

భాగము వచ్చుటయు, కన్య నిచ్చుటయు, వస్తుదానమును, ఈ మూడును ఒక్కపర్యాయమే యని మనువు చెప్పుటవలన పునః కన్యాదానము కూడదనియు, అందుచేత స్త్రీపునర్వివాహము నిషిద్ధమనియు, నిషేధవాదులు పలుకుదురు. ఇది సామాన్యవచనము; ఒకరి కిచ్చిన కన్యను మఱియొకనికి సాధారణముగా నియ్యఁగూడ దను మాట వాస్తవమే కాని విశేషవిధులనుబట్టి నష్టత్వాదినిమిత్తముల యందుమాత్రము పునర్దానము చేయవచ్చునని శాస్త్రముచేతనే తేలుచున్నది. కాఁబట్టి నష్టత్వాదులయందు తప్ప కన్యను పునర్దానము చేయఁగూడ దని పయిశ్లోకమున కర్థ మగుచున్నది.

శ్లో. నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్
న వివాహవిధా వుక్తం విధవావేదనం పునః.

మను. అ. ౯ శ్లో. ౬౫

వివాహమంత్రములయందు నియోగ మెక్కడను జెప్పఁబడలే దనియు, వివాహవిధులయందు మరల విధవావివాహము చెప్పఁబడలే దనియు మనువు చెప్పెను గాన విధవావివాహము కూడ దని ప్రతిపక్షులు వాదింతురు. "వివాహోపయమౌ సమౌ తథా పరిణయోద్వాహోపయమాః పాణిపీడనమ్" అను నమరనిఘంటువును బట్టి వేదనపదము వివాహార్థబోధకముగాఁ గనుబట్టదు. వేదనపదము గ్రహించుట యనునర్థ మిచ్చు "విద్" ధాతువునుండి పుట్టిన విశేష్యమగుటచేత దానికి గ్రహణ మర్థము కాఁబట్టి పై వచనము విధవ నొకరు నియమించుట గాని యొకరు గ్రహించుట కాని వివాహమంత్ర

ములయందు లే దని చెప్పుచున్న దే కాని యది విధవావివాహవిషయ మెంత మాత్రమును కాదు. ప్రకరణమునుబట్టి చూచినను, అది యంతయు నియోగవిషయమే కాని వివాహపుసంగతిని చెప్పుట కావశ్యక మెంతమాత్రమును లేదు. వివాహప్రకరణములో వదలివేసి నియోగప్రకరణమధ్యమున నీ యొక్క మాటయు సందర్భము లేకుండ వివాహమంత్రములో విధవావివాహము లే దని చెప్పు ననుట యుక్తియుక్తముగా కనుపట్టదు. వేదనశబ్దమునకు వివాహ మర్థము చేసెడు పక్షమున, సా చే దక్షతయోనిః స్యా దిత్యాది మనువచనమునకే యిది విరుద్ధ మగును. "ద్విజో విందేత దేవరః" అని మను వీ క్రియను నియోగమున గ్రహించుటయం దుపయోగించి యున్నాడు. ప్రకరణ సందర్భము తెలియుట కయి దాని పూర్వోత్తరశ్లోకముల నిం దుదాహరించుచున్నాను.

శ్లో. దేవరాద్వా సపిండాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా
ప్రజేప్సితాఽధిగంతవ్యా సంతానస్య పరిక్షయే. ౫౯
విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతో నిశి
ఏక ముత్పాదయే త్పుత్రం న ద్వితీయం కథం చ న. ౬౦
ద్వితీయ మేకే ప్రజనం మన్యంతే స్త్రీషు తద్విదః
అనిర్వృతం నియోగార్థం పశ్యంతో ధర్మత స్తయోః. ౬౧
విధవాయాం నియోగార్థే నిర్వృత్తే తు యథావిధి
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరమ్. ౬౨
నియుక్తౌ యౌ విధిం హిత్వా వర్తేయాతాం తు కామతః
తావుభౌ పతితౌ స్యాతాం స్నుషాగగురుతల్పగౌ. ౬౩
నాన్యస్మిన్ విధవా నారీ నియోక్తవ్యా ద్విజాతిభిః
అన్యస్మిన్ హి నియుంజానా ధర్మం హన్యుః సనాతనం. ౬౪

నోద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతే క్వచిత్
న వివాహవిధా వుక్తం విధవాఽఽవేదనం పునః. ౬౫

అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః
మనుష్యాణా మపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి. ౬౬

స మహీ మఖిలాం భుంజన్ రాజర్షి ప్రవరః పురా
వర్ణానాం సంకరం చక్రే కామోపహతచేతసః. ౬౭

తతః ప్రభృతి యో మోహాత్ ప్రమీతపతికాం స్త్రియం
నియోజయత్య పత్యార్థం తం విగర్హంతి సాధవః. ౬౮

మనుస్మృతి నవమాధ్యాయమునందలి పై శ్లోకములవలన నిది యంతయు నియోగప్రకరణ మగుట స్పష్టమే. "నాన్యస్మిన్ విధవా నారీ" మొదలుకొని యెనుబ్లోకములును ప్రక్షిప్తము లనియు, ఈ శ్లోకములు పూర్వా పరవ్యవధానముగా మనువు చెప్పినదానికే విరుద్ధముగా నున్నవనియు, విధవావివాహము శాస్త్రనిషిద్ధ మని సాధించుట కెవ్వరో వీనిని కల్పించి మధ్య నిమిడ్చి యుందురనియు, ఇవి మనువచనములే యైనయెడల మనువు తరువాత తొమ్మిదితరములు దాటి ప్రభుత్వమునకు వచ్చిన వేనుఁడు తనకు పూర్వమే రాజ్యము చేసి నియోగమును వ్యాపింపఁ జేసి వర్ణసాంకర్యమును గలుగఁజేసె ననుట తటస్థింప దనియు కొంద ఱభిప్రాయపడుచున్నారు.

విధవావివాహఖండనవాదులు విధవోద్వాహముతో దూరసంబధ మైనను లేని యీ నాలుగుకుర్బలవచనములను సాధనములుగా జేసికొని పోరాడి కంఠోక్తిగా స్త్రీపునర్వివాహమును విధించుచున్న బలవత్తరము లయిన యనేక శ్రుతిస్మృతివచనములను ఖండించి తమ వాదమును స్థాపింపఁ జూచుచున్నారు.

పురాణ ప్రమాణములు;

ఇంక పురాణములయందు స్త్రీపునర్వివాహవిషయమునఁ గను పట్టు ప్రమాణములను యోచింతము.

౧. అగ్నిపురాణము.

శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.
మృతే తు దేవరే దేయా తదభావే యథేచ్ఛయా.

పయివచనము నష్టత్వాది పంచాపదలయందును స్త్రీలకు మఱి యొక పతి విధింపఁబడుచున్నాఁ డనియు, మృతుఁ డయినప్పుడు మొదట దేవరునకును, దేవరుఁడు లేనప్పుడు మనసువచ్చిన వారికిని స్త్రీ నియ్యఁ దగు ననియు స్పష్టముగా చెప్పుచున్నది.

౨. బ్రహ్మపురాణము.

శ్లో. మృతే భర్తరి యా నారీ త్యక్త్వవత్యథా తం స్వయమ్
సవర్ణా జ్జనయే ద్గర్భం భర్తుః పౌనర్భవం సుతమ్.
యది సా బాలవిధవా బలాత్త్యక్తాఽథవా క్వచిత్
తథా భూయస్తు సంస్కార్యా గృహీత్వా యేన కేన చిత్.

ఇందలి మొదటిశ్లోకము విధవగాని భర్తచే విడువఁబడినదిగాని స్వయముగా సవర్ణునివలన బిడ్డను గన్నపక్షమున నట్టి సుతుఁడు భర్తకు పౌనర్భవపుత్రుఁ డగునని పౌనర్భవలక్షణమును చెప్పుచున్నది. అట్టి స్త్రీ బాలవిధవగాని బలవంతముగా మగనిచే విడిచిపెట్టఁబడినదిగాని యయినపక్షమున మనసువచ్చిన వానిని వివాహము చేసికొనుట కర్హురా లగుచున్నదని రెండవశ్లోకము పునర్వివాహానుజ్ఞ నిచ్చుచున్నది.

౩. భారతము.

శ్లో. అర్జునస్యాత్మజః శ్రీమా న్నిరావా న్నామ వీర్యవాన్
సుతాయాం నాగరాజస్య జాతః పార్థేన ధీమతా
ఐరావతేన సా దత్తా హ్యనపత్యా మహాత్మనా
పత్యౌ హతే సుపర్ణేన కృపణా దీనచేతనా
భార్యార్థం తాం చ జగ్రాహ పార్థః కామవశానుగాం.

* * * *

అజాన న్నర్జున శ్చాపి నిహతం పుత్ర మౌరసం
జఘాన సమరే శూరాన్ రాజ్ఞ స్తాన్ భీష్మరక్షిణః.

భీష్మపర్వము

ఈ శ్లోకములు పూర్వోక్తపురాణవచనములవలె స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మత మని మాత్రమే తెలుపక సుపర్ణునిచేత భర్త చంపఁబడిన తరువాత ఉలూపిని మరల నర్జునుఁడు వివాహము చేసికొనుటను మృతభర్తృక యయిన యులూపిని తండ్రి యైన నాగరాజే మరల దానము చేయుటను పునర్వివాహ మాడిన యువతికి పుట్టిన పుత్రుఁడు ఔరసుఁడే యనుటను కూడ తెలిపి సరిగా స్త్రీ పునర్వివాహము త్తమవంశమునందు జరగిన సంగతినికూడ స్థాపించుచున్నది.

శ్లో. అస్థాస్యతి పునర్భైమీ దమయంతీ స్వయంవరమ్
తత్ర గచ్ఛంతి రాజానో రాజపుత్రాశ్చ సర్వశః.

ఆదిపర్వము.

నలుఁడు నష్టుఁ డయినప్పు డాతనిని కనుఁగొనుటకయి దమయంతి సుదేవుఁ డను బ్రాహ్మణుని ఋతుపర్ణునొద్దకుఁ బంపునప్పుడు దమయంతి పునస్స్వయంవరము జరగఁబోవు ననియు, అందు

నిమిత్తమయి యందఱు రాజులును రాజపుత్రులును వచ్చుచున్నా రనియు ఋతుపర్ణునితోఁ జెప్పుటకయి నియమించెను. పోయినభర్తను వెదకి కనుఁగొనుటకయి పతివ్రతాశిరోమణియైన దమయంతి తనకు పునస్స్వయంవరమని బహిరంగముగా రాజసభకుఁ జెప్పఁబంపుటయు, ఆ వార్త విన్నతోడనే లేశ మయినను సంశయింపక రాజర్షి యైన ఋతుపర్ణు నంతటివాఁడు వెంటనే బయలుదేఱి వచ్చుటయు, ఆ యుపాయము సుదేవునకుఁగాని దమయంతియొక్క జననీజనకులకుఁగాని మఱియెవ్వరికిఁగాని వింతగా తోఁచకపోవుటయు, విచారింపగా పూర్వకాలమునందు స్త్రీపునర్వివాహము సర్వధారణముగా నడుచుచు వచ్చెననియు నట్టి ద్వితీయవివాహ మేవిషయమునందును ప్రథమవివాహమునకంటె క్రొత్తగా తోఁచకుండె ననియు విదిత మగుచున్నది.

ర. పద్మపురాణము.

శ్లో. సతాం దృష్ట్వా దివోదాసో దివ్యాం దేవీం సుతాం తదా
కస్మై చ దీయతాం కన్యాం సువరాయ మహాత్మనే.
ఇతి చింతాతురో భూత్వా సమాలోక్య నరోత్తమః
యూపదేశస్థ రాజానం సమ్యక్ జ్ఞాత్వా మహీపతిః.
చిత్రసేనం మహాత్మానం సమాహూయ తతో నృపః
కన్యాం దదౌ దివోదాస శ్చిత్రసేనాయ ధీమతే.
తస్యా వివాహకాలస్య సంప్రాప్తే సమయే నృప
మృతోఽసౌ చిత్రసేనస్తు కాలధర్మేణ వై కిల.
దివోదాస శ్చ ధర్మాత్మా చింతయామాస భూపతిః
బ్రాహ్మణానాం సమాహూయ పప్రచ్ఛ నృపనందనః.

అస్యా వివాహకాలే తు చిత్రసేనో దివం గతః
అస్యాస్తు కీదృశం కర్మ భవిష్యతి బ్రువంతు మే.

బ్రాహ్మణా ఊచుః.

శ్లో. వివాహే జాయతే రాజన్ కన్యాయాః స్తే విధానతః
పతి ర్మృత్యుం ప్రయాత్యేవ యో వా త్యాగం కరోతి చ.
మహాధివ్యాధినా భూత స్త్యాగం కృత్వా ప్రయాతి చ
ప్రవ్రాజితో భవే ద్రాజన్ ధర్మశాస్త్రేషు దృశ్యతే.
తస్యాం రజస్వలాయాం చ పతి రన్యో విధీయతే
వివాహం తు విధానేన పితా కుర్యా న్న సంశయః.
ఏవం రాజన్ సమాదిష్టం ధర్మశాస్త్రం శుభై ర్జనైః
వివాహ క్రియతా మస్యా ఇత్యూచు స్తే ద్విజోత్తమాః.
దివోదాసస్తు ధర్మాత్మా బ్రాహ్మణై స్సంప్రచోదితః
వివాహార్థం మహారాజా మానసం కృతవా న్నృపః.
పున ర్దత్తా తదా తేన దివ్యా దేవి ద్విజోత్తమ
పుణ్యసేనాయ పుణ్యాయ తస్మై రాజ్ఞే మహాత్మనే.
మృత్యుధర్మగతో రాజా వివాహసమయేఽపి సః
యదా యదా మహాభాగో దివ్యా దేవ్యా స్సభూమిపః.
కరోతి సతతోద్యోగం వివాహాయాఽతిదుఃఖితః
భర్తాఽపి మ్రియతే కాలే ప్రాప్తలగ్న స్తదా తదా.
ఏకవింశతి భర్తారః కాలే కాలే మృతా స్తథా
తతో రాజా మహాదుఃఖీ సంజాతః ఖ్యాతవిక్రమః.

చిత్రోపాఖ్యానము; సప్తమోధ్యాయము

ఈ పయివాక్యములవలన కాశీరాజైన దివోదాసుఁడు తన కొమార్తెకు భర్తపోయినప్పుడెల్లను మరలమరల వివాహముచేయుచు

వచ్చునని తెలియుటయేకాక పతి మృత్యుగతుఁ డౌట మొదలుగాఁ గల యాపదలయందు రజస్వలలకు సహితము పునర్వివాహ మొనర్చుట శాస్త్రసిద్ధాంత మని నిరాక్షేపముగా నేర్పడుచున్నది. వివాహ సమయమునందు పతి మృతుఁ డయ్యెనని యుండుటచేత భర్తలు సప్తపదికి పూర్వమే మృతు లగుచువచ్చిరని కొందఱు వాదింపఁ జూతురుగాని, "కన్యాం దత్తా" "పునర్దత్తా" "భర్తా" "ప్రాప్తలగ్నః" మొదలగుపదములు నిస్సందేహముగా భర్తలు వివాహదినములలో సప్తప ద్యనంతరమే మృతులగుచు వచ్చిరనుటను స్థాపించుచున్నవి.

ఈ పూర్వోదాహృత సమస్తవచనములనుబట్టి చూచిన పక్షమున మందుఁడయినను శ్రుతిస్మృతిపురాణేతిహాసములు నిస్సంశయముగా స్త్రీపునర్వివాహమును సిద్ధాంతపఱుచుచున్న వని తెలిసికొనవచ్చును. ఇందువలన స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమనుట మాత్రమే కాక క్రమముగా నట్టివివాహములు నడుచుచు వచ్చెననియు బృహస్పతి పార్థుఁడు దివోదాసుఁడు మొదలుగాఁగల పుణ్యపురుషులు సహితము స్త్రీపునర్వివాహమును చేసికొనుటకును చేయించుటకును వెనుకతీయ లేదనియు తేటపడుచున్నది.

కలియుగస్మృతి ప్రమాణములు.

స్త్రీపునర్వివాహమునకు సాధకముగా శ్రుతిస్మృతిపురాణముల నుండి యిట్లన్నివచనముల నుదాహరించినను, అవు నివి యన్నియు ననుకూలముగానే యున్నవి కాని యివి కలియుగధర్మైకబోధకములు కావు కాఁబట్టి, కలియుగమునందు స్త్రీపునర్వివాహము కర్తవ్యమని చూపుటకు నివి ప్రయోజనకరములు కావని నిషేధవాదు లొక్కమాట యనవచ్చును. కలియుగధర్మైకబోధకమగు పరాశరస్మృతి నుండి స్త్రీపునర్వివాహము నిషిద్ధమని యొక్క వచనమును ప్రతి

పక్షులు చూపఁగలుగుదురేని, ఈ పడినప్రయాస యంతయు వ్యర్థమగును. కాఁబట్టి విధాయకవాదులు తమ పక్షమును స్థిరపఱుచుకొనుటకయి పరాశరస్మృతియం దట్టి నిషేధము లేదని యయినను స్థాపింపవలసి యున్నది. అట్లుగాక విధాయకవాదు లిప్పుడు పరాశరస్మృతియం దట్టినిషేధ మేదియు లేదని చూపఁగలిగినవారు మాత్రమే కాక స్త్రీపునర్వివాహము చేయవచ్చు నన్న స్పష్టమయిన విధినిగూడ గనఁబఱిచి తమవాదమును నిరాక్షేపముగా సాధింపఁగలిగిన స్థితియందు కూడ నున్నారు.

పరాశరస్మృతి చతుర్థాధ్యాయములో

శ్లో. నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే.

పతి నష్టుఁడైనను, మృతుఁడైనను, సన్యసించినను, నపుంసకుఁడయినను, పతితుఁడయినను, స్త్రీల కీయైదాపదలయందును మఱియొకపతి విధింపఁబడుచున్నాఁడని స్పష్టమైన విధి కనఁబడుచున్నది. ఈ వాక్యముయొక్క సందర్భము తెలియుటకయి పూర్వోత్తరశ్లోకముల నిం దుదాహరించుచున్నాను,—

శ్లో. జ్యేష్ఠభ్రాతా యదా తిష్ఠే దాధానం నైవ కారయేత్
అనుజ్ఞాతస్తు కుర్వీత శంఖస్య వచనం యథా. ౨౭
నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే. ౨౮
మృతే భర్తరి యా నారీ బ్రహ్మచర్యే వ్రతే స్థితా
సా మృతా లభతే స్వర్గం యథా తే బ్రహ్మచారిణః. ౨౯
తిస్రః కోట్యర్ధకోటీ చ యాని లోమాని మానుషే
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి. 30

పరాశరుఁడు వివిధధర్మములను జెప్పుచు మొదట పరివేదనము కూడదని చెప్పి తరువాత ౨౭ వ శ్లోకముచేత జ్యేష్ఠభ్రాత బ్రతికి యుండఁగా తమ్ముఁడు యజ్ఞము చేయఁగూడదనియు అనుజ్ఞ పుచ్చుకొని చేయవలయుననియు చెప్పి, పిమ్మట మృతభర్తృకాదివిషయము నెత్తుకొని ౨౮ వ శ్లోకముచేత నష్టత్వాద్యాపదలయందు స్త్రీపునర్వివాహము చేసికోవచ్చునని విధించి, ౨౯ వ శ్లోకము చేత భర్త మృతుఁడయిన స్త్రీ బ్రహ్మచర్యము చేసినపక్షమున మరణానంతరము స్వర్గమును పొందునని చెప్పి, 30 వ శ్లోకముచేత సహగమనము చేసిన స్త్రీ మనుష్యశరీరముమీఁద నెన్నిరోమము లుండునో యన్నిసంవత్సరము లనఁగా మూడుకోట్ల యేఁబదిలక్షలసంవత్సరములు స్వర్గమున వసించునని చెప్పినాఁడు. ఈ పునర్వివాహము పరివేదినులకని యొకరును, వాగ్దత్తల కని మఱియొకరును, నియోగపర మని యింకొకరును వ్రాసియున్నారు. ప్రకరణమునుబట్టికాని శబ్దశక్తి చేతఁగాని యట్టి యర్థము వచ్చుట కవకాశము లేదు. వివాహము వాగ్దత్తల కయినపక్షమున ప్రకరణమునుబట్టి బ్రహ్మచర్యమును సహగమనమునుకూడ వాగ్దత్తలకే యయి పరిహాసాస్పద మయిన యర్థమేర్పడును. కొందఱీవిధి ద్విజులకు కాదని వాదించిరికాని మూల వాక్యములోని "ప్రవ్రజితే" శబ్దము వారిని బాధించునుగాన సన్న్యాసము ద్విజులకే యని తెలిసికొని వారూరకుండవలసినవా రగుచున్నారు. ఇంకొకరు పతి యనఁగా రక్షకపతి యని రెండవ పతిశబ్దమున కర్థముచేయ యత్నించినారు; మూలములో "క్లీబే" యను పదముండుటచేత నపుంసకుఁడు తనభార్యను రక్షించుటకు సమర్థుఁడు కాకపోఁడు గనుక వారియర్థము వ్యర్థము. మఱియొకరు "పతౌ" యను పదము వ్యాకరణదుష్టముగ కనఁబడుచున్నది. గనుక, 'అపతౌ' యని

పూర్వార్థమున పదవిభాగము చేసి పర్యుదాసముచేత దానికి పతిసదృశుడగు పతిభిన్నుఁడు ననఁగా వాగ్దత్తాపతి యని యర్థము చేయవలెనసిరి. ఉత్తరార్థమున "పతి రన్యః" అని మఱియొకపతిని విధించుటను బట్టి "అన్య" పదస్వారస్యముచేత మొదటివాఁడు పతియైనంగాని రెండవవాఁ డన్యపతి కానేరఁడు కాఁబట్టి మొదటిది 'పతి' శబ్దమేకాని 'అపతి' శబ్దము కాదు. నియోగపర మని వాగ్దత్తాపర మని యర్థము చేయువారినికూడ ఈ 'యన్య' పదమే బాధించును. కొందఱు 'పతౌ' యనుదానికే గౌణపతి యని యర్థము చేయ యత్నించిరి కాని,

శ్లో. నోదకేన న వా వాచా కన్యాయాః పతి రుచ్యతే
పాణిగ్రహణసంస్కారా త్పతిత్వం సప్తమే పదే.

అను నారదవచనమును బట్టియు,

శ్లో. నోదకేన న వా వాచా కన్యాయాః పతి రుచ్యతే
ప్రాణిగ్రహణసంస్కారో నియతం పతిలక్షణమ్.

అను పరాశరవచనమునుబట్టియు, సరిగా పాణిగ్రహణము చేసినవాఁడే పతి యగును గనుక మఱి యే యర్థమును పొసఁగదు. మనోరమా, తత్వబోధినీ వ్యాఖ్యానములయందు "పతౌ" యను రూపము సాధువుగానే చేయఁబడియున్నది. అంతియకాక యిది యార్షప్రయోగ మగుటచేత నిక్కడ నట్టి వివాదముతో పనియే లేదు.

౧. శీతాయాః పతయే నమః—రామాయణము.

౨. క్రీడతే పతినా సార్థం యావదింద్రా శ్చతుర్దశ—హారీతస్మృతి.

3. సమాంశభాగినీ మాతా పుత్రాణాం సా స్మృతే పతౌ.

నారదస్మృతి.

మొదలుగాఁగల యార్షప్రయోగములు పెక్కులు కనఁబడుచుండుటచేత 'పతౌ' పదము దుష్టమును గాదు; దానికి మఱియొక

యర్థము చేయ నావశ్యకమును లేదు. మాధవాచార్యులవారు వ్యాఖ్యానములో 'నష్టే మృతే' యనునది స్త్రీపునర్వివాహపరమని యొప్పుకొని యీ వచనమును యుగాంతరవిషయమునుగాఁ జెప్పి తమ వాక్యమున కుపబలముగా,—

శ్లో. ఊఢాయాః పునరుద్వాహం జ్యేష్ఠాంశం గోవధం తథా
కలౌ పంచ న కుర్వీత భ్రాతృజాయాం కమండలుమ్.

అను ఆదిపురాణవచనము నుదాహరించి యున్నారు. పరాశరుఁడే కలియుగమున కని చెప్పిన విధిని మూలవిరుద్ధముగా నితర యుగమునకన్న వ్యాఖ్యానము గ్రాహ్యము కానేరదు. గనుకను స్మృతికంటె పురాణ మెప్పుడును దుర్బలమయిన దగుటచే నాదిపురాణవచనము పరాశరస్మృతిని బాధింపఁజాలదు గనుకను, కలియుగమున స్త్రీపునర్వివాహ మాచరణీయమే యగును. అదిగాక పురాణవచనము "ఊఢాయాః పునరుద్వాహ" మని సామాన్యముగా వివాహితకు పునర్వివాహము కలినిషిద్ధ మని చెప్పుచున్నది; పరాశరస్మృతి యన్ననో విశేషముగా నష్టత్వాదులయిన యయిదాపదల యందు మాత్రమే స్త్రీలకు పునర్వివాహమును విధించుచున్నది. కాఁబట్టి స్మృతి పురాణవచనమున కెంతమాత్రమును విరోధముగా నుండక యుత్సర్గాపవాద న్యాయమున నాపత్పంచకమునందు మాత్రము పునరుద్వాహమును సిద్ధాంతీకరించుచున్నది. అందుచేత రెంటికి సమన్వయము చేసినయెడల నష్టత్వాద్యాపత్పంచకమునందు తప్ప నారీపునర్వివాహము కూడదన్న సిద్ధాంత మేర్పడుచున్నది. కలియుగనిషేధ మన్నతోడనే పూర్వయుగములయం దున్నదానిని దేనినో నిషేధింపవలయును గనుక, పయిపురాణవచనము పూర్వ

యుగములయం దున్న పునర్వివాహములను వేసని నిషేధించుచున్న దని కొందఱు శంక చేయవచ్చును. "వరశ్చే త్కులశీలాభ్యాం" మొదలగు పూర్వోదాహృత వచనములనుబట్టి వరుఁడు మంచివాఁడు దొరకినపక్షమున వివాహితను మరల మఱియొకని కిచ్చి వివాహము చేయవలయునన్న విధులనుమాత్రమే కలియుగమునందు పయిపురాణ వచనము నిషేధించుచున్నది. ఈ యొక్కవచనముమాత్రమే కాక కలినిషేధములనుగూర్చి చెప్పెడి పురాణవచనము లన్నియు నీ ప్రకార ముగానే, యిచ్చిన కన్యను మరల నియ్యఁగూడ దని సామాన్యముగానే చెప్పుచున్నవి.

౨. శ్లో. సముద్రయాత్రా స్వీకారః కమండలు విధారణమ్
ద్విజానా మసవర్ణాను కన్యానూపయమ స్తథా.
దేవరాచ్చ సుతోత్పత్తి ర్మధుపర్కే పశోర్వధః
మాంసదానం తథా శ్రాద్ధే వానప్రస్థాశ్రమ స్తథా.
దత్తాయాశ్చైవ కన్యాయాః పునర్దానం వరస్యచ
దీర్ఘకాల బ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకౌ.
మహాప్రస్థానగమనం గోమేధశ్చ తథా మఖమ్
ఇమాన్ ధర్మాన్ కలియుగే వర్జ్యానాహుర్మనీషిణః.

బృహన్నారదీయము.

3. శ్లో. దేవరాచ్చ సుతోత్పత్తి ర్దత్తాకన్యా ప్రదీయతే
న యజ్ఞే గోవధం కార్యః కలౌ న చ కమండలుగ—క్రతువు.

౪. శ్లో. దీర్ఘకాలం బ్రహ్మచర్యం ధారణశ్చ కమండలోః
దేవరేణ సుతోత్పత్తి ర్దత్తా కన్యా ప్రదీయతే.
కన్యానా మసవర్ణానాం వివాహశ్చ ద్విజాతిభిః
ఆతతాయి ద్విజాగ్ర్యాణాం ధర్మ్యయుద్ధే న హింసనమ్.

వానప్రస్థాశ్రమస్యాపి ప్రవేశో విధిదేశితః
వృత్తస్వాధ్యాయసాపేక్ష మఘసంకోచనం తథా.
ప్రాయశ్చిత్తవిధానంచ విప్రాణాం మరణాంతికమ్
సంసర్గదోష పాపేషు మధుపర్కే పశోర్వధః.
దత్తౌరసేతరేషాస్తు పుత్రత్వేన పరిగ్రహః
శూద్రేషు దాసగోపాల కులమిత్రార్ధసీరిణామ్.
భోజ్యాన్నతా గృహస్థస్య తీర్థసేవాతిదూరతః
బ్రాహ్మణాదిషు శూద్రస్య పక్వతాదిక్రియాపిచ.
భృగ్వగ్ని పతనశ్చైవ వృద్ధాది మరణం తథా
ఏతాని లోక గుప్త్యర్థం కలే రాదౌ మహాత్మభిః
నివర్తితాని విద్వద్భి ర్వ్యవస్థాపూర్వకం బుధైః.

ఆదిత్యపురాణము.

ఇప్పు డుదాహరింపఁబడినవానిలో (ఊఢాయాః పునరుద్వాహమ్) వివాహితకు మరల వివాహమని యాదిపురాణములోను, (దత్తాయాశ్చైవ కన్యాయాః పునర్దానం వరస్య చ) దత్తయైన కన్యను వరునకు మరల దానముచేయుట యని బృహన్నారదీయ పురాణము నందును, (దత్తా కన్యా ప్రదీయతే) దత్తయైన కన్య యియ్యఁబడుట యని క్రతువచనమునందును, (దత్తా కన్యా ప్రదీయతే) దత్తయగు కన్య యియ్యఁబడుచున్నదని యాదిత్యపురాణమునందును, సామాన్యముగా నొకసారి యియ్యఁబడిన కన్య మరల నియ్యఁబడఁ గూడదని చెప్పఁబడినదే కాని పరాశరస్మృతియందువలె నింకొకదానియందును విశేషాపత్తుల విషయమయి చెప్పఁబడి యుండలేదు. స్త్రీపునర్వివాహ విధాయక వాదులు సహితము పూర్వోక్తపురాణములవలెనే సామాన్యముగా వివాహితకు మరల వివాహము చేయఁగూడదనియు దానము

చేయఁబడిన కన్యలను మరల దానము చేయఁగూడదనియునే చెప్పుదురు. కాని వారు పరాశరుఁడు చెప్పిన యాపత్సమయములయందు మాత్రము విశేషవిధిచేత స్త్రీపునర్వివాహము కూడునందురు.

ఈ వాదము నటుండనిచ్చి సత్యమెట్లున్నను ప్రతిపక్షులకే సమస్తవిధముల లాభమును గలుగఁజేసి స్మృతికంటె పురాణమే బలమయినదనియు విశేషసామాన్యభావము లేదనియు పురాణవచనములన్నియు విధవావివాహమునే కలియుగమునందు నిషేధించుచున్నవనియు క్షణకాల మంగీకరించినను ఇఁక ముప్పదియొక్కవేల సంవత్సరములనాటికిఁగాని యీవిషయములకు చెల్లుబడియే కలుగదు. ఎట్లనిన,—

శ్లో. చత్వార్యాహుస్సహస్రాణి వర్షాణాంతు కృతం యుగమ్
తస్య తావచ్ఛతీసంధ్యా సంధ్యాంశశ్చ తథావిధః. ౬౯
ఇతరేషు ససంధ్యేషు ససంధ్యాంశేషు చ త్రిషు
ఏకాపాయేన వర్తంతే సహస్రాణి శతాని చ. ౭౦

మనుస్మృతి ప్రథమోధ్యాయమునందలి పయి శ్లోకములవలన కృతయుగ పరిమాణము నాలుగువేల దివ్యసంవత్సరములనియు దానికి సంధ్య నాలుగువందల దివ్యసంవత్సరములును సంధ్యాంశము నాలుగువందల దివ్యసంవత్సరములు నుండుననియు, తక్కిన యుగములును క్రమముగా సంధ్యాసంధ్యాంశలతోఁగూడ నొక్క వేయిసంవత్సరముల చొప్పునను వందసంవత్సరముల చొప్పునను తక్కువగా నుండుననియు స్పష్టపడుచున్నది. దీనినిబట్టి చూడఁగా సంధ్యాసంధ్యాంశలు గాక మిగిలియున్న మధ్యకాలమే క్రమమయినయుగమని తేటపడుచున్నది.

శ్లో. కృతం త్రేతా ద్వాపరశ్చ కలిశ్చేతి చతుర్యుగమ్
దివ్యైర్ద్వాదశభిర్వర్షైస్సావధానం నిరూపితమ్. ౧౮

చత్వారి త్రీణి ద్వే చైకం కృతాదిషు యథాక్రమమ్
సంఖ్యాతాని సహస్రాణి ద్విగుణాని శతాని చ. ౧౯
సంధ్యాసంధ్యాంశయో రంత ర్యత స్సర్గో యతో లయః
తమే వాహు ర్యుగం తద్జ్ఞా యత్ర ధర్మో విధీయతే. ౨౦

శ్రీమద్భాగవతము తృతీయస్కంధము ఏకాదశాధ్యాయము నందలి పయి శ్లోకములనుబట్టి కృత త్రేతా ద్వాపర కలియుగము లన్నియుఁ గలిసి పండ్రెండువేల దివ్యసంవత్సరములు కలవనియు, అందు నాలుగువేల యెనిమిదివందల దివ్యసంవత్సరములు కృతయుగ మనియు, మూఁడువేల యాఱువందల దివ్యసంవత్సరములు త్రేతాయుగ మనియు, రెండువేల నాలుగువందల దివ్యసంవత్సరములు ద్వాపరయుగ మనియు, పండ్రెండువందల దివ్యసంవత్సరములు కలియుగమనియు, యుగాదికాలము సంధ్యయనియు, యుగాంతరకాలము సంధ్యాంశ మనియు, ఆ యా యుగధర్మములు విధింపఁబడెడు కాలము సంధ్యా సంధ్యాంశల నడిమిభాగమగు క్రమమయిన యుగము మాత్రమే యనియు స్పష్టమగుచున్నది. పూర్వోదాహృత మనుస్మృతివచనముల వలనను, "క్రమాత్కృత యుగాదీనాం షష్ఠాంశ స్సంధ్యయో స్స్వకః" ఇత్యాద్యార్యభటసిద్ధాంతవచనమువలనను, కలియుగమునందు నూఱు దివ్యవర్షములు సంధ్యగాను నూఱుదివ్యవర్షములు సంధ్యాంశముగాను నేర్పడుచున్నవి. ఒక దివ్యవర్షమునకు మన సంవత్సరములు మూఁడు వందలయిరువది యగును గనుక కలియుగప్రమాణము ౪,౩౨,౦౦౦ సంవత్సరములలో సంధ్యాకాలము మొదటి ముప్పదియాఱువేలసంవత్సరములుగా నుండును. పయి భాగవతపురాణ ప్రమాణమునుబట్టి పూర్వోక్తములయిన కలినిషిద్ధధర్మములన్నియు కలియుగ మారంభ మయిన ముప్పదియాఱువేల సంవత్సరముల కనఁగా నీవలఁ గించుమిం

చుగా గణించిన యైదువేలసంవత్సరములును గాక యింక ముందు ముప్పదియొక్క వేల సంవత్సరములు దాటిన తరువాతనే వ్యవహారము నకు రావలయును కాఁబట్టి ప్రతిపక్షుల కలినిషేధములును వారి కిప్పు డేవిధముననను సాహాయ్యము చేయఁజాలవు. పూర్వోదాహృతము లయిన భాగవత శ్లోకములలో కడపటిదానికి వ్యాఖ్యానము చేయుచు శ్రీధరాచార్యులవారు,—

"యుగస్యాదౌ సంధ్యా, అంత్యే తు సంధ్యాంశః తయోరంత రం (తయోర్మధ్య ఇత్యర్థః) యుగస్వరూపం వేదితవ్య మిత్యాహుః- సంధ్యాసంధ్యాంశయో ర్విశేషమాహ - యత స్సర్గో యత్రో లయ ఇతి- తత్తద్వ్యాగేన కర్మకృతఫలభోగినాంచ ప్రాణినాం, యత్రో యత్ర సర్గ ఉత్పత్తిః, సా యుగస్యసంధ్యా - తేషాం, యతో యత్ర లయో నాశః న సంధ్యాంశ ఇతి- తన్మధ్యపతితయుగస్య విశేష మాహ- యత్ర ధర్మో విధీయత ఇతి-యత్ర గవాలంభనాది ధర్మవిశేషో విధీయత్తే, తద్ జ్ఞాః, తదభిజ్ఞాః, తమేవ యుగమాహుః- సాధారణధర్మస్తు సంధ్యా సంధ్యాం శయో రప్య స్త్యేవ."

అని గవాలంభనాది కలినిషేధములు సంధ్యాసంధ్యాంశముల నడిమి భాగమయిన క్రమమయిన యుగమునందు మాత్రమే చెల్లు ననియు సాధారణ ధర్మములే సంధ్యాసంధ్యాంశములలో నడుచు ననియు వివరముగా తెలిపియున్నారు. క్రమమయిన కలియుగము వచ్చిన తరువాత నహితము మనుష్యకృతము లయిన పూర్వోక్త కలి నిషేధవచనములు దేవదత్తములయిన వేదవాక్యములను ఋషి ప్రోక్తము లయిన స్మృతివాక్యములను బాధింపఁజాలవని యీ వఱకే సప్రమాణముగా స్థాపించి యున్నాను. ప్రాచీను లేర్పఱుచుకొన్న కట్టు పాటులే శ్రుతిస్మృతులను బాధింపఁ గలిగిన పక్షమున దేశకాలాను

సారముగా నాకట్టుపాట్ల నిప్పటివారేల మార్చుకొనరాదో నే నూహింపఁజాలకున్నాను.

శ్లో. పరిత్యజేదర్థకామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ
ధర్మం చా ప్యసుఖోదర్కం లోకవిక్రుష్ట మేవ చ.
మను, అ-౪, శ్లో. ౧౭౬.

అని మనువే లోకమునకు అసుఖమును బాధకరము నైన ధర్మమును సహితము త్యజింపవలెనని యనుజ్ఞ యిచ్చి యున్నాఁడు గాన పూర్వపు పెద్దలు శాస్త్రానుసారముగానే దేశకాలపాత్రతను విచారించి యట్టి సమయము నేర్పఱచుకొని యున్నారనెడు పక్షమున ఆ మనువచనము పూర్వపువారి కట్టుపాటును మనము మీఱకూడదని విధించుట కనుకూలపడదు. గాని యిప్పటి దేశకాల స్థితినిబట్టి మనము సహితము తగిన మార్పులను చేసికోవచ్చుననియు పూర్వమేదో బాధ సంభవించినందువల్ల తత్కాలానుగుణముగా తొంటి పెద్ద లట్టి కట్టును జేసికొని యుందురనియు తెలిసికొనుటకు మాత్రమే యాక్షేపకు వచ్చుచున్నది. శ్రుతి స్మృతి పురాణేతిహాసముల యందింత బలముగా విధింపఁబడిన స్త్రీపునర్వివాహము నిలిచిపోవుటకు కారణమేమయి యుండునో తెలిసికోవలె నని పలువుర కభిలాష యుండవచ్చును. గనుకను, ఆ కారణము నూహించుటకు పూర్వోదాహృతములయిన కలి నిషేధవచనములు కొంత తోడుపడును గనుకను, ఆ విషయమయి నా యభిప్రాయమును సంగ్రహముగా తెలిపెదను.

శ్లో. ఏతాని లోక గుప్త్యర్థం కలే రాదౌ మహాత్మభిః
నివర్తితాని విద్వద్భి ర్వ్యవస్థాపూర్వకం బుధైః.

అను పూర్వోదాహృతమయిన యాదిత్యపురాణవచనమును బట్టి పయి కలినిషేధములన్నియు లోకరక్షణార్థమయి కలియుగాది

యందు మహాత్ములును విద్వాంసులు నగు పెద్దలచేత వ్యవస్థాపూర్వకముగా నివర్తింపఁబడినట్లు స్పష్టమగుచున్నది. ద్వాపరాంతము వఱకును స్త్రీపునర్వివాహము లవిచ్ఛిన్నముగా నడుచుచు వచ్చెననుట కర్జునుఁడు విధవయైన యులూపిని పరిణయ మగుటయే చాలినంత నిదర్శనముగా నుండును. ద్వాపరాంతమువఱకును జరిగిన వివాహముల నంత శీఘ్రముగా కలియుగాదియందే నిలుపుటకు తగినంత దేశోపద్రవ మప్పు డేది కలిగినదని విచారింపఁగా, ఆ యుపద్రవము భారతయుద్ధముగాఁ గనఁబడుచున్నది. భారతయుద్ధమునందు హిందూదేశము నందుఁగల రాజులందఱును తమ సైన్యములతో నేదోయొక కక్షిని జేరి యుద్ధము చేసినట్లును, పదునెనిమిదక్షౌహిణుల బలము నాశము చెందినట్లును, భారతమును జదివినవారి కందఱికిని తెలిసి యుండును. కౌరవ పక్షమున సేనాధిపతులుగా నుండిన ద్రోణకృపాశ్వత్థామలను బట్టి యుభయసైనికులలోను పలువురు బ్రాహ్మణులు సహిత ముండి యుందురు. యుద్ధము చేసెడివారు బాలురును వృద్ధులునుగా నుండక సాధారణముగా వయస్సులో నున్నవారుగానే యుందురు గనుకను, అన్ని జాతులలోను లక్షలకొలఁది జనులు రణనిహతు లయిరి గనుకను, అన్ని జాతులలోను లక్షలకొలఁది వయస్సులో నున్న స్త్రీలు ఏకకాలమునందు విధవలయియుందురు. అందఱు పురుషులు ఏకకాలమునందు మృతులయి యుండుటచేత హిందూదేశమునం దా కాలమునందు పురుషులసంఖ్య యత్యల్పముగాను, స్త్రీలసంఖ్య యత్యధికముగాను ఉండెననుటకు లేశమయినను సందేహ ముండదు. అందుచేత నా కాలమునందు స్త్రీలకందఱకును వివాహమగుట సంభవింపఁ నేరదు గనుకను హిందువు లితరదేశములవారితో సంబంధములు చేయువారు కారు గనుకను అప్పుడు కొందఱికి మాత్రమే వివాహమగుటకుఁ దగిన

యేర్పాటు చేసికోవలసి వచ్చినది. అందునిమిత్తమయి పెద్దలందఱును సభచేరి ధర్మబుద్ధిచేత విచారించి వివాహితలయి కొంతకాలము కాకపోయినఁ గొంతకాలమయినను వివాహసుఖ మనుభవించినవారికి మాత్రము పునర్వివాహములు లేకుండఁజేసి, కన్యలకు మాత్రమే వివాహములగునట్లు స్త్రీలోక రక్షణార్థముగా నియమము నొకదానిని జేసిరి. అట్టి కట్టుపాటప్పుడు చేయకపోయిన పక్షమున, పురుషులు సాధారణముగా సద్యఃకాలమున కక్కఱకువచ్చెడు మితిమీఱియున్న యనాథలయిన యువతులనే వివాహము చేసికొందురు గనుకను, ఎప్పుడో యెదిగి కాపురమునకురాఁగల బాలికలను వివాహమాడ వాంఛింపరు గనుకను, కన్యలకు వివాహములుకాక వ్యభిచారాదిదోషములు ప్రబలును. అట్టి బాధకములను నివారించుటకై కొంతకాలము సౌఖ్యపడి తృప్తినొందియున్న వారికి వ్యభిచారాదులకు దిగకుండుటకు శక్యమగును గనుక వారికి వివాహములు మాన్పి కన్నియలకే మన పెద్ద లప్పటికి వివాహముల నేర్పఱిచిరి; వా రప్పుడంతకన్న చేయ వలసిన కార్య మేదియు లేదు. కొంతకాలము సౌఖ్య మనుభవించిన ముప్పదియేండ్ల యువతి యొకతెయు, పండ్రెండేండ్ల బాలిక యొకతెయు వివాహమునకుండి, పురుషుఁ డొక్కఁడుమాత్రమే దొరకెడు పక్షమున వివేకముగలవాఁ డెవ్వఁడైనను వయసుమీఱిన దాని నట్టేయుంచి కన్నియకు వివాహము చేయింపక మానఁడుగదా! ఆ ప్రకారము చేసి యప్పటి పెద్దలు పురుషు లేవిధముగా మనదేశమును విడువకుందురో, వ్యర్థులుగాక యేవిధముగా వివాహమున కక్కఱకు వత్తురో, యాయావిధములఁ జేయఁదగిన ప్రయత్నములను కట్టుపాటులను అన్నిటినిఁ జేసియున్నారు. వారప్పుడు పునర్వివాహములను మాన్పుటయేకాక, సముద్రయాత్రను, సన్యాసమును, వానప్రస్థాశ్రమమును,

దీర్ఘకాల బ్రహ్మచర్యమును, నరమేధమును, మహాప్రస్థానగమనమును, ఆతతాయిద్విజులధర్మ్యయుద్ధహింసనమును, మరణాంతికప్రాయోపవేశమును, అతిదూరతీర్థసేవనమును, భృగ్వగ్నిపతనమును, వృద్ధాదిమరణమును గూడ నిషేధించి యున్నారు. వారవ్వ డంతకంటె మఱియేమి చేయఁగలుగుదురు? ఆ కాలమున కాకట్టుపాటు సరిపడియే యుండినది. ఇప్పుడటువంటి యావశ్యకము మన దేశమున లేదు కనుకను, స్త్రీపునర్వివాహము లేకపోవుటవలన మన దేశమున కనేకానర్థములు కలుగుచున్నవి గనుకను, లోకరక్షణార్థమయి జీర్ణమయిపోయిన ధర్మము నవశ్యకముగా పునరుద్ధారణము చేయవలయుట వివేకశాలులయి దేశాభిమానము గలవారి కందఱికిని పరమధర్మము. పయి మనువచనమును బట్టియు, కలియుగాదిని పెద్దలేర్పఱిచిన కట్టుపాటులను బట్టియు, కాలానుగుణముగా స్మృత్యుక్త ధర్మములను సహితము విద్వాంసులు సభచేసి మార్చుకొన వచ్చునని యేర్పడు చుండఁగా జీర్ణమయిపోయిన ధర్మమును లోకరక్షణార్థము పునరుద్ధారణము చేయుటకు మనమేల సందేహపడవలెను? పూర్వులు నిషేధించిన సన్న్యాసము మొదలయిన వానిని కొందఱు పునరుద్ధారణము చేయుటకూడ దేశకాలానుసారముగా నిషేధించినవానిలో వేనినైనను పునరుద్ధారణము చేసికోవలెనని బోధించుచుండలేదా?

శ్లో. యత్కర్మ కుర్వతోఽస్య స్యా త్పరితోషోంతరాత్మనః
తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్.

మను. అ. ౪. ౧౬౧

అను మనువచనమును మూలసూత్రమునుగాఁ గైకొని పామరుల మాటలను వినక యేపని మీా యంతరాత్మకు సంతోషము కలిగించునో యా పనినే లోకోపకారముగాఁ జేయఁజూడుఁడు. ఇన్ని

విధముల శాస్త్రము స్త్రీపునర్వివాహ మాచరణీయమని బోధించు చున్నను, అది లేకపోవుటవలన లోకములో ననంతములైన నష్టములు కనఁబడుచున్నను, జనులను ఈ సత్కార్యమునుండి విముఖులనుగాఁ జేయునది యొక్క యాచారపిశాచముగాఁ గనఁబడుచున్నది.

శ్లో. స్మృతి ర్వేదవిరోధేతు పరిత్యాగో యథా భవేత్
తథైవ లౌకికం వాక్యం స్మృతిబాధే పరిత్యజేత్.

వేదవిరుద్ధముగా నున్నప్పుడు స్మృతి యేలాగున పరిత్యాజ్యమో స్మృతివిరోధమయిన యాచారము సహిత మాలాగుననే పరిత్యాజ్య మగును గాన పరాశరస్మృతికి విరుద్ధమయిన యీ యాచార మవశ్య ముగా విడిచిపెట్టవలసి యున్నది. శ్రుతిస్మృతులను మీఱి వర్తించు వారు శిష్టులు కారు గనుకను, వారి యాచారము సదాచారము కాదు గనుకను శిష్టాచారము ప్రమాణమన్నమాట యీ విషయమున వర్తింపదు.

దాయాది నిర్ణయ ప్రమాణములు

పైని జెప్పిన దంతయు విని నిజముగా స్త్రీ పునర్వివాహము శాస్త్రసమ్మతమే యయిన యెడల, పునర్వివాహితల పుత్రులకు దాయ మెక్కడఁ జెప్పఁబడెననియు, పునర్వివాహమునకు మంత్రము లెక్కడ నున్నవనియు, తండ్రికి మరల కన్యాదానము చేయుటకు స్వత్వ మెట్లు కలుగుననియు, జాతాశౌచ మృతాశౌచములకు విధు లెక్కడ నున్నవనియు, పూర్వభర్తయొక్క శ్రాద్ధ మెవ్వరు పెట్టవల యుననియు, పునర్వివాహమున కన్యను ఏగోత్రమున దానము చేయ వలయుననియు, వపనము జరిగిన స్త్రీగతి యేమికావలయు ననియు, ప్రతిపక్షులు ప్రశ్న చేయవచ్చును. కాఁబట్టి యీ యంశముల కన్నిటి కిని సంగ్రహముగా సమాధానములు చెప్పెదను.

౧. దాయము. —పరాశరస్మృతినిబట్టి స్త్రీ పునర్వివాహము వలనఁ బుట్టిన పుత్రులు ఈ యుగమున ఔరసులే యగుదురు గాన వారికి మొదటి భార్యవలనఁ గలిగిన పుత్రులకు వలెనే దాయము వచ్చును. పూర్వయుగములయందు సహితము పౌనర్భవులకు దాయము సమస్త స్మృతులయందును జెప్పఁబడి యున్నది.

శ్లో. ఔరసః పుత్రికాపుత్రః క్షేత్రజో గూఢజ స్తథా
కానీనః పంచమప్రోక్త ష్షష్ఠః పౌనర్భవః స్మృతః.
దత్తః క్రీతః కృత్రిమశ్చ స్వయందత్త ఇతీరితః
సహోఢ జోపవిద్ధశ్చ పుత్రా ద్వాదశ కీర్తితాః.

* * * *

పిండ దోంశ హార శ్చైషాం పూర్వాభావే పరఃపరః

యాజ్ఞవల్క్యస్మృతి.

అని యాజ్ఞవల్క్యుఁడు ద్వాదశవిధ పుత్రులను జెప్పి వారు వరుసగా నొకరి యభావమునం దొకరు తండ్రి కపరక్రియలు జరపి శ్రాద్ధము పెట్టుటకును, దాయమును బొందుటకును నర్హులని నిర్ణయించియున్నాఁడు; అంతేకాక యతఁడు పౌనర్భవుని దత్తపుత్రుని కంటె ముఖ్యునిగాఁగూడ నేర్పఱిచి యున్నాఁడు.

శ్లో. ద్వౌతు యౌ వివదేయాతాం ద్వాభ్యాం జాతౌ స్త్రియా ధనే
తయో ర్యద్యస్య పిత్ర్యం స్యా త్తత్సగృహ్ణీత నేతరః.

మనుస్మృతి, ౯ ౯.

ఇద్దఱు తండ్రులవలన నొక్క స్త్రీయందుఁ గలిగిన పుత్రులు తమ తల్లియొద్ద నున్న ధనము నిమిత్తము వివాదపడెడు పక్షమున, ఎవని తండ్రిసొత్తును వాఁడు పొందవలయునే కాని యితరమును పొందఁ గూడదు అని మనువు చెప్పియున్నాఁడు.

శ్లో. అనేక పితృకాణాం చ పితృతో భాగకల్పనా
యస్య యత్ పైతృకం రిక్థం స తద్గృహ్ణీత నేతరః.

విష్ణుస్మృతి.

అను విష్ణువచనమునుబట్టి స్త్రీకి మొదటిభర్తవలనను రెండవ భర్తవలనను గూడ సంతాన మున్నయెడల వారు తండ్రులనుబట్టి భాగము పంచుకోవలసినవా రగుదురు.

౨. మంత్రములు:— పురుషులకువలెనే స్త్రీలకును మొదటి మంత్రములే ద్వితీయవివాహమునకును పనికివచ్చును. తొమ్మిదిసంవత్సరములదానికిఁగాని పండ్రెండు సంవత్సరములదానికిఁగాని వివాహము చేయునప్పుడు మంత్రములయందలి "కన్యామ్" అను పదమును "రోహిణీమ్" అనికాని, "రజస్వలామ్" అనికాని మార్చునట్లే స్త్రీపునర్వివాహమునందును మంత్రములను మార్చవలసిన యావశ్యకము లేదు. పూర్వోదాహృతమయిన "విధవా యా భవేత్కన్యా" మొదలయిన స్మృతివచనములను బట్టి విధవకు సహితము కన్యాశబ్ద వ్యవహారము కలదు గాన ద్వితీయ వివాహమునందును పూర్వమంత్రములే నిరాక్షేపముగా నుపయోగింపఁబడవచ్చును. ఒకపక్షమున మొదటి మంత్రములు ఒక్క పురుషుల విషయమున మాత్రమే పనికిరావని చెప్పవచ్చును. దానవాక్యములో "స్నాతకాయ కన్యార్థినే తుభ్యమహం సంప్రదదే" యని కన్యను గోరెడు స్నాతకుఁడవైన నీకు నేను కన్య నిచ్చుచున్నానని యుండుటవలననుఁ ద్వితీయవివాహము చేసికొనువాఁడు స్నాతకుఁడెన్నఁడును కానేరఁడు గనుకను, విధుర విషయమున దాన వాక్యమెట్లుపయోగించును?

శ్లో. అవిప్లుత బ్రహ్మచర్యో లక్షణ్యాం స్త్రియ ముద్వహేత్
అనన్య పూర్వికాం కాంతా మసపిండా మవీయసీమ్.

అను యాజ్ఞవల్క్య వచనమునుబట్టి బ్రహ్మచారి లక్షణవంతు రాలును, పరపూర్వ కానిదియు, మనోహరురాలును, అసపిండురాలును వయస్సుచే. చిన్నదియు నగు స్త్రీని వివాహమాడవలయునని విధి యగుటవలన, యనన్యపూర్వికా యనుటచే వివాహితకు మరల వివాహము కూడదనియు శంకింపవచ్చును. యాజ్ఞవల్క్యుఁడు స్త్రీవిషయమున "అనన్యపూర్వికా" యన్నట్టే పురుషవిషయమున "అవిప్లుత బ్రహ్మచర్య" యని కూడఁ జెప్పియున్నాఁడు. ఈ ప్రకారముగానే బోధాయనులు "శ్రుతిశీలినే విజ్ఞాయ బ్రహ్మచారిణేఽర్థినే దేయా" యని వేదాభ్యాసకుఁడును, సదాచారసంపన్నుఁడును, బ్రహ్మచారియు నైన వరునకు కన్య నియ్యవలయుననియే చెప్పియున్నాఁడు. వీని యవ యవార్థమునే మనము పుచ్చుకొన్నయెడల పురుషులలో సహితము బ్రహ్మచారులకు తప్ప మఱియెవ్వరికిని వివాహము కాకపోవలసి యుండును. ఈ సామాన్యవిధుల కపవాదములుగా స్త్రీలకువలెనే పురుషులకును పునర్వివాహవిషయమున విశేషవిధు లనేకములు కనఁబడు చున్నందున, కన్యావరు లట్టి లక్షణములు కలవారగుట ప్రశస్తమనియే కాని విధియని యేర్పడదు. అంతేకాక,—

శ్లో. పతిం హిత్వాపకృష్టం స్వముత్కృష్టం యా నిషేవతే
నింద్యైవ సా భవే ల్లోకే పరపూర్వేతి చోచ్యతే.

అను మనువచనమువలన హీనుఁడగు పతిని విడిచిపెట్టి ఘనుఁ డగువానిం జేరినదే పరపూర్వ యగును గాన, అట్టిదానిని వివాహ మాడఁగూడదనియైనను "అనన్య పూర్వికా" శబ్దముచేత నర్థము చేయవచ్చును.

3. కన్యాదాత:—ప్రథమ వివాహమునందు వలెనే ద్వితీయ వివాహమునందును కన్యాదాతలు తండ్రి మొదలగువారే.

శ్లో. పితా దద్యాత్స్వయం కన్యాం భ్రాతా వానుమతే పితుః
మాతామహో మాతులశ్చ సకుల్యో బాంధవస్తథా.
మాతాత్వభావే సర్వేషాం ప్రకృతౌ యదివర్తతే
తస్యామప్రకృతిస్థాయాం కన్యాం దద్యుస్స్వజాతయః.

నారదసంహిత.

అని నారదుఁడు ప్రథమ ద్వితీయ వివాహవివేచనము చేయక సామాన్యముగా కన్యను దానము చేయవలసినవారు తండ్రి మొదలు కొని స్వజాతివారు వఱకును జెప్పియున్నాఁడు. కాఁబట్టి పునర్వివాహము నందు కన్యను పునర్దానము చేయవలసినవారు తండ్రి మొదలగువా రనుట కే యాక్షేపమును లేదు. పూర్వము దివోదాసుఁడు తన కొమారై యైన దివ్యాదేవిని, ఐరావతుఁడు తన కూఁతురైన యులూపిని, పునర్దానము చేసినట్లు వెనుక నుదాహరించిన పురాణవచనములవలనఁ గూడ స్పష్టమగుచున్నది. ఇందుమీఁద నొకసారి యిచ్చివేసిన కన్యను మరల నిచ్చుటకు తండ్రి మొదలగువారికి స్వత్వ మెక్కడనుండి వచ్చు నని సందేహము తోఁచవచ్చును. స్త్రీ పునర్వివాహమునకు విధు లెప్పు డున్నవో యప్పుడే పునర్దానము శాస్త్రవిహిత మగును గనుక, అట్టి సందేహమున కవకాశమే లేదు. కన్యాదానము వధూవరు లిద్దఱుఁను యావజ్జీవము పరస్పర సౌఖ్యము నిమిత్తమును ధర్మప్రజోత్పత్త్యర్థమును కలిసి యుండుటకయి యేర్పడిన వివాహసంబంధము యొక్క పూర్వాంగమే కాని దాత కన్యయెడలఁ గల తన సత్వమును పూర్ణముగా వదలు కొని యన్యునకు స్వత్వము కలుగఁజేయుట కాదు. అట్లు కానియెడల పూర్వోక్త నారదవచన ప్రకారముగా, కన్యక విషయమున బొత్తిగా స్వత్వము లేని స్వజాతివారు సహితము కన్యను దానము చేయుట కెట్లర్హు లగుదురు? తక్కిన సమస్త దానములయందును "సంప్రద

దేన మమ" .ఈవస్తువు 'నీ కిచ్చుచున్నాను; ఇఁక నాది కాదు' అని యుండి కన్యాదానమునందు మాత్రము 'న మమ" 'నాది కాదు' అను మాట యుండఁగూడదని విధులుండుటయు, కన్యాదాన మాత్రముననే మగని యధీనురాలుగాక యుక్తవయస్సు వచ్చుపర్యంతము జనకుని యింటనే యుండవలయుటయు, దానమాత్రము చేతనే పుత్రికాత్వము పోక జనకుని సొత్తునకు పుత్రికయు నామె పుత్రులును కర్త లగుటయు, విధవకు పరాశరుఁడు పితృగృహ నివాసమే విధించుటయు, దుహిత విషయమయిన స్వత్వము తండ్రికి కన్యాదానమాత్రమున పోదనుటకు జాలిన నిదర్శనములుగా నుండవచ్చును. అట్లు కాదేని, స్త్రీ పునర్వివాహమును విధించెడి శ్రుతిస్మృతిపురాణ వచనములన్నియు నిష్ప్రయోజనములు కావలసివచ్చును.

౪. జాతాశౌచ మృతాశౌచములు:— తల్లి విషయమున కొమాళ్ళు కాని, భార్యవిషయమున భర్త కాని, పట్టవలసిన సూతకాదులనుగూర్చి యిప్పుడు సందేహమేదియు లేదు. ఆవిషయమున సామాన్యవిధులే పనికివచ్చును. ఇఁక నొక స్త్రీకి పూర్వభర్తవలనను పరభర్తవలననుకూడ సంతానాదికము కలిగినయెడల వారిలో వారికి మాత్రము సూతకాదులు నిర్ణయింపవలసి యుండును.

శ్లో. మాత్రైకయా ద్విపితృకౌ భ్రాతరా వన్యగోత్రజౌ
ఏకాహం సూతకే తత్ర త్రిరాత్రం మృతకే తయోః.

మరీచి స్మృతి.

అను మాధవాచార్య ధృతమయిన మరీచివచనము ఒక తల్లి యం దిద్దఱు తండ్రులవలనఁ బుట్టిన వేఱువేఱు గోత్రములుగల సోదరుల విషయమయి యన్యోన్యము పురుడు ఒక్క దినమేయనియు, మృతాశౌచము మూఁడుదినములనియు విధించుచున్నది. వా రేకగోత్రజు

లయిన పక్షమున ఆశౌచము పదిదినము లన్నమాట వేఱుగ చెప్ప నక్కఱయే లేదు.

౫. పూర్వభర్తృ శ్రాద్ధము:— పునర్వివాహిత ప్రథమ భర్త వలన సంతానముకలది యైనప్పుడు అతని శ్రాద్ధవిషయమయి సందేహమే లేదు.

శ్లో. అపుత్రా శయనం భర్తుః పాలయంతీ వ్రతే స్థితా
పత్న్యేవ దద్యా త్తత్పిండం కృత్స్న మంశం లభేతచ —మనువు

అను విజ్ఞానేశ్వరధృత వృద్ధమను వచనము వలన అపుత్రవంతురాలు భర్తృశయన పరిపాలనము చేయుచు, బ్రహ్మచర్య వ్రతమునం దున్నయెడలనే భర్తకు పిండప్రదానముచేసి భాగమును స్వీకరింప వలయునని విధించుటచేత, స్త్రీ బ్రహ్మచర్యవ్రతమును మాని వివాహ మాడినయెడల శ్రాద్ధము పెట్టనక్కఱ లేదని స్పష్టమగుచున్నది. స్త్రీ పునర్వివాహమువలన మఱియొక గోత్రమునకు మాఱును గనుకను, మొదటిభర్త కుటుంబముతోడి సంబంధమును పూర్ణముగా వదులుకొని యాశ్రమాంతరమును స్వీకరించును గనుకను, పూర్వ భర్తయొక్క శ్రాద్ధాదులు పెట్టకుండుట న్యాయమే. పురుషుఁడు సహితము దత్తుఁడై యన్య గోత్రమునకు మాఱినప్పుడును తన కుటుంబముతోడి సంబంధమును వదులుకొని సన్యాసాశ్రమమును స్వీకరించినప్పుడును జనకుని యొక్క శ్రాద్ధమునే పరిత్యజించునుగదా?

౬. గోత్రము— కన్యాదానము తండ్రిగోత్రముననే యవశ్యముగా జరగవలయును. గోత్రశబ్దార్థమును కొంచెము విచారించిన పక్షమున సందేహమే కలుగకపోవును.

శ్లో. జమదగ్ని ర్భరద్వాజో విశ్వామిత్రాఽత్రి గౌతమాః
వశిష్ఠ కాశ్యపాఽగస్త్యా మునయో గోత్రకారిణః.
ఏతేషాం యాన్యఽపత్యాని తాని గోత్రాణి మన్యతే.

జమదగ్ని, భరద్వాజుఁడు, విశ్వామిత్రుఁడు, అత్రి, గౌతముఁడు, వశిష్ఠుఁడు, కాశ్యపుఁడు, అగస్త్యుఁడు, గోత్రకర్తలనియు, వీరిలో నెవరి గోత్రమునఁ బుట్టినవారు వారిగోత్రము కలవారగుదురనియు పై స్మృతివచనములు బోధించుచున్నవి. ఇందువలన తండ్రి గోత్రమే కొమార్తెదియు నగుననుట నిస్సందేహముకదా ?

శ్లో. స్వగోత్రా ద్భ్రశ్యతే నారీ వివాహాత్సప్తమే పదే
పతిగోత్రేణ కర్తవ్యా తస్యాః పిండోదక క్రియా.

అను లఘుహారీత వచనమునుబట్టి స్త్రీ వివాహమువలన సప్తపది యందు తన గోత్రమును పోగొట్టుకొనుననియు, పతిగోత్రముచేత నామె పిండోదకక్రియలు చేయవలయుననియు, కనబడుచున్నది. ఇందలి పూర్వార్థముచేతనే స్వగోత్రము మాయునని కనఁబడు చుండఁగా మరల ఉత్తరార్థముచేత నామె పిండోదకక్రియలు పతి గోత్రమున చేయవలయునని చెప్పుటచేత కర్మలు చేయునప్పుడు భర్తగోత్రమున చేయవలసినను తనగోత్రమునుకూడ నామె కలిగి యుండుననియే యూహింపఁదగియున్నది.

శ్లో. సంస్కృతాయాం తు భార్యాయాం సపిండీకరణాంతికం
పైతృకం భజతే గోత్ర మూర్ధ్వంతు పతిపైతృకమ్.

అను కాత్యాయన వచనమువలన కర్మకు పతిగోత్రమునే యుపయోగించినను, వివాహితయైన స్త్రీ తన సపిండీకరణమువఱకును తన పితృగోత్రమునే ధరించుననియును, అటుపిమ్మట పూర్ణముగా భర్తృగోత్రమును పొందుననియు స్పష్టమగుచున్నది. ఇందుచేతనే వివాహితస్త్రీ తనతండ్రికి గయాశ్రాద్ధాదులుచేయుట కర్హురాలగుచున్నది.

శ్లో. అముష్య పౌత్రిం చాముష్య పుత్రిం చాముష్య గోత్రజాం
ఇమాం కన్యాం వరాయాస్మై వయం తద్వృణీమహే
శ్రుణుధ్వ మితి వై బ్రూయా దసౌ కన్యాప్రదాయకః.

అనుటవలన కన్యాప్రదాత ఫలానివాని పౌత్రియు, ఫలాని వాని పుత్రియు, ఫలానివాని గోత్రమునఁ బుట్టినదియును, అగు నీకన్యను ఈ వరున కిచ్చుచున్నానని యందఱి ముందఱ నుపలుకవలసినట్లు కనఁబడుచున్నది. ఒకసారి వివాహమాడిన మాత్రమున స్త్రీ తన పితామహునకు పౌత్రియు జనకునకు పుత్రికయుఁ గోత్రమునఁ బుట్టినదియు కాకపోదు గనుక,-

శ్లో. వరగోత్రం సముచ్చార్య ప్రపితామహ పూర్వకమ్
నామసంకీర్తయే ద్విద్వాన్ కన్యాయాశ్చైవ మేవ హి.

ప్రపితామహపూర్వకముగా వరగోత్రము నుచ్చరించి నామము ను ప్రకటించి యదేప్రకారముగా కన్యయొక్క గోత్రనామములను జెప్పవలసిన వివాహమంత్రములయందు కన్యయొక్క పితృగోత్రముతప్ప మఱియొక్కగోత్రము ఉచ్చరించుటకు మంత్రములను బట్టియే యవకాశము లేదు. కాఁబట్టి కన్య యవశ్యముగా పితృగోత్రముతోనే పునర్దానము చేయఁబడవలయును.

౭. ముండనము —"మృతభర్తృకకు మగఁడుపోయిన పదవ దినమున శిరోముండనము చేయవలయునుగదా ? పునర్వివాహమును చేసికొనెడి స్త్రీకి అట్టిపనిని చేయఁగూడదని యెక్కడనైన విధి యున్నదా" యని కొందఱడుగవచ్చును. స్త్రీకి పదవదినమున తల గొరిగించుట లౌకికమేకాని స్మృతిసమ్మతము కాదు; అట్టి ముండనమును విధించు మంత్రము లెక్కడను కనఁబడవు. స్త్రీలకు కేశవపనము లేదని పెక్కుస్మృతులు లైకకంఠ్యముగా ఘోషించుచున్నవి. పరాశరుఁడును,-

శ్లో. సర్వాన్ కేశాన్ సముద్ధృత్య ఛేదయే దంగుళద్వయమ్
ఏవం నారీ కుమారీణాం శిరసో ముండనం స్మృతమ్.

న స్త్రియాగ కేశవపనమ్ న దూరే శయనాసనమ్
న చ గోష్ఠే వసేద్రాత్రౌ న దివాగా అనువ్రజేత్
నదీషు సంగమేచైవ అరణ్యేషు విశేషతః
న స్త్రీణా మజినం వాసో వ్రతమేవ సమాచరేత్.

అని తొమ్మిదవ యధ్యాయమున స్త్రీలకుఁగాని బాలికలకుఁగాని యెక్కడనైనను ముండనము విధించిన పక్షమున కేశముల నన్నిటిని వదలివేసి చివర రెండంగుళములు మాత్రము ఖండింపవలయు ననియు, బ్రహ్మచర్యాది వ్రతములయందు స్త్రీల కెప్పుడును కేశవపనము లేదనియు స్పష్టపఱిచి యున్నాఁడు. ఈ పైని వ్రాసిన దానివలన ప్రతిపక్షులు సాధారణముగాఁ జేయు ముఖ్యమయిన యాక్షేపణల కన్నిటికిని సంగ్రహముగా సమాధానములు వచ్చినవని తలఁచెదను.

పౌనర్భవ విచారము

కొందఱు చెప్పిన దంతయు నొప్పుకొని స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమే కాని ద్వితీయవివాహము చేసికొన్నవారును తత్సంతతివారును ప్రథమవివాహితలకంటెను తత్సంతతివారికంటెను తక్కువవారనియు, వారు అపాంక్తేయులును, హవ్యకవ్యముల కనర్హులు నగువా రనియు; వారు ప్రత్యేకజాతిగా నుండఁదగినవారనియు వాదించుచు తెలియనివారిని భ్రమింపఁజేయుదురు. అట్టివారు చూపెడు ప్రమాణములను గూర్చి కొంత విమర్శింతము.

మనుస్మృతి, తృతీయాధ్యాయము

శ్లో. చికిత్సకాన్ దేవలకాన్ మాంసవిక్రయిణ స్తథా
విపణేన చ జీవంతో వర్జ్యా స్స్యు ర్హవ్యకవ్యయోః. ౧౫౨
ప్రేష్యో గ్రామస్య రాజ్ఞశ్చ కునఖీ శ్యావదంతకః
ప్రతిరోద్ధా గురోశ్చైవ త్యక్తాగ్ని ర్వార్ధుషిక స్తథా. ౧౫౩

యక్ష్మీచ పశుపాలశ్చ పరివేత్తా నిరాకృతిః
బ్రహ్మద్విట్ పరివిత్తిశ్చ గణాభ్యంతర ఏవ చ. ౧౫౪
కుశీలవోఽవకీర్ణీ చ వృషలీపతి రేవ చ
పౌనర్భవశ్చ కాణశ్చ యస్య చోపపతి ర్గృహే. ౧౫౫
భృతకాధ్యాపకో యశ్చ భృతకాధ్యాపిత స్తథా
శూద్రశిష్యో గురుశ్చైవ వాగ్దుష్టః కుండగోళకౌ. ౧౫౬
అకారణపరిత్యక్తా మాతాపిత్రో ర్గురో స్తథా
బ్రాహ్మైర్యానైశ్చ సంబంధై స్సంయోగం పతితైర్గతః. ౧౫౭
అగారదాహీ గరదః కుండాశీ సోమవిక్రయీ
సముద్రయాయీ వందీచ తైలికః కూటకారకః. ౧౫౮
పిత్రావివదమానశ్చ కితవో మద్యప స్తథా
పాపరోగ్యఽభిశ స్తశ్చ దాంభికో రసవిక్రయీ. ౧౫౯
ధనుశ్శరాణాం కర్తాచ యశ్చాగ్రే దిధిషూపతిః
మిత్రద్రు గ్ద్యూతవృత్తిశ్చ పుత్రాచార్య స్తథైవ చ. ౧౬౦
భ్రామరీ గండమాలీచ శ్విత్ర్యథో పిశున స్తథా
ఉన్మత్తోఽంధశ్చ వర్జ్యాః స్యు ర్వేదనిందక ఏవ చ. ౧౬౧
హస్తిగోఽశ్వోష్ట్ర దమకో నక్షత్రై ర్యశ్చ జీవతి
పక్షిణాం పోషకో యశ్చ యుద్ధాచార్య స్తథైవ చ. ౧౬౨
స్రోతసాం భేదకో యశ్చ తేషాం చావరణేరతః
గృహసంవేశకో దూతో వృక్షారోపక ఏవ చ. ౧౬౩
శ్వక్రీడీ శ్యేనజీవీ చ కన్యాదూషక ఏవ చ
హింస్రో వృషలవృత్తిశ్చ గణానాం చైవ యాజకః. ౧౬౪
ఆచారహీనః క్లీబశ్చ నిత్యం యాచనక స్తథా
కృషిజీవీ శ్లీపదీచ సద్భిర్నిందిత ఏవ చ. ౧౬౫

ఔరభ్రికో మాహిషికః పరపూర్వాపతి స్తథా
ప్రేతనిర్యాతకశ్చైవ వర్జనీయాః ప్రయత్నతః. ౧౬౬
ఏతాన్ విగర్హితాచారా నపాంక్తేయాన్ ద్విజాధమాన్
ద్విజాతిప్రవరో విద్వా నుభయత్ర వివర్జయేత్. ౧౬౭

ఆయాస్మృతులు ప్రత్యేకముగా పునర్భువు నేప్రకారముగా నిర్వచించి పునర్భువులను పునర్భూపుత్రులను ఎట్టివారినిగాఁ జెప్పినవో యాసంగతి నించుకయు విచారింపక, పునర్భూలక్షణ మొక స్మృతినుండియు తద్దూషణము మఱియొక స్మృతినుండియు పుచ్చుకొని మనసువచ్చినట్టుగా నొకదానితో నొకటి కలిపి పాడుచేయుటవలన నీయసందర్భార్థము పొసగినదే కాని దేనికది ప్రత్యేకముగా విమర్శించినపక్షమున విధివిహితముగా పునర్వివాహము చేసికొన్నవారు పునర్భువులే కారనియు, ఒకవేళ పునర్భూనామము వారికిఁగూడ కలిగినను వారు నింద్యులైన నిషిద్ధ పునర్భూజాతిలో చేరరనియు, నిమిషములో స్పష్టము కాఁగలదు. "ఋషీణాం మతయశ్చ భిన్నాః" అని యుండుటచే తక్కిన సమస్తవిషయములయందువలెనే పునర్భూనిర్ణయమునందును స్మృతికర్తలు భిన్నాభిప్రాయము కలవారుగానే యున్నను, అన్నిఁటిని సమన్వయము చేసెడి పక్షమున విధ్యుక్తవివాహ మాడిన పునర్భువు లెంతమాత్రమును దూష్యులు కారనియే సిద్ధాంత మేర్పడును.

౧. శ్లో. సప్తపౌనర్భవాః కన్యా వర్జనీయాః కులాధమాః
వాచాదత్తా మనోదత్తా కృతకౌతుకమంగళా.
ఉదకస్పర్శితా యా చ యా చ పాణిగృహీతికా
అగ్నిం పరిగతా యా చ పునర్భూ ప్రభవా చ యా.
ఇత్యేతాః కాశ్యపేనోక్తా దహన్తి కులమగ్నివత్ - కాశ్యపస్మృతి

అని కశ్యపుఁడు వాగ్దత్తలను, మనోదత్తలను, మంగళస్నానాదికము చేసినవారిని, ఉదకస్పర్శితలను, పాణిగృహీతకలను, అగ్నిప్రదక్షిణము చేసినవారిని, పునర్భూప్రభవలను, ఏకవిధముగా నీ యేడుగురను పునర్భువులనుగాఁ జెప్పి వారు కులము నగ్నిహోత్రమువలె కాల్చివేయుదురని దూషించియున్నాఁడు. దీని యవయవార్థమునే మనము పుచ్చుకొని ప్రవర్తింతుమేని, ఇంచుమించుగా లోకములోని కన్నియ లందఱును పునర్భువులే యయి దూష్యురాండ్రు కావలసి వచ్చును. ఎల్లవారికిని తమకూఁతులను మొదట మనసులో నొకరి కియ్యవలె ననుకొనియు, వారి కిచ్చెదమని నోటితో చెప్పియు, మంచి వరుఁడు లభించిన యెడల తమ యుద్దేశమును మార్చుకొనుట సహజమయి యుండును. అంతేకాక పయిని జెప్పఁబడినవారిలో మొదటి యైదు తెగలవారికిని మనమిప్పుడు నిరాక్షేపముగా వివాహములు చేయుచునే యున్నాము. అట్టి కన్నియలు పునర్భువులని చెప్పుట కెవ్వరును సాహసింపరు.

శ్లో. దత్త్వాం న్యాయేన యః కన్యాం వరాయి న దదాతి తాం
అదుష్టశ్చే ద్వరో రాజ్ఞా సదండ్య స్తత్ర చోరవత్ - నారదుఁడు.

న్యాయముచేత నియ్యఁబడిన కన్యను వరున కెవ్వఁడియ్యఁడో వాఁడు వరుఁడు దుష్టుఁడు కానిపక్షమున రాజుచే చోరునివలెనే దండ్యుఁడగునని చెప్పు నారదాది స్మృతివచనముల ననుసరించి పై కాశ్యప వచనమునకు అదుష్టవరపరమని సంకోచము కల్పించి శాస్త్రోదితమయిన వరదోషము లేక ధనాశచేతను ద్వేషముచేతను వివాహము చేసినప్పుడుమాత్రమే వాగ్దత్తాదులు పునర్భువు లగుదురని నిర్ణయము చేసియున్నారు. ఈప్రకారముగానే బోధాయనులును,—

వాచాదత్తా మనోదత్తాఽగ్నింపరిగతా
న ప్తమంపదం నీతా భుక్తా గృహీతగర్భా

ప్రసూతా చేతి సప్తవిధా పునర్భూ స్తాం
గృహీత్వా న ప్రజాం న ధర్మం విందేత.

వాగ్దత్తాదులగు సప్తవిధ పునర్భువులను చెప్పి కశ్యపుఁడు చెప్పిన వారిలో నడుమ కొందఱిని వదలి సంభోగసౌఖ్య మనుభవించిన దానిని, గర్భము ధరించిన దానిని, సంతానము కన్నదానిని గూడఁజేర్చి వారిని గ్రహించి సంతానమును ధర్మమును పొందఁ గూడదని విధించి యున్నాఁడు. అనేకస్మృతులు వాగ్దత్తాదులకు వివాహమును విధించుచున్నవి. ఇందుకు నిదర్శనముగా కాత్యాయనుఁడు,—

శ్లో. వరే దేశాంతరగతే త్రీన్మృతూ న్సంప్రతీక్ష్య వా
కన్యాన్యస్మై ప్రదాతవ్యా వాగ్దానేతు కృతే సతి.
పంచత్వం చే ద్వరో గచ్ఛేత్ వాగ్దానేతు కృతే సతి
కన్యాన్యస్మై ప్రదాతవ్యా తథా సప్తపదాత్పరమ్.

వరుఁడు వాగ్దానాంతరము దేశాంతరము పోయినను, మృతుఁడయినను, కన్యను మఱియొకని కియ్యవలెనని చెప్పుచున్నాఁడు. ఆ ప్రకారముగా నే లోకములో సర్వసాధారణముగా వ్యవహారమును జరుగుచున్నది. అట్టి కన్యకల నెవ్వరును పునర్భువులనిగాని తక్కువ వారనిగాని యెంచరు. దీనినిబట్టి చూడఁగా పునర్భువులను నిందించిన యా స్మృతియందుఁగాని మఱియొక స్మృతియందుఁగాని వివాహ మెవ్వరికి విధింపఁబడెనో వారు పునర్భూ నిర్వచనమునకు లోఁబడినవా రయినను వారికి పునర్భూనామము చెందదనియు, వారేవిధముచేతను తక్కినవారికంటె తక్కువవారు కారనియు విస్పష్ట మగుచున్నది. సప్తపదికి పూర్వమునం దనేకస్మృతులలో వివాహము విధింపఁబడినది గనుక నట్టివారు పునర్భువులు గాకుండవచ్చును గాని సప్తపద్య నంతరము వివాహమాడువారు పునర్భువులు కాకతప్పరని కొంద

అనవచ్చును. సప్తపదికి పూర్వమునందు వివాహమును విధించిన కాత్యాయనవచనమే "తథా సప్తపదాత్పర" మని సప్తపది తరువాత సహితము మృతభర్తృకకు పునర్వివాహము విధించుచున్నది గనుక పూర్వము చెప్పిన హేతువుచేతనే సప్తపద్యనంతరము శాస్త్రవిహిత మయిన వివాహము చేసికొన్నవారు సహితము పునర్భువులు కారు. మఱియు పునర్భువుల నాప్రకారముగా నిందించిన బోధాయనుఁడే తన స్మృతిలోని వివాహప్రకరణమునందు,-

శ్లో. నిసృష్టో వా హతో వాపి యస్యా భర్తా మ్రియేతి వా
సా చే దక్షతయోని స్యాత్ గతప్రత్యాగ తాపివా
పౌనర్భవేన విధినా పున సంస్కార మర్హతి.

భర్త నష్టుఁడయినప్పుడును హతుఁడయినప్పుడును మృతుఁడయినప్పుడును అక్షతయోనికి పునరుద్వాహమును విధించుచున్నాఁడు. ఇందువలన బోధాయనుని యభిప్రాయము విధ్యనుసారముగా వివాహితలయినవారు తప్ప తక్కిన స్త్రీలే పునర్భువు లగుదురనియు శాస్త్రమును తిరస్కరించి వివాహము చేసుకొనువారు మాత్రమే పునర్భువులును దూష్యులును అగుదురనియు ననుట కరతలామలక మయిన విషయమే కాఁబట్టి "నష్టే మృతే" లోనుగాగల పునరుద్వాహ విధుల ననుసరించి వివాహము చేసికొన్నవారు పునర్భువులు కారనియు ఏస్మృతియందు పునర్భూలక్షణ మేవిధముగాఁ జెప్పఁబడినను శాస్త్రవిధుల నతిక్రమించి వివాహమాడినవారును వారి సంతతివారును మాత్రమే పునర్భువులును పౌనర్భవులును నయి నింద్యు లగుదురనియు పరమసిద్ధాంత మగుచున్నది.

౨. ఒకవేళ యౌగికముగా పునర్వివాహము చేసికొనెడి స్త్రీలందఱియందును పునర్భూశబ్దము వర్తించినను, పునర్భువులను దూషిం

చెడి సామాన్యవిధుల కపవాదములుగా నుండు విశేషవిధులచేత విధ్యుక్తరీతిని వివాహము చేసికొన్న స్త్రీలును వారి కొమాళ్ళు మొదలయినవారును పరిరక్షింపఁబడి యెంతమాత్రమును వారు దూష్యులు కాకయే యుందురు ఎట్లనఁగా,—

శ్లో. దారాగ్నిహోత్రసంయోగం కురుతే యోऽగ్రజే స్థితే
పరివేత్తా స విజ్ఞేయః పరివిత్తిస్తు పూర్వజః.

మనువు. అ 3, శ్లో. ౧౭౧

అను వచనమునుబట్టి అన్నకు ముందు వివాహమాడువాఁడు పరివేత్త యనంబడును. అట్టి పరివేత్త పాపాత్ముఁడయిన నరకమును పొందుననియు బహుస్మృతులు ఘోషించుచున్నవి. పౌనర్భవాదులను పంక్తిబాహ్యులనుగాఁ జెప్పిన పూర్వోదాహృత మనువచనములలోనే పరివేత్తకూడ అపాంక్తేయుఁడుగాను హవ్యకవ్యముల కక్కఱకు రానివాఁడుగాను పరిగణింపబడి యున్నాఁడు. అయినను,-

శ్లో. కుబ్జవామన షండేషు గద్గదేషు జడేషు చ
జాత్యంధే బధిరే మూకే న దోషః పరివేదనే.

అని స్మృత్యంతరమునందు. జ్యేష్ఠభ్రాత కుబ్జుఁడుగాఁ గాని, వామనుఁడుగాఁగాని, నపుంసకుఁడుగాఁగాని, వణఁకుగలవాఁడుగాఁ గాని, జడుఁడుగాఁగాని, జాత్యంధుఁడుగాఁగాని, చెవిటివాఁడుగాఁగాని, మూగవాఁడుగాఁగాని ఉన్నయెడల పరివేదనమువలన దోషము లేదని అపవాదవిధి కనఁబడుచున్నది. అందుచేత అన్నకు ముందుగా వివాహము చేసికొన్నవాఁడగుటచే నతఁడు పరివేత్తయైనను, అన్నయందు కుబ్జత్వాది దోషము లున్నప్పుడు విధ్యనుసారముగా వివాహము చేసికొన్న కనిష్ఠభ్రాత యెన్నఁడు నపాంక్తేయుఁడును దూష్యుఁడును కానేరఁడు. అదేప్రకారముగా ద్వితీయవివాహము చేసుకొన్న స్త్రీ

లందఱును పేరున పునర్భువులే యగుదురని యొప్పుకొన్నను నష్టే మృతేత్యాది స్మృతివచనముల ననుసరించి వివాహముల చేసికొన్న వారును వారిపుత్త్రాదులును పంక్తి కనర్హులును దూష్యులును కారు.

3. ప్రతిస్మృతిని ప్రత్యేకముగాఁ జదివి యా స్మృతికర్త చెప్పిన పునర్భూ లక్షణములను పునర్భువుల యోగ్యతను పరీక్షించిన యెడల, విధివిహితముగా పునర్వివాహ మాడిన స్త్రీ లేవిషయమునను తక్కువవారుగా నుండనట్లు తెలిసికోవచ్చునని యీవఱకే తెలిపి యున్నాను. కొందఱు స్మృతికర్తలు శాస్త్రముమీఱి పరపురుషుని వరించి సంతానము గన్నవారినే పునర్భువులనుగాఁ జెప్పి వారిని దూషించియున్నారు; కొందఱు పునర్వివాహ మాడిన స్త్రీల నందఱిని పునర్భువులనుగాఁ జెప్పి వారిని తక్కువవారినిగా చెప్పకయున్నారు. కొందఱు సామాన్యముగా పునర్భువులను దూషించిమాత్ర మున్నారు. ఇందుకు దృష్టాంతముగా మనువు తొమ్మిదవ యధ్యాయములో,—

శ్లో. యాౘ పత్యావా పరిత్యక్తా విధవా వా స్వయేచ్ఛయా
ఉత్పాదయే త్పునర్భూత్వా స పౌనర్భవ ఉచ్యతే. ౧౭౫

పతిచేత విడిచిపెట్టఁబడినగాని విధవయయిగాని స్త్రీ స్వేచ్ఛ చేత ననఁగా శాస్త్రవిరుద్ధముగా బిడ్డను గన్నదానినే పునర్భువనియు, ఆ పుత్త్రుఁడే పౌనర్భవుఁడనియు నిర్వచించి యట్టివారిని మాత్రమే యుపాంక్తేయులనుగాఁ జెప్పియున్నాఁడు. కాని విధి విహితముగా ద్వితీయ వివాహమాడిన దాని పుత్త్రుని పౌనర్భవునిగా నెక్కడను చెప్ప లేదు. అట్టి ద్వితీయ వివాహితపుత్త్రుఁడు మొదటి భర్తకు మాత్రమే పౌనర్భవుఁడగును గాని ద్వితీయభర్త కౌరసుఁడేయగును. "సహతం పుత్రమౌరస" మనియున్న భారతవచనమును జదివినచో నీయంశము స్పష్టమగును. ఇదేప్రకారముగా నా యా స్మృతులను ప్రత్యేకము

గాఁ జదివిన యెడల, పునర్భూవిషయమయిన మన ఋషుల యభిప్రాయము వారి వారికే తెలియును. ఏ స్మృతియైనను పునర్భూలక్షణమును సామాన్యముగాఁ జెప్పి వారిని దూషించినపక్షమున నక్కడ సమన్వయరీతిచేత విధియుక్తముగా పునరుద్వాహ మాడినవారి విషయములో తప్ప తక్కిన వారివిషయములో మాత్రమే యా దోషములు పట్టునని యర్థము చేయవలెను.

4. పూర్వోదాహృత మనుస్మృతి వచనములయందును, తదితర స్మృతివచనములయందును కొందఱు హవ్యకవ్యముల కనర్హులని దూషించుట యతిశయోక్తిచేత సాధారణముగా తదితరులు ప్రశస్తులని చూపుటకొఱకే గాని వానియం దంతకంటె విశేషమేమియు లేదు. అట్టిచోట్ల మన మెప్పుడును వాని యుద్దేశమునే గ్రహింపవలయును గాని యవయవార్థమును గ్రహింపరాదు. శబ్దార్థమునే గ్రహింత మనుపక్షమున, పయిని చెప్పఁబడిన మనువచనములనుబట్టి వైద్యులును, వాణిజ్యము చేయువారును, గ్రామోద్యోగులును, రాజకీయోద్యోగస్థులును, పుప్పిగోళ్ళవారును, కప్పుపండ్లవారును, జ్యోతిష్కులును, చిలుకలు మొదలగు పక్షులను పెంచువారును, యాచకులును, వ్యవసాయము చేయువారును కూడ పంక్తిబాహ్యులే యగుదురు. అట్టివారి నెవ్వరు నిప్పుడు అపాంక్తేయులనుగాఁ జూడరు. కాఁబట్టి పయివాక్యములలో పయిని చెప్పఁబడినవారు కానివారు ప్రశస్తులని తాత్పర్యమేకాని వారందఱు నపాంక్తేయులని కాదు. ఒకవేళ పైదాని కవయవార్థము యంగీకరించి, వాదము నిమిత్తమై పునర్వివాహము చేసికొన్న వారిసుతులు పౌనర్భవులే యనియు వారు నిందిత పౌనర్భవులలోనే చేరుదురనియు నొప్పుకొన్నను, అప్పుడు సహితము వారు వైద్యులు, వర్తకులు, రాజకీయోద్యోగస్థులు, జ్యోతిష్కులు,

కృషిచేయువారు, మొదలయినవారితో సమానులే యగుదురు గాని వారికంటె తక్కువవారు కాఁజాలరు.

౫. పరాశరుఁడు "నష్టే మృతే" త్యాది వచనముచేత స్త్రీ పునర్వివాహమును విధించి పౌనర్భవపుత్రుని నెక్కడను చెప్పకపోవుట చేత కలియుగమునందు పునర్భూవ్యవహారముగాని పౌనర్భవ వ్యవహారముగాని బొత్తిగానే లేనట్టును, ద్వితీయవివాహితల పుత్రులు ఔరసులేయగుదురని పరాశర మతమైనట్టును స్పష్టమగుచున్నది.

శ్లో. ఔరసః క్షేత్రజ శ్చైవ దత్తః కృత్రిమక స్సుతః
దద్యా న్మాతా పితావాపి సపుత్రో దత్తకః స్మృతః.

అని కలియుగమునందు త్రివిధపుత్రులను మాత్రమే పరాశరుఁడు చెప్పియున్నాఁడు. ఏవ పదసారస్యముచేత స్వక్షేత్రజుఁడనఁగా స్వభార్యయందు పుట్టినవాఁడే యౌరసుఁడని పై శ్లోకములోని మొదటి పదమున కర్థము. ఈ యర్థమునే దత్తక మీమాంసయందు నంద పండితుఁడు వ్రాసియున్నాఁడు,—

ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమకస్సుతః-ఇతి కలిధర్మ ప్రస్తావే పరాశరస్మరణాత్, నచైవం క్షేత్రజోఽపిపుత్రః కలౌ స్యాదితి వాచ్యం-తత్రనియోగ నిషేధేనైవ తన్నిషేధాత్ అస్తుతర్హి విహితప్రతిషిద్ధత్వాత్ వికల్ప ఇతిచేన్నదోషాష్ట కాపత్తేః-కథం తర్హ్యత్ర క్షేత్రజగ్రహణ మితిచేత్ ఔరస విశేషణత్వేనేతి బ్రూమః- తథాచమనుః- శ్లో. స్వక్షేత్రే సంస్కృతాయాంతు స్వయ ముత్పాదితశ్చయః-తమౌరసం విజానీయాత్ పుత్రం ప్రథమకల్పితమ్. ఇతి— దత్తకమీమాంస.

ఈ పయిదానినిబట్టి పునర్వివాహము చేసికొన్న స్త్రీలు పునర్భువులును, వారిపుత్రులు పౌనర్భవులును కారనియు, వారెంతమా

త్రమును కలముగో తక్కువవారు కారనియు, వారికిఁ బుట్టిన సుతు లౌరసులును, వారు సాధ్వులును నగుదు రనియు, కొంచె మాలో చించి చూచినయెడల నిష్పక్షపాతబుద్ధుల కందఱకును విశదము కా వచ్చును. భారతమున పునర్వివాహిత యయిన యులూపి పుత్రుఁ డౌరసుఁడుగాను, ఉలూపి సాధ్విగాను జెప్పఁబడి యుండుట యందఱకు విశదమయినదే యుండును.—

శ్లో. ఆగతస్తు పునస్తత్ర గంగాద్వారం తయా సహ
పరిత్యజ్య గతా సాధ్వీ ఉలూపీ నిజమందిరమ్.

ఉ ప సం హా ర ము

ఇంతవఱకును స్త్రీపునర్వివాహము శాస్త్రసమ్మతమని చూపుట కయి ప్రయత్నించి నాకు తెలిసినదానిని సంగ్రహముగా తెలిపి యున్నాను. ఇప్పుడవకాశము లేకపోవుటచేతను, గ్రంథవిస్తారము చేయుట నాయుద్దేశము కాదు గనుకను, నేను శ్రుతిస్మృతిపురాణ ములయందలి వచనముల నుదాహరించి వాని తాత్పర్యమును వ్రాసితినే కాని యీవిషయమయిన యాక్షేపసమాధానములను పూర్ణముగా వివరింపఁగలిగినవాఁడను గాను. కొంచెమాలోచించి చూచినయెడల నేను జెప్పిన యర్థములు క్లిష్టములు కావనియు శబ్దములవలన స్పష్ట ముగా కనఁబడునవియే యనియు మీకు విశదము కావచ్చును. ఈ విన్నదానినిబట్టి స్త్రీపునర్వివాము శాస్త్రసమ్మతమనియు, అవ శ్యాచరణీయమనియు మీమనసునకయినను తోఁచవచ్చును. లోకాను భవమునుబట్టి చూచిన స్త్రీపునర్వివాహము కర్తవ్యమని తలఁపనివా రెవ్వరుందురు? ఈ కాలమునందు మాత్రమే కాక పూర్వకాలమునందు పహితము స్త్రీలదురవస్థను జూచి మనసు కరఁగి విధవావివాహమును

పునరుద్ధారణము చేయుటకయి ప్రయత్నించిన పుణ్యపురుషు లనేకు లుండి యున్నారు. కొంచెమయినను దయారసముగలవా రీసత్కార్య విషయమున తగినతోడ్పాటును చేయకుండరని దృఢముగా విశ్వసించు చున్నాను. పెక్కువందల సంవత్సరముల క్రిందటనే మనదేశపు స్త్రీల దుర్దశలను మాన్పుటకయి జీర్ణమయిపోయిన నారీపునర్వివాహమును పునరుద్ధారణము చేయవలెనని జయపురమహారాజగు జస్వంతసిం గనువారును, సుప్రసిద్ధులయిన యప్పయదీక్షితులవారును ప్రయత్నము చేసినట్లు మనము వినుచుండుటయేకాని యా కాలమునందలి జనుల మౌఢ్యాధిక్యమునుబట్టి వారికోరికలు సఫలమయినట్లు వినలేదు. వంగదేశమునందు మూడువందలయేఁబది సంవత్సరముల క్రిందట పండితమండలాగ్రగణ్యుఁడుగా నుండిన స్మార్త భట్టాచార్య రఘు నందను లను వారొక గ్రంథమునుజేసి బాలవిధవ యయిన తన కొమార్తెకు వివాహము చేయవలెనని ప్రయత్నించిరి కాని చిరకాలా గతమయిన దురాచారప్రభావముచేత వారికోరికయు విఫలమే కావలసివచ్చినది. అటుతరువాత కొంతకాలమునకు రాజవల్లభుఁడను నతఁడు గొప్పప్రయత్నముచేసి పండితులచేత నొకవ్యవస్థ చేయించెను. గాని వివాహములనుమాత్రము చేయింపఁగలిగినవాఁడు కాఁడు. ఇప్పటి కించుమించుగ నూఱుసంవత్సరముల క్రిందట పీష్వావద్ద సేనాధిపత్యము వహించి ఘనతకెక్కిన పరశురామపట్ట బాహువర్ధనులనువారు తన కొమార్తెయగు దుర్గాబాయి యను నామె యెనిమిది సంవత్సరముల ప్రాయమున భర్తను పోఁగొట్టుకొన్నప్పు డామెకు పునర్వివాహము చేయుటకయి విశ్వప్రయత్నములు చేసిరి గాని తుదకప్పుడును కార్యము కాలేదు. అప్పుడు పునానగరమునం దుండు పండితులు మాత్రమే కాక కాశీపురమందలి పండితులును స్త్రీపునర్వివాహము

శాస్త్రసమ్మతమని సిద్ధాంతముఁ జేసిరి; అప్పటి శంకరాచార్యుల వారును దాని నంగీకరించిరి. అంతట వివాహము జరుగుటకు సిద్ధమయియుండఁగా బ్రాహ్మణులందఱును జేరి పరశురామపట్ట బాహువర్ధనుల భార్యపాదములమీఁద పడి మొఱ్ఱపెట్టుకొని యామెమూలమున వివాహము జరుగకుండఁ జేసిరి. అటుపిమ్మట కొందఱు నాగపురము మొదలయిన స్థలములయందు కొంతప్రయత్నము చేసిరి కాని వారిప్రయత్నములు ఉపన్యాసములతోనే సరిపోయినవి. తరువాత మొట్టమొదట మన హిందూదేశములో స్త్రీ పునర్వివాహములను సరిగా జరిపించిన వారు గొప్పపండితులయి కాళీఘట్ట రాజధానియందు వసియించెడి పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరులనువారు. వారు బహుప్రయాసపడి జనులకు శాస్త్రమును జూపి వారి కన్నులను విప్పుటయేకాక స్త్రీపునరుద్వాహవిషయమయి రాజకీయశాసనము నొకదానిని కలిగించి ౧౮౫౬ వ సంవత్సరములో మొట్టమొదట రెండువివాహములను జరిగించిరి. నాటినుండి బంగాళా రాజధానియందు పెక్కు వివాహములు జరుగుచునేయున్నవి. తరువాత బొంబయి నగరమునందు విష్ణుపరశురామశాస్త్రిలవారు ౧౮౬౭ వ సంవత్సరమునందు వాదమునకారంభించి ౧౮౭౦ వ సంవత్సరమున సరిగా కొన్నివివాహములను జరిగించిరి. ఇప్పుడా శాస్త్రిలవారు మృతులయినను, ఆ ప్రాంతములయందు పునరుద్వాహములు విస్తారముగా జరుగుచు వచ్చుచున్నవనుమాట వార్తాపత్రికలను జదువువారి కందఱికిని తెలిసియుండును. ఎక్కడ నేవిధముగా జరుగుచున్నను మన రాజధాని మాత్రము నేటివఱకును కన్నులు మూసికొని హాయిగా నిద్రపోవుచున్నది. ఈ... మున పదునెనిమిది సంవత్సరములనుండి ఒకసమాజమున్నను ...ందు వేమియుఁ గారాదు. నేను ౧౮౭౯ వ సంవత్సరమునను

మహేంద్రవరమున నీవిషయమున నుపన్యాసములను జేయనారంభించి, భగవదనుగ్రహమువలన నిప్పటికి రెండువివాహములను జేయింపఁ గలిగినాఁడను. ఈ రాజధానివారిఁకనైన నిద్రనుండి లేచి చుఱుకుగా పనిచేసి తక్కిన రాజధానులవారితో సామ్యమును బొంద ప్రయత్నింతు రని కోరుచున్నాను. సర్వదయాపరుఁ డయిన యీశ్వరుఁడే యీ విషయమున మీకు ధైర్యస్థైర్యముల నిచ్చునుగాక యని ప్రార్థించుచు, ఈ యుపన్యాసమును యింతటితో ముగించుచున్నాను.

స్త్రీ పునర్వివాహ వ్యాపారము యొక్క భూత వర్తమాన స్థితులు.

By

K. VEERESA LINGAM

స్త్రీ పునర్వివాహ వ్యాపారము యొక్క భూత వర్తమాన స్థితులు.

ఓ మహాజనులారా!

ఈపట్టణమునం దారంభింపఁ బడిన స్త్రీ పునర్వివాహవ్యాపారము యొక్క భూతవర్తమానస్థితులను గుఱించి నేఁటి మహాసభలో నుపన్యసింపవలసినదని వెనుకటిసభలో కార్యదర్శిగారు నన్నడిగినప్పుడు నేను నిర్వహింపవలసిన కార్యభారముయొక్క కష్టమును చక్కఁగా విచారింపక మంచిదని యొప్పని కంగీకరించినాను. కాని సభవిడిచిపోయిన పిమ్మట నాలో నే నాలోచించుకొనఁగా నాకు నియమించిన యీ యుపన్యాసము మఱియొకరు నిర్వహించుట యుచితముగా నుండునని నా కప్పుడు తోఁచినది. ఐనను చేసెదనని సభవారిముం దొప్పుకొని వచ్చినతరువాత వెనుకతీయుట ధర్మముకాదు గనుక, నామనస్సున కిది రుచించిన విషయము కాకపోయినను విధిగా భావించుకొని తోఁచి నట్లు చెప్పఁబోవుచున్నాను. నాసంగతి నేను చెప్పుకొనుట లేశమాత్రమును నాకిష్టమయినపని కాదు. కాని మొదటినుండియు నాకున్న యెడతెగని సంబంధమునుబట్టి నాపేరు విడిచిపెట్టి యీస్త్రీపునర్వివాహ చరిత్రమును చెప్పగలుగుట నాకు సాధ్యముగా తోఁచలేదు. అంతే కాక సంగతులు తెలియక కొందఱును, బహుకారణములచేత నాకు ద్వేషులుగా నేర్పడినవారు చెప్పెడు గిట్టనిమాటలను నమ్మి కొందఱును, నేను చేయుచున్న యీ కృషి విషయమయి విపరీతాభిప్రాయము కలిగియున్నట్టు నాకిప్పుడు కొన్నిసూచనలు గానఁబడుచున్నం

దున ప్రస్తుతాంశముతో సంబంధించి యున్నంతవఱకు నావిషయమయి కూడ కొంత చెప్పుకొనుటయు నావశ్యకముగానే కనుపట్టుచున్నది; కాబట్టి నేనిప్పుడు చెప్పఁబోయెడు సంగతులను సావధానముగా చిత్తగింపవలెనని మహాజనులను వేడుకొనుచున్నాను.

ప్రప్రథమమున నే నీ శ్రీ పునర్వివాహవిషయమున కృషి కారంభించినప్పు డెవ్వరో యొకరిద్దఱుతప్ప ఇప్పుడున్న యీ సామాజికులలో నెవ్వరును నాకు సహాయులుగా నుండలేదు. న్యాయపతి సుబ్బారావుపంతులుగారప్పు డీ పట్టణమునకు క్రొత్తగా వచ్చియుండరు. ఆరంభించిన రెండుసంవత్సరములకుఁగాని ఆత్మూరి లక్ష్మీనరసింహముగారీపట్టణమునకు రాలేదు. బసవరాజు గవర్రాజుగారు మాత్రము నాకు తోడుపాటుగా నుండిరి. కాని నాకు ముఖ్యప్రోత్సాహకులుగానుండి యీకృషిలో నన్ను ప్రవేశపెట్టి నాచేత పనిచేయించినవారు నా సహా ము, మిత్రులునైన చల్లపల్లి బాపయ్యగారు. లౌక్యాధికారధూర్వ ు విద్యాధికుడనుగాని నే నీమహాకార్యమును నిర్వహింపఁజాల ధైర్యపడి నిరుత్సాహుఁడను కాఁగా నాకు ధైర్యముచెప్పి పురి ్న వెంటఁగొని బయలుదేఱి శ్రీపునర్వివాహసమయమున ులకు వచ్చెదమని నుప్పదిమంది బ్రాహ్మణ గృహస్థులచేత ఖ్యచేయించి నాకంటెను మహాశ్రద్ధతో పనిచేసిన దీయనయే. ఈయన ప్రోత్సాహముచేతనే ౧౮౭౯ వ సంవత్సరము జూలై నెలలో శ్రీవిజయనగరపు మహారాజగారి బాలికాపాఠశాలయందు నేను శ్రీ పునర్వివాహవిషయమయి నా మొదటియుపన్యాసమును జేసినాను. కాఁబట్టి యిప్పు డంకురించి పెరుగుచున్న శ్రీపునర్వివాహక్రియావృక్షమునకు బీజావాపము చేసినవారు శ్రీ చల్లపల్లి బాపయ్యగారనియే చెప్పవలసియున్నది. అప్పుడు బాపయ్యగారును, నేనును, నామిత్రులు మఱికొందఱును చేరి శ్రీపునర్వివాహసమాజమని పేరుపెట్టుకొని పని

చేయ నారంభించితిమి. ఆరంభదశయందు మాయొద్ద నొక్కకాసును నిధిగా లేదు; మహారాజులు సహితము పూని నిర్వహింపలేకపోయిన యీపని మేము నలుగురయిదుగురము పూని నిర్వహింపఁ గలుగుదుమన్న విశ్వాసము మాకప్పుడు కలలోను లేదు. కాని యీవిషయమయి కృషిచేయుట మాకు పరమధర్మమనుకొని సమస్తమునకు పరమేశ్వరుని నొక్కనినే నమ్ముకొని త్రికరణశుద్ధిగా పనిచేయ మొదలుపెట్టితిమి. ఈకృషి యారంభమయిన కొన్నివారములకు నాకు పరిచితులయిన శ్రీ బారు రాజారావుపంతులుగారు శ్రీపైడా రామకృష్ణయ్యగారీపట్టణమునకు వచ్చినప్పుడు నాకు వారితోడి మైత్రిని కలిగించినారు. వారప్పుడీపనినిమిత్తమయి తాము ముప్పదివేల రూపాయల నిచ్చెదమని వాగ్దానము చేసినారు. ఈశ్వరుఁడు మాకీ గొప్పప్రాపు కనఁబఱచినందున మాకు మఱింత యుత్సాహముకలిగి మేము తొంటికంటె ద్విగుణధైర్యముతో పనికిఁ బూనితిమి. ఈకాలము మొదలుకొని తరువాత రెండుసంవత్సరములకు పిమ్మట ప్రథమ వివాహమగువఱకును పట్టిన సమస్తవ్యయములను నేనేవహించినాను. నేను చేసిన యుపన్యాసములను ముద్రించి కొన్ని ప్రతులను విక్రయించినను విశేషభాగ మూరక పంచిపెట్టినాను; వాదము నిమిత్తమయి ముప్పదినలువది స్మృతులను, ఇతరపుస్తకములను కొని కృషిచేసినాను; బహుస్థలములయందున్నవారితో నుత్తరప్రత్యుత్తరములను జరుపుచు వలసినప్పు డితరస్థలములకుఁగూడ పోయి యుపన్యసించుచు వచ్చినాను; వివాహములు చేసికొనెదమని వాగ్దానముచేసిన విద్యార్థులకుఁ గొందఱికి పాఠశాలజీతములకు సహాయము చేయుచు వచ్చినాను; బాలవితంతువులున్న స్థలములను విచారించి సమాచారములు తెచ్చుటకును కృషిచేయుటకును మనుష్యులకు సొమ్మిచ్చుచు వచ్చినాను; బాలవితంతువుల సంరక్షకులతో మాటాడుటకయి అమలాపురము, మం

డపేట, తాళ్ళపూడి, కాకినాడ దొడ్డిపట్ల, విశ్వేశ్వరము, రామ
చంద్రపురము, పాలకొల్లు మొదలయిన స్థలములకు మనుష్యులను
పంపుటయేకాక, వీనిలో నొకటిరెండుస్థలములకు నేనును బోవుచు
వచ్చినాను; ఈ ప్రయాణములలో నొకసారి యొకపల్లెలో శీతకాలపు
రాత్రి యందొక మిత్రుఁడును నేనును పశువులపాకలోని పశువులతోఁ
గలసి రొచ్చుకంపులో పరుండి నిద్రింపవలసివచ్చినది. ఈ కృషిలో
నాకిక్కడి రాజకీయపాఠశాలలోని విద్యార్థులు మొదటినుండియు
ముఖ్యసహాయులుగా నుండిరని చెప్పవలసియున్నది. ఇప్పుడు వివా
హములు చేసికొన్నవారిలో పులవర్తి శేషయ్యగారును నల్లగొండ
కోదండరామయ్యగారును పయినిజెప్పిన గ్రామములలోఁ గొన్నిటికిఁ
బోయి కృషిచేసినందునకయి నాకృతజ్ఞతనిక్కడఁ దెలుపుచున్నాను.
యిప్పుడు వితంతువివాహములను జేసికొన్న బీదవాండ్రకు నెల ౧కి
...ము, మిత్రులగా రు ౧ ల చొప్పున కొన్నిసంవత్సరముల వఱకును
మ ... ప్రచురించినారము. కొంతకాలమైన తరువాత సుబ్బా
...తులుగారు మొదలయినవారు మాలోఁ జేరినారు; చెన్నపట్ట
నుండి సోమంచి భీమశంకరముగారు వచ్చినారు; కాకినాడకు సబు
జ్జీగా వచ్చిన శ్రీ కంచి కృష్ణస్వామిరావుపంతులుగారు వాక్సహా
యము చూపి మాకు మఱింత ప్రోత్సాహము కలిగించినారు; మొదటి
వివాహమయిదాఱు మాసములకు జరుగుననఁగా ఆత్మూరి లక్ష్మీ
నరసింహముగారిక్కడకు డిస్ట్రిక్టుమునసబుగా వచ్చి బహువిధముల
తోడుపడినారు. ఇతరస్థలములయందును లక్ష్మీనరసింహముగారి
లోపలను పెక్కుసభలు జరిగిన తరువాత న్యాపతి సుబ్బారావుపంతులు
గారును, ఆత్మూరి లక్ష్మీనరసింహముగారును, కొమ్ము రామలింగ
శాస్త్రిగారును, బసవరాజు గవర్రాజుగారును, నేనును జేరి యొక
యాంతరంగికసభ యేర్పఱుచుకొని కార్యాలోచనము చేయుచు

౧౮౮౧ వ సంవత్సరము డిసెంబరు నెల ౧౧ వ తేదిని మా గృహము నందు మొదటి వితంతూద్వాహమును జరిగించితిమి. ఈ వివాహము జరుగుటకు కొన్ని దినములు ముందు శ్రీ పైడా రామకృష్ణయ్యగారు తమ సహజౌదార్యముతో వేయిరూపాయలను మాయొద్దకుఁ బంపి నారు. ధనవ్యయవిషయమయిన భారమును నామీఁదఁ బెట్టుకొనుట కిష్టములేనివాఁడ నయినందున, మొదటి రెండువివాహములును మా యింటనే జరిగినను వివాహముల నిమిత్తమై రామకృష్ణయ్యగారు మొదట పంపిన వేయిరూపాయలను తరువాత పంపిన మొత్తమునుగూడ శ్రీలక్ష్మీనరసింహముగారే వాడినారు. ఇంచుమించుగా నేకకాలము నందే జరిగిన రెండువివాహములకును రెండు వేల రూపాయలవఱకును వ్యయపడినను, రెండవపెండ్లికుమార్తె కిచ్చెదమన్న రెండువందల రూపాయల నగలలోను డెబ్బది యెనుబది రూపాయల నగలకంటె మే మప్పు డెక్కువ పెట్టలేకపోయినాము. వివాహము లయినతరువాత పెండ్లికొమార్తెలును పెండ్లికొమాళ్ళును రెండవపెండ్లికొమార్తెయొక్క తల్లిదండ్రులును తమ్ములును పినతల్లియు తాతగారును నలుగురు వంట బ్రాహ్మణులును పురోహితుఁడును వివాహములలో భోజనములకు వచ్చి మాలోఁ జేరిన ముంజులూరి వేంకట్రామయ్యగారును కుటుం బమును నల్లగొండ కోదండరామయ్యగారును మాయింటనే యుండ వలసినవారయిరి. వీరికందఱికి నయ్యెడు వ్యయములను ౧౮౮౨ వ సంవత్సరము మార్చినెల కడపటివఱకు శ్రీరామకృష్ణయ్యగారు లక్ష్మీ నరసింహముగారివద్దకుఁ బంపుచురాఁగా వారివద్దనుండి ముంజులూరి వెంకట్రామయ్యగారు కొంతకాలమును నల్లగొండ కోదండరామయ్య గారు కొంతకాలమును సొమ్ము తెచ్చి తామే వాడి లెక్కనుంచుచు వచ్చిరి. పలుచోట్లనుండి వచ్చి బహువిధాభిప్రాయములు గలవా రింత మంది యొక్కచోట కూడినప్పుడు వారిలో నైకమత్య ముండునో

లేదో నేను జెప్పవలసిన యక్కఱలేదు. అందులోఁ గొందఱిని వేఱు చేయవలసి వచ్చినందునను, ఈపక్షములోఁ జేరినవారి కితరులు కాపురము లుండుటకై యిండ్లియ్యకపోయినందునను, రామకృష్ణయ్యగారిక్కడకు వచ్చినప్పుడు వారితోఁ జెప్పఁగా వారప్పుడు వివాహములాడినవారును తత్సంబంధులును కాపురములుండుటకయి యిన్నీసుపేటలో నొక గృహమును కొన్నారు. నెల కెనిమిది రూపాయలు జీతము లేర్పఱిచి ముందుగా రెండవ పెండ్లికొమార్తె పుట్టినింటివారిని, తరువాత రెండవపెండ్లి దంపతులను, ఆయింటికిఁ బంపినాము. ఈలోపల క్రొత్తగా పెండ్లియైన దంపతులను దీసికొని చెన్నపట్టణము రాదలసినదని దివానుబహదూరు రఘునాథరావుగారును పల్లె చెంచలరావు పంతులుగారును మమ్మాహ్వానము చేసినందున ప్రథమ వివాహదంపతులను దీసికొనిపోఁదలఁచి విశాఖపట్టణమునుండి మొదటి పెండ్లికుమారుని రప్పించినాము. ప్రయాణవ్యయముల నిమిత్తమయి యేప్రిల్ నెలలో రామకృష్ణయ్యగారు నూఱురూపాయలను నాకుఁ బంపినారు. నేను ప్రయాణము కాఁబోవునప్పటికి జీతములవారందఱును నేను మరల వచ్చువఱకును తమకుఁ గావలసిన జీతముల నియ్యవలసిన దని నిర్బంధపఱుపఁగా నేను ఋణముచేసి వారిజీతము లియ్యవలసివచ్చినది. ప్రథమదంపతులను వెంటఁబెట్టుకొని వంటబ్రాహ్మణునితో కుటుంబసహితముగా బయలుదేఱి యిందుతో సంబంధించిన యొక కోర్టువ్యవహారము నిమిత్తమయి ముందుగా విశాఖపట్టణమునకుఁబోయి యక్కడినుండి చెన్నపట్టణము పోయితిమి. అక్కడ మమ్మాదరించి మాకు వస్త్రములు కట్టఁబెట్టి దారిఖర్చులక్రింద నూఱు రూపాయలిచ్చి చెంచలరావు పంతులుగారు మమ్ము పంపివేయఁగా జూను నెలమధ్యమున బయలుదేఱి వచ్చి రాజమహేంద్రవరము చేరినాము. అప్పటికి సమాజమునకు నిధిగా ధనమేదియు లేదు; మాస

వ్యయములకయినను రామకృష్ణయ్యగారు దయచేసి పంపినఁ గలదు; లేకపోయిన లేదు; ఈస్థితియంతయు శ్రీ కంచి కృష్ణస్వామిరావుపంతుల వారితో మనవిచేయఁగా వారు రామకృష్ణయ్యగారిని ప్రోత్సాహ పఱిచి దివాన్ బహదూరు రఘునాధరావుగారిని పళ్ళె చెంచలరావు పంతులుగారిని ట్రస్టీలనుగా నేర్పఱిపించి పదివేలరూపాయలను చెన్న పట్టణమునకుఁ బంపునట్లు చేసినారు. ఆ ట్రస్టుడీడ్లలో రెండుసంవత్స రములలోపల వివాహములు జరగని పక్షమున తమసొమ్ము మరల తమకు పంపివేయునట్లు వ్రాసి వివాహములు జరగెడు పక్షమున వివా హ మొకటికి వేయేసి రూపాయలవంతున నాయొద్దకు పంపుచుండవల సినదనియు వ్యయములక్రింద జూనునెల మొదలుకొని నెలకు డెబ్బది యైదు రూపాయల చొప్పునఁ బంపవలసినదనియు వారికి వ్రాసినారు. అప్పుడు మరల వివాహములగునన్న యాశ రామకృష్ణయ్యగారికిని లేదు; ఈపక్షములో చేరినవారిని జనులప్పుడు పెట్టెడు బాధ మహో ఛా్రియదశయం దుండినది; శంకరాచార్యులవారి బహిష్కారపత్రికలు వచ్చి పులులవలె నందఱిని బెదరించుచుండినవి; లక్ష్మీనరసింహము గారు శంకరాచార్యులవారిమీఁద తెచ్చిన యభియోగము కొట్టుపడి పోయినది; రామకృష్ణయ్యగారు మొదలుకొని యిందులోఁ జేరినవా రనేకులు ప్రాయశ్చిత్తములు చేయించుకొని ప్రతిపక్షులలోఁ జేరవల సినవారయిరి. ఈపక్షమునం దభిమానము గలవారు సహితము బహి రంగముగా మాసభలకు వచ్చుటకే భయపడుచుండిరి. అయినను మే మీలోపల నిరుత్సాహులమయి యూరకున్నవారము కాము. మొట్టమొదట మాలోఁజేరిన ట్లున్నవారే కొందఱు మమ్ము చేయి విడిచినందునను, కొందఱు ప్రతిపక్షులుగాకూడ మాఱినందునను, తాంబూలములకు వచ్చియు భోజనములు చేసియు మఱియొకవిధముగా సాహాయ్యముచేసియు శ్రీపునర్వివాహపక్షము నభిమానించుకొన్న

వారిని మరల సమాజముగాఁ గూర్చుకొని లక్ష్మీనరసింహముగారి లోపల సభచేసి దానికి వూండి సుబ్బరాయలయ్యగారిని సహాయ కార్యదర్శినిగా నేర్పఱుచుకొన్నాము. వారు కొంతకాలమున కుద్యో గాంతరముమీఁద దేశాంతరమునకు పోవలసినవారయినారు. మాలోఁ జేరినవారు ప్రాయశ్చిత్తములు చేయించుకొని యొక్కరొక్కరే మమ్ము చేయి విడుచుచు రాఁగా ౧౮౮౪ వ సంవత్సరారంభమున కోదండ రామయ్యగారి వివాహమగునప్పటికి పైవారిలో కొటికలపూడి రా మేశ్వరరావుగారును, బసవరాజు గవర్రాజుగారును, నేనును ముగ్గురము మాత్రమే యీసమాజములో నిలిచియున్నాము. ఇప్పుడు మొదటి వారుగాక తక్కిన యిద్దఱము మాత్రమే యున్నాము. రామకృష్ణయ్య గారు మాసవ్యయములక్రింద నాకిమ్మన్న జూన్ నెల డెబ్బదియైదు రూపాయలును సెప్టెంబరు మొదటితేదివఱకు నాకు ముట్టనేలేదు. ఇట్లు మాసవ్యయములక్రింద డెబ్బదియైదురూపాయలు చొప్పున వచ్చు చున్నను వానిలో నుండి నెలజీతములును రొక్కముగా నిచ్చెడు సొమ్మును తప్ప మఱియేమియు వ్యయపెట్టలేదు; భోజనాదివ్యయముల నన్నిటిని నాసొంత సొమ్మునుండి నేనే వహించుచుంటిని. నల్లగొండ కోదండరామయ్యగారు ౧౮౮౭ వ సంవత్సరము జూలయినెలలో ప్రాయశ్చిత్తము చేయించుకొని మాయింటినుండి వెడలిపోవువఱకును తానే వెచ్చమంతయు వాడి లెక్కవ్రాసెను. వంటబ్రాహ్మణులు లోనుగాఁగలవారు కొందఱు సంవత్సరములకొలఁదిని, కొందఱు నెలల కొలఁదిని మాయింటనే యుండి భోజనములుచేయుచు వచ్చెడువారు. రెండవ పెండ్లికొమార్తెకు బాకియున్న నగలు పెట్టినను మఱియేయితర వ్యయములు చేసినను మాసమాసమునకు వచ్చెడి సొమ్ములో నుం డియో, వివాహమైనప్పు డందుల వ్యయములలోనుండి మిగిల్చియో చేయవలెను. మాసవ్యయములనుండి నగలు పెట్టుటకు సాధ్యముకాక

పోఁగా కొంతకాల మయినతరువాత రామకృష్ణయ్యగారు తామే రెండవపెండ్లికొమార్తెకు మిగిలిననగలను పెట్టినారు. వివాహ మొక టికి వేయేసిరూపాయలచొప్పున వ్యయపెట్టుటకయి రామకృష్ణయ్య గారు నాకధికారమిచ్చినను నేను విచ్చలవిడిగా సొమ్ము వ్యయపెట్టక తాత్కాలికస్థితినిబట్టి సాధ్యమయినంత మితముగానే సొమ్ము వాడుచు వచ్చినాను. నాకిచ్చిన స్వాతంత్ర్యప్రకారముగా నేను చేయించిన పదునొకండువివాహములకును వివాహ మొక్కంటికి వేయేసిరూపా యలచొప్పున పదునొక్క వేలరూపాయలును, నెలకు డెబ్బదియైను రూపాయలచొప్పున రెండుసంవత్సరముల యేడుమాసములకును రెండువేల మూడువందల యిరువదియైను రూపాయలును, నేను వ్యయ పఱిచి యుండినయెడల, రామకృష్ణయ్యగా రిచ్చిన పదివేలును పోఁగా పయిగా మూడు వేలరూపాయ లప్పయియుండును. అట్లు చేయక సాధ్యమయినంత పొదుపుగా వాడియుండుటచేత నేను ప్రస్తుత సమాజమువారికి లెక్క యొప్పగించునప్పటికి చెన్నపట్టణములో నూటయిరువదియెనిమిది రూపాయలు నిలువయున్నవి.

ప్రథమమున జరగిన రెండువివాహములును అయిన తరువాత మరల వివాహములు జరుగుట దుస్సాధ్యమయినందున మూడవ వివాహము చేయించు నిమిత్తమయి మొదటికంటెను విశేషశ్రమ పడవలసివచ్చినది. ౧౮౮౨వ సంవత్సరము ఆగష్టునెల కడపట తృతీయవివాహ మగునట్లు కనఁబడఁగా చెన్నపట్టణము వ్రాసి సెప్టెం బరునెల మొదట వేయిరూపాయలను తెప్పించినాను. అప్పుడు సహిత మా సొమ్మును లక్ష్మీనరసింహముగారియొద్దనే యుంచి పెండ్లికొమా రునకు ఋణములు తీర్చుకొనుట నిమిత్తమై యిచ్చిన రెండువందల రూపాయలును మఱి నలువదిరెండు రూపాయలును కర్చుపడువఱకును ఆయనచేతనే వ్యయపఱిపించినాను. వివాహసమయమునకు లక్ష్మీ

నరసింహముగారు బందరువెళ్ళుట తటస్థించినందున మిగిలిన యేడు వందలయేఁబదియెనిమిది రూపాయలు నేను పుచ్చుకొని వ్యయము చేసినాను. ఆసంవత్సరము సెప్టెంబరునెల యిరువదిరెండవ తేదిని జరిగిన యావివాహమునకు తొమ్మిదివందల తొంబదియేడు రూపాయలు వ్యయమయినవి. వివాహమునకు పూర్వమునందయిన రెండువందల నలువది రూపాయలునుగాక నగలకు రెండువందల యిరువదియేడు రూపాయలును, బట్టల కెనుబదియేడు రూపాయలును, భోజనములకు డెబ్బదియైదు రూపాయలును ఊరేగింపునకు డెబ్బదియైదు రూపాయలును పోఁగా తక్కిన రెండుమూఁడువందల రూపాయలును తక్కిన కర్చుల కయినవి. మొదటి వివాహమునకు బాజాభజంత్రీల కఱువదిరూపాయల నేర్పఱిచినను తగ్గించి మూఁడవవివాహమునకు నలువదిరూపాయలును, తరువాత కొన్నివివాహములయిన తరువాత ముప్పదియొక్క రూపాయలును, కట్టకడపట కొంతమంది మనుష్యులను తగ్గించి పదిరూపాయలును చేసినాను. పురోహితునకు మొదట వివాహమొకటి కేఁబది రూపాయలు చేయఁగా మూఁడవవివాహమున కిరువదియైదు రూపాయలును తరువాత వివాహముల కెనిమిదేసి రూపాయలును చేసినాను. వంటబ్రాహ్మణులకు జీతములుగాక వివాహదినములలో దిన మొకటికి నాలుగేసి రూపాయలచొప్పున నియ్య నిర్ణయించుకొన్నను మూఁడవ వివాహమునకు దినమొకటికి రెండేసిరూపాయలును తరువాత దినమొకటికి రూపాయచొప్పునను కట్టకడపట దినమొకటి కెనిమిదణాల చొప్పునను చేసినాను. ఈప్రకారముగా క్రమక్రమముగా బహు వ్యయములను తగ్గించుచు వచ్చినాను. వితంతువివాహములను చేసి కొన్నవారి కితరులు కాపురముండుట కిండ్లియ్యకపోవుట విచారించి రామకృష్ణయ్యగారితో నాలోచించి ముందు వివాహములు చేసికొను వారు కాపురముండుట కిల్లిచ్చెదమని ప్రథమ ద్వితీయవివాహము

లయినతరువాత ప్రచురించినను, అప్పటి యావశ్యకమునుబట్టి యీ మూడవపెండ్లికొమారునకు స్థిరముగానే మూడువందల రూపాయల వెలచేసెడి యిల్లుగాని రొక్కమునుగాని యిచ్చెదమని వ్రాసి యియ్య వలసివచ్చినది. ౧౮౮౩ వ సంవత్సరము జనేవరు నెలలో జరిగిన నాలవవివాహమునకు ౭౨౩ రూపాయలు వ్యయపడినవి; ఈ వివాహ మునం దండలికిని బట్టలు పెట్టినందున ౧౨౨ రూపాయలు బట్టలకే యయినవి; ఈవివాహము మొదలుకొని సొమ్ము వాడఁదగినవా రెవ్వరును తాంబూలములకు వచ్చుట సహితము కానరానందున సదా వివాహగృహమునందుండెడు నేనే వాడుచువచ్చినాను. అటుపిమ్మట జనేవరునెల కడపట జరిగిన యైదవవివాహమునకు ౫౧౮ రూపాయలు వ్యయపడినవి; తరువాత మార్చినెలలో జరిగిన యాఱవవివాహము నకు ౮౦౯ రూపాయలు కర్చుపడినవి; ఆవెనుక ఏప్రిల్ నెలలో జరిగిన యేడవవివాహమునకు ౮౯౬ రూపాయలు వ్యయమయినవి; ఇది ఇక్కడ జరిగినవానిలో మొదటి కోమటివివాహము. ఈసమయము నందు చెంచలరావుపంతులుగారు దక్షిణహిందూస్థానమునకు రాజ ధానయైన చెన్నపట్టణమునం దొకటి రెండు వివాహములు చేయించ వలసినదని నన్నును రామకృష్ణయ్యగారిని కోరినందున వారి యభిమత మును దీర్చుటకయి యిద్దఱు వితంతుకన్యలను వరులను దీసికొని పురో హితుఁడు మొదలయిన పదుముగ్గురు జనముతో నేను చెన్నపురికి పోయినాను. అక్కడ జూన్ నెల ౯ వ తేదీని ఒక్కవివాహము మాత్రము జరిగినది. ఆవివాహమున కక్కడ నెనిమిదివందల యేఁబది రూపాయలు వ్యయమయినవి; రాకపోకలకు ప్రయాణములక్రింద ౩౩౧ రూపాయలు కర్చుపడినవి; రెండువందలరూపాయలు పెట్టి పెండ్లి కొమార్తెకు మాన్యము విడిపించి యిచ్చినాను; సంబంధమును కుదిర్చి యీవితంతుకన్యలను తెచ్చినవారికి నలువదిరూపాయ లిచ్చినాము;

పెండ్లికొమార్తెలను తల్లిని కృష్ణామండలములోని గుంటూరి కావల నుండు వల్లూరునుండి రెండుసారులు తీసికొనివచ్చినందునకయి నలువదిరూపాయ లయినవి; పెట్టిన నగలు రెండువందల రూపాయలును కలుపుకొనియు యెనిమిదవ వివాహమునకు ౧౬౨౧ రూపాయలయినవి. అటుపిమ్మట ఆగష్టునెలలో జరిగిన తొమ్మిదవ వివాహమునకు ౪౦౩ రూపాయలు వ్యయపడినవి; ౧౮౮౪ వ సంవత్సరము జనేవరి నెలలో జరిగిన పదవవివాహమునకు ౫౫౪ రూపాయలు కర్చుపడినవి. ఈవ్యయములలో నించుమించుగా రెండేసివందల రూపాయలు ప్రతి వివాహమునకు నగలక్రింద నగుచువచ్చినవని నేనిక్కడ చెప్పనక్కఱయే లేదు. ౧౮౮౫ వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో బళ్ళారిలో జరిగిన పదునొకండవ పండ్రెండవ వివాహములకు రెంటికిని వేయిరూపాయలు కర్చుపడినవి. నేను డిసెంబరుసెలవులలో చెన్నపట్టణము వెళ్ళినప్పుడు కుదిరిన యీ రెండుసంబంధములకును కొన్ని కారణములచేత చెన్నపురిలో వివాహములు చేయకుండుటకు నిశ్చయింపఁబడినందునను సెలవుదినము లయిపోవుటచేత వివాహము లగువఱకును నేనక్కడ నుండుటకు వల్లపడనందునను, వివాహ మొకటి కయిదేసివందల రూపాయలచొప్పున వ్యయపెట్టుటకు నిర్ణయించి సొమ్మును మన్నవ బుచ్చయ్య పంతులువారి తావున నిచ్చునట్లు చెంచలరావుపంతుల వారి కొప్పన చేసి బయలుదేఱి వచ్చినాను. బళ్ళారిలోని సభాపతి మొదల్యారిగారు తమయూర వివాహములు చేయవలసినదనియు వ్యయములు తాము వహించెదమనియు వ్రాసినందున బుచ్చయ్య పంతులుగా రా దంపతులను బళ్ళారికిఁ గొనిపోయి వారి వివాహముల నక్కడ జరిగించినారు. వ్యయపడిన నాలుగువందల రూపాయలును పోఁగా మిగిలిన యాఱువందల రూపాయలును దంపతులకును కన్యాదాతలకును పంచిపెట్టఁబడినవి. ౧౮౮౪ వ సంవత్సరము డిసెంబరు నెలలో జరిగిన పదుమూడవ

వివాహమునకయిన మూఁడువందలరూపాయలును రామకృష్ణయ్యగారు నావద్దకు ప్రత్యేకముగాఁ బంపినారు. రామకృష్ణయ్యగా రిచ్చిన వివాహ నిధిలోనుండి కర్చుపెట్టి చేసిన పదివివాహములకును గలిసి ౬౬౬౮రూపాయలయినవి. కొన్ని వివాహముల కెక్కువయినను కొన్నివివాహములకు తక్కువయినను సగటున వివాహ మొకటికి రూ ౬౬౬ లు వ్యయపడినవి.

నేను కర్చుచేసిన మాసవ్యయములు ముప్పదియొక్క నెలలకును రు ౧౯౩౧ లయినవి. సగటున నెల యొకటికి రు ౬౨ – ౦ – ౦ లు కర్చుపడినవి. వివాహములు మొదలయిన వాని నిమిత్తమయి నేను చేసిన వ్యయములన్నియు నీదిగువ ప్రకారముగా నుండును:—

ప్రత్యేకముగా వివాహముల నిమిత్తము. రు ౬౬౬౭-౧౫-౮

మాసవ్యయములు. ... ... ౧౯౩౧-౫-౩.

కొన్ని యిండ్లును స్థలములును. ... ౧౧౬౬-౦-౦.

కొన్ని పాత్రసామగ్రియు మంచములును. ౧౮౧- ౨-౯.

వైద్యపుకర్చులు. ౪౮-౧౨-౬.

రావి గుర్నావధానులవలన రావలసినది. ౯౦- ౦-౦.

మొత్తము ౧౦,౦౮౫-౪-౨.

నేను చెన్నపట్టణమునుండి తెప్పించిన సొమ్మంతయు బళ్ళారిలో జరగిన వివాహములకుఁ గలుపుకొని ౬౭౫౪-౭-౫ పోఁగా నే నీసమాజమువారికి లెక్క యొప్పగించునప్పటికి నాకే ౩౩౦-౧౨-౯ లు రావలసియున్నవి. నాకెంతబాకీ యున్నను నే నా సొమ్మెప్పుడును మరల పుచ్చుకోఁదలఁచుకోలేదు. వివాహము లారంభమైనది మొదలుకొని ౧౮౮౬ వ సంవత్సర ప్రారంభమువఱకును శీతకాలపు సెలవులలోను వేసవికాలపు సెలవులలోను కూడ నేనీపనిమీఁద చెన్నపట్టణమునకో మఱియొక స్థలమునకో పోక మానిన సంవత్సరము లేదు.

నావ్యయములను తమసొమ్ములోనుండి పుచ్చుకొమ్మని రామకృష్ణయ్యగారెన్నిసారులు చెప్పినను పుచ్చుకోక నాప్రయాణవ్యయములను నేనే వహించుచు వచ్చినాను. ౧౮౮౪ వ సంవత్సరము మే, జూన్ నెలలలో చందాల నిమిత్తమయి చెన్నపురికి వెళ్ళినప్పటి వ్యయములను మాత్రము వసూలయిన చందాసొమ్ములోనుండి పుచ్చుకొన్నాను. ఇంతేకాక యీ కార్యములమీఁద మునిస్వామి మొదలయినవారిని నెలలకొలఁది త్రిప్పినను సమాజధనమునుండి యేమియు గ్రహింపక వారిజీతములు మొదలయిన వానిని నేనే భరించుచు వచ్చినాఁడను. కార్యసాఫల్యము కానివిషయములలో శ్రీపునర్వివాహప్రయత్నములందు నేను వ్యయపెట్టిన సొమ్మేమియు నేను సమాజపులెక్కలో వ్రాయలేదు. విశాఖపట్టణమునుండి యొకబ్రాహ్మణుఁడు వితంతుకన్యలను తీసికొని వచ్చెదనని చెప్పి మునిస్వామిని విశాఖపట్టణమండలమునందు పెక్కుదినములు త్రిప్పి తుదకు కొంతసొమ్మెత్తుకొని పాఱిపోవుట మొదలయిన వార్తలను పలువు రెఱిఁగి యుందురు. రామకృష్ణయ్యగారు ౧౮౮౭ వ సంవత్సరము జూన్ నెలలో సొమ్ము పంపినది మొదలుకొని ౧౮౮౯ వ సంవత్సరము మార్చినెలవఱకు చెన్నపట్టణపు సమాజమువారికి మనసొమ్ములోనుండి పాదరుక్రింద బుచ్చన్నగారు పాయలు కర్చుపడినప్పు డిక్కడ నాకెంత కర్చయియుండును యీవారే యూహించుకోవచ్చును. ఈసొమ్ములోనుండి చెన్నపట్టణపు సమాజముక్రింద అయిదువందలరూపాయలు కర్చుపడినవి—అందులో మూఁడువందలరూపాయలు శ్రీపునర్వివాహము మంచిదని బోధించు బోధకుల జీతములక్రింద వ్యయపడినవి.

నాలుగయిదు వివాహము లయిన తరువాత మూఁడవపెండ్లి కొమారునికిఁ జేసిన వాగ్దానమునుబట్టి తక్కినవారికిఁగూడ వారువారు కాపురములున్న యిండ్లు వారివారి కిచ్చివేయవలసినదని రామకృష్ణయ్య

గారిపేర నేను వ్రాసితిని గాని వారందున కంగీకరింపక తగిన హేతువులు చెప్పినందున నేనును వారిలోనే యేకీభవించి పారంపర్యముగా కాపురము లుండుటకు మాత్రమే యిండ్లిచ్చుట శ్రేయస్కరమని తలఁచినాను. నేను వివాహములు చేసిన వరులందఱును విద్యాధికులు కారని చాటున కొందఱాక్షేపించుచున్నారఁట! ఒక్క కుటుంబములో పదిమంది కన్యలున్నప్పుడు వారికందఱికిని విద్యాధికులనే భర్తలనుగాఁ దెచ్చుట సామాన్యకుటుంబములోనే సాధ్యమగుచున్నదో లేదో యాలోచించినయెడల, వితంతువుల విషయమున వారి యాక్షేపణకు వారికే సమాధానము తోఁచవచ్చును. ౧౮౮౮వ సంవత్సరము జనేవరినెలలో నల్లగొండ కోదండరామయ్యగారి వివాహమగువఱకును సామాజికులకును వివాహములు చేసికొన్న వారికిని ఐకమత్యమున కేమియు కొఱఁతరాలేదు. కోదండరామయ్యగారి వివాహము నిమిత్తమయి కన్యను తీసికొని రావలసినదని నేను పులపర్తి శేషయ్యగారిని పంపినప్పు డాయన సంకోచింపక పెండ్లికూఁతురువారి వస్తువులను సహితము కొంతదూరము సంతోషపూర్వకముగా మోచుకొనివచ్చుట యీ యైకమత్యమునకొక నిదర్శనముగా చెప్పవచ్చును. పదిమంది యొకసంఘములో చేరిన తరువాత వారిలో వారి కప్పుడప్పుడు తగవులు రాకమానవు. తమకు ప్రతికూలముగా తీర్చినప్పుడు తగవు తీర్పఁబూనిన వానియెడల కొందఱికి మనస్తాపమును కోపమును వచ్చుటయు స్వాభావికమే. కాని యీ ద్వేషముమాత్రము చిరకాలముండదు. నాచేతిలో సొమ్ము లేకపోయినప్పుడును యుక్తకాలములో నాకు చెన్నపురినుండి సొమ్ము రానప్పుడును కొన్నిసారులు రాఁబోవు నెలజీతములు ముందుగా ముట్టక కొందఱికి కాలస్యముగా ముట్టినవి. అప్పుడును నే నప్పుయినను చేసి కొంతసొమ్మయినను ముందుగా నియ్యని మాస మొక్కటియు లేదు. కోదండరామయ్యగారి వివాహ

మయిన రెండుమూడు మాసములలో కొన్ని కలహకారణములు కలిగినవి. లోకములో వైరమునకును నేరములకును ఏవి కారణములుగా నుండునో తెలిసినవారికి వైరమునకుఁగల కారణమును తెలుపవలసిన పని యుండదు. ఉన్న యైకమత్యమును చెడఁగొట్టుట యెట్టివారికిని సులభము కాని చెడినదానిని మరల కూర్చుట సాధారణముగా సాధ్యము కాదు. అట్లు నాటఁబడిన వైరవిషబీజము మెల్లమెల్లఁగా నంకురించి వివాహములు చేసికొన్న వారికేకాక సామాజికులలో నొకరిద్దఱికిఁగూడ తన విషవాయువును బఱపి యీ మహాకార్యమునకు భంగకరమయిన దుష్ఫలమును కొంతవఱకుఁ గలుగఁజేసినందునకయి యెంతయు చింతిల్లుచున్నాను. ఒకసత్కార్యమునకు విఘ్నము కలుగఁజేసెడి యవకాశము కొంచెము లభింపఁగానే దానిని సందు చేసికొని గోరంతలు కొండంతలుచేసి ద్వేషాగ్నిని ప్రజ్వలింపఁజేసి కార్యవిఘాతమయినప్పుడు చూచి సంతోషింపవలెనని కనిపెట్టుకొని యుండు మహానుభావులు లోకములో ననేకులుందురు. అట్టివారి దుర్బోధలు విని చెడిపోక బీటలువాఱుచున్న యైకమత్యమార్గమును స్వలాభముకొఱకెల్లవారును మరల శాంతిసుధతో నతికింపఁ జూతురని నమ్ముచున్నాను. యుక్తకాలములో నట్లు చేయకపోయినయెడల కార్యము మించిన తరువాత పశ్చాత్తాపపడిన ప్రయోజనము లేక స్వయంకృతదోషము ననుభవింపవలసివచ్చును. ౧౮౭౮ వ సంవత్సరము మెయినెలలో నేను నరసాపురము వెళ్ళియుండినప్పుడు నేనెప్పుడు నెదురుచూడని తావునుండి నాకొక యుత్తరమువచ్చి నా కాశ్చర్యము పుట్టించినది. నేనీపనిమీఁద నరసాపురమునుండి బందరుపోయి తిరిగి రాఁగానే జూన్ నెలలో సభచేసి యిప్పుడున్నరీతి సమాజము నేర్పఱుచుటకుఁ బ్రయత్నించినాను. ఇప్పుడున్నరీతిగా మన యీ సమాజమప్పు డేర్పడినదే. అవఱకు వేఱుగా చందాలు లేవు గనుక చందా

లిచ్చినవారెల్ల సభికులని యిప్పటివలె నంతకుముం దేర్పఱుచుటకు వీలులేదు. ఆవఱకు నేను వివాహములు చేయవలసి వచ్చినప్పుడుగాని ముఖ్యమయిన పనిని దేనినైనను నిర్ణయింపవలసి వచ్చినప్పుడుగాని యీ విషయమయి నిజమైన శ్రద్ధగలవారని నేను నమ్మిన యొకరిద్దఱి తోను పైడా రామకృష్ణయ్యగారితోను ఆలోచించుచుండెడివాఁడను. స్త్రీపునర్వివాహప్రయత్నమున కెల్లను రామకృష్ణయ్యగారు ప్రాణముగా నుండెడివారు; నిజము విచారింపఁగా సమాజమన్న పరమార్థ మాయన యొక్కరే గనుక నేను వివాహములు చేయించుచున్నను, ఆయనగారే యిండ్లు మొదలయినవి కట్టించుచు పెండ్లి చేసికొన్న వారికిని తత్సంబంధులకును తగిన సాహాయ్యముచేయుచు భేదము లేక వర్తించుచుండెడివారు; వివాహముల ధనములోనుండి నేను కొన్న స్థలములో ఆయన యిండ్లు కట్టించినారు; నేను కొన్న యిండ్లను వారి వారి కియ్యవలసినదని మరణశాసనములో వ్రాసినారు. అటువంటి వారు లోకాంతరగతులగుటచేత మన సమాజము ప్రాణములేని బొందెవంటి దైనదని చెప్పవచ్చును. ఏవివాహమున కెంత సొమ్మయినదో యాయనయే విచారించుచుండెడివారు; మూడవ వివాహమున కయిన వ్యయముల వివరము నేనాయనకుఁ బంపినప్పుడు వివర మక్కఱ లేదనియు మొత్తములను మాత్రము పంపుచుండవలయుననియు కోరినారు. నేనాప్రకారముగా పంపుచుండఁగా పదివివాహము లయిన తరువాత వివరములన్నియు తమయొద్ద లెక్కయుంచుకొను నిమిత్తమయి కోరినారు. లెక్కయంతయు మరల వ్రాయుటకు నాకవకాశము లేక కొన్నిమాసములకు మన సమాజమువారి నిమిత్తమయి వ్రాసిన పుస్తకమునే నేను పంపఁగా వారు దానికి నకలు వ్రాయించి తమయొద్ద నుంచుకొని పుస్తకము సమాజమువారి తావునకుఁ బంపినారు. అటుపిమ్మట రామకృష్ణయ్యగా రిక్కడకు వచ్చినప్పుడు తాము

తరువాత నిచ్చిన పదివేలరూపాయలును మొదటి రెండువివాహములకు ప్రత్యేకముగా చేసిన వ్యయములును కట్టించిన యిండ్లును స్త్రీపునర్వివాహాభివృద్ధినిమిత్తమయి చేసిన యితరవ్యయములును కలుపుకొని యిరు పదివేలరూపాయ లయ్యెననియు, మొట్టమొదట వాగ్దానము చేసిన మొత్తములో అవిపోఁగా మిగిలిన పదివేలరూపాయలును వేగిర మిచ్చెదననియుఁ జెప్పి మూలధనము వ్యయపడక వృద్ధివలన సమాజమునకు తోడుపడునట్లుగాఁ జేయుటకయి యేమిచేయుట యుచితముగా నుండుననని నన్నాలోచన యడిగిరి. అప్పుడు నేనొకసారి నాగోజీరావుపంతులు వారియొద్దకును ఇంకొకసారి ఆచంట లింగరాజు గారి యొద్దకును వారితోఁగలిసి పోయి యాలోచించితిమి గాని యప్పుడెట్లు చేయుటకును నిశ్చయింపలేదు. దేశముయొక్క యభాగ్యముచేత నింతలో వారి కవసానదశ సంప్రాప్తమయినందున, ఉద్దేశించిన పదివేలరూపాయలను మరణశాసనమూలమున నిచ్చి, చేసిన వాగ్దానమును చెల్లించుకొన్నారు. మనమందఱమును వారియెడల కృతజ్ఞులమై యుండి వారిచ్చిన ధనము వారి యుద్దేశప్రకారముగా సార్థకపడునట్లు చేయుటకును, వారవలంబించిన యీ ఘనకార్యము దినదినాభివృద్ధి చెందునట్లు చేయుటకును, సర్వవిధముల ప్రయత్నింపవలెను. ఈమధ్య కాలములో పుట్టిన వైమనస్యాభావమును పోఁగొట్టి యీ లోకోపకార కార్యము నిర్విఘ్నముగా సాగునట్లు చేయవలయునని యీశ్వరుని హృదయపూర్వకముగా ప్రార్థించుచున్నాను.

స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సమాజమువారి
విజ్ఞాపనము.

By

K. VEERESA LINGAM

స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సమాజమువారు హిందూ మహాజనులకు చేయు విజ్ఞాపనము

అస్మద్దేశీయులగు మహనీయులారా!

సాధారణముగా హిందూదేశముయొక్క యభివృద్ధికొఱకును అంతకంటెను ముఖ్యముగాఁ బూర్వకాలమునందు హిందూసుందరులు పొందియున్నట్టియు అధికనాగరికతగల ప్రపంచములోని యితరదేశములయందలి స్త్రీలిప్పుడు బొందుచున్నట్టియు ఉన్నతదశకు మరల మన స్త్రీలను దీసికొనివచ్చుటకొఱకును అభిలాషగలవారందఱును, అత్యంతాపేక్షణీయమయిన యీ యభివృద్ధి విషయమయి యే మాత్రము శ్రద్ధచేయువారయినను మనలో నంతకంతకు ముదురుచున్న యీ క్రిందఁ జెప్పఁబోయెడి యాచారమువలనఁ గలుగుచున్న విషతుల్యములయిన ఫలములను తెలిసికొని చింతిలకపోరు. కేవలము పసితనములోనే భర్తలను పోఁగొట్టుకొన్న బాలికలయినను యావజ్జీవము దుఃఖైకమూలమయిన విధవావస్థయందే కాలము వెళ్ళఁబుచ్చవలయునను నిర్బంధకరమయిన యీ యాచారమును మళ్ళించుటకై భరతఖండములోని భిన్నభిన్న దేశములయందలి మహాపురుషులు కొంద ఱప్పుడప్పుడు ప్రయత్నములు చేయుచు వచ్చినను, దానిని సంపూర్ణముగ మాన్పవలెనన్నచో ఈ దేశమునందలి వివేకిలోకమంతయు సంక్షోభవించి యైకమత్యముతో మహాప్రయత్నము చేయవలయుట యనివార్యకార్యమయినట్టు కనఁబడుచున్నది.

ఓ దేశీయులారా! హిందువులను జూచి యితర దేశములవారు నాగరికతను నేర్చుకొన్నటువంటి పూర్వకాలమును నిమిషమునేపు మీ మనసులలో నిలుపుకొండి. అప్పుడు మీదేశము సమస్తవిద్యలకును కళలకును ఆటపట్టయి యున్నందుకై మీకిప్పుడు సంతోషము కలుగుచుండ లేదా? గ్రీకుదేశస్థులును యవనదేశస్థులును వైద్యశాస్త్రరహస్యములను గణితశాస్త్ర మూలవిధులను నేర్చుకొనఁగలిగినది మీపూర్వులవలననే కాదా? సమస్తభాషలలోను ఉత్కృష్టమయిన సంస్కృతమును, సమస్తశాస్త్రములలోను శ్రేష్టమయిన జ్యోతిషమును మిక్కిలి సంపూర్ణములయిన శాస్త్రసంప్రదాయములును, అసమాన ప్రజ్ఞావంతులయిన ధర్మశాస్త్రకర్తలును, వెనుక నొకప్పుడు మన దేశము నలంకరించి యుండలేదా? మన శాస్త్రములు న్యాయముగా నర్థముచేయఁబడి, ప్రామాణికబుద్ధితో ననుసరింపఁబడుచువచ్చిన కాలమొకటి యుండలేదా? తక్కిన యుత్తమపదార్థసంపదతోడిపాటిగా మన దేశమునం దప్పుడు దేశాభిమానులును పలువు రుండలేదా? ఓహో! వారి ప్రయత్నములెంత శ్లాఘనీయములుగా నుండెను! అపరిమిత మేధాసంపన్నులకుఁగాక మఱియెవ్వరికైన మన ధర్మశాస్త్రములను, వ్యాకరణశాస్త్రమును, తర్కశాస్త్రమును, వేదాంతశాస్త్రమును, జ్యోతిషశాస్త్రమును చేయుటకు శక్యమగునా? అట్టి యుత్తమకాలమునందు మనదేశమునందలి స్త్రీలుగూడ విద్యావతులయి, పురుషులతో సమానముగా గౌరవింపఁ బడుచుండలేదా?

అట్టి పూర్వకాలములయందు స్త్రీ లెట్టి యున్నతదశను జెందియుండిరో మీమనసులకు తార్కాణపడుటకయి, సీత, శకుంతల, అనసూయ, అవ్వై మొదలయిన పుణ్యసతుల నామములను స్మరణకుఁ దెచ్చుచున్నాము. అనేక ప్రతిబంధములుగల యీ కాలమునందు

సహితము కాంత లెంతటి విద్యావతులు కాఁదగియుందురో చూపుటకయి కొంతకాలముక్రిందట లోకాంతరగతురాలయిన తారాదత్తను నిదర్శనముగాఁ బుచ్చుకొనుచున్నాము. ఆమె ప్రతిభవిషయమయి గడచిన శ్రావణమాసమునఁ బ్రకటితమయిన ఖండాంతరమునందలి "స్థిరవారవిమర్శని" యను పత్రిక యీవిధముగా భాషించి వ్రాయుచున్నది:—"విష్ణుపురాణమును ఇంగ్లీషుభాషయందుఁ బద్యకావ్యముగా భాషాంతరీకరించిన తారాదత్త విషయమయి మాకిప్పుడు సంపూర్ణముగాఁ దెలిసినది; ఆమె ఫ్రెంచిభాషయందొక వచన ప్రబంధమును రచించి ప్రచురించిన ౧౮౭౭ వ సంవత్సరమున నిరువదిసంవత్సరముల ప్రాయముగలది; ఆమె యైరోపీయ సంపర్కమెఱుఁగని శుద్ధ హిందూసుందరి; భాష చేసికొన్న యభాగ్యముచేతనే యామె తన యిరువదిరెండవ సంవత్సరమునఁ బరమపదమును పొందినది... ఈవరకు భూమిమీఁద జననమొంది విశేషజ్ఞురాండ్రని ప్రసిద్ధికెక్కిన వారిలో తారాదత్త యగ్రగణ్యురాలని నమ్ముటకు హేతువులనేకములు గనఁబడుచున్నవి. జార్జి సాండు దొరసాని గాని, జార్జి యీలియట్టు దొరసాని గాని, తన యిరువదియొకటవయేట మృతినొంది యుండెనేని, ఇప్పుడు తారాదత్త రచియించిన గ్రంథమువలన మనకుఁ దెలియవచ్చుచున్న కల్పనాశక్తిని ప్రౌఢిమను మించిన మంచికావ్యములను వారు రచియింపఁగలిగి యుందురని యూహించుటకుఁగల నిదర్శనము లేవియు మనకిప్పుడు లేకపోయియే యుండును; అద్భుత ప్రతిభావంతురాలయిన యీచిన్నదాని పాండిత్యమునందు దూరాలోచన లేనట్టు గనఁబడునది యించుకయు లేదు."

దేశీయులారా! ఇఁక ప్రస్తుతకాలస్థితికి దిగి శ్రద్ధతోఁ బరిశీలింపుఁడు. నిలువక పరుగెత్తు అవిమర్శకుఁడైనను మనము హీనదశను

పొందియున్నామని కనుగొనవచ్చును. దైవముఖమునుజూచి యెవ్వరైన నందుకు వ్యతిరేకముగాఁ జెప్పఁగలరా? పూర్వము ప్రపంచమున కంఠకును అభరణముగానుండి హిందూదేశమే యిప్పు డెల్లవారల పరిహాసమునకును బాత్రమైనది. మనపెద్దలు మన కిచ్చిపోయిన దాని నేమైన మనము వృద్ధిపఱుచుకొనియున్నామా? వారి యాజ్ఞలకు బద్ధులమై గౌరవముకలిగి నడుచుకొనుచున్నామా? మాననీయులారా! క్షణ మాలోచించితిరేని మనపూర్వులేర్పఱిచిన సనాతనములైన సద్విధులను మనము బొత్తిగా నలక్ష్యము చేయుచున్నామనియు వానిస్థానమున పూజనీయుఁడుకాని యొకద్రోహిని తెచ్చిపెట్టి సింహాసనమెక్కించి యాతని నారాధించుచుండుటయేకాక యాతనికి హైన్యముతో దాస్యము చేయుచున్నామనియు మీకే తెలియవచ్చును. బాహుళ్యముగా మనమందఱమును వంగి సేవచేయుచున్న దుష్టుఁడు ఆచారమను క్రూరరాక్షసుఁడు. అతని క్రౌర్యముయొక్క ఫలమును మన మందఱము ననుభవించుచున్నాము. కాని, అతని యధికారము నతిక్రమించి స్వతంత్రించుటకు శక్తులము గాకయున్నాము. అతఁడు మనకు సర్వాధికారి కాఁడని యెఱుఁగుదుము; అట్లయ్యును అతనితోఁగల బద్ధసంబంధమువలన, న్యాయముగా మనకు మార్గప్రదర్శకములైన శాస్త్రములమాటయే మఱచిపోవుచున్నాము. ఆచారపిచాచము మనలను దారి తప్పించి తప్పుత్రోవను బెట్టి, మన యభివృద్ధిమార్గమున కడ్డముగా కంటకప్రాయములగు ప్రతిబంధములను గల్పించి మన సౌఖ్యవృక్షమును మూలముతో ఛేదింపఁ జూచుచున్నదని మన మెన్నిసారు లనుభవమువలనఁ దెలిసికొనియున్నాముకాము? అతఁడు మనకుఁ దెచ్చిపెట్టిన మితిమీఱిన కడగండ్ల ననుభవించుచుండియు, ఇంకను మన మతనికి లోఁబడి యుండవలెనా? అక్కఱలేదు; మన

మీరాశ్వరశాసనమునకుఁ లోఁబడవలెను; కార్యక్రమ మెప్పుడును మాఱుచుండును. ఈవఱకు మనము కాళ్ళను చేతులును గట్టుకొని యాచారమున కధీనులమై పడియున్నాము; మీరాకట్లు త్రెంచుకొని స్వచ్ఛందదశను పొందుఁడని బోధించు విధిమాటను విని, మన మింక మాంద్యమునుండి లేతము. ఆచారముయొక్క సమ్మోహనమంత్ర ప్రభావముచేత మన మిప్పుడు దేహములు మఱచి యుండలేదు. మన మియ్యెడ నడుము కట్టుకొని నిలిచి, అధికారము నక్రమముగా నాక్రమించుకొన్న యా ద్రోహిని క్రిందఁ బడవైచి, క్రమబాధ్యతగల శాస్త్రములకు మరల సింహాసనము నర్పింతము. ఈ ఘనకార్యనిర్వాహణము మనలను దేశముయొక్క ఋణమునుండి విముక్తులను జేయుటయేకాక, పూర్వ మొకప్పుడు ధర్మరాజు, గౌతముఁడు, మనువు, పరాశరుఁడు, విక్రమార్కుఁడు, మొదలయిన కీర్తిశరీరులచే నలంకరింపఁబడిన దేశమున వసించు మహాపురుషుల సంతతివారమని చెప్పుకొనుటకు మన మర్హులము కావలెనని ప్రయత్నము చేయుచున్నందుకు నిదర్శనముగా నుండును.

దేశీయులారా! ఇంతవఱకును మే మొక ముఖ్యోద్దేశము లేకయే యేమో చెప్పుచున్నామని మీ రనుకోవచ్చును. కాఁబట్టి మాముఖ్యోద్దేశము నవశ్యముగాఁ జెప్పవలసియున్నది. మన దేశములో స్త్రీల స్థితి యెంత దౌర్భాగ్యదశయం దున్నదో మీరందఱు నెఱుఁగుదురు; వివాహబంధమువలన తన జీవితదశయందు ముందు రాఁబోవు మార్పు యొక్క గౌరవస్వభావము నించుకయుఁ దెలిసికోలేని పసితనములోనే కన్నియకు వివాహము చేయఁబడుచున్నది. ఎన్ని విషయములలో జ్ఞానమురాని చిన్న పెండ్లికొమార్తెలు వివాహమహోత్సవమునంతను భక్ష్యములు చేసికొని వాద్యములు వాయించు నొక సాధారణపు పండు

గునుగా భ్రమించుటలు మీరు చూచియున్నారు కారు? భర్త పోయినాఁడన్న పిడుగువంటి దుర్వార్త కుటుంబమునంతను దుఃఖసముద్రములో ముంచినప్పుడును, పెండ్లినాటికంటె నెక్కువ జ్ఞానము రాని ముగ్ధబాలిక లెందఱున్నారు కారు? ప్రాణసమానలయిన ప్రియపుత్రికలను యావజ్జీవమును దుస్సహమయిన వైధవ్యదశకుఁ దెచ్చిన దురవస్థను దలఁచుకొని తలలువీడ, బొమ్మలు బాదుకొనుచు రోదనముచేయు తల్లిదండ్రులకడకుఁ బోయి, వారి వ్యసనకారణమును లేశమయినను దెలిసికోఁజాలక, "నాయనా! ఏమికష్టము వచ్చినది? ఏల యేడ్చుచున్నావు? అమ్మా! ఏల దుఃఖించెదవు?" అను నిట్టి యెఱుఁగని ప్రశ్నలను విధవలయిన పసిబిడ్డలు వేయునప్పుడు చూచువారి గుండెలు బ్రద్దలుచేయు నట్టి ప్రదేశములను యథాస్థితముగా వర్ణింపఁగల కాళిదాసు నొకని మనమిప్పుడు కోరవలసినదేకదా?

మనలో విధవావస్థ యనఁగా నెటువంటిదో వర్ణించుటకై మేము ప్రయత్నింపవలసిన యావశ్యము లేదు. కొంతవఱకు బాల్యవివాహములనుబట్టియు, కొంతవఱకు స్త్రీలకు పునర్వివాహము లేక పోవుటంబట్టియు, వయసుచెల్లిన రెండవపెండ్లివాండ్రు సహితము బాలికలనే వివాహమాడుచుండుటం బట్టియు, ఈ యన్ని హేతువులచేతను మనలో విధవలసంఖ్య విస్తారముగా పెరుగుచున్నది. వారి సంఖ్యతోనే వైధవ్యజీవనమువలనఁ గలుగు నష్టములును వృద్ధియగుచున్నవి. ఒక బాలిక భర్త పోయినతోడనే మనుష్యులు పెట్టినఁ యలంకారములను మాత్రమేకాక తఱుచుగా భగవంతుఁడు దయచేసిన నల్లని నిడుద శిరోరుహములనెడి స్వతస్సిద్ధమయిన యమూల్యాలంకారమును సహితము పోఁగొట్టుకొనును; ఆమె దినమున కొక పూట మాత్రమే మితాహారముతో తృప్తిపొందవలసి యుండుటయే కాక యింటఁగల

హీనమయిన కష్టపుపని యంతయు ఆమెపాలనే పడును. ఇదియంతయు నేమి? ఆమెచేత శక్తికిమించిన పని చేయించి తిన్నగా నన్నము పెట్టక కడుపు మాడ్చుటయేకదా? ఆమె శ్రమయంతయు నింతేకాదు— అన్నిటికంటెను భయంకరమైన దింకొకటి యున్నది. భాగ్యహీనలైన విధవలు వీనికన్నిటికి లోఁబడఁగలరు గాని, ప్రకృతిని మాత్రము జయింపలేరు. అందుచే వారేమిచేయుటకును తోఁచని కష్టదశయందుందురు. స్వజాతివారి మెప్పు వడయుటకై ప్రకృతిని జయింపవలసినదా, లేక, ప్రకృతిసిద్ధమైన యింద్రియాకర్షణమునకు లోనై వారి దృష్టియందు హీనురాండ్రుగాఁ గనఁబడవలసినదా? ప్రకృతిని జయించుట యించుమించుగా నసాధ్యకార్యము. ప్రియజనకునిని, ప్రియతరులయిన తోఁబుట్టినవాండ్రను, తోడఁబుట్టినపడుచులను, ప్రియతమురాలయిన తల్లిని విడిచి, నీచురాండ్రవలె జీవించుటయు నొకవిధమున ప్రకృతిని జయించుటయేయైనను, స్త్రీలపాలిటి కది గొప్పనష్టమే యైనను, నిరాశ్రయలా దశయందున్న యీ యనాథలయిన యబలలు దుస్స్వభావముగల పురుషుల ప్రేరణమువలన నుద్రేకించిన యింద్రియముల ప్రోత్సాహముల నెట్లు నిగ్రహింపఁ గలుగుదురు? అంతట వారు ఇంద్రియనిగ్రహము చేయలేక, పురుషులవలలఁ బడుదురు. అందువలనఁ గలిగెడి ఫలమేది? గర్భోత్పత్తి! కులమువారి కన్నులనుగప్పి, వారి నోరడంచవలెను. ఇంతవఱకును నిరపరాధులుగా నుండు భాగ్యహీనులయిన తల్లిదండ్రులును, సోదరులును ఇప్పుడు నేరమునకు సహకారులగుదురు. అప్పుడు గర్భపాతకర్మ ప్రారంభింపఁబడి, మరల నవసరము వచ్చినప్పుడెల్ల నాపనియే యాచరింపఁబడుచుండును. అట్టిస్థితిలో నొకానొకప్పుడు తనపనికి విఘాతము చేయవలెనని వ్యర్థముగా మనుష్యులు చేయు దుర్బల ప్రయత్నమును

జూచి ప్రకృతి పరిహసించుటయు సంభవించును. ఇట్టి పోరాటములో ప్రకృతియే విజయముఁగాంచి, మంచిశిశువు జనన మొందును. ఇప్పుడు మరల కులమువారి కన్నులకు గంతలుకట్టి దోషము లెన్ను వారి నోళ్ళను కట్టిపెట్టవలెను. అందుకుఁ దగిన యుపాయమేది ?— శిశుహత్య. ఓకులమా ! నీవెంత క్రూరమైన దానవుగా నున్నావు ? నీ వెంత కరుణమాలినదానవుగా నున్నావు ? నీవు కన్నులు తెఱచి క్రూరదృష్టితోఁ జూచుచున్నంతవఱకును, ఈదేశములో శిశుహత్యలు మానినవని మేమెట్లు చెప్పఁగలము ? ఎంతమంది చక్కని శిశువులను నీపొట్టను బెట్టుకొన్నావు? నీ యకవాశ కెప్పటికిని పరిమితిలేదా? ఇప్పుడు నీ క్రూరకృత్యములను విడిచిపెట్టవలసిన కాలము వచ్చినది.

నేరములు పట్టుకొనుటకై నియమింపఁబడియుండు రాజకీయ భటులవలని గాని, యుద్యోగస్థులవలనిగాని భీతివలన ఈపనిని జేయ వెనుకదీయువారు తాము కన్న పిల్లలను వేశ్యాంగనలకును, మాల వాండ్రకును, వీధులు తుడుచు వాండ్రకును ఇచ్చి వేయుదురు. అయ్యో ! ఉత్తమకులమునందుఁ బుట్టిన బిడ్డలు భోగస్త్రీలుగాను, చెప్పులు కుట్టువారుగాను, పెంటలు బాగుచేయువారుగాను అగునట్లు చేయఁబడుచున్నారు! ఈ యనర్థముల కన్నిటికిని కారణము కులాచారమే. ఇవి తల్లిదండ్రుల, యిల్లు విడిచి వెళ్ళలేని స్త్రీలు చేసెడి యపరాధములు (?) భ్రూణహత్యలు, శిశుహత్యలు, శిశువులను పాఱవేయుటలు ఇవియన్నియు మన యాచారమువలన సంభవమగుచున్న ఫలములు. ఇట్టి యాచారమును మన తండ్రులును, తాతలును అనుసరించిరి కాఁబట్టి మనమును అవలంబింపవలెను ! పైనుదాహరింపఁబడిన నేరములు మాత్రమే కాక, అట్టినేరములు చేసినారను ననుమానము సహితము వారిని రాజకీయశాసనములయొక్క

మృదుతరకటాక్షముల కొప్పగింతపెట్టునని మేమిక్కడఁ జెప్ప నక్కఱయుండదు. కులమువారి భయమువలనను, ప్రసవము నాప శక్యముకాదను నిరాశవలనను, తమరు కన్నకూఁతులకే తండ్రు లెన్ని మాఱులు విషము పెట్టినారుకారు? విధవలయిన కొమార్తెల విట పురుషులకు తల్లులు విషము పెట్టుచుండలేదా? నిజమునకు ప్రకృతి ధర్మమేయైనను తాము పాపమని భ్రమించిన దానిని వారించుటకై నిర్భాగ్యులయిన తలిదండ్రులు ఘోరతరపాతకములను జేయుచుండ లేదా? కులమువారి శిక్షను తప్పించుకొను నిమిత్తము వారు చేసిన పాపకార్యముల శిక్షను వారనుభవింపవలసిన వారు కారా? మే మింతవఱకును జెప్పి ఒకతరగతి స్త్రీల విషయమయి మాత్రము మాటాడియున్నాము. రెండవతరగతి స్త్రీలు కులమునం దంతగా గౌరవ ముంచువారు కారు. తల్లిదండ్రులయెడఁ గల ప్రేమానుబంధ మయినను వారిని వారింపఁజాలదు. జననీజనకులను, గృహములను వారు ప్రేమింతురుగాని, వారిప్రేమ కంతకును ముఖ్యాస్పదమయిన దొక్క పదార్థమును ప్రపంచమును విడిచిపోయినది. ఇఁక వారు మఱుఁగు చొచ్చుటకు కులమువారిలో నేమియు నాధారము లేదు. కులమును యితరుల దౌర్బల్యమును జూచి యపరాధము లెంచుట కెప్పుడును సిద్ధపడి యుండుటయేకాని వారి విషయమయి లేశ మయినను దాక్షిణ్యము పూనకున్నది. కాఁబట్టి, వారవలంబించెడి యుత్తమపద్ధతి కులము నతిక్రమించి ప్రవర్తించుటయే. అట్లు చేయుటయు వారికి నైసర్గికమే. కులమునకు వారియెడల నాదరము లేనపుడు వారికి కులము నెడ నాదరము లేకపోవుట యద్భుతముకాదు. కులమునువిడిచి వారెక్కడకుఁ బోవుదురు? బహిరంగముగా నిల్లు విడిచి జారవృత్తియందుఁ బ్రవేశింతురు. ఇటువంటి విషయములలో

వారిస్థితి వేశ్యలస్థితికంటెను హీనమయినదిగా నుండునని మీరెఱుంగుదురు. వేశ్యలు బాల్యమునుండియు నభ్యాసము చేసెడి మాయలేవియు వారికిఁ బట్టుపడవు. ఓ దేశీయులారా! మేముసంగతుల సగము సగము చెప్పలేదు. హిందూదేశమునందు ప్రతి పురుషుఁడును కనుచుండునట్టియు, అదృష్టహీనులయిన జననీజనకు లనేకులుఁ దలఁచుగా మనసు కుంద దుఃఖించుచుండునట్టియు సంగతులనే మీ కన్నులయెదుటఁ బెట్టియున్నాము.

దేశీయులారా! మీ దేశముయొక్క పూర్వపు మహోన్నత దశను, ఇప్పటి యత్యంత నీచదశను కొంచె మాలోచించుకొండి. మనపూర్వులనుండి విద్యాబుద్ధులను నేర్చుకొన్నవారు మనలను భ్రష్టులగుచున్నారని వ్రేలుపెట్టి చూపుచుండఁగా, అటువంటి మహానుభావుల సంతతివార మయ్యును చేతులు నలువుకొనుచు మన మూరక కూరుచుండ వలసినదేనా? మన స్త్రీలను గుడిసె వేటులయి బహిరంగముగా వ్యభిచరించుటకయి మనము పంపివేయవలసిన వారమేనా? ఓ బ్రాహ్మణులారా! విధవలయిన మీ కొమార్తెలు దుష్టజనులను తగులుకొని లేచిపోయి కడపడ మీకన్నుల యెదుటనే జారిణులై పడుచుకొనుచుండఁగా మీరు చూచుచు నూరకుండెదరా? మీగొప్పతనమున కంతకు నిదియే లక్షణమా? బుద్ధిసంపదయందితరులకంటె నధికులని ప్రసిద్ధి గనుచున్నట్టియు దేశముయొక్క పరిపాలనమును పూర్వము నిర్వర్తించియుండి, యిప్పుడట్టి పరిపాలనములో భాగము కావలెనని కోరుచున్నట్టియు జనుల వివేకమంతయు నిదియేనా? మీపూర్వులు లక్షలకొలఁది జనులకు ధర్మశాస్త్రములను జేసి వారిని యుక్తధర్మములయందుఁ బ్రవర్తింపఁజేసి యుండఁగా, మీరు మాత్రము మీప్రవర్తనమునయినను బాగుచేసికొనుటకు శక్తి

లేనివారయి యొక దుష్టాచారమునకు దాసులయి యూరకుండెదరా? ఓ దేశీయులారా! బ్రాహ్మణులారా! మీ పెద్దలసంగతి జ్ఞప్తియం దుంచుకొని, వారిని జూచియైనను వారి మహాత్త్వమునందు గౌరవబుద్ధి యుంచి యీ దుష్టాచారమునకు మిమ్ముల బద్ధులనుగాఁ జేసినకట్లను త్రెంచుకొని, వారి గౌరవమునకు మీరు క్రొత్తగా నేమియుఁ జేర్ప లేకపోయినను మునువున్న దానినైనను నిలువఁబెట్టుఁడు. నష్టకరము లని తోఁచినప్పుడెల్లను మీ పూర్వు లాచారమును మార్చుకొనుచు రాలేదా? వారు ప్రదర్శించిన మార్గమును మీరవలంబింపరాదా? ఈ యాచారమువలన నష్టములు ప్రత్యక్షముగా మీకుఁ గనఁబడు చుండఁగా, వారు చేసినపనిని మీరు చేయరాదా? ఆచారమునుండి మనము తొలఁగి ప్రవర్తించునెడల, ఏ మార్పును మనము తెచ్చిపెట్ట వలయునని మీ రడుగవచ్చును. మీ ప్రశ్న కుత్తరము చెప్పుటకై, ఈ దుర్దశ లన్నిటికిని మూలకారణమును మరల మేము చెప్పవలసి యున్నది. వచ్చినతరువాత మాన్పఁ బ్రయత్నించుటకన్న మొదటనే రాకుండఁ జేసికొనుట యుత్తమకార్యము; నిర్బంధముచేతఁగాని సుబో ధలచేతఁగాని బాలవిధవల నందఱిని మనము మహాపతివ్రతలనుగాఁ జేయఁగలమా? చేయలేము. మన మనుష్ఠించుటకయి యున్న యాధారమెల్లను స్త్రీలకు పునర్వివాహము చేయుటయే. మన శాస్త్రము విధవావివాహము నంగీకరించునని మాకు రూఢిగాఁ దెలిసియున్నను, ప్రస్తుతము యుక్తవయస్సు రాకమునుపు భర్తలను పోఁగొట్టుకొన్న వారికి మాత్రము వివాహములు చేయింపఁ బూనుకొన్నాము.

దేశీయులారా! మీరు నాయకత్వమును వహించి యీ సత్కా ర్యోద్ధారణమును నడిపింప నమ్మతింతురేని, మీకు మనఃపూర్తిగా సర్వసహాయములను జేయుటకు సిద్ధముగా నున్నాము. మీరు సంశ

యుంచెడి పక్షమున మేము నడిపెదము; మీరు మాకు సుముఖులగుదురేని, శుద్ధమైన మనజాతి కంతకును అపకీర్తికరమయిన గొప్పకళంకముగానున్న యీ దురాచారమును నివర్తింపఁజేయుటకై శక్తివంచన లేక ధైర్యముతో మాచేతనైనంతయుఁ జేసెదము. మన పూనిక కిష్టము లేనివారు కొందఱున్నారని మీరు చెప్పవచ్చును. మన పక్షమునకు విరోధులున్నారు—ఉన్న నేమి? ప్రతికార్యమునకును ప్రతికూలురు కొందఱుండరా? ప్రతిపక్షమే లేనియెడల, ఘనత యెక్కడిది? పూర్వపక్ష మెంత యధికముగా నుండునో ప్రతిష్ఠయు నంత యధికముగా నుండును. మొట్టమొదట పూర్వపక్షకోటి యెంత ప్రబలముగా నుండినను, అదియంతయు క్రమక్రమముగా నశించి పోవును.

మేము మిమ్మిప్పు డడుగఁబోవు తోడుపాటు రెండువిధములయినది. మొదటిది స్త్రీపునర్వివాహము చేసికొనువారితో నిరభ్యంతరముగా సర్వకార్యములయందును కలిసి యుండుట. రెండవది ధనసాహాయ్యము.

ఈ ద్వివిధ సహాయత్వమును చేసెదమని వాగ్దానము చేసిన వారిని మే మీవఱకే కొందఱిని సంపాదించియున్నాము. అనేక హేతువులనుబట్టి మొదటి విధమైన సాహాయ్యమును జేయ సిద్ధపడువారిసంఖ్య తక్కువగానే యుండును. ఐనను మమ్మది ప్రోత్సాహపఱుచుటకుఁ జాలియుండలేదని మే మెంచుకోలేము. ద్వితీయవివాహములు జరిగించుటకు కొందఱు బీదకుటుంబములవారు బయలుదేఱుచున్నందున, అట్టిబీదలను సంరక్షించుచున్నట్టియు, ఈనూతనపద్ధతి కిష్టము లేనట్టియు ధనికులు వారిని వదిలిపెట్టుదురేమోయని భయపడవలసి యున్నది. అట్లగుట యిట్టి వివాహసంబంధములయందుఁ ప్రవేశించువారికి దిక్కులి

నిరుత్సాహకరముగా నుండును గనుక ఇటువంటి యిబ్బందికిఁ దగిన ప్రతిక్రియను విచారించుట యావశ్యక మగుచున్నది.

హిందూదేశమునందలి రాజకుమారులారా ! ఓ సంస్థానాధిపతులారా ! మీపూర్వులు మతసంబంధ మయినట్టియు, సర్వజనోపయుక్తము లయినట్టియు నూతనసిద్ధాంతముల నాదరించి, కవులచేత కీర్తికాయులుగాఁ జేయఁబడి యున్నారు. ఓ రాజచంద్రులారా ! సంస్థానాధిపతులారా ! దేశముయొక్క యభివృద్ధికొఱకును క్షేమముకొఱకును ఈదేశము మిమ్మే దృఢముగా నమ్ముకొని యున్నది గాన, మీయౌదార్యమును గనఁబఱిచి యీ యుద్యమమునకు తోడుపడుఁడు.

హిందూదేశమునందలి విద్యాసంపన్నులారా ! ఈదేశము మిమ్ములనుండియే యెంతో మేలును పొంద ప్రతీక్షించుచున్నది. లోకమంతయు దేశాభివృద్ధికొఱకు మీనిమిత్తమె యాశపడి చూచుచున్నది. అభిముఖులై వచ్చి మీ తోఁబుట్టువులకు సహాయము చేయుఁడు "సంఘే శక్తిః కలౌయుగే" అని యుండుటవలన, వచ్చి యౌదార్యముతో సహాయులరు కండి. మీరు సిద్ధపడుఁడు. మేము వెనుకదీయఁగలవారము కాము. మేము మనఃపూర్వకముగా పని చేయుచున్నవారమని నమ్ముఁడు.

శ్రీపునర్వివాహప్రవర్తక సమాజము, రాజమహేంద్రవరము, సెప్టెంబరు ౧౮౭౯ } కం. వీరేశలింగము, కార్యదర్శి.

గోదావరీమండల సాంఘికసభలో
చేసిన ప్రసంగము.

By

K. VEERESA LINGAM

ఏలూరులో జరిగిన మూడవ గోదావరీ మండల సాంఘికసభలో సభా నాయకత్వము వహించినప్పుడు చేయఁబడిన ప్రసంగము.

ఓ మహాజనులారా!

నాకంటె సమర్థతరులైన వారనేకులుండఁగా, మీరు దయాపూర్వకముగా నన్నే నేడు సభానాయకత్వమునకు నియమించినందుకు మిక్కిలి కృతజ్ఞత గలవాఁడనయి మీ కనేకాభివందనములు సమర్పించుచున్నాఁడను. మ. రా. శ్రీ. దీ ఆనరేబిల్ న్యాపతి సుబ్బారావుపంతులుగారు నేడు సభానాయకత్వమును వహించుటకు మొట్టమొదట నేర్పాటు జరిగినను కొన్నికారణములచేత వారు నేఁడిచ్చటకు రాలేకపోయినందునకుఁ జింత నొందుచున్నాను. వారే నేఁడగ్రాసనాసీనులయియుండుట తటస్థించిన పక్షమున, మీరు శ్రవణానందకరమయిన మంచిప్రసంగమును వినియుందురు. నేను వక్తనుగాను. కాఁబట్టి మీలో నెవ్వరును నేఁడు నావలన హృదయాహ్లాదకరమయిన యుపన్యాసము నెదురుచూడఁ బోకుఁడు. సభలో నగ్రాసనాధిపత్యమును వహించువారు నాఁటిదినము విచారింపఁబోయెడి యంశములనుగూర్చి ముందుగాఁ బ్రసంగించుట యాచారమయి యున్నందున నేనును నేఁడిచ్చట నిర్ధారణము చేయ నేర్పఱుచుకొన్న విషయములను గూర్చి రెండేసిమాటలు చెప్పక తప్పదు.

సంఘసంస్కారవిషయములను జర్చించుటకయి యిక్కడ మీరింతమంది కూడుట నాకెంతో సంతోషకరముగా నున్నది. రాజ్యతంత్రసంస్కారమునకంటె ముందుగాఁ గాకపోయినపక్షమున దానితో

సమానముగా నైనను సాంఘికసంస్కార మవశ్యకముగా నడుచు చుండవలెను. సాంఘికసంస్కారము జరగకపోయినయెడల రాజ్యతంత్రస్వాతంత్ర్యములవలని ఫలములను మన మెన్నఁడును బూర్ణముగా ననుభవింప శక్తులము కాము. ఈ మండలసభయొక్క ప్రథమ దినమునం దొక రన్నట్లుగా సంఘసంస్కార మాత్మసంస్కారము వంటిది; రాజ్యాంగసంస్కారము బాహ్యసంస్కారమువంటిది. ఆత్మ సుఖస్థితియం దున్నమీఁదటఁగాని బాహ్యసుఖము లానందప్రదములు కాఁజాలవు. దేహమంతయు లోపల జ్వరముచేత తపించుచున్నప్పుడు పయి శీతలోపచారము లేవి తాపనివారకములు కాఁగలుగును ? లోపల జీర్ణశక్తి చెడి యున్నప్పుడు బాహ్యములయిన యుత్తమపదార్థము లేవి బలదాయకములు కాఁజాలును ? బాహ్యపదార్థముల ననుభవించి సుఖపడఁ గోరెడు పక్షమున ముందుగా మనము లోపలి వ్యాధు[లఁ] పోఁగొట్టుకొని సమస్తాంగములను సుఖస్థితికిఁ దెచ్చుకోవలెను. [మ]న సంఘస్థితి యుండవలసినరీతిగా నుండ లేదనియు, సంఘమును [బా]ధించుచున్న యనేక దురాచారరోగములను నివారణము చేసికొని [ప్రా]ర్ణారోగ్యదశ నొందఁ బాటుపడుట యావశ్యకమనియు నిప్పు డిప్పుడు కొంచెముగానో గొప్పగానో యెల్లవారును దెలిసికొను చున్నారు. సంఘసంస్కారము మనలో మనము చేసికోవలసినది; రాజ్యాంగసంస్కారమో యితరుల యనుగ్రహమువలనఁ గలుగ వలసినది. ప్రయత్నము చేసినచో సంఘసంస్కారము జరుగుట నిశ్చయము; రాజ్యాంగసంస్కారము జరుగుట సంశయము. కాఁబట్టి చేతిలోనున్న సంఘసంస్కారకార్యము నుపేక్షించుట వివేకులకు ధర్మముగాదు. బాహ్యములయిన రాజ్యాంగస్వాతంత్ర్యములు లక్ష కలిగినను లోపల సాంఘికస్వాతంత్ర్యములులేక నిజమైన సౌఖ్యము కలుగఁజాలదు. గనుక నేఁ డిక్కడ దయచేసిన మహాజనులందఱును

సాంఘికసంస్కార విషయమున శ్రద్ధ వహించి పనిచేయుదు రని నమ్ముచున్నాను.

సాధ్యమైనవఱకు వివాహవ్యయములను తగ్గించుటకయి కృషి చేయవలె ననుట మన మిప్పుడు నిర్ధారణము చేయవలసిన విషయములలో నొకటిగా నున్నది. వివాహసమయములయం దిప్పుడు చేయఁబడుచుండెడి వ్యయములలో ననావశ్యకములయిన వనేకములున్నను వానిలో ముఖ్యములైన యొకటి రెంటిని గూర్చి మాత్రము నేను రెండుమాటలు చెప్పుచున్నాను. సదస్యదినమున భూరిసంభావన యను పేర బ్రాహ్మణులకు ధనదానము చేయుట కలిగినవారిలోను లేనివారిలోనుగూడ నిప్పుడొక యాచారమయి యున్నది. ఆ సమయమునందు దాత తన శక్త్యశక్తులను విచారింపక వ్యర్థదంభముచేతను స్తోత్రప్రియత్వముచేతను తాను ధనసంపన్నుఁడు కాకపోయినను ఋణములు చేసియు భూములు విక్రయించియు వచ్చినవారికెల్లను ధనము పంచిపెట్టుచున్నాఁడు. అప్పు డిచ్చెడు విత్తము మొత్తముమీఁద తలకొక డబ్బు మొదలుకొని రూపాయకు మించకపోయినను స్వీకరించు బ్రాహ్మణోత్తములకు దానివలన సంతృప్తి కలుగకపోయినను, ఇచ్చెడి గృహస్థునకు మాత్ర మధికధనవ్యయమయి కొన్నిసమయములయందు బహుకష్టములకుఁ గారణమగుచున్నది. భూరిసంభావనల మూలమునఁ జెడిపోయి కూటికి పేదలయిన వారి ననేకులను నే నెఱుఁగుదును. రాజమహేంద్రవరమునం దొక సంపన్నగృహస్థుఁడు పేరున కాశపడి పెండ్లిసమయమునం దిచ్చిన దొడ్డసంభావనమూలమున భూములను గ్రామములను బోఁగొట్టుకొని, యూళ్లేలినవాఁడు భుక్తికిఁ జాలక కష్టపడుచుండఁగా నేను జూచియున్నాను. అంతధనమును స్వీకరించి యా వివాహసమయమునందుఁ జేసిన మహదాశీర్వచనము తరువాత నెట్లు

ఫలించినదో చిత్తగింపుడు. వరుఁడు వివాహమయిన యల్పకాలము లోనే యీ లోకమును విడిచిపోయెను; వధు వట్టి భాగ్యమునకు నోచుకోకపోయినను యుక్తవయస్సు వచ్చిన పిమ్మటఁ దానును యథాశక్తి నుపభర్తతో నిల్లువిడిచి లేచిపోయెను. నాలుగుదినములు నలుగురిలో దలయెత్తుకొని తిరుగఁగలుగుటకయి పనికిమాలిన యపాత్రదానములు చేసి తరువాత యావజ్జీవమును తలవంపులు తెచ్చుకొనుటకంటెఁ బెండ్లి నాలుగుదినములును యాచకాధముల దూషణములకు తలయొగ్గి తరువాత నెల్లకాలమును హాయిగా తలయెత్తుకొని తిరుగఁగలుగునట్లు వర్తించుట యెంత శ్రేయస్కరము! వివాహసమయములయందు భోగముమేళము నిమిత్తము చేయునది యింతకంటెను దుర్వ్యయము. అది యిందు ప్రత్యేకవిషయముగా నున్నందున దానినిగూర్చి ముందు కొంత చెప్పెదను.

మనము నిర్ధారణము చేయవలసిన విషయములలో నింకొకటి బ్రాహ్మణాదివర్ణములలోఁగల శాఖలలోను ఉపశాఖలలోను భోజన ప్రతిభోజనములను సంబంధబాంధవ్యములను నెలకొల్పుట యావశ్యకమని; పూర్వకాలమునందు వర్ణములు నాలుగే యేర్పడినను కాలక్రమమునఁ బ్రతివర్ణములోను శాఖోపశాఖ లంకురించుచు వచ్చి బలపడి యిప్పుడు లెక్కకెక్కువయయి యనేకానర్థములకు మూలములగుచున్నవి. ఆ యా శాఖోపశాఖలలోనివారు తమలో తామేకాని వివాహసంబంధములు చేసికోరాదని పనికిమాలిన నియమ మొకటి యేర్పఱుచుకొని యుండుటచేతఁ గొన్నిశాఖలలో వరునకుఁ దగిన వధువు దొరకకయు వధువునకుఁ దగినవరుఁడు దొరకకయు పెక్కుబాధలు కలుగుచున్నవి. రాజకీయాధికారధురంధరుఁడయి ధనసంపన్నుఁడయి యున్న గృహస్థు విద్యావతియు రూపవతియు గుణ

పతియు నైన తన పుత్రికను దన శాఖలోనివానికే యియ్యవలెనన్న నిర్బంధముచేత విద్యాగంధమెఱుఁగని పశుప్రాయునకో చేష్టలయందే కాక రూపమునందును మర్కటమును బోలిన రూపగుణహీనునకో కట్టిపెట్టవలసినవాఁ డగుచున్నాఁడు. అట్లు లభించువరుఁడు నిర్ధనుఁడును వృద్ధుఁడును నగుటకూడఁ దటస్థించెనా కాపురమునకుఁ బోయిన తరువాత కన్య పడు పాట్లు భగవంతుఁ డెఱుఁగును. ఇట్టి వివాహములు సాధారణముగా సుఖప్రదములగుటకు మాఱుగా దుఃఖకరము లగుచున్నవి. ఒక్క వర్ణములోని శాఖోపశాఖలలో నన్యోన్యవివాహములు లేకపోవుటయే కొంతవఱకు ధనాశాపరులలో కన్యాశుల్కమునకును వరవిక్రయమునకును గారణమగుచున్నది. ఇట్టి యశాస్త్రీయములైన యనావశ్యక నిర్బంధములు లేక బ్రాహ్మణులలోను తక్కిన వర్ణములలోను శాఖోపశాఖలలో పరస్పరసంబంధబాంధవ్యము లున్నపక్షమున నిట్టి యనర్థము లనేకములు రూపుమాసి పోవుననుటకు సందేహము లేదు. శాఖాభేదమును పాటింపక మనలోని చదుకొన్నవా రితరశాఖలలోని తగు మనుష్యులతో వియ్యమంది పామరులకు మార్గప్రదర్శకు లగుదురుగాక !

ఇప్పుడు విచారింపవలసిన యంశ మింకొకటి యీ దేశములో స్త్రీవిద్య తగినంత వృద్ధికి రానందునకు మన విచారమును దెలుపుచు ప్రముఖులుగా నున్నవారి నందఱిని స్త్రీవిద్యాభివృద్ధికొఱకై గట్టికృషి చేయఁ బ్రార్థించుటనుగూర్చి. ఈ కాలమునందు స్త్రీవిద్య యావశ్యకమని చూపుటకయి యుక్తిబాహుళ్య మక్కఱలేదు. “విద్యావిహీనః పశుః” అని మనపూర్వులే చెప్పియున్నారు కదా ? విద్యను నేర్చియుండుటయే మనుష్యలక్షణము. మనుష్యరూపమును ధరించి యున్నను విద్యాగంధము లేనివాఁడు నిజముగా ద్విపాదపశువే. స్త్రీ

తాను పురుషునిలో నర్ధభాగమని నాగరికతాలేశముగల యెల్ల దేశములవారును ఘోషించుచున్నారు. స్త్రీపురుషు లిద్దఱును గలసి యేకదేహ మని ఘోషమిడుచున్నప్పుడు పురుషుల విద్యాభివృద్ధినిమిత్తమయి శ్రద్ధవహించుచు స్త్రీల విద్యాభివృద్ధి నిమిత్తమయి యుపేక్షచేయుట యేకదేహములో నర్ధభాగమును మనుష్యునిగాఁజేసి తక్కిన యర్ధభాగమును మృగమునుగా నుంచుటయే కాని వేఱుకాదు. స్త్రీలు విద్యావతులు కానంతవఱకు మనదేశము బాగుపడదు. మన యభివృద్ధి యంతయు స్త్రీల యభివృద్ధిలోనే యున్నది. నాబుద్ధికిఁజూడ మనకిప్పుడు రెండుగతులు మాత్రమేకనబడుచున్నవి. మనతో సమానముగా స్త్రీలకు విద్యచెప్పించి వారితో గలసి మన మూర్ధ్వగతికైనను బోవలెను. లేదా, వారిని మూఢదశయందుంచి వారితోఁ గలిసి మన మధోగతికైనను బోవలెను. ఈ రెంటికంటెను మనకు వేఱుగతి లేదు. పయికయినను క్రిందికయినను బోవుచుండక త్రిశంకుస్వర్గమువలె నడుమ నూగులాడుచుండుట మనుష్యస్వభావము కాదు. పురుషుఁడు తానెంత స్వతంత్రుఁడనని విఱ్ఱవీఁగువాఁ డయినను కార్యములలో స్త్రీకి దాసుఁడు కాక తప్పదు. గృహమునకు రాణి యనఁదగిన స్త్రీ మాట చెల్లును. గాని యింట బురుషునిమాట చెల్లదు. స్త్రీలను విద్యావతులనుగాఁ జేసినచో వారు సమస్త సత్కార్యములయందును మనతో నేకీభవించి మన పురోభివృద్ధిలో సహాయురాం డ్రగుదురు. స్త్రీల నవిద్యావతులనుగా నుంచినచో వారు సమస్త సంస్కారములయందును మనతోఁ గలహించి మన పురోభివృద్ధికిఁ బ్రతిబంధకారిణు లగుదురు. కాఁబట్టి పురుషుని వృద్ధిని గోరువారందఱును తప్పక స్త్రీలను విదుషులనుగాఁ జేయ సర్వప్రయత్నములను జేయవలెను.

నేఁడు నిర్ధారణము చేయఁబడవలసినది వితంతు వివాహములను

ప్రోత్సాహబలుపవలయుననియు విధవలను విరూపిణులనుజేసెడి యాచారమును నిరుత్సాహపరుపవలయు ననియు ప్రముఖులుగా నుండువారిని కోరుట మఱియొకవిషయముగా నున్నది. ఇది యీ ప్రాంతములయందు బహుసంవత్సరములనుండి చర్చింపఁబడుచున్న విషయము. మన కడుపునఁ బుట్టిన వితంతుబాలికలును తోడఁబుట్టిన యనాథయువతులును పసితనముననే భర్తలనుగోలుపోయి దుర్లంఘ్యమైన దురాచారపిశాచబలముచేత యావజ్జీవమును దుర్భరవైధవ్యదుఃఖముల ననుభవింపవలసినవారగుచుండఁగా శక్తులమయ్యును వారియాపద తొలఁగింపఁ జూడకుండుటకంటె క్రూరకృత్యము వేఱొకటి యేముండును ? మన తోఁబుట్టిన పడుచులయొక్కయు పుత్రికలయొక్కయు స్వాతంత్ర్యములనుమన్నించి వారిని సుఖపెట్టలేనివారము రాజ్యతంత్రస్వాతంత్ర్యములు లభించినప్పుడు పరులనేమి సుఖపెట్టఁగలుగుదుము ? మన యిల్లు బాగుచేసికోలేనివారము లోకము నేమి బాగుచేయగలుగుదుము ? ముందు స్వకుటుంబసౌఖ్యమును సమకూర్చుచు గృహపరిపాలనము చక్కఁగా నిర్వహించికదా ప్రజాసౌఖ్యమును సమకూర్చి స్థానికపరిపాలనమును వహించుట కర్హులమని చూపవలెను? స్థానికప్రభుత్వమునకయి కృషిచేయుచున్న మనవారందఱును హిందువులు క్రూరాచారపిశాచావేశముచేత స్వకృత్యము నెఱుఁగజాలక తమగర్భవాసమునఁ బుట్టిన యనాథబాలలను బాధించుచున్నారన్న యపయశమును మనలోనుండి తొలఁగించుటకయి నిరంతరప్రయత్నము చేయవలెను. భర్తృమరణశోకముచేత పరితపించుచున్న యనాథకాంతల తల గొఱిగించుట తలతఱిగించుటకన్నను క్రూరకృత్యము-జన్మాదిగా నబలల కలంకారముగా నీశ్వరుఁడు దయచేసిన మృదుశిరోజములను మంగలవాని కత్తులకత్తుల కప్పగించుటకంటెఁ బురుషుల కధికావమానకరమైనకర్మము మఱి యేముండును ? హృదయమున కరుణ

యన్నది యేమూలనైనను గొంచె మున్నవారి కీవిషయమునఁ జెంచి చెప్పవలసిన పనిలేదు. చెప్పుటకును వినుటకునుగూడ నాకును మీకును సంతాపకరమయిన యీ విషయమును విడిచి తరువాతి విషయమునకుఁ బోదము.

పదిసంవత్సరములకు లోపలియీడుగల బాలికలకును పదునాలేండ్లకు లోపలి వయస్సుగల బాలురకును వివాహము చేయుటయు, ఏఁబదియేండ్లు దాటిన పురుషులు పదునాలేండ్ల లోపలి ప్రాయముగల కన్యలను వివాహమాడుటయు, ప్రజాక్షేమమునకు భంగకరమన్న మన నిశ్చితాభిప్రాయమును బ్రకటించుచు మైసూరి వివాహశాసనమువంటి శాసనము నొకదానిని జేయ దొరతనమువారిని బ్రార్థింపవలయు నన్నది తరువాతి విషయము. శిశువివాహములవలనఁ గలుగుచున్న యనర్థము లిన్నియన్ని యని చెప్పశక్యముకాదు. ఈ యతిబాల్యవివాహములవలననే మనదేశమునందు బాలవితంతువుల సంఖ్య నానాటికి వర్ధిల్లుచున్నది; ఈ యతిబాల్యవివాహములవలనే కన్యాశుల్కములు ప్రబలుచున్నవి. కన్యాశుల్కమును గైకొని జననీజనకులు తమకూఁతులను వృద్ధఘటములకుఁ గట్టిపెట్టక పోయినను వధూవరులలో నకాలమరణములు సంప్రాప్తము కాకపోయినను, బాల్యవివాహమువలన దంపతులనేకులు విపద్దశల పాలగుచున్నారు. చిన్నతనములో నెవ్వరివర్తన మెట్లగునో, ఎవ్వరి కేమి ప్రాప్తమగునో, తెలియదు. పరమసాధ్వియైన కన్యకామణియొక్క బాలభర్త ప్రాయము ముదిరినతరువాత వేశ్యలయింటిబంటయి కులకాంతనొల్లని శృంగారనాయకుఁడుకావచ్చును. పరమసాధువైన పురుషరత్నముయొక్క పసిభార్య యేండ్లుపైఁబడినకొలఁదిని గయ్యాళితనమున గండు మీఁటి గృహము నరణ్యముగామార్పఁగలిగిన ప్రత్యక్షరాక్షసి కావచ్చును. స్ఫోటకము మొదలైన రోగములచే వధూవరులలో నొకరు వికలాం

గులో విరూపులోయయి వివాహబంధమును దుర్భరదుఃఖజనకము నుగాఁ జేయవచ్చును. ఇవియన్నియు నటుండఁగా బాల్యవివాహము కన్యావరులవిద్యకు వినాశనమును గలిగించి వారి సౌఖ్యమునకుఁ గొఱఁత దెచ్చును. ఈ బాలభర్త క్రిందితరగతులలోఁ జదువుకొను చుండఁగానే భార్య యెదిగి కాపురమునకు వచ్చుట తటస్థించి కష్టము తెలియఁగని యుల్లాసస్థితిలో నుండవలసిన విద్యార్థిదశలోనే సంసార భారమును సంతానశోకమును మీఁదఁబడి పురుషుఁ డాడునుత్సాహహీనుఁ డయి యకాలవృద్ధుఁడు కావలసివచ్చును. ఇంగ్లీషువిద్య నేండ్లు మీఱిన తరువాతనే యారంభించినను పెండ్లిని మాత్రము గోచి పెట్టుకొని యీడుననే చేసెదు నా చిన్నతనములో నా సహపాఠి యొకఁడు ప్రవేశ పరీక్షతరగతికి వచ్చునప్పటి కాతని కుమారుఁడును మా పాఠశాలలోని క్రింది తరగతిలోఁ జదువ నారంభించెను. అది చూచి యాతనిని తోడి విద్యార్థులందఱును పరిహసింపఁ జొచ్చినందున సిగ్గుచేత నతఁడు పరీక్షయందుఁ గృతార్థుఁడు కాకయే పాఠశాలను విడిచి తనపురోభి వృద్ధికి భంగము తెచ్చుకోవలసినవాఁ డయ్యెను. విద్యకు వినాశకర మయిన దగుటచేతను, అనేకానర్థములకు మూలమయిన దగుట చేతను, వివేకు లందఱును బాల్యవివాహములను సాధ్యమైనవఱకు నిరుత్సాహ పఱుపవలెను.

ఇప్పుడు నిర్ధారణీయమైన మఱియొక యంశము కన్యాశుల్క మును వరవిక్రయమును మాన్పఁ బ్రయత్నింపవలె ననుట. ఈ కన్యా శుల్కము బాల్యవివాహవిషవృక్షమువలనఁ గలిగెడు దుష్ఫలములలోఁ బ్రధాన మయినదని చెప్పవచ్చును. కన్యాశుల్కరూపమయిన నరమాంసవిక్రయము క్రూరకిరాతుఁడు చేయు గోమాంసవిక్రయ మునకన్నను ఘోరతర మయిన దని చెప్పవచ్చును. కటికివాఁడు

చేయు మాంసవిక్రయములో చంపఁబడిన జంతువు బాధ యా క్షణము లోనే యంతము నొందును; ఈ నరమాంసవిక్రయములో బాధ యావజ్జీవము నుండును. పొట్టకయి తాను పెంచిన కోడిపెట్ట మెడను నలిపి చంపెడు దయావిహీనునికంటెను నిర్దయుఁడయి కన్యాశుల్కమును గ్రహించెడు నరపశువు తాను కని పెంచిన ముద్దుపట్టిని గర్భదరిద్రునకో రోగపీడితునకో పండ్లూడిన ముదిపెండ్లికొడుకునకో బ్రతికియున్నంతవఱకును బాధపడునట్లుగా వివాహవ్యాజమున బలిపెట్టుచున్నాఁడు. కడుపునఁ బుట్టిన కన్యలను బాధలపాలుచేయఁ బితృరూపమున నవతరించిన యీ కలియుగరాక్షసులను జాతినుండి బహిష్కరించుచు వచ్చిననఁగాని యీ యనర్థము కొంతవఱకైనను తొలఁగదు. దీనిని జూర్ణముగా రూపుమాపవలె నన్న పక్షమున బాల్యవివాహములను మాని యుక్తవయస్సు వచ్చిన తరువాత వరులను వరించెడు స్వాతంత్ర్యమును వధువుల కియ్యవలెను. స్వయంవరముగల యితర దేశములలో మాత్రము వృద్ధులు వయస్సులోనున్న కన్నెలను బెండ్లియాడుచుండ లేదాయని కొందఱడుగవచ్చును. బొత్తిగా లేదని నేను చెప్పఁజాలనుగాని కన్య యిష్టపడి వరించుటచే నందు దోషమేదియు లేదు. ఒకఁడు తాను బుద్ధిపూర్వకముగాఁ జేసినప్పుడు మంచిదయిన పనినే, యితరులు వానిచేత బలవంతముగాఁ జేయించినప్పు డది పాపకార్య మగును. దానము చేయుట సత్కార్యమని యెల్లవారు నెఱుఁగుదురు. ఒకఁడు క్షుద్బాధితునినో రోగపీడితునినో చూచినప్పుడు మనస్సు కరఁగినవాఁడయి తన వ్రేలి నున్న యుంగరమునో చెవినున్న పోగులనో తీసి వాని కిచ్చిన యెడల దాపున నున్నవారందఱును సత్కార్యము చేసెనని యా దాతను మెచ్చుకొందురు. అట్లతఁడు బుద్ధిపూర్వకముగా దానము చేయకున్నప్పుడు దాపుననున్నవారిలో బలవంతులయిన యిద్దఱు

దయాళురు తల బద్దలుకొట్టెదమని బెదరించియో మీఁదఁబడి యూడఁ బెరికియో యా యుంగరమునుగాని పోగులనుగాని యా బీదకో రోగికో యిప్పించినను దానిని దాపుననున్నవారు కొల్లిటివలెఁ బుణ్యకార్యమని మెచ్చుకొనక యా పనికి దారిదోపిడియనియు దొంగతనమనియు పేరులుపెట్టి పాపకార్యమునుగా బరిగణించి దూషింతురు. ఈ విధముగానే వితంతుకాంత కాంతునిషయినిగల ప్రేమాతిశయముచేతఁ బునర్వివాహము నొల్లక బ్రహ్మచర్యమునకుఁ బూనినచో నా పని శ్లాఘ్యమగును; ఆ పనినే యితరులు నిర్బంధపఱిచి చేయించినచో దూష్యమగును. వితంతువు లందఱును బునర్వివాహము చేసికొనుట విధి కాకపోయినను వివాహము చేసికో నిచ్ఛగలవారి కనుజ్ఞ నిచ్చుట మాత్రము మనకుఁ గర్తవ్యము. మూడేండ్లప్పుడు ముండమోసిన దానినిగూడ మరలఁ బెండ్లియాడఁగూడదని నిర్బంధపఱుచు చుండుటచేతను, ముగ్గురు భార్యలను మ్రింగి ముదిసిన వగ్గును సహితము ముప్పునఁ బెండ్లి యాడ నంగీకరించు చుండుటచేతను, భార్యలు కావలసిన పురుషుల సంఖ్య యెక్కువగుటయు భార్యలు కాఁజాలిన బాలికల సంఖ్య తక్కువగుటయు సంభవించి కన్యాశుల్కమున కవకాశము కలుగుచున్నది. కన్యాశుల్కమువలెనే వరదక్షిణయని పేరుపెట్టి మనలోని చదువుకొన్నవారు కన్యల సంరక్షకులవలన బేరమాడి బలవంతముగాఁ బుచ్చుకొనెడి వరశుల్కమును దూష్యమైన దగుటకు సందేహము లేదు. బాల్యవివాహములను మాన్పి వితంతువివాహములను నెలకొల్పి స్త్రీవిద్యను వ్యాపింపఁ జేసినచో వరశుల్క కన్యాశుల్క రూపములయిన యీ రెండు దురాచారములును నామమాత్రావశిష్టములు కావచ్చును.

వివాహాదులయిన వేడుకలయందు భోగముమేళములఁ బెట్టుట దూష్యమన్న విషయము తరువాత నిర్ధారణము చేయవలసినది. నృత్తగీతాదు లాదరణీయములు కావని చెప్పువారు లోకములో నెవ్వరు

నుండరు. కఠినచిత్తుల హృదయములను సహితము కరఁగించి యానంద వార్ధిని దేల్చి భక్తికిని సత్కార్యాచరణమునకును బురికొల్పుటలో గానరసమునకున్న శక్తి మఱిదేనికిని లేదు. అటువంటి సంగీతము మన దేశమునం దభాగ్యవశముచేత వ్యభిచారమే కులవృత్తిగాఁగల వేశ్యల పాలఁ బడుటచే సర్వజనశ్లాఘాపాత్రమైన గానవిద్య దూషణమునకుఁ బాత్రమయి శ్మశానకుసుమమువలె వర్జనీయమైనది. గృహమును భూతలస్వర్గమునుగాఁ జేసెడు నృత్యగానవిద్యలు కులకాంత లభ్యసించుట యిప్పుడు తప్పయినది. కాసునకయి తమ కాయములను కుష్ఠరోగికయినను విక్రయించెడు పడుపుపడఁతుల పాలఁబడఁబట్టికదా యీ దేశమునందు సంగీతమున కిట్టిదురవస్థ పట్టినది! అది యటుండనిండు. వివాహసమయములయందు భోగముమేళముల మూలమున నయ్యెడు దుర్వ్యయముమాట యటుండఁగా రత్నములు చెక్కిన సంకెలలవలె సమస్తాభరణములను ధరించుకొని దీపములవెలుతురున తళుక్కుమన్నప్పుడు మనస్సులు చలించి పెండ్లికొమారుఁడు మొదలుగా ననేక యౌవనపురుషులు కొన్నిసమయములయందు వేశ్యలకు దాసులయి తమధనమును యౌవనమును మన్మథాగ్ని కాహుతి చేయుచున్నారు. వేశ్యలయిండ్లను వెదకుకొని వ్యభిచారమునిమిత్తమయి పోవువారెక్కడనో నీతిమాలినవారు కొందఱే యుందురు. వేశ్యలలోఁ బలువురు పగలు కంటఁ బడినపక్షమున చింపితలలతోను వికృతవిగ్రహములతోను మర్కటములవలె రాత్రి కలలోఁ గనఁబడు స్థితియందే యుందురు. అట్టివారు వన్నెలు చిన్నెలు ధరించివచ్చి కప్పగొంతు పాములవలెఁ బాటలు పాడుచు మన గృహములలోనే ప్రవేశించినప్పుడు సాన్నిధ్యప్రభావముచేత ననేక సాధుపురుషులకు సహిత మామేఁకవన్నె పులులవాతఁ బడుట కవకాశము కలుగునుగాన నీతిపరులయిన వారందఱును మణిభూషితఫణులనువలె వేశ్యలను గృహము చొరనీక

దూరముగా తఱుమవలెను. వధువులకుఁ బాతివ్రత్యము నేర్పఁదగిన వివాహములవంటి పవిత్రసమయములందుఁ బాతివ్రత్యకల్పలతకు వేఱుపురుగులై యపవిత్రలయిన పడుపువడఁతుల నింటికి రప్పించి వారిచేత వ్యభిచారోద్దీపకములైన శృంగారగీతములను పాడించుట యెంత హేయకృత్యము? మానవంతుఁడు తనవారు మఱియే యపరాధమును జేసినను సహింపఁగలుగును గాని వ్యభిచరించినప్పుడు మాత్రము చేసికొన్న భార్యనయినను కన్న కూఁతునయినను తోఁడబుట్టిన కోమలినైనను విటపురుషసహితముగాఁ జంపఁజూడక మానఁడు గదా? లోకములో జరగెడు హత్యలలో సగము వ్యభిచారమూలమున జరుగుచున్నవి. అట్టి హేయాతిహేయమైన వ్యభిచారమును కులవృత్తిగాఁ గైకొన్న దూష్యురాండ్రను డబ్బిచ్చి పిలిపించి యెవ్వరును దమ గృహములను దూష్యములనుగాఁ జేసికొనకుందురుగాక! ఈశ్వరసృష్టిలో పాపమెప్పుడును స్థిరముగా వర్ధిల్లదు. సద్వంశజలయిన బాలవితంతువులు గన్నబిడ్డలును బీదలమ్ముకొను బిడ్డలును భోగకాంతల పాలఁ బడకుండిన పక్షమున సంతానహీనతచే మన దేశములో వేశ్యాకుల మీవఱ కొంతకాలముక్రిందటనో నశించియే యుండును.

ఇప్పుడు నిర్ధారణముచేయ నేర్పఱుచుకొన్న మఱియొక విషయము సామాన్యముగా నిప్పటి మతాచార్యులును ముఖ్యముగా నీ ప్రాంతమందలి శంకరాచార్యులును స్వకృత్యము మఱచి, శిష్యులను బాధించి విత్తార్జనము చేయుచుండుటయు, పాదపూజలు సమర్పింపనివారికి బహిష్కారపత్రికలు పంపుచుండుటయు ననుచితమని మన యసంతృప్తిని దెలుపుటయయి యున్నది. మతమును, నీతిని వ్యాపింపఁజేయుచు, నీతిబాహ్యులయిన వారిని శిక్షించుచు, స్వకృత్యమును నిర్వహించుచున్నంతవఱకు మతాచార్యులుండుట యావశ్యకమనుట నిర్వివాదాంశము. పీఠాధిపతులు కేవల శిష్యవిత్తాపహారులు

గాక హృత్తాపహారులుగా నున్నంతవఱకు వారిని గౌరవించుటయు భక్తిపూర్వకముగా శక్తికొలఁదిని వారిని ధనాదులతో సత్కరించుటయు మనకు ధర్మమే. అయిన పీఠాధిపతులు తమ ధర్మమును విస్మరించి లోకమున కేవిధమునను ప్రయోజనపడక ప్రజాపీడాకరులుగా నున్నప్పుడు మాత్రము మనము వారియాజ్ఞలను మన్నింపవలసిన పనిలేదు. అక్రమములయిన వారియాజ్ఞలను సంక్షోభవించి ధిక్కరించి జనులమీఁద నిరంకుశాధికారము చెల్లించుచుండుటయే తమ పనియని దుర్భ్రమగొని యున్న యాచార్యపురుషుల కన్నులఁదెఱచి వారిని స్వకృత్యమునకుఁ దింపుట లోకోపకారము బరమధర్మమును నగును. సన్యాసు లైహికసుఖపరిత్యాగముచేసి కేవల పారమార్థిక చింతతో బ్రహ్మానుసంధానము చేయుచు శిష్యులకు ముక్తిమార్గోపదేశము చేయుచుఁ గాలము గడపవలసినవారు. పూర్వకాలమునందాదిశంకరులు మొదలయినవారు పాదచారులయి సేతువు మొదలుకొని హిమాచలమువఱకును దేశసంచారము చేసి భరతఖండమునందు మతవ్యాపనము చేయుచు వచ్చిరి. విద్యారణ్యులని నామాంతరము వహించిన మాధవాచార్యులవారు బుక్కరాజునకు మంత్రిగా నుండి శంకరాచార్యపీఠమునకు వచ్చిన తరువాత పీఠాధిపతు లయిన సన్యాసుల కిప్పటి వైభవము లారంభమయినట్లు కనుపట్టుచున్నవి. అయినను వెనుకటి పీఠాధిపతులు వైభవయుక్తులయినను స్వకృత్యమునుపేక్షచేయక లోకోపకారులయి జనుల సత్కారమునకును గౌరవమునకును యోగ్యులగుచుండిరి. ఇఁక నిప్పటి యతులో స్వప్నావస్థయందయిన స్వకృత్యమును దలపెట్టక పెండ్లికూతుఁరు లేకపోయినను క్రొత్తపెండ్లికొడుకులవలె వాద్యములతోను గజాశ్వాదులతోను పెండ్లిపల్లకులలో నెక్కి యూరేగుచుఁ దమవైభవమును గాపాడు నిమిత్తమే జనులు సృజింపఁబడినారని భావించుచు తత్త్వవిచారమన్న

మాట యెఱుఁగక భోగపరాయణులయి యథేచ్ఛావిహారులగుచు న్నారు. శిష్యుల కుపదేశించుటకు మొదల మతమన్న వారికే తెలియదు. వారికిఁ దెలిసినదెల్ల జనులను నిర్బంధించి గురుదక్షిణలు గైకొనుటయు భక్ష్యములతో షడ్రసోపేతముగా భిక్షలు చేయుటయు మాత్రమే. ఈ విషయమున మనలో వాడుకగానున్న యొకకథ నాకు స్మరణకు వచ్చుచున్నది. ఒక స్వాముల వారొక గృహస్థుని యింటికి భిక్షకు విజయం చేసెనఁట! ఆయతీశ్వరునకు భిక్షాదినమునఁ బంచ భక్ష్యపరమాన్నభుక్తి యొక్కటియే ముక్తివిచారమన్న సత్యము నెఱుఁగజాలక ముద్దరాలయిన యాయింటి యిల్లాలు భిక్షానంతర మున స్వాములవారివద్దకు వచ్చి వేదాంతగ్రంథపారాయణము చేసి కొందురేమోయన్న భ్రమచేత "స్వామీ! భగవద్గీతలు తెత్తునా?" యని యడిగెనఁట! భక్ష్యభక్షణచింత తప్ప వేఱుచింత లేని యా యతీంద్రుఁడు మిన్నువంకఁజూచి కొంతసేపాలోచించి యా పేరుగల భక్ష్యములను దాను మున్నెన్నఁడును దిన్నట్టు స్మరణకు రాకపోయి నను భగవద్గీత లనునవి యేవో యపూర్వభక్ష్యము లయియుండు నని భావించి కడుపు నిమురుకొనుచు "అమ్మా! కడుపు నిండుగా నున్నది. ఇప్పుడు పుచ్చుకోలేను. కొంతసేపు తాళి తీసికొనివచ్చిన పక్షమున భక్షించెదను" అని యుత్తరము చెప్పెనఁట. గృహయజ మానురా లాయన భోజనపాండిత్యమునకు సంతోషించి మాఱుమాటాడక లోపలికిఁ బోయెనఁట! ఇది యతిశయోక్తియే యైనను, ఇప్పటి పీఠాధికారుల పాండిత్యప్రకర్షమునుబట్టి విచారింపగాఁ నిందును గొంత సత్యమున్నదని తోఁచకపోదు. ఇటువంటి యనేక దురాచారముల కాలవాలమగుటచేతనే పూర్వకాలమునందు మనదేశమునందు సన్న్యాసము నిషేధింపఁబడినది. పూర్వకాలమునందు సంస్కృతభాషలో రచియింపఁబడిన ప్రహసనములలో సన్న్యాసుల వ్యభిచారాదులు బహు

విధముల వర్ణింపఁబడి పరిహసింపఁబడినవి. నిషేధింపఁబడిన సన్న్యాసమును శంకరాచార్యులవారు మరల నుద్ధరించి యీ దేశమున వ్యాపింపఁజేసిరి. ఇప్పటి స్వాములవార లెట్లున్నారో కొంతవఱకు మన యిక్కడి శంకరాచార్యులను బట్టియే తెలిసికోవచ్చును. ఈయన ధనాకర్షణమే పరమార్థముగా భావించుకొని తన శిష్యులైనవారిని గ్రా వారినిగూడ ధనము సమర్పింపుఁడని బాధించుచు నడిగినంత మొ మియ్యలేనివారికి బహిరంగముగా బహిష్కారపత్రికలను ను చున్నారు. కఱవుకాలములో నిట్లు నిర్బంధపఱిచి ధనము లా జూచుట దారులఁ గొట్టుటకంటె శ్రేష్ఠమయిన పనియని నే ననుకోను. మతాచార్యులవలని యిటువంటి దౌర్జన్యములను వారింపఁజూచుట దేశాభిమానుల కందఱకును కర్తవ్యము.

ఇఁకను నేడు మనము విచారింప నేర్పఱుచుకొన్న విషయ మింకొకటి మాత్రమే మిగిలియున్నది. ఇప్పుడు పేర్కొనఁబడిన విషయములలోను, ఇట్టివే మఱికొన్ని విషయములలోను, సంస్కారము జరుగుట సంఘముయొక్క యభివృద్ధి కావశ్యకమని విద్యావివేకములు గలవారు దృఢముగా నమ్ముచున్నారు. ఆచారమునే దేవతనుగా నమ్మి కొలుచు పామరులును పూర్వదురాచారములవలననే లాభము ననుభవింపమరగిన స్వప్రయోజనపరులును సంస్కారమునకుఁ బ్రతికూలురుగా నున్నారు. ఇట్టి సమయమునందు సంఘములో నట్టి మార్పులు చేయుట యెట్లు సాధ్యమగును? పామరులకు సంస్కారమువలనఁ గలుగు లాభములను దెలిపియు మొట్టమొదట నూతన మార్గములను తాము త్రొక్కి చూపియు సంఘాభివృద్ధికయి పాటుపడెడు దేశాభిమానులు కొంద ఱేర్పడినఁగాని యీ మహాకార్యము సాధ్యము కాదు. కాఁబట్టి యట్టిపనికయి యందందు సంస్కారసంఘములేర్పడుట యావశ్యకము. ఇప్పుడీ సభవారు రాజమహేంద్రవరము

నందు మండలసంఘసంస్కారసమాజ మొకటి స్థాపింపఁబడి యేలూరు, కాకినాడ మొదలయిన ప్రధానస్థలములయం దెల్లను దానికి శాఖ లేర్పఱుపఁబడవలయునని నిర్ధారణ చేయవలసియున్నది. ఇది మిక్కిలి ముఖ్యమైన పని. పలువు రేకీభవించి పూనికతో బనిచేసినంగాని యేవిషయములోను కార్యసాఫల్యము కాదు. "సంఘే శక్తిః కలౌ యుగే" యన్న యార్యోక్తి యెల్లవారును పలుమాఱు వినుచున్నదే. ఒక్క యీ కలియుగమునందు మాత్రమే కాక సమస్తయుగముల యందును సమస్తదేశములయందును గూడ సంఘీభవించి చేసిన పని లోనే యత్యద్భుతశక్తి యుండుననుటకు సందేహము లేదు. విద్యార్థులు సంఘములుగాఁ జేరి యైకమత్యముతోఁ బనిచేసిన పక్షమున నత్యల్పకాలములోనే బహుసంస్కారములను జేసి దేశమున కమిత లాభములను గలిగింపవచ్చును. ఇట్లేర్పడు సమాజములవారు చేయ వలసిన పను లేవియని కొంద ఱడుగవచ్చును. వారు సంస్కారవిష యమున సులభశైలిని దేశభాషలలో పుస్తకములను పత్రికలను వ్రాసి ప్రచురించి యల్పక్రయమునకో ధర్మార్థముగానో సర్వజనుల కును పంచిపెట్టుచుండవలయును; తమ కవకాశము గలిగినప్పు డెల్లను గ్రామములకుఁ బోయి సభలుచేసి యుపన్యాసములను ప్రసం గములను జేయుచుండవలయును. వారపత్రికనో పక్షపత్రికనో మాస పత్రికనో యొకదానిని బ్రకటించుచు నందు సంస్కారవిషయమున గల సాధకబాధకములను బలుమాఱు చర్చించుచుఁ బూర్వపక్షులు చేసెడి యాక్షేపణములకు సమాధానము లిచ్చుచుండవలయును; ఇతరస్థలములయం దిట్టి పని కయి యేర్పడియున్న సమాజములతోను త్తరప్రత్యుత్తరములు జరుపుచు వారి మంచిపద్ధతుల నవలంబించు చుండవలయును. సంఘమువలన బహుప్రయోజనములు గలుగు ననుట కిప్పు డిక్కడ సమావేశమయి యున్న యీ మహాసంఘమే నిదర్శనము. సాంఘికసంస్కారము జరగక రాజ్యాంగసంస్కారము